## కుర్చీ వదలా..!

15 ఏళ్లుగా జిల్లాలోనే..

ఈనాడు – పాడేరు, అరకులోయ, న్యూస్‌టుడే

ఉద్యోగ సంఘాల నాయకులు ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహించడం సరికాదని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇటీవల అభిప్రాయం వ్యక్తం చేసింది. దీనిపై తదుపరి విచారణకు ఆదేశించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉద్యోగ సంఘాల నాయకులు కాకున్నా ఒకేచోట 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారున్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులూ వారిని కదపలేకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. గృహ నిర్మాణ సంస్థలో ఇద్దరు అధికారులు కీలకమైన పోస్టుల్లో కుర్చీని వదలకుండా జిల్లాలోనే తిష్ట వేశారు.

ఎమ్మెల్యే మత్స్యలింగంతో సమావేశమైన పీడీ బాబూనాయక్, డీఈ రాజబాబు

★ హౌసింగ్ డీఈఈగా ఉన్న రాజబాబు పదిహేనేళ్ల కిందట ఏఈఈగా వచ్చారు. అరకులోయ ఏఈఈగా ఏడేళ్లు పనిచేశారు. ప్రస్తుతం అరకు సబ్ డివిజన్ డీఈఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటూ బదిలీ కాకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. పీఎం ఆవాస్ యోజనలో నియోజకవర్గానికి 33 వేల ఇళ్లు మంజూరయ్యాయి. గృహ నిర్మాణాల పర్యవేక్షణకు పూర్తిస్థాయిలో డీఈఈ, పీడీలు లేరు. బిల్లుల చెల్లింపుల్లో ఆరోపణలున్నా, ఏళ్ల తరబడి ఒకేచోట కొనసాగుతున్నా.. ఆయా పోస్టుల్లో వీరినే కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది.

★ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న బాబూ నాయక్ 15 ఏళ్లుగా జిల్లాలోనే పనిచేస్తున్నారు. పాడేరు డివిజన్‌లో అరకు సబ్ డివిజన్ డీఈఈగా ఆరేళ్లపాటు పనిచేశారు. అనంతరం పదోన్నతి పొంది పాడేరు డివిజన్ ఈఈగా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన గృహనిర్మాణ సంస్థ ఈఈ కాగా.. ప్రస్తుతం అల్లూరి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గృహనిర్మాణ సంస్థలో ఈఈ, పీడీ వంటి రెండు కీలక పోస్టుల్లో బాస్‌గా కొనసాగడం ఆయనకే చెల్లింది.

## ఈ-పాన్ ఎంతో సులభం!

ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ పాన్‌కార్డు తప్పనిసరి. ఆన్‌లైన్‌లో నిమిషాల వ్యవధిలోనే పొందవచ్చు. గూగుల్‌లో ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ హోం పేజీలోకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్ ఐచ్ఛికంపై క్లిక్ చేయాలి. తర్వాత గెట్ న్యూ ఈ-పాన్ కార్డు ఐచ్ఛికంపై క్లిక్ చేయాలి. ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే జనరేట్ ఓటీపీ సూచిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే చరవాణికి ఓటీపీ వస్తుంది. నమోదు చేయగానే వ్యక్తిగత వివరాలు ప్రత్యక్షమవుతాయి. సరి చూసుకుని 'ఐ యాక్సెప్ట్ దట్' బాక్స్‌ను ఎంచుకుని కంటిన్యూపై క్లిక్ చేస్తే దరఖాస్తు ప్రక్రియ పూర్తయినట్లే. ఎక్నాలెడ్జ్‌మెంట్ నంబరు వస్తుంది. మొబైల్‌కు కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. మళ్లీ హోం పేజీకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్ ఎంచుకుని ఆధార్ నంబరు, ఓటీపీ నమోదు చేయగానే పూర్తి వివరాలు కనిపిస్తాయి. డౌన్‌లోడ్‌పై క్లిక్ చేసి ఆధార్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ అడుగుతుంది. దాన్ని నమోదు చేయగానే పాన్‌కార్డు పీడీఎఫ్ ఫైల్‌గా డౌన్‌లోడ్ అవుతుంది. పుట్టిన తేదీ నమోదు చేస్తే ఓపెన్ అవుతుంది. దాన్ని ప్రింట్ తీసుకుంటే సరి. – న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

## కాఫీ పల్పింగ్ సాఫీగా!

### యూనిట్ల నిర్మాణానికి రూ.3.5 కోట్లు కేటాయింపు

చింతపల్లి, జి.మాడుగుల న్యూస్‌టుడే

మన్యం పేరెత్తగానే కాఫీ గుర్తొస్తుంది. అరకు కాఫీగా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. దీన్ని ప్రమోట్ చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు నుంచి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. దేశదేశాల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్, పారిశ్రామికవేత్తల సదస్సుల్లో దీనికోసం ప్రస్తావిస్తున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిధుల కొరతతో గూడెంకొత్తవీధి, జి.మాడుగులలో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటి పునఃనిర్మాణానికి తాజాగా రూ.3.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

■ మన్యంవ్యాప్తంగా సుమారు 2.50 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు సాగవుతున్నాయి. లక్షకు పైగా కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఏటా 18,000 టన్నుల వరకు కాఫీ ఉత్పత్తి జరుగుతోంది. సుమారు రూ. 150 నుంచి రూ. 200 కోట్ల వరకూ వాణిజ్యం జరుగుతోంది.

చింతపల్లి పల్పింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.నాయక్

■ మన్యంలోని కొయ్యూరు మండలం మినహా దాదాపు 10 మండలాల్లోనూ కాఫీ సాగు జరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి మంచి ధరలు పలుకుతున్నాయి. ప్రస్తుతం కిలో పార్చిమెంటు ధర స్థానికంగానే రూ.450 వరకూ ఉంది. చెర్రీ ధర కిలో రూ.250 వరకూ జీసీసీ చెల్లిస్తోంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో మాక్స్ కిలో కాఫీ పండ్ల ధర రూ.70గా నిర్ణయించింది. నాణ్యమైన కాఫీ పార్చిమెంటు తయారు చేయాలంటే చెట్ల నుంచి సేకరించిన పండ్లను 24 గంటల్లోగా పల్పింగ్ కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. వాటిని ప్రాసెస్ చేయగా నాణ్యమైన పార్చిమెంటు ఉత్పత్తి అవుతుంది. మన్యంవ్యాప్తంగా కాఫీ సాగు జరుగుతున్న ప్రతి మండలంలోనూ ఎకో పల్పింగ్ కేంద్రాలు నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన. దీనికి అనుగుణంగా ది విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ (మ్యాక్స్) పేరిట ట్రైకార్ నిధులతో ఏడేళ్ల క్రితం చింతపల్లిలో తొలిసారిగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ఎకో కాఫీ పల్పింగ్ పరిశ్రమను నెలకొల్పారు. ఇదే తరహాలో జి.మాడుగుల, గూడెంకొత్తవీధి మండలాల్లోనూ వీటిని నిర్మించతలపెట్టారు. యంత్ర సామగ్రి కొనుగోలు చేసినా.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇవి నేటికీ పూర్తికాలేదు. ఇప్పుడు వీటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో త్వరలో ఈ రెండు మండలాల్లోనూ కాఫీ పరిశ్రమలు నిర్మాణం కానున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే స్థానికంగానే గిరిజన రైతులు వారు పండించిన కాఫీ పండ్లను సకాలంలో ఆయా పల్పింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆస్కారం ఉంటుంది. మేలురకపు పార్చిమెంటు ఉత్పత్తి జరుగుతుంది. గిరిజనుల ఆదాయం రెట్టింపు అవుతుంది.

## ఆదా.. రేపటికి ధీమా!

### నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

అనంతగిరి, పాడేరు, న్యూస్‌టుడే: విద్యుత్తు గృహోపకరణాలు లేని ఇల్లంటూ లేదు. గిరిజన గ్రామాల్లోనూ ప్రతి ఇంట్లో విద్యుద్దీపాలతోపాటు ఫ్యాన్లు, టీవీ, ఫ్రిడ్జ్ ఉంటున్నాయి. కొందరు అవసరం మేరకు వీటిని వినియోగిస్తుంటే.. మరికొందరు అవసరమున్నా, లేకున్నా నిరంతరాయంగా వాడుతున్నారు. ఇలా చేయడం వల్ల త్వరగా పాడవడంతో పాటు విద్యుత్తు వినియోగం అధికమవుతోంది. అవసరం లేనప్పుడు ఆఫ్ చేస్తే ఆదా చేసిన వారమవుతాం. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ధ్యేయంతో సోమవారం నుంచి ఈ నెల 21 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నారు.

**అధిక మొత్తం బొగ్గు నుంచే.. :** అల్లూరి జిల్లా వ్యాప్తంగా సుమారు 2.65 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. సుమారు 70 శాతం వరకు బొగ్గు ఆధారితంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తునే వినియోగిస్తున్నారు. ఒక యూనిట్ విద్యుత్తు తయారీకి సుమారు 700 గ్రాముల బొగ్గు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో గాలి కాలుష్యం కావడంతోపాటు విద్యుత్తును పొదుపుగా వినియోగించకుంటే భవిష్యత్తు తరాలకు కొరత ఏర్పడే ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఇలా చేద్దాం..:** ● అవసరం లేకుండా బల్బులు, టీవీలు, ఫ్యాన్లు వాడకూడదు. ● ఫోన్ ఛార్జర్, టీవీ ప్లగ్‌లను ఉపయోగంలో లేనప్పుడు తీసివేయాలి.

● పగటి పూట బల్బులు వినియోగించకుండా సూర్యకాంతి లోపలకు వచ్చేలా చూసుకోవాలి. ● విద్యుత్తు పరికరాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించుకోవాలి. ● ఎల్ఈడీ, సీఎఫ్ఎల్ బల్బులతో విద్యుత్తు ఆదా అవుతుంది. ● అధిక వినియోగాన్ని అరికట్టేందుకు సౌర విద్యుత్తు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**అవగాహన ర్యాలీలు, పోటీలు:** వినియోగదారులంతా సామాజిక బాధ్యతగా విద్యుత్తు వృథాను అరికట్టేందుకు నడుం బిగించాలి. అవసరం లేకుండా గృహోపకరణాలు వినియోగించకూడదు. గృహోపకరణాలు కొనుగోలు చేసే సమయంలో 5 స్టార్ రేటింగ్ ఉన్న వాటినే ఎంచుకోవాలి. ఇవి తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్తు వైపు దృష్టిసారించాలి. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీలు, డివిజన్ స్థాయిలో వ్యాసరచన, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తాం. వివరాలకు 94408 12491 (పాడేరు), 83097 71508 (రంపచోడవరం) నంబర్లలో సంప్రదించవచ్చు.
– ప్రసాద్, ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్, పాడేరు

## అథ్లెటిక్స్‌లో అదరహో!

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ప్రోత్సాహం అందిస్తే ఏ రంగంలోనైనా రాణించగలమని గిరిజన యువకులు మరోసారి నిరూపించారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

★ గుంటూరు జిల్లా పాలపర్రులో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన 45వ ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అల్లూరి జిల్లాకు చెందిన మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నుంచి ఆరుగురు యువకులు పతకాలు సాధించారు.

★ ముంచంగిపుట్టు మండలం పెదగుడ పంచాయతీ జర్రిపడకు చెందిన కుర్తాడి ప్రసాద్ 800 మీటర్ల పరుగులో పసిడి, 1500 మీటర్ల పరుగులో కాంస్యం, 5 కి.మీ. పరుగులో రజత పతకాలు సాధించాడు.

★ పెదబయలు మండలం సీకరి గ్రామానికి చెందిన గణేష్ లాంగ్‌జంప్, పరుగు, నడక పోటీల్లో ప్రతిభ చూపాడు. ముసిడిపుట్టుకు చెందిన మహేష్ జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ పోటీల్లో సత్తా చాటాడు.

★ డుంబ్రిగుడ మండలం కుజబంగికి చెందిన శత్రుఘ్న ట్రిపుల్ జంప్, జావెలిన్‌త్రో పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించాడు. రంగినివలసకు చెందిన విశ్వనాథం 200 మీ., 800 మీ. పరుగు, షాట్‌పుట్ పోటీల్లో పతకాలు గెలుచుకున్నాడు.

★ అరకులోయ మండలం మొర్రిగుడకు చెందిన మంగు 800 మీ. పరుగు, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్‌లో పతకాలు సాధించారు. వీరంతా ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

పతకాలు సాధించిన గిరి యువకులు

## పసోళ్లకు ప్రాంగణాలు కావాలి

### అద్దె ఇళ్లలోనే అంగన్‌వాడీ కేంద్రాలు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

చింతూరు, న్యూస్‌టుడే: నేటి బాలలే రేపటి పౌరులు. ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. పలుచోట్ల కేంద్రాలకు భవనాల్లేవు. భవనాలున్న చోట్ల మౌలిక వసతుల్లేవు. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానికులు అద్దె తీసుకోకుండా కేంద్రాల ఏర్పాటుకు ఇళ్లను సమకూర్చారు. చిన్నారులను ఆడించేందుకు తగినంత జాగా ఉండటం లేదు. గదులు ఇరుకుగా ఉండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం పంపిణీకే పరిమితం కావాల్సి వస్తోంది.

■ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ తదితర వివరాలను నమోదు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం సెల్‌ఫోన్లు అందజేసింది. సాంకేతికతను అందిపుచ్చుకుని పోషకాహారం పంపిణీ పారదర్శకంగా నిర్వహిస్తున్న యంత్రాంగం కేంద్రాలకు సొంత భవనాల్లేని చోట్ల నిర్మాణంపై దృష్టిసారించడం లేదు. అద్దె భవనాలకు స్వస్తి చెప్పి భవనాలు నిర్మించడంతోపాటు సదుపాయాలు కల్పించి చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అందేలా ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరముంది.

**జిల్లాలో కేంద్రాలిలా..**

| డివిజన్ | కేంద్రాలు | భవనాలు | అద్దెవి | అద్దెరహిత | చిన్నారులు |
|---|---|---|---|---|---|
| పాడేరు | 2,329 | 770 | 1427 | 132 | 31,360 |
| రంపచోడవరం | 553 | 331 | 167 | 55 | 6,668 |
| చింతూరు | 432 | 210 | 158 | 64 | 4,307 |

## తారాబు.. కళకళ

ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని తారాబు జలపాతానికి పర్యాటకులు పోటెత్తుతున్నారు. పచ్చని గిరుల నడుమ 120 అడుగుల ఎత్తు నుంచి ఈ జలపాతం పారనురగను తలపిస్తూ దిగువకు జాలువారుతూ సందర్శకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. పాడేరు నుంచి పెదబయలు, ముంచంగిపుట్టు మీదుగా జామిగుడ వరకు ఆర్టీసీ బస్సు సదుపాయం ఉండటంతో అనకాపల్లి, విశాఖ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉంటోంది. తారాబు ప్రాంతంలో సదుపాయాలు కల్పిస్తే ఈ జలపాతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు.
– న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

## తేనెటీగ.. మెరుపు తీగ

- పగ పెంచుకునే గుణం
- శాస్త్రవేత్తల పరిశోధనలో వెలుగులోకి..

చింతపల్లి, న్యూస్‌టుడే

'ఈగ' పేరుతో దర్శకుడు రాజమౌళి నిర్మించిన సినిమా ఎంత హిట్టయిందో అందరికీ తెలుసు. గ్రాఫిక్స్‌తో ఈగ హావభావాలన్నింటినీ కళ్లకు కట్టినట్లు చూపారు. ఈగ జాతికే చెందిన తేనెటీగల జీవన విధానం ఎలా ఉంటుందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు. తేనెపట్టులో ఉండే సుమారు 70 వేల తేనెటీగలన్నీ రాణి ఈగ మాట వింటాయి. శత్రువులపై పగ పెంచుకుంటాయి. ఆత్మాహుతి దాడులకు పాల్పడతాయి. ముసలితనం, నాయకత్వ లక్షణాలను కోల్పోవడం, ఆహార అన్వేషణలో సూచనలు ఇవ్వడంలో వైఫల్యం చెందుతోందని భావిస్తే శ్రామిక ఈగలుగా ఉన్న తేనెటీగలన్నీ కలిపి మూకుమ్మడిగా రాణి ఈగను చంపేస్తాయి. అన్నీ కలిసి మరో ఈగను నాయకురాలిగా ఎన్నుకుంటాయి. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇవన్నీ తేనెటీగలపై చేసిన పరిశోధనల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పరిశోధనాస్థానం కీటక విభాగం శాస్త్రవేత్తలు గుర్తించారు.

■ తేనెపట్టు అరల్లో సుమారు 60 నుంచి 70 వేల వరకు తేనెటీగలుంటాయి. వాటిలో ప్రధానమైనది 'రాణి' ఈగ. పేరుకు తగ్గట్లుగానే ఇది రాచరికాన్ని అనుభవిస్తుంది. మిగిలిన వాటికి భిన్నంగా కాస్త పొడవుగా, సన్నగా ఉంటుంది. తేనెటీగల్లో మగ ఈగలు శ్రామిక ఈగలుంటాయి. ఇవి కేవలం సంతానోత్పత్తికే పరిమితం. రాణి ఈగతో సంగమించిన వెంటనే మరణిస్తాయి. మగ ఈగతో సంగమించాలనకుంటే రాణిఈగ తన నివాసాన్ని వదిలి బయటకు వస్తుంది. అరల్లోనూ రాణి ఈగ ఉండేందుకు ప్రత్యేక గది ఉంటుంది. మిగతా వాటికంటే ఇది పెద్దదిగా ఉంటుంది. అందులోకి రాణి ఈగ తప్ప మరొకటి వెళ్లదు.

■ శ్రామిక ఈగలు నిత్యం ఆహారాన్వేషణలోనే ఉంటాయి. ఇవి అడవుల్లో తిరుగుతూ పూలపై ఉన్న పుప్పొడి, మకరందాన్ని సేకరిస్తాయి. ఇలా సేకరించిన వాటిని తమ స్థావరాలైన తేనెపెట్టెల్లో భద్రపరుస్తాయి. పుప్పొడి, మకరందం వేర్వేరుగా తింటాయి. రాణిఈగకు ప్రత్యేకంగా పుప్పొడి, మకరందం మిశ్రమాన్ని కలిపి రాజహారం (రాయల్ జెల్లీ)ని అందిస్తాయి.

■ రాణి ఈగ జీవితకాలం రెండేళ్లు. సంతానోత్పత్తికి పనికిరాకపోయినా, వయసు మీదపడి వృద్ధాప్య ఛాయలు దరిచేరినా, నాయకత్వ లక్షణాలు కోల్పోయినా, సైన్యానికి సలహాలు, ఆదేశాలు ఇవ్వకపోయినా శ్రామిక తేనెటీగలన్నీ కలిసి రాణి ఈగను హతమారుస్తాయి.

■ రాణిఈగ మరణానంతరం శ్రామిక ఈగలన్నీ కలిసి కొత్త నాయకురాలిని ఎన్నుకునే పనిలో నిమగ్నమవుతాయి. ఇందుకోసం ప్రత్యేక పద్ధతిని అమలుచేస్తాయి. తేనెపట్టుల్లో రాణివాసాలుగా సుమారు 20, 30 ప్రత్యేకమైన అరలను కొత్తరాణి ఎంపిక కోసం ఏర్పాటుచేస్తాయి. ఈ క్రమంలో రాజహారంగా పిలవబడే ప్రత్యేకమైన ఆహారాన్ని శ్రామిక ఈగలు ఈ అరల్లో పెడుతుంటాయి. ఆహారాన్ని తింటూ ఏ ఈగ ముందుగా బయటకు వస్తుందో దాన్నే రాణిఈగగా భావిస్తాయి. గదుల్లో మిగిలిన ఈగలన్నింటికీ మరణదండన విధిస్తాయి. ఇలా తొలిసారి బయటకు వచ్చిన ఈగను నాయకురాలిగా భావించి అప్పటినుంచీ ఆ రాణి ఈగ నాయకత్వంలో పనిచేస్తాయి.

■ తేనెటీగలకు ప్రధాన శత్రువులు కందిరీగలు, మైనపు పురుగులు. తేనెటీగలపై కందిరీగలు దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు తమ ఆహారాన్ని కాపాడుకునేందుకు కొన్ని తేనెటీగలు అన్నీ కలిసి సామూహికంగా కందిరీగపై మెరుపుదాడి చేస్తాయి. ఈ దాడిలో కందిరీగతోపాటు తేనెటీగలూ చనిపోతాయి. తేనెపెట్టెల్లో మైనాన్ని తినేందుకు చిన్న సీతాకోక చిలుకను పోలి ఉండే మైనపు పురుగులు వస్తాయి. వాటినీ కందిరీగల తరహాలోనే దాడిచేసి చంపుతాయి.

## చలికి వణకాలా.. చదువుకోవాలా?

పాక వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పాఠశాలలకు భవనాలు సమకూరడం లేదు. దశాబ్దాలుగా గిరిజన బాలబాలికలు పాకల్లో, షెడ్డులో చదువు సాగిస్తున్నారు. ముంచంగిపుట్టు మండలం కుమడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు భవనం లేక పదేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రేకులతో నిర్మించిన షెడ్డులో చదువులు సాగిస్తున్నారు. చలి కాలంలో వీరి బాధలు వర్ణనాతీతం. ఇక్కడ ఐదు తరగతుల్లో 40 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు భవనాలు నిర్మించాలని పలుమార్లు అధికారులను కోరినా ఒక్కరూ స్పందించలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

## మంచులో గిలిగింత.. మన్యంలో పులకింత

పర్యాటక సీజన్ ప్రారంభమైనప్పటికీ నుంచి మన్యంలో మంచు దట్టంగా కురుస్తోంది. పది రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత బాగా పెరిగింది. పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే వారి సంఖ్యా పెరుగుతోంది. ముందురోజు రాత్రే చేరుకుని గిలిగింతలు పెట్టే చలిలో క్యాంప్ ఫైర్ వేసుకుని గుడారాల్లో నిద్రిస్తున్నారు. ఉదయాన్నే దట్టంగా కురిసే మంచును ఆస్వాదిస్తున్నారు. శని, ఆదివారాల్లో లంబసింగి, తాజంగి, చెరువులవెనం, పొల్లూరు, ఎర్రవరం జలపాతాలకు పోటెత్తారు.
– న్యూస్‌టుడే, చింతపల్లి, మోతుగూడెం

పొల్లూరు జలపాతంలో జలకాలాడుతూ..

చెరువులవెనం వ్యూపాయింట్ వద్ద రద్దీ

## ఏళ్ల కల.. నెరవేరిన వేళ

సంగులోయ-వంచేబు మార్గంలో బీటీ రహదారి పనులు

సంగులోయ నుంచి వంచేబు వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణం ప్రారంభమైంది. ఉపాధి హామీ నిధులతో ఈ రహదారి నిర్మాణం చేపడుతుండటంతో రెండు గ్రామాల ప్రజల ఏళ్లనాటి కల నెరవేరింది. త్వరలోనే పూర్తిచేస్తామని ఏఈ మాణిక్యం చెప్పారు. వర్షాకాలంలో పడిన బాధలు, బురద దారిలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లే పరిస్థితులు ఇకపై ఉండవని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, జి.మాడుగుల

## అడిగేదెవరు.. అడ్డేదెవరు?

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని ఓ గుత్తేదారు ఆక్రమించి గోదాంగా మార్చేశాడు. అరకులోయలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గ్రామ సచివాలయం పక్కనే సామాజిక భవనాన్ని సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించారు. దీన్ని గుత్తేదారు ఆవాసంగా మార్చుకున్నాడు. అందులోనే భవన నిర్మాణ సామగ్రి, సిమెంట్ బస్తాలు నిల్వ చేస్తున్నాడు. రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వ భవనం ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా మిన్నకుండిపోవడం గమనార్హం. ఈ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అరకులోయ

గుత్తేదారు గోదాంగా మార్చేసిన సామాజిక భవనం

## నేడు పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జడ్పీ యూనిట్ ఎన్నికలు ఈనెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తామని ఎన్నికల అధికారి డి.సీతారామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఆవరణలోని ఆ సంఘం భవనంలో ఎన్నికలు జరుగుతాయని, ఉద్యోగులంతా పాల్గొనాలని కోరారు. ఎన్నికల పరిశీలకులుగా విశ్రాంత ఎంపీడీఓ యు.కూర్మారావు వ్యవహరిస్తారని చెప్పారు.

## అన్నొస్తాదని కాదు.. పంట రక్షణకు!

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పరదాల మాటున పర్యటించిన ముఖ్యనేత వస్తారని చేసిన ఏర్పాట్లు కావివి. వాహనాల రాకపోకలతో రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలపై దుమ్ము పేరుకుపోకుండా రక్షణగా రైతులు గ్రీన్ మ్యాట్లు కట్టుకున్నారు. టేకులబోరు నుంచి కొండ్రుజాపేట మార్గంలో దుమ్ముతో పంటలు దెబ్బతినకుండా దారి పొడవునా వలలు ఏకరాలకు రక్షణగా ఇలా ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, కూనవరం

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

# ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్

నర్సీపట్నం, న్యూస్‌టుడే

వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ పక్కాగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఓటీపీ విధానం ప్రవేశపెట్టినా అంతంతమాత్రంగానే అమలవుతోంది. సిలిండర్ల సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ పద్ధతి ఎంతగానో ఉపకరిస్తుంది. ఇప్పుడు శత శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

★ సాధారణంగా వినియోగదారులు గ్యాస్ బుక్ చేసి నగదు చెల్లించి సిలిండర్లు తీసుకుంటున్నారు. ఏడాదిగా ఓటీపీ పద్ధతిలోనూ ఇవి సరఫరా అవుతున్నాయి. వినియోగదారుడు 94936 02222 నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే సిలిండర్ బుక్ అవడంతోపాటు రిజిస్టర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఇంటికి వచ్చే గ్యాస్ డెలివరీ సిబ్బందికి ఓటీపీ చెబితే సరిపోతుంది. సిబ్బంది తమ మొబైల్‌లోని యాప్‌లో ఓటీపీ నమోదు చేసి ఓకే అవగానే సిలిండర్ ఇచ్చి నగదు తీసుకుంటారు. ఈ విధానాన్ని జిల్లాలో 30 శాతం మందే వినియోగించుకుంటున్నారు.

★ జిల్లాలో హెచ్‌పీ, ఇండేన్, భారత్ కంపెనీలు సేవలందిస్తున్నాయి. వీటి పరిధిలో సుమారు 15 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. నర్సీపట్నం హెచ్‌పీ డీలర్ పరిధిలోని 38 వేల మందిలో 55 శాతం ఆన్‌లైన్‌లో సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారు. గ్యాస్ రాయితీ దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఓటీపీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లతోపాటు బేసిక్ ఫోన్లు వాడే వినియోగదారులూ ఓటీపీ విధానంలో సిలిండర్లు బుక్ చేసుకోవచ్చని నర్సీపట్నం హెచ్‌పీ డీలర్ విద్యాసాగర్ పేర్కొన్నారు.

# నేడే ఆఖరు

## స్మార్టు కార్డుల స్వీకరణకు ముగియనున్న గడువు

నక్కపల్లి, న్యూస్‌టుడే

రేషన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం జారీచేసిన స్మార్టు కార్డుల స్వీకరణకు సోమవారంతో గడువు ముగియనుంది. మూడు నెలల కిందట రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల జారీ చేపట్టగా 96 శాతం మంది తీసుకున్నారు. ఇప్పటికి కొందరు తీసుకోకపోవడంతో ప్రభుత్వం తుది గడువు ప్రకటించింది. జిల్లాలో ఐదు లక్షల మందికిపైగా రేషను కార్డుదారులున్నారు. ఏటీఎం, ఆధార్ కార్డుల తరహాలోనే రేషన్ స్మార్టు కార్డులు జారీ అయ్యాయి. వీటిపై ఇంటి యజమాని ఫొటో, వివరాలు, చిరునామా, కార్డు నంబరు, ప్రభుత్వ ముద్ర, లబ్ధిదారుల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ముద్రించారు. ప్రభుత్వ పథకాల అర్హతకు, పలు ధ్రువపత్రాల జారీలో రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. వీటిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలంటూ ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించింది. తొలుత నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు తీసుకెళ్లి అందజేశారు. మిగిలిపోయిన వారంతా డిపోల వద్దకు వచ్చి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటివరకు 96 శాతం కార్డుల బట్వాడా పూర్తయింది.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| రేషన్ లబ్ధిదారులు | : 5,32,346 |
| ఇంత వరకు ఇచ్చిన కార్డులు | : 5,09,253 |
| తీసుకోవాల్సిన వారు | : 23,093 |

**ఇబ్బందులు పడతారు:** ప్రభుత్వం నేరుగా ఇళ్లకే కార్డులు అందించింది. అందుబాటులోలేని వారంతా డిపోలకు వచ్చి తీసుకోవాలని అందుబాటులో ఉంచాం. చాలామంది తీసుకున్నా, ఇంకా కొందరు మరణాలు, మరికొందరు వలసల కారణంగా తీసుకోలేదని గుర్తించాం. కార్డు వెనక్కి వెళ్లిపోతే ప్రభుత్వం తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఇచ్చేది ఉండదు. ఏదైనా అవసరం వచ్చి కార్డు కావాలంటే ఇబ్బంది పడతారు, అందుబాటులో ఉన్నవారంతా కార్డులు తీసుకోవాలి. – గణపతిరావు, సీఎస్‌డీటీ

# ఉందిగా.. పురమిత్ర

## సమస్యల సత్వర పరిష్కారానికి యాప్

నా వయస్సు 80 సంవత్సరాలు.. ఇంటి ముందు కాలువలు శుభ్రం చేయక భరించరాని దుర్గంధం. దోమల మోత, నడవలేని స్థితిలో ఉన్నా! విశ్రాంత ఉద్యోగినైన నేను మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయలేని పరిస్థితి. పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కాలువ సమస్యపై ఫిర్యాదు చేశా. మరుసటి రోజే మున్సిపల్ సిబ్బంది వచ్చి కాలువ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి వెళ్లారు. – వి.లక్ష్మి, ఎలమంచిలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ప్రజలు ఇంటి నుంచే వారి సమస్యలు పరిష్కరించుకోవడం కోసం ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో గత నెలరోజులుగా ఈ యాప్‌పై ప్రచారం చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకోవడం తెలియని వారికి సచివాలయం సిబ్బంది స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. పురప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేదు. ఫోన్ చేసి సిబ్బందిని బతిమలాడుకోవాల్సిన పనిలేదు.

★ ప్లేస్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఓపెన్ చేస్తే ఫోన్ నంబర్ అడుగుతుంది. ఎంటర్ చేసి సబ్మిట్ చేయగానే ఓటీపీ వస్తుంది.

★ మన చుట్టూ ఉన్న సమస్యలను ఫొటో తీసి యాప్‌లో పంపించవచ్చు. వాయిస్ రికార్డింగ్ ద్వారా సమస్యను చెప్పుకోవచ్చు. ఫిర్యాదుపై పురోగతిని ట్రాక్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఇందులో 8 విభాగాలకు చెందిన 119 నుంచి 150 వరకూ పౌరసేవలు అందుబాటులో ఉన్నాయి. రెండు మున్సిపాల్టీల్లో కలిపి ఇప్పటివరకూ 14,767 మంది ఈయాప్ వాడుతున్నారు.

**3 నుంచి 30 రోజుల్లో..**

సమస్య తీవ్రతను బట్టి 3 నుంచి 30 రోజుల్లోగా పరిష్కరిస్తారు. సమస్య నేరుగా సంబంధిత శాఖకు చేరుతుంది. ఆ అధికారి స్పందించకపోతే ఉన్నతాధికారికి ఫిర్యాదు వెళ్లి స్పందించని అధికారిని బాధ్యుడిని చేస్తుంది. తెలుగు భాషలోనూ యాప్ అందుబాటులో ఉంది.

**అందేసేవలు** : ప్రజారోగ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, అకౌంట్స్, జనన మరణ, వివాహ ధ్రువపత్రాలు, తాగునీటి సమస్య, చెత్త సేకరణ, కాలువలు, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి సేవలను అందిస్తుంది.

**కార్యాలయానికి వచ్చే పనిలేదు**

సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే పనిలేదు. యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల జవాబుదారీతనం పెరిగి సిబ్బంది తొందరగా పరిష్కరిస్తారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. – ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి మున్సిపాలిటీ

# పాపికొండల విహారయాత్రకు ఆరు పర్యాటక బోట్లు

వరద ముంపులో అమ్మవారి ఆలయం

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. గండిపోశమ్మ ఆలయం నుంచి ఆదివారం ఆరు బోట్లలో పర్యాటకులు పాపికొండల అందాలు తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. తొలుత వారంతా కొండమొదలు నుంచి గండిపోశమ్మను దర్శించుకుని విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం కావడంతో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద గోదావరి నిలకడగా కొనసాగుతోంది. పూడిపల్లి, చినరమణయ్యపేట పంచాయతీల పరిధిలోని పది రోజులుగా నీట మునిగిన మొక్కజొన్న చేలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. సీతపల్లి వాగును గోదావరి ఉద్ధృతి కొనసాగుతోంది. పది రోజులుగా అమ్మవారి ఆలయం వద్ద వరద నీరు తగ్గడం లేదు. పోలవరంలో పనులు జరుగుతున్న క్రమంలో ఎప్పటికి వరద నీరు తగ్గుతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. ఆలయం వద్ద గోదావరి పూర్తిగా తగ్గితే గండిపోశమ్మ ఆలయం స్వయంభు దర్శన పనులు ప్రారంభించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు.

# ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య భారతి సంస్థ వైద్యులు

చింతూరు, న్యూస్‌టుడే: అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆరోగ్య భారతి దేశ వ్యాప్తంగా పనిచేస్తోందని ఆ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ వైద్య కళాశాల ఆచార్యులు డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కన్నూరు పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు ఆదివారం ఆరోగ్య భారతి సంస్థ ఆధ్వర్యంలో ప్రథమ, అత్యవసర చికిత్సలు, ఆరోగ్యకర జీవన విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 30 మంది విద్యార్థులకు వాటిపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఆరోగ్య భారతి సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏవీఎల్ నారాయణ, చింతూరు సేవాభారతి వైద్యులు డాక్టర్ పీవీ గంగాధర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధన్48 సాగుతో సత్ఫలితాలు

## వరి కోతలకు సన్నాహాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

నూతన వంగడాలను సృష్టించేందుకు శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమిస్తుంటారు. భారతీయ వరి పరిశోధన సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పాయకరావుపేటలో డీఆర్ఆర్-ధన్48 రకం వరి సాగుకు నాంది పలికారు. ఈ క్రతువులో శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాల విద్యార్థులు భాగస్వాములయ్యారు. ★ మధుమేహంతో బాధపడే వారికి, ఊబకాయం వేధిస్తున్న వారికి మేలు చేసే సన్నరకం బియ్యం అందించాలనే లక్ష్యంతో ఐకార్ కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తోంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ధాన్యం వచ్చే రకాన్ని అభివృద్ధి చేశారు. వీటిని పండించి దిగుబడులు పరిశీలించేందుకు శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేశారు. వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి సుందరం, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బారావు, సంస్థ డైరెక్టర్ రామసీత పర్యవేక్షణలో కొత్త వంగడం సాగు చేపట్టారు. ఇది 120 రోజుల్లోనే కోతకు వచ్చింది. మంచి దిగుబడులు వచ్చే ఆవకాశముంది. అధిక జింక్, తక్కువ గ్లైసెమిక్ సూచిక, తక్కువ పిండి పదార్థం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పోషకాలు ఇమిడి ఉన్నాయి. ప్రయోగం విజయవంతం కావడంతో వరి కోతకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఎంతో ఆనందాన్నిచ్చింది**

నూతన వంగడం ఆవిష్కరణలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ధన్48 రకం పండించడంలో ప్రయోగాలు చేశాం. నారు మడి నుంచి మమేకమయ్యాం. పంట పండించడంలో రైతులు పడుతున్న కష్టం విలువ తెలిసింది. – ఎస్.శ్యామల, ఎం.రమ్య, పి.శరణ్య, బీఎస్సీ విద్యార్థులు

**అహర్నిశలు శ్రమించాల్సిందే..**

పంట పండించడమంటే కష్టంతో కూడుకున్నది. ప్రస్తుత వైపరీత్యాలను తట్టుకుని దిగుబడి సాధించాలంటే అహర్నిశలు శ్రమించాల్సిందే. కొత్త రకం సన్నబియ్యం సాగు కత్తిమీద సామే. శాస్త్రవేత్తల సూచనలతో మంచి ఫలితాలు సాధించాం. – నవదీప్, విద్యార్థి

వరి సాగులో విద్యార్థులు

# యాడున్నారో..

- పెరుగుతున్న అదృశ్యం కేసులు
- లభ్యం కాని 107 మంది ఆచూకీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

❖ ఎలమంచిలికి చెందిన వివాహిత ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినా.. ఇప్పటివరకు ఆమె ఆచూకీ లభ్యం కాలేదు.

❖ అనకాపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి అదృశ్యమయ్యాడు. గోవాడకు చెందిన ఈ విద్యార్థి శనివారం పాఠశాలకని బయలుదేరాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు అనకాపల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లాలో అదృశ్యం కేసులు అధికంగా నమోదవుతున్నాయి. కొందరి ఆచూకీ తెలియడం లేదు. వీరంతా ఏమైపోయారోనన్న ఆందోళనలో కుటుంబ సభ్యులున్నారు. 2023 నుంచి ఇప్పటివరకు జిల్లాలో అదృశ్యమైన వారిలో 107 మంది ఆచూకీ తెలియలేదు. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 59 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసులు చాలామంది ఆచూకీ గుర్తిస్తున్నారు. కొందరి ఆచూకీ గుర్తించడం కష్టమవుతోంది. వివాహితలు, బాలికలు మాయమాటలు నమ్మి ఇంట్లో నుంచి వెళ్లి పోతున్న ఘటనలు అధికమవుతున్నాయి. అపరిచిత వ్యక్తులతో ఏర్పడుతున్న పరిచయాలు, వారు చెప్పే మాటలు నమ్మి వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారి ఆచూకీ గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చాకే కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.

వివాహితలు పిల్లలను వదిలేసి ఇళ్ల నుంచి వెళ్తున్న కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. చిన్నచిన్న విషయాలకే ఇళ్ల నుంచి వెళ్లిపోతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. చదువుకుంటున్న వయసులో బాలికలు, యువతులు ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని కుటుంబ సభ్యులకు వేదన మిగిల్చేలా వ్యవహరించవద్దని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. – తుహిన్‌సిన్హా, ఎస్పీ

**మూడేళ్లలో ఇలా..**

| ఏడాది | కేసులు | మహిళలు | పురుషులు | బాలికలు | బాలురు | ఆచూకీ లభ్యం | పెండింగ్ |
|---|---|---|---|---|---|---|---|
| 2023 | 417 | 197 | 131 | 66 | 23 | 396 | 21 |
| 2024 | 422 | 210 | 142 | 60 | 20 | 395 | 27 |
| 2025 | 332 | 168 | 103 | 45 | 16 | 273 | 59 |

# దస్తూరి.. భవితకు దారి

## చక్కని చేతిరాతకు విద్యార్థుల సాధన

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంపైనే ఇప్పుడు అందరి దృష్టి. పరీక్షల్లో విద్యార్థుల చేతిరాత కీలక పాత్ర పోషించనుంది. విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉపాధ్యాయులు దస్తూరి మెరుగుపడేలా విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు.

'రాత బాగుంటే.. గీత బాగుంటుంది' అన్నది నానుడి. అక్షరాలను ముత్యాల్లా రాస్తే టాపర్లుగా నిలవవచ్చు. పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యార్థులకు ఇప్పటికే వంద రోజుల విద్యా ప్రణాళిక అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా 405 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 18,500 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా చక్కని దస్తూరితో సమాధానాలు రాయడంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతోపాటు సాధన చేయిస్తున్నారు.



చేతి రాత సాధన చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు అప్పారావు

**ఇలా చేయండి..**

★ ఇటుకలు పేర్చినట్లు అక్షరాలు అందంగా ఉండేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నర్సీపట్నం ఎంఈవో తలుపులు సూచిస్తున్నారు.

★ చూడగానే ఆకట్టుకునేలా, ఒక క్రమపద్ధతిలో గుండ్రని అక్షరాలతో సమాధానాలు రాయాలి.

★ గీతలు లేని కాగితంలోనూ వరుస తప్పకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ★ ఒకదానికొకటి అంటుకోకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో ఉండాలి.

★ రెండు పదాల మధ్య '0' పట్టేంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ సాధన చేస్తే చక్కని దస్తూరి సొంతమవుతుంది.

# ఆవలో లాహిరి.. లాహిరి

ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే కొండకర్ల ఆవకు సెలవు రోజుల్లో సందర్శకులు బారులు దీరుతున్నారు. కుటుంబ సమేతంగా కొందరు, స్నేహితులతో ఇంకొందరు, బృందాలుగా మరి కొందరు ఇక్కడకు చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదగా గడుపుతున్నారు. ఈ ఆదివారం ఆవ సందర్శకులతో కిటకిటలాడింది. ఫైబర్ బోట్లలో విహరిస్తూ ఆవ అందాలను ఆస్వాదించారు. ఆవ ఒడ్డున వనసమారాధనలు నిర్వహించి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, ఆటలాడుతూ సందడి చేశారు. – న్యూస్‌టుడే, అచ్యుతాపురం

# మూడడుగులు కదురు..

సముద్రంలో లభించే చేపల్లో అనేక రకాలైన జాతులుంటాయి. ఇందులో కొన్ని రకాలే ఇక్కడి వారికి పరిచయం. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలంలో వేట సాగించే మత్స్యకారులు నక్కపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాల్లో మార్కెట్‌లో చేపలు విక్రయిస్తుంటారు. ఈ రెండుచోట్ల ఆదివారం వచ్చిన చేపల్లో కొన్నింటిని కొనేందుకు పలువురు ఆసక్తి చూపారు. వీటిలో పొడవైన ఈటెలాంటి మూతి ఉన్న కదురులు ఉన్నాయి. ఇవి సహజంగా అడుగున్నర పొడవున్నవే లభిస్తుంటాయి. మూడడుగుల పొడవైన ఈ చేపలు ఒక్కొక్కటి రూ.1500 ధర పలికాయి. – న్యూస్‌టుడే, నక్కపల్లి

# శిరస్త్రాణం ధరిస్తే ప్రాణాలు నిలిచేవి..!

## స్తంభాన్ని ఢీకొని ఇద్దరు స్నేహితుల దుర్మరణం

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: వేర్వేరు గ్రామాలు అయినా ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు ఇద్దరూ కలిసే ఉంటారు. ఎక్కడకు వెళ్లినా కలిసే వెళ్తారు. మునగపాక మండలం గణపర్తి గ్రామంలో ఉత్సవానికి వెళ్లి బైక్‌పై వస్తూ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. శిరస్త్రాణం లేకపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోగా ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. అచ్యుతాపురం, మునగపాక ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. మునగపాక మండలం గణపర్తి, చెర్లోపాలెం గ్రామాలకు చెందిన భోగాది ధనువిజయ్ (19), ధూళి దుర్గ (20) స్నేహితులు. గణపర్తిలో ఉత్సవానికి వెళ్లిన ఇద్దరూ దుర్గ అమ్మమ్మ ఊరైన చోడిపల్లి వెళ్లాలని స్నేహితుడి బైక్ తీసుకున్నారు. ఎం.జగన్నాథపురం సమీపంలో మలుపు వద్ద రాత్రి 11.30 గంటల సమయంలో మంచుతో రోడ్డు కనిపించక విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న దుర్గతోపాటు వెనుక కూర్చున్న ధనువిజయ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కాపాడేందుకు స్థానికులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దుర్గ, విజయ్ (పాత చిత్రాలు)

★ ఒక్క రోడ్డు ప్రమాదం రెండు పేద కుటుంబాల్లో విషాదం నింపింది. చేతికందొచ్చిన కుమారులను దూరం చేసింది. పదో తరగతి వరకు చదువుకున్న దుర్గ, ధనువిజయ్ చిన్న చిన్న పనులు చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉంటున్నారు. దుర్గ తండ్రి గతంలోనే చనిపోయారు. తల్లి నాగమణి, అన్నయ్య చందు అచ్యుతాపురం సెజ్‌లోని దుస్తుల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ధను విజయ్ తండ్రి మహేష్ టింకరింగ్ పని చేస్తుంటారు. తల్లి లక్ష్మి దుస్తుల పరిశ్రమలో పనిచేస్తున్నారు. సోదరి పావని ఇంటర్ చదువుతోంది. కొడుకు దూరమైన తమకు దిక్కెవరంటూ ధనువిజయ్ తల్లి లక్ష్మి రోదించడం అక్కడి వారిని కంట తడి పెట్టించింది. శిరస్త్రాణం ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడే వారని, తలకు బలమైన గాయాలు కావడంతోనే మృత్యువాత పడ్డారని కన్నీరుమున్నీరయ్యారు.

# ట్రాఫిక్ చిక్కులతో బస్సులు ఆలస్యం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవడం వల్లే ఆర్టీసీ బస్సులు ఆలస్యంగా రాకపోకలు వస్తున్నాయని జిల్లా ప్రజా రవాణా అధికారి వి.ప్రవీణ చెప్పారు. 'ఒక్క బస్సు లేదే' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. కశింకోట, లంకెలపాలెం, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లో చాలా సేపు ట్రాఫిక్ నిలిచిపోతుండటం వల్ల బస్సులన్నీ ఆలస్యమవుతున్నాయన్నారు. సాయంత్రం సమయంలో కశింకోట వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోందన్నారు. కణితి రోడ్డు మరమ్మతుల వల్ల కూర్మన్నపాలెం మీదుగా రాకపోకలు సాగించడం వల్ల వాహనాల సంఖ్య పెరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యలతో ఆర్టీసీ డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, వీటిని అధిగమించి సకాలంలో బస్సులు నడిచేలా చూస్తామన్నారు.

# మహాసభ 21న

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: చింతూరులో ఈనెల 21నిర్వహించే అమర వీరుల సంస్మరణ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు పిలుపునిచ్చారు. రేఖపల్లిలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో చిన్నబాబు మాట్లాడారు. సత్తిబాబు, సుందరయ్య పాల్గొన్నారు.

JOBS

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

# 'కాఫీ' వచ్చేస్తోంది!

- క్యూరింగ్ సెంటర్‌కు గింజల సరఫరా
- జనవరి నుంచి మహిళలకు ఉపాధి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నర్సీపట్నం కేంద్రంగా నడుస్తున్న కాఫీ శుద్ధీకరణ కేంద్రానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ ఎస్టేట్ల నుంచి గింజల సరఫరా మొదలైంది. ఈ ఏడాది 175 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను ఇక్కడ శుద్ధి చేయించి వేలంలో విక్రయించాలన్నది లక్ష్యం. ఇప్పటికే 49 టన్నుల గింజలను ఇక్కడి గోదాముల్లో నిల్వ చేశారు. వంద టన్నులకు చేరుకోగానే శుద్ధీకరణ పనులు ప్రారంభించనున్నారు. తద్వారా నర్సీపట్నంలో సుమారు వంద మంది మహిళలకు ఉపాధి లభించనుంది.

కాఫీ పండ్లు

★ గతేడాది 183 టన్నుల గింజలను నర్సీపట్నం కేంద్రంలో శుద్ధి చేశారు. వీటిని వేలంలో విక్రయించంగా రూ.9.7 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువ వస్తుందన్న అంచనాతో శుద్ధీకరణ లక్ష్యాన్ని కుదించారు. ఈ పనులు పూర్తయ్యాక గిరిజనుల నుంచి జీసీసీ కొనుగోలు చేసిన వేల టన్నుల గింజలను శుద్ధిచేసి ఇస్తుంటారు. ఎగుమతులు, దిగుమతులు, గింజలను ఆరబెట్టడం, మర పట్టడం తదితర పనుల ద్వారా వచ్చే ఏడాది జనవరి నుంచి మూడు నెలలకుపైగా మహిళలకు ఉపాధి లభించనుంది.

★ ఏపీఎఫ్‌డీసీకి అల్లూరి జిల్లాలో నాలుగు వేల హెక్టార్లకుపైగా కాఫీ తోటలున్నాయి. వివిధ కారణాల వల్ల ప్రస్తుతం 3,300 హెక్టార్ల నుంచే కాఫీ గింజల సేకరణ జరుగుతోంది.

నర్సీపట్నంకు చెందిన పలువురు వ్యాపారులు ఏజెన్సీకి వెళ్లి కాఫీ గింజలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. ఇక్కడ వాటిని ఆరబెట్టి శుభ్రం చేయించి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. నాణ్యత, రుచుల్లో మన కాఫీ అంతర్జాతీయంగా పలు అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. పురపాలక సంఘం పరిధిలోని మార్కెట్ యార్డులో జనవరి నుంచి కాఫీ గింజల ఆరబోత, శుద్ధీకరణ పనులు ప్రారంభం కానున్నాయి.

★ మాకవరపాలెం మండలంలో కాఫీ పరిశ్రమ ఏర్పాటుకు జీసీసీకి ఇప్పటికే కొంత భూమి కేటాయించింది. సంబంధిత అధికారులు పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిశ్రమలో వందలాది మందికి ఉపాధి లభించనుంది. నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన వారికే ఈ పరిశ్రమలో ఉద్యోగాలొచ్చేలా చూస్తామని సభాపతి అయ్యన్నపాత్రుడు ఇటీవల ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు నెలకొన్నాయి.

# వైద్య శిబిరంలో 400 మందికి సేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 400 మంది రోగులకు వైద్యసేవలు అందించి మందులు పంపిణీచేసినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. వైద్యులు రామారావు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, మణికంఠ, శృతి పరీక్షలు చేశారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షించి మందులు అందజేశారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేశారు. వైద్యశిబిరాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి సందర్శించి నాలుగు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతంలో రామకృష్ణమిషన్ అందిస్తున్న వైద్యసేవలపై ప్రశంసించారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు బాలాజీ శ్రీను, అడబాల బాపిరాజు, సమన్వయకర్త శ్రీనివాసు పాల్గొన్నారు.

రామకృష్ణమిషన్ ఇన్‌ఛార్జితో బొజ్జిరెడ్డి తదితరులు

# రేషన్ పొందేందుకు లబ్ధిదారుల పాట్లు

ఎటపాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పొందేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామాల్లో సంకేతాలు అందక, అంతర్జాలం పనిచేయక అవస్థలు పడుతున్నారు. వీటిని తీసుకునేందుకు ఒక్కరోజే గడువు ఉండటంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులు ఆదివారం రేషన్ దుకాణాల వద్ద బారులు తీరారు. ఏజెన్సీలో సిగ్నల్స్ సమస్య అధికంగా ఉండటంతో రేషన్ డీలర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పరిస్థితిని బట్టి గుట్టలు ఎక్కాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు.

క్యూలో లబ్ధిదారులు

**చికెన్ ధరలు** (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 111 | 113 |
| లైవ్ | 138 | 133 |
| డ్రెస్డ్ | 200 | 236 |
| స్కిన్‌లెస్ | 228 | 246 |

(c) eenadu

## సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి రామకృష్ణమూర్తి

కొయ్యూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పాకలపాడు ఆశ్రమం గురువు రామానందస్వామి అన్నారు. గడబపాలెం పంచాయతీ మల్లవరం గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రామకృష్ణమూర్తి, రామానంద స్వామి హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ భూమారెడ్డి పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: నెల్లిపాక ముత్యాలమ్మ దేవాలయ ఆవరణలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధి జంగమయ్య మాట్లాడుతూ.. హిందువుల ఐక్యత కోసం సంఘం చేసిన కార్యక్రమాలను వివరించారు.

## హెల్మెట్‌తో ప్రాణాలకు భరోసా

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ-విశాఖపట్నం ఘాట్‌రోడ్డులో హెల్మెట్ వాడకంపై పోలీస్‌శాఖ వినూత్న ప్రచారం నిర్వహించింది. సీఐ హిమగిరి, ఎస్సై గోపాలరావు.. కాఫీ తోటల వద్ద వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. హెల్మెట్లు ధరించకుండా వస్తున్న ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడపటం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. హెల్మెట్ ఉంటే ప్రాణాలకు భరోసా ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకులకు తప్పనిసరిగా దీన్ని ధరించాలన్నారు.

వాహనదారులకు స్వాగతం పలుకుతున్న సీఐ హిమగిరి, ఎస్సై గోపాలరావు

## పరిహారమే సాగుకు పెట్టుబడి

కూనవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం అందజేస్తున్న పరిహారాలు వ్యవసాయ పెట్టుబడులకు అక్కరకొస్తున్నాయి. నెల రోజులుగా కూనవరం, వీఆర్‌పురం మండలాల్లోని ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం ఇంటి విలువల పరిహారాలను బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు ఆ మొత్తాన్ని పంటల సాగుకు పెట్టుబడిగా వినియోగిస్తున్నారు. పరిహారాలు రాకుంటే వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితని పలువురు చెబుతున్నారు. సమయానికి పరిహారం జమ కావడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పనిలేకుండా పోయిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాడ్వాయిలో ప్లాట్లుగా విభజించని భూమి

ఏపుగా ఎదిగిన వరి పంట

★ పరిహారంగా అందిన సొమ్ముతో ఇల్లు నిర్మించుకోవాలని పలువురు నిర్వాసితులు అనుకున్నా సాధ్యపడటం లేదు. అధికారులు ఇప్పటివరకు పునరావాసం కోసం పశ్చిమగోదావరి జిల్లా తాడ్వాయిలోని భూములనే చూపిస్తున్నారు తప్ప.. వాటిని ప్లాట్లుగా విభజించలేదు. ఫలితంగా ఎవరి ఇంటి స్థలం ఎక్కడన్న స్పష్టత నిర్వాసితుల్లో లేదు. అధికారులు ముందుగా ప్లాట్లు విభజించి తర్వాత పరిహారాలు జమ చేసి ఉంటే నిర్వాసితులంతా ఆ మొత్తాన్ని ఇళ్ల నిర్మాణాలకు వినియోగించే వారు. ఇప్పటికే రెండు గ్రామసభలు నిర్వహించిన అధికారులు తాజాగా పునరావాస పరిహారాలు, ఇంటి నిర్మాణాలపై నిర్వాసితుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. రానున్న మూడు నెలల్లో నిర్వాసితులకు ఇంటి స్థలాల కేటాయింపు చేస్తామని చెబుతున్నారు.

పరిహారంగా వచ్చిన మొత్తంలో కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి కొంత వ్యవసాయ పెట్టుబడిగా వాడుతున్నామన్నారు. వ్యవసాయం లేని వారు పరిహారం మొత్తాన్ని బ్యాంకుల్లో ఎఫ్.డి. చేస్తుండగా, కొందరు ఆడంబరాలకు ఖర్చు చేస్తున్నారు.

## చిన్నబోయిన సీలేరు

మోతుగూడెం, న్యూస్‌టుడే: పొల్లూరు జలవిద్యుత్కేంద్రంలో 460 మెగావాట్ల విద్యుదుత్పత్తి ద్వారా విడుదలయ్యే 4,600 క్యూసెక్కుల నీటితో నిండుగా కనిపించే సీలేరు నది పది రోజులుగా చిన్నబోయింది. ఈ కేంద్రంలో నాలుగు యూనిట్లకు అదనంగా రూ.510 కోట్లతో 5, 6 యూనిట్ల పనుల్లో భాగంగా ఈ నెల 3 నుంచి విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేశారు. దీంతో సీలేరు నదిలో నీటి ప్రవాహం లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడంతో రాళ్లు తేలిపోయాయి. నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు పడవలపై వెళ్లే గిరిజనులు రాళ్లు తేలడంతో ఒడిశా నుంచి ఆంధ్రాకు రాళ్లపై నుంచి నడుచుకుంటూ వస్తున్నారు. ఈ నది అటవీ ప్రాంతం నుంచి ప్రవహించి చింతూరు శబరి నదిలో కలుస్తుంది. ఆ సమయంలో గిరిజన, గిరిజనేతర రైతుల పంటల సాగుకు ఉపయోగపడి, వేసవిలో మూగజీవాల దప్పిక తీరుస్తోంది. 5, 6 యూనిట్ల డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్ల నిర్మాణం, పవర్ కెనాల్ నిర్వహణ పనులు పూర్తయిన తర్వాతనే పొల్లూరు జలవిద్యుత్కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తారు. అప్పటి వరకు సీలేరు నదిలో నీటి ప్రవాహం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాళ్లు తేలిన సీలేరు నది

## అ వీ ఇ వీ

### జీసీసీ ఛైర్మన్ పర్యటన నేడు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి ఈనెల 15న చింతపల్లి మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు ఆదివారం తెలిపారు. లంబసింగి పంచాయతీ బురదబీడి గ్రామ కాఫీ రైతులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జీసీసీ పెట్రోల్‌బంక్, జీసీసీ కార్యాలయం సందర్శిస్తారన్నారు. భోజనం తరువాత తెదేపా కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. ఏఎంసీ, పీఏసీఎస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

### సక్రమంగా అందని సరకులు

సీలేరు, న్యూస్‌టుడే: దుప్పిలవాడ పంచాయతీ వలసపల్లి అంగన్‌వాడీ కేంద్రం నుంచి సరకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని పెసా కమిటీ ఉపాధ్యక్షుడు జి.బిసన్, కార్యదర్శి కృష్ణ ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వంటలు వండి, ఆటపాట నేర్పాల్సి ఉన్నప్పటికీ నిర్వాహకురాలి నిర్లక్ష్యం వల్ల అలా జరగడంలేదన్నారు. నెలకు ఒకరికి 15 గుడ్లు, కొద్దిపాటి బియ్యం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారన్నారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### సీడీపీవోను నియమించండి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ప్రజలకు, అంగన్‌వాడీ లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా సీడీపీవోను నియమించాలని జీకేవీధి మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ దాహూద్ కోరారు. స్థానిక సీడీపీవో.. పీడీ బాధ్యతలు చూస్తుండటంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

### ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలోని మిస్పా ప్రార్థన మందిరంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘకాపరి లక్కోండ పాల్‌బుజ్జి బాబు ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎఫ్‌సీఎస్ ఛైర్మన్ బిషప్ గొర్లె శ్రీకాంత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్లె అనిల్‌ప్రసాద్, సత్తు కామేశ్వరరావు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## సీతపల్లి వాగుపై వంతెన కలేనా?

దేవీపట్నం, న్యూస్‌టుడే: వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాల ప్రజలకు ఏళ్ల తరబడి సీతపల్లి వాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో మూడు నెలలకుపైగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. వెలగపల్లి - గుంపెనపల్లి గ్రామాల మధ్య సీతపల్లి వాగుపై వంతెన ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులకు వినతులు అందజేసినా ఫలితం లేదు. ఇటీవల వారంతా నిరసన చేపట్టారు. ప్రతి నెలా నిత్యావసర సరకులు, పిల్లల చదువులు, ఆరోగ్యం బాగోలేనివారిని ఆసుపత్రికి తరలించేందుకు వాగు దాటి వెలగపల్లి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగు సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. వంతెన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాగులో గుంపెనపల్లి గిరిజనుల రాకపోకలు

## నీటి పథకం.. నిరుపయోగం!

పెదబయలు మండలం గలగండ పంచాయతీ సిరసపల్లిలో గ్రావిటీ నీటి పథకం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. కొన్నేళ్ల క్రితం ఈ పథకం మూలకుచేరినా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామంలో నీటికష్టాలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చిన్ననీటిపారుదలశాఖ జేఈ జగదీష్‌ని వివరణ కోరగా.. పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వినియోగంలోకి వచ్చేలా కృషిచేస్తానని పేర్కొన్నారు. – పెదబయలు, న్యూస్‌టుడే

## కొలువు ఇక్కడ.. నివాసం అక్కడ

ఎంపీడీవో అందుబాటులో లేకుంటే ఎలా?

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: 12 పంచాయతీలు, 8 సచివాలయాలు, 71 గిరిజన గ్రామాలతో మారేడుమిల్లి మండలం విస్తరించి ఉంది. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే 30 నుంచి 50 కి.మీ. ప్రయాణించాలి. వేర్వేరు పనులపై వ్యయప్రయాసలకోర్చి వస్తే.. కార్యాలయాల్లో సంబంధిత అధికారులు అందుబాటులో లేక ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వస్తోంది. ఎంపీడీవోగా రవికిశోర్ సెప్టెంబర్ 22న బాధ్యతలు స్వీకరించారు. అప్పట్నుంచి ఆయన కార్యాలయంలో సరిగా ఉండటం లేదు. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే పర్యటన సమయాల్లోనే కార్యాలయానికి వస్తున్నారు. మండల పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఉండటం లేదని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆహ్వానం ఉండటం లేదంటూ స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఈ విషయమై అక్టోబరు 16న జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా చూస్తామని ఎంపీడీవో రవికిశోర్ హామీ ఇచ్చారు. స్థానికంగా నివాసం ఉండేందుకు క్వార్టర్ లేదని ఆయన ప్రస్తుతం అడ్డతీగలలో ఉంటున్నారు. దస్త్రాలపై సంతకాలు కావాలంటే కార్యాలయ సిబ్బంది అక్కడికే వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల స్థాయి అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఖాళీగా ఎంపీడీవో కుర్చీ

## పర్యాటకం.. కోలాహలం..!

పాడేరు, న్యూస్‌టుడే: మన్యంలో పర్యాటక ప్రాంతాలు ఆదివారం కళకళలాడాయి. తెల్లవారుజాము నుంచే సందర్శకులు తరలిరావడంతో ఆయా ప్రాంతాలన్నీ కోలాహలంగా కనిపించాయి. వంజంగి మేఘాలకొండలకు పర్యాటకులు పోటెత్తారు. మంచు అందాలు పర్యాటకులను పరవశింపచేశాయి. అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన చెక్ గేటు ద్వారా సుమారు రూ.2.24 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

వంజంగి మేఘాల కొండపై సందర్శకులు

★ మన్యంలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మినుములూరు కాఫీ బోర్డు వద్ద 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఎస్ఎల్‌ఓ రమేష్ తెలిపారు. జనవరి నెలలో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కొత్తపల్లి కళకళ

సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో జలపాతం పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. కుటుంబసమేతంగా వచ్చిన పర్యాటకులు ఇక్కడి అందాలను ఆస్వాదించారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని డముకు వ్యూపాయింట్, బొర్రాగుహలు, తాడిగుడ, కటికి జలపాతాలను అధిక సంఖ్యలో సందర్శించారు. శనివారం సుమారు 6500 మంది, ఆదివారం 6 వేల మంది బొర్రాగుహలను సందర్శించారు. కాఫీతోటల్లో సేదతీరారు. ఘాట్‌రోడ్డులో రద్దీ నెలకొంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

తాడిగుడ జలపాతం వద్ద..

చాపరాయిలో

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి, అంజోడ సిల్క్ ఫాం పీనరీ, కొల్లాపుట్టు జలతరంగిణి పర్యాటకులతో కిటకిటలాడాయి. చాపరాయిలో సరదాగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

## గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

కూనవరం, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని కూనవరం, వీఆర్‌పురం ఎస్సైలు లతశ్రీ, సంతోశ్‌లు పేర్కొన్నారు. చింతూరు ప్రీమియర్ లీగ్‌కు చెందిన కొన్ని పోటీలను కూనవరం పోలీస్ మైదానంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను ఇద్దరు ఎస్సైలతోపాటు తెదేపా, జనసేన మండలాధ్యక్షులు భాస్కరరావు, నరేంద్ర ప్రారంభించారు. తొలిపోటీలో అడవి వెంకన్నగూడెం, వీఆర్‌పురం జట్లు తలపడగా అడవి వెంకన్నగూడెం జట్టు విజయం సాధించింది. మచ్చా వినయ్ ప్రసాదు, గణేశ్, రామారావు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న కూనవరం, వీఆర్‌పురం ఎస్సైలు, కూటమి నాయకులు

## కొలిక్కిరాని బూదరాళ్ల పంచాయతీ విభజన

కొయ్యూరు, న్యూస్‌టుడే: మండలంలో అతిపెద్ద పంచాయతీ బూదరాళ్లను విభజించడానికి ఆదివారం బాలరేవుల గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ పంచాయతీని మూడు, నాలుగు భాగాలుగా చేయాలన్న వాదనలు వినిపించాయి. సర్పంచి ముత్యాలమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పంచాయతీలోని 33 గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పంచాయతీని నూతనంగా ఏర్పాటు చేయాలంటే కనీసం 500 మంది జనాభా ఉండాలని ఇన్‌ఛార్జి ఈవోఆర్డీ బాబూరావు తెలిపారు. బాలరేవులను పంచాయతీగా ఏర్పాటు చేయాలని కొంతమంది ప్రజలు కోరారు. పోకలుపాలెం, గరిమండలలోనూ వేర్వేరుగా ఏర్పాటు చేయాలని మరికొంతమంది డిమాండ్ చేశారు. వేర్వేరు వాదనలు రావడంతో మరోమారు చర్చించాలన్న నిర్ణయానికి పంచాయతీ పాలకవర్గం వచ్చింది. మంప ఎస్సై శంకర్రావు, కార్యదర్శి లీలా కృష్ణ పాల్గొన్నారు.

గ్రామసభకు హాజరైన ప్రజలు

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

### యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చింతూరు, న్యూస్‌టుడే: మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక, సాధారణ సమావేశం మండల కమిటీ అధ్యక్షులు ఎం.సోమరాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా గౌరవాధ్యక్షులు పి. కృష్ణయ్య పాల్గొన్నారు. తొలుత నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పనులు మినహాయించాలని డిమాండ్ చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సోమరాజు, ముత్తయ్యలతోపాటు 13 మందితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రహదారిని కమ్మేసిన మంచు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో ఆదివారం ఉదయం 516-ఈ జాతీయ రహదారిపై దట్టమైన పొగమంచు కురిసింది. 8 గంటలు దాటినా మంచు తెరలు వీడలేదు. వాహనదారులు లైట్లు వెలిగించి రాకపోకలు సాగించారు. గత కొద్ది రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో మంటల నుంచి ఉపశమనం పొందుతున్నారు. ప్రకృతి ప్రేమికులు మంచు అందాలకు పరవశిస్తున్నారు.

రహదారిపై కురుస్తున్న మంచు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 35 ఏళ్ల కిందట చదివిన మొట్టమొదటి పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు థింసా నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మృతి చెందిన తమ స్నేహితులకు నివాళి అర్పించారు. తమలో ఎవరికి ఆపద వచ్చినా ఆదుకోవాలని, పాఠశాల అభివృద్ధికి సాయం చేయాలని నిర్ణయించారు. ఇక్కడే చదివి డాక్టరేట్ సాధించిన అమృతరావు, మరికొందరిని సన్మానించారు. సర్పంచి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, నాయకులు సూరయ్య, జయదేవ్, పూర్వవిద్యార్థులు ఫాల్గుణ, లక్ష్మణరావు, ధర్మారావు, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## పర్యాటక భవనంగా పాఠశాల!

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించే లక్ష్యంతో మారుమూల గ్రామాల్లోనూ ప్రభుత్వం వివిధ యాజమాన్యాల కింద పాఠశాలలు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా చాలాకాలం క్రితమే మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలస పంచాయతీ పరిధి వాలమూరులో గిరిజన ప్రాథమిక పాఠశాల (జీపీఎస్) ఏర్పాటు చేశారు. 2015 ప్రాంతంలో సరిపడినంతగా విద్యార్థులు లేరనే ఈ పాఠశాలను మూసివేశారు. ఇక్కడి విద్యార్థులను మారేడుమిల్లి, బోదులూరు, వేటుకూరు, దేవరపల్లి తదితర ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించారు. అప్పటి నుంచి ఈ పాఠశాల భవనం ఖాళీగా ఉండిపోయింది. కాలక్రమంలో నిర్వహణ లేక ఇది శిథిల స్థితికి చేరింది.

★ శిథిలస్థితికి చేరి, నిరుపయోగంగా ఉన్న వాలమూరు పాఠశాల భవనాన్ని 'జంగిల్‌స్టార్ నేచర్‌క్యాంపు' సిబ్బంది గమనించారు. పైగా ఈ పర్యాటక ప్రదేశాలకు వెళ్లే దారిలో ఉండటంతో తమకు పూర్తి అనుకూలంగా ఉంటుందని భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శిథిల భవనానికి మరమ్మతు చేపట్టి, సుందరంగా తీర్చిదిద్దారు. పర్యాటకంగా అవసరమైన పనులకు దీనిని వినియోగించుకుంటున్నారు. ఇటీవల దీనిపై గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీనిపై రంపచోడవరం గిరిజన సంక్షేమశాఖ ఏటీడబ్ల్యూవో అక్కడికి వెళ్లి, దర్యాప్తు చేశారు. 2017లో నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని తమకు కేటాయించాలంటూ అప్పటి రంపచోడవరం అటవీశాఖ వన్యమృగ సంరక్షణ విభాగం రేంజి అధికారి ఆ శాఖ డీడీని సంప్రదించి, అనుమతులు తీసుకున్నట్లు వెల్లడైంది. ప్రస్తుతం గ్రామంలో బడుల్లో చదివే వయసున్న చిన్నారులు చాలామంది ఉండడంతో తిరిగి పాఠశాలను పునః ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వాలమూరు పర్యాటక భవనంగా మారిన పాఠశాల భవనం

## నాణ్యత లోపిస్తే సహించం

హుకుంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే మత్స్యలింగం పేర్కొన్నారు. తడిగిరి నుంచి కొండచీడిపుట్టు మీదుగా బర్రెలబంద వరకు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే, కూటమి నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. రూ.5.50 కోట్లతో ఈ రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లో రూ.కోట్లతో చేపడుతున్న రహదారుల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సర్పంచులు రంజిత్ కుమార్, పూర్ణిమ, నాయకులు పాల్గొన్నారు.

తడిగిరిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

## మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

### వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలోని పలు వీధుల్లో పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీనిపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన చిత్ర వార్తలు ప్రచురితం అయ్యాయి. దీనికి పంచాయతీ కార్యదర్శి వెంకటరావు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపించి వ్యర్థాలను తీయించారు.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: వంతాల పంచాయతీ పెదవలసలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. మరమ్మతులు చేయాలి. – పద్మ, వంతాల, ✓: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తాం. – రమణ, విద్యుత్తు ఏఈ, జి.మాడుగుల

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలో పెదగెద్దాడ నుంచి సోకులగూడెం వెళ్లే రహదారి గుంతలుపడి మెటల్ లేచిపోయి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ..సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు, సోకులగూడెం, ✓: పెదగెద్దాడ నుంచి సోకులగూడెం గ్రామానికి పక్కా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో నిర్మాణ పనులను ప్రారంబిస్తాం. – వెంకటరమణ, డీఈ పీఆర్, రంపచోడవరం.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి కరిముఖిపుట్టు వెళ్లే రహదారిలో డేగలపుట్టు సమీపంలో రహదారి ఛిద్రమైంది. మరమ్మతులు చేపట్టాలి. – గణేష్, స్థానికుడు, ✓: రోడ్డును పరిశీలించాం. మరమ్మతులు చేపడతాం. – రాముడు, ఏఈ, గి.సం.శాఖ, ముంచంగిపుట్టు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సున్నంపాడు పంచాయతీ పరిధిలోని పెద్దమల్లంపాడు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. – ప్రభాకర్‌రెడ్డి, కుండాడ,✓: పెద్దమల్లంపాడు వెళ్లే రహదారి నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. – చైతన్య, డీఈఈ, గి.సం. ఇంజినీరింగ్ విభాగం

## విద్యుత్తు వృథా అరికడదాం

సీలేరు, న్యూస్‌టుడే: విద్యుత్తు వృథాను అరికడదామని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది పిలుపునిచ్చారు. ధారకొండ పంచాయతీ పెద గంగవరంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వీధి దీపాలు నిత్యం వెలగడం ద్వారా విద్యుత్తు వృథా అవుతుందని, రాత్రుళ్లు మాత్రమే వెలిగేలా గ్రామస్థులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యుత్తుతో నడిచే ధాన్యం మిల్లులు ఉంటే మీటర్ తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా తమకు తెలియజేయాలని లైన్‌మెన్ శివ కోరారు.

అవగాహన కల్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది

## సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని, సమాజానికి తోడ్పాటు అందించాలని ప్రిన్సిపల్ విజయభారతి అన్నారు. చింతపల్లి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం చిలకలమామిడి గ్రామంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈశ్వర్, సతీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలకలమామిడిలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## ప్రహరీని ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

హుకుంపేట, న్యూస్‌టుడే: బైకును తప్పించబోయి పాఠశాల ప్రహరీని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద పాడేరు నుంచి వస్తున్న కారు.. బైక్‌ను తప్పించబోయి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బైకుపై ఉన్న అనంతగిరి మండలానికి చెందిన రాజారావు కింద పడి గాయాలపాలయ్యారు. కారులో ఉన్న సాయికీ గాయాలయ్యాయి. సాయి తన స్నేహితులతో కలసి విశాఖపట్నం నుంచి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అంబులెన్సులో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రహరీ ధ్వంసమైంది.

పాఠశాల ప్రహరీని ఢీకొట్టిన కారు

(c) eenadu

ఈనాడు
అమరావతి
గుంటూరు
సోమవారం డిసెంబరు 15, 2025


# ముందుచూపు.. ముప్పు తప్పు

## రాజధానిలో వేగంగా గ్రావిటీ కెనాల్స్, రిజర్వాయర్ల పనులు

ఎన్‌-16 రహదారి పక్కన గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, తుళ్లూరు

భవిష్యత్తులో ఎంత పెద్ద వర్షం పడినా అమరావతికి వరద ముప్పు లేకుండా రాజధాని బృహత్ ప్రణాళిక ప్రకారం రూపొందించిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొండవీటి, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్, నీరుకొండ, శాఖమూరు, పెనుమాక రిజర్వాయర్ల నిర్మాణ పనులు అమరావతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 30 శాతానికి పైగా పూర్తి చేశారు. ఈ కాలువల నిర్మాణం ద్వారా వరద నీటి సమస్యలు శాశ్వత పరిష్కారం లభించనుంది. నీటి వనరులకు కొరత లేకుండా ఉంటుంది. ప్రస్తుతం వర్షం పడినప్పుడు తప్పా మిగతా సమయంలో రిజర్వాయర్లు, కెనాల్స్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2026 డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఏడీసీఎల్ కృషి చేస్తోంది.

### నెదర్లాండ్స్ డిజైన్లు..

అమరావతిలో ఎంత పెద్ద వర్షం పడినా, ఎగువ నుంచి వరద నీరు వచ్చినా ముంపు భయం లేకుండా నెదర్లాండ్స్ అధికారులు ప్రభుత్వం కాలువల నిర్మాణాలకు డిజైన్లు చేయించింది. రాజధాని పరిధిలో మొత్తం 47.94 కి.మీ మేర విశాలమైన కాలువలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు కొండవీటి, పాలవాగుల్లోకి వచ్చే వరద నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి కృష్ణానదిలో కలిసేలా నీరుకొండ వద్ద 440 ఎకరాల్లో 0.4 టీఎంసీలు, శాఖమూరు వద్ద 50 ఎకరాల్లో 0.03 టీఎంసీలు, కృష్ణాయపాలెం వద్ద 190 ఎకరాల్లో 0.1 టీఎంసీలు, పెనుమాకలో 190 ఎకరాల్లో 0.03 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఆయా ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఆయా పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఏడీసీఎల్ ఛైర్ పర్సన్ లక్ష్మీపార్థసారథి తెలిపారు.

# రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపునకు ఈ- లాటరీ

నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని నిర్మాణానికి భూసమీకరణలో 9.14 ఎకరాల ద్వారా భూములు ఇచ్చిన రైతులకు, అనంతవరంలో ఎన్‌-17 రహదారిలో భూములు కోల్పోతున్న 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నెం.18లో మినహాయింపు భూమి వల్ల ప్రభావితమైన ఐదుగురు రైతులకు, మల్కాపురంలో అసైన్డ్ లేఔట్ ప్రభావితమై 65 శాతం-35 శాతం కింద ఉన్న ఏడుగురు రైతులకు ఈ-లాటరీ ద్వారా సోమవారం ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం తెలిపింది. మొత్తం 225 మంది రైతులకు 405 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా పరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల్లోనూ నిర్వహించనున్నామని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌లో అందజేసిన అర్జీల స్థితిని టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీలు Meekosam.ap.gov.inలో నమోదు చేసుకోవచ్చన్నారు.

# మూలిగితే మూలకే.. సేవలిక నెలలకే..!

## ఎండోస్కోపీ, ల్యాప్రోస్కోపీల్లో తరచూ మొరాయింపులు

## గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహణ లోపంతో సమస్యలు

మూలన పడేసిన వెంటిలేటర్లు ఇవే..

ఈనాడు, అమరావతి

వైద్య పరికరాలు మూలిగితే చాలు మూలకెళ్తున్నాయి. నిర్వహణ లోపంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వైద్య కొనుగోలు పరికరాలను ఎలుకలు పాడు చేస్తుంటే.. అవి మరమ్మతులు చేసేది నెలల తరబడి వినియోగానికి రావడం లేదు. గుంటూరు జీజీహెచ్ అంటే జిల్లాలకు వైద్య ప్రదాయిని. నిత్యం 5వేల మందికి పైగా రోగులకు చికిత్స అందిస్తారు. 1500 మంది ఇన్‌పేషెంట్లుగా సేవలు పొందుతారు. ఇంతటి కీలకమైన వైద్యాలయంలో కొన్ని విభాగాలు పరంగా నిర్వహణ లోపాలు సమస్యగా తయారయ్యాయి.

### సీటీ స్కాను ఎప్పుడు పనిచేస్తాయో తెలియదు..

ప్రధానంగా కొన్ని యంత్ర పరికరాలు తరచూ మొరాయిస్తుండడం సమస్య జటిలం చేస్తోంది. పరిమితికి మించి రోగుల రాకతో వాటిపై ఒత్తిడి పెరుగుతోంది. రేడియాలజీ విభాగంలో ఇది తరచూ జరుగుతోంది. సీటీ స్కాన్లు ఎప్పుడు పనిచేస్తాయో, ఎప్పుడు మొరాయిస్తాయో అర్థం కాని పరిస్థితి. ఇక ఆపరేషన్ థియేటర్లలో ఓటీ లైట్ల నుంచి ఎండోస్కోపీ, ల్యాప్రోస్కోపీ వంటి కీలక యంత్రాల వరకు ఇలాగే తయారయ్యాయి. సీయామ్ మిషన్లు, అనస్తీషియా వర్క్ స్టేషన్లు తరచూ మొరాయిస్తున్నాయి.

### ఆ వెంటిలేటర్లు ఉన్నా లేనట్టే..

కొవిడ్ అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు గుంటూరు జీజీహెచ్‌కు పీఎం కేర్ కింద 100కు పైగా వెంటిలేటర్లు వచ్చాయి. ఇవన్నీ మూన్నాళ్ల ముచ్చటగా మూలన చేరడంతో సమస్య ఏర్పడింది. వీటికి వారంటీలు, మరమ్మతులు చేసే కాంట్రాక్టు దొరక్క మూలన పెట్టేశారు. అసలే స్థల భావంతో ఇబ్బంది పడుతున్న జీజీహెచ్‌లో ఇది మరింత జటిలంగా మారింది. ఆ చోట్లలో అర్థం కాక అధికారులు వీటిని ఆస్పత్రి ప్రాంగణంలో అనేక ప్రాంతాల్లో నిల్వ చేశారు. వీటిని ఎలా వినియోగంలోకి తీసుకురావాలో అర్థం కాక ఆసుపత్రి వర్గాలు, వైద్యఆరోగ్యశాఖ తలపట్టుకున్నాయి.

### లెక్కలోకి వచ్చేది తక్కువే

జీజీహెచ్‌లో మొత్తం 3,121 పరికరాల్లో 49 పనిచేయడం లేదని అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో క్రిటికల్ కేర్ పరికరాలు 7, నాన్ క్రిటికల్ కేర్ పరికరాలు 42 ఉన్నాయి. 118 తక్కువ కింద మార్చేందుకు నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నా ఇంతవ మూడింతలు మూలన చేరాయన్నది బహిరంగ రహస్యం.

### వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

ఆసుపత్రిలో కీలక పరికరాలను యుద్ధప్రాతిపదికన వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కొన్నింటిని వార్షిక నిర్వహణ కింద బాగు చేయించాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

- ఎస్‌.ఎస్‌.వి.రమణ, సూపరింటెండెంట్

# రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కృషి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, న్యూస్‌టుడే: 'రాజధాని అమరావతి హైదరాబాద్ తరహాలో హైటెక్ సిటీలా రూపొందించాలనే ఆదర్శంగా నిలవనుంది. రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కొన్ని దినపత్రికల ద్వారా ప్రచారం అవుతున్న అవాస్తవాలను నమ్మొద్దు' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో రూ.2.90 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ.. మోతడకలో త్వరలో పచ్చళ్ల తయారీ యూనిట్ ఏర్పాటు కానుందన్నారు. స్థానిక తెదేపా నేతలు కంచర్ల శివరామయ్య, యడ్లపల్లి సాంబశివరావు, తెదేపా మండల ధ్యక్షుడు ప్రసన్నకుమార్, సర్పంచ్ యడ్లపల్లి పద్మావతి, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి విజయశేఖర్, భాజపా ఇన్‌ఛార్జి కంతేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# గుండెగుడిలో.. కల్పతరువు

మేడికొండూరు బొడ్డురాయి సెంటర్‌లో ఉన్న మందిరం మధ్య నుంచి వేప చెట్టు పైకి ఎలా వెళ్లిందని ఆశ్చర్యం కలుగుతుంది కదా. కొన్నేళ్ల కిందట ఇక్కడ గద్దె అరుగుపై మహాలక్ష్మి దేవి విగ్రహం, పక్కన చెట్టు ఉండేది. ఈ నేపథ్యంలో భక్తులు అక్కడ నాలుగేళ్ల కిందట మందిరం ఏర్పాటు చేశారు. వందేళ్ల నాటి వృక్షానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేశారు. చెట్టుకు 'అంకమ్మ'గా నామకరణం చేశారు. అప్పటి నుంచి అమ్మవారితోపాటు చెట్టునూ పూజించడం సంప్రదాయంగా వస్తోంది. భక్తులు కూర్చునేందుకు మందిరం చుట్టూ సిమెంట్ బల్లలు అందుబాటులో ఉంచారు. మండు వేసవిలో చాలా మంది ఇక్కడికి వచ్చి సేదతీరుతారు.

- మేడికొండూరు, న్యూస్‌టుడే

# అవయవదానం.. స్కాన్‌తో చైతన్యం



క్యూఆర్ కోడ్ | డౌన్‌లోడయ్యే కరపత్రాలు

గుంటూరు జీజీహెచ్‌లోని పలు ప్రాంతాల్లో 'మరణించినా జీవించండి' క్యూఆర్ కోడ్‌ను అంటించి అవయవదానంపై సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ అవగాహన కల్పిస్తున్నారు. కోడ్‌ను స్కాన్ చేయగానే మూడు పేజీల కరపత్రం డౌన్‌లోడ్ అవుతుంది. ఇందులో అవయదానంపై పూర్తి వివరాలు పొందుపరిచారు. **-ఈనాడు, అమరావతి**

# సీఆర్డీఏ ఆధ్వర్యంలో గ్రామ సభలు నేడు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: సీఆర్డీఏ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి మండలం ఎర్రబాలెం, నవులూరు, కృష్ణాయపాలెం, బేతపూడిలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌డీసీ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) భీమారావు తెలిపారు. రైతుల సందేహాలు, అర్జీలను పరిశీలించి, భూమిలేని వారికి పింఛన్ల పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

## పోలీసు పీజీఆర్ఎస్ రద్దు..

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం అనివార్య కారణాలతో ఈ నెల 15న రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయం ఆదివారం తెలిపింది.

# డ్రగ్స్ ముఠా కోసం ముమ్మర గాలింపు

## అదుపులో ముగ్గురు అనుమానితులు!

గుంటూరు నేరవార్తలు, పట్టాభిపురం, న్యూస్‌టుడే: బాలికకు మత్తుపదార్థాలు అలవాటు చేసిన డ్రగ్ ముఠా కోసం లాలాపేట పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆదివారం పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. నగరానికి చెందిన ఇంటర్ చదువుతున్న ఓ బాలికను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు ప్రేమ పేరుతో నమ్మించి డ్రగ్స్‌కు బానిసను చేశాడంటూ ఆమె తల్లి మనస్తాపానికి గురైంది. బాలిక చరవాణిలోని అభ్యంతరకర ఫొటోలు చూసిన తల్లి ఆత్మహత్యాయత్నం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఆమెను పరామర్శించిన ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ, ఎస్పీ వకుల్ జిందాల్ తన కుమార్తెను డ్రగ్ ముఠా అనేకరకాలుగా ఇబ్బంది పెడుతున్నట్లు ఆవేదన చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై ఎస్పీ ప్రత్యేక దర్యాప్తు నకు ఆదేశించారు. తూర్పు డీఎస్పీ అజీజ్ ఆధ్వర్యంలో లాలాపేట సీఐ శివప్రసాద్ లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారి రక్త నమూనాలు జీజీహెచ్‌కు పంపించినట్లు తెలిసింది. వారు డ్రగ్స్ వాడినట్లు తేలితే తదుపరి విచారణ వేగవంతం చేయనున్నారు. ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించింది ఎవరు? బాలికకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఎవరు తీశారు? అనే కోణాల్లో విచారించనున్నారు.

# కాబోయే అమ్మకు.. సాంకేతిక దన్ను

## 'జననీ మిత్ర' యాప్‌కు రూపకల్పన

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేకంగా 'జననీ మిత్ర' యాప్‌ను ఏఐ అండ్ మెడ్‌టెక్ అలయెన్స్ ఫాండేషన్, ఏఐజీ హాస్పిటల్ (హైదరాబాద్) సంయుక్తంగా రూపొందించాయి. ఇందులో గర్భిణులు తీసుకునే ఆహారాన్ని ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వాటిలో ఏయే పోషకాలు ఉన్నాయి.. వాటి నుంచి కేలరీల రూపంలో ఎంత వస్తుందో తెలుస్తుంది. ఆ మహిళ ఆరోగ్య పరిస్థితి, నెలలను అప్‌డేట్ చేస్తూ.. మందులు ఏ సమయానికి ఎలా వేసుకోవాలో సూచనలు ఇస్తుంది. మందులు వేసుకోవాల్సిన సమయాన్ని యూజర్లకు నోటిఫికేషన్లు పంపిస్తుంది. వారు ఇచ్చే సమాచారం ఆధారంగా ఏదైనా ఆందోళనకరమైన లక్షణాలు గుర్తిస్తే తదనుగుణంగా సూచనలు ఇస్తుంది. గర్భిణులు ఆరోగ్య సమస్యను పొందుపరిచి క్లిక్ బటన్ నొక్కితే కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారం చేరుకుంటుందని, దాని ద్వారా అక్కడికి సమీపంలోని ఆశా వర్కర్, ఏఎన్ఎంకు సందేశం వెళ్తుంది. జీపీఎస్ వ్యవస్థ ద్వారా నేరుగా ఆశా కార్యకర్త సంబంధిత నివాసానికి చేరుకునే వీలుంది. అదే విధంగా 'ఎస్ఓఎస్' ప్రమాద సూచిక (రిస్క్ మీటర్) అనే ఆప్షన్ ఉంటుందని, అత్యవసర పరిస్థితిలో దానిపై క్లిక్ చేస్తే క్షేత్రస్థాయి వైద్యసిబ్బంది తోపాటు దగ్గరలో ఉన్న అంబులెన్స్‌కు సమాచారం అంది.. సకాలంలో వైద్య సేవలు అందుతాయి. ఈ యాప్ తెలుగుతోపాటు మరో నాలుగు భాషల్లో అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం దీని పనితీరును ఎన్టీఆర్ జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల తోపాటు మంగళగిరి ఇందిరా నగర్‌లోని ఆరోగ్యం కేంద్రంలో ట్రయల్ రన్ వేస్తున్నట్లు మెటర్నల్ హెల్త్ జేడీ డాక్టర్ సతీష్ చెప్పారు. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారని ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పరుచూరి అనూష తెలిపారు.

# సమాజ సేవ.. ఆదర్శ తోవ

వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న సీతామహాలక్ష్మి

న్యూస్‌టుడే, ఫిరంగిపురం గ్రామీణ

ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన తుపాకుల సీతామహాలక్ష్మి గత 43 ఏళ్లుగా ప్రజా సేవలో తరిస్తున్నారు. ఆమెకు చిన్నతనం నుంచి పేదలకు సేవ చేయాలనే ఆశయం ఉండేది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గ్రామానికి చెందిన తోటి మహిళలతో కలిసి 1982లో కండ్రిక మహిళా మండలి ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రభుత్వానికి చెందిన 'మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్' ద్వారా గుర్తింపు పొందారు. మండలికి అప్పటి నుంచి సీతామహాలక్ష్మి ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మొదట్లో కొన్నాళ్లు ఆమె గ్రామీణ ప్రాంత ప్రజలకు సాయంత్రం వేళలో ఉచితంగా చదువు చెప్పేవారు. ప్రభుత్వ సహకారంతో పేదలకు పక్కా ఇళ్లు కట్టించడంలో కీలక పాత్ర పోషించారు. దీనికి తోడు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ నేర్పించడం వంటి పనులు చేశారు. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో ఫిరంగిపురంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి.. వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించి సేవ చేస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం 25 మంది వృద్ధులు ఉన్నారు. ప్రతి నెలా ఆశ్రమ నిర్వహణ, వారి పోషణ, ఆరోగ్య సంరక్షణకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని ఆమె చెబుతున్నారు. ఇందులో 90 శాతం ఖర్చు ప్రభుత్వం ద్వారా అందుతుంది. మిగిలిన 10 శాతం విరాళాలు సేకరిస్తారు. వృద్ధులకు ఉదయం 7 గంటలకు టీ లేదా కాఫీ, 9 గంటలకు ఇడ్లీ, దోశ, చపాతి వంటివి అందిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు భోజనం, సాయంత్రం 5 గంటలకు అల్పాహారం, రాత్రి 8 గంటలకు మరోసారి భోజనం పెడతారు. వృద్ధులకు ప్రత్యేకంగా పరుపుతో కూడిన మంచాలు ఏర్పాటు చేశారు. వారికి కావాల్సిన దుప్పట్లు, పరుపులు ఉచితంగా అందిస్తారు. ఆశ్రమం ఖర్చులతో అప్పుడప్పుడు ప్రయివేట్ వైద్యుల ద్వారా ఆరోగ్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందిస్తుంటారు. ఆవరణలో టీవీ ఏర్పాటు ఏర్పాటు చేశారు. తన భర్త నరసింహారావు సహకారం, ప్రోత్సాహంతో సేవలు కొనసాగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# కాకతీయ వైభవానికి సజీవ సాక్ష్యం

గోళకి మఠం (శివాలయం)

ఏక శిలా శాసనం

రాజధాని అమరావతిలోని మల్కాపురం గ్రామంలో ఉన్న ఏకశిలా శాసనం కాకతీయుల పాలనా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 1261 మార్చి 25న రాణి రుద్రమదేవి పుట్టిన రోజు వేడుకలు ఇప్పటి రాజధాని గ్రామం మల్కాపురంలోని గోళకి మఠం (శివాలయం) వద్ద అంగరంగ వైభవంగా జరిగాయి. ఆ వేడుకల గుర్తుగా గ్రామంలో నందీశ్వర, నాగ ఏక శిలా శాసనాన్ని ఏర్పాటు చేశారు. దీనిపైన ఒక వైపు నందీశ్వరుడు, మరో వైపు నాగ ప్రతిమ ఉన్నాయి. రాణి జన్మదిన వేడుకల విశేషాలు, చేసిన దానాల గురించి సంస్కృతం, తెలుగు ప్రాకృత భాషలో పొందుపరిచారు. నది పక్కన ఉన్న గ్రామాలను రాణి రుద్రమ దేవి తండ్రి గణపతిదేవుడు.. కాకతీయ రాజ గురువు విశ్వేశ్వరశంభుకు దానంగా ఇచ్చారు. మల్కాపురంలో నేడు కనిపిస్తున్న గోళకి మఠాన్ని ఆయనే నిర్మించారు. **- తుళ్లూరు, న్యూస్‌టుడే**

# నీడలేక గోడు.. వరుణుడే తోడు..

## జీఎంసీ 'ఉద్యాన' విభాగానికి కార్యాలయ కష్టం

ఈనాడు, అమరావతి

కార్యాలయంలోకి వెళ్లగానే ఇలా పరికరాలు కనిపిస్తాయి..

గుంటూరు నగరంలో పచ్చదనాన్ని పరిరక్షించేది వారే.. ఉద్యానాల అభివృద్ధి, సుందరీకరణలో ప్రధాన భూమిక పోషించేది ఆ విభాగమే. అలాంటి జీఎంసీ ఉద్యాన విభాగాన్ని కార్యాలయ భవన కష్టాలు వెంటాడుతున్నాయి. ఏళ్ల తరబడి అన్నక్యాంటీన్‌లో తలదాచుకోగా, ఇప్పుడు గాంధీపార్కులో మ్యూజియం నిర్మాణమే ఆవాసమైంది. ఇక్కడ చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తుండడంతో ఆ వాననీటిలో పడరాని పాట్లు పడుతున్నారు.

* 5లక్షల మొక్కలు నాటడం ద్వారా నగరాన్ని హరితమయం చేయాలని 'మిషన్ గ్రీన్ గుంటూరు' పేరుతో అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 32 పార్కులు, 43 కి.మీ పొడవైన డివైడర్లు, 15 ట్రాఫిక్ ఐల్యాండ్స్, 10 కుంటల వద్ద పచ్చదనం పరిరక్షణలో జీఎంసీ ఉద్యాన విభాగం కీలకపాత్ర పోషిస్తోంది. ఆ విభాగానికి అవసరమైన కార్యాలయం పరంగా మాత్రం కష్టాలు వెంటాడుతున్నాయి.

**అన్న క్యాంటీన్ నుంచి పార్కులోకి..** రూ.కోట్ల ఆదాయం ఉండే జీఎంసీలో హార్టికల్చర్ వింగ్‌కు కేటాయించడానికి గది కరవైంది. ఏళ్ల తరబడి గాంధీ పార్కు సమీపంలోని అన్నక్యాంటీన్‌లో ఇది కొనసాగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అక్కడ సేవలు మొదలవడంతో గాంధీపార్కులో మ్యూజియం కోసం నిర్మించిన కట్టడంలోకి మార్చారు. ఇక్కడ చిన్నపాటి వర్షం పడినా చెరువులా మారుతోంది. అందులోనే ఆరుగురు సిబ్బంది పనిచేయాల్సిన దుస్థితి. కీలక దస్త్రాలు తడిసిపోతున్నాయి. 80 మంది కార్మికులు ఉండగా కార్యాలయం మధ్యలో ఉన్న చిన్నపాటి గదిలోనే ఈ విభాగం సామగ్రి, పరికరాలు ఉంచి స్టోర్‌రూమ్‌గా వినియోగిస్తుండడం గమనార్హం.

**అధికారులు ఉండట్లేదే..** కీలక బాధ్యతలు ఉన్న ఈ విభాగం మొక్కుబడిగా మారడంతో ఇక్కడ పనిచేయడానికి అధికారులు సైతం మొగ్గుచూపని దుస్థితి. ఉద్యానశాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి నాలుగు రోజుల కిందట మాతృశాఖకు వెళ్లిపోయారు. డిప్యూటీ కమిషనర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం వాహనాల పార్కింగ్ వద్ద ఈ హార్టికల్చర్ కార్యాలయ నిర్మాణానికి గతంలో ప్రతిపాదించినా అది కేవలం కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించాల్సి ఉంది.

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆం.ప్ర-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి-400708. నమోదిత కార్యాలయం: 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనీయబడిన స్థిరాస్తి లోన్ రిఫరెన్స్ నెం.5343లో శ్రీ చిగురుపాటి రంగారావు మరియు శ్రీమతి చిగురుపాటి జ్యోతి నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రావల్సిన బకాయిలు 19-04-2023 నాటికి **రూ.37,89,278/- (ముప్పై ఏడు లక్షల ఎనభై తొమ్మిది వేల రెండు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే) (19-04-2023 వరకు వర్తించిన వడ్డీ ఈ మొత్తంలో కలిసి ఉంది)లతో పాటు భవిష్యత్ వడ్డీ** మరియు వ్యయాలను రాబట్టు కొనుటకు **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 31-12-2025న విక్రయించబడుతుంది.** అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు. |
| రిజర్వు ధర (రూ.లలో) | రూ.28,98,000/- (ఇరవై ఎనిమిది లక్షల తొంభై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ.2,89,800/- (రెండు లక్షల ఎనభై తొమ్మిది వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) విశాఖపట్నం వద్ద చెల్లింపయ్యేలా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట డిడి/ పిఒ ద్వారా. |
| బిడ్ పెంపుదల సొమ్ము | రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేది, సమయం మరియు ప్రదేశం | 30.12.2025 సా.5.00 గం.లోగా. శ్రీ అజారుద్దీన్‌ను ఉద్దేశించి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530016 చిరునామాతో. |
| బహిరంగ ఇ-వేలం తేది, సమయం మరియు ప్రదేశం | 31.12.2025 ఉ.11.00 గం.ల నుండి మ.12.00 గం. మధ్య ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com వద్ద. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైనతెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును. |

**స్థిరాస్తి షెడ్యూలు**

గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, మంగళగిరి రెవిన్యూ గ్రామం, మంగళగిరి మున్సిపల్ ఏరియా పరిధిలో 947.60 చ.గజాలు లేదా 792.31 చ.మీటర్ల విస్తీర్ణ మొత్తంలో 47.73 చ.గజాల అవిభాజ్య మరియు అనిర్దేశిత విస్తీర్ణభూమితోపాటు డి.నెం.5-455/5, ఆర్.ఎస్ నెం.227, ఫ్లాట్ నెం.501, నాల్గవ అంతస్తు, ద్వారకా కృష్ణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, 925 చ.అడుగుల ప్లింత్ ఏరియా, 225 చ.అడుగుల కామన్ ఏరియా, 125 చ.అడుగుల పార్కింగ్ ఏరియా ఆస్తి యావత్తు. **షెడ్యూలు-ఎ (మొత్తం స్థలం కొరకు) సరిహద్దులు: తూర్పు:** మచిలీపట్నం, ఫుల్ గోస్పెల్ చర్చ్ ఆఫ్ ఇండియా ఆస్తి, **దక్షిణం:** ఆత్మకూరు వైపు రోడ్‌కు ఆనుకొని మార్జిన్ హద్దు, **పడమర:** తోట నాగమ్మచే ఇతరులకు విక్రయించిన ఆస్తి, **ఉత్తరం:** ప్రగడ సరోజినిచే ఇతరులకు విక్రయించిన ఆస్తి. **షెడ్యూలు-బి (మొత్తం ఫ్లాట్ కొరకు) తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఖాళీ, **పడమర:** ఖాళీ, **ఉత్తరం:** ఖాళీ.

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా **https://www.axisbank.com/auction-retail** నందు ఇవ్వబడిన లింకును మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ **https://www.bankeauctions.com** ను చూడండి.

వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు **శ్రీ అజారుద్దీన్ 7330999018 మరియు శ్రీ కార్తిక్ 9080589635 అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం.నుండి సా. 4.00 గం.మధ్య సంప్రదించవచ్చును.**

**ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.**

తేది: 15-12-2025
ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్‌సాన్ రోడ్, అయిరోలి, నవీముంబయి-400 708 **రిజిస్టర్డ్ ఆఫీసు: "త్రిశూల్" 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదుట, ఎల్లిస్‌బ్రిడ్జి అహ్మదాబాదు-380006.**

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలంముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనీయబడిన స్థిరాస్తి **21.11.2023 నాటికి గల, మెసర్స్ శ్రీసంధ్య పోతుగుంట, శ్రీ మల్లేశ్వర ఇన్నవోలు లోన్ రిఫరెన్సు 1262లో చెల్లించవలసిన బకాయి రూ. 40,49,403/- (రూపాయలు నలభై లక్షల నలభై తొమ్మిది వేల నాలుగు వందల మూడు మాత్రమే)లను (21.11.2023 వరకు లెక్కించబడిన వడ్డీ కలిపి ఉన్నది)** మరియు అదనపు వడ్డీ మరియు వ్యయాలు ఆదనంగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు గల బకాయిలను రాబట్టుకొనేందుకుగాను **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన 31.12.2025న విక్రయించబడును.** అవసరమైన వివరాలకు దయచేసి దిగువన గల వేలం షెడ్యూలును చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో): | రూ.25,20,000/- (రూపాయలు ఇరవై ఐదు లక్షల ఇరవై వేలు మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ. 2,52,000/- (రూపాయలు రెండు లక్షల యాభై రెండు వేలు మాత్రమే)లను డిడి/పిఓ ద్వారా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట విశాఖపట్నంలో చెల్లుబాటగునట్లుగా చెల్లించాలి. |
| బిడ్ పెంపుదల సొమ్ము | రూ. 10,000/- (రూపాయలు పది వేలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేది, సమయం మరియు ప్రదేశం | 30.12.2025న సా.5.00 గం.లోగా యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం. 43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016. శ్రీ అజారుద్దీన్‌బాబుకు పంపాలి. |
| బహిరంగ ఇ-వేలం తేది సమయం మరియు స్థలం: | 31.12.2025 న ఉ. 11.00 గం. నుంచి మ. 12.00 గం. వరకు ప్రతిదీ 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషను గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు, పైన తెలిపిన సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో అందుబాటులో గలవు. |

**స్థిరాస్తి షెడ్యూలు**

**షెడ్యూలు ఎ:** గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లాలో, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో డోర్ నం.256, 273, నల్లపాడు గ్రామం, డాక్యుమెంట్ మరియు సిటీ ప్లానర్ మునిసిపల్ కార్పొరేషన్ గుంటూరు కేటాయించిన ఎండార్స్‌మెంట్ టిపిఎస్ నం.125619/2018-19/జి3 మరియు ఎఫ్ఎల్ఆర్ నం.1194/2018, తేది 11.01.2019, సర్వే నం.256/1 మరియు 273/2, విస్తీర్ణం 7937.6 చ.గజాలు లేదా 6636.62 చ.మీ.లు సమీప డోర్‌నం.2-16-83, ఎ.1.64 సెంట్లలో నిర్మించబడిన ఒక అపార్ట్‌మెంట్ భవనం పేరు "స్కైలార్క్ టవర్స్". **హద్దులు: తూర్పు:** వేత్రోలు గాంధి చౌదరి -594'-00". **దక్షిణం:** రోడ్డు 126'-00". **పడమర:** వేత్రోలు రామయ్య ఇతరులకు అమ్మిన భూమి హద్దు 607'-3". **ఉత్తరం:** పంచుమర్తి వెంకటామయ్య కుమారులకు చెందిన ఆస్తి - 95-9". ఈ హద్దులలో 7937.6 చ.గజాలు లేదా 6636.62 చ.మీ.ల స్థలం గలదు.

**షెడ్యూలు బి.** పైన ఎ - షెడ్యూలు ఆస్తిలో, అవిభాజ్య మరియు అనిర్దేశిత వాటా విస్తీర్ణం 60.75 చ.గజాలు లేదా 50.79 చ.మీ.ల స్థలంతో ఫ్లాటు నం.508 (మూడు పడక గదులు), 4వ అంతస్తు, రెసిడెన్షియల్ పీకాక్ బ్లాకు నం.1 "స్కైలార్క్ టవర్స్"లోనిది ప్లింత్ ఏరియా 1800 చ.అడుగులు (కామన్ ఏరియా సహా) **హద్దులు: తూర్పు:** ఓపెన్ స్పేస్ **దక్షిణం:** ఓపెన్ స్పేస్. **పడమర:** కామన్ కారిడార్

# మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేత 'నెల్లూరు'

పెదనందిపాడు: ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు జిల్లా క్రీడాకారులు

**పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే:** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు జి. రాంబాబు, శివనాగేశ్వరరావు, సత్యనారాయణ, సీహెచ్ పవన్‌కుమార్, పారిశ్రామికవేత్త, దాత ముద్దన రాఘవయ్య, ఎన్. నాగేశ్వరరావు, పి. రామకృష్ణ, పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

ఒక కిలోమీటర్ నడక, జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో పురుషుల 90 ఏళ్ల పైబడి విభాగంలో డి. శేషగిరిరావు (నాగులపాడు) వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 75 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలో మీటర్ల నడక పందెంలో ఆర్. అప్పలనాయుడు, రామారావు, (విశాఖపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగుపందెంలో (65 ఏళ్ల పైబడి) శేషయ్య (గుంటూరు), సుబ్బరాజు (విశాఖపట్నం), 200 మీటర్ల పరుగు పందెం(70 ఏళ్ల పైబడి)లో ధనుంజయ (తిరుపతి), మూర్తి (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మూడు కిలోమీటర్ల నడక పందెంలో విశాఖపట్నంకు చెందిన బి. వెంకటలక్ష్మి ప్రథమంలో నిలిచారు. 65 ఏళ్ల పైబడి పరుగు పందెంలో ఎన్. రమణేశ్వరి (గుంటూరు), డి. నాగేశ్వరమ్మ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. బహుమతులు అందుకున్నారు. 60 ఏళ్ల పైబడిన విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో నెల్లూరుకు చెందిన పి. కోటేశ్వరమ్మ బంగారు పతకం సాధించారు. 3 కిలోమీటర్ల (60 ఏళ్ల పైబడి) పరుగు పందెంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పి. రాజేశ్వరమ్మ, నెల్లూరు జిల్లాకు చెందిన రహినాబేగం వరుసగా పతకాలు గెలుచుకున్నారు.

# విద్యుత్తు పరికరాల కొనుగోలులో అవినీతి

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** తెనాలి పురపాలక సంఘంలో విద్యుత్తు పరికరాల కొనుగోలులో అవినీతి చోటు చేసుకుంది. మున్సిపల్ అధికారులు చాలా ఏళ్లుగా స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లకు విద్యుత్తు పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ తంతు అనేక ఏళ్లుగా కొనసాగుతోన్నా గుర్తించకపోవడం గమనార్హం. ఈ ధరల కన్నా చాలా తక్కువకు ఇటీవల ప్రస్తుత మున్సిపల్ ఎంఈ పినిప శ్రీకాంత్ విద్యుత్తు పరికరాలు కొనడంతో గతంలో అధికారులు చేసిన కొనుగోళ్లలో జరిగిన అవినీతి విషయం వెలుగులోకి వచ్చింది.

★ తెనాలి మున్సిపల్ అధికారులు ఇటీవల విద్యుత్తు పరికరాలకు టెండర్ పిలిచారు. టెండర్లో పేర్కొన్న 200, 100 పీసీబీ, 90, 40 వాట్స్ ఎల్ఈడీ విద్యుద్దీపాల స్టాండర్డ్ షెడ్యూల్ ధరలు బయట కన్నా ఎక్కువని ఎంఈ శ్రీకాంత్ గుర్తించారు. వీటిలో నాణ్యమైన తక్కువ ధరకు లభ్యమయ్యే వీధి దీపాలను కొని సరఫరా చేయాలని సూచించారు. టెండర్ నిబంధనల ప్రకారం గుత్తేదారుకు దక్కాల్సిన మార్జిన్‌కు ఇబ్బంది లేకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

★ ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం 45 వాట్స్ రూ. 3,619, 90 వాట్స్ రూ. 7,085, 200 వాట్స్ రూ. 14,554, 100 వాట్స్ పీసీబీ రూ. 1,320, 1/18 వైర్ కాయిల్స్ రూ. 850. వీటి ధరలు బహిరంగ మార్కెట్లో.. 45 వాట్స్ రూ. 3,080, 90 వాట్స్ రూ. 4,560, 200 వాట్స్ రూ. 8,625, 100 వాట్స్ పీసీబీ రూ. 780, 1/18 వైర్ కాయిల్స్ రూ. 670. పురపాలక అధికారులు 45 వాట్స్‌వి 15, 90 వాట్స్‌వి 10, 200 వాట్స్‌వి 6, 100 వాట్స్ పీసీబీవి 100, 1/18 వైర్ కాయిల్స్ 10 చొప్పున స్టాండర్డ్ కంపెనీవి తక్కువ ధరవి కొన్నారు. వీరు రూ. 2,83,850 విలువైనవి కొనడం వల్ల మున్సిపల్ ఖజానాకు ఒక్కో దానిలో రూ. 8,085, రూ. 25,250, రూ. 35,574, రూ. 54,000, రూ. 1,800 చొప్పున మొత్తం రూ. 1,24,709 మున్సిపాలిటీకి ఆదా అయ్యాయి. ఇవే దీపాలను ఎస్ఎస్ఆర్ రేట్లకు కొని ఉంటే గుత్తేదారులు, అధికారుల జేబులు నింపుకునే వారు.

★ మున్సిపల్ అధికారులు 2019 నుంచి 2025 జూన్ వరకు ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ. 1.67 కోట్ల విలువైన విద్యుత్తు పరికరాలు కొన్నారు. ఇలా చేయడం వల్ల మున్సిపల్ ఖజానాకు దక్కాల్సిన రూ. 80 లక్షలు, మున్సిపల్ అధికారులు, గుత్తేదార్లు దిగమింగారు.

## బిల్లుల చెల్లింపులో జాప్యం.. ఆలయ ఈవోకు లీగల్ నోటీసులు

**పెదకాకాని:** గుంటూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో చేసిన అభివృద్ధి పనులకు నెలల తరబడి బిల్లులు ఇవ్వడం లేదని నలుగురు కాంట్రాక్టర్లు ఆదివారం ఆలయ ఈవో గోగినేని లీలాకుమార్ లీగల్ నోటీసులు ఇచ్చారు. ఈ అంశం రాష్ట్ర దేవాదాయశాఖలో చర్చనీయాంశమైంది. ఆలయాల్లో పనిచేసిన తరువాత బిల్లుల రసీదులు ప్రి ఆడిట్ చేసి ఆమోదం తెలపాలి. ఆమోదం పొందిన బిల్లులకు ఆలయాల ఈవోలు నగదు చెక్కులను కాంట్రాక్టర్లకు అందిస్తారు. ఇదే తరహాలో పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పూజా సామగ్రి, అభివృద్ధి పనులు చేసిన తరువాత కాంట్రాక్టర్లు ఇచ్చిన బిల్లులను ఆలయ అధికారులు ఆడిట్‌కు పంపారు. కానీ నెలల తరబడి తాత్సారం చేయడంతో ఆలయంలో రూ. 1.2 కోట్ల బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. దీనిపై న్యూస్‌టుడే ఈవో గోగినేని లీలాకుమార్‌ని వివరణ కోరగా.. లీగల్ నోటీసులు దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# ఏఐ ఆధారిత ఈసీజీతో బహుళ ప్రయోజనాలు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

**మంగళగిరి (ఏఎన్‌యూ), గుంటూరు నగరం, న్యూస్‌టుడే:** ఏఐ ఆధారిత ఈసీజీ వల్ల గుండె సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశముందని ప్రముఖ గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ బాబు చెప్పారు. ఆదివారం తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 'హార్ట్ ఇన్ ద క్యూర్, మేనేజింగ్ కార్డియాక్ రిస్క్స్ ఇన్ నాన్ కార్డియాక్ సర్జరీస్‌పై హై ఇంపాక్ట్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఏటా సుమారు 3 నుంచి 4 కోట్ల వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఇందులో దాదాపు 95 శాతం గుండెకు సంబంధం లేనివే జరుగుతున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. శస్త్రచికిత్స సమయంలో వచ్చే గుండెపోటు వల్ల 15.6 శాతం మరణాలు నమోదవుతున్నాయన్నారు. గుండె వ్యాధులున్న రోగులు, ఇతర వ్యాధులున్న వ్యక్తులు, రక్తాన్ని పలుచగా చేసే మందులు వినియోగించే వాళ్లకు శస్త్ర చికిత్సలు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. సర్జరీల సమయంలో గుండె, నాడీ వ్యవస్థ స్థిరంగా లేకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే అవకాశముందన్నారు. 'ఆధునిక కార్డియాక్ రిస్క్ అసెస్మెంట్ టెక్నాలజీ' ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని రమేష్‌బాబు వివరించారు. ప్రతి శస్త్రచికిత్సలో కార్డియాలజిస్ట్, అనస్తీషియా, ఇంటెన్సివిస్ట్, గుండె శస్త్రచికిత్స నిపుణులు, సంబంధిత వ్యాధి శస్త్ర చికిత్స నిపుణులు ఒక బృందంగా పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి



కొత్తగా ఎన్నికైన జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కార్యవర్గం

**జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి. వేణు మాధవరావు అన్నారు. నగరంలోని కృషి భవన్‌లో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. వేణుమాధవరావు మాట్లాడుతూ ఏఈవోలకు జాబ్ చార్ట్ ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఏఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, కోశాధికారి సుభాని, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సురేష్ గోపి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఏఈవోల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ☛ జిల్లా అధ్యక్షుడిగా ఆలా రమేష్‌బాబు, కార్యదర్శి ఎన్. ప్రసాద్‌బాబు, కోశాధికారి ఎం.ఎన్. కృష్ణారావు, సహాధ్యక్షుడు ఐ. శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పి. రవికుమార్, ఆర్. వెంకయ్య, వీరంకి గోపి, కార్యనిర్వాహక కార్యదర్శి శివరావు, ప్రచార కార్యదర్శి కె. రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులు ఐ. జ్యోత్స్న, పి. రాజేంద్రప్రసాద్, బి. సౌజన్య, కార్యవర్గ సభ్యులుగా దేవ సమర్పణరావు, ఆదిలక్ష్మి, మురళి ఎన్నికయ్యారు.

# అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలి

**తాడేపల్లి,న్యూస్‌టుడే:** ఉన్నత విద్యా రంగంలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తికి అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ అభ్యసవర్గ (ఏబీఆర్ఎస్ఎం) విజ్ఞప్తి చేసింది. వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన ఏబీఆర్ఎస్ఎం సమావేశాలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజినీరింగ్ ఇంటర్ కళాశాలల నుంచి అధ్యాపకులు తమ సమస్యలను ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు వినతి పత్రం రూపంలో తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల, వీసీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు వేతనాలు ఇచ్చేందుకు జీవో నంబర్ 110ను అమలు చేయాలని కోరారు. మధుమూర్తి స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారుల ఆదేశాలను అమలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సంఘం జాతీయ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డీవీఎస్ బాలసుబ్రహ్మణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజశేఖర్ డాక్టర్ కాశీబాబు, ప్రొఫెసర్ ముప్పాళ్ల లక్ష్మణరావు, శరత్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధులు

# సాహిత్యంలో మానవతా విలువలు జోడించాలి

విజేతలతో అతిథులు, నిర్వాహకులు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సమస్యలకు సాహిత్యం పరిష్కారం చూపుతుందని ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ధార్మిక ప్రాంగణంలో సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ ఆదివారం జరిగింది. రమ్యభారతి సాహిత్య పత్రిక వ్యవస్థాపకుడు చలపాక ప్రకాష్, రచయిత సంఘం సభ్యులు శ్రీవశిష్ఠల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలో మానవతా విలువలు ఉండాలన్నారు. సభకు రమ్యభారతి సాహిత్య పత్రిక నిర్వాహకుడు వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు సి. భవానీదేవీ, ప్రముఖ కథకులు శ్రీకంఠస్ఫూర్తి, తెలుగు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. రచయితలు సింగరాజు శ్రీనివాసరావు (గెలుపు కథ), జి. రంగబాబు (అక్షర మారింది), బి.ఎస్.కె. కరిముల్లా (జీవం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఇంద్రగంటి నరసింహమూర్తి (మార్పు రావాలి), సింహప్రసాద్ (సామాజిక నేరం), ఎం. వెంకటేశ్వరరావు (అమూల్యాలు) ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు. అతిథులు, నిర్వాహకులు విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పాపినేని శివశంకర్, సి.హెచ్. సుశీలమ్మ, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోటకూర వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు మారుపేరు ధూళిపాళ్ల

వడ్లమూడిలో ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకల్లో తెదేపా నాయకులు

**చేబ్రోలు, న్యూస్‌టుడే:** నిస్వార్థమైన సేవకు మారుపేరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అని తెదేపా నాయకులు మేడికొండూరు నరేష్ అన్నారు. మండల పరిధిలోని వడ్లమూడిలో నరేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులు ఆయనపై నిరాధార ఆరోపణలు ఎన్ని చేసినా వాటిని లెక్క చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి, పాడి రైతుల కోసం పాటు పడుతున్న వ్యక్తి నరేంద్ర కుమార్ అని కొనియాడారు. అనంతరం కేకు కోసి పంపిణీ చేశారు. చేబ్రోలు మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

# ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ చట్టం అమలు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఎస్పీ వకుల్ జిందాల్ సిఫారసుతో జిల్లాలోని ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ చట్టం అమలు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సుందరయ్య కాలనీకి చెందిన షేక్ బాజీ అలియాస్ సిరిపురం బాజీ (42)పై నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఎ కేటగిరి రౌడీషీట్ ఉంది. ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రామిరెడ్డితోటకు చెందిన షేక్ సమీర్ అలియాస్ ఫైజల్ (19) అతనిపై కొత్తపేట పోలీసుస్టేషన్‌లో ఎ-ప్లస్ రౌడీషీట్ ఉంది. రెండు హత్యలతో సహా పది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇద్దరు రౌడీషీటర్లు జైలుకు వెళ్లి వచ్చినా వారిలో ఎటువంటి మార్పురాలేదని, పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా పద్ధతి మార్చుకోలేదు. తీవ్రమైన నేరాల్లో పాల్గొంటూ ప్రజాశాంతికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో వారిపై పీడీ చట్టం నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇద్దరు రౌడీషీటర్లను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో రౌడీషీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీట్ ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# తెలుగు జయకేతనం బాపు

వర ముళ్లపూడికి పురస్కారం అందిస్తున్న ఎస్ఎస్‌వీ రమణ తదితరులు



అరసవల్లి గిరిధర్

హరి వెంకటరమణ

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** చలనచిత్రాలు, కార్టూన్ల ద్వారా తెలుగు భాషా సంస్కృతులకు విశేష ప్రాచుర్యం కలిగించిన మహనీయుడు బాపు తెలుగు జాతి జయకేతనం లాంటివారని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. గుంటూరు భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణ మూర్తి ఆడిటోరియంలో బాపు-రమణ-బాలు కళాపీఠం, మల్లెతీగ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా బాపు స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా ప్రశంసిస్తున్నామంటే అది బాపు చిత్రాలకున్న గొప్పతనమన్నారు. తెలుగు వారు ఉన్నంతకాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయన్నారు. తెలుగు అమ్మ ఒడి భాష కావాలన్నారు. సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం. ప్రభాకర్ మాట్లాడుతూ బాపు సినిమాల్లోని కొన్ని ముఖ్య సన్నివేశాలు, పాటల్ని గుర్తు చేసి సభాసదులను అలరించారు. గుంటూరు సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ బాపు ప్రతిభను తెలిపే విషయాలను వివరించారు. తొలుత మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ అతిథులను సభకు పరిచయం చేశారు. సభలో సుప్రసిద్ధ సినీ దర్శకుడు వర ముళ్లపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణలకు బాపు స్మారక పురస్కారాలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తదితరులు ప్రదానం చేశారు. అనంతరం పురస్కార గ్రహీతలు బాపుతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**మంగళగిరి (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న మంగళగిరి ఆరో బెటాలియన్‌లో పర్యటించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించిన సుమారు 6 వేల మందికి ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సభకు వచ్చే అభ్యర్థులకు భోజనం, తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని మంగళగిరి-తాడేపల్లి కమిషనర్‌కు చెప్పారు. నాలుగు అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఎస్ఎస్‌జీ అదనపు సంచాలకులు మల్లికార్జున, అదనపు ఎస్పీలు హనుమంతు, రమణమూర్తి, రవికుమార్, జడ్పీ సీఈవో జ్యోతిబసు, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

SAREES

**పాతపట్టు చీరలు:** కంచి, వెంకటగిరి, గద్వాల్ ప్యూర్ జరీ చీరలు మీ ఇంటి వద్దనే 1000/- నుండి లక్ష రూ॥ దాకా కొనబడును. ✆ 81251 68645.

MARRIAGE SERVICES

**కాపు, 29Y,** 5'.4'' ఐర్లాండ్‌కు వరుడు మరియు కాపు 29Y, 5'.11'' ఐర్లాండ్‌కు వధువు కావలెను. భరత్ మ్యారేజ్ లింక్స్, తెనాలి. ✆ 98499 70373.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

**23 లక్షలకే** రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటి నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం॥ 89196 28403.

PLOT FOR SALE

GENERAL

**గుంటూరు మున్సిపాలిటీ** పరిధిలో లాల్ పురం గ్రామం ఆనుకొని 33 Ft రోడ్‌లో బ్యాంక్‌లోన్ సదుపాయంతో ఓపెన్ ప్లాట్స్ అమ్మకంనకు కలవు. స్పాట్‌హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసుకోబడును. ✆ 83098 12757, 88861 12399

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar Guntur. Good opertunity for Freshers/Experienced. Whatsapp: 91007 87054.

**Karthikeya Infraces** సంస్థ నందు పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం 12,000 -30,000 + ఇన్సెంటివ్, అర్హత 10th -డిగ్రీ, Age 18-20 Yrs. ✆ 88861 12399, 88862 12399.

**30-65Yrs బ్యాంక్** అనుబంధ సంస్థలో జీతం + Inc 35వేలు టీంమేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్స్యూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

**గుంటూరులోని రియల్‌బూమ్** రియల్‌ఎస్టేట్ సర్వీసెస్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50) టెలీకాలర్స్ (10) DDOలు (10) కావలెను. 99920 82456.

**రాయల్ ఎంఫీల్డ్** షోరుమ్ తాడేపల్లి నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ & మెకానిక్ కావలెను. Contact: 99891 28328.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. సంప్రదించగలరు. ✆ 8978480429.

**గుంటూరులోని ప్రముఖ** కళాశాల ఉమెన్స్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో పనిచేయుటకు లేడీ రెసిడెన్షియల్ వార్డెన్ (శాకాహారులు మాత్రమే) కావలెను. ✆ 83310 33743.

**గవర్నమెంట్ హాస్పిటల్‌లో** ఔట్‌సోర్స్ డేటా ఎంట్రీ చేయుటకు కంప్యూటర్ స్పీడ్ టైపింగ్‌లో అనుభవమున్న ఆపరేటర్స్ కావలెను. 8885050664, 9908780954.

**శ్రీనిధి ఎంటర్** ప్రైజెస్‌వారి అద్దంకిఆఫీసులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (ట్యాలీ) తెలిసినవారు కావలెను. అద్దంకికి చెందిన వారై ఉండాలి. 9247424587.

**మా రియల్** ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ లీడర్స్, గృహిణులు, Govt/ pvt & Rtd వారు, LIC /చిట్స్ / ఇన్స్యూరెన్స్ /సాఫ్ట్‌వేర్స్ /NRIలు కావలెను. ✆ 9502822335

HYD **యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**వంట మనిషి** కావలెను: గుంటూరు పట్టణంలో ఏ.టి.అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్‌లో అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579.

**గుంటూరు, ఆటోనగర్,** HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. PT/FT. 77996 89889, 80745 46302.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

# సాంకేతిక విద్యార్థుల పల్లెబాట

గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

**గుంటూరు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పల్లెబాట పట్టారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మార్పు సాంకేతిక విధానాల అమలుతోనే సాధ్యమవుతుందని విద్యార్థులు వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, బొర్రవారిపాలెం గ్రామాల్లో రెండో రోజు కార్యక్రమాలు నిర్వహించారు. పశుపోషణ, వ్యవసాయ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణ ద్వారా నిర్వహణ సులువు కావడమే కాకుండా వ్యయం తగ్గుతుందని వివరించారు.

# విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

**తాడికొండ, న్యూస్‌టుడే:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 'చలపతి హిల్ వ్యూ స్టేడియం'ను ఆదివారం ఆయన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో క్రీడాకారులకు 3 శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. కళాశాల కార్యదర్శి వై. సుజిత్‌కుమార్, డైరెక్టర్ వినయ్‌కుమార్, రాష్ట్ర ఖాదీ విలేజ్ బోర్డు డైరెక్టర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు, అడ్మిషన్ డీన్, డాక్టర్ కె. కిరణ్‌కుమార్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, వైవీ ఆంజనేయులు

**బ్రాయిలర్ ధరలు** (కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

# ఆత్మీయ వేదిక.. ఆనంద వేడుక

చింతలపూడిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పొన్నూరు పట్టణ పరిధి నిడుబ్రోలు హైస్కూల్‌లో 1981-1982లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం వేడుకగా జరిగింది. మండల పరిధి చింతలపూడిలోని ధూళిపాళ్ల వీరయ్య చౌదరి కల్యాణ మండపంలో సమావేశమై.. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. సన్నిహితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సహచర పూర్వపు విద్యార్థి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు.

# త్రికోటేశ్వర ఫాం ల్యాండ్ వెంచర్ ప్రారంభం

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** మండలంలో కోటప్పకొండ నుంచి గోనెపూడి వెళ్లే మార్గంలో చుట్టూ పచ్చదనంతో నిండిన ఎత్తైన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రికోటేశ్వర ఫాంల్యాండ్ వెంచర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటప్పకొండ గతం కన్నా ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో మంచి వాతావరణంలో వెంచర్ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. సుందరమైన ఇళ్ల నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్‌పార్కు, స్విమ్మింగ్‌పూల్, పది రకాలైన ఆర్గానిక్ మొక్కల పెంపకం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచుమర్తి భూపతిరావు, నాగసుశీల, మల్లెం సుభాష్, బండి చంద్ర పాల్గొన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తదితరులు

(c) eenadu

# తెనాలి

• తెనాలి • పొన్నూరు

## ఘనంగా కుసుమ కుమారిదేవి జయంతి

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** కుసుమ కుమారిదేవి జయంతి వేడుకను ఆదివారం నందులపేట కుసుమ హరనాథ్ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సంకీర్తన గానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు రాచపూడి సుజాత, ముద్దాభక్తుని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. అయ్యప్ప పడి పూజ

స్వామివారికి అలంకరించిన మండపం

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** శ్రీవాసవీ మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద అయ్యప్ప పడి పూజ నేత్రపర్వంగా నిర్వహించారు. గురుస్వాములు అయ్యప్ప స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, మాలధారులు ఆలపించిన గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. 50 అడుగుల ఎత్తులో అలంకరించిన అయ్యప్ప మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీదేవి స్వీట్స్ తరుపున బూర్లగడ్డ రామకృష్ణ, గాదంశెట్టి శ్రీనివాసరావు, వెచ్చు సత్యనారాయణ, కార్తీక్ మిత్రమండలి, గురుస్వాములు సత్యం, జొన్న శ్రీను, శివస్వాములు, భవానీలు, వెంకటేశ్వస్వామి మాలధారులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ నాజరుపేట టంకశాల వారి వీధిలో విద్యుత్తు తీగలపైకి చెట్లకొమ్మలు చేరి తరుచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. - **స్థానికులు, నాజరుపేట** ✔ కొమ్మలను తొలగింపజేస్తాం. - **బి.అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ**

? తెనాలి పట్టణ రామలింగేశ్వరపేట డిపో కూడలిలోని ప్రధాన కాలువ పూడికతో నిండింది. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం - **గౌరి, రామలింగేశ్వరపేట** ✔ పూడికలు, అడ్డంకులు తొలగింపజేస్తాం. దోమల నివారణ చర్యలు తీసుకుంటాం.
- **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

స్పందనకు వందనం

✦ తెనాలి మండలం నందివెలుగు ప్రధాన రోడ్డులో విద్యుత్తు తీగలపై చెట్లకొమ్మల వల్ల విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. కార్మికులతో వాటిని తొలగింపజేశారు.

✦ తెనాలి పట్టణ వహాబ్ రోడ్డు డంపింగ్ పాయింట్ వద్ద వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించి.. వాటిని తరలింపజేశారు.
- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

? పొన్నూరు పరిధిలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. **-డి. వెంకయ్య, 19వ వార్డు** ✔ వీధి దీపానికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు** ? పొన్నూరు పరిధి జీబీసీ రహదారిలోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. - **అనీల్‌బాబు, జీబీసీ రహదారి** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి.** ✦ పట్టణ పరిధిలోని పాత పొన్నూరులో రెండు రోజులుగా చెత్త తీయడం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పేరుకుపోయిన చెత్తను కార్మికులతో తీయించారు. – న్యూస్‌టుడే, పొన్నూరు

## వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు

వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం తెనాలిలోని శ్రీమహాత్మాగాంధీ సేవా శాంతి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి, నాయకులు అశోక్, రవిశేఖర్, నరసింహారావు, రాజా తదితరులు పాల్గొన్నారు. తొలుత గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ప్రమాదకర వంతెనలపై ప్రయాణమెలా..?

పొన్నూరు, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో సాగునీటి కాలువలపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. నిధులు మంజూరు చేయాలని స్థానిక రైతులు ఆనాటి పాలకులను కోరినా. . నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతా వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయని రైతులు ఫిర్యాదులు చేయడంతో.. సాగునీటి శాఖాధికారులు స్పందించి ఈ ఏడాది మార్చిలో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వ పరిశీలనకు పంపారు. ప్రభుత్వం ఇంకా నిధులు మంజూరు చేయలేదని, నిధుల కోసం ఎదురుచూస్తున్నామని ఆ శాఖ సహాయ ఇంజినీరు రవీంద్రబాబు న్యూస్‌టుడేకు తెలిపారు.

**పెచ్చులూడుతూ.. చువ్వలు కనిపిస్తూ..**
మండల పరిధిలోని ఆలూరు, ఆరెమండ,

ఆరెమండ సమీపంలో రక్షణ గోడ లేకుండా..

మాచవరం, ములుకుదురు, దొప్పలపూడి, మన్నవ, పచ్చలతాడిపర్రు, మునిపల్లె, మామిళ్లపల్లి, బ్రాహ్మణకోడూరు, నిడుబ్రోలు తదితర ప్రాంతాల్లో సాగునీటి కాలువలపై నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని వంతెనల అడుగు భాగంలో శ్లాబు పెచ్చులు, పెచ్చులుగా ఊడిపడుతున్నాయి. చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కొన్ని వంతెనలకు రక్షణ గోడలు విరిగిపోయాయి. వంతెనలపై రాకపోకలు నిర్వహించే సమయంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే అంచుకు వెళ్లడానికి

**కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు**

వాహనదారులు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

**ఎక్కలేక.. దిగలేక..** మండల పరిధిలోని ఆలూరు సమీపంలో సాగునీటి కాలువలపై నిర్మించిన కాలిబాట వంతెన మధ్యలో విరిగిపోయింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు రైతులు భయపడుతున్నారు. వంతెనకు ఒక వైపు ర్యాంపు కుంగిపోయింది. రైతులు ఎక్కలేక.. దిగ లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు నిర్వహించే సమయంలో పరిస్థితి దయనీయంగా ఉందని మహిళా రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే ప్రభుత్వం స్పందించి నూతన వంతెనలు, రక్షణ గోడలు, కాలిబాట వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

విజేతను అభినందిస్తున్న డీఎస్పీ సునీల్ పక్కన పీఈటీలు

**వెనిగండ్ల(పెదకాకాని), న్యూస్‌టుడే:** మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని డీఎస్పీ సునీల్(సీఐడీ) తెలిపారు. వెనిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండో రోజైన ఆదివారం కొనసాగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వీక్షించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పేదరికం దూరమవుతుందని.. నిరంతర సాధన ఉంటే క్రీడల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. తాను పేద కుటుంబానికి చెందిన వాడనని ప్రభుత్వ పాఠశాలలో చదివి పోలీసు అధికారిగా మారడానికి కారణం కసరత్తు మాత్రమే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పీఈటీలు కొండయ్య, గోపి, లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి ధనుర్మాస పూజలు

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** పట్టణ నాజర్‌పేటలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ ఛైర్మన్ కె. చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ నిర్వహించే పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ఆయుర్వేద ఆసుపత్రుల్లో హైజీన్‌కు అధిక ప్రాధాన్యత

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల్లో హైజీన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలో పెద్ద డబ్బాల్లో వచ్చిన మందులను రోగులకు మోతాదు ప్రకారం కాగితాల్లో పొట్లం చుట్టి అందించటం, తెచ్చుకున్న సీసాలో ద్రవరూపంలో మందు పోయడం వంటి పనులకు శాశ్వతంగా స్వస్తి చెప్పాలని ఆదేశించింది. కాగితాలు, సీసాల్లో అపరిశుభ్రత చోటు చేసుకుంటుందని.. ఇది రోగుల అనారోగ్యం తగ్గక పోవడానికి కారణమని స్పష్టంగా పేర్కొంది. వీటిని నివారణకు గాను ప్లాస్టిక్ సీసాల్లో మందులు ప్యాకింగ్ చేసి ఆసుపత్రులకు అందించాలని మందుల తయారీ కంపెనీలను ఆదేశించింది. ఈ క్రమంలో ఆయుర్వేద మందుల సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి



సీసాల్లో ప్యాకింగ్ చేసిన మందులు

ప్లాస్టిక్ సీసాల్లో ప్యాకింగ్ చేసిన మందులు క్రమం తప్పకుండా ఇండెంట్ మేరకు ఆసుపత్రులకు అందిస్తున్నారు. ఇలా ఇవ్వడంతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్యాకింగ్ మందులు రోగులకు నేరుగా ఇస్తున్నట్లు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ అర్చన పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్య సేవల్లో హైజీన్ ముఖ్యమని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్యాకింగ్ మందులు అందిస్తుందని చెప్పారు.

## ఉపాధ్యాయులు.. సామాజిక చైతన్యానికి పునాదులు

**చేబ్రోలు, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు సామాజిక చైతన్యానికి పునాదులని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఆర్వీ ఐటీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ 51వ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజశేఖర్‌రావు, కళాధర్‌లతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్వీఐటీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీ కృష్ణయ్య, పింఛనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాస్, స్థానిక శాఖ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్



కేక్ కోస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, కత్తెర హెనీక్రిస్టినా, సంఘ ప్రతినిధులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** ది పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సంఘ ప్రతినిధులు, పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

## పురుషుల ఓపీకి మహిళల రాకతో ఇక్కట్లు

**తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:** తెనాలి జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులతో మహిళలకు, పురుషులకు అధికారులు వేర్వేరుగా ఓపీ కేంద్రాలు తెరిచారు. కొందరు మహిళలు వరుసలో నిల్చోలేని బంధువులకు చీటీ రాయించడానికి పురుషులకు కేటాయించిన ఓపీ కేంద్రం వద్దకు వచ్చి వరుసలో నిల్చుంటున్నారు. వీరు తరచూ వరుసలో ఉన్నవారితో గొడవలు పడుతున్నట్లు పురుషులు వాపోతున్నారు. నిల్చోలేని వారికి మొదటి అవకాశం ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



వరుసలో నిల్చున్న రోగుల తరఫు మహిళలు

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర, న్యూస్‌టుడే:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్టు అమలు చేస్తామని కొల్లిపర ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తెలిసీ, తెలియక తప్పులు చేసి ఉంటారని.. ఇకనుంచైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఐదు సంవత్సరాలు సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ తొలగించే అవకాశముందని పేర్కొన్నారు.

## అభివృద్ధి.. సంక్షేమానికి ప్రాధాన్యం

**ఫిరంగిపురం, మేడికొండూరు, న్యూస్‌టుడే:** 'రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4,000 సామాజిక పింఛను అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఫిరంగిపురం మండలంలోని గుండాలపాడులో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు, మునగపాడులో తారు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో పెమ్మసాని మాట్లాడుతూ.. కూటమికి ఎప్పుడూ మద్దతుగా నిలుస్తోన్న గుండాలపాడు గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాలనీలు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి కారణమన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. గుండాలపాడు అభివృద్ధిలో నియోజకవర్గానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైకాపా హయాంలో ఛిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే అభివృద్ధి పనులను ప్రభుత్వం కొనసాగిస్తుందని వివరించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, భాజపా నేత బ్రహ్మయ్య, నాయకులు బి.విజయశేఖర్, కె.కోటేశ్వరరావు, చిన నరసింహారావు, ప్రసాద్, దాసయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల జన్మదిన వేడుకలు



నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

**పొన్నూరు, న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలను తెదేపా కార్యాలయం, పట్టణ, మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తేదేపా కార్యకర్తలు, నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పొన్నూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాన్ని, ఆర్టీసీ డిపో ప్రాంగణంలో అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ పఠాన్ రిజ్వాన్ ప్రారంభించారు. ముస్లిం, మైనార్టీ నేతలు జీబీసీ రహదారిలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నిడుబ్రోలులో తెదేపా యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. శ్రీవీరాంజనేయస్వామి దేవాలయంలో దేవాలయ ఛైర్మన్ జీఎంసీ గుప్తా ప్రత్యేక పూజలు చేశారు.

**పెదకాకాని, న్యూస్‌టుడే:** పెదకాకానిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 15 కేజీల కేకును కోశారు. అనంతరం వేలాది మందికి అన్నదానం చేశారు. పేదల అభ్యున్నతి, నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మండలంలో పలు చోట్ల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదకాకాని, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెదకాకానిలో..

## రహదారి నిర్మాణ పనులు పూర్తి

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని 6వ వార్డు విద్యానగర్‌లో సిమెంటు రహదారి నిర్మించకపోవడంతో మట్టి రహదారిలో రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానా ఇబ్బందులు పడ్డారు. గత వైకాపా పాలనలో సిమెంటు రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు అనేక మార్లు వైకాపా నేతల ముందు తమ గోడు వినిపించారు. అయినా నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయలేదు. ఎన్నికలు ముందు అప్పటి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వార్డు పర్యటనకు వెళ్లిన సమయంలో రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తామని స్థానికులకు హామీనిచ్చారు. ఈ ఏడాది అక్టోబరు 5న వసతులు కొరవడి.. అవస్థలు పడి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. రహదారి నిర్మాణ పనులకు రూ.7.80 లక్షలు నిధులు మంజూరు చేయడంతో ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యానగర్‌లో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు

ఈనాడు కథనానికి స్పందన

## సుందరంగా తహసీల్దార్ కార్యాలయం..

**మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ప్రారంభం నేడు**

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** ఇప్పుడు తెనాలి తహసీల్దార్ కార్యాలయాన్ని చూస్తే అందరూ ఆశ్చర్యపోక మానరు. పురాతన ప్రధాన నిర్మాణ శైలికి విఘాతం లేకుండా సమగ్ర మరమ్మతులు నిర్వహించి కార్పొరేట్ కార్యాలయాన్ని తలదన్నే విధంగా నిర్మించారు. కొద్ది నెలల కిందట వరకు వాన వస్తే కార్యాలయం లోపలి గదుల్లోకి నీరు పడే క్రమంలో పట్టాలు కప్పుకుంటూ దినదినగండంగా నిర్వహణ సాగింది. అధికారులు, సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చిపోయే ప్రజలకు ఎలాంటి సదుపాయాలు లేవు. ఈ క్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ చొరవ చూపి దాతల సహాయంతో కార్యాలయాన్ని సమగ్ర వసతులతో సుందరంగా తీర్చిదిద్దారు. బ్రిటీష్ జమానాలో 1882లో తెనాలి తాలూకా కార్యాలయం ఏర్పాటైందని, అప్పటి నుంచి అలాగే కొనసాగుతూ వచ్చిందని, 143 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఆధునిక రూపు సంతరించుకుందని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నారని చెప్పారు.



## దేవాలయంలో పరిశుభ్రత పనులు

సేవలో యోగ సాధకులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో ఆదివారం కొలవరం లోని శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర ఆలయంలో పరిశుభ్రత యోగం నిర్వహించారు. తెల్లవారుజామున 4:30 గంటలకు ఆలయ ప్రాంగణానికి చేరుకున్న యోగ సాధకులు ఉదయం 9 గంటల వరకు పరిశుభ్రత పనులు నిర్వహించారు. ప్రాంగణాన్ని రంగ వల్లులతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు. యోగాచార్య కిశోర్ గురుజీ పర్యవేక్షించారు.

## పద్ధతి మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగండి

కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ జనార్దనరావు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** పద్ధతి మార్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ బి.జనార్దనరావు స్పష్టం చేశారు. తెనాలి గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలుత వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్ రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని సూచించారు. సీఐ నాయబ్ రసూల్, ఎస్సైలు ఆనంద్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసిన విద్యార్థిని చదువు కొనసాగించడానికి ఎస్సై శ్రీనివాసరావు రూ.10 వేలను సీఐ చేతుల మీదుగా అందించారు.

## నదిలో దూకి యువకుడి గల్లంతు

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** మందడం ఎస్సీ కాలనీకి చెందిన శశికుమార్ (23) ఆదివారం సాయంత్రం తాళ్లాయపాలెం సమీపంలో బల్లకట్టు వద్ద కృష్ణానదిలోకి దూకి గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. డిగ్రీ చదువుతూ మధ్యలోనే మానేసిన అతడి మానసిక స్థితి బాగోక నదిలో దూకి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోండి

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించి సమాజానికి తమ వంతు సేవలు అందించాలని పారిశ్రామికవేత్త తులసీరామచంద్రప్రభు విద్యార్థులకు సూచించారు. కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాను చదువుకునే సమయంలో ఎదురైన ఇబ్బందులు, అధిగమించిన తీరును వివరించారు. కార్యక్రమంలో 430 మంది విద్యార్థులకు రూ.14.53 లక్షలు విలువైన ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. రంగిశెట్టి జగదీష్, డాక్టర్ కోటి నాగయ్య, చింతల శ్రీనివాసరావు, టి.చిన్నబ్బాయి, శివనాగరాజు, నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి దశలోనే గుర్తిస్తే సమస్యల నివారణ

డాక్టర్ రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

**తెనాలి టౌన్, న్యూస్‌టుడే:** నోటి పరిశుభ్రతను పక్కాగా పాటించడం, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దంత సమస్యలను నివారించవచ్చని.. తొలి దశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే మరింత విస్తరించకుండా చూసుకోవచ్చని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ డి.రవీంద్రనాథ్ తెలిపారు. తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. సంఘ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రనాథ్‌ను జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

## పట్టు తప్పితే ప్రమాదమే..

తెనాలి నుంచి నందివెలుగు, కొలకలూరు మీదుగా గుంటూరు వరకు వెళ్లే ప్రధాన మార్గంలో నందివెలుగు వంతెన కీలకమైంది. ఈ వంతెన అంచున ఒక వైపు ఇనుప రేకు అడ్డు గోడగా ఉంది కాని.. రెండో వైపున ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. వాహనాలు కాని, నడక ద్వారా రాకపోకలు సాగించే వారు ఏమాత్రం పట్టు తప్పినా నేరుగా వంతెన నుంచి కింద ఉన్న రోడ్డు మీద పడిపోతారు. ఇప్పటికే ఇలా జరిగి పలు ప్రమాదాలు జరిగాయి. అధికారులు క్షేత్ర పరిస్థితులను అధ్యయనం చేసి వీలైనంత త్వరగా రక్షణ ఏర్పాట్లు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

## గడ్డివాముకు నిప్పు

**కొల్లిపర, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో ఆదివారం వరి గడ్డివాముకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న తెనాలి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలికి చేరి మంటలను అదుపు చేశారు. రూ.90 వేల నష్టం వాటిల్లిందని వివరించారు.

## రూ.90 వేల నగదు చోరీ

**పొన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని 5వ వార్డు సాయినగర్‌కు చెందిన మహబూబ్ బాబాఖాన్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలోని రూ.90 వేల నగదు, 10 గ్రాముల బంగారం చోరీ చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరనాయక్ వెల్లడించారు.

## క్రీడా పోటీల్లో సత్తా

**లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే:** లేమల్లెపాడు యూపీ స్కూల్‌లో వీవీఐటీయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం క్రికెట్, వాలీబాల్, స్లో సైక్లింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి మద్దినేని సుధాకర్, సొసైటీ ఛైర్‌పర్సన్ పాతూరి కృష్ణారావులు బహుమతులు అందించారు. వీరు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు అంకిత భావంతో నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్ తెలిపారు.

## కమిషనర్ చెప్పినా వినరా?

పిచ్చి మొక్కలతో బహిరంగ ఉద్యానం

దశాబ్ద కాలంగా పట్టణంలోని బహిరంగ ఉద్యానాల్లోని వ్యాయామ, క్రీడా పరికరాలు మరమ్మతులకు, పిచ్చి మొక్కలు తొలగింపునకు నోచుకోక సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు ఇందిరా కాలనీలోని బహిరంగ ఉద్యానం పరిశీలించి శుభ్రం చేయించి.. పరికరాలు వినియోగంలోకి తీసుకు రావాలని ఇంజినీర్లను ఆదేశించారు. పక్షం రోజులు గడుస్తున్నా.. అతీగతీ లేదని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

(c) eenadu

# మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

## జనసేన బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. లాలాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. అలాగే రానున్న స్థానిక సంస్థల పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆ పార్టీ నేతలు వడ్రాణం మార్కండేయబాబు, నాయుడు కమల్, దేగల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: పనిపోలు గ్రామంలో మంచి నీటి ట్యాంకును శుభ్రం చేసి తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని 'మేమున్నాం.. మీకు తోడుగా' కార్యక్రమం ద్వారా స్థానికులు సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఇన్‌ఛార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పారిశుద్ధ్య కార్మికులతో ట్యాంకులను శుభ్రం చేయించారు.

## 16 నుంచి ధనుర్మాస పూజలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ నాజర్‌పేటలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ ఛైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## గుంతలు పూడ్చారు

మేడికొండూరు, న్యూస్‌టుడే: అధికారులు ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చారు. మేడికొండూరు - పేరేచర్ల మధ్య ప్రధాన రహదారిలో అక్కడక్కడా గుంతలు పడ్డాయి. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 10న 'ఈనాడు'లో 'గోతులు.. వేతలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు.

మరమ్మతులు చేసిన తర్వాత..

## ఎట్టకేలకు తారు వేశారు..!

ఈనాడు స్పందన

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మోరంపూడి నుంచి పేరుకలపూడి వెళ్లే రోడ్డుకు కంకర వరకూ వేసి వదిలేశారు, తారు ఎప్పుడు వేస్తారంటూ గత నెల 17న 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ రోడ్డుకు రూ. 2.71 కోట్లు నిధులు మంజూరైనా తారు వేయలేదనేది సమస్య సారాంశం. అప్పటి నుంచి పది రోజులకు ఒకసారి చొప్పున ఆర్ అండ్ బి అధికారులతో 'న్యూస్‌టుడే' రెండు సార్లు ప్రస్తావించింది. ఎట్టకేలకు ఆదివారం ఉదయం మోరంపూడి కాలనీ వంతెన నుంచి తారు వేసే పనులు చేపట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని గుత్తేదారు తెలిపారు.

## వైద్య శిబిరానికి స్పందన

మంగళగిరి (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం పెసర్లంకలో మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిపాలన అధికారి మండవ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 120 మంది వైద్యులు, 200 మంది సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 1200 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. డీన్ డాక్టర్ లక్ష్మి, ఎంఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, డీఎంఎస్ డాక్టర్ కుమార్ చౌదరి, సీనియర్ రేడియాలజిస్ట్ డాక్టర్ అంకమరావు పాల్గొన్నారు.

వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ముట్లూరు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పుట్టిన రోజు సందర్భంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో భక్తులు అభిషేకించారు.

పెదనందిపాడు: రేణుక ఎల్లమ్మ ఆలయంలో..

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పాలపర్రులో రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ (తేళ్లవారి) వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మేడికొండూరు, న్యూస్‌టుడే: మేడికొండూరు శ్రీమహాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా జరిగాయి. ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. సాయంత్రం 2 వేల మందికి భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు తమ సొంత ఖర్చుతో కార్యక్రమం నిర్వహించారు.

ముట్లూరులో లక్ష్మీచెన్నకేశవస్వామి

మేడికొండూరు: మహాలక్ష్మి అమ్మవారు

## దాత ఔదార్యం.. వెతలు దూరం

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: పెదనందిపాడు మండలం పాలపర్రు ఎస్సీ కాలనీ నుంచి వరద కాలువ వరకు (ఒక కిలోమీటర్) కాలువ తీయించి మట్టిరోడ్డు నిర్మాణానికి ప్రత్తిపాడు మార్కెటింగ్ యార్డు కమిటీ డైరెక్టర్ బండ్లమూడి ఉపేంద్రరావు రూ.లక్ష సొంత డబ్బుతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి పనులు చేయించి ఆదర్శంగా నిలిచారు. ఈ రహదారికి గ్రావెల్ వేయిస్తే ఉపయోగంగా ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు. అధికారులు గ్రావెల్ వేయించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొనసాగుతున్న పనులు

## తడబడని మనసు.. తలపడడమే తెలుసు

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే

వయసు శరీరానికే కానీ మనసుకాదు అని నిరూపిస్తున్నారు వీరు. ఆరు పదుల వయసు దాటిన ఉరిమే ఉత్సాహంతో అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటుతున్నారు. నియమిత ఆహార నియమాలు, నిత్య సాధన, సంకల్పం తమ విజయ రహస్యాలని వారు చెబుతున్నారు. పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొమ్మిది జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి వచ్చారు. తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

### ఆరు పదుల వయసులో అథ్లెటిక్స్‌లో రాణింపు

నడక పందెంలో ఉత్సాహంగా క్రీడాకారులు

### అమ్మ స్ఫూర్తితో..

మాది ఏలూరు జిల్లా భీమడోలు. 60 ఏళ్ల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం, మూడు కిలోమీటర్ల నడక పందెంలో బంగారు పతకాలు సాధించాను. 800 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం గెలుచుకున్నాను. 2012లో విశాఖపట్నం, 2014లో శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో కూడా బంగారు పతకాలు గెలుచుకున్నాను. అమ్మ కూడా క్రీడల్లో పాల్గొనేవారు. ఆమె స్ఫూర్తితోనే నేనూ రాణిస్తున్నా. - పైడి రాజేశ్వరమ్మ

### ఆటలపై మమకారంతో..

మాది తిరుపతి. పాఠశాల స్థాయి నుంచే వివిధ ఆటల్లో పాల్గొని బహుమతులు పొందాను. పాలపర్రులో జరిగిన అథ్లెటిక్స్ లో 75 ఏళ్ల పైబడిన విభాగంలో జావెలిన్‌త్రో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాను. 2018లో ఉత్తరప్రదేశ్, 2019లో ఒడిశాలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాను.

-కె. సుబ్బరామిరెడ్డి

### 135 పతకాలు సాధించాను..

మాది నెల్లూరు. 22 ఏళ్ల నుంచి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటూ 135 పతకాలు సాధించాను. వీటిలో బంగారు పతకాలు 66, ఇంటర్నేషనల్ స్థాయిలో ముంబయిలో 2014లో జరిగిన దూరం దూకు పందెంలో ప్రథమంలో నిలిచాను. 2019లో తిరువనంతపురంలో జాతీయ స్థాయిలో జరిగిన ట్రిపుల్ జంప్ పోటీలో ప్రథమం, 100 మీటర్ల హర్డిల్, 400 మీటర్ల హర్డిల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. -ఈ.రామచంద్ర

### భర్త ప్రోత్సాహమే..

మాది విశాఖపట్నం. భర్త బ్యాంక్‌లో ఉద్యోగి. ఆయన ప్రేరణతో 1982 నుంచి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నాను. పాలపర్రులో జావెలిన్‌త్రో, షాట్‌పుట్‌లో 55 ఏళ్ల పైబడిన గ్రూప్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాను. 2025 ఆగస్టులో జరిగిన జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నాను. - కెముత్యకొండ

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఫిరంగిపురం, మేడికొండూరు, న్యూస్‌టుడే: 'రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4,000 సామాజిక పింఛను అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఫిరంగిపురం మండలంలోని గుండాలపాడులో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు, మునగపాడులో తారు రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో పెమ్మసాని మాట్లాడారు. కూటమికి ఎప్పుడూ మద్దతుగా నిలుస్తోన్న గుండాలపాడు గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాలనీల్లోనూ సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి కారణమన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గుండాలపాడు అభివృద్ధిలో నియోజకవర్గానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైకాపా హయాంలో ఛిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే అభివృద్ధి పనులను ప్రభుత్వం కొనసాగిస్తుందని వివరించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, భాజపా నేత బ్రహ్మయ్య, నాయకులు బి.విజయశేఖర్, కె.కోటేశ్వరరావు, చిన నరసింహారావు, ప్రసాద్, దాసయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండాలపాడులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

### 'అంబటి రాంబాబు వ్యాఖ్యలు సరికాదు'

వైకాపా నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సరికాదని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆయన మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఎమ్మెల్యేలను కించపరుస్తూ మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. గుంటూరు నగరంలో శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి తొలగింపు పని క్లిష్టతరమైనదని, రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మూడు నెలల అవకాశం అడిగారన్నారు. మొదట పరిశీలన చేసిన సంస్థ 35 రోజులు గడువు కోరిందన్నారు. దీనికి రైల్వే అధికారులు అంత గడువు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేయడంతో అధికారులు సూచనల మేరకు మరో సంస్థ ప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారన్నారు. ఒకటీ లేదా రెండు నెలల్లో బ్రిడ్జి తొలగింపు పూర్తి అవుతుందన్నారు. ఆయా పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

## ఉపాధ్యాయులు.. సామాజిక చైతన్యానికి పునాదులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు సామాజిక చైతన్యానికి పునాదులని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఆర్సీఎంబీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ 51వ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రాజశేఖరరావు, కళాధర్‌లతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్సీఎంబీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్బీ కృష్ణయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్, స్థానిక శాఖ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పోతినేని జన్మదిన వేడుకలు

మంగళగిరి (ఏఎన్‌యూ), దుగ్గిరాల, న్యూస్‌టుడే: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం మంగళగిరిలో ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలోని నివాసంలో పార్టీ నేతలు ఏర్పాటు చేసిన కేకును శ్రీనివాసరావు కట్ చేశారు. ఆయనకు పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో పలు చోట్ల పార్టీ నేతలు ఏర్పాటు చేసిన కేకులను పోతినేని కోశారు. గోసాల రాంపమ్మ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు పుస్తకాలు, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకోట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి బాబీ, షేక్ జంషీద్, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య తదితరులు పాల్గొన్నారు. దుగ్గిరాలలోనూ స్థానిక నాయకులతో కలిసి పోతినేని కేకు కోశారు.

మంగళగిరిలో కేకు కోస్తున్న శ్రీనివాసరావు

## క్రీడా పోటీల్లో సత్తా

లేమల్లెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: లేమల్లెపాడు యూపీ స్కూల్‌లో వీవీఐటీయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం క్రికెట్, వాలీబాల్, స్లోసైక్లింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి మద్దినేని సుధాకర్, సొసైటీ ఛైర్‌పర్సన్ పాతూరి కృష్ణారావులు బహుమతులు అందించారు. వీరు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు అంకిత భావంతో నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి భక్తసింగ్ తెలిపారు.

## వసతులు కరవు.. విధులు బరువు

### తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌ను వెంటాడుతున్న సమస్యలు

తుళ్లూరు, న్యూస్‌టుడే

రాజధానిలో కీలకమైన తుళ్లూరు పోలీసు స్టేషన్‌ను సిబ్బంది కొరత వెంటాడుతోంది. 2014-19 మధ్య అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 40 వేల మంది కార్మికులు రాత్రీపగలు తేడా లేకుండా పనులు చేశారు. అప్పట్లో తుళ్లూరు స్టేషన్‌లో ఇద్దరు సీఐలతో 120 మంది సిబ్బంది పని చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత అమరావతి నిర్మాణాన్ని నిలిపివేసింది. దాంతో పాటు తుళ్లూరు పోలీసు సిబ్బందిని కూడా క్రమేపీ తగ్గించారు. ప్రస్తుతం 40 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నారు. ఎస్సైలు 1, ఏఎస్ఐలు 2, హెడ్ కానిస్టేబుల్స్ 7, కానిస్టేబుల్స్ 52, ఉమెన్ పీసీలు 4 మొత్తం 65 మంది సిబ్బంది కొరత ఉంది. వారితో పాటు ఎటాచ్‌మెంట్, మెడికల్ సెలవులు, ఇతర కారణాలతో మరికొంత మంది పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ప్రస్తుతం అమరావతి నిర్మాణ పనులు వేగవంతం కావటంతో క్రమేణ కార్మికుల సంఖ్య పెరగటంతో పాటు భారీగా నిర్మాణ సామగ్రి రాజధానికి తరలి వస్తుంది. దీనికి తోడు అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు, ప్రముఖ విశ్వవిద్యాలయాలు, సీఆర్డీఏ కార్యాలయాలకు నిత్యం ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ప్రముఖులు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ప్రొటోకాల్ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి అక్కడ ఉంది. అమరావతి నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా శాంతి భద్రతలు నిర్వహించటానికి తగినంత మంది సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

**మొరాయిస్తున్న వాహనాలు..** రాజధాని నేపథ్యంలో అమరావతిలో తరచూ సిబ్బంది ప్రొటోకాల్ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్‌లో ఉన్న వాహనాలు తరచూ మరమ్మతులకు గురవటంతో ప్రముఖుల వాహనాల ముందు వేగాన్ని అందుకోలేక మొరాయిస్తున్నాయి. ఐదుగురు ఎస్సైలు, సిబ్బంది అందరూ ఒక్క వాహనాన్నే వినియోగించుకోవాల్సిన పరిస్థితి తుళ్లూరు స్టేషన్‌లో ఉంది. ఆ వాహనం కూడా పూర్తి కండీషన్‌లో లేదు. కానిస్టేబుల్ సిబ్బందికి తగినన్ని ద్విచక్రవాహనాలు అందుబాటులో లేవు.

**ఆధునికీకరణ అవసరం..** ఒకప్పుడు చిన్న మండలంగా ఉన్న తుళ్లూరు ప్రస్తుతం రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతుంది. గతంలో ఇరుకైన చిన్న చిన్న గదులతో స్టేషన్ భవనం ఉంది. అమరావతిలో ప్రభుత్వం స్థలం కేటాయించి విశాలమైన నూతన భవనాన్ని నిర్మించి పోలీస్ స్టేషన్ నిర్మించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గృహ సముదాయాలు నిర్మించి మెరుగైన సదుపాయాలు కల్పించాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..** 'స్టేషన్‌లో సిబ్బంది కొరత, అధునాతన వాహనాలు సమకూర్చాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం' అని ఎస్‌హెచ్‌వో కె.శ్రీనివాసరావు తెలిపారు.

## బ్యాంకు ఉద్యోగి ఇంట్లో చోరీ

ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

మంగళగిరి (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే: తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపం రహదారిలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీ జరిగింది. విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న దాసరి రామ్‌గోపాల్ తన కుటుంబసభ్యులతో కలిసి మూడురోజుల క్రితం శిర్డీ వెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో కబోర్డ్స్, బీరువా తెరిచి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న సుమారు 200 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు కనిపించడం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించారు.

## శివారు కాలనీ.. పట్టించుకునే వారేరీ?

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థలో రాయపాటి శ్రీనివాస్ నగర్ విలీనమై ఏళ్లు గడుస్తున్నా.. ఈ ప్రాంతంపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూరల్ మండలం అడవి తక్కెళ్లపాడు పరిధిలోని ఈ కాలనీలో పేదలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న రాజీవ్ గృహకల్ప సముదాయంలో 800 పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా ప్రతిరోజు నగరంలోకి వచ్చి కూలి పనులు చేసుకుని తిరిగి వెళుతుంటారు. రాయపాటి శ్రీనివాస్ నగర్‌లో మౌలిక వసతులు లేక పేదలు అల్లాడుతున్నారు. పలు అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. సముదాయానికి దక్షిణం వైపు సిమెంట్ రోడ్డు, కాల్వలు నిర్మించలేదు. దీంతో మురుగు వెళ్లే మార్గం లేక ఇళ్ల మధ్య నిలుస్తోంది. వర్షాల సమయంలో నీరు ఇళ్లలోకి వస్తోంది. కాలనీ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలనీలో మట్టి రోడ్డు.. ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

## దుర్వాసన.. దోమలు

మంగళగిరి-నిడమర్రు ప్రధాన రహదారిలోని అరవింద స్కూల్ సమీపంలో మురుగునీరు ప్రవహించడం లేదు. కొంతమంది షాపుల యజమానులు చెత్తను రోడ్డుపై వేయడంతో అవి కాలువల్లో చేరి ఈ పరిస్థితి ఏర్పడుతుంది. నిత్యం దుర్వాసన, దోమలతో నరకం చూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఎప్పటికప్పుడు డ్రెయిన్లను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు. * పట్టణ పరిధిలోని కొప్పురావు కాలనీ ఇండియన్ బ్యాంక్ సమీపంలో, పెదవడ్లపూడి గ్రామ చింతలకుంట ఏరియా సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

మంగళగిరి- నిడమర్రు ప్రధాన రహదారి వెంబడి..

## పొంచి ఉన్న ప్రమాదం

మేడికొండూరు నుంచి 113 తాళ్లూరు వరకు కొత్తగా తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల కురిసిన వానలకు వరద పోటెత్తడంతో మేడికొండూరు పరిధిలో రోడ్డు అక్కడక్కడా కోతకు గురైంది. దీంతో రోడ్డు నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు ఆయా గుంతలు పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, మేడికొండూరు

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: వృద్ధురాలి మెడలోని 96 గ్రాముల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కుని ద్విచక్రవాహనంపై పారిపోయిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. మంగళగిరి కొత్తపేటలో నివాసం ఉంటున్న ఈశ్వరమ్మ(65) ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద ముగ్గు వేసి ఇంటికి తిరిగి వెళుతుండగా బైక్ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పారిపోయినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. గొలుసు విలువ దాదాపు రూ. 12 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

## నదిలో దూకి యువకుడి గల్లంతు

తుళ్లూరు, న్యూస్‌టుడే: మందడం ఎస్సీ కాలనీకి చెందిన శశికుమార్ (23) ఆదివారం సాయంత్రం తాళ్ళాయపాలెం సమీపంలో బల్లకట్టు వద్ద కృష్ణానదిలోకి దూకి గల్లంతైనట్టు పోలీసులు తెలిపారు. డిగ్రీ చదువుతూ మధ్యలోనే మానేసిన అతడి మానసిక స్థితి బాగోక నదిలో దూకి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు తుళ్లూరు పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

## చౌక బియ్యం స్వాధీనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం రాయపూడిలో మదర్సా రోడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 30 బస్తాల చౌక బియ్యాన్ని ఆదివారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై సోమవారం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వీఆర్ఏ ఖాదీర్ బాషా తెలిపారు.

## 'ఇళ్లు కట్టించి ఇస్తేనే నివాసాలు ఖాళీ చేస్తాం'

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి నుంచి వడ్డేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ నిమిత్తం రోడ్డు వెంబడి ఉన్న నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిని ఖాళీ చేయాలని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు అందించారు. రహదారి వెంబడి ఉన్న 22 ఇళ్లను నాలుగు రోజుల్లో ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరించారని చైతన్యనగర్ వాసులు తెలిపారు. ఎటువంటి హామీ ఇవ్వకుండా ఇప్పటికిప్పుడే ఖాళీ చేయమనడం వల్ల ఇబ్బందులకు గురవుతామని స్థానికులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. తమకు స్థలం కేటాయించడంతోపాటు ఇంటిని నిర్మించి ఇస్తేనే తమ నివాసాలను ఖాళీ చేస్తామని స్పష్టం చేశారు. సమస్యను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తామని స్థానిక తెదేపా నాయకులు చెబుతున్నారు.

## క్రిస్మస్ జెండా ప్రతిష్ఠ

ఫిరంగిపురం న్యూస్‌టుడే: ఫిరంగిపురం బాలయేసు దేవాలయంలో ఆదివారం క్రీస్తు జయంతి పండగ జెండా ప్రతిష్ఠ జరిగింది. దివ్య పూజాబలి సమర్పించిన రెవ. ఫాదర్ డా. వల్లె విజయ జోజి బాబు, పూజ అనంతరం పండగ జెండాను, క్రిస్మస్ నక్షత్రం ప్రతిష్ఠించి, దైవర్చన క్యాలెండర్ ఆవిష్కరించారు. విచారణ గురువు ఫాతిమా మర్రెడ్డి దైవ సందేశం వినిపించారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విచారణ గురువులు

## విద్యార్థిని చదువుకు చేయూత

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఉన్నత విద్య చదువుకోవడానికి దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ భార్య సులోచన వితరణ చేశారు. జి.ఇందిరప్రియ అనే యువతి బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్సు చదివేందుకు సులోచన రూ. 20 వేలు ఆదివారం అందించారు. గద్దె రవీంద్రరావు, కొండపనేని రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

పెనుమూలి(దుగ్గిరాల), న్యూస్‌టుడే: పెనుమూలి దళితులకు నిర్దిష్ట ప్రాంతంలో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ లీగల్‌సెల్ న్యాయవాది చిలువూరు నాగరాజు కోరారు. ఆదివారం పెనుమూలిలో ఆయన స్థానికులతో సమావేశమయ్యారు. మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి ప్రయోజనాలు పట్టించుకోవడంలేదన్నారు. ఈ సందర్భంగా తమకు శ్మశానవాటిక సమకూర్చాలని కోరుతూ ఎస్సీ కమిషన్, ప్రభుత్వ అధికారులు, మానవ హక్కుల సంఘం, హైకోర్టులకు అక్కడి ప్రజలు ఉత్తరాలు రాశారు.


### బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన గుంటూరుజిల్లా, పెద నందిపాడు(మం), రావిపాడు గ్రామ కాపురస్తులు లేటు మొవ్వా అప్పయ్య గారి కుమారుడు శివరామారావు మేనేజింగ్ పార్ట్‌నర్ ఆఫ్ శివ కాటన్ జిన్నింగ్ మిల్లు వారి సూచనలమేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి శివ కాటన్ జిన్నింగ్ మిల్ ప్రత్తిపాడు నందు పార్ట్‌నర్స్ అయినటువంటి 1) మొవ్వా అప్పయ్య గారి కుమారుడు మొవ్వా శివ రామారావు, 2)మొవ్వా తిరుపతయ్య గారి కుమారుడు లేటు అప్పయ్య, 3)పొన్నం ఆదియ్య గారి కుమారుడు సుబ్రహ్మణ్యం, 4)లేటు మొవ్వా తిరుపతయ్య గారి కుమారుడు లేటు మొవ్వా రామారావు గార్లకు సంబంధించిన ఆస్తి శివ కాటన్ జిన్నింగ్‌మిల్లు ఆస్తులను తరిగోపుల రంగారావు గారి ద్వారా కొనుగోలు చేయబడిన ఆస్తులకు సంబంధించి 1995వ సం॥లో పరస్పర ఒక అంగీకార పత్రము వ్రాసుకోబడినది. దానికి విరుద్ధంగా లేటు మొవ్వా రామారావు గారి కుమారుడు మొవ్వా శ్రీనివాసరావు గారు ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవని పేపరులో ప్రకన ఇచ్చి సంబంధిత పోలీసు వారి నుండి సర్టిఫికేట్ పొంది ఆ సర్టిఫికేట్ ఆధారంగా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా లబ్దిపొందాలనే దురుద్దేశ్యముతో ది.06-10-2025న దఖలు దస్తావేజు నెం.14070/2025 యస్.ఆర్.ఓ. గుంటూరు ద్వారా తన పిల్లలైన కుమార్తె మొవ్వా @ పూసం శ్రీలేఖ మరియు కుమారుడు మొవ్వా శ్రీహర్ష గార్లకు దఖలుచేసినారని తెలియవచ్చినది. కావున ఎవరైనా అట్టి తప్పుడు డాక్యుమెంట్ ఆధారంగా ఏమైనా లావాదేవీలు జరిపిన యెడల అవి నా క్లయింటును బైండుచేయజాలవు. అట్టి వ్యవహారములపై నా క్లయింటు చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనెదరని ఈ ప్రకటన ద్వారా యావన్మందికీ తెలియ జేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥, ప్రత్తిపాడు సబ్.డి॥ & గ్రామం, డి.నెం.163లో య.8-03 శెంట్లు మింజుమలె య.1-50శెంట్లు రీ సర్వే దాఖలా యల్.పి.యం.నెం.1461లో య.1-49శెంట్ల భూమికి హద్దులు. తూర్పు: శివ కాటన్ జిన్నింగ్ మిల్లు హద్దు, దక్షిణం: రోడ్డు హద్దు, పడమర: సర్కారు డొంక హద్దు, ఉత్తరం: కాకాని ముత్యాలు వగైరాల భూమి హద్దు.

పసుపులేటి వెంకట సుబ్బారెడ్డి, అడ్వకేట్
విద్యానగర్, 1వ లైను, గుంటూరు. సెల్: 9177646766


(c) eenadu

## క్రెడాయ్ ప్రాపర్టీ షో విజయవంతం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** క్రెడాయ్ మూడు రోజులుగా నిర్వహించిన ప్రాపర్టీ షో విజయవంతం కావడం ఆనందదాయకమని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. సిద్ధార్థ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న క్రెడాయ్ 8వ ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వేలాది మంది ప్రజలు, వినియోగదారులు ఈ కార్యక్రమానికి వచ్చి స్థిరాస్తి వ్యవహారాలపై అవగాహన పొందారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల ఉన్నతాధికారులను క్రెడాయ్ సంస్థ నాయకులు ఆళ్ల శివారెడ్డి, ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, మామిడి రాము, మెట్టు సాంబిశివరెడ్డి, ఏవీ నాగార్జునరెడ్డి, తియ్యగూర వినోదరెడ్డిలు శాలువాలతో సత్కరించారు. ఆదివారం 10 లక్కీ బంపర్ డ్రాలు నిర్వహించి గెలుపొందిన వారికి వెంటనే బహుమతులు అందజేశారు. వేల పూల మొక్కలను వినియోగదారులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

**నగరపాలకసంస్థ:** రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఉర్దూ డీఏ ఎండీ ఖాసిం అన్నారు. ఆదివారం చౌత్రా కూడలిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉర్దూ అకాడమీ 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉర్దూ మహోత్సవం నిర్వహణపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ ఈ నెల 16న 9 నుంచి 12వ తరగతి వరకు ఉర్దూ భాష అభివృద్ధిపై వ్యాసరచన, 17న కాలిగ్రఫీ, 18న 20-20 క్రికెట్ పోటీలు, 19న ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని పేర్కొన్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌కు అభినందనలు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** జిలా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన భీమినేని వందనాదేవిని ఆదివారం టీఎన్‌యూఎస్ జిల్లా నాయకులు అమరావతి రోడ్డులోని ఆమె గృహంలో కలిసి అభినందనలు తెలిపారు. టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ.జగదీష్, జిల్లా అధ్యక్షుడు పసల బాలస్వామి, సహాధ్యక్షుడు జీవీ.శ్రీధర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉంటుందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 9.30 నుంచి 10.30 వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం, తర్వాత కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.


కన్నీటి వీడ్కోలు

మాతృమూర్తిగా, ఆదర్శగృహిణిగా మా జీవితాలకు వెలుగులు నింపిన శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు ది.12-12-2025 స్వర్గస్తులైనారని తెలియజేయుచున్నాము.

జననం: 01-01-1941 మరణం: 12-12-2025

కీ॥శే॥ శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు
W/o శ్రీ కామినేని దేవదాసు గాంధీ (లేటు)
గుంటూరు

అంతిమయాత్ర: ది.15-12-2025 సోమవారం ఉ॥ 10.00 గం॥లకు మా స్వగృహము పృథ్వీ అపార్ట్‌మెంట్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు నుండి మహాప్రస్థానమునకు బయలుదేరును. కావున తెలియజేయడమైనది.

ఇట్లు: కుటుంబసభ్యులు: 90000 92999


## రౌడీషీటర్ అరెస్టు


నాగేశ్వరరావు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** రౌడీషీటర్ నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు నగరంపాలెం పోలీసులు ఆదివారం తెలిపారు. డబ్బులు ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడని శ్రీనివాసపేట వ్యాపారుల ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

## ఏఐ ఆధారిత ఈసీజీతో బహుళ ప్రయోజనాలు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

**మంగళగిరి (ఏఎన్‌యూ), గుంటూరు నగరం, న్యూస్‌టుడే:** ఏఐ ఆధారిత ఈసీజీ వల్ల గుండె సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశముందని ప్రముఖ గుండె శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ బాబు చెప్పారు. ఆదివారం తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 'హార్ట్ ఇన్ ద క్యూర్, మేనేజింగ్ కార్డియాక్ రిస్క్స్ ఇన్ నాన్ కార్డియాక్ సర్జరీస్‌పై హై ఇంపాక్ట్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఏటా సుమారు 3 నుంచి 4 కోట్ల వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఇందులో దాదాపు 95 శాతం గుండెకు సంబంధం లేనివే జరుగుతున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. శస్త్రచికిత్స సమయంలో వచ్చే గుండె పోటు వల్ల 15.6 శాతం మరణాలు నమోదవుతున్నాయన్నారు. గుండె వ్యాధులున్న రోగులు, ఇతర వ్యాధులున్న వ్యక్తులు, రక్తాన్ని పలుచగా చేసే మందులు వినియోగించే వాళ్లకు శస్త్ర చికిత్సలు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. సర్జరీల సమయంలో గుండె, నాడీ వ్యవస్థ స్థిరంగా లేకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే అవకాశముందన్నారు. 'ఆధునిక కార్డియాక్ రిస్క్ అసెస్‌మెంట్ టెక్నాలజీ' ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని రమేష్‌బాబు వివరించారు. ప్రతి శస్త్రచికిత్సలో కార్డియాలజిస్ట్, అనస్తీషియా, ఇంటెన్సివిస్ట్, గుండె శస్త్రచికిత్స నిపుణులు, సంబంధిత వ్యాధి శస్త్ర చికిత్స నిపుణులు ఒక బృందంగా పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తగా ఎన్నికైన జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కార్యవర్గం

**జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు అన్నారు. నగరంలోని కృషి భవన్‌లో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. వేణుమాధవరావు మాట్లాడుతూ ఏఈవోలకు జాబ్ చార్ట్ ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఏఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, కోశాధికారి సుభాని, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సురేష్ గోపి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఏఈవోల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ☛ జిల్లా అధ్యక్షుడిగా ఆలా రమేష్‌బాబు, కార్యదర్శి ఎన్.ప్రసాద్‌బాబు, కోశాధికారి ఎం.ఎన్.కృష్ణారావు, సహాధ్యక్షుడు ఐ.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పి.రవికుమార్, ఆర్.వెంకయ్య, వీరంకి గోపి, కార్యనిర్వాహక కార్యదర్శి శివరావు, ప్రచార కార్యదర్శి కె.రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులు ఐ.జ్యోత్స్న, పి.రాజేంద్రప్రసాద్, బి.సౌజన్య, కార్యవర్గ సభ్యులుగా దేవ సమర్పణరావు, ఆదిలక్ష్మి, మురళి ఎన్నికయ్యారు.

## సాహిత్యానికి మానవతా విలువలు జోడించాలి

విజేతలతో అతిథులు, నిర్వాహకులు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సమస్యలకు సాహిత్యం పరిష్కారం చూపుతుందని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ధార్మిక ప్రాంగణంలో సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ ఆదివారం జరిగింది. రమ్యభారతి సాహిత్య పత్రిక వ్యవస్థాపకుడు చలపాక ప్రకాష్, రచయితల సంఘం సభ్యుడు శ్రీవశిష్టల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలో మానవతా విలువలు ఉండాలన్నారు. సభకు రమ్యభారతి సాహిత్య పత్రిక నిర్వాహకుడు వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు సి.భవానీదేవీ, ప్రముఖ కథకులు శ్రీకంఠస్ఫూర్తి తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా కథల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. రచయితలు సింగరాజు శ్రీనివాసరావు (గెలుపు కథ), జి.రంగబాబు (ఇకనైనా మారండి), బి.ఎస్.కె.కరీముల్లా (బేరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. ఇంద్రగంటి నరసింహమూర్తి (మార్పు రావాలి), సింహప్రసాద్ (సామాజిక నేరం), ఎం.వెంకటేశ్వరావు (అమూల్య)లు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అతిథులు, నిర్వాహకులు విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పాపినేని శివశంకర్, సీహెచ్.సుశీలమ్మ, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోటకూర వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారులకు అండగా ధూళిపాళ్ల

ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదిన వేడుకల్లో తెదేపా నాయకులు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తూ అండగా నిలుస్తున్నారని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయం, నిర్మల్ హృదయ్‌లో ఆదివారం జరిగిన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. నాయకులు కంచర్ల శివరామయ్య, కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ రాజామాస్టారు, హసన్ బాషా, వడ్రాణం హరిబాబు, సుఖవాసి శ్రీనివాసరావు, బొల్లెద్దు సుశీలరావు పాల్గొన్నారు.

## తెలుగు జయకేతనం బాపు

వర ముళ్లపూడికి పురస్కారం అందిస్తున్న ఎస్ఎస్‌వీ రమణ తదితరులు

అరసవల్లి గిరిధర్


హరి వెంకటరమణ

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** చలనచిత్రాలు, కార్టూన్ల ద్వారా తెలుగు భాషా సంస్కృతులకు విశేష ప్రాచుర్యం కలిగించిన మహనీయుడు బాపు తెలుగు జాతి జయకేతనం లాంటివారని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. గుంటూరు భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో బాపు-రమణ-బాలు కళాపీఠం, మల్లెతీగ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా బాపు స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా ప్రశంసిస్తున్నామంటే అది బాపు చిత్రాలకున్న గొప్పతనమన్నారు. తెలుగువారు ఉన్నంతకాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయన్నారు. తెలుగు అమ్మ ఒడి భాష కావాలన్నారు. సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ బాపు సినిమాల్లోని కొన్ని ముఖ్య సన్నివేశాలు, పాటల్ని గుర్తు చేసి సభాసదులను అలరించారు. గుంటూరు సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ బాపు ప్రతిభను తెలిపే విషయాలను వివరించారు. తొలుత మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ అతిథులను సభకు పరిచయం చేశారు. సభలో సుప్రసిద్ధ సినీ దర్శకుడు వర ముళ్లపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణలకు బాపు స్మారక పురస్కారాలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తదితరులు ప్రదానం చేశారు. అనంతరం పురస్కార గ్రహీతలు బాపుతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.


శ్రద్ధాంజలి

మా మార్గదర్శి, మా ఇంటి పెద్దలు, మా కంటి వెలుగు
శ్రీ వెల్లంకి లక్ష్మీ నారాయణరావు గారు
ది. 13-12-2025 ఉదయం 11.00 గం॥లకు పరమపదించినారు.

అంతిమయాత్ర: ది. 15-12-2025 సోమవారం ఉదయం 9.00 గం॥లకు నవభారత్‌నగర్, 2వ లైనులోని మా స్వగృహము నుండి బయలుదేరును. కావున తెలియజేయటమైనది.

కీ॥శే॥ శ్రీ వెల్లంకి లక్ష్మీ నారాయణరావు గారు
Retd Addl. Supdt. of Police, గుంటూరు
జననం: 17-11-1928, మరణం: 13-12-2025

ఇట్లు: కుటుంబ సభ్యులు సెల్: 98844 38517


## త్రికోటేశ్వర ఫాం ల్యాండ్ వెంచర్ ప్రారంభం

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** మండలంలో కోటప్పకొండ నుంచి గోనెపూడి వెళ్లే మార్గంలో చుట్టూ పచ్చదనంతో నిండిన ఎత్తైన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రికోటేశ్వర ఫాంల్యాండ్ వెంచర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటప్పకొండ గతం కన్నా ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో మంచి వాతావరణంలో వెంచర్ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. సుందరమైన ఇళ్ల నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్‌పార్క్, స్విమ్మింగ్‌పూల్, పది రకాలైన ఆర్గానిక్ మొక్కల పెంపకం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచుమర్తి భూపతిరావు, నాగసుశీల, మల్లెం సుభాష్, బండి చంద్ర పాల్గొన్నారు.

ప్రారంభ కార్యక్రమంలో చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తదితరులు

## విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

శిలాఫలకం వద్ద కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, వైవీ ఆంజనేయులు

**తాడికొండ, న్యూస్‌టుడే:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 'చలపతి హిల్ వ్యూ స్టేడియం'ను ఆదివారం ఆయన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో క్రీడాకారులకు 3 శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. కళాశాల కార్యదర్శి వై. సుజిత్‌కుమార్, డైరెక్టర్ వినయ్‌కుమార్, రాష్ట్ర ఖాదీ విలేజ్ బోర్డు డైరెక్టర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు, అడ్మిషన్ డీన్, డాక్టర్ కె.కిరణ్‌కుమార్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యార్థుల పల్లెబాట

గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

**గుంటూరు రూరల్:** ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పల్లెబాట పట్టారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మార్పు సాంకేతిక విధానాల అమలుతోనే సాధ్యమవుతుందని విద్యార్థులు వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, బొర్రవారిపాలెం గ్రామాల్లో రెండో రోజు కార్యక్రమాలు నిర్వహించారు. పశుపోషణ, వ్యవసాయ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణ ద్వారా నిర్వహణ సులువు కావడమే కాకుండా వ్యయం తగ్గుతుందని వివరించారు.

## సమస్యల పరిష్కారానికి పౌర నిఘా అవసరం

మాట్లాడుతున్న నారాయణరెడ్డి

**గుంటూరునగరం, న్యూస్‌టుడే:** గుంటూరు నగరం ఎదుర్కొంటున్న తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి పౌర సంస్థలతో కూడిన నిఘా అవసరమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోషియేషన్ హాలులో రేట్ పేయర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో రక్షిత మంచినీటి సరఫరాలో నెలకొన్న లోపాల కారణంగా ప్రజలు మృత్యువాత పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని, ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళగిరి వరకు కొంతమేర ఉన్న ఓపెన్ ఛానల్ వల్ల నీరు వ్యర్థాలతో కలుషితమవుతుందన్నారు. వెంటనే వీటికి ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలన్నారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 80 శాతానికి పైగా జబ్బులు కలుషిత నీరు వల్ల సంభవిస్తున్నాయన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పరుచూరి పరంధామయ్య, అధ్యక్షులుగా ఓరుగంటి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా రామ్‌కుమార్, సురేష్‌బాబు, వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాఘవరావు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా మరో 34 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జలీల్ అహ్మద్, పి.రమేష్, శివరామిరెడ్డి, భారవి, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవా సంస్థల కృషి అభినందనీయం

**పట్నంబజారు, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** సమాజాభివృద్ధికి మానవతా సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాతగుంటూరులోని హిందూ శ్మశానవాటికకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, జాయ్ ఎన్ జాయ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మార్చురీ ఏసీ బాక్స్‌ను అందించారు. కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మార్చురీ ఏసీ బాక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

## కిరాణా రిటైల్ మర్చంట్స్ సంఘ కార్యవర్గం ఎన్నిక

గణేష్ చంద్రకుమార్

**పట్నంబజారు:** ది గుంటూరు కిరాణా రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పోలేపల్లి గణేష్ చంద్రకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా పోలేపల్లి గణేష్ చంద్రకుమార్ 5వసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గ్రంథె సుబ్బారావు, కార్యదర్శిగా బొలిశెట్టి వెంకట నాగరాఘవేంద్ర, సహాయ కార్యదర్శులుగా వట్లూరి శ్రీనివాసరావు (ఎంటీఆర్), వాగిచర్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా చేవూరి కోటయ్య (నాని) ఎన్నికయ్యారు.

## ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ చట్టం అమలు

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఎస్పీ వకుల్ జిందాల్ సిఫారసుతో జిల్లాలోని ఇద్దరు రౌడీషీటర్లపై పీడీ చట్టం అమలు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సుందరయ్య కాలనీకి చెందిన షేక్ బాజీ అలియాస్ సిరిపురం బాజీ (42)పై నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఎ కేటగిరి రౌడీషీట్ ఉంది. ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రామిరెడ్డితోటకు చెందిన షేక్ సమీర్ అలియాస్ ఫైజల్ (19) అతనిపై కొత్తపేట పోలీసుస్టేషన్‌లో ఎ-ప్లస్ రౌడీషీట్ ఉంది. రెండు హత్యలతో సహా పది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇద్దరు రౌడీషీటర్లు జైలుకు వెళ్లి వచ్చినా వారిలో ఎటువంటి మార్పురాలేదని, పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా పద్ధతి మార్చుకోలేదు. తీవ్రమైన నేరాల్లో పాల్గొంటూ ప్రజాశాంతికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో వారిపై పీడీ చట్టం నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇద్దరు రౌడీషీటర్లను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో రౌడీషీటర్లు, సస్పెక్ట్, హిస్టరీ షీట్ ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో ॥కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.


### ప్రకటన

మా క్లయింట్ గుంటూరు, బ్రాడీపేట కాపురస్తులు అయిన జితేంద్రకుమార్, కవిత కుమారి, సీమజైన్ వారల నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా... ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ రామినేని చిన సుందరామయ్య S/o. వెంకయ్య అనువారు ది. 12-2-1980వ తేదీన శ్రీమతి ముప్వా శేషగిరమ్మ గార్ల ద్వారా విక్రయం పొంది వారికి మాత్రమే సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగినట్టు ఆస్తి అనియు సదరు రామినేని చిన సుందర రామయ్య గారు ది. 30-6-1993వ తేదిన నిగంటువుగా మరణించుట వలన తదుపరి వారి భార్య అయినటువంటి శ్రీమతి రామినేని సీతారావమ్మ గారు కూడా ది.13-02-2010 వ తేదీన మరణించినారని వారలకు ఏకైక వారసుడు అయినటువంటి వారి కుమారుడు శ్రీ రామినేని మల్లేశ్వర ప్రసాదు గారు మాత్రమే ముఖ్య వారసుడు అని వారి తల్లిదండ్రుల అనంతరం వారలకు మాత్రమే సదరు ఆస్తిపై పూర్తి హక్కు ఉన్నదని చెప్పి సదరు ఆస్తిని అమ్మ జూపగా సరియైన క్రయ ధనము చెల్లించి కొనుగోలు చేయుటకు మాక్లయింటు కొనుగోలు చేయుటకు సంసిద్ధులైన చేత సదరు ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కు భుక్తములు గాని, కోర్టు వారిచే జారీ చేయబడిన ఏమైనా ఆర్డర్లు గాని, మరి ఎవరికైనను షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టి క్లెయిములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 5 దినముల లోపల లిఖితపూర్వకంగా ఈ దిగువ చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరటమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥ గుంటూరు సబ్॥డి॥ చంద్రమౌళినగర్ మెయిన్‌రోడ్డు లోకాలిటికి చెందిన గుంటూరు గ్రామం డినెం:5/1 నెంబరు తాలుకు డోర్ నెం: 5-87-52; అసెస్‌మెంట్ నెం: 1021020343 నందు గల చ॥గ॥ 335-1/9ల స్థలము అందుగల డాబా రేకుల పంజ గల ఆస్తికి హద్దులు. తూర్పు: కురిచేటి పరదయ్య గారి ఆస్తి హద్దు - 104.6 Ft; దక్షిణం: మునిసిపల్ రోడ్డు హద్దు - 29.9 Ft; పడమర: త్రయంబకం గారి ఆస్తి హద్దు - 103.6 Ft; ఉత్తరం: ముప్వా వెంకటరావు వగైరాల ఆస్తి హద్దు - 28.3 Ft

ఇట్లు: C.నరేంద్రబాబు, అడ్వకేట్, 5వలైను బృందావన్‌గార్డెన్స్, గుంటూరు Ph: 92464 85115.

### బహిరంగ పత్రిక ప్రకటన

నాక్లయింట్ శ్రీ సంభవనాద్ జైన్ స్వేతాంబర్ ట్రస్టువారి నుంచి సంజాయిషి పొంది యావన్మంది ప్రజలకు తెలియజేయుటమేమనగా నాక్లయింట్ శ్రీ సంభవనాద్ జైన్‌స్వేతాంబర్ ట్రస్టు గుంటూరు సిటి 2/7 బ్రాడీపేట డోర్ నెం: 5-8-1 మాడభూషి దివాకర్‌బాబు గారి కుమారుడు మాడభూషి చైతన్య గారి తన నాయనమ్మ శ్రీమతి మాడభూషి అండాలమ్మ గారు ది: 19.6.2008 గారి ద్వారా రిజిస్టర్ గిఫ్ట్ డీడ్ నెం. 4130/2008 గుంటూరు రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నమోదు కాబడినది. మాడభూషి చైతన్య గారి నుంచి నాక్లయింట్ దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయతలచుకున్నారు కావున యావన్మందికి తెలియచేయుట మేమనగా సదరు ఆస్తిపై ఎటువంటి రుణాలు, బకాయిలు తనఖా రుణాలు, బ్యాంకు రుణాలు ఇతర ప్రోనోట్ రుణాలు ఇతరత్ర వగైరాలు ఉన్న యెడల 10 రోజులలోపు ఈ క్రింది తెలిపిన అడ్రస్‌కు లేదా సెల్ నెంకు మీ అభ్యంతరాలను తెలియచేయగలరు. నాక్లయింట్ సదరు ఆస్తిని కొనుగోలు చేసుకుంటాడు 10 రోజుల తరువాత ఏ వివాదాలు తెలియచేసిన అవి నాక్లయింట్‌ను బందింపజాలవు. నాక్లయింట్ ఎటువంటి బాధ్యత లేదు.

షెడ్యూలు: గుంటూరు డి॥ గుంటూరు సబ్॥డి॥ గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ యేరియాలో చేరిన గుంటూరు సిటీ, 2/7 బ్రాడీపేటలోని గుంటూరు మున్సిపల్ పాత వార్డు నెం. 2రు, బ్లాకు నెం. 8రు, టౌన్ సర్వే నెం.560రు మింజుమలె నాకు హక్కు కలిగి నీకు దఖలు పరచిన ఆస్తికి హద్దులు. తూర్పు: పాములపాటి సాంబిరెడ్డి గారికి, ఈ ఆస్తికి మధ్య ఈ ఆస్తి తాలూకు ప్రహరీ గోడ హద్దు. అ.34.అం.0లు. దక్షిణం: కందాళం శ్రీనివాస రాఘవన్ గారి ప్రహరీ గోడ హద్దు. అ.77.అం.0లు. పడమర: బ్రాడీపేట 7వ అడ్డ రోడ్డు హద్దు. అ.32.అం.0లు. ఉత్తరం: నారా ఆషాలత గారి ఆస్తికి ఈ ఆస్తికి మధ్య గల జాయింటు ప్రహరీ గోడ హద్దు. అ.78.అం.0 లు. ఈ హద్దుల మధ్యన గల చ.గ. 284 లు లేక చ.మీ. 237.45ల్లు నివేశన స్థలమున్నూ.

ఇట్లు, ముప్పాళ్ళ సత్యసాయిబాబు, అడ్వకేట్, గుంటూరు. సెల్ నెం: 93941 14442.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. [illegible] ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ [illegible] Ph: 8142232071.

SAREES

[illegible] ✆ 81251 68645.

MARRIAGE SERVICES

కాపు, 29Y, 5'.4" [illegible] కాపు 29Y, 5'.11" [illegible] ✆ 98499 70373.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

23 లక్షలతో రాజధాని అమరావతి [illegible] 2BHK ఫ్లాట్స్ [illegible] 89196 28403.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు [illegible] ✆ 83098 12757, 88861 12399

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar Guntur. Good opertunity for Freshers/Experienced. Whatsapp: 91007 87054.

Karthikeya Infraces [illegible] జీతం 12,000 -30,000 [illegible] Age 18-20 Yrs. ✆ 88861 12399, 88862 12399.

30-65Yrs [illegible] ✆ 90524 70111

గుంటూరులోని [illegible] 99920 82456.

రాయల్ [illegible] Contact: 99891 28328.

గుంటూరు మార్కెట్ [illegible] ✆ 9248733372.

గుంటూరు మార్కెట్ [illegible] ✆ 8978480429.

గుంటూరులోని ప్రముఖ [illegible] ✆ 83310 33743.

గవర్నమెంట్ హాస్పిటల్ [illegible] 9908780954.

శ్రీనిధి [illegible] 9247424587.

మా రియల్ ఎస్టేట్ [illegible] ✆ 9502822335

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వంట మనిషి కావలెను: గుంటూరు [illegible] ✆ 9398991579.

గుంటూరు, ఆటోనగర్, HP పెట్రోల్ బంక్‌లో [illegible] PT/FT. 77996 89889, 80745 46302.

గమనిక

[illegible]

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

# గుంటూరు తూర్పు

ప్రమాణస్వీకార మహోత్సవ
శుభాకాంక్షలు

మా మిత్రులు, శ్రేయోభిలాషులు, మంచి మనిషి, నిగర్వి
శ్రీ తిరివీధి వెంకట రమణయ్య గారు
ఎల్.వి.ఆర్ సన్స్‌క్లబ్ & రీడింగ్ రూమ్, గుంటూరు.
పాలకవర్గ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికై నేడు ప్రమాణస్వీకారం చేయుచున్న శుభసందర్భంగా వారికి ఇవే
మా హృదయ పూర్వక శుభాకాంక్షలు ....
వారు ముమ్ముందు మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని మనసారా కోరుకుంటూ....

| | |
|---|---|
| ఏలూరి సూర్యనారాయణ<br>ఆర్య సమాజము | పులివర్తి శ్రీనివాస్<br>సీనియర్ అడ్వకేట్ & జర్నలిస్ట్ |
| దారపనేని మాధవరావు | పెనిగండ్ల రమేష్<br>(రైల్వే) టి.డి.పి. |
| దారపనేని చెన్నకేశవులు | దుద్దుకూరి వెంకటేశ్వర్లు |
| తిరివీధి చెన్నకేశవులు<br>సమర | తిరివీధి చెన్నగిరిరావు<br>హోటల్ శంకర్ విలాస్ |
| ధనేకుల రామకృష్ణ<br>రాంబాబు | పోలినేని నరసింహారావు<br>హోటల్ హసిని ఇన్ |
| రావి శ్రీనివాసరావు<br>డాన్ | మేడసాని కేశవులు |
| పతకమూరి మల్లికార్జునరావు<br>మనోజ్ ట్రేడర్స్ | కూండ్ల కృష్ణమూర్తి |
| ఓరుగంటి అంకయ్య | రామినేని సురేష్ |
| కూండ్ల మాల కొండయ్య | చుండి సుబ్బారావు |
| కల్లూరి రమణయ్య<br>సైకిల్ షాప్ | పాములపాటి హరికృష్ణ ప్రసాద్ |

ఆత్మీయ మిత్రమండలి - డొంకరోడ్డు.
శ్రీ వేంగమాంబ సేవా సమితి -గుంటూరు.

## మెకానిక్‌లు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

**నగరపాలకసంస్థ:** మెకానిక్‌లు వృత్తిపరమైన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఆదివారం నగరంలో టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 21వ వార్షికోత్సవం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షులు చుక్కపల్లి రమేష్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని త్వరలో ఆటోనగర్‌లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## పేదల్ని ఆదుకునేందుకు ముందుకురావాలి

**పట్నంబజారు:** పేదల్ని ఆదుకొనేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం 100 మంది వృద్ధులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఎస్.వి.రమణ, పోలేపల్లి వెంకట సుబ్రమణ్యం, పలకలూరి శివరావు, ఎ.పాండుసాయి, పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు పంపిణీ చేస్తూ..

## కుసుమకుమారిదేవి మాతాజీకి భోగిఫల సమర్పణ

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** జిన్నాటవర్ సెంటర్‌లోని శ్రీ కుసుమహరనాథ మందిరంలో ఆదివారం కుసుమకుమారిదేవి 155వ జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు మాతాజీకి భోగిఫల సమర్పణ చేశారు. అనంతరం 33వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ కేక్ కోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహా నివేదన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

## ముగిసిన అయ్యప్పస్వామి పడిపూజ వేడుకలు

**పట్నంబజారు:** ఏలూరుబజారులోని శ్రీరామ మందిరం వద్ద శ్రీవాసవి మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ అయ్యప్ప పడిపూజ వేడుకలు ఘనంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఉదయం 10గంటలకు నిర్వాహకులు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మణికంఠ, నాగవెంకట మల్లేశ్వరరావు, శివప్రసాద్, శ్రీనివాసరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న ఆలయం.. ఇక పూర్వ వైభవం

### రూ.1.33కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

న్యూస్‌టుడే, నెహ్రూనగర్ (గుంటూరు)

**ఆ**లయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెట్టపీట వేస్తోంది. నగరంలోని దేవాదాయశాఖకు చెందిన లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. సుమారు ఏడు దశాబ్దాల కిందట ఆలయ నిర్మాణం జరిగింది. 1965లో దేవాదాయశాఖ ఆధీనంలోకి వచ్చింది. స్వామివార్లకు కుడి, ఎడమ వైపు అమ్మవార్ల విగ్రహాలు కొలువుతీరాయి. ఆలయ అధికారుల పర్యవేక్షణలో వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం స్వామివార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్నారు. పర్వదినాలతోపాటు ధనుర్మాస సేవలు, ఏటా స్వామివార్ల కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

**వైకాపా హయాంలో అభివృద్ధికి నోచుకోక..**

స్వామివారి గర్భాలయంలో గోడలు, అంతరాలయం, మండపం వద్ద స్లాబు గోడలు పెచ్చులూడిపడేవి. ధ్వజస్తంభం కొంత పక్కకు ఒరిగింది. గత వైకాపా ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి పట్టించుకోకుండా గాలికి వదిలేసింది. తాత్కాలిక మరమ్మతులు చేయించి చేతులు దులిపేసుకుంది.

లాలాపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

**రూ.3.60 కోట్లతో..**

ప్రస్తుత ఆలయ ఈవో, సహాయ కమిషర్ టి.సుభద్ర ఆలయం పునర్నిర్మాణం చేయాల్సిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారులు, ఆశాఖ ఇంజనీరింగ్ అధికారులు నూతన ఆలయ నిర్మాణానికి రూ.3.60కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదించారు. ఇదే విషయాన్ని సహాయ కమిషర్ సుభద్ర స్థానిక ఎమ్మెల్యే నజీర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణానికి అనుమతులు జారీ చేశారు. ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.33 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన మొత్తం భక్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించి నిర్మాణం చేయాలని సూచించింది.

**త్వరలో పనులు ప్రారంభం**

ధ్వజస్తంభం నుంచి శ్రీవారి గర్భాలయం, అమ్మవార్ల అంతరాలయాలు, స్వామివార్ల ముందు మండపం తదితర ప్రాంతాల్లో ఆలయ పునః నిర్మాణానికి అధికారులు అనుమతులు జారీ చేశారు. మంచి రోజు చూసుకొని పనులు ప్రారంభిస్తాం. భక్తులు విరాళాలు అందించి ఆలయ నిర్మాణానికి సహకరించాలి. **- టి.సుభద్ర, సహాయ కమిషనర్**

## ఈవ్ టీజింగ్‌పై స్పెషల్ డ్రైవ్

ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోని విద్యా సంస్థలు, హాస్టళ్లు, షాపింగ్‌మాల్స్, సినిమాహాళ్లు, ఉద్యానవనాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రధాన కూడళ్లలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై అనవసరంగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న 332 మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆడపిల్లలు, మహిళలతో సమావేశాలు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు.

**పట్నంబజారు, న్యూస్‌టుడే:** మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తూర్పు విభాగం డీఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. బస్టాండు, గాంధీపార్కు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరించే 30 మంది యువకులకు ఆదివారం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

## ఏఎస్ఎల్‌పీఏ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

ఎన్నికైన నూతన కార్యవర్గం

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ఏపీ ఆడియాలజిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ (ఏపీఏఎస్ఎల్‌పీఏ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కొత్తపేట సంఘం కార్యాలయంలో కార్యవర్గం సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఆర్.శిరీష, కార్యదర్శిగా డాక్టర్ బి.ప్రకాశం, ట్రెజరర్‌గా డాక్టర్ సీహెచ్.సుజిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అనధికారంగా స్పీచ్‌థెరపీ సెంటర్లు నడుపుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉన్నవారు నిపుణులైన ఆడియాలజిస్ట్‌లను సంప్రదించి వారి పర్యవేక్షణలోనే వినికిడి యంత్రాలను వినియోగించాలని సూచించారు. సమావేశంలో సంఘ సభ్యులు లావణ్య, ఆర్.మోహన్‌కుమార్, బి.క్రిష్టోఫర్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

Jasper
TATA MOTORS
Connecting Aspirations
జాస్పర్ ఇండస్ట్రీస్
నూతన అవుట్‌లెట్ ప్రారంభోత్సవం
దిః 15-12-2025 సోమవారం
RTO ఆఫీస్ రోడ్, జయంతినగర్, గుంటూరు

www.jaspertata.com

ఎల్.వి.ఆర్. & సన్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్
కొరిటెపాడు, గుంటూరు
2025-2027 సం.కు గాను నూతన పాలకవర్గ పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవ ఆహ్వానము
సుదీర్ఘ ఘన చరిత్ర కలిగి, ఎన్నో సేవా కార్యక్రమాలు, ప్రోత్సాహాలు అందిస్తున్న
గుంటూరు ఎల్.వి.ఆర్ & సన్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్ ఎన్నికలలో మాపై ఎంతో నమ్మకంతో మమ్ములను ఏకగ్రీవంగా
ఎన్నుకున్న క్లబ్ సభ్యులకు మరియు మా విజయానికి సహకరించిన మా ఆప్తమిత్రలకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నూకవరపు వెంకటేశ్వరరావు (ఎన్.వి.ఆర్) - అధ్యక్షులు
జనార్ధనరావు పతంగి - ఉపాధ్యక్షులు
వక్కలగడ్డ రామక్రిష్ణ - కోశాధికారి
కొండ్రగుంట బుచ్చిబాబు - సంయుక్త కార్యదర్శి
యర్రమనేని రామకృష్ణ - కార్యదర్శి

కొమ్మినేని నాగేశ్వరరావు - టెన్నిస్
వట్టికూటి బాలాజీప్రసాద్ - బిలియర్డ్స్
నెల్లూరి రోశయ్య - బఫెట్
నాగిరెడ్డి వట్టిగుంట - ఇండోర్ గేమ్స్
పాలడుగు సుబ్బారావు - రీడింగ్ రూమ్, లైబ్రరీ
డా॥ చిట్టినేని శివకోటేశ్వరరావు - కళలు, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు
క్రిష్ణమనేని లలితబాబు - బార్

తిరివీధి వెంకట రమణయ్య - విశ్రాంతి గదులు
వజ్రాల సాంబిరెడ్డి - స్టోర్స్, హౌస్ కీపింగ్
కొలిపాకుల చంద్రశేఖర్ - జిమ్, సూపర్ బజార్
కూనిశెట్టి వెంకట రమణ ప్రసాద్ - వైద్యశాల
కుర్రా యేసుబాబు - సాంఘిక, సంక్షేమ, క్రీడా కార్యక్రమములు
బోనబోయిన సాంబయ్య - క్యారమ్స్, చెస్
నేడు ది.15-12-2025 సోమవారం ఉదయం 10 గం॥లకు మా నూతన పాలకవర్గము ప్రమాణ స్వీకారం జరుగును. కావున మా క్లబ్ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు విచ్చేసి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరుచున్నాము.

(c) eenadu

# తెలుగు జయకేతనం బాపు

వర ముళ్లపూడికి పురస్కారం అందిస్తున్న ఎస్ఎస్‌వీ రమణ తదితరులు



అరసవల్లి గిరిధర్

హరి వెంకటరమణ

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** చలనచిత్రాలు, కార్టూన్ల ద్వారా తెలుగు భాషా సంస్కృతులకు విశేష ప్రాచుర్యం కలిగించిన మహనీయుడు బాపు తెలుగు జాతి జయకేతనం లాంటివారని గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. గుంటూరు భారతీయ విద్యాభవన్‌లోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో బాపు-రమణ-బాలు కళాపీఠం, మల్లెతీగ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాపు జయంతి సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా బాపు స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ అందమైన స్త్రీని బాపు బొమ్మగా ప్రశంసిస్తున్నామంటే అది బాపు చిత్రాలకున్న గొప్పతనమన్నారు. తెలుగువారు ఉన్నంతకాలం బాపు సినిమాలు, చిత్రాలు, కార్టూన్లు సజీవంగా ఉంటాయన్నారు. తెలుగు అమ్మ ఒడి భాష కావాలన్నారు. సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ బాపు సినిమాల్లోని కొన్ని ముఖ్య సన్నివేశాలు, పాటల్ని గుర్తు చేసి సభాసదులను అలరించారు. గుంటూరు సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ బాపు ప్రతిభను తెలిపే విషయాలను వివరించారు. తొలుత మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ అతిథులను సభకు పరిచయం చేశారు. సభలో సుప్రసిద్ధ సినీ దర్శకుడు వర ముళ్లపూడి, చిత్రకారుడు అరసవల్లి గిరిధర్, కార్టూనిస్టు హరి వెంకటరమణలకు బాపు స్మారక పురస్కారాలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తదితరులు ప్రదానం చేశారు. అనంతరం పురస్కార గ్రహీతలు బాపుతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

## ఆశ్రిత పక్షపాతానికి తావివ్వనివాడే అసలైన నాయకుడు

**గుంటూరు సాంస్కృతికం:** పాలనలో ఆశ్రితపక్షపాతాలకు తావివ్వనివాడే అసలైన నాయకుడని సుప్రసిద్ధ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గుళ్లపల్లి సేవాసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపన్యాసలహరిలో ఆదివారం రాత్రి 'ఆముక్తమాల్యదలో రాజనీతి' అనే అంశంపై ప్రసంగించారు. ఆత్మ సిద్ధితో నిర్ణయాలు తీసుకోవడంలో రాజు ఎంతో సత్యనిష్ఠతో వ్యవహరించాలని ఆముక్తమాల్యద కావ్యం పేర్కొంటుందన్నారు. రాజనీతిజ్ఞతను శ్రీకృష్ణదేవరాయలు ఎంతగా ఆచరణలో చూపాడన్న విషయం కావ్యంలో కనిపిస్తుందన్నారు. తొలుత దేవాలయ పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గుళ్లపల్లి సేవా సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు, శ్రీలక్ష్మి, చైత్రన్, చిట్టినేని శివ కోటేశ్వరరావు, పారా అశోక్‌కుమార్, గూడవల్లి లక్ష్మీనారాయణ, పాలమమండలి ఉపాధ్యక్షుడు లంక విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత ఈసీజీతో బహుళ ప్రయోజనాలు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

**మంగళగిరి (ఏఎన్‌యూ), గుంటూరు నగరం, న్యూస్‌టుడే:** ఏఐ ఆధారిత ఈసీజీ వల్ల గుండె సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశముందని ప్రముఖ గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ బాబు చెప్పారు. ఆదివారం తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 'హార్ట్ ఇన్ ద క్యూర్, మేనేజింగ్ కార్డియాక్ రిస్క్స్ ఇన్ నాన్ కార్డియాక్ సర్జరీస్‌పై హై ఇంపాక్ట్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఏటా సుమారు 3 నుంచి 4 కోట్ల వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఇందులో దాదాపు 95 శాతం గుండెకు సంబంధం లేనివే జరుగుతున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. శస్త్రచికిత్స సమయంలో వచ్చే గుండెపోటు వల్ల 15.6 శాతం మరణాలు నమోదవుతున్నాయన్నారు. గుండె వ్యాధులున్న రోగులు, ఇతర వ్యాధులున్న వ్యక్తులు, రక్తాన్ని పలుచగా చేసే మందులు వినియోగించే వాళ్లకు శస్త్ర చికిత్సలు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. సర్జరీల సమయంలో గుండె, నాడీ వ్యవస్థ స్థిరంగా లేకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే అవకాశముందన్నారు. 'ఆధునిక కార్డియాక్ రిస్క్ అసెస్మెంట్ టెక్నాలజీ' ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని రమేష్‌బాబు వివరించారు. ప్రతి శస్త్రచికిత్సలో కార్డియాలజిస్ట్, అనస్తీషియా, ఇంటెన్సివిస్ట్, గుండె శస్త్రచికిత్స నిపుణులు, సంబంధిత వ్యాధి శస్త్ర చికిత్స నిపుణులు ఒక బృందంగా పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

# ఏఎస్ఎల్‌పీఏ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** ఏపీ ఆడియాలజిస్ట్, స్పీచ్ లాంగ్వేజ్ పెథాలజిస్ట్ అసోసియేషన్ (ఏపీఏఎస్ఎల్‌పీఏ) నూతన కార్యవర్గం ఏర్పాటైంది. కొత్తపేట సంఘం కార్యాలయంలో కార్యవర్గం సమావేశం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా డాక్టర్ ఆర్.శిరీష, కార్యదర్శిగా డాక్టర్ బి.ప్రకాశం, ట్రెజరర్‌గా డాక్టర్ సీహెచ్.సుజిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అనధికారంగా స్పీచ్‌థెరపీ సెంటర్లు నడుపుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉన్నవారు నిపుణులైన ఆడియాలజిస్ట్‌లను సంప్రదించి వారి పర్యవేక్షణలోనే వినికిడి యంత్రాలను వినియోగించాలని సూచించారు. సమావేంలో సంఘ సభ్యులు లావణ్య, ఆర్.మోహన్‌కుమార్, బి.క్రిష్టోఫర్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక సంబరాలు

గుంటూరు ఐఎంఏ హాల్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ గుంటూరు శాఖ పదో వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.సౌజన్య, సాత్విక్, ఆదిత్య, కె.రోహిత్, రామచంద్ర, సుబ్బానాయుడు, సాయి శంకర్ పలువురు దంత వైద్యులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గుంటూరు నగరం

# పాల ఉత్పత్తిదారులకు అండగా ధూళిపాళ్ల

నరేంద్రకుమార్ జన్మదిన వేడుకల్లో నాయకులు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తూ అండగా నిలుస్తున్నారని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయం, నిర్మల్ హృదయ్ ఎల్ ఆదివారం జరిగిన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కోశారు. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ నరేంద్ర సంగం డెయిరీని రూ.2000 కోట్లు టర్నోవర్‌కు చేర్చారన్నారు. నాయకులు కంచర్ల శివరామయ్య, కనుకర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ☛ జేకేసీ కళాశాల రోడ్డులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ ఛైర్మన్ దాసరి రాజా మాస్టారు, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు, నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు నరేంద్ర జన్మదిన కేకు కోశారు. కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా నరేంద్ర అండగా ఉంటారని వారు పేర్కొన్నారు.






# సాహిత్యానికి మానవతా విలువలు జోడించాలి

విజేతలతో అతిథులు, నిర్వాహకులు

**గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** సమస్యలకు సాహిత్యం పరిష్కారం చూపుతుందని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ధార్మిక ప్రాంగణంలో సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ ఆదివారం జరిగింది. రమ్యభారతి సాహిత్య పత్రిక వ్యవస్థాపకుడు చలపాక ప్రకాష్, రచయితల సంఘం సభ్యుడు శ్రీవశిష్ఠల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలో మానవతా విలువలు ఉండాలన్నారు. సభకు రమ్యభారతి సాహిత్య పత్రిక నిర్వాహకుడు వేమూరి హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు సి.భవానీదేవి, ప్రముఖ కవులు శ్రీకంఠస్ఫూర్తి తెలుగు జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా కథల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. రచయితలు సింగరాజు శ్రీనివాసరావు (గెలుపు కథ), జి.రంగబాబు (జన్మనా మారండి), బి.ఎస్.కె.కోటేశ్వరరావు (వేరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా.. ఇంద్రగంటి నరసింహమూర్తి (మార్పు రావాలి), సింహప్రసాద్ (సామాజిక నేరం), ఎం.వెంకటేశ్వరావు (అమూల్య)లు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అతిథులు, నిర్వాహకులు విజేతలను సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పాపినేని శివశంకర్, సీహెచ్.సుశీలమ్మ, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, తోటకూర వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తగా ఎన్నికైన వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం కార్యవర్గం

**జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు అన్నారు. నగరంలోని కృషి భవన్‌లో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. వేణుమాధవరావు మాట్లాడుతూ ఏఈవోలకు జాబ్ చార్ట్ ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఏఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, కోశాధికారి సుభాని, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సురేష్ గోపి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఏఈవోల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ☛ జిల్లా అధ్యక్షుడిగా ఆలా రమేష్‌బాబు, కార్యదర్శి ఎన్.ప్రసాద్ బాబు, కోశాధికారి ఎం.ఎన్.కృష్ణారావు, సహాధ్యక్షుడు ఐ.శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పి.రవికుమార్, ఆర్.వెంకయ్య, వీరంకి గోపి, కార్యనిర్వాహక కార్యదర్శి శివరావు, ప్రచార కార్యదర్శి కె.రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శులు ఐ.జ్యోత్స్న, పి.రాజేంద్రప్రసాద్, బి.సౌజన్య, కార్యవర్గ సభ్యులుగా దేవ సమర్పణరావు, ఆదిలక్ష్మి, మురళి ఎన్నికయ్యారు.






# 'వైకాపా హయాంలో ఏం చేశారో చెప్పండి'

**గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే:** కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కూటమి ప్రభుత్వంపై మాట్లాడే అర్హత మాజీ మంత్రి అంబటి రాంబాబుకు లేదని ఏపీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ మల్లె ఈశ్వర్‌రావు అన్నారు. హౌసింగ్ బోర్డులోని ఏపీ వడ్డెర కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో ప్రజలు ట్రాఫిక్ సమస్యల వల్ల ఇబ్బంది పడుతున్నారని, శంకర్‌విలాస్ వంతెన వెడల్పు చేస్తే సమస్యలు తగ్గుతాయని పైవంతెన నిర్మాణం చేపట్టారన్నారు. పనులు చక్కగా సాగుతున్నాయని, దాన్ని చూసి ఓర్వలేక బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పెమ్మసానిపై లేనిపోనివి మాట్లాడడం తగదన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు.

# గిరిజన ప్రజాచైతన్య యాత్ర విజయవంతం చేయాలి

**ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే:** గిరిజన ప్రజా చైతన్య యాత్రను విజయవంతం చేయాలని, గిరిజన ప్రజా, విద్యార్థి సమాఖ్యల వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో గిరిజన ప్రజా చైతన్య యాత్ర గోడపత్రికలు, కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. మైదాన ప్రాంత గిరిజనుల రాజకీయ రిజర్వేషన్ల సాధనకు అన్ని జిల్లాల్లో గిరిజన ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హక్కుల సాధనకు ఈనెల 28న అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు దుర్గానాయక్, న్యాయ సలహాదారు అంజినాయక్, నాయకులు, కల్యాణ్, భాస్కర్, సతీష్ నాగరాజు పాల్గొన్నారు.

# త్రికోటేశ్వర ఫాం ల్యాండ్ వెంచర్ ప్రారంభం

ప్రారంభ కార్యక్రమంలో చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తదితరులు

**నరసరావుపేట:** మండలంలో కోటప్పకొండ నుంచి గోనెపూడి వెళ్లే మార్గంలో చుట్టూ పచ్చదనంతో నిండిన ఎత్తైన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రికోటేశ్వర ఫాంల్యాండ్ వెంచర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటప్పకొండ గతం కన్నా ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. పంచుమర్తి భూపతిరావు, నాగసుశీల, సుభాష్ పాల్గొన్నారు.

## ఎస్ఐపై దాడి.. ముగ్గురిపై కేసు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** ఎస్ఐపై దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఏడుకొండలు 12వ తేదీ రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా శ్రీనగర్ అయిదో లైనులో సేల్స్ టాక్స్ కార్యాలయ అటెండర్ రెడ్డి రాజు, మల్లె బోయిన కిరణ్, గండికోట అక్కేశ్వరరావులు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ కేకలు వేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ఎస్ఐ ఏడుకొండలు వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దాడి చేసి గాయపర్చారు. ఎస్ఐ ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# క్రెడాయ్ ప్రాపర్టీ షో విజయవంతం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

**నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే:** క్రెడాయ్ మూడు రోజులుగా నిర్వహించిన ప్రాపర్టీ షో విజయవంతం కావడం ఆనందదాయకమని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. సిద్ధార్థ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న క్రెడాయ్ 8వ ప్రాపర్టీ షో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వేలాది మంది ప్రజలు, వినియోగదారులు ఈ కార్యక్రమానికి వచ్చి స్థిరాస్తి వ్యవహారాలపై అవగాహన పొందారన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, కెనరా బ్యాంక్, ఐసీఐసీఐ, గుంటూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల ఉన్నతాధికారులను క్రెడాయ్ సంస్థ నాయకులు ఆళ్ల శివారెడ్డి, ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, మామిడి రాము, మెట్టు సాంబిశివరెడ్డి, ఏవీ నాగార్జునరెడ్డి, తియ్యగూర వినోదరెడ్డిలు శాలువాలతో సత్కరించారు. ఆదివారం 10 లక్కీ బంపర్ డ్రాలు నిర్వహించి గెలుపొందిన వారికి వెంటనే బహుమతులు అందజేశారు. వేల పూల మొక్కలను వినియోగదారులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

శిలాఫలకం వద్ద కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, వైవీ ఆంజనేయులు

**తాడికొండ, న్యూస్‌టుడే:** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 'చలపతి హిల్ వ్యూ స్టేడియం'ను ఆదివారం ఆయన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో క్రీడాకారులకు 3 శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. కళాశాల కార్యదర్శి వై. సుజిత్‌కుమార్, డైరెక్టర్ వినయ్‌కుమార్, రాష్ట్ర ఖాదీ విలేజ్ బోర్డు డైరెక్టర్ సాంబశివరావు, ప్రిన్సిపల్ నాగ శ్రీనివాసరావు, అడ్మిషన్ డీన్, డాక్టర్ కె.కిరణ్‌కుమార్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

**వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
**కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
**అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

# సాంకేతిక విద్యార్థుల పల్లెబాట

గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

**గుంటూరు రూరల్, న్యూస్‌టుడే:** ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పల్లెబాట పట్టారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మార్పు సాంకేతిక విధానాల అమలుతోనే సాధ్యమవుతుందని విద్యార్థులు వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వారం పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, బొర్రావారిపాలెం గ్రామాల్లో రెండో రోజు కార్యక్రమాలు నిర్వహించారు. పశుపోషణ, వ్యవసాయ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణ ద్వారా నిర్వహణ సులువు కావడమే కాకుండా వ్యయం తగ్గుతుందని వివరించారు.


## ప్రకటన

మా క్లయింట్ గుంటూరు, బ్రాడీపేట కాపురస్తులు అయిన జితేంద్రకుమార్, కవిత కుమారి, సీమజైన్ వారల నుండి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా... ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ రామినేని చిన సుందరామయ్య S/o. వెంకయ్య అనువారు ది. 12-2-1980వ తేదీన శ్రీమతి ముప్పా శేషగిరమ్మ గార్ల ద్వారా విక్రయం పొంది వారికి మాత్రమే సర్వ సంపూర్ణ హక్కు భుకములు [illegible] ... 10 రోజులలోపు [illegible] ... అట్లు: C.నరేంద్రబాబు, అడ్వకేట్, ... బృందావన్ గార్డెన్స్, గుంటూరు. Ph. 92464 85115.

## బహిరంగ పత్రికా ప్రకటన

నాక్లయింట్ శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ ట్రస్టువారి నుంచి సంజాయిషీ పొంది యావన్మంది ప్రజలకు తెలియజేయుటమేమనగా నాక్లయింట్ శ్రీ సంభవనాథ్ జైన్‌శ్వేతాంబర్ ట్రస్టు గుంటూరు సిటీ 2/7 బ్రాడీపేట డోర్ నెం: 5-8-1 మాడభూషి దివాకర్ గారి కుమారుడు మాడభూషి చైతన్య గారి తన నాయనమ్మ ... గారు ది: 19.6.2008 గారి ద్వారా ... 4130/2008 గుంటూరు రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నమోదు కాబడినది. మాడభూషి చైతన్య గారి నుండి ... షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుచున్నాము. ... యావన్మందికి తెలియచేయునది ... ఎటువంటి రుణాలు, బకాయిలు ... రుణాలు ఇతర ప్రోనోట్ రుణాలు ... ఉన్నయెడల 10 రోజులలోపు ... సెల్ నెంకు మీ అభ్యంతరాలు తెలియచేయవలెను. సదరు ఆస్తిని కొనుగోలు చేసిన తరువాత ఏ వివాదాలు తెలిపినా అవి నాక్లయింటుకు బంధింపజాలవు. నాక్లయింట్ ...
షెడ్యూలు: గుంటూరు ... గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ... 2/7 బ్రాడీపేట ... 2రు, ... నాకు ... తూర్పు: ... ఆస్తి ... కందా ... అ.77 ... అ.32 ... మధ్య ... ఈ హద్దుల మధ్యన గల ... 237.45చ.గ విస్తీర్ణ స్థలమున్నూ.
ఇట్లు, ముప్పాళ్ల సత్యనారాయణ, అడ్వకేట్, గుంటూరు. సెల్ నెం: 93941 14442.



## EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనుటకు. [illegible] ✆ 87907 41166.

బంగారంపై బ్యాంకులో [illegible] Ph: 8142292071.

SAREES

పాతపట్టు చీరలు కొంటాం. [illegible] ✆ 81251 68645.

MARRIAGE SERVICES

కాపు, 29Y, 5'4" [illegible] ✆ 98499 70373.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

23 లక్షలకే [illegible] 2BHK ఫ్లాట్స్ [illegible] ✆ 89196 28403.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు మున్సిపాలిటీ [illegible] ✆ 83098 12757, 88861 12399

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar Guntur. Good opertunity for Freshers/Experienced. Whatsapp: 91007 87054.

Karthikeya Infraces [illegible] 12,000 -30,000 [illegible] Age 18-20 Yrs. ✆ 88861 12399, 88862 12399.

30-65Yrs [illegible] ✆ 90524 70111

గుంటూరులోని [illegible] ✆ 99920 82456.

రాయల్ ఎంటర్ప్రైజెస్ [illegible] Contact: 99891 28328.

గుంటూరు మాస్టర్ మైండ్స్ [illegible] ✆ 93389 99157.

గుంటూరు మాస్టర్ మైండ్స్ [illegible] ✆ 9248733372.

గుంటూరు మాస్టర్ మైండ్స్ [illegible] ✆ 8978480429.

గుంటూరులోని ప్రముఖ [illegible] ✆ 83310 33743.

గవర్నమెంట్ హాస్పిటల్ [illegible] 8885050664, 9908780954.

శ్రీనిధి ఎంటర్ ప్రైజెస్ [illegible] ✆ 9247424587.

మా రియల్ ఎస్టేట్ కంపెనీకి [illegible] ✆ 9502822335

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వంట మనిషి కావలెను గుంటూరు [illegible] ✆ 93389 91579.

గుంటూరు, ఆటోనగర్, HP [illegible] PT/FT. 77996 89889, 80745 46302.

గమనిక
[illegible]

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వడం
పూర్తి వివరాలకు సంప్రదించండి
8008510541

# గుంటూరు పశ్చిమ

## ఎల్వీఆర్ క్లబ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం నేడే

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** ఎల్వీఆర్ సన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం జరగనుంది. అధ్యక్షుడిగా నూకవరపు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా యర్రమనేని రామకృష్ణతో పాటు పలు పదవులు ఏకగ్రీవమయ్యాయి. కేవలం వైద్యశాల, క్యారమ్స్, చెస్ కార్యవర్గ సభ్యుల పదవులకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. కూనిశెట్టి వెంకటరమణ ప్రసాద్ వైద్యశాలకు కార్యవర్గ సభ్యుడిగా, బోనబోయిన సాంబయ్య క్యారమ్స్, చెస్‌కు కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నార్నె బాబూజీరావు వ్యవహరించారు.

వెంకటేశ్వరరావు, రామకృష్ణ

## ఆ రోడ్డులో వెళ్తే.. దుమ్ము కొట్టుకుపోవాల్సిందే..

వసంతరాయపురం మహాప్రస్థానం వెనుక రోడ్డులో వాహనం వెళ్తుంటే పరిస్థితిదీ..

**జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే:** నగరంలోని వసంతరాయపురం మహాప్రస్థానం శ్మశాన వాటిక వెనుక రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులతో పాటు స్థానికులు భయపడాల్సిందే. సిమెంటు రోడ్డు అధ్వానంగా తయారవడంతో.. కొత్తగా రోడ్డు వేసేందుకు దానిని తవ్వి సన్నటి కంకర పర్చారు. నెలలు గడుస్తున్నా పైన తారు వేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రాడీపేట నుంచి బొంగరాలబీడు, శారదాకాలనీ, రెడ్డిపాలెం వైపు వెళ్లే వాహనాలు ఈ మార్గంలో వస్తున్నాయి. ఏ వాహనం వెళ్లినా దుమ్ము లేస్తుండడంతో వెనుక వచ్చే వారి కళ్లలో పడి అసౌకర్యానికి గురవుతున్నారు. దుస్తులు కూడా దుమ్ము కొట్టుకుపోతున్నాయని అంటున్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో వాహనదారుల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. దుమ్ము, ధూళి లేచి రోడ్డు పక్కనున్న భవనాల గోడలకు, వరండా నుంచి ఇంటి లోపలికి వెళ్తుండడంతో నివాసం ఉంటున్నవారు వాటిని బాగు చేయించుకోలేక ఇక్కట్లు పడుతున్నామంటున్నారు. జీఎంసీ అధికారులు స్పందించి అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నారు.

## ఇంధన పొదుపు తప్పనిసరి

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న నజీనాబేగం

**జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే:** ప్రత్యామ్నాయ, పునర్వినియోగ ఇంధన వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ ఎం.డి.నజీనా బేగం అన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం, చలపతి ఫార్మసీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రీన్ ఇండియా ర్యాలీ నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి తారకరామనగర్ వరకు కొనసాగింది. నజీనాబేగం మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటడం, స్థిరమైన విధానాల ద్వారా ఇంధన పొదుపు పాటించాలని పేర్కొన్నారు. దీనివల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కేంద్రం జోనల్ సమన్వయకర్త రామకోటేశ్వరరావు, పర్యావరణ విద్య జిల్లా సమన్వయకర్త డి.తిరుపతిరెడ్డి, చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ రామారావు, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, వాలంటీర్లు, చలపతి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాజానికి విభిన్న ప్రతిభావంతులే స్ఫూర్తి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** విభిన్న ప్రతిభావంతులు సమాజానికి నిజమైన స్ఫూర్తి అని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. సక్షం ఆధ్వర్యంలో రెవెన్యూ కల్యాణ మండపంలో విభిన్న ప్రతిభావంతుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సమస్యలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా.. సమాజంలో ప్రత్యేక ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్న విభిన్న ప్రతిభావంతులు అందరికీ ఆదర్శప్రాయులన్నారు. సక్షం సంస్థ ద్వారా నియోజకవర్గానికి సంబంధించిన వివరాలను తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రతి అంశంలో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. సదరం ధ్రువపత్రాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయన్నారు. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని వివరించారు.

**పట్టాభిపురం:** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. క్యాంప్ కార్యాలయంలో 20వ డివిజన్ కమిటీ సభ్యులతో ఆదివారం ఆమె మాట్లాడుతూ 20వ డివిజన్‌లో రాబోయే రోజుల్లో తప్పకుండా విజయం సాధించాల్సిందేనని స్పష్టం చేశారు.

## అభివృద్ధి చేస్తుంటే.. విమర్శలా..!

మాట్లాడుతున్న శ్రీనివాసరావు, మ్యాని

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** శంకరవిలాస్ వంతెన అభివృద్ధిపై వైకాపా నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మద్దిరాల మ్యాని విమర్శించారు. శంకరవిలాస్ వంతెన పనుల్ని ఆదివారం వారు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ భీమినేని వందనాదేవి, కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, కొమ్మినేని కోటేశ్వరరావు, స్మిత పద్మజతో కలిసి పరిశీలించి మాట్లాడారు. 'కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆయనపై వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తున్నాం. పెమ్మసాని మంత్రి పదవి స్వీకరించగానే అయిదు రైల్వే వంతెనలకు నిధులు మంజూరు చేయించారు. పెమ్మసాని పేరెత్తే అర్హత అంబటికి లేదు. మంత్రి పదవి వెలగబెట్టిన అంబటి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి'.. అని డిమాండ్ చేశారు.

## దేవాలయాల ప్రగతికి ప్రాధాన్యం

**జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. శ్రీనివాసరావుపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో చేస్తున్న అభివృద్ధి పనులను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా భోజనశాలకు శంకుస్థాపన చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఆలయ కమిటీ సభ్యులు తోట రామకృష్ణ, తిరుమలశెట్టి భరత్‌కుమార్, తిరుమలశెట్టి ఎన్వీ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

## మదిలో దుర్గమ్మ.. ఇరుముడి తెస్తిమమ్మ

భవానీ దీక్షల విరమణ సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆదివారం కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భవానీలు తరలివచ్చి దుర్గమ్మకు ఇరుముడి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది వచ్చారని అధికారులు తెలిపారు. సోమవారం వేడుకలు ముగుస్తాయి. - ఈనాడు, అమరావతి

రాత్రి 11 గంటలయినా భక్తులతో కిటకిట

## సూక్ష్మ కళ.. రూపు భళా..

ఆవగింజలతో శివుడు

**ది**వ్యాంగుడైన అనకాపల్లి జిల్లా తుమ్మపాల గ్రామానికి చెందిన **బోదసింగి రవికుమార్** అనే సూక్ష్మ చిత్రకారుడు విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన చిత్రకళా సంతలో ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. తోటకూర, ఆవ, దోస గింజలు తదితరాలతో రూపొందించిన చిత్రాలు కనువిందు చేశాయి. ముఖ్యంగా భగవద్గీతలో 700 శ్లోకాలను 23,801 దోసగింజలను ఉపయోగించి ఒక్కో గింజపై ఒక్కో అక్షరం రాశారు. అంతేకాకుండా భగవద్గీతను అంగుళం సైజు పుస్తకంలో కూడా లిఖించారు. ఇవేకాకుండా పరమశివుడు, ఎన్టీఆర్, భారతదేశం, రైతు, సీఎం చంద్రబాబునాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు తదితర చిత్రాలను ఆవ, తోటకూర గింజలతో రూపొందించడం విశేషం. - **ఈనాడు, అమరావతి**

## రిటర్నబుల్ ప్లాట్ల ఈ- లాటరీకి వేళాయె..

**తుళ్లూరు:** రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో 9.14 ఎకరాల మెట్ట ద్వారా భూములు ఇచ్చిన రైతులకు, అనంతవరంలో ఎల్-17 రహదారిలో భూములు కోల్పోతున్న 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నం.18లో మినహాయింపు భూమి వల్ల ప్రభావితమైన ఇద్దరు రైతులకు, మల్కాపురంలో అనధికార లేఅవుట్ వల్ల ప్రభావితమై 65శాతం-35 శాతం కింద ఉన్న ఏడుగురు రైతులకు ఈ-లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ కార్యాలయం తెలిపింది. ★ కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు 1, 2 వెలగపూడి, మందడం 1, 2, నిడమర్రు 1, 2 గ్రామాల రైతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, పెనుమాక, తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2 వెంకటపాలెం, దొండపాడు, ఐనవోలు, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల రైతులకు మ.2 నుంచి 4 వరకు, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు సంబంధించిన ప్రత్యామ్నాయ ప్లాట్లకు సంబంధించి 4 నుంచి 5 గంటల వరకు లాటరీ నిర్వహించనున్నారు.

# ఊరుకుంటే ఆపద.. మేలుకుంటే ఆగదా!

☛ నిబంధనలు పాటించని దుకాణదారులు
☛ అగ్నిప్రమాదాలకు అదే మూలం

గుడివాడ, న్యూస్‌టుడే

**జి**ల్లాలో తరచూ వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతుండటం కలవరం రేపుతోంది. దుకాణ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోక పోవడమే ఈ ప్రమాదాలకు మూలం. ముఖ్యంగా దుకాణాలకు నో అబ్జక్షన్ (ఎన్‌వోసీ) తీసుకోవాలి. దీనికి గ్రామ, పట్టణ, జిల్లా అధికారుల నుంచి ఏ పరిధిలో అయితే అక్కడ సంబంధిత అధికారుల నుంచి సదరు భవనాలకు ప్లాన్ తీసుకోవాలి. దానిలో భాగంగా అధికారులు అగ్నిమాపక శాఖకు ఎన్‌వోసీ ఇమ్మని ఆదేశాలు ఇస్తారు. అగ్నిమాపక శాఖ భవనాలను పరిశీలించి ఎన్‌వోసీ జారీ చేస్తుంది. అయితే ప్రస్తుతం గ్రామ, పురపాలక, జిల్లా అధికారుల నుంచి సూచనలు, ఆదేశాలు రాక అగ్నిమాపక శాఖ తనిఖీలు చేపట్టడం లేదు.

దుకాణం వద్ద రోదిస్తున్న ప్రభు డిజైన్స్ నిర్వాహకులు

★ ముఖ్యంగా మోపిదేవిలో ఇటీవల ఓ హోటల్‌లో గ్యాస్ సిలిండర్ లీకై ప్రమాదం జరగ్గా.. అటుగా వెళుతున్న ఓ ఫైర్‌మెన్ దాన్ని ఆపేందుకు యత్నించారు. అక్కడ ప్రమాద నియంత్రణ పరికరం లేక పక్కనే ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుంచి తెచ్చి మంటలు అదుపు చేశారు. ★ గతంలో గుడివాడ పట్టణంలోని జీవీ మాల్‌లో భవనం పైన ఉన్న ఏసీ విద్యుత్తు తీగలు కాలిపోయి మంటలు రేగాయి. గుడివాడ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. లేదంటే పెను ప్రమాదం జరిగి ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టం జరిగేది. ★ కొద్ది రోజుల క్రితం వలివర్తిపాడు యూబీఐ బ్యాంకులో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. అలాగే ఆదివారం ప్రమాదం జరిగిన గుడివాడ అద్దేపల్లి కాంప్లెక్స్‌కు అగ్నిమాపక అనుమతులు లేవు. ఈ క్రమంలో సెల్‌ఫోన్ దుకాణంలో రేగిన మంటలు వ్యాపించి చెక్క గోడ వల్ల పక్కన గల 5 దుకాణాలు కాలిపోయాయి.

గుడివాడలో దుకాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

### ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

★ విద్యుత్తు వినియోగ సామర్థ్యం మించిన సామర్థ్యం గల విద్యుత్తు వైర్లను వాడాలి. అలాగే విద్యుత్తును ఓవర్‌లోడ్ చేయకూడదు. ఓవర్ లోడు నియంత్రణకు జాగ్రత్తలను తీసుకోవాలి. ★ దుకాణాలు మూయగానే బయట ఎంసీబీలు ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా ఆఫ్ చేయాలి. ★ అగ్ని ప్రమాద నివారణ స్టాకు మాత్రమే నిల్వ చేయాలి. దుకాణాలను చెక్కతో కాక ఇనుము లాంటి వాటితో పార్టిషన్ చేయించాలి. దుకాణాల్లో విద్యుత్తు బోర్డుల కింద, దీపారాధన చేసే చోట వెంటనే మండే స్వభావం గల ప్లాస్టిక్, పేపర్లను ఉంచరాదు. ★ వస్తువుల నిల్వలను దుకాణాలను ఒకే చోట ఉంచకూడదు. విద్యుత్తు ప్యానెల్‌కు ముందు చెక్కతో కవర్ చేయకూడదు. ★ ప్రతి పదేళ్లకు విద్యుత్తు వైరింగ్ మార్చాలి. ఐఎస్ఐ వైర్లనే వినియోగించాలి. ★ దుకాణాల్లో గ్యాస్, ఆయిల్స్ నిల్వ ఉంచరాదు. త్వరగా మండే వస్తువులు, టపాసులు నిల్వ ఉంచకూడదు. ★ దుకాణాల సుందరీకరణ అగ్ని ప్రమాద నివారణ వస్తువులతోనే చేయాలి. ★ దుకాణాల్లో అనుభవం గల ఎలక్ట్రీషియన్‌తో విద్యుత్తు పనులు చేయించాలి.

## రామయ్య.. కుడివైపునే సీతమ్మ

**హ**నుమాన్‌జంక్షన్ కూడలిలోని రామాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ స్వామి వారు సీతమ్మ సమేతంగా కొలువుదీరి శ్రీసీతారామచంద్రుడిగా నిత్యం పూజలందుకుంటారు. ఇందులో వింతేముంది? అంటారా, కానీ ఇక్కడ మాత్రం సీతమ్మ వారు శ్రీరాముడికి కుడివైపున కొలువుదీరి ఉంటారు. దాదాపుగా ఏ గుడిలోనైనా అమ్మవారు రాముడికి ఎడమ వైపున ఉండేలా విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. కానీ జంక్షన్‌లో మాత్రం కుడివైపున అమ్మవారు దర్శనమిస్తుంటారు. పదిహేనేళ్ల కిందట దేవాలయం పూర్తిగా నేలమట్టం అయింది. అప్పట్లో ఉన్న పాలరాతి విగ్రహాలు కూడా ధ్వంసమయ్యాయి. దాతల సాయంతో వెంటనే ప్రస్తుతం ఉన్న దేవాలయాన్ని నిర్మించారు. కొత్తగా ప్రతిష్ఠించిన నల్లరాతి విగ్రహాలను కూడా పాత తరహాలోనే ఏర్పాటు చేయడం గమనార్హం. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

## బావి తరాలకు బతుకు తరువై

**గ్రా**మాల్లో ప్రజలకు తాగునీరు అందించే వనరుల్లో బావులు కీలకం. ఇప్పటికీ ఆ నీటినే తాగడానికి వినియోగిస్తుంటారు. అయితే కాలక్రమంలో వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పాడుపడుతున్నాయి. అలా ఉన్న బావిని కుంచించుకుని ఎదిగిన ఈ చెట్టును అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. పెడన మండలం చేవేంద్రపాలెం గ్రామంలో రహదారి పక్కన ఉన్న తాగునీటి బావిలో చెట్టు ఎదిగింది. బావి పాడైపోవడంతో నీటి అవసరాల కోసం సమీపంలో మరొకటి తవ్వారు. అయితే అలంకార ప్రాయంగా ఉన్న బావి.. ప్రస్తుతం ఆ వృక్షానికి ఆసరాగా నిలిచి అందరినీ ఆలోచింపజేస్తోంది. – మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

## శత వసంతం.. శుభమనంతం..!

అక్షర కోవెలకు 112 ఏళ్లు

**నం**దిగామలో జడ్పీ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేకత ఉంది. దీనిని స్వాతంత్ర్యానికి పూర్వమే దివంగత తుర్లపాటి పెద్దవీరభద్రరావు, దివంగత అయ్యదేవర రామనరసింహం తదితర వ్యవస్థాపక కమిటీ సభ్యులు 9 జూన్ 1913లో 14 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించారు. 1921లో ఉన్నత పాఠశాలగా మారింది. 1 ఆగస్టు 1922లో ఈ బడి జిల్లా బోర్డు పరిధిలోకి వచ్చింది. ఈ పాఠశాల ఏర్పాటై 112 సంవత్సరాలు అవుతోంది. ఇక్కడ చదివిన ఎంతోమంది రాజకీయ నాయకులుగా, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ఇక్కడే చదువుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు నుంచి పది వరకు 860 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్వం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చారు. తరువాత నిర్మించిన భవనంలో కొన్ని గదుల్లో పదో తరగతి, హెచ్‌ఎం రూం, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మిగిలిన తరగతుల విద్యార్థులకు కొత్తగా తరగతి గదులు నిర్మించారు. ఈ ప్రాంతంలో ఇదే పురాతన పాఠశాల అని ప్రధానోపాధ్యాయిని పొదిలి విజయలక్ష్మి తెలిపారు. - **నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

## డీడీల గల్లంతు అంశంలో.. ముగ్గురు కమిషనర్లకు మెమోలు

**ఉయ్యూరు, న్యూస్‌టుడే:** ఉయ్యూరులో టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల డీడీలు గల్లంతయిన అంశంలో ముగ్గురు కమిషనర్లు, ఇద్దరు సిబ్బందికి మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ ఛార్జ్ మెమోలు జారీ చేశారు. 2020వ సంవత్సరంలో లబ్ధిదారులకు చెందిన కొన్ని డీడీలు గల్లంతు కావడంపై యూఎఫ్ఆర్టీఐ కో కన్వీనరు జె. శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. డీడీల గల్లంతులో ఆయా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కోణంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఉయ్యూరు పూర్వపు కమిషనరు సీహెచ్ సత్యనారాయణ ప్రస్తుతం సాలూరు కమిషనరుగా, టి. రామ్‌కుమార్ తణుకు కమిషనర్‌గా, శేషఫణి ఎర్రకుంట ఇన్‌ఛార్జి కమిషనరుగా, సీనియర్ అసిస్టెంట్ ఎం. వెంకటేశ్వరరావు జగ్గయ్యపేట పురపాలక సంఘంలో విధులు నిర్వర్తిస్తున్నారు. పూర్వపు కమిషనరు వి.వి.ఎస్.శేఖరరావు పదవీ విరమణ చేశారు. వీరందరికీ నోటీసులు జారీ అయ్యాయి.

ప్రజా పంపిణీ వ్యవస్థలో కొత్త ఒరవడి దిశగా కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు, ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చారు. అదే దిశగా కొత్త ఏడాది నూతన సంస్కరణలు చేస్తోంది. – **ఈనాడు, అమరావతి**

# స్మార్ట్‌గా పౌరసరఫరాలు

జనవరి నుంచి మనమిత్ర యాప్, వాట్సప్ సేవలు

### ఒక్క నంబర్.. ఎన్నో సేవలు..

✦ **95523 00009** నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పెడితే వెంటనే ప్రభుత్వంలోని వివిధ శాఖలు కనిపిస్తాయి. పౌరసరఫరాలపై క్లిక్ చేస్తే సేవలు కనిపిస్తాయి. వాటిల్లో మన సమస్యపై దరఖాస్తు చేయొచ్చు. * కొత్త రేషన్ కార్డుకు చరవాణి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని పత్రాలు అప్‌లోడ్ చేస్తే సచివాలయానికి దరఖాస్తు చేరుతుంది. పరిశీలన అనంతరం రేషన్ కార్డు చిరునామాకు చేరుతుంది. కార్డులో కొత్త సభ్యులను చేర్చడం, మరణించిన వారి తొలగింపు, చిరునామా మార్పు, ఇలా ఏ సేవైనా ఇందులో పొందవచ్చు. ✦ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. వలసలు వెళ్లిపోవడం.. కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో వేల మంది ఇంకా కార్డులు తీసుకోలేదు. స్మార్ట్ కార్డు పోగొట్టుకున్నవారు డూప్లికేట్ కార్డు తీసుకునేందుకు యాప్‌లో అవకాశం ఉంది.

అక్రమాలు, అవకతవకలు, లోపాలపై ఫిర్యాదుకు వీలుగా ప్రతి చౌక దుకాణంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఫోన్‌లో స్కాన్ చేసి ఫిర్యాదులు, పౌరసరఫరాలపై అభిప్రాయాలు ఇవ్వొచ్చు. విచారణ చేసి చర్యలు తీసుకుంటారు.

☛ **73373 59375** నంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే ధాన్యం కొనుగోలు ఎప్పుడు చేస్తారో షెడ్యూలు చేసుకునే వీలుంది.

☛ వివాహం తర్వాత పాత కార్డు నుంచి తొలగించి కొత్తగా కార్డు ఇవ్వడానికి పెద్ద ప్రహసనం సాగేది. ప్రస్తుతం పెళ్లి ధ్రువపత్రం అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు పాత కార్డు నుంచి తప్పిస్తారు.

### అరచేతిలో సేవలు..

ఫోన్‌తో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగడం, సిబ్బంది దగ్గర ప్రాధేయ పడాల్సిన అవసరం లేదు. అందరూ మనమిత్ర వాట్సప్ నంబర్ సేవ్ చేసుకుని ఉపయోగించుకోవాలి.

**-నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల మంత్రి**

# ఇవ్వమంటే ఇరుకున.. ఇచ్చారంటే పరుగున

పౌరసేవల్లో పంచాయతీ కార్యదర్శుల దందా

ఈనాడు – అమరావతి

"**కొం**దరు పంచాయతీ కార్యదర్శుల అక్రమాలు హద్దు మీరుతున్నాయి. నిధుల దుర్వినియోగం, పౌరసేవల విషయంలో ఆమ్యామ్యాలు తీసుకోవడం.. పంచాయతీ ఆదాయానికి గండి కొట్టేయడం... ఇలా లెక్కకు మించిన వ్యవహారాలతో కాసులు పోగేసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులను వాటాలు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా అడ్డగోలు వ్యవహారాలు చేస్తున్న కార్యదర్శులు ఉన్నారు. సర్పంచి అండ.. స్థానిక నాయకుల ఆశీస్సులతో సర్వం చక్కబెడుతున్నారు."

### ఎందెందు వెతికినా...

★ గన్నవరం మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి వసూళ్లు శ్రుతి మించుతున్నాయి. కొత్త కొళాయి కనెక్షన్ కావాలంటే పంచాయతీకి రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటే.. ఈయనకూ రూ.6 వేలు కట్టాల్సిందే. లేదంటే నీటి బొట్టు రాదు. ఇదేంటని ప్రశ్నిస్తే 'ఇదంతా నాకే అనుకుంటున్నారా? చాలా మందికి సర్దాలయ్యా' అని దబాయించి మరీ వసూలు చేస్తున్నారు. ★ మోపిదేవి మండలంలో ఓ శివారు పంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారులకు నెలవారీ మామూళ్లు పంపిస్తూ.. పన్నులు మొదలు చెరువుల ఆదాయం వరకు సర్పంచితో కలిసి మెక్కేస్తున్నారు. ★ విజయవాడ సమీపంలో భారీగా ఆదాయం వచ్చే పంచాయతీలో ఓ కార్యదర్శి అదనపు బాధ్యతలు నిర్వర్తించేలా ఓ నాయకుడిని ప్రసన్నం చేసుకుని భారీగా నిధుల స్వాహా చేస్తున్నారు.

### నాయకుల అండతో..

పంచాయతీల్లో అక్రమాల్లో కార్యదర్శులు తెర ముందు పాత్రధారులే. తెర వెనుక సూత్రధారులు మాత్రం సర్పంచులు, స్థానిక నాయకులనేది బహిరంగ రహస్యమే. ★ కార్యదర్శులు అక్రమాలకు వెనుకంజ వేస్తున్నా 'మేమున్నాం చూసుకుంటాం' అని ముగ్గులోకి దించుతున్నారు. తీరా అక్రమాలు వెలుగులోకి వస్తే కార్యదర్శులే బలవుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

★ దీనిపై ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ మాట్లాడుతూ, కార్యదర్శుల అక్రమాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురి అరెస్టు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అమీన్‌పూర్ పట్టణంలోని సృజన లక్ష్మీనగర్‌లో ఈ నెల 9న జరిగిన బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. స్థానిక యువతి, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన యువకుడు కాకాణి జ్యోతి శ్రవణ్‌సాయి (19) ప్రేమించుకుంటున్నారు. ఈ విషయమై యువతి కుటుంబసభ్యులు పలు మార్లు యువకుడిని హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా యువతిని కలుస్తూనే ఉండటంతో మాట్లాడుదామని.. ఈ నెల 9న శ్రవణ్‌సాయిని ఇంటికి పిలిచారు. ఇంటికి వెళ్లిన శ్రవణ్‌సాయితో యువతి తల్లి, తండ్రి, సోదరుడు గొడవ పడ్డారు. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయడంతో యువకుడి తల, శరీరంలోని పలు భాగాల్లో గాయాలయ్యాయి. అయినా పట్టించుకోకుండా గంటల తరబడి ఇంట్లోనే నిర్బంధించారు. అడ్డుకోబోయిన యువతిని సైతం కొట్టడంతో ఆమెకూ గాయాలయ్యాయి. మరుసటి రోజు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే యువకుడు మృతిచెందాడు. మృతుడి పెద్ద నాన్న వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతికి యువతి తల్లి సిరి, తండ్రి హరిబాబు, సోదరుడు రామ్‌తేజ్ కారణమని నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు.

# అక్రమం గుట్టు... శివాని కెరుక!

☛ అజ్ఞాతం వీడని లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సీఈవో
☛ బోర్డు తిప్పేసే నాటికే సొమ్ము దారి మళ్లింపు

ఈనాడు, అమరావతి

'**ప్ర**స్తుతం మన భవిష్యత్తు ఏంటి? వచ్చే తరాలకు భరోసా ఏంటి? వీటిని దృష్టిలో పెట్టుకుని పేదలు, మధ్యతరగతి వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని' రంగురంగుల బ్రోచర్లతో ప్రచారం చేశారు. ఊరూరా భార్యాభర్తలు.. శివాని, దుర్గాప్రసాద్ అందరినీ నమ్మించారు. భారీగా డిపాజిట్లు రాగానే సొమ్ము పక్కదారి పట్టించి.. బోర్డు తిప్పేశారు. వేల మంది లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్‌లో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో యూట్యూబ్‌లో భారీగా ప్రచారం చేశారు. ఈ మాటలు నమ్మి మచిలీపట్నం, భవానీపురం, విస్సన్నపేట, రాజోలు, కాకినాడ, ఏలూరు, ఖమ్మం, తదితర చోట్ల కార్యాలయాలు పెట్టి డిపాజిట్లు వసూలు చేసి నిండా ముంచేశారు.

### ప్రత్యేక బృందాల ఏర్పాటు...

విస్సన్నపేట ఠాణాలో శుక్రవారం రాత్రి సంస్థపై కేసు పెట్టారు. ఇంకా పలువురు బాధితులు వరుస కడుతున్నారు. పెద్దసంఖ్యలో బాధితులతో ముడిపడిన అంశం కావడంతో దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను వేశారు. మొత్తం ఎంత వసూలు చేశారు? ఇప్పటికి ఎంత చెల్లించారు? డిపాజిట్‌దారులకు ఇచ్చిన బాండ్లు పరిశీలించనున్నారు. సంస్థ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఎక్కడికి తరలింది? నిర్వాహకులు.. బినామీ పేర్లతో ఆస్తులు కొన్నారా? అని తేల్చనున్నారు. బ్యాంకు లావాదేవీల స్టేట్‌మెంట్లు తీసుకొని.. ఖాతాలను ఫ్రీజ్ చేయనున్నారు. దుర్గాప్రసాద్, శివానిల బంధువుల ఆస్తులను పరిశీలించనున్నారు. బాధితుల చిట్టా తయారీలో పోలీసులు నిమగ్నమయ్యారు.

### ద్వాక్రా మహిళలే ఎక్కువ..

పేద, మధ్యతరగతి వారినే లక్ష్యంగా చేసుకునే నిర్వాహకులు డిపాజిట్లు వసూలు చేశారు. వీరిలోనూ డ్వాక్రా మహిళలే ఎక్కువ. వీరికి రుణాలు మంజూరవగానే.. ఊళ్లలో సమావేశాలు పెట్టి, సంస్థలో పెట్టుబడి పెట్టాలని.. అధిక వడ్డీ ఆశజూపారు. దీంతో చాలా చోట్ల పొదుపు మహిళలు ఎక్కువగా డిపాజిట్లు చేశారు. బంగారాన్ని, ఇంటి పత్రాలను తనఖా పెట్టి మరీ డిపాజిట్ చేశారు. మార్చి నుంచే చెల్లింపులు ఆగాయి. గట్టిగా నిలదీసిన వారికీ అరకొరే ఇచ్చారు. మరికొందరికి చెక్కులిచ్చి చేతులు దులుపుకొన్నారు.

### బంధువుల ఖాతాలకు..

రెడ్డిగూడెం మండలంలో శివాని కనిపిస్తే పట్టుకున్నారని ప్రచారం సాగినా పోలీసులు ధ్రువీకరించలేదు. శుక్రవారం రాత్రి మద్దెలపర్వలో ఆమె తల్లిదండ్రుల ఇంటికి బాధితులు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో 250 గ్రాముల బంగారు నగలు కొన్న రశీదులు దొరికాయి. నూజివీడులో ఓ దుకాణంలో ఏడాది లోపు కొన్న బిల్లులు కనిపించాయి. శివాని, ఆమె బంధువులు కొందరు కనిపించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థకు చెందిన నాలుగు కరెంటు ఖాతాల నుంచి కుటుంబీకులు, బంధువుల బ్యాంకు ఖాతాలకు రూ.2-3 కోట్లు బదిలీ అయినట్లు భావిస్తున్నారు. శివాని స్థలాలు కూడా ఆమె బంధువుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది.

## 28న ఏపీ ఎన్జీవో నగర శాఖ ఎన్నికలు

**విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే :** ఏపీఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ ఎన్నికలు ఈ నెల 28న గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ నెల 16న పబ్లిష్ చేస్తామని చెప్పారు. 22న నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అర్హుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఒక్కో పదవికి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే.. 28న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, పర్యవేక్షకుడిగా జిల్లా కోశాధికారి బి.సతీష్‌కుమార్‌ను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు ప్రసాద్ తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**కలెక్టరేట్ (మచిలీపట్నం):** కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ప్రజలు అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారన్నారు. 1100 నంబరుకు ఫోన్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు స్థితిగతులను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

# రూ.లక్షలు వెచ్చిస్తే.. కోట్లు వస్తాయ్!

శిథిల దుకాణ సముదాయాలు చక్కదిద్దితే ఆదాయం

ఈనాడు, అమరావతి

'**వి**జయవాడ నగరపాలికకు.. కీలక ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన స్థలాలున్నాయి. వీటిని సరిగ్గా వినియోగిస్తే.. భారీగా ఆదాయం సమకూరుతుంది. వీటిలో దశాబ్దాల నాటి పురాతన దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఇక్కడ ప్రైవేటు దుకాణాలు, కార్యాలయాల అద్దెలు ఆకాశంలో ఉండగా.. ఇవి మాత్రం పాడుబడి.. కూలేలా ఉన్నాయి. వీటిని ఆధునికీకరిస్తామని.. ఏళ్లుగా చెప్పడమే తప్ప.. ఆచరణ ఊసేలేదు." గాంధీనగర్‌లో రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్ సముదాయం 80 సెంట్లలో ఉంది. వైకాపా హయాంలో కూలగొట్టి.. కొత్తగా కట్టాలని నిర్ణయించారు. సగం కూలగొట్టే సమయానికి.. నేతలు అడ్డుకోగా.. ఆధునికీకరణ ఆగింది. నాటి నుంచి.. ఈ దుకాణ నిర్వాహకులు చాలామంది అద్దెలే చెల్లించడం లేదు. వీరికి ప్రస్తుత పాలకవర్గమైన వైకాపా నేతలు అండ ఉంది.

**ఐదేళ్లు విచ్చలవిడితనం..** వైకాపా హయాంలో ఐదేళ్లు నేతలు విచ్చలవిడిగా ఈ దుకాణాలను కేటాయించుకున్నారు. తమకు డబ్బులు ఎవరు ఎక్కువ ఇస్తే.. వాళ్లకే ఇచ్చుకున్నారు. భారీగా చెల్లించాల్సిన గుడ్‌విల్‌కు కూడా గండికొట్టారు. రూ.30 లక్షల వరకూ గుడ్‌విల్ ఉంటే.. రూ.5 లక్షలకు తగ్గించేశారు. సగం వైకాపా నేతలు, మిగతాది పాడుకున్న వాళ్లు లబ్ధిపొందారు. టెండర్లు కూడా చాలా దుకాణాలకు పిలవలేదు. ఖాళీ అయితే.. సీల్డ్‌కవర్, బహిరంగ వేలంలో ఎవరు ఎక్కువకు పాడితే వాళ్లకే ఇవ్వాలి. కానీ.. ఇవేవీ అమలు జరగలేదు.

రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్‌లో పాడుబడిన దుకాణాలు

**విలువైన ప్రాంతాల్లో:** 63 వాణిజ్య సముదాయాల్లో... 4000 దుకాణాలున్నా.. ఏటా రూ.22 కోట్ల ఆదాయమే వస్తోంది. వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ స్టేడియం దుకాణాలకు డిమాండ్ ఉంది. ఇవన్నీ ఖరీదైన ప్రాంతాల్లోనే ఉన్నా.. అద్దెలు అరకొరే వస్తున్నాయి. ఆధునికీకరిస్తే.. నాలుగైదు రెట్లు ఆదాయం పెరుగుతుంది.

**అభివృద్ధికి ప్రణాళికలు..: ఎ.శ్రీధర్, ఎస్టేట్ ఆఫీసర్**

దుకాణ సముదాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఉండే దుకాణ సముదాయాలను ఆధునికీకరించి.. పాలికకు ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

(c) eenadu

# 4 రోజులు.. 3.75 లక్షల మంది భవానీలు

## పక్కా ఏర్పాట్లతో సత్ఫలితాలు

సూచనలు చేస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, పక్కన ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ

**ఈనాడు, అమరావతి :** ఇంద్రకీలాద్రిపై ఈనెల 11 నుంచి కొనసాగుతున్న భవానీదీక్ష విరమణ వేడుకలకు ఆదివారం సాయంత్రం వరకు నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ వెల్లడించారు. భవానీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరంగా అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వేడుకలు, భక్తులకు కల్పించిన సౌకర్యాలను ఆయన ఆదివారం పరిశీలించారు. క్యూలైన్లలో వెళ్తున్న భవానీ భక్తులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామచంద్ర మోహన్ మాట్లాడుతూ.. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ ఉచిత అన్నప్రసాదం అందుబాటులో ఉంచామన్నారు. వారికి ఎన్ని కావాలంటే అన్ని ఇచ్చేలా లడ్డూ ప్రసాదం ముందస్తుగా సిద్ధం చేశామని తెలిపారు.

**దసరా ఉత్సవాల మాదిరిగానే.. :** భవానీదీక్షలకు సైతం పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ప్రతి భవానీ భక్తుడు సంతృప్తికరంగా దీక్ష విరమణ చేసి వెళ్తున్నారని తెలిపారు. స్నానఘాట్ల వద్ద ఏర్పాట్లు, ఉచిత రవాణా, క్యూలైన్లలో వచ్చేవారికి మంచినీళ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, ఉచిత ప్రసాదం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

**ప్రణాళికతో ప్రసాదాల తయారీ.. :** భవానీ దీక్ష విరమణ వేడుకల్లో ఏటా భక్తులు కోరినన్ని ప్రసాదాలు అందజేసే విషయంలోనే ఇబ్బందులు వస్తుండడంతో ఈసారి పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రధానంగా మూడు పాయింట్లలో నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం తయారీ చేయిస్తూ.. భక్తులు కోరినన్ని లడ్డూలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రసాదాల విషయంలో భవానీ భక్తులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు.

☛ వేడుకల నిర్వహణలో ఈసారి కూడా సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తున్నామని, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సహా అన్ని విభాగాలతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అనుసంధానం చేసుకుంటూ వెళ్లడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. సోమవారంతో వేడుకలు ముగుస్తున్న నేపథ్యంలో ఆఖరి నిమిషం వరకూ చాలా అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులను రామచంద్రమోహన్ ఆదేశించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తిరుపతమ్మ అమ్మవారి దీక్షాధారణ

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షాధారణ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఉప కమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 5:59 గంటలకు దీక్ష ప్రారంభిస్తామన్నారు. దీక్ష తీసుకునే వారికి ఈనెల 21 వరకు అవకాశం ఉందని చెప్పారు. జనవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అర్ధ మండల దీక్షాధారణలు ఉంటాయని తెలిపారు. దీక్ష తీసుకునే భక్తులు ఆయా సమయాల్లో నేరుగా ఆలయం వద్దకు వచ్చి స్వీకరించవచ్చని చెప్పారు.

## పూర్ణాహుతి నేడు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 15న ఉదయం 10 గంటలకు యాగశాలలో మహాపూర్ణాహుతిని నిర్వహిస్తున్నట్లు వైదిక కమిటీ పేర్కొంది. మహా పూర్ణాహుతితో భవానీ దీక్షాల విరమణ మహోత్సవాలు పరిసమాప్తం అవుతాయని తెలిపారు.

**రాత్రి వరకు ప్రసాదం పంపిణీ :** భవానీ దీక్షల విరమణ నాల్గోరోజు రికార్డు స్థాయిలో 1.50 లక్షల మంది దీక్షాధారులు దుర్గమ్మను దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. అన్నదాన గ్రౌండ్ ఫ్లోరులో అన్నప్రసాదం, దద్ధోజనం, కట్టెపొంగలి, కదంబ ప్రసాద పంపిణీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దేవస్థానం అధికారులు కొనసాగించారు.

**వీఐపీ దర్శనాలకు బ్రేక్ :** ఇంద్రకీలాద్రిపై వీఐపీ ప్రొటోకాల్ దర్శనాలు నిలిపి వేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో వాహనాల రాకపోకలను బందోబస్తు పోలీసులు నియంత్రించారు. కుమ్మరిపాలెం సెంటరు నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. వృద్ధులు, దివ్యాంగులను మాత్రమే దేవస్థానం బస్సుల్లో ఘాట్ రోడ్డులో ఇంద్రకీలాద్రిపైకి చేరుస్తున్నారు.

పుష్పాలతో అంతరాలయం అలంకరణ

దీవించు తల్లీ...

### ఆదాయం రూ.81,58,730

**విజయవాడ వన్‌టౌన్:** ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్షల విరమణల సందర్భంగా నాల్గోరోజు దుర్గమ్మ ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ. 81,58,730 ఆదాయం సమకూరింది.
☛ రూ.15ల లడ్డూ ద్వారా రూ.12,930
☛ రూ.100ల లడ్డూల ద్వారా 76,08,300 ☛ శ్రీచక్రార్చన లడ్డూల ద్వారా రూ.9,500, ☛ కేశఖండనసాల ద్వారా రూ.5,28000
☛ ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు 22,437 మంది అన్నప్రసాదం, 26,586 మంది అల్పాహారం స్వీకరించారని అధికారులు వెల్లడించారు. ☛ మూడో రోజు పూర్తి వివరాలను అధికారులు తెలిపారు. శనివారం మొత్తం 1.21 లక్షల మంది భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
☛ మూడో రోజు మొత్తం 49,948 మంది భక్తులకు ఉచిత అల్పాహారం, అన్నప్రసాదాన్ని అందజేశామని అధికారులు తెలిపారు.

# అనిర్వచనీయం.. అపూర్వం

● 48 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల కలయిక
● గుడ్లవల్లేరు కళాశాల 1974-77 బీకాం బ్యాచ్ సందడి

**గుడివాడ (గుడ్లవల్లేరు) న్యూస్‌టుడే :** గుడ్లవల్లేరులోని గుడ్లవల్లేరు కళాశాలలో 1974- 1977 బీకాం బ్యాచ్ వారు 48 ఏళ్ల తర్వాత కలిశారు. గుడ్లవల్లేరులోని పాలకేంద్రం ఫంక్షన్ హాలులో ఆదివారం ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. డిగ్రీలో వారు చేసిన అల్లరి, సరదాగా గడిపిన క్షణాలు గుర్తు చేసుకున్నారు. వీరంతా అధికంగా తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడినా వాట్సాప్ ద్వారా ఏడాది పాటు శ్రమించి 30 మంది కలుసుకున్నారు. తమ ఉన్నతికి కారణమైన విద్యాలయాన్ని మరిచిపోలేమని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

### ఇది ఓ మధురానుభూతి

ఏడాదిగా శ్రమించి అందరి ఫోన్ నంబర్లు సంపాదించాను. నా మిత్రులతో కలిసి అందరితో మాట్లాడి 30 మంది బీకాం డిగ్రీ చదివిన మొదటి బ్యాచ్ వారంతా 48 ఏళ్ల తర్వాత మొదటిసారి కలుసుకోవడం ఓ మధురానుభూతి. దీన్ని మరిచిపోలేను. మళ్లీ మళ్లీ మిత్రులను కలుసుకునే అవకాశం కల్పిస్తాం. - బెజవాడ వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు

### నా ఉన్నతికి కళాశాల కారణం

ఈ కళాశాల నా ఉన్నతికి కారణం. దీన్ని జీవితంలో మరువలేను. ఇక్కడ బీకాం పూర్తిచేసి ఎంకాం, లా చదివి హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నా. ఆడపిల్లగా నాకు పుట్టింటికి రావడం కన్నా ఈ కలయిక ఆనందంగా ఉంది. నా పిల్లలకు ఈ సంగతులు చెబుతూ మరింత ఉత్సాహంగా జీవిస్తున్నా. - ఉప్పలపాటి సునీల, హైకోర్టు న్యాయవాది

### మరింత ఊపిరి పోసింది

మా అపూర్వ కలయిక నా జీవితానికి మరింత ఊపిరి పోసింది. పాఠశాలలో ఉద్యోగ విరమణ చేశాక ఈ కలయిక గొప్ప మధురానుభూతిని మిగిల్చింది. జీవితంలో చాలామందికి దొరకని అదృష్టం మాకు దక్కింది. ఇది ఎన్నటికీ మరిచిపోలేను. -తుమ్మల సుశీల, ఖాజీపేట

### జన్మభూమిని, చదువుల తల్లిని మరువలేను

48 ఏళ్ల క్రితం చదువు చెప్పిన కళాశాలను, జన్మనిచ్చిన ప్రాంతాన్ని మరువలేదు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో స్థిరపడినా చాలాకాలం తర్వాత తొలిసారిగా ఇక్కడకి వచ్చి నా స్నేహితులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. -సుధాకర్ బాబు యెర్నేని

### జీవితానికి ఆక్సిజన్‌లా పని చేస్తుంది

48 ఏళ్ల క్రితం డిగ్రీ చదివిన వారి కలయిక మున్ముందు కలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది నా పనిలో ఆక్సిజన్ లాగా పని చేసి ఉత్సాహంగా పని చేయడానికి దోహదపడుతుంది. ఇది చాలా అద్భుతం. ఇలా ఎవరూ కలుసుకుని ఉండరు. నాకు చాలా ఆనందంగా ఉంది. -పోలవరపు వెంకటేశ్వరరావు, ఛార్టెడ్ అకౌంటెంట్, హైదరాబాద్

# కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆసక్తిగా తిలకిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

రకరకాల వస్తువులు, బొమ్మలు..

అలరించిన చిత్రకళా సంత

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** చిత్రకళాకారులు గీసిన చిత్రాలు, తీసిన దృశ్యాలు నగరవాసులను కట్టిపడేశాయి. వీటిని తిలకించిన జిల్లావాసులు మంత్రముగ్ధులయ్యారు. తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ దూరదర్శన్ కేంద్రం రోడ్డులో ఏర్పాటు చేసిన 4వ చిత్రకళ సంత అద్భుతంగా ఆకట్టుకుంది. దాదాపు 200కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన, అమ్మకాలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కళల కాణాచి విజయవాడలో ఇటువంటి చిత్రకళా సంతను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగర ప్రజల అభిరుచి మేరకు ప్రదర్శన నిర్వహించడం, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి విచ్చేయడం విశేషమన్నారు. కొన్నేళ్లుగా చిత్రకళకు ఆదరణ తగ్గినా ఇటువంటి ప్రదర్శనల ద్వారా ఎంతోమందికి ఆసక్తి పెరుగుతోందన్నారు. భవిష్యత్తులో చిత్ర, కళాకారులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని, అమరావతి రాజధానిలో కళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రపంచ తెలుగు చిత్రకారులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాలయోగితో పాటు పలువురు చిత్ర కళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, వల్లభనేని సత్య సాయిబాబు పర్యవేక్షణలో ప్రదర్శన సాగింది.

# కాలనీల్లో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

**మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే:** పేదల నివాస గృహాల కోసం కేటాయించిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సొంత స్థలం, గృహ లబ్ధిలేని వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధంచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మచిలీపట్నంలో పర్యాటక రంగ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ పరమైన అంశాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, వాటిని ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారులకు పరిష్కార చర్యల నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, ఆక్వా కల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకే నారాయణప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ కుంచె నాని, మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, నాయకులు సోమశేఖర్, అనిల్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వమే కొంటుంది

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

**తోట్లవల్లూరు, న్యూస్‌టుడే :** రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వమే కొని.. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో శనివారం కఠినంగా వ్యవహరించి.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం డబ్బులు రైతులకు చెల్లించేలా ఏర్పాటు చేశానని తెలిపారు. కొంత మంది రైతులు రైస్ మిల్లర్ల కారణంగా తడిసిన ధాన్యానికి సంబంధించి నష్టపోతున్నట్లు తనకు చెప్పారని, దీంతో మూడు లారీల ధాన్యం లోడ్ చేసుకుని వస్తుంటే వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నం చేయగా సరైన సమాధానం రాలేదని తెలిపారు. దీంతో రైతులను, అధికారులను, మిల్లర్లను పిలిపించి అందరి సమక్షంలో రైతులకు న్యాయం చేశానని చెప్పారు. రైతులు రూ.200 నష్టం జరుగుతోందని గ్రహించి అధికారులతో మాట్లాడి ఇప్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రైతుల నుంచి ధాన్యం కొని ఆరు నెలలు డబ్బులు చెల్లించలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అలా కాకుండా ముందస్తుగా రూ.20 వేల కోట్లు నిధులు కేటాయించి, ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే డబ్బులు అందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని తెలిపారు. సొంత కుటుంబ సభ్యుడ్ని దారుణంగా హత్య చేసినా.. చిరునవ్వుతో ఉండే లౌక్యం తనకు లేదని, మీ మీదా హత్యా ప్రయత్నం చేసినా, మీకు అవకాశం వచ్చినా దాన్ని నిరూపించి దోషిని నిలబెట్టక పోయినా చిరునవ్వుతో ఉండే స్థితప్రజ్ఞున్ని తాను కాదని ఆయన వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు.

కేపీ రావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, చిత్రంలో నరసింహ చౌదరి

## కబడ్డీకి కేపీ రావు సేవలు ఎనలేనివి

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర కబడ్డీ రంగానికి కేపీ రావు చేసిన కృషి మరవలేనిదని మాజీ ఎంపీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో కేపీ రావు కబడ్డీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కౌన్సిల్(ఐవోసీ) మాజీ సభ్యుడు నరేంద్ర ధ్రువ్‌బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ హాజరై కేపీ రావును సత్కరించారు. లగడపాటి మాట్లాడుతూ కేపీ రావు 50 ఏళ్ల క్రీడా జీవితం, ముఖ్యంగా కబడ్డీకి చేసిన సేవలను కొనియాడారు. కేపీ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు ఉపయోగపడతానని వాగ్దానం చేశారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్, శాప్ విశ్రాంత డీడీ కేసీహెచ్ పున్నయ్య చౌదరి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి జీవీ రామారావు, రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం కార్యదర్శి కరీముల్లారావు చౌదరి, ఎం.నరసింహచౌదరి పాల్గొన్నారు.

### రాజకీయాలకు దూరం : లగడపాటి

రాజకీయాలకు దూరంగా ఉన్నానని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్.. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానమించారు. రాజకీయాల గురించి ఎటువంటి విషయాలు మాట్లాడదలచుకోలేదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలని, రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు.

**బ్రాయిలర్ ధరలు** (కిలో | కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

# నాలుగున్నర ఏళ్లుగా అసంపూర్తిగానే..

అవనిగడ్డ మండలం పులిగడ్డ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రూ.40 లక్షలతో నాలుగేళ్ల కిందట సచివాలయ భవన నిర్మాణం ప్రారంభించారు. అయితే గుత్తేదారు నిర్మాణం అసంపూర్తిగా వదలివేశాడు. భవనానికి ఫ్లోరింగ్ పనులు, విద్యుత్తు పనులు, తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయాలి ఉంది. దీంతో భవనం వినియోగంలోకి రాలేదు. మరో పక్క పంచాయతీ కార్యాలయంలో సచివాలయం ఏర్పాటు చేయడంతో ఇరుకు గదుల్లో సిబ్బంది ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సచివాలయం ఉద్యోగులు, పులిగడ్డ పంచాయతీ పాలకులు విజ్ఞప్తి చేస్తున్నారు. -అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

## ఐక్య పోరాటాలతో కళాశాలను కాపాడుకుందాం

**సీతారాంపురం:** అందరం కలిసికట్టుగా పోరాడి శాతవాహన కళాశాలను కాపాడుకుందామని పూర్వ ప్రధానాచార్యులు ఉయ్యూరి సాంబిరెడ్డి పిలుపునిచ్చారు. సీతారాంపురంలోని కళాశాల ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని విద్యార్థి సంఘాలతో పాటు ఐక్య కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దుర్గామల్లేశ్వరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు పిన్నమనేని కృష్ణమోహన్ మాట్లాడుతూ.. కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తమ కమిటీ కృషి చేస్తోందన్నారు. వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర మాట్లాడుతూ.. కళాశాల పరిరక్షణకు ఐక్య కార్యాచరణ అవసరమని చెప్పారు. పూర్వ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు నవనీతం సాంబశివరావు మాట్లాడుతూ.. అన్ని సంఘాల సహకారంతో కమిటీ పోరాడుతుందన్నారు. సమావేశంలో మోర్త రామకృష్ణ, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు బాసర రవికిరణ్, వెంకన్న, వాలేశ్వరరావు, వల్లూరు బాబు, భాను, కిరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాంబిరెడ్డి. పక్కన కృష్ణమోహన్, రవిచంద్ర తదితరులు

ఆశాను సన్మానించిన రాధారంగా మిత్రమండలి సభ్యులు

## వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి

**పామర్రు, న్యూస్‌టుడే :** దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ పామర్రులో రంగా మిత్రుడు దివంగత తాడిశెట్టి నాగేశ్వరరావు (పాము) కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. నాగేశ్వరరావు మృతి చెందినా ఆయన కుటుంబ సభ్యులు సత్యనారాయణ, మధుశేఖర్, సాంబశివరావు, కుటుంబ సభ్యులు నేటికీ తన తండ్రి వర్ధంతి, సంస్మరణ సభ నిర్వహిస్తూ ఆయన ఆశయ సాధనకు పని చేస్తున్నారని చెప్పారు. ముందుగా పామర్రు తోటలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమెను నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాధారంగా మిత్రమండలి సభ్యులు అల్లంశెట్టి సురేష్, పసుపులేటి శ్రీనివాసరావు, పవన్, కలకొండ చిరంజీవి, తాడిశెట్టి మోహన్ పాల్గొన్నారు.

బృందంతో కోచ్ అజయ్‌కుమార్‌రెడ్డి

## అంతర్ రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలకు రాష్ట్ర ఎంపిక

**విజయవాడ క్రీడలు:** రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో నగేష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ స్థాయి సీనియర్ అంధుల క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఆ సంఘం కార్యదర్శి సి.రవీంద్ర బాబు ఆదివారం వెల్లడించారు. టి.దుర్గారావు(కెప్టెన్), ఎం.గణేష్(వైస్ కెప్టెన్), బి.అశోక్‌రెడ్డి, టి.శివశంకర్, కె.జాని, డి.వెంకటేష్, కె.పుణ్య శ్రీనాథ్, ఆర్.వెంకటేష్, డి.కోటయ్య, ఎం.శివరాజు, ఎ.రవి, డి.తాండవకృష్ణ, కె.విక్రాంత, ఎన్.రమణయ్యలు జట్టులో స్థానం సాధించగా.. కోచ్‌గా ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి, మేనేజరుగా ఎల్.నరేష్ నియమితులయ్యారు.

## 'గత వైకాపా పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేశారు'

మాట్లాడుతున్న వెంకన్న

**పటమట:** గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాక్షసులంతా కలిసి రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మార్చారాని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో వైకాపా నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడిని అరెస్టు చేస్తే.. అది తప్పు.. అన్యాయం.. అంటూ సీఎం జగన్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పిన్నెల్లి సోదరులు రాష్ట్రంలో తెదేపా మద్దతుదారులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్న దుర్మార్గులని మండిపడ్డారు. మున్సిపల్ ఛైర్మన్ పదవికి వేలంపాట పెట్టి దాడులు, హత్యలు చేయించిన నీచమైన చరిత్ర వారిదన్నారు. మాచర్ల నియోజకవర్గంలో బీసీ కార్యకర్తను జై వైకాపా అనలేదని నడిరోడ్డుపై పీక కోసి చంపేశారని బుద్ధా ఆరోపించారు. పిన్నెల్లి సోదరుల అరెస్టును ఆ నియోజకవర్గ ప్రజలు దీపావళిలా సంబరాలు చేసుకుంటే. . వైకాపా నేతలు మాత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వెల్లడించారు.


91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

REAL ESTATE

FLAT FOR SALE

RAMAVARAPPADU
FLAT FOR SALE
363 SQYRDS
65 UDS FOR EACH FLOOR
5 FLOORS
4BHK EACH FLOOR
2500 SQRFT EACH FLOOR TOTAL
PLINT 2100 SQRFT EACH FLOOR
10 CAR PARKS TOTAL
2 FOR EACH FLAT
PRICE : 4500/- PER SFT. (NEGOTIABLE)
BRAND NEW LUXURY HIGH QUALITY CONSTRUCTION AT A VERY AFFORDABLE PRICE
READY TO OCCUPY
LAST 2 FLATS AVAILABLE
Contact : 8333911102, 8712123344, 9390311148

3 BHK LUXURIOUS FLATS FOR SALE
Patamata @JD Nagar
• 2100 Sft. • NO GST
• 85 sq.yds UDS
• 2 Car Parking
• Ready to Occupy
Year Ending Offer FREE REGISTRATION
94401 72044

HOUSE FOR SALE

NUNNA ROAD

LAND FOR SALE

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జీఎస్టీ 5% అదనం

JOBS

కావలెను
విజయవాడలోని రమ క్లాత్ స్టోర్స్ నందు పనిచేయుటకు
• సేల్స్‌మేన్స్
• హెల్పర్స్
• క్యాషియర్స్
WALK-IN-INTERVIEW DEC 13th 14th & 15th
Timings : 11am to 4pm
Ph : 81259 73743

Wanted Lady Telecallers 6. Age 20 to 35 Salary 15K RAM'S Career Guidance Labbipet Vijayawada. 62813 70293.

SRI Gowtham Jr.College NEET & JEE Mains(Kanuru) Wanted Principals 50k, Campus(AO)30k. Vice principals 25 to 30k, Wardens 15k. 96425 58058, 91547 51815

Wanted Real Estate Agents for Venture Plots Sales Good Commission Contact : 97364 54545, 94324 54545.

గమనిక


(c) eenadu

మచిలీపట్నం
●మచిలీపట్నం ●పెడన

## పేదలకు సాయం చేయడం గొప్ప వరం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: పేదల సాయం చేయడం గొప్ప వరమని రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పుట్టినరోజు పురస్కరించుకుని మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గురుమూర్తి బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి అని, తెదేపాను నమ్ముకుని ఎదుగుతూ వచ్చారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో కేసులు పెట్టి హింసించినా తెదేపాను నమ్ముకుని పని చేశారని తెలిపారు. ఆయన పుట్టినరోజున వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని రేవతి థియేటర్ నుంచి రామానాయుడుపేట సెంటరుకు వెళ్లే దారిలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. ఈ సమస్యను ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.

❖ నగరంలో కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లే దారిలో రహదారి పక్కన ఉన్న చెత్త మేట తొలగించాలని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం..మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

? కొంకేపూడి-ఈదుమూడి రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - కట్టా నాగరాజు

✔ రహదారి నిర్మాణానికి రూ.2.04 కోట్ల నిధులు విడుదలయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. - ధర్మయ్య, మండల పరిషత్తు ఏఈ. - పెడన

## శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. క్రైం, రికవరీ ఇతర రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదని సూచించారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. తొలుత సిబ్బంది, వాహనదారులతో కలిసి శిరస్త్రాణం ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.

### ధర వరలు

టమాట 35, వంగ 20, బెండ 44, పచ్చిమిర్చి 42, కాకర 44, క్యాబేజీ 24, క్యారెట్ 44, దొండ 42, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 48, దోస 34, సొర 15/20, అరటికాయ 7/8, చిక్కుళ్లు 60, బీర 50, చామదుంప 28, మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 38, కీరదోస 32, బీన్స్ 90, క్యాప్సికం 66, అల్లం 100, పెలకదుంప 40, కొత్తిమీర 17/08, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిశెట్టి వర్మ, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు.

### సినిమాలు

రేవతి: అఖండ-2
మినీరేవతి: మోగ్లీ
సిరికృష్ణ: అఖండ-2
సిరివెంకట్: అఖండ-2
- న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

# డొంక దారి.. దారుణంగా మారి!

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: వ్యవసాయ అవసరాలకు అత్యంత కీలకమైన డొంకరోడ్లు అధ్వానంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తెదేపా హయాంలో కొన్ని నిర్మించారు. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయా దారులను అభివృద్ధి చేయాలని కోరినా స్పందన లేదు. ఈ వేసవిలోనైనా సమస్య పరిష్కరించాలని కర్షకులు కోరుతున్నారు.

### 80 వేలకు పైగా ఎకరాలు..

బందరు, పెడన నియోజకవర్గాల పరిధిలో 80 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ ఆయకట్టు ఉంది. అనేక డొంక రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఏళ్ల తరబడి వాటిని పట్టించుకోకపోవడంతో కుంచించుకుపోయి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పొలాలకు ఎలా వెళ్లాలి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

✤ నాలుగు కిలోమీటర్ల మేర ఉండే పెడన మండలం ఉప్పలకలవ గుంట- లంకలకలవగుంట మార్గాన్ని సగం వరకు అభివృద్ధి చేసి వదిలేశారు. ✤ గూడూరు మండలం మల్లవోలు పంచాయతీ పరిధిలోని గుండుపాలెం డొంక రోడ్డును బాగు చేయాలని ఏళ్లతరబడి కోరుతున్నా స్పందన లేదు. ✤ ఆర్తపల్లి-పెడన రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ✤ కంకటావ పంచాయతీ పరిధి కత్తులవానిపాలెం నుంచి గూడూరు ప్రధాన రహదారిని కలిపే డొంక అత్యంత అధ్వానంగా తయారైంది. ✤ బందరు మండలం చిన్నాపురం గ్రామ ప్రధాన రహదారి నుంచి ఐదో నంబరు కాలువ వెంబడి దాదాపు 600 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఆయా పొలాలకు వెళ్లేందుకు కాలువ దారిని గ్రావెల్‌గా అభివృద్ధి చేయాలని రైతులు విన్నవిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆక్వా చెరువులకు వెళ్లే ట్రాక్టర్లు, జేసీబీలు అటుగా వెళ్లడంతో దారి దారుణంగా తయారైంది. ✤ బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని వివిధ గ్రామాల్లో డొంక దారులు వర్షం వస్తే కనీసం పశువుల్ని మేపు తెచ్చుకోవడానికి సైకిల్‌పై కూడా వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా డొంకరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రోడ్లు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

గూడూరు ఆర్తపల్లి-పెడన రోడ్డు దుస్థితి

## 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని ప్రసిద్ధ రంగనాయకస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు, ఈవో మాగంటి సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో నిత్యం విశేషపూజలు, అర్చనలు తదితర పూజా క్రతువులతో పాటు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందన్నారు. ఈ నెల 29న స్వామివారు జగన్మోహిని రూపంలో భక్తులకు దర్శనమిస్తారని, 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని చెప్పారు. జనవరి 14న గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బందరు కోట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ముత్తేవి వెంకట శోభనాద్రి తెలిపారు. ఈ నెల 24న నరసింహస్వామి వ్రతాలు ఉంటాయన్నారు.

# సామాజిక అంశాలపై అవగాహన

పెడన, గ్రామీణ, న్యూస్‌టుడే: నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 14 వరకు నిర్వహించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. వారం రోజులుగా వలంటీర్లు సామాజిక అంశాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని సూచించారు. అలాగే చరవాణులకు వచ్చే లింకులను తెరవకూడదని చెప్పారు. బాలికలు అపరిచితులతో పరిచయాలు పెంచుకోవద్దని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాల నిర్వహణ, పరిశుభ్రత, మంగినపూడి బీచ్‌లో వ్యర్థాల తొలగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రోగ్రాం సమన్వయకర్త అనీల్‌కుమార్ చెప్పారు.

స్వచ్ఛంద సేవలో విద్యార్థులు

## మంత్రిని కలిసిన డీఈవో

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన యూవీ సుబ్బారావు ఆదివారం మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని మంత్రి సూచించారు. శాఖాపరంగా అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాల గురించి డీఈవో వివరించారు.



మంత్రి రవీంద్రకు కనకదుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డీఈవో సుబ్బారావు

## ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

మచిలీపట్నం (గొడుగుపేట): నగరంలోని సర్కిల్‌పేట మల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఛైర్మన్‌గా యక్కల చంద్రశేఖర్, సభ్యులు ఆరేపు లక్ష్మణకుమార్, నిడుమోలు ఓంకారేశ్వరరావు, పత్తికాయల మంగ, కోణపల శ్రీనివాసరావు, చొప్పరపు కనకదుర్గ, పరాశరం పద్మజ, వంగర శ్రీలక్ష్మీ, కానుకొలను హరితా నాగలక్ష్మీఅనుపమ, అయిలూరి మల్లికార్జునరావు.. పలువురు ప్రముఖులు సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కుంచే దుర్గాప్రసాదు(నాని), తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాదు, జనసేన నగర అధ్యక్షులు గడ్డం రాజు తదితరులు నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు.

నూతన కార్యవర్గంతో అతిథులు

## మురుగు పారక.. రాకపోకలకు దారిలేక!

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఈడేపల్లిలో అధ్వానంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మురుగు రహదారులపైకి చేరడంతో ఆ ప్రాంత వాసులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ వృద్ధాశ్రమం మీదుగా బైపాస్ మార్గానికి వెళ్లే దారిలో అంతర్గత దారులపై మురుగుపారుతోంది. కొన్నిచోట్ల చేసేది లేక రాళ్లు ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగు రోడ్లపైకి చేరకుండా దిగువకు పారేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పట్టించుకోకుంటే ప్రమాదమే..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని సర్వజన ఆసుపత్రి నుంచి చిలకలపూడి వెళ్లే ప్రధాన రహదారిలో షార్కీ స్కూల్ సమీపంలో చెట్టు కొమ్మలు విద్యుత్తు తీగలను తాకుతున్నాయి. గాలులు వీచినప్పుడు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పాటు కొన్నిసార్లు తీగలు తాకి నిప్పురవ్వలు కూడా వస్తున్నాయని ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి, కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తీగలను తాకుతున్న కొమ్మలు

## అనుసంధానం లేక అవస్థలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పెయింటర్స్ కాలనీలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్‌పై కల్వర్టులు నిర్మించారు. కానీ చాలా చోట్ల అనుసంధాన రోడ్లు లేకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## ముగిసిన కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు

కూచిపూడి: మొవ్వ మండలం కూచిపూడిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. వేదాంతం కూచిపూడి నృత్య శిక్షణలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి శ్రీసిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠం పూర్వ ప్రధానాచార్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో యువ నాట్యాచార్యులు చక్రవర్తుల పవన్‌కుమార్, నిహారిక చౌదరి నిర్వహణలో రాష్ట్రం, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలువురు గురువులు, నాట్య విద్యార్థులు 60 మంది పాల్గొని శిక్షణ పొందారు.

## పోలీసులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

పెడన, న్యూస్‌టుడే: ఈ నెల 5న పైడమ్మ ప్రభల ఊరేగింపులో తమ మనోభావాలకు విరుద్ధంగా స్థానిక ఎస్సై, పోలీసులు వ్యవహరించారని ఆరోపిస్తూ 12వ వార్డు ప్రజలు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదుచేశారు. నాగేశ్వరరావుపేటలోని ఆయన నివాసానికి కౌన్సిలర్ మట్టా శివపావనీ ఆధ్వర్యంలో తరలివెళ్లిన ఆ ప్రాంత ప్రజలు.. ఆరోజున జరిగిన సంఘటనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పరిమిత సంఖ్యలో డీజేలను అనుమతించారని, ప్రభల ఊరేగింపులో కూడా తమపై ఆంక్షలు పెట్టారని పేర్కొన్నారు. ఉత్సవాల రెండో రోజు 12వ వార్డు కాపులవీధి నుంచి 11 శిడిబొమ్మలతో భక్తులు ఆలయానికి వెళ్లడం ఆచారంగా వస్తోందని, ఈ ప్రాంతంలోనే అమ్మవారి పుట్టినింటి వంశీయులు ఉన్న నేపథ్యంలో భక్తులు సంప్రదాయంగా ఈ క్రతువు నిర్వర్తిస్తారని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పోలీసు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్, 12వ వార్డు ప్రజలు

# పైడమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముగిసిన ఉత్సవాలు

పెడన, న్యూస్‌టుడే: పైడమ్మ ఉత్సవాల చివరి రోజు ఆదివారం పెడన పుర వీధులు భక్త జన సంద్రంగా మారాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఈ ఒక్క రోజే దాదాపు 30-40వేల మంది తరలివచ్చినట్లు ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్శనాలను అధికారులు నిలిపేశారు.

ప్రభల ఊరేగింపులో పూర్వ విద్యార్థులు

గణాచారులకు భక్తుల పూజలు

**అంతటా కోలాహలం:** శిడిబొమ్మల ప్రదర్శనతో పట్టణంలో సందడి నెలకొంది. 1989-90 బ్యాచ్ జ్ఞాన కోటయ్య హైస్కూలు పూర్వ విద్యార్థులు ప్రభలతో ఆలయానికి తరలివెళ్లారు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నారాణి, కౌన్సిలర్ బళ్ల గంగయ్య పలువురు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక 14వ వార్డు మఠం వీధి యువత శిడిబొమ్మలతో సందడి చేసింది. వినాయక ఆలయం నుంచి మొదలైన ఊరేగింపు పురవీధుల మీదుగా సాగింది.

**గణాచారుల ప్రదర్శన:** పైడమ్మ జాతరలో భాగంగా స్థానిక 14వ వార్డు భక్త బృందం ఆధ్వర్యంలో పట్టణంలో గణాచారులు ప్రదర్శన నిర్వహించారు. భక్తులు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు.

**అమ్మవారి గ్రామోత్సవం:** ఉత్సవ క్రతువు ముగింపులో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ క్రతువు అనంతరం సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన అమ్మవారికి ఊయల సేవ చేసి తిరిగి యథాస్థానంలో ఉంచుతారు. దీంతో 11రోజుల ఉత్సవ క్రతువు ముగుస్తుంది.

పెడన: అఖిల భారత అయ్యప్ప దీక్ష సేవా సమితి, పైడమ్మ భక్త బృందాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పైడమ్మ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఆహారం పంపిణీ చేశారు. దాదాపు 5వేల మంది అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు కొత్త నాగవెంకట మురళీకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో కోడూరి రమేష్, గుర్రం వెంకట నారాయణ, జవ్వాజి నాగరాజు, విస్సంశెట్టి రాఘవరావు, కొత్త నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు.. భక్తిగీతాల పోటీలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని చెమ్మనగిరిపేట అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు, అయ్యప్పదీక్షాధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. సాయంత్రం నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు భక్తి, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి భక్త బృంద ప్రతినిధులు బహుమతులు పంపిణీ చేశారు.

పూజలందుకున్న అయ్యప్పస్వామి, బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

### సోమేశ్వరస్వామికి..

గూడూరు, న్యూస్‌టుడే: మండల పరిధి ఐదుగుళ్లపల్లిలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు దర్శించుకున్నారు.

### పొలాల దారిలో
## నియంత్రికతో ఇబ్బందులు

మండలంలోని చిన్న తుమ్మిడి పరిధిలో వ్యవసాయ భూములకు వెళ్లే డొంక దారిలో ఓ ఆక్వా రైతు నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని కర్షకులు వాపోతున్నారు. సదరు రైతు చెరువు సమీపంలో కాకుండా సుమారు 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసి, అక్కడి నుంచి తీగలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇబ్బందికరంగా ఉన్న వాటిని తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. ఈ విషయమై బంటుమిల్లి ఏఈ పాండురంగారావు మాట్లాడుతూ ఆక్వా రైతుకు ఇప్పటికే నోటీసు ఇచ్చామని, నియంత్రికను అక్కడి నుంచి వేరే ప్రదేశానికి మార్చేందుకు అంచనాలు వేసి, చలానా కట్టాలని సూచించామని చెప్పారు. - న్యూస్‌టుడే, చిన్నతుమ్మిడి (బంటుమిల్లి)

## రంగా ఆశయ సాధనకు కృషి

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: పేదల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన దివంగత వంగవీటి రంగా ఆశయ సాధన కోసం అంకితమవుదామని ఆయన కుమార్తె ఆశాకిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక వలందపాలెంలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మచిలీపట్నంతో తన తండ్రికి విడదీయరాని అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఆయనకు ఈ ప్రాంతంలో అనేకమంది మిత్రులు, సన్నిహితులు ఉన్నారన్నారు. రాధా రంగా మిత్రమండలి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విశాఖపట్నంలో ఈ నెల 26న నిర్వహించే రంగానాడును విజయవంతం చేయాలని కోరారు. తొలుత మచిలీపట్నం చేరుకున్న ఆశాకిరణ్.. లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి వలందపాలెం వరకు రంగా అభిమానులు భారీ ర్యాలీతో తోడ్కొని వెళ్లారు. నగర డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, కూటమి నాయకులు కొట్టె వెంకట్రావు, చిన్నం సురేష్, అంకెం రాంజీ, ఊసా చంటి, రాధారంగా మిత్రమండలి నగర అధ్యక్షుడు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఆశాకిరణ్

## హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయరూ..!

బంటుమిల్లి ప్రధాన కాలువపై చిన్నపాండ్రాక పరిధిలో జాతీయ రహదారి-216పై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మల్లేశ్వరం వైపు నుంచి చిన్నపాండ్రాకలోని పలు ప్రాంతాలకు, వ్యవసాయ పనులకు వెళ్లే వారు జాతీయ రహదారి దాటాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో సరైన హెచ్చరిక సూచికలు లేవు. వాహన చోదకులు వాహనాలను నియంత్రించలేకపోతున్నారు. ప్రమాదం జరగకముందే సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: నగరంలోని 14వ డివిజన్‌కు చెందిన శివ(35) రెండ్రోజుల కిందట అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులు చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పెడన మండలం కొంకేపూడి చెరువులో ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి పరిశీలించగా అది శివదే అని నిర్ధారణ కావడంతో పరీక్ష నిమిత్తం మచిలీపట్నం సర్వజనాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అస్తవ్యస్తంగా
## తాగునీటి వ్యవస్థ

పెడన, న్యూస్‌టుడే

పెడనలో తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో పట్టణంలోని 35 వేల జనాభాకు ఇబ్బందులు తప్పడం లేదు. 1998లో రక్షిత నీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది. అప్పట్లో ఏర్పాటు చేసిన ప్రధాన పైపులైన్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పలు చోట్ల లీకులు ఏర్పడి తాగునీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి 1000 కేఎల్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసే ఏసీ పైపులైన్లకు నెలలో కనీసంగా రెండు సార్లు భారీ లీకులు ఏర్పడి పట్టణ వ్యాప్తంగా సరఫరా నిలుస్తోంది. వీటిని మార్చాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టటంలేదు. పలు ప్రాంతాల్లో 40 కిమీల పొడవున విస్తరించిన అంతర్గత పైపులైన్లకు సైతం లీకులు బెడద తప్పడం లేదు.

మఠం వీధిలో రోడ్డుపై పారుతున్న నీరు

**కాలుష్యంపై ఆందోళన:** భూమి లోపల ఉన్న పైపులకు ఏర్పడుతోన్న లీకులతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనిపై పలుమార్లు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి కౌన్సిలర్లు, ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా.. చర్యలు కనిపించడం లేదు.

**కనిపించని కార్యదర్శులు:** పట్టణంలో ప్రతి రెండ్రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్లు, కుళాయిల వద్ద క్లోరిన్ శాతాన్ని పరీక్షించాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. అయితే నెలలో ఒకసారి కూడా వారు ఈ బాధ్యతలు నిర్వర్తించడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి.

**నిర్ధారణ:** పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి ఇటీవల నీటి నమూనాలను సేకరించి గుంటూరులోని రీజనల్ ల్యాబ్‌కు పంపారు. పరీక్షల్లో కాలుష్య కారకాలు ఉన్నట్లు నిర్ధారణైంది. పీహెచ్ విలువలు పరిమితం కంటే అధికంగా ఉన్నట్లు తేలింది. మున్సిపల్ కుళాయిల నీటిలోనూ ఇదే రీతిలో కాలుష్యం వెలుగు చూసింది.

### కార్యదర్శులకు నోటీసులు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తాం. పైపులైన్లను మార్చేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కోరాం. త్వరలో ఆ ప్రక్రియ మొదలవుతుంది. కాలుష్య రహిత నీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.
- సీతారామాంజనేయులు, ఇన్‌ఛార్జి కమిషనర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కోస్టల్ బ్యాంక్
COASTAL BANK
26 YEARS OF TRUSTED SERVICE COMMITTED TO EXCELLENCE
(రిజర్వ్ బ్యాంక్ నియంత్రణలో నడుపబడుతున్న కమర్షియల్ బ్యాంక్)
కార్పొరేట్ ఆఫీస్ - విజయవాడ.
ప్రారంభోత్సవ ఆహ్వానం
కోస్టల్ బ్యాంక్
51 వ శాఖ మచిలీపట్నం నందు
(డోర్ నెం. 24/235-236, రామానాయుడు పేట)
ది.15-12-2025 సోమవారం
ఉదయం 11.00 గం॥లకు
ప్రారంభకులు
శ్రీ వెంకటరామన్ కృష్ణమూర్తి గారు (ఛైర్మన్)
విశిష్ట అతిథులు
శ్రీ బి. వేణుగోపాల రెడ్డి గారు మేనేజింగ్ డైరెక్టర్ & సి.ఇ.ఓ | శ్రీ ఎ.యస్. అప్పయ్య గారు డైరెక్టర్ | శ్రీ తిమ్మిచెట్టి రవి గారు డైరెక్టర్
ఈ శుభసందర్భమున మీ అందరికి మా హృదయపూర్వక ఆహ్వానము
హరిహర రెడ్డి బ్రాంచ్ మేనేజర్
టి. రామకృష్ణ రీజనల్ మేనేజర్
మనకోసం.... మన ప్రాంతీయ అభివృద్ధి కోసం.... మన ప్రాంతీయ బ్యాంక్.
"visit us at www.coastal.bank.in"

(c) eenadu

# పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

## సామూహిక వ్రతాలు

వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త కాకాని బాబు, అరుణ దంపతులు భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. అర్చకులు చక్రావధానుల సీతా రామాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

★ పెనమలూరు పొట్టి శ్రీరాములు రహదారిలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు శనివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం ఈ ప్రాంతంలో పనిచేయని 12 దీపాలను తొలగించి కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు. ★ పెనమలూరు-చోడవరం రహదారి, జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో రహదారులపై లారీల నుంచి జారిపడిన ఇసుక, మట్టి.. కుప్పలుగా పేరుకుపోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారంటూ గ్రామస్థులు శనివారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ఆదివారం కుప్పలను తొలగించి రోడ్లను శుభ్రం చేశారు.

స్పందనకు వందనం

★ గన్నవరం రాయ్‌నగర్ పరిసరాల్లో వ్యర్థాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు సమస్యను మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఈవో చెన్నకేశవుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పంచాయతీ సిబ్బందిని పంపి పరిసరాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. ★ గన్నవరం దళితవాడ శివారులో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయని స్థానికులు సమస్యను విద్యుత్తు ఏఈ రాజుకు తెలిపారు. ఆయన స్పందించి తీగలను సరి చేయించారు.

- న్యూస్‌టుడే, పెనమలూరు, గన్నవరం గ్రామీణం

## మౌలిక వసతులు కల్పించాలి

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** గన్నవరం పంచాయతీ పరిధిలోని అయోధ్య చంద్రికా గృహ సముదాయం పరిసరాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు పిడికిటి రత్నప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచి, ఉపసర్పంచి పాలడుగు నానిని ఆదివారం కలిసి విన్నవించారు. రోడ్లు, డ్రెయిన్లతో పాటు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి మొర్ల మహీధర్, కోశాధికారి దివి మోహన్ కుమార్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కాసన్నేని అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టలు కట్టండి.. గ్రాసం పొందండి

**కంకిపాడు, న్యూస్‌టుడే:**

యంత్రాలతో నూర్పిడి చేసిన వరి పొలాల్లోని ఎండు గడ్డిని తగలబెడుతున్న కారణంగా కాలుష్యంతోపాటు భూసారం దెబ్బతింటోందని వ్యవసాయ అధికారులు పదే పదే చెబుతున్నారు. అయినా 75 శాతం మంది వాటికి నిప్పు పెడుతున్నారు. దీనికి భిన్నంగా కొందరు రైతులు వరిగడ్డిని యంత్రంతో కట్టలుగా కట్టించి పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఎకరంలోని వరిగడ్డి రూ.10 వేల వరకు పలుకుతోంది. యంత్రంతో ఒక్కో గడ్డి కట్ట కట్టడానికి రూ.35 చొప్పున తీసుకుంటున్నారు. ఒక ఎకరానికి 60 కట్టల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన రూ.2,100కే రూ.10 వేల విలువైన వరిగడ్డి లభిస్తుందని, నాణ్యమైన పశుగ్రాసాన్ని బుగ్గిపాలు చేయొద్దని కంకిపాడు మండల వ్యవసాయ అధికారిణి ఉషారాణి సూచిస్తున్నారు.

ప్రొద్దుటూరులో వరిగడ్డి కట్టలు

**రూ.40 వేలు ఆదా చేసుకోగలిగాం**
**- మశిముక్కు శ్రీనివాసరావు, ప్రొద్దుటూరు**

మాకు ఆరు గేదెలు, రెండు ఎడ్లు ఉన్నాయి. పచ్చిగడ్డి, దాణాతోపాటు ఐదు ఎకరాల్లోని ఎండుగడ్డి అవసరం అవుతుంది. దీనికి రూ.50 వేలు వెచ్చించాలి. ప్రస్తుతం యంత్రంతో నూర్పిడి చేసిన పొలాల్లో గడ్డిని తగలబెడుతున్నారు. వారి అనుమతితో యంత్రంతో మూడు ఎకరాలు, మరో రెండు ఎకరాల్లోని గడ్డిని మేమే పోగుచేసుకుని వామి వేసుకున్నాం. దీనికి మొత్తం రూ.10 వేల వరకు ఖర్చయింది. తద్వారా రూ.40 వేలు ఆదా చేసుకోగలిగాం. ఈ గడ్డి మెత్తగా ఉండడంతో పశువులు ఇష్టంగా తింటాయి.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత

**కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే:** కంకిపాడులో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తనయుడు బోడే వెంకట్రామ్ చేతుల మీదుగా ఆదివారం ట్రైసైకిళ్లు అందజేశారు. తమకు ట్రైసైకిళ్లు కావాలని ఇటీవల దివ్యాంగులు తెదేపా పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. దీంతో వారు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ట్రైసైకిళ్లు పంపించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, ఉపసర్పంచి చిరంజీవి, పులి శ్రీనివాసరావు, కాకుమాను రమేష్, వీరంకి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## డొంక రహదారుల అభివృద్ధికి చర్యలు

**చిన ఓగిరాల(ఉయ్యూరుగ్రామీణం), న్యూస్‌టుడే:** ఉయ్యూరు మండలంలోని చిన ఓగిరాల-పెద ఓగిరాల డొంక రోడ్డు అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజతో కలిసి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. మండల పరిషత్, పంచాయతీ నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. పలువురు రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రహదారులు దెబ్బతినడంతో పంట ఉత్పత్తులను రవాణా చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నదాతలు తెలిపారు. నియోజకవర్గంలో ఇలాంటి వాటిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీపీవో అరుణ, తెదేపా మండల అధ్యక్షుడు వెంకట కుటుంబరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కమిషనర్ పెనమలూరు నుంచి సాలీపేట మీదుగా పోరంకి వెళ్లే రహదారిని పరిశీలించారు.

కృష్ణతేజతో కలిసి డొంక రోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

## కూటమి పాలనలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

**హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దిగ్గజ పారిశ్రామికవేత్తలు తమ సంస్థలను ఏపీలో ఏర్పాటు చేయడానికి ముందుకొస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన పెరికీడు గంగానమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. అధిష్ఠానం మాటకు కట్టుబడి నూజివీడు సీటు త్యాగం చేశానని, చంద్రబాబు, లోకేశ్ తనకు సముచిత స్థానం కల్పిస్తారనే నమ్మకం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. నాయకులు బోయపాటి వరప్రసాద్, వేగిరెడ్డి బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు నక్కాబాబు, పుట్టి రాంబాబు, పుట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


గంగానమ్మ ఆలయంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, తదితరులు

## రోడ్డు మరమ్మతులకు మరో రూ.కోటి మంజూరు

**పెనమలూరు, న్యూస్‌టుడే:** గోసాల-వణుకూరు-మద్దూరు ఆర్‌అండ్‌బి రహదారి అభివృద్ధికి మరో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఎన్‌హెచ్ 65 నుంచి ఇవి కేటాయించారు. ఈ నిధులతో గోసాల నుంచి వణుకూరు వరకు 7 మీటర్ల వెడల్పుతో సీసీ రహదారిగా అభివృద్ధి చేయనున్నారు. అంతకు ముందు ఈ రహదారి అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరుకాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనంగా రూ.కోటి మంజూరయ్యే అవకాశాలున్నాయి. ఈ నిధులతో వణుకూరు గ్రామశివారు నుంచి మద్దూరు వరకు ఐదున్నర మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు వేయనున్నారు. ఆయా అభివృద్ధి పనులకు పది రోజుల్లోగా టెండర్లు పిలవనున్నట్లు అధికారులు తెలిపారు.

గుంతలమయంగా మారిన గోసాల-వణుకూరు-మద్దూరు రహదారి

## పేద కుటుంబానికి బాసట

**కంకిపాడు:** పక్షవాతానికి గురైన మద్దూరు గ్రామస్థుడు ఆంజనేయులు కుటుంబానికి అండగా ఉంటామని లయన్స్‌క్లబ్ విజయవాడ రూరల్‌శాఖ కార్యదర్శి రావి సురేష్‌బాబు చెప్పారు. ఆదివారం మొదటి విడతగా నిత్యావసరాలు, రూ.6 వేల నగదు అందజేశారు. స్థానిక రామాలయంలో నిత్య పూజల నిమిత్తం రూ.3 వేల విలువైన నువ్వులనూనె కూడా ఇచ్చారు.


## శ్రద్ధాంజలి

కీ॥శే॥ చిట్నేని వీరేంద్రనాథ్ ముఖర్జీ గారు
పెద్దకర్మ ది. 15-12-2025

ముఖర్జీ గారు క్రమశిక్షణకు కట్టుబడి, ఉన్నత విలువలతో జీవించి, మంచి మనసుతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి. నల్లూరు వారి షిర్డీ సాయి ద్వారకామాయి ఆలయ వ్యవహారాలను క్రమశిక్షణతో నిర్వహించి అపారమైన సేవలను అందించిన పుణ్యమూర్తి. ముఖర్జీ గారి ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని "సాయిబాబా"ని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

శోకతప్త హృదయాలతో..
నల్లూరు వారి షిర్డీసాయి ద్వారకామాయి సేవక బృందం
భార్గవి నగర్, గన్నవరం.


## గుర్రపుడెక్క ఇలా.. నీరు పారేదెలా

ఏలూరు కాల్వలో గుర్రపు డెక్క మళ్లీ మొలకెత్తింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమై, సాగు అవసరాలకు నీటిని విడుదల చేసిన తర్వాత హడావుడిగా కాల్వలో గుర్రపుడెక్క, తూడు తొలగింపునకు కార్యాచరణ చేపట్టడంతో పూర్తి స్థాయిలో పూడిక జరగలేదు. దీంతో ప్రస్తుతం కాల్వ మొత్తం గుర్రపుడెక్క అల్లుకుంది. మళ్లీ వేసవి నాటికి కానీ నీటి పారుదల శాఖ కాల్వల నిర్వహణ పనులు చేపట్టదు. ఈలోగా తాగునీటి చెరువులను నింపుకొనేందుకు నీటిని విడుదల చేసినప్పుడు ఈ గుర్రపుడెక్క కారణంగా ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని, కాబట్టి ముందుగానే దీన్ని తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

## క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు ప్రతిబింబించాలి

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** వందేమాతరం 150 వార్షికోత్సవాలను పురస్కరించుకొని గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రా ఆర్‌అండ్‌వీ ఎన్‌సీసీ రెజిమెంట్లో ఆదివారం గుర్రాలతో విన్యాసాలు ప్రదర్శించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గుర్రాలతో చేసిన షో జంపింగ్, టెంట్ పెగ్గింగ్ వంటి సాహసోపేతమైన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలుగా నిలిచిన క్యాడెట్లకు భట్లపెనుమర్రు చెందిన రచయిత సంగిశెట్టి సాంబశివరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు ప్రతిబింబించాలని ఆయన పేర్కొన్నారు. కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కర్నల్ ఎల్డీ. తీర్థప్రసాద్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఎల్.జయబాల్, జేసీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

150 ఆకృతిలో నిలబడి నినాదాలు చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు

## వీధిదీపాలు ఏర్పాటు చేయరూ..

**కానూరు, న్యూస్‌టుడే:** తాడిగడప 100 అడుగులరోడ్డు నుంచి కానూరు వెళ్లే డొంకరోడ్డులో వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఆసుపత్రులతో పాటు అపార్టుమెంట్లు కూడా ఉన్నాయి. చీకటిగా ఉండటంతో పాములు, విష పురుగులు తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంధకారంగా ఉన్న ప్రాంతం

## భాజపా మండల మోర్చాల నియామకం

భాజపా నూతన కమిటీ ప్రతినిధులతో పార్టీ నాయకులు

**కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని వివిధ విభాగాలకు కమిటీలను నియమించినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం కంకిపాడు గ్రామంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పావనగాయత్రి ధ్యాన మందిరంలో పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు విష్ణువర్ధనరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుళ్లపూడి శ్రీనివాసరావు, దీవి చిన్మయి, రోహిణికుమార్, మురళీల ఆధ్వర్యంలో కమిటీలను ఎన్నుకున్నారు. పార్టీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా డొక్కు విష్ణువర్ధనరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా ఇంటూరి నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా గుడివాడ సంధ్యారాణి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా షేక్.కరీముల్లా, యువజన మోర్చా అధ్యక్షుడిగా భూపతిరాజు, ప్రధాన కార్యదర్శులుగా గుడిపాటి హరికృష్ణ, కంకిపాటి సురేష్‌లను నియమించారు.

## 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

**మచిలీపట్నం, గొడుగుపేట:** నగరంలోని ప్రసిద్ధ రంగనాయక స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో నిత్యం విశేషపూజలు, అర్చనలు తదితర పూజా క్రతువులతో పాటు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందన్నారు.


## ప్రకటన

మా క్లయింటు, గూడూరు మండలం, తరకటూరు కాపురస్తులు, బాదర్ల బసవయ్య గారి కుమారుడు, వెంకట సత్యనారాయణ గారు యీ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయం పొందుటకు సికింద్రాబాద్, సాకేత్ ఇ.సి.ఐ.యల్ సాకేత్ కాలనీ, లైన్ నెం.7, ప్లాట్ నెం. 170 కాపురస్తులు, కుందేటి (లేటు) ఉమామహేశ్వరరావు గారి కుమారుడు, ప్రతాప్ కుమార్ గారి వద్ద నుండి విక్రయ ఖరారు అగ్రిమెంటు పొందియున్నారు.
షెడ్యూలు ఆస్తి మరియు మరికొంత ఆస్తిని కలిపి ది. 31-12-1982న కుందేటి శివనాంచారయ్య గారి భార్య సీతామహాలక్ష్మమ్మ గారు బొమ్ము కోటిరెడ్డి గారి కుమారుడు, వెంకట చలమారెడ్డి గారి వద్ద దస్తావేజు నెం. 291/1983 రీత్యా క్రయం పొందియున్నారు. సదరు కుందేటి సీతామహాలక్ష్మమ్మ గారి మరణానంతరం, వారి వారసులైన భర్త శివనాంచారయ్య, కుమారుడు గోపాలకృష్ణమూర్తి మరియు మరియొక చనిపోయిన కుమారుడు వెంకట సుధాకర్ గారి వారసులైన కుందేటి నాంచారమ్మ, కుందేటి మోహనకృష్ణ మరియు కుందేటి కుసుమ గారలు సదరు ఆస్తిలో వారికి గల జాయింటు హక్కులను మరియొక కుమారుడు అయిన కుందేటి ఉమామహేశ్వరరావు గారికి ది. 20-12-2017న నున్న సబ్ రిజిస్ట్రారు వారి ఫైలు - దస్తావేజు నెం. 4289/ 2017 రీత్యా వదులుకునియున్నారు. సదరు ఆస్తిని కుందేటి ఉమామహేశ్వరరావు గారు అనుభవించుచున్నారు. సదరు ఉమామహేశ్వరరావు గారు మరియు వారి భార్య లక్ష్మీ నర్సాంబల మరణానంతరం, వారి కుమారులైన కుందేటి ప్రతాప్‌కుమార్ మరియు కుందేటి స్వరూప్‌కుమార్ గారలు సదరు ఆస్తిని విభజించుకుని ది. 07-12-2021న నున్న సబ్ రిజిస్ట్రారు వారి ఫైలు పార్టిషన్ దస్తావేజు నెం. 3924/2021 రీత్యా 'A' షెడ్యూలు ఆస్తి సదరు కుందేటి ప్రతాప్‌కుమార్ గారికి, 'B' షెడ్యూలు ఆస్తి సదరు కుందేటి స్వరూప్ కుమార్ గార్లకు సంక్రమించి వారి వారల సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వుండివున్నది. కావున, షెడ్యూలు ఆస్తిని మా క్లయింటు సదరు కుందేటి ప్రతాప్ కుమార్ గారి వద్ద నుండి క్రయం పొంది, రిజిష్టరు విక్రయ దస్తావేజును పొందుటలో ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు కాని, హక్కులు కాని, క్లెయిములు కాని, ఇతరత్రా ఆక్షేపణలు కాని ఉన్న యెడల వారం రోజులలో తెలియపరచవలసిందిగా కోరడమైనది. తదుపరి వచ్చు క్లయిములు మా క్లయింటుని బైండ్ చేయజాలవు.
**షెడ్యూలు:** విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయితీ, అంబాపురం గ్రామ రీ. సర్వే నెం. 88, ప్లాటు నెం. 8 దాఖలా 197.11 చ॥గ॥లు లేక 164.80 చ॥మీ॥ల ఖాళీ నివేశన స్థలముకు **హద్దులు: తూర్పు:** కుందేటి స్వరూప్ కుమార్ గారి ఆస్తి, **దక్షిణం:** ప్లాటు నెం.9, **పడమర:** 30 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ఇతరుల ఆస్తి.

**తుర్లపాటి బైర్రాజు, పి.వి.వి. హరినాథ్‌బాబు**
అడ్వకేట్స్, సత్యనారాయణపురం, విజయవాడ- 520 011
ఫోన్: 97053 53284



ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616


## వాతావరణం అనుకూలం.. కోతలు వేగవంతం

దిత్వా తుపాను గండం గట్టెక్కడం, వాతావరణం అనుకూలంగా మారడంతో గన్నవరం నియోజకవర్గంలో ఖరీఫ్ వరి కోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజుల నుంచి ఎండ ఊతమివ్వడంతో నూర్పిడి చేసిన ధాన్యాన్ని నిర్ణీత ప్రమాణాల మేరకు ఉండేలా రైతులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని రెండు కీలక జాతీయ రహదారులపై ధాన్యం ఆరబెడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**మద్దూరు(కంకిపాడు), న్యూస్‌టుడే:** గంగూరులోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మద్దూరులో 'ఆయుష్', సంధ్యా నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. సాధారణ, కంటి, ఎముకలు, గుండె తదితర సమస్యలతో వచ్చినవారికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా తెదేపా యువ నాయకుడు బోడే వెంకటరామ్ పాల్గొని 50 మంది వాలంటీర్లకు ధ్రువపత్రాలు అందజేశారు. పీవో వెంకటేశ్వరరావు, సమన్వయకర్తలు పవన్‌కుమార్, కృష్ణసాయి, వైద్యులు కాశీరాజు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

**గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే:** తోటి వారి పట్ల ప్రేమ, దయా, కరుణ, సేవాభావంతో ఉండాలని ఏసుక్రీస్తు బోధనలను అనుసరించాలని పాస్టర్ సీహెచ్ కిషోర్‌బాబు అన్నారు. గండిగుంటలో పెంతెకొస్తు ఆలయం సమీపంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు.

## పెదపులిపాకలో చోరీ

**పెనమలూరు, న్యూస్‌టుడే:** పెదపులిపాక శివాలయం సమీపంలోని ఓ కూల్‌డ్రింక్స్ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. బీరువా పగలగొట్టిన దుండగులు అందులోని రూ.1.10 లక్షల నగదు, ఉంగరాన్ని ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దుకాణం నిర్వాహకుడు ముసునూరి శ్రీనివాస్ పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


## శ్రద్ధాంజలి



కీ॥శే॥ శ్రీ చిట్నేని వీరేంద్రనాథ్ ముఖర్జీ గారు

మంచికి మారుపేరుగా నిలిచి మాకు ఆప్యాయత, అనురాగాలు పంచి
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన శ్రీ చిట్నేని వీరేంద్రనాథ్ ముఖర్జీ గారు
03.12.2025, బుధవారం స్వర్గస్థులైనారు. కావున
పెద్దకర్మ : 15.12.2025, సోమవారం గన్నవరం, ఋషివాటిక, రావ్‌ఫిన్ ఎస్టేట్‌లోని
మా స్వగృహం నందు జరుగునని తెలియజేయడమైనది. శోకతప్త హృదయాలతో...

భార్య : చిట్నేని రత్నమాంబ తమ్ముడు - మరదలు : చిట్నేని ఋషికేశ్ - ఉషాకాంత

కుమారుడు : చిట్నేని చంద్రశేఖర్ కోడలు : చిట్నేని మున్ని
మనుమలు : చిట్నేని అమిత్, చిట్నేని ఆర్నవ్
కుమార్తె : పాతూరి మాధవి అల్లుడు : పాతూరి కాశీప్రసాద్
మనుమడు : పాతూరి అచ్యుత్
మనుమరాలు : పాతూరి ఆమని

కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు సెల్ : 98492 50296


(c) eenadu

## సూర్యదేవుడి కల్యాణం.. కమనీయం

వేకనూరు (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : వేకనూరు సూర్య దేవాలయంలో ఆదివారం సూర్యదేవుడి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితుడు దీవి నరసింహమూర్తి బ్రహ్మత్వంలో పాలకపాటి రామచంద్రరావు కల్యాణం చేశారు.

# గుడివాడ

• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

## కోట ముత్యాలమ్మకు వెండి కిరీటం

ఘంటసాల, న్యూస్‌టుడే : దేవరకోట కోట ముత్యాలమ్మకు ఘంటసాలకు చెందిన బాణావత్ సతీష్‌బాబు-హిమబిందు దంపతులు రూ.60వేల వెండి కిరీటం అందజేశారు. ఆలయ ధర్మకర్తలు వేమూరి వెంకట రామకృష్ణ, వేమూరి ప్రవీణ్‌కు ఆదివారం అందజేశారు. సర్పంచి బాణావత్ వెంకటేశ్వరమ్మ, సీతారామయ్య పాల్గొన్నారు.

కిరీటం అందజేస్తున్న సతీష్‌బాబు దంపతులు

## పేదలకు సాయం చేయడం గొప్ప వరం

సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : పేదల సాయం చేయడం గొప్ప వరమని రాష్ట్ర సమాచార శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పుట్టినరోజు పురస్కరించుకుని మెగా వైద్య శిబిరం నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గురుమూర్తి బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి అని, తెదేపాను నమ్ముకుని ఎదుగుతూ వచ్చారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో కేసులు పెట్టి హింసించినా తెదేపాను నమ్ముకుని పని చేశారని తెలిపారు. ఆయన పుట్టినరోజున వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి తెదేపా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య), తెదేపా మండల అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, సీనియర్ తెదేపా నాయకుడు రామినేని కుటుంబయ్య, తటూకూరి రమణ తదితరులు గురుమూర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 16 వైద్య విభాగాలకు చెందిన నిపుణులతో శిబిరం నిర్వహించగా ఇందులో 153 మంది రక్తదానం చేశారు. శంకర కంటి ఆసుపత్రి వారు 3003 మందిని పరీక్షలు నిర్వహించి 50 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 850 మంది వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారని గురుమూర్తి తెలిపారు.

## బైపాస్ రహదారి మరిచారా?

అవనిగడ్డ, న్యూస్‌టుడే

❖ మధ్యలో నిలిచిన పనులు ❖ పూర్తికి గ్రహణం

లంకమ్మమాన్యం వంతెన వద్ద బైపాస్ రహదారిపై అడ్డుగా పోసిన కంకర

నియోజకవర్గ కేంద్రం అవనిగడ్డ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ క్రమబద్ధీకరించే ఆలోచనతో భారీ వాహనాలు ప్రధాన రహదారిపై ప్రవేశించకుండా 2018లో అప్పటి ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ బైపాస్‌కు శ్రీకారం చుట్టారు. నీరు- చెట్టు పథకం కింద సుమారు రూ.90 లక్షలు మంజూరు చేయించారు. అవనిగడ్డ రెండో వార్డు కృష్ణా కరకట్ట నుంచి బస్టాండ్ మీదుగా దక్షిణ పంటకాల్వ వెంబడి బందలాయి చెరువు వరకు 3.3 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి పనులు చేపట్టారు.

❖ బందలాయి చెరువు సమీపంలో రెండు గృహాలు ఈ మార్గంలో అడ్డుగా ఉండటంతో అక్కడి వరకు పనులు చేసి, చివరలో నిలిపివేశారు. దీంతో అవనిగడ్డలో భారీ వాహనాలు ప్రవేశించవని, ట్రాఫిక్ అంతరాయం సమస్య పరిష్కారం అవుతుందని పలువురు భావించారు. అయితే తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం రహదారిని పట్టించుకోలేదు. దీంతో వేసిన రహదారి కూడా గుంతలమయంగా తయారైంది. పిచ్చిమొక్కలు పెరిగాయి.

❖ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ బస్ డిపో నుంచి లంకమ్మ మాన్యం వరకు ఉన్న బైపాస్ రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేశారు. అంత వరకు రహదారిని అభివృద్ధి చేసి, తారు రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. లంకమ్మ మాన్యం వంతెన నుంచి బందలాయి చెరువు వరకు సుమారు 1.5 కిలోమీటర్లు రహదారిలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో ఈ రహదారి అభివృద్ధి చేస్తారా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి... అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

## 17 నుంచి కుంభాభిషేక పూజలు

చల్లపల్లి, న్యూస్‌టుడే : చల్లపల్లి మండలం పాగోలులోని శ్రీకైవల్యాశ్రమ చలాచల బోధేపదేశ మందిరంలో శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వరస్వామి మందిర కుంభాభిషేకానికి ఏర్పాట్లు ప్రారంభించారు. శ్రీఅచలేశ్వర మందిరం పైభాగంలో శివలింగాకారంలో శిఖరాన్ని నిర్మించి చుట్టూ కమలం ఆకారంలో సుందరంగా నిర్మించారు. మందిరంపై ముందుభాగంలో శ్రీసదాశివ మూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 17న బుధవారం నుంచి కుంభాభిషేక పూజలు ప్రారంభంకానున్నాయి.

ఎమ్మెల్యేకు ఆహ్వానం.. ఈనెల 17 నుంచి 19 వరకు ప్రముఖ ఆధ్యాత్మిక శైవక్షేత్రం చల్లపల్లి మండలం, పాగోలు కైవల్యాశ్రమంలో ఏర్పాటుచేసిన కుంభాభిషేకం కార్యక్రమానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులను ఆదివారం నిర్వాహకులు ఆహ్వానించారు. నిర్వాహకులు బంగారుబాబు, డొక్కు నాగేశ్వరరావు, యడ్ల శ్రీనివాసరావు, నర్రా చిన్ని పాల్గొన్నారు.

సిద్ధేంద్రయోగి చిత్రపటంతో గ్రామోత్సవం

శిక్షణ పొందుతున్న కళాకారులు

## ముగిసిన కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు

కూచిపూడి, న్యూస్‌టుడే : మొవ్వ మండలం కూచిపూడిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. వేదాంతం కూచిపూడి నృత్య శిక్షణ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కూచిపూడి శ్రీసిద్ధేంద్ర నాట్య కళాపీఠం పూర్వ ప్రధానాచార్యుడు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి ఆధ్వర్యంలో యువ నాట్యాచార్యులు చక్రవర్తుల పవన్‌కుమార్, నిహారిక చౌదరి నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలువురు గురువులు, నాట్య విద్యార్థులు 60 మంది పాల్గొని శిక్షణ పొందారు. ముగింపు రోజైన ఆదివారం నాట్య ఆద్యుడు శ్రీసిద్ధేంద్ర యోగి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. కూచిపూడి నాట్యారామం నుంచి బాలా త్రిపురసుందరి అమ్మవారి విగ్రహం ఎదుట నృత్యం చేశారు. ముగింపు సభలో మొవ్వ ఏఎంసీ ఛైర్మన్ పోతుపాటి శివరామయ్య, హంస అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, నాట్యగురువు వేదాంతం పార్థసారథి, ఆలయ కమిటీ పసుమర్తి నారాయణమూర్తి, రెడ్‌క్రాస్ సొసైటీ మండల ఛైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కూచిపూడి రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొండవీటి అమర బాలేశ్వరరావు, సంగీత చారిణి డాక్టర్ వేదాంతం దుర్గాభవానీ పాల్గొన్నారు. నాట్య శిక్షణ అందించిన గురువు వేదాంతం దేవివాణి, అతిథులు శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు.

## నేత్ర వైద్యశిబిరంలో సేవలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు ధర్మ

నాగాయలంక : స్థానిక మారుతీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో దివంగత తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో ఈనాడు, సుదర్శి మానవతా సేవాసంస్థ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి డాక్టర్ ధర్మ వైద్య పరీక్షలు నిర్వహించి 50 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. నిర్వాహకుడు తలశిల రమేశ్‌బాబు, శిబిరం ఇన్‌ఛార్జి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దీనులకు సేవ చేస్తే దేవునికి చేసినట్లే

గుడివాడ, న్యూస్‌టుడే : ఆకలితో ఉన్న దీనులకు సాయం అందిస్తే ఆ దేవునికి సాయం చేసినట్లే అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ఆటోనగర్‌లో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను మైనారిటీ పెద్దలు సత్కరించారు. విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా మండల అధ్యక్షుడు వాసే మురళీ, నేతలు లింగం ప్రసాద్, చేకూరు జగన్ మోహన్ రావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రషీద్ బేగ్, నాయకులు కర్రె వెంకట గిరి, కడియాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ వేడుకలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ ప్రజలకు భక్తి ఎక్కువ

గుడివాడ ప్రజలకు భక్తి అధికమని అందువల్ల ఇక్కడ దీక్షాదారులు కూడా ఎక్కువగా ఉన్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులో భీమేశ్వరాలయంలో భవానీ దీక్షాదారుల ఇరుముడి కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం జనసేన నేతలు ఏర్పాటు చేసిన పండ్లను దీక్ష విరమణకు ఆయా ఆలయాలకు వెళుతున్న భవానీ, అయ్యప్ప మాలధారులకు అందజేశారు. జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, ఆలయ ఈవో కందుల వేణుగోపాలరావు, ఆలయ ఛైర్మన్ పట్టపు చిన్నా, తెదేపా నేత చేకూరు జగన్ మోహన్‌రావు, జనసేన నేతలు వేమూరి త్రినాథ్, పడాలి సౌమ్య, పవన్, షేక్ నాగుర్ బాషా, కె.అంజనేయులు పాల్గొన్నారు.

## కాల్వగట్టు కోత అరికట్టండి



ఫతేలంక నుంచి దేవరపల్లి పరిసర గ్రామాలకు వెళ్లే మోపిదేవి కాల్వగట్టు రహదారి కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు కోత అరికట్టే గోడ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. గతంలో సడక్ యోజనలో వేసిన ఈ రహదారి రైతులకు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులు ఇళ్లకు చేర్చుకునేందుకు ఉపయుక్తంగా ఉండేది. ఇపుడు అధ్వానంగా మారి అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల పెనమకూరు వంతెన మరమ్మతుల సందర్భంగా ఈ రహదారిలో వాహనాల ఒత్తిడి పెరిగి కొంతమేర రబ్బీసు తోలి తాత్కాలిక మరమ్మతు చేశారు. వర్షాలు పడితే మళ్లీ రహదారి కాల్వలోకి జారే అవకాశం ఉంది. అధికారులు గోడ నిర్మాణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. -ఫతేలంక (పమిడిముక్కల), న్యూస్‌టుడే

## శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే : శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. క్రైం, రికవరీ ఇతర రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, శాంతి భద్రతల విషయంలో రాజీ పడకూడదని సూచించారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. తొలుత సిబ్బంది, వాహనదారులతో కలసి శిరస్త్రాణం ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్సై సత్యనారాయణ, పీఎస్సై దుర్గాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

కప్పులు, ధ్రువపత్రాలు, పతకాలు అందుకుంటున్న విద్యార్థులు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని రామపర్లలో గల మదర్ థెరిస్సా ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ ఎల్. పుష్ప ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14న పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. వీటిలో పాఠశాల విద్యార్థులు వి.ఆకాష్, జి.సిద్ధార్థ, టి.జయవర్ధన్, బి.లోహితస్వ, డి.నిహన్వి, డి.శ్రయాన్షి, సి.హెచ్.జై, ఎ.ధ్రువ, టి.లలిత్ పాల్గొని బంగారు పతకాలు, ధ్రువపత్రాలు అందుకున్నట్లు చెప్పారు. విజేతలను, కోచ్ జి.శంకర్‌బాబును అభినందించారు.

## రహదారి టెండర్ల రద్దుపై వాడీవేడి చర్చ

పీఆర్ ఏఈని ప్రశ్నిస్తున్న వైఎస్ ఎంపీపీ సీతారామాంజనేయులు

మోపిదేవి, న్యూస్‌టుడే : వెంకటాపురం- పెదకళ్లేపల్లి బీటీ రహదారి నిర్మాణానికి మూడు నెలల కితం మంజూరైన రూ.2.60 కోట్ల నిధులకు సంబంధించి టెండర్లు రద్దు కావటంపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆదివారం వాడీవేడి చర్చ జరిగింది. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పదేళ్లుగా రహదారికి నిధుల కోసం శ్రమిస్తున్నామని, చేతికి వచ్చినట్లే వచ్చి టెండర్లు రద్దు కావటంపై సమాధానం చెప్పలేక పోతున్నామంటూ వైఎస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు పీఆర్ ఏఈ శ్రీనివాసరావును ప్రశ్నించారు. సాంకేతిక కారణాలతో రద్దు అయిందని ఆయన చెప్పారు. ధాన్యం తేమ శాతం సాకు చూపి రైస్ మిల్లర్లు దోచేస్తున్నా జిల్లా ఉన్నతాధికారుల పట్టించుకోని తీరుపై వైఎస్ ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం స్మార్ట్ కార్డులు అందక చాలా మంది అడుగుతున్నారని సర్పంచి ఏసుబాబు ప్రశ్నించారు. ఉప ఎంపీపీ నడకుదిటి జననీకుమారి, ఎంపీడీవో స్వర్ణభారతి, ఏవో పాండు రంగారావు, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుక

కేకు కోస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా తదితరులు

(కూచిపూడి), న్యూస్‌టుడే : మందపాలెంలో సెమీ క్రిస్మస్ వేడుకలో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి.. కేకు కోసి మిఠాయిలు పంచారు. ఎమ్మెల్యే, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాస్టర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కాజ (కూచిపూడి), న్యూస్‌టుడే : మొవ్వ మండలం కాజలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అందజేశారు. లబ్ధిదారుల గృహాలకు శనివారం వెళ్లిన ఆయన చిట్టిబొమ్మ దశరథరామయ్యకు రూ.40 వేల చెక్కు, సందోలు కోటేశ్వరరావుకు రూ.20,524 చెక్కు అందించారు. రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తాతా నారాయణరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి యార్లగడ్డ శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు శీలం శేఖర్ పాల్గొన్నారు.

పామర్రు గ్రామీణం : మండలంలోని ఉండ్రపూడిలో మెరుగు అరవింద్‌కి రూ.20 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే కుమార్ రాజా అందించారు.

## అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు

విజేతగా నాగమల్లేశ్వరరావు (మధ్యలో)

చల్లపల్లి, న్యూస్‌టుడే : చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామానికి చెందిన మురాల నాగమల్లేశ్వరరావు ఏడో ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 40- 45 ఏళ్ల విభాగంలో బంగారు పతకం సాధించాడు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపట్ల ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఐదు కిలోమీటర్ల పరుగు పందెం విభాగం, 1500 మీటర్ల పరుగు విభాగంలో బంగారు పతకాలు సాధించాడు. 110 హార్డిల్స్ విభాగంలో వెండి పతకం సాధించి సత్తా చాటాడు. విశాఖపట్నంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమల్లేశ్వరరావు విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించడంపై చల్లపల్లి మండలం, వక్కలగడ్డ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## శుభ్రత పట్టించుకునే వారే లేరా?

అవనిగడ్డలో టిఫిన్ హోటల్స్ 19, టీ స్టాల్స్ 15, భోజన హోటళ్లు 5 ఉండగా పక్కా భవనాలు, షెడ్లలో నిర్వహిస్తున్న వాటిలో పారిశుద్ధ్యం బాగున్నప్పటికీ, రోడ్డు మార్జిన్‌లో, కాల్వగట్టు మార్జిన్‌లో నిర్వహించే వాటి వద్ద శుభ్రత లోపించింది. ఏడాది క్రితం కాల్వగట్టు పక్కన రోడ్డు మార్జిన్‌లో బండి పెట్టి నిర్వహిస్తున్న టిఫిన్ హోటల్ లైసెన్స్ కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్రమ వసూళ్లకు పాల్పడగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తర్వాత ఆయన్ను సస్పెండ్ చేయగా ఆయన స్థానంలో వేరొకరిని నియమించక పోవడంతో హోటళ్లలో శుభ్రత గురించి పట్టించుకునే వారు కరవయ్యారు. శుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -అవనిగడ్డ, న్యూస్‌టుడే

చల్లపల్లిలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు మోహనరావు

వైద్యసేవలు పర్యవేక్షిస్తున్న లయన్స్ ప్రతినిధులు

## వైద్య శిబిరాలు.. ఉచిత సేవలు

చల్లపల్లి, న్యూస్‌టుడే : చల్లపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో డాక్టర్ మోహనరావు 69 మందిని పరీక్షించి 27 మందిని శస్త్రచికిత్సలకు పంపారు. అమరావతి కంటి ఆసుపత్రి వైద్యుడు వేణు వైద్య శిబిరం నిర్వహించి.. 49 మందికి మందులు అందజేశారు. వాసవీ క్లబ్ కార్యదర్శి గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, ప్రతినిధులు దింటకుర్తి జ్యోతి, వరదా రాజశేఖర్, మలిశెట్టి చెంచురాములు, రాధాకృష్ణ, యండూరి లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ వైద్యురాలు జి.రజని, వైద్య సిబ్బంది పాల్గొని 80 మందిని పరీక్షించారు. దాతలు నర్రా గంగాధరరావు, వల్లభనేని రామకృష్ణ, కొసరాజు బాపయ్య చౌదరి వితరణతో ఉచితంగా మందులు అందించారు. లయన్స్ ప్రతినిధులు మూల్పూరి సుధాకర్, చాపరాల రాజా, బాలాజీ, కుంచపర్తి మురళీ, పెరుమాళ్లు పర్యవేక్షించారు.

## సీనియర్ పాత్రికేయుడి మృతికి సంతాపం

ప్రభాకర్

అంగలూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : మండలంలోని అంగలూరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు దుగ్గిరాల ప్రభాకర్ (64) ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడ్డారు. 40 ఏళ్లుగా ఆయన పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ఆయన సిటీకేబుల్ ప్రభాకర్‌గా సుపరిచితులు, తర్వాత సొంతంగా కోస్తాజ్యోతి పేరిట సాయంకాలం దినపత్రిక నిర్వహించారు. మృతదేహానికి మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, పాత్రికేయులు నివాళి అర్పించారు.

## రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ

విజేతలతో గౌతమ్ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసాద్

గుడివాడ : విశాఖపట్నం ఉడా పార్కులో 5 నుంచి 15 నిర్వహిస్తున్న 63వ జాతీయ రోలర్ హాకీ స్కేటింగ్ పోటీల్లో గుడివాడ డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల చిన్నారులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ పి.లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గౌతమ్ పాఠశాలలో విజేతలను ఆదివారం అభినందించారు. క్యాడెట్స్ కేటగిరిలో పి.కారుణ్య వెండి పతకం, టైనీ టాట్స్‌లో వి.చేతన కృష్ణ కాంస్య పతకం, బి.ప్రవర్షిణి రామ్‌రాజ్ కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు.

## గౌడ సంఘీయుల సంక్షేమానికి కృషి

సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న కొనకళ్ల బుల్లయ్య

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: గౌడ సంఘం సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా రాష్ట్ర నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) అన్నారు. ఆదివారం బేతవోలు వాటర్ ట్యాంక్ సమీపంలో గుడివాడ గౌడ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడు రాజులపాటి వీర వెంకటేశ్వరరావు, కార్యదర్శులు శొంఠి శ్రీనివాసరావు, పంతంగి శివ నాగేశ్వరారవు, వంకా లక్ష్మయ్య, కాగిత వెంకటేశ్వరరావు, శొంఠి నీలకంఠస్వామితో ప్రమాణ స్వీకారం చేయించారు. యార్లగడ్డ గోవర్ధనరావు, బొర్ర చలమయ్య, ఈడే వెంకట విష్ణు మోహనరావు, గూడవల్లి వెంకటేశ్వరారవు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## పాఠశాలకు జాతీయ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు

అవార్డు అందుకున్న షైనింగ్ స్టార్ పాఠశాల నిర్వాహకులు

గుడివాడ, న్యూస్‌టుడే : పట్టణంలోని రాఘవేంద్రనగర్‌లో గల షైనింగ్ స్టార్ పాఠశాలకు జాతీయ స్థాయి ఎక్సలెన్స్ అవార్డు వచ్చినట్లు నిర్వాహకులు లింగంనేని జగదీష్, స్రవంతి ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 12న హైటెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు చెప్పారు. విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, నిర్వహణ నైపుణ్యాలు పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

## వంతెనకు తాత్కాలిక మరమ్మతులు

వంతెనకు చేసిన మరమ్మతులు

పెదపారుపూడి : ఇటీవల భారీ వాహనాలు వెళ్లడంతో దోసపాడు ఛానల్‌పై ఉన్న పాములపాడు వంతెన కుప్పకూలింది. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చొరవతో తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు దోసపాడు తెదేపా సీనియర్ నేత సజ్జా శివకుమార్ తెలిపారు. ఆదివారం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ వందేళ్ల నాటి వంతెన కావడంతో రోడ్డు మరమ్మతులకు కంకర లారీలు వెళ్లడంతో కూలిందన్నారు.

## నిభానుపూడిలో వరికుప్ప దగ్ధం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో నిభానుపూడిలో వరికుప్ప దగ్ధమై రూ.20 వేలు నష్టం జరిగినట్లు మచిలీపట్నం అగ్నిమాపకాధికారి ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన బలవరవు దివ్యకుమార్‌కు చెందిన 0.70 ఎకరాల వరి కుప్ప దగ్ధమవగా మచిలీపట్నం అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. సిగరెట్ ఆర్పకుండా పడేయడంతో ప్రమాదం సంభవించి ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు ఘన సత్కారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఏపీపీగా నియమితులైన కర్రా సుధాకర్, లంకమ్మ దేవస్థానం కమిటీ ఛైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, శివాలయం ఛైర్మన్ ఘంటసాల రాజమోహన్‌రావు, తదితరులు ఆదివారం ఘనంగా సత్కరించారు. తమను ఏపీపీగా నియమించడం, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా నియమించడంపై వారు ధన్యవాదాలు తెలిపారు.

## కొండలమ్మకు 15 వేలమంది భక్తుల పూజలు

పొంగళ్లు వండుతున్న మహిళలు

వేమవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : మండలంలోని ప్రసిద్ధ వేమవరం కొండలమ్మ దేవస్థానాన్ని ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధనుర్మాసం రానుండటంతో జిల్లా నలుమూలల నుంచి వేలమంది తరలివచ్చి పూజలు నిర్వహించారు.

## తెదేపాకు ప్రవీణ్‌చంద్ర సేవలు వెలకట్టలేనివి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : యువకుడు, తెదేపా పామర్రు మండల పార్టీ అధ్యక్షుడు కుదురవల్లి ప్రవీణ్‌చంద్ర పార్టీకి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ స్వగ్రామమైన పామర్రు మండలం నిమ్మకూరులో తెదేపా మండల అధ్యక్షుడి జన్మదిన వేడుక నిర్వహించారు. ప్రవీణ్‌చంద్రతో కలిసి కేకు కోసి పంచారు. కృష్ణా జిల్లా పీసీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

10వ తరగతి మార్కుల లిస్టు పోయినది
కృష్ణా జిల్లా, పమిడిముక్కల మండలం, మర్రివాడ గ్రామ కాపురస్తురాలు మదిరి సుధారాణి, D/o మదిరి ఇశ్రాయేలు D.No. 1-31 గల SSC ఒరిజినల్ మార్కుల లిస్టు నెం. 0289958 పోయినది. దొరికినవారు ఈ క్రింద నెంబరుకు తెలియజేయగలరు.
✆ 63006 56563

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్

## మదిలో దుర్గమ్మ.. ఇరుముడి తెస్తిమమ్మ

భవానీ దీక్షల విరమణ సందర్భంగా ఇంద్రకీలాద్రి ఆదివారం కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భవానీలు తరలివచ్చి దుర్గమ్మకు ఇరుముడి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది వచ్చారని అధికారులు తెలిపారు. సోమవారం వేడుకలు ముగుస్తాయి. - ఈనాడు, అమరావతి

రాత్రి 11 గంటలయినా భక్తులతో కిటకిట

## సూక్ష్మ కళ.. రూపు భళా..

ఆవగింజలతో శివుడు

**ది**వ్యాంగుడైన అనకాపల్లి జిల్లా తూటిపాల గ్రామానికి చెందిన **బోడసపర్తి రవికుమార్** అనే సూక్ష్మ చిత్రకారుడు విజయవాడలో ఆదివారం ఏర్పాటు చేసిన చిత్రకళా సంతలో ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. తోటకూర, ఆవ, దోస గింజలు తదితరాలతో రూపొందించిన చిత్రాలు కనువిందు చేశాయి. ముఖ్యంగా భగవద్గీతలో 700 శ్లోకాలను 23,801 దోసగింజలను ఉపయోగించి ఒక్కో గింజపై ఒక్కో అక్షరం రాశారు. అంతేకాకుండా భగవద్గీతను అంగుళం సైజు పుస్తకంలో కూడా లిఖించారు. ఇవేకాకుండా పరమశివుడు, ఎన్టీఆర్, భారతదేశం, రైతు, సీఎం చంద్రబాబునాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు తదితర చిత్రాలను ఆవ, తోటకూర గింజలతో రూపొందించడం విశేషం. - **ఈనాడు, అమరావతి**

## ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నేడు

**సూర్యారావుపేట, న్యూస్‌టుడే :** జాతీయ ఇంధన పొదుపు, సంరక్షణ దినోత్సవం సందర్భంగా డిసెంబరు 12 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రదర్శన ప్రారంభమవుతుంది. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు ఏపీ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో విద్యుత్తు పొదుపు, ఇంధన వనరుల సంరక్షణపై భారీ ప్రదర్శన నిర్వహిస్తారు. కలెక్టర్ జి.లక్ష్మీశ, ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టి.వి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు జెండా ఊపి ప్రారంభిస్తారు. ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ హనుమయ్య తన కార్యాలయం నుంచి అధికారులు, ఉద్యోగులతో కలిసి ప్రదర్శనగా కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంధన పొదుపు, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అతిథులు ప్రసంగిస్తారు.

# రూ.లక్షలు వెచ్చిస్తే.. కోట్లు వస్తాయ్!

## శిథిల దుకాణసముదాయాలు చక్కదిద్దితే ఆదాయం

ఈనాడు, అమరావతి

'విజయవాడ నగరపాలికకు.. కీలక ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన స్థలాలున్నాయి. వీటిని సరిగ్గా వినియోగిస్తే.. భారీగా ఆదాయం సమకూరుతుంది. వీటిలో దశాబ్దాల నాటి పురాతన దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఇక్కడ ప్రైవేటు దుకాణాలు, కార్యాలయాల అద్దెలు ఆకాశంలో ఉండగా.. ఇవి మాత్రం పాడుబడి.. కూలేలా ఉన్నాయి. వీటిని ఆధునికీకరిస్తామని.. ఏళ్లుగా చెప్పడమే తప్ప.. ఆచరణ ఊసేలేదు."

గాంధీనగర్‌లో రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్ సముదాయం 80 సెంట్లలో ఉంది. వైకాపా హయాంలో కూలగొట్టి.. కొత్తగా కట్టాలని నిర్ణయించారు. సగం కూలగొట్టిన తర్వాత.. నేతలు అడ్డుకోగా.. ఆధునికీకరణ ఆగింది. నాటి నుంచి.. ఈ దుకాణ నిర్వాహకులు చాలామంది అద్దెలే చెల్లించడం లేదు. వీరికి ప్రస్తుత పాలకవర్గమైన వైకాపా నేతలు అండ ఉంది.

**విలువైన ప్రాంతాల్లో..**

63 వాణిజ్య సముదాయాల్లో... 4000 దుకాణాలున్నాయి. ఏటా రూ.22 కోట్ల ఆదాయమే వస్తోంది. వస్త్రలత, కాళేశ్వరరావు మార్కెట్, ఎన్టీఆర్ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ స్టేడియం ఆనుకుని ఉన్న దుకాణాలకు భారీగా డిమాండ్ ఉంది. ఇవన్నీ అత్యంత ఖరీదైన ప్రాంతాల్లోనే ఉన్నా.. అద్దెలు అరకొరే వస్తున్నాయి. ఆధునికీకరిస్తే.. కనీసం నాలుగైదు రెట్లు ఆదాయం పెరుగుతుంది.

**ఐదేళ్లు విచ్చలవిడి తనం..** వైకాపా హయాంలో ఐదేళ్లు నేతలు విచ్చలవిడిగా ఈ దుకాణాలను కేటాయించుకున్నారు. తమకు డబ్బులు ఎవరు ఎక్కువ ఇస్తే.. వాళ్లకే ఇచ్చుకున్నారు. భారీగా చెల్లించాల్సిన గుడ్‌విల్‌కు కూడా గండికొట్టారు. రూ.30 లక్షల వరకు గుడ్‌విల్ ఉంటే.. రూ.5 లక్షలకు తగ్గించేశారు. సగం వైకాపా నేతలు, మిగతాది పాడుకున్న వాళ్లు లబ్ధిపొందారు. టెండర్లు కూడా చాలా దుకాణాలకు పిలవలేదు. ఖాళీ అయితే.. సీల్డ్ కవర్, బహిరంగ వేలంలో ఎవరు ఎక్కువకు పాడితే వాళ్లకే ఇవ్వాలి. కానీ.. ఇవేవీ అమలు జరగలేదు.

రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్లో పాడుబడిన దుకాణాలు

**అభివృద్ధికి ప్రణాళికలు..**

- ఎ.శ్రీధర్, ఎస్టేట్ ఆఫీసర్

నగరంలో దుకాణ సముదాయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఉండే దుకాణ సముదాయాలను ఆధునికీకరించి.. పాలికకు ఆదాయాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

## శత వసంతం.. శుభమనంతం..!

ఈ అక్షర కోవెలకు 112 ఏళ్లు

**నం**దిగామలో జడ్పీ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేకత ఉంది. దీనిని స్వాతంత్ర్యానికి పూర్వమే దివంగత తుర్లపాటి పెద్దవీరభద్రరావు, దివంగత అయ్యదేవర రామనరసింహం తదితర వ్యవస్థాపక కమిటీ సభ్యులు 9 జూన్ 1913లో 14 ఎకరాల విస్తీర్ణంలో స్థాపించారు. 1921లో ఉన్నత పాఠశాలగా మారింది. 1 ఆగస్టు 1922లో ఈ బడి జిల్లా బోర్డు పరిధిలోకి వచ్చింది. ఈ పాఠశాల ఏర్పాటై 112 సంవత్సరాలు అవుతోంది. ఇక్కడ చదివిన ఎంతోమంది రాజకీయ నాయకులుగా, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు ఇక్కడే చదువుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు నుంచి పది వరకు 860 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్వం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని కూల్చారు. తరువాత నిర్మించిన భవనంలో కొన్ని గదుల్లో పదో తరగతి, హెచ్‌ఎం రూం, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మిగిలిన తరగతుల విద్యార్థులకు కొత్తగా తరగతి గదులు నిర్మించారు. ఈ ప్రాంతంలో ఇదే పురాతన పాఠశాల అని ప్రధానోపాధ్యాయిని పొదిలి విజయలక్ష్మి తెలిపారు. - **నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

## రిటర్నబుల్ ప్లాట్ల ఈ- లాటరీకి వేళాయె..

**తుళ్లూరు, న్యూస్‌టుడే:** ప్రజా రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో 9.14 అగ్రిమెంటు ద్వారా భూములు ఇచ్చిన రైతులకు, అనంతవరంలో ఎన్-17 రహదారిలో భూములు కోల్పోతున్న 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నెం.18లో మినహాయింపు భూమి వల్ల ప్రభావితమైన ఇద్దరు రైతులకు, మల్కాపురంలో అనధికార లేఔట్ వల్ల ప్రభావితమై 65శాతం-35 శాతం కింద ఉన్న ఏడుగురు రైతులకు ఈ లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ★ కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు1, 2 వెలగపూడి, మందడం 1, 2, నిడమర్రు 1, 2 గ్రామాల రైతులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అదేవిధంగా పెనుమాక, తుళ్లూరు 1, 2, నెక్కల్లు, అనంతవరం, రాయపూడి 1, 2 వెంకటపాలెం, దొండపాడు, ఐనవలోలు, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల రైతులకు మ.2 నుంచి 4 గంటల వరకు, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు సంబంధించిన పత్యామ్నాయ ప్లాట్లకు సంబంధించి 4 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రాయపూడి సమీపంలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. మొత్తం 225 మంది రైతులకు 405 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు.

## రామయ్య.. కుడివైపునే సీతమ్మ

**హ**నుమాన్‌జంక్షన్ కూడలిలోని రామాలయానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ స్వామి వారు సీతమ్మ సహితంగా కొలువుదీరి శ్రీసీతారామచంద్రుడిగా నిత్యం పూజలందుకుంటారు. ఇందులో వింతేముంది? అంటారా, కానీ ఇక్కడ మాత్రం సీతమ్మ వారు శ్రీరాముడికి కుడివైపున కొలువుదీరి ఉంటారు. దాదాపుగా ఏ గుడిలోనైనా అమ్మవారు రాముడికి ఎడమ వైపున ఉండేలా విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. కానీ జంక్షన్‌లో మాత్రం కుడివైపున అమ్మవారు దర్శనమిస్తుంటారు. పదేళ్ల కిందట లారీ ఢీకొట్టడంతో పాత ఆలయం పూర్తిగా నేలమట్టం అయింది. అప్పట్లో ఉన్న పాలరాతి విగ్రహాలు కూడా ధ్వంసమయ్యాయి. దాతల సాయంతో వెంటనే ప్రస్తుతం ఉన్న దేవాలయాన్ని నిర్మించగా, కొత్తగా ప్రతిష్ఠించిన నల్లరాతి విగ్రహాలను కూడా పాత తరహాలోనే ఏర్పాటు చేయడం గమనార్హం. – న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

## బావి తరాలకు బతుకు తరువై



**గ్రా**మాల్లో ప్రజలకు తాగునీరు అందించే వనరుల్లో బావులు కీలకం. ఇప్పటికీ ఆ నీటినే తాగడానికి వినియోగిస్తుంటారు. అయితే కాలక్రమంలో వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పాడవుతున్నాయి. అలా ఉన్న బావిని కుండీగా చేసుకుని ఎదిగిన ఈ చెట్టును అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు. పెడన మండలం చేవేంద్రపాలెం గ్రామంలో రహదారి పక్కన ఉన్న తాగునీటి బావిలో చెట్టు ఎదిగింది. బావి పాడైపోవడంతో నీటి అవసరాల కోసం సమీపంలో మరొకటి తవ్వారు. అయితే అలంకార ప్రాయంగా ఉన్న బావి.. ప్రస్తుతం ఆ వృక్షానికి ఆసరాగా నిలిచి అందరినీ ఆలోచింపజేస్తోంది. – మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

## స్మార్ట్‌గా పౌరసరఫరాలు

### జనవరి నుంచి మనమిత్ర యాప్, వాట్సప్ సేవలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో కొత్త ఒరవడి దిశగా కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు, ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చారు. అదే దిశగా కొత్త ఏడాది నూతన సంస్కరణలు చేస్తోంది. – **ఈనాడు, అమరావతి**

**ఒక్క నంబర్.. ఎన్నో సేవలు..**

✦ 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పెడితే వెంటనే ప్రభుత్వంలోని వివిధ శాఖలు కనిపిస్తాయి. పౌర సరఫరాలపై క్లిక్ చేస్తే సేవలు కనిపిస్తాయి. వాటిల్లో మన సమస్యపై దరఖాస్తు చేయొచ్చు. * కొత్త రేషన్ కార్డుకు చరవాణి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని పత్రాలు అప్‌లోడ్ చేస్తే సచివాలయానికి దరఖాస్తు చేరుతుంది. పరిశీలన అనంతరం రేషన్ కార్డు చిరునామాకు చేరుతుంది. కార్డులో కొత్త సభ్యులను చేర్చడం, మరణించిన వారి తొలగింపు, చిరునామా మార్పు, ఇలా ఏ సేవైనా ఇందులో పొందవచ్చు. ✦ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతోంది. వలసలు వెళ్లిపోవడం.. కార్డులు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో వేల మంది ఇంకా కార్డులు తీసుకోలేదు. స్మార్ట్ కార్డు పోగొట్టుకున్నవారు డూప్లికేట్ కార్డు తీసుకునేందుకు యాప్‌లో అవకాశం ఉంది.

అక్రమాలు, అవకతవకలు, లోపాలపై ఫిర్యాదుకు వీలుగా ప్రతి చౌక దుకాణంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఫోన్‌లో స్కాన్ చేసి ఫిర్యాదులు, పౌరసరఫరాలపై అభిప్రాయాలు ఇవ్వొచ్చు. విచారణ చేసి చర్యలు తీసుకుంటారు.

☛ 73373 59375 నంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే ధాన్యం కొనుగోలు ఎప్పుడు చేస్తారో షెడ్యూలు చేసుకునే వీలుంది.

☛ వివాహం తర్వాత పాత కార్డు నుంచి తొలగించి కొత్తగా కార్డు ఇవ్వడానికి పెద్ద ప్రహసనం సాగేది. ప్రస్తుతం పెళ్లి ధ్రువపత్రం అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు పాత కార్డు నుంచి తప్పిస్తారు.

**అరచేతిలో సేవలు..**

ఫోన్‌తో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగడం, సిబ్బంది దగ్గర ప్రాధేయ పడాల్సిన అవసరం లేదు. అందరూ మనమిత్ర వాట్సప్ నంబర్ సేవ్ చేసుకుని ఉపయోగించుకోవాలి.

**-నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల మంత్రి**

## ఇవ్వమంటే ఇరుకున.. ఇచ్చారంటే పరుగున

### పౌరసేవల్లో పంచాయతీ కార్యదర్శుల దందా

ఈనాడు – అమరావతి

"**కొం**దరు పంచాయతీ కార్యదర్శుల అక్రమాలు హద్దు మీరుతున్నాయి. నిధుల దుర్వినియోగం, పౌర సేవల విషయంలో ఆమ్యామ్యాలు తీసుకోవడం.. పంచాయతీ ఆదాయానికి గండి కొట్టేయడం... ఇలా లెక్కకు మించిన వ్యవహారాలతో కాసులు పోగేసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులను వాటాలు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో చూసినా అడ్డగోలు వ్యవహారాలు చేస్తున్న కార్యదర్శులు ఉన్నారు. సర్పంచి అండ.. స్థానిక నాయకుల ఆశీస్సులతో సర్వం చక్కబెడుతున్నారు."

**ఎందెందు వెతికినా...**

ఏ.కొండూరు మండలంలో మూడు పంచాయతీల్లోని ఇటుక బట్టీలు, వ్యాపార సముదాయాలు, పెట్రోలు బంకుల... పన్ను వసూలు సవ్యంగా చేయడం లేదు. మామూళ్లు తీసుకుని చెల్లించాల్సిన కొండంత పన్నుకు గోరంత వసూలు చేసి మమ అనిపిస్తున్నారు. ★ పెనుగంచిప్రోలు మండలంలో ఓ కార్యదర్శి సర్పంచితో కుమ్మక్కై గతంలో చేసిన పనులకు తప్పుడు బిల్లులు పెట్టి భారీగా సొమ్ము స్వాహా చేశారు. హరిత రాయబారులను నియమించకనే బినామీలతో రూ.లక్షల్లో సొమ్ము పక్కదారి పట్టించారు. ★ జగ్గయ్యపేట మండలంలో ఓ పంచాయతీలో జరిగిన రూ.కోట్ల అవినీతి వ్యవహారంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించారు. అసలు పని చేయకుండానే చేసినట్లు చూపి భారీగా మింగేశారు. ★ విజయవాడ సమీపంలో భారీగా ఆదాయం వచ్చే పంచాయతీలో ఓ కార్యదర్శి అదనపు బాధ్యతలు నిర్వర్తించేలా ఓ నాయకుడిని ప్రసన్నం చేసుకుని భారీగా నిధుల స్వాహా చేస్తున్నారు.

**నాయకుల అండతో..**

పంచాయతీల్లో అక్రమాల్లో కార్యదర్శులు తెర ముందు పాత్రధారులే. తెర వెనుక సూత్రధారులు మాత్రం సర్పంచులు, స్థానిక నాయకులనేది బహిరంగ రహస్యమే. ★ కార్యదర్శులు అక్రమాలకు వెనుకంజ వేస్తున్నా 'మేమున్నాం చూసుకుంటాం' అని ముగ్గులోకి దించుతున్నారు. తీరా అక్రమాలు వెలుగులోకి వస్తే కార్యదర్శులే బలవుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

★ దీనిపై ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ మాట్లాడుతూ, కార్యదర్శుల అక్రమాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బెజవాడ చరితకు సాక్ష్యం... గద్దబొమ్మ..

**వి**జయవాడలో మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ పిల్లర్ ఎక్కడ ఉంది అని అడిగితే.. చాలా మంది చెప్పలేరు. కానీ గద్దబొమ్మ ఎక్కడంటే.. టక్కున చెప్పేస్తారు. ఆ రెండూ ఒక్కటే. ఆంగ్లేయుల కాలం నుంచే బెజవాడకు ఘనమైన చరిత్ర ఉంది. 2.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో.. 9,936 మంది జనాభాతో బెజవాడ పురపాలక సంఘం 1888, ఏప్రిల్ 3న ఏర్పడింది. 1945, జులై 23న స్వర్ణోత్సవాలు నిర్వహించారు. దీనికి గుర్తుగా 'బెజవాడ మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ పిల్లర్'ను కాళేశ్వరరావు మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేశారు. 1888 నుంచి మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలు అందిస్తున్న అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు దీన్ని ఆవిష్కరించారు. దీని పైభాగంలో బంగారు రంగుతో మెరిసిపోయే గద్దబొమ్మ ఉంటుంది. స్తూపం నిర్మాణ ఖర్చును మజ్జి సీతారామయ్య పాత్రుడు భరించారు. జీబు వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు.

**ముఖ్యమైన కట్టడాలు తెలిపేలా..** ఈ స్తూపానికి నలువైపులా చరిత్రను తెలిపే శిలాఫలకాలు ఉన్నాయి. ముందు భాగం బెజవాడ చరిత్రకు అద్దం పడుతోంది. ముఖ్యమైన కట్టడాలు, అవి నిర్మించిన సంవత్సరాల వివరాలున్నాయి. శివుడి గుడి, దుర్గగుడి, అక్కన్న మాదన్న గుహలు, షారా ఐ ఖానా మస్క్, కృష్ణానదిపై ఆనకట్ట, రోమన్ క్యాథలిక్ చర్చి, విక్టోరియా మ్యూజియం, అరండల్ సత్రం, రైల్వేస్టేషన్ నిర్మాణాలు ఎప్పుడు నిర్మించారో వివరాలు ఉన్నాయి. మిగిలిన వైపున నాటి మున్సిపల్ కౌన్సిలర్లు, గోల్డెన్ జూబ్లీ కమిటీ సభ్యుల పేర్లు ఉన్నాయి.

**భావితరాలకు అందిద్దాం..** ఈ స్తూపం పట్ల నగరపాలకసంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. దీనిపై గోడపత్రికలు అంటిస్తున్నారు. శిలాఫలకంపై పిచ్చి మొక్కలు పెరుగుతూ..శిథిలం చేస్తున్నాయి. అధికారులు స్పందించి.. సంరక్షించాల్సిన అవసరం ఎంతో ఉంది.

– గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

## నేడు విధుల్లోకి కలెక్టర్

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్టర్ జి.లక్ష్మీశ వ్యక్తిగత విదేశీ పర్యటన ముగిసిన నేపథ్యంలో ఈనెల 15వ తేదీ సోమవారం ఆయన తిరిగి విధుల్లోకి రానున్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు:** భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేశామని అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో కూడా రద్దు చేశామని సీపీ వెల్లడించారు.

# అక్రమం గుట్టు... శివాని కెరుక!

ఈనాడు, అమరావతి

☛ **అజ్ఞాతం వీడని లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సీఈవో**

☛ **బోర్డు తిప్పేసే నాటికే సొమ్ము దారి మళ్లింపు**

'ప్రస్తుతం మన భవిష్యత్తు ఏంటి? వచ్చే తరాలకు భరోసా ఏంటి? వీటిని దృష్టిలో పెట్టుకుని పేదలు, మధ్యతరగతి వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని' రంగురంగుల బ్రోచర్లతో ప్రచారం చేశారు. ఊరూరా భార్యాభర్తలు.. శివాని, దుర్గాప్రసాద్ అందరినీ నమ్మించారు. భారీగా డిపాజిట్లు రాగానే సొమ్ము పక్కదారి పట్టించి.. బోర్డు తిప్పేశారు. వేల మంది లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్‌లో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టి నష్టపోయారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో యూట్యూబ్‌లో భారీగా ప్రచారం చేశారు. ఈ మాటలు నమ్మి మచిలీపట్నం, భవానీపురం, విస్సన్నపేట, రాజోలు, కాకినాడ, ఏలూరు, ఖమ్మం, తదితర చోట్ల కార్యాలయాలు పెట్టి డిపాజిట్లు వసూలు చేసి నిండా ముంచేశారు.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు...**

విస్సన్నపేట ఠాణాలో శుక్రవారం రాత్రి సంస్థపై కేసు పెట్టారు. ఇంకా పలువురు బాధితులు వరుస కడుతున్నారు. పెద్దసంఖ్యలో బాధితులతో ముడిపడిన అంశం కావడంతో దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను వేశారు. మొత్తం ఎంత వసూలు చేశారు? ఇప్పటికి ఎంత చెల్లించారు? డిపాజిట్‌దారులకు ఇచ్చిన బాండ్లు పరిశీలించనున్నారు. సంస్థ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము ఎక్కడికి తరలింది? నిర్వాహకులు.. బినామీ పేర్లతో ఆస్తులు కొన్నారా? అని తేల్చనున్నారు. బ్యాంకు లావాదేవీల స్టేట్‌మెంట్లు తీసుకొని.. ఖాతాలను ఫ్రీజ్ చేయనున్నారు. దుర్గాప్రసాద్, శివానిల బంధువుల ఆస్తులను పరిశీలించనున్నారు. బాధితుల చిట్టా తయారీలో పోలీసులు నిమగ్నమయ్యారు.

**ద్వాక్రా మహిళలే ఎక్కువ..**

పేద, మధ్యతరగతి వారినే లక్ష్యంగా చేసుకునే నిర్వాహకులు డిపాజిట్లు వసూలు చేశారు. వీరిలోనూ డ్వాక్రా మహిళలే ఎక్కువ. వీరికి రుణాలు మంజూరవగానే.. ఊళ్లలో సమావేశాలు పెట్టి, సంస్థలో పెట్టుబడి పెట్టాలని.. అధిక వడ్డీ ఆశజూపారు. దీంతో చాలా చోట్ల పొదుపు మహిళలు ఎక్కువగా డిపాజిట్లు చేశారు. బంగారాన్ని, ఇంటి పత్రాలను తనఖా పెట్టి మరీ డిపాజిట్ చేశారు. మార్చి నుంచే చెల్లింపులు ఆగాయి. గట్టిగా నిలదీసిన వారికీ అరకొరే ఇచ్చారు. మరికొందరికి చెక్కులిచ్చి చేతులు దులుపుకొన్నారు.

**బంధువుల ఖాతాలకు..**

రెడ్డిగూడెం మండలంలో శివాని కనిపిస్తే పట్టుకున్నారని ప్రచారం సాగినా పోలీసులు ధ్రువీకరించలేదు. శుక్రవారం రాత్రి మద్దెలపర్వలో ఆమె తల్లిదండ్రుల ఇంటికి బాధితులు వెళ్లి పరిశీలించారు. ఇంట్లో 250 గ్రాముల బంగారు నగలు కొన్న రశీదులు దొరికాయి. నూజివీడులో ఓ దుకాణంలో ఏడాది లోపు కొన్న బిల్లులు కనిపించాయి. శివాని, ఆమె బంధువులు కొందరు కనిపించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. సంస్థకు చెందిన నాలుగు కరెంటు ఖాతాల నుంచి కుటుంబీకులు, బంధువుల బ్యాంకు ఖాతాలకు రూ.2-3 కోట్లు బదిలీ అయినట్లు భావిస్తున్నారు. శివాని స్థలాలు కూడా ఆమె బంధువుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది.

(c) eenadu

# 4 రోజులు.. 3.75 లక్షల మంది భవానీలు

## పక్కా ఏర్పాట్లతో సత్ఫలితాలు



సూచనలు చేస్తున్న దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, పక్కన ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ

**ఈనాడు, అమరావతి :** ఇంద్రకీలాద్రిపై ఈనెల 11 నుంచి కొనసాగుతున్న భవానీదీక్ష విరమణ వేడుకలకు ఆదివారం సాయంత్రం వరకు నాలుగు రోజుల్లో 3.75 లక్షల మంది భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ వెల్లడించారు. భవానీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, చిన్న పొరపాటు కూడా తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరంగా అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారన్నారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వేడుకలు, భక్తులకు కల్పించిన సౌకర్యాలను ఆయన ఆదివారం పరిశీలించారు. క్యూలైన్లలో వెళ్తున్న భవానీ భక్తులతో మాట్లాడారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామచంద్ర మోహన్ మాట్లాడుతూ.. భక్తులు ఎంతమంది వచ్చినా అందరికీ ఉచిత అన్నప్రసాదం అందుబాటులో ఉంచామన్నారు. వారికి ఎన్ని కావాలంటే అన్ని ఇచ్చేలా లడ్డూ ప్రసాదం ముందస్తుగా సిద్ధం చేశామని తెలిపారు.

**దసరా ఉత్సవాల మాదిరిగానే.. :** భవానీదీక్షలకు సైతం పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ప్రతి భవానీ భక్తుడు సంతృప్తికరంగా దీక్ష విరమణ చేసి వెళ్తున్నారని తెలిపారు. స్నానఘాట్ల వద్ద ఏర్పాట్లు, ఉచిత రవాణా, క్యూలైన్లలో వచ్చేవారికి మంచినీళ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు, ఉచిత ప్రసాదం అందజేస్తున్నామని పేర్కొన్నారు.

**ప్రణాళికతో ప్రసాదాల తయారీ.. :** భవానీ దీక్ష విరమణ వేడుకల్లో ఏటా భక్తులు కోరినన్ని ప్రసాదాలు అందజేసే విషయంలోనే ఇబ్బందులు వస్తుండడంతో ఈసారి పక్కా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రధానంగా మూడు పాయింట్లలో నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం తయారీ చేయిస్తూ.. భక్తులు కోరినన్ని లడ్డూలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రసాదాల విషయంలో భవానీ భక్తులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు.

☛ వేడుకల నిర్వహణలో ఈసారి కూడా సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తున్నామని, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సహా అన్ని విభాగాలతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అనుసంధానం చేసుకుంటూ వెళ్లడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. సోమవారంతో వేడుకలు ముగుస్తున్న నేపథ్యంలో ఆఖరి నిమిషం వరకూ చాలా అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులను రామచంద్రమోహన్ ఆదేశించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తిరుపతమ్మ అమ్మవారి దీక్షాధారణ

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షాధారణ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఉప కమిషనర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 5:59 గంటలకు దీక్ష ప్రారంభిస్తామన్నారు. దీక్ష తీసుకునే వారికి ఈనెల 21 వరకు అవకాశం ఉందని చెప్పారు. జనవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అర్ధ మండల దీక్షాధారణలు ఉంటాయని తెలిపారు. దీక్ష తీసుకునే భక్తులు ఆయా సమయాల్లో నేరుగా ఆలయం వద్దకు వచ్చి స్వీకరించవచ్చని చెప్పారు.

# పూర్ణాహుతి నేడు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 15న ఉదయం 10 గంటలకు యాగశాలలో మహాపూర్ణాహుతిని నిర్వహిస్తున్నట్లు వైదిక కమిటీ పేర్కొంది. మహా పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు పరిసమాప్తం అవుతాయని తెలిపారు.

**రాత్రి వరకు ప్రసాదం పంపిణీ :** భవానీ దీక్షల విరమణ నాల్గోరోజు రికార్డు స్థాయిలో 1.50 లక్షల మంది దీక్షాధారులు దుర్గమ్మను దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణ మార్గం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. అన్నదాన గ్రౌండ్ ఫ్లోరులో అన్నప్రసాదం, దద్దోజనం, కట్టెపొంగలి, కదంబ ప్రసాద పంపిణీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దేవస్థానం అధికారులు కొనసాగించారు.

**వీవీఐపీ దర్శనాలకు బ్రేక్ :** ఇంద్రకీలాద్రిపై వీవీఐపీ ప్రొటోకాల్ దర్శనాలు నిలిపి వేశారు. గిరిప్రదక్షిణ మార్గంలో వాహనాల రాకపోకలను బందోబస్తు పోలీసులు నియంత్రించారు. కుమ్మరిపాలెం సెంటరు నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిపి వేశారు. వృద్ధులు, దివ్యాంగులను మాత్రమే దేవస్థానం బస్సుల్లో ఘాట్ రోడ్డులో ఇంద్రకీలాద్రి పైకి చేరుస్తున్నారు.

పుష్పాలతో అంతరాలయం అలంకరణ

దీవించు తల్లీ...

**విజయవాడ వన్‌టౌన్:** ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్షల విరమణల సందర్భంగా నాల్గోరోజు దుర్గమ్మ ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.81,58,730 ఆదాయం సమకూరింది.

### ఆదాయం రూ.81,58,730

☛ రూ.15ల లడ్డూ ద్వారా రూ.12,930 ☛ రూ.100ల లడ్డూల ద్వారా 76,08,300 ☛ శ్రీచక్రార్చన లడ్డూల ద్వారా రూ.9,500, ☛ కేశఖండనశాల ద్వారా రూ.5,28000 చారు.

☛ ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు 22,437 మంది అన్నప్రసాదం, 26,586 మంది అల్పాహారం స్వీకరించారని అధికారులు వెల్లడించారు.

☛ మూడో రోజు పూర్తి వివరాలను అధికారులు తెలిపారు. శనివారం మొత్తం 1.21 లక్షల మంది భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

☛ మూడో రోజు మొత్తం 49,948 మంది భక్తులకు ఉచిత అల్పాహారం, అన్నప్రసాదాన్ని అందజేశామని అధికారులు తెలిపారు.

# జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

ప్రమాణ స్వీకారం చేస్తున్న రామకృష్ణ, దుర్గాప్రసాద్, రవి తదితరులు

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం డీఎస్ డిప్యూటీ తహసీల్దార్ బత్తిన రామకృష్ణ, సహాధ్యక్షుడిగా కలెక్టరేట్ భూ విభాగ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎస్.వి.రవీంద్రనాథ్, జి.వెంకటేశ్వరరావు, జె.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా యలమంచిలి రవి, నిర్వాహక కార్యదర్శిగా ఎన్.అనూష్ కుమార్, క్రీడలు, సాంస్కృతిక విభాగ కార్యదర్శిగా కమ్మిలి నాగభూషణం, సంయుక్త కార్యదర్శులుగా గుళ్లపల్లి వరప్రసాద్, వి.సునీల్ కుమార్, పి.సాయి కుమార్, కె.సుస్పందన, కోశాధికారిగా పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా ఆర్.శ్రీనివాసరావు, మొహమద్ అలీ ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారి బి.పుల్లయ్య నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి పి.విజయలక్ష్మి తదితరులు సభ్యులను అభినందించారు.

### బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

## ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీకి రాష్ట్ర జట్టు

క్రాంతికుమార్

**విజయవాడ క్రీడలు:** కొలంబో(శ్రీలంక)లో ఈ నెల 20న జరిగే 37వ ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టుకు విజయవాడకు చెందిన దూబా క్రాంతికుమార్ సారథ్యం వహిస్తాడని ఆ సంఘం అధ్యక్షుడు పొన్నేరి సురేష్‌కుమార్ తెలిపారు. సీహెచ్ సతీష్, పి.సురేష్‌కుమార్, టి.ధరణీధర్‌రెడ్డి, డి.జయప్రకాష్, పి.నవీన్, డి.సునీల్ అరవింద్, ఎస్.లక్ష్మీకాంత్(వైస్ కెప్టెన్), వి.దేవానంద్, పి.వెంకట్, ఎం.జగదీశ్వర్ విగ్నేష్, ఐ.యశ్వంత్ కిరణ్‌కుమార్, జి.రాజ్‌కుమార్, ఎస్కే మొహమ్మద్ మాజ్, బీడీ నిఖిల్ కుమార్, కె.సందీప్, ఎన్.భూచక్రవర్తిలు జట్టులో స్థానం సాధించారు.

# కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆసక్తిగా తిలకిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

దారి పొడవునా.. కళా రూపాలే..

### అలరించిన చిత్రకళా సంత

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** చిత్రకళాకారులు గీసిన చిత్రాలు, తీసిన దృశ్యాలు నగరవాసులను కట్టిపడేశాయి. వీటిని తిలకించిన బెజవాడ వాసులు మంత్రముగ్ధులయ్యారు. తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ దూరదర్శన్ కేంద్రం రోడ్డులో ఏర్పాటు చేసిన 4వ చిత్రకళా సంత ఆద్యంతం ఆకట్టుకుంది. దాదాపు 200లకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన, అమ్మకాలను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కళల కాణాచి విజయవాడలో ఇటువంటి చిత్ర కళా సంతను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగర ప్రజల అభిరుచి మేరకు ప్రదర్శన నిర్వహించడం, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి విచ్చేయడం విశేషమన్నారు. కొన్నేళ్లుగా చిత్రకళలకు ఆదరణ తగ్గినా ఇటువంటి ప్రదర్శనల ద్వారా ఎంతోమందికి ఆసక్తి పెరుగుతోందన్నారు. భవిష్యత్తులో చిత్ర, కళాకారులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని, అమరావతి రాజధానిలో కళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రపంచ తెలుగు చిత్రకారులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాలయోగితో పాటు పలువురు చిత్ర కళాకారులు కాటూరి వెంకటేశ్వరరావు, వల్లభనేని సత్య సాయిబాబు పర్యవేక్షణలో ప్రదర్శన సాగింది.

రకరకాల వస్తువులు, బొమ్మలు..

కొబ్బరి చిప్పలతో కళాకృతులు

# కార్టూనిస్టుల సంఘానికి సహకారం

సంఘం పేరును ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు, జస్టిస్ శేషసాయి, శ్రీనివాసరావు, శ్రీధర్ తదితరులు

**రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక):** కార్టూనిస్టుల సంఘానికి ప్రభుత్వం నుంచి సహకారం అందేలా కృషి చేస్తానని శాసన సభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు అన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. రఘురామకృష్ణరాజు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ముఖ్య అతిథులుగా హాజరై సంఘం లోగో, పేరును ఆవిష్కరించారు. ఉపసభాపతి మాట్లాడుతూ.. సమకాలీన సమస్యలను కార్టూనిస్టులు తమ కార్టూన్ల ద్వారా వెలుగులోకి తెస్తారన్నారు. చిన్నతనం నుంచి తనకు కార్టూన్లు అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. ప్రఖ్యాత చిత్రకారుడు బాపుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జస్టిస్ ఎ.వి.శేషసాయి మాట్లాడుతూ.. కార్టూన్‌లో హాస్యం జోడించి ఉన్నందున వాటికి ప్రజల ఆదరణ ఎప్పటికీ ఉంటుందన్నారు. సమాజహితాన్ని కాంక్షిస్తూ మంచి కార్టూన్లను ప్రజలకు అందించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. కార్టూన్ రంగానికి ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. నేటి యువత ఈ రంగంలోకి రావాలని పిలుపునిచ్చారు. తొలుత సంఘం గౌరవాధ్యక్షుడిగా దుగ్గరాజు శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా అన్నం శ్రీధర్(బాచి), రావెళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బొమ్మన్‌లతో కలిపి 14 మందితో కూడిన నూతన కార్యవర్గం ఏర్పాటైంది. హాస్యానందం రాము, పద్మ, హరికృష్ణ, పద్మాదాసు, మురళీధర్, రాము, ఏవీఎం, మయూరి టెక్స్ పార్క్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 28న ఏపీ ఎన్జీవో నగర శాఖ ఎన్నికలు

**విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే :** ఏపీఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ ఎన్నికలు ఈ నెల 28న గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ నెల 16న పబ్లిష్ చేస్తామని చెప్పారు. 22న నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అర్హుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఒక్కో పదవికి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వస్తే.. 28న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, పర్యవేక్షకుడిగా జిల్లా కోశాధికారి బి.సతీష్‌కుమార్‌ను నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు ప్రసాద్ తెలిపారు.

# ఏపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ నియామకం

ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

**సూర్యారావుపేట, న్యూస్‌టుడే :** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సూర్యారావుపేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా శాఖ ద్వితీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలిగా వేములపల్లి రాధిక, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ఖాసిం, ఉపాధ్యక్షులుగా టి.పూర్ణచంద్రరావు, ఎస్.అనిల్, ఎం.నయీం అహ్మద్, డి.రాజకుమార్, కార్యదర్శులుగా బి.వసరాం, ఎ.సుందర రామారావు, శెట్టిపోగు రాము, షేక్ ఖాజా, షేక్ లాల్‌వలీ, ప్రచార కార్యదర్శిగా పి.వి.దుర్గాప్రసాద్, ఎస్.కె.నిఖత్ సుల్తానా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు ఎన్నికలు నిర్వహించారు. సమావేశంలో ఎం.అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీ వేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. పని గంటలు పెంచే ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని ఎదుర్కోవాలని సూచించారు. సంఘం ఇచ్చే పిలుపునకు ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు వేములపల్లి రాధిక మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ఏపీటీఎఫ్ క్రియాశీలకంగా వ్యవహరించిందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం గత రెండు సంవత్సరాల సంఘ కార్యక్రమాల నివేదికను వెల్లడించారు. కార్యక్రమంలో మండాది వెంకటేశ్వర్లు, శోభనాద్రాచార్యులు, వై.భాస్కరరావు, కె.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ యాజమాన్యంపై కేసు

**విస్సన్నపేట:** విస్సన్నపేటలో లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి మూసేసిన యజమానులపై స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన బాధితుడు అట్టదేవర రాజేష్ విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై జి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. ఫిర్యాదుదారు ఆ సంస్థ నిర్వాహకులైన నండూరి దుర్గాప్రసాద్, శివాని దంపతులకు ఏడాది కిందట రూ.5,00,000లు పెట్టుబడి నిమిత్తం ఇచ్చారు. ఆ సొమ్ము తాలూకు లాభాలు ఇవ్వకుండా జాప్యం చేయడంతో రాజేష్ పోలీసులను ఆశ్రయించారు. సంస్థ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ ఇప్పటికే మృతి చెందగా ఆయన భార్య శివాని అజ్ఞాతంలో ఉన్నారు. తనతో పాటు మరికొంత మంది ఎల్‌బీఎఫ్ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్, డిపాజిటర్ యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంస్థ బాధితులు ఎవరు ఉన్నా స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరిశీలిస్తామన్నారు.

## బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురి అరెస్టు

**హైదరాబాద్(అమీన్‌పూర్):** అమీన్‌పూర్ పట్టణంలోని సృజన లక్ష్మీనగర్‌లో ఈ నెల 9న జరిగిన బీటెక్ విద్యార్థి హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. స్థానిక యువతి, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన యువకుడు కాకాణి జ్యోతి శ్రవణ్‌సాయి (19) ప్రేమించుకుంటున్నారు. ఈ విషయమై యువతి కుటుంబసభ్యులు పలుమార్లు యువకుడిని హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా యువతిని కలుస్తూనే ఉండటంతో మాట్లాడుదామని.. ఈ నెల 9న శ్రవణ్‌సాయిని ఇంటికి పిలిచారు. ఇంటికి వెళ్లిన శ్రవణ్‌సాయితో యువతి తల్లి, తండ్రి, సోదరుడు గొడవ పడ్డారు. ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో దాడి చేయడంతో యువకుడి తల, శరీరంలోని పలు భాగాల్లో గాయాలయ్యాయి. అయినా పట్టించుకోకుండా గంటల తరబడి ఇంట్లోనే నిర్బంధించారు. అడ్డుకోబోయిన యువతిని సైతం కొట్టడంతో ఆమెకూ గాయాలయ్యాయి. మరుసటి రోజు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే యువకుడు మృతిచెందాడు. మృతుడి పెద్ద నాన్న వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతికి యువతి తల్లి సిరి, తండ్రి హరిబాబు, సోదరుడు రామ్‌తేజ్ కారణమని నిర్ధారించి రిమాండ్‌కు తరలించారు.

## 'గత వైకాపా పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్ఠం చేశారు'

మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

**పటమట:** గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాక్షసులంతా కలిసి రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మార్చారాని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలతో వైకాపా నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడిని అరెస్టు చేస్తే.. అది తప్పు.. అన్యాయం.. అంటూ సీఎం జగన్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. పిన్నెల్లి సోదరులు రాష్ట్రంలో తెదేపా మద్దతుదారులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్న దుర్మార్గులని మండిపడ్డారు. మున్సిపల్ ఛైర్మన్ పదవికి వేలంపాట పెట్టి దాడులు, హత్యలు చేయించిన నీచమైన చరిత్ర వారిదన్నారు. మాచర్ల నియోజకవర్గంలో బీసీ కార్యకర్తను జై వైకాపా అనలేదని నడిరోడ్డుపై పీక కోసి చంపేశారని బుద్ధా ఆరోపించారు. పిన్నెల్లి సోదరుల అరెస్టును ఆ నియోజకవర్గ ప్రజలు దీపావళిలా సంబరాలు చేసుకుంటే.. వైకాపా నేతలు మాత్రం కొవ్వొత్తులతో ప్రదర్శన చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వెల్లడించారు.


91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297



**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటెయిల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్‌సాన్ రోడ్, ఐరోలి, నవీముంబయి-400 708 రిజిస్టర్డ్ ఆఫీసు: "త్రిశూల్" 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదుట, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాదు-380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

… "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన 31.12.2025న విక్రయించబడును. అవసరమైన వివరాలకు దయచేసి దిగువన గల వేలం షెడ్యూళ్లను చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో) | రూ.23,52,348/- (రూపాయలు ఇరవై మూడు లక్షల యాభై రెండు వేల మూడు వందల నలభై ఎనిమిది మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ. 2,35,235/- (రూపాయలు రెండు లక్షల ముప్పైఐదువేల రెండు వందల ముప్పైఐదు మాత్రమే)లను డిడి/ పేఆర్డర్ ద్వారా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట విశాఖపట్నంలో చెల్లుబాటుగునట్లుగా చెల్లించాలి. |
| బిడ్ పెంపుదల సొమ్ము: | రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం: | 30.12.2025న సా. 5.00 గం.లోగా యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం - 530016. శ్రీ కిరణ్‌కు పంపాలి. |
| బహిరంగ ఇ-వేలం తేదీ, సమయం మరియు స్థలం: | 31.12.2025 న ఉ. 11.00 గం. నుంచి మ. 12.00 గం. వరకు ప్రతిది 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషను గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు, పైన తెలిపిన సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో అందుబాటులో గలవు. |

**స్థిరాస్తి షెడ్యూలు**

షెడ్యూలు ఎ: క్రిష్ణా జిల్లా, కంచికచెర్ల, సబ్-రిజిస్ట్రార్, కంచికచెర్ల గ్రామ పంచాయతి ఏరియా, కంచికచెర్ల, ఆర్.ఎస్.నం.452/2, విస్తీర్ణం 480.చ.గజాలు ఆస్తి. హద్దులు: తూర్పు: బజారు. దక్షిణం: గోగినేని రెసిడెన్సి. పడమర: బజారు. ఉత్తరం: వెన జనార్ధన్ ఆస్తి. ఈ హద్దులలో స్థలం 580.80 చ.గజాలు లేదా 485.62 చ.మీ.లు. దీనిలో అవిభాజ్య వాటా మరియు అనిర్దేశిత వాటా 41.4 చ.గజాలు లేదా 34.61 చ.మీ.లు. షెడ్యూలు బి: పై ఎ షెడ్యూలు ఆస్తిలో నిర్మించబడిన "ద్వారకామాయి రెసిడెన్సి" అపార్ట్‌మెంట్‌లో, ఫ్లాట్ నం.ఎఫ్-4, మొదటి అంతస్తు, 817 చ.అడుగుల ప్లింత్ ఏరియా 130 చ.అడుగుల కామన్ ఏరియా, అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై. దక్షిణం: ఓపెన్ టు స్కై. పడమర: ఉమ్మడి నడవా మరియు మెట్లు. ఉత్తరం: ఫ్లాటు నం ఎఫ్ఎఫ్-3.

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింక్‌ను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.comను చూడండి.

బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో వేలం జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ కిరణ్ 7989623940 మరియు శ్రీ కార్తిక్ 9080589635 బ్యాంకు అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం. మధ్య సంప్రదించవచ్చును. ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) క్రింద రుణగ్రహీతలకు ఇవ్వబడుతున్న 15 రోజుల నోటీసుగా విధిగా పరిగణించవలెను.

తేదీ: 15.12.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి- 400708. నమోదిత కార్యాలయం: 'త్రిశూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ- వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనీయబడిన స్థిరాస్తి లోన్ రిఫరెన్స్ నెం.2782లో మెసర్స్ లలిత ట్రేడర్స్ ప్రొప్రైటర్ శ్రీ శంక సిహెచ్ వి ప్రసాద్ మరియు శ్రీ శంక సిహెచ్ వి పి ప్రసాద్ మరియు శ్రీమతి శంక అరుణ నుండి సెక్యూర్ క్రెడిటార్‌కు రావల్సిన బకాయిలు 31-01-2023 నాటికి రూ. 5,77,12,205/- (ఐదు కోట్ల డెబ్బై ఏడు లక్షల పన్నెండు వేల రెండు వందల ఐదు రూపాయలు మాత్రమే) (ఈ మొత్తంతో 31-01-2023 వరకు వర్తించిన వడ్డీ కలిసిఉంది)లతో పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలను రాబట్టు కొనుటకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 31-12-2025న విక్రయించబడుతుంది. అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు. |
| రిజర్వు ధర (రూ.లలో) | రూ. 4,46,30,400/- (నాలుగు కోట్ల నలభై ఆరు లక్షల ముప్పై వేల నాలుగు వందల రూపాయలు మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ. 44,63,040/- (నలభై నాలుగు లక్షల అరవై మూడు వేల నలభై రూపాయలు మాత్రమే) విశాఖపట్నం వద్ద చెల్లింపయ్యేలా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట డిడి/ పిఒ ద్వారా. |
| బిడ్ పెంపుదల సొమ్ము | రూ. 25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం | 30.12.2025 సా.5.00 గం.లోగా. శ్రీ సురేష్‌ను ఉద్దేశించి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016 చిరునామాతో. |
| బహిరంగ ఇ-వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం | 31.12.2025 ఉ. 11.00 గం.ల నుండి మ.12.00 గం.మధ్య ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com వద్ద. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైనతెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును. |

**షెడ్యూలు ఆస్తి వివరము**

శ్రీ శంక అరుణ భర్త శ్రీ చక్రధర వెంకట పద్మనాభ ప్రసాద్ పేరున ఉన్న, విజయవాడ ఎస్ఆర్ఓ వద్ద రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.3160/2009, తేది. 24.08.2009 ప్రకారం 272 చ.గజాల విస్తీర్ణంలో, కృష్ణా జిల్లా, ఎన్‌టిఆర్ జిల్లా యొక్క ఎస్ఆర్ఓ విజయవాడ పరిధిలో మరియు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వన్ టౌన్, బ్రాహ్మిన్ స్ట్రీట్, డి.నెం.11-63-49, 11-63-50, ప్రస్తుత అసెస్మెంట్ నెం.173023915, 173023916, పాత అసెస్మెంట్ నెం.58079, 58080, ఎన్‌టిఎస్ నెం.220, 222, మున్సిపల్ వార్డు నెం.6, కొత్త మున్సిపల్ వార్డు నెం.10, బ్లాక్ నెం.3, రెవిన్యూ వార్డు నెం.3 వద్ద గల నివాస రమ్ కమర్షియల్ ఆస్తి యావత్తు. సరిహద్దులు: తూర్పు: "బి" షెడ్యూలు ఆస్తి మరియు ఇతరుల ఆస్తి-49.10" అడుగులు, దక్షిణం: ఉప్పులూరి వీధిగా పిలువబడు మున్సిపల్ రోడ్-48.6" అడుగులు, పడమర: బ్రాహ్మిన్ వీధిగా పిలువబడు మున్సిపల్ రోడ్-50.7" అడుగులు, ఉత్తరం: కుందుకూరి చెంచయ్య ఆస్తి-49" అడుగులు.

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింక్‌ను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.comను చూడండి.

వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ సురేష్ 9849901112 మరియు శ్రీ కార్తిక్ 9080589635, అధీకృత అధికారిని బ్యాంక్ కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం.మధ్య సంప్రదించవచ్చును. ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేదీ: 15-12-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



EENADU e Classifieds

BUSINESS SERVICES

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

**బంగారం కొనబడును.** బ్యాంకులలో ఇతర ప్రైవేట్‌సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

REAL ESTATE

FLAT FOR SALE

**23 లక్షలకే** రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటి నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం|| 89196 28403.

3 BHK LUXURIOUS FLATS FOR SALE
Patamata @JD Nagar
❖ 2100 Sft. ❖ NO GST
❖ 85 sq.yds UDS
❖ 2 Car Parking
❖ Ready to Occupy
Year Ending Offer FREE REGISTRATION
✆ 94401 72044

RAMAVARAPPADU

FLAT FOR SALE
✔ 363 SQYRDS
✔ 65 UDS FOR EACH FLOOR
✔ 5 FLOORS
✔ 4BHK EACH FLOOR
✔ 2500 SQRFT EACH FLOOR TOTAL
✔ PLINT 2100 SQRFT EACH FLOOR
✔ 10 CAR PARKS TOTAL
✔ 2 FOR EACH FLAT
✔ PRICE : 4500/- PER SFT. (NEGOTIABLE)
✔ BRAND NEW LUXURY HIGH QUALITY CONSTRUCTION AT A VERY AFFORDABLE PRICE
✔ READY TO OCCUPY
✔ LAST 2 FLATS AVAILABLE
Contact : 8333911102
8712123344, 9390311148
Ramvarapadu Inner Ring Road, Back Side of Innotel, Opp. Raguram Steels

HOUSE FOR SALE

NUNNA ROAD

**నార్త్ ఫేస్** 201 చ.గ. రేకుల ఇల్లు అమ్మబడును. ఆంధ్రప్రభ కాలనీ, సింగ్ నగర్, విజయవాడ, బ్యాంక్ లోన్ వారు సం.ప్ర. 89193 86329. No mediators.

LAND FOR SALE

**మచిలీపట్నం గుండుపాలెం** (రుద్రవరం పంటకాలువ డొంకరోడ్డు కృష్ణ యూనివర్శిటీ దగ్గర) 12.5 ఎకరాల పొలం అమ్మకం ✆ +9199499 88829(Whatsap)

**Uppaluru (Vi), Kankipadu (Mdl.)** Krishna(dt.) Total Land: 3.16 Acres, R.S.No: 4-2C-1Acres R.S.No: 4-2B-1Acress R.S.No:4 -2A-1A-Ac0.895Cs, R.S.No: 4-2A-1B-Ac0.18Cs, R.S. No:4-2A-2Ac0.085CS and Total Land (S.Yards): 653.35Sy. Yards. Rs.No. 4/1C-283.98S. Yrds RS. 4/1C- 369S. Yrds. 97012 51090, 90003 37219

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/-
(5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

**Wanted** Real Estate Agents for Venture Plots Sales Good Commission Contact : 97364 54545, 94324 54545.

**విజయవాడ పుడ్‌హట్‌లో** పనిచేయుటకు Falooda వర్కర్స్, టీమాస్టర్స్ మరియు హెల్పర్స్ 20 నుండి 35సం||లోపు వారు కావలెను. ✆ 91820 43904

కావలెను
విజయవాడలోని
రమ క్లాత్ స్టోర్స్
నందు పనిచేయుటకు
• సేల్స్‌మేన్స్
• హెల్పర్స్
• క్యాషియర్స్
WALK - IN - INTERVIEW
DEC 13th, 14th & 15th
Timings : 11am to 4pm
Y.V.Rao Hospital Road, Opp : PVP Mall, Labbipet, VIJAYAWADA.
Ph : 81259 73743
Mail : hr@ramaclothstores.com

**Wanted** Lady Telecallers 6. Age 20 to 35 Salary 15K RAM'S Career Guidance Labbipet Vijayawada. 62813 70293.

**SRI Gowtham** JrCollege NEET & JEE Mains(Kanuru) Wanted Principals 50k, Campus(AO)30k, Vice principals 25 to 30k, Wardens 15k. ✆ 96425 58058, 91547 51815

**స్వగృహఫుడ్స్‌లో** పనిచేయుటకు సేల్స్‌బాయస్, సేల్స్‌గరల్స్ కావలెను. Age 20 to 30 సం||లోపు, అర్హత 10th మించిజీతం పార్ట్/ ఫుల్‌టైం. ✆ 81425 45000.VJA

**HYD యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# తిరువూరు

• తిరువూరు • మైలవరం

## జగన్మాత సేవలో నృత్య దర్శకుడు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మను ప్రముఖ నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ ఆదివారం దర్శించుకున్నారు. భవానీ దీక్ష స్వీకరించిన ఆయన గిరిప్రదక్షిణ పూర్తి చేసి ఇరుముడితో అమ్మవారి ఆలయానికి వచ్చారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

ఇరుముడితో శేఖర్ మాస్టర్

## అంతర్ రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో నగేష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ స్థాయి సీనియర్ అంధుల క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఆ సంఘం కార్యదర్శి సి.రవీంద్రబాబు ఆదివారం వెల్లడించారు. టి.దుర్గారావు(కెప్టెన్), ఎం.గణేష్(వైస్ కెప్టెన్), బి.అశోక్‌రెడ్డి, టి.శివశంకర్, కె.జాని, డి.వెంకటేష్, కె.పుణ్య శ్రీనాథ్, ఆర్.వెంకటేష్, డి.కోటయ్య, ఎం.శివరాజు, ఎ.రవి, డి.తాండవకృష్ణ, కె.విక్రాంత, ఎన్.రమణయ్య జట్టులో స్థానం సాధించగా.. శిక్షకుడిగా ఐ.అజయ్ కుమార్ రెడ్డి, మేనేజరుగా ఎల్.నరేష్ నియమితులయ్యారు.

బృందంతో శిక్షకుడు అజయ్ కుమార్ రెడ్డి

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

**న**రసాపురం- చనుబండ రహదారి వెంట చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈవో జి.స్వాతి స్పందించి యంత్ర సాయంతో చెత్తను ట్రాక్టర్‌కి ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

? జి.కొండూరులోని వివేకానంద పాఠశాల సమీపంలో కృష్ణా జలాల పైపులైన్ లీకై నీరంతా సిమెంటు రోడ్డుపై వృథాగా పోతోంది. **- నాగేశ్వరరావు, గ్రామస్థుడు**

✔ సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథా అరికడతాం. **- బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

? కొండపల్లి రైల్వేస్టేషన్ కూడలి నుంచి ఈలప్రోలుకు వెళ్లే రహదారిలో స్థానికులు రోజు ఏదో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో రోడ్డును మూసేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. **- శేషగిరిరావు, స్థానికుడు** ✔ సిబ్బందితో పర్యవేక్షణ చేయించి వారికి అవగాహన కల్పిస్తాం. **- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి కమిషనర్ - న్యూస్‌టుడే, కొండపల్లి**

## డివిజన్ స్థాయి ఆటల పోటీలు నేడు

**మైలవరం, న్యూస్‌టుడే :** విజయవాడ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి ఆటల పోటీలను స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. పురుషుల విభాగంలో క్రికెట్, మహిళల విభాగంలో త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## శ్మశాన వాటికలో ముళ్ల కంప తొలగింపు

**మైలవరం, న్యూస్‌టుడే :** స్థానిక పెద్ద ఎస్సీ ఏరియాకు సంబంధించిన శ్మశాన వాటికలో ఆదివారం ముళ్ల కంప తొలగింపు పనులను తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాలకృష్ణ, సతీష్, సుధాకర్, ప్రేమ్‌సాగర్, భార్గవ్, బాబూరావు, యోహాన్ పాల్గొన్నారు.

## ఇష్టమైన క్రీడలు.. అభివృద్ధికి అడుగులు

**గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే**

**కూ**టమి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అధికారులు గతంలో కన్న భిన్నంగా విద్యార్థులు ఇష్టమైన క్రీడలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా సామగ్రిని సమకూరుస్తున్నారు. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే విధమైన ఆట పరికరాలు ఇచ్చేవారు. ప్రస్తుతం విద్యార్థుల ఆసక్తి మేరకు స్కూల్స్ వారీగా క్రీడా పరికరాల జాబితాలు సేకరించి వాటినే సరఫరా చేశారు. చదువులో ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆటలపై ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం క్రీడా రిజర్వేషన్లను రెండు నుంచి మూడు శాతానికి పెంచడంతో పాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఇప్పటికే పాఠశాలల్లో విశాలమైన ఆట మైదానాలు,

| మండలం పేరు | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| మైలవరం | 53 | 4,252 |
| జి.కొండూరు | 34 | 3,125 |
| రెడ్డిగూడెం | 41 | 2,700 |
| ఇబ్రహీంపట్నం గ్రామీణం | 24 | 4,735 |
| కొండపల్లి పురపాలిక | 18 | 2,600 |

నిష్ణాతులైన క్రీడా ఉపాధ్యాయులున్నారు. అయితే ఆట పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.

మైలవరం నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అవసరమైన క్రీడా పరికరాలకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇండెట్లు తీసుకుని సమకూర్చారు. స్థాయి మేరకు ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు, ప్రాథమికోన్నత రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు, ప్రాథమిక రూ.5 వేల నుంచి రూ.10 వేలు లోపు విలువ చేసే కిట్లు సరఫరా చేశారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అన్ని

### మెరుగైన ఫలితాలు సాధించడానికి..

కాచవరం ప్రాథమిక పాఠశాలకు వచ్చిన సామగ్రితో చిన్నారులు

పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందించారు. క్రీడలతో విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేయడంతో పాటు ఆరోగ్యం సమకూరుతుందని తద్వారా చదువుపై దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆటల్లో విద్యార్థులు రాణించేందుకు ప్రభుత్వం అందించిన పరికరాలు ఎంతగానో దోహదపడతాయని వ్యాయామోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

నూతనంగా ఎంపికైన ఎస్సీ సంక్షేమ సంఘం సభ్యులు

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** తిరువూరు నియోజకవర్గ ఎస్సీ సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి చేరవేయడానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎంపికైన సంఘ సభ్యులను అభినందిచారు. సంఘం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సందడిగా సెమీ క్రిస్మస్ వేడుక

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే :** క్రిస్మస్ ఆరాధనాలు సమాజంలో శాంతిని ప్రోత్సహిస్తాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గుంటుపల్లిలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ ఆరాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాస్టర్ అల్లూరి విశ్వప్రసాద్ వాక్య సందేశం అందించారు. యేసుక్రీస్తు జన్మ ద్వారా మానవాళికి ఇచ్చిన శాంతి, ప్రేమ, క్షమాభావనలను వివరించారు. అనంతరం నిర్వాహకులు విశ్వాసులకు భోజనాలు వడ్డించారు. మోగావత్ భామానాయక్, ఆయన కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రసంగిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు

## కబడ్డీ రంగానికి సేవలు ఎనలేనివి

**విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే:** రాష్ట్ర కబడ్డీ రంగానికి కేపీ రావు చేసిన కృషి మరవలేనిదని మాజీ ఎంపీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో కేపీ రావు కబడ్డీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కౌన్సిల్(ఐవోసీ) మాజీ సభ్యుడు నరేంద్ర ధ్రువ్‌బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ హాజరై కేపీ రావును సత్కరించారు. లగడపాటి మాట్లాడుతూ కేపీ రావు 50 ఏళ్ల క్రీడా జీవితం, ముఖ్యంగా కబడ్డీకి చేసిన సేవలను కొనియాడారు.



కేపీ రావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, చిత్రంలో నరసింహ చౌదరి

## మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారాలి

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే :** పొదుపు సంఘ మహిళలు చిన్నపాటి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కేశినేని ఫౌండేషన్, ఎన్ఐఆర్‌డీలు సంయుక్తంగా పొదుపు సంఘ మహిళలకు వివిధ అంశాల్లో ఐదు రోజుల శిక్షణ ఇవ్వనున్నాయి. ఈ నేపథ్యంలో 45 మంది పొదుపు మహిళలతో కూడిన బృందం ఆదివారం శిక్షణ కేంద్రానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకుడు సీతారామయ్య జెండా ఊపి బస్సును ప్రారంభించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



బస్సు వద్ద మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకులు

## యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

**ఇబ్రహీంపట్నం (గ్రామీణం, ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే :** ప్రస్తుతం ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఇబ్రహీంపట్నం మండల శాఖ ఎన్నికల నిర్వహణ కమిటీకి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అంతక ముందు జరిగిన మండల శాఖ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేజే ఆర్మ్‌స్ట్రాంగ్, ప్రధాన కార్యదర్శిగా సముద్రల సూర్యనారాయణ, కోశాధికారిగా ఫరూక్, ఉపాధ్యక్షులుగా కరిముల్లా, మరియ కుమారి ఎన్నికైయ్యారు. ఎన్నికలను జిల్లా కార్యదర్శులు హరిప్రసాద్, సదానందలు పర్యవేక్షించారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ సూర్యనారాయణ

## ఎమ్మెల్యే పవర్ ఏంటో చూపించమంటారా?

**నందిగామ :** నందిగామ శాసన సభ్యులు ఎవరో తెలియదని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని విప్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కాకాని నగర్‌లోని తన కార్యాలయంలో సౌమ్య మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనపై 27 వేల ఓట్ల తేడాతో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే ఎవరో తెలియదని ఆరోపించారు. ఎమ్మెల్యే పవర్, అధికారం ఎలా ఉంటుందో గుర్తుచేయడం తనకు పెద్ద కష్టం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను అప్పగించారని సౌమ్య తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో నందిగామ వంద పడకల వైద్యశాలను రిజిస్ట్రేషన్ చేయకుండానే బయట భవన నిర్మాణానికి ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సోదరులు శంకుస్థాపన చేయడం చారని ఎమ్మెల్యే సౌమ్య ఆరోపించారు.

## చదువుతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతాం

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** ప్రతి విద్యార్థి చదువును ఆయుధంగా చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని రెడ్డిగూడెం ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం కుదప, కూనపరాజుపర్వ జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పది తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూనపరాజుపర్వ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు డి.ప్రకాష్, నాగలక్ష్మి, భవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి

## దారి బాగు చేయండయ్యా..!

**మం**డలంలోని పుల్లూరు శివారు చిలుకూరివారిగూడెంలో బుడమేరు వాగు అంచునున్న శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు దీర్ఘకాలంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కాలాలకు అతీతంగా ప్రధాన రహదారి నుంచి బుడమేరు వాగు మీదుగా అక్కడకు వెళ్లే మార్గం బురదమయంగా మారింది. దీంతో పలువురు దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతుంటే, గ్రామస్థుల సాయంతో యువత విరాళాలతో గతంలోనే స్లాబు వేయించారు. కానీ అక్కడి వరకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండటంతో సీసీ రహదారి వేయాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా పాలకులకు పట్టడం లేదు. **- న్యూస్‌టుడే, మైలవరం**

## వంతెన శిథిలం..ఎన్నటికో పదిలం

**మం**డల కేంద్రంలోని ప్రధాన కూడలి నుంచి ఎస్సీవాడకు వెళ్లే రోడ్డులో కోతుల వాగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. గతంలో దీనిపై నుంచి వాహనాలు వెళ్లకుండా అధికారులు అడ్డుగా గోడలు కట్టించారు. ప్రస్తుతం కొందరు వాటిని తొలగించి రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

## సమస్య తీవ్రం.. స్పందించని వైనం

**వై**కాపా హయాంలో పంచాయతీల్లో నిధుల లేమితో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కూటమి ప్రభుత్వం రాకతో పల్లెలకు మహర్దశ పట్టిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పినపాక గ్రామంలో సీసీ రోడ్లు వేసి, ఎనిమిది వీధుల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. కానీ ఇక్కడే మరో సమస్య ఎదురైంది. గ్రామంలోని ప్రధాన రహదారికి అనుసంధానంగా నిర్మించిన సీసీ డ్రెయిన్లపై మూతలు వేయకపోవడంతో వాటిని దాటలేక అవస్థలు పడుతున్నామని వృద్ధులు వాపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలపై మూతలు వేయించి తమ అవస్థలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

## బోరు పని చేయక.. వెతలు తీరక

**పి**నపాక ఎస్సీ శ్మశాన వాటికలోని పంచాయతీ బోరు పూర్తిగా ధ్వంసమైంది. ఇది పని చేయక పోవడంతో కర్మకాండలు నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి తమ అవస్థలు తొలగించాలని పలువురు వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

## 16 నుంచి వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** తిరువూరు నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోదారంగనాయకుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 14 వరకు వేకువజాము నుంచే గోదాదేవి పాశురాలు ఆలపిస్తూ ప్రజలను మేలుకొలుపుతారు. మార్గశిరం ఆధ్మాత్మిక మాసం కావడంతో ప్రజల్లో భక్తిభావం నెలకొంటోంది.

నెమలి కృష్ణాలయంలో గోదాదేవి అమ్మవారు

## నేటి నుంచి ధ్యాన సప్తాహం కార్యక్రమాలు

**కొండపల్లి, న్యూస్‌టుడే :** ప్రపంచ ద్వితీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యాన సప్తాహం కార్యక్రమాన్ని నేటి నుంచి వారం పాటు నిర్వహించనున్నామని సంస్థ ఛైర్మన్ లంకే జనార్దన్ తెలిపారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

## జనవరి 3న మైలవరంలో హిందూ సమ్మేళనం

**మైలవరం, న్యూస్‌టుడే :** మైలవరంలో జనవరి 3న నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హిందూ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక భగవద్గీతా మందిరంలో ఆవిష్కరించారు. సమ్మేళనానికి స్వామిజీలు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు హాజరవుతారని చెప్పారు.

మైలవరం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

జి.కొండూరు : ఇంటింటా ప్రచారం చేస్తున్న సభ్యులు

**జి.కొండూరు, న్యూస్‌టుడే :** త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించినట్లు సేవా సమితి సభ్యుడు కె.సత్యం తెలిపారు. జి.కొండూరులో ఆదివారం భగవద్గీత ప్రచారకర్తలతో కలిసి ఇంటింటా తిరిగి పలు విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పి.నాగరాజు, రమేష్, లక్ష్మీ, చెంచు ప్రవీణ, రాజేశ్వరి, దుర్గారావు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

**ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే :** ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం శివదత్తసాయి మందిరంలో ఎన్నారై గుంటక సుదర్శన రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ సెంటిని ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో గ్రామస్థులు 150 మంది పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాయి సేవాదళ్ సభ్యులు బాలాజీ ప్రసాద్, సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**పుట్రేల(విస్సన్నపేట), న్యూస్‌టుడే :** మండల పరిధి పుట్రేల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పుట్రేల సొసైటీ ఛైర్మన్ కస్తూరి సీతారామస్వామి ఆధ్వర్యంలో విజయవాడ బెస్ట్ ఆసుపత్రి వారిచే వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఛైర్మన్ డా.కొండవీటి సంతోష్ కృష్ణ దంపతులు, జనసేన నాయకులు మనుబోలు శ్రీనివాసరావు, యాసిన్, ఉయ్యూరు జయప్రకాష్, పుచ్చకాయల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవులూరులో సేవలందిస్తున్న వైద్యులు ఈశ్వర్, పవన్

రామచంద్రాపురం : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

**జి.కొండూరు, న్యూస్‌టుడే :** కవులూరు గ్రామంలో ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు ఈశ్వర్, పవన్ పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు, రామారావు, బొర్రా నవీన్ పాల్గొన్నారు.

## పొద్దుపోయే వరకు జాతీయ లోక్ అదాలత్

**గవర్నర్‌పేట, న్యూస్‌టుడే :** విజయవాడ మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం రాత్రి 9.30 గంటల వరకు కొనసాగింది. 16 బెంచిల ద్వారా 16,566 కేసులను పరిష్కరించారు. 67 మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.15కోట్లు పరిహారం ఇచ్చారు. రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు 16,383 పరిష్కరించి బాధితులకు రూ.11.65కోట్లు, ఇతర సివిల్ కేసులు 69 పరిష్కరించి రూ.6.69 కోట్లు, 47 ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.2,11,271లు పరిహారం ఇప్పించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశానుసారం రాత్రి పొద్దు పోయే వరకు బెంచ్‌లు పని చేసి కేసులను పరిష్కరించాయని తెలిపారు. సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీలకు, కక్షిదారులకు, కోర్టు సిబ్బందిని అభినందించారు.

## 4 రోజుల్లో 24 వేల ట్యాగ్‌లు

**ఇంద్రకీలాద్రి, విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణలో వేల సంఖ్యలో దీక్షాధారులు తరలి వస్తున్న నేపథ్యంలో చిన్నారులకు ట్యాగ్ వేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పేర్కొన్నారు. మోడల్ గెస్టు హౌస్ సమీపంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆదివారం ఆమె మాట్లాడారు. నాలుగు రోజులుగా 240 మంది సిబ్బంది.. 12 ప్రదేశాల్లో 24 వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేశారన్నారు. చిన్నారులు తప్పి పోకుండా ట్రాక్ చేసేందుకు దోహదపడుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. సీడీపీవోలు లక్ష్మీభార్గవి, కృష్ణకుమారి, భానుమతి, డీసీపీవోలు రాజేశ్వరరావు, కిరణ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గాఘాట్ సమీపంలో చిన్నారికి ట్యాగ్ వేస్తున్న వాలంటీర్లు

## స్నానఘాట్‌లలో భజనలు

**భవానీపురం, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్ద భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జల్లు స్నానాలు చేసి గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళ్లారు. అక్కడే భజనలు చేశారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

## పతాక స్థాయికి చేరిన వర్గ విభేదాలు

**తిరువూరు, న్యూస్‌టుడే :** తిరువూరు నియోజకవర్గ తెదేపాలో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇవన్నీ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం చేసుకునే స్థాయికి వెళ్లాయి. రెండ్రోజుల నుంచి ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావుకు, ఆయన వ్యతిరేక వర్గీయులకు మధ్య జరుగుతున్న ఆరోపణలు పతాక స్థాయికి చేరాయి. దీంతో నియోజకవర్గంలో రాజకీయ దుమారం లేపాయి. సామాజిక మాధ్యమంలో పంచాయితీలకు తెరతీశాయి.

## ఆలోచన మరుగు.. అధ్వానం నెలవు

### పురపాలికలో క్షీణించిన పారిశుద్ధ్యం

**కొండపల్లి, న్యూస్‌టుడే**

**కొం**డపల్లి పురపాలికలోని డ్రెయిన్లలో వ్యర్థాలతో కూడిన కవర్ల మూటలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పురపాలికలో పారిశుద్ధ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడి కాలువలు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుగా కనిపిస్తున్నాయి. గృహాల్లో వినియోగించిన వ్యర్థాలను కాలువల్లో పడవేయవద్దని గతంలో పురపాలిక సంఘం అధికారులు ప్రకటనలు చేశారు. మూడు ప్లాస్టిక్ బుట్టలు అందించి తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలను విభజించి వాటిల్లో వేయాలని అవగాహన కల్పించారు. అయితే ఆ చెత్త బుట్టలను సేకరించేందుకు సిబ్బంది నివాసితుల వద్దకు వెళ్లకపోవడంతో మూడు ప్లాస్టిక్ బుట్టల ఆలోచన మరుగున పడిపోయింది. అవి నీరు నింపుకోవడానికి మాత్రమే పరిమితమయ్యాయి. గృహ వినియోగంలోని వ్యర్థాలు పాలిథిన్ కవర్లలో మూటలుగా మారిపోయాయి. దీంతో వాటిని అత్యధిక మంది డ్రెయిన్లలోనే విసిరేస్తున్నారు.

◆ ఈ నేపథ్యంలో కాలువల్లో మురుగు పారుదల లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. అయితే వీటిని తొలగించడానికి పారిశుద్ధ్య కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ ఇబ్బందులను భరించలేక కాలువల్లో మురుగును తొలగించే పనులకు వారు దూరంగా ఉంటున్నారు. దీంతో దాదాపు అన్ని వీధుల్లోనూ పారిశుద్ధ్య సమస్య తలెత్తుతుంది. మున్సిపాలిటీలో క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో పాటు పారిశుద్ధ్యానికి ప్రత్యేక అధికారులు లేకపోవడం పెద్ద సమస్యగా తయారైంది. ఇప్పటికైనా దీనిపై పుర ప్రజలకు అవగాహన కల్పించి చెత్తను సకాలంలో ఇంటింటా సేకరిస్తే పరిస్థితి మెరుగుపుతోంది.

కొండపల్లిలోని డ్రెయిన్‌లో ప్లాస్టిక్ కవర్లు

(c) eenadu

# విజయవాడ తూర్పు

## అక్రమ కట్టడం కూల్చివేత

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** అనుమతిలేకుండా నిర్మించిన ఓ అక్రమ కట్టడాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఆదివారం తొలగించారు. నగరంలోని న్యూ ఆర్టీసీ కాలనీలో భవన యజమాని ప్లాన్‌కు భిన్నంగా అదనపు అంతస్తు నిర్మిస్తున్నారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో ఆక్రమణల నిర్మూలన దళం సిబ్బంది సాయంతో ఆ కట్టడాన్ని తొలగించారు. కమిషనర్ ధ్యానచంద్ర, చీఫ్ సిటీప్లానర్ సంజయ్‌రత్నకుమార్ మాట్లాడుతూ నగరంలోని ఏ ప్రాంతంలోనైనా ప్లాన్‌కు భిన్నంగా అనుమతిలేని అక్రమ నిర్మాణాలను చేపట్టిన పక్షంలో వాటిని తమ సిబ్బంది సాయంతో గుర్తించి వెంటనే కూల్చి వేస్తామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

✦ 3వ డివిజన్ శ్రీరామచంద్ర నగర్ మహానాడు రోడ్డు జీస్క్వేర్ ఎదురుగా 3-9/116 విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి వి.శ్రీనివాస్.. మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. ✦ నాలుగో డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ ప్రధాన రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి రాజేష్.. ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు. ✦ 3వ డివిజన్ మహానాడు రోడ్డు చివర ఆటోనగర్ 100 అడుగుల రోడ్డు ఎదురుగా వ్యర్థాలతో నిండి ఉందని స్థానిక నివాసి కోటేశ్వరరావు.. శానిటరీ అధికారి ఆంథోనీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి యంత్ర సాయంతో తొలగించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

## భక్తిశ్రద్ధలతో ఆదిత్య హృదయ పారాయణం

**లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే:** లబ్బీపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహా సౌర అరుణ పారాయణ-సూర్య నమస్కారాలు చేశారు. విద్యార్థులతో ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారు.

# వీడని చీకట్లు.. చూడని పాలకులు

## ఆటోనగర్‌లో అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

**ఆటోనగర్, న్యూస్‌టుడే**

విజయవాడ నగరంలో కీలక ప్రాంతమైన ఆటోనగర్ అంధకారంలో చిక్కుకుంది. ఇక్కడ వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. రోజుల తరబడి చీకట్లు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఈ ప్రాంత పరిధిలో సుమారు 700 వీధి దీపాలు ఉంటే.. అందులో 200 దీపాలు వెలగని పరిస్థితి ఉందంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో ఊహించవచ్చు. వెలుగులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. అధిక శాతం పరిశ్రమల యజమానులు తమ దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న దీపాల వెలుగులే ప్రజలకు దారి చూపుతున్నాయి. స్థానికులు ఈ సమస్యను అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులైనా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**కార్మికులకు తప్పని అవస్థలు :** నగరం మధ్యలో ఉండే ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక నిర్మానుష్యంగా మారడంతో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. దుకాణాల్లో మద్యం తీసుకుని ఆటోనగర్‌లోని అంతర్గత రోడ్లలో కూర్చొని తాగడం పరిపాటిగా మారింది. దీంతో రాత్రిపూట ఈ వీధుల గుండా వెళుతున్న కార్మికులను బెదిరించి ఫోన్లు, డబ్బులు చోరీ చేస్తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. దీనికితోడు గంజాయి బ్యాచ్‌లు సమస్యలు సృష్టిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో వీరి ఆగడాలు ఎక్కువయ్యాయి. మరోపక్క చోరీ చేసిన నిందితులను గుర్తించడం పోలీసులకు కష్టతరంగా మారింది.

బస్టాండ్ వెనుక రోడ్డులో అంధకారం

| | |
|---|---|
| పనిచేసే కార్మికులు: 60 నుంచి 70 వేలు | |
| చిన్న, మధ్య తరహా పరిశ్రమలు: సుమారు 3 వేలు | |
| ఆటోనగర్‌లో వీధి దీపాలు: 700 | |
| ప్రస్తుతం వెలుగుతున్నవి : 500 | |

## అక్రమ ప్లాన్ ఉపసంహరణ

ఈనాడు కథనానికి స్పందన

**విజయవాడ నగరపాలక సంస్థ:** కార్పొరేషన్‌కు టోకరా వేస్తూ అక్రమంగా ప్లాన్ పొంది ఓ భారీ కట్టడానికి సహకరించిన ఘటనలో బాధ్యుడైన లైసెన్సు కలిగిన టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీని) అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. 'అక్రమ అంతస్తు.. అవినీతి కంపు' శీర్షికన నవంబరు 27న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ప్రణాళికాధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గతంలో ఒప్పంద పద్ధతిలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ఆపై లైసెన్సు కలిగిన టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ)గా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి ఇతరుల లాగిన్‌ను ఉపయోగించి పలు నిర్మాణ ప్లాన్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అనంతరం ఉపయోగంలో లేని టీడీఆర్ బాండ్లు, ఇతర సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ అక్రమంగా ప్లాన్లు మంజూరు చేయిస్తున్నారు. ఈ అక్రమాలపై వార్త రావడంతో విద్యాధరపురం కామకోటినగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న భవనం ప్లాన్‌ను అధికారులు కొంత ఆలస్యంగా ఉపసంహరించుకున్నారు. సంబంధిత ఎల్‌టీపీని బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఆయా అక్రమాలకు ప్రధాన కారకుడైన చందు అనే ఎల్‌టీపీ ప్రస్తుతం దాదాపుగా 8-10 లాగిన్లు ఉపయోగించి ఇంటి ప్లాన్ల పేరిట మోసం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు గుర్తించారు.

## హిందూ సమ్మేళనం విజయవంతానికి పిలుపు

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** కృష్ణలంక గుంటూరువారి వీధిలో 28వ తేదీ సాయంత్రం హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సమ్మేళన సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం వారు పాత పోస్టాఫీసు రోడ్డులో సమావేశాన్ని ఏర్పాటు చేసి గోడపత్రిక విడుదల చేశారు. సమ్మేళన సమితి అధ్యక్షుడు చిరుమామిళ్ల రమేష్, బస్తీ ప్రముఖ్ శనగపల్లి మల్లికార్జున, సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వినియోగదారుల నమ్మకం, ఆదరణే ప్రధానం

కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అతిథులు

**లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే:** మారుతీ సుజుకీ నెక్సా-వరుణ్ విజయవాడ ఆధ్వర్యంలో ఆ సంస్థ వినియోగదారుల సమావేశం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. సంస్థ కమర్షియల్ బిజినెస్ హెడ్ యోగేష్ గుప్తా, ఏరియా మేనేజర్ అభిషేక్ సింగ్, రూరల్ సేల్స్ మేనేజర్ చైతన్య, వరుణ్ మోటార్స్ సీజీఎం అబ్బాస్ ఖాన్, ఏజీఎం శ్యామ్‌బాబులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల కొన్నేళ్ల నుంచి వినియోగదారుల ఆదరణ, నమ్మకాన్ని పొందుతున్నామని తెలిపారు. ఇంధన సామర్థ్యం వల్ల నిర్వహణ ఖర్చులు తగ్గుతాయన్నారు. మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా స్ట్రాంగ్ హైబ్రిడ్, ఇన్విక్టో మోడళ్లపై వంద శాతం రోడ్డు పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల ఎక్కువ మంది కొనుగోలు చేయడానికి ముందు వచ్చారని తెలిపారు.

## ఏఐ ఆధారిత ఈసీజీ వల్ల బహుళ ప్రయోజనాలు

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

**మంగళగిరి (ఏఎన్‌యూ), న్యూస్‌టుడే:** ఏఐ ఆధారిత ఈసీజీ వల్ల గుండె సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశముందని ప్రముఖ గుండె శస్త్రచికిత్స వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ బాబు చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో 'హార్ట్ ఇన్ ద క్యూర్, మేనేజింగ్ కార్డియాక్ రిస్క్స్ ఇన్ నాన్ కార్డియాక్ సర్జరీస్'పై హై ఇంపాక్ట్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఏటా సుమారు 3 నుంచి 4 కోట్ల వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. ఇందులో దాదాపు 95 శాతం గుండెకు సంబంధం లేనివే జరుగుతున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయన్నారు. శస్త్రచికిత్స సమయంలో వచ్చే గుండెపోటు వల్ల 15.6 శాతం మరణాలు నమోదవుతున్నాయన్నారు. గుండె వ్యాధులున్న రోగులు, ఇతర వ్యాధులున్న వ్యక్తులు, రక్తాన్ని పలుచగా చేసే మందులు వినియోగించే వాళ్లకు శస్త్ర చికిత్సలు చేయడం పెద్ద సవాలుగా మారిందన్నారు. సర్జరీల సమయంలో గుండె, నాడీ వ్యవస్థ స్థిరంగా లేకపోతే ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడే అవకాశముందన్నారు. 'ఆధునిక కార్డియాక్ రిస్క్ అసెస్‌మెంట్ టెక్నాలజీ' ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించవచ్చని రమేష్‌బాబు వివరించారు. ప్రతి శస్త్రచికిత్సలో కార్డియాలజిస్ట్, అనస్తీషియా, ఇంటెన్సివిస్ట్, గుండె శస్త్రచికిత్స నిపుణులు, సంబంధిత వ్యాధి శస్త్ర చికిత్స నిపుణులు ఒక బృందంగా పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## క్రిస్మస్ సందడి

దీపాల వెలుగుల్లో మెస్సీయ ఫెలోషిప్ చర్చి

**పటమట, న్యూస్‌టుడే:** నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. పలు చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆటోనగర్‌లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి, పటమటలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి తదితర చర్చిల ప్రాంగణాల్లో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు.

## నగరానికి చినజీయర్‌స్వామి

**బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే:** బెంజిసర్కిల్‌లోని ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి చినజీయర్‌స్వామి హాజరయ్యారు. భక్తులు, అభిమానులు వచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయన అనుగ్రహ భాషణం చేశారు.

## హిందూ సమాజంలో ఐక్యత పెంపొందాలి

మాట్లాడుతున్న భాగయ్య, వేదికపై వాసుదేవానందగిరి స్వామి, వివేకానంద, వనజ తదితరులు

**రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే:** భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ విశిష్టత అని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు భాగయ్య అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల కార్యక్రమాలను పురస్కరించుకుని బృందావన్ కాలనీలోని వల్లూరి సుబ్బారావు వీధిలో సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యవక్తగా ఆయన మాట్లాడుతూ దేశానికి ఆత్మలాంటి హిందూ ధర్మం, సంస్కృతి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి దేశాన్ని విశ్వగురువుగా నిలపాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ ఆశయమన్నారు. కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువుల్లో ఐక్యత పెంపొందాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పెదపులిపాక విజయరాజరాజేశ్వరి పీఠాధిపతి వాసుదేవానందగిరిస్వామి మాట్లాడుతూ భారతదేశం ధర్మానికి ఆయువుపట్టు అని పేర్కొన్నారు. ట్రూత్ వివేకామృతం వ్యవస్థాపకులు వివేకానంద మాట్లాడుతూ భారతదేశంలో జన్మించడం అందరి అదృష్టంగా చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అమ్మిశెట్టి వాసు, పాతూరి వనజ, బయన ఆర్య తదితరులు పాల్గొన్నారు.

**బొంబే డయింగ్** since 1879
స్టాకిస్టు మానస ఎం.జి.రోడ్ 16వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
15 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699
1 కొనండి 2 ఉచితం
మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి.
రు.799ల సింగిల్ బెడ్‌షీట్స్ 3కొనండి కేవలం రు.1000లు మాత్రమే
ప్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రు.1000లు మాత్రమే
పిల్లో 1కొనండి 1ఉచితం
ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం
రు.799ల టర్కిష్‌టవల్ రు.299లు మాత్రమే
రు.300ల పిల్లో కవర్సు పెయిర్ 1కొనండి 1ఉచితం
రు.2299ల దివాన్‌సెట్స్‌పై 60% డిస్కౌంట్
సుందరం / శ్రీమాన్ లుంగీ 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
ప్రెస్టేజియస్ బొంబే డయింగ్ షోరూమ్ మానస ఎం.జి.రోడ్, చెన్నుపాటి పెట్రోలు బంకు సెంటర్, లబ్బీపేట, విజయవాడ-10. ఫోన్: 2497476

## కబడ్డీకి కేపీ రావు సేవలు ఎనలేనివి

కేపీ రావును సత్కరిస్తున్న లగడపాటి రాజగోపాల్, చిత్రంలో నరసింహచౌదరి

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర కబడ్డీ రంగానికి కేపీ రావు చేసిన కృషి మరవలేనిదని మాజీ ఎంపీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో కేపీ రావు కబడ్డీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కౌన్సిల్(ఐవోసీ) మాజీ సభ్యుడు నరేంద్ర ధ్రువ్‌బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ హాజరై కేపీ రావును సత్కరించారు. లగడపాటి మాట్లాడుతూ కేపీ రావు 50 ఏళ్ల క్రీడా జీవితం, ముఖ్యంగా కబడ్డీకి చేసిన సేవలను కొనియాడారు. కేపీ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు ఉపయోగపడతానని వాగ్దానం చేశారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్, శాప్ విశ్రాంత డీడీ కేసీహెచ్ పున్నయ్య చౌదరి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి జీవీ రామారావు, రాష్ట్ర వ్యాయామోపాధ్యాయ సంఘం కార్యదర్శి కరీముల్లారావు చౌదరి, ఎం.నరసింహచౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి డయాబెటిక్ ఇన్‌హేలర్స్

సదస్సులో అతిథులు, వక్తలు

**లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే:** దేశ వ్యాప్తంగా పది కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారని ప్రస్తుతం దీని నియంత్రణకు ఇన్‌హేలర్స్ అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ సూర్యదేవర కేశవరావుబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ డయాబెటిస్ ఫెడరేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో లబ్బీపేటలోని ఓ హోటల్‌లో ఏపీడీఎఫ్ కాన్-2025 పేరుతో 34వ జాతీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేశవరావుబాబు మాట్లాడుతూ వైద్యులను సంప్రదిస్తూ మందులు వాడాలని సూచించారు. ఏపీడీఎఫ్ కాన్ అధ్యక్షుడు, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యలమంచి సదాశివరావు, సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యలమంచి ఐశ్వర్య, వైద్యులు యలమంచి హిమన, అమూల్యలు మాట్లాడారు. 500 మంది ప్రముఖ వైద్యులు, 20 మంది జాతీయ వక్తలు హాజరయ్యారు. డాక్టర్ ఎల్.శ్రీనివాస్ మూర్తికి పసిడి పతకాన్ని అందజేసి సత్కరించారు.

## లోక్ అదాలత్‌కు స్పందన

**గవర్నర్‌పేట:** విజయవాడ మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు స్పందన లభించింది. 16 బెంచిల ద్వారా 16,566 కేసులను పరిష్కరించారు. 67 మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.15కోట్లు పరిహారం ఇచ్చారు.

## కథా రచనలపై ఆసక్తి చూపండి

శిబిరంలో మాధవరావు, పవన్‌కుమార్, రాజగోపాల్, అనిల్

**మొగల్రాజపురం (విజయవాడసిటీ):** చదువుతో పాటు కథా రచనలపై విద్యార్థులు ఆసక్తి చూపాలని చినుకు పత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ అన్నారు. మొగల్రాజపురం ప్రజాశక్తినగర్‌లోని శిఖర పాఠశాలలో తెలుగు కథా శిక్షణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన హైదరాబాద్ వేదిక వ్యవస్థాపకుడు అనిల్ అట్లూరి.. కథా నిర్మాణం, పాత్రల రూపకల్పనపై సూచనలు చేశారు. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ సత్రీ మాట్లాడుతూ మంచి పాఠకులు మాత్రమే గొప్ప రచయితలు కాగలరన్నారు. శిఖర పాఠశాల డైరెక్టర్ బండ్ల మాధవరావు, సీనియర్ అధ్యాపకురాలు కల్పన, అధ్యాపకుడు డాక్టర్ వి.పవన్‌కుమార్‌రెడ్డిలు ప్రసంగించారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై ఒక్కో అంశంపై కథ రాయగా.. వాటిపై సమీక్షించారు.

In The Court of the 1st Addl. Junior Civil Judge, Nellore
I.A.No. 286/2025
O.S.No. 911/2021
Prathivenkata Subba Rao ... Petitioner / Plaintiff
Vs
1. Pothuraju Vimala and 2 others ... Respondents / Defendants
NOTICE
R1, Pothuraju Vimala W/o Late P.Sudhakar, 3rd Line Blackgatedown, Krishna Lanka, Vijayawada, Krishna District.
R2, Nama Lakshmi W/o N.Vasantha Rao, D/o Late P.Sudhakar, 16-2-18/1 (Old 16-8-24), Poornandapeta, Karlapalem Street, Vijayawada, Krishna Dist.
R3, Mekala Durga, D/o Late P.Sudhakar, 41-1/2-32, Dwaraka Nagar, 3rd Line, Blackgatedown, Krishnalanka, Vijayawada, Krishna Dist.
పై కేసులో పిటిషనరు వాది పై వాం కోర్టు పైసల్ డిక్రీ పిటిషన్ దాఖలు చేసియున్నారు. పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం తేది 02-01-2026న వాయిదా ఉన్నది. ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
Y.V. శేషయ్య, అడ్వకేట్, నెల్లూరు.

## పుస్తక మహోత్సవ ప్రాంగణానికి విమలాదేవిగా నామకరణం

**కరెన్సీనగర్:** వచ్చే జనవరి రెండో తేదీ నుంచి 12 వరకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న పుస్తక మహోత్సవ ప్రాంగణానికి కరెన్సీనగర్ నివాసి వడ్లమూడి విమలాదేవి పేరు పెడుతున్నందుకు కాలనీ కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు కాలనీ అధ్యక్ష కార్యదర్శులు వంగల కృష్ణప్రసాద్, ముప్పాళ్ల రాఘవలు ఒక ప్రకటనలో విడుదల చేశారు. విమలాదేవి ప్రభుత్వ మహిళ విభాగంలో డిప్యూటీ డైరెక్టరుగా పదవీ విరమణ చేసి, క్రమశిక్షణకు మారుపేరుగా గుర్తింపు పొందారన్నారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో మెరుగుపర్చేందుకు అనువుగా నగరంలోని 47 ప్రాంతాల్లో 1690 మంది అదనపు కార్మికుల ద్వారా మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యం టన్నులకొద్దీ అదనపు వ్యర్థాలను సేకరించి తరలిస్తున్నట్లు తెలిపారు. భవానీలు వదిలిన దుస్తులను కన్వేయర్‌బెల్ట్ ద్వారా స్నానఘాట్ల నుంచి ఎప్పటికప్పుడు పైకి చేర్చి, అక్కడ నుంచి ప్రత్యేక ప్రాంతాలకు పంపుతున్నామని వివరించారు.

## ప్రజాసేవే 'గౌరిపర్తికి' నిజమైన నివాళి

మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్, భవకుమార్ తదితరులు

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** ప్రజాసేవే మాజీ కార్పొరేటర్ గౌరిపర్తి నరసింహారావుకు నిజమైన నివాళిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్ సత్యం హోటల్ సమీపంలో ఆదివారం నిర్వహించిన గౌరిపర్తి వర్ధంతిలో భాగంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు చెందిన పార్టీ మహిళా కార్యకర్తలు 10 మందికి కుట్టు మిషన్లు, ఒక మహిళకు తోపుడు బండిని ఎమ్మెల్యే అందజేశారు. తెదేపా నాయకుడు బొప్పన భవకుమార్, గౌరిపర్తి నామేశ్వరరావు, కోలపల్లి గణేష్, కొవ్వూరి కిరణ్, కొర్ర అప్పన్న, పెరుమాళ్ల గుర్నాథం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయం

**కృష్ణలంక, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ ధ్యేయంగా 22వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు పెద్ది అన్నారావు అన్నారు. భ్రమరాంబపురం మలేరియా ఆసుపత్రి సెంటర్‌లో ఆదివారం స్థానిక నేతలతో ప్రజాదర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. జనసేన డివిజన్ అధ్యక్షుడు తోట శ్రీను, రాజు, వైవీ దుర్గారావు, గల్లా శ్రీను, మైలమూరి పీరుబాబు, గోగుల ఏసు తదితరులు పాల్గొన్నారు.




## అంతర్రాష్ట్ర అంధుల క్రికెట్ టోర్నీకి రాష్ట్ర జట్టు

బృందంతో కోచ్ అజయ్‌కుమార్‌రెడ్డి

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో నగేష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ స్థాయి సీనియర్ అంధుల క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఆ సంఘం కార్యదర్శి సి.రవీంద్రబాబు ఆదివారం వెల్లడించారు. టి.దుర్గారావు(కెప్టెన్), ఎం.గణేష్(వైస్ కెప్టెన్), బి.అశోక్‌రెడ్డి, టి.శివశంకర్, కె.జాని, డి.వెంకటేష్, కె.పుణ్య శ్రీనాథ్, ఆర్.వెంకటేష్, డి.కోటయ్య, ఎం.శివరాజు, ఎ.రవి, డి.తాండవకృష్ణ, కె.విక్రాంత, ఎన్.రమణయ్యలు జట్టులో స్థానం సాధించగా.. కోచ్‌గా ఐ.అజయ్‌కుమార్‌రెడ్డి, మేనేజరుగా ఎల్.నరేష్ నియమితులయ్యారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో విశాఖ సత్తా

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం జట్టు టీమ్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా.. శ్రీకాకుళం జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం నాలుగు పసిడి, అయిదు రజత, మూడు కాంస్య పతకాలతో ప్రథమ, శ్రీకాకుళం జట్టు ఒక పసిడి, నాలుగు రజత, ఒక కాంస్య పతకంతో ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఎన్టీఆర్ జట్టు ఒక రజత, ఒక కాంస్య పతకంతో ఆరో స్థానంతో సంతృప్తి చెందింది. ముగింపు కార్యక్రమానికి జీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాంబాబు, వ్యాపారవేత్త కోగంటి సత్యం, దీక్ష మీడియా ఛైర్మన్ జె.రాజేష్ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు, ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.మధుసూదనరావు, ఎన్టీఆర్ జిల్లా బాక్సింగ్ సంఘ కార్యదర్శి వైవీఎస్ ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు ఎండీ సుభాని, కోశాధికారి శివకుమార్, పలువురు శిక్షకులు పాల్గొన్నారు.

(c) eenadu

# నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

## ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

**జగ్గయ్యపేట గ్రామీణం:** పట్టణ పరిధిలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. 'నంబరు ప్లేట్లు లేకుండా ప్రయాణం' శీర్షికన ఈ నెల 14న 'ఈనాడు'లో ప్రచురితన కథనానికి స్పందించి సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న 10 వాహనాలు, ఎక్కువ ధ్వని వచ్చే సైలెన్సర్లు ఉన్న 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడుపుతున్న 20 మంది వాహనదారులకు జరిమానాలు విధించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✻ స్థానిక తహసీల్దారు కార్యాలయ రోడ్డులో పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు మున్సిపల్ ఏఈ ఫణిశ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కార్మికులతో మరమ్మతులు చేయించారు. ✻ స్థానిక 15, 16వ వార్డుల్లో డ్రెయిన్లలో చెత్త పేరుకుని అధ్వానంగా ఉన్నాయని, మురుగునీరు దిగువకు వెళ్లక దుర్గంధం వస్తోందని పలువురు నివాసులు ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ✻ స్థానిక 19, 20 వార్డుల్లో దోమలు విపరీతంగా ఉన్నాయని స్థానికులు కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయా స్పందించి వార్డుల్లో ఫాగింగ్ చేయించారు. - **న్యూస్‌టుడే, నందిగామ**

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం జరుగుతుందని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. విజయవాడలో మాత్రం భవానీ దీక్షల విరమణ వల్ల కలెక్టర్ లక్ష్మీశ రద్దు చేశారని చెప్పారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

**మైలవరం, న్యూస్‌టుడే :** విజయవాడ డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి ఆటల పోటీలను స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. పురుషుల విభాగంలో క్రికెట్, మహిళల విభాగంలో త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## స్నానఘాట్ల వద్ద భజనలు

**భవానీపురం, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున పున్నమి, భవానీ స్నానఘాట్ల వద్ద భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జల్లు స్నానాలు చేసి గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళ్లారు. అక్కడే భజనలు చేశారు.

## కేంద్రం ఇక్కడ.. సంపద ఎక్కడ?

మాగల్లులో సంపద తయారీ కేంద్రం(షెడ్) నిరుపయోగంగా మారింది. తడి, పొడి చెత్తను ఈ షెడ్డుకు చేర్చి వేరు చేయాలి. తడి చెత్తతో వర్మీకంపోస్టు తయారు చేయించాలి. కానీ ఈ షెడ్డును ఖాళీగా వదిలేశారు. రాత్రి వేళ కొంతమంది ఇక్కడ మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్మీకంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మాటలు ఘనం.. చేతలు గగనం

★ వైకాపా ప్రభుత్వ నిర్వాకం ★ ఆదిలోనే అటకెక్కిన పాల శీతలీకరణ కేంద్రాలు

కంచికచర్ల, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమకు ఊతమిచ్చే లక్ష్యంతో గత వైకాపా ప్రభుత్వం మంజూరు చేసిన పాలశీతలీకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. కొన్నిచోట్ల నిధులు వెచ్చించి ఆదరాబాదరాగా చేపట్టిన భవన నిర్మాణాలు ఆదిలోనే ఆగిపోయాయి. దీంతో ఇందుకోసం వెచ్చించిన నిధులు వృథా అయ్యాయి. కొన్నిచోట్ల అసలు నిర్మాణ పనులే ప్రారంభించలేదు. తమ గ్రామాల్లో పాల శీతలీకరణ కేంద్రాల నిర్మాణం పూర్తయితే తమకు స్వయం ఉపాధి దొరుకుతుందని, పాల ఉత్పత్తిని పెంచుకుని ఆదాయం పొందుదామని ఆశపడిన రైతులకు నాటి ప్రభుత్వ తీరు తీవ్ర నిరాశ కలిగించింది. కూటమి ప్రభుత్వమైనా వీటిపై ప్రత్యేక దృష్టి సారించి రైతులు కోరుతున్నారు.

గొట్టుముక్కలలో నిరుపయోగంగా ఇలా..

**ఒక్కో భవనానికి రూ.17.61 లక్షలు**

ప్రతి సచివాలయం పరిధిలో ఒక పాల శీతలీకరణ కేంద్రం నిర్మించాలని 2021 జూన్‌లో అప్పటి ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొంది. ఒక్కో కేంద్రాన్ని రూ.17.61 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సైతం తయారు చేశారు. నిధుల జాప్యం వల్ల నిర్మాణాలు నిలిచిపోయాయి.

**రెండు నియోజకవర్గాల్లో 143 మంజూరు..**

✦ నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో మొత్తం 143 పాల శీతలీకరణ, పాల సేకరణ కేంద్రాలు మంజూరు కాగా అందులో ఏడు నిర్మాణ, కొన్ని స్థలసేకరణ దశలోనే ఆగిపోయాయి. 130కు పైగా కేంద్రాలు అసలు నిర్మాణమే మొదలు పెట్టలేదు. ✦ కంచికచర్ల మండలంలో 16 పాల కేంద్రాలు మంజూరు కాగా.. రెండు నిర్మాణ దశలో ఉండగా.. 14 చోట్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. ✦ నందిగామ మండలంలో 24కు ఒకటి మాత్రమే నిర్మాణ దశలో ఉంది. మిగిలిన 23 కేంద్రాల నిర్మాణమే చేపట్టలేదు. ✦ చందర్లపాడు మండలంలో 26 కేంద్రాలకు ఒకటి, వీరులపాడులో 22కు రెండు జగ్గయ్యపేట 21కి ఒకటి మాత్రమే నిర్మాణ దశకు వచ్చి ఆగిపోయాయి. ✦ పెనుగంచిప్రోలు మండలంలో 15, వత్సవాయిలో 19 కేంద్రాలు మంజూరు కాగా.. ఒక్క నిర్మాణం కూడా చేపట్టలేదు.

## ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శుల ఎన్నిక

రాజ్‌కుమార్, షేక్ ఖాజా

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** విజయవాడ ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సబ్ కమిటీ ఎన్నికల్లో నందిగామకు చెందిన దాసరి రాజ్‌కుమార్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, షేక్ ఖాజా జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి నియామకంపై నందిగామ ఏపీటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళలు పరిశ్రమలు స్థాపించాలి

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే :** పొదుపు సంఘ మహిళలు చిన్నపాటి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకే ఎన్ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్)లో శిక్షణ కార్యక్రమమని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. కేశినేని ఫౌండేషన్, ఎన్ఐఆర్‌డీలు సంయుక్తంగా పొదుపు సంఘ మహిళలకు వివిధ అంశాల్లో అయిదు రోజుల శిక్షణను హైదరాబాద్‌లో ఇస్తోంది. ఈ నేపథ్యంలో 45 మంది పొదుపు సంఘ మహిళలతో కూడిన బృందం ఆదివారం శిక్షణ కేంద్రానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా నాయకుడు సీతారామయ్య జెండా ఊపి బస్సును ప్రారంభించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 16 నుంచి వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** తిరువూరు నియోజకవర్గంలోని వైష్ణవాలయాల్లో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గోదారంగనాయకుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 14 వరకు వేకువజాము నుంచే గోదాదేవి పాశురాలు ఆలపిస్తూ ప్రజలను మేలుకొలుపుతారు. మార్గశిరం ఆధ్యాత్మిక మాసం కావడంతో ప్రజల్లో భక్తిభావం నెలకుంది.

## రూ.1.02 కోట్ల రుణం మంజూరు

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీలో సొసైటీ అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య అధ్యక్షతన జగ్గయ్యపేట, వత్సవాయి మండలం, జిల్లా పరిషత్ స్కూల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం హాజరయ్యారు. సొసైటీలో రుణానికి దరఖాస్తు చేస్తున్న 13 మంది సభ్యులకు మంజూరైన రూ.1.02 కోట్ల చెక్కులను శ్రీరాం తాతయ్య, నెట్టెం రఘురాం, ఎం.కృష్ణయ్య అందించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎం.కృష్ణయ్య మాట్లాడుతూ.. సొసైటీ నుంచి లోన్ తీసుకున్న సభ్యులు దురదృష్టవశాత్తు మరణిస్తే బ్యాంకు ఛైర్మన్ రఘురాం మాట్లాడుతూ.. రుణం తీసుకున్న సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ.. సభ్యులందరూ వ్యక్తిగత బీమా తీసుకోవాలని సూచించారు.

### వైస్ ఛైర్మన్ ప్రభాకర్‌కు అభినందన

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా మల్లెల సీతమ్మ, వైస్ ఛైర్మన్‌గా అడుసుమల్లి ప్రభాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీవో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అడుసుమల్లి ప్రభాకర్ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శ్రీరాం చిన్నబాబులను ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శ్రీరాం చిన్నబాబు ప్రభాకర్‌ను అభినందించారు.

## ఎమ్మెల్యే పవర్ ఏంటో చూపించమంటారా?

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, న్యూస్‌టుడే:** నందిగామ ఎమ్మెల్యే ఎవరో తెలియదని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కాకాని నగర్‌లోని తన కార్యాలయంలో సౌమ్య.. మాజీ ఎమ్మెల్యే ఆరోపణలపై మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనపై 27 వేల ఓట్ల తేడాతో ఓడిపోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఎవరో, అధికారం ఎలా ఉంటుందో గుర్తుచేయడం తనకు పెద్ద కష్టం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను అప్పగించారని సౌమ్య తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో నందిగామ వంద పడకల వైద్యశాలకు భూములు రిజిస్ట్రేషన్ చేయకుండానే ఊరు బయట భవన నిర్మాణానికి ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సోదరులు శంకుస్థాపన చేయించారని ఎమ్మెల్యే సౌమ్య ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిధులు మంజూరు చేయించి పాత వైద్యశాల ప్రాంగణంలోనే నూతన భవన నిర్మిస్తున్నట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం పేరుతో భూమి చదును మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. ఇప్పుడు రామవరప్పాడు కొండ వద్ద భూమి కేటాయించి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో నందిగామ మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే హయాంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలతో కొండ మూడొంతులు తరిగిపోయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అర్థరహిత ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ కోగంటి బాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పట్టవా?

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు

**నందిగామ, న్యూస్‌టుడే:** నందిగామ నియోజకవర్గంలో రైతుల సమస్యలను గురించి ఎమ్మెల్యే పట్టించుకోవట్లేదని తంగిరాల సౌమ్యను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు విమర్శించారు. స్థానిక వైకాపా కార్యాలయంలో శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా చెప్పుకొంటున్న ఆమెకు రైతుల ఇబ్బందులపై అవగాహన లేదన్నారు. కంచికచర్ల యార్డు పరిధిలో మినుము, పెసలు, అపరాలు కొనుగోలు చేయలేదని ఆరోపించారు. తాము నిరసన తెలిపాక సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోందన్నారు. నందిగామలో ఇసుక అక్రమ రవాణా ద్వారా వచ్చే డబ్బులను ఎంపీ, ఎమ్మెల్యే వాటాలు వేసుకుని పంచుకుంటున్నారని ఆరోపించారు. వైకాపా నాయకులు కోటేరు ముత్తారెడ్డి, బండి మల్లికార్జునరావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, మహ్మద్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చౌటపల్లిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

**చౌటపల్లి(వీరులపాడు), న్యూస్‌టుడే :** మండల పరిధి చౌటపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐపీవీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ శ్యామ్ నేతృత్వంలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చి ప్రాంగణంలో విద్యార్థులు క్రీస్తు జన్మవృత్తాంతం తెలిపే నాటకాన్ని ప్రదర్శించారు.

**చందర్లపాడు, న్యూస్‌టుడే:** కోనాయపాలెం లోని ప్రిన్స్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీస్ సంఘ కాపరిలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ నెహెమ్యా కేక్ కోసి పంపిణీ చేశారు. క్రీస్తును కొలుస్తూ విశ్వాసులు గీతాలు, కీర్తనలు ఆలపించారు. మాక్ అసెంబ్లీకి వెళ్లి వచ్చిన విద్యార్థి వల్లపు సంతోష్‌ను సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలు దాతల సహకారంతో అందజేశారు. పాస్టర్ జాన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి

## ఐక్యతే బలం

**జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** హిందులందరూ ఐక్యంగా ఉండాలని తాళ్లాయిపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో శివ స్వామితో పాటు రాష్ట్ర ఆర్ఎస్ఎస్ ప్రముఖులు దువ్వాడ యుగంధర్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ స్వామి మాట్లాడుతూ హిందులందరూ విభేదాలు లేకుండా జీవించాలన్నారు. వారి సంతతి తగ్గిపోవడం వల్లే అనేక విభేదాలు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

## కళాకారులకు అండగా ఉంటాం

కోగంటి బాబును సన్మానిస్తున్న రంగస్థల కళాకారులు

**కంచికచర్ల, న్యూస్‌టుడే:** రంగస్థల కళాకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు తాతినేని సూరిబాబు ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన కోగంటి బాబును ఆదివారం కంచికచర్లలో సత్కరించారు. కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని వారు కోరగా అండగా ఉంటామని కోగంటి బాబు వారికి హామీ ఇచ్చారు.

## వృద్ధులకు దంత వైద్య పరీక్షలు

శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ అంజని

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని మాగల్లు ఖాసిం అండ్ ఖాసిం(కేకే) వృద్ధాశ్రమంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. నందిగామ అంజని డెంటల్ కేర్ ఆసుపత్రి వైద్యురాలు వై.అంజని వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. టూత్ బ్రష్‌లు, పేస్టులు పంపిణీ చేశారు. బిస్కట్లు ఇచ్చారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

## సాగునీటికి ఎదురుచూపు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** మునేటి కాలువ ఆయకట్టులో మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. పత్తి పంట వర్షాలకు తుడిచి పెట్టుకుపోవడంతో రబీ పంటగా మొక్కజొన్న సాగు చేపట్టారు. వత్సవాయి మండలం పోలంపల్లి మునేటి ఆనకట్ట నుంచి ఈ కాలువకు సాగునీరు సరఫరా కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ కాలువ ఆయకట్టు చివరి గ్రామాలైన మాగల్లు, కొండూరు, సోమవరం, పల్లగిరి గ్రామాల రైతులు మొక్కజొన్న పంటకు తడులు అందించడానికి కాలువలో చుక్కనీరులేక వాపోతున్నారు. మాగల్లు రైతులు కొండూరు, రామిరెడ్డిపల్లి వద్ద మునేటి ప్రధాన కాలువపై నీటిని దిగువకు మళ్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎగువన తూములు మూసి అరకొరగా సరఫరా అయ్యే నీటిని ఆయకట్టు దిగువకు రప్పించడానికి కాలువలపై తిరుగుతున్నారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు నీటికోసం ఇటీవల ఎకరానికి రూ.వెయ్యి వంతున నీటి సంఘాల అధ్యక్షులకు ఇచ్చారు. మునేటి డ్యాం వద్ద ఇసుక కట్ట ఏర్పాటు చేసి దిగువకు నీటిని విడుదల చేయాలని కర్షకులు కోరుతున్నారు.

సాగు చేసిన మొక్కజొన్న పంట

నీరులేని మునేటి కాలువ

## 18వ సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

సాంస్కృతిక కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ కోరారు. విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి సీఐటీయూ గ్రామ కమిటీ, సీతారామాంజనేయ వంట కార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రామిక్ ఉత్సవ్ నిర్వహించారు. అభ్యుదయ గీతాలు ఆలపించారు. నందిగామ మండలం చందాపురం గ్రామ కోలాటలు ఆకట్టుకున్నాయి. జిల్లా ప్రజానాట్య మండలి కార్యదర్శి అప్పన్న కార్మిక గీతాలతో అలరించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో లక్షలాది మందితో భారీ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, కౌలు రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రధాని మోదీ 44 కార్మిక చట్టాలను రద్దు చేశారన్నారు. కార్యక్రమంలో సీతారామాంజనేయ కార్మిక సంఘం అధ్యక్షుడు అంకెం లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.సువర్చల, వివిధ సంఘల నాయకులు నాగేశ్వరరావు, కటారపు గోపాల్, ఎం.తిరుమలదేవి, గురవయ్య, ఎం.మౌళేశ్వరరావు, జె.రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్, ఆటో ఢీ.. బాలిక దుర్మరణం

**మధిర గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే:** ట్రాక్టర్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో బాలిక మృతి చెందగా.. మరో అయిదుగురికి గాయాలైన సంఘటన ఆదివారం సాయంత్రం మధిర మండలం ఖాజీపురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామానికి చెందిన ఓ కుటుంబం గంపలగూడెం మండలం ఊటుకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆటోలో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. చెవిటికల్లుకు చెందిన షేక్ అయిషా(17) మృతిచెందగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని మధిర వైద్యశాలకు తరలించారు. ప్రమాద స్థలాన్ని గ్రామీణ పోలీసులు పరిశీలించారు.

## రహదారి ప్రమాదంలో దంపతులకు గాయాలు

**కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే :** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో దంపతులకు గాయాలైన ఘటన కీసర వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన రావూరి దుర్గాప్రసాద్, అతని భార్య వెంకటరమణ ద్విచక్ర వాహనంపై నందిగామ వైపు వెళుతుండగా, కీసర సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో దుర్గాప్రసాద్ దంపతులు రహదారిపై పడిపోయారు. దుర్గా ప్రసాద్ హెల్మెట్ ధరించి ఉండడంతో అతనికి స్వల్ప గాయాలు కాగా.. అతని భార్య వెంకటరమణ తలకు తీవ్ర గాయమైంది. వారిని విజయవాడ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సేవలు అభినందనీయం

బియ్యం పంపిణీ చేస్తున్న కన్వీనర్ వాసుదేవరావు

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక సత్యసాయి మందిరంలో కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. గత నెలలో ఇక్కడ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 35 మందికి శంకర్ కంటి వైద్యశాలలో శుక్లాల ఆపరేషన్లు చేశారు. వీరికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యం, ఐదు కేజీల కందిపప్పు చొప్పున హోమియో వైద్యుడు బొందలపాటి నరసింహారావు, సేవా సమితి కన్వీనర్ యు.వాసుదేవరావులు పంపిణీ చేశారు. చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెంలోని మదర్ థెరెసా వృద్ధాశ్రమానికి బియ్యం, కందిపప్పు అందజేశారు. దాసర కార్పొరేషన్ డైరెక్టర్ మనబోతుల శ్రీరామ్, విశ్రాంత డీఈ వీరభద్రయ్య పాల్గొన్నారు.

## కబడ్డీకి కేపీ రావు సేవలు ఎనలేనివి

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర కబడ్డీ రంగానికి కేపీ రావు చేసిన కృషి మరవలేనిదని మాజీ ఎంపీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లగడపాటి రాజగోపాల్ అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో కేపీ రావు కబడ్డీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కౌన్సిల్(ఐవోసీ) మాజీ సభ్యుడు నరేంద్ర ధ్రువ్‌బత్రా, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ హాజరై కేపీ రావును సత్కరించారు. కేపీ రావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు ఉపయోగపడతానని వాగ్దానం చేశారు.

## అంతర్రాష్ట్ర అంధుల క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు

బృందంతో శిక్షకుడు అజయ్ కుమార్‌రెడ్డి

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** రాష్ట్ర అంధుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు జిల్లా నంబూరులోని డాక్టర్ గోకరాజు గంగరాజు ఎమ్మెస్కే క్రికెట్ మైదానంలో నగేష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ స్థాయి సీనియర్ అంధుల క్రికెట్ టోర్నీలో తలపడే రాష్ట్ర జట్టును ఆ సంఘం కార్యదర్శి సి.రవీంద్రబాబు ఆదివారం వెల్లడించారు. టి.దుర్గారావు(కెప్టెన్), ఎం.గణేష్(వైస్ కెప్టెన్), బి.అశోక్‌రెడ్డి, టి.శివశంకర్, కె.జాని, డి.వెంకటేష్, కె.పుణ్య శ్రీనాథ్, ఆర్.వెంకటేష్, డి.కోటయ్య, ఎం.శివరాజు, ఎ.రవి, డి.తాండవకృష్ణ, కె.విక్రాంత, ఎన్.రమణయ్య జట్టులో స్థానం సాధించగా.. శిక్షకుడిగా ఐ.అజయ్ కుమార్ రెడ్డి, మేనేజరుగా ఎల్.నరేష్ నియమితులయ్యారు.

## 'వసతిగృహ విద్యార్థులపై చిన్నచూపు తగదు'

గండేపల్లి: విద్యార్థినులతో బాలకోటయ్య

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య కోరారు. ఆదివారం నందిగామ ఎస్సీ బాలుర, ఎస్సీ బాలికల, ఎస్సీ కళాశాల వసతిగృహాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వసతిగృహ విద్యార్థులపై చిన్నచూపు పోవాలని ఆకాంక్షించారు. తాను కూడా వసతిగృహంలో చదువుకున్నానని, వీటి పరిస్థితిపై అవగాహన ఉందన్నారు. డాక్టర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వసతి గృహాల్లో సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రత, విద్యాప్రమాణాలను పరిశీలించారు. ఏపీ రాజధాని ఏదని ప్రశ్నించగా విద్యార్థులు అమరావతి అని బదులిచ్చారు. వసతి గృహాల సంక్షేమాధికారులు ఎస్.సుగుణ, ఎ.శివలాల్, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**గండేపల్లి(కంచికచర్ల), న్యూస్‌టుడే:** ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని బాలకోటయ్య సూచించారు. గండేపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు.

## ఒప్పంద కార్మికుడి మృతికి సంతాపం

**నందిగామ, న్యూస్‌టుడే:** స్థానిక పురపాలక సంఘంలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్న పరిమి రవి(48) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య రాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణిశ్రీనివాసరావులు రవి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా**
జగ్గయ్యపేట బ్రాంచ్, డి.నెం.6-1192, హైదరాబాద్ రోడ్డు, జగ్గయ్యపేట, ఆంధ్రప్రదేశ్ - 521175, ఫోన్ : 08654 226670

**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు) Appendix IV
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, జగ్గయ్యపేట బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: శ్రీమతి ఉమ్మనేని రోజా రమణి,** భర్త : పూర్ణచంద్ర రావు, నివాసం : ఇ.నెం.2-102, బొల్లువు బజారు, గౌరవరం, జగ్గయ్యపేట మండలం, కృష్ణాజిల్లా (ప్రస్తుతం ఎన్‌టీఆర్), ఆంధ్రప్రదేశ్ - 521178 మరియు **శ్రీమతి గూడపాటి వెంకటపరమ్మ,** భర్త : వెంకటేశ్వరరావు, నివాసం : ఇ.నెం.2-78, ఎన్‌హెచ్ -9 రోడ్డు, గౌరవరం, జగ్గయ్యపేట మండలం, కృష్ణాజిల్లా (ప్రస్తుతం ఎన్‌టీఆర్), ఆంధ్రప్రదేశ్ - 521178 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.18,46,387.99/-** (అక్షరాల పద్దెనిమిది లక్షల నలభై ఆరు వేల మూడు వందల ఎనభై ఏడు రూపాయల తొంభై తొమ్మిది పైసలు మాత్రమే) + **తేది.12.07.2025** నుండి ఇంకా విధించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది. 17-07-2025న** డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీత/తనఖాదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 9 ప్రకారము **తేది.09-12-2025న** దిగువ పేర్కొన్న ఆస్తి **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం **రూ.18,46,387.99/-** (అక్షరాల పద్దెనిమిది లక్షల నలభై ఆరు వేల మూడు వందల ఎనభై ఏడు రూపాయల తొంభై తొమ్మిది పైసలు మాత్రమే) **+ తేది.12.07.2025** నుండి ఇంకా విధించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు, మొదలగునవి **బ్యాంక్ ఆఫ్ బరోడా, జగ్గయ్యపేట బ్రాంచ్** వారి యొక్క ఛార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/ తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు/హామీదారులు/ చట్టపరమైన వారసులు, తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

**స్థిరాస్తి వివరములు:**
ఆంధ్రప్రదేశ్, ఎన్‌టిఆర్ జిల్లా, జగ్గయ్యపేట మండలం, గౌరవరం గ్రామం, డోర్ నెం.2-25, ఆర్.ఎస్.నెం.197/23 లోని ఎ.1.88 మొత్తంలో 242 చ॥గ॥ల నివాస స్థలంలో క్రింది అంతస్తుతో కూడిన ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు :** బజారు, **దక్షిణం:** బొల్లు నాగేశ్వరరావు గారి స్థలం, **పడమర :** నెట్టం కృష్ణయ్య గారి స్థలం, **ఉత్తరం :** గడిపూడి లక్ష్మయ్య మరియు ఇతరుల స్థలం.
**ప్రస్తుతం మరియు భవిష్యత్తులో దానిపై ఉన్న లేదా ఇకపై నిర్మించబడే అన్నీ భవనాలు మరియు నిర్మాణాలతో కలిపి.**

తేది : 09-12-2025
ప్రదేశం : జగ్గయ్యపేట

సం/- చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

# విజయవాడ పశ్చిమ

## అక్రమ ప్లాన్ ఉపసంహరణ

ఈనాడు కథనానికి స్పందన

**విజయవాడ నగరపాలక సంస్థ:** కార్పొరేషన్‌కు టోకరా వేస్తూ అక్రమంగా ప్లాన్ పొంది ఓ భారీ కట్టడానికి సహకరించిన ఘటనలో బాధ్యుడైన లైసెన్సు కలిగిన టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీని) అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. 'అక్రమ అంతస్తు..అవినీతి కంపు' శీర్షికన నవంబరు 27న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి ప్రణాళికాధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో గతంలో ఒప్పంద పద్ధతిలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ఆపై లైసెన్సు కలిగిన టెక్నికల్ పర్సన్(ఎల్‌టీపీ)గా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి ఇతరుల లాగిన్‌ను ఉపయోగించి పలు నిర్మాణ ప్లాన్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అనంతరం ఉపయోగంలో లేని టీడీఆర్ బాండ్లు, ఇతర సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ అక్రమంగా ప్లాన్లు మంజూరు చేయిస్తున్నారు. ఈ వ్యవహారంలో పలువురు అధికారులు ఇతనికి సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ అక్రమాలపై వార్త రావడంతో విద్యాధరపురం కామకోటినగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న భవనం ప్లాన్‌ను అధికారులు కొంత ఆలస్యంగా ఉపసంహరించుకున్నారు. సంబంధిత ఎల్‌టీపీని బ్లాకిలిస్టులో పెట్టారు. ఆయా అక్రమాలకు ప్రధాన కారకుడైన చందు అనే ఎల్‌టీపీ ప్రస్తుతం దాదాపుగా 8-10 లాగిన్లు ఉపయోగించి ఇంటి ప్లాన్ల పేరిట మోసం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు గుర్తించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

✦ చిట్టినగర్ నగరాల సీతారామస్వామి అమ్మవార్ల కల్యాణ మండపం వెనుక మురుగు కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. ✦ వాగుసెంటర్ వద్రుపేట కొండ ప్రాంతానికి వెళ్లే రహదారి మార్గంలో రోడ్డుపై చెత్త తీయడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తరలించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? పాతబస్తీ బ్రాహ్మణ వీధి రామాలయానికి వెళ్లే మెట్ల మార్గం ధ్వంసమైంది. **- రవికిరణ్, స్థానికుడు.** ✔ పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. **- శ్రీనివాస్, సర్కిల్-I ఈఈ, విజయవాడ కార్పొరేషన్**
? చేపల మార్కెట్ ప్రాంతంలో కోళ్ల వ్యర్థాలు రోడ్డుపై వేస్తున్నారు. **- అప్పారావు, స్థానికుడు.** ✔ వాటిని తరలించేలా చర్యలు తీసుకుంటాం. **- నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**
? కేఆర్ మార్కెట్ పోస్టాఫీసు వద్ద రోడ్డుపై చెత్త తీయడం లేదు. **- ఉమామహేశ్వరి, స్థానికురాలు.** ✔ చెత్త తరలిస్తాం. **- యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి** – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

## జగన్మాత సేవలో నృత్య దర్శకుడు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ ఆదివారం దర్శించుకున్నారు. భవానీ దీక్ష స్వీకరించిన ఆయన గిరిప్రదక్షిణ పూర్తి చేసి ఇరుముడితో అమ్మవారి ఆలయానికి వచ్చారు. సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

ఇరుముడితో శేఖర్ మాస్టర్

## నూతన ఆవిష్కరణ.. దేశానికి ప్రేరణ

చిట్టినగర్, న్యూస్‌టుడే

**నూ**తన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నేటి యువత తమ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పవచ్చు. ఆ దారిలోనే యువత తమ సృజనకు పదును పెడుతూ సరికొత్త ఆలోచనలు ఆవిష్కరిస్తున్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మైండ్ స్ప్రింట్-2కె25 పేరుతో నిర్వహించిన హ్యాకథాన్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులు ప్రజాప్రయోజనాలకు ఉపయోగకరంగా ఉన్నాయి.

### డేటా గార్డెక్స్

సైబర్ మోసాలు అరికట్టేందుకు నంది గామ మండలం పరిటాలలోని శ్రీఅమ్రితసాయి సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో చదువుతున్న **సౌమ్యద, హర్షిత, ఖ్యాతి దుర్గ** 'డేటా గార్డెక్స్' అనే వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఇందులో మన వివరాలు పొందుపరచి ఉంచాలి. ఎవరైనా హ్యాక్ చేస్తే గుర్తిస్తుంది. వాళ్ల లొకేషన్, చరవాణి నంబరు గుర్తించి.. వెబ్‌సైట్‌లో వాళ్ల సమాచారం తెలియజేస్తుంది. స్పామ్ కాల్స్ లిఫ్ట్ చేసిన 10 సెకన్లలో గుర్తించి వెంటనే ఆ కాల్‌ను ఆటోమేటిక్‌గా బ్లాక్ చేస్తుంది.

### అటెండెన్స్ నోటిఫికేషన్

పశ్చిమ గోదావరి జిల్లా సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న **రజిత, లక్ష్మీపార్వతి, మణిమాధవ్** 'ఏఐ స్మార్ట్ ఫ్యాకల్టీ అటెంటెన్స్ అండ్ నోటిఫికేషన్'ను ఏఐ ఉపయోగించి రూపొందించారు. కళాశాలల్లో, కంపెనీల్లో, ఇతర సంస్థల్లో సిబ్బంది హాజరు విషయమై సీసీ కెమెరాలకు అనుసంధానం చేయడంతో ముఖ ఆధారిత గుర్తింపుతో హాజరు పడేలా చేస్తుంది. బయోమెట్రిక్ వల్ల కొంత సమయం పడుతుంది. ఒక్కొక్కసారి మొరాయిస్తుంది. కానీ దీని ద్వారా లోపలికి ప్రవేశించగానే హాజరు పడుతుంది.

### స్మార్ట్ కనెక్టడ్ వాటర్ మీటర్

ఏలూరు శ్రీ రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న **మోహన్‌కృష్ణ, వినోద్‌కుమార్, రామ్‌చరణ్** విద్యార్థులు 'స్మార్ట్ కనెక్టడ్ వాటర్ మీటర్' ప్రాజెక్టు ఆవిష్కరించారు. వాటర్ ట్యాంకు నిండినప్పుడు ఆటోమేటిక్‌గా మోటారు ఆగిపోతుంది. అపార్టుమెంట్లు, బహుళ అంతస్తుల భవనంలోని ఉండే అందరూ సమానంగా నీరు వాడుకునే విధంగా సెన్సార్ల ద్వారా ఆటోమేటిక్‌గా పని చేస్తుంది. ట్యాంకులో నీరు 90 శాతం తగ్గిపోతే వెంటనే మెసేజ్ ద్వారా సమాచారం ఇస్తుంది. దీన్ని రూ.20 వేల ఖర్చుతో అమర్చుకోవచ్చు.

## 4 రోజుల్లో 24 వేల ట్యాగ్‌లు

**ఇంద్రకీలాద్రి, విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణలో వేల సంఖ్యలో దీక్షాధారులు తరలి వస్తున్న నేపథ్యంలో చిన్నారులకు ట్యాగ్ వేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పేర్కొన్నారు. మోడల్ గెస్ట్ హౌస్ సమీపంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆదివారం ఆమె మాట్లాడారు. నాలుగు రోజులుగా 240 మంది సిబ్బంది.. 12 ప్రదేశాల్లో 24 వేల మంది చిన్నారులకు ట్యాగ్ వేశారన్నారు. చిన్నారులు తప్పిపోకుండా ట్రాక్ చేసేందుకు దోహదపడుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. సీడీపీవోలు లక్ష్మీభార్గవి, కృష్ణకుమారి, భానుమతి, డీసీపీవో రాజేశ్వరరావు, కిరణ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గాఘాట్ సమీపంలో చిన్నారులకు ట్యాగ్ వేస్తున్న వాలంటీర్లు

## భవానీపురంలో ఇద్దరు బాలురు అదృశ్యం

**భవానీపురం, న్యూస్‌టుడే:** ఇద్దరు బాలురు అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురం ఊర్మిళానగర్‌లో ఎస్. మాధవీ నివాసం ఉంటున్నారు. ఆమె భర్త గురవయ్య రెండేళ్ల కిందట చనిపోయారు. ఆమెకు ఒక కుమారుడు భాస్కర్ మణికంఠ(14), కుమార్తె ఉన్నారు. స్థానికంగా ఉన్న పాఠశాలలో భాస్కర్ మణికంఠ ఏడో తరగతి చదువుతున్నాడు. ఈనెల 12వ తేదీ ఉదయం మాధవీ తోటి కోడలు కుమారుడు ఎన్.హర్షవర్ధన్(12)తో కలిసి మణికంఠ

### మూడు బృందాలతో గాలింపు

ఇంటి నుంచి వెళ్లిపోయారు. గతంలో కూడా వారిద్దరూ ఇదే విధంగా ఇంటి నుంచి వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చారు. రెండ్రోజులు ఎదురు చూసిన వారిద్దరూ రాకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారిని గాలించేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారం బాలురు ఎటు వెళ్లారనే విషయమై పోలీసులు విచారిస్తున్నారు.

## భవానీలకు దుర్గమ్మ భక్తుల సేవలు

**చిట్టినగర్, విద్యాధరపురం, విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణ నిమిత్తం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ చేస్తున్న భవానీ భక్తులకు పలువురు సేవలు అందిస్తున్నారు. ● కలరా ఆసుపత్రి సమీపంలో లలితా ప్రసాద్ కమిటీ సభ్యులు రామన, రఘువీర్ ఆధ్వర్యంలో అల్పాహారం, కేసరి, పాయసం, టీ అందిస్తున్నారు. 28 ఏళ్లుగా భవానీలకు సేవలు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ● నాలుగు స్తంభాల సెంటరులో నాగేంద్ర బాలభక్త సమాజం ఆధ్వర్యంలో.. ● లంబాడీపేటలో నక్షత్ర ప్రసాద్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భవానీలకు 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. 20 వేల పైగా విస్తర్ల ప్యాకెట్లు సీనియర్ నాయకులు కుర్రా శివయ్య అందజేసినట్లు వివరించారు. ● దుర్గగుడి పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకరబాబు, బడేటి ధర్మారావు అన్నప్రసాద కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

భక్తులకు కేసరి, పాయసం పంపిణీ

లంబాడీపేటలో..

నాలుగు స్తంభాల సెంటరులో..

ఆదివారం అర్ధరాత్రి సమయంలో భక్తుల రద్దీ

గిరిప్రదక్షిణలో భక్తులు

## అంతా జగన్మాత నామస్మరణే..

**విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్షల విరమణలకు ఆదివారం భవానీలు పోటెత్తారు. గిరిప్రదక్షిణ చేసుకుంటూ.. ఇరుముడులు సమర్పిస్తూ.. ఆ జగన్మాతను దర్శించుకుంటున్నారు. అన్నప్రసాదం స్వీకరించి క్షేమంగా స్వస్థలాలకు బయలుదేరుతున్నారు. భవానీలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో మెరుగుపర్చేందుకు అనువుగా నగరంలోని 47 ప్రాంతాల్లో 1690 మంది అదనపు కార్మికుల ద్వారా మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ నిత్యం టన్నులకొద్దీ అదనపు వ్యర్థాలను సేకరించి తరలిస్తున్నట్లు తెలిపారు. భవానీలు వదిలిన దుస్తులను కన్వేయర్‌బెల్ట్ ద్వారా స్నానఘాట్ల నుంచి ఎప్పటికప్పుడు పైకి చేర్చి, అక్కడ నుంచి ప్రత్యేక ప్రాంతాలకు పంపుతున్నామని వివరించారు. 28 ప్రదేశాల్లో భవానీ భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు అందుబాటులో ఉంచామని తెలిపారు.

## సులభంగా అమ్మ దర్శనం

**వృ**ద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లుభవానీ దీక్షల విరమణ సందర్భంగా ఇంద్రకీలాద్రికి వేల సంఖ్యలో వస్తున్న దీక్షాధారులను దృష్టిలో పెట్టుకొని ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలను నియంత్రించారు. ఈ నేపథ్యంలో దీక్ష తీసుకున్న వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకూడదని దేవస్థానం అధికారులు ఏడు బ్యాటరీ కార్లను ఏర్పాటు చేశారు. కనకదుర్గానగర్‌లో నాలుగు, ఘాట్ రోడ్డులో మూడు వాహనాలను ఉంచారు. నడవలేని వారిని దర్శనానికి తీసుకు వెళ్లడం.. కనకదుర్గానగర్ నుంచి బయటకు తీసుకు రావడానికి వాటిని దేవస్థానం సిబ్బంది వినియోగిస్తున్నారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు అమ్మవారి దర్శనం చేసుకోవడంతో పాటు ఇరుముడి సమర్పణకు ఆటంకం లేకుండా వారికి వీలుగా కలుగుతుంది. చిన్న రాజగోపురం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఛైర్‌ను కూడా భక్తులు వినియోగిస్తున్నారు. తోపులాటలకు తావు లేకుండా వీరిని వీల్‌ఛైర్‌లో దర్శనం చేయించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక ఛైర్ స్థానంలో ఎక్స్‌లేటర్ ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం కలుగుతుందని భక్తులు కోరుతున్నారు.
**- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్**

చిన్న రాజగోపురం వద్ద ప్రత్యేక ఛైర్‌లో మెట్లు దిగుతున్న వృద్ధుడు

బ్యాటరీ కారులో దర్శనానికి వెళ్తున్న వృద్ధులు, దివ్యాంగులు

## దుర్గగుడి విశేషాలు

✦ ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భవానీ దీక్ష విరమణలు కార్యక్రమం నేటితో ఆఖరి రోజుకి చేరింది. ✦ సుమారు 2900 భక్తులకు వైద్య శాఖ అధికారులు సేవలను అందించారు. వీరిలో సుమారు 30 మంది భక్తులు వివిధ రకాల కారణాలతో కొండపైన, కొండ కింద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో చికిత్స పొందగా వైద్యాధికారులు వారికి సేవలందించారు. ✦ దుర్గగుడి పాలకవర్గం సభ్యురాలు సుకాశి సరిత ఆదివారం అమ్మవారికి ఇరుముడి సమర్పించారు. ✦ ఆలయ ఈఓ, ఛైర్మన్ భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ పరిసరాల్లో తిరిగి భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ✦ క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా నాలుగు రోజుల్లో సుమారు 230 సందేశాలు వచ్చినట్లు సమాచారం. ఇందులో అధికం శాతం చెప్పుల స్టాండు, సామాన్లు భద్రపరిచే లాకర్ల వద్ద అధికంగా నగదు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందాయి. ✦ గిరిప్రదక్షిణ మార్గంలో పలువురు భక్తులు భవానీలకు పండ్లు, బిస్కెట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ✦ నగర సీపీ రాజశేఖరబాబు దుర్గమ్మను ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో, ఛైర్మన్లు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలని అందజేశారు. అనంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.
– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్, ఇంద్రకీలాద్రి

సీపీ రాజశేఖరబాబుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో, ఛైర్మన్


పట్టు స్పర్శ | చేనేత వస్త్రాల గొప్పతనం!
100% చేనేత ఉత్పత్తులతో
ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వారి
వెడ్డింగ్, క్రిస్మస్ & సంక్రాంతి పండుగల సందర్భంగా
అతిపెద్ద & అత్యంత విశ్వసనీయ ప్రదర్శన అమ్మకం
LAST 3 DAYS ONLY!
తేది: 12 నుంచి 17 డిసెంబర్ 2025 (6 రోజులు మాత్రమే) ఉ. 10.30 నుంచి రా. 8.00 వరకు

వేదిక: ఎ కన్వెన్షన్ సెంటర్ బెంజ్ సర్కిల్ విజయవాడ
బనారసి ప్రత్యేక సేకరణ | పశ్చిమ బెంగాల్ బోటిక్ వస్తువులు | టస్సార్ కాంత & ప్రింటెడ్ | చందేరి / మహేశ్వరి / కోటా రాజ్‌కోట్ పటోలా | పోచంపల్లి ఇక్కత్ | బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్ | బీహార్ & జార్ఖండ్ టస్సార్ వస్త్రాల మెటీరియల్స్ | గద్వాల్ | కలంకారి | కాంచీపురం | పైతాని చీరలు | వెంకటగిరి / ఉప్పాడ జమ్దాని చీరలు మరియు కాటన్ దుస్తులు మెటీరియల్స్ | బెడ్ లినెన్లు | ఆభరణాలు
సంప్రదించండి: 95735 53337 లేదా 9000346337 Info@indiansilkgallery.com


## అక్రమ కట్టడం కూల్చివేత

**విజయవాడ నగరపాలక సంస్థ:** అనుమతి లేకుండా నిర్మించిన ఓ అక్రమ కట్టడాన్ని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఆదివారం తొలగించారు. నగరంలోని న్యూ ఆర్టీసీ కాలనీలో భవన యజమాని ప్లాన్‌కు భిన్నంగా అదనపు అంతస్తు నిర్మిస్తున్నారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు ఆ నిర్మాణాన్ని తొలగించాలని క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కమల్ ఆధ్వర్యంలో ఆక్రమణల నిర్మూలన దళం సిబ్బంది సాయంతో ఆ కట్టడాన్ని తొలగించారు. కమిషనర్ ధ్యానచంద్ర, చీఫ్ సిటీప్లానర్ సంజయ్‌రత్నకుమార్ మాట్లాడుతూ నగరంలోని ఏ ప్రాంతంలోనైనా ప్లాన్‌కు భిన్నంగా అనుమతిలేని అక్రమ నిర్మాణాలను చేపట్టిన పక్షంలో వాటిని తమ సిబ్బంది సాయంతో గుర్తించి వెంటనే కూల్చి వేస్తామని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అసత్య ప్రచారం తగదు

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షాధారుల ఇరుముడిని అపవిత్రం చేశారని కొందరు ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదని దుర్గగుడి స్థానాచార్య శివప్రసాదశర్మ తెలిపారు. ఇంద్రకీలాద్రి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవానీ దీక్షల విరమణ సందర్భంగా గురుభవానీలతో కలిసి దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్, ఈవోలు ఇరుముడి సమర్పణ కేంద్రాలు పరిశీలిస్తే ఇరుముడి విప్పారని ప్రచారం చేయడం తగదన్నారు. సంప్రదాయం, ఆచారాలు, భక్తుల సౌకర్యాల విషయంలో జిల్లా యంత్రాంగం, పోలీసు, వివిధ శాఖలు చేస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకొని భక్తులు సహకరించి విరమణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వేదపండితులు షణ్ముఖశాస్త్రి, మురళీధరశాస్త్రి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్థానాచార్య శివప్రసాదశర్మ, ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్, వేదపండితులు

## స్నానఘాట్ల వద్ద భజనలు

**భవానీపురం, న్యూస్‌టుడే:** భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్ద భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జల్లు స్నానాలు చేసి గిరి ప్రదక్షిణకు బయలుదేరి వెళ్లారు. అక్కడే భజనలు చేశారు.

## వీధుల్లో క్రిస్మస్ సందడి

**భ**వానీపురం పలు వీధుల్లో పెద్ద స్టార్‌లు, క్రీస్తు జననాన్ని తెలిపే పాకలను ఏర్పాటు చేస్తున్నారు. భవానీపురం అవుట్ ఏజెన్సీ వద్ద క్రిస్మస్ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్టార్ ఆకట్టుకుంటుంది. విద్యుత్తు దీపాలతో స్టార్‌ను ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**ర**హదారులపై వెళ్లే వాహనచోదకులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా రహదారుల వెంట 'వేరియబుల్ మెసేజింగ్ సిస్టమ్(వీఎంఎస్)'ను ఏర్పాటు చేస్తున్నారు. భవానీపురం వెంకటేశ్వర ఫౌండ్రీ సెంటర్ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వెంట వీఎంఎస్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, భవానీపురం**

జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన వీఎంఎస్ స్తంభం


కన్నీటి వీడ్కోలు

జననం: 01-01-1941 మరణం: 12-12-2025
మాతృమూర్తిగా, ఆదర్శగృహిణిగా మా జీవితాలకు వెలుగులు నింపిన శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు ది.12-12-2025 స్వర్గస్తులైనారని తెలియజేయుచున్నాము.
కీ॥శ్రీ॥ శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు
W/o శ్రీ కామినేని దేవదాసు గాంధీ (లేటు)
గుంటూరు
అంతిమయాత్ర: ది.15-12-2025 సోమవారం ఉ॥ 10.00 గం॥లకు మా స్వగృహము పృథ్వీ అపార్ట్‌మెంట్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు నుండి మహాప్రస్థానమునకు బయలుదేరును. కావున తెలియజేయడమైనది.
ఇట్లు: కుటుంబసభ్యులు: 90000 92999


## మైదానాలు మాయం.. యువత నిస్సహాయం..

న్యూస్‌టుడే, చిట్టినగర్

**క్రీ**డలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటుగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రతిభ ఉన్నప్పటికీ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు అందుబాటులో లేక యువతలోని క్రీడాసక్తి నిర్వీర్యం అవుతుంది. పశ్చిమ నియోజకవర్గంలోని ఎంతో మంది యువత, చిన్నారులు క్రీడలకు దూరం అవుతున్నారు. వీధుల్లో ఆడుకుంటున్నారు. లేబరుకాలనీలోని మినీ స్టేడియం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్రీడాసక్తిని వెలికితీసే భావి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు క్రీడా ప్రాంగణ పనులు త్వరితగతిన పూర్తి చేసి యువతకు, చిన్నారులకు అందుబాటులోకి తెచ్చేందుకు పాలకులు దృష్టి సారించాలి.

| |
|---|
| డివిజన్లు: 22 |
| జనాభా: సుమారు 3.75 లక్షలు |
| ఓటర్లు: సుమారు 2.5 లక్షలు |
| యువత, పిల్లలు: లక్షకుపైగా.. |
| క్రీడల పట్ల ఆసక్తి: సుమారు 30 వేలకు పైబడి |

### వీధులే క్రీడా మైదానాలు..

ఆదివారం, సెలవు రోజులు వస్తే చాటు వీధుల్లో క్రికెట్ బ్యాట్‌లు పట్టుకొని వికెట్లు రోడ్డు మీదనే ఏర్పాటు చేసుకొని ఆడుతున్న పరిస్థితి. గత్యంతరం లేక వీధులే క్రీడా మైదానాలు చేసుకుని ఆడుతున్నారు. ఏ వీధి చూసినా యువకులు, పిల్లలు బ్యాట్లు పట్టుకుని ఆడుతూ కనిపిస్తున్నారు. వీధుల్లో ఆడడంతో వాహనాలు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. దీనికితోడు గృహాల్లోకి బంతులు వెళ్లడం.. పార్క్ చేసిన వాహనాలకు తగిలి అద్దాలు పగలడంతో గొడవలు జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అధికారులు స్పందించి యువత ఆడుకునేందుకు మైదానాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుపై క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

అమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణ దినం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయుచున్న ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం – సుస్వాగతం
వేదిక: తుమ్మలపల్లి కళాక్షేత్రం, విజయవాడ
డిసెంబర్ 15, 2025 సోమవారం సా. 05.00 గం.లకు
డూండి రాకేష్
ఛైర్మన్: ఆర్యవైశ్య వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ కార్పొరేషన్
మేనేజింగ్ ట్రస్టీ: అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్

# విజయవాడ మధ్య

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

❖ అజిత్‌సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్ నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలోని డ్రెయిన్‌లో పూడిక తీయడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

❖ కొత్త రాజరాజేశ్వరీపేట వంతెన మార్గంలో రాత్రివేళ పలువురు యువకులు మద్యం తాగుతున్నారు. స్పందించిన అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

**- న్యూస్‌టుడే, పాయకాపురం**

? స్థానిక 23వ డివిజన్ సూర్యారావుపేట సూర్యనారాయణ వీధిలోని విద్యుత్తు స్తంభం(నం:23-19-12-86)కు ఉన్న కేబుల్ వైర్లు తెగి రోడ్డుపై వెళ్లే పాదచారులకు తగిలి గాయపడుతున్నారు. **- బీఆర్‌సీ మూర్తి, స్థానికుడు**

✔ పరిశీలించి వెంటనే తీగలు తొలగిస్తాం. **- బి.వెంకట్రావు, ఏఈ** – న్యూస్‌టుడే, సీతారాంపురం

? వాంబేకాలనీ జీబ్లాక్ వార్డు సచివాలయం ఆవరణలోని కాలువల్లో పూడిక తీయడం లేదు. **- రామలక్ష్మి, స్థానికురాలు**

✔ పూడిక తీయించేలా చర్యలు తీసుకుంటాం.

**- శివరామకృష్ణ, స్థానిక శానిటరీ అధికారి**

? నందమూరినగర్ నుంచి కొత్త రాజరాజేశ్వరీపేటకు వెళ్లే రహదారి గుంతలమయంగా ఉంది.- మహేష్‌రెడ్డి, స్థానికుడు ✔ గుంతను పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సతీష్, ఏఈ, సర్కిల్- 2, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్** ? వాంబేకాలనీ జీబ్లాక్ 09వ బిల్డింగ్ వద్ద రాత్రుల్లో పలువురు యువకులు గంజాయి తాగుతున్నారు. - పూజిత, స్థానికురాలు. ✔ చర్యలు తీసుకుంటాం. **- కృష్ణమోహన్, సీఐ, నున్న** – న్యూస్‌టుడే, పాయకాపురం

## సంజయ్ గాంధీ సేవలు మరువలేం

గవర్నర్‌పేట: సామాన్యుడికి కారు అందుబాటులో ఉండాలన్న ఆలోచనతో మారుతీ సుజుకి దేశంలో ఉత్పత్తిని ప్రోత్సహించిన ఘనత సంజయ్‌గాంధీకి దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రరత్నభవన్‌లో సంజయ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. షేక్ అబ్దుల్ అన్సారీ, సత్యవతి, బెల్లంకొండ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## సేవా గుణం అలవర్చుకోవాలి

పాయకాపురం: చిన్నతనంలోనే సేవా గుణం అలవర్చుకోవాలని పైపుల్‌రోడ్డు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.జగదీశ్వరి అన్నారు. ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కండ్రిక, రాజీవ్‌నగర్, పైపుల్‌రోడ్డు, ఏపీ కాలనీ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ నాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయిన్‌ల నిర్మాణానికి కసరత్తు

పాయకాపురం, న్యూస్‌టుడే

శివారు కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత వైకాపా పాలనలో సైడ్ కాలువలు లేకపోవడంతో ప్రజలు నరకం చూశారు. 2014-2019 మధ్య కాలంలో నగర విస్తరణ జరుగుతుండగా, అప్పటి తెదేపా ప్రభుత్వం మురుగు పారుదల వ్యవస్థ, డ్రెయిన్‌లు, పక్కకాలువల నిర్మాణానికి కసరత్తు చేసింది. 3.5 కోట్లతో అంచనాలు రూపొందించింది. ఎన్నికలు రావడం... వైకాపా అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటుపడింది. రాజధాని నగరమైన విజయవాడను పట్టించుకోలేదు. అప్పటి తెదేపా ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ ఎక్కడిక్కడే ఆగిపోయాయి. గత ఐదేళ్లు ప్రజలు నరకయాతన అనుభవించారు. చిన్నపాటి వాన వచ్చినా మురుగు చేరేది. వాటి మధ్యనే జీవనం గడపాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం.. ఆ పరిస్థితులను మార్చాలని గట్టిగా ప్రయత్నాలు ఆరంభించింది.

కాలువలు లేని జర్నలిస్టుల కాలనీ

| |
|---|
| డివిజన్‌లు : 62, 63, 64 |
| ఎంత మందికి లబ్ధి : సుమారు 38వేలు |
| కాలువలు వెడల్పు పెంచాల్సినవి : సుమారు 2000 |
| కావాల్సిన నిధులు : మరో రూ. 2 కోట్లు |

**మూడు దశల్లో పూర్తి..**

స్థానిక 62, 63, 64వ డివిజన్‌లలో రూ. 7కోట్లతో నూతన డ్రెయిన్‌ల నిర్మాణం, ఉన్న వాటిని వెడల్పు చేయడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జర్నలిస్టుల కాలనీ, కండ్రిక, రాజీవ్‌నగర్ ఎల్ఐజీ, ఎమ్ఐజీ, ఈడబ్ల్యూఎస్ తదితర ప్రాంతాల్లో పనులకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం రాజీవ్‌నగర్ ప్రధాన రహదారిలోని డ్రెయిన్ ఎత్తు పెంచి వెడల్పు చేశారు. 63, 64 డివిజన్‌లలోనూ పనులు కొనసాగుతున్నాయి. మొత్తం మూడు దశల్లో పూర్తి చేయాలని భావిస్తున్నారు.

❖ ప్రకాష్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, కండ్రికలో పేద, మధ్య తరగతి ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడి కాలువలు చాలా చిన్నవిగా ఉండడం, వెడల్పు లేకపోవడంతో.. మురుగంతా రోడ్డుపైకి చేరుతోందని వాపోతున్నారు. వాటిని కూడా ఎత్తు పెంచి వెడల్పు చేయాలని, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## ఆపన్నులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం బీఆర్‌టీఎస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రూ.6లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందన్నారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేయడమే కాకుండా మందులు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

## నృత్యరీతులు.. భళా...

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళారత్న చింతా రవిబాలకృష్ణ నిర్వహణలో గోళ్ల భువనశ్రీ కూచిపూడి నృత్య రంగప్రవేశ కార్యక్రమం ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించారు. రాధామాధవ నాట్య క్షేత్రం నాట్యాచార్యులు ఎస్.కె.ఖలీల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నృత్య ఇన్‌స్ట్రక్టర్ దేవరకొండ నాగ సాయి, రాధిక మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు రమణి సిద్ధి, త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు ఇందిరా పరశురామ్ హాజరయ్యారు. గణపతి స్తుతితో ప్రారంభించి.. మోహన రాగం, రాగమాలిక తదితరాల నృత్య రీతులతో భువనశ్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. నట్టువాంగంతో చింతా రవిబాలకృష్ణ, గాత్రంతో సి. హెచ్. సుధాశ్రీనివాస్, మృదంగంతో పసుమర్తి హరనాథశాస్త్రి, వయోలిన్‌తో పాలపర్తి ఆంజనేయులు, ఫ్లూట్‌తో ఎస్.కుమార్ బాబులు చక్కని సహకారం అందించారు.

భువనశ్రీ ప్రదర్శన

## శిరస్త్రాణధారణపై అవగాహన

విజయవాడ (గాంధీనగర్): నగర సీపీ రాజశేఖరబాబు, ట్రాఫిక్ డీసీపీ షరీన్‌బేగం ఆధ్వర్యంలో రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇప్పుడు శిరస్త్రాణధారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బీఆర్‌టీఎస్ రోడ్డులో నో హెల్మెట్, నో ఎంట్రీ పేరుతో వీఎంసీ సహకారంతో ట్రాఫిక్ సిబ్బంది సామగ్రితో ముఖ్య కూడళ్లలో నినాదాలు రాశారు. ప్రాణ రక్షణ కోసం ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మూడో ట్రాఫిక్ సీఐ కొత్తూరు కిశోర్‌బాబు సూచించారు.

రహదారిపై వేస్తున్న స్లోగన్స్

## పొద్దుపోయే వరకు జాతీయ లోక్ అదాలత్

గవర్నర్‌పేట: విజయవాడ మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ రాత్రి 9.30 గంటల వరకు కొనసాగింది. 16 బెంచీల ద్వారా 16,566 కేసులను పరిష్కరించారు. 67 మోటారు యాక్సిడెంట్ కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4.15కోట్లు పరిహారం ఇప్పించారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు 16,883 పరిష్కరించి బాధితులకు రూ.11.65కోట్లు, ఇతర సివిల్ కేసులు 69 పరిష్కరించి రూ.6.69 కోట్లు, 47 ప్రీలిటిగేషన్ కేసుల్లో రూ.2,11,271ల పరిహారం ఇప్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశానుసారం రాత్రి పొద్దు పోయే వరకు బెంచ్‌లు పని చేసి కేసులను పరిష్కరించాయని తెలిపారు. సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, బీమా కంపెనీలకు, కక్షిదారులకు, కోర్టు సిబ్బందిని అభినందించారు.

## బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక వాడో-ర్యూ అకాడమీలో ఆదివారం ఏపీ వాడో-ర్యూ రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జేఎం దాస్ ఆధ్వర్యంలో బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 'మామ్' ట్రస్టు వ్యవస్థాపకుడు మహంతి వాసుదేవరావు బెల్టులను ప్రదానం చేశారు. 12 మంది ఎల్లో బెల్ట్, 11 మంది గ్రీన్ బెల్ట్, ఒకరు పర్పుల్ బెల్ట్ సాధించారని దాస్ తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లు ఆరిఫ్, హర్షితలు సహాయకులుగా వ్యవహరించారు.

విద్యార్థులతో వాసుదేవరావు, దాస్

## ఇరుముడితో అయ్యప్ప సన్నిధికి

సత్యనారాయణపురం (గాంధీనగర్): ముత్యాలంపాడులోని పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పల ఇరుముడి కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. 41 రోజులు పాటు దీక్షలు చేపట్టిన అయ్యప్పలు.. భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారు.

ఇరుముడి కట్టుకున్న చిన్నారి

## వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ

చుట్టుగుంట, న్యూస్‌టుడే: చుట్టుగుంట విశాలాంధ్ర రోడ్డులోని బొబ్బిలి తాండ్రపాపారాయుడు, రేచర్ల బ్రహ్మనాయుడు ట్రస్టు కార్యాలయంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ మడిచర్ల వెంకటేశ్వరరావు తెలిపారు. దాతల సహకారంతో 25 మందికి ఒక్కొక్కరికి రూ. 500ల చొప్పున ప్రతి నెలా రెండో ఆదివారం పింఛన్ల పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

## కల్యాణం.. వైభోగం

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్నేహ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం.. కందుకూరి కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తితిదే వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం ఉత్సవ మూర్తులను పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించారు. ప్రాంగణం మొత్తం గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు కె.సాయినరేంద్రరెడ్డి, ఎం.వెంకట దుర్గాహరిప్రసాద్, చిలుకోటి మురళి, మాజేటి కవి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రతువు నిర్వహిస్తున్న పండితులు

## భవానీ భక్తులకు అన్నదానం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఆదివారం పాత ప్రభుత్వాసుపత్రి రోడ్‌లో దీక్షల విరమణకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భవానీలతో పాటు వారి కుటుంబసభ్యులకు తెదేపా నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, ఇప్పిలి శ్రీనివాసరావు, మద్దినేని సుబ్రహ్మణ్యం, ఎర్రబోతు రామారావు, సీహెచ్ రఘు తదితరులు పాల్గొన్నారు.


bd since 1879 బోంబేడయింగ్

స్టాకిస్టు మానస ఎం.జి.రోడ్ 16వ వార్షికోత్సవ సేల్

15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్

15 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు

కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699

1 కొనండి 2 ఉచితం

మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి.

రు.799ల సింగిల్ బెడ్‌షీట్స్ 3కొనండి కేవలం రు.1000లు మాత్రమే

ప్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రు.1000లు మాత్రమే

పిల్లో 1కొనండి 1ఉచితం

ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం

రు.799ల టర్కిష్‌టవల్ రు.299లు మాత్రమే

రు.300ల పిల్లో కవర్సు పెయిర్ 1కొనండి 1ఉచితం

రు.2299ల దివాన్‌సెట్స్‌పై 60% డిస్కౌంట్

సుందరం / శ్రీమాన్ లుంగీ 1కొనండి 1ఉచితం

గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.

ప్రెస్టేజియస్ బోంబే డయింగ్ షోరూమ్ మానస ఎం.జి.రోడ్, చెన్నుపాటి పెట్రోలు బంకు సెంటర్, లబ్బీపేట, విజయవాడ-10. ఫోన్: 2497476


## ఆధ్యాత్మికత పంచిన సంగీత సభ

**విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే :** సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం దుర్గాపురంలోని కళాపీఠం కార్యాలయంలో సంగీత సభ నిర్వహించారు. తమన్ కీర్తనలు.. శ్రోతలను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్, డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు మాట్లాడుతూ.. సంగీతం, సాహిత్యాల వికాసానికి వాగ్గేయకారుల రచనలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. సంగీతం మానసిక, బుద్ధి వికాసానికి తోడ్పడుతుందని చెప్పారు. సంగీత సాహిత్యాలతో అనుబంధం ఉన్నవారు శారీరకమైన రోగాలకు దూరంగా ఉంటారని చెప్పారు. దాదాపు వంద మంది వర్ధమాన కళాకారులు, విద్వాంసులు వీణ, వయోలిన్ వాద్యంతో ఆహూతులను అలరించారు. చిరంజీవి, సంతోష్‌లు మృదంగం, వయోలిన్‌లతో సహకరించారు. సమితి అధ్యక్షుడు మన్నం గోపీచంద్ నేతృత్వంలో కార్యదర్శి సి.వి.రావు, ఉపాధ్యక్షురాలు చిట్టా రామలక్ష్మి అధ్యక్షతవహించారు.

కీర్తనలు ఆలపిస్తున్న తమన్

## 'స్టేడియంలో ప్రైవేటు కార్యక్రమాలు తగదు'

**విజయవాడ క్రీడలు,:** అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య నగరపాలక సంస్థ స్టేడియంలో ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతించకూడదని డీవైఎఫ్ఐ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. విజయవాడ సెంట్రల్ కార్యదర్శి నిజాముద్దీన్ మాట్లాడుతూ.. క్రీడేతర కార్యక్రమాలకు మైదానం ఇవ్వడం ద్వారా క్రీడాకారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మెరక చేసి ఆటలు, వాకింగ్‌కు అనువుగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రసూల్, ఎస్.మల్లేశ్వరరావు, శ్యామ్, శ్రీను, సునీల్, భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ

**గవర్నర్‌పేట:** పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్రాఫ్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాయని ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి పేర్కొన్నారు. చిన్నారుల కోసం ప్రతి ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహించే వినూత్న కార్యక్రమాల్లో భాగంగా ఈ వారం కాగితాలతో బొమ్మలు తయారు చేయడం నేర్పించారు. తెనాలి నుంచి వచ్చిన సుబ్బారావు విద్యార్థులకు కాగిత బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. అనంతరం చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు.

కాగితంతో బొమ్మలు తయారు చేయడం నేర్పుతున్న సుబ్బారావు


కన్నీటి వీడ్కోలు

మాతృమూర్తిగా, ఆదర్శగృహిణిగా మా జీవితాలకు వెలుగులు నింపిన శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు ది.12-12-2025 స్వర్గస్తులైనారని తెలియజేయుచున్నాము.

జననం: 01-01-1941 మరణం: 12-12-2025

కీ॥శ్రీ॥ శ్రీమతి కామినేని బేబి సరోజిని గారు

W/o శ్రీ కామినేని దేవదాసు గాంధీ (లేటు)

గుంటూరు

అంతిమయాత్ర: ది.15-12-2025 సోమవారం ఉ॥ 10.00 గం॥లకు మా స్వగృహము పృధ్వీ అపార్ట్‌మెంట్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు నుండి మహాప్రస్థానమునకు బయలుదేరును. కావున తెలియజేయడమైనది.

ఇట్లు: కుటుంబసభ్యులు: 90000 92999


## బసవపున్నయ్య స్ఫూర్తి కొనసాగించాలి

**రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే :** సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలకు మాకినేని బసవపున్నయ్య దార్శనికుడిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కొనియాడారు. ఎంబీ విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం బసవపున్నయ్య జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఆయన స్మారకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రం అనేక రకాల సాంస్కృతిక, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. సాంస్కృతిక రంగంలో అభ్యుదయ భావజాలాన్ని కల్పించేందుకు ఆయన ఎనలేని కృషి చేసినట్లు చెప్పారు. ఎంబీవీకే ఇన్‌ఛార్జి బీఆర్ తులసీరావు మాట్లాడుతూ.. ఆయన స్ఫూర్తితో పదేళ్లుగా విజ్ఞాన కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. ఆయన వ్యక్తిత్వం, పోరాట పటిమ, పేదలపట్ల ఉన్న అభిమానాన్ని అందరూ కొనసాగించాలని కోరారు. ఎంబీవీకే కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బి.రమాదేవి, టి.క్రాంతికిరణ్, యు.వి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. చిత్రంలో తులసీరావు, మురళీకృష్ణ

## దేవీనగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మధురానగర్, న్యూస్‌టుడే :** 30వ డివిజన్ దేవీనగర్ 8వ లైనులో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డి, కలీం బేగ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఇందులో కంటి సంబంధ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. పలువురికి మందులు, కళ్లజోళ్లు ఇచ్చారు. హనుమతుల్లా, బాషా, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యనిపుణులు


పట్టు స్పర్శ 100% చేనేత ఉత్పత్తులతో చేనేత వస్త్రాల గొప్పతనం!

ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వారి

వెడ్డింగ్, క్రిస్మస్ & సంక్రాంతి పండుగల సందర్భంగా అతిపెద్ద & అత్యంత విశ్వసనీయ ప్రదర్శన అమ్మకం

LAST 3 DAYS ONLY!

తేది: 12 నుంచి 17 డిసెంబర్ 2025 (6 రోజులు మాత్రమే) ఉ. 10.30 నుంచి రా. 8.00 వరకు

వేదిక: ఎ కన్వెన్షన్ సెంటర్ బెంజ్ సర్కిల్ విజయవాడ

బనారసి ప్రత్యేక సేకరణ | పశ్చిమ బెంగాల్ బోటిక్ వస్తువులు | టస్సార్ కాంత & ప్రింటెడ్ | చందేరి / మహేశ్వరి / కోటా రాజ్‌కోట్ పటోలా | పోచంపల్లి ఇక్కత్ | బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్ | బీహార్ & జార్ఖండ్ టస్సార్ వస్త్రాల మెటీరియల్స్ | గద్వాల్ | కలంకారి | కాంచీపురం | పైతాని చీరలు | వెంకటగిరి / ఉప్పాడ జమ్దాని చీరలు మరియు కాటన్ దుస్తులు మెటీరియల్స్ | బెడ్ లినెన్లు | ఆభరణాలు

సంప్రదించండి: 95735 53337 లేదా 9000346337 Info@indiansilkgallery.com


## నిత్య సాధనతోనే చక్కని గాత్రం

**విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే :** గాయకులకు నిరంతర సాధన అవసరం అని, అప్పుడే ప్రజారంజకంగా పాడగలరని సాహితీ, ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జేఎన్ఎస్ సరాగాల సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గుప్తాతో పాటు తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు మాట్లాడారు. వర్ధమాన గాయకులకు చక్కని వేదికలు ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు. బుల్లితెర నటి మణిసరిత, గాయకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

## రౌడీషీటర్లకు సత్ప్రవర్తన అవసరం

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఆదివారం ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

## భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

**మధురానగర్ :** రామలింగేశ్వరపేటకు చెందిన తన భర్త ప్రభాకర్(60) 2015 నుంచి కనిపించడం లేదంటూ సాయిలక్ష్మి కామేశ్వరి అనే మహిళ అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభాకర్ ఆటోనగర్‌లోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసేవారు. ఆరోగ్యం కూడా సరిగా ఉండేది కాదని 2015లో ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతని కోసం పలు చోట్ల వెతికిన కనిపించక పోవడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

## ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక

**గాంధీనగర్:** ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నున్నలో గెట్‌టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ మేనేజర్లు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. సినీ గీతాలకు నృత్యాలు చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సాజిద్ అధ్యక్షతన నిర్వహించిన క్రికెట్ పోటీ ఉత్సాహంగా సాగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. విజయవాడ బ్రాంచి అధ్యక్షుడిగా నాంచారయ్య, ఉపాధ్యక్షుడిగా కృష్ణకమల్, కార్యదర్శిగా రాజేష్, సహాయ కార్యదర్శిగా శివరామ్, కోశాధికారిగా అబ్బాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సివిల్ కోర్టు న్యాయమూర్తి దమ్మాలపాటి ధనరాజ్, న్యాయవాది వి.రాజారత్నం, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు, వారి కుటుంబ సభ్యులు

## ఐక్య పోరాటాలతో కళాశాలను కాపాడుకుందాం

**సీతారాంపురం :** అందరం కలిసికట్టుగా పోరాడి శాతవాహన కళాశాలను కాపాడుకుందామని పూర్వ ప్రధానాచార్యులు ఉయ్యూరి సాంబిరెడ్డి పిలుపునిచ్చారు. సీతారాంపురంలోని కళాశాల ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని విద్యార్థి సంఘాలతో పాటు ఐక్య కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దుర్గామల్లేశ్వరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు పిన్నమనేని కృష్ణమోహన్ మాట్లాడుతూ.. కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తమ కమిటీ కృషి చేస్తోందన్నారు. సాంబశివరావు, రామకృష్ణ, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాంబిరెడ్డి. పక్కన కృష్ణమోహన్, రవిచంద్ర తదితరులు

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే :** పీపీపీ విధానంలో వైద్య కళాశాలలతోపాటు వైద్య, ఆరోగ్య శాఖలను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. సంఘం రాష్ట్ర మహాసభలను ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. వివిధ కేడర్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావులు మాట్లాడుతూ.. వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఆ దిశగా యూనియన్‌లు పనిచేయాల్సిందిగా చెప్పారు. 12వ పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై యాప్‌ల భారం తగ్గించడం వంటి 12 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సంఘం నూతన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎ.వి.నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.జగన్మోహనరావు, తాళ్లూరు వెంకటేశ్వర్లు తదితరులతో కూడిన 36మందితో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు. వేదికపై నాగేశ్వరరావు సంఘం నాయకులు




అమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణ దినం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయుచున్న ముఖ్యమంత్రివర్యులు

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి స్వాగతం – సుస్వాగతం

వేదిక: తుమ్మలపల్లి కళాక్షేత్రం, విజయవాడ

డిసెంబర్ 15, 2025 సోమవారం సా. 05.00 గం.లకు

దూండి రాకేష్

ఛైర్మన్: ఆర్యవైశ్య వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ కార్పొరేషన్

మేనేజింగ్ ట్రస్టీ: అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్

ఈనాడు అనకాపల్లి
సోమవారం 15 డిసెంబరు 2025


# ధన్48 సాగుతో సత్ఫలితాలు

## వరి కోతలకు సన్నాహాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

నూతన వంగడాలను సృష్టించేందుకు శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమిస్తుంటారు. భారతీయ వరి పరిశోధన సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పాయకరావుపేటలో డీఆర్ఆర్-ధన్48 రకం వరి సాగుకు నాంది పలికారు. ఈ క్రతువులో స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు భాగస్వాములయ్యారు.

★ మధుమేహంతో బాధపడే వారికి, ఊబకాయం వేధిస్తున్న వారికి మేలు చేసే సన్నరకం బియ్యం అందించాలనే లక్ష్యంతో ఐకార్ కొన్నేళ్లుగా పరిశోధనలు చేస్తోంది. తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న ధాన్యం ఇచ్చే రకాన్ని అభివృద్ధి చేశారు. వీటిని పండించి దిగుబడులు పరిశీలించేందుకు స్పేసెస్ డిగ్రీ కళాశాలతో ఎంఓయూ కుదుర్చుకుంది. వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మీనాక్షి సుందరం, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సాయిప్రసాద్, విద్యాసంస్థ డైరెక్టర్ రామసీత పర్యవేక్షణలో కొత్త వంగడం సాగు చేపట్టారు. ఇది 120 రోజుల్లోనే కోతకు వచ్చింది.

మంచి దిగుబడులు వచ్చే అవకాశముంది. అధిక జింక్, తక్కువ గ్లైసిమిక్ సూచిక, తక్కువ పిండి పదార్థం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పోషకాలు ఇమిడి ఉన్నాయన్నారు. ప్రయోగం విజయవంతం కావడంతో వరి కోతకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఎంతో ఆనందాన్నిచ్చింది**

నూతన వంగడం ఆవిష్కరణలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ధన్48 రకం పండించడంలో నైపుణ్యం సాధించాం. నారు మడి నుంచి మమేకమయ్యాం. పంట పండించడంలో రైతులు పడుతున్న కష్టం విలువ తెలిసింది.
– ఎస్.శ్యామల, ఎం.రమ్య, పి.శరణ్య, బీఎస్సీ విద్యార్థులు

**అహర్నిశలు శ్రమించాల్సిందే..**

పంట పండించడమంటే కష్టంతో కూడుకున్నది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని దిగుబడి సాధించాలంటే అహర్నిశలు శ్రమించాల్సిందే. కొత్త రకం సన్నబియ్యం సాగు కత్తిమీద సామే. శాస్త్రవేత్తల సూచనలతో మంచి ఫలితాలు సాధించాం.
– నవదీప్, విద్యార్థి

వరి సాగులో విద్యార్థులు

## లారీలో మొక్కలొచ్చాయ్!

గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాలు ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏళ్ల తరబడి నిలిచిపోతున్నాయి. ఎండకు ఎండి వానకు తడిసి ముందుకు కదలని పరిస్థితి నెలకొన్నాయి. ఈ వాహనాల్లో కేబిన్ నుంచి తొట్టె వరకు మొక్కలు పెరిగిపోయాయి. ఇవి పెద్దవై వాహనాలనే కప్పేస్తున్నాయి. – ఎలమంచిలి, న్యూస్‌టుడే

# యాడున్నారో..

■ పెరుగుతున్న అదృశ్యం కేసులు
■ లభ్యం కాని 107 మంది ఆచూకీ

❖ ఎలమంచిలికి చెందిన వివాహిత ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినా.. ఇప్పటివరకు ఆమె ఆచూకీ లభ్యం కాలేదు.

❖ అనకాపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమయ్యాడు. గోవాడకు చెందిన ఈ విద్యార్థి శనివారం పాఠశాలకని బయలుదేరాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు అనకాపల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

జిల్లాలో అదృశ్యం కేసులు అధికంగా నమోదవుతున్నాయి. కొందరి ఆచూకీ తెలియడం లేదు. వీరంతా ఏమైపోయారోనన్న ఆందోళనలో కుటుంబ సభ్యులున్నారు. 2023 నుంచి ఇప్పటివరకు జిల్లాలో అదృశ్యమైన వారిలో 107 మంది ఆచూకీ తెలియలేదు. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 59 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసులు చాలామంది ఆచూకీ గుర్తిస్తున్నారు. కొందరి ఆచూకీ గుర్తించడం కష్టమవుతోంది. వివాహితలు, బాలికలు మాయమాటలు నమ్మి ఇంట్లో నుంచి వెళ్లి పోతున్న ఘటనలూ అధికమవుతున్నాయి. అపరిచిత వ్యక్తులతో ఏర్పడుతున్న పరిచయాలు, వారు చెప్పే మాటలు నమ్మి వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారి ఆచూకీ గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చాకే కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.

వివాహితలు పిల్లలను వదిలేసి ఇళ్ల నుంచి వెళ్తున్న కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. చిన్నచిన్న విషయాలకే ఇళ్ల నుంచి వెళ్లిపోతున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. చదువుకోవాల్సిన వయసులో బాలికలు, యువతులు ప్రేమ పేరుతో ఇంటి నుంచి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని కుటుంబ సభ్యులకు వేదన మిగిల్చేలా వ్యవహరించవద్దని కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ

**మూడేళ్లలో ఇలా..**

| ఏడాది | కేసులు | మహిళలు | పురుషులు | బాలికలు | బాలురు | ఆచూకీ లభ్యం | పెండింగ్ |
|---|---|---|---|---|---|---|---|
| 2023 | 417 | 197 | 131 | 66 | 23 | 396 | 21 |
| 2024 | 422 | 210 | 142 | 60 | 20 | 395 | 27 |
| 2025 | 332 | 168 | 103 | 45 | 16 | 273 | 59 |

# ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్

నర్సీపట్నం, న్యూస్‌టుడే

వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీ పక్కగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఓటీపీ విధానం ప్రవేశపెట్టినా అంతంతమాత్రంగానే అమలవుతోంది. సిలిండర్ల సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ పద్ధతి ఎంతగానో ఉపకరిస్తుంది. ఇప్పుడు శత శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

★ సాధారణంగా వినియోగదారులు గ్యాస్ బుక్ చేసి నగదు చెల్లించి సిలిండర్లు తీసుకుంటున్నారు. ఏడాదిగా ఓటీపీ పద్ధతిలోనూ ఇవి సరఫరా అవుతున్నాయి. వినియోగదారుడు 94936 02222 నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే సిలిండర్ బుక్ అవడంతోపాటు రిజిస్టర్ మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఇంటికి వచ్చే గ్యాస్ డెలివరీ సిబ్బందికి ఓటీపీ చెబితే సరిపోతుంది. సిబ్బంది తమ మొబైల్‌లోని యాప్‌లో ఓటీపీ నమోదు చేసి ఓకే అవగానే సిలిండర్ ఇచ్చి నగదు తీసుకుంటారు. ఈ విధానాన్ని జిల్లాలో 30 శాతం మందే వినియోగించుకుంటున్నారు.

★ జిల్లాలో హెచ్‌పీ, ఇండేన్, భారత్ కంపెనీలు సేవలందిస్తున్నాయి. వీటి పరిధిలో సుమారు 15 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. నర్సీపట్నం హెచ్‌పీ డీలర్ పరిధిలోని 38 వేల మందిలో 55 శాతం ఆన్‌లైన్‌లో సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారు. గ్యాస్ రాయితీ దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఓటీపీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్లతోపాటు బేసిక్ ఫోన్లు వాడే వినియోగదారులూ ఓటీపీ విధానంలో సిలిండర్లు బుక్ చేసుకోవచ్చని నర్సీపట్నం హెచ్‌పీ డీలర్ విద్యాసాగర్ పేర్కొన్నారు.

# నేడే ఆఖరు

## స్మార్టు కార్డుల స్వీకరణకు ముగియనున్న గడువు

నక్కపల్లి, న్యూస్‌టుడే

రేషన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం జారీచేసిన స్మార్టు కార్డుల స్వీకరణకు సోమవారంతో గడువు ముగియనుంది. మూడు నెలల కిందట రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల జారీ చేపట్టగా 96 శాతం మంది తీసుకున్నారు. ఇప్పటికి కొందరు తీసుకోకపోవడంతో ప్రభుత్వం తుది గడువు ప్రకటించింది. జిల్లాలో ఐదు లక్షల మందికిపైగా రేషను కార్డుదారులున్నారు. ఏటీఎం, ఆధార్ కార్డుల తరహాలోనే రేషన్ స్మార్టు కార్డులు జారీ అయ్యాయి. వీటిపై ఇంటి యజమాని ఫొటో, వివరాలు, చిరునామా, కార్డు నంబరు, ప్రభుత్వ ముద్ర, లబ్ధిదారుల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ముద్రించారు. ప్రభుత్వ పథకాల అర్హతకు, పలు ధ్రువపత్రాల జారీలో రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. వీటిని ప్రతి ఒక్కరూ తీసుకోవాలంటూ ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పించింది. తొలుత నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు తీసుకెళ్లి అందజేశారు. మిగిలిపోయిన వారంతా డిపోల వద్దకు వచ్చి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో జిల్లాలో ఇప్పటివరకు 96 శాతం కార్డుల బట్వాడా పూర్తయింది.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| రేషన్ లబ్ధిదారులు | : 5,32,346 |
| ఇంత వరకు ఇచ్చిన కార్డులు | : 5,09,253 |
| తీసుకోవాల్సిన వారు | : 23,093 |

**ఇబ్బందులు పడతారు:** ప్రభుత్వం నేరుగా ఇళ్లకే కార్డులు అందించింది. అందుబాటులోలేని వారంతా డిపోలకు వచ్చి తీసుకోవాలని అందుబాటులో ఉంచాం. చాలామంది తీసుకున్నా, ఇంకా కొందరు మరణాలు, మరికొందరు వలసల కారణంగా తీసుకోలేదని గుర్తించాం. కార్డు వెనక్కి వెళ్లిపోతే ప్రభుత్వం తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఇచ్చేది ఉండదు. ఏదైనా అవసరం వచ్చి కార్డు కావాలంటే ఇబ్బంది పడతారు, అందుబాటులో ఉన్నవారంతా కార్డులు తీసుకోవాలి.
– గణపతిరావు, సీఎస్‌డీటీ

# ఉందిగా.. పురమిత్ర

## సమస్యల సత్వర పరిష్కారానికి యాప్

నా వయస్సు 80 సంవత్సరాలు.. ఇంటి ముందు కాలువలు శుభ్రం చేయక భరించరాని దుర్గంధం. దోమల మోత, నడవలేని స్థితిలో ఉన్నా! విశ్రాంత ఉద్యోగినైన నేను మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయలేని పరిస్థితి. పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కాలువ సమస్యపై ఫిర్యాదు చేశా. మరుసటి రోజే మున్సిపల్ సిబ్బంది వచ్చి కాలువ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి వెళ్లారు.
– వి.లక్ష్మి, ఎలమంచిలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ప్రజలు ఇంటి నుంచే వారి సమస్యలు పరిష్కరించుకోవడం కోసం ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో గత నెలరోజులుగా ఈ యాప్‌పై ప్రచారం చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకోవడం తెలియని వారికి సచివాయం సిబ్బంది స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు. పురప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. ఫోన్ చేసి సిబ్బందిని బతిమలాడుకోవాల్సిన పనిలేదు.

★ ప్లేస్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఓపెన్ చేస్తే ఫోన్ నంబర్ అడుగుతుంది. ఎంటర్ చేసి సబ్మిట్ చేయగానే ఓటీపీ వస్తుంది.

★ మన చుట్టూ ఉన్న సమస్యలను ఫొటో తీసి యాప్‌లో పంపించవచ్చు. వాయిస్ రికార్డింగ్ ద్వారా సమస్యను చెప్పుకోవచ్చు. ఫిర్యాదుపై పురోగతిని ట్రాక్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఇందులో 8 విభాగాలకు చెందిన 119 నుంచి 150 వరకూ పౌరసేవలు అందుబాటులో ఉన్నాయి. రెండు మున్సిపాల్టీల్లో కలిపి ఇప్పటివరకూ 14,767 మంది ఈయాప్ వాడుతున్నారు.

**3 నుంచి 30 రోజుల్లో..**

సమస్య తీవ్రతను బట్టి 3 నుంచి 30 రోజుల్లోగా పరిష్కరిస్తారు. సమస్య నేరుగా సంబంధిత శాఖకు చేరుతుంది. ఆ అధికారి స్పందించకపోతే ఉన్నతాధికారికి ఫిర్యాదు వెళ్లి స్పందించని అధికారిని బాధ్యుడిని చేస్తుంది. తెలుగు భాషలోనూ యాప్ అందుబాటులో ఉంది.

**అందేసేవలు** : ప్రజారోగ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, అకౌంట్స్, జనన మరణ, వివాహ ధ్రువపత్రాలు, తాగునీటి సమస్య, చెత్త సేకరణ, కాలువలు, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి సేవలను అందిస్తుంది.

**కార్యాలయానికి వచ్చే పనిలేదు**

సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే పనిలేదు. యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల జవాబుదారీతనం పెరిగి సిబ్బంది తొందరగా పరిష్కరిస్తారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.
– ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి మున్సిపాలిటీ

# దస్తూరి.. భవితకు దారి

## చక్కని చేతిరాతకు విద్యార్థుల సాధన

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంపైనే ఇప్పుడు అందరి దృష్టి. పరీక్షల్లో విద్యార్థుల చేతిరాత కీలక పాత్ర పోషించనుంది. విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉపాధ్యాయులు దస్తూరి మెరుగుపడేలా విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. 'రాత బాగుంటే.. గీత బాగుంటుంది' అన్నది నానుడి. అక్షరాలను ముత్యాల్లా రాస్తే టాపర్లుగా నిలవవచ్చు. పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యార్థులకు ఇప్పటికే వంద రోజుల విద్యా ప్రణాళిక అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా 405 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 18,500 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా చక్కని దస్తూరితో సమాధానాలు రాయడంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతోపాటు సాధన చేయిస్తున్నారు.


చేతి రాత సాధన చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు అప్పారావు

**ఇలా చేయండి..**

★ ఇటుకలు పేర్చినట్లు అక్షరాలు అందంగా ఉండేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నర్సీపట్నం ఎంఈవో తలుపులు సూచిస్తున్నారు.

★ చూడగానే ఆకట్టుకునేలా, ఒక క్రమపద్ధతిలో గుండ్రని అక్షరాలతో సమాధానాలు రాయాలి.

★ గీతలు లేని కాగితంలోనూ వరుస తప్పకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ★ ఒకదానికొకటి అంటుకోకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో ఉండాలి.

★ రెండు పదాల మధ్య '0' పట్టేంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ సాధన చేస్తే చక్కని దస్తూరి సొంతమవుతుంది.

# ట్రాఫిక్ చిక్కులతో బస్సులు ఆలస్యం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవడం వల్లే ఆర్టీసీ బస్సులు ఆలస్యంగా రాకపోకలు వస్తున్నాయని జిల్లా ప్రజా రవాణా అధికారి వి.ప్రవీణ చెప్పారు. 'ఒక్క బస్సు లేదే' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. కశింకోట, లంకెలపాలెం, అగనంపూడి, గాజువాక ప్రాంతాల్లో చాలా సేపు ట్రాఫిక్ నిలిచిపోతుండటం వల్ల బస్సులన్నీ ఆలస్యమవుతున్నాయన్నారు. సాయంత్రం సమయంలో కశింకోట వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోందన్నారు. కణితి రోడ్డు మరమ్మతుల వల్ల కూర్మన్నపాలెం మీదుగా రాకపోకలు సాగించడం వల్ల వాహనాల సంఖ్య పెరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యలతో ఆర్టీసీ డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, వీటిని అధిగమించి సకాలంలో బస్సులు నడిచేలా చూస్తామన్నారు.

## ఆవలో లాహిరి.. లాహిరి

ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే కొండకర్ల ఆవకు సెలవు రోజుల్లో సందర్శకులు బారులు దీరుతున్నారు. కుటుంబ సమేతంగా కొందరు, స్నేహితులతో ఇంకొందరు, బృందాలుగా మరి కొందరు ఇక్కడకు చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదగా గడుపుతున్నారు. ఈ ఆదివారం ఆవ సందర్శకులతో కిటకిటలాడింది. ఫైబర్ బోట్లలో విహరిస్తూ ఆవ అందాలను ఆస్వాదించారు. ఆవ ఒడ్డున వనసమారాధనలు నిర్వహించి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, ఆటలాడుతూ సందడి చేశారు. – న్యూస్‌టుడే, అచ్యుతాపురం

## మూడడుగులు కదురు..

సముద్రంలో లభించే చేపల్లో అనేక రకాలైన జాతులుంటాయి. ఇందులో కొన్ని రకాలే ఇక్కడి వారికి పరిచయం. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలంలో వేట సాగించే మత్స్యకారులు నక్కపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాల్లో మార్కెట్‌లో చేపలు విక్రయిస్తుంటారు. ఈ రెండుచోట్ల ఆదివారం వచ్చిన చేపల్లో కొన్నింటిని కొనేందుకు పలువురు ఆసక్తి చూపారు. వీటిలో పొడవైన ఈటెలాంటి మూతి ఉన్న కదురులు ఉన్నాయి. ఇవి సహజంగా అడుగున్నర పొడవున్నవే లభిస్తుంటాయి. మూడడుగుల పొడవైన ఈ చేపలు ఒక్కొక్కటి రూ.1500 ధర పలికాయి.
– న్యూస్‌టుడే, నక్కపల్లి

# శిరస్త్రాణం ధరిస్తే ప్రాణాలు నిలిచేవి..!

## స్తంభాన్ని ఢీకొని ఇద్దరు స్నేహితుల దుర్మరణం

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: వేర్వేరు గ్రామాలు అయినా ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు ఇద్దరూ కలిసే ఉంటారు. ఎక్కడకు వెళ్లినా కలిసే వెళ్తారు. మునగపాక మండలం గణపర్తి గ్రామంలో ఉత్సవానికి వెళ్లి బైక్‌పై వస్తూ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. శిరస్త్రాణం లేకపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించేలోగా ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. అచ్యుతాపురం, మునగపాక ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. మునగపాక మండలం గణపర్తి, చెర్లోపాలెం గ్రామాలకు చెందిన భోగాది ధనువిజయ్ (19), ధూళి దుర్గ (20) స్నేహితులు. గణపర్తిలో ఉత్సవానికి వెళ్లిన ఇద్దరూ దుర్గ అమ్మమ్మ ఊరైన చోడిపల్లి వెళ్లాలని స్నేహితుడి బైక్ తీసుకున్నారు. ఎం.జగన్నాథపురం సమీపంలో మలుపు వద్ద రాత్రి 11.30 గంటల సమయంలో మంచుతో రోడ్డు కనిపించక విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న దుర్గతోపాటు వెనుక కూర్చున్న ధనువిజయ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కాపాడేందుకు స్థానికులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దుర్గ, విజయ్ (పాత చిత్రాలు)

★ ఒక్క రోడ్డు ప్రమాదం రెండు పేద కుటుంబాల్లో విషాదం నింపింది. చేతికందొచ్చిన కుమారులను దూరం చేసింది. పదో తరగతి వరకు చదువుకున్న దుర్గ, ధనువిజయ్ చిన్న చిన్న పనులు చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉంటున్నారు. దుర్గ తండ్రి గతంలోనే చనిపోయారు. తల్లి నాగమణి, అన్నయ్య చందు అచ్యుతాపురం సెజ్‌లోని దుస్తుల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ధను విజయ్ తండ్రి మహేష్ టింకరింగ్ పని చేస్తుంటారు. తల్లి లక్ష్మి దుస్తుల పరిశ్రమలో పనిచేస్తున్నారు. సోదరి పావని ఇంటర్ చదువుతోంది. కొడుకు దూరమైన తమకు దిక్కెవరంటూ ధనువిజయ్ తల్లి లక్ష్మి రోదించడం అక్కడి వారిని కంట తడి పెట్టించింది. శిరస్త్రాణం ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడే వారని, తలకు బలమైన గాయాలు కావడంతోనే మృత్యువాత పడ్డారని కన్నీరుమున్నీరయ్యారు.

## బొజ్జన్న కొండకు బారులుదీరారు!

శంకరం సమీపంలోని బొజ్జన్న కొండకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. కొండకు వచ్చే మార్గం వాహనాలతో రద్దీగా మారింది. కొండ వద్ద ప్రాచీన బౌద్ధ విగ్రహాలు, లింగాల కొండ స్తూపాలను తిలకించారు. కొండ చరిత్రను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు.
– న్యూస్‌టుడే, అనకాపల్లి గ్రామీణం

# 'కాఫీ' వచ్చేస్తోంది!

➡ క్యూరింగ్ సెంటర్‌కు గింజల సరఫరా
➡ జనవరి నుంచి మహిళలకు ఉపాధి

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నర్సీపట్నం కేంద్రంగా నడుస్తున్న కాఫీ శుద్ధీకరణ కేంద్రానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ ఎస్టేట్ల నుంచి గింజల సరఫరా మొదలైంది. ఈ ఏడాది 175 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను ఇక్కడ శుద్ధి చేయించి వేలంలో విక్రయించాలన్నది లక్ష్యం. ఇప్పటికే 49 టన్నుల గింజలను ఇక్కడి గోదాముల్లో నిల్వ చేశారు. వంద టన్నులకు చేరుకోగానే శుద్ధీకరణ పనులు ప్రారంభించనున్నారు. తద్వారా నర్సీపట్నంలో సుమారు వంద మంది మహిళలకు ఉపాధి లభించనుంది.

★ గతేడాది 183 టన్నుల గింజలను నర్సీపట్నం కేంద్రంలో శుద్ధి చేశారు. వీటిని వేలంలో విక్రయించంగా రూ.9.7 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువ వస్తుందన్న అంచనాతో శుద్ధీకరణ లక్ష్యాన్ని కుదించారు. ఈ పనులు పూర్తయ్యాక గిరిజనుల నుంచి జీసీసీ కొనుగోలు చేసిన వేల టన్నుల గింజలను శుద్ధిచేసి ఇస్తుంటారు. ఎగుమతులు, దిగుమతులు, గింజలను ఆరబెట్టడం, మర పట్టడం తదితర పనుల ద్వారా వచ్చే ఏడాది జనవరి నుంచి మూడు నెలలకుపైగా మహిళలకు ఉపాధి లభించనుంది.

కాఫీ పండ్లు

★ ఏపీఎఫ్‌డీసీకి అల్లూరి జిల్లాలో నాలుగు వేల హెక్టార్లకుపైగా కాఫీ తోటలున్నాయి. వివిధ కారణాల వల్ల ప్రస్తుతం 3,300 హెక్టార్ల నుంచే కాఫీ గింజల సేకరణ జరుగుతోంది.

నర్సీపట్నంకు చెందిన పలువురు వ్యాపారులు ఏజెన్సీకి వెళ్లి కాఫీ గింజలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. ఇక్కడ వాటిని ఆరబెట్టి శుభ్రం చేయించి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. నాణ్యత, రుచుల్లో మన కాఫీ అంతర్జాతీయంగా పలు అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. పురపాలక సంఘం పరిధిలోని మార్కెట్ యార్డులో జనవరి నుంచి కాఫీ గింజల ఆరబోత, శుద్ధీకరణ పనులు ప్రారంభం కానున్నాయి.

★ మాకవరపాలెం మండలంలో కాఫీ పరిశ్రమ ఏర్పాటుకు జీసీసీకి ఇప్పటికే కొంత భూమి కేటాయించింది. సంబంధిత అధికారులు పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిశ్రమలో వందలాది మందికి ఉపాధి లభించనుంది. నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన వారికే ఈ పరిశ్రమలో ఉద్యోగాలొచ్చేలా చూస్తామని సభాపతి అయ్యన్నపాత్రుడు ఇటీవల ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు నెలకొన్నాయి.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

# కూచిపూడిలో భళా...

## రాణిస్తున్న అనకాపల్లి విద్యార్థినులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యంలో అనకాపల్లి విద్యార్థినులు రాణిస్తున్నారు. సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేస్తున్న నృత్య సాధన విద్యార్థినులకు గుర్తింపు తెస్తోంది. చదువుతో పాటు నృత్య సాధనతో జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచేలా చేసింది. ఇటీవల గుంటూరు, తిరుపతిల్లో నిర్వహించిన పోటీలో ప్రతిభ చూపారు.

### మొదటి స్థానంలో నిలిచి...



కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో రెండో తరగతి నుంచి నృత్య సాధన చేస్తున్నా. బాలల దినోత్సవంలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలో మొదటి స్థానం వచ్చింది. తిరుపతిలో నిర్వహించి పోటీలో నగదు బహుమతి సాధించాను. భవిష్యత్‌లో నృత్యకారిణిగా పేరు తెచ్చుకోవాలన్నది నాకోరిక. **- లాస్యశ్రీ, నాలుగో తరగతి**

### స్ఫూర్తి పొంది.. సాధన చేసి

కూచిపూడి, భరత నాట్యం చాలామంది నేర్చుకుంటున్నారు. వీరిని చూసి నాకు సాధన చేయాలని అనిపించింది. సాధన చేస్తూ పోటీల్లో పాల్గొంటున్నాను. కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూడో స్థానంలో నిలిచి బహుమతి సాధించాను. రాబోయే పోటీల్లో ప్రథమ స్థానం సాధించాలనేది లక్ష్యం. **- యశ్మిత, ఆరో తరగతి**

### చదువుతూనే శిక్షణ

చదువుకుంటూ నృత్య సాధన చేస్తున్నాను. ప్రతి రోజు చేస్తున్న సాధన ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ప్రపంచ తెలుగు బాలోత్సవం పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి బాలలతో పోటీపడడం వల్ల ఎన్నో విషయాలు తెలిశాయి. రాబోయే రోజుల్లో ప్రథమ బహుమతి సాధించేందుకు సాధన చేస్తున్నాను. **- యషిక**

## రక్తదానం ప్రాణదానంతో సమానం

నెహ్రూచౌక్(అనకాపల్లి), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీక్లబ్ అధ్యక్షులు బుద్ధ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ఏటా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. సేకరించిన రక్తాన్ని విశాఖ రోటరీ రక్తనిధి కేంద్రాన్ని తరలించారు. క్లబ్ కార్యదర్శి ప్రకాశరావు, ప్రోగ్రాం ఛైర్మన్ బుద్ధ సత్యనారాయణ, సతీష్, కేఎల్ఎన్ కుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. కొండలరావు, రమేష్, సంఘ ప్రధాన కార్యదర్శి గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ తోటాడ సింహాచలం, కార్యదర్శి పిల్లా సురేష్, కోశాధికారి కృష్ణ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సభ్యులు

## ఉత్సాహం ఉరకలెత్తే..!

ఆర్కేబీచ్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన 'వైజాగ్ నేవీ మారథాన్'కు జనం పోటెత్తారు. ఈ సందర్భంగా 42కే, 10కే, 5కే పరుగు పోటీలు నిర్వహించారు. వణికించే చలిని లెక్క చేయకుండా వేలాది మంది నీలి రంగు దుస్తులు ధరించి తీరంలో పరుగులు పెట్టారు. విజేతలకు రూ.10 లక్షలకు పైగా నగదు బహుమతులు అందజేశారు. **-న్యూస్‌టుడే, విశాఖపట్నం**

## అప్పన్న సేవలో శ్రీలీల

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ కథానాయిక శ్రీలీల ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు బి.సత్య శ్రీనివాస్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

త్రోబాల్‌లో రాంబిల్లి జట్టుకు బహుమతి అందిస్తున్న అప్పారావు

## డివిజనల్ ఆటల పోటీల విజేత రాంబిల్లి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రాజీవ్ క్రీడామైదానంలో డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల ఆటలపోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. మహిళల విభాగంలో త్రోబాల్ పోటీల్లో రాంబిల్లి ఉపాధ్యాయినుల జట్టుకు ప్రథమ స్థానం, అనకాపల్లి జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. విజేతలకు డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు బహుమతులు అందించారు. ప్రతిభ కనబచిరిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. సోమవారం పురుషుల క్రికెట్ ఫైనల్ పోటీలు ఉంటాయి. ఎంఈఓలు సుసర్ల సూర్యప్రకాశరావు, అరుణ్‌కుమార్, పీఈటీలు పాల్గొన్నారు.

## ఎం.ఎస్.ఎస్. రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా శివ

నక్కపల్లి, న్యూస్‌టుడే: మత్స్యకార సంక్షేమ సమితి (ఎం.ఎస్.ఎస్) యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు చెందిన వాసుపల్లి శివ ఎన్నికయ్యారు. భీమవరంలో జరిగిన శిక్షణ తరగతుల్లో భాగంగా యువజన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఉమ్మడి మహేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

**ANDHRA PRADESH STATE WAREHOUSING CORPORATION**
(A GOVT. OF AP.UNDERTAKING)
REGIONAL OFFICE :: VIZIANAGARAM
D.No 8-30-9A Plot No.24, SaiNagar, Near Gayathri College, Thotapalem, Vizianagaram-535002
Email ID: 2010regionaloffice@gmail.com
Tender No SWC/B4/H&T/Parwada-Own/2025-26 Dated: 10-12-2025

**NOTICE INVITING TENDERS ON AD-HOC BASIS**

Ad-hoc tenders are invited from the interested parties for appointment of Ad-hoc Transport Contractor at State Warehouse godown at Parwada(Own) (Only Transport, Till completion of regular contract)
**Sale of Tenders**: APSWC, Regional Office, Vizianagaram from **15.12.2025 to 17.12.2025 (3 Working Days)**. For further details contact at the above office or by over phone Land No. 08922-221214 & Mobile No: 9849059561.

REGIONAL MANAGER
APSWC, Vizianagaram

## 'ఎడతెగని జ్ఞాపకాల్లో' పుస్తకావిష్కరణ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంల వివేకానంద ఛారిటబుల్ ట్రస్టులో తెలుగు రచయిత కోరాడ అప్పలరాజు రచించిన 'ఎడతెగని జ్ఞాపకాల్లో' పుస్తకాన్ని మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి ఆవిష్కరించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంపై రచయితలు రాసిన పుస్తకాలు ఎంతో ప్రభావం చూపుతాయన్నారు. వైద్యులు విష్ణుమూర్తి, మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు, మువ్వల రాంబాబు, పృథ్వీరాజ్, ఎంఈఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్కకావిష్కరణలో మాజీ ఎంపీ సత్యవతి, రచయితలు

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కశింకోట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం బయ్యవరం శారదావనంలో జిల్లా అధ్యక్షులు డి.గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టెట్‌పై ఉపాధ్యాయులు ఆందోళన చెందొద్దన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు కాశీ, విశాఖ జిల్లా అధ్యక్షులు మద్దు శ్రీను, కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెద్ది నాయుడు, యు.వి.గిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ధర్మవరం వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. గెడ్డపాలెం నుంచి ఎలమంచిలి మండలం పద్మనాభరాజుపేటకు వీటిని తరలిస్తుండగా, విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. తనిఖీలు చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా 17 మూటల్లో సుమారు 600 కేజీల బియ్యాన్ని గుర్తించారు. సరకుతోసహా ఆటోను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు.

పట్టుబడిన బియ్యం

## రిటైల్, వినోద కేంద్రంగా అభివృద్ధి

గాజువాక, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం రిటైల్, వినోద కేంద్రాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందని ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావులు అన్నారు. ఆదివారం పాతగాజువాకలో సెలెస్ట్ మాల్‌లో ఫ్యాషన్ వరల్డ్ వస్త్ర షోరూమ్‌ను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణతో కలిసి వీరు ప్రారంభించారు. సెలెస్ట్‌లో సకల సదుపాయాలు వినియోగదారులకు చేరువలో ఉన్నాయన్నారు. కంకటాల అధినేత మల్లిక్, పలువురు సెలెస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా, గంటా, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

## పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఆర్టీసీ ద్వారా వినియోగదారుల పార్సిళ్లను పది కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేస్తామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, అనకాపల్లి, నర్సీపట్నం బస్‌స్టేషన్లలో కేంద్రాల నుంచి డోర్ డెలివరీ సదుపాయం ఉందని, అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు.

## జీవీఎంసీకి అవార్డుల పంట

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహా విశాఖ నగరపాలక సంస్థకు మూడు అవార్డులు వచ్చాయి. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంపవరింగ్, గ్రోత్, బ్రిడ్జిరింగ్ రూట్స్ థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమానికి ఉత్తరాఖండ్ స్పీకర్ రీతూ ఖండూరి భూషణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్యం, సోషల్ మీడియా వినియోగం, మహిళా సాధికారిత, సామాజికాభివృద్ధి విభాగాల్లో జీవీఎంసీకి దక్కిన అవార్డులను అదనపు కమిషనర్ రమణమూర్తి, పౌర సంబంధాల అధికారి ఎన్.నాగేశ్వరరావు స్వీకరించారు.

## తీరప్రాంతంలో భద్రత పెంపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు భద్రత పెంచారు. సముద్ర స్నానాలకు దిగి యువత ప్రాణాలు పోగొట్టుకుంటున్న నేపథ్యంలో రత్నాయంపేట, పెంటకోట, వెంకటనగరం, రాజవరం, రేవుపోలవరం తదితర ప్రాంతాల్లో ఆదివారం గస్తీ ముమ్మరం చేశారు. తీరానికి వచ్చిన పర్యాటకులు సముద్రంలో స్నానాలకు దిగకుండా అవగాహన కల్పించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో ఎవరినీ స్నానాలకు అనుమతించలేదని ఎస్సై డి.రత్నశేఖర్ తెలిపారు. రత్నాయంపేట బీచ్ మరింత ప్రమాదకరంగా ఉందన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో సముద్ర తీరంలో నిరంతరం గస్తీ చేపడుతున్నామని పేర్కొన్నారు.

పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్సై రత్నశేఖర్

## ఇంటి వాతావరణాన్ని పచ్చదనంతో నింపాలి

కశింకోట, న్యూస్‌టుడే: ప్రతి ఇంటి వాతావరణాన్ని పచ్చదనంతో నింపాలని సీఐ అల్లు స్వామినాయుడు పిలుపునిచ్చారు. కశింకోటలో రామచంద్ర సంస్థ హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ రహదారి నుంచి సంపతిపురం ధ్యాన మందిరం వరకు 1.5 కిలోమీటర్ల మేర రన్ సాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మానసిక శాంతి, సామరస్య జీవన విధానాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో నెల్లి గురుదేవ్, లక్ష్మణయ్య, మురళీమోహన్, కె.ఎన్.కె.రావు, 500 మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పరుగు ప్రారంభిస్తున్న సీఐ స్వామినాయుడు

## తాగునీటి సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి తులసీనగర్ ప్రాంతంలో తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. కాలం చెల్లిన పాత పైపులు తరచూ పగిలిపోతున్నాయి. ఎన్ని సార్లు మరమ్మతులు చేసినా తరచూ పగిలిపోతున్నాయి. 30 సంవత్సరాల కిందట వేసిన పైపులనే ఇప్పటికీ వాడుతున్నారు. ఈ కారణంగా రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతకాలం నాటి పైపులైన్లకు కాలం చెల్లిందని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. వీటిని మార్చడానికి నిధులు లేకపోవడంతో పాత వాటితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. తరచూ పగిలిపోతున్న పైపులు అధికారులకు తలనొప్పిగా మారింది. తాగునీటి సమస్య తీవ్రం అవుతోంది. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని పురప్రజలు కోరుతున్నారు.

పైపులకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

**EENADU e Classifieds**

**BUSINESS SERVICES**

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక ఋణం ఇప్పించబడును. ✆ 9908545224.

**BUSINESS OFFER**

మీకు సంఘంలో గుర్తింపు, విదేశాలలో సత్కారం మరియు మీ పేరున పోస్టల్‌స్టాంపు ఆవిష్కరణ ఊహ కాదు నిజమే. ఇన్సూరెన్స్ రంగంలో అత్యున్నత పురస్కారంగా పేరు కలిగిన MDRT క్లబ్‌లో మెంబరుగా ఈ నెలలో చేరిన యెడల సాధ్యమే. చివరి తేది 24-12-2025. 8790189686.

**FINANCIAL SERVICES**

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xerox పై 2nd మార్టిగేజ్ లోన్ ఇస్తాం. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396999669.

**REAL ESTATE**

**FLAT FOR SALE**

**AKKAYYAPALEM**

2 BHK flat North & South. Ready to occupy. Opp celebrations restaurant, Narasimha Nagar, NH5 Highway 48 bus stop. ✆ 8374764888.

**HOUSE FOR SALE**

**ATCHYUTAPURAM**

121 Sqyds North East Corner (Cellar+ G+1) House for Sale 2700 Sqft at Just 3300 Per Sft Brand New ✆ 9885824528.

**LAND FOR SALE**

**GENERAL**

పూసపాటిరేగ మం. గోవిందపురం రోడ్డు, హైవేకి 1/2km తా.రోడ్డు ఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట &13 ఎకరాలు 100' రోడ్డు ఉన్న స్థలం సేల్. ✆ 9440255187

**PLOT FOR SALE**

**PENDURTHI**

**PLOT FOR SALE**
Urgent Sale
933.33 Sqyds at
SRI BALAJI DEVELOPERS
VUDA Layout
Near Pendurthy, Gorapalli, Karakavanipalem
@ 18000/- Sqyd Negotiable
9030595527

**TO LET**

**COMMERCIAL**

**SIRIPURAM**

Commrl 2 flrs 1550 sft each 3BHK lift car AC Furnishd kitchn cellar VIP Rd CBM Compound. Contact Ph: 9848194142, 9290876448.

**JOBS**

Wanted 1) Drawing Teacher/ Artist @Vsp 2) Civil Engg/ Supervisor @ Lambasingi. Contact Ph: 7674888221, 7780706507.

Wanted Computer Operator (F) with Tally & MS Office, Salary 18K - 25K, Job @ Dabagardens, Vizag. Walk-in 17-12-25 (Wednesday) Contact Ph: 9848222131, 8125222131.

**WANTED**
A Well Established Org. Starts New Projects in 2 States. Urgently Required in AP State, VSP Branches.
❖ ADMINISTRATION STAFF : M/F
(A) OFFICE INCHARGES : 5 Posts
(B) OFFICE ASSISTANTS : 5 Posts
(C) P.R.O's: 3 Posts
Qlf: Age 30 Years and above any Degree min. 1Yr. Exp. in any sectors.
Monthly Package: 60,000 to 1 Lakh Nego.
INTERVIEWS ON : 15th, 16th &17th - Dec-25
INTERVIEW TIMINGS 10.00 AM to 7PM
Con: Y.K.Rao
DOCTORS COLONY, VSP
Ph: 8121100599

మీ ఆఫీస్/ఫ్యాక్టరీ కొరకు సెక్యూరిటీ హౌస్‌కీపింగ్ స్టాఫ్ or కాంట్రాక్ట్ లేబర్ కొరకు. Contact Ph: 9603722786. www.arabia consultancyservices.com

HYD యూనిట్ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయసు. యువతీ, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము Cont: 9704637370, 9949904532.

Dyd, పోర్ట్, HPCL, ప్లాంట్, బ్యాంక్ కాంట్రాక్టర్స్ వద్ద సూపర్ వైజర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, ఫైర్ & సేఫ్టీ, హౌస్‌కీపింగ్ కావలెను. 10th to డిగ్రీ, ITI, బీటెక్. జీతం: 20K-40K. ✆ 9573635594, 9121044796.

**MARKETING/ SALES**

Hyd based Tissue MFG Company required field, sales, Executives, fresher/ Experience, Bike must, Age 22-35, Resume 7997409992.

**FACULTY/ TEACHERS**

Faculty for B.Sc Nursing College Q:M.Sc(Nursing), B.Sc(Nursing) Candidates C:8008083353,7799772299 E-Mail: balajee.nursing@gmail.com

**DRIVERS**

Experienced Auto driver age 20 to 45 years. Food and accommodation available. Contact Phone Number: 8897663366

**SECURITY GUARDS**

వైజాగ్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8 గం|| డ్యూటీ. జీతం: 18815/- PF, ESI. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11 మంది (Ex-Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం: 30000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## గెడ్డలోకి దూసుకుపోయిన కారు

రాంబిల్లి, న్యూస్‌టుడే: రాంబిల్లి-వెంకటాపురం ప్రధాన రహదారిలో సంతపాలెం సమీపాన కారు ఆదివారం రాత్రి ఉప్పరిగెడ్డలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. రాంబిల్లి నుంచి అచ్యుతాపురం వైపు వెళ్తున్న కారు సంతపాలెం శ్మశానవాటిక వద్ద మలుపులో అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ తరవాత ఉప్పరిగెడ్డలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విద్యుత్తు స్తంభం విరిగిపోయింది. కారు ముందు భాగం నుజ్జయింది. కృష్ణంపాలెం, రాజకోడూరు, ఆర్.నర్సాపురం, జంగాలపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు గెడ్డలోకి దూసుపోయిందని స్థానికులు తెలిపారు.

## 13 ఏళ్లగా మూత

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లిలో మాంసం అమ్మకాలపై నియంత్రణ లేదు. వాస్తవానికి ప్రభుత్వ పశువైద్య అధికారుల పర్యవేక్షణలో మేకలు, గొర్రెలను వధించాలి. ఈ మేరకు 13 ఏళ్ల క్రితం అనకాపల్లిలో జంతువధశాలలను నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా ఇది ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా అమ్మకాలు చేస్తున్నారు. చనిపోయిన మేకలు, గొర్రె మాంసం కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

★ ప్రస్తుతం పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో జంతువులను వధిస్తున్నారు. పట్టణంలో రోజుకు 50 నుంచి 70 వరకు జంతువులు వధిస్తుంటారు. ఆదివారం ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. అక్కడ కూడా ఎటువంటి పర్యవేక్షణ లేదు. అనకాపల్లి పురపాలక సంఘంగా ఉండే సమయంలో పశువైద్యాధికారి తరపున ఉద్యోగులు స్టాంపు వేసేవారు. ఆర్యోగ అధికారులే పర్యవేక్షించాల్సి ఉంది. జీవీఎంసీగా స్థాయి పెరిగిన తరవాత పూర్తి స్థాయి ఆరోగ్య అధికారి లేని పరిస్థితి నెలకొంది.

★ పరిశుభ్రత అనేది కానరావడంలేదు. నూకాలమ్మ కోవెల, శారదాకాలనీ, నాగులపల్లి కాలువ, అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో మాంసం వ్యాపారులు సొంతంగా జంతువధశాలలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో జనావాసాలు పెరిగాయి. వీటిని అరికట్టలని ఆయా ప్రాంత ప్రజలు పలు పర్యాయాలు ఫిర్యాదులు చేసినా అధికార్లు స్పందించడం లేదు.

ప్రారంభానికి నోచుకోని జంతు వధశాల

### కాలువల పక్కనే

పట్టణంలోని పలు మాంసం దుకాణాలు కాలువల పక్కనే ఉన్నాయి. మాంసంపై ఈగలు, దోమలు వంటివి వాలుతున్నాయి. రహదారులపై నుంచి వచ్చే ధూళి, దుమ్ము మాంసంపై పడుతుంటుంది. అయినా ఎటువంటి రక్షణ ఏర్పాట్లు చేయడం లేదు. ఆరోగ్యశాఖ అధికారులు కనీసం వీటి గురించి పట్టించుకోవడంలేదు. చనిపోయిన జంతువులతో పాటు ముందురోజు మిగిలిపోయిన మాంసాన్ని చాలా మంది వ్యాపారులు అమ్ముతూ ప్రజారోగ్యంతో ఆటాడుకుంటున్నారు. అనకాపల్లిలో అమ్మకం చేసే వాటిలో అధిక శాతం మేక మాంసమే. అయినా వ్యాపారులు వేట మాంసం అంటూ కొనుగోలుదారులను నమ్మించి మోసం చేస్తున్నారు. దీనిపై జోనల్ కమిషనర్ చక్రవర్తిని వివరణ కోరగా జంతువధశాల తెరవడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

## ఆదా.. రేపటికి ధీమా!

### నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

*అనంతగిరి, పాడేరు, న్యూస్‌టుడే:* విద్యుత్తు గృహోపకరణాలు లేని ఇల్లంటూ లేదు. గిరిజన గ్రామాల్లోనూ ప్రతి ఇంట్లో విద్యుద్దీపాలతోపాటు ఫ్యాన్లు, టీవీ, ఫ్రిడ్జ్ ఉంటున్నాయి. కొందరు అవసరం మేరకు వీటిని వినియోగిస్తుంటే.. మరి కొందరు అవసరమున్నా, లేకున్నా నిరంతరాయంగా వాడుతున్నారు. ఇలా చేయడం వల్ల త్వరగా పాడవడంతోపాటు విద్యుత్తు వినియోగం అధికమవుతోంది. అవసరం లేనప్పుడు ఆఫ్ చేస్తే ఆదా చేసిన వారమవుతాం. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ధ్యేయంతో సోమవారం నుంచి ఈ నెల 21 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నారు.

***అధిక మొత్తం బొగ్గు నుంచే..*** : అల్లూరి జిల్లా వ్యాప్తంగా సుమారు 2.65 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. సుమారు 70 శాతం వరకు బొగ్గు ఆధారితంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తునే వినియోగిస్తున్నారు. ఒక యూనిట్ విద్యుత్తు తయారీకి సుమారు 700 గ్రాముల బొగ్గు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో గాలి కాలుష్యం కావడంతోపాటు విద్యుత్తును పొదుపుగా వినియోగించకుంటే భవిష్యత్తు తరాలకు కొరత ఏర్పడే ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

***ఇలా చేద్దాం..:*** ● అవసరం లేకుండా బల్బులు, టీవీలు, ఫ్యాన్లు వాడకూడదు. ● ఫోన్ ఛార్జర్, టీవీ ప్లగ్‌లను ఉపయోగంలో లేనప్పుడు తీసివేయాలి. ● పగటి పూట బల్బులు వినియోగించకుండా సూర్యకాంతి లోపలకు వచ్చేలా చూసుకోవాలి. ● విద్యుత్తు పరికరాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించుకోవాలి. ● ఎల్ఈడీ, సీఎఫ్ఎల్ బల్బులతో విద్యుత్తు ఆదా అవుతుంది. ● అధిక వినియోగాన్ని అరికట్టేందుకు సౌర విద్యుత్తు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**అవగాహన ర్యాలీలు, పోటీలు:** వినియోగదారులంతా సామాజిక బాధ్యతగా విద్యుత్తు వృథాను అరికట్టేందుకు నడుం బిగించాలి. అవసరం లేకుండా గృహోపకరణాలు వినియోగించకూడదు. గృహోపకరణాలు కొనుగోలు చేసే సమయంలో 5 స్టార్ రేటింగ్ ఉన్న వాటినే ఎంచుకోవాలి. ఇవి తక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్తు వైపు దృష్టిసారించాలి. ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీలు, డివిజన్ స్థాయిలో వ్యాసరచన, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తాం. వివరాలకు 94408 12491 (పాడేరు), 83097 71508 (రంపచోడవరం) నంబర్లలో సంప్రదించవచ్చు.
**– ప్రసాద్, ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్, పాడేరు**

## గాయపడిన మహిళ మృతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీ కొని తీవ్రంగా గాయపడిన సుబ్బారాయుడుపాలేనికి చెందిన ఉరుకూటి ఎరుకులమ్మ చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో ఆదివారం ఉదయం మృతిచెందినట్లు పట్టణ ఎస్సై రమేష్ తెలిపారు. ఈ నెల తొమ్మిదిన ఆమె రోడ్డు పక్కన నిలబడి ఉండగా నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న బైకు అదుపు తప్పి ఈ మహిళను ఢీ కొందని వివరించారు. ఆమె కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వివరించారు.

## దయాల్బాగ్ వస్తు ప్రదర్శనకు స్పందన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ సమీప దయాల్‌నగర్‌లోని దయాల్బాగ్ విద్యా కేంద్రం ఆవరణలో ఆదివారం నిర్వహించిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన వచ్చింది. రూ.8లక్షల సరకు గంటన్నరలో అమ్ముడుపోయినట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 111 | 113 |
| లైవ్ | 138 | 133 |
| డ్రెస్డ్ | 200 | 236 |
| స్కిన్‌లెస్ | 228 | 246 |

**తెరపై ఈనాడు**

అనకాపల్లి: రాజా, రామచంద్ర, వెంకటేశ్వర, పద్మినాయి: అఖండ-2, సత్యనారాయణ స్క్రీన్1: మోగ్లీ, స్క్రీన్2: ఆంధ్ర కింగ్ తాలుకా శ్రీనివాస: డ్రైవ్, అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: ఉదయం, మొదటి ఆట అఖండ-2, మ్యాట్నీ, రెండో ఆట ఆంధ్ర కింగ్ తాలుకా, బాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-2: నాలుగు ఆటలు అఖండ-2.

### విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ఆదివారం కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పాయకరావుపేట బాలికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఎస్.నర్సాపురం, రాజానగరం, పెదరామభద్రపురం, సత్యవరం, మంగవరం పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. నక్కపల్లి మండలం దేవవరంలో హెచ్.ఎం.వేమగిరి నూకరాజు తరగతులను పరిశీలించారు.

# అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

### ఆకట్టుకున్న చింతామణి నాట్యవైభవం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన చింతామణి నాట్యవైభవం ఆకట్టుకుంది. విజయవాడ మువ్వగోపాల్ కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 150 మంది నృత్య కళాకారులు వివిధ రకాల నాట్య ప్రదర్శన ఇచ్చారు. క్షేత్ర ప్రధాన ట్రస్టీ ఆంజనేయరాజు వీరిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు. యాగశాలలో వేద పండితులు మిత్ర, కిరణ్, లక్ష్మీగణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు.

నృత్యకళాకారులతో ట్రస్టీలు

## జూడోలో బాలికల సత్తా

పతకాల మోత

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పోటీ ఏదైనా పతకాల మోత మోగిస్తున్నారు. విజయమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. పాయకరావుపేటకు చెందిన బాలికలు జూడోలో సత్తా చాటుతున్నారు. విజయాలు సాధిస్తున్నారు. కష్టమైనప్పటికీ ఇష్టంగా సాధన చేస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపిస్తున్నారు.

పట్టణంలోని బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రెండేళ్ల నుంచి జూడోలో శిక్షణ తీసుకుంటున్నారు. అప్పట్లో ఆడపిల్లలకు మార్షల్ ఆర్ట్స్ ఎందుకంటూ తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఉపాధ్యాయులు వారిలో ఉన్న ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించారు. దీంతో బాలికలను సాధనకు పంపించారు. నిత్యం చదువుతోపాటు జూడోలో శిక్షకులు మీనా ఆధ్వర్యంలో మెలకువలపై పట్టు సాధించారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడం మొదలు పెట్టారు.

కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగో స్థానం, అనంతపురంలో జరిగిన పోటీలో సీనియర్ విభాగంలో బహుమతి సొంతం చేసుకున్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కాకినాడ, గోపాలపట్నం, అనకాపల్లిలో జరిగిన ఈవెంట్లలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.

ఇప్పటివరకు వీరంతా 10కి పైగా పతకాలు సాధించారు.

సాధన చేస్తున్న బాలికలు

**అన్నింటోనూ ముందంజ..:** జూడోలో ప్రావీణ్యం ఎంతో ఉపయోగపడుతోంది. అన్నింటోనూ ముందంజలో ఉంటున్నాం. చాలా చురుకుగా, ఉత్సాహంగా ఉంటోంది. పోటీలకు వెళ్లేందుకు తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారు. – వై.దుర్గాభవాని, షేక్ ఆస్మా

**విజయాలతో ఉత్సాహం..:** పోటీల్లో వచ్చిన విజయాలతో మరింత ఉత్సాహం వస్తోంది. జూడో సాధన కష్టమైన పనే. ఆరంభంలో ఇబ్బంది పడ్డాం. క్రమేపీ పట్టు సాధించాం. ప్రత్యర్థులతో పోటీపడే సమయంలో ఏమాత్రం వెనకంజ వేయం. దూకుడుగా ఉంటున్నాం. – టి.సోని, వి.ప్రియ

**పోలీసు శాఖలో ఉద్యోగం లక్ష్యం..:** పోలీసుశాఖలో ఉద్యోగం చేయాలన్నదే మా లక్ష్యం. జూడోతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనే నైపుణ్యం వచ్చింది. నిరంతరం సాధన చేస్తున్నాం. మరిన్ని పతకాలు సాధిస్తాం. – ఎ.పూర్ణ, జె.సుబ్బలక్ష్మి

**తల్లిదండ్రులను ఒప్పించి..:** మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణకు తల్లిదండ్రులను ఒప్పించాం. ఇది స్వీయరక్షణకు ఉపయోగపడుతుందని వివరించాం. విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యమిచ్చేలా చూస్తున్నాం. సాధనకు ఏనాడూ వెనుకంజ వేయలేదు. – భవాని, ప్రధానోపాధ్యాయిని

## శిథిలావస్థలో నీటి పథకాలు.. శుభ్రత కనుమరుగు

❖ అనకాపల్లి పట్టణంలోని పట్టణంలోని రామచంద్రాపేటలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన నీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. స్తంభాలు మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో పలకలు శిథిలమై, శుభ్రం దెబ్బతిని ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. సిమెంట్ పెచ్చులూడిపడుతున్నాయి.

❖ జీవీఎంసీ 80, 84 వార్డుల పరిధిలోని రాజుపాలెం, కొప్పాక, సిరసపల్లి, కొత్తూరు, నరసింగరావుపేట, ఎదురుపాకలపాలెం, గొర్లెవానిపాలెం, వల్లూరు గ్రామాల్లో 30 పథకాలు ఉన్నాయి. 16 వేల జనాభాకు ఈ పథకాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. చాలా పథకాలకు మెట్లు లేకపోవడంతో వీటి శుభ్రత ఎండమావిగా మారింది. వల్లూరు ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది.

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), పాయకరావుపేట, న్యూస్‌టుడే: నీటి పథకాలు శిథిలావస్థకు చేరడంతో వీటి వినియోగం అంతంత మాత్రంగా ఉంటోంది. ఈ ట్యాంకులు ఎప్పుడు కూలుతాయోనని స్థానికుల్లో ఆందోళన సైతం వ్యక్తమవుతోంది. శిథిలావస్థకు చేరిన పథకాల శుభ్రత ప్రశ్నార్థకమవుతోంది.

❖ పాయకరావుపేట మండలం కుమారపురంలోని ట్యాంకు ఊచలు తుప్పు పట్టి ఊడిపోతున్నాయి. నీరు లీక్ అవుతోంది. స్తంభం భాగంలో ఊచలు కనిపిస్తున్నాయి. ట్యాంకు చుట్టూ ఇళ్లు ఉన్నాయి. ట్యాంకు తొలగించాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన గోవిందరెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

కుమారపురంలో..

వల్లూరులో అపరిశుభ్రంగా పరిసరాలు

### తాత్కాలికంగా పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో పారిశుద్ధ్య కార్మికులు తమ సమ్మెను తాత్కాలికంగా విరమించారు. బకాయి పడిన నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సమ్మె బాట పట్టిన సంగతి తెలిసిందే. ఈమేరకు సమస్యపై స్పందించిన కూటమి నాయకులు సంబంధ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ నెల 20న చెల్లించాలని గుత్తేదారు అంగీకరించారు. మిగిలిన బకాయిలను నెలాఖరుకు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించారు.

### శారదానదిలో ఘాట్ నిర్మాణానికి కృషి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జంపపాలెం వద్ద శారదానదిలో భక్తుల స్నానానికి ఘాట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎంపీపీ గొర్ల శేషు పేర్కొన్నారు. జంపపాలెంలో ఆదివారం ఎంపీటీసీ సభ్యుడు ఉమా గణేష్‌తో కలసి పర్యటించారు. శారదానది సమీపంలోని శ్మశానవాటికలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మరిడిమాంబ ఆలయం దర్శించుకున్నారు. నాయకులు బెల్లాలి తాతారావు, పొలమరశెట్టి వెంకట్, సూరిశెట్టి శేషుకుమార్ పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి యువత సహకారం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో యువత సహకరించాలని లక్కవరం పీఏసీఎస్ అధ్యక్షులు కొలుకులూరి విజయబాబు అన్నారు. పురుషోత్తపురంలో ఆదివారం స్వర్ణ భారత్ కార్యక్రమంలో భాగంగా రోడ్ల ఇరువైపులా చెత్తను తొలగించారు. యువకులు రాజాన వెంకటనాయుడు పాల్గొన్నారు.

### ఎలమంచిలిలో ఉచిత ధ్యాన శిక్షణ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి వేద పాఠశాలలో ఉచిత ధ్యాన శిక్షణ ఏర్పాటు చేస్తున్నామని యోగా టీచర్ మల్ల రాము చెప్పారు. ఈనెల 21న అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

### మొక్కలు పెంచండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మొక్కలను విరివిగా పెంచాలని ద్వారక ఫౌండేషన్ ప్రతినిధులు దోని యర్రయ్య, ఎరిపల్లి శ్రీను కోరారు. పూడిమడకలో గంటాలమ్మ, నాగూరమ్మ ఆలయాల వద్ద ఆదివారం మొక్కలు నాటారు. ప్రతినిధులు పెంటయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

### లారీల ఢీ.. డ్రైవర్లకు గాయాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఇరువాడ వద్ద రెండు లారీలు ఆదివారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. లారీల ముందు భాగాలు నుజ్జయ్యాయి.

అనకాపల్లి పట్టణం: జాతీయ రహదారిపై కొప్పాక వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ముందు వెళ్తున్న ఆటోను వెనక నుంచి కారు ఢీకొట్టగా ఆటోడ్రైవర్ బి.ఆదినారాయణ గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### తుప్పల్లో ట్రాన్స్‌ఫార్మర్లు

రాంబిల్లి, న్యూస్‌టుడే: ట్రాన్స్‌ఫార్మర్లను తుప్పలు అల్లుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రాంబిల్లి ప్రధాన రహదారిలో తుప్పలు తీగలను తాకుతుండడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. కృష్ణాపురం పాఠశాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రహదారుల్లో వీటి చుట్టూ తుప్పలు కప్పేశాయి. సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కూలిన ప్రహరీ.. పట్టించుకునే వారేరీ?

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ప్రహరీ కూలిపోయి పునరుద్ధరణపై అధికారులు దృష్టి సారించడం లేదు. క్రీడామైదానంలో సౌకర్యాలను మెరుగుపర్చడంపై చూపుతున్న నిర్లక్ష్యం క్రీడాకారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయాన్నే వందల మంది యువకులు ఈ క్రీడా మైదానానికి ఆటలు ఆడటానికి వస్తుంటారు. కూలిన వ్యర్థాలు పడేస్తుండటంతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు.

### ఎగుడు దిగుడుగా కాలువలు.. ముందుకెళ్లని మురుగు

దిబ్బపాలెం సెజ్ కాలనీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో 2009లో 26 గ్రామాలను సెజ్ కోసం సేకరించారు. వీరందరికీ దిబ్బపాలెం పరిధిలో 450 ఎకరాల్లో లేఅవుట్‌ను ఏర్పాటు చేసి 4500 ప్లాట్లు విభజించారు. కాలనీలో వంద కిలోమీటర్ల మేర కాలువల నిర్మాణం జరిగినా చుక్కనీరు ముందుకెళ్లే పరిస్థితులు లేవు. ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా నిర్మాణాలు సాగడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతోంది. ఈ కారణంగా దోమలు విజృంభించి పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. మురుగు ముందుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో అధికారులకు తెలిసినా వీటిని సరిదిద్దేందుకు ముందుకు రావడంలేదు. పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖలు ఏటా భారీగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నా ఇక్కడ ఎటువంటి పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయడంలేదు. కాలువలను అనుసంధానం చేసి ఎత్తుపల్లాలు సరిచేసే పనులు చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అచ్యుతాపురం

### గోతులతో అవస్థలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కొత్తూరు పంచాయతీ శంకరనగర్‌లోని రహదారి మరమ్మతులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడ తారు రోడ్డు మట్టిరోడ్డును తలపిస్తోంది. రోడ్డులో చాలా భాగం తారు కనిపించడం లేదు. దుమ్ముమట్టి చేరింది. దీంతోపాటు రహదారిపై గోతులు పడ్డాయి. రహదారి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

### భగవద్గీత శ్లోకాల పోటీలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గవరపాలెం శ్రీరామ్ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 12వ అధ్యాయం భక్తియోగంలో శ్లోకాలపై జరిగిన పోటీలకు మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారంతా పాల్గొన్నారు. ఐదు విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈనెల 28న విజయవాడలో జరగబోయే ప్రాంతీయ స్థాయి పోటీల్లో విజేతలంతా పాల్గొంటారని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డి.బి.నాయుడు తెలిపారు. వర్తకసంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, గౌరీనవ సంఘం అధ్యక్షులు ఆళ్ళ సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, శరగడం జగదీష్, శ్రీకాకుర్తి పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విజేతలతో పరిషత్ సభ్యులు

### 'రెండో విడత భూములిచ్చేది లేదు'

నక్కపల్లి, న్యూస్‌టుడే: స్టీల్ ప్లాంట్ నిమిత్తం తాము భూములు ఇచ్చేది లేదని నెల్లిపూడి గ్రామస్థులు స్పష్టం చేశారు. గ్రామంలో ఆదివారం రాత్రి కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీరంతా మాట్లాడుతూ రైతులకు ఇష్టం లేకుండా బలవంతంగా భూములు తీసుకుంటే సహించబోమన్నారు. రెండో విడత సేకరణ తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సీరం నరసింహమూర్తి, అయినంపూడి మణిరాజు, సురకాసుల గోవింద్, లొడగల చంద్రరావు, అయినంపూడి సురేష్ రాజు, జి.వెంకటరమణ, వర్మ, అవతారంరాజు, కురందాసు నాని, టి.జోగిరాజు తదితరులు పాల్గొన్నారు

### చట్టం ప్రకారం బార్కు భూసేకరణ చేయాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బార్క్ టౌన్‌షిప్‌కు దొప్పెర్ల, దోసూరు, రావిపాలెం పరిధిలో తీసుకునే భూములకు 2013 భూసేకరణ చట్టాన్ని ప్రకారం వర్తింపజేయాలని తెదేపా నాయకులు తీర్మానించారు. దొప్పెర్లలోని దుర్గాలమ్మ ఆలయం వద్ద ఆదివారం సమావేశమై పది అంశాలపై తీర్మానం చేశారు. గ్రామంలో సీసీరోడ్లు నిర్మించాలని, రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పించాలని, తెదేపా కార్యకర్తలకు గ్రామంలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు పల్లి వెంకటరావు, నాయకులు కొల్లి వరహాలరావు, కొల్లి సన్నిబాబు, మచ్చు గంగరాజు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దుప్పితూరు ముసలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తప్పెటగుళ్లు, చిడతల పోటీలను నిర్వహించారు. హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, అర్జున్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. భారీస్థాయిలో బాణసంచా వెలిగించారు. దేముడు, కొండబాబు, అర్జున, సన్నిబాబు, శ్రీను, అర్జునరావు, నాయుడుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో ధనుర్మాసం నెలరోజుల పాటు నిర్వహించే లక్ష ప్రదక్షిణను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. ఆదివారం దీనికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. డిసెంబరు 16 నుంచి జనవరి 16 వరకు ఆలయం చుట్టూ ఈ ప్రదక్షిణాలు చేస్తామన్నారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. వచ్చే నెల 14వ తేదీ వరకు ఈ పూజలు చేయనున్నారు. 19వ తేదీ నుంచి స్వామి వారిని దశావతారాల్లో అలంకరించనున్నారు. భక్తుల సందర్శనార్థం ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.దివ్యతేజ తెలిపారు.

పాండురంగస్వామి

### ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రకృతి సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈఎన్‌టీ వైద్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి పేర్కొన్నారు. పట్టణంలో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన 'వాక్ ఫర్ నేచర్' కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. రింగ్‌రోడ్డు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, విశ్రాంత అటవీశాఖ అధికారి బీరా వినోద్‌కుమార్, కాండ్రేగుల సత్యనారాయణ, కుంచం నూకయ్యశెట్టి పాల్గొన్నారు.

### ఉపాధి పథకాన్ని నీరుగార్చొద్దు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి పేదల పొట్ట కొట్టొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. దీనిని ఒక సాధారణ సంక్షేమ పథకంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇటువంటి చర్యలను అందరూ అడ్డుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. 200 రోజుల కనీస పనిదినాలను కల్పించాలని, రూ. 600 కనీస వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### అధునాతన సాంకేతికతతో ప్రమాదాల నివారణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సముద్రంలో సంభవించే ప్రమాదాలను నివారించే అధునాతన స్మార్ట్ లైఫ్ జాకెట్‌ను రూపొందించిన విశాఖకు చెందిన ఎలెర్ట్ 24 వ్యవస్థాపకులు దాడి తేజను జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ సత్కరించారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సముద్రంలో మునిగిపోయిన బాధితుల కచ్చితమైన స్థానాన్ని దీని ద్వారా కనుగొనవచ్చన్నారు. 20 రోజుల బ్యాటరీతో ఇది పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

తేజను సత్కరిస్తున్న రామకృష్ణ

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో...

కొత్తూరు (అనకాపల్లి), అనకాపల్లి పట్టణం న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో 1989-90 పదో తరగతి చదివిన విద్యార్థులు అనకాపల్లిలో సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా గవర్నర్ ప్రత్యేక రక్షణ అధికారి, ఏఎస్పీ కోన రఘు, బంగారు వర్తక సంఘ నాయకుడు కోటిపల్లి వెంకట కిషోర్ పాల్గొన్నారు. అనకాపల్లిలోని జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో 1975 ఏడాదిలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. 50 ఏళ్ల క్రితం పాఠశాలలో నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలలో మొక్కలు నాటారు.

కశింకోట, మునగపాక,: డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా విస్సన్నపేట పడమటమ్మలోవలో కలుసుకున్నారు. రేజేటి మారుతీ వెంకటాచార్యులను సన్మానించారు. మునగపాక మండలం తోటాడ జడ్పీ పాఠశాలలో 1989లో పదోతరగతి విద్యార్థులు పాటిపల్లి ఆలయ ప్రాంగణంలో భేటీ అయ్యారు.

కశింకోటలో..

ఎలమంచిలి గ్రామీణం, అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ హైస్కూల్‌లో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఎర్రవరం సమీపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. పల్లా సత్యనారాయణ, రవికుమార్, మళ్ల శంకర్ పాల్గొన్నారు. మునగపాక జడ్పీ పాఠశాలలో 1983-84లో పదో తరగతి పూర్తిచేసిన 70 మంది అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ వద్ద ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆడారి కనక అప్పారావు, పీలా వెంకట అప్పారావు, పొలిమేర సాంబశివరావు, పద్మకృష్ణ పాల్గొన్నారు.

■ మునగపాక జడ్పీ పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదువుకున్న వారంతా వాడాపల్లి పారిపల్లెమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమావేశమయ్యారు. వెలగా మురళీ, పెంటకోట దుర్గునాయుడు, నాగ అప్పారావు పాల్గొన్నారు.

ఎలమంచిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

అచ్యుతాపురం మండలం కొండకర్లలో..

### మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి గవరపాలెం చిన్నరామస్వామి కోవెల ప్రాంతంలో కాలువలు శుభ్రం చేయడం లేదు. – **విల్లూరి రామారావు, అనకాపల్లి,** ✓: కార్మికులతో కాలువలు శుభ్రం చేయిస్తాం. – **రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్**

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద ఓపెన్ జిమ్‌లో పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. – **సాకేత్, అనకాపల్లి,** ✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. – **చక్రవర్తి, జోనల్ కమిషనర్**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లే రోడ్డు గోతులతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వీటిని పూడ్చించాలి. – **వి.సతీష్, ఎలమంచిలి,** ✓: గోతులు పూడ్చించే పనులు చేపడతాం. – **ప్రసాదరాజు, కమిషనర్**

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే ఎలమంచిలి ఏఎస్ఆర్ కాలనీలో విద్యుత్తు తీగలపై కొబ్బరి కమ్మలు పడి తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయి. – **నరేష్, స్థానికుడు,** ✓: సరఫరాకు అంతరాయం లేకుండా కమ్మలు తొలగిస్తాం. – **కనకరాజ్, ఏఈ**

అచ్యుతాపురం లంకధర్మవరం రోడ్డులో వీధి దీపాలు లేక రాత్రి పూట ఇబ్బంది పడుతున్నాం. – **అప్పారావు, లంకధర్మవరం,** ✓: పంచాయతీ అధికారులతో మాట్లాడి వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం. – **శ్రీనివాసరావు, ఏఈ**

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారపురంలో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రివేళ పశువులు, మూగ జీవాలపై కుక్కలు దాడులు చేసి గాయపర్చుతున్నాయి. – **వెంకటరెడ్డి, గ్రామస్థుడు,** ✓: కుక్కల నియంత్రణకు పంచాయతీ పాలకవర్గంలో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. – **డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని గ్రామసచివాలయం వీధిలో డ్రైనేజీలో మురుగు పేరుకుపోయింది. దోమల బెడద ఎక్కువగా ఉంది. – **శర్మ,** ✓: డ్రైనేజీలో మురుగు తీయిస్తాం. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – **కె.డేవిడ్, ఈవో**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని నర్సీపట్నం రోడ్డు కూడలి వద్ద ఉన్న జాతీయ రహదారి వంతెనలపై వాహనాలు నిలిపేస్తున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – **డి.ప్రసాద్, ఎల్టీ కాలనీ,** ✓: వాహనాలు నిలుపచేయకుండా చర్యలు చేపడతాం. – **అప్పన్న, సీఐ**

### గుంత పూడ్చరూ..

కోటవురట్ల, న్యూస్‌టుడే: పాములవాక నుంచి పి.కొత్తపల్లి వెళ్లే మార్గంలో బోడపాలెం శివారు కొత్తూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీరు వృథా కావడంతో, వాటి మరమ్మతు కోసం కుళాయిల వద్ద గుంతలు తవ్వారు. వాటిని అలాగే వదిలేశారు. ప్రధాన రహదారిపై ఈ గుంతల వద్దనే వాహనదారులు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కారణంగా ఆదమరిస్తే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోమోనని వీరంతా ఆందోళన చెందుతున్నారు. తవ్విన గుంతలు పూడ్చాలని అధికారులను కోరుతున్నారు.

### అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలి

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మునగపాకలో వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకొన్నాయి. ఈ దీక్షల్లో నాగులాపల్లి, అరబుపాలెం, గణపర్తి, రాజుపేట, కాకరాపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు కూర్చున్నారు. అనకాపల్లి వైకాపా సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సంఘీభావం తెలిపారు. అనంతరం అనకాపల్లి-అచ్యుతాపురం రహదారిపై మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేపట్టారు. నాయకులు బొడ్డేడ ప్రసాదు, పెంటకోట స్వామిసత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు, మళ్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రహదారులు, బస్ స్టేషన్లు, ఆలయాలు, కూడళ్లు, పాకల్లో పేదలకు అనకాపల్లి సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మూడు రోజులపాటు వీటిని పంపిణీ చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగ భూషణం తెలిపారు. చలిని దృష్టిలో పెట్టుకొని పేదలు, వృద్ధులకు వీటిని అందజేస్తున్నామని చెప్పారు. ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, బల్లా శ్రీనివాసరావు, సత్యనారాయణ, సత్యారావు హర్ష పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, YELAMANCHILI Branch, Yelamanchili, Anakapalli District,** I issue the following notice to general public. My client intends to grant loan **SMT. NANEPALLI DHANA LAKSHMI** S/o N Siva Sankara Rao by keeping the below mentioned schedule properties as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE IMMOVABLE PROPERTY**

Erstwhile Visakhapatnam District, Presently Anakapalli District, Rambilli Mandalam, Yelamanchili Sub-District, Kotturu Gram panchayat and village accounts 5th ward, Southern side of Rajaveedhi, Gramkantam S. No.204-2B site measuring East to West 23 feet or 7.077 meters and North to South 31 feet or 9.444 meters totaling an extent of 79.22 Sq. yards or 66.23 sq. meters together with RCC building ground floor with plinth area of 723 SFT bearing D. No.3-21, assessment no.321 is bounded by: **EAST:** 2 feet lane and thereafter house of N Narasimha Murthy; **SOUTH:** 4 feet common lane thereafter house of N Narasimha Murthy; **WEST:** Tiled house of Nanepalli Sanni Babu; **NORTH:** Panchayat CC road

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar
Seethammadhara, Visakhapatnam-13.
Mobile No.9885166648
Mail: sreenivaskoduri@gmail.com

Visakhapatnam
Dt.14.12.2025.


(c) eenadu

# నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక

ధ్రువపత్రాలు చూపుతున్న ఎంపికైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం తురువోలు యువ చంద్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లిలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అబాకస్ పోటీలో పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో రెండో తరగతి చదువుతున్న నానుపల్లి రామ చరణ్, ప్రత్యూ దిలీప్ జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఇద్దరు విద్యార్థులను నిర్వాహకులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపిక చేసినట్టు కరస్పాండెంటు పోతల శ్రీరామ్మూర్తి చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందించారు.

## రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఉత్సవ కమిటీ ఛైర్మన్ విజయమూరి శంకర్ ఆదివారం తెలిపారు. ఆరోజు ఎమ్మెల్యే రాజు ఉత్సవాలను ప్రారంభిస్తారని వచ్చే నెల 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కేశవస్వామి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నట్లు సీతారామాచార్యులు తెలిపారు. ఈనెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఉంటుందన్నారు.

## తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి1: అన్న గారు వస్తున్నారు, అమర కావ్యం, పైసావాలా, డ్రైవ్, ఆడి 2: ఆడి 3: అఖండ-2, ఆడి 4: అఖండ-2, మిస్టీరియస్, రాజు: అఖండ-2, బంగార్రాజు: మొగిలి, చోడవరం: శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా, సాయిలక్ష్మి: పాంచ్ మినార్, పూర్ణా: అఖండ2

## హస్తకళల్లో జాతీయస్థాయికి ఎదగాలి

శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

కళాకారులు తయారు చేసిన బొమ్మలు తిలకిస్తున్న అయ్యన్నపాత్రుడు, అధికారులు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: హస్తకళాకారులు తమ నైపుణ్యం అంచెలంచెలుగా మెరుగుపర్చుకుని జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేయాలని శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సూచించారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో హ్యాండ్‌క్రాఫ్ట్ కళాకారులకు (ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (లేపాక్షి) 2025-26 ఏడాది సంబంధించి టూల్‌కిట్లు మంజూరు చేసింది. వీటిని కృష్ణదేవిపేటలో లబ్ధిదారులకు ఆదివారం అయ్యన్నపాత్రుడు పంపిణీ చేశారు. ఇక్కడ 50 మంది హస్త కళాకారులకు రూ.10 వేల విలువ చేసే కిట్లు, గుర్తింపు కార్డులు అందజేశారు. తొలి దశలో కళాకారులు తయారు చేసిన ఆకృతులకు కూటమి నాయకులు, అధికారులు తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఏటికొప్పాక హస్తకళాకారులను ఆదర్శంగా తీసుకుని, ఉన్నత స్థాయికి ఎదిగి కృష్ణదేవిపేటకు గుర్తింపు తేవాలన్నారు. జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర, మండల తెదేపా అధ్యక్షులు చిటికెల తారక రమణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు బొడ్డు జమీలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాది దేవి తదితరులు పాల్గొన్నారు.

**నిధులిచ్చినా.. పనులు చేయకపోతే ఎలా..:** గొలుగొండ మండలం తెదేపా నాయకుల వినతుల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు, వీధిలైట్లు, అంతర్గత రహదారుల నిర్మాణానికి ఈ ఏడాది 74 పనులకు నిధులు మంజూరు చేయించినట్లు అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో నాయకులు ఇంతవరకు పనులు చేపట్టలేదని చురకలు వేశారు. పనులు చేపట్టడంలో చోద్యం, పాతకృష్ణదేవిపేట, కొత్తమల్లంపేట, జోగుంపేట, పాకలపాడు, పాతమల్లంపేట, గొలుగొండ గ్రామాలు వెనుకబడి ఉన్నాయన్నారు. వీరంతా తక్షణం స్పందించి మంజూరైన పనులు పూర్తి చేయాలని హితవు పలికారు. లేని పక్షంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆ గ్రామాలకు నిధులు మంజూరు చేయనని స్పష్టం చేశారు.

## సహకార లోపం.. చదువులకు శాపం

చోడవరం, న్యూస్‌టుడే

నాడు ప్రభుత్వ బడులలో చదువుకున్నవారెందరో ఇంజినీర్లు, డాక్టర్లుగా స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నారు. ఎందరో రాజకీయ నాయకులకు సైతం సమాజంలో ఎదిగేందుకు పునాదులు వేశాయి. గతంలో వెలుగొందిన ఈ పాఠశాలల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది.

గత వైకాపా ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను విలీనం చేపట్టడంతో చాలా ప్రభుత్వ బడులు మూతపడే దశకు చేరుకున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం పాఠశాలలో మెరుగైన సదుపాయాలు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టింది. బోధనకు కొత్తగా ఉపాధ్యాయులను నియమించింది. కాని స్థానికుల సహకారలోపంతో వచ్చే ఏడాదికి మరిన్ని ప్రభుత్వబడులు మూసివేసే దిశలో పయనిస్తున్నాయి. కనీసం పదిమంది లేని పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా వందకు చేరింది. చోడవరం నియోజకవర్గంలో ఈ సంఖ్య దాదాపు 29 ఉంది.

విద్యార్థులు రాకపోవడంతో మూతపడిన రేవళ్ల పాఠశాల

సింహాద్రిపురంలో ఇద్దరే పిల్లలున్నారు. వారికి ఉపాధ్యాయురాలు పాఠాలు చెబుతున్నారు. వారూ మానేస్తే బడి మూసేయాల్సిందే. జుత్తాడ, లక్ష్మీపురం(స్పెషల్), గవరవరం పాఠశాలల్లో నలుగురు చొప్పున, పట్టణంలో కోమటి వీధి, చంరపీధి పాఠశాలల్లో అయిదుగురు చొప్పున చదువుతున్నారు. పాఠశాలలను నడిపించాలన్న ధ్యేయంతో ఉన్న అధికారులకు స్థానిక పెద్దల సహకారం లోపించింది. తల్లిదండ్రుల కమిటీలన్నా పేరుకే. కేవలం పదవుల కోసం వెంపర్లాట తప్ప బాలల బాగుకోసం ఆలోచించే నాథుడే లేడు.

**పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు..:** లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో వందకు పైగా విద్యార్థులుండేవారు. సంఖ్య తగ్గుతుండటంతో అన్ని పార్టీల గ్రామ రాజకీయ నాయకులు సమావేశమై ఊర్లో పిల్లల్ని బడిలో చేర్పించాలని తీర్మానించుకున్నారు. సర్పంచి శిరోష్ విజయకుమార్ గంగ భవానీ తన కుమార్తెను చేర్పించారు. 15 మంది వరకు చేరారు.

గండవరం శివారు కొత్తపల్లిలో తెదేపా యువ నాయకులందరూ సీఎస్ఆర్ నిధులు రూ.30 లక్షలతో గ్రామంలో ఆధునాతన సదుపాయాలతో భవనం నిర్మాణం జరిగేలా చొరవ తీసుకున్నారు.

**పది మంది ఉంటే..:** గ్రామంలో కనీసం పదిమంది పిల్లలు వస్తే కొత్త బడులు ప్రారంభించవచ్చు. ఉన్న బడుల్లో పిల్లలు సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. మంచి విద్యతో పాటు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలు బడికి వచ్చేలా చూస్తే కొంతవరకు సమస్య పరిష్కారమవుతుంది. – కె.సింహాచలం, మండల విద్యాశాఖాధికారి–2, చోడవరం

## 17న ఉద్యోగ సంఘ ఎన్నికలు

చోడవరం, న్యూస్‌టుడే: ఈ నెల 17న చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం చోడవరం యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి జి.గంగాధర్ ఆదివారం తెలిపారు. చీడికాడ, చోడవరం, మాడుగుల మండల పరిషత్, పి.ఆర్ అండ్ ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలలో పనిచేసే ఉద్యోగులతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.సత్యనారాయణ వ్యవహరిస్తారని తెలిపారు.

## విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న లారీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కశింకోట-బంగారుమెట్ట (కె.బి) రోడ్డులో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బుచ్చెయ్యపేటకు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున మరో లారీ రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి ఆయన్ను అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ మార్గంలో స్తంభాలన్నీ రోడ్డు అంచులకు ఆనుకుని ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

## కాపులకు అండగా ఉంటా..

చోడవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కాపులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. మండలంలో గౌరీపట్నం రోడ్డులోని సూర్యనారాయణ మూర్తి దేవాలయం ప్రాంతంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ తూర్పుకాపు యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన పేరిట ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయించడమే కాకుండా వచ్చే ఫిబ్రవరిలో భూమిపూజ చేస్తామని ప్రకటించారు. మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ అందరం సమిష్టిగా ముందుకెళ్లాలని సూచించారు. సంఘం పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ.. మీ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పి.యశస్వినీ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీపీ రాజారామ్, చందు రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, జిల్లా భాజపా అధ్యక్షుడు పరమేశ్వరరావు, అకుల రమేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

## జనసేన నేత కుటుంబానికి నాగబాబు పరామర్శ

రాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నాగబాబు

రోలుగుంట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు కుటుంబ సభ్యులను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు పరామర్శించారు. విశాఖపట్నంలోని రాజు ఇంటికి వెళ్లి దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## కంటి వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి : శంకర్ ఫౌండేషన్ సహకారంతో దేవరాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో పరీక్షల కోసం తమ ఆధార్ కార్డును తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: అటల్-మోదీ సుపరిపాలన యాత్రను పురస్కరించుకుని మండలంలోని గుండుబాడు శివారు బలిజిపాలెంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మామిడి రమణ చొరవతో విశాఖకు చెందిన 'మెడికవర్' ఆసుపత్రి వైద్యబృందం ఇందులో పాల్గొని పరీక్షలు చేశారు.

## సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

కొయ్యూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పాకలపాడు ఆశ్రమం గురువు రామానందస్వామి అన్నారు. గడబపాలెం పంచాయతీ మల్లవరం గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి రామకృష్ణమూర్తి, రామానంద స్వామి హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ భూమారెడ్డి పాల్గొన్నారు.

## పథకాల అమలులో భాగస్వామ్యం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అమల్లో అధికారులంతా భాగస్వామ్యం కావాలని ఎంపీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. సమావేశాన్ని సెలవురోజు ఏర్పాటు చేయడంపై కోఆప్షన్ సభ్యులు ఎస్.కె.రజాక్ అభ్యంతరం తెలిపారు. ఉద్యోగుల సెలవులో వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం అన్యాయమన్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. 90 రోజుల వ్యవధిలో సమావేశ నిర్వహణలో భాగంగా తప్పని పరిస్థితిలోనే జరిగినట్లు తెలిపారు. వ్యవసాయం, విద్యుత్తు, పీఆర్ ఉపాధి శాఖల పనితీరుపై లేవనెత్తిన పలు ప్రశ్నలకు అధికారులు జవాబు ఇచ్చారు.

★ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ తమ శాఖ ద్వారా రైతులకు అమలు చేస్తున్న ప్రయోజనాలను వివరించారు. జడ్పీటీసీ సభ్యురాలు కె.అప్పలనర్స, సహకార సంఘం అధ్యక్షులు ఎ.మాణిక్యం, సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాజనకంగా ఖరీఫ్ దిగుబడులు



వరి నూర్పుడిలో నిమగ్నమైన రైతులు

ఈ ఏడాది ఖరీఫ్ రైతులు కాస్త ఉపశమనం పొందుతున్నారు. దిగుబడి, రాబడులపై అంచనాలు వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో వేసిన వరికి వారంతా ఊహించినట్టుగానే ఆశాజనకంగా దిగుబడులు వచ్చే అవకాశాలుండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అకాలవర్షాలు కాస్త ఆందోళనకు గురిచేసినప్పటికీ రైతులు అప్రమత్తమవడంతో తిండి గింజల్ని రక్షించుకోగలిగారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం సగటున 5వేల ఎకరాలు కాగా ఈ ఏడాది ఖరీఫ్‌కి సంబంధించి వాతావరణం అనుకూలించడంతో 5500 ఎకరాల్లో సాగు చేశారని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. మండలంలో నేలల ఆధారంగా ఎకరానికి 29నుంచి 32, 33బస్తాల వరకూ దిగుబడి వస్తాయని వ్యవసాయ సిబ్బంది, రైతులు బేరీజులు వేస్తున్నారు. ఈ మేరకు కోసిన వరి చేను సురక్షిత ప్రాంతాల్లో కుప్పలు వేయడం, కొంతమంది నూర్పడం వంటి పనుల్లో నిమగ్నమవుతున్నారు. – న్యూస్‌టుడే, రోలుగుంట

బీమా చెక్కు అందజేస్తున్న గేదెల సత్యనారాయణ

## బీమా పరిహారం అందజేత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడిలో పాడి రైతులకు ఆదివారం బీమా పరిహారాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన శెట్టి అప్పలనర్స ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విశాఖ డెయిరీ నుంచి మంజూరైన రూ.15వేలు బీమాను కుటుంబసభ్యులకు డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ అందజేశారు. పాడి రైతులకు విశాఖ డెయిరీ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్‌తో ప్రాణాలకు భరోసా

అరకులోయ: అరకులోయ- విశాఖపట్నం ఘాట్‌రోడ్డులో హెల్మెట్ వాడకంపై పోలీస్‌శాఖ వినూత్న ప్రచారం నిర్వహించింది. సీఐ హిమగిరి, ఎస్సై గోపాలరావు.. కాఫీ తోటల వద్ద వాహనదారులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. హెల్మెటు ధరించకుండా వస్తున్న ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం మంది శిరస్త్రాణం ధరించకుండా వాహనాలు నడపటం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు.

## ఎట్టకేలకు సమస్య తీరింది..

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలో చోడవరం నుంచి చీడికాడ వెళ్లే దారిలో దుర్గా, మత్స్యకారుల, ఐటీఐ కాలనీల వద్ద రోడ్డుపై గుంతలను పూడ్చేందుకు కాలనీ వాసులు స్వతహాగా ముందుకొచ్చారు. గ్రావెల్, క్వారీ బుగ్గితో పూడ్చివేత పనులు చేశారు. ఈ మార్గంలో వర్షమొస్తే ఎక్కడ గొయ్యి ఉందో తెలియదు. మిగతా రోజుల్లో సైతం వాహనాలు నడుపుతున్నపుడు అదుపుతప్పితే ఎక్కడ పడిపోతామేమో అనే భయంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గాన్ని ఉద్ధరించడానికి అధికారుల కోసం ఎదురు చూశారు. ఇటీవల ప్రమాదాల సంఖ్య మరీ అధికమవడంతో ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూపులు ఆపేసి స్థానికులే సమస్య పరిష్కరించారు.

గోతుల పూడ్చివేత అనంతరం

## చదరంగం పోటీలు ప్రారంభం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్నూరుపాలెం, శ్రీగౌతమి లలితకళా శిక్షణ కేంద్రం మాకవరపాలెం సంయుక్త ఆధ్వర్యంలో మాకవరపాలెం గ్రంథాలయంలో చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక జడ్పీఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఇందులో మాకవరపాలెంతోపాటు నర్సీపట్నం, సోమవారం, తామరం, గిడుతూరు తదితర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. హోరాహోరీగా పోటీదారులు తలబడ్డారు. ఇందులో నర్సీపట్నానికి చెందిన రామన్నపాత్రుడు, చరణ్ (మాకవరపాలెం) గణేష్ (గణేష్) లు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివి.సుధీర్‌కుమార్, రంగరాజు, గౌతమి, ఆదినారాయణ, చంద్రకళ, రమణ, భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని చీమలపాడు పంచాయతీ పెదగరువు గిరిజన గ్రామంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. తుప్పుపట్టి కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ 13 కుటుంబాల వారు నివాసముంటున్నారు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని మార్చి కొత్తదాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూలిపోయేలా ఉన్న స్తంభం

## ఆనాటి స్నేహం.. అపూర్వ బంధం

గురుకుల విద్యాలయానికి అందజేస్తున్న సామగ్రితో..

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి మండలం తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో 1994-95లో పదో తరగతి వరకు చదువుకున్న ఆనాటి విద్యార్థులు మళ్లీ కలిశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. సమాజంలో తమను ఉన్నతంగా తీర్చిదిద్దిన పాఠశాలకోసం సుమారు రూ. లక్ష విలువ చేసే సామగ్రిని వితరణ చేశారు. ప్రిన్సిపల్ విక్టర్‌పాల్‌తో పాటు వ్యాయామ అధ్యాపకులు ఉమ మహేశ్వర్రావు, తరుణేశ్వర్రావుకు పూర్వ ప్రిన్సిపల్ ఎస్.నారాయణరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సీఐ సింగంపల్లి శ్రీనివాసరావు దగ్గరుండి నిర్వహించగా, పూర్వ విద్యార్థులు మండ శ్రీనివాసరావు, కృష్ణ, ప్రకాష్, వెంకటరమణ, నాగ అప్పారావు, మధుసూదనరావు, వెంకటరావు సహకారం అందించారు.

బలిఘట్టంలో బియ్యం అందజేస్తూ..

నర్సీపట్నం అర్బన్: 'సాయానికి పది రూపాయల సంఘం' అధ్యక్షుడు ఏసుబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం 2020-24 మధ్య చదువుకున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులు కలిసి పట్టణంలోని బలిఘట్టం రాజరాజేశ్వరి పర్వత శ్రేణిలో నివసిస్తున్న పేదలకు ఆదివారం వెయ్యి కేజీల బియ్యం, వంద దుప్పట్లు పంపిణీ చేశారు.

చోడవరం: 1970లో ఏడో ఫారం(12వక్లాస్) చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఆత్మీయ కలయిక పేరిట జరిగిన ఈ సమావేశానికి చోడవరంతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా హాజరై మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మృతి చెందిన మిత్రులకు, ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. కందర్ప స్వామి, పూసర్ల శంకరరావు, మార్కేండేయులు, వి.వి.రామరాజు, రమణమూర్తి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.

చోడవరంలో పూర్వ విద్యార్థులు

## యాజమాన్యాలు ఐక్యతతో మెలగాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: విద్యా సంస్థల నిర్వాహణలో పోటీతత్వం ఉన్నప్పటికీ సమస్యలు ఎదురైనప్పుడు ఐక్యతతో పరిష్కరించుకోవాలని మాజీ వీసీ ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడు మండలం చౌడువాడలోని ఓ రిసార్ట్‌లో ఆదివారం ఏపీ ప్రైవేటు జూనియర్ కాలేజీ మేనేజ్‌మెంటు అసోసియేషన్ అనకాపల్లి జిల్లా సమావేశం అయ్యన్న జూనియర్ కళాశాల కరస్పాండెంటు డాక్టర్ ఖాసీం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన యాజమాన్యాలను అభినందించారు. ఇంటర్ విద్య ఆర్.ఐ.ఓ వినోద్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జేఎంఏ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శేషగిరి, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## 20రోజుల పాటు నైపుణ్య శిక్షణ

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరంలో యువతకు వృత్తి నైపుణ్యాభివృద్ధిలో 20 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంఎస్ఎంఈ సీఏటీడీ సంచాలకుడు విజయకృష్ణకాంత్ తెలిపారు. లక్ష్మీపురం రోడ్డులోని మహేష్ ఎడ్యుకేషన్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ స్కిల్ ఆఫ్ సెంటర్‌లో శిక్షణ ఉంటుందన్నారు. 30 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పాస్‌పోర్ట్ పోయినది

మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం KOTNI SRINU S/o K. Kondababu 25 Years. Adhar No.614448186383. పాస్‌పోర్ట్ నెం.V4503260 కలిగిన మా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోతనపూడి అగ్రహారం నుండి M. కోటపాడు వెళ్ళు మార్గ మధ్యలో పోయినది. ఎవరికైనా దొరికినట్లైతే క్రింది ఫోన్ నెం.కి తెలియజేయగలరు.

కోట్ని శ్రీను 9676338189

## మేమున్నాం.. మీకు తోడుగా

| | |
|---|---|
| నర్సీపట్నం - 80085 74743 | చోడవరం - 80085 74732 |
| మాడుగుల - 80085 74740 | చీడికాడ - 80085 74742 |

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కొత్తమల్లంపేట కిల్లాడవారి వీధిలో వీధి కాలువలు మురుగుతో నిండిపోవడంతో దోమలతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. – **కిల్లాడ వెంకటరమణమూర్తి, కొత్తమల్లంపేట ✓:** ఇక్కడ మురుగు సమస్య చాలాకాలం నుంచి ఉంది. శాశ్వత పరిష్కారం దిశగా కొత్త డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. కొద్దిరోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. – **శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, కొత్తమల్లంపేట**

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేటలో సీసీ రోడ్డుపై మురుగు పేరుకు పోతోంది. దీంతో ఈ వీధిలో ఉండే వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. – **జి.పెదసత్యనారాయణ, స్థానికుడు ✓:** సీసీ రోడ్డుకు ఇరువైపుల ఇళ్లు ఉన్నవారు కాలువను మట్టితో కప్పడంతో ఈ దుస్థితి నెలకున్నట్లు గుర్తించాం. పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులు వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తాం. – **శివ, పంచాయతీ కార్యదర్శి**

## జారిందా.. గోవిందా!

చీడికాడ మండలం కోనాం-గుడివాడ మార్గం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలోని చెరుకుపల్లి కూడలిలో రోడ్డంతా శిథిలమై.. రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. దీనికి తోడు రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండటంతో వాహనాలు ఇట్టే అదుపు తప్పుడుతున్నాయి. దీంతో చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రోడ్డులోని నిత్యం చీడికాడ, హుకుంపేట, అనంతగిరి గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు స్పందించి పాడైన రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – చీడికాడ, న్యూస్‌టుడే

## కొత్తపల్లి కళకళ

సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో జలపాతం పరిసర ప్రాంతాలు కిక్కిరిశాయి. కుటుంబసమేతంగా వచ్చిన పర్యాటకులు ఇక్కడి అందాలను ఆస్వాదించారు.

## ప్రథమ చికిత్సపై అవగాహన

చీడికాడ, న్యూస్‌టుడే: విద్యార్థులకు సాధారణంగా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెన్నుపూస బ్రహ్మారెడ్డి సూచించారు. చీడికాడ మండలం తురువోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం వైద్య పరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ బ్రహ్మారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవీఆర్ కృష్ణాజీ, డాక్టర్ ఎం.మానస ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలాడుతున్నప్పుడు గాయాలు తగిలితే ప్రాథమిక చికిత్స, మందుల వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సోమేష్ వ్యవహరించారు. కార్యక్రమానికి అవసరమైన పరికరాలు, విద్యార్థులకు మందులు రూ.15 వేలు సొంత నిధులతో ఉపాధ్యాయులు ఆయన సమకూర్చారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

(c) eenadu

**తెరపై ఈనాడు**

లక్ష్మీకాంత్
స్క్రీన్-1: అఖండ-2
స్క్రీన్-2: మోగ్లీ

## పాలిథిన్ వినియోగాన్ని విడనాడాలి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని చేసే పాలిథిన్ వినియోగాన్ని ప్రతి ఒక్కరు విడిచిపెట్టాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా ఆదివారం చినముషిడివాడ ద్రోణంరాజునగర్‌లో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు కాలనీవాసులకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెందుర్తి

## మర్యాదపూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబును పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం ఉత్తరాంధ్రకు చెందిన జనసేన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో పంచకర్ల పాల్గొన్నారు.

నాగబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

## మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -పి.మహేష్, సబ్బవరం. ✓: ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. -అశోక్ కుమార్, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, సబ్బవరం

?: సబ్బవరం పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో గోతులు ఏర్పడి రోగులు, సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. -ఎస్.నాగేంద్రకుమార్, సబ్బవరం. ✓: వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తాం. -పి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: పల్లినారాయణపురం రామాలయం సమీపంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. -రామారావు, పల్లినారాయణపురం. ✓: వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -హరి బహదూర్, ఏఈ, జోన్-8

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం దేశపాత్రునిపాలెం మలుపు వద్ద కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. -నగేశ్, స్థానికుడు. ✓: శిథిల కల్వర్టుకు త్వరలో మరమ్మతులు చేపడతాం. -లలిత, ఏఈ, ఆర్అండ్‌బి

## బాబోయ్.. ఫార్మా కాలుష్యం!

పరవాడ, న్యూస్‌టుడే:

పరవాడ ప్రాంత ప్రజలను ఫార్మాసిటీ కాలుష్య భూతం వెంటాడుతోంది. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడంతో భరణికంలోని మొల్లోడు గెడ్డవాగులో పెద్ద ఎత్తున స్తంభించాయి. వీటి నుంచి దుర్వాసన రావడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషజలాలు తరచూ మొల్లోడు గెడ్డవాగును ముంచెత్తాక పరవాడ సన్యాసిచెరువు, పెద్ద చెరువులతోపాటు భూగర్భజలాలను విషతుల్యం చేస్తున్నాయి. ఈ సమస్య రోజురోజుకు జటిలం అవుతున్నా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినపుడు నీటి నమూనాలు సేకరిస్తున్నారు తప్పా..ఎలాంటి చర్యలు ఉండడం లేదని అంటున్నారు.

కాలువ ద్వారా ప్రవహిస్తున్న వ్యర్థజలాలు

**ప్రజారోగ్యంతో చెలగాటం**

రసాయన జలాల వల్ల పంట భూములు సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. వ్యాధుల భయం వల్ల పొలాల్లో పనిచేయడానికి కూలీలు రాకపోవడంతో రైతులు పంటలు వేయడం మానేశారు. ఈ జలాల వల్ల పశువులు తదితర జీవరాశులకు ముప్పు పొంచి ఉంది. భూములు అమ్ముకుందామంటే ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదు. రాంకీ ఫార్మా సంస్థలు రసాయన వ్యర్థ జలాలను బయటకు విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నా అధికారులకు పట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

**నిబంధనలు ఉల్లంఘించి..**

నిబంధనల ప్రకారం ఫార్మాసిటీ నుంచి వ్యర్థ నీరు తప్పా.. ఇతర జలాలను బయటకు విడిచిపెట్టకూడదు. వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తర్వాత తిక్కవానిపాలెం తీరానికి పైపులైన్ ద్వారా పంపాలి. శుద్ధి ప్రక్రియకు ఖర్చులు అధికం కావడం వల్ల రాంకీ ఫార్మా సంస్థల యాజమాన్యాలు ఈ జలాలను బయటకు విడిచిపెడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇవి కాలువల ద్వారా వచ్చి గెడ్డవాగులు, పొలాలు, చెరువులను కాలుష్య కాసారం చేస్తున్నాయి. నెల రోజుల క్రితం మొల్లోడు గెడ్డవాగును స్థానికులు, పీసీబీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరిశీలించి యంత్రాంగం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించినా నేటికీ కార్యరూపం దాల్చలేదని స్థానికులు అంటున్నారు.

**ట్యాంకర్లతో తోడిస్తాం..**

మొల్లోడు గెడ్డవాగులోని వ్యర్థ జలాలను పరిశీలిస్తాం. ట్యాంకరు లారీలతో గెడ్డవాగులోని జలాలను రాంకీ సీఈటీపీకి తరలిస్తాం. వ్యర్థ జలాలు బయటకు రాకుండా రాంకీ ప్లాంటు వద్ద సంపుల నిర్మాణం జరుగుతోంది. అవి అందుబాటులోకి వస్తే ఇబ్బందులు తీరుతాయి. -ముకుందరావు, కాలుష్య నియంత్రణ మండలి, ఈఈ

## అ'పూర్వ' సమ్మేళనం

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో చదువుకున్న 1987-88 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. దువ్వపాలెంలోని ఓ రిసార్టులో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మళ్ల శ్రీను, రెడ్డి సురేశ్, తాటిపాక భాస్కరరావు, బండారు శ్రీను, తదితరులు మిత్రా గ్రూప్ పేరిట ఈ సమ్మేళనాన్ని నిర్వహించారు. స్నేహితులంతా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, మిత్ర బృంద సభ్యులు

## షిప్‌యార్డు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో..

మల్కాపురం, న్యూస్‌టుడే: విశాఖ హిందూస్థాన్ షిప్‌యార్డుకాలనీలో షిప్‌యార్డు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చదివిన 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగర పరిధిలోని గ్రాండ్ హోటల్‌లో సందడిగా జరిగింది. కొన్ని దశాబ్దాల తర్వాత కలిసిన వీరు అనాటి సంగతులను మననం చేసుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ గడిపారు. ఆటపాటలతో అదరగొట్టారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో సమాజ సేవకు కృషి చేయాలని పలువురు వక్తలు సూచించారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

## నేరమార్గం వీడి.. పరివర్తనతో మెలగాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరమార్గాన్ని వీడి సన్మార్గంలో పయనించాలని పెందుర్తి ఎస్ఐ భాస్కరరావు సూచించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. నేర ప్రవృత్తిని విడిచిపెట్టి కుటుంబ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కరరావు

## పేద కుటుంబాలకు చేయూత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన వేద సంస్కృతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాడేరు సమీప మినుములూరు, 12వ మైలురాయి, అమ్మవారి పాదాలు, దల్లపల్లి, లబ్బపుట్ గ్రామాల గిరిజనులకు 100 రగ్గులు, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ట్రస్టు నిర్వాహకులు కిరణ్ శర్మ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడిన గిరిజనులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

## సేవలకు గుర్తింపు

వేపగుంట: శంకర్ ఫౌండేషన్ ప్రతీ నెలా విడుదల చేసే విజన్ ఇన్‌సైట్స్ లేఖ పత్రికకు లభించిన జాతీయ పురస్కారాన్ని ఆదివారం డెహ్రాడూన్‌లో ఫౌండేషన్ ప్రతినిధి, ప్రజా సంబంధాల అధికారి కె.బంగార్రాజు అతిథుల నుంచి అందుకున్నారు. అక్కడ జరిగిన 47వ అఖిల భారత ప్రజాసంబంధాల సదస్సులో ఈ అవార్డును అందుకున్నట్లు బంగార్రాజు పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సెలవురోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. అమ్మవారికి త్రికాల సమయంలో నిర్వహించిన పంచామృతాభిషేకంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో శ్రీచక్ర నవ వర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తశతీ, వేదపారాయణం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

## 600 మందికి హెచ్‌పీవీ టీకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : నగరంలోని పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు చెందిన 9-14 ఏళ్లలోపు బాలికలకు వరుసగా రెండో రోజు హ్యూమన్ పాపిలోమ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ అందించారు. శని, ఆదివారాల్లో కలిపి మొత్తం 600 మంది బాలికలకు టీకాలు వేశామని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. గర్భాశయ ముఖం ద్వారా వచ్చే క్యాన్సర్ నియంత్రణకు వీలుగా ఆరు నెలల తర్వాత రెండో డోసు వేస్తామన్నారు.

## మేహాద్రిలో స్నానాలు చేస్తే కఠిన చర్యలు

రిజర్వాయరు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పోలీసులు

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయరులో స్నానాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ హెచ్చరించారు. రిజర్వాయరు వద్దకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పోలీసులు ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల 'హెచ్చరికలు బేఖాతరు' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి సీఐ స్పందించి రిజర్వాయరు వద్ద గస్తీని పెంచడంతోపాటు హెచ్చరిక బోర్డులు పెట్టించారు. ఈ జలాశయంలో స్నానాలు చేయడం నిషేధమని, ఎవరైనా రిజర్వాయరులోకి దిగితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## శ్రీసాయిమాధవనగర్ సమస్యల పరిష్కారానికి కృషి

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప శ్రీసాయిమాధవనగర్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ రాపర్తి కన్నా కాలనీ అసోసియేషన్ సభ్యులకు ఆదివారం హామీ ఇచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కన్నా పాల్గొన్నారు. కాలనీలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని, సెక్టార్ 2 వద్ద గెడ్డపై వంతెన నిర్మించాలని, సీనియర్ సిటిజన్స్‌కు సామాజిక భవనం నిర్మించాలని అసోసియేషన్ సభ్యులు కన్నాకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎ.సుబ్బారాయుడు, కార్యదర్శి త్రినాథరావు, పరిటాల భాస్కరరావు, ఆచంట రామకృష్ణతోపాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని వరాహలక్ష్మీనరసింహస్వామి వాకర్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. 93, 94 వార్డుల కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా గంట్ల దేముడు, అధ్యక్షులుగా శేశెట్టి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా సాలాపు రమణ, ఉపాధ్యక్షులుగా మామిడి కిరణ్, జిన్నాల రాము, కోశాధికారిగా సీరం అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.వి.సత్యానంద్, జాయింట్ సెక్రటరీగా బల్ల అప్పారావు, సలహాసంఘ సభ్యులుగా ముత్తా నాగరాజు, బాలాజీ రాములను ఎన్నుకున్నారు. సభ్యులతో కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని కార్పొరేటర్లు నూతన కమిటీకి సూచించారు. అనంతరం సబ్బవరం సమీప కృష్ణానగర్ మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఎన్నికైన సభ్యులతో కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా తదితరులు

## మల్లికార్జునుడికి నీరాజనం

పూజలందుకున్న స్వామివారు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తి ప్రశాంతినగర్‌లో కొలువైన స్వయంభూ భ్రమరాంబ సమేత లింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం సంకీర్తన సేవ జరిగింది. అనకాపల్లికి చెందిన శివ కూటమి భక్త బృందం సభ్యులు మల్లికార్జునుడిని భజనలతో ఆరాధించారు. తొలుత అర్చకులు పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భజన బృందాన్ని సత్కరించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులు

## 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలకు చెందిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

వేపగుంట, న్యూస్‌టుడే: లక్ష్మీనరసింహనగర్ కృష్ణాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి, లక్ష్మీపురం పోర్టుకాల నీలోగల కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీలు తెలిపాయి. 30వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, 14న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం జరుగుతుందని కమిటీలు తెలిపాయి.

గోపీజనవల్లభ స్వామి ఆలయంలో కృష్ణ భగవానుడు

## మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేత 'నెల్లూరు'

ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

**విజేతలు వీరే..:** ఒక కిలోమీటర్ నడక, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రోలో పురుషుల 90 ఏళ్ల పైబడిన విభాగంలో డి. శేషగిరిరావు (నాగులపాడు, గుంటూరు జిల్లా) వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 75 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలో మీటర్ల నడక పందెంలో ఆర్.అప్పలనాయుడు, రామారావు, (విశాఖపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగుపందెంలో (65 ఏళ్ల పైబడి) శేషయ్య (గుంటూరు), సుబ్బరాజు (విశాఖపట్నం), 200 మీటర్ల పరుగు పందెం(70 ఏళ్ల పైబడి)లో ధనుంజయ (తిరుపతి), మూర్తి (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మూడు కిలోమీటర్ల నడక పందెంలో విశాఖపట్నానికి చెందిన బి. వెంకటలక్ష్మి ప్రథమంలో నిలిచారు. 65 ఏళ్ల పైబడిన విభాగ పరుగు పందెంలో ఎన్.రమణేశ్వరి (గుంటూరు), డి. నాగేశ్వరమ్మ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కూటమి నేతలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఎంవీపీకాలనీలోని ఎల్ఐసీ ఐక్యతా భవన్‌లో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ విశాఖ జిల్లా 50వ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, 12వ పీఆర్‌సీ అమలు చేస్తారని ఆశించామని అవేవీ చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టీఆర్ అంబేడ్కర్, గౌరవ అధ్యక్షుడిగా అనకాపల్లి పైడిరాజు, సహ అధ్యక్షులుగా కె. ముత్యాలనాయుడు, ఎ.విజయకుమారి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, రామకృష్ణ, రాజునాయుడు, సీహెచ్ సంతోష్, శ్రీనివాస్‌నాయుడు, వంగా రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సెలర్‌గా తాడాన అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రియాజ్ అహ్మద్, సభ్యులుగా వి.వి.గిరి, ఆడిటర్లుగా శ్రీనివాస్ కుమారి, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

## శ్రీశయన సామాజికవర్గ సమావేశం

బంటాకాలనీ(వేపగుంట), న్యూస్‌టుడే: 92వ వార్డు బంటాకాలనీలో శ్రీశయన(సెగిడి) సామాజికవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. పలువురు సంఘ పెద్దలు ఈ సమావేశానికి హాజరై సామాజికవర్గ సమస్యలపై చర్చించారు. ఈనెల 28వ తేదీన సింహాచలం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీప తోటల్లో వనమహోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

## షాపింగ్ మాల్ ప్రారంభం

పెందుర్తి, న్యూస్‌టుడే: చినముషిడివాడలో ఆదివారం శ్రీభవాని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, సినీనటి శ్రీదేవి అతిథులుగా పాల్గొని మాల్‌ను ప్రారంభించారు. ఈ మాల్‌లో బంగారు, వెండి ఆభరణాలతో పాటు రెడీమేడ్ వస్త్రాలు లభిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవంలో సినీనటి శ్రీదేవి, ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి నమ్మిదొడ్డి కూడలిలో ఆదివారం పులిచెర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పులిచెర్ల మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి వైద్య సేవలందించేందుకు తమ ట్రస్టు ముందుకొచ్చిందన్నారు. వైద్యసిబ్బంది 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ట్రస్టు జనరల్ సెక్రటరీ డాక్టర్ రవిశంకర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ తపన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేతుల శుభ్రతకు స్టాండ్ ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఇంతవరకూ చేతులు కడుక్కునేందుకు తగిన కుళాయి సదుపాయం ఉండేది కాదు. ఈ పరిస్థితిని తెలుసుకున్న ఎల్అండ్‌టీ సంస్థ సీఎస్సార్‌లో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించి ఆవరణలో కొత్తగా 15 కుళాయిలతో కూడిన చేతులు కడుక్కొనే స్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

కుళాయి స్టాండ్ వద్ద చేతులు శుభ్రపరచుకుంటున్న విద్యార్థులు

## నివాసితులకు మొక్కల పంపిణీ

వుడాకాలనీ (పెదగంట్యాడ), న్యూస్‌టుడే : నేచర్ గార్డెనర్స్ సంస్థ ఆధ్వర్యంలో గాజువాక వుడాకాలనీలో నివాసితులకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. వుడా ఓపెన్ ఆడిటోరియం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మాసవరపు ఐశ్వర్య మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో టెర్రస్ గార్డెనింగ్‌లో ప్రతి ఒక్కరూ తగిన మెలకువలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మొక్కల పెంపకాన్ని మహిళలు ఉద్యమంగా కొనసాగించాలని సూచించారు.

అందుకున్న మొక్కలతో కాలనీ వాసులు

## ప్రతిభ చాటి.. బహుమతులు సాధించి..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెం కల్యాణ మండపంలో ఈనెల 13వ తేదీన పరవాడ పోలీస్ సబ్‌డివిజన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన.. మత్తు పదార్థాలు లేని రేపటి కోసం-అవగాహన, విద్యా ప్రదర్శన (ఎక్స్‌పో)లో పలు విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ మండలాల్లోని 64 పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 500మంది విద్యార్థులు సుమారు 150 నమూనాలు ప్రదర్శించారు. వీటిలో మూడింటిని ఉత్తమంగా గుర్తించారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా బహుమతులు అందించారు. అవేంటంటే..

★ గంజాయి సాగు, రవాణాకు ముఠా సభ్యులు ఎక్కువగా పిల్లలను ఉపయోగిస్తున్నారు. విద్యార్థి దశలో యువత వీటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వివరిస్తూ ప్రదర్శించిన నమూనా ప్రథమస్థానం సాధించింది. దీనికి రూ.10వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నాం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలని నమూనాలో వివరించాం. - విజేత బృందం, లోటస్ ఇంగ్లిషు మీడియం స్కూల్, హరిపురం, రాంబిల్లి మండలం

★ గంజాయి నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలు వివరిస్తూ ప్రదర్శించిన నమూనాకు ద్వితీయ స్థానం లభించింది. రూ.9వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నాం. ఈ నమూనాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసులు అనుసరించే విధానాన్ని వివరించాం. మత్తు పదార్థాలతో దొరికితే శిక్షలు ఎలా ఉంటాయి? మత్తు పదార్థాల విక్రయ సమాచారం తెలిస్తే పోలీసులకు ఎలా తెలియజేయాలో వివరించాం. -సుమేధా హైస్కూల్ విద్యార్థులు, పరవాడ

★ ఒక మనిషి డ్రగ్స్‌కు అలవాటు పడక ముందు.... పడిన తర్వాత జీవితం, ప్రవర్తన ఎలా ఉంటుందనే విషయాలతో ప్రదర్శించిన నమూనాకు తృతీయ స్థానం లభించింది. డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత ఆరోగ్యం దెబ్బతిని జీవితం, చదువు నాశనం అవుతుంది. చివరికి మరణం వరకు వెళ్తుందని వివరించి రూ.8వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకున్నాం. -కైట్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అచ్యుతాపురం

(c) eenadu

## 114 మందికి చేతనం

అనంత సాంస్కృతికం

**సందర్భం:** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు కాలిపర్స్ పంపిణీ

**శిబిరం:** భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని కమలానగర్‌లోని ఓ సొసైటీ భవనంలో కృత్రిమ కాళ్లు, చేతుల కాలిపర్స్ శిబిర నిర్వహణ

**అధ్యక్షత ఎవరిది?:** ప్రాంతీయ పరిషత్ కన్వీనర్ పరుచూరు రమేశ్‌బాబు అధ్యక్షతన ఉమ్మడి అనంత జిల్లా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు విశ్రాంత ప్రిన్సిపల్ రామకృష్ణ, ప్రముఖ న్యాయవాది హరికృష్ణ, కన్వీనర్ రమణానాయుడుల సారథ్యం

**ఎవరెవరు వచ్చారు:** ప్రకాశం, కర్నూలు, ఉమ్మడి అనంత జిల్లాలోని 114 మంది దివ్యాంగులు హాజరై కొలతలు ఇచ్చారు.

**పునరావాస యోజన:** భారత్ వికాస్ పరిషత్ జాతీయ శాశ్వత పథకమైన వికలాంగుల పునర్వాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రమాదాలు, దీర్ఘకాలిక జబ్బులు, పోలియో వికలాంగులకు అనంత శాఖ వారిచే కాలిపర్స్ ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు.

## అంజన్నపై ఆన.. నిజమే చెబుతా

నల్లచెరువు మండలం పాత రైల్వేస్టేషన్ సమీపంలో వెలిసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ప్రమాణాలకు ప్రసిద్ధి. శ్రీకృష్ణదేవరాయలు ఆంజనేయస్వామి గుడిని నిర్మించినట్లు జన ప్రతీతి. దురాశతో తమదికాని డబ్బు, ఆభరణాలను కాజేసిన వారు ఆంజనేయుడి సన్నిధిలో ప్రమాణం చేస్తుంటారు. శనివారం రోజున చన్నీటి స్నానం చేసి పొంగళ్లుపెట్టుకున్న వ్యక్తి స్వామి సన్నిధిలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ఒకరకంగా రాజదర్బార్‌లో పంచాయితీ జరిగే రీతిన ఇక్కడి పూజారి సమక్షంలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది. తప్పుచేసిన వ్యక్తులు ప్రమాణానికి సిద్ధమవగానే పశ్చాత్తాపంతో ఆ సొమ్మును పొంగళ్లుపెట్టుకున్నవారి ఇళ్లలో వారం పది రోజుల్లో పడేస్తుంటారు. పోలీస్‌స్టేషన్‌లలో తెగని పంచాయితీలు స్వామి చెంతన పదుల సంఖ్యలో పరిష్కారం అవుతుంటాయని గ్రామస్థులు తెలిపారు. - న్యూస్‌టుడే, కదిరి పట్టణం

## పట్టెడన్నం పంచుతున్నారు

యాచకుడికి భోజనం అందిస్తూ..

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రికి చెందిన యువత యాచకులు, అభాగ్యులకు మేమున్నామంటూ తోడుగా నిలుస్తున్నారు. ఏ దిక్కులేని వారి ఆకలి తీరుస్తున్నారు. వినూత్నంగా ఆలోచించి పట్టణంలో ఉన్న పలు హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని సేకరించి పొట్లాలు కట్టి అన్నార్తుల కడుపు నింపుతున్నారు. తాడిపత్రిలోని వేర్వేరు కాలనీలకు చెందిన వరుణ్, కళ్యాణ్, ఇమ్రాన్, రాజు, భాస్కర్ బృందంగా ఏర్పడ్డారు. అనుకున్నదే తడవుగా గతేడాది నవంబరులో 'మేము సైతం..మీకోసం' సంస్థను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొన్ని హోటళ్లకు వెళ్లి 'మిగిలిన ఆహారాన్ని ఇవ్వండి, పొట్లాలు కట్టి యాచకులకు అందిస్తాం' అని అడిగేవారు. కొందరు స్పందించి ఆహారం అందించారు. తొలి రోజుల్లో బస్టాండు, రైల్వేస్టేషన్, చింతల రాయుడు, బుగ్గరామలింగేశ్వర ఆలయాల వద్ద యాచకులకు ఇచ్చి ఆకలి తీర్చారు. ప్రతి రోజూ 50 మందికి పైగానే సేవలందించారు. క్రమేణా ఆ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

### ఐదుగురితో ప్రారంభమై..

ఐదుగురితో ప్రారంభమైన సేవా బృందం 30 మంది సభ్యుల వరకు చేరింది. వీరంతా కలిసి హోటళ్ల యజమానులు, శుభకార్యాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. భవిష్యత్తు సేవల్ని అనాథ ఆశ్రమాలకు విస్తరిస్తామని చెబుతున్నారు సంస్థ ప్రతినిధి వరుణ్.

## సీట్లు.. పాట్లు

బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు ఎగబడ్డారు. ఈ దృశ్యం ఉరవకొండ ఆర్టీసీ బస్టాండులో కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయాల సందర్శన, సొంత పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండు కిక్కిరిసిపోయింది. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉండటం గమనార్హం. మధ్యాహ్నం వరకు బస్సులన్నీ రద్దీగా కనిపించాయి.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

## లక్ష్యమే.. శిఖరాగ్రం!




కిలిమంజారో పర్వతంపై చిరంజీవి

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** అందరిలా మనముండటం కన్నా.. కొంత భిన్నంగా ఉండటం ప్రధానం అనుకున్నారు గుంతకల్లు మండలం ముకలపెంటకు చెందిన చిరంజీవి. చిన్నతనం నుంచే కొండలెక్కడం అలవాటు చేసుకున్నాడు. తర్వాత పర్వతారోహణకు నడుం బిగించాడు. తండ్రి విరూపాక్షి సాధారణ రైతు. కుమారుడికి పర్వతారోహణపై ఆసక్తి ఉండటంతో గుర్తించి ప్రోత్సహించారు.

### ప్రభుత్వం తరఫున తీవిగా సాగి..

తాజా ప్రభుత్వం తరఫున పర్వతారోహణ పోటీల్లో పాల్గొని దక్షిణాఫ్రికా దేశం టాంజానియాలోని 19,340 అడుగల ఎత్తు ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగరవేశాడు. కశ్మీర్‌లోని 12,087 అడుగల ఎత్తైన తులియాన్, పహల్గావ్ పర్వతాలను ఎక్కి సత్తాచాటాడు. ప్రస్తుతం అమెరికాలోని అకాన్కాగువా పర్వతాన్ని ఎక్కడానికి విజయవాడలో శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరంతోపాటు ఇతర ఖండాల్లోని ఎత్తైన అన్ని పర్వతాలను ఎక్కాలన్నది తన లక్ష్యమని చిరంజీవి చెబుతున్నారు. గుంతకల్లులో పర్వతారోహణపై ఉత్సాహం ఉన్నవారికి శిక్షణ ఇస్తుండటం విశేషం.

## 16, 17 తేదీల్లో రైల్వేగేటు మూసివేత

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ముదిగుబ్బలోని కదిరి గేటును 16, 17వ తేదీల్లో మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శివంమాతూరు ఆదివారం తెలిపారు. ఎల్‌సీ నెంబర్ 26 వద్ద రైల్వేపట్టాల నిర్వహణతో పాటు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం నుంచి కదిరికి వెళ్లే వాహనదారులు ముదిగుబ్బ బైపాస్ మీదుగా, పులివెందుల నుంచి బుక్కపట్నం వైపు వెళ్లే చోదకులు ముదిగుబ్బ పాతూరు మీదుగా రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు.

## ఆటలో అరటిపండేనా!

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే:** జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల్లో ముఖ్యమైంది అరటి. రైతు కష్టపడి అధిక దిగుబడులు సాధిస్తున్నా.. నాణ్యత లేక ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం 'ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్' (ఎంఐడీహెచ్)లో భాగంగా జిల్లాలోని అరటి ఫల సంరక్షణకు 2025-26 ఆర్థిక ఏడాదికి రూ.3.80 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నాణ్యత పెంచేందుకు జిల్లా ఉద్యానవన శాఖ వెచ్చించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వారి పరిస్థితి, సమస్యలు ఆటలో అరటిపండు చందంగా మారాయి. ఇప్పటివరకు ఒక్క పైసా ఖర్చు చేయలేదనంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. పంట నాణ్యత లేక వ్యాపారులు కొనడం లేదు. కర్షకులు పంటను తొలగించడం లేదా పశువులు, గొర్రెలకు మేతకు వదిలేసే పరిస్థితి నెలకొంది.

| ఉమ్మడి అనంతపురం జిల్లాలో.. |
| --- |
| సాగు విస్తీర్ణం |
| 30,000 హెక్టార్లు (అంచనా) |
| హెక్టారుకు పెట్టుబడి వ్యయం |
| రూ.2.72 లక్షలు |
| దిగుబడి అంచనా |
| హెక్టారుకు 160.55 టన్నులు |

### పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

విపణిలో పంట ఉత్పత్తులు కిలో రూ.8లకు పడిపోతే మార్కెటింగ్ శాఖ జోక్యం చేసుకోవాలి. గతంలో దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. అధికారులు రంగంలో దిగి రైతుల నుంచి గెలలు కొనాలి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి విక్రయించాలి. ఇదేం జరగలేదు. ధరలు పతనమైన తర్వాత కలెక్టర్ ప్రశ్నిస్తే మార్కెటింగ్, ఉద్యానవన శాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం గమనార్హం.

### ఫ్రూట్‌కేర్ అమలు చేస్తున్నాం

**-ఉమాదేవి, ఉప సంచాలకురాలు, ఉద్యాన శాఖ**

జిల్లాలో అరటి నాణ్యత పెంచేందుకు ఫ్రూట్‌కేర్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. రూ.3.80 కోట్ల నిధులతో ఈ ఆర్థిక ఏడాదిలో 1500 హెక్టార్లలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొంత అమలు చేశాం. పూర్తిస్థాయిలో నిధులు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

### ఏం జరిగింది

ఉద్యానవన శాఖ అధికారులు ఫ్రూట్‌కేర్ కార్యక్రమంపై రైతులకు అవగాహనతో సరిపెడుతున్నారు. కనీసం ఒక్క హెక్టారులోనూ ఫల సంరక్షణ చేయలేదు.

### చేయాల్సింది ఇలా..

ఫల సంరక్షణ కార్యక్రమం కింద 1,500 హెక్టార్లలో అరటి నాణ్యత పెంచాలనేది లక్ష్యం. రూ.3.80 కోట్ల నిధులను మొక్క నాటిన నాటి నుంచి కోత వరకు వెచ్చించాలి. ఒక్కో రైతుకు హెక్టారుకు రూ.25,500 ఇవ్వాలి. మొగ్గ తొడిగిన తర్వాత బడ్ ఇంజక్షన్ వేయాలి. 45 రోజుల తర్వాత వివిధ రకాల మందులు పిచికారీ చేయాలి. గెలలకు కవర్లు కట్టాలి. ఇవన్నీ సకాలంలో పాటిస్తే అరటి దిగుబడి పెరగడంతో పాటు గెలలు నాణ్యతగా కాస్తాయి. వ్యాపారులు కొనేందుకు పోటీ పడతారు. రైతులకు మంచి ధర దక్కుతుంది.

## రాయితీల రంగరింపు..

**అనంతపురం(రాంనగర్), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం మల్బరీ రైతులకు సిల్క్ సమగ్ర పథకం కింద పలు రాయితీలు ప్రకటించింది. పట్టు పురుగుల వ్యాధి నిరోధకాల మందులకు ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఆమేరకు గుత్తేదారుడు మందులు సరఫరా చేశారు. దరఖాస్తు చేసుకొని వాటా చెల్లించిన రైతులకు వాటిని రాయితీపై పంపిణీ చేయనున్నారు. అంతేకాకుండా యాంత్రీకరణ పథకం కింద పరికరాలు, యంత్రాలు అందించనున్నారు.

### వ్యాధి నిరోధక మందులు

- ★ యూనిట్ల మంజూరు : 600
- ★ ఒక్కో యూనిట్‌లో ఎన్ని రకాలుంటాయి: 6
- ★ ఏయే మందులు ఉంటాయి: సున్నం, విజేతపొడి, క్లోరిన్‌డైయాక్సైడ్, పోషణ మందు, బ్లీచింగ్ పొడి, అస్త్రాపొడి
- ★ యూనిట్ ధర : రూ.5 వేలు
- ★ జనరల్ : రూ.3,750 రాయితీపోనూ రూ.1,250 రైతు వాటా చెల్లించాలి.
- ★ ఎస్సీ, ఎస్టీలు : రూ.4,500 రాయితీపోనూ రైతు వాటా రూ.500 చెల్లించాలి.

### యంత్ర పరికరాలు

- ★ యూనిట్ల మంజూరు : 25
- ★ ఎన్ని రకాలు: 7
- ★ ఏయే యంత్రాలు: బ్రష్‌కట్టర్, కోత, కలుపు యంత్రం, పవర్‌టిల్లర్, పెద్ద కత్తెర, చిన్న కత్తెర, పవర్ స్ప్రేయర్
- ★ జనరల్: 15 యూనిట్లు కేటాయించగా 50 శాతం రాయితీ.
- ★ ఎస్సీ, ఎస్టీలు: 5 యూనిట్ల చొప్పున 90 శాతం రాయితీ

### రైతులు సద్వినియోగం చేసుకోండి

**- విజయకుమార్, జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి**

మందులు, యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కేల్లో, పట్టుపరిశ్రమశాఖ అధికారులను సంప్రదించాలి. దరఖాస్తు చేసుకుని, రైతు వాటా చెల్లించిన వారికి పంపిణీ చేస్తాం. రాయితీలను మల్బరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## ఘన ప్రస్థానం.. నిత్యనూతనం

గుంతకల్లు రైల్వే జంక్షన్ ఆంగ్లేయుల కాలంలో (1870) రూపుదిద్దుకుంది. ఇప్పటికి 155 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో స్టేషన్‌తోపాటు డివిజన్‌లో రైల్వేలైన్ల నిర్మాణం జరిగింది. 1886 నుంచి 1994 వరకు ఆవిరి (స్టీమ్) ఇంజిన్లతో రైళ్లు నడిపారు. ప్రత్యేకంగా స్టీమ్ లోకో షెడ్డు ఉండేది. ప్రస్తుతం దీని స్థానంలో రైల్వేస్టేషన్‌కు కొత్త భవనాలు, ప్లాట్‌ఫాం, అత్యాధునిక వసతులతో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. నాటి ఆవిరి ఇంజిన్ రైళ్లతో మొదలుకొని నేటి విద్యుత్తు రైళ్ల వరకు జంక్షన్ ప్రస్థానం కొనసాగుతుండటం విశేషం.

-న్యూస్‌టుడే, గుంతకల్లు

**ప్రత్యేకతలు**

- రైల్వే లైన్లు : ఉత్తర, దక్షిణ భారతదేశమంతటా..
- స్టేషన్ గుండా వెళ్లే రైళ్లు: 110
- ఉద్యోగులు: 8 వేలు
- రోజువారీ ప్రయాణికులు: 20 వేలు

## అతివకు ఆర్థిక ఆసరా

"రాయదుర్గం, న్యూస్‌టుడే: మహిళల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం చేయూత నిస్తోంది. మహిళల స్వయం ఉపాధితో పాటు ఆర్థికాభివృద్ధిలో నానాటికీ ఎదుగుతున్న సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ప్రభుత్వం నూతన పొదుపు సంఘాల ఖాతాలకు రివాల్వింగ్ ఫండ్‌ను జమ చేసింది. సీఎం చంద్రబాబు మొదటి నుంచి సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2వేల కొత్త సంఘాలకు రూ.3కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసింది. ఇందులో 1278 బీసీ సంఘాలకు, 509 ఎస్సీ, 213 ఎస్టీ సంఘాలకు సామాజిక వర్గాల వారీగా లబ్ధి చేకూరనుంది. దీని ద్వారా ఒక్కో సంఘానికి రూ.15 వేలు అందనుంది."

### సంఘం ఆవశ్యకత

రివాల్వింగ్ ఫండ్‌తో సంఘం నిధి పెరుగుతుంది. దీంతో సభ్యులకు అవసరాన్ని బట్టి అంతర్గత రుణాలు మంజూరుకు, బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తాలను రుణాలు పొందటానికి ఇది దోహదం చేస్తుంది. రుణాల ద్వారా సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని వారి ఆదాయాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.

### 152 సంఘాలకు రూ.22.80 లక్షల మంజూరు

2024 ఆగస్టు 2 నుంచి 30.11.2025 మధ్య ఏర్పాటైన కొత్త సంఘాలకు సామాజిక వర్గాల వారీగా ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసింది. జిల్లాలో 152 కొత్త సంఘాలకు రూ.22.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో 111 బీసీ, 32 ఎస్సీ, 9 ఎస్టీ సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేశారు.

### సంఘాల అభివృద్ధికి ఎంతో మేలు

**- గంగాధర, వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు, అనంతపురం**

ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం సంఘాల అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుంది. రివాల్వింగ్ ఫండ్ ద్వారా మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి.

## మొండి బకాయి.. తేలని లడాయి!

**అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** బీఎస్ఎన్ఎల్ సంస్థలో టెలిఫోన్ సౌకర్యం తీసుకున్న వినియోగదారులు కొందరు సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా బకాయిలు పేరుకుపోతున్నాయి. వాటిని వసూలు చేయడం అధికారులకు కత్తి మీద సాములా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ టెలిఫోన్ ఎక్చేంజీల పరిధిలో 8 వేలమంది వినియోగదారుల బకాయి భారీ మొత్తంలో ఉంది.

★ బీఎస్ఎన్ఎల్ సంస్థ పలు సేవలను (టెలికాం ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రొవైడర్) టీఐపీ ప్రైవేట్ ఏజెన్సీలకు టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వడం, బకాయిలు వసూలు బాధ్యతలు అప్పగించింది. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలకు దరఖాస్తు చేసిన వినియోగదారులకు టెలిఫోన్, మోడెం, పరికరాలు సమకూర్చి కనెక్షన్లు ఇచ్చినపుడు, బకాయి వసూలు చేసిన సమయంలో 50 శాతం మొత్తాన్ని కమిషన్ రూపంలో ఏజెన్సీలకు చెల్లించేలా బీఎస్ఎన్ఎల్ యాజమాన్యం మార్గదర్శకాలు రూపొందించి, అమలు చేస్తోంది. కొన్ని ఏజెన్సీల సిబ్బంది టెలిఫోన్ కనెక్షన్ ఇచ్చే సమయంలో చూపినంత ఆసక్తి, బకాయి వసూలు సమయంలో చూపించక పోవడంతో రూ.కోట్ల రూపాయల సొమ్ము పేరుకుపోతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ టెలిఫోన్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసిన వినియోగదారుడు ఏ ఎక్ఛేంజీ పరిధిలో ఉన్నారో ఆ ఏజెన్సీ సిబ్బందికి ఫోన్ సౌకర్యం ఇవ్వాలి. టెలిఫోన్ సౌకర్యం తీసుకున్నపుడు, బిల్లులు సకాలంలో చెల్లించకుండా డిస్‌కనెక్షన్ చేసుకున్న వినియోగదారుడితో బకాయిలు వసూలు చేసినందుకు సదరు ఏజెన్సీకి 50 శాతం కమీషన్ సంస్థ చెల్లించేలా నిబంధనలున్నాయి. టెలిఫోన్ కనెక్షన్ ఇచ్చిన ఏజెన్సీకి డిస్‌కనెక్షన్ చేసుకుంటున్న సమాచారాన్ని ఇవ్వాలని నిబంధన ఉంది. టెలిఫోన్ సేవలు రద్దు చేసుకుంటున్నామని సమాచారం ఇచ్చినా సకాలంలో ప్రైవేట్ ఏజెన్సీలు స్పందించక పోవడం బకాయిలు పేరుకుపోవడానికి దారి తీస్తోందని పరిశీలనలో తేలింది.

### వసూలుకు చర్యలు..

**- ముజీబ్ పాషా, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జీయం**

ఉమ్మడి అనంతపురంలో 8వేల మంది వినియోగదారుల నుంచి రూ.1.2 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. టెలిఫోన్ సౌకర్యం తీసుకుని, సకాలంలో బిల్లులు చెల్లించని వారి నుంచి బకాయిలు వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతినెలా లోక్ అదాలత్‌లో కేసులు వేసి కొంత బకాయి సొమ్ము రాబడుతున్నాం. కోర్టు వరకు వెళ్లకుండా గడువులోపు ఇస్తామన్న వారితో చర్చించి కొంతమేరకు వసూలు చేస్తున్నాం. సకాలంలో స్పందించని ఏజెన్సీ సిబ్బందికి తాఖీదులు జారీ చేస్తున్నాం.

## కల్యాణ వైభోగమే..

అనంతపురం నగరం ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరాలయంలో స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం భక్త జన రంజకంగా సాగింది. గోవిందమాల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకను వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోవిందనామ స్మరణతో భక్తిభావం వెల్లివిరిసింది.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

## 11 పోస్టులు.. 137 దరఖాస్తులు

**అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) అనుబంధ శిశుగృహ పోస్టులకు తీవ్ర పోటీ నెలకుంది. 11 పోస్టుల కోసం ఏకంగా 127 మంది దరఖాస్తు చేశారు. తుది గడువు ముగియడంతో పోస్టుల కేటగిరీల వారీగా దరఖాస్తుల సంఖ్య లెక్క తేలింది. ఈనెల 8 నుంచి 14 దాకా ఖాళీగా ఉన్న పోస్టుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను వడపోసి తుది ప్రాథమిక ప్రతిభా జాబితా చేస్తామని ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ చల్లా లలిత చెప్పారు. త్వరలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పార్టుటైం డాక్టర్ పోస్టుకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదన్నారు.

**కేటగిరీల వారీగా దరఖాస్తు ఇలా**

| | |
| --- | --- |
| మేనేజర్ | 29 |
| సోషల్ వర్కర్ | 27 |
| 2 నర్సు పోస్టులు | 39 |
| 6 ఆయా పోస్టులు | 36 |
| 1 చాకీదార్ పోస్టు | 6 |

## ఉద్యానం.. అపూర్వ నామధేయం

ఓ పూర్వ విద్యార్థి తాను చదువుకున్న కళాశాలకు, విద్యార్థులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కళాశాల ఆవరణంలో అందమైన పార్కును ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ముంబయిలో బ్యాంకింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న చెట్టనాథన్ కళాశాలకు ఆరు గదులను నిర్మింపజేయడమే కాకుండా కంప్యూటర్లు, డెస్కులు, నోటు పుస్తకాలు, బీరువాలు తదితర వాటికి రూ.1.50 కోట్లకు పైగానే ఖర్చుచేశారు. అతని సేవలకు గుర్తింపుగా పార్కును ఏర్పాటు చేసి దానికి చెట్టనాథన్ పార్కుగా నామకరణం చేశారు. త్వరలో దీన్ని అతని చేతుల మీదుగా ప్రారంభింప జేయాలని నిర్ణయించినట్లు కళాశాల అధికారులు చెప్పారు. ఏర్పాటు చేసిన పార్కు కళాశాలకు అందంగా మారింది.

- న్యూస్‌టుడే, గుంతకల్లు

## గుత్తి కోట పర్యాటకానికి అడుగులు

కోట సంరక్షణ సమితి ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తి కోట పర్యాటక ప్రగతికి అడుగులు పడ్డాయి. ఈక్రమంలో కోట ప్రాంతాన్ని ఆదివారం కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. జనవరి 24-25న రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కలెక్టర్ కొత్తపేట గ్రామం వైపు ఉన్న రహస్య సొరంగ మార్గాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి నేరుగా కోటలోకి కొత్తపేట నుంచి వెళ్లేందుకు వీలుగా సొరంగ మార్గాన్ని పునఃనిర్మించేందుకు చర్యలు చేపట్టేందుకు ఆయన పరిశీలించారు. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు విడుదల చేసింది. కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, సర్పంచి గురు మస్తాన్, తహసీల్దారు పుణ్యవతి, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

## పేద మహిళలకు ఉజ్వల యోజన

"అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: కట్టెలు, బొగ్గుల పొయ్యిల ద్వారా వచ్చే విషపూరిత పొగను పీల్చకుండా మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని తీసుకొచ్చింది. అదే ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై). నాలుగేళ్లుగా ఆగిపోయిన ఈ పథకాన్ని మళ్లీ పునఃప్రారంభించారు. ఈ పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి."

### పూర్తిగా ఉచితం

సిలిండర్‌కు రూ.1,700, రెగ్యులేటర్‌కు రూ.150, ఒక మీటరు పైపు రూ.100, గ్యాస్ పుస్తకం రూ.25, ఇంట్లో బిగించేందుకు రూ.75 కలిపి రూ.2,050 ఈ మొత్తాన్ని ఆయిల్ కంపెనీలే భరిస్తాయి. మొదటి సిలిండర్ ఉచితం. తర్వాత తీసుకునే సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. ఈ పథకం అమలుకు జిల్లా ఉజ్వల కమిటీని నియమించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ప్రతినిధి జిల్లా కోఆర్డినేటర్‌గా, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సభ్యుడిగా ఉంటారు.

### కావాల్సిన ధ్రువపత్రాలు

- ● రేషన్‌కార్డులో పేర్కొన్న పేర్ల మీద ఎటువంటి గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలి.
- ● రేషన్‌కార్డు ఉన్న వలస కార్మికులూ సంబంధిత పత్రాలు జతపరచి కనెక్షన్ పొందవచ్చు.
- ● నెలకు రూ.10 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. రెవెన్యూ అధికారులతో ఆదాయ ధ్రువీకరణ పత్రం జతపరచాలి.
- ● అర్హులైన పేద మహిళలు ఏజెన్సీల వద్దకు వెళ్లి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- ● 14.2 కిలోల సింగిల్ సిలిండర్ లేదా 5 కిలోల రెండు సిలిండర్లు పొందవచ్చు.
- ● అర్హులైన ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌పీజీ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్ పేర్కొన్నారు.

## విజయ వీరులకు సత్కారం

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:**

**సందర్భం:** మాజీ సైనికులకు అనంతపురంలో సన్మానం

**ఎవరికి :** 'ఆపరేషన్ విజయ్' పేరుతో 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న జిల్లా మాజీ సైనికులకు, 1965లో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు

**ఆధ్వర్యం :** సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. షేకన్న

సత్కారం పొందిన మాజీ సైనికులు

**నేపథ్యం**

బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం ఆపరేషన్ విజయ్ పేరుతో 1971 డిసెంబరులో 13 రోజులపాటు యుద్ధం జరిగిందని గుర్తుచేశారు. ఇందులో 93 వేల మంది పాకిస్థాన్ సైనికులను బందీలుగా పట్టుకున్నామని వెల్లడించారు. 1971లో పాల్గొన్న వారిలో కెప్టెన్ షేకన్న, అబ్దుల్‌ఖాదర్, ఖాజాసాహెబ్‌లు ఉన్నారు. ఇదే సందర్భంగా 1965లో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు సిద్ధన్న, రామచంద్రారెడ్డి, జి.నాగభూషణం, బాబారత్నం, నంజేగౌడ, సి.కల్లప్పలనూ సత్కరించారు.

(c) eenadu

## ఆధ్యాత్మిక సమాచారం

**కదిరి, న్యూస్‌టుడే:** శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేటి (సోమవారం) ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. 10 గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణం. దర్శన వేళలు.. ఉదయం 6 నుంచి 6.30 వరకు, 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంట, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వ దర్శనం.

## సంతల ఆదాయం రూ.3.40 లక్షలు

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే :** అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శని, ఆదివారం గొర్రెలు, మేకలు, పశువుల వారం సంతలు నిర్వహించారు. సంతలతో మొత్తం రూ.3,40,350 ఆదాయం వచ్చింది. అందులో గొర్రెలు, మేకలు సంతలో రూ. 2,08,550 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.1,31,800 ఆదాయం వచ్చిందని, సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్ర కుమార్ తెలిపారు.

# దివ్యాంగ బాలల భవితకు భరోసా

చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** వారు అడుగు తీసి వేయలేరు. సరిగా మాట్లాడలేరు. కనీసం తమ పనులు తాము చేసుకోలేరు. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన వారి దయనీయ పరిస్థితి ఇది. అటువంటి చిన్నారులకు విద్యతోపాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సాధారణ స్థితికి తెచ్చేలా కృషి చేస్తున్నారు. జిల్లాలో 31 భవిత కేంద్రాల్లో 4,180 మంది దివ్యాంగులు ఉన్నారు. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఎన్నో సేవలు అందిస్తున్నా సరైన అవగాహన లేక కొందరు వాటిని అందిపుచ్చుకోలేక పోతున్నారు.

### రవాణా ఖర్చులు చెల్లింపు

కేంద్రానికి వచ్చే వినికిడిలోపం, మస్తిష్క పక్షపాతం, బుద్ధి మాంద్యం, అంగవైకల్యం ఉన్న బాలురకు నెలకు రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు, బాలికలకు రవాణా, స్టైపండ్ కలిపి నెలకు రూ.500 చొప్పున పది నెలలకు చెల్లిస్తారు.

### అందిస్తున్న సేవలు

ప్రతి కేంద్రంలో బుద్ధిమాంద్యం, వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఒక్కొక్క ఉపాధ్యాయుడు, చిన్నారుల బాగోగులు చూడటానికి ఒక ఆయా ఉంటారు. మానసిక, శారీరక వికాసం కోసం యోగా, దృఢత్వానికి ఇండోర్ ఆటలు ఆడిస్తారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ చికిత్సలు, ప్రతి శనివారం చిన్నారుల ఇళ్లకు వెళ్లి గృహ ఆధారిత విద్య నేర్పిస్తారు. పిల్లలు, తల్లిదండ్రులకు సంభాషణ పరమైన సలహాలు, పిల్లలకు సర్జరీలు, వీల్ ఛైర్లు వంటి ఉపకరణాల కోసం సూచనలు చేస్తారు. ప్రవర్తన సరిగా లేని పిల్లల పనితీరును మెరుగుపరచటం, దినసరి కార్యక్రమాలు వారే చేసుకునేలా తీర్చిదిద్దటం, విద్యాపరమైన బోధనలు చేస్తారు. పింఛన్ల కోసం సదరం సర్టిఫికెట్లు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఉపకరణాలు, కిట్లు, రైలు పాసుల కోసం యూడీఐడీ సర్టిఫికెట్లు అందజేస్తారు.

### అవగాహన కల్పిస్తున్నాం

భవిత కేంద్రాల సేవలపై విస్తృత ప్రచారం జరపాల్సి ఉంది. అంగవైకల్యం కలిగిన ఎందరో పిల్లల తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక సేవలు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.

**- వెంకటరమేశ్, ఎంఈవో, రాయదుర్గం**

# తెగుళ్లు సోకి పంటలు నష్టపోతున్నారా?

◆ శాస్త్రవేత్తలతో మాట్లాడి నివారణోపాయం పొందండి

◆ రేపు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే:** జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. పంటలకు తెగుళ్ల తీవ్రత అధికమైంది. ప్రధానంగా ఉల్లి, దానిమ్మ, అరటి, మామిడి, టమాటా వంటి పంటలతో పాటు పప్పుసెనగ, వేరుసెనగ, వరి పంటలకు తెగుళ్లు ఆశించాయి. పూత, కాయ ఆలస్యంగా కావడంతోపాటు పురుగులు, తెగుళ్లు ఆశించి [illegible] తీవ్రంగా నష్టపోతున్నారు. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం [illegible]. రేకులకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ రమణ, డాక్టర్ శారద, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రకాశ్ మాధవి, ఉద్యాన అధికారులతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పిస్తున్నాం. ఇంకెందుకు ఆలస్యం ఒక్క ఫోన్ చేయండి. అమూల్యమైన సలహాలు, సూచనలు పొందండి.

| | |
|---|---|
| ఫోన్ చేయాల్సిన తేదీ | : 16-12-2025 (మంగళవారం) |
| సమయం | : ఉదయం 9 నుంచి 10.30 గంటల మధ్య |
| ఫోన్ చేయాల్సిన నంబర్లు | : 94906 95704, 94413 23352, 98487 11064 |

## సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహణ భేష్

సెంట్రల్ వర్సిటీలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి రంగనాథ్

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహణ చాలా బాగుందని కర్ణాటక ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన సెంట్రల్ యూనివర్సిటీని వీసీ కోరితో కలిసి సందర్శించారు. వర్సిటీ ఏర్పాటైన ఆరేళ్లలోనే అనేక విజయాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉద్దేశించి మాట్లాడుతూ సాధారణ విద్యలోని సైద్ధాంతిక పరిమితులు, [illegible] గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు పలువురి విజయగాథలు, పైలెట్ ప్రాజెక్టుల గురించి తెలుసుకోవాలన్నారు. సంస్థాగత అభ్యాసం, నాయకత్వ వికాసంపై నిరంతర పరిశీలన చేయాలన్నారు. చదువుతో పాటు, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారులు జావేద్ అక్తర్, ద్వారక, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో న్యాయవ్యవస్థ

### విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు

సమావేశంలో మాట్లాడుతున్న కె.చంద్రు

**ఆర్వెనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాక్ స్వాతంత్ర్యం, లౌకికత్వాన్ని కూడా కాపాడుకోవాలని మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్లో బార్ కౌన్సిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'రాజ్యాంగ పరిరక్షణ' సదస్సుకు చంద్రు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనేది స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో ప్రాధాన్యం కల్గిన నినాదమన్నారు. నేడు మన దేశంలోని ప్రజలు ఎటువంటి దుస్తులు ధరించాలి, తిండి ఏం తినాలి అనే విషయాన్ని కూడా పాలకులు నిర్ణయించే స్థాయికి వచ్చిందని, దీన్ని బట్టి చూస్తే వ్యక్తిగత స్వేచ్ఛ హరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వ సంస్థల పేర్లను మార్పు చేసే ప్రయత్నంలో ఉన్నారని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు రోజ్‌గార్ యోజనగా మార్చేందుకు బిల్లు ప్రవేశపెట్టనున్నారు. గాంధీ, నెహ్రూ పేర్లు మోదీ, అమిత్‌షాలకు ఇష్టం లేదని ఆరోపించారు. దళితుడైన భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరిన లాయర్‌ను కనీసం అరెస్టు చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఐలు కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ప్రముఖ కార్డియాలజిస్టు వంశీకృష్ణ, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రసూన, హేమలత పాల్గొన్నారు.

# విజయనగర సామ్రాజ్య రాకుమార్తె శాసనం గుర్తింపు

గుడిపల్లిలో బృందావనాన్ని చూపుతున్న ఉపాధ్యాయుడు గోపి, పక్కన గ్రామస్థుడు శ్రీనివాసులు

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని గుడిపల్లిలో పురాతన కాలం నాటి సజ్జగంట రంగనాథస్వామి ఆలయం వద్దగల అత్యంత అరుదైన విజయనగర సామ్రాజ్య రాకుమార్తె 'సామాయి' శాసనాన్ని ఆదివారం గుర్తించినట్లు బుక్కపట్నం ఉపాధ్యాయుడు, చరిత్రకారుడు కె.గోపి తెలిపారు. విజయనగర సామ్రాజ్యాధిపతులు శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ప్రతిమలను ప్రతిష్ఠించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయానికి ఉత్తర ద్వారమైన బృందావనం రాతి గోడలపై విజయనగర సంగమ వంశ మూడో రాజైన రెండవ హరిహర రాయల కుమార్తె అయిన సామాయి పేరుతో శ్రీ.శ 1398వ సంవత్సరం మే ఒకటిన శిలా శాసనం వేయించారని ఆయన చెప్పారు. పుణ్యం కోసం హరిహర రాయలు బృందావనాన్ని నిర్మించినట్లు ఈ శాసనంలోని సారాంశం తెలుగు, కన్నడ భాషల్లో అక్షరాలున్నట్లు తెలియజేశారు. సాధారణంగా విజయనగర పాలనా కాలంలో శాసనాలను రాజుల పేరు మీద వేయించినట్లు చరిత్రకారుల పరిశోధనలో లభ్యమవుతున్నాయని, అయితే ఇందుకు భిన్నంగా ఒక రాకుమార్తె పేరుతో వేయించిన శాసనం వెలుగుచూడటం ఇదే తొలిసారి అని ఉపాధ్యాయుడు గోపి తెలియజేశారు. భారత పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సహకారంతో ప్రాచీన ఆలయాలు, శాసనాల మీద తను చేస్తున్న పరిశోధనలో భాగంగానే ఇక్కడి అరుదైన శాసనాన్ని వెలుగులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట పలువురు గ్రామస్థులు ఉన్నారు.

# అందాల సౌందర్య

### శ్రీమతి ఆంధ్రప్రదేశ్ -2025లో రన్నరప్‌గా విజేత

**హిందూపురం, మడకశిర, న్యూస్‌టుడే:** మడకశిర పట్టణానికి చెందిన సోను సౌందర్య ప్రస్తుతం హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 'శ్రీమతి ఆంధ్రప్రదేశ్ -2025' పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ అందాల పోటీల్లో తన అద్భుతమైన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకొంది. ఇప్పటికే అక్టోబర్ మాసంలో నిర్వహించిన పోటీల్లో 'శ్రీమతి విజయవాడ' కిరీటాన్ని దక్కించుకొంది. హిందూపురంలో గ్లాం స్టూడియో హౌస్ ఆఫ్ బ్యూటీ నిర్వహిస్తున్న ఈమె మేకప్ రంగంలోనూ రాణిస్తూ పట్టణంలో ప్రత్యేక గుర్తింపు పొంది ఎంతో మంది గృహిణిలకు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రస్థాయి అందాల పోటీలో రన్నరప్‌గా నిలిచిన సోనూ సౌందర్య కు పట్టణ ప్రముఖులు, పలువురు అభినందనలు తెలిపారు.

## 16న జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 16న జిల్లా పురుష, మహిళల, జూనియర్ బాలబాలికల ఖోఖో జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడా విభాగం జిల్లా కార్యదర్శి నిరంజన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీప్రసాద్, రాఘవేంద్ర, ప్రభాకర్ ఆదివారం పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు నిర్ధారణ ధ్రువపత్రంతో పాటు ఆధార్‌కార్డుతో పాల్గొనాలని సూచించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

Wanted Managers & Sales Staff for Anantapur Biggest Furniture Store Mamatha Furniture. 2yrs Exp & Computer Skills. Sal: Upto 25K + Incentives. Interview 14 & 15th Dec. @ 11 AM - 4Pm. # Gooty Road, Opp: Market Yard, ATP.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

**స్కూల్ నందు** అనుభవం గల Vice Principal మరియు A.O కావలెను. Cell: 9440045441.

HYD **యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

# బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం

విజేత జట్టుకు కప్పు అందిస్తున్న మంత్రి భరత్

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే:** కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో మూడు రోజుల పాటు నిర్వహించిన భూషణ్‌రావు స్మారక రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో అనంతపురం జట్టు రాజమహేంద్రవరం జట్టుపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో చిత్తూరు జట్టు కర్నూలుపై విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందని చెప్పారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి దాదాబాషా, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆందోళన పట్టదా?

ఆసుపత్రి ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు

**అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే:** పద్మావతి క్లీనింగ్ ఏజెన్సీస్ నిర్వాహకులు, గుత్తేదారుడైన భాస్కర్ నాయుడును పిలిపించి కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు నాగేంద్రకుమార్, ముత్తూజ, సాకే హరి, సురేష్, మల్లికార్జునరెడ్డి, రామిరెడ్డి డిమాండ్ చేశారు. 42 రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి తొలగించిన కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆదివారం ఆసుపత్రి ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. మహిళా కార్మికులు ఉదయం అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు, మహిళా పోలీసులు కార్మికురాళ్లను అరెస్ట్ చేసి బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఆర్డీవో సమక్షంలో సంప్రదింపులు

శనివారం ఆసుపత్రిలో కార్మికులకు, గుత్తేదారులకు మధ్య జరిగిన గొడవపై జిల్లా కలెక్టర్ ఆర్డీవో కేశవనాయుడు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఆర్డీవో కలిసి కార్మిక, ప్రజా, కులసంఘాల నాయకులతో మాట్లాడారు. గుత్తేదారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 20 ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని డిగ్రీ ఉండాలని, 50 ఏళ్లలోపు వయసు ఉండాలని నిబంధనలు చూపటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మరుగుదొడ్లలో యాసిడ్ చల్లి శుభ్రం చేసిన వీరి కష్టాలు అధికారులకు కనబడటం లేదా అంటూ ప్రశ్నించారు.

## ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ విజేత కుశాల్

కుశాల్‌కు కప్ అందజేస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

**ధర్మవరం:** పట్టణంలోని కొత్తపేట సీతా రామాంజనేయ కల్యాణమండపంలో రెండు రోజులుగా జరుగుతున్న డా.ఎస్.నాగమణి మెమోరియల్ ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా అనంతపురానికి చెందిన కుశాల్ నిలిచాడు. ఆదివారం టోర్నీ ముగిసింది. విజేతకు కప్‌తో పాటు రూ.15వేలు నగదును ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ధర్మవరం అధ్యక్షుడు డా.వాసుదేవరెడ్డి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విజయవాడకు చెందిన మల్లేశ్వరరావు రూ.10వేలు, కప్, తృతీయ స్థానం సాధించిన అనంతపురానికి చెందిన లాలిత్య రూ.8వేలు, కప్‌ను టోర్నీ ఆర్గనైజింగ్ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాషా, ఈశ్వరప్ప, గౌరవాధ్యక్షుడు డా.సుబ్బరావు, డా.రవిప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. వివిధ స్థానాల్లో నిలిచిన 32 మంది క్రీడాకారులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఏపీ చెస్ సంఘం కార్యదర్శి సుమన్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరామ్ పాల్గొన్నారు.

## యువత సామాజిక సేవలో భాగమవ్వాలి

యువతతో సంస్థ సీఈవో, సిబ్బంది

**రొద్దం, న్యూస్‌టుడే :** సమాజంలో ప్రతి యువత వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు, సామాజిక సేవలోనూ భాగం కావాలని కల్పవల్లి సీఈవో చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని కోగిర సమీపంలోని కల్పవల్లి సీఈవో చిరంజీవి ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన యువతకు టింబక్టు కలెక్టివ్ సంస్థ పర్యావరణ పరిరక్షణతో పాటు ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కల్పవల్లి సంరక్షణతో పాటు యువతత అటవీ ప్రాంతంలో కొన్నివేల మొక్కలు నాటించి, వాటి సంరక్షణకు వాచర్స్‌ను నియమించారన్నారు. దీంతో వందల ఎకరాల్లో పచ్చదనం అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు రవి, రమేశ్, సతీష్, ఆది, కిరణ్,లతో పాటు వాచర్స్ పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని యువకుడి వీరంగం

### కత్తితో హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

దాడికి యత్నిస్తున్న రవి

**పామిడి, న్యూస్‌టుడే :** పామిడి పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఆదివారం మతిస్థిమితం లేని రవి అనే యువకుడు కత్తితో వీరంగం చేశాడు. దుస్తులు కొనడానికి వెళ్లిన రవి డబ్బులు ఇవ్వకుండా దుకాణ యజమానులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోగానే వారి వాహనంపై కర్రతో దాడి చేసి వెంబడించాడు. పట్టుకోవడానికి వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులుపై కత్తితో దాడికి యత్నించాడు. త్రుటిలో ప్రమాదం తప్పింది. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా సదరు యువకుడు మతిస్థిమితం లేని కారణంగా విశాఖలో వైద్యం తీసుకున్నటు పోలీసులు తెలిపారు.

# మామిడి మొక్కల నరికివేత

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని దురదకుంట గ్రామానికి చెందిన రాముడు అనే రైతు పొలంలో దుండగులు మామిడి మొక్కలను నరికేశారు. ఆదివారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిచూడగా దాదాపు 36 మొక్కలు నేలపై పడి ఉన్నాయని రైతు వాపోయారు. రెండేళ్ల క్రితం కడియం నుంచి 300 మొక్కలు తెచ్చి 4 ఎకరాల్లో నాటినట్లు చెప్పారు. ఓర్వలేకనే కొందరు ఉద్దేశపూర్వకంగా మొక్కలను నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.90 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కవలల జననం.. బాలింత విషాదాంతం

గంగమ్మ

**బెళుగుప్ప, న్యూస్‌టుడే:** పదేళ్ల తర్వాత కవల పిల్లలు పుట్టారన్న సంతోషం.. పిల్లలను తనివితీరా చూడకుండానే ఆ తల్లి మృతి చెందటంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. హృదయాలను కలచి వేసిన ఈ ఘటన బెళుగుప్ప మండలంలోని గంగవరం గ్రామంలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం హావలిగి గ్రామానికి చెందిన గంగమ్మ (28)కు శివకుమార్‌తో పదేళ్ల కిందట వివాహం జరిగింది. పురిటి నొప్పులు రావడంతో ఆమెను కళ్యాణదుర్గంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం కవలలకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే బాలింతకు రక్తస్రావం ఆగకపోవడంతో అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు చిన్నారులకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

# ట్రాక్టర్ ఢీకొని ఉపాధ్యాయుడి దుర్మరణం

హరికృష్ణ

**అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే:** అమడగూరులోని విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హరికృష్ణ(36) అనే ఉపాధ్యాయుడు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు. . ముదిగుబ్బ మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన హరికృష్ణ అమడగూరు మండలం జౌకులకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా అమడగూరు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# కారు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

### హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఘటన

క్షతగాత్రులు లక్ష్మీనరసింహ, భార్గవ్

**ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలోని బాలుర సమీకృత వసతిగృహం వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆదివారం ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బాలుర వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు లక్ష్మీనరసింహ, భార్గవ్‌కు హాస్టల్ సిబ్బంది గురుప్రసాద్ తన ద్విచక్రవాహనాన్ని ఇచ్చారు. కొత్తపల్లి సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నారని, మిగిలిపోయిన భోజనాన్ని తెమ్మన్నారు. విద్యార్థులు అక్కడికి వెళ్లి భోజనాన్ని తెచ్చిన తర్వాత, పాత్రలను తిరిగి ఇచ్చి రమ్మని చెప్పారు. పిల్లలు ద్విచక్రవాహనంపై వడ్డివారిపల్లి సమీపంలో హైవేను దాటుతుండగా, కదిరి నుంచి గోరంట్ల వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మీనరసింహ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనిపై వసతిగృహం వార్డెన్ కృష్ణనాయక్ వివరణ కోసం న్యూస్‌టుడే ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

### విద్యార్థులు రోడ్డుమీదకు ఎలావచ్చారు : మంత్రి

**పెనుకొండ:** వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడతామని, వసతిగృహంలో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డు మీదకు ఎలా వచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రశ్నించారు. వసతి గృహం విద్యార్థులు గాయపడడంపై మంత్రి సవిత కలెక్టర్, జిల్లా ఎస్పీతో అమరావతి నుంచే చరవాణిలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈఘటనపై డీఎస్‌డబ్ల్యూవో రెడ్డిబాలాజీతోనూ మంత్రి చరవాణిలో మాట్లాడారు. తక్షణం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి, చోదకుడిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

# పొలం వివాదంతో రైతు ఆత్మహత్యాయత్నం

కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఉన్న అశ్వర్థ

**పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :** సోదరుల మధ్య తలెత్తిన పొలం వివాదంలో తనకు న్యాయం జరగలేదని ఓ రైతు మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన పెద్దపప్పూరు పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం జరిగింది. శింగనగుంటపల్లికి చెందిన అశ్వర్థకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని తబ్జుల గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడికి ఆరేళ్ల పాటు కౌలుకు ఇచ్చాడు. అశ్వర్థ సోదరుడు పెద్దకుళ్లాయప్ప అన్నదమ్ముల పొలాల మధ్య ఇతరులకు కౌలుకు ఇస్తే సమస్యలు ఉత్పన్నం అవుతాయని, తనకే భూమి కౌలుకు ఇవ్వాలని అడిగాడు. దీనికి అతను ఒప్పుకోలేదు. న్యాయం కోసం శనివారం పోలీసులను ఆశ్రయించాడు. గొడవలకు వెళ్లకుండా సామరస్యంగా ఉండాలని సోదరులిద్దరికీ పోలీసులు సూచించారు. ఈక్రమంలో పెద్దకుళ్లాయప్ప పొలంలో దుక్కి దున్నడానికి వెళ్లాడు. ఆ వెంటనే అశ్వర్థ కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి పురుగు మందు తాగేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకొని పెద్దకుళ్లాయప్పను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అశ్వర్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హత్య కేసు ఛేదన

### ముగ్గురు నిందితుల అరెస్టు

నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

**పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** వ్యక్తి హత్య కేసును ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం డీఎస్పీ విజయ్‌కుమార్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దేవరవంక గ్రామానికి చెందిన ముత్తప్ప(44) అనే వ్యక్తి అమడగూరు మండలం ఆకులవారిపల్లిలో సెప్టెంబరు 3న దారుణ హత్యకు గురయ్యాడు. కర్ణాటక రాష్ట్రం కొత్తపల్లికి చెందిన సురేష్‌తో ముత్తప్పకు భూవివాదం ఉంది. మరోవైపు చామాలవారిపల్లి సోమశేఖర అనే వ్యక్తి ముత్తప్ప అన్న కూతురుతో అసభ్యంగా ప్రవర్తించగా, ముత్తప్ప చెప్పుతో కొట్టించాడు. ఈ నేపథ్యంలో సురేష్, సోమశేఖర కలిసి ముత్తప్పను చంపాలని నిర్ణయించుకున్నారు. ముత్తప్ప అమడగూరు మండలం ఆకులవారిపల్లిలో పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పథకం ప్రకారం సురేష్, సోమశేఖర బోయిపల్లికి చెందిన ఆనందతో కలిసి సెప్టెంబరు 3న ఆకులవారి పల్లికి వెళ్లారు. ముగ్గురూ కలిసి ముత్తప్ప తలపై నరికి దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా నిందితులు ఆదివారం ఓడీచెరువు మండలం మహమ్మదాబాద్ వద్ద ఉండగా అరెస్టు చేశారు. కేసును ఛేదించిన నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీసీ ఎస్సై మల్లికార్జున రెడ్డి, కానిస్టేబుళ్లు లోకేశ్వర, కరుణాకర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్బీ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

వరిగడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు

## పశుగ్రాసానికి గిరాకీ

**కణేకల్లు:** కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఉన్న పశుగ్రాసానికి డిమాండ్ నెలకొంది. జిల్లాలో వేరుసెనగ సాగు తగ్గిన నేపథ్యంలో పాడి పశువులకు వరిగడ్డి ప్రధాన ఆధారమైంది. ఈ సారి 50వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. ప్రతిరోజు 150 ట్రాక్టర్ల గడ్డిని జిల్లాలోని ఇతర ప్రాంతాలు, కర్ణాటకకు తరలిస్తున్నారు. పాడి రైతులు వరి గడ్డిని కొని నిల్వ చేసుకుంటుండటంతో ట్రాక్టర్ల యజమానులకు, కూలీలకు ఉపాధి లభిస్తోంది. దీంతో రైతులకు కూడా అదనపు ఆదాయం సమకూరుతోంది.

## మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

**సమస్య:** పట్టణంలోని రామస్వామి వీధిలో ప్రధాన కాలువలో పూడిక పేరిగి మురుగు ముందుకు కదలక దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. - గెల్లి శ్రీనివాసులు, లక్ష్మీబజారు, రాయదుర్గం

**సమాధానం:** త్వరలో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

**సమస్య:** పాత బస్టాండులో వీధిదీపాలు లేక రాత్రిళ్లు ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - ఆదమ్‌బాషా, రాయదుర్గం.

**సమాధానం:** పరిశీలించి వీధిదీపాలు ఏర్పాటు చేస్తాం - నరసింహారెడ్డి, దేవాదాయశాఖ, రాయదుర్గం.

**సమస్య:** పట్టణంలోని కణేకల్లురోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. -తిమ్మరాజు స్థానికుడు

**సమాధానం:** త్వరలో పూడుస్తాం. - రవితేజరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ, రాయదుర్గం.

**సమస్య:** బళ్లారి రోడ్డులో వీధిదీపాలు వెలగక రాత్రిళ్లు చీకటి నెలకొంది. -నాగరాజు, బళ్లారిరోడ్డు, రాయదుర్గం.

**సమాధానం:** త్వరలో పట్టణమంతా వీధి పాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం. - న్యూస్‌టుడే, రాయదుర్గం

నగదు అందిస్తున్న మార్నింగ్ వాకర్స్

## ఆలయ అభివృద్ధికి విరాళం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ మండలం చిన్నముష్టూరు వద్ద ఉన్న కల్లం బండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకర్స్ రూ.27 వేలు విరాళంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం అందించారు. వారిని ఆలయ ప్రతినిధులు అభినందించారు.

## కుటుంబ ఓటర్లంతా ఒకే చోట ఉండేలా మ్యాపింగ్

**కణేకల్లు, న్యూస్‌టుడే:** ఓటరు జాబితా ఆధారంగా కుటుంబంలోని ఓటర్లంతా ఒకే చోట కనిపించేలా మ్యాపింగ్ చేస్తున్నట్లు తహసీల్దారు బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో బీఎల్వోలు ఓటరు మ్యాపింగ్ చేపట్టినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 53,388మంది ఓటర్లు ఉండగా, 19547ఓటర్ల మ్యాపింగ్‌తో 36.61 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

## నేడు ప్రజాదర్బార్

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల కన్వీనర్ హనుమంతు, ఎంపీడీవో కొండన్న తెలిపారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరిస్తారు. కావున ప్రజలు, తెదేపా నాయకులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం

**బెళుగుప్ప, న్యూస్‌టుడే:** ఒకేరోజు మూడు విద్యుత్తు నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని రామసాగరం గ్రామంలో చోటు చేసుకుంది. రైతులు ఓబులేష్, వెంకటస్వామి, ఎర్రిస్వామిలకు చెందిన విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేసి అందులో ఉన్న ఆయిల్, రాగి తీగలను దుండగులు ఎత్తుకెళ్లారు. రూ.40 వేల వరకు నష్టం కలిగినట్లు ఏఈ గంగాధర్ తెలిపారు. ఇందులో రెండు ప్రైవేటు విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయన్నారు. ఘటనపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# జలవనరుల శాఖలో అధికారుల కొరత

✦ నియోజకవర్గానికి ఒక జూనియర్ ఇంజినీర్, ఒక డీఈతో నిర్వహణ
✦ లస్కర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు అసలు లేరు

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో 53 చెరువుల కింద 6520ఎకరాలు, బీటీ ప్రాజెక్టు కింద 8వేల ఎకరాలు ఉన్న జలవనరుల శాఖలో జూనియర్ ఇంజినీర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కర్ల కొరత తీవ్రంగా ఉంది. ఫలితంగా వాటి నిర్వహణ కష్టంగా మారింది. నియోజకవర్గంలో ఒక డీఈతో పాటు మండలానికి ఒకరు చొప్పున అయిదు మండలాలకు ఐదుగురు జూనియర్ ఇంజినీర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక డీఈ, ఒక జేఈ మాత్రమే పని చేస్తున్నారు. నాలుగు జేఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అభివృద్ధి పనుల అమలుకు, నీటి నిర్వహణకు అవసరమైన వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు ఉండాలి కానీ ఒక్కరు కూడా లేరు. చెరువుల కింద ఆయకట్టు భూములకు సాగు నీరు సక్రమంగా అందించేందుకు 8 మంది లస్కర్లు అవసరం కాగా ఒక్కరూ లేరు.

రాయదుర్గం జలవనరులశాఖ కార్యాలయం

### సచివాలయ ఇంజినీరు నియామకానికి ప్రతిపాదనలు

బీటీ ప్రాజెక్టుతో పాటు ట్రిబుల్ ఆర్ పథకం కింద చెరువుల అభివృద్ధికి జూనియర్ ఇంజినీర్ల కొరత ఉంది. గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను మండలానికి ఇద్దరు చొప్పున నియామకానికి, బీటీ పాజెక్టు నీటి నిర్వహణ కోసం ప్రైవేటు లస్కర్ల నియామకానికి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం.
- గీతాలక్ష్మి, జలవనరులశాఖ, రాయదుర్గం

### బీటీ ప్రాజెక్టు నీటి నిర్వహణ ఎలా?

ఈనెల 15 నుంచి బీటీ ప్రాజెక్టు 1 నుంచి 9వ తూము వరకు 3162 ఎకరాలకు సాగునీటిని విడుదల చేయనున్నారు. నీటి నిర్వహణకు వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు ఎంతో అవసరం. వారు లేకపోతే తూముల నిర్వహణ కష్టంగా మారుతుంది. ఆయకట్టు మొదట్లో ఉన్న రైతులు కాలువకు అడ్డుకట్టలు వేస్తారు. ఫలితంగా చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించటం కష్టంగా మారుతుంది. దీని వల్ల రైతుల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లను నియమించాల్సిన అవసరం ఎంతో ఉంది.

✦ నియోజకవర్గంలోని 17 చెరువుల అభివృద్ధికి ట్రిబుల్ ఆర్ కార్యక్రమం కింద మరమ్మతులు, ఆధునికీకరణ, స్థిరీకరణ పనుల కోసం దాదాపు రూ.1.5కోట్ల ప్రతిపాదనల తయారీకి, జూనియర్ ఇంజనీర్ల అవసరం ఉంది. బీటీ ప్రాజెక్టు నిర్వహణకు కూడా రూ.1.5 కోట్ల ప్రతిపాదనల తయారీకి, ప్రాజెక్టు నీటి నిర్వహణకు ఇంజనీరు అవసరం ఉంది.

# అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక

కూడేరులో పూర్వ విద్యార్థులు

**కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే:** కూడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డికి స్వాగతం పలికి సత్కరించారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అంతా కలిసి భోజనాలు ఆరగించారు.

**బొమ్మనహాళ్:** మండలంలోని దర్గాహొన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పూర్వవిద్యార్థులు కలుసుకున్నారు. విద్యార్థి బృందం సభ్యులు గంగిరెడ్డి, గురురాజ్ గౌడ్, ముద్దురాజు, అబ్దుల్, జక్కిరెడ్డి, ఇబ్రహీం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులు, మిత్రుల అకాల మరణానికి సంతాపం తెలిపారు. ఎంఈవో తిమ్మప్ప, ఉపాధ్యాయురాలు రామక్క, విశ్రాంత ఉపాధ్యాయులు వన్నారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, బండయ్య, గుండురావు, రామస్వామి, నజీర్‌బాషా, మల్లికార్జునను పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

దర్గాహొన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

వజ్రకరూరులో..

**వజ్రకరూరు:** స్థానిక కేవీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ 25 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. పాఠాలు బోధించిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లు పట్టణం కసాపురం రహదారి పక్కన ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పడిపూజ కార్యక్రమం జరిగింది. మాలధారులు అయ్యప్ప స్వామి మూలవిరాట్‌ను అందంగా అలంకరించారు. శబరిమలైలో మాదిరి ఆలయంలో 18 మెట్లను ఏర్పాటు చేశారు. మాలధారులు అయ్యప్పస్వామి భక్తి గీతాలను ఆలాపించారు. భక్తులు పూజలు చేశారు. వేద పండితుడు మురళీకృష్ణ వేదమంత్రాలను పఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జట్టు సభ్యుల ఆనందోత్సాహం

## క్రికెట్ విజేత కణేకల్లు ఉపాధ్యాయుల జట్టు

**కణేకల్లు, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయుల క్రీడా పోటీలలో భాగంగా కళ్యాణదుర్గంలో జరిగిన జోనల్ క్రికెట్ పోటీలలో కణేకల్లు ఉపాధ్యాయుల జట్టు విజేతగా నిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుమ్మగట్ట జట్టు నిర్ణీత 15ఓవర్లలో 122 పరుగులు చేయగా, కణేకల్లు జట్టు 9ఓవర్లలో 123పరుగుల లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఓపెనర్‌గా వెళ్లిన పీడీ రామాంజినేయులు 34బంతులలో శతకం చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. క్యాప్టెన్ భవానీ శంకర్, కోచ్ రమేష్, జట్టు మేనేజరు నక్కా నాగరాజు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జట్టు సభ్యులు అభినందించారు.

## సేవలతోనే గుర్తింపు..

పదోన్నతి పొందిన ఉద్యోగికి సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉద్యోగులు క్రమశిక్షణతో శ్రద్ధగా విధులు నిర్వహిస్తే పదోన్నతులు పొందవచ్చని ఆర్టీసీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే మర్రిస్వామి, ఆజామ్ బస్సుల్లో తనిఖీ అధికారులు(స్క్వాడ్) పదోన్నతులు పొందారని తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో వారికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యూనియన్ నాయకులు వేణుగోపాల్, గంగప్ప, చెన్నయ్య, రామాంజనేయులు, రాంప్రసాద్, శేఖర్, ముత్యాలు, విశ్రాంత ఉద్యోగి ఎస్ఎన్‌వీ రావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలగా వాలీబాల్ కోర్టు నిర్మాణం

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** ఉరవకొండ పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థినుల సదుపాయార్థం ఏడాది క్రితం ఉపాధి అధికారులు వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అయితే అది నేటికి పూర్తి కాలేదు. పైపైన మట్టి తోలిచించి, చేతులు దులుపుకొన్నారు. గురుకులంలో క్రీడల్లో రాణించే విద్యార్థినులు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఉపాధి ఏపీవో సుజాతను వివరణ కోరగా విద్యాలయం అధికారిణులతో మాట్లాడి కోర్టు నిర్మాణం పూర్తి చేసేలా తగిన చర్యలు చేపడతామన్నారు.

## ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరం

**కంబదూరు, న్యూస్‌టుడే:** మండలంలోని గుద్దెళ్ల గ్రామం రాధాస్వామి ఆశ్రమంలో నిర్వహించిన సత్సంగం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహారక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాస్వామి పళ్ల మొక్కలు, పూల మొక్కలు పంపిణీ చేశారు. ఇళ్ల ముందు పొలం గట్లపై నీడనిచ్చే మొక్కలను నాటి సంరక్షించాలని భక్తులకు తెలియజేశారు. ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. లయన్

రక్తదాన శిబిరంలో మొక్కను అందుకుంటున్న రాధాస్వామి

ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సభ్యులు తిమ్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, జస్వంత్‌కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదాస జయంతి

**కుందుర్పి, న్యూస్‌టుడే:** కుందుర్పి మండలంలోని యర్రగుంట గ్రామంలో కురుబల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాస జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఊరు వాకిలి వద్ద కనకదాస చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలు, జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి, కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. గొరవయ్యలు ప్రత్యేక నృత్యాలు ప్రదర్శించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

విద్యార్థులతో గురువు వెంకట

## యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** అనంతపురంలోని పీవీకేకే కళాశాలలో ఈనెల 12 నుంచి 14 వరకు యోగాసన భారత్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ యోగాసన ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు యోగా గురువు వెంకట ఆదివారం పేర్కొన్నారు. ఫార్వర్డ్ బెండింగ్ యోగాసనలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భరణి తృతీయ, రిథమిక్ విభాగంలో ఎస్కే ఉన్నత పాఠశాలకు చెందిన గిరిధర్ తృతీయ, లెగ్ బ్యాలెన్స్ విభాగంలో చిన్నహోతూరు ఉన్నత పాఠశాలకు చెందిన నవీన్ తృతీయ, మోకా చరణ్, తలారి సంతోష్ రిథమిక్ బృంద విభాగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. వారిని అధికారులు ప్రశంసా పత్రాలతో అభినందినట్లు వివరించారు.

## కాలువ ఇలా.. మురుగు పారేదెలా?

**రాయదుర్గం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల వసతి గృహం వద్ద మురుగునీటి కాలువ అధ్వానంగా తయారయ్యింది. కాలవలో పూడికతో పాటు ముళ్ళచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి కావలను కమ్మేశాయి. దీంతో మురుగు సవ్యంగా పారక దుర్గంధంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి వేళల్లో దోమలు విపరీతంగా వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుభ్రం చేయాలని హాస్టల్ వార్డన్ సత్యనారాయణ ఇటీవల మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డికి వినతి పత్రాన్నిచ్చినా స్పందన కరవైంది. ఇప్పటికైనా కాలవ శుభ్రతకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలతో మూసుకుపోయిన కాలువ

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

**రాయదుర్గం గ్రామీణం:** మండలంలోని వేపరాళ్ల గ్రామానికి చెందిన ప్రేమకుమార్ (19) ఒక అమ్మాయిని కొన్ని రోజులుగా ప్రేమించేవాడు. ఆమె కులం వేరే కావడంతో పెద్దలు అంగీకరించలేదు. దీంతో నాలుగు రోజుల క్రితం రసాయన మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. కుటుంబసభ్యులు గమనించి రాయదుర్గం, అనంతపురం, బెంగళూరులలో చికిత్సలు చేయించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో..

**క**ళ్యాణదుర్గం పట్టణంలోని రాజీవ్ సర్కిల్ నిత్యం రద్దీగా ఉంటుంది. కొన్నిసార్లు వాహనాలు ఒకేసారి పలు వైపుల నుంచి వస్తుండటంతో ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియక ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో ఆటోలు, ద్విచక్రవాహనాదారులు ఇష్టానుసారంగా వస్తుంటారు. పాదచారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురి కావాల్సిందే. ట్రాఫిక్‌ను నియంత్రించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

## నీటివృథా.. అధికారులకు పట్టదా!

**మం**డలంలోని దర్గాహొన్నూరు-బిదురుకుంతం గ్రామాల మధ్యన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైపులైన్‌కు అమర్చి ఎయిర్ వాల్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా వెళ్తోంది. నెల రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం, కల్‌హోళ, తారకాపురం గ్రామాలకు తాగునీరు అందించే పైప్‌లైన్ లీకేజీ అవుతుండటంతో శివారు గ్రామాలు, కాలనీలకు తాగునీరు అందడంలేదు. ఈ విషయమై శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఏఈఈ దీపికను వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు
- **న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**

## రహదారికి మరమ్మతు చేయరూ..

**రా**యదుర్గం- కణేకల్లు ర.భ ప్రధాన రహదారిలోని కొంతానపల్లి గ్రామ సమీపంలో రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాయదుర్గం పట్టణానికి తాగునీరందించే ప్రధాన పైపు పగిలిపోవడంతో నీరంతా రహదారిలోకి రావడంతో దెబ్బతినింది. ఫలితంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, రాయదుర్గం గ్రామీణం**

## పచ్చదనం.. ఆకర్షణీయం

**శె**ట్టూరు మండలం కనుకూరు గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లతో పందిరేసినట్లు ఏపుగా పెరిగి చూపరులను ఆహ్లాద పరుస్తున్నాయి. పదేళ్ల క్రితం కిలో మీటరు వరకు ఆర్డీటీ సంస్థ నాటిన సుబాబుల్ చెట్లు నేడు వృక్షాలుగా పెరిగి నీడను ఇస్తున్నాయి. వేసవి కాలంలో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, రైతులు, బాటసారులకు ఆహ్లాదం పొందడమే గాక నీడ కింద కొంతసేపు సేద తీరి వెళుతుంటారు.
- **న్యూస్‌టుడే, శెట్టూరు**

## మనిషిని సన్మార్గంలో నడిపేదే మతం : మంత్రి

**ఉరవకొండ, న్యూస్‌టుడే:** మనిషిని సన్మార్గంలో నడుపుతూ, ప్రతి ఒక్కరితో కలిసి మంచి విధానంలో వెళ్లమని, ఎలా జీవించాలో సూచించేదే మతమని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. అన్ని మతాల వెనుక ఉన్న అర్థం కూడా అదేనన్నారు. ఉరవకొండలో రూ.1.72 కోట్లతో నిర్మించిన సీఎస్ఐ చర్చిని ఆదివారం సాయంత్రం ఆయన రాయలసీమ బిషప్ వరప్రసాద్ దంపతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రార్థనలకు వచ్చే వారు విశ్వాసం, ప్రేమను మరింత మందితో పంచుకుని మంచి సమాజాన్ని నిర్మించాలని కోరారు. బిషప్ మాట్లాడుతూ దేవుడు ఒక్కడేనని, నమ్మకాలు, సంప్రదాయాలు, ఆచారాలు, నాగరికత, సంస్కృతికి అనుగుణంగా ఆయన్ను కొలుస్తారన్నారు. మతాల పేరిట ద్వేషం, హింస చోటు చేసుకుంటుందని, అది సరైనది కాదన్నారు. అంతకు ముందు జరిగిన ప్రార్థనల్లో వైకాపా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ప్రమీళజోసఫ్, నిర్మాణ కమిటీ ప్రతినిధులు షాహిన్, పీఆర్ భాస్కర్, డేవిడ్, సాకే భాస్కర్, ఏపీఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చర్చిని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, బిషప్ వరప్రసాద్

## గుంతల రోడ్డుకు మహర్దశ

**డి.హీరేహాళ్, న్యూస్‌టుడే:** డి.హీరేహాళ్ మండలంలోని మురడి-తమ్మేపల్లి ప్రధాన రహదారికి అధికారులు, ప్రజాప్రతినిధులు నూతనంగా తారురోడ్డు వేయించారు. గతంలో ఈ రోడ్డుపై గుంతలు పడి, రాళ్లు తేలి ప్రయాణానికి చాలా ఇబ్బందికరంగా ఉండేది. నెల రోజుల కిందట కొత్తగా తారురోడ్డు వేయడంతో గుంతల రోడ్డుకు మహర్దశ కలిగింది. ఇలా దెబ్బతిన్న రోడ్డును పూర్తిగా తొలగించి తారు వేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతోందని వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

నూతనంగా వేసిన తర్వాత రోడ్డు

## ఇరువర్గాల ఘర్షణ

**వజ్రకరూరు:** వజ్రకరూరులోని ఎస్సీ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాత కక్షల కారణంగా ఒక వర్గానికి చెందిన యేసన్న, సురేంద్ర, శరత్, తేజబాబు, మరో వర్గానికి చెందిన నల్లబోతుల శాంతప్ప, హేమలత, సుబ్బమ్మ, విక్రమ్ శనివారం ఘర్షణ పడి కొట్టుకోగా గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగస్వామి పేర్కొన్నారు.

## మట్టి దిమ్మెను ఢీకొని ఇద్దరికి గాయాలు

**విడపనకల్లు, న్యూస్‌టుడే:** కర్ణాటక రాష్ట్రం కొప్పలకు చెందిన ఇద్దరు వ్యక్తులు బళ్లారి వైపు నుంచి గుంతకల్లు వైపు ద్విచక్రవాహనంలో వెళ్తూ మండలంలోని పెంచులపాడు వద్ద మట్టి దిమ్మెను ఢీకొన్నారు. ఇద్దరు అపస్మారకస్థితిలో పడిపోయారు. స్థానికులు అత్యవసర వాహనానికి సమాచారం ఇచ్చారు. ఇద్దరిని గుంతకల్లు అసుపత్రికి తరలించారు. విడపనకల్లు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## వైద్యసేవలు కష్టమే

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకే వైద్యురాలు

**కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే:** కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు ఒక్కరే ఉండటంతో రోగులకు వైద్యసేవలు అందడం లేదు. కూడేరు జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉంటుంది. ఈ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా 30 వేల జనాభా ఉంది. పీహెచ్‌సీకి రోజు 120 మందికిపైగా రోగులు ఓపీ సేవలకు వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాలి. గత 8 నెలలుగా ఒకరే ఉంటున్నారు. ఆ ఒక్కరూ ఓపీ సేవలతో పాటు 104, ఇతర సమావేశాలు, మెరుగైన వైద్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఆసుపత్రుల సందర్శనకు వెళ్లాల్సి ఉంది. వైద్యురాలు అందుబాటులో లేనప్పుడు ఓపీ సేవలు ఉండవు. రోగులకు సిబ్బందే వైద్యం చేసి పంపుతున్నారు. కొన్ని గ్రామాలు పీహెచ్‌సీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడ నుంచి వ్యయప్రయాసాలతో ఆసుపత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేక వారు పడే బాధలు వర్ణనాతీతం.

వైద్యురాలు లేకపోవడంతో ఫార్మసీలో మందులు తీసుకుంటున్న వృద్ధురాలు

### పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు

పీహెచ్‌సీలో మరో డాక్టర్‌ను నియమించే దిశగా జిల్లా ఉన్నతాధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. కొన్నాళ్లు ఇతర చోట్ల నుంచి డాక్టర్‌ను రప్పించి మమ అనిపించారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి మరో డాక్టర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై డీఎంహెచ్‌వో ఈబీ దేవి మాట్లాడుతూ మరో డాక్టర్ నియామకం దిశగా కలెక్టర్‌కు ప్రతిపాదించాము. త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తి కావడానికి అవకాశం ఉందని తెలిపారు.

(c) eenadu

# గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

## బెరాకా చర్చి నూతన కార్యవర్గం ఎంపిక

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రిలోని సంజీవనగర్‌లోని బెరాకా చర్చి నూతన వర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు లీగల్ రిప్రజెంటేటివ్ రాగి వీరాచారి మాట్లాడుతూ కొన్నాళ్లుగా కార్యవర్గ ఎంపికపై చర్చిలో వివాదాలు జరుగుతుండేవని తెలిపారు. ఈ విషయంపై సొసైటీ కలగజేసుకుని సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. బెరాకా చర్చి పాస్టర్‌గా డేవిడ్ వరప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎ.బాబు, డి.కుమార్, రాజేష్, మల్లయ్య, కంబగిరిస్వామి, భాస్కర్, మహేశ్వరరెడ్డిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన హూబ్రోను సొసైటీ ప్రతినిధులు టైటస్, రవి తిమోతి, ఇమ్మానియల్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

అలంకరణలో మూలవిరాట్

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లు పట్టణం కసాపురం రహదారి పక్కన ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పడిపూజ కార్యక్రమం జరిగింది. మాలధారులు అయ్యప్పస్వామి మూలవిరాట్‌ను అందంగా అలంకరించారు. శబరిమలైలో మాదిరి ఆలయంలో 18 మెట్లను ఏర్పాటు చేశారు. మాలధారులు అయ్యప్పస్వామి భక్తి గీతాలను ఆలాపించారు. భక్తులు పూజలు చేశారు. వేదపండితుడు మురళీకృష్ణ వేద మంత్రాలను పఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

**సమస్య:** గుంతకల్లులో బెంచికోట్టాలకు వెళ్లే దారిలో బెయిర్బాల్ చర్చి దగ్గర ఉండే వీధిలో కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడి మురుగు ముందుకు కదలడం లేదు. **- శేఖర్.**

**సమాధానం:** పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలో వ్యర్థాలను తొలగిస్తాం.
**-వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
—న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

**సమస్య:** బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో బస్టాండు ఎదురుగా ఉన్న మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి. కాలువల్లో పూడిక తీయించాలి. **-కొండన్న, బుక్కరాయసముద్రం**

**సమాధానం:** పంచాయతీ సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి** -న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

**సమస్య:** తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్ సచివాలయం వీధిలో పలుచోట్ల వ్యర్థాలు పడేస్తున్నారు. రోడ్డుపైనే ఉన్న విద్యుత్తు నియంత్రిక, వీధి ప్రారంభంలో చెత్త గుట్ట పేరుకుపోతోంది. **- బాబావృధ్కన్, స్థానికుడు**

**సమాధానం:** వెంటనే ఆయా కాలనీలోని చెత్తను శుభ్రం చేయిస్తాం.
**- నాగేంద్రప్రసాద్, ఏఈ**
-న్యూస్‌టుడే, తాడిపత్రి

## సమస్యలు బోలెడు.. పట్టించుకునే దిక్కులేదు!

ఇరువైపులా కంపచెట్లతో మట్టిరోడ్డు

| | |
|---|---|
| కాలనీలు | : అశోక్‌నగర్, రాజేంద్రనగర్ |
| ఇళ్లు | : 1500 |
| జనాభా | : 8000 |

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లులో మున్సిపల్ రికార్డుల్లో అశోక్‌నగర్, రాజేంద్రనగర్‌లు నమోదయ్యాయి. అయినా ఆయా కాలనీ వాసులకు సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కాలనీల్లో సమస్యలను పరిష్కరించి తమను ఆదుకోవాలని కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

### క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

అశోక్‌నగర్ నుంచి పట్టణానికి వెళ్లాలంటే రెండు కి.మీలు దూరం ఉంది. వెళ్లే దారిలో మురుగునీరు, కంపచెట్లు ఉన్నాయి. కాలనీ వాసులు రోజూ కంకరరోడ్డు పైనే ప్రయాణం సాగిస్తున్నారు. అలాగే విద్యుత్తు స్తంభాలు ఉన్నా వాటికి వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళ ముళ్లపొదల్లో నుంచి పాములు రోడ్డుపైకి వస్తున్నాయి. కాలనీలో కొన్ని చోట్ల సిమెంటు రోడ్డు లేవు. ఉన్న రోడ్లు పరిశుభ్రంగా లేవు. మురుగు కాలువలు నిర్మించలేదు.

● రాజేంద్రనగర్ కాలనీకి ఆనుకుని గుంతలలో మురుగు ఉండటంతో దోమలకు నివాస స్థలంగా మరింది. అలాగే రోడ్డుపక్కన ఉండే ప్రధాన మురుగు కాలువ పాడైపోయింది. పార్కును నిర్వహించే వారు లేకపోవడంతో బోసిపోయింది. క్రీడా పరికరాలు పాడైపోయాయి. సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

### పరిష్కార చర్యలు చేపడతాం

అశోక్‌నగర్, రాజేంద్రనగర్‌లోని సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. కాలనీకి వీధి దీపాలను ఏర్పాటు చేస్తాం. రోడ్లు, మురుగు కాలువలను నిర్మించడానికి కొత్త ప్రణాళికలో చేర్చాం. నిధులు విడుదలైన వెంటనే పనులను ప్రారంభిస్తాం. **- హరికృష్ణ, ఏఈ**

### నిరుపయోగంగా నిర్మాణాలు..

అశోక్ నగర్ కాలనీలో 50 మందికి పైన విద్యార్థులున్నారు. ఇక్కడ పాఠశాలను ప్రారంభించడానికి గదులు నిర్మించారు, కానీ పాఠశాలను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు 3 కి.మీలకు పైగా దూరంలో ఉండే పాఠశాలలకు వెళుతున్నారు. చర్మాలను శుభ్రం చేసి రంగులు వేసే ప్రభుత్వానికి చెందిన ట్యానింగ్ కేంద్రం చాలా ఏళ్ల కిందటే మూలపడింది. తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌లో కాలినడక వంతెనను నిర్మించారు, కానీ ఆనుకుని ఉన్న కాలనీ ప్రజలు వెళ్లడానికి రైల్వే అధికారులు దాన్ని పొడిగించలేదు. ఫలితంగా ప్రజలు నాలుగు కిలోమీటర్లు చుట్టేసి పట్టణానికి వెళుతున్నారు.

## మౌలిక వసతులకు మోక్షమెన్నడో?

జగనన్న కాలనీలో రహదారులను కమ్మేసిన జమ్మిగడ్డి

**పామిడి, న్యూస్‌టుడే:** పామిడి మేజర్ గ్రామ పంచాయతీలో జగనన్న కాలనీవాసులకు అవస్థలు తప్పడం లేదు. వెళ్లేందుకు రహదారి లేదు. మట్టిదారికి ఇరువైపుల జమ్ము, కంపచెట్లు అలుముకున్నాయి. శివారు ప్రాంతంలో ఉండటంతో వీధిదీపాలు సరిగా లేక రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా కూడా లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## కుక్కల బెడదతో ప్రజల బెంబేలు

**తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే:** తాడిపత్రి పట్టణంలో కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సీపీఐ కాలనీ, శివాలయం వీధి, పోలీసు కాలనీల్లో కుక్కలు ప్రధాన రహదారుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయని దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కుక్కల బారి నుంచి రక్షించాలని కోరుతున్నారు.

శివాలయానికి వెళ్లే దారిలో కుక్కల సంచారం

## 'హమాలీలకు తక్కువ కూలి చెల్లిస్తున్నారు'

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** గుంతకల్లు డివిజన్‌లోని రైల్వేకు చెందిన గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలకు తక్కువ కూలి చెల్లిస్తున్నారని భారతీయ రైల్వే మాల్‌గోడౌన్ దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాజేంద్ర అన్నారు. ఆయన సంఘం నాయకులతో కలిసి ఆదివారం పదముగ గుంతకల్లు వద్దనున్న గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వేలో పని చేస్తున్న హమాలీలకు న్యాయమైన కూలీలు అందడంలేదని చెప్పారు. ఒక బస్తాకు రూ.4లు కూలి చెల్లిస్తున్నారని ఆయన చెప్పారు. హైదరాబాదు, సికింద్రాబాదుల్లో బస్తాకు ఏడు రూపాయలు చెల్లిస్తున్నారని వివరించారు. కార్మికులకు వసతి గృహాలు, మరుగుదొడ్లు నిర్మించాలని, మెడికల్ కిట్లను సరఫరా చేయాలని ఆయన కోరారు. రైల్వే మాల్‌గోడౌన్ కార్మిక సంఘం జోనల్ అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైల్వే మాల్‌గోడౌన్ కార్మిక సంఘం సికింద్రాబాద్ జోనల్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర, పక్కన అధ్యక్షురాలు పద్మావతి

## సనాతన ధర్మాన్ని పాటిద్దాం

**గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే :** సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని శ్రీ జగద్గురు శంకరాచార్య, డాక్టర్ యోగశ్రీ అన్నారు. మండల పరిధిలోని కేశవపురం, గార్లదిన్నె గ్రామాల్లో ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. కేశవపురంలో జగద్గురు శంకరాచార్య, గార్లదిన్నెలో డాక్టర్ యోగశ్రీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గ్రామ పురవీధుల్లో జై శ్రీరామ్ నినాదంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హిందూ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి మనదేశాన్ని విశ్వగురువుగా నిర్మించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున హిందువులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న శంకరాచార్య

## రైల్వే మోరీలో వాహనాల రద్దీ

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులో కసాపురం రోడ్డులో రైల్వే మోరీ చిన్నదిగా ఉండటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోజురోజుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుండటంతో రైల్వే బ్రిడ్జి వలన వాహన చోదకులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం, ఆదివారం, మంగళవారాల్లో మరింత రద్దీ అవుతుంది. దీంతో వాహనాలు బారులు తీరుతుంటాయి. బ్రిడ్జిను వెడల్పు చేయడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కష్టంగా వెళ్తున్న వాహనాలు

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే :** బుక్కరాయసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సుదర్శన్ గాయపడ్డాడు. బుక్కరాయసముద్రం ఎస్సీ కాలనీకి చెందిన నరసయ్య కుమారుడు సుదర్శన్ అనంతపురం నుంచి ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనంలో ఎస్సీ కాలనీకి వెళ్తుండగా నార్పల క్రాసింగ్ వద్ద నార్పలకు వెళ్లే బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు సుదర్శన్‌కు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం దెబ్బతింది. దీంతో స్థానికులు యువకుడిని చికిత్స నిమిత్తం అనంతపురం వైద్యశాలకు తరలించారు. ఈమేరకు బుక్కరాయసముద్రం పోలీసులు విచారణ చేపట్టారు.

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రి మండలంలోని పులిపొద్దుటూరు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు యాడికికి చెందిన వెంకటనారాయణ సొంత పనుల నిమిత్తం తాడిపత్రికి వస్తుండగా గ్రామం సమీపంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. దీంతో వెంకటనారాయణకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించి స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**పామిడి, న్యూస్‌టుడే:** గజరాంపల్లి గ్రామంలో పామిడి శ్రీసర్వతీ విద్యామందిర ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం సప్తశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మయూరి, ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ భారతదేశంలో మహిళల అభ్యున్నతిపై అవగాహన కల్పించారు. సంస్కృతి, సంప్రదాయాల గురించి మహిళలకు వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

## సౌర విద్యుత్తుతో ఆదాయం

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రిలో సౌర విద్యుత్తు ఏర్పాటు చేయడంతో పురపాలికకు ఆదాయం వస్తుందని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నందలపాడులో ఉన్న వాటర్ వర్క్స్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ఆదివారం జేసీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మెగావాట్ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పురపాలిక కార్యాలయం, వాటర్‌వర్క్స్, ఎస్టీపీలు తదితర వాటికి సౌర విద్యుత్తు సరఫరా చేయడానికి వీలుంటుందన్నారు. విద్యుత్తు వినియోగం తగ్గి పురపాలికకు రూ.లక్షల్లో ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం సౌర కంపెనీ వారితో చర్చలు జరిపారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, డీఈ రాంప్రసాద్, ఏఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

## హోరాహోరీగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

**గుంతకల్లు :** ఉపాధ్యాయులు క్రీడాకారులుగా మారి క్రికెట్ ఆడటం చాలా సంతోషంగా ఉందని పట్టణానికి చెందిన విద్యా ప్రబోధిని సంస్థ యజమాని బండారు అనిల్‌కుమార్ అన్నారు. గుంతకల్లు డివిజన్‌లోని పాఠశాలల ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు రెండో రోజైన ఆదివారం ప్రభుత్వ, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలల క్రీడామైదానాల్లో జరిగాయి. పోటీల్లో విడపనకల్లు జట్టుపై గుంతకల్లు జట్టు, గుత్తి జట్టుపై వజ్రకరూరు జట్టు విజయం సాధించాయి. తుది పోటీలను రెండు రోజుల విరామం తరువాత జరపాలని నిర్ణయించినట్లు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. పోటీలను డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, మండల విద్యాశాఖాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు పర్యవేక్షించారు.

## హిందుత్వాన్ని బలోపేతం చేయాలి

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే :** మారుమూల గ్రామాల్లో హిందుత్వాన్ని బలోపేతం చేయాలని ఆచలనంద ఆశ్రమ పీఠాధిపతి విరిజానందస్వామి పేర్కొన్నారు. మండలంలోని దిమ్మగుడిలో విశ్వ హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శివాలయం, ఆంజనేయ, శివాలయాల్లో పూజలు ఆచరించి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ ప్రదర్శన చేపట్టగా రాముడు, లక్ష్మణుడు, పలు వేషధారాణలతో పలువురిని అలరించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామగ్రామాన హిందువులంతా ఏకమై హిందుత్వాన్ని బలపరచాలన్నారు. అనంతరం పలు అంశాలపై సూక్తులను తెలియజేశారు. దిమ్మగుడి గ్రామానికి చెందిన శివరామాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు విరిజానందస్వామిని ఘనంగా సన్మానించారు.

ప్రదర్శనగా వెళ్తున్న విరిజానందస్వామి తదితరులు

## వైభవంగా నల్లలమ్మ జాతర

**శింగనమల, న్యూస్‌టుడే :** శింగనమల మండలంలోని కల్లుమడి గ్రామంలో వెలసిన నల్లలమ్మ జాతర మహోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి పాల్గొని నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషలతో ఉండాలని ప్రత్యేక పుజలు జరిపించారు. గ్రామస్థులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమానికి తెదేపా నాయకులు, శింగనమల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండు శ్రీనివాసులు, మండల కన్వీనర్ గోరంట్ల మారుతీ నాయుడు, న్యాయవాది ఈశ్వర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అమ్మవారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తదితరులు

## బోయరెడ్డిపల్లిలో పోలీసుల నాకాబందీ

**యాడికి, న్యూస్‌టుడే :** యాడికి మండలంలోని బోయరెడ్డిపల్లిలో ఆదివారం వేకువజామున పోలీసులు నాకాబందీ నిర్వహించారు. యాడికి యూపీఎస్ సీఐ ఆర్.శ్రీనివాసులు, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణ, గ్రామీణం, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు ఎస్సైలు గౌస్ మహమ్మద్, ధరణిబాబు, ఆంజనేయులు, నాగేంద్ర ప్రసాద్ సంయుక్తంగా గ్రామంలోని అనుమానితులు, పలువురి ఇళ్లల్లో తనిఖీలు చేశారు. గడ్డి వాములు, పశువుల పాకాల్లో సోదాలు నిర్వహించారు. ఎవరైనా గొడవలు, అల్లర్లకు పాల్పడినా శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.శ్రీనివాసులు హెచ్చరించారు.

గ్రామంలో పర్యటిస్తున్న సీఐ శ్రీనివాసులు, పోలీసు బలగాలు

## అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

**పెద్దవప్పూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వర్థనారాయణ స్వామి, శ్రీచక్రభీమలింగేశ్వర స్వామి వారికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి శూలం విరాళం

**గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే :** కోటంక గ్రామ సమీపంలోని కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కోటంక గ్రామానికి చెందిన శశివర్ధన్, వరలక్ష్మి దంపతులు, కుటుంబసభ్యులు కలిసి ఆదివారం వెండి శూలాన్ని ఆలయ అర్చలు రామాచార్యులకు అందజేశారు. ఈ ఆభరణం 303 గ్రాముల బరువు ఉంటుందన్నారు. దాతలు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అర్చకుడికి వెండి శూలాన్ని అందజేస్తున్న దాతలు

## క్రీడా పరికరాలు ఎక్కడ?

రైల్వేకు చెందిన శాంతినగర్‌లో ఉన్న అంబేడ్కర్ పార్కులోని క్రీడా పరికరాలు అడ్రస్ లేకుండా పోయాయి. పరికరాలు దెబ్బతినగా వాటికి మరమ్మతులు చేయకుండా అధికారులు పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయలేదు. పార్కులో ఒక్క ఊయల మాత్రమే ఉంది. ఫలితంగా పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వాటిని అధికారులు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.
**-న్యూస్‌టుడే, గుంతకల్లు**

## ప్రమాదకరంగా ఫ్యూజులు

తాడిపత్రి పట్టణంలోని శ్రీనివాసపురం కాలనీలో ఎస్ఎస్ఎస్ ఎంఆర్ఎం ఉన్నత పాఠశాల సమీపంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. పాఠశాల సమీపంలో నియంత్రికకు అమర్చిన ఫ్యూజులు తక్కువలో ఎత్తు ఉండి ప్రమాదకరంగా మారాయి. రక్షణగా ఏర్పాటు చేసిన ఫ్యూజు బాక్సు కాలిపోయింది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం**

## గుంతలు.. ప్రయాణానికి ఇబ్బందులు

యాడికి-బుగ్గ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. గుంతలతో రోడ్డు రూపు రేఖలే మారిపోయాయి. ఇటువైపు రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్ల క్రితం కంకరతో మరమ్మత్తులు చేశారు. వేసిన పది రోజులకే తిరిగి కంకర తేలడంతో ప్రయాణం మరింత కష్టంగా మారింది. గుంతలు తప్పించే క్రమంలో వాహన చోదకులు ప్రమాదలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, యాడికి**

## కుండీ నిండినా పట్టదా?

గుత్తిపురపాలికలో పారిశుద్ధ్యం పడకేసింది. పురపాలికలో 25 వార్డులుండగా చెత్తకుండీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఉన్నవేమో తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజలు చెత్తను వాటిలో వేస్తున్నారు. కుండీలు శిథిలమై చెత్త బయటకు పడుతోంది. ప్రతిరోజు పురపాలికలో 15 టన్నుల చెత్తపోగవుతోంది. దీంతో చెత్త సేకరణలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇంటింటి చెత్తసేకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుత్తి**

## సీసీరోడ్లు నిర్మించరూ!

పాతగుంతకల్లులో ఉన్న మంజునాథ్ నగర్, చౌడేశ్వరి కాలనీలు మౌలిక వసతులకు నోచుకోవటం లేదు. సీసీరోడ్లు లేకపోవడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంజునాథ్ నగర్‌లో వీధి దీపాలులేక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

## 'ప్రభుత్వ భూమిని కాపాడాం'

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే :** ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతుంటే పోరాటం చేసి కాపాడామని మాజీ కౌన్సిలర్ రామచంద్ర తెలిపారు. ఆదివారం గుంతకల్లులో అజంతా సర్కిల్‌లో సీఎం చంద్రబాబునాయుడు పాలనా బాగుందని సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక కోటేశ్వరుడు కుటుంబ సభ్యుల పేర్లతో పట్టాలు పొంది షెడ్లు ఎలా నిర్మిస్తాడని ప్రశ్నించాడు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అయినట్లు 'ఈనాడు' దినపత్రికలో రావడంతో భారీ స్పందన లభించిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రామచంద్ర

## పేరుకే అవుటర్ బైపాస్!

☛ ఏడేళ్లుగా నిర్వహణ గాలికి ☛ పల్లెదారి కంటే అధ్వానం

దారిలో భారీగా గుంతలు

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రిలోని అవుటర్ బైపాస్ దుస్థితికి చేరింది. ఐదేళ్లుగా వైకాపా నాయకులు పట్టించుకోకపోవడంతో అడుగుకో గుంత పడింది. భారీ వాహనాలు పట్టణంలోకి రాకూడదని ఆంక్షలు విధించడంతో నిత్యం బైపాస్‌లో వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా పలు గ్రామాల ప్రజలు అదే దారిలోనే పోతుంటారు. గుంతల దారి ఉండటంతో వారు పోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● తాడిపత్రిలోకి భారీ వాహనాలు రాకుండా ఉండాలని 2017లో శ్రీనివాసపురం నుంచి నంద్యాల రోడ్డు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పెన్నానది ఒడ్డున రహదారి నిర్మించారు. అంతేకాకుండా యల్లనూరు రోడ్డు మీదుగా బైపాస్ కూడా నిర్మించడంతో ప్రస్తుతం అక్కడ రెండు వరుసల దారి వేశారు. కానీ పెన్నానది ఒడ్డున ఉన్న రోడ్డును మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇటు అనంతపురం, అటు కడప, నంద్యాల, బుగ్గ, సజ్జలదిన్నె పారిశ్రామి వాడ నుంచి వందల సంఖ్యలో లారీలు అధిక బరువుతో వెళ్తుంటాయి. గుంతల కారణంగా వాహనాలు పోవాలంటే భయంగా ఉందని వాహనదారులు వాపోయారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పెన్నానది ఒడ్డున ఉన్న అవుటర్ బైపాస్‌ను పరిశీలిస్తాం. మున్సిపల్ పరిధిలో ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డును బాగుచేయిస్తాం. అయినా బైపాస్ గురించి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.
**-శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్, తాడిపత్రి**

## పోస్టాఫీసులో ఆధార్ సేవలు

**యాడికి, న్యూస్‌టుడే:** యాడికి పోస్టాఫీసులో నుంచి ఆధార్ సేవలు ప్రారంభించినట్లు పోస్టుమాస్టర్ నాగిరెడ్డి తెలిపారు. ఇంతకు ముందు సాంకేతిక కారణాల వల్ల సేవలు నిలిపేశామని, ప్రస్తుతం మళ్లీ ప్రారంభించామని వెల్లడించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

**బహిరంగ ప్రకటన**

భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (BPCL) సర్వే నెంబర్ 669-B, తాడిపత్రి రూరల్ ఏరియా, గన్నెవారిపల్లి గ్రామ పంచాయతి, తాడిపత్రి మండలం, అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో 629 చదరపు గజాలు విస్తీర్ణంలో రీటైల్ అవుట్‌లెట్‌ను స్థాపించుటకు ప్రతిపాదిస్తోంది. ఈ స్థలం పడమర R&B పుట్లూరు రోడ్, తూర్పున వి.క్రిష్ణరాఘవేంద్రరెడ్డి విక్రయించిన బయలు, ఉత్తరం 30 అడుగుల రస్తా, దక్షిణం ఎస్.రంగనాథరెడ్డి. ఈ భూమి వి.ఇందిరమ్మ భర్త వి.శ్రీనివాసరెడ్డి, తాడిపత్రి టౌన్, తాడిపత్రి మండలం, అనంతపురము జిల్లా నుండి లీజు పద్ధతిలో తీసుకోబడుతుంది. ఎవరి వ్యక్తి లేదా సంస్థ (సంఘటిత లేదా అసంఘటిత) ఈ భూమిపై ఏమైనా హక్కులు లేదా హక్కు పత్రాలు/రుజువులు సమర్పించి నేటి తేది నుండి 7 రోజులలోపల క్రింద ఇవ్వబడిన చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరబడుచున్నది. తేది: 15-12-2025

సంప్రదించవలసిన వారు

టెరిటరీ మేనేజర్ (రీటైల్), నెల్లూరు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
26-3/171-1, బి.వి.నగర్, మినీ బైపాస్ రోడ్, నెల్లూరు, SPSR నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 524 004.

(c) eenadu

# అనంతపురం

● అనంతపురం ● రాప్తాడు

## సమాజాన్ని ప్రశ్నించేలా సాహిత్యం ఉండాలి

**అనంత సాంస్కృతికం:** స్థానిక డ్రామా సమావేశ మందిరంలో ఆదివారం రాయపాటి శివయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కవి దాదా ఖలందర్ రాసిన 'మౌనం నా మతం కాదు' పుస్తకావిష్కరణ జరిగింది. కవి తల్లిదండ్రులు మహమ్మద్ షరీఫ్, బానూబీ ఆవిష్కరించిన ఈ పుస్తకం గురించి వరంగల్ వాసి, కవి అన్వర్ మాట్లాడుతూ.. పదునైన భావుకత, సమాజ హితాన్ని కోరేతత్వం వివరించిందని పేర్కొన్నారు. సమాజం పట్ల అమితమైన అభిమానాన్ని ఏర్పరచుకున్నప్పుడే కవి సమాజం పట్ల చక్కగా నిర్వర్తిస్తూ ఉంటాడని అభిప్రాయపడ్డారు. ఇంకా ప్రముఖ రచయితలు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, శాంతి నారాయణ, టీవీ రెడ్డి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రాజారాం, అంకే శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.

## భక్తిశ్రద్ధలతో లలితాపారాయణం

**అనంత సాంస్కృతికం:** స్థానిక చెరువుకట్ట శిరిడీసాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీలలిత పరమేశ్వరీదేవి కోటి కుంకుమార్చన ఘనంగా జరిగింది. నెల్లూరు జిల్లా పెంచలకోన మణిద్వీప మహాసంస్థాన వ్యవస్థాపకురాలు విజయేశ్వరిదేవి మాత ఆదేశాల మేరకు లలితా సహస్రనామ కోటి కుంకుమార్చన నిర్వహించారు. వెయ్యి నామాల బీజాక్షరాలతో శాస్త్రోక్తంగా జరిపారు. శిరిడీ సాయిబాబా మందిరం, మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం అనంతపురం శాఖ సంయుక్త నిర్వహణలో ఆశ్రమం నిర్వాహకురాలు అరవేటి శ్యామల పర్యవేక్షించారు. నేటివరకు గీతామందిరం, టీటీడీ కల్యాణమండపం, భైరవనగర్, ఆదిమూర్తి నగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించామని, పాల్గొన్న ప్రతి వ్యక్తితో వెయ్యి చొప్పున బీజాక్షరాలు పలికించామని, ఇప్పటివరకు 22 లక్షలసార్లు పైగా అమ్మవారి నామస్మరణ చేశామన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా**

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

**సమస్య:** నగరంలోని గుల్జార్‌పేట మ్యాక్స్ వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో చెత్త అంతా పడేస్తున్నారు. **- నాగరాజు**
**సమాధానం:** పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం.
**సమస్య:** బుడ్డప్పనగర్ మైనార్టీ సంక్షేమ కార్యాలయం కింది భాగాన చెట్టు కొమ్మలు కుప్పగా వేసి వదిలేశారు. **-శ్రీనివాసులు**
**సమాధానం:** వెంటనే కొమ్మలు తరలిస్తాం.
**(పై ప్రశ్నలకు ఈఈ షాకీర్ సమాధానాలు ఇచ్చారు.) - న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

### తెరపై ఈనాడు

**అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే:** గంగ, గౌరి, గాయత్రి, గౌతమి, త్రివేణి, నీలిమ, ఎస్వీ సినిమా, శాంతి : **అఖండ-2..** తరంగిణి : **మొగ్లీ,** తేజస్విని : **డ్రైవ్,** సుధా : **ఆంధ్రాకింగ్ తాలూకా.**

### నగరంలో నేడు

**కమలానగర్:** జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయాల్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల నిర్వహణ.
● మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని నేడు వైకాపా కార్యాలయం నుంచి టవర్‌క్లాక్, పాతూరు మీదగా బుక్కరాయసముద్రం వరకు వైకాపా నాయకుల బైక్ ర్యాలీ

### నేటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**అనంత సాంస్కృతికం:** నగరంలోని మొదటి రోడ్డు శివాలయంలో జరుగుతున్న శ్రీఅయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున 4.30కు ఆరాట్టు (చక్ర స్నానం) ఉత్సవం జరుగుతుందని నిర్వాహకులు గంగన లక్ష్మీరెడ్డి, కొర్రపాటి శ్రీనివాసులు తెలిపారు. పీవీ మాధవీలత, శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి అన్నదానసమితి సంయుక్త దాతలుగా వ్యవహరించే మహాపడి పూజ సాయంత్రం 7 గంటలకు జరుగుతుందన్నారు.
● స్థానిక హెచ్ఎల్సీ కాలనీ శ్రీధర్మశాస్త్రా అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటలకు స్వామివారికి పుష్పాభిషేకం జరుగుతుందని గురుస్వామి లింగమయ్య స్వామి తెలిపారు.

## ప్రచార పిచ్చి పరాకాష్ఠకు చేరితే బాదుడే!

● **హోర్డింగులు, ఫ్లెక్సీలు, లాలిపప్స్ ఫీజులకు సరికొత్త మార్గదర్శకాలు**

**అశోక్‌నగర్, న్యూస్‌టుడే:** అనంతపురం నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు పెడతామంటే కుదరదు. ఏవిధమైన అనుమతులు లేకుండా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు భారీగా రుసుములు వసూలు చేస్తారు. నగరపాలక సంస్థకు ఏవిధమైన ఫీజులు చెల్లించకుండా ఏర్పాటు చేస్తే అనుమతి ఇవ్వరు. కచ్చితంగా ముందుగా పట్టణ ప్రణాళికతో అనుమతి పొంది నగరపాలక కార్యాలయంలోని షరాబు వద్ద నగదు రూపేణా చలానా చెల్లించి లైసెన్సు ఉంటేనే ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.

● నగరంలో కొత్త ఉత్తర్వుల ప్రకారం నిర్దేశించిన రుసుములు నిర్ణయించిన అనంతరమే హోర్డింగ్‌లు, డిస్‌ప్లే డివైజ్‌స్, లాలిపప్స్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అడ్వర్టైజ్‌మెంట్ విధానంలో పలు సవరణలు చేసి ఇటీవల కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఎలా పడితే అలా, ప్రమాదకర ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తే నిర్భయంతరంగా తొలగించే అధికారం నగరపాలక సంస్థకు ఉంటుంది.

**ఎగ్గొట్టడానికి వీలులేదిక**

● ఆంధ్రప్రదేశ్ 'డిస్‌ప్లే డివైజస్-2025 రుసుం' పేరుతో గతంలో ఉన్న నిబంధనలు మార్పు చేయడంతో రుసుములు ఎగ్గొట్టడానికి వీలుండదు.
● ప్రతి మూడేళ్లకు ఓసారి సంబంధిత ఏజెన్సీలు లైసెన్సును రెన్యువల్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. అనంతపురం నగరంలో లైసెన్సు రుసుం వ్యక్తిగత డిస్‌ప్లేయర్ అయితే రూ.20 వేలు, ప్రొఫెషనల్స్ అయితే రూ.60 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఆర్థిక సంవత్సరానికి 10శాతం రుసుం పెంచుతారు.

ధరలు (రూ.లలో) ఇలా.. (పొడవు, ఎత్తు, వెడల్పు ఆధారంగా ఫీజులు మారుతాయి)

| | |
|---|---|
| యూనిపోల్స్ | 8 వేలు |
| హోర్డింగ్స్ | 4 వేలు |
| బస్సులు, టాక్సీలు, | |
| ఆటోల్లో ప్రచారం | 1500 |
| తాత్కాలిక బోర్డు | 300 |
| సైను బోర్డులు, లాలిపప్స్ | 2000 |
| సెంట్రల్ మీడియా డివైజస్ | 2000 |
| దుకాణాలకు శాశ్వతం | 800 |
| తాత్కాలికంగా దుకాణాలు | 150 |

**పడిపోయే స్థితిలో**



శ్రీకంఠం కూడలి-గౌరి థియేటర్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డులో భారీ భవంతి ఉంది. పైభాగాన ఇనుప ఫ్రేం ఎప్పుడు ఊడి ఎవరి మీద పడుతుందో అన్న పరిస్థితి ఉంది. పూర్తిగా పడిపోయే స్థితిలో ఉంది. ఏ సమయంలో అయినా రద్దీగా ఉండే ప్రదేశంలో వాహనదారుల మీద పడే ప్రమాదం ఉంది. ఇటీవల బళ్లారిబైపాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేం గాలికి ఇద్దరు వ్యక్తుల మీద పడి గాయాలయ్యాయి. అయినా పట్టణ ప్రణాళిక ప్రమాదకర వాటిని గుర్తించి చర్యలు తీసుకోలేదు.

**రోడ్డుకు అడ్డంగా**

త్రివేణి వంతెన నుంచి సూర్యనగర్ కూడలి వరకు లాలిపప్స్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు సమీపంగా ఉండటంతో ఏమాత్రం అప్రమత్తంగా లేకుంటే అవి తగిలే పరిస్థితి నెలకొంది. కొన్నింటికి రేకు ఊడిపోయి రోడ్డు మీదకు రావడంతో వాటిని రాసుకొని వెళితే కింద పడే ప్రమాదం ఉంది.

## విద్యార్థి చదువుకు చేయూత

తాడిపత్రికి చెందిన విద్యార్థిని స్పందన బీటెక్ చదువుతోంది. కూలి పనులు చేసుకునే కుటుంబం కావటంతో ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేయాలని భావించింది. ఈ విషయం తెలుసుకున్న నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మల మురళి, దాత కుసుమ, ఎయిమ్ ఫర్ సేవా సంస్థ నిర్వాహకులు చక్రపాణి కలిసి ఆదివారం ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో విద్యార్థి స్పందనకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.
**- న్యూస్‌టుడే, కమలానగర్**

## గుండె శస్త్రచికిత్సకు రూ.లక్ష 50 వేలు సాయం

**కమలానగర్, న్యూస్‌టుడే :** గుండె ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం అవసరమైన ఆటో డ్రైవర్ సాదిక్‌వలికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి రూ.లక్షా 50 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతపురంలోని హమాలికాలనీ చెందిన 20 ఏళ్ల సాదిక్ వలికి చిన్నప్పుడు తన తండ్రి మృతి చెందాడు. తల్లి జుబేదాకి బీపీ, షుగర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతోంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న సాదిక్‌వలికి గుండెలో సమస్య వచ్చింది. దీంతో బెంగళూరులోని నారాయణ హృదయాలయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ అవసరమని వైద్యులు తెలపటంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాదిక్‌వలి పరిస్థితి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించి ఆదివారం రూ.లక్షా 50 వేలు నగదును సాయం అందించారు.

## సందడిగా ముగిసిన ఉమర్ ఫారూక్ సున్ని సమావేశం

మాట్లాడుతున్న డా. తౌసిఫ్ రజా సాహెబ్

**అనంత సాంస్కృతికం:** స్థానిక రెండో రోడ్డు బహావుద్దీన్ మసీద్ ఆవరణలో ఆదివారం సాయంత్రం తెహరికె ఫైజానే ఉమర్ ఫారూక్ వారి సున్ని సమావేశం ఘనంగా జరిగింది. కర్ణాటక హుక్కేరి వాసి హజరత్ ఆన్ జార్ ఖాన్‌సాహెబ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో భార్యాభర్తల మధ్య సరైన ఒడంబడిక లేక కుటుంబాల్లో ప్రశాంతత కరవవుతోందని, ప్రేమానురాగాలతో తల్లిదండ్రులు ఏవిధంగా వ్యవహరించాలో సాహస బాలల జీవితాన్ని గమనించాలన్నారు. మధ్యప్రదేశ్ జబల్‌పూర్ అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ ముస్లింలు ఉన్నత చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. డా. తౌసిఫ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో ఓర్పు, సహనం, కరవయ్యాయని వాటిని అధిగమించిన రోజే ఉన్నత శిఖరాలను అధిగమించగలమని సూచించారు.

## డ్యాన్స్‌స్పోర్ట్స్‌లో భవ్యశ్రీ ప్రతిభ

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** అనంత జిల్లా డ్యాన్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2025లో భవ్యశ్రీ ప్రతిభ చాటుకుంది. ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. భవ్యశ్రీ నృత్యప్రతిభతో ఆకట్టుకుంది. వివిధ కేటగిరీల్లో ఆ విద్యార్థినికి బహుమతులు దక్కాయి.

## నేడు వైకాపా ద్విచక్రవాహన ర్యాలీ

**అనంత నగరపాలక:** మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు నగరంలో ద్విచక్రవాహన ర్యాలీ ఉంటుందని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతులతో జిల్లా కార్యాలయం నుంచి గడియార స్తంభం, సప్తగిరి కూడలి, పాతూరు మార్కెట్ మీదుగా బుక్కరాయసముద్రం వరకు ర్యాలీ సాగుతుందన్నారు.

## ఫిజియోథెరపీతో ఉజ్వల భవిష్యత్తు

ప్రసంగిస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి చంద్రశేఖర్

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే:** ఫిజియో థెరపీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అనంత నగరంలోని కస్తూరి ఫిజియో థెరపీ కళాశాల స్నాతకోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. రోగాలు నయం చేయంలో ఫిజియోథెరపీ పాత్ర ఎంతో కీలకమన్నారు. అత్యంత వేగవంతంగా జబ్బులు నయం చేయడంలో ఫిజియోథెరపీ ప్రధానపాత్ర పోషిస్తోందన్నారు. వ్యాధిగ్రస్తులను ఉపశమనం కలిగించడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. వైద్యవృత్తిలో ధనార్జన కంటే ప్రజల హృదయాలను గెలవాలన్నారు. వృత్తిలో నైతిక విలువలు, అంకితభావంతో సేవలు అందించడం ముఖ్యమన్నారు. వైద్య పరిశోధనలకు విశ్వవిద్యాలయం నిధులు కేటాయిస్తోందన్నారు. అనంతరం ఫిజియోథెరపి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపల్ ప్రహ్లాద, యాజమాన్యం సుదర్శనగర్, చంద్రశేఖర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

## విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ విజేత రైల్వే ఇంజినీర్స్ జట్టు

ట్రోఫీ అందుకుంటున్న జట్టు సభ్యులు

**అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే:** విన్సెంట్ ఫెర్రర్ స్మారక జిల్లా స్థాయి ఉద్యోగుల క్రికెట్ ట్రోఫీని గుంతకల్లు రైల్వే ఇంజినీర్ల జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం అనంతపురం క్రికెట్ మైదానంలో జరిగిన ఫైనల్ పోటీలో రైల్వే జట్టు 8 పరుగుల తేడాతో అనంతపురం పోలీస్ జట్టుపై పోరాడి నెగ్గింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న రైల్వే జట్టు ఓపెనర్లు తేజ (54), నాగరాజు (43) బ్యాటింగ్ కదంతొక్కడంతో 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ఓపెనర్లు శుభారంభం చేయడంతో రమేష్ (34), శివ (25) చివర్లో విజృంభించడంతో భారీస్కోరు దక్కింది. పోలీస్ జట్టు బౌలర్లలో షఫీ 3 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేశాడు. అనంతరం 180 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన పోలీస్ జట్టు గెలుపు వాకిట బోర్లాపడింది. 19.3 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. ఈ జట్టు బ్యాటర్లు వర్ధన్ (77), ప్రభు (42)లు చివరి వరకు పోరాడినా ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు. రైల్వే జట్టులోని బౌలర్లు శ్రీధర్, అశోక్, రమేష్, శివలు చెరో రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టు ఆశలపై నీళ్లు చల్లారు. కొంతకాలంగా విడతల వారీగా జరిగిన ఈ పోటీలో ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి వెటరన్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి, వెటరన్ క్రికెట్ కార్యనిర్వాహక కార్యదర్శి విజయరాజు, రైల్వే ఇంజినీర్లు గోపీకృష్ణ యాదవ్, బి.వెంకటేశ్వర్లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఫైనల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన రమేష్, అశోక్, నాగరాజులకు వ్యక్తిగత బహుమతులు అందజేశారు.

### వెలుతురు ఎరగని దారులు

నగరంలోని గుత్తి రోడ్డు మసీదు ప్రాంతంలో ఆరు నెలలుగా విద్యుత్తు దీపాలు వెలగటం లేదు. నిత్యం వాహనదారులు చీకటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై పశువులు చీకటిలో ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మసీదుకు వచ్చే ముస్లింలు చీకటిలో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు దీపాలు రాత్రిళ్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
**-న్యూస్‌టుడే, కమలానగర్**

### రాలుతున్నాయ్.. నిప్పురవ్వలు

నగరంలోని ఆదిమూర్తినగర్ రైతు బజార్‌కు వెళ్లే దారిలో విద్యుత్తు తీగలకు చెట్టు తీగలు ప్రమాదంగా అల్లుకున్నాయి. గాలి వీచిన సమయంలో నిప్పురవ్వలు వస్తున్నాయి. ఈ దారిలో నిత్యం విద్యార్థులు, ఆర్డీవో కార్యాలయానికి, తాడిపత్రి బిర్యాని సెంటర్‌కు వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని వాపోతున్నారు. సమీపంలోనే కేఎస్ఆర్ జూనియర్ కళాశాల ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. చెట్టు తీగలను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కమలానగర్**

### పాటించరా నిబంధనలు!

ఇళ్లు కట్టుకోవడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఇళ్లు నిర్మాణం చేసుకొనే సమయంలో ఇతరులకు ఇబ్బంది కల్గించడం తగదు. నగరంలోని మారుతినగర్‌లో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా నిర్మాణ సామగ్రి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు కంకర, మరో వైపు ఇసుక వేయడంతో దారిలో వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే కనీసం అంబులెన్సు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంది. నిర్మాణ సామగ్రి రోడ్డుకు అడ్డంగా లేకుండా నగర పట్టణ ప్రణాళిక అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

### స్తంభం చుట్టూ పెళ్లలు

ఇదేమిటీ స్తంభానికి చుట్టూ సిమెంటు పెళ్లలు పేర్చారంటే స్తంభం ప్రమాదకరంగా ఉందేమో అన్న అనుమానం వస్తుంది. ఏమీ లేకున్నా దుకాణంలో పెళ్లలు రోడ్డు పక్కన స్తంభానికి చుట్టూ పేర్చడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో వాహనాల్లో వెళ్లే వారు కింద పడుతున్నారు. తిలక్ రోడ్డులో ద్విచక్రవాహనంలో వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. కోదండరామ దేవాలయం ఎదురుగా ఉన్న ఆయిల్ మిల్లు నిర్వాహకుడు తన దుకాణంలో ఆయిల్ ట్యాంకరు ఏర్పాటు చేసే క్రమంలో కొన్ని పెళ్లలు తొలగించారు.
**- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

**అనంతపురం విద్య, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్ఆర్ టీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్సీఈఆర్టీ సంచాలకులు వెంకటకృష్ణారెడ్డిని ఆదివారం జమ్మలమడుగులో మర్యాదపూర్వకంగా కలిసారు. ఉపాధ్యాయుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి, రాజమోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అల్తాఫ్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

**అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే:** ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ మల్లేశ్వరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను పలు విభాగాల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు కలసి అభినందించారు. ఆసుపత్రి అభివృద్ధితో పాటు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## కుమారునితో గొడవ పడి తల్లి అదృశ్యం

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుటుంబం ఐదేళ్ల క్రితం అనంతపురం నగరానికి వలస వచ్చింది. స్థానిక ఒకటో రోడ్డులో నివాసం ఉంటోంది. కుమారుడు మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం తల్లిని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. తన వద్ద లేవనడంతో గొడవ పెట్టుకున్నాడు. మనస్తాపానికి గురైన తల్లి.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన భర్త.. భార్య కనిపించకపోవడంతో పరిసరాలు, బస్టాండు, రైల్వే స్టేషన్లలో గాలించారు. ఆచూకీ లభించక పోవడంతో త్రీటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## 29 ఏళ్ల జ్ఞాపకాలు కళ్ల ముందుకు..

**రాప్తాడు:** రాప్తాడు మండలం గాండ్లపర్తి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 1996-97 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులను సన్మానించారు. 29 సంవత్సరాల ముందు వారి పాఠశాల జ్ఞాపకాలను పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు. విద్యార్థులు వారి అనుభవాలను తెలియజేసి ఇన్నేళ్ల తరువాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు వెంకటస్వామి, సూర్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి, పద్మావతి, 46 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష పుష్పార్చన

**అనంత సాంస్కృతికం:** నగరంలోని మొదటి రోడ్డు శివాలయంలోని అయ్యప్ప స్వామికి ఆదివారం లక్ష పుష్పార్చన నేత్రపర్వంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ఉత్సవంలో మాలధారులు, మహిళలు విశేషంగా హాజరయ్యారు. సావిత్రమ్మ, రాజగోపాల్‌రెడ్డి, ఆదిత్యారెడ్డిలు ప్రధాన దాతలుగా వ్యవహరించిన స్వామివారికి లక్షకుపైగా మల్లెపూలను సమర్పించారు.

## సంతానం కలగలేదని ఆత్మహత్య

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** వివాహమై ఇరవై ఏళ్లైనా సంతానం కల్గలేదని వేదనకు గురై మతి స్థిమితం కోల్పోయిన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన జబీనా, మహమ్మద్ సాహెబ్‌లకు ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే వారికి సంతానం కలగలేదు. మానసిక ఒత్తిడికి గురై మతిస్థిమితం కోల్పోయింది. కుటుంబ సభ్యులు వైద్యం చేయించినా తగ్గుముఖం పట్టలేదు. సంతానం కల్గకపోవడం, జబ్బు నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం రసాయన ద్రావణం సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది . మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## నృత్యం.. రసాత్మక అభినయం

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బుర పరిచాయి. అమృత కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన క్లాసికల్ నృత్యప్రదర్శనలు అడుగడుగునా అలరించాయి. కొండలలో నెలకొన్న కోనేటి రాయుడివారు, మూషిక వాహన, గరుడ గమన, నీలి మేఘంలో, వీణ పుస్తకధారిణి, ఐగిరి నందిని లాంటి గేయాలకు యక్షిత, లాస్యప్రియ, జననీ, నిహారిక, రిత్విక, జాగృతి, అన్విక, మేమిత, లయక్రిశివ్‌లు నృత్యం ప్రదర్శించారు.

## మరుగుదొడ్ల నిర్మాణం.. వివాదాస్పదం

నగరంలో గడియారపు స్తంభం సమీపంలోని ఫ్లైఓవర్ వంతెన కింద నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణం వివాదాస్పదంగా మారింది. సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి నగరపాలికలో టెండర్లు నిర్వహించారు. ప్రజల అవసరాల కోసం సులభ్ కాంప్లెక్స్‌లు అవసరమే. అయితే జనం నిలుచుకొనే బస్టాప్‌లు, జనసంచారం ఎక్కువగా ఉండే మార్కెట్లు వద్ద సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి. ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిర్మిస్తుండటంపై వివాదం నెలకొంది. నాలుగు వరుసల వంతెన మూడేళ్ల క్రితం నిర్మించారు. ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించారు. కోర్టురోడ్డు మలుపు వద్ద బ్రిడ్జి కింద కొంత ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో రాత్రికి రాత్రి పునాదులు తవ్వారు. పెద్దపెద్ద రాతి గుండ్లు బయటకు తీశారు. ఇసుక, కంకర డంప్ చేశారు. ఇంతలో కొందరు సులభ్‌కాంప్లెక్సు నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వాహణకు నీటి కోసం బోరు వేయడానికి జాతీయ రహదారులశాఖ అంగీకరించడం లేదు. నగరపాలక సంస్థ సరఫరా చేసే శుద్ధమైన తాగునీటిని సులభ్ కాంప్లెక్స్‌కు ఉపయోగించాలని భావిస్తున్నారు. **- న్యూస్‌టుడే, జేఎన్‌టీయూ**

## పూర్తి స్థాయిలో తాగునీరు అనుమానమే!

పైపులైను లీకేజీ మరమ్మతు పనులు

**అనంత నగరపాలక, న్యూస్‌టుడే:** నగరానికి తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను పనులు ఆదివారం రాత్రి పొద్దుపోయే దాకా సాగాయి. ఆదివారం ఉదయం ప్రారంభించిన పనులు ఓ పట్టాన కొలిక్కి రాలేదు. రోజంతా పనులు చేపట్టారు. నగరం శివారులోని రాచానపల్లి వద్ద తాగునీరు ప్రధాన పైపులైను లీకేజ్ కావడంతో వాటిని అరికట్టడానికి ఆదివారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీరు సరఫరా ఆపేశారు. రాత్రి వరకు పనులు సాగడంతో సోమవారం పూర్తి స్థాయిలో తాగునీరు అందే పరిస్థితి కన్పించడం లేదు. పైపులైను పనులు పూర్తి అయిన తర్వాత కొన్ని గంటలకు పీఏబీఆర్‌కు అనుసంధానంగా ముద్దలాపురం వద్ద ఉన్న నీటి శుద్ధి కేంద్రం నుంచి నీరు పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ప్రధాన పైపుల ద్వారా నేరుగా నగరంలోని ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపుతారు. అనంతరం నీటిని ఇళ్లకు సరఫరా చేయాల్సి ఉంది.

**నేడు అరకొరగా..**

పైపులైను పనులు రాత్రి వరకు జరగడంతో సోమవారం ఉదయం సరఫరా చేసే పరిస్థితులు కన్పించడం లేదు. మధ్యాహ్నం నుంచి నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. అరకొరగా అందే అవకాశం ఉంది. అన్ని పరిస్థితులు అనుకూలిస్తేనే సోమవారం కొంత మేర సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. నగరపాలక ఈఈ చంద్రశేఖర్, డీఈ నరసింహ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

అమృతమూర్తికి అంతిమవీడ్కోలు

అనురాగమూర్తి, ఆదర్శప్రాయులు, అంతులేని ప్రేమానురాగాలను మాకు పంచి, మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మీ జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ..

భార్య: G.నరసమ్మ
కుమారుడు: G.గంగాధర్‌రెడ్డి
కోడలు: G.వాణి

కీ॥శే॥ జి.కృష్ణారెడ్డి గారు
అనంతపురం. మరణం: 14-12-2025

కుమార్తెలు: G.సువర్ణమ్మ B.A., G.వసంత UK
అల్లుళ్లు: M.రాజశేఖర్‌రెడ్డి M.A., L.L.B., M.B.A., M.Sc (Yoga) Rtd. SDE., BSNL, A.ప్రభాకర్‌రెడ్డి B.Tech, Software, UK

మనవళ్లు: G.వినయ్‌కుమార్‌రెడ్డి, B.Tech., M.R.పునీత్‌కుమార్‌రెడ్డి, B.Tech., M.S., USA, M.R.ప్రమోద్‌రెడ్డి, Software, HYD, A.సాయి యశ్వంత్ Graduation Student, UK
మనవరాళ్లు: G.గీతిక B.B.A., A.దివ్య B.Tech., (M.B.A), Cambridge, DL.సద్భావతి M.S., USA (మనవడి భార్య)

అంత్యక్రియలు: 15-12-2025 సోమవారం మధ్యాహ్నం 3 గంటల పైన రాచానపల్లి స్మశానవాటిక నందు నిర్వహించబడును. Cell: 9490582848, 9440288899


(c) eenadu

# ఈనాడు అన్నమయ్య

సోమవారం డిసెంబరు 15, 2025

## కడప రాళ్లు.. మంగళూరు పెంకులు

చర్చిల్లో అద్భుతమైన కట్టడంగా పేరొందింది ఎస్పీజీ క్రైస్ట్ చర్చి కడప జిల్లా కేంద్రంలో 177 వసంతాలు పూర్తి చేసుకుంది. అప్పటి ఆంగ్లేయులు ఈ చర్చిని ఎంతో గొప్పగా నిర్మించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రెండుసార్లు కూలిపోయింది. బ్రిటిష్ ప్రభుత్వం అప్పట్లోనే రూ.6 వేలు విరాళం ప్రకటించగా అప్పటి జిల్లా రెవెన్యూ అధికారులు స్మిత్, డబ్ల్యూ హార్సిలీ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. 1810లో మొదలై అధికారికంగా 1849లో ప్రారంభానికి నోచుకుంది. ఈ చర్చి కడప రాళ్లతో నిర్మించగా పైకప్పు మంగళూరు పెంకులతో నిర్మించారు. రాయలసీమ డయాసిస్‌లో కెల్లా ఎంతో సుందరమైందిగా పేరుగాంచింది.

**- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

## నేడు డయల్ యువర్ సీఎండీ

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10.30 నుంచి 12 వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ సమయంలో 89777 16661 నంబరుకు ఫోన్ చేసుకోవచ్చన్నారు.

# ఆదివారం ఆసుపత్రికి సుస్తీ!

**వైద్యులు, సిబ్బంది దుమ్మా**

**జిల్లాలో పరిస్థితి ఇది**
మండలాలు 30
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47

'గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పింది.. కొన్ని మండలాల్లో రెండు నుంచి మూడు పీహెచ్‌సీలు పనిచేస్తున్నాయి. సిబ్బంది అందుబాటులో ఉంటూ నిరుపేదలకు వైద్య సేవలందించాల్సి ఉండగా వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం అయితే సెలవు ప్రకటించుకుని విధులకు దుమ్మా కొడుతున్నారు. అసలే చలికాలం.. ఆపై విష జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యులు అందుబాటులో లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఈనాడు-ఈటీవీ ప్రత్యేక పరిశీలనలో వెలుగు చూసిన అంశాలివి. **- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ, సుండుపల్లి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, రాయచోటి గ్రామీణ, ఓబులవారిపల్లె**

● రాజంపేట మండల కేంద్రంలోని ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం వైద్యుడు అందుబాటులో ఉన్నారు. 11 గంటల వరకు ఓపీ చూసి వెళ్లిపోయారు. రోగులు వస్తున్నప్పటికీ నర్సు మందులు అందించి పంపించారు. కనీసం స్టాఫ్ నర్సు కూడా అందుబాటులో లేకపోవడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 10.45 గంటలకు స్టాఫ్ నర్సు జ్యోతి విధులకు వచ్చారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంలో ఆసుపత్రికి వచ్చిన రోగులు వెళ్లిపోయారు.

ఆకేపాడులో కనిపించని వైద్యులు

రోగికి మందులు ఇస్తున్న నర్సు

● రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు పనిచేస్తుండగా ఆదివారం ఇద్దరూ విధులకు హాజరుకాలేదు. వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు నిరాశతో రాయచోటి, కడప ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు నర్సులు విధులకు హాజరై మందులిచ్చి పంపించేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయారు.

రామాపురంలో 11 గంటలకే ఆరోగ్య కేంద్రానికి తాళం

● లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని కుర్నూతల పంచాయతీ దేవపట్నంపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆదివారం ఒకరు విధులకు వస్తుండగా వైద్యుల గదికి తాళం వేశారు.

● రాయచోటి మండలం యండపల్లె పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులతో కలిపి మొత్తం పది మంది పనిచేస్తున్నారు. ఆదివారం స్టాఫ్ నర్సు కవిత మాత్రమే విధులకు హాజరయ్యారు. రోగులకు నిరాశ తప్పలేదు.

యండపల్లె పీహెచ్‌సీలో ఖాళీగా వైద్యురాలి కుర్చీ

# కార్యకర్తలకు అండగా కార్యక్షేత్రంలోకి

● నేడు ఇన్‌ఛార్జి మంత్రి మదనపల్లెకు
● జోనల్ బాధ్యులు దీపక్‌రెడ్డి సైతం రాక

**ఈనాడు, కడప:** తెదేపా కార్యకర్తలపై ఆ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. వారి నాడిని తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌ఛార్జి, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి మదనపల్లెకు సోమవారం వస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి పార్టీ మదనపల్లెలో పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో కార్యకర్తలతో సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీ కార్యకర్తలను విస్మరించి వైకాపా సేవల్లో తరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితిని దారికి తెచ్చే దిశగా బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో పాటు జోనల్ బాధ్యులకు బాధ్యతలు అప్పగించింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నడూ లేనంతగా తొలిసారిగా పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇది వరకు నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు తలపెట్టగా వివాదాల కారణంగా అర్ధాంతరంగా వాయిదా వేసుకుని వెళ్లిపోయారు. ఇప్పుడు పార్లమెంటు స్థాయిలో జరిగే సమావేశానికి ప్రాధాన్యం లభించింది.

● **వైకాపా నేతల చేరికపై వివాదం :** రాజంపేట నియోజకవర్గం నుంచి కొందరు వైకాపా నేతలను పార్టీలోకి తీసుకు రావాలనే ప్రయత్నాలు బెడిసికొట్టాయి. స్థానిక నేతలకు సంబంధం లేకుండా ఇతర జిల్లాల, పక్క నియోజకవర్గాల సూచనల మేరకు కొందరిని పార్టీలో చేర్చుకోవాలనే ప్రయత్నాలపై నేతలు, కార్యకర్తలకు ఆగ్రహం తెప్పించింది. వైకాపా హయాంలో కాజేసిన భూములను కాపాడుకోవడానికి, కేసుల నుంచి బయటపడటానికి కొందరు తెదేపాలో చేరిపోవాలనే ఎత్తులు వేశారు. మకిలీ నేతలను పార్టీలో చేర్చుకుని ప్రజలకు ఏం సంకేతాలు ఇవ్వదలిచారంటూ పార్టీ శ్రేణులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం వర్గానికి ఫిర్యాదు చేశారు. దీంతో రాజంపేట నుంచి వైకాపా వారిని పార్టీలో చేర్చుకునే నిర్ణయాన్ని విరమించుకున్నట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొచ్చింది. పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. ఇందులో భాగంగా విద్యార్థుల కంటి చూపుపై దృష్టి సారించింది. గత కొన్ని నెలలుగా జిల్లాలోని 275 పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కొందరిని కళ్లద్దాలకు ఎంపిక చేశారు. మసక మసక చూపుతో అద్దాల కోసం చిన్నారులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ఇదీ పరిస్థితి

**- న్యూస్‌టుడే, కంభంవారిపల్లి, రాయచోటి**

# చూపు మసక.. అక్షరాలు కానక

● కూటమి ప్రభుత్వం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఆరు నుంచి 16 సంవత్సరాల్లోపు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపిక చేసిన పాఠశాలలకు వెళ్లి కంటి పరీక్షలు నిర్వహించి, సమస్యలను గుర్తిస్తున్నారు.

**జిల్లాలో కంటి పరీక్షల వివరాలివి...**
**మొత్తం విద్యార్థులు :** 1,33,836
**పరీక్షలు చేసింది:** ఆగస్టు-నవంబరు మధ్యలో
**ఎన్ని పాఠశాలల్లో:** 275, **లక్ష్యం :** 30 వేలు
**పరీక్షించింది:** 35,592 మందిని
**దృష్టి లోపం ఉన్న వారు:** 2,382 మంది
**కళ్లద్దాలు అవసరమైన వారు :** 2,365

● **జాగ్రత్తలు తప్పనిసరి :** ● విద్యార్థులు ఆహారం తీసుకొనే విషయంలో జాగ్రత్తలు పాటించకపోవడంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని కంటి వైద్య నిపుణులు చెపుతున్నారు. సెల్‌ఫోన్లు వాడకం వలన, పోషకాహారాన్ని తీసుకోకపోవడంతో సమస్యలు పెరిగే అవకాశం ఉంది.

● ఉపాధ్యాయులు బోర్డులపై రాసి పాఠాలు చెప్పే సమయంలో, విద్యార్థుల కంటి సమస్యలను గుర్తించవచ్చు. గుర్తించిన సమస్యలకు చికిత్సలు అందించి, చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

● ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. పెద్ద తెరలపై ఎక్కువగా చూడటం వల్ల కంటి సమస్యలు పెరుగుతున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు తగ్గించే అవకాశం ఉంది.

**త్వరగా కళ్లద్దాలు అందజేస్తాం:** జిల్లాలో 3 వేల మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. త్వరగా అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం నాణ్యంగా ఉన్నాయా లేవాని 72 కళ్లద్దాలు అందజేశాం. పరిశీలించి, మిగిలిన విద్యార్థులకు అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. **- లక్ష్మీ నరసయ్య, డీఎంహెచ్‌వో**

# వాజ్‌పేయీ జీవితం భావితరాలకు ఆదర్శం

**మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే :** దివంగత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయీ రాజకీయ జీవితం రాబోయే తరం ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిదాయకమని ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ పేర్కొన్నారు. అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా ఆదివారం మదనపల్లె పట్టణం అన్నమయ్య కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, నాయకులతో కలిసి పుష్కర్‌సింగ్ ధామీ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఉత్తరాఖండ్ సీఎం మాట్లాడారు. 'దేవభూమి ఉత్తరాఖండ్ నుంచి జ్ఞానభూమి మదనపల్లెకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను రూపకల్పన చేసి వాటిని అమలు చేశారు. దేశంలో అనేక నగరాలను కలుపుతూ జాతీయ రహదారులు నిర్మాణం చేపట్టారు. ఆయన స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రధాని మోదీ స్టార్టప్ ఇండియా, మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి వాటిని అమలు చేసి భారతదేశాన్ని ప్రపంచంలో విశ్వగురువుగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు' అని పుష్కర్‌సింగ్ ధామీ వెల్లడించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో వాజ్‌పేయీ విగ్రహాలను ఆవిష్కరించే ఏర్పాట్లు చేశాం. గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడానికి పనికి ఆహార పథకాన్ని తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలన్న సంకల్పంతో సర్వశిక్ష అభియాన్ పథకాన్ని తీసుకొచ్చారు' అని కొనియాడారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియాఖానమ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, 20 సూత్రాల పథకం అమలు ఛైర్మన్ లంక దినకర్ తదితరులు మాట్లాడారు.

పుష్కర్‌సింగ్ ధామీకి వాజ్‌పేయీ ప్రతిమను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, చిత్రంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ జకియాఖానం, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

# కాలువలనూ కమ్మేయ్.. కబ్జాలో కలిపేయ్!

**రూ.కోట్ల భూముల్లో ప్రైవేటు భవనాలు**

**న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

రైల్వేకోడూరుకు చెందిన ఓ కుటుంబ సభ్యులకు పట్టణ పరిధిలోని సర్వే సంఖ్య 14/1లో 82 సెంట్ల స్థలం ఉంది. ఇందులో ఓ సినిమా హాలు ఉండేది (మూడు రోజుల క్రితం పడగొట్టేశారు). అదే కుటుంబానికి రాఘవరాజపురం గ్రామ పరిధిలోని 36/2లో 2.79 ఎకరాల భూమి ఉంది. వారి కుటుంబ ఆర్థిక వ్యవహారాల దృష్ట్యా ఈ స్థలాలు భూ వ్యాపారులు, వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అది వారి వ్యక్తిగతం. అయితే వాటిని అడ్డుపెట్టుకుని రూ.కోట్లు విలువైన రోడ్లు, భవనాలశాఖ భూములకు రియల్టర్లు ఎసరు పెట్టారు. స్థలాలకు ముందు వైపు కడప - చెన్నై జాతీయ రహదారి పక్కనే ఉన్న భూములను కలిపేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత రెండు, మూడు రోజుల నుంచి రాఘవరాజపురం వద్ద ఉన్న భూమిని చదును చేసుకునే ప్రక్రియలో భాగంగా అక్కడి కాలువను పూడ్చేసే ప్రయత్నాలు చేశారు. సుమారు ఎకరా స్థలాన్ని ప్రైవేటు జాగాలో కలిపేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ధరల ప్రకారం జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమి సుమారు రూ.10 కోట్లు చేస్తుందని అంచనా.

జాతీయ రహదారి పక్కన కాలువను పూడ్చేసే ప్రయత్నం

● పట్టణంలో కూల్చివేసిన సినిమా హాలు ముందు వైపున్న దుకాణాలను ఖాళీ చేయాల్సిందేనని భూ వ్యాపారులు హుకుం జారీ చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడ సుమారు ఇరవై ఏళ్లకు పైబడి పది శీతల పానీయాల దుకాణాలున్నాయి. ఇవన్నీ మద్యం తాగేవారితో దర్శనమిస్తున్నాయి. ● వారిని ఇది వరకే రోడ్లు, భవనాలశాఖ అధికారులు ఖాళీ చేయాలని చెప్పినా రాజకీయ నాయకులతో చెప్పించి వారు అక్కడే ఉంటున్నారు. ఇప్పుడు భూ వ్యాపారులు వారిని ఖాళీ చేయించాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్కడున్న ప్రభుత్వ స్థలంపై ఇలా ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఆ భూమి పట్టణంలో ఉన్నందున రూ.కోట్లలోనే విలువ చేస్తుంది. ● ఈ విషయాన్ని రోడ్లు, భవనాలశాఖ డీఈ జయప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా కోడూరు, రాఘవరాజపురం వద్ద ఉన్న స్థలాలు ప్రస్తుతం జాతీయ రహదారుల నిర్వహణకు వెళ్లిపోయాయన్నారు. ఏమైనా చర్యలు తీసుకోవాలంటే వారే చేపట్టాలని వివరించారు.

**ఆక్రమణలు అడ్డుకున్నాం..**

రాఘవరాజపురం వద్ద జరుగుతున్న వ్యవహారం మా దృష్టికి వచ్చింది. వెంటనే అక్కడ పరిశీలించి పనులు నిలుపుదల చేయించాం. ప్రైవేటు స్థలంలోకి దారి కావాలంటే ప్రభుత్వానికి చలానా కట్టి, దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించిన మీదట దారి కోసం మాత్రమే కొంత స్థలం కేటాయించగలం. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. **- అమర్‌నాథ్, తహసీల్దారు**

# నెత్తిన గుండు.. జాగ్రత్తగా ఉండు



గాలివీడు మండల పరిధిలోని చీమలచెరువు పంచాయతీ కమలామర్రి రహదారి పక్కనే గుట్టపై రాళ్లపై రాళ్లు ఉన్నాయి. ఈ దారిలో వెళ్లేవారు అటుగా చూసి అరె భలేగా ఉందే అని ఆసక్తితో చూడడంతో పాటు జారి పడితే ఇంకేమైనా ఉందా అని భయాందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు. పాలెగాళ్ల పాలనలో ఓ వ్యాపారి గుర్రంపై వెళ్లేటప్పుడు ఈ రాళ్లను చూసి ఎక్కడ నెత్తిన పడతాయోనని ఆందోళనతో అక్కడిక్కడే మృతి చెందగా సమీపంలోనే ఖననం చేసిన ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఇప్పటికీ ఆ ప్రాంతానికి చేరుకుంటే రాళ్లు ఎక్కడ పడతాయని తొందరగా అక్కడి నుంచి వెళ్లిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

## పుంజుకున్న టమాట.. కిలో రూ.44

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** టమాట మార్కెట్‌లో ధరలు గత వారం కంటే స్వల్పంగా పెరిగాయి. ఆదివారం కిలో అత్యల్పంగా రూ.23 నుంచి అత్యధికంగా నాణ్యమైన కాయలు కిలో రూ.44 వరకు పలికాయి. వారం కిందట కిలో రూ.20 నుంచి రూ.38 మధ్యలో ఉన్న ధర నేడు పుంజుకుంది. మార్కెట్‌కు 123 టన్నుల మేర సరకును రైతులు తీసుకొచ్చారు. ఏ-గ్రేడ్ కిలో రూ.38 నుంచి రూ.44 వరకు, బీ-గ్రేడ్ కిలో రూ.23 నుంచి రూ.37 సగటున కిలో రూ34 నుంచి రూ.42తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి బయటి ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

**రాయచోటి:** రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. తమ అర్జీలను మీకోసం. ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొంటే నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. అర్జీల స్థితిని తెలుసుకొనేందుకు 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

# ప్రగతి కల.. సాకారం ఇలా!

**జిల్లా: అన్నమయ్య**
మండలాలు: 30
నియోజకవర్గాలు : 6
**జిల్లా : వైఎస్సార్ కడప**
మండలాలు: 36
నియోజకవర్గాలు: 7

రాజంపేట పట్టణంలో స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా స్వర్ణాంధ్ర-2047 భవనాలను నిర్మిస్తున్నారు. జిల్లాకు ఆరు కార్యాలయాలు మంజూరు కాగా నియోజకవర్గ కేంద్రంలో వీటి నిర్మాణం పూర్తి చేసి ఫర్నిచర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.● నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశం అయ్యేలా, ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారిని ఇప్పటికే నియమించారు. స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలపై సమీక్ష చేయనున్నారు.

**అధికారులు ఇలా..**

● రాజంపేట నియోజవర్గంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047 పేరుతో నూతన కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రత్యేక అధికారిగా రాజంపేట సబ్ కలెక్టర్‌ను కేటాయించారు.

● పంచాయతీలు, పురపాలక అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి విజన్-2047 కాల వ్యవధిలో పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వేకోడూరులో కూడా ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. రైల్వేకోడూరుకు ప్రత్యేకాధికారిగా డీపీవోను కేటాయించారు.

● రాజంపేట కేంద్రంగా పని చేసే ఇబ్బందికి అవసరమైన ఫర్నిచర్ రాజంపేట ఎంపీడీవో కార్యాలయానికి చేరింది. ఇక్కడ పనిచేస్తున్న ప్రత్యేక అధికారి, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ స్థాయి అధికారులు కోసం కంప్యూటర్లు, ఫైల్స్‌ను భద్రపరిచే బీరువాలు, కంప్యూటర్ ప్రింటర్లు, కుర్చీలు, ఎమ్మెల్యే కోసం ఎగ్జిక్యూటివ్ కుర్చీలు కార్యాలయానికి చేరుకున్నాయి.

● రాజంపేటలో స్వర్ణాంధ్రా కార్యాలయం కోసం గతంలో ఉన్న డివిజనల్ వ్యవసాయాధికారి కార్యాలయాన్ని రూ.5 లక్షలతో అభివృద్ధి చేశారు. నూతన సంవత్సరంలో వీటిని ప్రారంభించనున్నారు.

# అబాకస్.. పృథ్వీ ఫేమస్

మారుమూల ప్రాంతంలో సామాన్య కుటుంబంలో జన్మించిన ఓరుగంటి పృథ్వీ నాలుగో తరగతి చదువుతున్నాడు. అమ్మ మాధవి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలు కాగా నాన్న రామకృష్ణ పెయింటర్. అబాకస్ గణిత పోటీల్లో జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. మలేషియా నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచాడు. సుండుపల్లి వశిష్ఠ పాఠశాలలో చదువుతున్న సమయంలో గణితంలో పృథ్వీ చూపుతున్న వేగం, చురుకుదనాన్ని గుర్తించిన పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ కె.రెడ్డెయ్య రాజు అబాకస్ పోటీలకు గణిత ఉపాధ్యాయిని ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. జిల్లా స్థాయిలో ఫిబ్రవరిలో, రాష్ట్రస్థాయిలో మార్చిలో అనంతరం జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో అగ్రస్థానంలో నిలిచారు. గత నెలలో మలేషియా నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పరీక్షలోనూ ప్రతిభ చూపారు. తృతీయ స్థానం సొంతం చేసుకొని ప్రతిభను చాటాడు. **- న్యూస్‌టుడే, సుండుపల్లి**

# అతివల ఆరోగ్యం భద్రం

● **హెల్త్ పాయింట్ పర్సన్ల నియామకానికి సన్నాహాలు**

**రాయచోటి, న్యూస్‌టుడే:** ఇంటి నిర్వహణ పనులతో తీరిక లేక మహిళలు సతమతమవుతుంటారు. చాలా మంది వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారు. అతివల సంక్షేమానికి వివిధ పథకాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. హెల్త్ పాయింట్ల పర్సన్లను నియమించి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా సన్నహాలు చేస్తోంది. 2016లో తెదేపా ప్రభుత్వం వెలుగు పథకంలో భాగంగా మహిళల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి నియమించిన హెల్త్ రీసోర్సు పర్సన్లు విశేష సేవలందించారు. వైకాపా పాలనలో వారిని తొలగించారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త హెచ్‌పీపీల నియామకాలకు చర్యలు చేపట్టింది. మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. గ్రామ సంఘానికి ఒక హెల్త్ పాయింట్ పర్సన్ నియామకానికి ఆదేశాలొచ్చినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

**మహిళా సంఘాలు** 29,670
**సభ్యుల సంఖ్య** 2,90,875
**గ్రామ సంఘాలు** 1528

# ఏఐ.. తిండిలెక్క చెప్పేయ్!

**చిన్నతేడా ఉన్నా చిత్రంతో వెంటనే గుర్తింపు**

**గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:** ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అపరిశుభ్రత నెలకొనడం, భోజనాలపై నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యానికి కళ్లెం వేసి, వసతి కేంద్రాల పర్యవేక్షణ బాధ్యత పెంచేలా కూటమి ప్రభుత్వ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అవకతవలకు అడ్డుకట్ట వేసేందుకు 'హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) పేరుతో ఏఐ (కృత్రిమ మేధ ఆధారిత) సాంకేతికతతో కూడిన ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. ప్రతి చిన్న పనీ దీని ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల సంరక్షకులు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వసతి గృహాల్లో వార్డెన్ల పనితీరును గాడిన పెట్టేందుకు ఈ యాప్ ఓ సూచికలా నిలవనుంది. ఇటీవల జిల్లాలో అన్ని వసతి గృహాల్లోని సంక్షేమ అధికారులకు ఈ యాప్‌ను చరవాణుల్లో వేయడమే కాకుండా పనితీరు వివరించారు.

**జిల్లాలో పరిస్థితి ఇలా**
మండలాలు : 30
వసతి గృహాలు : 98
విద్యార్థులు : 9,050 మంది

గాలివీడు ఎస్సీ వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

**జిల్లాలో వసతి గృహాల వివరాలు**

| సాంఘిక సంక్షేమం | వెనుకబడిన తరగతులు |
|---|---|
| 55 | 43 |
| ప్రీమెట్రిక్ 49 | 32 |
| | 11 |
| పోస్టు మెట్రిక్ 6 | 4,506 |
| విద్యార్థుల సంఖ్య | మొత్తం 98 |
| | 81 |
| 4,544 | 17 |

● **ప్రత్యేకతలు ఇవే.. :** వసతి గృహాల్లో పారదర్శకతను పెంచేలా హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం (హెచ్‌పీటీఎస్) పేరుతో ఓ సరి కొత్త యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రోజూ చేపట్టే పనులతో పాటూ వారాంతం, నెలవారీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అమలు చేసేలా చర్యలు తీసుకుంటుంది. వసతి గృహాల్లో కంచాలు కడగడం నుంచి పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు, ఆవరణ, మరుగుదొడ్లు, తాగునీరు, గదులు శుభ్రత అన్నీ ఈ యాప్‌లో ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసేలా ఆప్షన్లు పొందుపరిచారు.

● **నిరంతరం నిఘా:** హెచ్‌పీటీఎస్ యాప్ ద్వారా వసతి గృహాల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. ప్రధానంగా భోజనాల సమయంలో ఫొటోలు తీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యను ఆ ఆహారం సరిపోతుందా.. లేదా? అనే విషయాన్ని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. అవకతవకలు నిర్ధారణ జరిగితే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటారు. గాలివీడులో నవంబరు నుంచి అమలు చేస్తున్నామని వార్డెన్ రవీంద్రనాయక్ తెలిపారు.

(c) eenadu

## విద్యార్థి మిత్రకు నిధుల మంజూరు

**గాలివీడు, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట కిట్లు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. అందుకోసం రూ. 830.04 కోట్లు నిధులు విడుదలకు అనుమతినిచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయనుంది. 2026-27 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు కిట్లు అందిస్తారు. అందులో నోట్ బుక్‌లు, బెల్ట్, షూలు, బ్యాగ్ వంటివి ఇవ్వనున్నారు. పాఠ్యపుస్తకాలు, మూడు జతల యూనిఫాం క్లాత్‌లతో కూడిన కిట్లు కూడా పంపిణీలో చేర్చారు. కిట్ల సేకరణ పంపిణీ కోసం రూ.157 కోట్లు కేంద్రం ఇవ్వనుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా కిట్ల సరఫరా, పంపిణీదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలేరమ్మ అమ్మవారికి వెండి మకర తోరణం వితరణ

**బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే:** పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రకాశం జిల్లా లింగసముద్ర మండలం చిన్నపవని గ్రామానికి చెందిన వెల్ల బ్రహ్మానాయుడు, హిమబిందు దంపతులు 13 కేజీల 992 గ్రాముల వెండి మకర తోరణాన్ని మఠం మేనేజర్ ఈశ్వరయ్యచారి, పూర్వపు మఠాధిపతి కుమారుడు దత్తాత్రేయస్వామి, వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్యులు ఆధ్వర్యంలో అందించారు.

అమ్మవారికి సమర్పించిన వెండి మకర తోరణం

# సాగని పనులు

- ముగ్గురాయి పొడి చేస్తామని చెప్పి.. నేరుగానే విక్రయాలు
- నెరవేరని ఏపీఎండీసీ లక్ష్యం

**ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే :** ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థకు మిల్లుల యజమానులు టోకరా వేస్తున్నారు. ముగ్గురాయి పౌడర్‌గా మార్చి విక్రయిస్తామని ఒప్పందం చేసుకొని నేరుగా ముడిరాయినే అమ్మేస్తున్నారు. ఫలితంగా మిల్లులు నడవక స్థానికులకు ఉపాధి దొరకడం లేదు. ఏపీఎండీసీ ఇస్తున్న రాయి తీని 70 శాతం మిల్లుల యజమానులు ఉల్లంఘనలకు పాల్పడుతూ మోసం చేస్తున్నారు. సంస్థ అధికారులూ ఇదేమీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఆకస్మిక తనిఖీల్లో ఈ దందా వెలుగుచూసింది.

ఏపీఎండీసీకి అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం మంగంపేట వద్ద ముగ్గురాయి గనులున్నాయి. అయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం తవ్వకాలు జరిపే దేశాల్లో ముగ్గురాయికి డిమాండు ఉంది. మంగంపేట గనులకు దగ్గరలో 200 పల్వరైజింగ్ మిల్లులున్నాయి. వీటికి ఉపాధి కోసం ప్రభుత్వం రాయితీతో ముగ్గురాయిని సరఫరా చేస్తుంది. కొందరు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల కింద ముగ్గురాయి మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. వీరికి ఏపీఎండీసీ ప్రతి నెలా ఏ గ్రేడ్ ముగ్గురాయి 120 టన్నులు, బి గ్రేడ్ 200-300 టన్నులు, సి,డి గ్రేడ్ వెయ్యి టన్నులపైనే సరఫరా చేస్తోంది. ఇందులో ఏ గ్రేడ్ ముడిరాయిని మాత్రమే నేరుగా విక్రయించుకోవచ్చు. మిగిలినవి మిల్లులో పొడిగా చేసిన తర్వాతే విక్రయించాలి. దీనివల్ల మిల్లుల్లో స్థానికులకు ఉపాధి లభిస్తుంది. కానీ ఎక్కువ మంది మిల్లర్లు కొందరు ఎగుమతి దార్లతో మాట్లాడుకొని బీ, సీ, డీ గ్రేడ్లను ముడి రాయిగానే అమ్మేస్తున్నారు.

మిల్లు వద్ద ఉన్న ముగ్గురాయి ముడి ఖనిజం

### చర్యలు తీసుకోని అధికారులు

డేంజర్‌జోన్ పరిధిలో ఉన్న ఇల్లు, భూములు కోల్పోయిన వారిని ప్రోత్సహించాలని ఎగుమతిదార్లకు ఇచ్చే ధర కంటే స్థానిక మిల్లులకు 10 శాతం రాయితీపై ముగ్గురాయిని ఇస్తున్నారు. మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘించి అదే రాయిని అధిక ధరకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లులు నడవక పోవడంతో స్థానికులకు ఉపాధి అనేది ఉత్త మాటే అవుతోంది. ఈ తనిఖీల నివేదిక ఏపీఎండీసీ ఎండీకి చేరింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

### విద్యుత్తు కనెక్షన్లే లేవు..

కొందరు పల్వరైజింగ్ మిల్లుల యజమానులు అక్రమాలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ తనిఖీలకు ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ముగ్గురాయి తీసుకున్నట్లు రికార్డుల్లో ఉన్న 91 మిల్లుల్లో తనిఖీలు చేయించారు. ఇందులో 26 నిబంధనలు పాటించగా, మిగతా 65 మిల్లుల్లో పెద్దెత్తున ఉల్లంఘనలు గుర్తించారు. ఆయా మిల్లుల విద్యుత్తు బిల్లుల వివరాలు చూస్తే ఈ దందా బయటకొచ్చింది. కొన్నింటికి విద్యుత్తు కనెక్షన్ లేకున్నా.. ముగ్గురాయిని పొడి చేస్తున్నట్లు యజమానులు నమ్మబలికారు.

## 10 మంది సీఐల బదిలీలు

**రాయచోటి, న్యూస్‌టుడే:** జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పని చేస్తున్న పది మంది సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా నుంచి అనంతపురం రేంజి, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఈ బదిలీలు చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలివి.

| పేరు | పని చేస్తున్న స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఎస్. రోషన్ | కమలాపురం | రాయచోటి రూరల్ |
| ఎన్. వరప్రసాద్ | రాయచోటి రూరల్ | వీఆర్ అన్నమయ్య |
| ఎన్. క్రిష్టంరాజు నాయక్ | సీసీఎస్-1 కడప | లక్కిరెడ్డిపల్లె |
| టి. వి. కొండారెడ్డి | లక్కిరెడ్డిపల్లె | ఆర్ఎస్ఏటీఎఫ్, అన్నమయ్య |
| పి. చంద్రశేఖర్ | ఆర్ఎస్ఏటీఎఫ్ అన్నమయ్య | ఆదోని వన్‌టౌన్ |
| డి. మస్తాన్‌వలీ | వీఆర్ కర్నూల్ | ఎస్సీ, ఎస్టీ సెల్ అన్నమయ్య |
| డి. రామాంజనేయుడు | ఎస్సీఎస్టీ సెల్ అన్నమయ్య | ప్రొద్దుటూరు 3 టౌన్ |
| టి. మధు | వీఆర్ అన్నమయ్య | డీపీటీసీ అన్నమయ్య |
| ఎ. ఆదినారాయణరెడ్డి | డీపీటీసీ అన్నమయ్య | డీసీఆర్‌బీ అన్నమయ్య |
| ఎం. తులసీరాం | డీసీఆర్‌బీ అన్నమయ్య | వీఆర్ అనంతపురం రేంజ్ |

## పూల రథంపై ఈశ్వరీదేవి ఊరేగింపు

**బ్రహ్మంగారిమఠం:** జగన్మాత ఈశ్వరీ మహాదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు పూల రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. గుడి ఉత్సవం, అభిషేకాలు, కుంకుమార్చనలతో పూజలు ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మఠాధిపతి వీరశివకుమారస్వామి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పూల రథంపై దర్శనమిస్తున్న ఈశ్వరీ దేవి అమ్మవారు

## జిల్లా సాధనకు మోకాళ్లపై నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస నాయకులు

**రాజంపేట, న్యూస్‌టుడే:** రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ ఐకాస చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 5వ రోజుకి చేరుకున్నాయి. రిలే దీక్షలకు కార్మిక, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. పాతబస్టాండు కూడలిలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం సాధన కోసం అన్నివర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోందని, ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారని ఐకాస నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల నుంచి ప్రజలు, కార్మికులు, వివిధ పార్టీ నాయకులు తరలిరావాలని కోరారు. ఐదో రోజు రిలేదీక్షల్లో సుబ్బనరసయ్య, డాక్టర్ సి.సుధాకర్, మేడికొండు రవికుమార్‌నాయుడు, డీఆర్‌ఎల్ మణి, సంజీవ రాయుడు, బాసినేని వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో 54 ముంపు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

**అట్లూరు, న్యూస్‌టుడే :** కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండో విడతలో సోమశిల ముంపు పరిహారం అందుకున్న 54 గ్రామాల కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా లబ్ధి చేకూరనుంది. గతంలో సోమశిల ముంపు గ్రామాలకు పరిహారం ఇచ్చారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తమకు పునరావాస వసతులు (ఆర్‌అండ్‌ఆర్) కల్పించాలంటూ బాధితులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో అట్లూరు, గోపవరం, నందలూరు, ఒంటిమిట్ట మండలాల్లో బాధిత లబ్ధిదారుల రికార్డులను పరిశీలించేందుకు మంగళవారం నుంచి కార్యరంగంలోకి దిగనున్నారు. ఈ విచారణ నాలుగు రోజుల పాటు కొనసాగనుంది.

సోమశిల ముంపులో వరికుంట ఎస్సీ కాలనీ (పాత చిత్రం)

అట్లూరు మండలంలో మద్దూరు, చెండువాయి, విరూరు, వరికుంట, ఉప్పుటూరు, జొన్నవరం, రంగంపల్లె, మలినేనిపట్నం గ్రామాలకు స్థానిక స్త్రీ శక్తి భవనంలో విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దారు శిరీష తెలిపారు. సంబంధిత గ్రామాల ముంపు బాధితులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

## ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

**రాయచోటి, న్యూస్‌టుడే:** ప్రభుత్వం 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి వెంటనే 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండు చేశారు. రాయచోటిలో ఆదివారం నిర్వహించిన ప్రగతి శీల ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్‌సీ, ఐఆర్, డీఏలను సకాలంలో చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వకపోవడం దగా చేయడమేనని ఆయన తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. సీపీఎస్‌పై సమీక్ష చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైనా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లిస్తామని చెప్పి 10వ తేదీ వచ్చినా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉపాధ్యాయులకు ఉన్న రూ.31 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని గౌరవాధ్యక్షుడు పి.సి.రెడ్డెన్న డిమాండు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు పి.వి.సుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రియబాష, మైనార్టీ కన్వీనర్ లియాకత్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి

## సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

సమావేశానికి హాజరైన దివ్యాంగులు

**పుల్లంపేట, న్యూస్‌టుడే:** ప్రతి దివ్యాంగుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని భారత్ దివ్యాంగుల క్రికెట్ జట్టు నాయకుడు శివకోటి అన్నారు. ఆదివారం పెనగలూరు మండలంలో జరిగిన ప్రపంచదివ్యాంగుల దినోత్సవం వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతోనే దివ్యాంగుల సమస్యలను పరిష్కరించుకోగలరన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంఘనాయకులు తిరుమలరెడ్డి, తిరిపాల్, చిరంజీవి, సుబ్బనరసారెడ్డి, అబ్దుల్లా, నరసింహులు దివ్యాంగులను గురించి మాట్లాడారు. కేకు కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని బాలపల్లె, రైల్వేకోడూరు అటవీ ప్రాంతాలలో ఆదివారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందం, ఆర్ఎస్సైలు అలీబాషా, బాల చెన్నయ్య బృందం అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టగా కంగిమడుగు, తిమ్మయ్యగుంట ప్రాంతాలలో ఇద్దరిద్దరు చొప్పున తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు పట్టుబడ్డారు. వారి వద్ద గొడ్డళ్లు, రంపాలు ఉన్నట్లు చెప్పారు. ఆ ప్రాంతాలలో గుంపులుగా వస్తున్న స్మగ్లర్లను చుట్టుముట్టడంతో వారు పారిపోయారు. పట్టుబడిన వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు.

పట్టుబడిన వారిని చూపుతున్న పోలీసులు

## రెడ్డెమ్మ దేవతకు స్వర్ణాభరణం వితరణ

**గుర్రంకొండ, న్యూస్‌టుడే :** గుర్రంకొండ మండల పరిధిలోని రెడ్డెమ్మదేవతకు రాయచోటికి చెందిన తిరుపతి సూర్యకుమారి, శ్రీనివాసుల దంపతులు రూ.3,84,000ల విలువైన 30 గ్రాముల బంగారం ఆభరణాన్ని వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆలయ ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడికి ఆదివారం దాతలు అందజేశారు. దాతలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఈవో మంజుల తదితరులు పాల్గొన్నారు.

బంగారం ఆభరణం చూపుతున్న దాతలు

## కళాకారులతో అన్నమయ్య కీర్తన నృత్య కైంకర్యం

సాధన చేస్తున్న కళాకారులు

**రాజంపేట, న్యూస్‌టుడే:** శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న 1,008 మంది నృత్య కళాకారులతో అన్నమయ్య కీర్తన నృత్య కైంకర్యం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆ అకాడమీ నృత్య గురువు శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు రాజంపేటలో నృత్య కైంకర్యానికి సంబంధించిన గోపడత్రాలను పురపాలక కౌన్సిలర్ రాఘవేంద్రవర్మ, సినీ దర్శకుడు శివమణి, చిత్ర కళాకారుడు గిరిధర్, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ ఆవిష్కరించారు. ఈ నృత్య కైంకర్యం చిరస్థాయిగా నిలిచిపోతుందని, విజయవంతం అవుతుందని అతిథులు తెలిపారు. అనంతరం కళాకారులకు నృత్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## స్నేక్‌హితులకు శిక్షణ

జీరో టచ్ పద్ధతిలో పామును పట్టుకుంటున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యుడు (పాతచిత్రం)

**మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే :** పాములంటే భయపడని వారెవరుంటారు చెప్పండి. ఒకవైపు పూజిస్తూనే మరోవైపు కంటికి కన్పిస్తే మాత్రం చంపేందుకు కూడా సాహసిస్తారు. పాము ఇంట్లోకి వస్తే భయంతో పరుగులు తీయాల్సిందే. ఇదివరకు మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ సంస్థ ప్రతినిధులు పాములను రక్షించి అటవీప్రాంతంలో వదిలేవారు. వీరిలో శిక్షణ పొందిన ఇద్దరు బయట ప్రాంతాలకు వెళ్లి పోవడంతో మదనపల్లెలో పాములను రక్షించే వారు కరవయ్యారు. ఉన్న ఒకరిద్దరు పామును పడితే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబుబకర్ సిద్దిక్ వినూత్న ఆలోచన చేశారు. మదనపల్లె పట్టణ శివారు ప్రాంతాల్లో కొండలు తొవ్వి నివాసాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పాములు జనవాసాల్లోకి వస్తున్నట్లు గుర్తించారు. ఇందులో టీచర్స్‌కాలనీ, చంద్రాకాలనీ, వైఎస్ఆర్‌కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, కొత్తఇండ్లు, ఈశ్వరమ్మకాలనీ ప్రాంతాల్లో పాములు జనవాసంలోకి ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఈ ప్రాంతాల్లో ఎవరైనా యువకులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే పాములు ఎలా పట్టుకోవాలో ఉచితంగా శిక్షణ ఇస్తామని చెబుతున్నారు. జీరో టచ్ విధానం ద్వారా పట్టుకోవడం సులభమన్నారు. చాలా మంది స్నేక్ క్యాచర్లు పట్టేటప్పుడు పాము నడుము భాగం దెబ్బతిని మృత్యువాత పడుతున్నాయని ఇలాంటి పరిస్థితి రాకుండా పర్యావరణ సమతుల్యం కోసం మనుషులతో పాటు భూమిపై పాములు జీవించాలన్న లక్ష్యంతో జీరో టచ్ విధానంపై శిక్షణ ఇస్తామన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 70 శాతం పాముల్లో విషం ఉండదని అయితే వాటిని కొందరు కావాలనే చంపేస్తున్నారని చెప్పారు. పరిస్థితులు మార్చేందుకే యువతకు శిక్షణ ఇస్తామని అన్నారు. వ్యాపార ధోరణి లేకుండా సేవా దృక్పథం ఉన్నవారు తమను కలిస్తే ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 9502461515కు సంప్రదించవచ్చు.

## హోరాహోరీగా క్రీడా పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

**రాయచోటి, న్యూస్‌టుడే:** రాయచోటి పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో సంబేపల్లె, చిన్నమండెం జట్లు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలో సంబేపల్లె జట్టు విజేతగా నిలిచిందని డివిజనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వీరాంజనేయులు తెలిపారు. చిన్నమండెం జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. మహిళల త్రోబాల్ పోటీలలో చిన్నమండెం జట్టు విజేతగా నిలిచిందన్నారు. మహిళల త్రోబాల్ పోటీలను డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. గెలుపొందిన జట్లు ఈనెల 20 నుంచి నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు నరసరాజు, రెడ్డెయ్య, రామాంజనేయులు, సతీష్‌రెడ్డి, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

నాటకంలోని ఓ సన్నివేశం

**కడప విద్య, న్యూస్‌టుడే :** కడప నగరంలోని హరిత ఫంక్షన్ హాలులో ఆదివారం బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. సమాజంలో శాంతి, సౌభాగ్యం వెల్లివెరియాలనే సందేశంతో నిర్వహించిన ఈ నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బౌద్ధమతం భారతీయ జీవన విధానాన్ని ప్రభావితం చేసిందని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగళ్‌రెడ్డి, రాజేశ్వరమ్మ, అశోక్‌కుమార్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు కుమారస్వామిరెడ్డి, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి, న్యాయవాది సంపత్‌కుమార్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట చెరువులోకి దూసుకెళ్లిన కారు

- సురక్షితంగా బయట పడిన కర్నూలు వాసులు

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** ఒంటిమిట్ట శివారులో చెరువులోకి కారు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయట పడ్డారు. కర్నూలు నగరం నిర్మలానగర్‌కు చెందిన చిప్పగిరి శ్రావణ్‌కుమార్ (50), ధనలక్ష్మి (48), మాకా జయప్రకాష్ (62), సుభద్రాదేవి (57) దంపతులు తిరుమలకు కారులో బయల్దేరి వెళ్లారు. ఆదివారం స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని చెర్లోపల్లి సమీపంలో కారు నడుపుతున్న శ్రావణ్‌కుమార్ నిద్ర మత్తులో చెరువులోకి తీసుకెళ్లారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎస్.ఐ.రామ్మోహన్ గుర్తించి కారులో ఉన్న వారిని బయటికి తీసుకొచ్చారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కారును క్రేన్ సాయంతో బయటకు తీసేటప్పుడు జాతీయ రహదారిపై వాహనాలు కొద్ది సేపు నిలిచిపోయాయి.

## 21న కలమల్ల శాసన రెప్లిక ఆవిష్కరణ

**కడప చిన్నచౌకు:** కడప నగరం ఎర్రముక్కపల్లెలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఈ నెల 21న జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో తొలి తెలుగు కలమల్ల శాసన రెప్లిక ఆవిష్కరిస్తున్నట్లు జానుమద్ది సాహితీపీఠం కార్యనిర్వాహకుడు జానుమద్ది విజయభాస్కర్, రచయిత చరిత్రకారుడు రమేష్‌లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలమల్ల తొలి తెలుగు శాసనం తొలుత అయిదు అడుగుల ఆరు అంగుళాలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు అడుగులు మాత్రమే ఉందన్నారు. ఈ శిలాశాసనాన్ని కాపాడడంలో పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుమార్తె దీపా వెంకట్ సహకారముందన్నారు. శిలాశాసనం ప్రారంభోత్సవానికి కలెక్టర్ శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, వైవీయూ వీసీ ఆచార్య రాజశేఖర్ హాజరవుతారన్నారు. సాహిత్యకారులు, రచయితలు, చరిత్రకారులు, కవులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

## ఉపాధ్యాయ అభ్యున్నతికి ఎస్టీయూ కృషి

కడప ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్తున్న ఎస్టీయూ నాయకులు

**కడప విద్య, న్యూస్‌టుడే:** విద్యా రంగ, ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం ఎస్టీయూ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ హాలులో ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో భాగంగా విద్యా సదస్సు నిర్వహించారు. అంతకు ముందు స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరవగా మహార్యాలీగా జిల్లా పరిషత్తు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఇన్ సర్వీస్ టీచర్లకి టెట్ అర్హత పరీక్షపై ఆందోళన చెందొద్దని రాష్ట్ర ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేసి 2011 కన్నా ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి టెట్ నుంచి మినహాయింపు వచ్చేలా ప్రయత్నిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్యా సంవత్సరం మధ్యలో తీసుకొస్తున్న సంస్కరణల వల్ల విద్యా సంవత్సరం కుంటుపడుతోందని ప్రయోగాలు విఫలమవుతున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు చూస్తుంటే ప్రపంచబ్యాంకు షరతులకు ఉచిత విద్య నుంచి ప్రభుత్వం తప్పుకొనేలా పావులు కదుపుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సురేష్‌బాబు, గాజుల నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుబ్రమణ్యంరాజు, జోసెఫ్, సుధీర్‌బాబు, తిమ్మన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జన విజ్ఞాన వేదిక నాయకులు విశ్వనాథం పాల్గొన్నారు.

# పల్లె బిడ్డలు.. హాకీలో దిట్టలు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** ఆటలు ఆడటం అందరికీ ఇష్టం. అయితే అందులో నైపుణ్యాలు ప్రదర్శించడం కొందరికే సాధ్యం. తాము ఎంచుకున్న ఆటలో రాణించి మండల స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలంటే ఎంతో శ్రమ, ప్రతిభ అవసరం. మారుమూల పల్లెల నుంచి వచ్చిన బాలికలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ.. ఆటల్లో సత్తా చాటుతున్నారు. మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సీనియర్లు ఆటను చూసి జాతీయ క్రీడ హాకీని ఎంచుకున్నారు. స్టిక్ చేతబట్టి మండల, జిల్లాస్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయం కోసం సర్వశక్తులు ఒడ్డి, చెమటోడ్చి ఈ క్రీడలో శెభాషనిపించుకుంటున్నారు.

హాకీ ఆడుతున్న క్రీడాకారులు

### సీనియర్లను చూసి నేర్చుకున్నా

నా పేరు **పి.పావని,** 7వ తరగతి చదువుతున్నా.. హాకీ అంటే ఇష్టం. పాఠశాలలో సీనియర్లు ఆడే హాకీ ఆటను చూసి నేను కూడా నేర్చుకోవాలనుకున్నాను. వ్యాయామోపాధ్యాయురాలు జలజ సహకారంతో ఆటలో నైపుణ్యం సాధించి మదనపల్లెలో మండల స్థాయి, చంద్రగిరిలో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో అండర్-17 ఉమ్మడి చిత్తూరు జిల్లా హాకీ బాలికల జట్టుకు ఎంపికయ్యాను. నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాను. గోల్‌కీపర్‌గా అక్కడ కూడా ప్రతిభ చూపాలన్నదే లక్ష్యం.

### జాతీయ జట్టుకు ఆడాలని

నా పేరు **యు.చందన,** 9వ తరగతి చదువుతున్నా. హాకీలో జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా లక్ష్యం. మూడేళ్లుగా హాకీలో శిక్షణ తీసుకుంటున్నాను. గత ఏడాది జిల్లాస్థాయి పోటీలకు మాత్రమే వెళ్లాను. ఈ ఏడాది ఎలాగైనా జాతీయ స్థాయిలో రాణించాలని వ్యాయామోపాధ్యాయురాలు జలజ వద్ద శిక్షణ తీసుకున్నాను. ఇటీవల చంద్రగిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో అండర్-17 హాకీ బాలికల జట్టుకు ఎంపిక చేశారు.

### క్రమశిక్షణ.. ఆరోగ్యం

నా పేరు **బిందుశ్రీ,** 8వ తరగతి చదువుతున్నా. ఆటల్లో రాణించి పోలీసు కావాలన్నదే నా లక్ష్యం. క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని పెంచే హాకీ ఆటను ఇష్టపడమే కాదు కష్టపడి ఆడాలి. వ్యాయామోపాధ్యాయులు నరేష్, నాగరాజు సహకారంతో ఇటీవల చంద్రగిరిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించి జట్టులో స్థానం సంపాదించాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నది లక్ష్యం. పోలీసునై పేదలకు న్యాయం చేస్తాను.

EENADU Classifieds

BUSINESS SERVICES

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమిషన్. వర్కర్ జీ 20k. శ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

ప్రముఖ ఇనోవిజన్ సంస్థ నందు పనిచేయుటకు పిక్కర్స్, ప్యాకర్స్, డెలివరీ బాయ్స్, సేల్స్ ప్రమోటర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 95151 30414, 91601 52122.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏదైనా డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే

Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

# మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నృత్య పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** జాతీయ స్థాయి నృత్య పోటీలకు మదనపల్లె విద్యార్థులు ఎంపికైనట్లు సూర్య డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు సూర్యకుమార్ తెలిపారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో మదనపల్లెకు చెందిన లిపికశ్రీ, యశస్విని, దివ్యశ్రీ హర్షిత ప్రతిభ చాటారు. వీరు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని స్పష్టం చేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రం, పురస్కారాన్ని ఏపీ డ్యాన్స్, స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు మురళీ, సురేంద్ర, మనోహర్ అందించారు.

## కార్మిక హక్కుల సాధనకు పోరాటం

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గంగాధర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి ఆ స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574955
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

స్పందనకు వందనం

### బస్సు సర్వీసు ఏర్పాటు

కలికిరి నుంచి కలకడ మార్గంలో సాయంత్రం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్ బోర్డుపై ప్రయాణిస్తుండటంపై నవంబరు 9న 'ఇంకెన్నాళ్లు.. ఈ ప్రయాణ ప్రయాస' అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ అధికారులు అదనపు బస్సు సర్వీసు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

**?:** బి.కొత్తకోట ఖాజాఖాన్‌వీధిలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్య వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. **- సమీవుల్లా, స్థానికుడు**

**✓:** త్వరలో కొత్త మోటారును అమర్చి ఖాజాఖాన్‌వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. **- లోకేశ్, ఏఈ, బి.కొత్తకోట నగర పంచాయతీ** **- న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

## చిన్నారులు.. క్రీడల్లో చిచ్చర పిడుగులు

### పరుగుపందెంలో సత్తా

పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న **మునిచందు** పీలేరు ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన పోటీలో సత్తా చాటి మదనపల్లెలో జరిగిన డివిజన్, జిల్లా స్థాయిలో 800 మీటర్ల పరుగుపందెంలో రాణించింది. శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో ప్రతిభ చాటింది. అనంతరం జాతీయ స్థాయి పరుగు పందెంలో పాల్గొని ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకుంది. అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి భవిష్యత్తులో వైద్య వృత్తిలో స్థిరపడాలన్నదే తన లక్ష్యమని విద్యార్థిని చెబుతోంది.

**పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పీలేరు-చిత్తూరు మార్గంలోని జ్యోతిబా పులే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ప్రిన్సిపల్ పకురున్నీసా ప్రోత్సాహం, పీడీ అమరావతి శిక్షణలో చిన్నారులు ఆటల్లో రాణిస్తున్నారు. పాఠశాల స్థాయిలో సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపికై ప్రతిభ చాటుతున్నారు. కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం, జావెలెన్ త్రో తదితర విభాగాల్లో రాణిస్తూ తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు. రాష్ట్ర స్థాయి జూనియర్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో జరిగిన పోటీల్లో రెడ్డికుమారి, చందు, అశ్విని, లహరి సత్తా చాటారు. అలాగే ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీలో మునిచందు 800 మీటర్ల పరుగు పందెంలో సత్తా చాటింది. ఖోఖో విభాగంలో రాష్ట్ర స్థాయిలో భవ్యశ్రీ రాణించింది. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.

### ఖోఖోలో రాణిస్తూ..

పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న **భవ్యశ్రీ** ఖోఖో విభాగంలో ప్రతిభ చాటుతోంది. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణిస్తోంది. మదనపల్లెలో జరిగిన డివిజన్ స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటి జిల్లాస్థాయికి ఎంపికైంది. చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో జరిగిన జిల్లా స్థాయి, అనకాపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడమే లక్ష్యంగా చిన్నారి సన్నద్ధమవుతోంది.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**గుర్రంకొండ, న్యూస్‌టుడే:** స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థినులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. ఆదివారం రిడో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు నమూనా ప్రశ్నపత్రాలు, స్టడీ మెటీరియల్స్‌ను రిడో డైరెక్టర్ బలా ఈశ్వరయ్య అందజేశారు. ఈ సందర్భంగా గురుకుల విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమిత్ర, ఉపాధ్యాయుడు త్రినాథ్‌రావు, ఉప్పుశ్రీనివాసులు, వెంకటేశ్వర్లు(రాజా) తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

## ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, నాయకులు

**మదనపల్లె పట్టణం, గ్రామీణ, విద్య, న్యూస్‌టుడే :** అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా ఆదివారం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ మదనపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, ఎస్పీ ధీరజ్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, పలువురు స్వాగతం పలికారు. అనంతరం అమ్మచెరువుమిట్ట అన్నమయ్య కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పలువురు ప్రసంగించారు. ఇందుకు భాజపా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కూటమి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ ఫొటో ప్రదర్శనను నాయకులు తిలకించారు. అంతకు ముందు మదనపల్లెలో బీజేపీ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్, భాజపా నాయకులు వల్లపల్లె నరసింహారెడ్డి, డాక్టర్ ఎన్. సేతు, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగోతు రమేష్, జనసేనపార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్‌ఖాదర్ ఖాన్, విశ్వబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణాచారి, వాల్మీకి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పుష్కర్ సింగ్ ధామీతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సభకు హాజరైన భాజపా శ్రేణులు

## హోరాహోరీగా ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు

క్రికెట్ ఆడుతున్న ఉపాధ్యాయులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా నిర్వహించారు. క్రీడలను డీఎఈఓ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగరాజు, డివిజన్ క్రీడల సమన్వయకర్త భద్రయ్య పర్యవేక్షించారు. బి.కొత్తకోటపై మదనపల్లె, ములకలచెరువుపై పెద్దమండ్యం, గుర్రంకొండపై రామసముద్రం, వాల్మీకిపురంపై పెద్దతిప్పసముద్రం జట్లు గెలిచి సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం నాలుగు జట్ల మధ్య పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, అన్వర్, ఖాదర్‌బాషా, రియాజ్, శ్రీనివాసులు, విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయ భూమి కౌలుకు వేలం 16న

**నిమ్మనపల్లె, న్యూస్‌టుడే:** నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూమిని కౌలు నిమిత్తం ఈ నెల 16న వేలం వేయనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. తవళం పంచాయతీ కార్యాలయం వద్ద వేలం దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

## పీలేరులో హిందువుల సమ్మేళనం

హాజరైన ప్రజలు
ప్రసంగిస్తున్న స్వరూపానందస్వామి

**పీలేరు, న్యూస్‌టుడే:** హిందువులు దేశభక్తి పెంపొందించుకుని భారత దేశఖ్యాతిని నలుదిశలా వ్యాపింపచేయాలని తిరుపతి శ్రీలలితా పీఠం స్వామిజీ స్వరూపానందస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపానందస్వామి మాట్లాడారు. గోరక్షకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వివరించారు. కార్యక్రమంలో కృష్ణానందస్వామి, ఆర్ఎస్ఎస్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీలేరు భువన పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన భక్తి గీతాల నృత్యాలు అందరిని అలరించాయి. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామికి పూజలు

**పీలేరు, న్యూస్‌టుడే:** ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి ఏడు వరాల వ్రతాన్ని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖరస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదికపై వేదమంత్రోత్తుల వ్రతం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

**రామసముద్రం, న్యూస్‌టుడే:** రామసముద్రంలోని దుర్గాదేవికి ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రామసముద్రం: దుర్గాదేవి
పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

## తెదేపా నాయకుడి మృతిపై సంతాపం

**రామసముద్రం, న్యూస్‌టుడే:** రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామపంచాయతీ దిగువబొంపల్లెకు చెందిన తెదేపా నాయకుడు రవి(45) ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. తెదేపా మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మండల నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## గొల్లపల్లెలో అగ్ని ప్రమాదం

**పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే :** మండలంలోని కమ్మచెరువు పంచాయతీ గొల్లపల్లెలో ఆదివారం ఓ ఇంట్లో విద్యుత్ ప్రమాదం జరిగింది. ఘటనలో రూ.లక్ష విలువైన గృహ సామగ్రి, వస్తువులు కాలిపోయినట్టు బాధితుడు నరసింహులు తెలిపారు.

## వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

**మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే :** వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన మహమ్మద్ జాఫర్ మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డులో వెల్డింగ్‌షాపు నిర్వహిస్తాడు. ఇక్కడ శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాబు పనిచేస్తాడు. వీరిద్దరూ ఆదివారం సాయంత్రం పని ముగించుకుని కదిరికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా దొమ్మన్నబావి వద్ద ముందు వెళ్తున్న కారును తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో మహమ్మద్ జాఫర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ❖ మదనపల్లె పట్టణంలోని దేవళంవీధికి చెందిన రాజశేఖర్, ఇతని భార్య సరస్వతిలు నిమ్మనపల్లె రోడ్డులో నూతనంగా నిర్మించిన ఇంటి వద్దకు ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రామాచార్లపల్లె వద్ద ఆటోను తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్‌సభ్యులు

**రాయచోటి, రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** పట్టణంలోని స్థానిక జేపీ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించినట్లు రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఎంకే రవీంద్ర తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. కనీస ఛార్జీలు చెల్లించి డయాలసిస్ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్ ) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

## వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

3కె రన్‌ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

**మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే :** స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానసంస్థ ఆధ్వర్యంలో 3కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత, ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ బయ్యారెడ్డి, సెంటర్ సమన్వయకర్త రామలింగారెడ్డి, విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు, అజ్మతుల్లాఖాన్, అమరనాథ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా పార్కింగ్.. రాకపోకలకు ఇక్కట్లు

నిమ్మనపల్లె బస్టాండు నుంచి తవళం క్రాస్‌వరకు రహదారికి ఇరువైపులా ద్విచక్రవాహనాలు ఆటోలు నిలపడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలన్నా ఇబ్బందిగా ఉందని వాహనచోదకులు వాపోతున్నారు. సంతరోజు వాహనాల రద్దీతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. **- న్యూస్‌టుడే, నిమ్మనపల్లె**

## సైనికులకు అండగా ఉండండి

ర్యాలీ నిర్వహిస్తున్న మిట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** దేశ రక్షణలో గాయపడిన సైనికులకు సాయం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు అంగళ్లులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను లెక్కచేయని సైనికుల సేవలను స్మరించుకోవాలన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు రూ.15 వేలు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధ్యానంతో ఆత్మవిశ్వాసం

ధ్యాన శిక్షణకు హాజరైన వివిధ ప్రాంతాల ప్రజలు

**పీలేరు, న్యూస్‌టుడే:** ధ్యానంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని ప్రముఖ ధ్యాన బోధకులు నరేంద్ర మొదల్కర్ అన్నారు. ఆదివారం పీలేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆత్మజ్ఞానంతో ఏదైనా సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆచరించే ప్రతి విషయంపై నమ్మకం ఉంచాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు సుధీర్, సిద్ధయ్య, భగవాన్, సిద్ధులమ్మ పాల్గొన్నారు.

**IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE [SENIOR DIVISION] OF MADANAPALLE**
**I.P. No. 37 OF 2025**

**Petitioners:** 1) B.Raveendra Babu, S/o B.Venkatramana, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 2) B.Latha, W/o B.Raveendra Babu, Basinikonda, Madanapalle Mandal, Annamayya District.
**Respondents:** 1) C.Sivarami Reddy, S/o C.Sankar Reddy, Madanapalle, Annamayya District, 2) B.Madhavi, W/o B.Mohan, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 3) G.Gowramma, W/o Bumanna, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 4) P.Nagaveni, W/o P.Venkata ramana, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 5) G. Venkatramana, S/o Gutta Chinnaswamy, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 6) D.Sadasivamurthy, S/o Munuswamy, Basinikonda, Madanapalle Mandal, Annamayya District, 7) A.Rajeswari, C/o Giri, Basinikonda, Madanapalle Mandal, Annamayya District.

**NOTICE**

యిందుమూలంగా ప్రతివాదులకు తెలియజేయడం ఏమనగా! వాదులు ఐ.పి. నెం: 37/2025 దాఖలు చేసికొని వున్నారు. సదరు ఐ.పి. **21-01-2026**న మీరు కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది.
**యస్.రాజగోపాల్, అడ్వకేట్, మదనపల్లి.**

## భూచట్టాల సవరణతో ప్రజలకు నష్టం

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** అసైన్డ్ భూముల చట్ట సవరణతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నష్టం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణప్ప చెప్పారు. భూహక్కు చట్ట సవరణపై జనవరి 4న బి.కొత్తకోటలో నిర్వహించే జిల్లా స్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం చిన్నతిప్పసముద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**మదనపల్లె విద్య, న్యూస్‌టుడే :** జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రెడ్డి అఖిల్, శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కొండామారిపల్లె గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 180 మందికి పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి దేవేంద్రనాయక్, పీడీ శరత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

**పీలేరు :** స్థానిక శ్రీకాకతీయ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

## సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**పీలేరు, పీలేరు గ్రామీణ:** ఏపీ సర్వేయర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు ఆదివారం పీలేరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. పీలేరు రెవెన్యూ డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా సి.రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఎన్.హర్షద్ అయూబ్‌ఖాన్, కార్యదర్శిగా జి.శరత్‌కుమార్, జాయింట్ కార్యదర్శిగా సి.అన్నపూర్ణ, కోశాధికారిగా బి.విజయ్‌కుమార్ నాయక్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

సర్వేయర్ల సంఘ కార్యవర్గం ఇదే

20వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ మార్పూరి వెంకటస్వామి నాయుడు గారు, కీ॥శే॥శ్రీమతి మార్పూరి లక్ష్మమ్మ గారు
మదనపల్లి

అనురాగం, ఆత్మీయత పంచిన అమృతమూర్తులు, అమ్మానాన్నలుగా, అత్తమామలుగా, నాలుగు తరాల వారసులకు ఆదర్శప్రాయులుగా పరిపూర్ణ జీవితం గడిపిన మీకు ఇవే మా హృదయపూర్వక నమస్సులు.

కుటుంబ సభ్యులు
అమ్మనేని వీధి, మదనపల్లి.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

## కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రశంసా పత్రాలను చూపుతున్న విజేతలు

**సుండుపల్లి, న్యూస్‌టుడే:** విశాఖపట్నంలో నిర్వహించిన 19వ ఏపీ రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో మండల విద్యార్థులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారని మాధురి ఇంగ్లీషుమీడియం పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సుధాకర్, హెచ్ఎం చంద్రానాయక్‌లు తెలిపారు. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో దీక్షిత, అనంతరామ్, అభిలాష్, నవనీత్ బంగారు పతకాలు గెలుపొందగా, స్వాతి, పవన్‌తేజ్, కార్తిక్‌లు వెండి, వర్షిత, ఫజురుల్లాలు రజత పతకాలు సాధించారన్నారు.

## వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని గోవిందంపల్లె పంచాయతీ శంకరాపురంలో ఆదివారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానికులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శంకరాపురం ప్రజలందరూ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

## కలిసికట్టుగా జిల్లాను సాధించుకుందాం

మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

**రాజంపేట, న్యూస్‌టుడే:** రాజంపేట జిల్లా కేంద్రాన్ని అందరూ కలిసికట్టుగా సాధించుకుందామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. గత వైకాపా ప్రభుత్వం రాజంపేట ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని, ఆ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు వైకాపా మాయలో పడే పరిస్థితిలేదన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● తెదేపా సీనియర్ నాయకుడు మోదుగుల పెంచలయ్యతో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు భేటీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ స్థితిగతులు, ప్రజా సమస్యలపై చర్చించుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు ఆ పార్టీకి ఉపయుక్తంగా ఉంటాయని చమర్తి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్పీటీసీ సంఘ అధ్యక్షుడు ఎల్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం ఆసుపత్రికి వస్తే అంతే!

■ రోగుల ఇబ్బందులు పట్టని అధికారులు
■ పీహెచ్‌సీల్లో న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

ఆదివారం.. పేదలకు అనారోగ్యం రాకూడదు.. వస్తే ఇక అంతే సంగతులు. . మారుమూల గ్రామాల నుంచి కాళ్లీడ్చుకుంటూ సర్కారు ఆసుపత్రికి వస్తే తాళం దర్శనమిస్తోంది.. ఒక వేళ నర్సు ఉంటే మందులిచ్చి పంపించి వేస్తున్నారు. అదీ 9 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే. ఆ తర్వాత వస్తే తాళాలే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, పట్టించుకోకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట, చేసిందే వైద్యం అన్న విధంగా తయారైంది. 'న్యూస్‌టుడే' ప్రత్యేక పరిశీలన చేసింది. **- న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె, సుండుపల్లె, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట గ్రామీణ**

ఓబులవారిపల్లెలో వైద్యుడి కోసం చూస్తున్న రోగులు

దేవళంపల్లెలో వైద్యుడి గదికి తాళం

● రాజంపేట మండల కేంద్రంలోని ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం వైద్యుడు అందుబాటులో ఉన్నారు. 11 గంటల వరకు ఓపీ చూసి వెళ్లిపోయారు. రోగులు వస్తున్నప్పటికీ నర్సు మందులు అందించి పంపించారు. కనీసం స్టాఫ్ నర్సు కూడా అందుబటులో లేకపోవడం దారుణమని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు సిబ్బంది ఉన్న ఆసుపత్రిలో ఒక్కరే హాజరయ్యారు.

● ఓబులవారిపల్లె మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఉన్నది 24 గంటల పీహెచ్‌సీ. ఆదివారం ఇద్దరు వైద్యులూ గైర్హాజరయ్యారు. సుమారు 50 మంది వరకు రోగులు వచ్చి ఆసుపత్రిలో పరీక్షించే వారు లేక నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. ఈ ఆసుపత్రిలో ఈ శని, ఆదివారాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని సెలవు రోజుల్లో రోగులకు ఇబ్బందులు తప్పవని స్థానికులు వాపోతున్నారు.

● రామాపురంలో 11 గంటలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయారు. విధులకు నర్సు ఒక్కరే హాజరుకాగా వైద్యులు రాలేదు. దీంతో వచ్చిన రోగులంతా ఉసూరుమంటూ నిరాశతో వెనుదిరిగారు.

## బాధిత కుటుంబాల వివరాలు సేకరణ

● మర్లబైర్లు, పెర్లకుంట గ్రామాలకు మోక్షం

**రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే:(పెనగలూరు):** సోమశిల జలాశయం వెనక జలాలు కారణంగా ముంపునకు గురైన పెర్లకుంట, మర్లబైర్లు గ్రామాల బాధిత కుటుంబాలకు చెందిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పెనగలూరు తహసీల్దార్ డి. అమరేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు పెర్లకుంట, మర్లబైర్లు గ్రామాలకు చెందిన ప్రజల పూర్తి వివరాలను డిసెంబర్ 16, 17 తేదీల్లో పెనగలూరు తహసీల్దార్ కార్యాలయంలో సేకరిస్తున్నామన్నారు. సోమశిల ప్రాజెక్టు వెనుక జలాల కారణంగా ముంపునకు గురైన బాధితులను గుర్తించి వారికి నష్టపరిహారం పంపిణీ చేస్తామన్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు సంబంధిత పత్రాలను అందజేయాలని కోరారు.

**CHANGE OF NAME**
I, SHAIK MAHAMMAD NAVID BASHA (Old Name), R/o. D.No. 5/140-3-1, Reddys Colony, JP Nagar, Rayachoty, Annamayya District, A.P. Changed my Name as SHAIK NAVEED BASHA (NEW NAME).

మహారాజశ్రీ రాయచోటి అదనపు జిల్లా కోర్టు వారి సమక్షమున
ఐ.ఏ. నెంబర్ : 9/2023
ఐ.ఏ. నెంబర్ : 565/2018
ఓ.ఎస్. నెంబర్ : 2/2015
[illegible]
...న్యాయవాది ద్వారా కానీ సదరు కోర్టులో హాజరై జవాబు దాఖలు చేసుకోవలెను. అట్లు తప్పిన యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.
//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
ఎస్.కృష్ణ కుమార్, బి.రమేష్,
న్యాయవాదులు, రాజంపేట.

In The Court of The Hon'ble Civil Judge (Junior Division) Railway Kodur
O.S.No.137/2025
Between:
Veerapuram Sumanth S/o Vijayachari R/at D.No.9-359-1, Sriram Nagar, Railwaykodur (Post & Mandal), Annamaiah Dist. & Others ...వాదులు
V/s
Pasupuleti Chandra Sekhar S/o Subramanyam, Aged about 58 years, Hindu, Agriculture, R/at House No: 8-3, Chennarajampodu (Village & Post), Obulavaripalli (Mandal), Annamaiah (Dist), AP. Pin: 516105 ...ప్రతివాది 2
NOTICE
పై నెంబరు దావాలో వాదులు, Declaration of Right And Title, Recovery of Possession & Permeanant injunction కొరకు దావా దాఖలు చేసియున్నారు. 2వ ప్రతివాది కు గాను 30.12.2025 తేదీన వున్నది. 2వ ప్రతివాదికి ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదాకు హాజరు అయి, తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షములో ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
పి.వి.సుధాకర్, అడ్వకేట్, కడప
Cell: 9949236891

In The Court of The Hon'ble Civil Judge (Junior Division) Railway Kodur
I.A.No. 493/2025, O.S.No.137/2025
Between:
Veerapuram Sumanth S/o Vijayachari R/at D.No.9-359-1, Sriram Nagar, Railwaykodur (Post & Mandal), Annamaiah (District) ...పిటిషనర్/వాది నెం.1
V/s
Pasupuleti Chandra Sekhar S/o Subramanyam, Aged about 58 years, Hindu, Agriculture, R/at House No: 8-3, Chennarajampodu (Village & Post), Obulavaripalli (Mandal), Annamaiah (Dist), AP. Pin: 516105 ....రెస్పాండెంట్ నెం.2/ప్రతివాది నెం.2
NOTICE
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్, దావా ఆస్తిని రెస్పాండెంట్ నెం.2 మరియు 3 మరియు వారి ప్రతినిధులు దావా పూర్తి అయ్యేంతవరకు, ఇతరులకు అమ్ముట, తాకట్టు పెట్టుట, గిఫ్ట్ మొ॥ చేయకుండా ఆపాలని రాజశ్రీ కోర్టువారిని వేడుకొనియున్నారు. 2వ రెస్పాండెంట్ నోటీసుకు గాను 30.12.2025 తేదీన వాయిదా వున్నది. 2వ రెస్పాండెంటుకు ఆక్షేపణలు ఉన్నయెడల రాజశ్రీ కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదా రోజున హాజరు అయి, తెలుపుకొనవచ్చును. లేనియెడల మీ పరోక్షములో ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
పి.వి.సుధాకర్, అడ్వకేట్, కడప
Cell: 9949236891

In The Court of The Hon'ble Civil Judge (Junior Division) Railway Kodur
I.A.No. 495/2025, O.S.No.137/2025
Between:
Veerapuram Sumanth S/o Vijayachari R/at D.No.9-359-1, Sriram Nagar, Railwaykodur (Post & Mandal), Annamaiah Dist. ...పిటిషనర్/వాది నెం.1
V/s
Pasupuleti Chandra Sekhar S/o Subramanyam, Aged about 58 years, Hindu, Agriculture, R/at House No: 8-3, Chennarajampodu (Village & Post), Obulavaripalli (Mandal), Annamaiah (Dist), AP. Pin: 516105 ....రెస్పాండెంట్ నెం.2/ప్రతివాది నెం.2
NOTICE
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్, దావా ఆస్థిలో వున్న పిటిషనర్ తాతగారి సమాధిని Demolish చెయ్యకూడదని, Damage చేయకూడదని మరియు ప్రతి సంక్రాంతి పర్వదినాలలో పిటిషనర్ మరియు వారి కుటుంబ సభ్యులు జరిపే పితృదేవతాపూజలను అడ్డగించకుండా రెస్పాండెంట్ నెం.2 మరియు వారి మనుష్యులను నియంత్రించమని రాజశ్రీ కోర్టు వారిని వేడుకుంటూ పిటిషన్‌లో దాఖలు చేసియున్నారు. 2వ రెస్పాండెంట్ నోటీసుకు గాను 30.12.2025 తేదీన వాయిదా వున్నది. 2వ రెస్పాండెంటుకు ఆక్షేపణలు ఉన్నయెడల రాజశ్రీ కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదా రోజున హాజరు అయి, తెలుపుకొన వచ్చును. లేనియెడల మీ పరోక్షములో ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
పి.వి.సుధాకర్, అడ్వకేట్, కడప
Cell: 9949236891

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

**రాయచోటి (గ్రామీణ), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మాధవరం గ్రామం, కొండకింద వారిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక గ్రామస్థులతో కలసి ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురై 15 నెలలు గడిచిందని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తాగు నీటి బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంఘాభివృద్ధికి కృషి

**పుల్లంపేట, న్యూస్‌టుడే:** ఉమ్మడి కడప జిల్లా పద్మశాలి సంఘం కార్యవర్గంలోకి పుల్లంపేట మండలానికి చెందిన సందా లక్ష్మీనరసయ్య, ఉమ్మడి నరేంద్రలను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేసినట్లు ఉమ్మడి కడప జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చెన్నా వెంకటకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని రిలే దీక్షలు

దీక్షలో పాల్గొన్న విశ్వేశ్వరనాయుడు, పంతగాని, తాతంశెట్టి తదితరులు

**రైల్వేకోడూరు, న్యూస్‌టుడే:** రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రైల్వేకోడూరులో ఆదివారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెదేపా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాజంపేటను జిల్లా కేంద్రంగా మార్చాలని కోరారు. జేఏసీ అధ్యక్షుడు ముత్యాల పెంచలయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాజంపేట: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

**వీరబల్లి, న్యూస్‌టుడే:** వీరబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1984వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులైన విశ్వనాథరెడ్డి, వి.శ్రీనివాసులు, పీఈటీ జయరామ రాజు, తిమ్మయ్యలను సత్కరించారు. పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొన్నారు. కలిసి భోజనం చేశారు.

వీరబల్లిలో మాట్లాడుతున్న గురువులు

**రాజంపేట గ్రామీణ:** రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేపీ మోర్గాన్ సీనియర్ వైస్ అధ్యక్షుడుగా పని చేస్తున్న జగదీష్ మాట్లాడుతూ అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభ దశ నుంచే విద్యా ప్రమాణాలు, విలువలతో కూడిన బోధనకు ప్రాధ్యానత ఇవ్వడంతో విశ్వవిద్యాలయంగా మారిందన్నారు. అంకితభావం, క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్యార్థుల జీవితాలను ఉన్నత దశకు చేరుకునేలా మారుస్తున్నాయని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీసీ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ నారాయణ, వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

**రాయచోటి, రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే:** పట్టణంలోని స్థానిక జేపీ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించినట్లు రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ ఎంకే రవీంద్ర తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. కనీస ఛార్జీలు చెల్లించి డయాలసిస్ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న వాసవీ డిస్టిక్ గవర్నర్ ఎంకే రవీంద్ర

## ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందిస్తాం

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణంగా సహకారం అందిస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్టలో ఐకాస నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజు ఆదివారం కొనసాగాయి. శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా భౌగోళికపరంగా మధ్యలో ఉన్న రాయచోటిలో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాడు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా మదనపల్లెను జిల్లా చేస్తామని ఇప్పటి ప్రభుత్వం ప్రకటించినట్లు వివరించారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాంతంలో జిల్లా కేంద్రాన్ని ఉంచాలన్నారు.

## వాసవీ క్లబ్ కమిటీ నియామకం

**రాజంపేట, న్యూస్‌టుడే:** రాజంపేట వాసవీ క్లబ్ నూతన కమిటీని ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.ధనుష్, కమిటీ కార్యదర్శులుగా విఘ్నేష్, బి.సత్య, కోశాధికారిగా చైతన్యను వీ206ఏ క్యాబినెట్ కోశాధికారి సనిశెట్టి నవీన్‌కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాజేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులతో ఆర్యవైశ్య నాయకులు

## కడపలో కొనసాగించాలని ఆందోళన

సిద్దవటంలో నిర్వహించిన దీక్షలో ఉపాధ్యాయులు, ఇతరులు

**సిద్దవటం, న్యూస్‌టుడే:** అన్నమయ్య జిల్లాలో విలీనం చేయకుండా సిద్దవటాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని సిద్దవటం, భాకరాపేట, మాధవరం గ్రామాల్లో ఆదివారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సిద్దవటంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, భాకరాపేట, మాధవరం గ్రామాల్లో జేఏసీ నాయకులతో పాటు తెదేపా, వైకాపా, జనసేన పార్టీ నాయకులు, స్థానికులు రిలే దీక్షల్లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరభద్రుడు, సొసైటీ అధ్యక్షుడు దశరథరామనాయుడు, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సిద్దవటానికి సమీపంలో ఉన్న కడప జిల్లాను కాదని సుదూరంలో ఉన్న రాయచోటి జిల్లా కేంద్రంలో విలీనం చేయడం ఎంతవరకు సబబు అన్ని ప్రశ్నించారు.

## శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని **ఎస్.ఐ వల్లెపు శ్రీనివాసులు** అన్నారు. ఒంటిమిట్టలో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి బదిలీపై వచ్చారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాషా తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## సమాజాన్ని చైతన్య పరచడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

సమావేశంలో స్వరూపానందస్వామి, వక్తలు

**వీరబల్లి, న్యూస్‌టుడే:** హిందూ సమాజాన్ని చైతన్య పరచడమే ఆర్ఎస్ఎస్ సేవా సంఘం లక్ష్యం అని తిరుపతికి చెందిన స్వరూపానందస్వామి తెలిపారు. వీరబల్లిలోని గడికోట రోడ్డులో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి ప్రాణం హిందూ ధర్మమేనన్నారు. హిందూ సమాజ చైతన్యం, సమస్యల పరిష్కారానికి శాంతియుత జీవన ప్రగతికి మూలమన్నారు.

## జూదరుల అరెస్టు

**చిట్వేలి (పుల్లంపేట):** చిట్వేలి మండలం చెర్లోపల్లి సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,300 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వినోద్‌కుమార్ వివరించారు.

**సుండుపల్లి:** మండలంలోని మడితాటివాండ్లపల్లి సమీపంలో జూదమాడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేశామని ఎస్.కె.ఎం.హుసేన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 9,080 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## కంపచెట్ల తొలగింపునకు చర్యలు

**తిమ్మసముద్రం (సుండుపల్లి), న్యూస్‌టుడే:** మైస్కూల్- మైప్రైడ్ కార్యక్రమంలో భాగంగా తిమ్మసముద్రం జడ్పీ ఉర్దూ ఉన్నతపాఠశాల ప్రత్యేక అధికారిగా నియమితులైన రహదారుల శాఖ ఏఈఈ కుమార్‌బాబు చొరవతో ఆ పాఠశాల ఆటస్థలంలో పెరిగిన కంపచెట్లను జెసీబీ ద్వారా ఆదివారం తొలగింపజేశారు. ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఆటస్థలంలో కంపచెట్లు పెరిగి విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని ఆ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సొంత ఖర్చుతో తెటస్థలంలో పెరిగిన కంపచెట్లను తొలగింప చేశారు.

## వెలిగల్లుకు వెలుగొచ్చేనా!

✧ హామీలకే పరిమితమైన ఆధునికీకరణ పనులు

వెలిగల్లులో జలకళ

**గాలివీడు, న్యూస్‌టుడే:** జిల్లాలో రాయచోటి- కదిరి ప్రధాన మార్గంలో గాలివీడు వద్ద వెలిగల్లు జలాశయం పర్యాటక రంగం పరంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. పర్యాటకులకు ఆహ్లాద వాతావరణం కల్పించేలా పుష్కలమైన వనరులున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదు. గత వైకాపా పాలనలో అప్పటి జిల్లా కలెక్టరు గండిమడుగు కొండల మధ్య రోప్ వే, ఉద్యానవనం సమీపంలో వసతి గృహాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందు కోసం రెవెన్యూ శాఖ ఆ ప్రాంత సమీపంలో భవనాలకు స్థల సేకరణ కూడా చేశారు. పక్కనే ఉన్న గండిమడుగు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని భావించారు. అధికారుల బదిలీలతో సుందరీకరణ పనులు అటకెక్కాయి. కనీసం జలాశయంలో బోటు షికారు ఏర్పాటుకు కూడా ముందుకు రావడం లేదు. ఉన్నంతలో సర్దుకొని పోయేరీతిలో ఉద్యానవనాన్ని గుత్తేదారుకు అప్పజెప్పి సందర్శకులకు ఊరట కల్పిస్తున్నారు.

● ఇటీవల రవాణ యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెలిగల్లును సందర్శించారు. పర్యాటక ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. హరిత రెస్టారెంటు, వసతి గృహాల నిర్మాణంకు స్థలం సేకరించాలని అధికారులను ఆదేశించారు.

● 20 ఏళ్ల కిందట జలాశయం నిర్మాణ సమయంలో పర్యాటక శాఖ బోటు షికారును ఏర్పాటు చేసింది. గుత్తేదారుకు బాధ్యతను ఇవ్వడంతో ఒక బోటును కూడా తెప్పించారు. ఒడ్డు నుంచి నీటిలోకి వెళ్లడానికి అనువుగా తాత్కాలికంగా పనులు చేపట్టారు. పర్యాటకులు జలానుభూతి పొందేలా ప్రాజెక్టులో బోటు షికారు తిప్పారు. అనంతరం ప్రభుత్వం మారడంతో బోటు షికారు ఆగిపోయింది. ఆ తర్వాత ఏమైందో తెలియదుగానీ జల షికారుకు అనుమతి రాలేదని పక్కన పట్టేశారు. పాపఘ్ని నదిపై ఉన్న వెలిగల్లుకు ఎగువ నుంచి ఏటా పుష్కలంగా నీళ్లు చేరుతున్నాయి. గరిష్ఠ నీటి సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.27 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. ఏటా రెండు టీఎంసీలకు తగ్గడం లేదు. అయినప్పటికీ బోటు షికారు గురించి పట్టించుకునే వారే కనిపించలేదు. ఉద్యానవనంలో వసతి గృహాలు ఏర్పాటు చేసేలా ముందుకు సాగడం లేదు. బోటు షికారు కోసం నిర్మించిన గది నిరుపయోగంగా మారింది. పండుగలు, సెలవుల దినాల్లో ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు, పర్యాటకులు వస్తుంటారు. కూటమి పాలనలో వెలిగల్లు పర్యాటక అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. బోటు షికారు కోసం పర్యాటక శాఖ అధికారులకు నివేదించాం. పర్యాటక ప్రాంతం అభివృద్ధి కోసం నివేదికలు పంపామని ఈఈ భరత్‌కుమార్ తెలిపారు.

ఉద్యానవనంలో పచ్చదనం

13వ వర్ధంతి

పుట్టుట, గిట్టుట మన చేతుల్లో లేనిది కానీ మంచి అనిపించుకోవడం మన చేతుల్లోనే ఉన్నదని నిరూపించిన మీ జీవితం మాకు ఆదర్శం.
గూడె వెంకట్రమణ స్వామి
మరణం: 15.12.2012
భార్య : జి.నాగులమ్మ
కుమారులు: జి.నాగేశ్వరరావు, జి.శివశంకర
కోడళ్లు: జి.లక్ష్మీదేవి, జి.జయసుధ
మనవళ్లు: మణికంఠ తేజ, శివతేజేష్
మనుమరాండ్రు: దివ్యశ్రీ, శిరీష, శ్రీచేతన
దివ్యతేజ హైస్కూల్
The Digital Smart School, బేతల్ కాలనీ, రాయచోటి.

11వ వర్ధంతి

కీ॥శే॥ నాగినేని నారాయణ నాయుడు
DBN పల్లె, రాజంపేట. మరణం : 15/12/14
మంచితనానికి, మానవత్వానికి ప్రతిరూపమై మా అందరి మనసులు ఆకట్టుకొని ఆకస్మికంగా మమ్ములను వీడి దైవసన్నిధికి చేరి 11 సం॥రాలు గడిచినను నీ మధురస్మృతులు మాలో పదిలం.
భార్య : నాగినేని అంజనమ్మ
కుమారులు - కోడళ్లు
నాగినేని దివాకర్ చౌదరి దీపిక
నాగినేని ఎర్త్‌మూవర్స్ & మట్టి ఇటుక, బైపాస్ రోడ్డు, రాజంపేట.
నాగినేని నవీన్ కుమార్ నాయుడు నీరజ
ప్రైవేటు బిల్డర్, కాకతీయ సేవా సమితి ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా, రాజంపేట.
మనుమరాళ్లు : చైత్రా చౌదరి, లాస్య చౌదరి
మనుమళ్ళు : నిహాంత్ చౌదరి, కేతన్‌దేవ్ చౌదరి
తమ్ముళ్ళు మరదళ్లు
నాగినేని రమణయ్య నాయుడు రామసుబ్బమ్మ (బుజ్జమ్మ)
నాగినేని నాగేశ్వర్ నాయుడు పద్మ
పద్మ ట్రేడర్స్, బైపాస్ రోడ్, రాజంపేట.
చెల్లెళ్ళు - బావగార్లు
యస్.వెంకటసుబ్బమ్మ - కీ॥శే॥ రామయ్య నాయుడు
జి.యశోద - ఆదినారాయణ నాయుడు
మట్టి ఇటుక, రాజంపేట.
మరియు కుటుంబ సభ్యులు

# ఆత్మీయ వేడుక

తరగతి గదులు.. చదివిన పాఠాలు. నాటి జ్ఞాపకాలు.. స్నేహితుల కబుర్లు, ఆత్మీయ పలకరింపులు.. ఆనంద డోలికలు.. ఉపాధ్యాయుల ఆశీస్సులు, తీపిగుర్తుల కలబోతగా నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీ ప్రాంగణం కోలాహలంగా మారింది. రెండురోజుల పాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం ఆదివారంతో ముగిసింది. పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు.

**వైభవంగా సాగర్ ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవం**

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురిసౌత్

నృత్యాలతో పూర్వ విద్యార్థుల సందడి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి చదువుకున్న వారంతా పలువురు కార్లలో నాగార్జునసాగర్‌వైపు ఆదివారం ఉదయం నుంచే బారులుదీరారు. 1975 మొదలుకొని ఇప్పటి వరకు కాలేజీలో చదువుకున్న వారు బ్యాచ్‌ల వారీగా ప్రధాన వేదిక వద్ద గ్రూప్ ఫొటోలు దిగారు. కొందరు పాటల రూపంలో భావోద్వేగాలను వ్యక్తీకరిస్తే.. మరికొందరు ప్రసంగాల రూపంలో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. వివిధ రకాల పాటలకు వయసుతో సంబంధం లేకుండా నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. తరగతి గదులు, కూర్చున్న బెంచీలు కుటుంబ సభ్యులకు చూపిస్తూ చాలామంది భావోద్వేగానికి లోనయ్యారు.

❖ పూర్వ విద్యార్థులకు ప్రస్తుతం చదువుతున్న ఇంటర్ విద్యార్థులు సాయమందించారు. కొందరు ట్రాఫిక్ విధులు నిర్వహించి వాహనాలకు దారిచూపారు. అల్పాహారం వడ్డిస్తూ.. ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రస్తుతం ఏపీ విద్యార్థులే చదువుతున్నారు. ఈ కళాశాల ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు తెలంగాణ జిల్లాల విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకున్నారు. ఇప్పుడు వారి రాకతో మరింత కళ వచ్చింది.

కుటుంబ సభ్యులతో ఏపీఆర్‌జేసీ మొదటి బ్యాచ్ విద్యార్థులు

## ఉమ్మడి జిల్లాలో రెండు రైల్వేస్టేషన్ల ప్రత్యేకత

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు రైల్వే స్టేషన్లది ప్రత్యేక స్థానం. సాధారణంగా రైలు ఓ స్టేషన్‌కు చేరి అక్కడి నుంచి ముందుకు వెళ్లకుండా వెనక్కి తిరిగి వెళ్లే ముగింపు రైల్వే స్టేషన్లు అరుదు. ఆంగ్లేయుల కాలంలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేపల్లె, మాచర్ల పట్టణాల్లో రెండుచోట్ల ఈ ముగింపు స్టేషన్లు నిర్మించారు. పేదలు ప్రయాణించడానికి, ఆయా ప్రాంతాల్లో పండే పంట ఉత్పత్తులను నగరాలకు చేర్చడానికి నిర్మించిన ముగింపు స్టేషన్లు ఇప్పటికీ వేలాదిమందికి సేవలు అందిస్తున్నాయి. - ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, రేపల్లెఅర్బన్

# మూలిగితే మూలకే.. సేవలకు నెలలే!

**గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహణలేమితో సమస్యలు**

ఈనాడు, అమరావతి

వైద్య పరికరాలు మూలిగితే చాలు మూలకుచేరిపోతున్నాయి. నిర్వహణ లోపంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఏదైనా కొత్త పరికరాలు ఎలాగూ పాడు చేస్తుంటే.. అవి మరమ్మతుల పేరిట నెలల తరబడి వినియోగానికి రావడం లేదు. గుంటూరు జీజీహెచ్ ఆరు జిల్లాల వైద్య ప్రదాయిని. నిత్యం 5వేల మందికి పైగా రోగులకు చికిత్స అందిస్తారు. 1500 మంది ఇన్‌పేషెంట్లుగా సేవలు పొందుతారు. ఇంతటి కీలకమైన వైద్యాలయంలో కొన్ని విభాగాల పరంగా నిర్వహణ లోపాలు సమస్యగా తయారయ్యాయి.

**సీటీ స్కాన్లు ఎప్పుడు పనిచేస్తాయో తెలియదు..**

ప్రధానంగా కొన్ని యంత్ర పరికరాలు తరచూ మొరాయిస్తుండడం సమస్యను జటిలం చేస్తోంది. పరిమితికి మించి రోగుల రాకతో వాటిపై ఒత్తిడి పడుతోంది. రేడియాలజీ విభాగంలో ఇది తరచూ జరుగుతోంది. సీటీ స్కాన్లు ఎప్పుడు పనిచేస్తాయో, ఎప్పుడు మొరాయిస్తాయో అర్థం కాని పరిస్థితి. ఇక ఆపరేషన్ థియేటర్లలో ఓటీ లైట్ల నుంచి ఎండోస్కోపీ, ల్యాపరోస్కోపీ వంటి కీలక యంత్రాల వరకు ఇలాగే తయారయ్యాయి. సీయామ్ మిషన్లు, అనస్తీషియా వర్క్ స్టేషన్లు తరచూ మొరాయిస్తున్నాయి.

జీజీహెచ్‌లో పక్కన పడేసిన వెంటిలేటర్లు

**అవి ఉన్నా లేనట్లే..**

కొవిడ్ అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు గుంటూరు జీజీహెచ్‌కు పీఎం కేర్ కింద 100కు పైగా వెంటిలేటర్లు వచ్చాయి. ఇవన్నీ మూన్నాళ్లకే మూలన చేరడంతో సమస్య ఏర్పడింది. వీటికి విడిభాగాలు, మరమ్మతులు చేసే కాంట్రాక్టు దొరక్క మూలన పెట్టేశారు. అసలే స్థలాభావంతో ఇబ్బంది పడుతున్న జీజీహెచ్‌లో ఇది మరింత ఇబ్బందిగా మారింది. ఏం చేయాలో అర్థం కాక అధికారులు వీటిని ఆస్పత్రి ప్రాంగణంలోనే ఆరుబయట ప్రాంతాల్లో నిల్వ చేశారు. వీటిని ఎలా వినియోగంలోకి తీసుకురావాలో అర్థం కాక ఆసుపత్రి వర్గాలు, వైద్యఆరోగ్యశాఖ తల పట్టుకున్నాయి.

**లెక్కల్లోకి వచ్చేది తక్కువే**

జీజీహెచ్‌లోని మొత్తం 3,121 పరికరాల్లో 49 పని చేయడం లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో క్రిటికల్ కేర్ పరికరాలు 7, నాన్ క్రిటికల్ కేర్ పరికరాలు 42 ఉన్నాయి. 118 తుక్కు కింద మార్చేందుకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నా ఇంతకు మూడింతలు మూలన చేరాయన్నది బహిరంగ రహస్యం.

**వినియోగంలోకి వచ్చేలా ప్రయత్నం..**

ఆసుపత్రిలో కీలక పరికరాలను యుద్ధప్రాతిపదికన వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కొన్నింటిని వార్షిక నిర్వహణ కింద బాగు చేయించాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. - ఎస్.ఎస్.వి.రమణ, సూపరింటెండెంట్

# ఉన్నతికి కళాశాల పునాది

**పూర్వ విద్యార్థుల ఉద్ఘాటన**

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురిసౌత్: నాగార్జునసాగర్ గురుకుల జూనియర్ కళాశాల చదువే తమ ఉన్నతికి పునాది అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. స్వర్ణోత్సవాల వేళ పాత్రికేయులతో గుర్తు చేసుకున్నారు. మరోవైపు కాలేజీకి నిధుల పరంగా ఇబ్బందుల్లేవని కానీ.. అధ్యాపక బృందం కొరత వేధిస్తోందని, నిష్ణాతులైన అధ్యాపకుల్ని నియమించడంపై దృష్టి సారించాలని పలువురు వక్తలు కోరారు.

### విలువలతో కూడిన విద్య

మొదటిబ్యాచ్‌లో విద్యార్థుల్లో ఇద్దరు ఐఏఎస్, ఐపీఎస్‌లయ్యారు. అందులో నేను ఐపీఎస్ కావడం ఆనందంగా ఉంది. ఏపీఆర్‌జేసీ ప్రారంభించినప్పుడు బ్రిడ్జికోర్సులో ఉంచి చదువు చెప్పారు. పాములు, జింకలు మా కాలేజీ చుట్టుపక్కల తిరుగుతుండేవి. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకపోయినా క్రమశిక్షణ వచ్చింది. క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అందుకున్నాం. ఇప్పుడు అలాంటి మెరుగులు బయటకు రావడం లేదు. - మల్లారెడ్డి, మాజీ డీజీ

### చేయూత అందిస్తా

నేను 1988-90 బ్యాచ్ బైపీసీ విద్యార్థిని. ఇక్కడ నేర్చుకున్న వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు జీవితంలో ఉపయోగపడ్డాయి. ఇక్కడికి వచ్చాక మనసు 35 ఏళ్ల వెనక్కి వెళ్లింది. 50 ఏళ్ల పండుగ మహోత్సవం జరగడం ఆనందంగా ఉంది. కాలేజీ అభివృద్ధికి ట్రస్టు ఏర్పాటు చేస్తే నా వంతు సాయం అందిస్తా. సూపర్ విద్యార్థులతో మమేకమవడం ఆనందంగా ఉంది. - జస్టిస్ తుకారాంజీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

### కల నెరవేరింది

ఏపీఆర్‌జేసీలో చదువుకోవడం నా కల. అది నెరవేరింది. 1978-80 బ్యాచ్ మాది. బైపీసీ చదివా. సాగర్ ఏపీఆర్‌జేసీలో విద్యనభ్యసించడం అదృష్టంగా భావిస్తా. ఈ కళాశాలలో చదువుకోవడం నాడు ప్రతి పేద విద్యార్థికి లక్ష్యంగా ఉండేది. ఏపీఆర్‌జేసీలో విద్యనభ్యసించడంతో నా ఉన్నతికి బాటలుపడ్డాయి. చైనా, జపాన్, కెనడా దేశాలకు విదేశాంగ శాఖ కార్యదర్శిగా, తర్వాత హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్టు ఉన్నతాధికారిగా విధులు నిర్వర్తించానంటే ఇక్కడ వేసిన పునాదులే కారణం. - రాజశేఖర్ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి

### నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నా

మాది 1983-85 బ్యాచ్. ఎండీ అనస్తీషియా వైద్యనిపుణుడిగా స్థిరపడ్డా. 1999లో తెలుగుదేశం పార్టీ ఎంపీగా శ్రీకాకుళం నుంచి పోటీ చేసి గెలుపొందా. కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, టీం స్పిరిట్, అన్నివిభాగాల్లో తర్ఫీదు, క్రమశిక్షణ ఇక్కడ నేర్చుకోవడం వల్లే రాజకీయాల్లో ఎంపీగా రాణించా. ప్రస్తుతం శ్రీకాకుళం జేమ్స్ మెడికల్ కాలేజీలో హెచ్‌వోడీగా చేస్తున్నా. ఈ క్యాంపస్‌కు వస్తే అమ్మ దగ్గరకు వచ్చినట్టుంది. - డా.డీవీజీ శంకర్‌రావు, మాజీ ఎంపీ

# పోలీసుల గుండెల్లో కార్లు పరిగెడుతున్నాయ్!

**ఎస్సై సస్పెన్షన్‌తో మిగతా అధికారుల్లో ఆందోళన**

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఏఎస్సై కుమారుడే కదా అని ఇంత కాలం అతనితో అంటకాగిన పోలీసుల గుండెల్లో కార్లు పరిగెడుతున్నాయి. అవునండీ.. వెంకటనాయుడి ముఠా అపహరించిన కార్లను తీసుకొచ్చి పల్నాడు జిల్లాలో తక్కువ ధరకే అమ్మినట్లు.. వాటిని పలువురు పోలీసులు, రాజకీయ నాయకులు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి చాలామంది నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని సమాచారం. ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని ఎలాగైనా కార్ల వ్యవహారం కప్పిపుచ్చి బయటకు రాకుండా చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఎలాగూ రోడ్డు ప్రమాదంలో నిందితులను రిమాండ్‌కు పంపాం కాబట్టి అక్కడితో ముగిసిపోవాలని కొందరు పోలీసులు ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకుంటున్నట్లు తెలిసింది. సదరు ఏఎస్సైని వెల్దుర్తి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసినప్పటికీ కుమారుడి నేరాల చిట్టాలో తండ్రి పాత్ర ఏంటనే విషయంపై విచారణ చేస్తారా లేదా అన్నది ఆసక్తిగా మారింది. అరెస్టు చేసిన వెంకటనాయుడి బృందం అయిదుగురితో పాటు నకరికల్లు మండలం నర్సింగపాడుకు చెందిన భాను, నరసరావుపేటలో ఉంటున్న అంజిలు కలిసి సుమారు వందల కార్లు తెలంగాణలో అపహరించి పోలీసు అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల వద్ద ఉండే వారికి విక్రయించినట్లు తెలుస్తోంది. సస్పెండైన ఎస్సై రహంతుల్లా వద్ద నాలుగు కార్లను కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. గుంటూరులోని ఓ షెడ్డులో విక్రయానికి తొమ్మిది కార్లు ఉంచినట్లు కూడా తెలిసింది. నకరికల్లు మండలం త్రిపురాపురానికి చెందిన వ్యక్తి పేరుతో వెంకటనాయుడు బృందం ఫాస్ట్‌ట్యాగ్‌లు ఏర్పాటు చేసుకుని వాహనాల్లో తిరిగినట్లు టోల్‌గేట్ల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. సదరు వ్యక్తిని కూడా పిలిపించి విచారించారు. ముఠాలో భాను, అంజిలు ఇంకా పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారు. వెంకటనాయుడు బృందం అరాచకాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి రావాలంటే సిట్‌లేదా సీఐడీ దర్యాప్తు చేపడితేనే సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# వయసు 88.. పతకాలు 160

బాపట్ల భీమావారిపాలేనికి చెందిన విశ్రాంత ఉద్యోగి, మాస్టర్ క్రీడాకారుడు లేళ్ల వెంకట రామారావు అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నారు. 88 ఏళ్ల వయసులో రోజూ మైదానానికి వెళ్లి జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ సాధన చేస్తున్నారు. రాజస్థాన్‌లోని హల్వార్‌లో ఈ ఏడాది నిర్వహించిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 85 ఏళ్లకు పైగా వయసున్న క్రీడాకారుల విభాగంలో జావెలిన్‌త్రోలో పసిడి పతకం గెలిచారు. డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. బాపట్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో 100 పసిడి, 40 రజత, 20 కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. కళాశాల స్థాయిలో జిల్లా, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పదుల సంఖ్యలో పతకాలు సాధించారు. తర్వాత హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే క్రీడల్లో సాధన చేశారు. రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఉద్యోగ విరమణ అనంతరం వెటరన్ క్రీడాకారుడిగా పోటీలకు హాజరవుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో నడక, వ్యాయామం, అథ్లెటిక్స్‌లో సాధన చేస్తున్నారు. ఆటలతో చలాకీగా ఉంటున్నానని, ఇదే తన ఆరోగ్య రహస్యమని రామారావు తెలిపారు. క్రీడల్లో మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నారు. - బాపట్ల, న్యూస్‌టుడే

## అయిదు తరగతులున్నా.. గదులేవి

అద్దంకి కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు గదులు మాత్రమే ఉండటంతో మిగిలిన రెండు తరగతులు వరండాలో కొనసాగుతున్నాయి. నాడు-నేడు పథకం రెండో విడతలో ఈ బడికి మరుగుదొడ్లు, ఇనుప గ్రిల్స్ మంజూరు కాగా పూర్తయ్యాయి. పథకంలోనే రెండు అదనపు గదులకు రూ.24 లక్షలు కేటాయించారు. ఇందులో రూ.7 లక్షలతో పునాదుల వరకు నిర్మించారు. తర్వాత ముందుకు సాగలేదు. దీంతో రెండేళ్ల నుంచి విద్యార్థులకు సరైన తరగతి గదులు లేక సతమతమవుతున్నారు. మొత్తం 69 మంది విద్యార్థులుండగా 65 మంది వరకు వస్తుంటారు. అయిదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాత భవనం తొలగింపు, పనుల్లో వేగం లోపించడంతో నిర్మాణం నిలిచినట్లు ఎంఈవో-2 కేవీ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడి ఖాతాలో ఆ పథకం నిధులు రూ.2.30 లక్షలు న్నాయి. అనుమతులు వచ్చిన వెంటనే పనులు పునఃప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, అద్దంకి

# సాకు చెప్పి.. కోత పెట్టి!

**ధాన్యం విక్రయంలోనూ రైతుకు దగా**

న్యూస్‌టుడే, బాపట్ల, వేమూరు

ఒక చోట తేమ శాతమని, మరో చోట ధాన్యం నుంచి సరిగా బియ్యం రావడం లేదని రైతులను నిలువునా దోచేస్తున్నారు. బస్తాకు రెండు నుంచి నాలుగు కిలోల వరకు కోత విధిస్తున్నారు. అన్నదాతలు ఆ మేరకు ఆదాయం కోల్పోతున్నారు. తగినన్ని జీపీఎస్ వాహనాలు అందుబాటులో లేక ధాన్యం రవాణా నెమ్మదిగా సాగుతోంది.

జిల్లాలో 130 ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. విక్రయించిన 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తున్నారు. కల్లాలు, రైతుల ఇంటి వద్ద నుంచి ధాన్యం రవాణాకు జీపీఎస్ కలిగిన వాహనాలు తప్పనిసరి చేశారు. ప్రతి రైతు సేవా కేంద్రానికి ఐదు జీపీఎస్ వాహనాలు కేటాయించాలని నిర్ణయించారు. వేమూరు నియోజకవర్గ పరిధిలో జీపీఎస్ వాహనాల కొరతతో ఆర్ఎస్‌కేలో ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్ ఇచ్చినా మిల్లుకు తరలించటంలో జాప్యం నెలకొంటోంది. వాహనాలకు బయట ఎక్కువ ఆదాయం వస్తుండటంతో యజమానులు ధాన్యం రవాణాకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీనివల్ల కల్లాల్లో ఎక్కువ రోజులు ధాన్యం ఉండిపోతోంది. మంచు ఎక్కువగా కురుస్తుండటంతో తేమశాతం పెరగకుండా ఉండటానికి రైతులు పట్టలు కప్పి ఉంచుతున్నారు.

నందిరాజుతోటలో జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

| |
|---|
| ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం: 29,416 మెట్రిక్ టన్నులు |
| కొనుగోలు చేసిన ధాన్యం విలువ: రూ.70.27 కోట్లు |
| సేకరణ లక్ష్యం: 2 లక్షల మెట్రిక్ టన్నులు |

❖ ధాన్యంలో తేమ శాతం విషయంలో మిల్లర్లు దోబూచులాడుతున్నారు. ఆర్ఎస్‌కే వద్ద తేమ శాతం 17 శాతం లోపే ఉండగా మిల్లు వద్దకు వెళ్లేసరికి 19 ఉంచి 20 శాతానికి పెరిగినట్లు చూపిస్తున్నారు. ప్రైవేటు మార్కెట్‌లో ధ్యానానికి ఎక్కువ ధర లభించటం లేదు. చెరుకుపల్లి, కూచిపూడి, నగరం మిల్లర్లు మిల్లింగ్ చేస్తే ధాన్యంలో బియ్యం దిగుబడి తక్కువ వస్తోందని 75 కిలోల బస్తా నుంచి రెండు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీసేస్తున్నారు. దిగుబడి సొంతంగా నిర్ధారించే అధికారం మిల్లర్లకు లేకపోయినా 150 గ్రాముల ధాన్యాన్ని తీసుకుని మిల్లింగ్ పరీక్ష చేసి వంద గ్రాముల కన్నా తక్కువగా బియ్యం వస్తున్నాయని చెప్పి అటు ధరలోనో, ఇటు తూకంలోనో కోత విధిస్తున్నారు. రైతులు ఇలా ఎకరాకు రూ.3 వేల వరకు ఆదాయం కోల్పోతున్నారు. సమస్యను పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి సదరు మిల్లర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యంలో తేమశాతం విషయంలోనూ మోసాలకు పాల్పడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జీపీఎస్ వాహనాల సమస్య లేకుండా చూస్తామన్నారు.

## ఇదీ దోమతెర కథ!

గుంటూరు ఆర్టీసీ బస్టాండులో బస్సులు ప్రవేశించే వైపు ఉన్న ప్లాట్‌ఫాం పైన ఇలా వరుసగా తాళాలు వేసిన దోమతెరలు కనిపిస్తాయి. బస్సులో నైట్ డ్యూటీలకు వెళ్లే కండక్టర్లు, డ్రైవర్లు రాత్రి బస చేసే ప్రాంతాల్లో దోమల బెడద తట్టుకునేందుకు దోమతెరలను తీసుకెళ్తారు. వాటిని ఎవరూ తస్కరించుకుండా ఇలా తాళాలు వేస్తామని ఉద్యోగులు తెలిపారు. - ఈనాడు, అమరావతి

## పడవల సమూహం.. జల విహారం

బాపట్ల జిల్లా రేపల్లె పెనుమూడి వారధి వద్ద పదుల సంఖ్యలో పడవలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ వందలాది కుటుంబాలకు చేపల వేట జీవనాధారం. 60కి పైగా పడవలు ఇక్కడ నుంచి నిత్యం చేపల వేటకు వెళుతుంటాయి. వేట ముగిశాక పడవలను ఇక్కడే ఉంచి వెళతారు. - ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

## చినగంజాం.. బౌద్ధక్షేత్రం

నాడు ఉపయోగించిన స్నాన వాటికలు

చినగంజాంలో క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నాటి బౌద్ధక్షేత్రం ఆనవాళ్లు కన్పిస్తాయి. నాడు ఇది ప్రముఖ కేంద్రంగా ఉండేదని చారిత్రక ఆధారాలున్నాయి. 2002లో కొందరు రాత్రి సమయంలో ఆ ప్రాంతంలో తవ్వకాలు చేశారు. దీనిలో దెబ్బతిన్న పాలరాతి బుద్ధుని విగ్రహాలు బయటపడ్డాయి. బౌద్ధ క్షేత్రాల ఆనవాలు, కొన్ని లోహపు చిన్న విగ్రహాలతో పాటు నాడు ఉపయోగించిన గదుల పునాదులు, స్నాన వాటికలు, వాడిన మట్టి పాత్రల ఆనవాలు ఉన్నాయి. నాటి ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ ఉదయలక్ష్మి ఆదేశాల మేరకు వాటిని కసపర్తి మ్యూజియంలో భద్రపర్చారు. నాడు ఇక్కడ విశ్వవిద్యాలయం ఉండేదని, దేశ, విదేశాలకు చెందిన విద్యార్థులు వచ్చి చదువుకునేవారని చెబుతుంటారు. వారుండే గదులను సున్నపు రాతితో నిర్మించినట్లు ఆనవాళ్లు కనిపిస్తాయి. అశోకచక్రవర్తి కుమారుడు మహేంద్ర, కుమార్తె సంఘమిత్రలు శ్రీలంక పర్యటనలో భాగంగా చినగంజాంలో కొంత కాలం ఉన్నారని చెబుతుంటారు. ఈక్షేత్రం కొమ్మమూరు కాలువకు పడమరగా సుమారు వంద మీటర్ల దూరంలోనూ, 216 జాతీయ రహదారికి దక్షిణంగా 50 మీటర్ల దూరంలో ఉంది. - న్యూస్‌టుడే, చినగంజాం

తవ్వకాల్లో బయటపడ్డ పురాతన బౌద్ధక్షేత్రాలు

## వర్ణాల పూబంతి.. డిస్కో చామంతి!

కొరిశపాడు మండలం రావినూతలలో ఓ రైతు 1.50 ఎకరాల్లో చామంతి పూల తోట సాగు చేస్తున్నారు. డిస్కో రకంగా పిలిచే ఈ చామంతి మొక్క నుంచి కోసిన తరువాత 10 రోజుల పాటు తాజాగా ఉంటుందని రైతు తెలిపారు. పసుపు, తెలుపు రంగుల్లో పూసిన ఈ చామంతి పువ్వులు ఆ దారిలో వెళ్లే వారిని ఆకర్షిస్తున్నాయి. యువత ఫోన్‌లో సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాలలో పెడుతున్నారు. - న్యూస్‌టుడే, రావినూతల (మేదరమెట్ల)

# చౌక దుకాణాల్లో కొత్త కానుక

**జొన్నలు, రాగులు, గోధుమ పిండి పంపిణీకి సన్నాహాలు**

నరసరావుపేట, న్యూస్‌టుడే

కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా చౌకధరల దుకాణాల్లో జొన్నలు.. రాగులు.. గోధుమ పిండి పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, జొన్నలు, రాగులు కొన్ని నెలలపాటు పంపిణీ చేసింది. సంక్రాంతి కానుకగా సరకుల్ని తక్కువ ధరకు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది.

✦ డిసెంబరులో చౌకధరల దుకాణాల్లో పంపిణీకి పల్నాడు జిల్లాకు 150 మెట్రిక్ టన్నుల జొన్నలు కేటాయించారు. కార్డుదారుల నుంచి వాటికి డిమాండ్ ఉంది.

జనవరిలో 400 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసేలా ఇండెంట్ పెట్టారు. బియ్యం వద్దనుకుంటే జొన్నలు అందజేస్తున్నారు.

✦ ప్రస్తుతం అందజేస్తున్న బియ్యంలో రెండు, మూడు కిలోలు తగ్గించి వాటి స్థానంలో రాగులు ఇచ్చే ఆలోచన చేస్తున్నారు. ఒక కుటుంబం 25 కిలోల బియ్యం తీసుకుంటే అందులో మూడు నుంచి ఐదు కిలోల బియ్యం తగ్గించి వాటికి బదులు రాగులు ఇవ్వనున్నారు.

✦ మార్కెట్‌లో గోధుమ పిండి కిలో రూ.60 నుంచి రూ.65 వరకు ఉంది. దీన్ని ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో కిలో రూ.16కే అందించనుంది. కార్డుకు కిలో చొప్పున ప్యాకెట్ల రూపంలో ఇవ్వనుంది. కందిపప్పు కూడా పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కొత్త సంవత్సరంలో కార్డుదారులకు నిండుగా సరకులు అందనున్నాయి. రాయితీ సరకులతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది.

**పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దుకాణాలు, కార్డుల వివరాలిలా..**

| జిల్లా | చౌకధరల దుకాణాలు | బియ్యం కార్డులు |
|---|---|---|
| పల్నాడు | 1,289 | 6,43,453 |
| బాపట్ల | 1,123 | 4,79,994 |

### ప్లాట్ల కేటాయింపునకు ఈ- లాటరీ నేడు

తుళ్లూరు: ప్రజా రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో 9.14 అగ్రిమెంటు ద్వారా భూములు ఇచ్చిన రైతులకు, అనంతవరంలో ఎన్-17 రహదారిలో భూములు కోల్పోతున్న 24 మంది రైతులకు, మల్కాపురం సర్వే నెం.18లో మినహాయింపు భూమి వల్ల ప్రభావితమైన ఇద్దరు రైతులకు, మల్కాపురంలో అనధికార లేఔట్ వల్ల ప్రభావితమై 65శాతం-35 శాతం కింద ఉన్న ఏడుగురు రైతులకు ఈ లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం తెలిపింది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

## ఉత్సాహంగా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

పరుగు పోటీలో క్రీడాకారులు

నడక పోటీల్లో ప్రథమస్థానం సాధించిన శ్రీనివాసరావు

**బాపట్ల, న్యూస్‌టుడే :** జిల్లా కేంద్రమైన బాపట్లలో ఏడో రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని నలుమూలల నుంచి పాల్గొన్న క్రీడాకారులు ఆయా విభాగాల్లో తమ సత్తా చాటుతున్నారు. బాపట్ల ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానం వేదికగా రెండోరోజు ఆదివారం పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటి నాలుగు, ఐదు,ఆరు పదుల వయసులోనూ క్రీడల్లో హోరాహోరీగా తలపడ్డారు.. 50-55 సంవత్సరాల విభాగంలో ఐదు కిలోమీటర్ల నడక పోటీని 34నిమిషాల 27సెకన్లలో ముగించి బాపట్లకు చెందిన బండి శ్రీనివాసరావు ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా సత్తాను చాటారు. వైజాగ్‌కు చెందిన ఎం.డి షాకీరాబేగం లాంగ్‌జంప్, హార్డ్ డిస్క్‌త్రోలో మొదటి స్థానం, గుంటూరుకు చెందిన నవమి లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్‌లో మొదటి స్థానం, 60 ఏళ్ల విభాగంలో గుంటూరు కమర్షియల్ సేల్స్ టాక్స్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యు.ఏడుకొండలు 5కేరన్‌లో, 15మీటర్స్, పోటీల్లో ప్రథమస్థానాన్ని సాధించి బంగారు పతకాలు అందుకున్నారు.

## ఆహ్లాదం...ఉల్లాసం

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా...ఆహ్లాదంగా గడిపేందుకు సెలవు రోజుల్లో హైదరాబాద్, గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట, తెనాలి, సత్తెనపల్లి ప్రాంతాల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు వేల సంఖ్యలో తీరంలోని వాడరేవు, రామాపురం చేరుకుంటున్నారు. ఫలితంగా శని, ఆదివారాల్లో ఈ ప్రాంతంలో వీరితో సందడి నెలకొంటోంది. ఆ రెండు రోజులు బీచ్‌లో స్నానాలు చేస్తూ మరోవైపు ఆటలు ఆడుకుంటూ సరదాగా గడుపుతున్నారు. మొంథా తుపానుతో దాదాపు నెలరోజులుపైనే తీరంలో స్నానాలకు బ్రేక్ పడ్డాయి. గడిచిన మూడు వారాలుగా పర్యాటకుల సందడి పెరిగింది. దీనికితోడు తీరంలో రైడింగ్ బైక్‌లు అందుబాటులోకి రావడంతో వీటిపై యువత, చిన్నారులు సరదాగా తిరుగుతున్నారు.

రామాపురం తీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

## పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకం

**చీరాల, న్యూస్‌టుడే:** తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఆత్మగౌరవ నినాదంతో ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని, ఆయనను స్మరించుకోవడం మనందరి బాధ్యతని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజధానిలో నిర్మిస్తున్న కాంస్య విగ్రహం, గ్రంథాలయం నిర్మాణం గురించి ఆదివారం చీరాలలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చర్చా వేదిక నిర్వహించారు. వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ మాట్లాడుతూ తెలుగువారే కాదు ఇతర రాష్ట్రాల వారు ఆయన త్యాగాన్ని స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎంజీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సురేష్‌బాబు, డి.వి సురేష్, వివిధ సంఘాల నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## త్రికోటేశ్వర ఫాం ల్యాండ్ వెంచర్ ప్రారంభం

ప్రారంభ కార్యక్రమంలో చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఆనంద్‌బాబు తదితరులు

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** మండలంలో కోటప్పకొండ నుంచి గోనెపూడి వెళ్లే మార్గంలో చుట్టూ పచ్చదనంతో నిండిన ఎత్తైన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రికోటేశ్వర ఫాంల్యాండ్ వెంచర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటప్పకొండ గతం కన్నా ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో మంచి వాతావరణంలో వెంచర్ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. సుందరమైన ఇళ్ల నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్‌పార్కు, స్విమ్మింగ్‌పూల్, పది రకాలైన ఆర్గానిక్ మొక్కల పెంపకం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచుమర్తి భూపతిరావు, నాగసుశీల, మల్లెం సుభాష్, బండి చంద్ర పాల్గొన్నారు.

## ఆడతాం.. లక్ష్యాలు సాధిస్తాం

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులు

**న్యూస్‌టుడే, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), బాపట్ల**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయ, సౌత్‌జోన్ పోటీల్లో ఆడి ప్రతిభ కనబరిచారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నాగార్జునవర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. వారి ప్రతిభా పాటవాలు తెలుసుకుందాం..

### క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా

ప్రకాశం జిల్లా పమిడి లక్ష్మీపురం మాది. నాన్న బాలగురవయ్య, అమ్మ వీరనారాయణమ్మ వ్యవసాయ పనులకు వెళుతుంటారు. తెనాలి జేఎంజే కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. క్రాస్‌కంట్రీ, హైజంప్ అంటే ఇష్టం. ఇప్పటికే ఇంటర్, డిగ్రీ స్థాయిలో రెండుసార్లు క్రాస్ కంట్రీ పరుగు పందెంలో, హైజంప్‌లో రాష్ట్రస్థాయిలో, ఒకసారి సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నా. గత ఏడాది ఏఎన్‌యూ నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించా. భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించడమే లక్ష్యం. - శివాంజలి

### పీడీ అవుతా

కారంపూడి మాది. నాన్న అంకమ్మరావు, అమ్మ వెంకటరమణ. నాన్న ఆటోడ్రైవర్, అమ్మ కూలీ పనులకు వెళతారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయ కోర్సు చేస్తున్నా. చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ అంటే ఇష్టం. క్రాస్ కంట్రీ, 1500 మీటర్ల పరుగు పందెంలో ఇంటర్, డిగ్రీలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. 2024లో ఏఎన్‌యూలో నిర్వహించిన 1500 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్‌మెడల్ సాధించా. తల్లిదండ్రులు, పీడీల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నా. పీడీగా స్థిరపడి క్రీడాకారులను తయారు చేయాలని ఉంది. - అంకమ్మ

### జాతీయ జట్టుకు ఆడటమే లక్ష్యం

మాది సత్తెనపల్లి మండలం పాపాయపాలెం. నాన్న నరసింహారావు, అమ్మ లక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. తెనాలి జేఎంజే కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. క్రాస్ కంట్రీ, 400 మీటర్ల హర్డిల్స్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గత ఏడాది ఏఎన్‌యూలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచా. సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనే ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిథ్యం వహించా. జాతీయ జట్టుకు ఎంపికై ఆడటమే లక్ష్యం. పోలీసు ఉద్యోగంలో స్థిరపడటమే ధ్యేయం. - కల్యాణి

## సుపరిపాలన యాత్ర విజయవంతం చేయాలి

**అద్దంకి, న్యూస్‌టుడే:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర'ను జిల్లాలో విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా ఈనెల 16న జిల్లా కేంద్రం బాపట్లలో 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర', బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

**బాపట్ల, న్యూస్‌టుడే:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రతి రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోతే, ఫిర్యాదులకు సంబంధించి సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

## కాలువ కనపడదు.. నీరు పారదు!

✤ మోదేపల్లి మేజరు అస్తవ్యస్తం

**కొటికలపూడి(అద్దంకి), న్యూస్‌టుడే:** మోదేపల్లి మేజరు కాలువ అస్తవ్యస్తంగా తయారైంది. మూడు దశాబ్దాలుగా కాలువలో పూడిక తీయకపోవడంతో చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. కొన్ని చోట్ల కాలువ అంచుల వరకు రైతులు సాగు చేశారు. దీంతో కాలువ, కట్టల ఆనవాళ్లు కనిపించడం లేదు. ఎగువ రైతులకు నీరు అవసరం లేనపుడు మాత్రమే అరకొరగా దీనికి నీరు విడుదల చేసేవారు. కొటికలపూడి పంచాయతీ సర్పంచి విక్రం, గ్రామస్థులు సొంత నిధులతో ఇటీవల కాలువకు కొంతమేర తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఫలితంగా గత వారంలో సాగర్ నీరు కాలువ చివరి భూములకు చేరాయి. కానీ కాలువ పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. నీటి పంపిణీ సంస్థ, నీటిసంఘాల రైతులు విన్నవించుకుంటున్న నేపథ్యంలో వచ్చే ఏడాదిలో కాలువ మరమ్మతులు జరిపించేందుకు నిధుల విడుదల కోరుతూ ప్రతిపాదన పంపినట్లు ముండ్లమూరు ఎన్నెస్పీ డీఈ బి.ప్రేమ్‌చంద్ తెలిపారు.

కొటికలపూడి సమీపంలో చిల్లచెట్లతో నిండిన కాలువ

### రూ.మూడు కోట్లతో ప్రతిపాదన

సాగర్ ప్రధాన కాలువ 85/3 మైలురాయి నుంచి విడుదలయ్యే మోదేపల్లి మేజరు కాలువ సుమారు 47.5 కి.మీ. ప్రయాణించాల్సి ఉంది. దీని పొడవున చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. పూడిక పేరుకుంది. ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుని రూ.మూడు కోట్ల నిధులు అవసరం అవుతాయని, రానున్న ఏడాదిలో పనులు జరిగేలా ప్రతిపాదనలు పంపించామని డీఈ తెలిపారు. నిధులు విడుదల కాగానే కాలువ చివరి భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీరు అందేలా చేస్తామని చెప్పారు.

## విభేదాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండాలి

✤ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంత్రికి కేకు తినిపిస్తున్న లిడ్ క్యాప్ ఛైర్మన్ మాణిక్యరావు

**అద్దంకి, న్యూస్‌టుడే:** సైతాన్‌ల రూపంలో కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే వారు వస్తుంటారు.. వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. పట్టణంలోని కట్టకిందపాలెం సెంటినరీ తెలుగు బాప్టిస్టు ప్రాజెక్టు టౌన్ చర్చిలలో ఆదివారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంజే.స్టాలిన్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం సంతోషంగా ఈ పండగ జరుపుకోవాలన్నారు. రెండు దశాబ్దాలుగా కట్టకిందపాలెం వాసులతో ప్రత్యేక అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు. నాయకులు సుస్థిరంగా ఉంటే సుస్థిర పాలన అందించడం సాధ్యమవుతుందని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి పనులు కొనసాగాలంటే ప్రజలు సీఎం చంద్రబాబు కోసం ప్రార్థనలు చేయాలన్నారు. అపుడే విధ్వంసకారులకు అడ్డుకట్ట పడుతుందన్నారు. అనంతరం కేకు కోసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పేద మహిళలకు నూతన వస్త్రాలు అందించారు. ఏఎంసీ ఛైర్మన్ వరగాని పద్మావతి, వ్యవసాయ మిషన్ సంచాలకుడు నాగినేని రామకృష్ణ, పురపాలక మాజీ ఛైర్పర్సన్ పరిమి దయామణి తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరనున్న ఉపముఖ్యమంత్రి హామీ

**చిలకలూరిపేట గ్రామీణ:** చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 5న నిర్వహించిన మెగా పీటీఎంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ పాఠశాలకు 25 కంప్యూటర్లు, గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు ఎమ్మెల్యే పుల్లారావు, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా వాటిని సోమవారం బడికి అందజేయనున్నట్లు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు.

## సంపద సృష్టి కేంద్రాల్లో వసతులేవీ?

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో సేకరించే ఊడ్చుచెత్త నుంచి సంపద సృష్టించడం కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. వసతులు లేక, అవసరమైన కంపోస్టు ఎరువు అందుబాటులో లేక ఏళ్ల గడుస్తున్నా నిరుపయోగంగా పడిఉన్నాయి. మండలంలోని 13 పంచాయతీల్లో వీటి నిర్మాణం జరిగింది. పావులూరు, నాగండ్ల గ్రామాల్లో కొద్దిరోజులు వానపాముల ఎరువు తయారుచేసి విక్రయించారు. మిగిలిన కేంద్రాల్లో ఎటువంటి ఉత్పత్తి జరగడంలేదు. కేంద్రాలకు అవసరమైన కనీస వసతులు కల్పన జరగలేదు. వానపాముల తయారీకి పశువుల నుంచి సేకరించే కంపోస్టు ఎరువు అందుబాటులో ఉండాలి, రహదారి, నీటివసతి, విద్యుత్తు సౌకర్యం, కేంద్రం చుట్టూ నీడనిచ్చే చెట్లు, వానపాముల ఎరువు తయారీపై శిక్షణ పొందిన వ్యక్తులు ఉండాలి. పైవసతులన్నీ సమకూరితేనే నాణ్యమైన వానపాముల ఎరువు తయారై మార్కెట్‌లో అమ్మకాలు వేగంగా జరిగి, కేంద్రాలు లాభాలు ఆర్జిస్తాయి. ఒక్కో కేంద్రానికి రూ.5లక్షలు ఖర్చు చేశారు. కొన్నింటికి వెళ్లాలంటే రహదారి సక్రమంగా లేదు. మండల కేంద్రం ఇంకొల్లులో కేంద్రాన్ని అప్పేరు వాగులో నిర్మించారు. వర్షం కురిస్తే కేంద్రం చుట్టూ మీటరు లోతులో నీరు నిలిచి ఉంటుంది. పలు కేంద్రాలకు నీటి వసతి, విద్యుత్తు సౌకర్యంలేదు. వీటికి వసతులు కలుగజేసి వాటిపై వచ్చే ఆదాయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ధాన్యం ఆరబోతకు అన్నదాతల కష్టాలు

ఖాజీపాలెం రహదారిపై ఆరబెట్టుకుంటున్న రైతులు

**ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే:** యంత్రాలతో కోసిన వరి ధాన్యం ఆరబెట్టడానికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జాతీయ రహదారి, ఖాజీపాలెం నుంచి మాచవరం రహదారి పొడవునా, నివాస గృహాల ముందు ఖాళీ స్థలాల్లో ఆరబెడుతున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో నమోదైన తేమ శాతాన్నే మిల్లర్లు పరిగణనలోకి తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పిట్టువారిపాలెం, ఖాజీపాలెం, భవనంవారిపాలెం తదితర గ్రామాల వెంబడి రోడ్డు పక్కన ధాన్యం ఆరబోసి ఉండటం రైతులను కష్టాలను తెలియజేస్తోంది.

## చెత్త సమస్య తీరే మార్గం లేదా

**అద్దంకి, న్యూస్‌టుడే:** అద్దంకి పురపాలక సంఘం చెత్త సమస్య తీరే మార్గం కనిపించడంలేదు. పట్టణంలోని 20 వార్డుల ద్వారా రోజుకు 20 టన్నుల చెత్త వస్తుంది. ఇందులో 50శాతం ప్రత్యేక వాహనాల ద్వారా గుంటూరులోని జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. మిగిలిన 50 శాతం చెత్తను పాత డంపింగ్‌కు తరలిస్తున్నారు. చెత్త మొత్తాన్ని గుంటూరు తరలించేందుకు సరిపడా వాహనాలు లేకపోవడంతో ఇక్కడే పారబోస్తున్నట్లు ఏఈ లోకేష్ తెలిపారు. వారం రోజుల క్రితం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఆధునిక కాంపాక్టర్ యంత్రం కొనుగోలుకు ప్రతిపాదన పంపినట్లు వెల్లడించారు.

అద్దంకి కొండ డంపింగ్‌యార్డులో పెరుగుతున్న చెత్త


EENADU e Classifieds

**BUSINESS SERVICES**

**బంగారం కొనబడును.** బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

**SAREES**

**పాతపట్టు చీరలు:** కంచి, వెంకటగిరి, గద్వాల్ ప్యూర్ జరీ చీరలు మీ ఇంటి వద్దనే 1000/- నుండి లక్ష రూ|| దాకా కొనబడును. ✆ 81251 68645.

**MARRIAGE SERVICES**

**కాపు,** 29Y, 5'.4" ఐర్లాండ్‌కు వరుడు మరియు కాపు 29Y, 5'.11" ఐర్లాండ్‌కు వధువు కావలెను. భరత్ మ్యారేజ్ లింక్స్, తెనాలి. ✆ 98499 70373.

**REAL ESTATE**

**FLAT FOR SALE**

**GENERAL**

**23 లక్షలకే** రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటీ నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం|| 89196 28403.

**PLOT FOR SALE**

**GENERAL**

**గుంటూరు మున్సిపాలిటీ** పరిధిలో లాల్‌పురం గ్రామం ఆనుకొని 33 Ft రోడ్‌లో బ్యాంక్‌లోన్ సదుపాయంతో ఓపెన్ ప్లాట్స్ అమ్మకంనకు కలవు. స్పాట్‌హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసుకోబడును. ✆ 83098 12757, 88861 12399

**JOBS**

Jayalakshmi Nexa Hiring for Autonagar Guntur. Good opertunity for Freshers/Experienced. Whatsapp: 91007 87054.

**Karthikeya Infraces** సంస్థ నందు పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం 12,000 -30,000 + ఇన్సెంటివ్, అర్హత 10th -డిగ్రీ, Age 18-20 Yrs. ✆ 88861 12399, 88862 12399.

**30-65Yrs బ్యాంక్** అనుబంధ సంస్థలో జీతం + Inc 35వేలు టీంమేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

**గుంటూరులోని రియల్‌బూమ్** రియల్‌ఎస్టేట్ సర్వీసెస్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50) టెలీకాలర్స్ (10) DDOలు (10) కావలెను. 99920 82456.

**రాయల్ ఎంఫీల్డ్** షోరూమ్ తాడేపల్లి నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ & మెకానిక్ కావలెను. Contact: 99891 28328.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జిస్, క్లాస్ ఇన్‌ఛార్జిస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. సంప్రదించగలరు. ✆ 8978480429.

**గుంటూరులోని ప్రముఖ** కళాశాల ఉమెన్స్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో పనిచేయుటకు లేడీ రెసిడెన్షియల్ వార్డెన్ (శాఖాహారులు మాత్రమే) కావలెను. ✆ 83310 33743.

**గవర్నమెంట్ హాస్పిటల్‌లో** ఔట్‌సోర్స్ డేటా ఎంట్రీ చేయుటకు కంప్యూటర్ స్పీడ్ టైపింగ్‌లో అనుభవమున్న ఆపరేటర్స్ కావలెను. 8885050664, 9908780954.

**శ్రీనిధి ఎంటర్ ప్రైజెస్‌వారి** అద్దంకిఆఫీసులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (ట్యాలీ) తెలిసినవారు కావలెను. అద్దంకికి చెందిన వారై ఉండాలి. 9247424587.

**మా రియల్ ఎస్టేట్** కంపెనీకి మార్కెటింగ్ లీడర్స్, గృహిణులు, Govt/ pvt & Rtd వారు, LIC /చిట్స్ / ఇన్సూరెన్స్ /సాఫ్ట్‌వేర్స్ /NRIలు కావలెను. ✆ 9502822335

**HYD యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**వంట మనిషి** కావలెను: గుంటూరు పట్టణంలో ఏ.టి.అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్‌లో అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579.

**గుంటూరు, ఆటోనగర్,** HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. PT/FT. 77996 89889, 80745 46302.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541


## అయ్యప్ప భక్తుడి దుర్మరణం

చైతన్య (పాత చిత్రం)

**అమరావతి, వేమూరు, న్యూస్‌టుడే:** అయ్యప్ప దీక్ష తీసుకుని స్వామి దర్శనానికి వెళ్లిన భక్తుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వేమూరు మండలం కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన గాజుల చైతన్య (22) కొన్నాళ్లుగా అమరావతిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 11న శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనానికి ఇరుముడితో బయలు దేరి వెళ్లాడు. తోటి భక్తులతో కలిసి పంబానదిలో స్నానం చేసి స్వామి దర్శనానికి బయలుదేరగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ఆదివారం అమరావతికి అంబులెన్స్‌లో తీసుకొచ్చారు.


91.9FM Vijayawada

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమం | ప్రసార వేళలు |
|---|---|
| ఉదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వే నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297


## క్రీడలతో స్నేహం బలోపేతం

**గణపవరం(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే :** క్రీడలతో శారీరదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం సమకూరుతాయని, స్నేహబంధం బలపడుతుందని సీఆర్ కళాశాల ఎండీ చుండి వేణుబాబు, అధ్యక్షుడు, కరస్పాండెంట్ చుండి రంగనాయకులు అన్నారు. నాదెండ్ల మండలం గణపవరం సీఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల స్థాయి డబుల్ ఓపెన్ షటిల్ టోర్నమెంట్ పోటీల ముగింపు సభలో ఆదివారం మాట్లాడారు. సీఆర్ కళాశాల షటిల్ ఆటగాళ్లు, బత్తుల ప్రసాద్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీలు విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా విజేతలైన ఉమ్మడి జిల్లాల స్థాయిలో చంద్రం టీమ్ (విజయవాడ), ఖాదర్ మస్తాన్‌టీం (చిలకలూరిపేట), జాక్సన్, పృథ్వి టీమ్ (గణపవరం), సుబ్రహ్మణ్యం టీమ్ వరుసగా తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఖాదర్ టీమ్ (ప్రథమ), జాక్సన్, పృథ్వి టీమ్ (ద్వితీయ), ఆది టీమ్ (తృతీయ) బహుమతులు పొందారు. మొత్తం రూ.50వేల నగదు బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా నాగయ్య, రమేష్, నరేంద్ర, యాకోబు వ్యవహరించారు. కమిటీ సభ్యులు యశ్వంత్ చౌదరి, సాయి చౌదరి, మణికంఠ, నాని, బాషా పర్యవేక్షించారు. బహుమతులకు సహకారం అందించిన దాతలు శ్రీనివాసనాయక్, షేక్ సుభాని, రమేష్, అబ్రహం, దాసరి ధనలక్ష్మి, వెంకట గోపి, సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాసరావును సత్కరించారు.

జిల్లా స్థాయిలో విజేతలు

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** అనారోగ్య సమస్యలతో మహిళ పురుగు మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... వైకుంఠపురానికి చెందిన తిరుమలశెట్టి మాధవీలత(48) భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందారు. ఈమెను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో క్రిమిసంహారక మందు తాగారు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ఏరియా వైద్యశాల, అక్కడ నుంచి గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ మేరకు ఒకటో పట్టణ మహిళా ఎస్సై జి.వాణిశ్రీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

బోల్తా పడ్డ కారు

**బాపట్ల, న్యూస్‌టుడే:** పట్టణంలోని 216 ఏ జాతీయ రహదారిలో శ్రీనివాస సినిమాహాలు వద్ద గుంటూరు నుంచి చీరాల వైపు వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ కారు లోపల గాలి బెలూన్‌లు తెరుచుకోవటంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న చీరాల గంజిపాలేనికి చెందిన కోంద్రు చంద్రసేన్, భార్య, పాప స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గుంటూరులో షాపింగ్ చేసి వస్తుండగా ఈ ఘటన జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని పట్టణ సీఐ రాంబాబు పరిశీలించారు. రోడ్డుపై బోల్తాపడిన కారును పక్కకు తప్పించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. ప్రమాదాలు సంభవించకుండా డివైడర్లకు రేడియం స్టిక్కర్లు అతికిస్తామని సీఐ తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

## ఓవరాల్ ఛాంపియన్‌గా 'నెల్లూరు'

**పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే:** గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

# బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుక

కేకు కోస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, న్యూస్‌టుడే: పోతుమర్రులో ఆదివారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు పుట్టుక గురించి బైబిల్ లేఖనాలను వివరించారు. అనంతరం కేకు కోసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి జె.విజయబాబు, వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.పూర్ణచంద్రరావు(?), వైస్ ఛైర్మన్ కిశోర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకానంద కాలనీ పార్కులో ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని పురపాలక డీఈ కృష్ణారెడ్డి ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారిలో ఉన్న ప్రతిభను బయటకు తీసేందుకు సీఎం చంద్రబాబు హ్యాపీ సండేను తీసుకొచ్చారన్నారు.

హాజరైన ప్రజలు

## ఇలా ఉంటే వైద్యం అందించేదెలా?

శిథిలావస్థకు చేరిన కర్లపాలెం పశువైద్య భవనం

మండల కేంద్రం కర్లపాలెంతో పాటు గణపవరంలో పశువైద్యశాలలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది భయాందోళనతో సేవలందిస్తున్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీల నుంచి పశువులు వైద్యశాలలకు చికిత్సకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని పశువుల పెంపకందారులు కోరుతున్నారు. కర్లపాలెం, గణపవరం వైద్యాధికారులు లక్ష్మీ, నాగార్జున మాట్లాడుతూ.. కొత్త భవన నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వైద్యశాలల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కర్లపాలెం

## సీఎం సహాయనిధి మంజూరుపత్రం అందజేత

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరుకు చెందిన రవితేజ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.6,50,683 విలువైన పత్రాన్ని బాధితునికి ఆదివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు.

# ఎక్కడి వాహనం అక్కడే

### ఇరుకు రహదారులతో అవస్థలు

భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే

అది బ్రిటిష్ కాలంలో ఏర్పాటుచేసిన రహదారి. ప్రస్తుతం ఇంటికి ఒకటో రెండో వాహనాలు ఉన్నాయి. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారి విస్తరణ చేపట్టకపోవడంతో భట్టిప్రోలు, కొల్లూరు గ్రామాల్లోని ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దానికి తోడు ఇటీవల ట్రాక్టర్లు, లారీల రాకపోకలు సాగిస్తుండటంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవాల్సిన పరిస్థితి. భట్టిప్రోలులో రోజులో ఐదారుసార్లు ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. స్థానిక చావలి సెంటరు, రథం సెంటరు, మార్కెట్ యార్డు సెంటరు, కొల్లూరు బస్టాండు సెంటరు, లాకు సెంటరు, గొడపాలెం నుంచి బస్టాండు వరకు ఉన్న రహదారికి ఇరువైపులా ఆక్రమణలు ఉండటంతో ఈ ప్రాంతంలో వాహనాల పద్మవ్యూహంలో ఇరుక్కున్నట్లవుతోంది. ఉదయం, సాయంత్రం పోలీసులు నియామకం ఉంటే సమస్య కొంతమేర పరిష్కారం లభిస్తుంది.

చావలి సెంటరులో నిలిచిన వాహనాలు

**సర్వేకే పరిమితమైన ఆక్రమణల తొలగింపు..** గత వైకాపా ప్రభుత్వ హయాంలో మండల కేంద్రమైన భట్టిప్రోలులో ఆక్రమణలను తొలగించేందుకు సర్వే చేశారు. పాలకవర్గ సభ్యులు ఆక్రమణలు తొలగించడంపై కలెక్టరుకు తీర్మానం పంపడంతో అధికారులు వచ్చి స్థానిక రైల్వే గేటు నుంచి మసీదు వరకు సర్వే చేశారు. రహదారి వెంబడి ఉన్న గృహాల వారు స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నారు. కనీసం ఉన్నతాధికారులైనా శ్రద్ధ తీసుకోకపోవడంతో ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

### రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే గంట ముందు బయల్దేరాల్సిందే

భట్టిప్రోలు వాసులు ఉదయం సమయంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే గంట ముందుగానే బయల్దేరాల్సి వస్తోంది. ఎక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వస్తుందోనని భయపడుతున్నారు. దీనికితోడు రహదారి పక్కనే వ్యాపార సంస్థలు ఉండటంతో దుకాణాల్లోకి వెళ్లేవారి వాహనాలు రహదారులపైనే నిలుపుతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ గతంలో పంచాయతీలో తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలిపారు. ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

కొల్లూరులో..

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. యాభై ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య శాస్త్రి, అప్పారావు, వీరాస్వామి, రామ్మోహనరావుతో పాటు తమకు మార్గదర్శిగా నిలిచిన ఉపాధ్యాయులను సత్కరించారు.

భట్టిప్రోలు: టీపీఎం ఉన్నత పాఠశాలలో 1974 నుంచి 1979 వరకు చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో ఆదివారం జరిగింది. 45 సంవత్సరాల తర్వాత విశ్రాంత వయసులో వారంతా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు బోధించిన గురువులను సన్మానించారు.

భట్టిప్రోలులో..

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73136, వేమూరు: 91107 83738

? నగరం- కారంకివారిపాలెం రహదారిలో వీధి దీపాలు 24 గంటలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది. -స్థానికుడు, నగరం ✔ పగటి వేళల్లో వెలుగుతున్న దీపాలను, లైన్లను గుర్తించి సమస్యను పరిష్కరిస్తాం. -వెంకటేశ్వరరావు, కార్యదర్శి, నగరం -న్యూస్‌టుడే, నగరం

? పిట్టలవారిపాలెం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే గల మురుగు కాలువ మట్టి తీసి రహదారి పక్కన వేశారు. -వీరారెడ్డి, పిట్టలవానిపాలెం ✔ పరిశీలించి మట్టి తొలగించి ఇబ్బంది లేకుండా చేస్తాం. -శ్రీనివాసరావు, కార్యదర్శి, పిట్టలవానిపాలెం -న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

## నేటి నుంచి గోమాత కల్యాణ ఉత్సవాలు

బాపట్ల, బాపట్ల వెస్ట్ న్యూస్‌టుడే: పట్టణంలోని మహర్షి ఆశ్రమ గోశాలలో సోమవారం నుంచి గోమాత కల్యాణ ఉత్సవాలు మూడు రోజులపాటు జరుగుతాయని బాబూ నాగేంద్ర ఆదివారం తెలిపారు. ఈనెల 18న మాసశివరాత్రి సందర్భంగా కంచి పీఠాధిపతి చంద్రశేఖరస్వామి ఆరాధనోత్సవం, కామాక్షి ఏకాంబేశ్వర గోమాత కల్యాణం ఉంటుందని ఆయన తెలిపారు.

మాట్లాడుతున్న సలగల రాజశేఖర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

## అటల్ ఆశయం.. మోదీతో సాధ్యం

బాపట్ల, న్యూస్‌టుడే: అటల్-మోదీ సుపరిపాలన యాత్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న బస్సు యాత్ర బాపట్లకు చేరుకుంటుందని తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు చెప్పారు. ఆదివారం స్థానిక భాజపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న రాష్ట్ర రాజధాని అమరావతి కేంద్రంగా వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 16న బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వద్ద వైజంక్షన్ సమీపంలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ చేస్తున్నామని తెలిపారు. భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు బంగారు బాబు, జనసేన బాపట్ల సమన్వయకర్త నామన వెంకటశివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు యాత్ర విజయవంతం చేయాలి

రేపల్లె అర్బన్, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా ఈనెల 11 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భాజపా నిర్వహించే బస్సు యాత్ర విజయవంతం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో ఆదివారం గోడ పత్రిక ఆవిష్కరించారు. అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, మత్తి భాస్కరరావు, జక్కా శ్రీనివాసరావు, జీవి నాగేశ్వరరావు, మేకా రామకృష్ణ, గుర్రం మురహరిరావు, సాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 16న బాపట్లలో అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ జరుగుతుందని అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ నాయకులు రాంపల్లి జగన్నాథశాస్త్రి, పొన్నపల్లి సత్యనారాయణ ఆదివారం కోరారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

## 1200 మందికి వైద్య పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

భట్టిప్రోలు: పెసర్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆస్పత్రి మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైద్యులు గుండె, కిడ్నీ, నరాల వంటి సమస్యలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 1200 మందికి పైగా వైద్యపరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీ, శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ కోరారు. ఇంటి కప్పుపై 10 చదరపు మీటర్ల స్థలంలో కూడా ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకొని విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. పథకానికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం పొందే అవకాశం ఉందన్నారు. అవగాహన పెంచుకొని రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బండ్లమ్మ ఆలయంలో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు శ్రీ బండ్లమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమయ బంగారు కనుసోహారం, రజత కవచంతో అలంకరించగా ప్రసన్న వదనంతో భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లియపాలెం(?)లోని శ్రీబండ్లమ్మ వార్షిక భక్తుల పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అలంకరణలో చందోలు బండ్లమ్మ

## మహాశక్తి దేవతగా అల్లూరమ్మ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'మహాశక్తి దేవత'గా భక్తులకు దర్శనమిచ్చారు.



## ఆదమరిస్తే కాలువలోకే

రేపల్లె 13వ వార్డు శివారు పంట మురుగుకాలువ వంతెన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. ఓవైపు రక్షణ గోడ మూడొంతుల మేర కూలి ప్రమాదకరంగా మారింది. నల్లూరుపాలెం, ఊలుపాలెం, చినఅరవపల్లి, ఉప్పూడి గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెనపై రాకపోకలు చేస్తుంటారు. ఆయా సమయాల్లో ఆదమరిచి వహనం నడిపితే నేరుగా మురుగు కాలువలో పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. డ్రైనేజీశాఖ అధికారులు వెంటనే వంతెనకు రెండు వైపులా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

## దారిపై గుంతలు.. వెళ్లలేక వెతలు

పెదరావూరు నుంచి కూచిపూడి మీదుగా మండూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఏడేళ్ల నుంచి పరిస్థితి ఇలా ఉన్నా పట్టించుకున్న నాథుడు లేడు. వైకాపా పాలనలో దీన్ని అప్పటి నాయకులు పూర్తిగా విస్మరించారు. వేమూరు నియోజకవర్గానికి చెందిన వేమూరు, కొల్లూరు, అమృతలూరు, చుండూరు మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇదే దగ్గర మార్గం. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కనీసం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యపై ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ మాట్లాడుతూ నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, చుండూరు

## వరికుప్పలు.. ధాన్యపు సిరులు

రేపల్లె సమీపంలో కుప్పలుగా వరికంకులు

బాపట్ల, రేపల్లె ప్రాంతంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు అధికంగా యంత్రాలతోనే కోతలు నిర్వహిస్తున్నారు. దీంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుంది. కొంతమంది రైతులు పాత పద్ధతిలో వరికోసి కుప్పలు వేసి నూర్పుతున్నారు. పంట కోశాక వేసిన కుప్పలు పలుచోట్ల కనిపిస్తున్నాయి.

–న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

## ప్రమాదకరంగా మలుపు

కారంకివారిపాలెం శివారు మైనేనివారిపాలెం- ధూళిపూడి ఆర్‌అండ్‌బీ రహదారిలో మలుపులు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మలుపుల్లో రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నగరం

# ఇంట్లో పండించేలా.. ఆరోగ్యాన్ని కాపాడేలా

### మిద్దె, పెరటి సాగుపై మహిళల ఆసక్తి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే

రేపల్లె పట్టణంలో పలువురు మహిళలు ఇంటి పెరటి, మిద్దె, ఖాళీ స్థలంలో పూల మొక్కలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల సాగు చేస్తున్నారు. మార్కెట్లో విక్రయిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు 90 శాతం వరకు క్రిమిసంహారక మందులు వాడినవే ఉంటున్నాయి. ఈనేపథ్యంలో గృహ పరిసరాలు, పెరట్లో సేంద్రియ పద్ధతుల్లో పండిస్తూ తమ కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా గృహిణులు దృష్టి సారిస్తున్నారు.

### నాన్న స్ఫూర్తితో..

13వ వార్డు నివాసి దేసిరాజు నగరాజకుమారి ఇంటి ముందు, ప్రాంగణంలో 100కుపైగా మొక్కల్ని పెంచడం అలవాటు చేసుకున్నారు. క్రోటాన్స్, పూల మొక్కలు, శత పత్రమొక్క, టేబుల్ లెమన్, శ్రీగంధం, టేకు, జామ, పనస, సపోట, అంజూర, ఉసిరి, సొర, బీర, కాకర, చిక్కుడు, వంగ, టమాటా, మిర్చి, పసుపు కంద, పూలమొక్కలు సేంద్రియ పద్ధతిలో పెంచి సంరక్షిస్తున్నారు. చిన్ననాటి నుంచి నాన్న హనుమంతరావు మొక్కల పెంచేవారని ఆయన స్ఫూర్తితో తన వంతుగా పచ్చదనాన్ని పెంచి సంరక్షిస్తున్నానని నగరాజకుమారి తెలిపారు.

### మూడేళ్లుగా సాగు

రేపల్లె 26వ వార్డుకు చెందిన షేక్ అస్మా తన ఇంటి మిద్దెపై 200లకుపైగా పూల మొక్కలు, కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తున్నారు. అయిదు రకాల మిర్చి, నాలుగు రకాల బెండ, అయిదు రకాల లిల్లీ, గులాబి, మల్లి, సన్నజాజి, క్యాప్సికం, స్టార్‌ఫ్రూట్, కొత్తిమీర, కరివేపాకు మూడేళ్లగా సాగుచేస్తున్నారు. ఉదయం గంట, సాయంత్రం రెండు గంటల పాటు మొక్కల సంరక్షణకు సమయం కేటాయించి మానసిక ప్రశాంతత పొందుతున్నానని అస్మా తెలిపారు.

### మొక్కలు బహుమతిగా ఇస్తున్నా

రేపల్లెకు చెందిన కాళేపల్లి హారిణి 20 ఏళ్లుగా మిద్దెపై టమాటా, వంగ, బెండ, బీర, కాకర, చిక్కుడు, పొట్ల, సొర కాయలు, గోంగూర, తోటకూర, బచ్చలి, మెంతి, కరేపాకు, బంతి, చామంతి, మందార, షాట్ వెరైటీ కలబంద, పింక్ కలర్ డ్రాగన్ ఫ్రూట్, మూడు రకాల నల్లేరు, క్రోటాన్ తదితర 200లకుపైగా మొక్కలు పెంచుతూ సంరక్షిస్తున్నారు. ఇంటికొచ్చిన బంధువులకు మొక్కల్ని బహుమతిగా అందజేయడం ఆనవాయితీ చేసుకున్నారు.

## మాదకద్రవ్యాలతో తీవ్ర నష్టం

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల శారీరక మానసిక ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని చందోలు ఎస్సై శివకుమార్ అన్నారు. చందోలు, రెడ్డిపాలెం కూడలిలో యువతకు, ఖాజీపాలెంలో విద్యార్థులకు శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్, సైబర్ నేరాలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంటర్‌నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని సూచించారు.

## కరాటే పోటీల్లో పతకాల సాధన

పతకాలు గెలుచుకున్న విద్యార్థులు

కొల్లూరు, న్యూస్‌టుడే: అమరావతి 2025 నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో 13 మంది కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ ఇంటర్‌నేషనల్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఆరుగురు బంగారు, ఆరుగురు వెండి, ఒకరు కాంస్యపతకం సాధించారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ నవీన్, ప్రిన్సిపల్ అనిత కుమారి రాజన్, కరాటే శిక్షకుడు సోమయ్య, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## వేరికోస్ వ్యాధికి భయపడొద్దు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: వేరికోస్ వ్యాధి వల్ల ఎవరూ భయపడవద్దని ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి డాక్టర్ స్వాతి అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వేరికోస్ వెయిన్స్ వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఈ వ్యాధి నరాల్లో చెడురక్తం ఉండేవారికి, ఎక్కువసేపు నుంచునే, కూర్చునే వారికి వస్తుందన్నారు. దీనికి వైద్యం అందుబాటులో ఉన్నట్లు ఆమె చెప్పారు. వైద్య శిబిరం సుశ్రుత ఫౌండేషన్ ఏషియన్ వాస్కులర్ ఆసుపత్రి హైదరాబాదు, బాపట్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జరిగింది.

# నిర్వహణ కరవై నిరుపయోగం

### బస్సులు రాక బోసిపోయిన బస్టాండు

న్యూస్‌టుడే, కర్లపాలెం

బస్టాండు ఆవరణలో నిలిపిన ఆటోలు

మండల కేంద్రం కర్లపాలెం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం గతంలో తెదేపా ప్రభుత్వం రూ.6.5 లక్షల వ్యయంతో బస్టాండు నిర్మాణం చేపట్టింది. నిధులు చాలకపోవడంతో 2015లో బుద్దాంకు చెందిన పెన్మెత్స నాగరాజు రూ.15 లక్షలకు పైగా వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. ప్రారంభించిన అనంతరం మూడేళ్ల పాటు సక్రమంగానే వినియోగించారు. అనంతరం ఈ ప్రాంగణం సక్రమంగా వినియోగించిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ఆటోలకు నిలయంగా మారడం, బస్సులు ఆవరణలోకి రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. అధికారులు స్పందించి బస్టాండు వినియోగానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**రోడ్డుపైనే ఎదురుచూపులు..** ప్రారంభించిన తొలినాళ్లలో బస్టాండులో ఉన్న దుకాణాలు అద్దెకు ఇచ్చి ఆ ఆదాయంతో ఆవరణను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వసతి కల్పించారు. బస్సులు కూడా ఆవరణలోకి వచ్చి వెళ్లేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అపరిశుభ్రంగా మారడంతో పాటు రాత్రిళ్లు మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండక తప్పడం లేదు.

**వినియోగంలోకి తేవాలి..**

రూ.20 లక్షలు పైగా వెచ్చించి నిర్మించిన బస్టాండు నిరుపయోగంగా మారింది. ఎండైనా, వానైనా రోడ్డుపై నిలబడే బస్సెక్కాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలి.

- సురేష్, ప్రయాణికుడు

## ట్రాక్టర్ గోడకు తగిలిందని దాడి

వలివేరు(చుండూరు), న్యూస్‌టుడే: గిడ్డంగి గోడకు ట్రాక్టర్ తగిలిందని వ్యక్తిపై దాడి చేసిన ఘటన చుండూరు మండలం వలివేరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పందిపాటి రెడ్డియ్య శనివారం ధాన్యం లోడును గిడ్డంగికి తరలిస్తుండగా ట్రాక్టర్ ట్రక్కు గోడకు తాకింది. దీంతో గిడ్డంగి యజమాని కె.అప్పిరెడ్డి, ఆయన పెద్దకుమారుడు సందీప్‌రెడ్డి రెడ్డియ్యను కులం పేరుతో అసభ్యకరంగా దుర్భాషలాడుతూ దాడి చేశారు. సమాచారం అందుకున్న బంధువులు రెడ్డియ్యను తెనాలి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు చుండూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు. తెనాలిలో చికిత్స పొందుతున్న రెడ్డియ్యను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఆదివారం పరామర్శించారు.

## వ్యక్తికి గాయాలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన ఐలవరం రహదారిలో పెట్రోలు బంక్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపట్నం మండలం కళ్లిఫలం గ్రామానికి చెందిన కట్టుపల్లి రాజు తన భార్యతో ద్విచక్ర వాహనంపై రేపల్లె నుంచి చెరుకుపల్లి వైపు వెళ్తున్నారు. పెట్రోలు బంక్ దగ్గరకు వచ్చే సమయంలో ట్రాక్టర్ ఢీకొని కుడికాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై శివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పిచ్చిమొక్కలు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

వేమూరు, న్యూస్‌టుడే: పోతుమర్రు నుంచి చంపాడు వెళ్లే మార్గం పక్కన ఓ విద్యుత్తు నియంత్రిక పైకి పిచ్చిమొక్కలు ఎగబాకాయి. ఆ ప్రాంతంలో సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయంపై ఎగబాకిన నిర్లక్ష్యం అనే శీర్షికతో ఈనాడులో ఈనెల 11న కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పిచ్చిమొక్కలు తొలగించారు.

## ట్యాంకు ఉన్నా తాగునీరు రాదు!

చందోలు పంచాయతీ పరిధిలోని నదీముల్లాయపాలెం, కత్తివారిపాలెం గ్రామాలకు తాగునీరందించేందుకు నిర్మించిన నీటి ట్యాంకు నిరుపయోగంగా ఉంది. రెండేళ్ల క్రితం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో దీన్ని నిర్మించారు. అన్ని పనులు పూర్తైనా కేవలం అయిదారు ఇళ్లకు పైప్‌లైన్ విషయమై తలెత్తిన సమస్యతో నీటి సరఫరా ప్రారంభం కాలేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్‌ను వివరణ కోరగా గ్రామంలో నెలకొన్న సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరించి తాగు నీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. - న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

(c) eenadu

# చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

## రోటరీ క్లబ్‌కు ఎక్సలెన్స్ అవార్డు



ధ్రువపత్రంతో వీరయ్య, సభ్యులు

**అద్దంకి:** అద్దంకి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ సేవలకు గుర్తుగా 2024-25 సంవత్సరానికి 'ఎక్సలెన్స్' అవార్డు వచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో గత గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో క్లబ్‌కు అవార్డు అందజేశారు. ఆ మేరకు గత ఏడాది అధ్యక్షుడు చప్పిడి వీరయ్యకు పురస్కారం , ధ్రువపత్రం ఇచ్చారు. షేక్ మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

## పూర్తికాని కాలనీకి ప్రత్యేక స్టాప్ బోర్డు

**దైవాలరావూరు (మేదరమెట్ల), న్యూస్‌టుడే:** కొరిశపాడు మండలం దైవాలరావూరులో 30 కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక్క ఇల్లు పూర్తి చేయలేదు. అధికారుల ఒత్తిడితో కొంతమంది లబ్ధిదారులు స్లాబ్ వేయగా మిగిలిన వారు పునాదులుతో నిలిపివేశారు. కానీ అక్కడ 'జగనన్న కాలనీ రిక్వెస్ట్ స్టాప్' పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. పూర్తికానీ కాలనీ వద్ద స్టాప్ బోర్డు ఏర్పాటు చేయడంతో స్థానికులు చర్చించుకుంటున్నారు.

## వెళ్లేందుకు దారేది?

**దర్బార్‌రోడ్డు(చీరాల), న్యూస్‌టుడే:**



రహదారిపై నిలిపిన వాహనాలు

ఈ చిత్రం ఎక్కడో శివారు ప్రాంతమో కాదు.. పట్టణ నడిబొడ్డున ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట... ప్రధాన రహదారిపై అడ్డంగా వాహనాలు నిలిపితే పట్టించుకునేవారేలేరు. ఇక పట్టణంలో ట్రాఫిక్ ఏవిధంగా ఉంటుందో చెప్పనక్కరలేదు. చీరాల ఇరుకు ప్రాంతం. నిత్యం విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు.... చీరాలలో ఇదే ప్రధాన సమస్య. దీనిపై దృష్టిపెట్టి ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు దీన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసు స్టేషన్ ముందే రోడ్డుపై అడ్డంగా వాహనాలు నిలిపి గంటల తరబడి పనులు చేసుకుంటున్నారు. దీంతో పాటు దర్బార్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి ఉంది. పోలీసులు సాయంత్రం వేళ కొద్దిసేపు జరిమానాలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైన ట్రాఫిక్ సిబ్బందిని పెంచి, నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## సామర్థ్యానికి మించి ప్రయాణం.. కల్వర్టులు నిలిచేనా?

**మోదేపల్లి, పేరాయపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే:**

పగుళ్లిచ్చిన మోదేపల్లి -చిలకలేరు కల్వర్టు

సామర్థ్యానికి మించిన లోడుతో తాత్కాలిక పైపు కల్వర్టులపై నుంచి గ్రావెల్, గ్రానైట్ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో మోదేపల్లి, పేరాయపాలెం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మొంథా తుపాను ప్రభావంతో రెండు వంతెనల అప్రోచ్ రహదారులు దెబ్బతిన్నాయి. యుద్ధప్రాతిపదికన రూ.25 లక్షలు వెచ్చించి పైపుల ఏర్పాటుతో తాత్కాలిక రహదారి నిర్మించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా జరిగింది. ఇదే అదనుగా భావించిన కొందరు గుత్తేదారులు నేరుగా గ్రావెల్ టిప్పర్‌లు నడుపుతున్నారు. బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి 50 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్‌లు తిరుగుతున్నాయి. చీమకుర్తి నుంచి కొన్ని గ్రానైట్ రాళ్ల టిప్పర్‌లు అర్ధరాత్రి సమయాల్లో తిరుగుతున్నట్లు గ్రామస్థులు వెల్లడించారు. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే మోదేపల్లి సమీపంలోని చిలకలేరు వంతెన పూర్తిస్థాయిలో దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ఈవిషయమై ర.భ.శాఖ ఏఈ శివన్నారాయణను వివరణ కోరగా రెండు చోట్ల శాశ్వత వంతెనల నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక ప్రాతిపదికన కేవలం 30 టన్నుల వాహనాలు మాత్రమే ప్రయాణించొచ్చన్నారు. మైనింగ్ అధికారులకు లేఖ రాయనున్నట్లు చెప్పారు.

## ఆరు కిలోమీటర్ల రహదారి అధ్వానమే

**వేటపాలెం, న్యూస్‌టుడే:** సంతరావూరు రోడ్డు నుంచి ఆలేరు మురుగు కాలువ మీదుగా తిమ్మసముద్రం రోడ్డు వరకు సుమారు ఆరు కిలోమీటర్ల రహదారిని రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఆనాడు మురుగు కాలువపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఆ మార్గం ఆనవాళ్లు లేకుండా దెబ్బతినడంతో పలు చోట్ల గుంతలు పడ్డాయి. వంతెన సైతం శిథిలావస్థకు చేరింది. దీనిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. వారాట, ఆలేరు అవతల వైపు ఉన్న పొలాలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతోంది. వ్యవసాయ సీజన్ పనులు ప్రారంభం దగ్గర నుంచి పంట ఉత్పత్తులు ఇళ్లకు తరలించే వరకు ఇదే ప్రధాన మార్గం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రహదారిని ఇప్పటి వరకు పనిచేసిన పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు స్పందించి దీనికి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

**జె.పంగులూరు, న్యూస్‌టుడే:** ? ముప్పవరం నుంచి నూతనంగా నిర్మించిన కాలనీకి వెళ్లేదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పరిష్కరించండి. **కాలనీ వాసులు**

✔ రెండు రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **కాట్రగడ్డ వెంకట అనిల్‌కుమార్, కార్యదర్శి, ముప్పవరం**

**సంతమాగులూరు, న్యూస్‌టుడే:** ? స్థానిక గిరిజన కాలనీలో రెండు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. వీటిని వినియోగంలోకి తేవాలి. - **స్థానికులు, ఏల్చూరు**

✔ తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం.- **పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి, కొమ్మాలపాడు**

### వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

**వేటపాలెం:** ఆనుమల్లిపేట మహాలక్ష్మమ్మ చెట్టు వెనుక వీధిలో పాటు రైల్వేగేటు నుంచి సచివాలయానికి వచ్చే దారిలో మూడు వీధి దీపాలు వెలగడంలేదని ఆధారాలతో 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి ఈనెల 6న తీసుకొచ్చాం. స్పందించిన ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పూర్ణకుమారి ఆదివారం సిబ్బందిని పంపి, అక్కడ లైట్లు బాగుచేయించారు.

**చినగంజాం:** కడవకుదురు యానాది సంఘంలో వీధి దీపాలు వెలగడం లేదు. స్థానికులు సమస్యను ఈ నెల 12న తీసుకురాగా వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పంచాయతీ ఒప్పంద కార్మికుడిని పంపించి, దీపాలకు మరమ్మతులు చేయించారు.

## అందుబాటులో 108 వాహనం

ఈనాడు కథనానికి స్పందన

**అద్దంకి, న్యూస్‌టుడే:** అద్దంకి 108 వాహనం అందుబాటులోకి వచ్చింది. ఈనెల 9న 'ఈనాడు'లో ప్రచురితమైన 'పనిచేయని 108 వాహనం.. 'సేవలు ఆలస్యం' కథనానికి యాజమాన్యం స్పందించింది. తక్షణం రంగులు మార్చుచేసి ఆదివారం నాటికి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేర్చారు. కేవలం రంగులు మాత్రమే మార్చారు. సీట్లు, మిగిలిన పరికరాలు పాత వాటిని అలాగే ఉంచారు. ఏదేమైనా 108 వాహనం అద్దంకిలో ఉండడంతో అత్యవసర సమయాల్లో ఉపకరిస్తుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

### ట్యాంకు చెంత చిల్లచెట్ల తొలగింపు

**బల్లికురవ, న్యూస్‌టుడే:** మండలంలోని సూరేపల్లిలోని రక్షిత మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ చుట్టూ చిల్లచెట్లు అలుముకుని అస్తవ్యస్తంగా మారటంతో 'ఈనాడు'లో శనివారం 'చిల్లచెట్ల మధ్య రక్షిత మంచినీటి ట్యాంకు' అనే శీర్షిక ప్రచురితమైంది. దీంతో మంత్రి గొట్టిపాటి ఆదేశాల మేరకు స్పందించిన అధికారులు ఆదివారం ఉదయాన్నే జేసీబీ సాయంతో చిల్లచెట్లు తొలగించారు. మండలంలోని అన్ని రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రపరిచి, జల్ జీవన్ మిషన్ పథకంలో వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్ తెలిపారు.

## భవనాశి ఎగువ కాలువ పూడిక తొలగింపు

**గోపాలపురం (అద్దంకి), న్యూస్‌టుడే:** భవనాశి ఎగువ కాలువ పరిధిలో పూడిక తీత పనులు రెండురోజుల పాటు నిర్వహించారు. కాలువ పరిధిలోని గోపాలపురం, రామాయపాలెం, చక్రాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు 750 ఎకరాలకు కొన్నేళ్లుగా సాగునీరు అందని ద్రాక్షగానే మిగిలింది. కొన్నేళ్లపాటు నీరు అందక, మరికొన్నేళ్లు నిధులు లేక మరమ్మతులు జరిపించలేదు. భవనాశి నీటి సంఘం అధ్యక్షుడు నర్రా సుబ్బారావు బాధ్యతలు చేపట్టిన తరువాత కాలువలో పూడిక తొలగించడం, మరమ్మతులు జరిపిస్తున్నారు. మూడు కి.మీ. పొడవున కాలువలో పూడిక తీత, చెట్ల తొలగింపు పనులు నిర్వహించారు. ఇక నుంచి ఆయకట్టుకు నీరు నిరాటంకంగా సరఫరా అయ్యే వీలుందని రైతులు చెబుతున్నారు. దక్షిణ అద్దంకి, గోపాలపురం రైతులు బిక్షపతి రామాంజనేయులు, దామా రవి పాల్గొన్నారు.

పొక్లెయిన్‌తో తీస్తూ..

## ఇసుక టిప్పరు, ట్రాక్టరు స్వాధీనం

**చీరాల అర్బన్, చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓవర్ బ్రిడ్జి నుంచి కారంచేడు రోడ్డుకు వెళ్లే దారిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. బోయినవారిపాలెం రైల్వే గేటు వద్ద ఇసుక ట్రాక్టరును ఈపూరుపాలెం పోలీసుల పట్టుకున్నారు. చట్ట విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరిపి తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## కరాటేలో ప్రతిభ

విజేతలుగా నిలిచిన విద్యార్థులు

**బల్లికురవ:** మండలంలోని గుంటుపల్లి సమీపంలో కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపి, విజేతలుగా నిలిచారు. ఆదివారం చిలకలూరిపేటలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్14 కింద 11 స్వర్ణ, 10 కాంస్య పతకాలు సాధించారు. అండర్17 కింద 6స్వర్ణ, ఒక కాంస్యం సాధించారు. విద్యార్థినులను కోచ్ ఇజ్రాయిల్, సీటీ స్వర్ణలత, ఎస్ఓ ప్రధానోపాధ్యాయిని సరళకుమారి, సిబ్బంది అభినందించారు.

**వేటపాలెం:** పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్థానిక లిటిల్ స్కాలర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు శిక్షకులు వి.బ్రహ్మానాయుడు తెలిపారు. కటాస్ విభాగంలో హారిక, హాసిని, మృణాలిని, శతసాహస్ర, పార్నిత, అస్లాం బంగారు, చరణ్, వేదసూర్యచరణ్ వెండి పతకాలు కైవసం చేసుకున్నట్లు చెప్పారు.

## పోటీ పరీక్షలతో విద్యార్థులకు ప్రయోజనం

పరీక్ష పత్రాలను విడుదల చేస్తున్న డిప్యూటీ డీఈవో గంగాధర్ కమిటీ సభ్యులు

**రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే:** విద్యార్థులకు పోటీ పరీక్షలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ డీఈవో గంగాధర్ అన్నారు. రావినూతల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన యలగాల సుబ్బారావు స్మారక ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఆయన విడుదల చేశారు. డాక్టర్ యలగాల గోపీచంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు.. అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, ఇంకొల్లు, బల్లికురవ మండలాల్లోని 33 పాఠశాలల నుంచి 10వ తరగతి చదివే 370 మంది హాజరయ్యారు. కమిటీ సభ్యులు పూనాటి హరిబాబు, కేసమ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పర్యవేక్షించారు. విజేతలకు కేటగిరీల వారీగా ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు నగదు అందించనున్నారు.

**ఓసీ విభాగంలో..** బాచిన మోహన్ శ్రీనివాస్ (ప్రథమ), మారం ఈశ్వర్‌రెడ్డి (ద్వితీయ), ఎన్.కీర్తనకు తృతీయస్థానం లభించాయి. బీసీ విభాగంలో.. కట్టా వంశీకృష్ణ (ప్రథమ), ఉప్పుమాగులూరి వెంకటగీతా చరణ్ (ద్వితీయ), యలగాల మోహన్ మణికంఠ (తృతీయ) **ఎస్సీ, ఎస్టీ విభాగంలో..** కె.లోహిత్ (ప్రథమ), కె.నాగశైలజ (ద్వితీయ), ఎన్.అల్పితకు తృతీయస్థానం లభించాయి.

## నేడు స్వామిత్వ సర్వే గ్రామ సభ

**జె.పంగులూరు, న్యూస్‌టుడే:** మండలంలోని బైటమంజులూరులో సోమవారం స్వామిత్వ సర్వే గ్రామ సభ జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్ తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రావినూతలకు మంత్రి గొట్టిపాటి

**మేదరమెట్ల, న్యూస్‌టుడే:** కొరిశపాడు మండలం రావినూతలలో సోమవారం ఉదయం 10 గంటలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించనున్నారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు సింబోతు సత్యనారాయణ కోరారు.

### కరెంటు సరఫరా నిలిపివేత

**చీరాల, న్యూస్‌టుడే:** విద్యుత్తు మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీ2 ఏఈ శంకర్ తెలిపారు. పట్టణంలోని గంజిపాలెం, బోస్‌నగర్, స్వర్ణరోడ్డు, అయ్యప్పస్వామిగుడి ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఉచితంగా 'గోసేవా' కిట్‌లు అందజేత

**అద్దంకి, న్యూస్‌టుడే:** పశుపోషకులకు అవసరమైన 'గోసేవా' కిట్‌లను గోపాల్స్, గోపాలమిత్ర, గోపంచగవ్య, ఇతర అనుబంధ సంస్థల ప్రతినిధులు ఆదివారం ఉచితంగా అందించారు. అద్దంకిలోని గోశాల వద్ద ఇది జరిగింది. పశుపోషకులకు, పశువుల కాపరులకు, గోశాల నిర్వాహకులకు ప్రాథమిక చికిత్స నిర్వహించేలా ఈ కిట్‌లు ఉపకరిస్తాయని నిర్వాహకులు శివకుమార్ తెలిపారు. సుభాష్ చంద్రబోస్, పూర్ణచంద్రరావు, కళ్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కాలువ కట్ట నిర్వాసితులకు మౌలిక వసతులు

**శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే:** మినీ బైపాస్ నిర్మాణంలో భాగంగా కాలువ కట్ట నిర్వాసితుల లేఔట్ వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. గత నెల 17న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో మొత్తం 55 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. వారి లేఔట్ వద్ద ఇప్పటికే రహదారులు, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు ఏర్పాటు చేశారు. తాజాగా ఆదివారం మంచినీటి పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టారు. భారీ రక్షిత మంచినీటి పథకం నుంచి పైపులైన్ ద్వారా ఈ లేఔట్‌కు నీటి సదుపాయం కల్పించనున్నట్లు పురపాలక ఏఈ లోకేష్ తెలిపారు. రెండు రహదారుల్లో కలిపి 350మీటర్ల పొడవున పైపులైన్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు.

## యువత కదిలారు... గుంతను పూడ్చారు

గుంతలో కంకర రాళ్లు, మట్టి నింపుతున్న యువత

**ఆదిపూడి(కారంచేడు), న్యూస్‌టుడే:** మొంథా తుపాను ప్రభావంతో కారంచేడు- ఆదిపూడి రహదారి గుంతలమయంగా మారింది. ఇరు గ్రామాల మధ్య ఈ మార్గంలో ఓ చోట ఏర్పడిన భారీ గుంత కారణంగా రాత్రి వేళల్లో పలువురు ద్విచక్ర వాహనదారులు పడి గాయపడ్డారు. గ్రామానికి చెందిన ఏడుగురు గాయాలపాలయ్యారు. ఈక్రమంలో ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఆ గ్రామ యువత ముందుకు కదిలింది. ఆదివారం దాసరి కోటేశ్వరరావు, పగడాల లక్ష్మీనారాయణ, బండారు సురేంద్ర, పావులూరి సాయిహనుమ గుంతలు పడిన ప్రాంతంలో మట్టి, కంకర రాళ్లు వేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా మరమ్మతు పనులకు నిధులు మంజూరు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు.

### శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష

**అద్దంకి:** వాహన చోదకులు శిరస్త్రాణం ధరించడంతో వారి ప్రాణాలకు రక్షణ ఉంటుందని సీఐ సుబ్బరాజు అన్నారు. ఆదివారం భవానీ కూడలిలో నామ్ రహదారిపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

### రంగవల్లులకు 'ముగ్గు' దిగుమతి

**అద్దంకి:** సంక్రాంతి నేపథ్యంలో రంగవల్లులకు ఉపయోగించే ముగ్గును అద్దంకి వ్యాపారులు రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ పలు ప్రాంతాల్లో ముగ్గు రాళ్లు సేకరించి, ముగ్గుగా మార్చి ఇక్కడికి తీసుకొచ్చి, వ్యాపారుల ద్వారా విక్రయించేందుకు రంగం సిద్ధమవుతుంది. మంగళవారం నుంచి ముందస్తు సంక్రాంతి రంగవల్లుల కార్యక్రమం ప్రారంభంకానున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం పెరిగింది.

## విద్యుత్తు తీగల పందిరి!

**వల్లాపల్లి (బల్లికురవ), న్యూస్‌టుడే:** మండలంలోని వల్లాపల్లి సమీపంలో రహదారికి ఇరువైపులా విద్యుత్తు స్తంభాలు, తీగలు పందిరిని తలపిస్తున్నాయి. ఇటీవల పాత స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. పాత స్తంభాలను అలాగే ఉంచడంతో చూసేందుకు పందిరి మాదిరిగా ఉన్నాయి.

### కడవలు పోయే.. మోటార్లు వచ్చే!

**అద్దంకి, న్యూస్‌టుడే:** పొగాకు మొక్కలు నాటే సమయంలో గతంలో కడవలతో కుంట నుంచి నీరు తెచ్చి పాదుల్లో నీరు పోసే వారు. కూలీలు అందులో మొక్కలు నాటుతుండే వారు. నేడు కడవలు కనుమరుగయ్యాయి. పొగాకు పాదుల్లో నీరు పోసేందుకు కూలీలు సులభంగా ఆయిల్ ఇంజిన్, మోటారు పైపుతో నీరు పెట్టుకుంటున్నారు. మోటార్లు, పైపులకు కొంత ఖర్చయినప్పటికి కూలీలు మాత్రం సులభంగా పాదుల్లో నీరు పోస్తున్నారు.

## సాగు నీరు అందలేదంటే నమ్మలేకపోయా

**అద్దంకి, న్యూస్‌టుడే:** రెండున్నర దశాబ్దాల వరకు 500 ఎకరాల సాగర్ ఆయకట్టుకు సాగు నీరు అందకపోవడం అంటే నమ్మలేకపోయా అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం అద్దంకిలో పర్యటించిన మంత్రిని కొటికలపూడి సర్పంచి పూనాటి విక్రం, రైతులు కలిశారు. తమ పొలాలకు నీరు అందించడంలో కృషి చేసిన గొట్టిపాటిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్రికలో కథనం చూసి ఆశ్చర్యపోయానన్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచిందని, కూటమి సర్కారు ఏర్పడిన తరువాత ట్రూడౌన్ పేరుతో రూ.0.13 పైసలు తగ్గిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ట్రూఅప్ ఛార్జీ అంశం లేకుండా చేయాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యంగా చెప్పారు. మంత్రి వెంట కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, షేక్ మొహిద్దీన్ తదితరులు ఉన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్ విజేత 'గద్దల బాబు బృందం'

**అద్దంకి:** ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేతగా అద్దంకి పట్టణానికి చెందిన 'గద్దల బాబు' బృందం విజేతగా నిలిచింది. ఆదివారం పోటీలు ముగియగా, విజేతలకు ఎన్నెస్పీ ఈఈ సతీష్ బహుమతులు అందించారు. అనంతరం క్రిస్మస్ కేకు కోసి అందరికీ పంచారు. ఏపీఎన్‌జీజీవో అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, సునీల్, ఏడుకొండలు, అల్లాభక్ష, షరీఫ్,జయరాజు, రవికుమార్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**కారంచేడు, న్యూస్‌టుడే:** ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, నోవా అగ్రిటెక్ సంయుక్త ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో కారంచేడులోని యార్లగడ్డ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్యులు 425 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి, 105 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం ఎంపిక చేశారు. పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## తుది దశలో అన్న క్యాంటీన్ నిర్మాణం

**మార్టూరు, న్యూస్‌టుడే:** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం తొలిసారిగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన అన్న క్యాంటీన్ పథకం మార్టూరు ప్రజలకు చేరువ కానుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తోడ్పాటుతో నియోజకవర్గంలోని మార్టూరులో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. స్థానిక నాగరాజుపల్లి కూడలి వద్ద ఉన్న ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో దీని కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. దీనికి రూ.60 లక్షలు కేటాయించడంతో ముందుగా భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే భవన నిర్మాణం పూర్తయి, సిమెంటు ప్లాస్టింగ్ దశకు చేరింది. విశాలమైన హాలు, ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు పూర్తయి, క్యాంటీన్ ప్రారంభమైతే నిరుపేదలకు నాణ్యమైన భోజనం, అల్పాహారం కేవలం రూ.5కే దొరకనుంది.

## చెత్తకు చిరునామా

పొలాల నుంచి చీరాల పట్టణాన్ని వేరు చేసే దండుబాట చెత్తకు చిరునామాగా మిగులుతోంది. అడుగడుగునా.. చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంతో అది దండుబాటా లేక చెత్త గోదామా అన్న అనుమానం కలుగుతోందని ప్రయాణికులు అంటున్నారు. చీరాల-కారంచేడు రహదారి నుంచి ఎంజీసీ కాలనీ వరకు కి.మీ పైగానే దండుబాట ఉంది. ఇరుపక్కల గృహాలున్నాయి. మూడు చోట్ల పెద్ద ఎత్తున చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు తాగి పడేసిన కొబ్బరి బొండాలు పేరుకుపోతున్నాయి. వీటిలో దోమలు నివాసం ఏర్పరుచుకుని వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా.. పరిసర ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి రామాపురం ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించి, అపరిశుభ్ర వాతావరణం నుంచి తమను కాపాడాలని ఉజిలీపేట, జవహర్‌పేట, పాలేటినగర్, దండుబాట వాసులు కోరుతున్నారు.

**ఎంజీసీ కాలనీ, దండుబాట (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే.**

## నాగేంద్రుడికి విశేష పూజలు

**భీమవరం(ఇంకొల్లు), న్యూస్‌టుడే:** భీమవరం సమీపంలోని నీలాయ కుంట దగ్గర నాగేంద్రస్వామికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. వేకువ నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి, నాగ ప్రతిమలకు పూజలు చేశారు. గుడిని ఆనుకుని ఉన్న పుట్టలో పాలుపోశారు. సత్రంలో పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నారు. పిల్లలకు తల నీలాల సమర్పణ, చెవిపోగులు కుట్టించే కార్యక్రమాలు జరిగాయి. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తిమ్మసముద్రం కొమ్మమూరు కాలువపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, దగ్గుబాడు సమీపంలోని కోనరాజుకుంట పుట్ట దగ్గర మహిళలు పూజలు చేశారు.

### దాడిపై కేసు

**మోదేపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే :** పొలం గట్టు వివాదం నేపథ్యంలో జరిగిన దాడిపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఏఎస్సై జేవీవీ నాగేశ్వరరావు అందించిన సమాచారం మేరకు.. మోదేపల్లి గ్రామానికి చెందిన ఎం.అంజయ్య పొలంలో జామాయిల్ మొక్కలు నాటారు. ఆయన పొలం పక్కనే బంధువు ఎన్.రామాంజనేయులు పొలం సాగు చేస్తున్నారు. ఇద్దరికీ గట్టు వివాదం నెలకొంది. ఈనెల 12న పొలం వద్ద రామాంజనేయులు, ఆయన కుమారులు శ్రీకాంత్, వెంకటేష్‌లు కలిసి అంజయ్య, ఆయన భార్య గోవిందమ్మపై దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

### పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

**కారంచేడు, న్యూస్‌టుడే:** మండల పరిధి కేశవరప్పాడు గ్రామానికి చెందిన 54 ఏళ్ల మహిళ అనారోగ్య కారణాలతో ఆదివారం పురుగు మందు తాగి, ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిసింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని కారంచేడు పోలీసులు తెలిపారు.

### ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**మార్టూరు:** మార్టూరులోని మద్ది సీతాదేవి కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s. Shriram Finance Ltd., Chirala branch issued the following notice to the general public.

My client intends to grant the loan to the applicant **Katta Naga Malleswara Rao**, S/o. **Katta Sankaraiah**, R/o D.No. 1-50-41-8, Dandubata, Prakash Nagar, Chirala Municipality, Bapatla District, A.P. offered the following notice schedule property as a security of the Business Loan granted to the above said person and after scrutinasation of the documents pertaining to the notice schedule property by the way of registered mortgage as such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, disputes etc., shall be informed to my client or to me within 7 days from the date of notice otherwise later objections will not bind my client in this regards.

**Schedule:** Old Prakasam District - Present Bapatla District - Chirala Sub District - Chirala Municipality - Perala Village - Chirala Old Municipal 9th ward - Present -2nd ward - T.S. Ward No. 9 - Block No. 3- T.S. No. 1/2 - Sy. No. 180/2 of Perala Revenue Village - Old Door No. 2-4-17-18 - Present Door No. 2-11-3 - Dandubata area - an extent of 191 sq. yards site. **East :** Remaining my vacant site - 54ft.03 inches. **South :** 12ft. width passage - 15ft.09 inches. **West :** Property of Mannamgari Compound wall - 54ft. 03 inches. **North :** Property of Maddela Venkateswarlu and etc., - 15ft. 09 inches.

Place : Chirala Sd/- G. Srinivasulu
Date : 09-12-2025 Advocate, Chirala

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s. Shriram Finance Ltd., Chirala branch issued the following notice to the general public.

My client intends to grant the loan to the applicant **Mohammad Shariff S/o Shaik Imam** R/o Inkollu, Bapatla District, A.P. offered the following notice schedule property as a security of the Business Loan granted to the above said person and after scrutinasation of the documents pertaining to the notice schedule property by the way of registered mortgage as such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, disputes etc., shall be informed to my client or to me within 7 days from the date of notice otherwise later objections will not bind my client in this regards.

**Schedule:** Old Prakasam District - Present Bapatla District - Inkollu Sub District, Inkollu Mandal - Inkollu Grama Sy. No. 399/3 - Inkollu Village 4th ward -Nearest Door no. 156 - RCC building - an extent of 64 sq. Yards house site bounded by: **East :** Property of Paleti Chenchu Naga Lakshmi - 12ft. 08 inches. **South:** Property of Shaik Malabula vacant house site - 45ft. 06 inches. **West :** Panchayat Bazaar - 12ft. 08 inch.. **North :** Property of Shaik Malik vacant house site - 45ft. 06 inches.

Place : Chirala Sd/- G. Srinivasulu
Date : 09-12-2025 Advocate, Chirala

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s. Shriram Finance Ltd., Chirala branch issued the following notice to the general public.

My client intends to grant the loan to the applicant **Aala Venkata Gopaiah S/o. Srinivasa Rao,** R/o. D.No. 9-58-1 Karlapalem Mandal, Yijali Village, Bapatla District, offered the following notice schedule property as a security of the Business Loan granted to the above said person and after scnitinasation of the documents pertaining to the notice schedule property by the way of registered mortgage as such if anyone have any claims, charges, mortgages, sale agreements, court attachments, disputes etc., shall be informed to my client or to me within 7 days from the date of notice otherwise later objections will not bind my client in this regards.

**Schedule**

**Item No. 1:** Old Prakasam District - Present Bapatla District - Chirala Sub District - Chirala municipality- Perala Village - Old Municipal 6th ward - Present Municipal 9th ward - block no. 7 door no. 9-19-6 church compound - Harispet area - T.S. No. 516 - Perala Village L.P. No. 1112 - Sy. No. 324/11 - an extent of 290-4 sq. yards site out Ac. 0-59 cents bounded by **East :** Property of Dola Issac **South :** Road margin **West :** Remaining my vacant site **North :** 9ft. width passage

**Item No. 2:** Old Prakasam District - Present Bapatla District - Chirala Sub District - Chirala municipality - Perala village - Old Municipal 6th ward - Present Municipal 9th ward - block no. 7 - door no. 9-19-6 - church compound - Harispet area - T.S. No. 516 - Perala Village L.P. No. 1112 - Sy. No. 324/11 - an extent of 290-4 sq. yards site out Ac. 0-59 cents bounded by:- **East :** Property Aala Venkata Gopaiah **South :** 9ft. width passage **West :** Remaining my vacant site **North :** 9ft. width passage

Place : Chirala Sd/- G. Srinivasulu
Date : 09-12-2025 Advocate, Chirala


(c) eenadu

## సీఎం సహాయనిధి అందుకోండిలా..!

అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం పొందలేని నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆదుకుంటోంది. వైద్యచికిత్స అనంతరం రసీదులు భద్రపర్చుకుని స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయాల్సి ఉంటుంది. వారి సిఫార్సులతో సీఎంవో కార్యాలయానికి పంపుతారు. అక్కడ రసీదుల పరిశీలన పూర్తయ్యాక దరఖాస్తుదారులకు సంక్షిప్త సమాచారం వస్తుంది. అనంతరం చెక్కులు జారీ చేస్తారు. రెండు వారాలకోసారి పరిష్కరిస్తుండటంతో బాధితుల చేతికి త్వరగానే నగదు అందుతోంది.

### దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి..

తెల్ల రేషన్‌కార్డుదారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సాయం కోరేవారు ఏ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పత్రం, చికిత్స ఖర్చుల వివరాలు తెలియజేయాలి. చికిత్స పూర్తయితే ఆ వివరాలు, ఖర్చులు, ఔషధాలు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు పత్రం తీసుకున్నాకే తుది రసీదులు సమర్పించాలి. బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ పత్రాలను వైద్య ఖర్చుల రసీదులకు జత చేయాలి. దరఖాస్తులు కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంటాయి. వాటిని కార్యాలయ సిబ్బంది పరిశీలించి వైద్య ఖర్చుల అవసరాన్ని బట్టి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేస్తారు.

**దరఖాస్తు ఫారం, ఇతర సమాచారం కోసం : https:///apcmf.ap.gov.in** - న్యూస్‌టుడే, పుత్తూరు

## నేటి నుంచి శిరస్త్రాణం ధరిస్తేనే పెట్రోల్

శిరస్త్రాణం ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే:** సోమవారం నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వాటిని ధరించని వారి వాహనాలకు పెట్రోల్ నింపకూడదనే నిర్ణయాన్ని అమలు చేస్తామని చెప్పారు. శిరస్త్రాణధారణ బరువుగా కాకుండా బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు, భార్యాపిల్లల భవిష్యత్తుని శిరస్త్రాణం రూపంలో తలపై ధరించాలని సూచించారు.

# వందకే వారసత్వ హక్కులు

- వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్
- విలువ రూ.10 లక్షలు దాటితే రూ.వెయ్యి

**చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే:** వారసత్వ వ్యవసాయ భూములకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. భాగ పరిష్కారం ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుముల విషయంలో సమూల మార్పులు తెచ్చింది. రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షల పైన ఉంటే రూ.వెయ్యి చెల్లించాలి. దీంతో గత ప్రభుత్వ బాదుడు నుంచి వేలమందికి విముక్తి ఉపశమనం లభించనుంది.

### గతంలో ఇలా..

రూ.15 లక్షల విలువ చేసే ఆస్తిలో పెద్ద కుమారుడి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు, రెండో కుమారుడికి రూ.3 లక్షలు, మూడో కుమారుడికి రూ.2 లక్షల చొప్పున ఉందనుకుందాం. మిగిలిన ఇద్దరితో పోలిస్తే పెద్ద కుమారుడి ఆస్తి విలువ రూ.5 లక్షలు అధికం. దీనిపై 3 శాతం చొప్పున రూ.15 వేల స్టాంపు రుసుం, రిజిస్ట్రేషన్ రుసుం 0.5 శాతం చొప్పున రూ.2,500 కట్టాలి. మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.5 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.5 వేలు కట్టాలి. రిజిస్ట్రేషన్ రుసుముగా రూ.వెయ్యి చెల్లించాలి. గతంలో రెండింటికీ కలిపి రూ.23,500 వరకూ ఖర్చయ్యేది.

### ప్రభుత్వ చొరవతో..

భూమి కలిగిన పట్టాదారుల్లో చాలా మంది జీవించి లేరు. అయినా ఇప్పటికీ వారి పేర్లే వెబ్‌ల్యాండ్‌లో ఉన్నాయి. వారు కాలం చేసి ఏళ్లు గడచిపోతున్నా.. ఆ భూములు ఇప్పటికీ వారసుల పేర్లతో బదిలీ కాలేదు. దీంతో వారసులకు పాసుపుస్తకాలు, బ్యాంకు రుణాలు అందడం లేదు. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. స్పందించిన ప్రభుత్వం వాటి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేసింది.

### మృతుల పేర్లతో పట్టాలు..

భాగ పరిష్కారం ఆస్తులకు రిజిస్ట్రేషన్ బాదుడుతో చిన్న, సన్నకారు రైతులపై అధిక భారం పడేది. దీంతో చాలామంది రిజిస్ట్రేషన్లకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మ్యూటేషన్ కావడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు రావడం లేదు. వివాదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా రుసుముల తగ్గింపుపై ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు రైతన్నకు ఊరటనివ్వనున్నాయి.

### ఇప్పటికే మరణించి ఉంటేనే..

తమ ఆస్తులకు వీలునామా రాయకుండా (ఇంటస్టేట్) కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగ పరిష్కారం చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే.

**జిల్లాకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో మృతుల పేరున ఉన్న రికార్డులు: 22,800**

## వరద ఛాయలు.. కన్నీటి చారలు

పాతపాళెం అరుంధతివాడ పరిధిలో పక్కాగృహం దుస్థితి

ఎండిపోయిన శ్రీగంధం, మహాగని చెట్లను చూపుతున్న బాధితుడు బాబుశెట్టి

రాయల చెరువు గండితో ఏర్పడిన ఊహించని వరద ఆ పల్లెల జీవితాలను కన్నీటిమయం చేసింది. ప్రాణాలు కాపాడుకుంటే చాలు దేవుడా అన్నంతలా చుట్టేసింది. పశువులు, గృహోపకరణాలు కొట్టుకుపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి కేవీబీపురం మండలంలోని కళత్తూరు, పాతపాళెం, ఎస్ఎల్‌పురం పంచాయతీల ప్రజలది. వరి, వేరుసెనగ పంటలు పూర్తిగా ఇసుకమేటల కింద పూడిపోయాయి. రూ.లక్షల విలువ చేసే శ్రీగంధం, మహాగని చెట్లను వరద వేళ్లతో పెకలించింది. రాయలచెరువు ప్రమాదం జరిగి 37 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ముంపు మిగిల్చిన పెనువిషాదం కళ్లకుకడుతోంది.

-న్యూస్‌టుడే, కేవీబీపురం

## వాక్యమే.. ఊరైంది

వ్యాకరణ పరిభాషలో కొన్ని పదాలు కలిపితే వాక్యం అంటారు. కానీ ఆ పేరుతో ఓ ఊరి పేరే ఉందని తెలిస్తే అవాక్కవ్వాల్సిందే. బాలాయపల్లి మండలం నిండలి పంచాయతీలోని మజరా గ్రామమే వాక్యం. గ్రామానికి ఈ పేరు ఎలా వచ్చిందనేది పూర్వీకులకు సైతం తెలియని పరిస్థితి. ఊరిలో మూడు కాలనీల్లో 266 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ జనాభా 750. గ్రామానికి చుట్టూ మూడు మండలాలు, రెండు జిల్లాలు సరిహద్దు ఉన్నాయి.



ఊరికి పడమరన డక్కిలి, ఉత్తరాన నెల్లూరు జిల్లా సైదాపురం, తూర్పు, దక్షిణాన బాలాయపల్లి మండలాలు ఉన్నాయి. గ్రామం నిమ్మ దిగుబడులతో ప్రత్యేక గుర్తింపు సాధించింది.

- న్యూస్‌టుడే, బాలాయపల్లి

## బరి తెగించారు.. చిన్నా!

- కుంట పోరంబోకులో అక్రమంగా రోడ్డు నిర్మాణం
- పుత్తూరులో వైకాపా నేతకు కూటమి నాయకుడి సహకారం

ప్రధాన రహదారి పక్కనే రియల్టర్ల భూమికి వేసిన రోడ్డు

**ఈనాడు, చిత్తూరు:** రాష్ట్రంలో అధికారం మారినా వైకాపా నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది.. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు డేగల్లా వాలిపోతున్నారు.. దీనికి కొందరు కూటమి నాయకులు సహకారం అందిస్తుండటం గమనార్హం..

పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు ఆనుకుని పుత్తూరు పురపాలిక పరిధిలోని చెర్లోపల్లి రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 126/7, 126/10లో కుంట పోరంబోకు భూమి 82 సెంట్లు ఉంది. పక్కనే చిన్నరాజుకుప్పం ముస్లిం, ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ స్థలం వెనక చిన్నరాజుకుప్పానికి చెందిన ఓ వైకాపా నాయకుడి కుటుంబ భూములు ఉన్నాయి. రూ.కోట్ల విలువజేసే సదరు భూములను తిరుపతి, పుత్తూరు చెందిన ఇద్దరు రియల్టర్లకు ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు.

### అడ్డం తిరిగిన కథ..

భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంపై సదరు రియల్టర్లు ప్రశ్నించడంతో వైకాపా నేత ముందున్న కుంట పోరంబోకు మీదుగా దారి వేసేందుకు యత్నించగా అక్కడి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో రియల్టర్లు వైకాపా నాయకుడికి ఇవ్వాల్సిన భారీ నగదును నిలిపేశారు.

### సర్దుబాటు చేశారిలా..!

భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు నియోజకవర్గంలోని 'చిన్న' నేతను ఆశ్రయించగా ఆయన వైకాపా నేతలతో కలిసి ముస్లింకాలనీ వాసుల్లో కొందరిని పిలిచి మాట్లాడారు. వారిని నయానా భయానా ఒప్పించి వెంటనే కొంత మొత్తాన్ని వారికి, సమస్య పరిష్కరించినందుకు సదరు 'చిన్న' నేతకు పెద్ద మొత్తంలో ఆ రియల్టర్లు నగదు ముట్టజెప్పినట్లు సమాచారం. తదనంతరం పనులు చకచకా మొదలై కుంట భూమిలో రోడ్డు నిర్మాణం పూర్తయింది. కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటి పైమాటే. పుత్తూరు-చిత్తూరు ప్రధాన రహదారిలో విలువైన కుంట పోరంబోకు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. 'చిన్న' నేత హుకుం జారీచేయడంతోనే వారు 'మౌనం' దాల్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## విద్యుత్తు సేవలకూ.. ఓ లెక్కుంది..!

**చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే :** విద్యుత్తు వినియోగదారులకు సకాలంలో సేవలు అందజేసేందుకు.. ఒక్కో సేవకు ఒక్కో లెక్క ప్రకారం గడువు విధించారు. నిర్దేశిత సమయంలోగా సంబంధిత అధికారులు ఆ సమస్యను పరిష్కరించాలి. ఈ మేరకు పౌరసేవల సమయపాలన పట్టిక ఏర్పాటు చేశారు. గడువు ప్రకారం సేవలు అందించకుంటే సదరు వినియోగదారుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. సేవలను బట్టి రోజుకు రూ.100-500 వరకు పరిహారం పొందొచ్చు.

| గడువు(గంటల్లో) | పట్టణాల్లో | గ్రామాల్లో |
|---|---|---|
| సాధారణ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ | 4 | 12 |
| ఓవర్ హెడ్‌లైన్ బ్రేక్‌డౌన్ | 6 | 24 |
| నియంత్రిక వైఫల్యం | 24 | 48 |
| మీటరు ఫిర్యాదులు(రోజులు) | 7 | 15 |

### ఎన్ని రోజుల్లో పరిష్కారం చూపాలంటే..

కొత్త కనెక్షన్: మూడు
కాలిపోయిన మీటరు మార్పిడి: 7
వినియోగదారుడి కారణంగా మీటరు కాలిపోతే: 7
విద్యుత్తు సరఫరా (ఎల్‌టీ): 7
11కేవీ నుంచి: 15
33కేవీ నుంచి : 30
అదనపు హెచ్‌టీసీ: 45
యాజమాన్య హక్కు బదిలీ: 7
కేటగిరీ మార్పు: 7
ఎల్‌టీ1 ఫేజ్ నుంచి త్రీఫేజ్: 30
ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి: 60

## యువ పంచ్‌కు పతకాల పంట

పతకాలతో పవిత్ర

ప్రశంసా పత్రాలతో అక్షయ

**పుంగనూరు, న్యూస్‌టుడే:** వారు పంచ్ కొడితే నిర్ణేతలు సైతం మారుమాట్లాడకుండా పతకాలు ఇవ్వాల్సిందే. చదువుతోపాటు కరాటేలో రాణిస్తూ ఆత్మరక్షణ విద్యలో సత్తా చాటుతున్నారు ఆ యువతులు. పుంగనూరు పట్టణానికి చెందిన శిక్షకుడు రెడ్డి మహేష్ మెలకువలతో కరాటేలో పట్టు సాధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో తమదైన ప్రతిభ చూపుతూ బంగారు పతకాలు కైవసం చేసుకుంటున్నారు.

### రక్షించే ధైర్యం వస్తుంది..

పుంగనూరుకు చెందిన శ్యామల, గణపతి దంపతుల కుమార్తె పవిత్ర. ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. ఆరో తరగతి నుంచే శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే పోటీల్లో మూడేసి చొప్పున బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించింది. క్రమశిక్షణ, ఆత్మరక్షణకు దోహదపడే కరాటేను ప్రతిఒక్కరూ ప్రాథమికవిద్య నుంచే నేర్చుకోవాలంటోంది. ఇదే పట్టణానికి చెందిన నారాయణమూర్తి, జ్యోతి దంపతుల కుమార్తె అక్షయ బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఐదో తరగతి నుంచే శిక్షణ తీసుకుంటోంది. రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే పోటీల్లో నాలుగు చొప్పున బంగారు, రజతాలు, ఒక కాంస్య పతకం సాధించింది. కరాటేతో ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తోందని, అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తానంటోంది.

## 2 దూడల నుంచి.. రూ.2 లక్షల ఆదాయానికి...

**కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే:** అసలే పేదరికం.. ఇంటర్మీడియట్ వరకు చదివిన భర్త ఉపాధి కోసం బెంగళూరు పయనం.. వచ్చే రూ.15 వేల జీతంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో ఏడో తరగతి చదివిన ఆ ఇల్లాలు రెండు దూడలు కొని పాడి రంగంలోకి దిగారు. నేడు 17 ఆవులు పెంచుతూ పాలు సేకరిస్తున్నారు. నెలకు లక్షల్లో ఆదాయం సంపాదిస్తూ ఉత్తమ మహిళా రైతుగా ఎదిగారు గరిగచిన్నేపల్లికి చెందిన ఆర్.జయవేల్ భార్య నాగజ్యోతి.

### రోజుకు 200 లీటర్ల పాలు..

2016లో నాగజ్యోతి రెండు దూడలు కొన్నారు. వాటి ద్వారా ఆదాయంతో ఆవులు కొంటూ వచ్చారు. అలా ఇప్పుడు రోజుకు 200 లీటర్ల పాలను డైరీకి విక్రయిస్తున్నారు. ఖర్చులు పోనూ నెలకు రూ.2 లక్షలకుపైగా ఆదాయం సంపాదిస్తూ పిల్లలను చదివిస్తున్నారు.

### యూరియా లేకుండా గ్రాసం..

ఆవులకు మేతకోసం 1.50 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేపట్టారు. తొలుత యూరియా వినియోగించేవారు. ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో ఆవుల మూత్రం వృథాగా పోకుండా ఆవరణలో బావి తవ్వించారు. దానికి మోటారు అమర్చి మూత్రం పొలానికి మళ్లిస్తూ సారవంతమైన పశుగ్రాసం పండిస్తున్నారు. ఈమె కష్టం, మెలకువలను మెచ్చిన ఇండియన్ డెయిరీ సంఘం ఇటీవల తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ పాడి మహిళ పురస్కారానికి అందజేసింది.

## వేలాడే కంచె.. ఏనుగు తలవంచే

### బెడద ఇలా..

- 88 ఏనుగుల్లో ప్రస్తుతం 52 ఉన్నాయి. మిగిలినవి తమిళనాడు నుంచి వచ్చిపోతున్నాయి.

మొత్తం: 1292.47 కి.మీ., కందకాల తవ్వకం : 494 కి.మీ పూర్తి
ఎంత ఖర్చంటే.. కి.మీ. కంచెకు రూ.8 లక్షలు

- సత్ఫలితాలు ఇస్తున్న అటవీశాఖ ఏర్పాట్లు

**పలమనేరు, న్యూస్‌టుడే: అటవీశాఖ** పడమటి డివిజన్‌లో ఏనుగుల దాడులు నివారణకు అధికారులు సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఏనుగులు గ్రామాలవైపు రాకుండా వేలాడే సౌర విద్యుత్తు కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉండే చోట నిర్మాణం చేపట్టారు.

### ఎక్కడెక్కడ అవసరమంటే

- జిల్లా వ్యాప్తంగా 191.4 కి.మీ అవసరం.
- పలమనేరు రేంజ్‌లో 26 కి.మీ. అవసరంకాగా 5 కి.మీ. పూర్తికాగా మరో 4 కి.మీ.కు టెండర్లు పిలిచారు.
- కల్లూరు మండలంలో 5 కి.మీ.కు భూమిపూజ చేశారు.
- కుప్పంలో 9.5 కి.మీ. దూరం కంచె పూర్తిచేయగా 6 కి.మీ. వేయాల్సి ఉంది.
- చిత్తూరు ఈస్టులో మంగళంపేట వద్ద 5 కి.మీ.కు టెండర్లు పిలిచారు.

### రైతుల సహకారంతో..

ఏనుగులను ఏఐ సాంకేతికతతో అమర్చిన కెమెరాల ద్వారా గుర్తిస్తాం. ఎలిఫెంట్ మానిటరింగ్ బృందాల ద్వారా కదలికలు పరిశీలిస్తున్నాం. దాడులు అరికట్టడానికి సౌర కంచెను ఏర్పాటు చేస్తున్నాం. రైతులు సైతం సహకరిస్తున్నారు. - **శ్రీనివాసులు, డీఎఫ్‌వో**

## అటల్.. బాటలో

భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా చేపట్టిన యాత్ర ఆదివారం ఇక్కడికి చేరుకుంది. మర్రిగుంత కూడలిలో ఏర్పాటు చేసిన అటల్ విగ్రహాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్‌ధామీ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, భాజపా నేతలు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, వరప్రసాద్, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రేణిగుంట

## హిమ వర్షం

శీతాకాలం మొదలై చలి విపరీతమైన వణుకు పుట్టిస్తోంది. అసలు హిమాలయాల్లో ఉన్నామా అన్నట్లు మంచు నిత్యం కప్పేస్తోంది. పుత్తూరు పట్టణంలో శనివారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, పుత్తూరు

## ప్రాణం తీసిన నగలు

- నాలుగేళ్ల బిడ్డతో వివాహిత ఆత్మహత్య

**చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే:** నగల విషయమై చోటుచేసుకున్న వివాదంలో ఆవేశానికి గురైన వివాహిత నాలుగేళ్ల కుమారుడితో ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు గ్రామీణ మండలంలోని తుమ్మిందపాళ్యంలో శనివారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. చిత్తూరు తాలూకా పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన బాబు నగరంలోని ప్రైవేటు పాఠశాలలో డ్రైవర్‌గా, భార్య కవిత(27) అదే బస్సులో సహాయకురాలిగా పనిచేస్తున్నారు. కొద్దికాలం క్రితం ఆమెకు.. అదే గ్రామానికి చెందిన రూపేష్‌తో పరిచయం ఏర్పడింది. సదరు వ్యక్తి నగలు కావాలని అడగడంతో ఆమె.. ఇంట్లో ఉన్న బంగారు నగలు అతడికి ఇచ్చింది. వాటి గురించి భర్త ప్రశ్నించడంతో ఆమె రూపేష్‌పై ఒత్తిడి తెచ్చింది. ఒక ట్రెండ్రోజుల్లో ఇస్తానంటూ వాయిదా వేస్తూ వచ్చిన అతను చివరకు ఇచ్చేది లేదని తేల్చిచెప్పాడు. శనివారం రాత్రి నగల విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశానికి గురైన ఆమె కుమారుడు ముఖేష్(4)ను తీసుకెళ్లి గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అర్ధరాత్రి దాటాక మృతదేహాలను బావి నుంచి వెలికితీశారు.

## కొనసాగుతున్న టెట్

**చిత్తూరు విద్య:** టెట్ జిల్లాలో ఐదో రోజు ఆదివారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 370 మంది అభ్యర్థులకు గాను.. 305 మంది హాజరయ్యారని డీఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో టెట్ నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.


**104FM Tirupati** ఈ FM 104 Mee FM
**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

# ఆలయ దర్శిని

## కాణిపాకం వరసిద్ధుడి వినాయక ఆలయంలో



**నిజరూప దర్శనం:** ఉ.: 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా. 4.30- 5.00
**సర్వదర్శనం:** ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30, మధ్యాహ్నం: 12.00 సాయంత్రం: 4.30, రాత్రి: 7-9 గంటలు.

**నిత్య సేవలు**
సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00 బిందుతీర్థ అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

## తిరుమల శ్రీవారి ఆలయంలో

**నిత్యోత్సవాలు**
ఈనెల 17 నుంచి తెల్లవారుజామున 3 గం.కు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. మంగళ, బుధ, గురువారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సా.5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.
**సర్వదర్శనం:** తెల్లవాజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు.

**వారోత్సవాలు**
ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

–న్యూస్‌టుడే, తిరుమల

## ముక్కంటి ఆలయంలో

**ఉదయం:** 3.00: పురవీధుల్లో జేగంట, 4.00: మంగళవాయిద్యాలు, 4.15: గోమాత పూజ, తిరుమంజనం, 5.00: ప్రథమకాల అభిషేకం (ఏకాంతం), 6.00: ద్వితీయ కాలాభిషేకం, 7.00: పరివార దేవతలకు నివేదన, 7.30: గొబ్బిదేవత పురవీధుల ఉత్సవం, 10.30: ఉచ్చికాల అభిషేకం
**సాయంత్రం:** 5.00:ప్రదోష కాలాభిషేకం 6.30: నీరాజన మంత్రపుష్పం
**సర్వదర్శనం:** ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు.

**రాహు, కేతు పూజలు**
ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు
**అభిషేకాలు:** శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం).
**శుక్రవారం:** మనోన్మణికి ఊంజల్‌సేవ

● శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9.00 గంటలకు, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 8.30కు పల్లియర పూజ నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

## 'శ్రీవారి దివ్యప్రసాదములు' పుస్తకావిష్కరణ

**తిరుమల, న్యూస్‌టుడే:** 'శ్రీవారి దివ్యప్రసాదములు' పుస్తకాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. స్థానిక తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ పుస్తక రచయిత, శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు ఆవిష్కరింపజేశారు. వీరితో పాటు సహ రచయిత కోట నీలిమ, శ్రీఅష్టోత్తరశత చక్రాల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాజమహేంద్రవరం గొల్లపూడి వీరాస్వామి సన్ పబ్లిషర్స్ బుక్ సెల్లర్స్ పుస్తకాన్ని ముద్రించారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, రచయిత రమణదీక్షితులు

## రాఘవులుకు సత్కారం

**చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు రాఘవులును దళిత షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆయన్ను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, గౌరవాధ్యక్షులు చార్జిన్, సంఘ డైరెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాఘవులుతో షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం నాయకులు

## స్థలం ఒకరిది.. రిజిస్ట్రేషన్ మరొకరిది

దిగువమాసాపల్లె పంచాయతీ కొత్తూరులో సర్వే నంబరు 179లో వంశపారంపర్యంగా వచ్చిన ఐదు సెంట్ల స్థలం ఓ మహిళ అనుభవంలో ఉంది. అదే గ్రామంలో పలుకుబడిగల మరో వ్యక్తి.. ఈ ఆస్తిని మూడునెలల కిందట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెవెన్యూశాఖ ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని సమాచారం. దీనిపై బాధితురాలు.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చిన తతంగం బయటపడింది. పట్టా ఇచ్చే సమయంలో సిబ్బంది చేపట్టిన విచారణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పొజిషన్ ఆధారంగా రిజిస్ట్రేషన్

ఇదే సర్వే నంబరులో భూమి లేనివారికి రుణాలు

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** చిత్తూరు గ్రామీణ మండలం దిగువమాసాపల్లె పంచాయతీ కొత్తూరులోని ఐదు సెంట్ల స్థలంపై వివాదం జరుగుతోంది. దీని విలువ రూ.10 లక్షల పైమాటే. జీవించి ఉన్నట్లుండి ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ దస్త్రాలు తెచ్చి ఈ స్థలం తమదంటూ దౌర్జన్యానికి దిగడంతో అవాక్కయిన అనుభవదారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వంశపారంపర్యంగా తమ అనుభవంలో ఉన్న స్థలానికి పట్టా ఎలా ఇస్తారని ప్రశ్నించినా అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారుల ఎదుట బాధితులు వాపోయారు. ఈ వ్యవహారంలో రాజీ చేయాలని రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

**తీగలాగితే కదిలిన డొంక..** సదరు ఆస్తిని ఎవరు రిజిస్ట్రేషన్ చేశారనే విషయం తెలుసుకునేందుకు ఈసీ తీసుకోగా సర్వే నంబరు 179లో 40 సెంట్ల గ్రామకంఠం భూముల ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ తనఖాలో ఉన్నట్లు గుర్తించారు. ఆస్తిని చూపి రుణం పొందిన వ్యక్తులు సదరు స్థలంలో అనుభవంలో లేనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని స్థానికంగా కొందరు ఈ భూ ఆక్రమణపై సోమవారం కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమైనట్లు సమాచారం.

**విచారణకు ఆదేశించా..**
దిగువమాసాపల్లె పంచాయతీ కొత్తూరులో జరిగిన రిజిస్ట్రేషన్లు, పొజిషన్ వ్యవహారం విచారణకు సంబంధిత సర్వేయర్, ఆర్ఐలను ఆదేశించా. తప్పని తేలితే అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులకు న్యాయం చేస్తాం.
- కల్యాణి, తహసీల్దారు, చిత్తూరు గ్రామీణ

▶ సారె తీసుకెళ్తున్న మహిళలు ▶ విచిత్ర వేషధారణలో యువకులు, విశ్రాంత ఉద్యోగులు

## బంగారమ్మకు సారె సమర్పణ

**కార్వేటినగరం, న్యూస్‌టుడే:** కార్వేటినగరంలో వెలసిన శ్రీబంగారమ్మ ఆలయంలో గంగ జాతర సందర్భంగా శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సారె సమర్పించారు. బాజాభజంత్రీలు, కేరళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. జాతర పురస్కరించుకుని యువకులు, విశ్రాంత ఉద్యోగులు విచిత్ర వేషధారణలతో గ్రామ వీధుల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, ఉపాధ్యక్షుడు రంగనాథం మొదలియార్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ భక్తులకు ప్రత్యేక వసతులు

**కాణిపాకం, న్యూస్‌టుడే:** వరసిద్ధి వినాయకస్వామి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి, ఇతర సేవల్లో పాల్గొనడానికి ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన భక్తులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని ఈవో పెంచల కిషోర్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు సులభతర దర్శనం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందే విధానాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఇంటి నుంచి స్వామివారి దర్శనం, ఇతర టికెట్లు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చన్నారు. భక్తులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

## సిందూర గణపతి.. ప్రకృతి ప్రణతి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాపవినాశనానికి వెళ్లే మార్గంలో జాపాలి క్షేత్రంలో శ్రీఆంజనేయస్వామి కొలువై ఉన్నాడు. ఆవరణలో దశాబ్దాల కాలంనాటి భారీ మామిడి చెట్టు కాండం వద్ద ఏర్పడిన సహజ వినాయకుని ప్రతిమకు సిందూరం పూసి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. -ఈనాడు, తిరుపతి

## తెలుగు, హిందీ ప్రతిభా పోటీల్లో నస్రీన్‌భాను రాణింపు

జ్ఞాపిక అందుకుంటున్న నస్రీన్‌భాను

**చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో ఆదివారం నిర్వహించిన తెలుగు, హిందీ ప్రతిభా పోటీల్లో ఉమ్మడి రాష్ట్రానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో చిత్తూరు నగరానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నస్రీన్‌భాను మొదటి స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పాపయ్య తెలిపారు. విజేతకు సంస్కృత విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య కృష్ణమూర్తి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారన్నారు. విజేతను హెచ్ఎం హసాన్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

## మామిడి తోటలో.. కంది పూత

మామిడి తోటలో విరగకాసిన కంది

ఏడాదికి ఒకసారి కాపువచ్చే మామిడి తోటలే జిల్లా రైతులకు జీవనోపాధి. ఒకవేళ పంట సరిగా రాకున్నా.. కాయలకు రేటు లేకున్నా రైతులు తీవ్రంగా నష్టపోతారు. గత సీజన్‌లో మామిడి ఎక్కువగా రావటంతో రేటు పడిపోయింది. ప్రభుత్వం చొరవ తీసుకుని కిలో తోతాపురికి రూ.4 సబ్సిడీ ప్రకటించి రైతుల ఖాతాల్లో జమ చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక అలా నష్టపోకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు మామిడి రైతులు తమ పంటల మధ్యలో ఇతర పంటలు సాగుచేసి నష్టాలు పూడ్చుకునే పనిలో పడ్డారు. జీడీనెల్లూరు మండలం కొత్తపల్లిమిట్ట సమీపంలో ఓ రైతు కందిపంట సాగుచేయగా అది ఏపుగా పెరిగి పూత విరగ్గాసింది. అధిక దిగుబడి వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- ఈనాడు, చిత్తూరు

## 17, 18 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

**చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 17, 18 తేదీల్లో కలెక్టర్ల సదస్సు జరగనుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ సదస్సుకు హాజరు కానున్నారు. జీఎస్‌డీపీ లక్ష్యాలు, సూపర్ సిక్స్ పథకాలు, ఇతర అంశాలపై సీఎం సమీక్షించనున్నారు. ఈమేరకు అమరావతి వెళ్లేందుకు కలెక్టర్ సన్నాహాలు చేసుకుంటున్నారు.

## జిల్లాకు చేరిన 350 టన్నుల యూరియా

**చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే:** రబీ సాగు రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2,217 టన్నులు నిల్వ ఉందన్నారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## జీవో సంఖ్య 590ను రద్దు చేయాలి

మాట్లాడుతున్న ఆచార్య రమణ

**చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో ఏర్పాటు చేయనున్న వైద్య కళాశాలల ప్రక్రియ విరమించుకోవాలని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు రమణ ఆరోపించారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం నాయకులకు రెండోరోజు నిర్వహించిన సైద్ధాంతిక శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలల ఏర్పాటు ప్రక్రియ జీవో సంఖ్య 590 జారీ దారుణమన్నారు. ఈ విధానంతో ప్రభుత్వ భూములు, భవనాలు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతాయని, తద్వారా పేదలకు విద్య, వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న వైద్య కళాశాలల ఎదుట నిరసన చేపట్టనున్నామని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజన్, సహాయ కార్యదర్శి శివారెడ్డి పాల్గొన్నారు.

## ఐఐటీఎంలో ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025

▶ ప్రసంగిస్తున్న క్రికెటర్ సాయి సుదర్శన్ ▶ పతాకావిష్కరణలో డైరెక్టరు కామకోటి

**చెన్నై (వడపళని), న్యూస్‌టుడే:** ఐఐటీ మద్రాస్‌లో 59వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025 ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ తిరుపతిలతో కలిసి నిర్వహిస్తున్న వార్షిక జాతీయ సాయి క్రీడా పోటీలు 21వ తేదీ వరకు జరగనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సాయి సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ క్రికెట్ ఆటగాడు శ్రీధరన్ శ్రీరామ్, ఇండియా బాస్కెట్ బాల్ టీమ్ కెప్టెన్ ముయిన్ బెక్ హఫీజ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఐఐటీ మద్రాస్ 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్స్' పేరుతో క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ అనలిటిక్స్' కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్ క్రీడలను కెరీర్‌గా కొనసాగించాలనుకునే విద్యార్థులకు ఐఐటీలో జరుగుతున్న పోటీలు ఓ వేదికగా ఉండగలవని సాయి సుదర్శన్ పేర్కొన్నారు. మూడు ఐఐటీల నుంచి ఈ ఏడాది 3,800 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఐఐటీ మద్రాస్ నుంచి 550 మంది బాలురు, 400 మంది బాలికలు పాల్గొంటున్నారు. ఐఐటీ మద్రాస్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పాల్గొంటోంది. ఐఐటీ హైదరాబాద్ అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీ బాల్, ఐఐటీ తిరుపతి చెస్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్నాయి.

## వేటూరి పాట తెలుగు భాషకు కీర్తి పతాక

సత్కార గ్రహీతలతో దేవేంద్రరావు

**చిత్తూరు (సంతపేట):** సినీ గీత రచయిత వేటూరి సుందరమూర్తి.. పాట తెలుగు భాషకు కీర్తి పతాకమని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నారాయణస్వామి, ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. భారతీయ రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు దేవేంద్రరావు నేతృత్వంలో ఆదివారం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో 'వేటూరి సినీ గీత వైభవం'పై గీతాలాపన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ 37 ఏళ్ల చిత్ర రంగ ప్రయాణంలో 5 వేల పైచిలుకు పాటలు రాసి విశ్వవిఖ్యాత గీత చక్రవర్తిగా వేటూరి కీర్తిని గడించారన్నారు. అనంతరం రచయితలను సత్కరించారు.

### గజరాజులను తరిమిన రైతులు

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** ఎద్దులవారిపల్లె సమీప పాతిరిబండ అటవీ ప్రాంత సరిహద్దులో మకాం వేసిన ఏనుగుల గుంపు శనివారం రాత్రి పంటలపై దాడులకు యత్నించాయి. అటవీ ప్రాంతంలో మాటు వేసిన ఏనుగుల గుంపు పంటలపై దాడులకు వస్తాయని భావించిన రైతులు సరిహద్దులో అప్రమత్తమయ్యారు. పంటల వద్ద మంటలు వేశారు. ఎనిమిది ఏనుగుల గుంపు ఎద్దులవారిపల్లెకు చెందిన గోవిందయ్య మామిడి తోటలోకి చొరబడేందుకు రాగా గుర్తించిన రైతులు బాణసంచా పేల్చి డప్పులు వాయించి, కేకలు వేసి శబ్దాలు చేశారు. దీంతో ఆ గుంపు అటవీ ప్రాంతంలోని పాతిరిబండ లోయకు చేరింది. ఏనుగులు తమ పంటలపై దాడి చేయకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### 'అభివృద్ధి నిరోధకుడు జగన్'

**చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే:** వైకాపా అధినాయకుడు జగన్ అభివృద్ధి నిరోధకుడని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆయన సీఎంగా ఉన్నపుడు వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని, రాష్ట్రాభివృద్ధి తిరోగమనం వైపు నడిచిందన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి అడ్డుకునేందుకు జగన్.. తన ప్రచార మాధ్యమాల్లో విష ప్రచారం చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని, ఎన్ని కుట్రలు చేసినా ఏపీ ఖ్యాతి పెంచుతున్న కూటమి ప్రభుత్వం 2029లోనూ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## గుట్టలనూ వదలడం లేదు..

☛ రాత్రికిరాత్రి రహస్యంగా జేసీబీలతో చదును

చదును చేసిన చిన్నరాజుకుప్పం సమీప గుట్ట

**పుత్తూరు, న్యూస్‌టుడే:** భూముల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది.. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు.. సెలవు రోజులైతే చాలా జేసీబీలు పెట్టి చదును చేస్తున్నారు.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది.

పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలోని చిన్నరాజుకుప్పం దళితవాడకు చెందిన వైకాపా నాయకులు, ఓ కూటమి కార్యకర్తతో కలిసి 15 రోజుల క్రితం గ్రామ సమీప పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు కూతవేటు దూరంలోని గుట్టను జేసీబీతో చదును చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బందితో వెళ్లి పనులు నిలిపివేయించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మళ్లీ ఆ భూమిని అక్రమార్కులు దర్జాగా చదును చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గతంలో పనులు చేసిన సమయంలోనే వారిపై కేసులు పెట్టి ఉంటే మళ్లీ ఆక్రమణకు పాల్పడేవారు కాదు. చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెర్లోపల్లి రెవెన్యూలో ఇప్పటికే ఐదెకరాల మేర చదును చేశారు. పశువులు మేపుకోవడానికి గుట్ట లేకుండా చదును చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆ భూమిలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు..**
గుట్టభూమిని చదును చేసిన వారిని ఇప్పటికే పిలిచి హెచ్చరించాం. ఆదివారం కావడంతో జేసీబీతో చదును చేశారని తెలిసింది. తనకు తెలియగానే పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటికే జేసీబీతో పాటు వెళ్లిపోయారు. చదును చేసిన భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటా -వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

## ఆడుతున్నారు.. ప్రత్యేకంగా

☛ అందివచ్చిన ప్రోత్సాహం
☛ క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగులు

సంకల్పం బలంగా ఉంటే వైకల్యం అడ్డురాదని నిరూపిస్తున్నారు ఈ పిల్లలు.. వారి మనోధైర్యం, పట్టుదల ముందు వైకల్యం ఓడిపోయింది.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహిత ఉపాధ్యాయుల సూచనలతో జిల్లా స్థాయి పారా ఒలింపిక్ క్రీడా పోటీల్లో పాల్గొని చక్కగా రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు దివ్యాంగులు.

న్యూస్‌టుడే, చిత్తూరు విద్య, పూతలపట్టు

పోటీలో ఉత్సాహంగా పరుగిడుతున్న దివ్యాంగులు

**చిన్నబోయిన వైకల్యం..**

యాదమరి మండలం కుక్కలపల్లెకి చెందిన యశ్వంత్ ఎనిమిదో తరగతి విద్యార్థి. ఇటీవల ఎడమకాలిపై చిన్న గడ్డ ఏర్పడటంతో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేసినా ప్రయోజనం లేక చివరకు కాలు కొంతమేర తొలగించారు. ఆ బాధ కనిపించకుండా తల్లిదండ్రులు ధనలక్ష్మి, బాలాజీ ధైర్యం చెప్పి అతడిని ప్రోత్సహించారు. పారా ఒలింపిక్ క్రీడా పోటీల్లో వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ఒక కాలితో పరుగు తీసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

**అధైర్యపడక ముందుకు..**

బుద్ధి మాంద్య విభాగం అండర్-17 పరుగు పందెంలో గుడిపాల మండలం బోయపురానికి చెందిన భవ్య సత్తా చాటింది. తల్లిదండ్రులు విజయలక్ష్మి, సురేంద్ర కూలీలు. బుద్ధి మాంద్యంతో బిడ్డ పుట్టినా అధైర్య పడకుండా అన్నీ తామై చక్కగా చదివిస్తున్నారు. వంద మీటర్ల పరుగు పందెంలో చక్కగా రాణించింది. ఇద్దరు పిల్లల్లో భవ్యకు బుద్ధి మాంద్యం. తల్లిదండ్రులు, భవిత కేంద్ర ఉపాధ్యాయుల సలహాలు తూచా తప్పక పాటిస్తూ ముందుకు అడుగిడుతోంది.

**తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..**

వెదురుకుప్పం మండలం చెంచుగుడికి చెందిన సుశీల, మోహన్‌రెడ్డిల కుమార్తె కుసుమ మేధో వైకల్యంతో జన్మించింది. ఇప్పుడు ఏడో తరగతి చదువుతోంది. తరగతిలో మంచి మార్కులు సాధిస్తోంది. అండర్-17 విభాగం పరుగు పందెంలో రాణించింది. పేద కుటుంబంలో పుట్టిన కుసుమను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

**చిదంబరమా.. మజాకా..**

నగరి మండలం ఏకాంబరకుప్పానికి చెందిన చేనేత కార్మికులు దేవి, సంబంధం కుమారుడు చిదంబరం ఇంటర్ చదువుతున్నాడు. షాట్‌పుట్ పోటీలో 6.5 మీటర్లు దూరం విసిరి విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుద్ధిమాంద్యం కలిగిన ఈ విద్యార్థి అథ్లెటిక్స్ పోటీల్లో చక్కగా రాణించి విజేతగా నిలిచాడు.

EENADU Classifieds

EDUCATION
LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

WANTED: TEACHER for Lower/ Higher Section Hindi Subject. Experience 5 yrs. Cont: 99660 52499/ 88012 77691.

HEALTH & CARE
PAEDIATRIC
✆ 7893888794

WANTED VISHNU CARS (AUTHORIZED MARUTHI SUZUKI DEALER) 91543 33072

JOBS
✆ 98663 01764.
SALES ENGINEER (Male - 1No) Exp: 0-3y. Qua: Any Degree, Telugu Must Sal: 15-20K/ Month + Incentive. Location: Chittoor. 7382936829, 8978407249.
Diploma in Mechanical/ Electrical. 91776 89818. Email ID: karthik@ nilelimited.com.
✆ 81215 41212.

PERSONAL CLASSIFIEDS
CHANGE OF NAME
I, CHINTHAPATLA SNETHA (OLD NAME). D/o C. Muragaiah, Door.No:1-6/4, Rajulapalem, Yerpedu, Chittoor, Andhra Pradesh. 517619. I Changed my Name to CHINTAPATLA SNETHA. Henceforth, I will be Known as CHINTAPATLA SNETHA.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
80085 13290
B/W: రూ. 600 Colour: రూ. 800

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
CHITTOOR, Ramnagar Colony, Main Road, Near RTC 1 Depot, 75x200 Total 15000sft East Face Vacant Site for SALE. 8500511987.

గమనిక
ప్రకటనలపై 5% GST వర్తించును

## 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

**చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే:** చిత్తూరు నగరంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు జరగనున్నాయి. 30న వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి, జనవరి 1న నాయక నాయ పాశురం, 11న గుడారవల్లి, 12న నమ్మాళ్వార్ శాత్తుమొర, 14న ఆండాళ్ తిరుకల్యాణం, 15న విశ్వరూప దర్శనం, సంక్రాంతి, శ్రీ సీతారాముల కల్యాణోత్సవం జరగనున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాల్ తెలిపారు.

## ఎస్‌డీపీఐ సంబరాలు

**చిత్తూరు(జిల్లా పంచాయతీ):** కేరళలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 102 స్థానాల్లో విజయం సాధించడంతో పార్టీ నాయకులు ఆదివారం నగరంలో సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ కూడలిలో కేకు కోసి స్వీట్లు పంచారు. పార్టీ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆసిఫ్, నాయకులు ఆరిఫ్, కరీం, ఇజార్ మౌలానా పాల్గొన్నారు.

# చిత్తూరు

•చిత్తూరు • పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

## చీకటి పడితే భయం.. భయం

**సోమల:** మండలంలో శనివారం రాత్రి పార్వతీనగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం, మనోహర్, రెడ్డెప్ప, సహదేవకు చెందిన ధాన్యాన్ని ఏనుగులు నష్టపరిచాయి. ఎఫ్‌బీవో రాధమ్మ పంటలను ఆదివారం పరిశీలించారు. రాశెట్టివారిపల్లె, పార్వతీనగర్, వడ్డిపల్లెలో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో సూచించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

**న్యూస్‌టుడే, బంగారుపాళ్యం:** సమస్య: స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో చెత్తదిబ్బ దుర్గంధ భరితంగా మారి దోమలకు నిలయమైంది. **- ఓ విద్యార్థి తండ్రి**

సమాధానం: చెత్త దిబ్బ తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- రాజేంద్రప్రసాద్, వార్డెన్**

**న్యూస్‌టుడే, యాదమరి:** సమస్య: భూమిరెడ్డిపల్లి పంచాయతీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పొదల్లా పెరిగాయి. **- స్థానికులు**

సమాధానం: ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు గుర్తించి, వాటిని శుభ్రం చేయిస్తాం. సంబంధిత యజమానులు వినకుంటే నోటీసులు ఇస్తాం. **- లోకేష్, పంచాయతీ కార్యదర్శి**

**న్యూస్‌టుడే, పాలసముద్రం:** సమస్య: ఆముదాల పంచాయతీ రంగాపురం ఆదిఆంధ్రవాడ గ్రామంలోని ప్రధాన వీధుల్లో చెత్తకుప్పలు ఎక్కడ పడితే వేయడంతో అపరిశుభ్రంగా ఉంది. **-గ్రామస్థులు**

సమాధానం: చెత్తకుప్పలు వెంటనే తొలగింపజేస్తాం. **- సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో**

## గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతకే ప్రాధాన్యం

గొడుగుచింతలో సీసీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మురళీమోహన్

**పూతలపట్టు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని గొడుగుచింతలో ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, వేనూతనపల్లెలో జేజేఎం కింద రూ.17.77 లక్షలతో నిర్మించిన 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రక్షిత మంచి నీటి ట్యాంకును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందించాలనే ఉద్దేశంతో జల్‌జీవన్ మిషన్ కింద పనులు జరుగుతున్నాయని చెప్పారు. తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి గోపి, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం, తెదేపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కిక్కు దించుతున్నారు..

● ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు
● మూడేళ్లలో రూ.1.61 కోట్ల జరిమానా
● సిఫార్సులకు తలొగ్గని ట్రాఫిక్ విభాగం

డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**న్యూస్‌టుడే, చిత్తూరు(నేరవార్తలు)**

సాయంత్రమైతేనే మద్యం జోలికి వెళ్లే రోజులు పోయాయి. కొందరు పగలూరాత్రీ తేడా లేకుండా తాగేసి తూగుతూ వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు.. వీరిని కట్టడిచేసి ప్రమాదాలు అరికట్టేందుకు చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు రోడ్డెక్కి ఆకస్మిక తనిఖీలతో నేరుగా మందు బాబుల కిక్కు దించుతున్నారు.. మరోసారి తాగి రోడ్డెక్కాలంటే భయపడేలా న్యాయస్థానాలు సైతం జరిమానా విధిస్తూ కఠినంగా వ్యవహరించడం విశేషం.

చిత్తూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల తలకెక్కిన 'అతి' కిక్కు దించుతున్నారు.. మద్యం తాగి ప్రమాదాలకు కారణమై ఇటు తల్లిదండ్రులకు.. అటు పలు కుటుంబాల్లో ఆరని చిచ్చు రేపుతున్న వారిపై చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు.. ఈ అంశంలో న్యాయస్థానాలు సైతం తొలినుంచీ కఠినంగా వ్యవహరిస్తుండటంతో మందుబాబుల మత్తు వదులుతోంది.. ఫలితంగా గత మూడేళ్లలో ఇలా దొరికిపోయిన వారి నుంచి రూ.1.61 కోట్లు జరిమానా రూపంలో వసూలు చేయడం గమనార్హం.

### కఠినంగా వ్యవహరిస్తూ..

లైసెన్సు, శిరస్త్రాణం లేకున్నా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా చిన్న కేసులతో సరిపెట్టి హెచ్చరించి పంపుతున్నారు. అయితే.. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడితే 'వదిలే ప్రసక్తే లేదం'టూ ఒకింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో మద్యం తాగినట్లు తేలితే వెంటనే సదరు వాహనం, రికార్డులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారు. న్యాయమూర్తి వారిని విచారించి.. మొదటిసారి పట్టుబడితే తొలితప్పుగా భావించి రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు. రెండు, మూడోసారి పట్టుబడినా, వారి వ్యవహార శైలి సరిగా లేకున్నా, అతి చేస్తున్నట్లు తెలిసినా శిక్ష విధించిన సందర్భాలూ ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసులు ఇలా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తూ నిత్యం మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై జూలు విదిలిస్తున్నారు.

**మూడేళ్లలో కేసులు, జరిమానా ఇలా..**

| సంవత్సరం | కేసులు | జరిమానా |
|---|---|---|
| 2023 | 1,027 | 10,94,000 |
| 2024 | 1,084 | 71,12,500 |
| 2025 | 1,204 | 79,90,000 |
| మొత్తం | 3,315 | 1,61,96,500 |

### సిఫార్సులా.. కుదరదంతే..

డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారి కోసం ఎవరైనా సిఫార్సు చేసినా ట్రాఫిక్ పోలీసులు 'వీటి కోసం మాత్రం సిఫార్సు చేయొద్దు' అని సున్నితంగా తిరస్కరిస్తుండటం విశేషం. నిజానికి నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసులకు అధికారులు, రాజకీయ నాయకులు సిఫార్సు చేయడానికి ఇటీవల నిరాకరిస్తుండటం గమనార్హం. మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ ప్రమాదానికి కారణమైతే.. రోడ్డుపై వెళ్లే అమాయకులకే ప్రమాదమనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎవరూ ట్రాఫిక్ పోలీసులపై ఒత్తిడి చేయడం లేదు. ఇదివాలు ఇప్పుడిప్పుడే ఈ అంశంలో కొంతమేర మార్పు వస్తోందని చెప్పొచ్చు. దీంతో ట్రాఫిక్ పోలీసులు సైతం ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాలు, ప్రోత్సాహంతో మరింత ధైర్యంగా దూసుకెళ్తున్నారు.

### కుటుంబం ఎదురుచూస్తుంటోంది..

వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి కోసం తమ కుటుంబం ఎదురుచూస్తుంటుందని గుర్తెరగాలి. వారిలో మార్పు.. ప్రమాదాలు అరికట్టడమే కాక రోడ్డుపై వెళ్లే వారు క్షేమంగా ఇళ్లకు చేరతారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలి.
**-లక్ష్మీనారాయణ, ట్రాఫిక్ సీఐ, చిత్తూరు**

నాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

## చెదరని గుర్తులు.. మధుర జ్ఞాపకాలు

**పాలసముద్రం, న్యూస్‌టుడే:** 15 ఏళ్ల క్రితం చదువుకున్న సహచరులు అందరూ ఒకేచోట కలుసుకుంటే ఆ ఆనందానికి వెలకట్టలేం. అలాంటి మధుర జ్ఞాపకాలు వేదికైంది మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. 2010-2012లో ఇక్కడ ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి అధ్యాపకులు వెంకటరత్నం నాయుడు, సూర్యం, మధు, పురుషోత్తంరెడ్డి, మహేశ్వరబాబు, ధర్మయ్య, సుశీల, రమ్య, కన్యయ్యరాజులను ఘనంగా సత్కరించారు. వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ కళాశాలకు తమవంతు సాయం అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

**పుత్తూరు, న్యూస్‌టుడే:** విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని, అప్పుడే లక్ష్యం చేరుకోవచ్చని డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. పరమేశ్వరమంగళంలోని కేకేసీ ఫిజియోథెరపీ కళాశాలలో ప్రజ్ఞ-2కె25 వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ ఛైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రెడ్డికుమార్, ప్రొఫెసర్ ఎ.ఎస్. సురేష్, అధ్యాపకులు సుందర్, శివహరీష్, అలేఖ్య, వర్షిణి పాల్గొన్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు, హెచ్ఎంలు

## ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం

**నగరి, న్యూస్‌టుడే:** చదువుతో పాటు ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమని పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పార్వతీదేవి పేర్కొన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఆదివారం కరాటే పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రధానంగా బాలికలు ప్రస్తుత సమాజంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. అప్పుడు వారు క్లిష్ట సమయాల్లో చాకచక్యంగా వ్యవహరించి ఆపద నుంచి తప్పించుకునే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో శిక్షణ పొంది ప్రతిభ చూపిన వారికి ధ్రువపత్రాలు, ఐదుగురికి బ్లాక్‌బెల్టులు అందజేశారు. కరాటే మాస్టర్ అన్నాదొరై, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాగ్రత్త.. ఇక్కడో బావి ఉంది..

పెనుమూరు-పుత్తూరు మార్గంలో చింతలచెరువు కట్ట కింద ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. ఇది రోడ్డు అంచునే ఉండటం, దీన్ని కంప, చెట్లు పూర్తిగా కప్పేయడంతో అసలు కనిపించడం లేదు. దీంతో ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన వాహనదారుల్లో నెలకొంది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అక్కడ ఎదురుగా ఏదైనా వాహనం వస్తే పక్కకు దారి ఇచ్చే సమయంలో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఓ పాడిఆవు ఈ బావిలో పడి మృతి చెందింది. దీనికి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పెనుమూరు**

## హోరాహోరీగా డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

**చౌడేపల్లె, పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరు సమీపంలోని కేపీఎల్ ఆట స్థలంలో పలమనేరు డివిజన్ స్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మొదటి రోజు చౌడేపల్లె జట్టుపై పలమనేరు విజయం సాధించింది. సోమల జట్టుపై పుంగనూరు జట్టు విజయం సాధించిందని అధికారులు పేర్కొన్నారు. పుంగనూరు ఎంఈవో నటరాజరెడ్డి, రెవెన్యూ డివిజన్ సమన్వయకర్త శశిప్రకాష్, మండల సమన్వయకర్త వెంకటేష్ పాల్గొన్నారు.

సుమన్‌తో నాగరాజుగౌడ్, జనార్దన్

## గౌడ కులస్థుల అభ్యున్నతికి సహకరించాలి

**బంగారుపాళ్యం, న్యూస్‌టుడే:** ప్రముఖ సినీ నటుడు సుమన్‌ను హైదరాబాద్‌లో ఆదివారం జిల్లా ఈడిగ సంక్షేమ సమితి అధ్యక్షుడు నాగరాజుగౌడ్, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్ కలిసి సత్కరించారు. గౌడ కులస్థుల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించాలని కోరడంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. బంగారుపాళ్యం మండల బీసీ నాయకులతో ఉన్న పరిచయాలు గుర్తుచేసుకున్నారని వివరించారు. ఆయన వెంట నాయకులు చంద్రశెట్టి, నాగరాజు ఉన్నారు.

## చొరవచూపి.. పరిష్కరించి

వల్లియప్పనగర్‌లో పూడిక తొలగిస్తున్న కార్మికుడు

'ఈనాడు-మీతోడు' ద్వారా సమస్యలకు చెక్

**న్యూస్‌టుడే, చిత్తూరు నగరం**

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలోని 'మేమున్నాం-మీకు తోడు' విభాగం ద్వారా వచ్చిన పలు సమస్యలపై చిత్తూరు నగరపాలక సంస్థ, పలు మండలాల అధికారులు స్పందించారు.. వీధుల్లో చెత్త, వ్యర్థాలు, కాలువలు పూడిపోవడం, దోమల విజృంభణ.. ఇలా ఎప్పటికప్పుడు ప్రచురితమైన సమస్యలను ప్రజారోగ్య విభాగం అధికారులు చొరవ చూపి వెంటనే పరిష్కరించారు..

☛ స్థానిక వల్లియప్పనగర్‌లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజారోగ్య విభాగం అధికారులు కాలువలో పూడిక తొలగింపు పనులు పూర్తి చేశారు.

☛ ఇరువారం పీహెచ్‌కాలనీలో కాలువలు పూడిపోవడంతో పూడిక తీసి పారిశుద్ధ్య పనులు పూర్తిచేశారు.

☛ సంతపేట విజయలక్ష్మి కాలనీలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుని దుర్వాసన, దోమల బెడదపై స్పందించిన అధికారులు పూడిక తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టారు.

☛ తానప్పశెట్టివీధిలో నీటి పైప్‌లైన్ లీకేజీపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు మరమ్మతు చేసి లీకేజీ అరికట్టారు.

### తీగల తొలగింపు

బంగారుపాళ్యం-అరగొండ రహదారిలోని ఎస్సీ బాలుర వసతి గృహం సమీప విద్యుత్తు స్తంభాన్ని చుట్టుముట్టిన తీగెలను ఆ శాఖ అధికారులు తొలగించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.
**- న్యూస్‌టుడే, బంగారుపాళ్యం**

### తొలగిన పూడిక

అరగొండ-చిత్తూరు ప్రధాన రహదారిలో ఐరాల క్రాస్ దగ్గర అరగొండ వెళ్లే రహదారిలో చర్చి సమీప ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉండటంతో ట్రాన్స్‌కో అధికారులు స్తంభాన్ని సరిచేశారు.

☛ పుణ్యసముద్రం గ్రామంలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పూడిక తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, తవణంపల్లె**

### పూడిన గుంతలు

స్పందనకు వందనం

చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో జోడిచింతల విద్యుత్తు ఉప కేంద్రం వద్ద గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమల వ్యర్థాలతో నెలకొన్న సమస్యపై తహసీల్దార్ పార్థసారథి స్పందించారు. రహదారులపై వ్యర్థాలు తొలగించాలని సంబంధిత పరిశ్రమల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయడంతో వారు హుటాహుటిన శుభ్రం చేశారు.

☛ అంతర్రాష్ట్ర రహదారిలో కాశిరాళ్ల కొత్తూరు వద్ద నిర్మించిన కల్వర్టు ఎత్తుగా ఉండటం, రహదారి పల్లమై గుంతలు తేలిన సమస్యపై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మట్టి తోలి గుంతలు పూడ్చివేశారు.
**- న్యూస్‌టుడే, యాదమరి**

## గణనాథుడి సేవలో ఎమ్మెల్యే శ్రీనివాసులు

**కాణిపాకం :** శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈవో పెంచల కిశోర్, ఛైర్మన్ మణినాయుడు, అర్చకులు రాజగోపురం వద్ద ఆయనకు స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవో రవీంద్రబాబు, పాలకమండలి సభ్యుడు సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో కిశోర్, ఛైర్మన్ మణినాయుడు

**లైఫ్ సర్టిఫికేట్లు ఇవ్వాలి.. పలమనేరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికేట్లు ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు ఆదివారం కోరారు. పెన్షన్ కొనసాగించడానికి లైఫ్ సర్టిఫికేట్ అవసరమన్నారు.

వెల్డింగ్ కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు

## వెల్డింగ్ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

**నగరి, న్యూస్‌టుడే:** అసంఘటిత కార్మికులుగా వెల్డింగ్ వర్క్ చేసే వారిని బిల్డింగ్ సంక్షేమ బోర్డులో చేర్చి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ, పరిశ్రమల నిర్మాణాల్లో వెల్డింగ్ కార్మికులు కీలకంగా పనిచేస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహక పథకాలు అందడం లేదని, కార్మికశాఖ వారిని గుర్తించి సహకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయకుమార్, రాధాకృష్ణ, ధనపాల్, మస్తాన్, క్రాంతికుమార్, రవి పాల్గొన్నారు.

## అలంకారప్రాయం.. అవస్థల మయం

చవరంబాకం పంచాయతీ పరిధిలోని ఆవాస ప్రాంతాల్లో పంచాయతీ కార్మికులు సేకరించే చెత్త తరలించడం కోసం నిర్మించిన చెత్తను నుంచి సంపద తయారీ కేంద్రం గ్రామానికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. కార్మికులు తరలించే చెత్తను ఆవాస ప్రాంత సమీప కుంటలు, ఖాళీ ప్రదేశాల్లో వేసి పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నారు. అదే స్థలంలో నీటి సౌకర్యం కోసం పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. **-న్యూస్‌టుడే, నిండ్ర**

మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

## వైద్య కళాశాలలు ప్రభుత్వమే నిర్వహించాలి

**నగరి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన పోరాటంలో అందరూ పాల్గొనాలని మాజీ మంత్రి రోజా పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు వైద్యం అందాలంటే ప్రభుత్వమే వాటిని నిర్వహించాలన్నారు. తిరుపతిలో ఈ నెల 15న నిర్వహించనున్న ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. నగరి, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్లు నీలమేఘం, హరి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సంత మైదానంలో షాపింగ్ కాంప్లెక్సు పునాదుల్లో నిలిపిన ఆటోలు

## దుకాణ సముదాయమా.. ఆటోస్టాండా..?

● పునాదులకే పరిమితం ● పట్టించుకోని యంత్రాంగం

**న్యూస్‌టుడే, నగరి**

నగరి పురపాలక సంఘం ఏర్పడి 20 ఏళ్లవుతున్నా నేటికీ దినసరి మార్కెట్ గానీ, షాపింగ్‌మాల్ గానీ లేవు.. పట్టణ ప్రజలకు నేటికీ వారపు సంతే ఆధారం. పట్టణ, మండల ప్రజలతో పాటు సమీప నిండ్ర, విజయపురం మండలాల ప్రజలు ఇక్కడే కొనుగోళ్లకు వస్తారు. పేరుకు పట్టణమైనా పల్లె జీవనమే శరణ్యం. ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతలోనే నిత్యావసరాలు, కూరగాయలు కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో గుడ్‌విల్ పద్ధతిన దుకాణ సముదాయం నిర్మించేందుకు రెండేళ్ల క్రితం తీసిన పునాదులు వెక్కిరిస్తున్నాయి.

బస్టాండ్ వద్ద పట్టణ నడిబొడ్డున రూ.కోట్ల విలువజేసే స్థలం నేడు ఆటో స్టాండ్‌గా మారింది. గతంలో వారపు సంతకు వినియోగించే ఈ స్థలంలో రెండేళ్ల క్రితం గుడ్‌విల్ పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి పునాదులు వేశారు. రూ.2.3 కోట్లతో 31 గదులు, భవిష్యతులో జీప్లస్ భవన సముదాయ నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించి ఆపై పునాదులు వేశారు. ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచాయి, ఇంకఅంతే. వాటి ఊసే లేదు. ఇటు దుకాణ సముదాయం నిర్మించక, అటు సంత నిర్వహించే స్థలం ఇరుగ్గా మారింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న స్థలంలో నేడు ఆటోస్టాండ్‌గా ఉపయోగిస్తున్నారు. ప్రజలకు మాత్రం దినసరి మార్కెట్ కరవై తిప్పలు పడుతున్నారు.

**పురపాలక సంఘం : నగరి**
వార్డులు : 29
జనాభా : 74 వేలు
మున్సిపాలిటీగా ఏర్పడింది: మే 30, 2005

### అనుమతి రాగానే పరిశీలిస్తాం..

ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అనుమతి రాగానే పునఃపరిశీలిస్తాం. **- కృష్ణారెడ్డి, కమిషనర్**

## చదువుల్లో ఫలితాలు.. ఆటల్లో పతకాలు

### నెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు

**న్యూస్‌టుడే, పుత్తూరు**

సాధన ఉంటే అనుకున్నది సాధిస్తారు.. పట్టుదల ఉంటే లక్ష్యం చేరుకుంటారు.. పల్లె విద్యార్థులు క్రీడలపై పట్టు సాధిస్తున్నారు.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరిననాటి నుంచి చదువుల్లో రాణిస్తూనే క్రీడల్లోనూ తమ ప్రతిభ చాటుతున్నారు.. పుత్తూరు మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రాణించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

### గెలుపు కిరణం ఉదయశ్రీ..

తడుకు పంచాయతీ పరిధిలోని సీఎస్ కండ్రిగకు చెందిన నరేంద్రకుమార్, మల్లీశ్వరిల కుమార్తె ఉదయశ్రీ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తోంది. తల్లిదండ్రుల జీవనాధారం వ్యవసాయం. ఈ విద్యార్థినికి చిన్ననాటి నుంచి నెట్‌బాల్ క్రీడ అంటే ఇష్టం. దీంతో నిరంతరం పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభ నిరూపించుకుంది. అండర్-14 విభాగంలో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తన ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైంది. భవిష్యత్తులో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు సాధించేందుకు నిత్య సాధన చేస్తున్నానని చెప్పింది విద్యార్థిని.

### ఇతరులకు ఆదర్శం..

పుత్తూరు మున్సిపాలిటీలోని కట్టకింద రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గోవిందరాజులు, వనిత దంపతుల కుమార్తె మౌనిక ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో కార్మికుడు. చిన్నతనం నుంచే ఆటలంటే ఈ విద్యార్థినికి ఎంతో మక్కువ. మండల, జోన్, జిల్లా స్థాయిలో పాల్గొని పలు పతకాలు సాధించింది. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో తన సత్తా చాటింది. నిత్య సాధనతో క్రీడల్లో ప్రత్యేకత చూపుతోంది. మైదానంలో అడుగిడితే విజయమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా వ్యవహరించడం మౌనిక ప్రత్యేకం.

### జట్టు విజయంలో కీలకం..

పుత్తూరు మున్సిపాలిటీలోని కొత్త తిమ్మాపురానికి చెందిన షణ్ముగం, కామాక్షి దంపతుల కుమార్తె దీపిక. తండ్రి ఆర్టీసీ మెకానిక్. చిన్న కుటుంబం. ఈ విద్యార్థిని చిన్ననాటి నుంచి చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణిస్తోంది. నెట్‌బాల్ పోటీల్లో మండల, జోనల్, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికై నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన పోటీల్లోనూ తన సత్తా చూపింది. పలుమార్లు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి అందరి ప్రశంసలు అందుకుంది.

## మద్యం సీసాలు స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

**కార్వేటినగరం:** చింతమండి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గొలుసు దుకాణంపై దాడులు నిర్వహించి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశామని ఎస్సై తేజస్విని ఆదివారం తెలిపారు. పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజపురానికి చెందిన సుబ్రహ్మణ్యం చింతమండిక్రాస్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అతడిని అరెస్టు చేశామన్నారు.

## ఇరువర్గాల గొడవపై కేసుల నమోదు

**వెదురుకుప్పం:** ఇరువర్గాలు గొడవ పడిన నేపథ్యంలో ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండల పరిధి చిన్నపోడు జేను గ్రామంలో ఓ వివాహితతో.. ఓ వర్గం దురుసుగా ప్రవర్తించిదనే కారణంతో ఇరువర్గాల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారన్నారు. విచారణ అనంతరం ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

పలమనేరు
•పలమనేరు •కుప్పం •పుంగనూరు

## పాఠశాలలో పొంచి ఉన్న అపాయం

గుడుపల్లె మండలం పెద్దగొల్లపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అపాయం పొంచి ఉంది. వారిన ప్రహరీ, బీటలు వారిన మూత్రశాల గోడ, పెచ్చులూడుతున్న తరగతి భవనం పైకప్పు విద్యార్థులను భయపెడుతున్నాయి. పాఠశాలలో ఐదుగురు మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గుడుపల్లె**

## లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

**పలమనేరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని రాష్ట్ర ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు ఆదివారం కోరారు. పెన్షన్ కొనసాగించడానికి లైఫ్ సర్టిఫికెట్ అవసరమన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** సమస్య: కంగానెల్లూరులో కుళాయిలు లీకవుతున్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. సమస్యను పరిష్కరించాలి– ఆనంద్, కంగానెల్లూరు
**సమాధానం:** పంచాయతీ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – మహేష్‌కుమార్, కార్యదర్శి
**పలమనేరు, న్యూస్‌టుడే:** సమస్య: పట్టణంలోని కిట్టప్పమిషన్ వీధిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయడం లేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.– సుదర్శన్, పలమనేరు
**సమాధానం:** కాలువలు శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**పలమనేరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2014-2025 బ్యాచ్ బీటెక్ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ సీఎస్‌ఈ విభాగం ప్రొఫెసర్ సురేష్‌బాబు, కరస్పాండెంట్ రవీంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. **చౌడేపల్లెలో.. చౌడేపల్లె, న్యూస్‌టుడే:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం భోయకొండ వద్ద సమావేశమయ్యారు. తోటివారికి తమవంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నట్లు తీర్మానించారు.

సమావేశమైన పూర్వ విద్యార్థుల బృందం

# ప్రోత్సాహం.. తుది పరీక్షలకు సన్నద్ధం..!

● సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం

**పుంగనూరు, న్యూస్‌టుడే:** ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. సెలవు రోజుల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని విద్యాశాఖ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 7 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పాఠశాలల్లో ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు పురపాలక, గ్రామీణ, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో 51 ఉన్నత పాఠశాలలు, 2,562 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల్లో ప్రత్యేక, పునశ్చరణ తరగతులు, సబ్జెక్టు నిపుణులచే రూపొందించిన ప్రశ్నాపత్రాలతో నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం అందిస్తుండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**వివరాలిలా..**

| మండలం | హైస్కూల్స్ | విద్యార్థులు |
|---|---|---|
| పుంగనూరు అర్బన్, రూరల్ | 18 | 970 |
| చౌడేపల్లె | 10 | 424 |
| సోమల | 5 | 339 |
| సదుం | 5 | 245 |
| రొంపిచెర్ల | 5 | 292 |
| పులిచెర్ల | 8 | 292 |

కొత్తఇండ్లు పురపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందుకుంటున్న విద్యార్థులు

### విద్యార్థులకు ఎంతో సౌకర్యం

సెలవు రోజుల్లో తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ఎంతో సౌకర్యంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో మంచి ఫలితాలు సాధిస్తాం. ఉపాధ్యాయులు అంకితభావంతో తరగతులు నిర్వహిస్తున్నారు.
**- సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు, మేలుపట్ల పురపాలక ఉన్నత పాఠశాల**

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

## ఉచిత నేత్ర శిబిరానికి స్పందన

**పుంగనూరు, న్యూస్‌టుడే:** స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరానికి స్పందన లభించింది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 53 మందికి పరీక్షలు నిర్వహించగా 23 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరంలో స్థానిక అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి కేశవరెడ్డి, ప్రతినిధులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ల ఆవిష్కరణలో యాదవ సంక్షేమ సంఘం సభ్యులు

## క్యాలెండర్ల ఆవిష్కరణ

**పుంగనూరు, న్యూస్‌టుడే:** స్థానిక శ్రీకృష్ణ ఆలయ ఆవరణలో ఆదివారం యాదవ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో 2026 ఏడాది క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. నూతన ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం వనభోజనాలు నిర్వహించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సమీపతి యాదవ్, బీసీవైపీ నాయకురాలు సుశీల రామచంద్ర యాదవ్, సంఘ నాయకులు కుమార్, ప్రతాప్, హితేష్, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రీడాకారులు

## డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

**చౌడేపల్లె, పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరు సమీపంలోని కేపీఎల్ ఆట స్థలంలో పలమనేరు డివిజన్ స్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో మొదటి రోజు చౌడేపల్లె జట్టుపై పలమనేరు విజయం సాధించింది. సోమల జట్టుపై పుంగనూరు జట్టు విజయం సాధించిందని అధికారులు పేర్కొన్నారు. పుంగనూరు మండలం ఏతూరులో ఉపాధ్యాయ క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలమనేరు డివిజన్‌లోని 10 మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. పుంగనూరు ఎంఈవో నటరాజరెడ్డి, రెవెన్యూ డివిజన్ సమన్వయకర్త శశిప్రకాష్, మండల సమన్వయకర్త వెంకటేష్ పాల్గొన్నారు.

## ధ్యానంతో బహుళ ప్రయోజనాలు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** ధ్యానంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని సీఐ సుబ్బరాయుడు అన్నారు. ఆదివారం హర్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో 3కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ నెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ప్రశాంతత పొందడానికి ధ్యానం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ధ్యాన సంస్థకు చెందిన మానస, శివశంకర్, మురళీధర్, నారాయణరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

3కే రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ సుబ్బరాయుడు

## కుమ్మరవీధిలో ఉరుసు

**పుంగనూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని కుమ్మరవీధిలోని మకాన్ వద్ద హజరత్ ఖాదర్‌వల్లీ బాబా ఉరుసును ఆదివారం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం రాత్రి గంధం నిర్వహించారు. నౌజవాన్ కమిటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

## ఆకలి తీర్చడానికి కృషి

**పుంగనూరు, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలో నిరాశ్రయులను గుర్తించి వారి ఆకలి తీర్చడానికి తనవంతు కృషి చేస్తున్నానని పద్మ సుగుణ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు మధుబాల అన్నారు. ఆదివారం పట్టణంలోని నిరాశ్రయులను ఒకచోటకు చేర్చి భోజనాలు అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలరు కృపాకర్, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు భోజనం వడ్డిస్తున్న మధుబాల

## మేతభూమి కాదు.. కార్యాలయం..!

స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణం సెలవు వస్తే పశువులకు నిలయమవుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన వారు కార్యాలయాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేశారు. వనాన్ని కాపాడాల్సిన అధికారులు సెలవు వస్తే కార్యాలయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. గేటుకు తాళం వేయకపోవడంతో అక్కడున్న చెట్లను పశువులు తింటున్నాయి. అధికారులు స్పందించి ఉద్యానవనాన్ని కాపాడాల్సిన అవసరముంది. ఈ విషయంపై ఎంపీడీవో లీలా మాధవిని వివరణ కోరగా... గేటుకు తాళం వేస్తామని.. ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

## పాఠశాల ఎదుట ప్రమాద ఘంటికలు..!

శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఎదుట.. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై ప్రమాద ఘంటికలు పొంచి ఉన్నాయి. విద్యా సంస్థల వద్ద రోడ్డుకు ఇరువైపులా లారీలు, ఇతర వాహనాలను నిలుపుతున్నారు. గంటల తరబడి వాహనాలను నిలపడం వల్ల... విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షించే సందర్భంలో అనర్థాలు జరిగే అవకాశం లేకపోలేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**

## ఈ భవనానికి మోక్షం వచ్చేనా..?

మండలంలోని కందూరులో పదేళ్ల కిందట బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణం చేపట్టారు. అప్పట్లో నిధులు సరిపోకపోవడంతో అసంపూర్తిగా నిలిపారు. అప్పటి నుంచి నేటివరకు అలాగే ఉంచారు. నాయకులు చొరవ తీసుకుని భవనాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సోమల**

## పొంచి ఉన్న ప్రమాదం

పుంగనూరు-పలమనేరు జాతీయ రహదారి పిచ్చిగుండ్లపల్లెకు వెళ్లే మలుపులో రోడ్డుపై పడ్డ గుంతలు ప్రమాదకరంగా మారాయి. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్‌ను సంప్రదించగా.. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

## శునకాల దాడిలో గొర్రెల మృత్యువాత

**శాంతిపురం, న్యూస్‌టుడే:** మండల పరిధి గుండిశెట్టిపల్లె, మఠం, శాంతంపల్లెలో శునకాల దాడిలో గొర్రెలు, దూడలు మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం గుండిశెట్టిపల్లెలో శాంతమూర్తికి చెందిన గొర్రెల మందపై శునకాలు దాడి చేశాయి. రెండు గొర్రెలు చనిపోగా. . మూడు గొర్రెలు గాయపడ్డాయి. మూడు రోజుల కిందట కుక్కల దాడిలో రెండు గొర్రెలు, రెండు దూడలు తీవ్రంగా గాయపడి చనిపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

## మాజీ సర్పంచి మృతికి సంతాపం

**శాంతిపురం, న్యూస్‌టుడే:** కడపల్లె మాజీ సర్పంచి కుట్టెప్ప(80) అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మాజీ జడ్పీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామచంద్రప్ప, గుంజార్లపల్లె సర్పంచి జనార్దన్‌రెడ్డి, నాయకులు దొరస్వామి, కృష్ణమనాయుడు ఆదివారం కుట్టెప్ప మృతదేహానికి నివాళి అర్పించారు.

## కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

**పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పుంగనూరు-తిరుపతి మార్గంలోని చదళ్ల సమీపంలో ఆదివారం కారును ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చీకటి పడితే భయం.. భయం

**సోమల, న్యూస్‌టుడే:** మండలంలో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం రాత్రి పార్వతీనగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం, మనోహర్, రెడ్డెప్ప, సహదేవలకు చెందిన వరి ధాన్యాన్ని ఏనుగులు నష్టపరిచాయి. ఎఫ్‌బీవో రాధమ్మ పంటలను ఆదివారం పరిశీలించారు. రాశెట్టివారిపల్లె, పార్వతీనగర్, వడ్డిపల్లెలో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీవో సూచించారు.

## పురస్కారం ప్రదానం

**కల్లూరు, న్యూస్‌టుడే:** స్థానిక శ్రీవెంకటేశ్వర స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డికి హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఫీడ్ అనే సంస్థ ఉత్తమ ప్రతిభ అవార్డును ప్రదానం చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ప్రభాకర్‌రెడ్డి 32 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థలో సేవలందించడంతో ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జరిగింది. ఈ అవార్డు రావడం గర్వ కారణంగా ఉందని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు..!

**పలమనేరు, పుంగనూరు, న్యూస్‌టుడే:** పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించి సంపద సృష్టించాలన్న అధికారుల లక్ష్యం నీరుగారుతోంది. ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, కాలువల సరిహద్దులో ఇష్టానుసారంగా చెత్తను తగులబెడుతుండటంతో ప్రజలు నిత్యం పొగతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివార్లలో రూ.లక్షలు వెచ్చించి కంపోస్టు యార్డులు ఏర్పాటు, వీధుల్లో పోగయ్యే చెత్తను ఇంటింటా సేకరించడం, తరలించడానికి వాహన సదుపాయాలు ఉన్నా అమలులో నెలకొన్న లోపాలతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. పుంగనూరు, కుప్పం, పలమనేరు పురపాలికల్లో పలుచోట్ల చెత్తను కాల్చడంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది.

పుంగనూరు, కుప్పం, పలమనేరు పురపాలికల్లో ఒక్కో పురపాలికల్లో 55 నుంచి 60వేల జనాభా ఉంది. 15 నుంచి 25 టన్నుల చెత్త పోగవుతోంది. కానీ చాలీచాలని కార్మికులు, కండీషన్‌లో లేని వాహనాలు, సహకరించని ప్రజలతో చిన్న, సన్న వీధుల్లోనే కాదు ప్రధాన మార్గాల్లోనూ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో దుకాణదారులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్‌ల వద్ద చెత్త తరలించకుండా నిప్పు పెడుతున్నారు. ఈ చర్యలతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఆ పొగను పీల్చి అనారోగ్యానికి గురవుతున్నారు.

పుంగనూరులో రాగానిపల్లె రోడ్డులో..

### పొగతో కన్పించని రహదారి

ప్రధాన మార్గాల పక్కనే చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో వెలువడే పొగతో పాదచారులు, వాహనదారులకు రహదారి కన్పించడం లేదు. కొన్నిచోట్ల పొగతో ఊపిరాడకపోవడం, కళ్ల మంటలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణ పరిసరాల్లో ఈ సంఘటనలు నెలకొన్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చెత్తను రోడ్ల పక్కలో వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం

రోడ్లపై, కాలువలపై చెత్తను వేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్యం మెరుగుపరచే కార్యక్రమాలను ముమ్మరం చేస్తాం. ఉదయం వార్డుల్లో ఆకస్మిక పర్యటనలు చేసి విధుల నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకుంటాం.
**- మధుసూదనరెడ్డి, ఎన్వీ రమణారెడ్డి, శ్రీనివాసరావు కమిషనర్లు (పుంగనూరు, పలమనేరు, కుప్పం)**

## క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

**పుంగనూరు గ్రామీణ:** నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)లో విద్యార్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో శిక్షణ నిలుస్తున్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి భావనను పెంపొందిస్తుందని పుంగనూరులోని బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి రామచంద్ర పేర్కొంటున్నారు.

### పోలీసు అధికారినవుతా..

ఎన్‌సీసీలో శిక్షణ పొందడం వల్ల మెరుగైన భవిష్యత్తు ఉందంటున్నాడు **ఇబ్రహీమ్.** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు శిక్షణలోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాడు. రైఫిల్ ఫైరింగ్, మాక్‌డ్రిల్, సామాజిక సేవ తదితర కార్యక్రమాల్లో ప్రతిభ చూపి ప్రశంసలు అందుకుంటున్నాడు.

### ఆర్మీలో సేవలందిస్తా..

దేశ రక్షణ విభాగంలో చేరి తనవంతు సేవలందిస్తానంటున్నాడు **శశిప్రకాష్**. స్థానిక బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సెప్టెంబర్‌లో కడపలో జరిగిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో రైఫిల్ ఫైరింగ్, డ్రిల్ నేర్చుకున్నాడు. సీ సర్టిఫికేట్ సాధించడమే తన ధ్యేయమంటున్నాడు.

### నేవీలో చేరుతా

బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న **ఉదయ్ కుమార్** దేశానికి మెరుగైన సేవలందించడమే తన లక్ష్యమంటున్నాడు. నేవీలో చేరి సరిహద్దుల్లో నిలుస్తానంటున్నాడు. చిత్తూరు, కడపలో ఈ ఏడాది మేలో జరిగిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటాడు.

### దేశ రక్షణకు కృషి

ఎన్‌సీసీలో 'సీ' సర్టిఫికేట్ సాధించి ఎయిర్‌ఫోర్స్‌లో చేరి తనవంతు కృషి చేస్తానంటున్నాడు **సుమంత్**. స్థానిక బీఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరులో కడపలో జరిగిన శిక్షణలో పాల్గొని రైఫిల్ విభాగంలో ప్రతిభ చాటాడు.

## బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు

ఆరడిగుంట పంచాయతీ కురప్పల్లెలో ఆరు నెలల కిందట బోరు వేశారు. మోటారు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీరు సరఫరా కావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అప్పాజీని వివరణ కోరగా వెంటనే విద్యుత్తు కనెక్షన్ ఇప్పించేందుకు చర్యలు చేపడుతామన్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

## వ్యర్థాలతో నిండిన పుష్కరిణి

పుంగనూరులోని ఆరడిగుంట పంచాయతీ కురప్పల్లెలో ఉన్న పురాతనమైన పుష్కరిణి ప్రస్తుతం చెత్త, వ్యర్థాలు చేరి దుర్వాసన వస్తోంది. గ్రామం నడిబొడ్డున ఉన్న పురాతనమైన కొలనును శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

(c) eenadu

## బతుకు బాట.. మెతుకు వేట

గోదావరి ఒడ్డున తెల్లవారుజామున మొదలయ్యే జీవన పోరాటం ఇది. పి.గన్నవరం మండలం జొన్నలంకకు చెందిన మత్స్యకారులు రాత్రి వేళ వేట ముగించుకుని గోదావరిలోనే లంగరు వేసి పడవను నిలుపుతారు. ఉదయం వేళ మళ్లీ వేట మొదలు పెడతారు. నీరు తగ్గడంతో పడవ ఇసుకలో చిక్కుకున్నప్పుడు మత్స్యకారుల సమష్టి శ్రమ మొదలవుతుంది. ఇసుక నీటిలో కొందరు వెనుక నుంచి గెంటుతుంటే మరికొందరు ముందు నుంచి లాగుతూ పడవను గోదావరిలోకి తోస్తారు. ఉదయం మొదలైన ఈ శ్రమ రాత్రి వరకు కొనసాగాల్సిందే. -న్యూస్‌టుడే, కోనసీమ

## మొసళ్లను బంధించేందుకు.. ముమ్మర ఏర్పాట్లు

మొసలిని పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన బోను పరిశీలిస్తోన్న డీఎఫ్‌వో ప్రసాద్

**అయినవిల్లి, న్యూస్‌టుడే:** మొసళ్లను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎఫ్‌వో ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రత్యేకంగా తయారు చేసిన బోను తీసుకు వచ్చి ముక్తేశ్వరం రేవు సమీపంలో ఏర్పాటు చేశారు. 12 అడుగుల పొడవు గల ప్రత్యేక ఇనుపబోను తయారు చేయించారు. రెండు మూడు రోజుల్లో బోనులో చిక్కే అవకాశం ఉందన్నారు.

## సులువుగా రేషన్ కార్డు!

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

గతంలో రేషన్ కార్డు పొందాలంటే ప్రజలు అష్టకష్టాలు పడేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక.. అర్హులైన వారికి రేషన్ కార్డుల పంపిణీకి కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. మన మిత్ర యాప్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

### పిల్లల పేర్లు జత చేయడానికి..

రేషన్ కార్డులో పిల్లల పేర్లు జతచేయడానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. చిరునామా మార్పునకూ అవకాశం కల్పించారు.

### కొత్త జంటల కోసం

భార్యాభర్తల ఆధార్, భర్త పాత రేషన్ కార్డు, వివాహ ధ్రువీకరణ పత్రం తీసుకుని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పౌరసరఫరాల వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు. వీఆర్వో, తహసీల్దార్ అనుమతి పొందగానే కొత్త కార్డు మంజూరు చేస్తారు.

### కమిషనరేట్‌కు జాబితా..

రెండు నెలలు కావస్తున్నా.. నేటికీ 35 వేల స్మార్ట్‌కార్డులు డీలర్ల వద్దే ఉన్నాయి. వాటిని లబ్ధిదారులు తీసుకోవడానికి ఈ నెల 15 వరకు గడువు పెంచింది. ఆ తర్వాత వాటిని కమిషనరేట్‌కు పంపించనున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎ.ఉదయభాస్కర్ మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు తీసుకోని వారి జాబితాలను కమిషనరేట్‌కు పంపించనున్నామని చెప్పారు.

## ఇసుక అక్రమ రవాణాకు మార్గం

పరిశీలన

**పి.గన్నవరం, న్యూస్‌టుడే:** గోదావరి వరద అక్టోబరు చివరి నుంచి పూర్తిగా తొలగింది. దీంతో ఇసుకపై అక్రమార్కులు కన్నేశారు. పి.గన్నవరం మండలం లంకల గన్నవరం శివారు నడిగాడి గ్రామాన్ని ఆనుకుని వశిష్ఠ గోదావరి నదీపాయ ప్రవహిస్తుంది. గతంలో ఇక్కడ నీరు ఎక్కువగా ఉండేది. ఈ ప్రదేశంలో భారీగా నాణ్యమైన ఇసుకతిన్నెలు ఏర్పడ్డాయి. దీనిని తరలించడానికి బాట ఏర్పాటు చేశారు.

నడిగాడివద్ద గోదావరి ఒడ్డుపై ఏర్పాటుచేసిన బాట

### అనుమతులు లేకపోయినా

పి.గన్నవరం మండలంలో ఇసుక, లంకమట్టి వంటి వనరులు తవ్వేందుకు ఎలాంటి అనుమతులు లేవని గనులు, రెవెన్యూశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇవేమీ తమకు పట్టవన్నట్లు అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన ఒక నాయకుడు ఇసుక తీసేందుకు అనుమతులు ఇచ్చారంటూ చెబుతుండటం గమనార్హం. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన ఒక వ్యక్తి ఈ ప్రాంతంలో ఇసుక తీసేందుకు సదరు నాయకుడిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించాడని తెలిసింది. 'ఇసుక అక్రమ రవాణా ఏర్పాట్లపై నిఘా పెట్టాం. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం' అని ఆర్ఐ డాంగే అన్నారు.

## కొబ్బరి రైతులకు తీపి కబురు

మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ కొబ్బరి రైతులు ఎదురుచూపులు ఫలించాయి. కేంద్రమంత్రివర్గం ఈ నెల 12న తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా కొబ్బరికి మద్దతు ధర పెంచింది. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైస్(సీఏసీపీ) సిఫార్సులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. గతేడాది మిల్లింగ్ కోప్రా రకం క్వింటాకు రూ.11,582, బాల్‌కోప్రాకు రూ.12,100 ధర నిర్ణయించగా ప్రస్తుతం 2026 సీజన్‌కు సంబంధించి మిల్లింగ్ కోప్రా రూ.12,027, బాల్‌కోప్రా(బంతి కొబ్బరికి) రూ.12,500 మద్దతు ధరను ప్రకటించినట్లు కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రకటించారు. గతేడాది డిసెంబరులో మిల్లింగ్‌కోప్రా రకానికి క్వింటాలుకు రూ.422, బంతి కొబ్బరికి రూ.100 మేర పెంచారు. ఈ ఏడాది (2026 సీజన్‌కు) మిల్లింగ్ కోప్రాకు రూ.445, బంతి కొబ్బరికి రూ.400 మద్దతు ధర పెంపు చేశారు. గతేడాది మిల్లింగ్ కొబ్బరికి ఉన్న మద్దతు ధర రూ.11,582కు రూ.445 కలిపి ప్రస్తుతం రూ.12,027 ధర ఇవ్వనున్నారు. బంతి కొబ్బరికి గతేడాది రూ.12,100 ఉంటే ఈ ఏడాది రూ.400 కలిపి రూ.12,500గా నిర్ణయించారు.

అంబాజీపేట మార్కెట్‌లో ఆరబెట్టిన మిల్లింగ్ కొబ్బరి

అయిదేళ్లలో మద్దతు ధరలు ఇలా.. (క్వింటా రూ.లలో)

| ఏడాది | మిల్లింగ్ కోప్రా | బాల్ కోప్రా |
|---|---|---|
| 2022 | 10,590 | 11,000 |
| 2023 | 10,860 | 11,750 |
| 2024 | 11,160 | 12,000 |
| 2025 | 11,582 | 12,100 |
| 2026 | 12,027 | 12,500 |

(కొత్త సంవత్సరం)

## గోదారి హొయలు.. పర్యాటక పరవళ్లు

జిల్లా సిగలో పర్యాటక శోభ

**ఈనాడు, రాజమహేంద్రవరం:** వైకాపా జమానాలో పడకేసిన పర్యాటకాన్ని కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. పర్యాటకానికి పారిశ్రామికహోదా ఇస్తూ తీసుకొచ్చిన పాలసీలు పెట్టుబడులు పెట్టేందుకు దోహదపడుతున్నాయి. ఇప్పటికే తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో హోంస్టేలను ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరిలో 9, కోనసీమలో 23 మంది ఆసక్తి చూపినట్లు జిల్లా పర్యాటక అధికారులు వెంకటాచలం, అన్వర్ హుస్సేన్ తెలిపారు.

### ముందుకొస్తున్న సంస్థలు

- సముద్ర తీర ప్రాంతం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో జెట్టీలు ఏర్పాటు చేస్తే ప్రయాణికుల బోట్లు నడిపేందుకు పలు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విజయవాడలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ 'బిజినెస్ ఎక్స్‌పో'లో పర్యాటక సంస్థల ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇప్పటికే అంతర్వేదిలో పర్యాటకానికి అవసరమైన వనరులు సమకూర్చారు.
- గోదావరిలో రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని ధవళేశ్వరం నుంచి కడియపులంక వరకు బోటు విహారానికి సన్నాహాలు చేస్తున్నారు. సీతానగరం, నిడదవోలు, ఆత్రేయపురం, లొల్లలాకులు, పాశర్లపూడి, దిండి తదితర ప్రాంతాల్లోనూ ఆ దిశగా ప్రతిపాదనలున్నాయి. ఇప్పటికే పాపికొండల యాత్రకు యాత్రికులు వెళ్తున్నారు. ఆ ప్రాంతంలో పర్యాటక భవనాలు, రిసార్ట్సులు నిర్మించే యోచన ఉంది.

ఆత్రేయపురంలో పడవల పోటీ

### కోనసీమకు సీప్లేన్...

రాష్ట్ర పర్యాటకంలో ఏడు ప్రాంతాలు అనుసంధానం చేస్తూ సీప్లేన్ నడిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీప్లేన్ ల్యాండ్ అయ్యేందుకు దిండి ప్రాంతంలో మూడు స్థలాలను విమానయాన సంస్థ ప్రతినిధులు ఇటీవల పరిశీలించారు. ల్యాండింగ్‌కు సుమారు 30 సెంట్ల స్థలం అవసరమని గుర్తించారు. వరదల సమయంలో ఇబ్బంది లేకుండా స్తంభాలు నిర్మించి, ప్లాట్‌ఫాంపై ప్లేన్ ల్యాండ్ అయ్యేలా ఏర్పాట్లు చేస్తే ఇబ్బంది ఉండదని అధికారులు సూచించారు.

### కేరళ తరహాలో జల క్రీడలు

- ఏటా సంక్రాంతికి ఆత్రేయపురంలో కేరళ తరహాలో పడవల పోటీ, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానంలో బీచ్ ఫెస్టివల్‌ను అధికారికంగా నిర్వహించడానికి సర్కారు సుమారు రూ.3 కోట్ల మేర కేటాయించింది. బీచ్ ఫెస్టివల్ జనవరి రెండోవారంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## పాఠం.. అర్థమైందా..?

అభ్యసన సామర్థ్యాల అంచనాకు క్లికర్ పరిజ్ఞానం

న్యూస్‌టుడే, ముమ్మిడివరం, రావులపాలెం పట్టణం

తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించిన పాఠం విద్యార్థులకు అర్థమైందో.. లేదో.. తెలుసుకునే విధంగా ప్రభుత్వం నూతన సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు పరీక్షల వరకు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా నూతన విధానం 'క్లికర్'తో వెంటనే తెలుసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు రెండు పాఠశాలల వంతున ఎంపిక చేసి నూతన విధానాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది.

### ఇదీ విధానం..

ప్రఖ్యాత హార్వర్డ్, ఎంఐటీ విశ్వవిద్యాలయాలు, సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాల్లో క్లికర్ ఆధారిత ఇంటరాక్టివ్ క్లాస్ రూమ్ రెస్పాన్స్ విధానం అమలవుతోంది. రాష్ట్రంలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఈ విధానం అమలులోకి తెచ్చారు. పాఠం చెప్పి దాని గురించి డిజిటల్ తెరపై వీడియో చూపించి.. విద్యార్థులను ప్రశ్నలు అడుగుతారు. ప్రతి విద్యార్థి తమ చేతిలో ఉన్న క్లికర పరికరంతో సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ప్రతి సోమవారం నుంచి శనివారం వరకు జరిగే తరగతుల క్లికర్ డేటాను విశ్లేషిస్తారు. విద్యార్థులు తరచూ ఏ అంశాల్లో వెనుకబడుతున్నారో.. దీని ద్వారా గుర్తించి వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన విధానాలపై మదింపు చేశారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థులకు క్లికర్ సాంకేతిక పరికరాలను అందించినట్లు సమగ్ర జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు, సమగ్రశిక్షా ఏఎంఓ పి.రాంబాబు తెలిపారు. ఈ పాఠశాలల్లో ఫలితాలను బట్టి అన్ని పాఠశాలల్లోనూ క్లికర్ విధానం తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు.



రావులపాలెం: డిజిటల్ తెరపై విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

### పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనవి

- రావులపాలెంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల
- అమలాపురం మండలం బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాల

## చెల్లింపుల్లో పొరపాటా.. ఫిర్యాదిలా..

ప్రస్తుతం ప్రతిఒక్కరూ యూపీఐ చెల్లింపులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. కిరాణా, కూరగాయలు, టిఫిన్.. ఇలా ఉదయం లేచిన నుంచి రాత్రి వరకు డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు నగదు బదిలీ అవుతుంటుంది. లేకుంటే పెండింగ్ పడిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంది. లావాదేవీకి సంబంధించిన స్క్రీన్‌షాట్ తీసుకుని ఈ నంబర్లను సంప్రదిస్తే సరిపోతుంది. ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది.

గూగుల్‌పే: 18004190157
ఫోన్‌పే: 080 68727374
పేటీఎం: 01204456456
బీహెచ్‌ఐఎం: 18001201740

–న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

## పసికందుపై కర్కశత్వం

పుట్టిన వెంటనే చెత్తకుప్పలో వదిలిన వైనం

**మండపేట, న్యూస్‌టడే:** పండంటి బిడ్డను కనులారా చూసుకుని.. తనివితీరా ప్రేమగా ముద్దాడాలని ఏ తల్లయినా కలలు కంటుంది. పుట్టిన బిడ్డ రంగు.. రూపం.. ఎలా ఉన్నా.. హృదయపూర్వకంగా స్వీకరించడంలో మాతృమూర్తిని మించినవారు ఉండరు. ప్రసవ వేదనను పంటిబిగువన భరించి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత.. ఆ బిడ్డను చూసి పునఃజన్మ ఎత్తినంత సంతోషాన్ని అనుభవించే అమ్మ.. ఆ పసికందుపై కర్కశత్వాన్ని ప్రదర్శించింది. కళ్లయినా విప్పని పసిగుడ్డును చెత్తకుప్పపైకి చేర్చింది. మండపేటలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది.

ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న నవజాత శిశువు

**రక్షణగా శునకాలు..:** పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులో ఆదివారం ఉదయం పాలు తీసుకునేందుకు పశువుల కొట్టానికి వచ్చిన పశు పోషకుడు నారాయణకు పసికందు ఏడుపు వినిపించింది. ఎక్కడి నుంచి వస్తుందా అని పరికించి చూడగా సమీపంలోని చెత్తకుప్పపై అప్పుడే పుట్టిన మగబిడ్డ ఏడుస్తూ కనిపించింది. గడ్డకట్టే చలిలో ఉన్న ఆ పసికందుకు రక్షణగా అన్నట్లుగా చుట్టూ కొన్ని శునకాలు కాపలాగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఒళ్లంతా రక్తం మరకలతో ఉన్న నవజాత శిశువును చేతుల్లోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లగా వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సపర్యలు చేసిన అనంతరం అమలాపురం ఛైల్డ్ ప్రొటెక్షన్ విభాగంతో పాటు ఐసీడీఎస్‌కు సమాచారం అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త రాణి ఆసుపత్రికి చేరుకుని శిశువుకు పాలు పట్టారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటరమణ మాట్లాడుతూ పసిబిడ్డ ఆరోగ్యంగా ఉందని, సోమవారం పిల్లల వైద్యులు పరీక్షించిన అనంతరం ఛైల్డ్ కేర్ యూనిట్‌కు అప్పగిస్తామని చెప్పారు.

## అరచేతిలో ఆధార్ నవీకరణ

ఇప్పటి వరకు మొబైల్ నంబరుకు, ఆధార్‌కు అనుసంధానం చేయాలన్నా, మార్చాలన్నా ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈ వెతలు తీర్చేందుకు స్మార్ట్‌ఫోన్‌తోనే ఆ ప్రక్రియ పూర్తిచేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. చరవాణి నంబరును 30 రోజుల్లో అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యుఐడీఏఐ) అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఆధార్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్ నంబరు, ముఖ గుర్తింపుతో లాగిన్ అవ్వాలి. మన వివరాలు చూపించే క్యూఆర్ కోడ్ కింద ఉన్న 'షేర్ ఐడీ' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. 'మై ఆధార్ అప్‌డేట్స్'లోని మొబైల్ నంబర్ నవీకరణ ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి. చరవాణి నంబరు నమోదు చేసి, ఓటీపీ ధ్రువీకరణ తదితర వివరాలు పూర్తి చేసి రూ.75 చెల్లించగానే అభ్యర్థన యూఐడీఏఐకి చేరుతుంది. అనంతరం సర్వీస్ రిక్వెస్ట్ నంబరు జనరేట్ అవుతుంది. దీని ద్వారా అభ్యర్థన స్థితిని వినియోగదారులు తెలుసుకోవచ్చు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

OPENING NOW AT RAMACHANDRAPURAM.
MRF T&S
MRF TYRES & SERVICE
SRI SAI RAM TYRES - At VSM College Road, Beside SBI.
Your best bet for a superior wheel and tyre service.

You can't miss it! - Drive in to experience the comfort of tyre shopping and service.

SRI SAI RAM TYRES
Plot No.7 & Plot No.18, S.No.515 & 524,
Layout No.21/1983, VSM College Road,
Beside SBI, Ramachandrapuram,
Dr. B. R. Ambedkar Konaseema - 533 255,
Andhra Pradesh.
Mobile: 81859 34999




The MRF T&S Experience: Range of MRF Tyres • Automated Tyre Changing • Computerised Wheel Balancing & Alignment • Tubeless Tyre Repair • Nitrogen Filling • MRF Trained Service Personnel • Air-Conditioned Comfort
DEALERSHIP: MRF Limited advises the public that it has no Websites other than www.mrftyres.com seeking dealership applications.
The public is further cautioned that there could be FAKE Websites claiming to be MRF. For Dealership Requests, please send an email to "write2us@mrftyres.com"

(c) eenadu

# జ్ఞాన సముపార్జన.. నైపుణ్య శిక్షణ

● సమ్మిళిత విద్యా కేంద్రాలుగా గ్రంథాలయాలు

న్యూస్‌టుడే – ఆలమూరు, రావులపాలెం పట్టణం

చిన్నారులు మొదలుకుని వయోజనులు, సామాన్య ప్రజలతోపాటు పోటీపరీక్షల అభ్యర్థుల వరకు అందరికీ ఉచితంగా జ్ఞానాన్ని అందించేవి పౌరగ్రంథాలయాలే. కరోనా మహమ్మారి తరువాత సామాన్యుల్లో పఠనం పట్ల ఆసక్తి తగ్గినా, విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు నిత్యం గ్రంథాలయాలకు వచ్చి అక్కడున్న పుస్తకాలను వినియోగించుకుంటున్నారు. కాలానుగుణంగా పుస్తకాలతో పాటు డిజిటల్ విద్యను సైతం సామాన్యులకు చేరువ చేయాలన్న తలంపుతో కర్ణాటకకు చెందిన శిక్షణ ఫౌండేషన్, డెల్ కంపెనీ సంయుక్తంగా రెండు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్‌లతో ఇంక్లూసివ్ సెంటర్లను ఏర్పాటు చేశాయి. వీటిద్వారా ఉచితంగా డిజిటల్ విద్యను అందుకునే అవకాశం దక్కింది.

పాఠాలు వింటున్న విద్యార్థులు

**గత నెలలో ప్రారంభం..**

ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్రంలో 200 గ్రంథాలయాల్లో ఇంక్లూసివ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని గత నెలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో ఏడాది పాటు అంతర్జాల సౌకర్యం అందుబాటులో ఉంటుంది. డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమాలు, పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్ మొదలైన సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు.

**విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులకు ఉపయోగం**

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన సమాచారం కోసం పోటీ పరీక్షల అభ్యర్థులకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు సంబంధించిన విద్యా పాఠాలు స్మార్ట్ టీవీ ద్వారా వీక్షించవచ్చు. స్మార్ట్ ఫోన్ ద్వారా బ్యాంకింగ్, యూపీఐ వాడకం మొదలైన అంశాలను గ్రంథపాలకులు విద్యార్థులకు వివరిస్తారు.

**అందరూ వినియోగించుకోవాలి**

ఉచితంగా అంతర్జాల సౌకర్యంతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలు కంప్యూటర్లలో నిక్షిప్తమై పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలి. ఆలమూరు గ్రంథాలయంలో ఇన్‌క్లూసివ్ సెంటర్‌కు ఆదరణ బాగుంది.

– తమ్మా నమశ్శివాయ, గ్రంథాలయాధికారి, ఆలమూరు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో.. పౌర గ్రంథాలయాలు: 120 కేంద్రాలు ఏర్పాటు చేసినవి: 20**

# రామోజీ ఫిల్మ్‌సిటీ వేదిక.. శీతాకాల వేడుక

● ఈ నెల 18 నుంచి నెల రోజుల సందడి

18th DEC '25 - 18th JAN '26

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: శీతాకాల వేడుకలతో పర్యాటకులను అలరించేందుకు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ముస్తాబైంది. ఈనెల 18వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే 'వింటర్ ఫెస్ట్'కు సర్వంసిద్ధమైంది. జనవరి 18 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో సందర్శకులను మంత్రముగ్ధులను చేసే సినీ మ్యూజిక్‌తో పాటు సెలవు రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొనే కార్నివాల్ పరేడ్, మనసుకు హత్తుకొనేలా మ్యూజికల్ గ్లో గార్డెన్, మాయాలోక్‌తో పాటు మరెన్నో అలరించే అంశాలు ఉండనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా స్టూడియో టూర్..** వేడుకల్లో భాగంగా ఫిల్మ్‌సిటీ సందర్శన సమయం రాత్రి 9 గంటల వరకు పొడిగించారు. ప్రకాశవంతమైన వాతావరణంలో ఫిల్మ్‌సిటీ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో ఫెస్ట్‌ను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు అద్వితీయ సినిమా సెట్ల సందర్శనతో సాగే స్టూడియో టూర్ ఆకట్టుకుంటుంది. లైవ్ షోలు, వైల్డ్ వెస్ట్ స్టంట్స్, ఉత్తేజకరమైన రైడ్స్, సాహసాల వేదిక సాహస్, బర్డ్ పార్కు సందర్శనతో ఇదో మధుర జ్ఞాపకంగా మలుచుకోవచ్చు.

**న్యూ ఇయర్ పార్టీ...**

డిసెంబరు 31న నూతన సంవత్సరంలోకి అడుగిడే క్షణాలను సరికొత్త ఉత్సాహంతో గడిపేందుకు రామోజీ కార్నివైబ్ 2026 ఉంటుంది. వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్‌డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. అపరిమిత ఆహారం, పానీయాలతో వీనులవిందైన సంగీత ప్రదర్శనలతో సాగే ఈ వేడుకలో సందర్శకులు పాలుపంచుకోవచ్చు.

**అబ్బురపరిచే కార్నివాల్**

అద్భుత శకటాలతో అబ్బురపరిచే కార్నివాల్ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో చిన్నాపెద్దా అందరూ సరికొత్త అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. మిరుమిట్లు గొలిపే ఫిల్మ్‌సిటీ అందాల మధ్య ఆనందతీరాలను చవిచూడవచ్చు. మ్యూజికల్ గ్లో గార్డెన్ సరికొత్త లోకాన్ని కళ్ల ముందుకు తెస్తుంది. ఐకానిక్ సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ సందర్శనతో వీక్షించవచ్చు. సెట్ల డిజైన్, కళాత్మక నైపుణ్యంతో తెరవెనుక జరిగే కృషి కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది.

● 'వింటర్ ఫెస్ట్'కు సర్వం సిద్ధం

**ప్రత్యేక ప్యాకేజీలు, సౌకర్యాలు**

వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకలకు వివిధ ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ కోసం క్రెష్ సౌకర్యాలను పర్యాటకులు వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకు: www.ramojifilmcity.com లాగిన్ అవ్వండి. కాల్ సెంటర్ నంబర్: 7659876598

# సనాతన ధర్మధ్వజం ఎగురవేయడమే లక్ష్యం

● శ్రీరాజేంద్ర దాస దేవాచార్య మహరాజ్ స్వామీజీ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భారతావనిలో వైదిక ధర్మాన్ని ప్రతిష్ఠించి, సనాతన ధర్మ ధ్వజం ఎగురవేయడమే సంకల్పమని పరమపూజ్య శ్రీరాజేంద్ర దాస దేవాచార్యాజీ మహరాజ్ స్వామిజీ అన్నారు. బృందావనంలోని శ్రీరైవాసం నుంచి శిష్యగణంతో గోదావరి పరిక్రమ (ప్రదక్షిణ) క్రతువులో భాగంగా శనివారం రాత్రి కొవ్వూరు గౌడీయమఠానికి వచ్చారు. ఆదివారం ఉదయం నిత్యపూజ అనంతరం గోష్పద క్షేత్రం ప్రధాన రేవులో పుణ్య నదీ స్నానమాచరించారు. ఆయన మాట్లాడుతూ గోదావరిని పురాణాల్లో దక్షిణ గంగ అని పిలుస్తారన్నారు. గోష్పద క్షేత్రం, గోదావరి తీరంలో సప్తరుషులు నడయాడారని, ఇక్కడి నుంచి గోదావరి ఏడు పాయలుగా పయనించి సముద్రంలో కలుస్తుందన్నారు. ఇది విడివడేముందు ఈ ప్రదేశం ప్రధాన తీర్థంగా ఉందన్నారు.

గోష్పద క్షేత్ర రేవులో పుణ్యస్నానం చేస్తున్న స్వామీజీ

**శిష్యులు, భక్తుల సందడి..:** బృందావనం, అయోధ్య, చిత్రకూటం, ఓంకారేశ్వరం, ఉజ్జయిని, ద్వారక, జగన్నాథపురిల నుంచి సుమారు 500 మంది శిష్యులు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, భక్తులు స్వామీజీని దర్శించుకున్నారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ నివాసానికి ఆయన వచ్చి భక్తులను ఆశీర్వదించారు. డిసెంబరు 5న గోదావరి నది ఆవిర్భావ ప్రదేశం నాసిక్‌లో పరిక్రమ ప్రారంభమైందని వివరించారు.

**GOVERNMENT OF PUDUCHERRY**
**OFFICE OF THE REGIONAL ADMINISTRATOR**

No. 1044/RAY/D2/YPF-2026/2025-26 Yanam, Dt. 12-12-2025

**e-PROCUREMENT SHORT TENDER NOTICE**

The Regional Administrator, Yanam is inviting e-tenders to perform Programmes / Suppliers of Materials in connection with the Celebration of 22nd Yanam Peoples Cultural Festival, 2026 from Artistes / Cultural Associations / Registered Societies / Voluntary Service Organizations / Event Managers / Contractors / Material Suppliers who are having valid i-key and digital signature certificate and registered in U.T. of Puducherry.

1. Tenders can be downloaded from **15-12-2025 at 1.00 p.m.** onwards.
2. The date and time of receipt of tenders on or before **25-12-2025 upto 12.30 P.M.**
3. Date & Time of opening of Tender -- **26-12-2025 at 11.00 A.M.**

Further details can be seen at e-procurement website **https://pudutenders.gov.in** from **15-12-2025 at 01.00 p.m.** onwards and can be had from the office of the Regional Administrator, Yanam during office working hours.

**Sd/- (ANKIT KUMAR, I.A.S.)**
**REGIONAL ADMINISTRATOR, YANAM**

# ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం మండపేట మండలం ద్వారపూడి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ముందుగా ఆంధ్ర శబరిమలగా పేరుగాంచిన అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ప్రసిద్ధ శైవక్షేత్రం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, న్యాయమూర్తులు బెన్నియ్య నాయుడు, ఎల్.వెంకటేశ్వరరావు, శేషయ్య, ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్, మండల అధికారులు, పోలీస్ సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌తో జిల్లా న్యాయమూర్తులు

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి

# ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు

● యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ గోపీమూర్తి

రాయవరం, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా మిగిలిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రాయవరం మండలం పసలపూడి చింతా సుబ్బారాయుడు కల్యాణ మండపంలో యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. చట్టసభల్లో ప్రభుత్వాలకు అవసరమైన బిల్లులను ఆమోదించుకుంటున్నారే తప్ప ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయుల టెట్‌ను రద్దు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. తొలుతగా యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. వివిధ సందర్భాల్లో మృతి చెందిన ఉద్యమనాయకుల చిత్రపటాలకు నివాళి అర్పించారు.

**జిల్లా కార్యవర్గం ఎన్నిక..**

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా పెంకే వెంకటేశ్వరరావు, అధ్యక్షునిగా జీవీ రమణ, సహ అధ్యక్షులుగా వైవీఎస్ఎం బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎంటీవీ సుబ్బారావు, ఆడిట్ కమిటీ సమన్వయకర్తగా కొప్పిశెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా మేరదీ దూత్ ఎన్నికయ్యారు.

# పుణె పరుగు పోటీలో విజేత రామరాజు

విజేతకు పతకం అందజేస్తున్న నిర్వాహకుడు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని పుణె వెస్టర్న్ ఘాట్స్ రన్నింగ్ ఫౌండేషన్ ఈ నెల 13న నిర్వహించిన 8వ ఎస్ఆర్టీఎల్ ట్రైల్ రన్‌లో లొల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, ట్రై అథ్లెట్ దాట్ల శ్రీరామరాజు ప్రతిభ చాటారు. 45 సంవత్సరాల విభాగంలో సిన్హగడ్, రాజ్‌గడ్, టోర్న, లింగన కోటలను(100 కి.మీ.) 14.45 గంటల్లో పూర్తి చేశారు. పోటీల్లో చూపిన ప్రతిభకు ఈయన నిర్వాహకుల నుంచి పతకం, జ్ఞాపిక అందుకున్నారు. ఆదివారం ఈయన్ను పలువురు అభినందించారు.

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్- డి. నెం.5-2-183/184, 3వ అంతస్తు, మోదీ స్క్వేర్, రాణిగంజ్, సికింద్రాబాద్- 500003.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగస్లాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి- 400708. నమోదిత కార్యాలయం: 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదురుగా, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్–380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనియబడిన స్థిరాస్తి, రుణ రిఫ నం.2578లో శ్రీ అడబాల ఆదినారాయణ (ప్రొప్రైటర్) C/o శ్రీ వినాయక ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్, శ్రీమతి అడబాల దేవి కుమారి నుండి సెక్యూర్ క్రెడిటార్‌కు 5-12-2024 నాటికి రావల్సిన బకాయిలు రూ. 70,48,295/– (డెబ్బై లక్షల నలభైఎనిమిది వేల రెండువందల తొంభైఐదు రూపాయలు మాత్రమే) (ఈ మొత్తంలో 5-12-2024 వరకు వర్తించిన వడ్డీ కలిపి ఉన్నది)తో పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలను రాబట్టు కొనుటకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 31–12–2025 న విక్రయించబడుతుంది. అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో) | రూ. 85,24,800/– (ఎనభైఐదు లక్షల ఇరవైనాలుగు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ. 8,52,480/– (ఎనిమిది లక్షల యాభైరెండు వేల నాలుగువందల ఎనభై రూపాయలు మాత్రమే) విశాఖపట్నం వద్ద చెల్లింపయ్యేలా యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ పేరిట డిడి/ పిఓ ద్వారా |
| బిడ్ పెంపుదల సొమ్ము: | రూ. 10,000/– (పది వేల రూపాయలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్/ టెండరు దాఖలుకు చివరి తేది, సమయం మరియు ప్రదేశం: | 30–12–2025 సా.5.00 గం. లోగా యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్య మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం- 530016 వద్ద, శ్రీ రాంబాబును ఉద్దేశించి |
| బహిరంగ ఇ-వేలం తేది, సమయం మరియు ప్రదేశం: | 31–12–2025 ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.మధ్య ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com వద్ద. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైనతెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును. |

**స్థిరాస్తి షెడ్యూలు**

తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, (పాత కాకినాడ జిల్లా రిజిస్ట్రీ), సర్పవరం ఎస్ఆర్‌ఓ పరిధి, కాకినాడ నగరపాలక సంస్థ, ప్రస్తుత వార్డు నెం.30, పాత వార్డు నెం.2, బ్లాక్ నెం.70, కాకినాడ సిటీ, కాకినాడ సూర్యారావుపేట శివారు, గోదారిగుంట గ్రామం వద్ద ఆర్.ఎస్.నెం. 228/13లో ఎక.1.87 సెంట్లు పూర్తి విస్తీర్ణం నుండి ఎక.1.00 సెంట్ల ఉత్తరం వైపు విభాజ్య ఇంటి స్థలంపై ఎల్‌పి.నెం. 100/92గల, హైదరాబాద్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నుండి ఆమోదిత ప్లాన్‌లోని నాన్-రిలీజ్ లేఅవుట్‌నందు ప్లాట్ నెం.8గల ఉత్తరం వైపు విస్తీర్ణం 288చ.గ.లు. **సరిహద్దులు: తూర్పు:** 33 అ. వెడల్పు రోడ్డు - 40'-0", **దక్షిణం:** ప్లాట్ నెం.7లోని స్థలం- 65'-0", **పడమర:** ప్లాట్ నెం.6లోని సలం- 40'-0", **ఉత్తరం:** ప్లాట్ నెం.9లోని స్థలం- 65'-0".

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింకను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ను చూడండి.
వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ రాంబాబు, 7382922383 మరియు శ్రీ కార్తీక్ 9080589635 పై బ్యాంక్ యొక్క అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం. మధ్య సంప్రదించవచ్చును.
ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేది: 15–12–2025 సం/– అధీకృత అధికారి,
ప్రదేశం: తూర్పు గోదావరి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

# నాలుగు దశాబ్దాల ఆనందం

నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్నారు. ఆదివారం అంతా ఒకచోటుకు చేరి సందడి చేశారు. చిన్నపిల్లలా మారిపోయారు. దీనికి ఏపీఎడీటీ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదే పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థి గోన్నె శ్రీరామ్ వైద్యచికిత్స నిమిత్తం రూ.105,000 ఆర్థిక సాయం అందజేశారు. కొండూరి భాస్కర్, కడలి మెహర్‌ప్రకాశ్, సత్యసుబ్రహ్మణ్యం(ఏస్పీ), దివాకర్, గెద్దం తులసీభాస్కర్, గాదిరాజు రవి పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

# స్వామివారి రథానికి మరమ్మతులు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య రథాన్ని మరమ్మతుల నిమిత్తం షెడ్ నుంచి ఆదివారం బయటకు తీశారు. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా రథానికి అర్చకస్వాములు, ఏసీ నాగవరప్రసాద్, వాహన సేవకుల ప్రత్యేక పూజలు నిర్వహించి గోవిందనామ స్మరణతో బయటకు తీసుకొచ్చారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తారు. అనంతరం అనుమతి పత్రాన్ని అందిస్తారు. జనవరి 29న రథోత్సవం జరగనుంది.

# చీరపై తిరుప్పావై గీతమాలిక

మామిడికుదురు, న్యూస్‌టుడే: ధనుర్మాసం పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలోని గోదాదేవి అమ్మవారికి తిరుప్పావై గీతమాలికతో ఉన్న చీరను స్థానిక శ్రీకాకోళపు రత్నమోహన్, పూర్ణిమ దంపతులు ఆదివారం సమర్పించారు. దీనిపై తిరుప్పావైలోని 30 పాశురాలను రాసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వామివారి దర్శనానంతరం వేదాశీర్వచనం చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ వారిని అభినందించారు.

చీరను సమర్పిస్తున్న దంపతులు

**ధరవరలు**

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాలు) | ధర (రూ.లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి | 17,500 |
| కురిడీ (పాతవి) గండేరా | 28,000 |
| గటగట | 25,000 |
| కొత్తకురిడీ గండేరా | 27,000 |
| గటగట | 24,000 |
| [illegible] | 15,000-16,000 |
| [illegible] | 14,000-15,000 |
| కొబ్బరినూనె 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్లో ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే విక్రయాలు జరుగుతాయి.

వెంకటేశ్ చికెన్ ధర కిలో రూ.లలో

| | |
|---|---|
| బ్రాయిలర్ | 120-00 |
| లైవ్ | 147-00 |
| స్కిన్ | 213-00 |
| స్కిన్‌లెస్ | 243-00 |

# అభిమాన నేతకు అంతిమ వీడ్కోలు

అమలాపురం పట్టణం: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి అంత్యక్రియలు ఆదివారం అమలాపురంలో నిర్వహించారు. శనివారం దిల్లీలో మృతిచెందిన ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి అంబులెన్స్‌లో ఇక్కడికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, దళిత నాయకులు స్థానికంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీలు అనురాధ, మహేశ్వరరావు, మాజీ మంత్రి వీరరాఘవులు, నేతలు జగ్గిరెడ్డి, వరప్రసాద్‌రావు, రాజేశ్వరిదేవి, అముడా మాజీ చైర్మన్ డేవిడ్‌రాజు నివాళి అర్పించారు. ఆయన కుమారుడు రాజ్‌కృష్ణ, కుమార్తెలు కృష్ణసుధ, లక్ష్మీకృష్ణ, వంశీకృష్ణ తదితరులు ఓదార్చారు. రామకృష్ణారావు, సుభాషిణి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి తదితరులు

# నాగావ్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు.. ప్రయాణికుల ఆందోళన

అన్నవరం: సిల్‌చార్ నగరం నుంచి తాంబరం వెళ్లే రైలు బోగీ కింద భాగం నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. రైలును అన్నవరం స్టేషన్‌లో నిలిపివేసి మరమ్మతులు చేసి పంపారు. విశాఖపట్నం – రాజమహేంద్రవరం మార్గంలో వెళ్తున్న రైలు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఎస్7 బోగీ కింద నుంచి పొగలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు అన్నవరం స్టేషన్‌లో ఉదయం 10.30 గంటలకు నిలిపివేశారు. ఇక్కడ రైలుకు హాల్ట్ లేదు. సాంకేతిక బృందం అక్కడకు చేరుకుని పరిశీలించారు. బోగీ కింద భాగంలో బ్రేక్ వద్ద సాంకేతిక సమస్య కారణంగా పొగలు వచ్చాయని గుర్తించి మరమ్మతులు చేశారు. సుమారు 20 నిమిషాల తర్వాత రైలు ముందుకు వెళ్లింది. పొగలు రావడంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సాంకేతిక సమస్య అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.



అన్నవరం స్టేషన్‌లో నిలిపిన రైలు

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** రిటెయిల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగలసాన్ రోడ్, అయిరోలి, నవీముంబయి–400 708 నమోదిత కార్యాలయం: "త్రిశూల్" 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదుట, ఎల్లిస్‌బ్రిడ్జి అహ్మదాబాదు–380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) అమెండ్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలంముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనియబడిన స్థిరాస్తి శ్రీ ఆకుల హేమబాబు & శ్రీ ఆకుల హేమబాబు & శ్రీ ఆకుల శివకుమార్ నుండి లోన్ రిఫరెన్సు నం.8877లో సెక్యూర్ క్రెడిటార్‌కు రావల్సిన 15.05.2024 నాటికి గల బకాయిలు రూ.19,60,747/– (రూపాయలు పందొమ్మిదిలక్షల అరవైవేల ఏడు వందల నలభైఏడు) (15.05.2024 వరకు వడ్డీ లెక్కించబడింది)లను పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలతో అదనంగా రాబట్టు కొనుటకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 31.12.2025న విక్రయించబడుతుంది. అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో): | రూ.24,80,000/– (రూపాయలు ఇరవైనాలుగు లక్షల ఎనభైవేలు మాత్రమే) |
| ధరావతు (రూ.లలో) | రూ. 2,48,000 (రూపాయలు రెండు లక్షల నలభైఎనిమిదివేలు మాత్రమే)లను డిడి/పిఓ ద్వారా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట విశాఖపట్నంలో చెల్లుబాటగునట్లుగా చెల్లించాలి. |
| బిడ్ పెంపుదల సొమ్ము | రూ. 10,000/– (రూపాయలు పది వేలు మాత్రమే) |
| ధరావతుతో బిడ్/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం | 30.12.2025 సా.5.00 గం.లోగా. శ్రీ అజరుద్దీన్‌ను ఉద్దేశించి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016 పంపాలి. |
| బహిరంగ ఇ–వేలం తేది సమయం మరియు ప్రదేశం: | 31.12.2025న ఉ. 11.00 గం.ల నుంచి మ. 12.00 గం. మధ్య ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com. వద్ద ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషను వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు, పైన తెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును. |

**స్థిరాస్తి షెడ్యూలు**

షెడ్యూల్–ఏ: తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం సబ్ రిజిస్ట్రీ, రాజానగరం మండలం, చక్రద్వారబంధం గ్రామ పంచాయత్, బొర్రు ఏరియా, వెలుగుబండ గ్రామ జడ్-మెరక, ఆర్ఎస్ నం. 650, పూర్తిగా ఎక. 6-25 సెంట్ల విస్తీర్ణం భూమి ఆస్తి కల్గి ఉన్నది. అందులో సబ్ డివిజన్ ఆర్ఎస్ నం. 650/4బి ఎక. 0-80 సెంట్లు భూమి ఆస్తి కలదు. ఆర్ఎస్ నం.651, ఎక. 0-80 సెంట్ల భూమి ఆస్తి కలదు. సబ్ డివిజన్‌గా ఆర్ఎస్ నం. 651/5 నందు ఎక. 2.39 సెంట్ల భూమి ఆస్తి కలదు. మొత్తం ఎక. 3.19 సెంట్లతో పాటు ఇతరుల భూమితో కలిపి మొత్తం ఎక. 9.09 (1/2) సెంట్లు టిఎల్‌పి నం. 151/2016/ఆర్ చే ధృవీకరించబడి డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గుంటూరు వారిచే ఆమోదించబడి ఇంటి ప్లాట్లుగా విభజించబడినవి. ఇట్టి ప్లాట్లలో 2415.53 చ॥ గజాలు కల్గిన స్థలం ప్లాటు నం.14 అయి ఉన్నది మరియు 2264.40 చ॥గజాలు కల్గిన స్థలం ప్లాటు నం.15 అయి ఉన్నది. దిగువ రెండు ఐటంలకు సరిహద్దులు:

**ఐటం నం.1కు సరిహద్దులు:** ప్లాటు నం.14లో 2415.53 చ॥గజాలు కల్గిన స్థలం, **తూర్పు:** 33 అడుగుల వెడల్పు లేఅవుట్ రోడ్- 186.10, **పడమర:** 33 అడుగుల వెడల్పు లేఅవుట్ రోడ్- 175.60 అ., **ఉత్తరం:** ప్లాటు నం.15 (2 ఐటం) లోని స్థలం- 120.0 అ॥, **దక్షిణం:** ఇతరులకు చెందిన భూమి- 120.0 అ॥, పైన పేర్కొనబడిన సరిహద్దుల పరిధిలో 2415.53 చ॥గజాలు కల్గిన స్థలం ఉన్నది. **ఐటం నం.2కు సరిహద్దులు:** ప్లాటు నం.15 లో 2264.40 చ॥గజాలు కల్గిన స్థలం. **తూర్పు:** 33 అడుగుల వెడల్పు లేఅవుట్ రోడ్- 169.10 అ॥, **పడమర:** 33 అడుగుల వెడల్పు లేఅవుట్ రోడ్- 169.60 అ॥, **ఉత్తరం:** 400 అడుగుల వెడల్పు లేఅవుట్ రోడ్- 120.0 అ॥, **దక్షిణం:** ప్లాటు నం.14 (1 ఐటం) స్థలం- 120.0 అ॥. పైన పేర్కొనబడిన సరిహద్దుల పరిధిలో 2264.40 చ॥గజాల స్థలం కల్గి ఉన్నది. పై రెండు ఐటంలు మొత్తం 4679.93 చ॥గజాలు. దీనిలో 58.50 చ॥గజాలు లేదా 48.91 చ॥మీటర్ల కల్గిన స్థలం యొక్క ప్రత్యేకతలేని ఉమ్మడి హక్కుతో పాటు అన్ని సాధారణ మరియు అనుభోగ హక్కులు. **షెడ్యూల్– బి ఫ్లాట్:** రాకీ ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే చంద్రిక అవంతిక గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ భవనంలో స్టిల్ట్ గ్రౌండ్+ 4 అప్పర్ ఫ్లోర్స్ కల్గిన "నేత్రావతి మరియు అర్కావతి (80 ఫ్లాట్స్)" పిలువబడు నివాస అపార్ట్‌మెంట్ భవనంలో బ్లాక్ 1లో గ్రౌండ్ ఫ్లోర్ నందు 1375 చ॥అ॥ (కారు పార్కింగ్, బాల్కనీలు మరియు కామన్ ఏరియాలతో కలిపి) ప్లింత్ ఏరియాలో నం.101 గల పడమర దిక్కు ఫేసింగ్ కల్గిన మూడు బెడ్ రూమ్‌ల ఫ్లాట్. **సరిహద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై మరియు లిఫ్ట్.

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింకను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.comను చూడండి.
వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ అజరుద్దీన్ ఫోన్ 7330999018 మరియు శ్రీకార్తీక్ 9080589635ను కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం. మధ్య సంప్రదించవచ్చును.
ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) (అమెండ్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1) క్రింద రుణగ్రహీతలకు ఇస్తున్న 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేది: 15.12.2025 సం/– అధీకృత అధికారి
ప్రదేశం: తూర్పు గోదావరి. యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

# ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

రాజోలు: ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం చర్చించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య అన్నారు. సీఆర్సీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వాచ్‌మెన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజోలు మండలం శివకోడు సీతారామాంజనేయ స్వామి కళాక్షేత్రంలో ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులు కృష్ణయ్య, గిరిప్రసాద్ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పెనుమత్స సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.అమృతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసాల శ్రీనివాసరావు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంపన బ్రహ్మాజీరావు, కంకటాల చంద్రశేఖర్, ఎదుబండి సత్యనారాయణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పెద్ది రాజారావు, మాజీ అధ్యక్షుడు కృష్ణ తిలకరాజు, కృష్ణ కుమార్, ఎల్.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణయ్య

**92.7 FM Rajamahendravaram**
**ఈఎఫ్ఎం కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

**EENADU eClassifieds**

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులో/** ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

**FINANCIAL SERVICES**

**స్థిరాస్తులపై తూర్పు,** పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396999669.

**JOBS**

**Wanted Tele-callers.** Experienced/ Insurance/ Age: Above 30 years/ Female. Kakinada, Contact Cell: 98494 21277.

**స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్** కంపెనీ, రాజమండ్రి బ్రాంచ్ నందు పని చేయుటకు ADM మరియు సేల్స్ మేనేజర్స్ కావలెను. సంప్రదించండి సెల్: 98668 47345.

**రిసెప్షనిస్ట్ - Cum - కంప్యూటర్ ఆపరేటర్(M),** 40 సం॥లోపు, A&B షిఫ్ట్, జీ:12 వేలు, లోకల్ & అనుభవంగలవారు కావలెను. శ్రీగ్రాండ్ హోటల్, రాజమండ్రి, ✆80996 64555.

**HYD యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**రాజమండ్రి కొవ్వూరు,** అనకాపల్లిల్లో ప్ర॥కం. షోరూమ్స్ లో సె.గార్డ్స్, సూపర్‌వైజర్స్, జీ: 12 to15 వేలు, రూం+బో., రాజ్ సెక్యూరిటీ, Rjy, 9392269369, 9492444369.

**రాజమండ్రి ప్రముఖ** రియల్‌ఎస్టేట్ సంస్థలో టీ పెట్టుటకు Female (స్త్రీ) కావలెను. Contact Cell: 93924 41891.

**రాజమండ్రి ప్రముఖ** రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ కమ్ ఎకౌంటెంట్ (Female), టాలీలో 2 సం॥ అనుభవం ఉండాలి. ✆ 93924 41891.

**★కోనసీమ జిల్లాలో** క్రెడిట్‌కార్డ్ సేల్స్ చేయడానికి ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. **★బైక్ &** ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి. ★ జీతం: 15,000 + ఇన్సెంటివ్స్. Cont: 9030212623, 9966442928

**వైజాగ్ షాపింగ్** మాల్స్‌లో పని చేయుటకు 18-35 వయసు. యువతి, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము 9704637370, 9949904532.

**MARKETING/ SALES**

Wanted FMCG field sales executive & delivery boys. 2 yrs exp - Must have bike - contact on 9100940494

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **6-75** పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

**EENADU** for Advertisement Contact: **8008597607**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

రాజోలు: రాజోలులో ఈ నెల 13న నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా ఎనిమిదేళ్ల క్రితం నాటి స్థల వివాదం కేసు పరిష్కారమైందని సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రమీలారాణి ఆదివారం తెలిపారు. రాజోలు మండలం కాట్రేనిపాడుకు చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య 2017లో ఆస్తి వివాదం నెలకొంది. అప్పటి నుంచి వాయిదాలు జరిగాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మధ్యవర్తిత్వం' ద్వారా ఇరు కుటుంబాలకు కోర్టు న్యాయవాది మామిడిశెట్టి సాయిబాబా కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో కేసును లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకున్నారు. న్యాయవాది సాయిబాబా, ఇరుపక్షాల న్యాయవాదులు పి.వి.కృష్ణంరాజు, కె.వి.ఆర్.ఆర్.నాయుడును జడ్జి ప్రమీలారాణి అభినందించారు.

# రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

# 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 16 (మంగళవారం) నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కొర్లపాటివారిపాలెం గ్రామంలోని భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, పెద్దవీధిలోని సీతారామచంద్రస్వామి, చిరతపూడిలో వేణుగోపాలస్వామి, నందంపూడిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాలస్వామి, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, గంగలకుర్రుఅగ్రహారం గ్రామాల్లోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆయా కమిటీల సభ్యులు వెల్లడించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

**వీధి దీపాలు వెలిగాయి**

స్పందనకు వందనం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: బొబ్బర్లంకలో కాలువ అవతల, ఇవతల వైపున వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయించారు.

మామిడికుదురు: పాశర్లపూడిలంక పరిధి పిఠానివారిమెరకలో వీధి దీపాలు కొన్ని వెలగడం లేదని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కార్యదర్శి సురేష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. వెంటనే కొత్త ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయించారు.

**పంటబోదెలో పూడిక తొలగింపు**

రావులపాలెం గ్రామీణం: రావులపాలెం మండలం దేవరపల్లి పంటబోదెలో పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఉపాధిహామీ పథకం వేతనదారులతో పూడిక తీయించారు.

**డ్రెయినేజీ శుభ్రం**

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం కొత్త కాలనీలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగునీరు పారక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

– న్యూస్‌టుడే, మలికిపురం, రాజోలు

రాజోలు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. గత కొన్నేళ్లుగా గుంతలు, గొప్పులతో రాళ్లుతేలి అత్యంత దారుణంగా తయారైన విషయం తెలిసిందే. వీటిపై రాకపోకలకు ప్రజలు నిత్యం ఇబ్బందులు పడేవారు. గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసి అభివృద్ధికి నడుం బిగించింది. ప్రత్యేకంగా నిధుల మంజూరు చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**ఎక్కడెక్కడ అంటే..**

పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.27 కోట్లతో 20 గ్రామీణ రహదారులకు నిధులు మంజూరయ్యాయి. వీటితో 40 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. అంతర్వేదికర వయా జడ్పీ పాఠశాల, రామేశ్వరం మేట కొడప(రింగురోడ్డు), వీవీమెరక-పిల్లివారి(గ్రూపు), అప్పనరామునిలంక-కొత్తలంక(ఎస్సీపేట), కేశన ఎస్ రోడ్డు నుంచి వయా అంతర్వేదిపాలెం జడ్పీ పాఠశాల, అంతర్వేదికర సల్లావారి(గ్రూపు), చింతలమోరి-గొంది నుంచి బట్టెలంక సరిహద్దు, టేకిశెట్టిపాలెం వంతెన నుంచి శేషాయిలంక కాలువ వరకు, మలికిపురం-కేశనపల్లిపాలెం మార్గంలో శృంగవరప్పాడు దొండపాటివారి(గ్రూపు), ములికిపల్లి-కాట్రేనిపాడులంక, చెన్నడం-తూర్పుపాలెం(పోలేరమ్మపేట), రాజోలు-పొనుగుపల్లి హెచ్‌పీ గ్యాస్ గోడౌన్, గూడపల్లి సినిమాహాల్-పోలమూరివారి కాలనీ, లక్కవరం-ఐరుసుమండ-గుబ్బలపాలెం, లక్కవరం ఆర్అండ్‌బీ నుంచి గుబ్బలపాలెం వయా ఐరుసుమండ వీవర్స్ కాలనీ, బట్టెలంక-గుబ్బలపాలెం(సోలిపేట సరిహద్దు వరకు), విశ్వేశ్వరాయపురం ఆర్అండ్‌బీ నుంచి కేర్ వరకు, మామిడికుదురు ఈర్ల చెరువు, గోగన్నమఠం నుంచి వయా తోటమెరక, ముత్యాలపాలెం-గోగన్నమఠం(కరవాకరేవు వరకు) రోడ్లు అభివృద్ధి చేసే వాటిలో ఉన్నాయి.

ములికిపల్లి-కాట్రేనిపాడులంక రోడ్డు దుస్థితి

**రెండు నెలల్లో పూర్తిచేస్తాం**

గత ప్రభుత్వంలో రహదారులన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై శ్రద్ధ వహించాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి మేరకు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 20 రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషి జరుగుతోంది. టెండరు ప్రక్రియ ప్రారంభమైంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పనులు పూర్తి చేస్తాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

# గౌరవాధ్యక్షునిగా గౌరీమల్లిక్



ఆలమూరు, న్యూస్‌టుడే: సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ విశ్వసాహితీ కళావేదిక డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా గౌరవాధ్యక్షునిగా చింతలూరుకు చెందిన పద్యకవి కామవరపు మల్లికార్జునరావు(గౌరీమల్లిక్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఈయన్ను ఆదివారం పలువురు అభినందించారు.

# కుస్తీ పోటీల్లో బంగారు పతకం

ప్రశంసాపత్రం అందుకుంటున్న గోపాలకృష్ణ

రాజోలు, న్యూస్‌టుడే: ఒంగోలులోని కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి వెటరన్ కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాజోలుకు చెందిన విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 65 సంవత్సరాల సీనియర్స్ కేటగిరీ 80 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచారు. కుస్తీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మెరైన్ ఎస్సై సుబ్బారావు నుంచి పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. విశాఖలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పలువురు ఆయనను అభినందించారు.

# వినూత్న బహుమతి అందజేత

కొత్తపేట, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామానికి చెందిన పలువురు యువకులు థ్రెడ్ ఆర్ట్‌తో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చిత్రాన్ని గీసి బహుమతిగా అందజేశారు. ఆదివారం వాడపాలెంలోని తెదేపా కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో చూసి ఈ కళను నేర్చుకున్నామని వివరించారు. కొత్తపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధికి గుర్తుగా చిత్రం అందించామన్నారు. వీరిని ఎమ్మెల్యే అభినందించారు.

# వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తజనం

# బైపాస్‌పై వేగనిరోధకాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216 (బైపాస్)లో మామిడికుదురు-కొమరాడ రోడ్డు అనుసంధానమయ్యే చోట వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. అతివేగంగా వెళ్తున్న వాహనాల నియంత్రణకు రక్షణ పనులు చేపట్టాలని 'ఈనాడు'లో పలుసార్లు ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు.

ఈనాడు కథనానికి స్పందన

# గుంత పూడ్చివేత

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: బ్యాంక్ కెనాల్ నుంచి పంట పొలాల మీదుగా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే రహదారిలో ఏర్పడ్డ గుంతను దేవస్థానం అధికారులు సిమెంట్, మెటల్ కాంక్రీట్ మిశ్రమం వేయించి పూడ్పించారు. పెద్ద గుంత ఏర్పడటంతో ఈ నెల 7వ తేదీన 'రహదారిపై గుంత.. ప్రమాదాలతో చింత' శీర్షికన వెలువడిన కథనానికి దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు స్పందించి చర్యలు తీసుకున్నారు.

# సమాజ సేవకు తోడ్పాటు అందిద్దాం

కార్యక్రమంలో వెంకటరాజు తదితరులు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: సమాజ సేవకు తోడ్పాటు అందించడం ద్వారా మంచి గుర్తింపు పొందొచ్చని వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అన్నారు. ఆయన ఆదివారం ఆత్రేయపురంలోని రజకపేట, కుమ్మరిగూడెం, బుల్లిపేట తదితర ప్రాంతాల్లో 'మన భూమి.. మన బాధ్యత' కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో కలిసి డ్రైయిన్లలో పూడికలు, వీధులను శుభ్రం చేయడం వంటి పనులు చేశారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మనమే మన పరిసరాలను శుభ్రం చేసుకుంటే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం స్వచ్ఛందగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వేగేశ్న ప్రసాదరాజు, శ్రీనివాసరాజు, మంతెన ఆనందరాజు, ముదునూరి గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సెల్ఫీ పాయింట్‌గా సమరయోధుల స్తూపం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం ఎదురుగా మాడ వీధిలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల స్తూపాన్ని అందరినీ ఆకర్షించేలా కోనేరు చెంతన ఏర్పాటు చేస్తున్నారు. సంబంధించిన స్తూపాన్ని ఆదివారం మార్పు చేశారు. బ్రిటిష్ కాలంలో రథోత్సవం రోజున దేశభక్తులపై కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. దానికి గుర్తుగా ఇక్కడ స్తూపాన్ని నిర్మించారు. ప్రస్తుతం దీన్ని భక్తిని, దేశభక్తిని చాటేలా సెల్ఫీ పాయింట్‌గా తీర్చిదిద్దుతున్నారు. చుట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

స్తూపానికి మెరుగులు దిద్దుతున్న సిబ్బంది

# ఎమ్మెల్యే బండారుకు సత్కారం

కొత్తపేట: కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరుస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. దేవస్థానం పాలకవర్గ డైరెక్టర్‌గా యల్లమిల్లి చంద్రకుమారికి అవకాశం కల్పించడంతో నియోజకవర్గంలోని బీసీ నాయకులంతా వాడపాలెంలోని తెదేపా కార్యాలయానికి ఆదివారం పెద్దఎత్తున తరలివెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సత్యానందరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీసీ సంఘ సభ్యులు

# రోబోటిక్ ప్రదర్శనలో తృతీయ స్థానం

అయినవిల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఆదివారం జాతీయ స్థాయిలో జరిగిన భారత్ టెక్‌లీగ్ పోటీల్లో నేదునూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి తిప్పా గౌతమ్ ప్రదర్శించిన రోబోటిక్ ఆర్మ్ రోవర్ తృతీయ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు. ఈ విద్యార్థికి స్థానిక రావి ఫౌండేషన్ సహకారం అందజేసినట్లు చెప్పారు.

తిప్పా గౌతమ్

## పొంచి ఉన్న ప్రమాదం

పులిదిండి, వెలిచేరు గ్రామాల మధ్య ఆర్పీ(పొదలాడ, రాజవరం) ఆర్.అండ్.బి. రోడ్డు చెంతన ఉన్న 11 కేవీ విద్యుత్తు స్తంభాలు బొబ్బర్లంక ప్రధాన కాలువ వైపు ఒరిగిపోయాయి. ఎప్పుడైనా కూలిపోవచ్చు. నిత్యం అటుగా విద్యార్థులు, ప్రజలు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు ఏఈ టి.అశోక్ వద్ద వద్ద ప్రస్తావించగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## చారిత్రక కట్టడం.. నేడు శిథిలం

శివకోటిలోని కాటన్ బంగ్లా శిథిలావస్థకు చేరింది. దీన్ని నిర్మించి సుమారు వందేళ్లు అవుతుంది. సర్ ఆర్థర్ కాటన్ ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించే సమయంలో ఇందులో ఉండి కార్యకలాపాలు నిర్వహించేవారు. ప్రస్తుతం గోడలు పగుళ్లు తీసి పైకప్పు ధ్వంసమై వర్షం నీరు లీకవుతోంది. దీనిపై జలవనరులశాఖ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

## బ్యారేజీపై కానరాని వెలుగులు

కాటన్ బ్యారేజీ పొడవునా పలుచోట్ల విద్యుత్తు వెలుగులు కరవయ్యాయి. బల్బులు లేని విద్యుత్తు స్తంభాలు 50 శాతం పైబడి ఉండటంతో రాత్రుళ్లు అంధకారం నెలకొంటోంది. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని హెడ్‌వర్క్స్ ఏఈ రాధాకృష్ణ వద్ద ప్రస్తావించగా బల్బులు వేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

## అక్కడితో ఆపేశారు

మాచవరం పంచాయతీ పరిధి మెట్లకాలనీలో అంగన్‌వాడీ భవనం మధ్యలోనే నిలిచిపోయింది. గత వైకాపా పాలనలో నాడు-నేడు పథకంలో ప్రారంభించారు. స్లాబు వరకు పనులు చేశారు. ఇప్పటివరకు రూ.7.52 లక్షలు నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వి.ఎస్.వి.మహాలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట.

## తుప్పు పట్టి.. దుర్భరంగా మారి

పాశర్లపూడిబాడవలోని మీడియం డ్రెయిన్ మధ్యలో స్లూయిస్ తుప్పు పట్టి అధ్వానంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చుట్టూ చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్భరంగా తయారైంది. పోటు నీరు వస్తున్న సమయంలో గట్లు కోతబారిన పడుతున్నాయని స్థానికులు సతమతమవుతున్నారు. కింది భాగంలోని తూము మూసుకుపోవడంతో ముంపునీటి ఇబ్బందులు శ్రుతిమించుతున్నాయి. మురుగునీటి పారుదల నిలిచిపోకుండా చూస్తామని ఏఈఈ ఆనంద్ కిరణ్ తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

# ఉచిత శిక్షణ ప్రారంభం

సఖినేటిపల్లి, మలికిపురం: సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత గార్మెంట్స్ తయారీ శిక్షణను డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్‌చక్రవర్తి ఆదివారం ప్రారంభించారు. రోటరీ క్లబ్, స్వయం కృషి సంక్షేమ సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని, దీనిని సక్రమంగా వినియోగించుకుని నైపుణ్యం సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఫిలిప్‌రాజు, శివకుమార్, సింహాద్రి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాల్గొన్న ఫిలిప్‌రాజు, మహిళలు

# దివంగత నేతకు నివాళి

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురంలోని ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల ఆవరణలో దివంగత మాజీ మంత్రి రుద్రరాజు రామలింగరాజు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. కరస్పాండెంట్ ఎం.వి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి అధ్యక్షుడు డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, ప్రిన్సిపాళ్లు కె.ఆనందమహోని, ఆర్.రామరాజు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరాజు, గెద్దం తులసీభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల సిబ్బంది

# పేరవరంలో చోరీ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జన్యావుల రామభక్తుడు బెంగళూరులో ఉంటున్న కుమారుడి వద్దకు సెప్టెంబరు 25న కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి ఈ నెల 13న స్వగ్రామం చేరుకున్న ఆయన ఇంటి తాళం బద్దలుకొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

# వైభవంగా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, న్యూస్‌టుడే: గంగలకుర్రు గ్రామదేవత రావులమ్మతల్లి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా వెండి ఆభరణాలతో అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రావులమ్మకు అలంకరణ

**పునర్నిర్మాణానికి విరాళం**

పి.గన్నవరం, న్యూస్‌టుడే: లంకల గన్నవరం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం చిట్టాల గోపాలరావు రూ. 1,11,159, ధూళిపూడి వెంకటేశ్వరరావు రూ. లక్ష, నంబూరి వరదరాజు కుటుంబ సభ్యులు రూ. 15,116 విరాళం అందజేశారు. వీరిని గ్రామస్థులు అభినందించారు.

**నిత్యాన్నదాన పథకానికి ..**

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన మోటపర్తి సూర్య వెంకటకృష్ణ శేషగిరిరావు, కాదంబరి సత్యవాణి దంపతులు ఆదివారం రూ. 1,00,116 విరాళం అందించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

చెక్కు అందిస్తున్న గోపాలరావు కుటుంబ సభ్యులు

# సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం

మాట్లాడుతున్న పీఠాధిపతి నాగానందసరస్వతి

మామిడికుదురు, న్యూస్‌టుడే: హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని, అత్యంత పవిత్రంగా భావితరాలకు అందివ్వాలని శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతి స్వామీజీ అన్నారు. గోగన్నమఠం వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ధర్మపరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి విభాగ్ ప్రచారక్ సోముజీ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం కులవృత్తుల వారిని సత్కరించారు. చిన్నారులు కూచిపూడి ప్రదర్శనలు, కోలాట కీర్తనలతో అలరించారు. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.వేమా, సర్పంచి అల్లు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు సాగి పాపయ్యరాజు, ఆదుర్తి విద్యాసాగర్, కశిరెడ్డి వెంకటపేరయ్య, కాండ్రేగుల వెంకటరెడ్డి, యెరుబండి లక్ష్మయ్య, నామన వెంకన్నబాబు, కాపవరపు గోపాలకృష్ణ, భూపతి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

## కులాలకతీతంగా ఏకం కావాలి

మలికిపురం, న్యూస్‌టుడే: హిందువులందరూ కులాలకతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని దెందుకూరి రాంబాబురాజు అన్నారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక చంటిరాజు విల్లాస్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి(వక్కలంక) వాసుదేవానంద భారతీ స్వామీజీ మాట్లాడుతూ హిందూ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరించడంలో ప్రతిఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని కోరారు. మల్లిపూడి సత్తిబాబు, డాక్టర్ నారిన శ్రీహర్ష, మంగెన వెంకటసత్యనారాయణమూర్తి, పతివాడ రామరాజు, పెచ్చెట్టి మురళి, మేడిచర్ల చాణక్య తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో మాట్లాడుతున్న రాంబాబురాజు

## ఆలయాలకు మైక్‌సెట్‌ల బహూకరణ

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలులోని కనకమహాలక్ష్మి, సోంపల్లిలోని విష్ణుమూర్తి ఆలయాలకు హిందూ ధర్మరక్ష సమితి వారు ఆదివారం మైక్‌సెట్లను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, కాసు సుఖేష్ రంగనాయకి చేతుల మీదుగా ఆయా ఆలయ కమిటీలకు వీటిని అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కొత్త శ్రీనివాసరావు, చలువాది త్రినాథ్, రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ మృతికి సంతాపం

అయినవిల్లి, మలికిపురం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి ఈ నెల 12న గుండెపోటుతో దిల్లీ ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం విలసలోని రావిగుంటచెరువుకు తీసుకువచ్చారు. పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా అమలాపురం తీసుకువెళ్లారు. మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరి, చిర్ల జగ్గిరెడ్డి, సర్పంచులు కాకర శ్రీనివాసరావు, కాశీ వీరవెంకటసత్యనారాయణ, కుసుమ లీలీమంగేష్కర్, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మాజీ ఎంపీ మృతికి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సంతాపం వ్యక్తం చేశారు. అమలాపురంలో కుసుమ పార్థివ దేహంపై పుష్పమాల ఉంచి నివాళి అర్పించారు.

# శివారు భూములకూ నీరు

– న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి

ప్రస్తుతం సార్వా కోతలు, మాసూళ్లు జరుగుతూ దాళ్వా సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. కొందరు నారుమళ్లు వేసుకుంటున్నారు. కాలువల్లో పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితుల్లో పంతల వారీగా అందించాల్సి ఉంటుంది. ఈ సీజనులో మలికిపురం మండలంలో 1600, సఖినేటిపల్లిలో 1650, రాజోలులో 5150, మామిడికుదురులో 1100 ఎకరాల్లో నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాలువలను బాగుచేసి శివారు ఆయకట్టుకు కూడా నీరందేలా జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి సంఘాలు చర్యలు చేపట్టాయి.

తూడు తొలగించిన బట్టేలంక నంబర్-1 కాలువ

పేరుకుపోయిన తూడు, చెత్తాచెదారం తొలగించి గట్లను సరిచేస్తున్నారు.

**మొత్తం రూ.39 లక్షలతో..**

రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని శివారు ఆయకట్టు భూములకు నీరందించేందుకు రూ.39 లక్షలతో 11 పనులుగా కాలువలను బాగు చేస్తున్నారు. మలికిపురం మండలంలో రూ.14 లక్షలతో పనులు ప్రారంభమయ్యాయి. బట్టేలంక నంబరు 1, విశ్వేశ్వరాయపురం పరిధి కత్తిమండ, గూడపల్లి నంబరు 1, 2, మొండికోడు, మలికిపురం, లక్కవరం బ్రాంచి కాలువల తవ్వకం పనులు వేగంగా జరుగుతున్నాయి. సఖినేటిపల్లిలో రూ.12 లక్షలతో అంతర్వేది నంబరు 1, 2, రామేశ్వరం, సఖినేటిపల్లి వైరు ఛానెల్, ఎల్ఎఫ్ ఛానల్, మామిడితోట, కొబ్బరితోట పంట కాలువలు, రాజోలులో రూ.13 లక్షలతో మొగలికుదురు, పొదలాడ నంబర్ 1, 2, బి.సావరం, సోంపల్లి, చింతలపల్లి ప్రధాన పంటకాలువ, మట్టపర్రు, శివకోడు కాలువల ప్రక్షాళన పనులు చేపట్టి పూర్తిచేసే దిశలో ఉన్నాయి.

**వార్షిక నిర్వహణలో భాగంగానే..**

ఏటా జూన్ 1 నుంచి మార్చి వరకు వార్షిక నిర్వహణ పనులు చేపడుతుంటాం. ఇందులో భాగంగా డిసెంబరులో చేసే పనుల వల్ల దాళ్వా వరిసాగు చేతికందే వరకు మూడు నెలల పాటు నీరు సక్రమంగా ఉండి శివారు భూములకు కూడా చేరుతుంది.

- రమేశ్‌బాబు, ఏఈ, జలవనరులశాఖ

(c) eenadu

# అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

## సంక్రాంతికి రహదారుల నిర్మాణం పూర్తి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకు అత్యధిక నిధులు కేటాయించిందని, సంక్రాంతికి నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కోరింగలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.72 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. పాత కోరింగ సమీపంలో రూ.13 కోట్లతో వంతెన నిర్మాణం చేస్తామన్నారు. పంచాయతీరాజ్ డీఈ బి.సత్య శ్రీనివాస్, మండల ఇంజినీర్ కె.అప్పారావు, సర్పంచి పెయ్యల మంగేష్, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు.

## రైతు బజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

**అమలాపురం పట్టణం :** టమాట - 35, వంకాయలు నలుపు - 36, వంకాయలు తెలుపు - 30, బెండకాయలు - 55, పచ్చిమిర్చి - 45, కాకరకాయ - 40, బీరకాయలు - 58, కాలిఫ్లవర్ -26, క్యాబేజీ - 32, క్యారెట్ -52, దొండకాయలు - 42, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 18, 28, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 53, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 48, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 80, చిలకడదుంపలు - 45, గుమ్మడి -30, ఉసిరి - 80, ముల్లంగి - 45, కరివేపాకు -75, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70. ఆనబకాయ - 25, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 20.

నినాదాలు చేస్తున్న మాల మహానాడు నాయకులు

## కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరని లోటని త్రిరత్న బుద్ధవిహార్ నాయకులు పేర్కొన్నారు. కార్యదర్శి డీబీ లోక్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. కృష్ణమూర్తి దివ్యాంగులకు ఎంతో సహాయం అందించారని మహాసంఘటన్ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ సంక్షేమ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు సంతాపం తెలిపారు. ● 'దళిత వేదం' రచించి సాహితీ రంగంలోనూ కుసుమ కృష్ణమూర్తి ముద్ర వేసుకున్నారని ఇసుకపట్ల రఘుబాబు అన్నారు. అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కృష్ణమూర్తి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ నెల 22న పీవీ రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెయ్యల పరుశురాముడు, డీబీ లోక్, రేవు తిరుపతిరావు, బొంతు రమణ, సురేష్‌బాబు, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

## భవనంలేని.. విజ్ఞాన భాండాగారం

**గతంలో శంకుస్థాపన చేసినా సాకారం కాని వైనం**

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యాలయాలు ఒక్కొక్కటీ అందుబాటులోకి వస్తున్నాయి. సొంత భవనాల్లో కొన్నింటిని ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతుంటే.. మరికొన్నింటిని పరాయి పంచన నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు మాత్రం జిల్లా కేంద్రంలో స్థలం కనిపించడం లేదు. గతంలో ఇక్కడ ప్రథమ శ్రేణి గ్రంథాలయానికి స్థలం కేటాయించారు. దాని గురించి పట్టించుకోవడం లేదు. అక్కడ భవనం నిర్మిస్తే. . అదే జిల్లా కేంద్ర గ్రంథాలయమయ్యే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు దానిపై దృష్టి సారించడం లేదు.

అమలాపురం: గాంధీబజార్‌లో అద్దె భవనంలో గ్రంథాలయం

### అద్దె భవనంతో అవస్థలు..

అమలాపురంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని గాంధీబజార్‌లో ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలు ఉన్నప్పటికీ ఇరుకు గదులు కావడంలో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయానికొచ్చే పాఠకుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. 1996లో ఇక్కడ అద్దె భవనాన్ని తీసుకున్న అధికారులు అప్పటి నుంచి ఇక్కడే గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు వందమంది వరకు పాఠకులు వస్తున్నారు.

గతంలో ఆవిష్కరించిన శిలాఫలకం

### కేంద్ర గ్రంథాలయం ఇక్కడే..!

జిల్లా గ్రంథాలయ సంస్థ ఉమ్మడి జిల్లా నుంచి విడిపోతే.. కేంద్ర గ్రంథాలయంతోపాటు ఛైర్మన్ వచ్చే అవకాశం ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో ప్రథమ శ్రేణి గ్రంథాలయ భవనంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. నిన్నటి వరకు వైకాపా నాయకులు పట్టించుకోకపోగా.. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రజాప్రతినిధులు సైతం దీనిపై శ్రద్ధ చూపడం లేదు. దీనిపై అమలాపురం ప్రథమశ్రేణి గ్రంథాలయ అధికారి వర్మను వివరణ కోరగా.. ప్రథమశ్రేణి గ్రంథాలయ భవనం ఏర్పాటైతే.. అక్కడే జిల్లా కేంద్ర గ్రంథాలయం వచ్చే అవకాశం ఉందన్నారు.

### శిలాఫలకాలే మిగిలాయి..

అమలాపురంలోని పాత అగ్నిమాపక కేంద్రం వద్ద 2013లో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ కాపు రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యచంద్రరావు పేరుతో స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని శిలాఫలకం ఏర్పాటు చేశారు. అది సాకారం కాలేదు. మరోసారి గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో అక్కడే రూ.99.00 లక్షల అంచనా వ్యయంతో గ్రంథాలయ భవనానికి అప్పటి మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. దానికీ అడుగులు పడలేదు. ప్రస్తుతం ఆ రెండు శిలాఫలకాలు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఈదరపల్లి వంతెన రోడ్డుపై చెత్త, పూడిక తొలగిస్తున్న సిబ్బంది

**సమస్య:** అమలాపురం ఈదరపల్లి వంతెన రోడ్డు మురుగుకాలువపై చెత్త, పిచ్చిమొక్కలను పడేస్తున్నారు. దీంతో మురుగు ముందుకు కదలక ఇబ్బందులు పడుతున్నాం. **-కుమార్, వ్యాపారి**

**సమస్య:** హైస్కూల్ సెంటర్‌లో చెరుకుపిప్పిని రోడ్డుపై పడేస్తున్నారు. దోమలతో బాధ పడుతున్నాం. **- వర్మ, వ్యాపారి**

**సమస్య:** రావులచెరువు మురుగుకాలువ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి మూసుకుపోవడంతో పూడికలు పేరుకుపోయాయి. **-.బాబి, స్థానికుడు**

**సమస్య:** ముమ్మిడివరంగేట్ రోడ్డులో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారైంది. **- నాగేశ్వరరావు, వ్యాపారి**

**పరిష్కారం:** పట్టణంలో ఈదరపల్లి వంతెన రోడ్డు, హైస్కూల్‌సెంటర్, రావులచెరువు, ముమ్మిడివరంగేట్ రోడ్డులో చెత్త సమస్యలు తెలుపగా సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఉ 10 నుంచి మ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

| | |
|---|---|
| అమలాపురం పట్టణం: | 79939 35935 |
| గ్రామీణం: | 91000 20948 |
| అల్లవరం: | 91548 46718 |
| ముమ్మిడివరం: | 80085 74166 |
| కాట్రేనికోన: | 79950 67044 |
| ఉప్పలగుప్తం: | 91548 46716 |

## సెల్ఫీ పాయింట్‌గా సమరయోధుల స్తూపం

ఆత్రేయపురం : కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం ఎదురుగా మాడ వీధిలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల స్తూపాన్ని అందరినీ ఆకర్షించేలా కోనేరు చెంతన ఏర్పాటు చేస్తున్నారు. సంబంధించిన స్తూపాన్ని ఆదివారం మార్పు చేశారు. బ్రిటిష్ కాలంలో రథోత్సవం రోజున దేశభక్తులపై కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోయారు. దానికి గుర్తుగా ఇక్కడ స్తూపాన్ని నిర్మించారు. ప్రస్తుతం దీన్ని భక్తిని, దేశభక్తిని చాటేలా సెల్ఫీ పాయింట్‌గా తీర్చిదిద్దుతున్నారు. మట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

## 'నాయకర్ పేరు పెట్టే వరకు ఉద్యమం'

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసిన దివంగత మల్లాడి సత్య లింగ నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు నామకరణం చేసే వరకు ఉద్యమం ఆగదని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అన్నారు. కాకినాడలో జరిగిన సభకు తాళ్లరేవు మండలానికి చెందిన అగ్నికుల క్షత్రియులంతా ఆదివారం కాకినాడ తరలి వెళ్లారు. వాహనాలకు ఆయనతో పాటు తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, సాధన సమితి నాయకుడు ఓలేటి నరసింహామూర్తి జెండా ఊపి ప్రారంభించారు.

## తూడు తొలగిస్తేనే నీరు

సాగునీరు పుష్కలంగా ప్రవహించాల్సిన పంటకాలువలో తూడు, గుర్రపుడెక్కతో కమ్ముకున్నాయి. వల్లపల్లి నుంచి ఎస్.యానాం వరకు ఉన్న కొత్తకాలువ పరిస్థితి ఇది. ఈ కాలువపై చేపల చెరువులు అధికంగా ఉన్నాయి. పశువుల దాహార్తి తీర్చడానికి ఈ కాలువనీరు అవసరం. తూడు తొలగించి కాలువను బాగుచేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

## రహదారిపై ఇష్టారాజ్యం

అమలాపురం గారపాటివీధిలో ఓ నిర్మాణం కోసం రోడ్డుకు అడ్డంగా ఇసుక, కంకర వేసేశారు. అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొందరగా తొలగించాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

## యథేచ్ఛగా వదిలేశారు..!

అమలాపురంలో ఆబోతులు, పశువులు రహదారులపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. రాత్రయితే రోడ్డుకు అడ్డంగా ఉంటూ కదలడం లేదు. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా పెనుప్రమాదమే. కాలేజీరోడ్డులో రెప్పపాటులో ఆబోతులు అడ్డుగా రావడంతో వాహదారుడు వాటిని ఢీకొన్నాడు. రోడ్డుపై పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

## పునాది దాటని పనులు

ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలో పునాది స్థాయిలో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం ఇది. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు ఇలా వదిలేశారు. ఊచలు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. కనీసం పిల్లర్లు నిర్మిస్తే ఊచలను కాపాడుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

## సీఎం సహాయనిధితో పేదలకు సాంత్వన

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే వారికి ఆర్థికంగా సాంత్వన కలుగుతుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయం వద్ద సీఎంఆర్ఎఫ్‌లో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 49 కుటుంబాలకు మంజూరైన రూ.21.27 లక్షల చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, అర్ధాని శ్రీనివాసరావు, కట్టా సత్తిబాబు, కురసాల శివబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 12న దేహదారుఢ్య పోటీలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి నెల 12న రంకిరెడ్డి కాశివిశ్వనాథం బాడీబిల్డింగ్(దేహదారుఢ్య) పోటీలు నిర్వహిస్తున్నామని కోనసీమ బాడీబిల్డింగ్ సంఘ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. అమలాపురం మున్సిపల్ సర్క్యులర్ బజార్ జిమ్‌లో బాడీబిల్డింగ్ సంఘ నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు పోటీలకు సంబంధించిన కరపత్రికలను ఆవిష్కరించారు. కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమలాపురం దుడ్డివారి అగ్రహారం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 క్యాటగిరిలో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు, ప్రశంసాపత్రం, మెడల్, షీల్డ్‌లు బహూకరిస్తామని అన్నారు. పద్మరాజు, గారపాటి చంద్రశేఖర్, మట్టపర్తి సముద్రం, నార్ని శ్రీను, చిక్కం రాజబాబు, నగబేరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

## ఆధ్యాత్మికతే హిందూ సమాజానికి బలం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఆధ్యాత్మికతే హిందూ సమాజానికి బలం, ఐక్యతకు మూలమని శృంగ వృక్షం పంచమ పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెం క్షత్రియ పరిషత్తు ప్రాంగణంలో పెన్మత్స గోపాలకృష్ణంరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో స్వామీజీ పాల్గొని మాట్లాడారు. ప్రతి తల్లి తమ పిల్లలను ఛత్రపతి శివాజీలా పెంచాలన్నారు. హిందూ దేవాలయాలు, వాటి ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాకాల త్రినాథ్, పుసులూరి ప్రభాకరరావు, సాగి రాజు బాపిరాజు, సర్పంచి బీర సత్యకుమారి, పిన్నమరాజు వెంకటపతి రాజు, గాదిరాజు వెంకటసత్యనారాయణరాజు, గాదిరాజు విశ్వనాథ రాజు, ముదునూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ

## 28న ఉద్యోగ మేళా

యానాం, న్యూస్‌టుడే: యానాం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కృషితో ఈ నెల 28న యానాం యర్రా గార్డెన్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వృద్ధాశ్రమం కమిటీ అధ్యక్షుడు పెండెం సూర్యప్రకాష్ తెలిపారు. హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన 40 సంస్థల్లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే నిమిత్తం కాకినాడ వికాస్ సంస్థ జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు. ఎంపికైనవారికి నెలకు రూ.15వేల నుంచి రూ.50వేల వరకు వేతనం చెల్లిస్తాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న యువతీ యువకులు సోమవారం నుంచి యానాం ఓల్డేజ్ హోంలో తమ ధ్రువపత్రాల నకళ్లను సమర్పించి పేర్లు నమోదు చేయించుకోవాలని పెండెం ప్రకాష్ తెలిపారు.

## ఇందుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇందుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం అమలాపురం సాయి స్రవంతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు సాయిస్రవంతి, ఎర్రంశెట్టి వి.రావు ఎం.వెంకటవినయ్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి చొల్లంగి శివాలిని అప్పాజి, ఎంపీటీసీ కె.రాంబాబు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణమూర్తి, మల్లుల పోలయ్య, నాగిరెడ్డి తాతారావు, మోటుపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మొరాయించిన వెబ్‌సైట్

**నిరుద్యోగ అభ్యర్థుల ఇక్కట్లు**

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి పాలనా సంస్కరణల విభాగం వివిధ పోస్టుల భర్తీ కోసం ఏర్పాటు చేసిన రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ కొద్ది రోజులుగా మొరాయించడంతో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అగ్రికల్చర్ ఆఫీసర్, ఎల్‌డీసీ, యూడీసీ, టెక్నికల్ ఆఫీసర్, ఫీల్డ్ సూపర్‌వైజర్, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, స్టాటిస్టికల్ ఇన్‌స్పెక్టర్ తదితర 327 పోస్టుల భర్తీకి నవంబరు 18 నుంచి డిసెంబరు 14 వరకు అభ్యర్థులకు దరఖాస్తు గడువు ఇచ్చారు. గత వారం నుంచి రిక్రూట్‌మెంట్ వెబ్‌సైట్ అంతంతమాత్రంగా పనిచేసి, శనివారం సాయంత్రం నుంచి మొరాయించింది. ఆఖరి రోజు దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులు వివిధ నెట్ సెంటర్లలో వెబ్‌సైటు పనిచేయక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దరఖాస్తు చేయాలంటూ శనివారం పలువురు అభ్యర్థులు రాగా గడువు ముగిసే సమయానికి ఎనిమిది మంది దరఖాస్తులు మిగిలిపోయాయని నెట్ సెంటర్ నిర్వాహకుడు విత్తనాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పరిస్థితి గురించి పరిపాలనాధికారి అంకిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పుదుచ్చేరి ఎగ్జామినేషన్ సెల్‌కు విషయం తెలియజేశానని, సమస్య పరిష్కారమౌతుందని చెప్పారు.

## కొళాయి నీటిలో ములుగుపాము చేప

యానాం, న్యూస్‌టుడే: స్థానిక పాతరాజీవ్ నగర్ మొదటి వీధిలో సంగాడి మాతయ్య ఇంట్లోని మంచి నీటి కొళాయి నుంచి ఆదివారం ములుగు పాము చేప పిల్ల వచ్చింది. ఉదయం ఆరున్నరకు బకెట్‌లో నీటిని పడుతుండగా ఈ చేపపిల్ల వచ్చినట్లు ఆయన చెప్పారు. నీటి సరఫరా పైపులు పలుచోట్ల కాలువలు, మురుగునీటి డ్రెయిన్లలో ఉన్నాయి. దీంతో తరచూ మురుగు, మట్టి నీరు వస్తోంది. ఇప్పుడు ఏకంగా చేప పిల్ల రావడంతో ఆందోళన చెందుతున్నారు.

## వీధికుక్కల సమస్యపై ఫిర్యాదు

యానాం, న్యూస్‌టుడే: యానాంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల వల్ల వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్పీ వరదరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు వర్తకసంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, కార్యదర్శి కాపగంటి గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. పశువులు మందలుగా తిరుగుతూ డస్ట్‌బిన్లలోని చెత్తను చెల్లాచెదురు చేసి పరిసరాల్ని పాడు చేస్తున్నాయన్నారు. దుకాణాలు, కూరగాయల కొట్లలో చొరబడుతున్నాయని, రోడ్లు సంచరిస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయని వివరించారు. వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనచోదకుల వెంటపడుతున్నాయన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. వీధికుక్క వెంటపడటంతో ఓ విద్యార్థి వాహనంతో గోడను ఢీకొట్టి మృతి చెందాడన్నారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగ సుందరం, ఎస్సై పునీత్‌రాజ్, వర్తక సంఘ సభ్యులు కాపగంటి తాజుద్దీన్, మోటూరి రాజకుమార్ పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు అందజేస్తున్న వర్తక సంఘం ప్రతినిధులు

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పేరూరులో భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ బృందం చేపడుతున్న సేవా కార్యక్రమాలను కళాశాల ఛైర్మన్ బోనం కృష్ణ సతీష్, అక్షర్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎండీ బోనం విజయలక్ష్మి అభినందించారు. గతంలో పరీక్షలు చేసిన వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యురాలు కె.మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.దుర్గారావు, పీడీ రవిసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా మట్టి తరలింపు

కాట్రేనికోన : ఉప్పూడిలో రోడ్డు పక్కన ఓ చేనును మెరక చేసేందుకు ఆదివారం ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి తరలించారు. అధిక లోడు, మితిమీరిన వేగంతో ఇళ్ల మధ్య నుంచి ట్రాక్టర్లు వెళ్లాయని స్థానికులు ఆవేదన వ్యక్త చేశారు. కొన్నాళ్లుగా రాత్రి పూట అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని తహసీల్దారు రవికిరణ్ వద్ద ప్రస్తావించగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే ఉదయం పనులు ఆపివేయించామన్నారు. మధ్యాహ్నం నుంచి తరలింపు పనులు ప్రారంభించినట్లు తెలిసిందన్నారు. స్థానిక వీఆర్వో, ఆర్ఐను అక్కడికి పంపించి మట్టి తరలింపును నిలిపివేస్తామన్నారు.

ట్రాక్టర్‌లో మట్టి రవాణా చేస్తూ..

## కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలో నిర్మిస్తున్న శెట్టిబలిజ కల్యాణ మండప నిర్మాణానికి జీఎంకే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త గుత్తుల మీరాకుమార్ రూ.5 లక్షలు విరాళం అందించారు. ఆయన ప్రకటించిన విరాళాన్ని ట్రస్టు కార్యదర్శి పిల్లి నాగబాబు, ట్రస్టు సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి వచ్చి ఆదివారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపం వద్ద నిర్మాణ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శెట్టిబలిజ నాయకులు మీరా కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, సానబోయిన మల్లికార్జునరావు, దొమ్మేటి అప్పారావు, పితాని బాలకృష్ణ, గుబ్బల రవి, కట్టా సత్తిబాబు, బొంతు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

## ప్రమాదకరంగా నీటిసంపు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోనలోని నాగాపట్నం ప్రాథమిక పాఠశాలలో తాగునీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో 48 మంది చదువుతున్నారు. నాడు-నేడు పనుల్లో భాగంగా కొన్ని పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఆర్వోప్లాంటు ఏర్పాటు చేయాలి. ఆర్వోప్లాంటు వచ్చినా ట్యాంకు లేక బిగించ లేదు. పాఠశాల పక్కన నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన సంపుపై మూత సగం మాత్రమే ఉంది. ఆ ప్రాంతంలో పిల్లలకు ప్రమాదం పొంచి ఉంది.

## వైజ్ఞానిక యాత్రలే మంచి పాఠాలు

యానాం, న్యూస్‌టుడే: వైజ్ఞానిక యాత్రలు మంచి పాఠాలు, జ్ఞాపకాలుగా మిగులుతాయని ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. రాజమహేంద్రవరం సైన్స్ ప్లానెటోరియం, సౌందర్య చికిత్సకేంద్రం, ధవళేశ్వరం బ్యారేజీ, కాటన్ మ్యూజియం ఆదివారం మూడు బస్సుల్లో బయల్దేరిన స్థానిక కమలానెహ్రూ బాలికోన్నత పాఠశాల విద్యార్థుల యాత్రకు జెండా ఊపి మల్లాడి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు పిల్లి రుద్రరామ గోపాల్, పీఈటీ పాము సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న మల్లాడి

## యువకుడిపై పోక్సో కేసు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతీ పరిధిలోని చిన అగ్రహారానికి చెందిన కాలాడి సతీష్ మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి యువకుడిపై పోక్సో చట్టంలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

## శుభ కలశం.. కళావిహీనం

అమలాపురానికి చిహ్నమైన ఇక్కడి శుభ కలశం నిర్లక్ష్యానికి గురవుతోంది. దీనిని 2012లో సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం పూర్తిగా పోస్టర్లతో నిండిపోయింది. ప్రచార పోస్టర్లు ఇష్టారాజ్యంగా అతికిస్తున్నారు. గతంలో ఎంతో అందంగా ఉండే గోడలు పాడైపోయాయి. శుభ్రత చర్యలు చేపట్టి, శుభ కలశానికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోనసీమ

పోస్టర్లతో నిండిన దిమ్మ

పాడైన గోడ

## వాడపల్లిలో భక్తుల రద్దీ

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

(c) eenadu

# మండపేట

•మండపేట •రామచంద్రపురం

## మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

రాజోలు: రాజోలులో ఈ నెల 13న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా ఎనిమిదేళ్ల క్రితం నాటి స్థల వివాదం కేసు పరిష్కారమైందని సీనియర్ సివిల్‌జడ్జి ఎం.ప్రమీలారాణి ఆదివారం తెలిపారు. రాజోలు మండలం కాట్రేనిపాడుకు చెందిన ఇద్దరు అన్నదమ్ముల మధ్య 2017లో ఆస్తి వివాదం నెలకొంది. అప్పటి నుంచి వాదోపవాదాలు జరిగాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మధ్యవర్తిత్వం' ద్వారా ఇరు కుటుంబాలకు కోర్టు న్యాయవాది మామిడిశెట్టి సాయిబాబా కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో కేసును లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకున్నారు. న్యాయవాది సాయిబాబా, ఇరుపక్షాల న్యాయవాదులు పి.వి.కృష్ణంరాజు, కె.పి.ఆర్.ఆర్.నాయుడును జడ్జి ప్రమీలారాణి అభినందించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు, న్యూస్‌టుడే: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ సూచించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాట్సప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల యాప్‌ల ద్వారా ఇంటి నుంచే పనిచేస్తూ డబ్బు సంపాదించుకోవచ్చని ఆశచూపి మోసపూరిత లింకులు పంపి డబ్బు దోచుకుంటున్న కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. నిరుద్యోగులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నిలువునా దోచేస్తున్నారని పేర్కొంటూ వాటికి దూరంగా ఉండాలన్నారు. ఇలా మోసపోయినట్లు గుర్తించిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ: 80085 74192 ద్వారపూడి: 91543 96553

### వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం పాలతోడులోని ఎస్సీపేట చెరువుగట్టు వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో పాటు దోమలతో ఇబ్బంది పడుతున్నాం.
– సూర్యవంశీ, పాలతోడు

పరిష్కారం: సమస్యపై పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్ స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు.
– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

## ఇది 5జీ.. ఇక విధులన్నీ ఈజీ

అంగన్‌వాడీ కార్యకర్తలకు అధునాతన చరవాణులు

పామర్రు, న్యూస్‌టుడే: అధునాతన చరవాణుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. మరో వారం రోజుల్లో 5జీ సామర్థ్యపు చరవాణులు వారి చేతుల్లోకి రానున్నాయి. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల సీడీపీవో కార్యాలయాలకు ఫోన్లు చేరాయి. రామచంద్రపురం నియోజకవర్గంలోని 183 కేంద్రాలకు సంబంధించి 191, మండపేట నియోజకవర్గంలో 242 కేంద్రాలకు 253 చరవాణులు వచ్చాయి. వీటిని కార్యకర్తలు, పర్యవేక్షకులు, సీడీపీవోలకు పంపిణీ చేయనున్నారు.

### గట్టెక్కనున్న నెట్‌వర్కు కష్టాలు..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరును బాల సంజీవిని, పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఛాయాచిత్రాలుగా నమోదు చేయాలి. పౌష్టికాహారాన్ని ఇచ్చే సమయంలో గర్భిణులు, బాలింతలకు ముఖ గుర్తింపు తప్పనిసరిగా చేయాలి. శిశువుల జననం, కేంద్రంలో చేరికలు, పౌష్టికాహారం సరఫరా, నిల్వలు తదితర వివరాలను యాప్‌లో నమోదుచేసే క్రమంలో నెట్‌వర్క్ సరిగా లేకపోవడం, చరవాణులు సరిగా పనిచేయక మొరాయించడం తదితర సమస్యలతో కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పైగా ఒక్కోసారి తప్పులు కూడా నమోదై అధికారులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చేది. విధుల నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను ఆందోళన చేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొత్త చరవాణులు మంజూరు చేసింది.

### త్వరలో పంపిణీ..

ప్రస్తుతం వాడుకలో ఉన్న యాప్‌లతో పాటు 5జీ నెట్‌వర్క్ సామర్థ్యం కలిగిన రూ.12,500 విలువైన చరవాణులు త్వరలోనే అందనున్నాయి. ప్రధానమంత్రి మాతృవందన యోజన, మిషన్ వాత్సల్య, సఖి బిల్లుల నమోదుకు కూడా వీటిని ఉపయోగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విషయమై రామచంద్రపురం సీడీపీవో వరాహలక్ష్మిని వివరణ కోరగా కొత్త చరవాణులు కార్యాలయాలకు చేరాయని, మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా కార్యకర్తలకు త్వరలోనే అందిస్తామని వివరించారు.

## ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం విద్యుత్తు డివిజన్‌లో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యుత్తు పొదుపుపై అవగాహన ర్యాలీలు, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు, స్వయం సహాయ సంఘాల మహిళా బృందాలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని ఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని వివరించారు. విద్యుత్తు పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అంశాలపై ఇంజినీరింగ్ కళాశాలల్లో కార్యశాలలు జరుగుతాయన్నారు. అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, ఈనెల 20వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

## వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, చీరల పంపిణీ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఆదివారం ద్రాక్షారామ భీమేశ్వరస్వామి అతిథి గృహం వద్ద 800 మంది వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు రూ.4 లక్షలు విలువైన దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు శివకోటి మధుసూదనరావు దాదాపు 15 ఏళ్లుగా ఇక్కడికి వచ్చి దుస్తులు పంపిణీచేసి వారికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం సత్యసాయి బాబా ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు చెందిన 50 మంది సభ్యులతో వచ్చి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. విశాఖలోని కేజీహెచ్ వద్ద రోజూ 500 మందికి అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి యాట్ల అప్పారావు, నేతలు వై.నాగేశ్వరరావు, మాకం కామేశ్వరరావు, విస్సాప్రగడ కృష్ణమూర్తి, రోజారాణి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తులు అందిస్తున్న మధుసూదనరావు

కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల

## కేశవరంలో కంటి వైద్య శిబిరం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం కేశవరం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పీ-4 కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి విచ్చేసిన 235 మంది శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుండమట్ల వాసు, తెదేపా మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, నల్లమిల్లి వీర్రెడ్డి, వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా సామాజిక భవనం ప్రారంభం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అన్నాయిపేట గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని (కాపు కల్యాణ మండపం) ఆదివారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంయుక్తంగా ప్రారంభించారు. తొలుత పంచాయతీ సమీపంలోని కాటన్ దొర విగ్రహానికి, ఉద్యానవనంలోని వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు, తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా ఉన్నపుడు రూ.25 లక్షలు ఈ భవనం కోసం మంజూరు చేసినట్లు వివరించారు. ఈ భవనం వద్ద భోజనశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, సర్పంచి పెమ్మిరెడ్డి దొరబాబు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వైకాపా నియోజకవర్గం కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ బోస్, ఎమ్మెల్సీ తోట

## పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అమృతరావు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రపురానికి చెందిన మొంగం అమృతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజోలు మండలం పొదలాడలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో తనను ఎంపిక చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం మండలం చోడవరం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయనను పలువురు పీఆర్టీయూ నాయకులు అభినందించారు.

## జనంలోకి జనసేన..

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణ జనసేన పార్టీ ఆధ్వర్యంలో 17వ వార్డు ముచ్చుమిల్లిలో ఆదివారం రాత్రి జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రతిష్ఠ పెంచేలా నిర్వహించే కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ విజయంలో పార్టీ పాత్రను గుర్తుచేసుకునే అంశాలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో చంద్రశేఖర్, గొల్లపల్లి కృష్ణ తదితరులు

## ముక్కోటి వేడుకలకు రాట ముహూర్తం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు శ్రీకారం చుడుతూ రాజగోపాల్ సెంటర్‌లోని సీతారామ భక్త వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం రాటముహూర్తం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, రుత్వికుల సమక్షంలో రాటవేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గన్నమని చక్రవర్తి, కొవ్వూరి సురేష్, చవ్వాకుల సురేష్, దొడ్డా సతీష్, పడాల సుబ్రహ్మణ్యం, చీమలకొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రాటముహూర్తంలో గన్నమని చక్రవర్తి, ఆలయ కమిటీ సభ్యులు

## సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం

మామిడికుదురు, న్యూస్‌టుడే: హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని, అత్యంత పవిత్రంగా భావితరాలకు అందివ్వాలని శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగానందసరస్వతి స్వామీజీ అన్నారు. గోగన్నమఠం వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ధర్మపరిరక్షణ కోసం ప్రతిజ్ఞపూర్వ కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి విభాగ్ ప్రచారక్ సోమజి సందేశాన్ని ఇచ్చారు. అనంతరం కులవృత్తుల వారిని సత్కరించారు. చిన్నారులు కూచిపూడి ప్రదర్శనలు, కోలాట కీర్తనలతో అలరించారు. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.వేమా, సర్పంచి అల్లు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు సాగి పాపయ్యరాజు, ఆదుర్తి విద్యాసాగర్, కశిరెడ్డి వెంకటపేరయ్య, కాండ్రేగుల వెంకటరెడ్డి, యెరుబండి లక్ష్మయ్య, నామన వెంకన్నబాబు, కాపవరపు గోపాలకృష్ణ, భూపతి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానాల పాలకవర్గ సభ్యుల ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం ఏడిద గ్రామంలోని ప్రసిద్ధిచెందిన శ్రీసంగమేశ్వరస్వామి, కైలాసేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, పోలేరమ్మ దేవస్థానాలకు నూతన పాలకవర్గ సభ్యులుగా నియమితులైనవారు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నాలుగు దేవస్థానాలకు ఛైర్మన్లుగా పాడిశెట్టి శ్రీనివాస్, గొల్లపల్లి ప్రసాదరావు, మేకా లక్ష్మీప్రవీణ్, తూము సోమరాజులతో పాటు సభ్యులతో ఈవో శోభారాణి ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సర్పంచి బూరిగ ఆశీర్వాదం, కూటమి నాయకులు నల్లమిల్లి వీర్రెడ్డి, చింతపల్లి రామకృష్ణ, పర్వతిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ సభ్యులకు వేతనాలివ్వరా..?

రెండేళ్ల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి

పామర్రు, న్యూస్‌టుడే: రెండు సంవత్సరాలుగా గౌరవ వేతనాలు ఇవ్వకపోవడంపై కె.గంగవరం మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. కూళ్ల ఎంపీటీసీ సభ్యుడు పిల్లి దుర్గాప్రసాద్ గౌరవ వేతనాల అంశాన్ని లేవనెత్తుతూ సమస్య మన మండలంలోని సభ్యులకే ఎదురైందా..? అన్ని చోట్లా ఇలాగే ఉందా అని ప్రశ్నించారు. దీంతో మిగిలిన సభ్యులు కూడా గొంతు విప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు స్పందిస్తూ ఇప్పటికే మూడు బిల్లులు రూ.6 లక్షలకు చేసి సంబంధిత అధికారులకు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమవుతుందన్నారు. మండలంలో అవసరం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.19,200 చొప్పున చెల్లిస్తారని, ప్రతిపాదనలు పంపించాలని ఎంపీడీవో చెప్పారు. మండలంలోని శేరిలంక, కోట, తామరపల్లి, వాసాలరేవుల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. తామరపల్లి, పాణింగిపల్లి, పామర్రుల్లో జలజీవన్ మిషన్ పనులు జరగడంలేదని, నిధులున్నా కూడా గుత్తేదారు రావడం లేదని సర్పంచులు సభ దృష్టికి తెచ్చారు. శేరిలంకలో వీధి దీపాలు వెలగడం లేదని, పక్క మండలంలోని కమిని, సీతారామపురాల్లో వెలుగుతున్నాయని సభ్యులు చెప్పారు. అంతకు ముందు 2026-27 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ఎంపీడీవో సభలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల ఉపాధ్యక్షులు నీతిపూడి మధుబాల, నాగేశ్వర్రావు, తహసీల్దార్ శ్రీరామప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

శాంతి సందేశాన్నిస్తున్న ఇమ్మాన్యుయెల్ రాజ్

## క్రీస్తు శాంతి సందేశాన్ని పొరుగువారితో పంచుకోవాలి

రాయవరం, న్యూస్‌టుడే: ఆపన్నులను ఆదుకోవడం, పొరుగువారితో శాంతి, సుహృద్భావ వాతావరణంలో మసలుకోవాలన్న క్రీస్తు సందేశాన్ని విశ్వాసకులంతా అనుసరించాలని పెద్దాపురం బైబిల్ మిషన్ సంయుక్త కార్యదర్శి డా.ఇమ్మానుయేల్ రాజ్ అన్నారు. ఆదివారం రాయవరంలోని క్రీస్తు ఆరాధన మిషన్ ఆరాధకులు సత్తి మహిమానందరెడ్డి అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రీస్తు రాకను స్వాగతిస్తూ క్రైస్తవ ప్రసంగీకులు జ్యోతి పుష్ప ఆలపించిన గీతాలు సభికులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. తొలుతగా కేకు కోసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రైస్తవ గీతాలకు అనుగుణంగా ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కరపత్రం ఆవిష్కరిస్తున్న సంతోష్‌వర్మ తాతారెడ్డి తదితరులు

## హిందూ సమ్మేళన కరపత్రాల ఆవిష్కరణ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో ఈనెల 25న నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమ కరపత్రాల్ని రామచంద్రపురం శివాలయంలో ఆదివారం పట్టణ ప్రముఖులు, అధ్యక్షుడు కె.తాతారెడ్డి, ఆర్థోస్ ఎండీ సంఘ్‌చాలక్ అడ్డూరి సంతోష్‌వర్మ తదితరులు ఆవిష్కరించారు. నిర్వాహక కమిటీ సభ్యులు ఎ.వి.హనుమంతరావు, చెరుకుపల్లి గణేష్‌శర్మ, పి.ఎస్.రాఘవేంద్రరావు, దొడ్డా దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడుతూ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ సంయోజక్ వడ్డాది వెంకట సుబ్బారావు, రామచంద్ర శేఖర స్వామీజీ తదితరులు పాల్గొంటారని వివరించారు.

## వైష్ణవాలయాలకు ధనుర్మాస శోభ

రేపటి నుంచి తిరుప్పావై పాశురాలు

పామర్రు, న్యూస్‌టుడే: మాసానాం మార్గశీర్షోహం.. అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఉపదేశించారు. అంటే అన్ని మాసాల్లోనూ మార్గశిరం అంటే తనకిష్టమని అర్థం. ఆధ్యాత్మిక చింతన, మధుర భక్తికి ఈ మాసం ప్రతీక. శ్రీమహావిష్ణువును భర్తగా పొందడానికి గోదాదేవి ధనుర్మాసం నెల రోజులూ భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించి ఆయనలో ఐక్యమైందని పురాణాలు చెబుతున్నాయి. ఈనెల రోజులూ తెల్లవారుజామునే మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన పాశురాల పఠనం, బాలభోగం, భజనలు లాంటి కార్యక్రమాల నిర్వహణకు వైష్ణవాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు.

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని 108 దివ్యదేశాల నమూనాల ఆలయంగా వెలుగొందుతున్న కె.గంగవరం మండలంలోని కోట రాజగోపాలస్వామి ఆలయం, అముజూరు, కె.గంగవరంలలోని వేణుగోపాలస్వామి ఆలయాలు, పామర్రు పట్టాభిరామస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువజామునే బాజాభజంత్రీలతో స్వామి వారికి మేలుకొలుపు నిర్వహిస్తారు. భక్తులంతా గుడిలో సామూహికంగా తిరుప్పావై పాశురాలను ఆలపించేందుకు సిద్ధమవుతున్నారు.. పామర్రు, కె.గంగవరం, కోట తదితర ఆలయాల్లో లక్షతులసి పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. నవ జనార్దనాలయాలుగా ప్రసిద్ధిచెందిన మండపేట, జొన్నాడ, ఆలమూరు, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లిలో మాసోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

కోటలో కొలువైన 108 దివ్యదేశాల స్వామివార్ల నమూనా విగ్రహాలు

## కుస్తీ పోటీల్లో బంగారు పతకం

రాజోలు: ఒంగోలులోని కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి వెటరన్ కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాజోలుకు చెందిన విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 65 సంవత్సరాల సీనియర్స్ కేటగిరీ 80 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచారు. కుస్తీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మెరైన్ ఎస్సై సుబ్బారావు నుంచి పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. విశాఖలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పలువురు అభినందించారు.

## గౌరవాధ్యక్షునిగా గౌరీమల్లిక్

ఆలమూరు: సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ విశ్వసాహితీ కళావేదిక డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా గౌరవాధ్యక్షునిగా చింతలూరుకు చెందిన పద్యకవి కామవరపు మల్లికార్జునరావు(గౌరీమల్లిక్) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఈయన్ను ఆదివారం పలువురు అభినందించారు.

## కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరంలో నిర్మిస్తున్న శెట్టిబలిజ కల్యాణ మండప నిర్మాణానికి జీఎంకే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త గుత్తుల మీరాకుమార్ రూ.5 లక్షలు విరాళం అందించారు. ఆయన ప్రకటించిన విరాళాన్ని ట్రస్టు కార్యదర్శి పిల్లి నాగబాబు, ట్రస్టు సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి వచ్చి ఆదివారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపం వద్ద నిర్మాణ కమిటీకి అందేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శెట్టిబలిజ నాయకులు మీరా కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, సానబోయిన మల్లికార్జునరావు, దొమ్మేటి అప్పారావు, పితాని బాలకృష్ణ, గుబ్బల రవి, కట్టా సత్తిబాబు, బొంతు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలకు మైక్‌సెట్ల బహూకరణ

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలులోని కనకమహాలక్ష్మి, సోంపల్లిలోని విష్ణుమూర్తి ఆలయాలకు హిందూ ధర్మరక్ష సమితి వారు ఆదివారం మైక్‌సెట్లను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, కాసు సుఖేష్ రంగనాయకి చేతుల మీదుగా ఆయా ఆలయ కమిటీలకు వీటిని అందజేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కొత్త శ్రీనివాసరావు, చలువాది త్రినాథ్, రాజా నాగరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిబిరంలో వైద్య సేవలు

రామచంద్రపురం: పట్టణంలోని అను కంటి ఆసుపత్రిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ అనుపమ కంటి, గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి టూడీ ఎకో తదితర పరీక్షలు చేశారు. అనంతరం హృద్రోగ, కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గుణ్ణం రామకృష్ణ, కొండేపూడి సురేష్, కొండపల్లి రవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలు తెలిపేందుకే ప్రజాభిప్రాయ సేకరణ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గంలోని మండలాలను రాజమహేంద్రవరంలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈనెల 30వ తేదీలోగా అభ్యంతరాలు తెలియజేయాలని కోరినందునే తాము ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ పేర్కొన్నారు. కూటమి నాయకుల విమర్శలను ఆయన ఖండించారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో పెమ్మిరెడ్డి మురళి, పెంటపాటి శ్రీనివాస్ తదితర నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు.

## ఆదమరిస్తే.. కాలువలోకే..

బెర్ములు లేని రహదారులతో పొంచి ఉన్న ప్రమాదాలు

రాయవరం, న్యూస్‌టుడే: రోడ్డుపై బెర్ములు లేక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రాయవరం, లొల్ల గ్రామాల్లోని ప్రధాన సిమెంట్ రహదారులపై నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఎక్కడ: రాయవరంలోని శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల, లొల్ల శివాలయం వద్ద బెర్ములు లేని రహదారులు, ఆ పక్కనే మూతల్లేని కాలువలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

### అధికారులకు తెలియదా..?

బెర్ములు లేక తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, వాహనచోదకులు అధికారుల దృష్టికి నిత్యం తీసుకువెళుతున్నారు. అయినా పట్టించుకునేవారే లేరు.

### ప్రజలకు తప్పనితిప్పలు..

వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో మండల కేంద్రమైన రాయవరంతో పాటు లొల్ల గ్రామంలోని సోమేశ్వరం-రాజానగరం ప్రధాన రహదారి అన్ని వేళలా రద్దీగా ఉంటోంది. శ్రీరామయ్య జడ్పీ ఉన్నత పాఠశాల వైపు ఉన్న సిమెంట్ రహదారి అంచులు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. వాహనచోదకులు ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. లొల్ల శివాలయం వద్ద ప్రధాన సీసీ రహదారిని ఆనుకుని డ్రెయినేజీపై రక్షణమూత లేకపోవడం, రహదారి అంచే డ్రెయినేజీకి చేరి ఉండడంతో రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చేక్రమంలో వాటికి దారిచ్చేందుకు రోడ్డు చివర వరకు వచ్చి కిందపడి గాయాలపాలవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, రేడియం స్టికర్లతో సూచికలు ఏర్పాటుచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ. రామచంద్రపురం డివిజన్ ఈఈ టీవీఎస్ సూర్యనారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లొల్లలో బెర్ములేని ప్రధాన రహదారి పక్కనే కాలువ

## రోడ్డు ప్రమాదంలో ద్వారపూడి మెడికోకు గాయాలు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని గాయపడిన ఘటన శ్రీకాకుళం నగరంలో జరిగింది. మండపేట మండలం ద్వారపూడికి చెందిన పోతుల జాహ్నవి శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం సాయంత్రం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆలయానికి వెళ్లి వస్తుండగా కారు ఢీకొనడంతో గాయపడ్డారు. సమీపంలోనే ఉన్న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్లు ట్రాఫిక్ ఎస్సై దొర తెలిపారు.

(c) eenadu

# కొబ్బరి రైతులకు తీపి కబురు

## మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేట మార్కెట్‌లో ఆరబెట్టిన మిల్లింగ్ కొబ్బరి

కోనసీమ కొబ్బరి రైతుల ఎదురుచూపులు ఫలించాయి. కేంద్రప్రభుత్వం కొబ్బరికి మద్దతు ధర పెంచింది. గతేడాది మిల్లింగ్ కొప్రా రకం క్వింటాకు రూ.11,582, బాల్‌కొప్రా రూ.12,100 ధర నిర్ణయించగా ప్రస్తుతం 2026 సీజన్‌కు సంబంధించి మిల్లింగ్ కొప్రా రూ.12,027, బాల్‌కొప్రా(బంతి కొబ్బరి) రూ.12,500 మద్దతు ధరను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రకటించారు. గత డిసెంబరులో మిల్లింగ్‌కొప్రా రకానికి క్వింటాలుకు రూ.422, బంతి కొబ్బరికి రూ.100 పెంచారు. ఈ ఏడాది (2026 సీజన్‌కు) మిల్లింగ్ కొప్రాకు రూ.445, బంతి కొబ్బరికి రూ.400 మద్దతు ధర పెంచారు. గతేడాది మిల్లింగ్ కొబ్బరికి ఉన్న మద్దతు ధర రూ.11,582కు రూ.445 కలిపి ఇకపై ఇవ్వనున్నారు.

అయిదేళ్లలో మద్దతు ధరలు ఇలా.. (క్వింటా రూ.లలో)

| ఏడాది | మిల్లింగ్ కొప్రా | బాల్ కొప్రా |
|---|---|---|
| 2024 | 11,160 | 12,000 |
| 2025 | 11,582 | 12,100 |
| 2026 | 12,027 | 12,500 |

(కొత్త సంవత్సరం)

## చెల్లింపుల్లో పొరపాటా.. ఫిర్యాదిలా..

ప్రస్తుతం ప్రతిఒక్కరూ యూపీఐ చెల్లింపులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. కిరాణా, కూరగాయలు, టిఫిన్.. ఇలా ప్రతిదానికీ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు నగదు బదిలీ అవుతుంటుంది. లేకుంటే పెండింగ్ పడిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తిరిగి రాబట్టుకునే అవకాశం ఉంది. లావాదేవీకి సంబంధించిన స్క్రీన్‌షాట్ తీసుకుని ఈ నంబర్లను సంప్రదిస్తే సరిపోతుంది. ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. –న్యూస్‌టుడే, దేవీచౌక్

మీ కోసం

| | |
|---|---|
| గూగుల్‌పే | 18004190157 |
| ఫోన్‌పే | 080 68727374 |
| పేటీఎం | 01204456456 |
| భీమ్‌యాప్ | 18001201740 |

## ఏటిగట్టు తవ్వేస్తే ఎలా?

ఏటిగట్టును తవ్వి ఏర్పాటు చేస్తున్న ర్యాంపు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం జీడిగుంట-పెండ్యాల గ్రామాల మధ్య గోదావరి నదిని ఆనుకుని పట్టా భూముల్లో ఇసుక తొలగింపునకు భూగర్భ గనులశాఖ అధికారులు అనుమతిచ్చారు. నిర్వాహకులు సరాసరి ఏటిగట్టును కొంతమేర తవ్వి ర్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గట్టు ప్రమాదంలో పడే అవకాశం ఉందని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం తిరిగే వందలాది లారీల రాకపోకలతో గట్టు పూర్తిగా బలహీన పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సిద్ధాంతం గోదావరి హెడ్‌వర్క్స్ ఏఈ సీహెచ్ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


# ఈనాడు తూర్పుగోదావరి

సోమవారం డిసెంబరు 15, 2025




# నిజం నిగ్గు తేలేనా..?

## వైకాపా సర్కారులో భారీగా భూ అక్రమాలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం:

గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాలు అన్నీ ఇన్నీ కావు. సంక్షేమం పేరుతో అసైన్డ్, గ్రామ సర్వీసు ఇనాం, షరతులతో కూడిన పట్టా భూములను ఫ్రీహోల్డ్ పేరుతో దోచేశారు. కొందరి రైతుల భూములను ఉద్దేశపూర్వకంగా నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులు పెట్టారు. భూరికార్డులు తారుమారు చేసి పట్టాదారు పాసుపుస్తకాల్లో మరికొందరు రైతుల పేర్లు మార్చి వేరేవారి పేర్లు ఎక్కించారు. పేదలకు గతంలో అసైన్ చేసిన భూములపై శాశ్వత, పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తామంటూ భూముల ఫ్రీహోల్డ్ ముసుగులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చినప్పటికీ గత సర్కారు పట్టించుకోలేదు.

రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,458.60 ఎకరాలు, కొవ్వూరు డివిజన్ పరిధిలో 2,691.61 ఎకరాలు కలిపి మొత్తం జిల్లాలో 5,150.21 ఎకరాలను వైకాపా ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ చేశారు. వీటిలో అసైన్డ్, గ్రామసర్వీసు ఇనాం, షరతులతో కూడిన పట్టాభూములు కూడా ఉన్నాయి. ఇదే అదనుగా కొందరు వందల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి, కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వీటిపై పలు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

గోకవరం మండలంలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

### నల్లజర్ల మండలంలో అత్యధికం..

గత ప్రభుత్వం జిల్లాలోని 18 మండలాల్లో పలు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. మండలాల వారీగా చూస్తే అత్యధికంగా నల్లజర్లలో 516.92 ఎకరాలు అసైన్డ్, 109.99 ఎకరాల గ్రామ సర్వీసు ఇనాం, 748.16 ఎకరాల పట్టా భూములు ఫ్రీహోల్డ్ చేశారు. గోకవరం మండలంలో 400.11 ఎకరాలు, గోపాలపురంలో 317.96, రాజానగరంలో 221.20, రంగంపేటలో 260, కోరుకొండలో 193, కొవ్వూరులో 169.43, దేవరపల్లిలో 111.31 ఎకరాలు చొప్పున అసైన్డ్ భూములతోపాటు కొన్ని ఇనాం, పట్టా భూములు కూడా ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. మిగతా మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఆ భూముల రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి.

జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన భూములివి..(ఎకరాల్లో)

| | |
|---|---|
| అసైన్డ్ భూములు | 2,477.61 |
| సర్వీసు ఇనాం | 1,919.85 |
| షరతు పట్టా | 752.75 |

### పునఃపరిశీలన.. ప్రభుత్వానికి నివేదిక..

భూఅక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ఫ్రీహోల్డ్‌లో ఉంచిన భూముల పునఃపరిశీలనకు ఆదేశించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా మండలాల్లో 5,150.21 ఎకరాలు ఫ్రీహోల్డ్‌లో ఉన్నట్లు ధ్రువీకరించారు. వీటిలో ఎన్ని రిజిస్ట్రేషన్ వరకు వెళ్లాయనే వివరాలతోపాటు తిరిగి వీటిని నిషేధ జాబితాలో చేర్పించడానికి సాధ్యాసాధ్యాలపై నివేదికలు ప్రభుత్వానికి పంపారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని, ప్రజలు తమ సమీపంలోని కార్యాలయంలోనూ అర్జీలు అందించవచ్చని ఆమె తెలిపారు.

# ఎయిర్‌బస్‌లు వస్తున్నాయోచ్..

కోరుకొండ, సీతానగరం, న్యూస్‌టుడే: మధురపూడి విమానాశ్రయం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు చిన్న విమాన సర్వీసులకే పరిమితమైన ఈ విమానాశ్రయం పెద్ద విమానాల రాకపోకలకు సుగమమైంది. ఇండిగో విమానయాన సంస్థ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎయిర్‌బస్‌లను ఈనెల 16 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నద్ధమవుతోంది. వీటితో ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రాల రాజధాని భాగ్యనగరానికి ప్రయాణికుల రాకపోకల సంఖ్య మరింత పెరుగుతుంది.

ఎయిర్‌బస్ విమానం

### ఒకేసారి రెండు..

విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఒకేసారి రెండు ఎయిర్‌బస్‌లు కొత్తగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు దిల్లీ, ముంబయి నగరాలకు మాత్రమే ఇవి ఉన్నాయి. ఇక నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు అనుసంధానం కానున్నాయి. దీంతో ఈ సంఖ్య నాలుగుకు చేరుతుంది.

### పెరగనున్న ప్రయాణికుల

రోజూ హైదరాబాద్‌కు ఆరు సర్వీసులు ఉన్నాయి. ఆయా సర్వీసులతో సుమారు 600 వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం నుంచి అయిదు ఏటీఆర్ సర్వీసుల స్థానంలో రెండు ఎయిర్‌బస్‌లు వస్తున్నాయి. వీటి ద్వారా ప్రయాణికుల సంఖ్య 800కు చేరే అవకాశం ఉంది.

### బెంగళూరుకు అలయన్స్ ఎయిర్..

రాజమహేంద్రవరం నుంచి బెంగళూరుకు మరో విమాన సర్వీసును నడిపేందుకు అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఇండిగో రాత్రిపూట నడుస్తుండగా, ఉదయం మరొకటి నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### ఏటీఆర్ నుంచి ఎయిర్‌బస్

పదేళ్లుగా హైదరాబాద్‌కు ఏటీఆర్ విమానాలు మాత్రమే ఉన్నాయి. ఇవి 72 మంది సామర్థ్యం కలిగి ఉంటాయి. హైదరాబాద్‌కు ప్రయాణికుల డిమాండ్ పెరగడంతో ఒక సర్వీసుతో ప్రారంభమై ఇప్పటి వరకు ఆరుకు చేరింది. ఏటీఆర్‌లను తగ్గించే యోచనలో ఎయిర్‌బస్‌లకు ప్రాధాన్యం పెంచనున్నారు. 180 మంది ప్రయాణికులు ఒకేసారి ఎగిరిపోవచ్చు.

### అందుబాటులోకి మరిన్ని సర్వీసులు

ప్రయాణికుల డిమాండ్ మేరకు సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ కృషి చేస్తోంది. అందుకనుగుణంగా విమానయాన సంస్థల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తాం

- ఎన్‌కే శ్రీకాంత్, ఎయిర్‌పోర్టు డైరెక్టరు

విమాన సర్వీసులు బయలుదేరు సమయం(గంటలకు)

| | |
|---|---|
| హైదరాబాద్ | ఉదయం 8.30, మధ్యాహ్నం 3.30, రాత్రి 9.30 |
| దిల్లీ | ఉదయం 10.15 |
| చెన్నై | మధ్యాహ్నం 12.15 |
| ముంబయి | సాయంత్రం 6.25 (మంగళ, గురు, శనివారాలు) |
| బెంగళూరు | రాత్రి 7.15 |
| తిరుపతి | మధ్యాహ్నం 12.30 (మంగళవారం), ఉదయం 11.05 (గురు, శనివారాలు) |

## 16 నుంచి క్రీడా మహోత్సవ్

టి.నగర్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలో సంసద్ క్రీడా మహోత్సవ్-2025 నిర్వహించనున్నట్లు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం, 18 మండలాల్లో ఈనెల 16 నుంచి 21 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెంచడం, ఆరోగ్యం-ఫిట్‌నెస్ ప్రోత్సాహం, గ్రామీణ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే ఈ పోటీల ముఖ్య లక్ష్యమన్నారు. 21న రాజమహేంద్రవరంలో పురుషులకు 5 కి.మీ మారథాన్, మహిళలకు 3 కి.మీ మారథాన్ అటానమస్ కళాశాల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఈనెల 22న అటానమస్ కళాశాలలో అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుందన్నారు.

# పర్యాటకం.. ప్రగతి చోదకం..!

ఈనాడు, రాజమహేంద్రవరం : వైకాపా జమానాలో పడకేసిన పర్యాటకాన్ని కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇస్తూ తీసుకొచ్చిన పాలసీలు పెట్టుబడులు పెట్టేందుకు దోహదపడుతున్నాయి. ఇప్పటికే తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో హోంస్టేలను ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరిలో 9, కోనసీమలో 23 మంది ఆసక్తి చూపినట్లు జిల్లా పర్యాటక అధికారులు వెంకటాచలం, అన్వర్ హుస్సేన్ తెలిపారు.

ఆత్రేయపురంలో పడవల పోటీ

### ముందుకొస్తున్న సంస్థలు

- సముద్ర తీర ప్రాంతం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో జెట్టీలు ఏర్పాటు చేస్తే ప్రయాణికుల బోట్లు నడిపేందుకు పలు సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విజయవాడలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ 'బిజినెస్ ఎక్స్‌పో'లో పర్యాటక సంస్థల ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇప్పటికే అంతర్వేదిలో పర్యాటకానికి అవసరమైన వనరులు సమకూర్చారు.
- గోదావరిలో రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని ధవళేశ్వరం నుంచి కడియపులంక వరకు బోటు విహారానికి సన్నాహాలు చేస్తున్నారు. సీతానగరం, నిడదవోలు, ఆత్రేయపురం, లొల్లలాకులు, పాశర్లపూడి, దిండి తదితర ప్రాంతాల్లోనూ ఆ దిశగా ప్రతిపాదనలున్నాయి. ఇప్పటికే పాపికొండల యాత్రకు యాత్రికులు వెళ్తున్నారు. ఆ ప్రాంతంలో పర్యాటక భవనాలు, రిసార్ట్‌లు నిర్మించే యోచన ఉంది.

### కేరళ తరహాలో జల క్రీడలు

- ఏటా సంక్రాంతికి ఆత్రేయపురంలో కేరళ తరహాలో పడవల పోటీ, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానంలో బీచ్ ఫెస్టివల్‌ను అధికారికంగా నిర్వహించడానికి సర్కారు సుమారు రూ.3 కోట్ల మేర కేటాయించింది.
- రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు, సరస్వతి ఘాట్, కోనసీమలో మూడు హౌస్ బోట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తవడంతో వీలైనంత త్వరగా పట్టాలెక్కే అవకాశం ఉంది. రాజమహేంద్రవంలో వాటర్ స్పోర్ట్స్, స్పీడ్ బోట్లను ప్రైవేటు నిర్వాహకులు ఏర్పాటు చేయనున్నారు.

# అతివకు రుణం.. అభివృద్ధి పథం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)లోని మహిళల అవసరాన్ని బట్టి రుణాల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గతంలో మాదిరిగా సంఘం మొత్తానికి కాకుండా ఆ సంఘ సభ్యుల్లో ఎవరెవరికి ఎంతెంత రుణం అవసరమో తెలుసుకుని ఆ మేరకు రుణాలు అందించేందుకు ఇటీవల జిల్లాలో సర్వే చేశారు. ఆ ప్రకారం రుణాలు మంజూరు చేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రతి మహిళ తమ కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలవాలనే లక్ష్యంతో ఎస్‌హెచ్‌జీలకు ఊతమిస్తుంది. పొదుపు ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు పొంది స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటు అందిస్తుంది. బ్యాంకు లింకేజీ రుణాల మంజూరులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి తెలిపారు. స్త్రీనిధి రుణాల మంజూరులో జిల్లా 6వ స్థానం, ఉన్నతి ద్వారా రుణాల మంజూరులో 9వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మొత్తం 99,013 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ.969.2 కోట్ల రుణాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటివరకు జిల్లాలో 78,781 మంది సభ్యులకు రూ.726.5 కోట్లు ఇచ్చారు. ఇంకా 20,232 మందికి రూ.242.8 కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సమావేశంలో స్వయం సహాయక సంఘ సభ్యులు

### జిల్లాలో ఇలా..

| | |
|---|---|
| గ్రామీణ ప్రాంత ఎస్‌హెచ్‌జీలు | 30,950 |
| సంఘాల్లో మొత్తం సభ్యులు | 3,03,958 |
| బ్యాంకు లింకేజీ రుణాలు పొందినవారు | 53,928 |
| స్త్రీనిధి రుణాలు మంజూరైనది | 24,111 |
| ఉన్నతి ద్వారా రుణాలు పొందినది | 742 |
| ఈ ఏడాది అందించిన మొత్తం రుణం | రూ.726.5 కోట్లు |

### అందించిన రుణాలిలా..

- స్వయం సహాయక మహిళా సంఘాల్లోని 76,080 మందికి బ్యాంకు లింకేజీ రుణాలు రూ.748.22 కోట్లు లక్ష్యం కాగా 53,928 మందికి రూ.572.04 కోట్లు మంజూరు చేశారు.
- స్త్రీనిధిలో 21,283 మందికి రూ.212.7 కోట్ల రుణాలు ఇవ్వాల్సి ఉండగా 24,111 మందికి 150.1 కోట్లు మంజూరయ్యాయి.
- ఉన్నతిలో 1,650 మందికి రూ.8.25 కోట్లకు ఇప్పటివరకు 742 మందికి రూ.4.32 కోట్లు ఇచ్చినట్లు డీఆర్‌డీఏ పీడీ తెలిపారు.

## టెట్ పరీక్షకు 1,526 మంది హాజరు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్-2025) అయిదో రోజైన ఆదివారం ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం పేపరు మిల్లులోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో ఉదయం పరీక్షకు 955 మందికి 895 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 700 మందికి 631 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# చలికాలం.. ఆయుర్వేదంతో ఆరోగ్యం

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

చలికాలంలో శరీర ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. ఆ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే కాలానుగుణ జీవన, ఆహారశైలిని మార్చుకోవాలని రాజమహేంద్రవరంలోని **ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రమేష్** సూచిస్తున్నారు. చలికాలంలో వచ్చే ఇబ్బందులు, వాటికి ఆయుర్వేదంలో ఎలా అధిగమించాలో 'న్యూస్‌టుడే'కు వివరించారు.

### శ్వాసకోశ ఇబ్బందులు..

చలికాలంలో దగ్గు, జలుబు, న్యుమోనియా, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతుంటారు. నిత్యం ఆయుర్వేద క్లినిక్‌కు 50 శాతం మంది రోగులు ఈ ఇబ్బందులతోనే వస్తున్నారు.

### ఇలా అధిగమిద్దాం..

ఉదయం లేచిన తర్వాత, రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని నీటిని నిమ్మరసంతో తాగితే మేలు. పెద్దలు టీ, మజ్జిగ చేసుకునేటప్పుడు అందులో కొంచెం శొంఠి పొడి కలిపితే కఫ, వాత దోషాలను నివారించవచ్చు. ఫ్రిజ్‌లో ఉంచిన పదార్థాలు తినకూడదు. మాస్కులు ధరిస్తే మేలు.

### చర్మంపై తీవ్ర ప్రభావం

చర్మం పొడిబారిపోయి దురద, పుండ్లు ఏర్పడడం వంటివి ఎక్కువవుతాయి.

### ఈ జాగ్రత్తలు అవసరం..

కొబ్బరి నూనె, ఆవనూనె రాసుకుని స్నానం చేస్తే చర్మాన్ని కాపాడుకోవచ్చు. బయట దొరికే గ్లిజరిన్ సబ్బులు వాడుకోవాలి. చర్మ సమస్యలతో వచ్చిన వారికి మహామాష తైలం ఇస్తున్నాం. తిక్తక ఘృతం, పంచతిక్త ఘృతం, నింబాది చూర్ణం అందుబాటులో ఉన్నాయి.

### వాత సమస్యలు..

వృద్ధులు, 50 ఏళ్లు పైబడిన వారికి వాత సంబంధిత ఇబ్బందులు పెరగడం వల్ల కండరాలు పట్టేసి నొప్పులు తీవ్రతరమవుతాయి. పూర్వపు కీళ్లనొప్పులుంటే అవి తిరగబడి మరింతగా ఇబ్బంది పడతారు.

### ఏం చేయాలంటే..

స్నానం సమయంలో నువ్వుల నూనెతో తయారు చేసిన తైలం రాసుకుని గంట ఎండలో కూర్చొని స్నానం చేస్తే ఉపశమనం ఉంటుంది. జీజీహెచ్‌లోని ఆయుర్వేద క్లినిక్‌లో కండరాల నొప్పులకు యోగరాజు, కైశోర, సింహనాథ గుగ్గులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఎముక బలానికి లాక్షాది గుగ్గులు అనే మందు ఉంది. వీటిని వాడుతూ వ్యాయామాలు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# రేగి వడియం @ ఊనగట్ల

రేగి వడియాలంటే ఇష్టపడని వారుండరు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వీటి రుచిని ఆస్వాదిస్తారు. ఇవి చాగల్లు మండలం ఊనగట్లలో ఏడాది పొడవునా దొరుకుతాయి. ఇక్కడి నుంచి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్రలోని కిరాణా దుకాణాలకు ఏడాది పొడవునా సరఫరా చేస్తుంటారు. – న్యూస్‌టుడే, చాగల్లు

### ఆ కుటుంబాలకు ఇదే ఆధారం..

ఊనగట్లలో వడియాల తయారీ చిన్న పరిశ్రమను తలపిస్తుంటుంది. సుమారు వంద నుంచి నూట యాభై కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒకరకంగా ఇది వంశపారంపర్య వ్యాపారంగా సాగుతోంది. వర్షాల సమయంలో మాత్రం తయారీకి ఆటంకం ఏర్పడుతుంది.


రేగి వడియాలు ప్యాకింగ్ చేస్తున్న మహిళ

### పండ్ల దిగుమతి ఇలా..

హైదరాబాద్, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి రేగి పండ్లను దిగుమతి చేసుకుంటారు. అవి డ్రైఫ్రూట్ రూపంలో రావడంతో ఎక్కువ నిల్వకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. టన్ను పండ్లు రూ.28 వేల నుంచి రూ.30 వేలకు కొనుగోలు చేసి, తయారైన వడియాలను పెట్టెకు వంద చొప్పున ప్యాకింగ్ చేస్తారు. 'కుటీర పరిశ్రమగా సాగుతున్న రేగి వడియాల తయారీ కేంద్రాలను ప్రభుత్వం గుర్తించాలి. చిన్న తరహా పరిశ్రమగా గుర్తించి రాయితీలపై రుణాలు ఇవ్వాలి' అని వడియాల తయారీ కేంద్ర నిర్వాహకుడు రామకృష్ణ అన్నారు.

## అదిగో పులి..

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం మండల పరిధిలోని భీమోలు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వచ్చిన పుకార్లపై ప్రజలు భయపడొద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా రేంజ్ అధికారి దావీదు రాజునాయుడు సూచించారు. అటవీ ప్రాంతంలో పులి తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఆదివారం అధికారులు, సిబ్బంది ముమ్మర తనిఖీలు చేశారు. సుమారు 6 చోట్ల ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎక్కడైనా కదలిక ఉంటే వెంటనే తెలుస్తుందని ఎఫ్ఆర్‌వో అన్నారు. ప్రస్తుతం పులికి సంబంధించిన ఎటువంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు. ఆయన వెంట డీఆర్వో వేణుగోపాల్, ఇతర సిబ్బంది ఉన్నారు.

భీమోలు అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

## ఇదిగో మొసలి..

అయినవిల్లి, న్యూస్‌టుడే: మొసళ్లను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎఫ్‌వో ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రత్యేకంగా తయారు చేసిన బోను తీసుకువచ్చి ముక్తేశ్వరం రేవు సమీపంలో ఏర్పాటు చేశారు. 12 అడుగుల పొడవు గల ప్రత్యేక ఇనుపబోను తయారు చేయించారు. రెండు మూడు రోజుల్లో బోనులో చిక్కే అవకాశం ఉందన్నారు.

బోను పరిశీలిస్తోన్న డీఎఫ్‌వో ప్రసాద్

# నాగావ్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు.. ప్రయాణికుల ఆందోళన

అన్నవరం, న్యూస్‌టుడే: సిల్చార్ నగరం నుంచి తాంబరం వెళ్లే రైలు బోగి కింద భాగం నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. రైలును అన్నవరం స్టేషన్‌లో నిలిపివేసి మరమ్మతులు చేసి వదిలారు. విశాఖపట్నం - రాజమహేంద్రవరం మార్గంలో వెళ్తున్న రైలు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఎస్ 7 బోగీ కింద నుంచి పొగలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు అన్నవరం స్టేషన్‌లో ఉదయం 10.30 గంటలకు నిలిపివేశారు. ఇక్కడ రైలుకు హాల్ట్ లేదు. సాంకేతిక బృందం అక్కడకు చేరుకుని పరిశీలించారు. బోగి కింద భాగంలో బ్రేక్ వద్ద సాంకేతిక సమస్య కారణంగా పొగలు వచ్చాయని గుర్తించి మరమ్మతులు చేశారు. సుమారు 20 నిమిషాల తర్వాత రైలు ముందుకు వెళ్లింది. పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెంది స్టేషన్‌లో ఒక్కసారిగా దిగిపోయారు. సాంకేతిక సమస్య అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

అన్నవరం స్టేషన్‌లో నిలిపిన రైలు, బయటకు వచ్చిన ప్రయాణికులు
పొగలు వచ్చిన బోగీ కింద భాగం

# సనాతన ధర్మధ్వజం ఎగురవేయడమే లక్ష్యం

శ్రీరాజేంద్ర దాస దేవాచార్య మహరాజ్ స్వామీజీ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భారతావనిలో వైదిక ధర్మాన్ని ప్రతిష్ఠించి, సనాతన ధర్మ ధ్వజం ఎగురవేయడమే సంకల్పమని పరమపూజ్య శ్రీరాజేంద్ర దాస దేవాచార్యాజీ మహరాజ్ స్వామీజీ అన్నారు. బృందావనంలోని శ్రీరైవాసం నుంచి శిష్యగణంతో గోదావరి పరిక్రమ (ప్రదక్షిణ) క్రతువులో భాగంగా శనివారం రాత్రి కొవ్వూరు గౌడీయమఠానికి వచ్చారు. ఆదివారం ఉదయం నిత్యపూజ అనంతరం గోష్పద క్షేత్రం ప్రధాన రేవులో పుణ్య నదీ స్నానమాచరించారు. ఆయన మాట్లాడుతూ గోదావరిని పురాణాల్లో దక్షిణ గంగ అని పిలుస్తారన్నారు. గోష్పద క్షేత్రం, గోదావరి తీరంలో సప్తరుషులు నడయాడారని, ఇక్కడి నుంచి గోదావరి ఏడు పాయలుగా పయనించి సముద్రంలో కలుస్తుందన్నారు. ఇది విడివడేముందు ఈ ప్రదేశం ప్రధాన తీర్థంగా ఉందన్నారు.

గోష్పద క్షేత్రం ప్రధాన రేవులో పుణ్యస్నానం చేస్తున్న స్వామీజీ

### శిష్యులు, భక్తుల సందడి..

బృందావనం, అయోధ్య, చిత్రకూటం, ఓంకారేశ్వరం, ఉజ్జయిని, ద్వారక, జగన్నాథపురిల నుంచి సుమారు 500 మంది శిష్యులు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, భక్తులు స్వామీజీని దర్శించుకున్నారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ నివాసానికి ఆయన వచ్చి భక్తులను ఆశీర్వదించారు. డిసెంబరు 5న గోదావరి నది ఆవిర్భావ ప్రదేశం నాసిక్‌లో పరిక్రమ ప్రారంభమైందన్నారు.


ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669



ఎగ్జిబిషన్

రాజమండ్రి

పటోల & బంధేజ్

చీరలు & దుపట్టాలు,

15 / 16 డిసెంబరు 2025

ఉ.10 గం-రాత్రి 8గం

అమ్మకం పూర్తిగా 20% తగ్గింపు

@మంజీరా ప్రీమియర్

డి.నం.55-10-21, సువిశేష పురం

ఆర్ట్స్ కాలేజి రోడ్డు, తూర్పుగోదావరి, రాజమండ్రి

ఫోన్ 8735886935


(c) eenadu

న్యూస్‌టుడే - ఆలమూరు, రావులపాలెం పట్టణం

# జ్ఞాన సముపార్జన.. నైపుణ్య శిక్షణ

● సమ్మిళిత విద్యా కేంద్రాలుగా గ్రంథాలయాలు

చిన్నారులు మొదలుకుని వయోజనులు, సామాన్య ప్రజలతోపాటు పోటీపరీక్షల అభ్యర్థుల వరకు అందరికీ ఉచితంగా జ్ఞానాన్ని అందించేవి పౌరగ్రంథాలయాలే. కరోనా మహమ్మారి తరువాత సామాన్యుల్లో పఠనం పట్ల ఆసక్తి తగ్గినా, విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు నిత్యం గ్రంథాలయాలకు వచ్చి అక్కడున్న పుస్తకాలను వినియోగించుకుంటున్నారు. కాలానుగుణంగా పుస్తకాలతో పాటు డిజిటల్ విద్యను సైతం సామాన్యులకు చేరువ చేయాలన్న తలంపుతో కర్ణాటకకు చెందిన శిక్షణ ఫౌండేషన్, డెల్ కంపెనీ సంయుక్తంగా రెండు కంప్యూటర్లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్‌లతో ఇంక్లూసివ్ సెంటర్లను ఏర్పాటు చేశాయి. వీటిద్వారా ఉచితంగా డిజిటల్ విద్యను అందుకునే అవకాశం దక్కింది.

పాఠాలు వింటున్న బాలికలు

## గత నెలలో ప్రారంభం..

ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్రంలో 200 గ్రంథాలయాల్లో ఇంక్లూసివ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వీటిని గత నెలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలో ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో ఏడాది పాటు అంతర్జాల సౌకర్యం అందుబాటులో ఉంటుంది. డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమాలు, పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్ మొదలైన సమాచారాన్ని కంప్యూటర్లలో నిక్షిప్తం చేశారు.

## విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులకు ఉపయోగం

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన సమాచారం కోసం పోటీ పరీక్షల అభ్యర్థులకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు సంబంధించిన విద్యా పాఠాలు స్మార్ట్ టీవీ ద్వారా వీక్షించవచ్చు. స్మార్ట్ ఫోన్ ద్వారా బ్యాంకింగ్, యూపీఐ వాడకం మొదలైన అంశాలను గ్రంథపాలకులు విద్యార్థులకు వివరిస్తారు.

## అందరూ వినియోగించుకోవాలి

ఉచితంగా అంతర్జాల సౌకర్యంతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన అంశాలు కంప్యూటర్లలో నిక్షిప్తమై పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలి. ఆలమూరు గ్రంథాలయంలో ఇన్‌క్లూసివ్ సెంటర్‌కు ఆదరణ బాగుంది.

- తమ్మా నమశ్శివాయ, గ్రంథాలయాధికారి, ఆలమూరు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో.. పౌర గ్రంథాలయాలు: 120 కేంద్రాలు ఏర్పాటు చేసినవి: 20

# రామోజీ ఫిల్మ్‌సిటీ వేదిక.. శీతాకాల వేడుక

● ఈ నెల 18 నుంచి నెల రోజుల సందడి

18th DEC '25 - 18th JAN '26

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: శీతాకాల వేడుకలతో పర్యాటకులను అలరించేందుకు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ముస్తాబైంది. ఈనెల 18వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే 'వింటర్ ఫెస్ట్'కు సర్వంసిద్ధమైంది. జనవరి 18 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో సందర్శకులను మంత్రముగ్ధులను చేసే సినీ మ్యూజిక్‌తో పాటు సెలవు రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొనే కార్నివాల్ పరేడ్, మనసుకు హత్తుకొనేలా మ్యూజికల్ గ్లో గార్డెన్, మాయాలోక్‌తో పాటు మరెన్నో అలరించే అంశాలు ఉండనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా స్టూడియో టూర్..** వేడుకల్లో భాగంగా ఫిల్మ్‌సిటీ సందర్శన సమయం రాత్రి 9 గంటల వరకు పొడిగించారు. ప్రకాశవంతమైన వాతావరణంలో ఫిల్మ్‌సిటీ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో ఫెస్ట్‌ను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు అద్వితీయ సినిమా సెట్ల సందర్శనతో సాగే స్టూడియో టూర్ ఆకట్టుకుంటుంది. లైవ్ షోలు, వైల్డ్ వెస్ట్ స్టంట్స్, ఉత్తేజకరమైన రైడ్స్, సాహసాల వేదిక సాహస్, బర్డ్ పార్కు సందర్శనతో ఇదో మధుర జ్ఞాపకంగా మలుచుకోవచ్చు.

## న్యూ ఇయర్ పార్టీ...

డిసెంబరు 31న నూతన సంవత్సరంలోకి అడుగిడే క్షణాలను సరికొత్త ఉత్సాహంతో గడిపేందుకు రామోజీ కార్నివైబ్ 2026 ఉంటుంది. వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్ డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. అపరిమిత ఆహారం, పానీయాలతో వీనులవిందైన సంగీత ప్రదర్శనలతో సాగే ఈ వేడుకలో సందర్శకులు పాలుపంచుకోవచ్చు.

## అబ్బురపరిచే కార్నివాల్

అద్భుత శకటాలతో అబ్బురపరిచే కార్నివాల్ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో చిన్నా పెద్దా అందరూ సరికొత్త అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. మిరుమిట్లు గొలిపే ఫిల్మ్‌సిటీ అందాల మధ్య ఆనందతీరాలను చవిచూడవచ్చు. మ్యూజికల్ గ్లో గార్డెన్ సరికొత్త లోకాన్ని కళ్ల ముందుకు తెస్తుంది. ఐకానిక్ సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ సందర్శనతో వీక్షించవచ్చు. సెట్ల డిజైన్, కళాత్మక నైపుణ్యంతో తెరవెనుక జరిగే కృషి కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది.

● 'వింటర్ ఫెస్ట్'కు సర్వం సిద్ధం

## ప్రత్యేక ప్యాకేజీలు, సౌకర్యాలు

వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకలకు వివిధ ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ కోసం క్రెష్ సౌకర్యాలను పర్యాటకులు వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకు:
www.ramojifilmcity.com
లాగిన్ అవ్వండి.
కాల్ సెంటర్ నంబర్: 7659876598

# అన్ని మతాలను గౌరవించాలి

● క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, న్యూస్‌టుడే: మన మతాన్ని ప్రేమించడంతోపాటు అన్ని మతాలను గౌరవించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. నల్లజర్ల శివారు పోతవరం రోడ్డులో ఉన్న ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం రాత్రి నియోజకవర్గస్థాయి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రసంగీకులు ప్రత్యేక ప్రార్థనలు చేయడంతో పాటు క్రీస్తు సందేశాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఆచరించి చూపిన ప్రేమ, కరుణ, దయ, శాంతి, సామరస్యాలు అనుసరణీయమన్నారు. రాష్ట్రంలో అన్ని మతాలు, భాషలు, ఆచారాలు ఉన్నాయని అందరిని గౌరవించి సమదృష్టిగా చూడాలన్నారు. క్రిస్మస్ పండుగలాగే సంక్రాంతి, రంజాన్ తదితర పండుగలను ఘనంగా నిర్వహించుకుందామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటోందన్నారు. రాష్టాభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రార్థనలు చేయాలన్నారు. సినీనటుడు, సువార్త ప్రసంగీకుడు రాజా మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ఇంత ఘనంగా జరపడం ఆనందకరమైన విషయమన్నారు. వేడుకను తిలకించడానికి విశ్వాసకులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరాజు, పాల్గొన్న విశ్వాసులు

# బృంద స్ఫూర్తికి క్రీడలు దోహదం

**అనపర్తి గ్రామీణం:** బృంద స్ఫూర్తికి, శారీర ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న రాజమహేంద్రవరం డివిజన్ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి కోరుకొండ, రంగంపేట మండలాల ఉపాధ్యాయుల క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

# పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నేడు

బొమ్మూరు, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయంలో సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహిస్తున్నామని వీసీ డి.మునిరత్నం నాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌కంట్యాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్ హాజరవుతారని తెలిపారు. విద్యార్థులతో చర్చ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

# ప్రజలంతా ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి

రాజానగరం: ప్రజలు ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకుని, నిత్యం భగవద్గీత పఠనం చేయాలని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ అన్నారు. పాత వెలుగుబందలో ఆదివారం హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను స్థాపించి శత వసంతాలు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా హిందూ బంధువులందరూ కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. గడప లోపలే కులం-గడపదాటితే మనమంతా హిందువులమన్నారు. కార్యక్రమానికి పెద్దిశెట్టి గోవింద అధ్యక్షత వహించగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు, విద్యారణ్యాశ్రమాధిపతి సాధు ప్రసాద్ వరేణ్యం, శ్యామాంగ శ్రీనివాస్‌దాస్, మోహనకృష్ణ, పద్మావతి తదితరులు ప్రసంగించారు. చిన్నారులు కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రజ్ఞానంద సరస్వతి

# సమాజ హితమే సంకల్పం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: సమాజ హిత సంకల్పంతో శాస్త్ర, సంప్రదాయాలను సంరక్షించే బ్రాహ్మణ పురోహిత వృత్తి పవిత్రమైనదని తెదేపా పొలిట్‌బ్యూరో పొలిటికల్ కార్యదర్శి టి.డి.జనార్దన్ అన్నారు. కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని ధర్మజ్ఞాన కళావేదిక వద్ద ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో వేద శాస్త్ర పురోహిత, స్మార్త విద్వత్ మహాసభ, పురోహిత అర్హత పరీక్షలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 350 మంది పురోహితులు, వేద పండితులు రాగా కార్యక్రమానికి సమాఖ్య గౌరవాధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. స్మార్త పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు, జనార్దన్ పట్టాలను అందజేశారు. వారు మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ఉందన్నారు.

పురోహితులకు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, పొలిట్‌బ్యూరో సభ్యుడు జనార్దన్

సమాజంలో శాంతి సౌఖ్యాలకు బ్రాహ్మణులు చేస్తున్న సేవలను వెలకట్టలేమన్నారు. కపిలవాయి రామశాస్త్రి సోమయాజి, ఉమ్మడి పశ్చిమ జిల్లా శ్రీ గాయత్రి లక్ష్మీగణపతి పురోహిత సంఘం అధ్యక్షుడు వారణాసి హనుమంతరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# పింఛను కోసం పోరాటం

తన భర్త మృతిచెంది రెండేళ్లు అయినా ఇప్పటివరకు పింఛను మంజూరు చేయలేదని ఆమె వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కడియం మండలం కడియపులంక గ్రామపంచాయతీ పరిధి దోశాలమ్మ కాలనీకి చెందిన భీమిని సుభద్రమ్మ నర్సరీల్లో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆమె భర్త భీమిని తాతారావు అనారోగ్య కారణాలతో 2023లో మృతిచెందారు. అప్పటి నుంచి ఆయన పేరు మీద ఉన్న పింఛన్‌ను తన పేరుపై బదిలీ చేయాలని కోరుతున్నారు. పలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించి పింఛను బదిలీ చేయాలని ఆమె కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను సంప్రదించగా సమస్య పరిష్కారానికి సిబ్బందికి సూచనలు చేశామన్నారు.

– న్యూస్‌టుడే, కడియం

ధ్రువపత్రాలు చూపుతున్న సుభద్రమ్మ

# స్వామివారి రథానికి మరమ్మతులు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య రథాన్ని మరమ్మతుల నిమిత్తం షెడ్ నుంచి ఆదివారం బయటకు తీశారు. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా రథానికి అర్చకస్వాములు, ఏసీ నాగవరప్రసాద్, వాహన సేవకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గోవిందనామ స్మరణతో బయటకు తీసుకొచ్చారు. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తారు. అనంతరం అనుమతి పత్రాన్ని అందిస్తారు. జనవరి 29న రథోత్సవం జరగనుంది.

# ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం మండపేట మండలం ద్వారపూడి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ముందుగా ఆంధ్ర శబరిమలగా పేరుగాంచిన అయ్యప్పస్వామి ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ప్రసిద్ధ శైవక్షేత్రం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, న్యాయమూర్తులు బెన్నియ్య నాయుడు, ఎల్.వెంకటేశ్వరరావు, శేషయ్య, ఆలమూరు కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్, మండల అధికారులు, పోలీస్ సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌తో జిల్లా న్యాయమూర్తులు

# వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బిక్కవోలు: తూర్పుతిరుమలగా పేరొందిన బలభద్రపురం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్నవేంకటేశ్వర స్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. దాదాపు 15 మంది రుత్వికులు దీక్షాధారణ, ధ్వజారోహణం, విష్వక్సేన వాహనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పవళింపు సేవతో తొలిరోజు కార్యక్రమం ముగిసింది.

అలంకరణలో స్వామివారు

## ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 17,500 |
| పాతకాయ: గండేరా | 28,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 27,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 15,000-16,000 |
| కొత్త (పచ్చి) కాయ | 14,000-15,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

| | |
|---|---|
| ఫారంరేటు | 120-00 |
| రిటైల్ లైవ్ | 147-00 |
| డ్రెస్డ్ | 213-00 |
| స్కిన్‌లెస్ | 243-00 |

# ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి: ఏపీజీఈఏ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.35 వేల కోట్ల బకాయిల విషయంలో ఏళ్లతరబడి తాత్సారం చేయడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను తక్షణం నెరవేర్చాలన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఏపీజీఈఏ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు 2024-25 బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ఆందోళనకరమన్నారు. ఉద్యోగులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలనే అడుగుతున్నారన్నారు. ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను వేయకపోవడం అన్యాయమన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని తమ సంఘం కోరుతుందన్నారు.

మాట్లాడుతున్న ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

అనంతరం సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలకు తగిన నిధులు కేటాయించాలని, లేని పక్షంలో తమ సంఘం తగిన సమయంలో తగిన విధంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగసాయి, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శులు భూపతి రాజు, రవీంద్రరాజు, కేదారేశ్వర రావు, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# అభిమాన నేతకు అంతిమ వీడ్కోలు

అమలాపురం పట్టణం: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి అంత్యక్రియలు ఆదివారం అమలాపురంలో నిర్వహించారు. శనివారం దిల్లీలో మృతిచెందిన ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి అంబులెన్స్‌లో ఇక్కడికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, దళిత నాయకులు స్థానికంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీలు అనురాధ, మహేశ్వరరావు, మాజీ మంత్రి వీరరాఘవులు, నేతలు జగ్గిరెడ్డి, వరప్రసాద్‌రావు, రాజేశ్వరిదేవి, అముడా మాజీ ఛైర్మన్ డేవిడ్‌రాజు నివాళి అర్పించారు. ఆయన కుమారుడు రాజ్‌కృష్ణ, కుమార్తెలు కృష్ణసుధ, లక్ష్మీకృష్ణ, వంశీకృష్ణ తదితరులను ఓదార్చారు. రామకృష్ణారావు, సుభాషిణి పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్- డి. నెం.5-2-183/184, 3వ అంతస్తు, మోదీ స్క్వేర్, రాణిగంజ్, సికింద్రాబాద్- 500003.
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌సిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగస్లాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి- 400708.
నమోదిత కార్యాలయం: 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదురుగా, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.
స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 8(6) మరియు 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
[illegible]
రిజర్వు ధర (రూ.లలో): రూ. 85,24,800/-
ధరావతు (రూ.లలో): రూ. 8,52,480/-
బిడ్ పెంపుదల సొమ్ము: రూ. 10,000/-
ఇ-వేలం తేదీ: 31-12-2025 ఉ. 11.00 నుండి మ. 12.00 గం. https://www.bankeauctions.com
[illegible]
https://www.axisbank.com/auction-retail
https://www.bankeauctions.com
తేది: 15-12-2025 స్థలం: తూర్పు గోదావరి
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
[illegible]
స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన
[illegible]
రిజర్వు ధర (రూ.లలో): రూ.24,80,000/-
ధరావతు (రూ.లలో): రూ. 2,48,000
బిడ్ పెంపుదల సొమ్ము: రూ. 10,000/-
ఇ-వేలం తేదీ: 31.12.2025 ఉ. 11.00 నుండి మ. 12.00 గం.
[illegible]
https://www.axisbank.com/auction-retail
https://www.bankeauctions.com
తేది: 15.12.2025 స్థలం: తూర్పు గోదావరి
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

EENADU Classifieds
BUSINESS SERVICES
FINANCIAL SERVICES
JOBS
MARKETING/ SALES
Wanted FMCG field sales executive & delivery boys. 2 yrs exp Must have bike - contact on 9100940494
Wanted Tele-callers. Experienced/ Insurance/ Age: Above 30 years/ Female. Kakinada. Contact Cell: 93494 21277.
[illegible]
EENADU for Advertisement Contact: 8008597607
గమనిక
[illegible]

# రాజమహేంద్రవరం

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

**వీరవాసరం:** పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఈనెల 12 నుంచి జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి(ప్రథమ), విజయనగరం(ద్వితీయ), శ్రీకాకుళం(తృతీయ), బాలికల విభాగంలో విజయనగరం(ప్రథమ), పశ్చిమగోదావరి(ద్వితీయ), తూర్పుగోదావరి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను డీఈవో ఇ.నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్ నాయుడు అందజేశారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## సోగ్గాడు సంగీత విభావరి

**ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే:** నగరంలోని విక్రమహాలులో సోగ్గాడు శ్రీశోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆపాత మధురాలు త్రి స్వర రాగ తరంగిణి అనే పేరుతో పాటలను ఆలపించారు. పాత, కొత్త చిత్రాల్లోని పాటలతో జరిగిన సినీ సంగీత విభావరి ఆదివారం సాయంత్రం కోలాహలంగా జరిగింది. వారాంతం కావడంతో నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించారు. కార్యక్రమ నిర్వాహణ శోభన్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు దొండపాటి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

## ఆర్టీసీ నవజనార్దన క్షేత్రదర్శిని

### 28, 4 తేదీల్లో ప్రత్యేక యాత్ర బస్సులు

యాత్రకు ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సు

ధనుర్మాసంలో ఆలయాలను సందర్శించే భక్తుల కోసం నవజనార్దన క్షేత్రదర్శిని పేరిట ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. రాజమహేంద్రవరం డిపో నుంచి ఈ నెల 28న, వచ్చేనెల 4న నవజనార్దన క్షేత్రాలకు నడిపేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను సిద్ధం చేస్తుంది. ఒకే రోజు తొమ్మిది క్షేత్రాలను దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్(డీఎం) మాధవ్ తెలిపారు. భక్తుల డిమాండ్‌కు అనుగుణంగా నవజనార్దన క్షేత్రాలకు ఎన్ని బస్సులైనా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఒకరోజు యాత్రలో భాగంగా ధవళేశ్వరం, మడికి, జొన్నాడ, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర, కోటిపల్లి క్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. దీనికి టికెట్ ధర ఒక్కొక్కరికీ రూ.450గా నిర్ణయించారు. ముందుస్తు టికెట్ల బుకింగ్, ఇతర వివరాల కోసం 95023 00189 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు. ధనుర్మాసంలో ఆలయాలను సందర్శించే భక్తులు ఆర్టీసీ కల్పిస్తున్న నవజనార్దన క్షేత్రదర్శిని బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

## ఆదాయం ఘనం.. సిబ్బంది అంతంత మాత్రం..!

### లోపభూయిష్టంగా రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్

**దేవీచౌక్, న్యూస్‌టుడే:** రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీలో సిబ్బంది కొరతతో ఉద్యోగులపై పని భారం పెరుగుతోంది. ఈ మార్కెట్ ద్వారా ఏటా సుమారు రూ.3 కోట్ల ఆదాయం వరకు వస్తుంది.

12 మందికి గాను ప్రస్తుతం శాశ్వత ఉద్యోగులు ముగ్గురే ఉన్నారు. వీరిలో ఇద్దరు ఇతర మార్కెట్ కమిటీలకు బాధ్యులుగా కూడా ఉండటం గమనార్హం.

**కొన్ని ప్రధాన కారణాలు..**

- ★ 1996 నుంచి నియామకాలు లేకపోవడం
- ★ బదిలీ అయినా, పదవీవిరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారు రాకపోవడం.

**కమిటీలో తొమ్మిది ఖాళీలు..**

మార్కెట్ కమిటీలో మొత్తం తొమ్మిది ఖాళీలు ఉన్నాయి. ఇక్కడ మార్కెట్ కమిటీకి గ్రేడ్-1, గ్రేడ్-2 సెక్రటరీలు, ఎల్‌డీసీ-1, గ్రేడర్-1, ఏఎంఎస్-2, టైపిస్ట్-1, డ్రైవర్-1, వాచ్‌మెన్‌లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం గ్రేడ్-2 సెక్రటరీ, సహాయ సెక్రటరీ, సూపరింటెండెంట్ ఒకరు చొప్పున మాత్రమే ఉన్నారు. సెక్రటరీ జగ్గంపేట, సహాయ సెక్రటరీ నిడదవోలు మార్కెట్ కమిటీలకు బాధ్యులుగా కూడా వ్యవహరిస్తున్నారు. పొరుగు సేవల విధానంలో నలుగురు యార్డు అసిస్టెంట్లు, ఒక వాచ్‌మెన్, డాటా ఎంట్రీ అపరేటర్ ఒకరు పని చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగులపై భారం పడుతోంది.

| సంవత్సరం | ఆదాయం రూ.కోట్లలో |
|---|---|
| 2022–23 | 4.20 |
| 2023–24 | 3.25 |
| 2024–25 | 3.38 |

**మూడుగా విభజించి..**

రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఏటా రూ.3.38 కోట్ల ఆదాయం లభిస్తోంది. మార్కెట్ కమిటీ విడిపోయాక ఆదాయం తగ్గింది. 2020లో రాజమహేంద్రవరం మార్కెట్ కమిటీని మూడుగా విభజించారు. కొత్తగా రాజానగరం, రంపచోడవరం మార్కెట్ కమిటీలు ఏర్పడ్డాయి. దీంతో అప్పటి దాకా 17 మండలాల పరిధిలో ఉన్న మార్కెట్ కమిటీ ప్రస్తుతం రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం గ్రామీణం, కడియం కలిపి మూడు మండలాలకు పరిమితమైంది. దీనివల్ల ఆదాయం కూడా తగ్గింది.

**చెక్‌పోస్టులే కీలకం**

మార్కెట్ కమిటీకి ముఖ్యంగా చెక్‌పోస్టులు, ట్రేడర్ల ద్వారా ఆదాయం లభిస్తుంది. గతంలో దీని పరిధిలో రాజానగరం, కొంతమూరు, చెట్టి చెక్‌పోస్టులు ఉండేవి. విడిపోయాక కొంతమూరు ఒకటే మిగిలింది. ఈ ఆదాయంతోపాటు కోరుకొండరోడ్డులోని మార్కెట్‌యార్డు దుకాణాల ద్వారా కూడా ఆదాయం లభిస్తుంది. మార్కెట్‌యార్డులో మొత్తం 126 దుకాణాలు, అయిదు గోదాములు ఉన్నాయి. షాపుల ద్వారా నెలకు రూ.2.55 లక్షలతోపాటు గోదాముల ద్వారా ఆదాయం వస్తుంది.

చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, పోలరాజు

## మొక్కలు జీవన సందేశానికి ప్రతీకలు

**కడియం, న్యూస్‌టుడే:** ప్రకృతి వైభవాన్ని చాటే ప్రతి మొక్క జీవన సందేశాన్ని అందించే ప్రతీకలుగా నిలుస్తాయని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం కడియపులంకలోని ఆయన శిష్యుడు మల్లు విష్ణు స్వస్థలానికి విచ్చేశారు. కాసేపు విష్ణు కుటుంబ సభ్యులతో ముచ్చటించి, అనంతరం స్థానిక శివాంజనేయ నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత మల్లు పోలరాజు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చాగంటిని ఘనంగా సత్కరించారు. నర్సరీలో పచ్చని మొక్కలతో పాటు అరుదైన వందేళ్ల నాటి వృక్షాలను తిలకించారు. మానసిక ఆహ్లాదానికి నర్సరీలు చక్కని నిలయాలని కొనియాడారు. డాక్టర్ నీలకంఠరావు మాష్టారు, మల్లు శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వందేమాతర గీతం ఆలపిస్తున్న కవులు

## రచయితల సమితి సమావేశం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** ప్రతి నెలా రెండో ఆదివారం జరిగే కళాగౌతమి రచయితల సమితి సమావేశం వీరేశలింగం పురమందిరంలో నిర్వహించారు. వందేమాతరం గీతం 150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా హాజరైన కవులంతా వందేమాతర గీతం ఆలపించి సభను ప్రారంభించారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు బి.వి.ఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు బి.వి.రమాదేవి, సన్నిధి ధర్మేష్, మల్లెమొగ్గల గోపాలరావు, వి.వి.సుబ్రహ్మణ్యం, వరహాగిరి కృష్ణమోహన్ తదితరులు స్వీయకవితలు వినిపించారు. శ్రీపాద సీతామహాలక్ష్మి, కొత్తపల్లి సీతాదేవి, ఎస్.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం:** నాటక రంగానికి పతివాడ సూర్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం తీరనిలోటని పలువురు నివాళి అర్పించారు. వాణిజ్య పన్నులశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్, నాటక రచయిత పతివాడ సూర్యనారాయణ సంతాప సభ ఆదివారం ప్రకాశంనగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో జరిగింది. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి విజయలక్ష్మి, బొడ్డు బుల్లబ్బాయి, మహంతి లక్ష్మణరావు, ప్రసాదుల హరినాథ్ తదితరులు సూర్యనారాయణ సేవలను కొనియాడారు.

## వాలంటీర్ల శ్రమదానం

చెట్టు కొమ్మలు తొలగిస్తున్న విద్యార్థులు

కోటిపల్లి బస్టాండ్‌లోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో ఆదిత్య డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, యానిమేషన్ విభాగం ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం శ్రమదానం చేశారు. ఆవరణలోని పెద్ద ఎండిన చెట్లను, పనికిరాని మొక్కలను తొలగించారు. ఖాళీ స్థలంలో నేరేడు, మామిడి, పనస, ఉసిరి మొక్కలు నాటేందుకు అనువుగా సిద్ధం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, బి.రమాదేవి, పోలుకొండ సాయి, యూత్ రెడ్‌క్రాస్ కోశాధికారిణి వి.మహాలక్ష్మి, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యుడు సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

రౌడీషీటర్లకు, గంజాయి బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అప్పారావు

## సత్ప్రవర్తనతో లేకుంటే ఉపేక్షించం: ఎస్పీ

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** జిల్లాలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు సత్ప్రవర్తనతో ఉండకపోతే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల్లోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ చట్టం అమలు చేస్తామన్నారు. గంజాయి తాగడం, విక్రయించడం చేస్తే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయి వల్ల మానసిక, శారీరక సమస్యలతోపాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వంటివి బలహీనపడతాయని సూచించారు.

### సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలోని వివిధ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా 68 నంబరు లేని వాహనాలు, రికార్డు లేని ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 30 మంది పాత నేరస్థుల ఇళ్ల తనిఖీ చేశామన్నారు. జిల్లాలో ఎవరైనా సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

తిలకిస్తున్న నగరవాసులు

నదీమతల్లికి హారతి సమర్పిస్తున్న వేదపండితులు

## హారతి వైభవం

అఖండ గోదావరి తీరంలో గోదారమ్మకు హారతి అందించి నీరాజనం పలకడం ఓ పవిత్ర యజ్ఞం. రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో దేవాదాయశాఖ నిర్వహణలో జరుగుతున్న కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం వేదపండితులు 14రకాల హారతులను శాస్త్రోక్తంగా నదీమతల్లికి సమర్పించారు. సెలవురోజు కావడంతో నగరవాసులు పెద్దసంఖ్యలో హాజరై తిలకించారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

## కోటసత్తెమ్మకు ప్రత్యేకపూజలు

**నిడదవోలు, న్యూస్‌టుడే:** నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. ఈ రోజు అమ్మవారికి రూ.1.11 లక్షల ఆదాయం వచ్చింది. దర్శనాల ద్వారా రూ.31వేలు, అన్నదాన ట్రస్టుకు రూ.3,722, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.22,500, ఇతర టిక్కెట్ అమ్మకాల ద్వారా రూ.54,396 ఆదాయం వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ పాల్గొన్నారు.

## రాకపోకలకు అవస్థలు

రాజమహేంద్రవరంలో ప్రధాన ప్రాంతాలను కలిపే లక్ష్మీవారపుపేట వంతెన వద్ద ఆదివారం సాయంత్రం రెండు కార్లు రోడ్డుకు ఇరువైపుల నిలిపారు. చిన్న వంతెన దాటే అవకాశం లేక సుమారు 20 నిమిషాలు వాహనదారులకు అవస్థలు తప్పలేదు. రద్దీ సమయాల్లో ఇక్కడ ఎప్పుడూ ఇదే పరిస్థితి ఉంటుంది. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## మలుపులో సమస్య..

నగరంలోని చాలాచోట్ల మలుపుల దగ్గర కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. సోమాలమ్మ గుడి నుంచి శ్యామలానగర్, దానవాయిపేట వచ్చే దారిలో మలుపులు గుంతలతో కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. దీనికి తోడు రాత్రిపూట ఈ మలుపులో గుంత కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోటగుమ్మం

## వాలిపోయిన వృక్షం..

గోదావరి గట్టు రోడ్డు కంభం సత్రం వద్ద ఓ చెట్టు కొంత మేర వాలిపోయి పక్కనే ఉన్న ఆంజనేయ ఆలయ ప్రహరీపై పడింది. జనసంచారం ఉండే ఆలయం, నదీ తీరానికి సమీపంలో ఉండటంతో కంభం సత్రం వద్ద రోజూ పితృ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పెద్దగాలులు, భారీ వర్షాలు పడినప్పుడు పడిపోయే అవకాశం ఉంది. చెట్టు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వల్లభ గణపతి ఆలయ మార్గంలో ఓ వీధి మలుపులో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. పలుచోట్ల ఇదే పరిస్థితి. కొన్నిచోట్ల రోడ్లు వేసినా స్తంభాలు మాత్రం మార్చలేదు. రాత్రిపూట రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి, వీటిని సరిచేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## బాబోయ్ శునకాలు

నగరంలోని వీధి కుక్కల సమస్య ఎక్కువగా ఉంది. దానవాయి పేటలోని ఎస్.కే.వీ.టి.పాఠశాల గేటు ఎదురు వీధి, దాని పక్క వీధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నందం గనిరాజు జంక్షన్‌లో బాలుడిని కుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుక్కల దాడి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోటగుమ్మం

## నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

**టి.నగర్, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుంది. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.

## భార్య మందలించిందని భర్త బలవన్మరణం

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** భార్య మద్యం తాగొద్దన్నారని ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన వర్దనపు అనిల్‌కుమార్(41) దానవాయిపేటలోని ఓ హోటల్‌లో నైట్ సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నారు. గతంలో మద్యం తాగే అలవాటు ఉండడంతో తీవ్ర అనారోగ్యం పాలవగా దూరంగా ఉంటున్నారు. ఇటీవల నాలుగైదు రోజుల నుంచి మళ్లీ మద్యం తాగుతుండడంతో భార్య మందలించింది. ఆదివారం ఉదయం 07:30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వచ్చారు. అతని భార్య 8 గంటలకు విధుల నిమిత్తం పనిచేస్తున్న ఆసుపత్రికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఉరేసుకున్నారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని ఒకటో పట్టణ పోలీసులు వివరించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## యువకుడి అదృశ్యంపై కేసు

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** నగరంలోని మంగళవారపుపేటకు చెందిన 20 ఏళ్ల డిగ్రీ విద్యార్థి అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం ప్రకాశంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది.

## ప్లాంటు.. కాలుష్య కాటు

**రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే:** గోదావరి కాలుష్య నియంత్రణలో భాగంగా మురుగునీటిని శుద్ధి చేసే ప్రక్రియలో భాగంగా ఆవ ప్రాంతంలోని 30 ఎంఎల్‌డీ ప్లాంటు పూర్తిగా పాడైపోయింది. దీంతో మురుగునీటిని నేరుగా గోదావరిలోకి పంపింగ్ చేసేస్తున్నారు. తద్వారా నదీ కాలుష్యం పెరుగుతోంది. పదేళ్లుగా సేవలు అందించిన ఈ ప్లాంటు ప్రస్తుతం మూలకు చేరింది. మరొక పక్క అమృత్ 2.0లో భాగంగా సుమారు రూ.80 కోట్లతో 50 ఎంఎల్‌డీ ప్లాంటు నిర్మాణం జరుగుతుంది. ప్రస్తుతం పాతది పని చేయకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు.

మరమ్మతులకు గురైన శుద్ధి చేసే పాత ప్లాంటు

**రోజుకు 60 ఎంఎల్‌డీ వాడుక నీరు..**

నగరంలో మొత్తం 50 డివిజన్‌లు ఉన్నాయి. గృహాల నుంచి రోజుకు 60 ఎంఎల్‌డీ వాడుక నీరు బయటకు వస్తుంది. ఎగువ ఆవ ఛానల్ ద్వారా నేరుగా నదిలోకి చేరుతుంది. దిగువన ఆవ ఛానల్ ద్వారా ధవళేశ్వరం వద్ద కలుస్తుంది. అయితే ఆవ ప్రాంతంలో 30 ఎంఎల్‌డీ ప్లాంటు అందుబాటులో ఉంది. సుమారు ఏడు ఎకరాల్లో ప్లాంటు విస్తరించి ఉంది. ఆవ ఛానల్ ద్వారా వచ్చే నీటిని 30 ఎంఎల్‌డీ ప్లాంటు ద్వారా వివిధ దశల్లో శుద్ధీకరణ చేసి ఆ తర్వాత నదిలో కలుస్తుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి కొనసాగట్లేదు.

**రెండూ పనిచేస్తేనే ప్రయోజనం..**

మురుగులో కలిసిన ప్లాస్టిక్ వ్యర్థాలు క్యాన్సర్ కారకాలుగా మారుతున్నాయి. 50 ఎంఎల్‌డీ ప్లాంటు నిర్మాణం జరుగుతుండగా ప్రస్తుత అవసరాలకు సరిపోయే పరిస్థితి లేదు. 2040 నాటికి నగరంలో రోజుకు 90 ఎంఎల్‌డీ వాడుక నీరు బయటకు వస్తుందని అంచనా. ఈ నేపథ్యంలో కొత్త ప్లాంటు మాత్రమే కొంతమేర అవసరాలను తీర్చగలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పాతదాన్ని కూడా మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకొస్తే పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాగా ఇప్పటివరకు అలాంటి ప్రతిపాదనలు చేయలేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

## గోదారి తీరాన.. విజ్ఞాన పర్యటన

**ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే:** పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే సామాజిక, సాంస్కృతిక, సాహితీ అంశాలపై అవగాహన పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన పథకమే ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా. పీఎంశ్రీ పాఠశాలల్లోని విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నాయి. మలికిపురం మండలం బట్టేలంక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు 120 మంది ఎక్స్‌పోజర్ విజిట్ కోసం ఆదివారం రాజమహేంద్రవరం వచ్చారు. నగరంలోని సైన్స్ మ్యూజియం, రోడ్‌కం రైలు వంతెన, హేవలాక్ వంతెన, మహాకాళేశ్వర ఆలయం, ఇస్కాన్ మందిరం, కాటన్ మ్యూజియం, కాటన్ బ్యారేజీ, పుష్కరవనం, నగరపాలక సంస్థ కార్యాలయంలోని వందేళ్ల వృక్షాన్ని తిలకించారు.

## ఏఈఈల నూతన కార్యవర్గం ఎన్నిక

**ధవళేశ్వరం, న్యూస్‌టుడే:** జలవనరులశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ధవళేశ్వరంలోని గౌతమీ సదన్‌లో జరిగింది. నూతన అధ్యక్షురాలిగా ఎస్.షైనీ, అసోసియేట్ అధ్యక్షుడిగా వీరబాబు, ఉపాధ్యక్షులుగా సూజాత, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా రాజా జశ్వంత్, సహాయ కార్యదర్శులుగా రేణుకా చాందిని, అజీజ్, రవితేజ, హర్షవర్ధన్, కోశాధికారిగా చంద్రకాంత్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఆర్.పోచారావు, డీఈఈ నాగేంద్రప్రసాద్‌లు వ్యవహరించారు.

## కొత్త మోడల్ బైక్ ఆవిష్కరణ

ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి, నిర్వాహకులు

**టి.నగర్:** యూనిటీ టీవీఎస్ బైక్ షోరం ఆధ్వర్యంలో టీవీఎస్ అపాచీ 160 4వీ టీఎఫ్‌టీ 2025 మోడల్ న్యూ బైక్‌ను నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అదేవిధంగా అపాచీ 20వ ఏన్నివెర్సరీ ఎడిషన్‌ను సైతం ఆవిష్కరించారు. సీతంపేటలోని షోరూంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. వింటర్ ఉత్సవ్-మెగా ఎక్స్ఛేంజ్ కార్నివల్ ఆఫర్స్ ద్వారా ప్రజలకు తక్కువ ధరకు కొత్త ద్విచక్ర వాహనాలు, బైక్ సర్వీసును ప్రజలకు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 16 వరకూ ఇక్కడి షోరూమ్‌లో ఆఫర్ కొనసాగుతుందన్నారు. బిజినెస్ హెడ్ శ్రీరామ్, ఆపరేషన్స్ హెడ్ మహేష్, సర్వీస్ హెడ్ గిరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

**ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే:** రాజవోలు, రమాదేవి గార్డెన్స్‌లో రాజమండ్రి డివిజనల్ ఉద్యోగులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీస్తు జన్మ మానవాళికి శుభకరమైనదని, రక్షకుడిగా ఈ లోకానికి వచ్చారన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాక్షులు బద్దె జార్జి ఆంథోని, ఏపీటీఏ డా.భీమారావు, డా.ఎన్.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీరో పాయింట్ కూడలి వద్ద పేరుకుపోయిన ఇసుక

## రహదారిపై ప్రమాదకరంగా ఇసుక

**రాజానగరం, న్యూస్‌టుడే:** దివాన్‌చెరువు జీరో పాయింట్ కూడలి వద్ద జాతీయ రహదారిపై ఇసుక పేరుకుపోయింది. అది ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు, దివాన్‌చెరువు నుంచి గామన్ ఇండియా వంతెన రహదారి మీదుగా కొవ్వూరు వెళ్లే వాటికి, కొవ్వూరు నుంచి దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారి పైకి వచ్చే కార్లు, బస్సులు, భారీ వాహనాలు తదితరమైనవన్నీ ఈ కూడలి వద్దనే కలుస్తాయి. ద్విచక్రవాహనదారులు ఏకారణం చేతనైనా అకస్మాత్తుగా బ్రేకు వేసినప్పుడు ఇసుక మీదనే ఆగాల్సి ఉంటుంది. అప్పుడు వారు జారిపోయి వాహనాల కిందకు వెళ్లడమో లేదా అక్కడే పల్టీలు కొట్టడమో జరిగి క్షతగాత్రులవుతున్న సంఘటనలు పరిపాటిగా మారాయి. పేరుకుపోయిన ఇసుకను యుద్ధప్రాతిపదికన తొలగించాలని పలువురు కోరుతున్నారు.

# రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

**వీరవాసరం:** పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఈనెల 12 నుంచి జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి(ప్రథమ), విజయనగరం(ద్వితీయ), శ్రీకాకుళం(తృతీయ), బాలికల విభాగంలో విజయనగరం(ప్రథమ), పశ్చిమగోదావరి(ద్వితీయ), తూర్పుగోదావరి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను డీఈవో ఇ.నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు గుండ జయప్రకాశ్ నాయుడు అందజేశారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈల నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

**ధవళేశ్వరం:** జలవనరులశాఖ ఏఈఈల నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం గౌతమీ సదన్‌లో జరిగింది. అధ్యక్షురాలిగా ఎస్.షైనీ, అసోసియేట్ అధ్యక్షుడిగా వీరబాబు, ఉపాధ్యక్షులుగా సుజాత, లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా రాజా జశ్వంత్, సహాయ కార్యదర్శులుగా రేణుకా చాందిని, అజీజ్, రవితేజ, హర్షవర్ధన్, కోశాధికారిగా చంద్రకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఆర్ పోచారావు, డీఈఈలు నాగేంద్రప్రసాద్ వ్యవహరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947
ఉ॥ 10 - మ॥ 1

### వీధి దీపం వెలుగుతుంది

బొమ్మూరు నేతాజీనగర్ — స్పందనకు వందనం

మూడో వీధిలోని వీధి దీపం వెలగక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను కార్యదర్శి కాశీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, బొమ్మూరు

### గుంత పూడ్చాలి

**సమస్య:** జేఎల్‌బీ నగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపై రాళ్లు పైకి రావడం వల్ల వాహనాల రాకపోకలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుంది. వర్షానికి మట్టి కొట్టుకుపోయింది. - గిరి, స్థానికుడు

**సమాధానం:** మట్టి వేసి చదును చేయించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - కాశీ, గ్రామకార్యదర్శి, - న్యూస్‌టుడే, బొమ్మూరు

## పట్టాలిచ్చారు.. స్థలాలు చూపలేదు..

అధికారుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

పరిశీలన

**కడియం, ధవళేశ్వరం, న్యూస్‌టుడే:** గత పాలకుల చేసిన ఎన్నికల ముందు చేసిన హడావిడి పనులు అన్నీ ఇన్నీ కావు. కొన్ని మండలాల్లో ముందస్తుగా స్థల సేకరణ చేయకుండానే పట్టాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా మంజూరు చేసిన స్థలాలు అప్పగించక, కొత్తగా అర్జీ చేసేందుకు వీలులేక తీవ్రనిరాశకు గురవుతున్నారు.

### కోర్టు కేసులతో..

గత సర్కారు కాలంలో కడియం మండలం వేమగిరి జిల్లా పరిషత్‌కు చెందిన సుమారు 20ఎకరాల్లోని ప్రభుత్వ భూమిని దాదాపు 827 మందికి ఇళ్లస్థలాలుగా కేటాయించారు. దీనికి చేరువలో మనుగడలో లేని ఓ కర్మాగారం నిర్వాహకులు కోర్టులో కేసు వేయడంతో స్థలాల పంపిణీ నిలిచింది. ఏళ్లు గడుస్తున్నా కేసులో పురోగతి లేకపోవడంతో స్థలాల వచ్చేనా అంటూ లబ్ధిదారులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీరందరికీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు మరోసారి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

### స్థలాలకు ఎదురుచూపులు..

రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గంలో మేజర్ పంచాయతీగా పేరొందిన ధవళేశ్వరంలో సుమారు 3,749 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి రాజానగరం మండలంలోని కానవరంలో భూమిని కేటాయించారు. లేఔట్ సిద్ధం చేయకపోవడం, ఇళ్లస్థలాలు మ్యాపింగ్ జరగలేదు. పట్టాలు ఉన్నా స్థలాల కోసం ఎదురుచూపులు తప్పట్లేదు. దాదాపు 12 కి.మీ. దూరంలోని స్థలాన్ని కేటాయించడంపైనా విమర్శలు ఎదురవుతున్నాయి.

### అక్కడా అంతే..

రాజానగరం మండలంలో 2వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీళ్లకు పట్టాలు ఇచ్చినా స్థలం చూపించలేదు. వెలుగుబంద ప్రాంతాల్లో ప్రభుత్వానికి స్థలాల విక్రయించిన కొందరు రైతులకు ఇప్పటికీ నగదు అందలేదని అంటున్నారు. ● బిక్కవోలు మండలంలో ఎన్నికల ముందు ఇళ్లులేని నిరుపేదలుగా సుమారు 800 మందికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు ఇవ్వలేదు. ● రంగంపేట మండలంలో వైకాపా సానుభూతిపరుల భూములను ఆనాటి ప్రభుత్వానికి నివేశనా స్థలాలుగా విక్రయాలు జరిపారు. గ్రామానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం కావడంతో ఇళ్ల నిర్మాణానికి సుముఖత చూపలేదు.

### గతంలో మంజూరైతే అనర్హులే..

గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల లబ్ధిదారులుగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైన వారు ఇప్పుడు చేసుకునేందుకు కుదరదు. ఒకసారి ఇప్పటికే నమోదు కావడంతో ఇప్పుడు చేసుకున్నా ఆ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయి. వేమగిరిలో స్థలవివాదం పరిష్కారమైతే కడియపుసావరం, వేమగిరి, కడియపులంకకు చెందిన సుమారు 827 మందికి స్థలాలను కేటాయిస్తాం. ప్రస్తుతం కొత్త లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– ఎం.సునీల్‌కుమార్, తహసీల్దారు, కడియం

## ఎంపికైన కానిస్టేబుళ్లకు సన్మానం

సన్మానం పొందిన కానిస్టేబుళ్లతో ఎస్సై తదితరులు

**కోరుకొండ, న్యూస్‌టుడే:** కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన కానిస్టేబుళ్లుగా ఎంపికైన కొందరు అభ్యర్థులను ఆదివారం ఎస్సై ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలోకి అడుగుపెట్టిన వారందరూ ప్రజల పట్ల సేవాభావంతో, విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని కోరారు.

## అధ్వానంగా వాటర్ ట్యాంకు

హుకుంపేటలో శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంకు మెట్లు

**బొమ్మూరు(హుకుంపేట), న్యూస్‌టుడే:** హుకుంపేటలో మూడు ఆలయాల సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు అధ్వానంగా ఉంది. మెట్లలో ఉండే ఇనుప రాడ్లు బయటకు కనిపించడంతో సిబ్బంది ఆ మార్గం నుంచి వెళ్లి శుభ్రం చేయాలంటే భయపడుతున్నారు. ట్యాంకు చుట్టూ దట్టమైన పొదలు, పిచ్చి మొక్కలు పేరుకుపోయినా వాటిని తొలగించడం లేదు. ట్యాంకు దగ్గరలో ఉన్న వాల్వు నాను పట్టించి దానిని శుభ్రం చేయించడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు కనీస మరమ్మతులు చేపట్టలేదని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్ స్పందిస్తూ సమస్యను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

## భగవద్గీత పోటీలకు ముగ్గురి ఎంపిక

**రంగంపేట, న్యూస్‌టుడే:** తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిహాల్ గౌతమ్, నిమ్మలపూడి శ్రావణి, గిరిజాల సత్యదేవ్ రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చూపారన్నారు. త్వరలో విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ నాగమల్లేశ్వరం తెలిపారు.

## సత్ప్రవర్తన లేకుంటే ఉపేక్షించం: ఎస్పీ

రౌడీషీటర్లకు, గంజాయి బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అప్పారావు

**కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:** జిల్లాలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులు, గంజాయి, బ్లేడు బ్యాచ్‌లు సత్ప్రవర్తనతో లేకుంటే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్, బ్లేడు బ్యాచ్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల్లోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ చట్టం అమలు చేస్తామన్నారు. గంజాయి తాగడం, విక్రయించడం చేస్తే ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయి వల్ల మానసిక, శారీరక సమస్యలతోపాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి వంటివి బలహీనపడతాయని సూచించారు.

## బిక్కవోలు స్వామిని దర్శించుకున్న దశరథరామిరెడ్డి

దశరథరామిరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న కమిటీ సభ్యులు

**బిక్కవోలు, న్యూస్‌టుడే:** శ్రీదేవి, భూదేవి సహిత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ప్రముఖ ఆర్థోపెడిక్, యశోద ఆసుపత్రి చీఫ్ సర్జన్ సత్తి దశరథరామిరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికింది. పండితుల ఆశీర్వచనం అనంతరం స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

## ఆర్టీసీ 'నవజనార్దన క్షేత్రదర్శిని'

✦ ఈనెల 28, వచ్చేనెల 4న యాత్ర బస్సులు

యాత్రకు ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సు

ధనుర్మాసంలో ఆలయాలను సందర్శించే భక్తుల కోసం నవజనార్దన క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. రాజమహేంద్రవరం డిపో నుంచి ఈ నెల 28న, వచ్చేనెల 4న నవజనార్దన క్షేత్రాలకు నడిపేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను సిద్ధం చేస్తుంది. ఒకే రోజు తొమ్మిది క్షేత్రాలను దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్(డీఎం) మాధవ్ తెలిపారు. భక్తుల డిమాండ్‌కు అనుగుణంగా నవజనార్దన క్షేత్రాలకు ఎన్ని బస్సులైనా ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఒకరోజు యాత్రలో భాగంగా ధవళేశ్వరం, మడికి, జొన్నాడ, ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, మాచర, కోటిపల్లి క్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. దీనికి టికెట్ ధర ఒక్కొక్కరికీ రూ.450గా నిర్ణయించారు. ముందుస్తు టికెట్ల బుకింగ్, ఇతర వివరాల కోసం 95023 00189 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు. ధనుర్మాసంలో ఆలయాలను సందర్శించే భక్తులు ఆర్టీసీ కల్పిస్తున్న నవజనార్దన క్షేత్రదర్శిని బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

## రాములోరికి ఘనంగా స్వర్ణ పుష్పార్చన

కల్యాణ పూజ అందుకుంటున్న రాములవారు

**భద్రాచలం, న్యూస్‌టుడే:** భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామికి వారానికి ఒకసారి ఉండే అభిషేక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వర్ణ పుష్పాల పూజ మంత్రముగ్ధులను చేసింది. విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు క్షేత్రంలో అంటా నీరాజనాలు అందించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగళ్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. దర్బారు సేవ ఓలలాడించింది. అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామానికి చెందిన వెంకట లక్ష్మి, రామలక్ష్మి అనే భక్తులు స్వామివారిని దర్శించుకుని 680 గ్రాముల బరువు గల రూ.1.5 లక్షల విలువైన వెండి పాత్రను పీఆర్వో సాయిబాబా, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ద్వారా స్వామివారికి సమర్పించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

దొడ్డిగుంటలో తెదేపాలో చేరిన వారితో మనోజ్‌రెడ్డి తదితరులు

**దొడ్డిగుంట (రంగంపేట), న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి దొడ్డిగుంటలో వైకాపాకు చెందిన 40 మంది తెదేపాలోకి చేరేందుకు సుముఖత చూపగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. వడిశలేరుకి చెందిన తెదేపా నాయకుడు నిమ్మలపూడి బాబూరావు మృతిచెందగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. మనోజ్‌రెడ్డి, జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎలుబండి సత్తిబాబును నాయకులు, అభిమానులు సత్కరించారు. మండల తెదేపా అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు, నాయకులు వెలమర్తి సుధాకర్, మద్దిపూడి సత్తిబాబు, కొమ్మన రాంబాబు, సత్తి దేవదానరెడ్డి, నీలపాల త్రిమూర్తులు, అడబాల వెంకట్రావు పాల్గొన్నారు.

## బాబోయ్ విద్యుత్తు స్తంభం

రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వల్లభ గణపతి ఆలయ మార్గంలో ఓ వీధి మలుపులో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. పలుచోట్ల ఇదే పరిస్థితి. కొన్నిచోట్ల రోడ్లు వేసినా స్తంభాలు మాత్రం మార్చలేదు. రాత్రిపూట రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి, వీటిని సరిచేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## అధ్వానంగా డ్రెయిన్

రాజమహేంద్రవరం శివారు కాతేరు చర్చి సమీపంలోని రహదారి మలుపులో నడి మధ్యన ఉన్న డ్రెయిన్ పలకలు లేకుండా ప్రమాదకరంగా ఉంది. విద్యార్థులు, వృద్ధులు నడిచే సమయంలో ఏమరపాటుగా ఉంటే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

## రహదారి అంచులు దెబ్బతిని ప్రమాదాలు

బిక్కవోలు తహసీల్దారు కార్యాలయం నుంచి ఎంఈవో, గృహనిర్మాణ, రోడ్లు భవనాల శాఖ కార్యాలయాలకు వెళ్లే రహదారి అంచులు సరిలేక ప్రమాదకరంగా మారింది. సీసీరోడ్డుకు వేసిన బెర్మ్ వర్షాలకు కొట్టుకుపోయింది. పలువురు వాహన చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి పద్మజను వివరణ కోరగా పాలకవర్గం దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

- న్యూస్‌టుడే, బిక్కవోలు

## వాలంటీర్ల శ్రమదానం



కోటిపల్లి బస్టాండ్‌లోని ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో ఆదిత్య డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, యానిమేషన్ విభాగం ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఆదివారం ఉదయం శ్రమదానం చేశారు. ఆవరణలోని పెద్ద ఎండిన చెట్లను, పనికిరాని మొక్కలను తొలగించారు. ఖాళీ స్థలంలో నేరేడు, మామిడి, పనస, ఉసిరి మొక్కలు నాటేందుకు అనువుగా సిద్ధం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్. నాగేశ్వరరావు, బి.రమాదేవి, పోలుకొండ సాయి, యూత్ రెడ్‌క్రాస్ కోశాధికారిణి వి.మహాలక్ష్మి, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యుడు సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

## ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చు

ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చు అవుతుందని, దిగుబడి పెరుగుతుందని బలభద్రపురానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీతారామలక్ష్మి, భార్గవి, శ్రీలక్ష్మి, మల్లిక, కృష్ణవేణి తెలిపారు. ఆదివారం డ్రమ్ము సీడరుతో కాపవరంలో రైతు చోడసాని వీరబాబుతో వరి నాట్లు వేయించారు. ఈ విధానం ద్వారా 20 రోజుల తరువాత వీడర్‌ను ఉపయోగించి కలుపు తీయడం వల్ల భూమి గుల్లబారి మరింత సారవంతంగా మారి దుబ్బుకు పిలకల సంఖ్య పెరుగుతుందని తెలిపారు.

- న్యూస్‌టుడే, బిక్కవోలు

## మొక్కలు జీవన సందేశానికి ప్రతీకలు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, మల్లు పోలరాజు

**కడియం, న్యూస్‌టుడే:** ప్రకృతి వైభవాన్ని చాటే ప్రతి మొక్క జీవన సందేశాన్ని అందించే ప్రతీకలుగా నిలుస్తాయని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం కడియపులంకలోని ఆయన శిష్యుడు మల్లు విష్ణు స్వస్థలానికి విచ్చేశారు. కాసేపు విష్ణు కుటుంబ సభ్యులతో ముచ్చటించి, అనంతరం స్థానిక శివాంజనేయ నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత మల్లు పోలరాజు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చాగంటిని ఘనంగా సత్కరించారు. నర్సరీలో పచ్చని మొక్కలతో పాటు అరుదైన వందేళ్ల నాటి వృక్షాలను తిలకించారు. మానసిక ఆహ్లాదానికి నర్సరీలు చక్కని నిలయాలని కొనియాడారు. డాక్టర్ నీలకంఠరావు మాస్టారు, మల్లు శివ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వందేమాతర గీతం ఆలపిస్తున్న కవులు

## రచయితల సమితి సమావేశం

**రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ప్రతి నెలా రెండో ఆదివారం జరిగే కళాగౌతమి రచయితల సమితి సమావేశం వీరేశలింగం పుర మందిరంలో నిర్వహించారు. వందేమాతర గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హాజరైన కవులంతా పూర్తి వందేమాతర గీతం ఆలపించి సభను ప్రారంభించారు. కళాగౌతమి వ్యవస్థాపకుడు బి.వి.ఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు బి.వి.రమాదేవి, నక్కిన ధర్మేశ్, మల్లెమొగ్గల గోపాలరావు, వి.వి.సుబ్రహ్మణ్యం, వరాహగిరి కృష్ణమోహన్ తదితరులు స్వీయకవితలు వినిపించారు. శ్రీపాద సీతామహాలక్ష్మి, కొత్తపల్లి సీతానాథ్, ఎస్.వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు పంపిణీ

**ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే:** స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలోని 100 మంది వృద్ధులకు పున్నమిరాజు వీర్రాజు ఏర్పాటు చేసిన దుప్పట్లు, భోజనం ప్యాకెట్లను ఆదివారం వైకాపా రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు పంపిణీ చేశారు. గిరజాల మాట్లాడుతూ ఈ నెల 21న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వారం రోజుల పాటు వివిధ వర్గాల నిస్సహాయులకు సహాయ కార్యక్రమాలు కడియంలో చేస్తామన్నారు. సర్కార్ బాషా, మద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు

## ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

కేకు కోస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

**ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే:** రాజవోలు, రమాదేవి గార్డెన్స్‌లో రాజమండ్రి డివిజనల్ ఉద్యోగులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీస్తు జన్మ మానవాళికి శుభకరమైనదని, రక్షకుడిగా ఈ లోకానికి వచ్చారన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల బద్దె జార్జి ఆంథోని, ఏపీఏ డా.భీమారావు, డా.ఎన్.సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బిక్కవోలు:** బలభద్రపురం ఎస్సీపేటలో శనివారం రాత్రి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణ, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్, క్రీస్తు జనన వృత్తాంతం తెలిపే పశువుల పాక, నృత్యాలు ఆకట్టుకున్నాయి. డా.ఆశీర్వాదం క్రిస్మస్ సందేశం వినిపించారు. రెవరెండ్ విజయకుమార్, పాస్టర్ అగస్టీన్, ప్రసాద్, సబితా జాన్ హాజరయ్యారు. వృద్ధులకు దుప్పట్లు పంచారు. యువకులు డోకుబుర్ర వీర్రాజు, బాబూరావు, చాపల సతీష్ పాల్గొన్నారు.

**కడియం:** వీరవరంలోని బైబిల్ మిషన్ ప్రార్థనామందిరం పాస్టర్ సాకా ఏసుపాదం ఆధ్వర్యంలో స్థానిక వాలీబాల్ మైదానంలో జరిగిన క్రిస్మస్ వేడుకలు అలరించాయి. ముఖ్యఅతిథిగా జేగురుపాడు సర్పంచి యాదల సతీశ్ చంద్రస్టాలిన్ పాల్గొని శుభవచనలు పలికారు. పాస్టర్లు విజయకుమార్, ప్రకాశ్, రాజారావు, రత్నాకర్ వాక్యోపదేశాన్ని అందించారు.

## రహదారిపై ఇసుక.. జారిపడతారు జాగ్రత్త

జీరో పాయింట్ కూడలిలో పేరుకుపోయిన ఇసుక

**రాజానగరం, న్యూస్‌టుడే:** దివాన్‌చెరువు జీరో పాయింట్ కూడలి వద్ద జాతీయ రహదారిపై ఇసుక పేరుకుపోయింది. అది ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలు, దివాన్‌చెరువు నుంచి గామన్ ఇండియా వంతెన రహదారి మీదుగా కొవ్వూరు వెళ్లే, కొవ్వూరు నుంచి దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారి పైకి వచ్చే కార్లు, బస్సులు, భారీ వాహనాలన్నీ ఈ కూడలి వద్దనే కలుస్తాయి. ద్విచక్రవాహనదారులు ఏకారణం చేతనైనా అకస్మాత్తుగా బ్రేకు వేసినప్పుడు ఇసుక మీదనే ఆగాల్సి ఉంటుంది. అప్పుడు వారు జారిపోయి వాహనాల కిందకు వెళ్లడమో లేదా అక్కడే పల్టీలు కొట్టడమో జరిగి క్షతగాత్రులవుతున్న సంఘటనలు పరిపాటిగా మారాయి. మరమ్మతు పనులు చేసే వారు రహదారిపై పేరుకుపోయిన ఇసుకను యుద్ధప్రాతిపదికన తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



మంచితనం, ప్రేమ, ఆప్యాయతలతో మా అందరి మనస్సులలో చిరస్థాయిగా నిలిచి, మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం శ్రీ తంబాబత్తుల అప్పారావు గారి మరణం మాకు తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ తంబాబత్తుల అప్పారావు గారు
(పేపర్ల అప్పారావు)
జననం: 02-01-1922 మరణం: 04-12-2025
రాజానగరం

కుమారుడు: తంబాబత్తుల వెంకటరమణ - కోడలు: శ్రీమతి లక్ష్మీదేవి
మనుమలు: తంబాబత్తుల అప్పన్నదొర - శ్రీమతి వరలక్ష్మి
తంబాబత్తుల దుర్గాప్రసాద్ - శ్రీమతి దివ్య
తంబాబత్తుల ఉదయ్‌దొర - శ్రీమతి కళ్యాణి
మునిమనుమలు: మహవీర్, లలిత్, ధరహాస్, భరత్

పెద్దకార్యం: ది. 17-12-2025 బుధవారం, రాజానగరంలో మా స్వగృహము నందు జరుపబడును.

(c) eenadu

# కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

## కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిఉన్న కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. ఈ రోజు అమ్మవారికి రూ.1.11 లక్షల ఆదాయం వచ్చింది. దర్శనాల ద్వారా రూ.31వేలు, అన్నదాన ట్రస్టుకు రూ.3,722, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.22,500, ఇతర టిక్కెట్ అమ్మకాల ద్వారా రూ.54,396 ఆదాయం వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేపీ శర్మ పాల్గొన్నారు.

## నేడు

### ఉచిత వైద్య శిబిరం

ఉండ్రాజవరం: వెలగదుర్రులో శాంతిశ్రీ ఆసుపత్రి సౌజన్యంతో ఎంవీఎస్‌రాజు ఛారిటబుల్ ట్రస్టు ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెదేపా గ్రామ అధ్యక్షుడు ఎం.రవీంద్రరాజు తెలిపారు. దీనిని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ● ఉండ్రాజవరంలో బౌద్ధధర్మపీఠంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు పీఠాధిపతి అనాలయో తెలిపారు.

### విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెరవలి: పెరవలి మండలం కానూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని మరమ్మతుల పనుల నిమిత్తం సోమవారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నడుపల్లి, కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాలలో సరఫరా ఉండదన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అలంకరణ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మార్గశిర మాసం ఆదివారం పురస్కరించుకుని వేలివెన్నులో కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్‌చాలీసా

పెరవలి: నల్లాకువారిపాలెంలోని భక్తాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఆధ్యాత్మికవేత్త తుట్టగుంట అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మహిళలు పెద్దఎత్తున సిందూరం పూజలో పాల్గొన్నారు.

## సుందరేశ్వరునికి లక్షపత్రి పూజ

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలో లక్షబిల్వార్చన, ప్రత్యేక పూజాకార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. రుత్వికులు గణపతి పూజ, పుణ్యాహవచన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రిపూజ చేశారు. సాయంత్రం రుద్రహోమం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, వేదస్వస్తి, నిర్వహించారు.

## మొండిగోడలు.. ఇరుకు గదులు

### కదలని అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

తాళ్లపూడి, గోపాలపురం, న్యూస్‌టుడే: అద్దెభవనాలు, ఇరుకుగదులతో అంగన్‌వాడీ భవనాల్లో చిన్నారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారికి సొంతభవనాలు నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పినా నిధులు విడుదలలో నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో చాలా చోట్ల నిర్మాణాలు మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. సొంత భవనాలకు మరమ్మతులు చేసేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమయ్యాయి. ఇరుకు అద్దె భవనాల్లో అటు చిన్నారులు, ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి భవనాలు శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది.

తాళ్లపూడిలో అసంపూర్తిగా..

| నియోజకవర్గం | కొవ్వూరు | గోపాలపురం |
|---|---|---|
| మొత్తం కేంద్రాలు | 223 | 234 |
| సొంత భవనాలు | 108 | 172 |
| అద్దెవి | 91 | 34 |
| ఉచిత అద్దెవి | 24 | 28 |
| అసంపూర్తిగా ఉన్నవి | 40 | 20 |

### కూటమి ప్రభుత్వంపై ఆశలు..

గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు కింద మొదటి విడతలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలను నిర్మించేలా నిధులు మంజూరు చేసింది. అప్పట్లో ఒక్కో దానికి సుమారు రూ.16 లక్షలు మంజూరు చేసేలా కార్యాచరణ రూపొందించారు. తొమ్మిది మంది సభ్యుల కమిటీ సమక్షంలో నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఉపాధిహామీ ద్వారా మరికొన్నింటికి నిధులు మంజూరు చేశారు. వచ్చిన ఆ అరకొర నిధులతో కొన్ని చోట్ల నిర్మాణాలు జరిగాయి. మిగిలిన నిధులు రాక అవి మొండిగోడలకే పరిమితం అయ్యాయి. కొన్ని చోట్ల సొంతభవనాలు సైతం శిథిలావస్థకు చేరాయి. ఆ పనులు గుర్తించి నాడు-నేడు రెండో విడత కింద వాటికి మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా అదీ కార్యరూపం దాల్చలేదు. కొత్త భవనాలకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేసేకంటే అసంపూర్తిగా ఉన్న వాటికి సరిపడా నిధులు మంజూరు చేస్తే భవనాలు అందుబాటులోకి వస్తాయని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికే అసంపూర్తి భవనాల గోడలు బీటలు వారడం, పాదులు పైకి ఎకబాకడం, ఇనుపచువ్వలు తుప్పు పట్టడం తదితర పరిస్థితులు నెలకొన్నాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని, త్వరలో వాటికి కూడా నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని ఐసీడీఎస్ అధికారులు వెల్లడిస్తున్నారు.

## విష్ణు స్వరూపం.. ధనుర్మాసం

విశేషాలంకరణలో వరద గోపాలస్వామి

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, న్యూస్‌టుడే: మార్గశిర మాసంలో విష్ణు స్వరూపంగా ధనుర్మాస మహావ్రతానికి విశేష స్థానం ఉంది. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో వైష్ణవాలయాలు పూజలకు ముస్తాబవుతున్నాయి. ఈనెల 16న మధ్యాహ్నం 1.23 గంటలకు కోయిలత్తాళ్వార్ తిరుమంజన సేవతో ధనుర్మాసం (నెల గంట) ప్రారంభం కానుంది. ఆ సందర్భంలో విష్వక్సేనారాధన, దీక్షాధారణతో మహావ్రతం ఆరంభం అవుతుంది. ఆలయాల్లో రోజూ విష్ణు సహస్ర నామ స్తోత్రం, గోపికాగీతాలాపన, తిరుప్పావై, తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ జరగనున్నాయి. ● కొవ్వూరు పట్టణంలోని పురాణ ప్రాశస్త్యమైన రుక్మిణి సత్యభామ సమేత వరద గోపాలస్వామి, గోష్పద క్షేత్రంలోని సుందర గోవిందుడు, బసివిరెడ్డిపేట, శ్రీనివాసపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, వాడపల్లిలో జగన్నాథస్వామి, ఆరికిరేవుల, వేగేశ్వరపురం, చాగల్లులోని వేంకటేశ్వరస్వామి, తాళ్లపూడి మదన గోపాలస్వామి ఆలయాల్లో ధనుర్మాసమంతా పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా వరద గోపాలస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 16న లక్ష తులసీదళార్చనతో పూజలు ఆరంభిస్తామని అర్చకులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి తెలిపారు.

### పూజలు ఇలా..

● ఈనెల 17న ఉదయం 4.30 గంటలకు ధనుస్సంక్రమణం ప్రారంభం. ● 30న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి). ఉదయం 4 గంటల నుంచి విశేషార్చనలు, వైకుంఠ ద్వార దర్శనం. ● జనవరి 1న రోహిణి నక్షత్ర ప్రత్యేక పూజలు. ● 9న మహాలక్ష్మిదేవి సారూప్య పూజ (శ్వేత వస్త్రధారణ). ● 11న 108 కడవల పాయాస నివేదన, వితరణ. ● 13న స్వామి వరి ఆరగింపు పాటతో వస్తువుల నివేదన. ● 14 భోగి. రాత్రి 7 గంటలకు గోదా గోపాలస్వామి కల్యాణోత్సవం. ● 15న సంక్రాంతి రోజున దధిమధనోత్సవం. అవబృథ స్నానం. సాయంత్రం పరిసమాప్తి, సభ. పవళింపు సేవ.

## మెహర్‌స్థాన్‌లో ప్రేమిక సహవాస్

కొవ్వూరు పట్టణం: నన్ను దర్శించాలంటే నీ హృదయాంతరాళంలో వెతకాలన్న మెహర్ బోధనలు సదా ఆచరణీయమని వక్తలు అన్నారు. కొవ్వూరు మెహర్‌స్థాన్ సేవా ట్రస్టు 27వ ప్రేమిక సహవాస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మెహర్ సందేశాల రూపకం ప్రదర్శించారు. సంకీర్తనలు, ప్రసంగాలు, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యవక్తలు మెహర్ బోధనలపై ప్రసంగించారు. మెహర్ ప్రేమవరం, మెహర్‌స్థాన్ సంయుక్తాధ్వర్యంలో పేదలకు దుప్పట్లను, బియ్యం, చీరలు పంపిణీ చేశారు. వైస్‌ఛైర్మన్ మన్నె వద్ది, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మెహర్ ప్రేమికులు హాజరయ్యారు.

సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

## 21న చాగల్లులో హిందూ సమ్మేళనం

చాగల్లు: చాగల్లులో ఈనెల 21న హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక సమితి కార్యదర్శి తాళ్లూరి వరప్రసాద్ ఆదివారం తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం(ఆర్ఎస్ఎస్) సభ్యుల ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు. వరప్రసాద్ మాట్లాడుతూ చాగల్లు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మైదానంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అభయ హిందూ సేన వ్యవస్థాపకులు రాధా మనోహర్ దాస్ విచ్చేస్తారన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

## తాగునీటి పంపింగ్ మోటార్‌లో సాంకేతిక లోపం

నిడదవోలు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని నెహ్రూనగర్ పంప్‌హౌస్‌లో ఉన్న తాగునీటి పంపింగ్ మోటార్‌లో ఆదివారం సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ కారణంగా సాయంత్రం తాగునీరు అరగంట మాత్రమే అందించారు. ప్రస్తుతం మరమ్మతు పనులు చేపట్టారు. ఈనెల 15 మధ్యాహ్నానికి పనులు పూర్తి అవుతాయని కమిషనర్ తోట కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఉదయం కూడా తాగునీటి సరఫరా కొద్దిసేపు మాత్రమే ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు. పట్టణంలోని 3వ వార్డు నుంచి 11వ వార్డు, 21వ వార్డు నుంచి 27వ వార్డు వరకు తాగునీటి సరఫరా ప్రభావితం అవుతుందన్నారు. ఈ వార్డు ప్రజలు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

### నాలుగు ప్రాంతాలకు..

పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ప్రస్తుతం ఆర్వోబీ నిర్మాణ పనుల్లో భాగంగా తాగునీటి పైపులైన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్న దృష్ట్యా ఇందిరానగర్, గాంధీనగర్ పరిసర ప్రాంతాలు, రైల్వేస్టేషన్ రోడ్డు, రాయిపేట ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలుపుదల చేసినట్లు కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. ఐదు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సదరు ప్రాంతాలకు ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేస్తున్నామన్నారు.

## పురపాలక బడ్జెట్ సమావేశం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు పురపాలక సంఘ బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని ఈనెల 17న (బుధవారం) నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆదివారం తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు విధిగా హాజరవ్వాలని కోరారు.

## ఏపీఎన్జీవో కార్యవర్గం ఏకగ్రీవం

నూతన కార్యవర్గంతో సభ్యులు

గోపాలపురం, న్యూస్‌టుడే: ఏపీఎన్జీవో గోపాలపురం యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అర్హత కమిటీ ఛైర్మన్ మీసాల మాదవరావు, కన్వీనర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా జోడాల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పి.పాపారావు, ఉపాధ్యాక్షురాలుగా డి.మమ్మీ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జోడాల వెంకటేశ్వరరావును వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి మండలాల ఉద్యోగులు ఎన్నుకున్నారు.

## యూటీఎఫ్ నూతన కమిటీ

తాళ్లపూడి: తాళ్లపూడి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటైందని ఆదివారం ఎన్నికైన నూతన అధ్యక్షుడు బి.శంకర్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా బి.విజయబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా లక్ష్మీపతి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శి టి.క్రాంతికుమార్ తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు పి.జయకర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

నల్లజర్ల, న్యూస్‌టుడే: దూబచర్ల ఎంపీటీసీ సభ్యుడు, తెదేపా సీనియర్ నాయకుడు ఈడే శ్రీను కిడ్నీ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా బాధపడుతున్నారు. విజయవాడలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఆదివారం పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.6,50,000 నగదును అందజేశారు. బాపిరాజుతోపాటు దూబచర్ల తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు కాకర్ల రామకృష్ణ, అప్పసాని శివరామకృష్ణ, నాదేండ్ల రాధాకృష్ణ, యోగా ఉమాశంకర్ తదితరులు ఉన్నారు.

## నేడు సీవీఏపీయూ యూనిట్ ప్రారంభం

నిడదవోలు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్(సీవీఏపీయూ) యూనిట్‌ను ఈనెల 15న నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో టీవీ సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి ప్రణాళిక అమలుకు, సమన్వయానికి ఈ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

## జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు బస్టాండ్ కూడలిలో మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రాంబాబు కోరారు. పురపాలక సంఘ కార్యాలయ దగ్గరలో బాబూ జగ్జీవన్‌రామ్ సేవా సమితి, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో 2019లో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ఆర్వోబీ నిర్మాణ పనులు జరుగుతున్న దృష్ట్యా రహదారి వెడల్పు నిమిత్తం విగ్రహాన్ని ర.భ.శాఖ అధికారులు తొలగించి విగ్రహాన్ని జాగ్రత్త పరిచారన్నారు.


PASSPORT LOST

I, Deshala Ramakrishna, S/o Satyanarayana, Resident of D.No.2-12/1, SaiBaba Gudi Veedhi, Kanuru Agraharam Village, Peravali Mandal, E.G. District. I am the Indian Passport holder number T8551901 issued by Passport Officer, Visakhapatnam, Date of issue 23-8-2019 and Date of Expiry 22-8-2029. The above Passport was lost by me while I am travelling from Kanuru Agraharam to Nidadavole for catch the train, I searched for the same but i didnot found it any where. If any one found plz contact the below number

90145 95167



మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112


### పూడిక తీశారు

చాగల్లు, న్యూస్‌టుడే: కలవలపల్లి గ్రామంలో ప్రధాన డ్రెయినేజీ పూడికపోయి మురుగు పారడంలేదు. సమస్యను కార్యదర్శి జి.రాకేష్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి పూడిక తీయించారు.

స్పందనకు వందనం

## కరాటే పోటీల్లో చిన్నారి ప్రతిభ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని పాలంగికి చెందిన చిలుకూరి జస్విక తణుకులో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు చిన్నారి తండ్రి శివరామ్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు చిన్నారిని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సర్పంచి బొక్కా శ్రీనివాసు, తెదేపా గ్రామ అధ్యక్షుడు ఈద్పుగంటి ఉదయకుమార్ తదితరులు అభినందించారు.

### రోడ్డు నిర్మించరూ..

పెరవలి మండలం ఖండవల్లిలో కాలువకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ సమస్యను పీఆర్ ఏఈ భగవన్నారాయణ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పెరవలి

### అసంపూర్తిగా తరగతి గది

నిడదవోలు మండలం రావిమెట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాడు-నేడులో భాగంగా భవనంపై నిర్మించిన అదనపు తరగతి గది అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరతగతిన గదిని పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

### ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అరుంధతీపేటకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ స్టార్ విశేషంగా ఆకట్టుకుంటోంది. రహదారిపై వెళ్లేవారు దీనిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 38/2024 O.S.No.145/2018

1) చింత సాంబశివరావు (Died) వాది/ DHR
2) చింత సత్యవతి (Died)
3) చింత శ్రీనివాసరావు వగైరా పిటిషనర్లు/ LRs of deceased DHR

మరియు

1). శ్రీమతి పుసులూరి లక్ష్మి. ప్రతివాది/JDR

పై నెంబరు E.P లో డిక్రీ హోల్డర్స్ తమ బాకీ రాబట్టుకొను నిమిత్తం EP Schedule దాఖలా ఆస్తిని ది.05-01-2026వ తేది ఉదయం 10.30ని.లకు పై కోర్టులో వేలం వేయుదురు. ఆసక్తి వున్నవారు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్స్ తరపు ప్లీడరు గారిని గాని, కోర్టు అమీనా గారిని గాని సంప్రదించవచ్చును.

వేలం కావలసిన ఆస్తి వివరములు/SCHEDULE:

Old West Godavari District, Now East Godavari District, Kovvur Mandal, Nidadavole S.R.O. Limits, Madduru Panchayat Area, in the Village of MADDURU, in RS. No. 82/9A, an extent of 296 Sq. yards of site with the R.C.C. Daba house therein bearing Door No. 1-18/1 bounded by:

**East:** 68'-0" House and site of Pusuluri Sitaramayya;
**South:** 39'-0" Drainage (Murugu Kaluva);
**West:** 67'-0" House and site of Nayudu Srinivas;
**North:** 39'-6" Road.

Within the aforesaid boundaries an extent of 296 Sq. yards of site with the R.C.C. Daba house therein with roof, Doors, Door-ways, Windows, Electrical S.C.No.900 and Fixtures and all pre-existing easement and other rights thereto.

**D.Hr Value Rs. 10,00,000/-**
**Amin Value Rs. 22,00,000/-**
వేలం తేది: 05-01-2026

కొవ్వూరు,
Date: 11-12-2025.

ఆత్కూరి సత్యనారాయణ
DHRs తరపు అడ్వకేట్, సెల్: 9849847197
కొవ్వూరు, తూ॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్.



Y.T.R 76వ జయంతి నివాళి

పారిశ్రామిక, రాజకీయ, సామాజిక సేవారంగాలలో ఆదర్శంగా ఉంటూ అందరి అభిమానం పొందిన ఆత్మీయ నాయకులు, మాకు ముఖ్యమైన మార్గదర్శకులు అయిన మాజీ MLA శ్రీ యలమర్తి తిమ్మరాజా (వై.టి.ఆర్) గారి 76వ జయంతి సందర్భంగా వారికివే మా ఆత్మీయ నివాళి.

శ్రీ Y.T. రాజా గారు
మాజీ MLA, తణుకు

మల్లిన అరుణసారధి
పారిశ్రామికవేత్త, ఉండ్రాజవరం

అనపర్తి ప్రకాశరావు
డైరెక్టర్ : మాంటిస్సోరి స్కూల్, తణుకు


## చిరస్మరణీయుడు శేషగిరిరావు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీపీ, సీనియర్ తెదేపా నాయకుడు దివంగత గన్నమని శేషగిరిరావు జయంతి సందర్భంగా ఉండ్రాజవరంలో పలుచోట్ల ఆయన విగ్రహాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామం, మండలం అభివృద్ధికి, తెదేపా అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శేషగిరిరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

పుంత రోడ్డుకు భూమి పూజ చేస్తున్న కూటమి నేతలు

## రూ.30 లక్షలతో పుంత రోడ్డు నిర్మాణం

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం నుంచి బంధపురం వెళ్లే అడ్డరోడ్డు నిర్మాణానికి స్థానిక కూటమి నేతలు ఆదివారం భూమి పూజ చేశారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర నిర్మించే రోడ్డుకు ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షలు మంజూరు అయినట్లు వారు తెలిపారు. ఈ దారిపై ఆధారపడి వందలాది ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అనేక మంది రైతులు నిత్యం పనుల నిమిత్తం తిరుగుతుంటారన్నారు.

## తల్లిదండ్రులు మందలించారని.. బాలుడి ఆత్మహత్యాయత్నం

పోలవరం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఓ బాలుడు పురుగుమందు తాగిన ఘటన ఇది. గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం పనికి వెళ్లాడు. అక్కడి వారితో గొడవ పడి.. ఇంటికి వచ్చాడు. ఆ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గొడవలు ఎందుకు అంటూ మందలించారు. మనస్తాపం చెందిన అతను పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఏలూరు జిల్లా పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స అందించి, ప్రస్తుతం పరిశీలనలో ఉంచామని, పరిస్థితిని బట్టి రాజమహేంద్రవరం తరలిస్తామని వైద్యులు తెలిపారు.


శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానం
తిమ్మరాజుపాలెం గ్రా॥, నిడదవోలు మం॥, తూ॥గో॥జిల్లా. సెల్ : 73826 08577

సీల్డు టెండరు / బహిరంగ వేలం పాట తేది.27.12.2025

తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, తిమ్మరాజుపాలెం గ్రామములో వేంచేసియున్న శ్రీ కోట సత్తెమ్మ అమ్మ వారి దేవస్థానం నందు ఈ క్రింది తెలిపిన లైసెన్సు హక్కులకు ది.27.12.2025 తేది శనివారం ఉదయం గం.11.00 లకు సీల్డు టెండర్లు మరియు బహిరంగ వేలం పాట నిర్వహించబడును.

| వ. సంఖ్య | వివరము | సీల్డుటెండరు / బహిరంగ వేలం | ధరావత్తు మొత్తం | టెండరు షెడ్యూల్ ఖరీదు | కాలపరిమితి |
|---|---|---|---|---|---|
| 1 | వాహనములు పెట్టు మరియు నిర్దేశించిన స్థలము నందు పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను లైసెన్సు హక్కు | సీల్డుటెండరు / బహిరంగ వేలం | రూ. 1,00,000/- | రూ. 500/- | ది.20.02.2026 నుండి ది.19.02.2028 వరకు (2 సంవత్సరముల కాలపరిమితి) |
| 2 | తలనీలాలు (మొక్కుబడి జుట్టు) ప్రోగు చేసుకొని తీసుకుని వెళ్ళు లైసెన్సు హక్కు | సీల్డుటెండరు / బహిరంగ వేలం | రూ. 50,000/- | రూ. 500/- | పాట హక్కు స్వాధీనం చేసిన తేది నుండి (2 సంవత్సరముల కాలపరిమితికి) |

ముఖ్య షరతులు : 1. టెండరు షెడ్యూలు జారీ చేయు తేది.25.12.2025 నుండి 26.12.2025 సాయంకాలం గం.5-00 ల వరకు దేవస్థానం కార్యాలయములో విక్రయించబడును. 2. సీల్డు టెండరు దాఖలు చేయు తేది.27.12.2025, ఉదయం గం.10-15 ల నుండి గం.10-45 ల వరకు. 3. బహిరంగ వేలంలో హెచ్చుపాట పాడిన పిదప సీల్డు టెండర్లు తెరచి రెండిటి నందు ఏది హెచ్చుపాట అయితే దానిని హెచ్చుపాటగా నిర్ధారించుట జరుగును. 4. సీల్డు టెండరులో పాల్గొను వారు ధరావత్తు సొమ్ము కార్యనిర్వహణాధికారి, శ్రీ కోట సత్తెమ్మ అమ్మ వారి దేవస్థానం పేరున డి.డి./నగదు రూపంలో చెల్లించవలెను. 5. హెచ్చుపాటదారు పాట ముగిసిన వెంటనే ధరావత్తుతో కలిపి ఒక సంవత్సరం అద్దె సొమ్ము వెంటనే చెల్లించవలెను. రూ.5,00,000/- ల కిమ్మతు గల స్థిరాస్తి సాల్వెన్సీ మరియు ఒరిజినల్ దస్తావేజు పాటకాలమందు ముందుగా సమర్పించవలెను. పాటలో పాల్గొనువారు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించవలెను. ప్రభుత్వ పన్నులు అన్నియూ హెచ్చుపాటదారే భరించవలెను. అంగీకరించి పాటలో పాల్గొనవలెను. 6. మొదటి సం. హెచ్చుపాట పై 10% పెంపుదలతో రెండవ సం. చెల్లించు నిర్ణయం. 7. మిగిలిన విషయములు కార్యాలయము పని చేయు వేళలలో తెలుసుకొనవచ్చును. సెల్ నెం.: 73826 08577, 9666995151.

తేది.14.12.2025,
తిమ్మరాజుపాలెం.

ఇట్లు,
సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి


## సామాజిక బాధ్యతతో పల్లెల అభివృద్ధి

గోపాలపురం, న్యూస్‌టుడే: కంపెనీల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో గ్రామాలకు పలు సౌకర్యాలు సమకూరుతున్నాయి. ప్రజలకు శుద్ధ జలం పంపిణీ, ప్రభుత్వ బడులకు, ఆసుపత్రులకు పరికరాలు అందజేత, కొన్ని గ్రామాల్లో ప్రయాణికుల మినీ విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేసి సామాజిక బాధ్యతను ఈ కంపెనీలు చాటుతున్నాయి.

### సౌకర్యాల కల్పన..

▲ గోపాలపురం నియోజకవర్గం పరిధిలో పలు కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థల వారు ముందుకు వచ్చి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ▲ దేవరపల్లిలో సుమారు రూ.కోటి ఖర్చుతో నూతన ఆసుపత్రి భవనం నిర్మాణం చేయడానికి పరమేశు బయోటెక్ ప్రైవేటు కంపెనీ ముందుకు వచ్చింది. వీరు గతంలో పలు గ్రామాల్లో నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ▲ అవంతి కర్మాగారం తరపున దుద్దుకూరు, దొండపూడి, దేవరపల్లి గ్రామాలకు రూ.అయిదు లక్షలు చొప్పున ఖర్చు చేసి శుద్ధినీటిని అందిస్తున్నారు. ▲ ఠాగూర్ కర్మాగారం గోపవరంలో రెండు గదుల పాఠశాల భవనం నిర్మాణం చేస్తోంది. భీమోలు గ్రామంలో మినీ విశ్రాంతి భవనం ఏర్పాటు చేసింది. ▲ గోపాలపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఓ సంస్థ సుమారు రూ.8 లక్షలతో జనరేటర్ అందించింది. ఠాగూర్ కర్మాగారం ఆసుపత్రికి అవసరమైన వస్తు పరికరాలు కొనుగోలు చేసి ఇచ్చింది. ▲ ఓంకార్ ఫెర్టిలైజర్ యాజమాన్యం గోపాలపురం మండలంలో రెండు చోట్ల నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, వెంకటాయపాలెం, చిట్యాల గ్రామాల్లో మినీ నీటి శుద్ధి కేంద్రాలు వెలిశాయి.

### అవసరమైన వాటికి వినియోగం..

కర్మాగారాలు, సంస్థల వారు ఇచ్చే సీఎస్ఆర్ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో అనేక వసతులు ఏర్పాటు చేశాం. వారి సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– రాజ్‌మనోహర్, ఎంపీడీవో, గోపాలపురం

ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేళ్లచింతలగూడెంలో ఏర్పాటు చేసిన మినీ నీటి శుద్ధి కేంద్రం


వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ACB 51 YEARS
నల్లజర్ల బ్రాంచి

ఖాతాదారులకు, రైతులకు, డిపాజిటర్లకు విశిష్ట సేవలను అందిస్తూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 50 సం॥రాలు పూర్తి చేసుకొని 51వ వసంతంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా బ్రాంచి మేనేజర్ గార్కి, ఆఫీసర్స్‌కు మరియు సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు.

శ్రీమతి చిరితోటి శ్రావ్య గారు
బ్రాంచి మేనేజర్, SBI (ACB)

మద్దిపాటి ప్రసాద్ (MP)
నల్లజర్ల

బలుసు అచ్యుత దామోదరరావు
Ex. AMC వైస్ ఛైర్మన్, పుల్లలపాడు

కండెపు సత్యవరప్రసాద్
ఆడిట్ ఆఫీసు, నల్లజర్ల

దాసరి ఫిల్లింగ్ స్టేషన్
ప్రో॥ దాసరి రాధారాణి, నల్లజర్ల

పుసులూరి శ్రీనివాసరావు
నల్లజర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, నల్లజర్ల మండలం
ఐ.వి.సత్యం, అధ్యక్షులు, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి

మద్దు జనార్ధనరావు
నల్లజర్ల

శ్రీ వెంకటసత్య రైస్ & ఫ్లోర్‌మిల్లు
ప్రో॥ మద్దు సత్యనారాయణమూర్తి, నల్లజర్ల


(c) eenadu

## మాజీ ఎమ్మెల్యేకు సిద్ధు ప్రశంస

విమానంలో ప్రయాణికురాలికి చికిత్స అందిస్తున్న డాక్టర్ అంజలి నింబాళ్కర్

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** బెళగావి జిల్లా ఖానాపుర నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి నింబాళ్కర్ సేవా నిరతిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొనియాడారు. గోవా నుంచి దిల్లీకి వెళ్తున్న ఒక విదేశీ మహిళ రెండుసార్లు అపస్మారక స్థితికి చేరుకోగా, సీపీఆర్ ద్వారా ఆమె ప్రాణాలను కాపాడారు. ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ దగ్గరుండి సేవలు అందించారు. దీనికి సంబంధించిన చిత్రాలు, వీడియోలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చూశారు. ఆమె సేవానిరతిని అభినందిస్తూ, ఇతరులు అంజలిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచిస్తూ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

ఊర్వశి థియేటర్

## చరిత్ర పుటల్లోకి ఊర్వశి థియేటర్

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** బెంగళూరులో సింగిల్ స్క్రీన్ థియేటర్ల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ వస్తున్నది. ఈ వరుసలో నగరంలో అతి పెద్ద థియేటర్లలో ఒకటిగా ఉన్న ఊర్వశి చేరనుంది. లాల్‌బాగ్ సమీపంలోని సిద్దయ్య రహదారిలోని ఈ థియేటర్‌ను 1970లో నిర్మించారు. ఇది 1,100 సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెద్ద తెర, అత్యాధునిక సాంకేతికతలను అలవరుచుకున్న ఈ థియేటర్‌లో సేవలను వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి నిలిపి వేయనున్నారు. ఇప్పటికే నగరంలో కపాలి, సాగర్, త్రివేణి, కావేరి, స్టేట్స్, మూవీల్యాండ్, కెంపేగౌడ, మెజెస్టిక్ తదితర థియేటర్లను కూల్చి ఇతర నిర్మాణాలు, మినీ మాల్స్‌ను నిర్మించారు. ఊర్వశి థియేటర్ ఆవరణలో ఒక మాల్ వస్తుందని సమాచారం.

అల్పాహార విందులో శివకుమార్, ఇతర నేతలు

## నేతలకు డీకే అల్పాహార విందు

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** ఓట్ల చోరీకి సంబంధించి హస్తినలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లిన నేతలతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక భవన్‌లో ఆదివారం ఉదయం సమాలోచన చేశారు. మంత్రులు ఆర్‌బీ తిమ్మాపుర, మంకాళ వైద్య, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్వీర్ సేఠ్, ఎమ్మెల్యేలు అల్లమ ప్రభు పాటిల్, ఆశిఫ్ సేఠ్, ఎన్ శ్రీనివాస్, ప్రదీప్ ఈశ్వర్, ఎమ్మెల్సీలు సలీం అహ్మద్, పుట్టణ్ణ, మంజునాథ భండబారి, వసంతకుమార్, బసవనగౌడ బాదర్లి, శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ యూబీ వెంకటేశ్‌లతో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ధర్నాలో పాల్గొన్న అనంతరం కన్నడ భవన వద్ద మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, సీనియర్ కార్యకర్తలతో ముఖాముఖి అయ్యారు. తాము ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునే దిశలో పోరాటం చేసేందుకు మైదానం వైపు వెళ్తున్న వాహనాలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. కర్ణాటక నుంచి నాలుగు వేల మంది కార్యకర్తలు దిల్లీకి వచ్చారని, వారిలో ధర్నా అనంతరం వెనక్కు తిరిగి కొందరు వెళ్లగా మిగిలిన 1500 మంది బస చేసేందుకు సదుపాయాలను కల్పించామని చెప్పారు. ఓట్ల చోరీకి సంబంధించి కర్ణాటకలో తాము 1.42 కోట్ల సంతకాలు సేకరించామని గుర్తు చేశారు. గెలుపు, ఓటములను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ఎన్నడూ పోరాటాలు చేయదన్నారు.

# హస్తినలోనూ ఆసన సమరం

సిద్ధు, శివుడు కలిసిపోతారా?

**బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే:** చందనసీమలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరూ జోడెద్దుల్లా శ్రమించారు. ముందుగా ఇచ్చిన హామీకి, ఇచ్చిన మాటకు సిద్ధరామయ్య కట్టుబడి ఉండాలని, తనకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని డీకే శివకుమార్ డిమాండ్ చేస్తున్నారు. శాసనసభ సమావేశాలు ముందస్తుగానే తనకు బాధ్యతలు అప్పగించాలని కోరగా, ఇరువురూ ఏకాభిప్రాయానికి వచ్చి, ఆ తర్వాత తమ వద్దకు రావాలని కాంగ్రెస్ అధిష్ఠానం వారికి సూచించింది. జనవరి మొదటి వారం వరకు ముఖ్యమంత్రిని కొనసాగనిస్తే దేవరాజ అరసు రికార్డును సిద్ధరామయ్య అధిగమిస్తారు. శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉండని, సమావేశాలు పూర్తయ్యే వరకు సహనంగా ఉండాలని ఉభయులూ చర్చించుకున్నారు. తన తండ్రి ముఖ్యమంత్రిగా పూర్తి సమయం కొనసాగుతారని ఎమ్మెల్సీ యతీంద్ర సిద్ధరామయ్య, మంత్రి మహదేవప్ప, మాజీ మంత్రి రాజణ్ణ, తదితరులు తమ స్వరాన్ని వినిపిస్తున్నప్పటికీ డీకే శివకుమార్ సంయమనం కోల్పోకుండా, పార్టీ పెద్దలతో ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వస్తున్నారు. ఓట్ చోరీకి సంబంధించి ఆదివారం నిర్వహించిన ధర్నాలో పాల్గొనేందుకు హస్తినకు ఆయన శనివారం రాత్రే చేరుకున్నారు. ఏఐసీసీ నాయకులతో భేటీ అయ్యారు.

**ఖర్గే ఆహ్వానం:** ఆదివారం నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ప్రముఖులు కొందరికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విందుకు ఆహ్వానించారు. కర్ణాటక నుంచి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, శివకుమార్, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్‌లకు ఆహ్వానం అందింది. సిద్ధరామయ్య ఆలస్యంగా విందుకు హాజరు కాగా, డీకే శివకుమార్ తనకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నారు. సోనియా, ప్రియాంక, రాహుల్, ఖర్గేతో పాటు ఏఐసీసీలో కీలక పాత్ర పోషిస్తున్న వారితో మంతనాలు చేశారు. శాసనసభ సమావేశాలు పూర్తయ్యి, క్రిస్మస్ అనంతరం మరోసారి ప్రత్యేకంగా సమావేశమై నిర్ణయాన్ని తీసుకుందామని శివకుమార్‌కు అధిష్ఠానం సూచించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆందోళనకు రైల్లో వచ్చేవారికి కేపీసీసీ ఉచిత ప్రయాణ సదుపాయాలను కల్పించగా, విమానంలో వచ్చే వారు సొంత ఖర్చుతో రావాలని డీకే సూచించారు. కాగా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ఇతర నేతల సహకారంతో పలువురు ఎమ్మెల్యేలు, కీలక నేతలు విమానంలో హస్తిన తీసుకువెళ్లారు. తాను కాంగ్రెస్ క్రమశిక్షణ గల కార్యకర్తనని నిరూపించుకునేందుకు డీకే చేసిన ప్రయత్నాలను అధిష్ఠానం గుర్తించింది.

### పార్టీ నేతలపై డీకే అసహనం

జనవరి 6 లేదా 9న డీకే ముఖ్యమంత్రి అవుతారని కొందరు నాయకులు చేసిన వ్యాఖ్యలను కూడా శివకుమార్ ఖండించారు. 'కొందరు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారు. అలా మాట్లాడడం సరికాదు. క్రియాశీలకంగా ఉన్న ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తించి, అవకాశాలు ఇస్తుంది. తాను ఎమ్మెల్యేలు, కార్యకర్తలను అధిష్ఠానం వద్దకు తీసుకువెళ్లి, బలాన్ని నిరూపించుకోవలసిన అవసరం లేదు. పార్టీ నేతలు, రాష్ట్ర ప్రజలంతా నా బలమని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.

## నన్ను ఎవరూ బెదిరించవద్దు

రాహుల్‌తో కరచాలనం చేస్తున్న శివకుమార్, చిత్రంలో సోనియా, ప్రియాంక, ఖర్గే

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** అపార్ట్‌మెంట్ నివాసుల సంఘాలు, సమాఖ్యలు నిర్వహించిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం పాల్గొన్నారు. ఈ సమయంలో కిరణ్ హెబ్బార్ అనే సభ్యుడు ఇచ్చిన వినతి పత్రాన్ని చదివి ఆయన ఆగ్రహానికి గురయ్యారు. 'అపార్ట్‌మెంట్, ప్లాట్ యజమానుల హక్కులకు భంగం కలిగించేలా చట్టాన్ని రూపొందించాలని పలు సంవత్సరాలుగా కోరుతున్నాం. ఇకపై వేచి ఉండే సహనాన్ని కోల్పోయాం. ఈసారి సమావేశాల్లో తమ వినతిని పరిష్కరించాలి' అంటూ ఆ సభ్యుడు ఇచ్చిన పత్రాన్ని చూసి ఆగ్రహాన్ని నియంత్రించుకోలేక పోయారు. 'ఎనిమిది సార్లు ఎమ్మెల్యేను అయ్యాను. ఒక్కసారి కూడా నా నియోజకవర్గంలో ప్రచారం చేసుకోలేదు. కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానుల ప్రచారంతోనే గెలుస్తూ వచ్చాను. ఏ పదవి కోసం వెంపర్లాడలేదు. కాంగ్రెస్‌కు నిష్ఠగల కార్యకర్తగా సేవలు అందిస్తూ వచ్చాను. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే పెద్దపీట వేస్తున్నాను. నేను ప్రజలందరి గళాన్ని వినిపించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు పెద్దపీట వేస్తాను. మీ సమస్యలను ఆలకించి, పరిష్కరించేందుకే ఈ సమావేశానికి వచ్చాను. అధికారం ఉన్నప్పటికీ నేల విడిచి ఎన్నడూ సాము చేయలేదు. మీరు నన్నే బెదిరించేలా మీరు మాట్లాడతారా' అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

## గుడ్డు భేషుగ్గా తినొచ్చు

దినేశ్‌గుండూరావు

**బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే:** గుడ్లు తింటే క్యాన్సర్ వస్తుందని జరుగుతున్న ప్రచారాన్ని ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఖండించారు. అపోహలను తొలగించేందుకు వేర్వేరు సంస్థలు విక్రయిస్తున్న బ్రాండెడ్ గుడ్లను పరీక్ష చేయాలని అధికారులకు సూచించామని చెప్పారు. తాము విక్రయించే కోళ్లకు తాము ఎలాంటి హార్మోన్ ఇంజక్షన్లను ఇవ్వడం లేదని కోడిమాంసం విక్రేతలు, కోళ్ల ఫారాల నిర్వాహకుల సంఘం స్పష్టం చేసింది. కోళ్లు త్వరగా పెరిగేందుకు గ్రోత్ హార్మోన్లను ఇంజక్షన్ల రూపంలో ఇస్తున్నారని జరుగుతున్న ప్రచారాన్ని సంఘం ప్రతినిధులు ఇప్పటికే ఖండించారు.

# శామనూరు.. ఇకలేరు

శివశంకరప్ప (పాతచిత్రం)

**దావణగెర, న్యూస్‌టుడే:** కర్ణాటక రాష్ట్రం దావణగెర సీనియరు కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శామనూరు శివశంకరప్ప (95) ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. గత నెల రోజులుగా అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. నేడు దావణగెరెలో వీరశైవ లింగాయత విధి విధానాలకు అనుగుణంగా సకల ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా నేడు (సోమ) బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాలను రద్దు చేశారు. పలు విద్యాసంస్థలను నెలకొల్పిన శివశంకరప్ప ప్రస్తుతం వీరశైవ మహాసభకు అధ్యక్షునిగానూ సేవలు అందిస్తున్నారు. ఆయన కుమారుడు ఎస్ఎస్ మల్లికార్జున్ ఉద్యానశాఖ మంత్రిగా పని చేస్తుండగా, ఆయన కోడలు ప్రభా మల్లికార్జున్ లోక్‌సభకు మొదటిసారి ఎంపికయ్యారు. శివశంకరప్ప మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులు, మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, బసవరాజ బొమ్మై, జగదీశ్ శెట్టర్, తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

### విద్యారంగానికి నిరుపమాన సేవలు

**చిత్రదుర్గం,:** మధ్య కర్ణాటక దావణగెర పట్టణం విద్యాసంస్థలకు గుర్తింపు పొందింది. దావణగెర ఎమ్మెల్యే, మాజీ మంత్రి దివంగత శామనూరు శివశంకరప్ప ఇందుకు ప్రధాన కారణమంటే అతిశయోక్తి కాదు. ఆరు దశాబ్దాల క్రితం వ్యాపారం చేసుకోవడానికి వచ్చిన వ్యక్తి పట్టణ రూపురేఖలను మార్చివేశారు. స్మార్ట్ సిటీగా, విద్యాసంస్థల కేంద్రంగా విరాజిల్లడానికి శివశంకప్ప సంకల్ప బలం ఎంతో ఉంది. బాపూజీ విద్యాసంస్థను స్థాపించి తద్వారా అనేక విద్యాలయాలను నెలకొల్పారు. ఏటా వేలాది మంది విద్యార్థులు ఇక్కడ ఉత్తమ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాసంస్థ పరిధిలో దావణగెరలో రెండు వైద్య కళాశాలలు, ఒక దంత కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, రెండు ఎంబీఏ కళాశాలలు, నాలుగు డిగ్రీ కళాశాలలు, న్యాయ కళాశాల, నర్సింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, కన్నడ, ఆంగ్ల మాధ్యమాల్లో పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలలు నెలకొల్పారు. సహకార రంగంలో బాపూజీ సహకార బ్యాంకు పట్టణ వ్యాపారులు, ప్రజల నమ్మకానికి మారుపేరుగా నిలిచింది. పట్టణంలో పలు కల్యాణ మంటపాలు నిర్వహిస్తున్నారు. మైసూరు విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యుడిగా పనిచేసినపుడు దావణగెరలో మైసూరు విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రం ప్రారంభించారు. రెండు దశాబ్దాల పాటు స్నాతకోత్తర కేంద్రం నడపడానికి ఆర్ఎల్ న్యాయ కళాశాల భవనాన్ని ఉచితంగా ఇచ్చారు. దావణగెర స్నాతకోత్తర కేంద్రానికి శివగంగోత్రి వద్ద 24 ఎకరాల భూమిని దానంగా ఇవ్వడమే కాక 1998లో రూ.2 కోట్ల సొంత ఖర్చుతో భవనాన్ని నిర్మించి ఇచ్చారు.

## మరో ఏడాది బెయిలు దక్కదు

పవిత్ర గౌడ

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో ఏ1గా ఉన్న నటి పవిత్రా గౌడ మరో ఏడాది పాటు కారాగారంలోనే ఉండే పరిస్థితి నెలకొంది. గతంలో హైకోర్టు ఇచ్చిన బెయిలును, సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. మూడు నెలలుగా ఆమె పరప్పన కారాగారంలో ఉంటూ, వేసుకుంటున్న బెయిలు అర్జీలను దిగువ న్యాయస్థానాల నుంచి ఉన్నత న్యాయస్థానం రద్దు చేస్తూ వచ్చింది. ఆమె తరఫున సీనియరు న్యాయవాది బాలన్ కేసు విచారణ చేపట్టారు. బెయిలు వచ్చేందుకు కనీసం ఏడాది సమయం పట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటికే ఈ కేసులో మొదటి అభియోగపత్రాన్ని దాఖలు చేశారు. పవిత్రా గౌడపై పలు తప్పుడు వివరాలను అందులో నమోదు చేశారని పేర్కొన్నారు. దానిపై తాను న్యాయపోరాటాన్ని కొనసాగిస్తానని చెప్పారు.

## ప్చ్..ధరను తగ్గించలేం

**బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే:** నమ్మ మెట్రో సేవలు ప్రారంభమైన అనంతరం పలు ప్రాంతాల్లో వాహన రద్దీ సమస్య కొంత మేర అదుపునకు వచ్చింది. ఇటీవల కాలంలో ధరల పెంపు ఎక్కువైందని ప్రయాణికులు ఆక్రోశించారు. ధరల పెంపు నిర్ణయం రాష్ట్రానిదని, కాదు కేంద్రానిదని అధికార పార్టీ, విపక్ష నేతల మధ్య వాగ్యుద్ధం, ఆరోపణలు చోటు చేసుకున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులకు నెలపాస్‌లను ప్రవేశ పెట్టాలని కూడా విన్నపాలు వచ్చాయి. అయితే ఎవరికీ పాస్‌లను జారీ చేయడం, ధరలను తగ్గించడం, సీనియరు సిటిజన్లకు రాయితీ ధరలో టిక్కెట్లను జారీ చేసే ఆలోచన లేదని బీఎంఆర్‌సీఎల్, ధరలను నిర్ణయించే సమితి స్పష్టం చేసింది. విద్యార్థులకు గ్రూపు పాస్‌లను జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.

## కంపించిన భూమి

**దావణగెరె, న్యూస్‌టుడే:** దావణగెరె జిల్లాలో పలు ప్రాంతాలలో, చుట్టుపక్కల జిల్లాల్లో శనివారం రాత్రి భూమి కంపించిన అనుభవం స్థానికులకు కలిగింది. జగళూరు, కూడ్లిగి, చెళ్లకెరె తాలూకాల్లో శనివారం రాత్రి ఏడు గంటలకు పెద్ద చప్పుడు వినిపించింది. ఆ తర్వాత కొంత సమయానికే భూమి కంపించిన అనుభవం కావడంతో అందరూ పరుగులు పెడుతూ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. రాత్రి పది గంటల వరకు ఇళ్ల వెలుపలే ఉండగా, మరికొందరు రాత్రంతా జాగారం చేస్తూ బయటే చలి మంటలు వేసుకుని కూర్చున్నారు.

## రాష్ట్రం గజగజ

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చలి పులి వణికిస్తోంది. ధార్వాడ, గదగ, బీదర్, కలబురగి, విజయపుర, బాగలకోటె, రాయచూరు, యాదగిరి, బెళగావి జిల్లాల్లో బుధవారం వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బీదర్ (9), ధార్వాడ (9.6), విజయపుర, రాయచూరు (10), హాసన, బెళగావి (10.4), చిక్కబళ్లాపుర (11.9), బెంగళూరు గ్రామీణం (11.8), బెంగళూరు నగరం (12.8), బెంగళూరు దక్షిణం (14.2)లలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

## ప్లాస్టిక్ పార్కు ఏర్పాటుకు చర్యలు

**బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే:** ప్లాస్టిక్ పరిశ్రమను కాపాడే దిశలో మంగళూరు, విజయపురల్లో తలా 200 ఎకరాల్లో ప్లాస్టిక్ పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడించారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే, వారికి భూమి కేటాయిస్తామని ఆయన తెలిపారు. ఈ రెండు పార్కుల్లో ఒకచోట కేంద్ర పెట్రో కెమికల్ ఇంజినీరింగ్, సాంకేతికత సంస్థ (సీఐపీఈటీ) ఇక్కడ క్యాంపస్‌ను ఏర్పాటు చేసుకుంటుందని ప్రకటించారు. దేశంలో ప్లాస్టిక్ పరిశ్రమపై 40 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, వచ్చే ఏడాది నాటికి మరో 15 లక్షల మందికి ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉందని వివరించారు. కర్ణాటకలో పెట్టుబడిదారులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. దిల్లీలోని భారత మండపంలో వచ్చే ఫిబ్రవరి 5-10 వరకు 12వ వార్షిక అంతర్జాతీయ ప్లాస్టిక్ సమావేశాలు ఉంటాయని, రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు అందులో పాల్గొంటారని వివరించారు.

## ఇతర భాషల చిత్రాలు వద్దు

**బెంగళూరు (జేపీనగర):** కర్ణాటకలో మొదటి పాన్ ఇండియా నటునిగా 'కిచ్చ' సుదీప్‌కు గుర్తింపు ఉంది. కన్నడ, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో అభిమానులను సంపాదించుకున్నారు. ఇటీవల కన్నడ చిత్రాలకు మాత్రమే పరిమితమయ్యారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇతర భాషల చిత్రాల్లో నటించేందుకు సమయం ఇచ్చే బదులుగా, పూర్తిగా కన్నడలో నటించేందుకే ప్రాధాన్యత ఇస్తున్నానని చెప్పారు.

## అప్పుల ఉరి .. తీస్తోంది ఊపిరి

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** కర్ణాటకలో గత రెండేళ్లలో 2,809 మంది అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కేంద్రం విడుదల చేసిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం రైతుల ఆత్మహత్య అంశంలో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. పలు రాష్ట్రాలతో పోల్చితే అభ్యుదయ, ప్రగతిశీల రాష్ట్రంగా కర్ణాటకకు గుర్తింపు ఉంది. ఐటీ, బీటీ, సాంకేతిక రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ అతివృష్టి, అనావృష్టి, ధరలు పడిపోవడం, వివిధ కారణాలతో పంట నష్టం, లాభదాయక ధరలు లభించకపోవడం, అప్పుల ఊబిలో చిక్కుకుని బయటకు రాలేక ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గతంతో పోల్చితే సూక్ష్మ రుణ సంస్థలు, ప్రైవేటు బ్యాంకుల వేధింపులు తగ్గడంతో ఆత్మహత్యల కేసులు తగ్గుముఖం పట్టినా, దేశంలో ఇప్పటికీ రెండో స్థానంలో ఆత్మహత్యలు కొనసాగడం దురదృష్టకరం.

### ఆ జిల్లాల్లోనే అధికం

చందన సీమలో 2023-24 నుంచి 2025-26 నవంబరు నెలాఖరు వరకు 2,809 మంది రైతులు ఆయా జిల్లాల్లో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీటిలో 366 మంది వ్యవసాయేతర కారణాలతోనే ప్రాణాలు తీసుకున్నారని వాటిని, ఆత్మహత్యగా పరిగణించడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ రెండున్నరేళ్లలో హావేరి (297), బెళగావి (260), కలబురగి (234), ధార్వాడ (195), మైసూరు (190), బీదర్ (159), హాసన (118), మండ్య (115) మంది బలవన్మరణం కేసులు నమోదయ్యాయి.

పొలం దున్నుకుంటున్న రైతు

పంట నష్టం, పంట కోసం చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారాన్ని అందిస్తామని ప్రకటించింది. పలు సాంకేతిక కారణాలు, రైతుల కుటుంబాల్లోని సభ్యుల మధ్య ఉన్న వివాదాలతో పలువురికి పరిహారాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

### పరిహారం ఏమూలకు?

బలవన్మరణానికి పాల్పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఒక్కటిగా ముందుకు వస్తే తక్షణమే పరిహారాన్ని విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో 2023-24లో ఆత్మహత్య చేసుకున్న వారిలో 1081 మంది కుటుంబాలకు రూ.54 కోట్లు, 2024-25లో 896 మంది కుటుంబాలకు రూ.44.80 కోట్లు, ఈ ఏడాది 193 మృతుల కుటుంబాలకు రూ.9.65 కోట్లను వితరణ చేశారు. మరో 233 మంది కుటుంబాలకు పరిహారాన్ని ఇచ్చే ప్రక్రియ పరిశీలన దశలో ఉందని అధికారులు తెలిపారు.

## పోలీసు వేషం.. చేసేది మోసం

**బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే:** సీసీబీ పోలీసులు పేరుతో పోలీసు యునిఫారం ధరించి ఒంటరిగా నివశించే మహిళలు ఉండే ఇళ్లలోకి ప్రవేశించి బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న యశ్వంతపుర మత్తికెరె నివాసి మల్లికార్జున(27), మల్లణ్ణ(36), ప్రమోద్(30), వినయ్(36)లను విద్యారణ్యపుర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు మల్లికార్జున బళ్లారిజిల్లా సిరగుప్ప తాలూకా నివాసి. గతంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోసం అనేక సార్లు పోటీ పరీక్షలకు హాజరయ్యారు. ఎంపిక కాలేదు. దీంతో పోలీసు యూనిఫాం ధరించి ప్రజలను బెదిరించి నగదు వసూలు చేయడం ప్రారంభించారు. అందుకు ముగ్గురు స్నేహితులు సహకరించారు. ఈనెల7న రాత్రి నవీన్ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని బెదిరించి నగదు, నగలు దోచుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కారు, ద్విచక్రవాహనం, రూ.45వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## భజన మండలి వీడియోను పంచుకున్న భాజపా

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భజన మండలిని ఏర్పాటు చేసుకున్నారని కర్ణాటక భాజపా ఎద్దేవా చేసింది. శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ ఇద్దరూ హార్మోనియం వాయిస్తూ 'ఎష్టు దినా ఇల్లే కూరతి, నిన్న మనె బ్యారైతె' అంటూ పాడుతున్న వీడియోను కృత్రిమ మేధస్సుతో సృష్టించి పోస్టు చేశారు. అదే వీడియోలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ఆమె సోదరుడు చెన్నరాజ్‌లు భజన చేస్తున్నట్లు వీడియోను రూపొందించారు. భాజపా కర్ణాటక శాఖ ఎక్స్ కార్ప్ ఖాతాలోని ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

## 'సంక్రాంతి తర్వాత రాజకీయ మార్పులు'

**బెంగళూరు (రామమూర్తి నగర), న్యూస్‌టుడే:** కర్ణాటక రాజకీయాల్లో మకర సంక్రాంతి అనంతరం మార్పులు ఉంటాయని కోడిమఠం స్వామి డాక్టర్ శివానంద శివయోగి రాజేంద్ర స్వామి పేర్కొన్నారు. కర్ణాటకలో అధికార పార్టీలో జరుగుతున్న రాజకీయాలు సుఖాంతం అవుతాయని చెప్పారు. శాసనసభలో పద్దు ప్రవేశపెట్టేంత వరకు రాజకీయాల్లో పోరు ఉంటుందని చెప్పారు. 'సంగమేశను అరివనె, ఆదరె ఒళహడ్డ బందిదె. శివన ముడియ ఎరడు దుండు మల్లిగెగళు శివన బలపాద సేరియావు. ముందె సుఖాంత్యవాగలిదె' అంటూ తనదైన శైలిలో ఆయన భవిష్య వాక్కును వినిపించారు.

# చందనసీమలో బూచాళ్లు

● పెరిగిపోతున్న బాలల అపహరణ కేసులు

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** కర్ణాటకలో బాలల అపహరణ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. మూడేళ్లలో 9,639 మంది అపహరణకు గురి కాగా, అందులో 71.50 శాతం బాలికలు ఉన్నారు. ప్రతి పోలీసు ఠాణాలో ప్రత్యేకంగా బాలుర కోసం ప్రత్యేక విభాగం, బాలల సంక్షేమ అధికారిని ప్రభుత్వం నియమించింది. బాలలు అపహరణకు గురవుతున్నారంటే దానికి పోలీసులను నిందించడం సరికాదని నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వెల్లడించారు. తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఎవరిని భేటీ అవుతున్నారని తల్లిదండ్రులు నిఘా అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. చందనసీమలో 2023-2025 నవంబరు వరకు 9,639 మంది అపహరణకు గురికాగా, అందులో 6,891 మంది బాలికలు, 2748 మంది బాలురు ఉన్నారు. అదే విధంగా 2023లో 3,039, 2024లో 3411, 2025లో నవంబరు 15 వరకు 3,189 మంది అపహరణకు గురయ్యారు. అపహరణ అనంతరం కొద్ది రోజులకే పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి 8,455 మందిని రక్షించారు. వివాహం చేసుకుంటామని నమ్మించి బాలికలను అపహరించేవారి సంఖ్య పెరిగింది. తల్లిదండ్రులు తిడుతున్నారని, బడిలో వెనుక బడుతున్నామని, పని మానేసి కూలి పనులు చేసుకుందామని అనుకునే బాలలను గుర్తించి మరికొందరు అపహరిస్తున్నారు. అపహరణ అనంతరం వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి నగదు డిమాండ్ చేస్తున్నారు.

### నగరంలోనే ఎక్కువ..

ఇతర ప్రాంతాలతో పోల్చితే ఈ మూడేళ్లలో బెంగళూరులోనే 3,268 మంది అపహరణకు గురయ్యారు. వీరిలో 2,290 మంది బాలికలు ఉన్నారు. బెంగళూరు అనంతరం తుమకూరు (450), రామనగర (305), దావణగెరె (301), శివమొగ్గ (297), మండ్య (283), హాసన (264), చిత్రదుర్గ (244) కేసులు నమోదయ్యాయి. బాలలు మాదక ద్రవ్యాల బారిన పడకుండా, అపరిచితులు వేసే వలలో చిక్కుకోకుండా పోలీసులు అన్ని విద్యా సంస్థల పరిధిలో క్రమం తప్పకుండా జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తలకు మించిన అప్పులు, విలాసవంతమైన జీవితం కోసం నగదు సమకూర్చుకునే క్రమంలో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలకు వెళ్లడంతో, బాలలకు సరైన సంరక్షణ లేక దారి తప్పుతున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అధ్యయనంలో గుర్తించింది.

# ప్రజలకు పరీక్ష పెడతారా?

బాగలూరు క్రాస్ వద్ద సాగుతున్న పనులపై అధికారులను నిలదీస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ

**బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే:** మెట్రో సిమెంట్ స్తంభం నిర్మించేందుకు రెండు నెలలు సమయంపడుతుందని కాని ఆరునెలల సమయం తీసుకుని వాహనదారులు, ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారా? అని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ ఉన్నతాధికారులపై విరుచుకుపడ్డారు. ఆదివారం ఇక్కడ మెట్రో రెండో-బి దశ నిర్మాణం సాగుతున్న నాగవార మెట్రోస్టేషన్ నుంచి బాగలూరు క్రాస్ వరకు జరుగుతున్న పనులను ఆదివారం ఆయన, బీఎంఆర్‌సీఎల్, ఉత్తర నగర పాలికె ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఉన్నతాధికారులు, గుత్తేదారులు పనితీరుపై ధ్వజమెత్తారు. కొన్నేళ్ల నుంచి మెట్రో పనులు సాగుతున్నాయని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మిగతా ప్రాంతాల్లో పనులు పూర్తి చేసిన ఇక్కడ ఎందుకు జాప్యం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని మండిపడ్డారు. మెట్రో నిర్మాణ పనులు వ్యర్థాలతో పాదచారి మార్గాలు, సర్వీసు రహదారులు నిండి సంచరించలేని పరిస్థితి నెలకొందని తక్షణం వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అనవసరంగా కొన్ని రహదారులను మూసివేస్తున్నారని, దీనివల్ల సంచార రద్దీ పెరుగుతుందన్నారు. త్వరగా మెట్రో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

# సందర్శకుల తాకిడి.. పెరిగిన రాబడి

## ■ బన్నేరుఘట్టకు మంచి రోజులు

ఏపుగా పెరిగిన వృక్షాల మధ్య నీటి కొలనులు

**బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే:** బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించే సందర్శకుల సంఖ్య పెరిగింది. గత రెండువారాల్లో సందర్శకుల రాకతో రూ.60 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశీయులు నిత్యం ఉద్యానవనాన్ని సందర్శిస్తున్నారని అందువల్ల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని చెబుతున్నారు. వర్షాలకు ఏపుగా పెరిగిన వృక్షాలు, ఎటువైపు చూసినా పచ్చదనం మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది. సెలవు రోజుల్లో పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులు ఉద్యానవనం సందర్శించేందుకు వెళ్తున్నారు. సందర్శకుల కోసం బీఎంటీసీ ప్రత్యేక బస్సులు ఉన్నాయి. పర్యాటక శాఖ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు ప్రత్యేక వాహనాలను నడుపుతోంది. సఫారీ, జంతు ప్రదర్శనశాల, సీతాకోక చిలుక ఉద్యానవనాన్ని సందర్శించేందుకు అవకాశం ఉంది. రాత్రిళ్లు అక్కడ ఉండేందుకు జంగిల్ లాడ్జిలను నిర్మించారు. సందర్శన, జంగిల్ లాడ్జిల్లో ఉండేందుకు పర్యాటక శాఖ నిర్ణయించిన రుసుం చెల్లించాలి. జంగిల్ లాడ్జిల్లో సందర్శకులు ఉండేందుకు అనుమతిస్తున్నారు.

### ఆకట్టుకునేలా ఉద్యానవనం

నగర దక్షిణ ప్రాంతంలో బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం 731.88 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఉద్యానవనంలో 270 జాతుల మొక్కలు ఉన్నాయి. 150 రకాల సీతాకోక చిలుకలు, వివిధ రకాల 250 రకాల పక్షులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 72 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాగిహళ్లి అటవీ ప్రదేశాన్ని సఫారీగా అభివృద్ధి చేశారు. సఫారీలో 28 పులులు, ఏడు తెల్లపులులు, 23 సింహాలు ఉన్నాయి. వాటితో పాటు జీబ్రా, కంచరగాడిదలు, రెండువందలకు పైగా ఏనుగులు, వివిధ రకాల పాములు, జింకలు, కోతులు, అడవి పందులు, అడవి దున్నలు, ఎలుగుబంట్లు, తదితర జంతువులు ఉద్యానవనంలో ఉన్నాయి. చిన్నపాటి సెలయేర్లు, వాగులు ఉండటంతో జంతువులకు తాగు నీటి సమస్య తలెత్త లేదని అధికారులు తెలిపారు. వివిధ పండ్ల వృక్షాలు ఉన్నాయి. నిత్యం అక్కడ ఉండే ప్రాణులకు ఆహారాన్ని సిబ్బంది వేస్తున్నారు. కొందరు దాతలు ముందుకు వచ్చి సింహాలు, పులులు, ఏనుగులు, జింకలు, జీబ్రా తదితర జంతువులను దతత్త తీసుకుని వాటి ఆహార ఖర్చును భరిస్తున్నారు. ఇలా 315 మంది వివిధ జంతువులను దతత్త తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఉద్యానవనంలో ఏనుగులు

పులుల సంచారం

గోడ పత్రికను విడుదల చేసి ప్రదర్శిస్తున్న సభ్యులు, న్యాయమూర్తులు

## నూతన పన్ను విధానంతో మెరుగైన సేవలు

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకే నూతన పన్ను విధానాన్ని కేంద్రం రూపొందిస్తోందని సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భూయాన్ పేర్కొన్నారు. అఖిల భారత ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సమాఖ్య నిర్వహించిన 28వ జాతీయ జాతీయ సదస్సును ప్రారంభించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.వెంకట రమణిని అభినందించి మాట్లాడారు. ఆదాయపు పన్ను చట్టాలను జారీలోకి తీసుకువచ్చిన ఆరు దశాబ్దాల అనంతరం పలు చట్టాలను రద్దు చేసి, కొత్త చట్టాన్ని రూపొందించారన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జారీలోకి వస్తున్న ఈ నూతన పన్ను విధానంలో తేలికగా అర్థం చేసుకునేలా, డిజిటల్ మార్పునకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేలా, పారదర్శకత ఉండేలా రూపొందించారని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి వస్తువులు, సేవల పన్నులు చెల్లించే వారికి కూడా ఇప్పటికే ఆ ప్రక్రియను కేంద్రం సరళీకృతం చేసిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ పన్నులను నిజాయతీగా, పారదర్శకతతో చెల్లిస్తే 2047 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్ర చార్టర్డ్ అకౌంటెంట్ల సంఘం, ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సంఘం ప్రతినిధులు సమీర్ ఎస్ జెన్ని, శివప్రకాశ్ విరక్తిమఠ, మంజునాథ్, ఎఫ్ఆర్ సింఘ్వి, జి.ఎస్. ప్రశాంత్, రాఘవేంద్ర పురాణిక్, రవీంద్ర కోరె, తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో తండ్రీకుమారులకు గాయాలు

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** వంటగ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై అనంతరం మంటలు లేచిన సంఘటనలో తండ్రీకుమారుడు గాయపడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున ఎస్.ఆర్. నగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. గాయపడిన కరగప్పగార్డెన్ నివాసులు వెంకటేశప్ప(60) ఆయన కుమారుడు రాజేశ్(24) విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. రాత్రి ఇద్దరు హోటల్ నిద్రించారు. ఆసమయంలోగ్యాస్ సిలిండర్ లీక్ అయింది. తెల్లవారు జామున 2.30గంటలకు మూత్రవిసర్జన కోసం లేచిన వెంకటేశప్ప కరెంట్ స్విచ్ ఆన్‌చేశారు. దీంతో మంటలు రావడంతో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.

## 'మా ఇంట్లో దొంగలు పడ్డారు'

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** పద్మశ్రీ అవార్డు గ్రహీత, గ్రామీ అవార్డు విజేత రికీ కేజ్ తన ఇంట్లో దొంగతనమైందని తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆన్‌లైన్‌లో ఆహారాన్ని సరఫరా చేసే జొమాటోకు చెందిన ఫుడ్ డెలివరీ బాయ్ తన ఇంటి ముఖ్యపత్రాల రేళ్ళి నిర్వహించారు. ఆయన తన ఇంటి చుట్టూ మూతను దోచుకెళ్లాడంటూ తన నివాసం ఆవరణలోని సీసీ కెమెరా ఫుటేజీను ట్వీట్ చేశారు. బెంగళూరు నగర పోలీసులకు ఆ వీడియోలను ట్యాగ్ చేస్తూ ఈ వ్యక్తి ఎవరో గుర్తించడంలో సాయం చేయగలరా అని కోరారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. 'రికీ, ఇది నిజంగా ఆందోళన కలిగించే అంశం. మా డెలివరీ భాగస్వాముల నుంచి ఇలాంటి ప్రవర్తనను మేం కచ్చితంగా ప్రోత్సహించం. అవసరమైన చర్యలు తీసుకునేందుకు అనువుగా మేం దీనిపై తక్షణమే దర్యాప్తు చేస్తున్నాం.

## సీసీ కెమెరాలకు సౌరశక్తి

చెట్టుకు అమర్చిన సీసీ కెమెరాలు

**చామరాజనగర, న్యూస్‌టుడే:** బండీపుర అటవీ విభాగంలో సౌర శక్తితో పని చేసే సీసీ కెమెరాలను అటవీశాఖ అధికారులు అమర్చారు. వన్యప్రాణుల కదలికలను, వాటి గణతి కోసం వీటి సేవలను వినియోగించుకుంటామని అధికారులు తెలిపారు. అడవి అంచున ఉన్న గ్రామాల్లో ఇప్పటికీ వన్యప్రాణుల దాడులు కొనసాగుతున్నాయి. గుండ్లుపేట తాలూకా దేపాపురంలో గురుమల్లప్ప అనే వ్యక్తికి చెందిన ఆవుపై పులి శనివారం దాడి చేసి చంపింది. చామరాజనగర, మైసూరు జిల్లాల పరిధిలో గత 50 రోజుల్లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది 22 పులులను, వాటి పిల్లలను బంధించిన విషయం విదితమే.

## విదేశీయుణ్ని రక్షించిన తీర ప్రాంత దళం

**కార్వార, న్యూస్‌టుడే:** సరకుల తరలించే ఓడలో వస్తున్న ఉక్రెయిన్ దేశ పౌరుడు (62) గుండెపోటుకు గురయ్యారు. సమాచారం అందుకున్న తీరప్రాంత రక్షణ దళానికి చెందిన సిబ్బంది, వైద్యులని తీసుకుని వెళ్లి అతనికి ప్రథమ చికిత్సను అందించారు. కార్వార నుంచి గోవా తీరం వరకు వెళ్లి ఆ ప్రయాణికుడ్ని తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పించడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. తీర ప్రాంత రక్షణ దళం సేవలను ఓడ సిబ్బంది, రోగి కుటుంబ సభ్యులు ప్రశంసించారు.

అంబులెన్సు వద్ద తీరప్రాంత రక్షణ దళం

## దర్శన్‌పై అభిమానుల పోస్టులు

**బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే:** ఈసారి ఎన్నికల అనంతరం నటుడు దర్శన్ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయన అభిమానులు పోస్టర్లు చేసి, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలతో పోస్టులు పెట్టారు. హత్య కేసులో కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న తమ అభిమాన నటుడు, నిర్దోషిగా బయటకు వస్తాడని పలువురు అభిమానులు విశ్వసిస్తున్నారు. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన రీల్‌లో దర్శన్ పంచె, చొక్కా వేసుకుని విధాన సౌధ ఆవరణలో కార్యకర్తలతో కరచాలనం చేస్తూ వెళ్తున్నట్లు వీడియో చేసి పోస్టు చేశారు. ఆపోస్టులు ఇప్పుడు వైరల్‌గా మారాయి. వాటిని కొందరు మెచ్చుకోగా, ఎక్కువ మంది విమర్శలు గుప్పించారు.

అభిమానులు సృష్టించిన దర్శన్ చిత్రం

## వివాహాన్ని ఆపాలని.. యువతి గలాటా

**చిక్కమగళూరు, న్యూస్‌టుడే:** చిక్కమగళూరులోని ఒక కల్యాణ మండపంలోకి వచ్చిన ఒక యువతి (29), అక్కడ జరుగుతున్న వివాహాన్ని అడ్డుకునేందుకు విఫలయత్నం చేసింది. పదేళ్ల పాటు తనను ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించిన శరత్ (30) ఇప్పుడు మరో యువతిని పెళ్లి చేసుకుంటున్నాడని ఆరోపించింది. వరుడి తరపు బంధువులు ఆమెపై దాడి చేసి, అక్కడి నుంచి పంపించారు. చిక్కమగళూరుకు చెందిన శరత్ పదేళ్లుగా హాసనకు చెందిన యువతిని ప్రేమిస్తూ వచ్చాడు. వివాహ లాంఛనాలు తాము ఇవ్వలేమని యువతి తల్లిదండ్రులు చెప్పడంతో శరత్‌కు మరో యువతితో వివాహం నిశ్చయించారు. వివాహం జరుగుతున్న చోటుకు వచ్చిన ఆమెపై దాడి జరిగింది. బాధితురాలు చిక్కమగళూరు ఠాణాలో ఘటనపై ఫిర్యాదు చేసింది. శరత్‌కు ఇప్పటికే ఒక వివాహమై విడాకులు ఇచ్చి, ఈ రెండో వివాహాన్ని చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

వరుడు (ఎడమ), అతని ప్రేమికురాలు (కుడి)

## హాకీ విజేతలు కొడగు, బెంగళూరు సౌత్ జట్లు

### రన్నర్స్‌గా నిలిచిన మైసూరు, బళ్లారి

బాలికల విన్నర్స్ కప్ అందుకున్న కొడగు స్పోర్ట్స్ హాస్టల్ జట్టు

**బళ్లారి, న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి పదవీ పూర్వ కళాశాల జట్ల హాకీ పోటీల్లో బాలిక, బాలుర విభాగాల నుంచి కొడగు, బెంగళూరు సౌత్ జట్లు జయకేతనం ఎగురవేశాయి. జిల్లా క్రీడామైదానంలో ఆదివారం సాయంత్రం ఫైనల్స్ జరిగాయి. బళ్లారి, బెంగళూరు పదవీ పూర్వ శిక్షణశాఖ, ప్రధాన ఆచార్యుల సంఘం, బళ్లారి సెయింట్ జాన్ పదవీ పూర్వ కళాశాల సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. బాలికల విభాగం ఫైనల్స్‌లో కొడగు-మైసూరు, బాలురు విభాగంలో బెంగళూరు సౌత్-బళ్లారి జట్లు తలపడ్డాయి. కొడుగు జట్టు 1-0 గోల్స్ తేడాతో మైసూరు జట్టుపై గెలుపొందగా బాలుర విభాగం ఫైనల్స్‌లో బెంగళూరు సౌత్ జట్టు 6-0 తేడాతో బళ్లారి జట్టును చిత్తు చేసింది. ఆదివారం ఉదయం బాలికల విభాగం సెమీఫైనల్స్‌లో బళ్లారి-కొడుగు, బెంగళూరు నార్త్- మైసూరు జట్లు తలపడ్డాయి. బాలుర విభాగం సెమీఫైనల్స్‌లో బళ్లారి-కొడగు, బెంగళూరు సౌత్-బెంగళూరు నార్త్ జట్లు హోరాహోరీగా పోరాడాయి.

### బాలికల విభాగంలో..

రాష్ట్ర స్థాయి హాకీలో మొదట ఫైనల్స్‌లో కొడుగు స్పోర్ట్స్ హాస్టల్-మైసూరు జట్లు తలపడ్డాయి. గంటలపైగా జరిగిన హోరాహోరీలో నరాలు తెగే ఉత్కంఠతో సాగింది. మూడూ క్వార్టర్స్‌లో ఏ జట్టూ ఒక గోల్ కూడా చేయలేదు. మరో 6 నిమిషాల్లో ముగుస్తుందగా, చివరి క్వార్టర్స్‌లో పెనాల్టీ షూట్ అవకాశం కొడగు జట్టుకు వచ్చింది. చాకచక్యంగా నంబరు-9 ప్రతిక గోల్ చేసి జట్టును గెలుపు వాకిట నిలిపింది. మిగిలిన ఆరు నిమిషాలు పాటు మైసూరు జట్టు గోల్ చేయడానికి అవకాశం ఇవ్వలేదు. చివరికి ఒక గోల్‌తో కొడగు స్పోర్ట్స్ హాస్టల్ జట్టు గెలుపొంది.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

### బాలుర జట్లు..

ఫైనల్స్‌లో బాలురు విభాగంలో బెంగళూరు సౌత్-బళ్లారి స్పోర్ట్స్ హాస్టల్ జట్లు తలపడ్డాయి. బెంగళూరు సౌత్ జట్టు మొత్తం ఆరు గోల్స్ చేయగా, బళ్లారి స్పోర్ట్స్ హాస్టల్ జట్టు ఒక గోల్ మాత్రమే చేసింది. చివరికి బెంగళూరు సౌత్ జట్టు గెలుపొంది, జాతీయ హాకీ పోటీలకు ఎంపికైంది. బెంగళూరు సౌత్ జట్టులో నంబరు-27 జోషిన్ నాలుగు గోల్స్ చేసి రికార్డ్ సృష్టించాడు. అత్యుత్తమ గోల్ కీపర్‌గా పలంగప్ప (కొడగు), బెస్ట్ డిఫెండర్‌గా బళ్లారి జట్టుకు చెందిన యల్లప్ప, బెస్ట్ స్కోరర్‌గా బెంగళూరు సౌత్‌కు చెందిన ఎం.సి.జోషిన్‌గా నిలిచి వ్యక్తిగత కప్ అందుకున్నారు. గెలుపొందిన జట్లుకు జిల్లా పదవి పూర్వ శిక్షణశాఖ ఉపనిర్దేశకులు లక్ష్మణ హాలదళ్లి, ప్రధాన ఆచార్యులు నాగేశ్వరరావు, వ్యాయామ విభాగం అధ్యాపకులు సతీష్ రెడ్డి, హాకీ కోచ్ జాకీర్‌లు తదితరులు పాల్గొని కప్ అందజేసి అభినందించి మాట్లాడారు.

కప్ అందుకున్న బాలుర విన్నర్స్ బెంగళూరు సౌత్ జట్టు

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి మృతి

**బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే:** అతివేగంగా సంచరిస్తున్న సరకు రవాణా వాహనం ముందు సంచరిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో గాయత్రిలేఔట్ నివాసి కిరణ్(38) మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున కె.ఆర్.పురం పోలీసుఠాణా పరిధిలో జరిగింది. పాతమద్రాసు రోడ్డులో తెల్లవారు జామున ఒకటి గంటకు ఈసంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బాలుడి తండ్రికి జరిమానా

**మంగళూరు, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి 66లో నంతూరు వద్ద 2025 మార్చి 30 వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు (17), ఒక వ్యక్తి (30) గాయపడ్డారు. కద్రి ట్రాఫిక్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బాలుడికి ద్విచక్ర వాహనం ఇచ్చిన ఆరోపణలపై అతని తండ్రి అబ్దుల్ హమీద్‌కు జేఎంఎఫ్‌సి ఎనిమిదో న్యాయస్థానంలో న్యాయమూర్తి ఫవాజ్ రూ.25 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని దాడి

**బెళగావి, న్యూస్‌టుడే:** ఎన్నిసార్లు పిలిచినా భార్య పుట్టింటి నుంచి వెనక్కు రావడం లేదని భీమా భోసలే అని వ్యక్తి అత్తింటికి వెళ్లి అందరిపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. అథణి తాలూకా తెలసంగ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భార్యను తీసుకువెళ్లేందుకు అత్తవారింటికి వచ్చిన భీమా భోసలే తనతో పాటు సీసాలో పెట్రోలు తెచ్చుకున్నాడు. నీతో మా అమ్మాయిని పంపమని చెప్పడంతో అత్త, మామలు, ఇతర కుటుంబ సభ్యులపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. స్థానికులు అక్కడకు చేరుకుని అతని ప్రయత్నాలను వమ్ము చేసి అథణి గ్రామీణ ఠాణా పోలీసులకు అప్పగించారు.

## తండ్రీకొడుకులపైనా..

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** దొడ్డబళ్లాపురలోని పుట్టయ్యన అగ్రహారలో వెళ్తున్న కార్తిక్ (26) అనే యువకుడిపై ఐదుగురు దుండగులు శనివారం రాత్రి మారణాయుధాలతో దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్తిక్ తండ్రి మధుసూదన్ కూడా గాయపడ్డారు. స్థానికులు అక్కడికి రావడంతో నిందితులు పరారయ్యారు. స్థానికంగా ఒక యువతితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకుని యువతి కుటుంబ సభ్యులు గత నెల 23న రాజీ పంచాయతీ చేశారు. ఆమెను కలవకూడదని తీర్మానించినా, కార్తిక్ తీరు మార్చుకోకపోవడంతో ఈ దాడి జరిగిందని అనుమానిస్తున్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం దొడ్డబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

## బస్సు చోరీకి యత్నం

**బెంగళూరు (గ్రామీణం):** ఆనేకల్ వద్ద శనివారం రాత్రి నిలిపి ఉంచిన బీఎంటీసీ బస్సును దొంగిలించేందుకు నలుగురు దుండగులు ప్రయత్నించారు. బస్సును వంద అడుగులు ముందుకు నడిపిన అనంతరం నియంత్రణ తప్పి రహదారి పక్కన గోడను ఢీకొట్టి ఆగిపోయింది.

స్నానాల తొట్టెలో పాండా

నేతి డబ్బా


గోపురం కేకు

ఆఫ్‌రోడ్డు ట్రాకులో కారు

## ఆకాంక్షలకు అద్దం పట్టిన ప్రదర్శన

**బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే:** బెంగళూరు వార్షిక కేకులు, చక్కెర అచ్చుల ప్రదర్శన బేకరీ వ్యాపారానికి, కొత్త స్టార్టప్ అవకాశాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్యాలెస్ మైదానం త్రిపురవాసిని విభాగంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బేకింగ్ అండ్ కేక్ ఆర్ట్, మై బేకర్ స్టార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రదర్శన 1970లో మొదటి సారి ప్రారంభమైంది. ఆ ఏడాది నీలగిరీస్ గ్రూపు వ్యవస్థాపకుడు సి.రామచంద్రన్ ఒకే ఒక భారీ కేకును ప్రదర్శించారు. ఆహారం, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేసేలా ఈ ప్రదర్శన ప్రతి ఏడాది కొనసాగుతూ వస్తోంది. డిజైనర్ కేకుల ధర రూ.3వేల రూ.4 వేల ధరల నుంచి ప్రారంభమవుతున్నాయి. వివాహాలు, పుట్టిన రోజు, శుభ కార్యక్రమాలు, క్రిస్మస్, కొత్త ఏడాది, పండగలు, సినిమా, ధారావాహికల చిత్రీకరణలతో పాటు ప్రత్యేక సందర్భాల్లో బహుమతులుగా ఇచ్చేందుకు వివిధ డిజైన్లలో కేకులు, చక్కెర అచ్చులతో బొమ్మలు చేయించుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోయింది. కేకులను ఆన్‌లైన్‌లో ఆర్డరు తీసుకుని దేశంలోని ప్రతి చోటుకు చేర్చే అంకుర పరిశ్రమలు కూడా తెరపైకి వచ్చాయని ఇప్పటి ప్రదర్శన నిర్వాహక ప్రతినిధి గౌతమ్ తెలిపారు. రెండు టన్నుల కేక్ కోట, 800 కిలోల వేలాంగణి చర్చి తదితరాలకు చక్కని స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రదర్శనలో ఎక్కువ వేడి వెదజల్లని లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కేకుల తయారీపై ఆసక్తి ఉన్న వారికి లైవ్ బేకింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

EENADU Classifieds
JOBS

HYD యూనిట్ హాంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

## మహాకవి సిద్ధం

ఆదికవి పంప తన సాహిత్యం ద్వారా కులవ్యవస్థ పోరాటాలు ఆధారంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బరగూరు రామచంద్రప్ప దర్శకత్వంలో నిర్మిస్తున్న 'మహాకవి' చిత్రం చిత్రీకరణ జోరుగా సాగుతోంది. బరగూరు రామచంద్రప్ప దర్శకత్వం వహిస్తున్న 25 చిత్రం కావడం విశేషం. పంప రాసిన ఆది పురాణంలో కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ కథ ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. పంప రాసిన కొన్ని పద్యాలను చిత్రంలో ఉంచారు. పంప పాత్రను శ్రీకిశోర్ నటిస్తుండగా హీరోయిన్‌గా అనుషా రై,ఆకాంక్ష, సుందరరాజ్, ప్రమీళాజోయిస్, కుమారగోవింద, సుందరరాజు అరసు, వత్సలా మోహన్, రాఘవ్, హనుమంతేగౌడ, శాంతరాజు తదితరులు నటిస్తుండగా శమితా మల్నాడ్ సంగీతం అందిస్తున్నారు.


మహాకవి చిత్రంలో అనుషారై

## క్లాస్ ఆఫ్ మైసూరు చిత్రీకరణ

నగరంలోని బండెమహంకాళి అమ్మ దేవస్థానంలో 'క్లాస్ ఆఫ్ మైసూరు' చిత్రం చిత్రీకరణను ప్రారంభించారు. నటుడు దత్తణ్ణపై మొదటి దృశ్యాన్ని చిత్రీకరించారు. సినీ నటి తారా అనురాధ క్లాప్ ఇచ్చారు. కళాకారులందరు మైసూరు పట్టు పంచెలు, మైసూరు పేట ధరించి కార్యక్రమానికి హాజరయ్యారు. మైసూరు ప్యాలెస్, అంబారి తదితర అంశాలు ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నటు దర్శకుడు గౌతమ్ బసవరాజు తెలిపారు. దత్తణ్ణ, రంగాయణ రఘు, తబలనాణి, బిరాదర్, శరత్ లోహితాశ్య తదితరులు నటిస్తున్నారు. నాలుగు పాటలకు జోకూస్ట అందిస్తున్నారు.

సమావేశమైన చిత్ర బృందం

## ఆల్ఫా మ్యాన్ లవ్ వెగ్జాన్సి టీజర్ విడుదల

విభిన్నమైన ప్రేమకథ చిత్రం 'ఆల్ఫా మ్యాన్ లవ్ వెగ్జాన్సి' టీజర్ విడుదల చేశారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చినట్లు దర్శకుడు విజయ్ తెలిపారు. ప్రేమ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమన్నారు. కుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చి చిత్రాన్ని తిలకించే విధంగా నిర్మించినట్లు చెప్పారు. హేమంత్‌కుమార్, కార్తిక్ మహేశ్, గోపికా సురేష్, అవినాశ్, వినయ్‌బిద్దప్ప, మహంతేశ్, రాఘశివమొగ్గ తదితరులు నటిస్తున్నారు.

హేమంత్‌కుమార్, గోపికా సురేష్, తదితరులు

-బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే

## మద్యపానంపై కుడుకనమ్మక్కు

కుటుంబాలు, సమాజంపై మద్యపాన ప్రతికూల ప్రభావాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు 'కుడుకనమ్మక్కు' చిత్రం చిత్రీకరణ నగరంలోని శ్రీవిద్యాగణపతి దేవస్థానంలో ప్రారంభమైంది. ప్రాచీన కాలం నుంచి వస్తున్న మద్యపానం వల్ల ప్రజలు పడే కష్టాలను తెరపైకి తెచ్చినట్లు దర్శకుడు అస్కర్‌కృష్ణ తెలిపారు. ప్రజలను ఆలోచింపజేయడంతో పాటు హాస్యభరితంగా చిత్రం సాగుతుందన్నారు. చంద్రప్రభ వినోద్ గుబ్బరగాల, మిమిక్రీ గోపి, చైత్రాకుట్టూరు, ధరణి, తదితరులు నటిస్తుండగా మంజుకవి సంగీతం సాహిత్యం అందిస్తున్నారు.

కుడుకనమ్మక్కు చిత్రీకరణ ప్రారంభంలో నటీనటులు

(c) eenadu

# బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

## క్రికెట్ టోర్నీ విజేత సీఏ జట్టు

విజేతలకు కప్ అందజేస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు, సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: ట్యాక్స్‌మ్యాన్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా భారతీయ చార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థ(ఐసీఏఐ)నిలిచింది. సీఏ బళ్లారి శాఖ ఆధ్వర్యంలో వీరశైవ కళాశాల క్రీడామైదానంలో టోర్నీ నిర్వహించారు. కేంద్ర జీఎస్టీ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అధికారి అరుణ్‌కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థ శాఖ అధ్యక్షుడు గజరాజ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తమ్‌రెడ్డి, సభ్యులు విశ్వనాథ ఆచారి, శరత్‌పాటిల్, హనుమంత రెడ్డి, వెంకటేశ్, జితేంద్ర విజేతలకు కప్ అందజేసి అభినందించారు.

## రాయచూరులో దళిత సాహిత్య సమ్మేళనం

రాయచూరు: దళిత సాహిత్య పరిషత్ (బెంగళూరు), రాయచూరు జిల్లా దళిత సాహిత్య పరిషత్తు సంయుక్తంగా ఈ నెల 20, 21 తేదీల్లో స్థానిక రంగమందిరంలో 11వ అఖిల భారత దళిత సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహిస్తామని దళిత సాహిత్య పరిషత్తు రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ అర్జున్ గోళసంగి వెల్లడించారు. ఆయన ఆదివారం పత్రికా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మేళనం సర్వాధ్యక్షురాలుగా జయదేవి గాయకవాడను ఎంపిక చేశామన్నారు. విచార గోష్ఠి ప్రత్యేక ఉపన్యాసం, సాహిత్యంపై చర్చలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ రంగాల్లో సాధకులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని వివరించారు. 20వ తేదీ ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ మాజీ అధ్యక్షురాలు నరసమ్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మాజీ ఉపాధ్యక్షుడు జయణ్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.

## విజయనగర వీధుల్లో పర్యాటకుల సందడి

హంపీ విజయవిఠల ఆలయం, ఏకశిలారథం వద్ద సందర్శకులు

హొసపేటె, న్యూస్‌టుడే: వారాంతం ఆదివారం విజయనగర రాజధాని హంపీ వీధులు పర్యాటకులతో కిటకిటలాడాయి. పెద్ద సంఖ్యలో దేశ, విదేశీ పర్యాటకులు హంపీ సందర్శనకు వచ్చారు. ఇండిగో విమానాలు రద్దయిన సందర్భంగా 15 రోజుల నుంచి హంపీ వీధులు బోసిపోయాయి. ప్రస్తుతం విమాన సేవలను పునరుద్ధరించడంతో శని, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో సందర్శకులు హంపీ బాట పట్టారు. ఏటా హంపీకి 30 లక్షల మంది పర్యాటకులు వచ్చి వెళ్తారు. అక్టోబరు నుంచి మార్చి వరకు పర్యాటక సీజన్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో 20 లక్షమంది వస్తారు. మిగిలిన ఆరు నెలల్లో మరో 10 లక్ష మంది వచ్చి వెళ్తారు. హంపీ వీధుల్లో పర్యాటక సందడి నెలకొనడంతో ఆ ప్రాంతంలో వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది.

## సంత భవనం వద్దా? రహదారులే ముద్దా?

ఆరుబయటనే వ్యాపారాలు

బళ్లారి, న్యూస్‌టుడే: అంగట్లో అన్నీ ఉన్నా..అల్లుడి నోట్లో శని చందంగా బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌లో కూరగాయలు విక్రయించుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించినా..అధికారుల నిర్లక్ష్యంతో వ్యాపారులు రోడ్లపై ఫుట్‌పాత్ లపై విక్రయాలు చేస్తుండటంతో రూ.2.29కోట్లతో నిర్మించిన ఆదివారం సంత భవనం నిరుపయోగంగా మిగిలింది. రహదార్లపై, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయడంతో ఏపీఎంసీలో నిత్యం ట్రాఫిక్ అంతరాయంతో వినియోగదారులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

### కోట్లు వెచ్చించి నిర్మాణం

వర్షం వచ్చినా...ఎండ ఉన్నా...దుమ్ము..ధూళి లేకుండా కూరగాయలు తాజాగా ఉండాలి. వ్యాపారులు, వినియోగదారులకు అనుకూలంగా ఉండటం కోసం 2017-18లో విశాల ప్రదేశంలో రూ.2.29 కోట్లు భానువారం సంత(ఆదివారం) మార్కెట్‌ను నిర్మించారు. వ్యాపారులు కూరగాయలు విక్రయించుకోవడానికి ప్లాట్‌ఫారంలను ఏర్పాటు చేసి ఉచితంగా వితరణ చేశారు. వ్యాపారులు, కొనుగోలుదారులకు ఇబ్బంది ఉండకూడదని ప్రత్యేకంగా

### నిరుపయోగంగా రూ.2.29 కోట్ల నిర్మాణం

సామూహిక మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థను కల్పించారు. గాలి వెలుతురు రావడానికి అనుకూలంగా నిర్మించారు. మొత్తం 150 మంది వరకు కూరగాయలు విక్రయించుకోవడానికి ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేశారు. కానీ అందులో 10 మంది వ్యాపారులే కనిపిస్తారు. మిగిలిన ప్రాంతంలో పశువులు తారసపడతాయి.

### వ్యాపారులు ఎందుకు మొరాయిస్తున్నారు?

ఏపీఎంసీలో టోకు వ్యాపారులు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి, చిన్న వ్యాపారులకు విక్రయించాలి. చిన్న వ్యాపారులు ఆదివారం సంతలో తాజా కూరగాయలు విక్రయిస్తే వినియోగదారులు చక్కగా కొంటారు. నేడు పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. టోకు వ్యాపారులు

వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం

వారి దుకాణాల ముందు ఆరుబయటే, కిలోల కొద్దీ విక్రయించడం వల్ల చిన్న వ్యాపారుల వద్దకు వినియోగదారులు వెళ్లడం లేదు. టోకు వ్యాపారులు చిల్లర వ్యాపారం మానేస్తే... మేము ఆదివారం సంతకు వెళ్తామని పలు మార్లు అధికారులకు స్పష్టం చేశారు.

### వ్యాపారం కావడం లేదు

టోకు వ్యాపారులు వారి దుకాణాల వద్ద అర్ధ కిలో విక్రయించడం వల్ల ఎక్కువ మంది అక్కడే కొనుగోలు చేస్తున్నారు. చిన్న వ్యాపారులు ఆదివారం సంతలో ఉండడం వల్ల వ్యాపారం కావడం లేదు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. - మారెమ్మ, వ్యాపారి

### కర్రలు అడ్డంగా కట్టినా..

రోడ్లపై వ్యాపారాలు చేపట్టకూడదని అడ్డంగా కర్రలు కట్టినా...ప్రయోజనం కనిపించలేదు. టోకు వ్యాపారులతో మరోసారి సమావేశం నిర్వహించి, చిల్లర వ్యాపారం చేయకుండా నివారించడంతోపాటు చిన్న వ్యాపారులను ఆదివారం సంతలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం. - జయకుమార్, ఏపీఎంసీ కార్యదర్శి, బళ్లారి

## బాలల రంగభూమి ప్రశస్తికి ఎంపిక


అక్కి

రాయచూరు, న్యూస్‌టుడే : రంగభూమి కళాకారుడు వి.ఎన్.అక్కికి బాలల రంగభూమి క్షేత్ర గౌరవ (2023-24) పురస్కారానికి ఎంపిక చేసినట్లు కర్ణాటక బాలవికాస అకాడమీ వెల్లడించింది. ఈ నెల 16న బెళగావి సువర్ణసౌధ ఉత్తరద్వారం గాంధీ విగ్రహం దగ్గర సభాభవనంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఈ మేరకు కర్ణాటక బాలవికాస అకాడమీ యోజనాధికారి అక్కికి ఆహ్వానం పంపారు. అక్కి మూడు దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవలందిస్తున్నారు.

## 17న చలో బెళగావి

కంప్లి, న్యూస్‌టుడే: ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల ఉద్యోగుల వివిధ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 17న చలో బెళగావి కార్యక్రమం చేపట్టినట్లు ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహ కార్యదర్శి అంబిగర మంజునాథ తెలిపారు. కంప్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 విధానసభ ఎన్నికల్లో పాత పింఛన్ విధానం అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఎయిడెడ్ విద్యాలయాల ఉద్యోగులకు అన్ని సదుపాయాలు కల్పించాలి. .తదితర డిమాండ్లతో 17న బెళగావిలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కారటగిలో గురు వందనం

కారటగి, న్యూస్‌టుడే: స్థానిక జేపీ నగర్ శ్రీదేవి ఆలయ ఆవరణలో సోమవారం గురు వందన కార్యక్రమం జరగనుందని బ్రాహ్మణ సముదాయ నాయకులు తెలిపారు. బ్రాహ్మణ సముదాయ కుల గురువు సచ్చిదానంద జ్ఞానేశ్వర భారతి స్వామి, సుజ్ఞానంద భారతి స్వామి కారటగి రానున్నారు. స్వామీజీలను కరియప్ప తాత ఆలయం నుంచి శ్రీదేవి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి అక్కడ పాద పూజ, గురు వందనం, ధార్మిక సభ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## పౌరులకు పోలీసుల శిక్షణ

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పౌరులకు తుపాకీ వినియోగంలో శిక్షణ ఇవ్వటానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించామని ఎస్పీ ఎస్. జాహ్నవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 28 వరకూ ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తులు సమీపంలోని పోలీస్ ఠాణాలో దరఖాస్తులను స్వీకరించి, భర్తీ చేసిన వాటిని ఈ నెల 19 లోగా అదే ఠాణాలో సమర్పించాలని ఆమె సూచించారు. 21 ఏళ్లు పైబడిన వారు మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు.

## నేడు అయ్యప్ప పడి పూజ

సాలుంచిమర క్యాంపు (కారటగి), న్యూస్‌టుడే: తాలూకాలోని సాలుంచిమర క్యాంపు శిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం వివిధ పూజలు నిర్వహించనున్నారు. ఉదయం పంచామృత అభిషేకం, నవ గ్రహ పూజ, సర్వ దేవత మండపారాధన, సూర్య నమస్కారాలు, హోమం, ఊరేగింపు మధ్యాహ్నం అన్న సంతర్పణ రాత్రి పడి పూజ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శిర్డీ సాయిబాబా ఆలయ సమితి, ధర్మ శాస్త్ర అయ్యప్ప సేవా సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

## ఎమ్మెల్యే గారూ..సమస్యలు పరిష్కరించరూ!

హంపయ్యనాయక్‌ను స్వాగతిస్తున్న బసనగౌడ్ దద్దల్

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు విధానసభ పరిధిలోని దద్దల్ గ్రామంలో నిర్వహించనున్న ఆంజనేయ స్వామి, మారెమ్మదేవి జాతర సందర్భంగా దద్దల్ గ్రామానికి వచ్చిన హంపయ్యనాయక్‌ను ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ స్వాగతం పలికారు. మాన్వి పరిధిలోని కాతరకి గ్రామం నుంచి దద్దల్ వరకు రహదారి పనులను చేపట్టాలని స్థానికులు కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. రహదారి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అయ్యనగౌడ నాయక్, మౌనేశ్‌నాయక్, గోవింద్‌రాజ్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు చేయూత

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా

మాన్వి, న్యూస్‌టుడే : సమాచార లోపం కారణంగా దివ్యాంగులకు సరిగా ప్రభుత్వ సదుపాయాలు అందలేదని, వారికి చేయూత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ పేర్కొన్నారు. స్థానిక టీఏపీసీఎంఎస్ మైదానంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రమాణిక ప్రయత్నాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కల్మఠం విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ మాట్లాడుతూ దివ్యాంగులు సామాన్య ప్రజల కంటే అధిక సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. వారు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. ప్రముఖులు సజ్జద్ హుసేన్, సురేష్ విన్సెంట్, రాజా రామచంద్రనాయక్, మౌనేశ్‌నాయక్, వినోద్‌కుమార్, గుమ్మాబసవరాజ్, శివకుమార్ చల్మల్, లక్ష్మీ, సభ్యులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదానికి పెరుగుతున్న ప్రాధాన్యం

జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె, న్యూస్‌టుడే: నానాటికీ ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యం పెరుగుతోందని స్థానిక ఎమ్మెల్యే హెచ్.ఆర్.గవియప్ప అన్నారు. భారతీయ ఆయుష్ సమాఖ్య, హొసపేటె విభాగం ఆధ్వర్యంలో బోధ్వ-2025 శీర్షికన 'విద్ధ అగ్నికర్మ' అనే అంశంపై ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు క్రమేణ ఆయుర్వేద వైద్యం వైపు మళ్లుతున్నారన్నారు. హొసపేటెలో త్వరలో ప్రారంభంకానున్న 250 పడకల ప్రజాసుపత్రిలో ఆయుర్వేద వైద్యానికి 25 పడకలను కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఆయుర్వేద వైద్యనిపుణుడు పుణెకి చెందిన డాక్టర్ చంద్రకుమార్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ విద్ధ అగ్నికర్మ చికిత్స ద్వారా చాలా వ్యాధులు నయమయ్యాయి. ఆయుర్వేదంలో ఇది ఉత్తమ చికిత్స పద్ధతి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ వర్సిటీకి చెందిన డాక్టర్ సిద్ధనగౌడ పాటిల్, జిల్లా ఆయుష్ వైద్యాధికారి ఫణీంద్ర, తాలూకా అధ్యక్షుడు డాక్టర్ బి.వి.భట్, కార్యదర్శి చేతన్ సీనియర్ వైద్యులు మునివాసుదేవరెడ్డి, గురుమహాంతేశ్, కాశీలింగయ్య, దాసురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వచన సంకలన కృతి విడుదల

పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

మాన్వి, న్యూస్‌టుడే : అభ్యుదయ సాహితీవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సువర్ణగిరి మఠ రచించిన ఆధునిక వచన సంకలన నుడి నైవేద్య కృతిని ఆదివారం స్థానిక గెలాక్సీ హాల్లో జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు మహాంతేశ్ మస్కి విడుదల చేశారు. శరణుల వచనాలను స్ఫూర్తిగా తీసుకొని ఆధునిక వచనాలను రచించే పరంపరను సిద్ధలింగయ్య నాంది పలికారన్నారు. ఇప్పుడా పరంపరను చంద్రశేఖర్ అందిపుచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కల్మఠ విరూపాక్ష పండితారాధ్యస్వామీజీ, చికల్‌పర్వి రుద్రమునీశ్వర మఠం సదాశివస్వామీజీ, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శరణబసవ, మాజీ అధ్యక్షుడు బసవ ప్రభు పాటిల్, ప్రతినిధులు పంపయ్యస్వామి, గిరెయ్యపాటిల్, చైతన్యప్రభు, రాచమ్మ సాంబయ్యస్వామి, త్రయంబకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నాయకురాలు వరలక్ష్మికి శంకరప్ప అవార్డు

వరలక్ష్మికి అవార్డును అందజేసిన ఎమ్మెల్యే పుట్టణ్ణయ్య

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: రైతు నాయకురాలు వరలక్ష్మికి నులేనూరు శంకరప్ప అవార్డును అందుకున్నారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య ఆమెకు ప్రశస్తిని అందించి అభినందించారు. రైతు పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న దివంగత నులేనూరు శంకరప్ప రైతు సముదాయానికి చేసిన విశిష్ట సేవలకు గానూ ఆయన పేరిట ఈ ప్రశస్తిని ఏర్పాటు చేశామన్నారు. ఏటా ప్రగతి పర రైతులకు ఈ అవార్డును ఇస్తున్నట్లు తెలిపారు. వరలక్ష్మి కూడా గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలో రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాల అలసత్వంతో దేశంలో ప్రతి ఏటా రైతులు సుమారు రూ.3 లక్షల కోట్లు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రశస్తిని స్వీకరించిన వరలక్ష్మి మాట్లాడుతూ ఈ అవార్డును అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సమర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బడగలపుర నాగేంద్ర, ఉపాధ్యక్షుడు శివానంద కుగ్వే, చిక్కప్పనహళ్లి షణ్ముఖ, డాక్టర్ రవిశంకర్, యాదవరెడ్డి, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గీతా పఠనంతో మానవకల్యాణం

వేదికపై భగవద్గీత పఠనం చేస్తున్న స్వాములు, భక్తులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: నిత్యం గీతా పఠనం చేస్తే...మానవాళికి శుభం కలుగుతుందని..స్వామిని సిద్ధాత్మనంద సరస్వతి పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకృష్ణగీతా సేవాట్రస్ట్, గీతామందిరం బళ్లారి ఆధ్వర్యంలో గీతామందిర 39 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మార్కండేయస్వామి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన సామూహిక భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. బళ్లారి, ఉరవకొండ, రాయదుర్గం, ఆదోని, పత్తికొండ, మోకా, రాయచూరుకు చెందిన 1000మందికి పైగా భక్తులు పాల్గొని పారాయణం చేయడం శుభపరిణామమన్నారు. గీత గురించి కృష్ణచంద్రదాస్ ఇస్కాన్ స్వామిజీ ప్రసంగించారు. ఆధ్యాత్మిక చింతకులు జయరామ్, జానకీరామ్, వెంకటరమణ, బడిగించుల చంద్ర, పొబ్బతి రాజు, విజయ్‌భాస్కర్, జి.ఆర్.వెంకటేశులు, మార్కండేయ దేవస్థానం ధర్మకర్త తిరువీధుల వెంకటేశులు, డాక్టర్ రమేశ్‌గోపాల్, కార్పొరేటర్ గోవిందరాజులు, నాగభూషణ, చంద్రశేఖర్, రాజేశ్వరమ్మ, జగన్నాథ, ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు నాగరాజు తదితరులకు భగవద్గీత గ్రంథం, శాలువాతో సత్కరించారు. భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో వివిధ క్యాంపులవాసులు, నగరవాసులు, భక్తులు గీతా మందిరం కమిటీ సభ్యులు, రామాంజనేయనగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

శిబిరానికి హాజరైన అటవీ, పశుసంవర్ధక శాఖాధికారులు

## వన్యప్రాణుల సంరక్షణ ముఖ్యం

బళ్లారి, న్యూస్‌టుడే: అటవీశాఖ బళ్లారి ప్రాంతీయ విభాగం, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా ఆదివారం సండూరు గురుభవన్‌లో అటవీశాఖ, పశు వైద్య అధికారులకు వన్యప్రాణుల చట్టం, నేరాల శాస్త్రీయ దర్యాప్తుపై శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ డాక్టర్ ఎన్.ఉప్పార్, శరణ్‌కుమార్, డి.ఎఫ్.ఒ. కె.ఎన్.బసవరాజ్ ప్రారంభించి మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..వాటికి హాని కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు, చట్టాల గురించి అధికారులకు వివరించారు. అటవీశాఖ, సంవర్ధకశాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో శేషాద్రి, వెంకటేశ్, అమ్మణ్ణనవర్ తదితరులు పాల్గొన్నారు.

## బసవణ్ణ సిద్ధాంతాలు ఆదర్శనీయం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పరమేశ్వర్

కంప్లి, న్యూస్‌టుడే: బసవణ్ణ సిద్ధాంతాలు అందరికీ ఆదర్శం. సోమరితనం నుంచి దూరం చేసేందుకు బసవణ్ణ 'కాయకవే కైలాస' అన్న తత్వం జాగృతి కలిగిస్తుంది. ఈ తత్వాన్ని యువతకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం ఉందని కంప్లి షామియాచంద్ ప్రభుత్వ పీయూ కళాశాల ప్రిన్సిపల్ సిద్ధణ్ణ పరమేశ్వర్ తెలిపారు. తాలూకా శరణ సాహిత్య పరిషత్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బసవణ్ణ రచనలు అన్ని కాలాలకు ఆదర్శమంటూ 'బసవ వచన-విచార ధార' అన్న అంశంపై ఉపన్యసించారు. పరిషత్ అధ్యక్షుడు జి.ప్రకాశ్ మాట్లాడారు. పరిషత్ కార్యాధ్యక్షుడు బంగి దొడ్డ మంజునాథ, సణాపుర గవి వీరనగౌడ, సజ్జెద వీరభద్రప్ప, ఎస్.డి.బసవ రాజ్, శ్యామ్‌సుందర రావు, కె.చంద్రశేఖర్, రాము, అశోక్ కుకనూరు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బోధనతో నైపుణ్యాభివృద్ధి

విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను ప్రారంభిస్తున్న పయ్యావుల విష్ణు, జె.శ్రీనివాసరావు, నలంద మాగం తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కె.ఎల్.విశ్వవిద్యాలయం 2026-27 ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు 2026 జనవరి 3 నుంచి 5 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. ప్రతిభ గల విద్యార్థులు పరీక్షలు రాసి ప్రవేశాలు పొందాలని సంస్థ అడ్మిషన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాస్‌రావు కోరారు. బళ్లారి శ్రీ చైతన్య పదవీ పూర్వ గ్రూపు, కె.ఎల్.విశ్వవిద్యాలయం సంయుక్తంగా శనివారం రాత్రి బళ్లారి శ్రీ చైతన్య కళాశాల క్యాంపస్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కె.ఎల్.విశ్వవిద్యాలయం ఎన్.ఐ.ఆర్.ఎఫ్‌లో 26వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. బళ్లారి శ్రీ చైతన్య విద్యాసంస్థల నిర్దేశకులు పయ్యావుల విష్ణు మాట్లాడుతూ బళ్లారి శ్రీ చైతన్య విద్యా సంస్థలను తమ తండ్రి పయ్యావుల డాక్టర్ రాధాకృష్ణ ప్రారంభించి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థ నిర్దేశకులు నలంద మాగం, ప్రధాన ఆచార్యులు రాఘవేంద్ర సింథెల్, కె.ఎల్.విశ్వవిద్యాలయం డైరెక్టర్లు శివ రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల వద్ద చోరీ.. నిందితుడికి బేడీలు

### రూ.4 లక్షలు స్వాధీనం

నిందితుడు గణేశ్

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: బ్యాంకుల వద్ద పొంచి ఉండి డబ్బు డ్రా చేసుకొని బయటకు వచ్చేవారిని మోసగించి పరారవుతున్న నిందితుడు శివమొగ్గ జిల్లా భద్రావతికి చెందిన గణేశ్ (19) అనే వ్యక్తిని మొలకాల్మూరు పోలీసు అధికారులు అదుపులోకి తీసుకొని రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆదివారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. మొలకాల్మూరులో బ్యాంకుల వద్ద చోటుచేసుకున్న రెండు చోరీ కేసులలో నిందితుడు పాలు పంచుకొన్నట్లు తెలిపారు. అతనికి సహకరించిన ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. నిందితుడు మొలకాల్మూరు బస్టాండు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులకు చిక్కాడు. అదుపులోకి తీసుకొని అతణ్ని ప్రశ్నించగా అసలు సంగతి బయట పడినట్లు తెలిసింది.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

### రాజీ ద్వారా 7354 కేసుల పరిష్కారం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా, రాష్ట్ర, జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తాళూరు రహదారిలోని నూతన కోర్టు భవనంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన ఆచార్యులు జస్టిస్ కె.జి.శాంతి ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. పెద్ద సంఖ్యలో పెండింగ్, వ్యాజ్యానికి ముందు కేసులను పరిష్కరించడమే అదాలత్ ప్రధాన లక్ష్యమన్నారు. రాజీ ద్వారా కేసును పరిష్కరించుకున్న వారికి మొత్తం కోర్టు రుసుము తిరిగి చెల్లిస్తున్నట్లు చెప్పారు.

సమస్యను రాజీ ద్వారా పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

### వివిధ దావాల ముగింపు

జిల్లాలో 9 కుటుంబ కేసులు పరిష్కారమయ్యాయి. దూరంగా ఉన్న భార్యాభర్తలను రాజీ చేసి కలిసి జీవించడానికి ముందుకు వచ్చారు. రాజీ ద్వారా సుమారు 85 చెక్కుబౌన్స్ కేసులు కొలిక్కివచ్చాయి. సుమారు రూ. 2,48,41,056 పరిహారంగా ఇచ్చారు. రాజీ ద్వారా 44 బ్యాంకు వివాదాలు సమసిపోయాయి. రూ. 1,83,17,626, పరిహారం చెల్లించారు. 18 సొమ్ము రికవరీ కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. వీటి ద్వారా రూ.46,15,167 చెల్లించారు. 48 ప్రమాద పరిహారం కేసులు పరిష్కారమయ్యాయి. రూ.5,46,85,000 పరిహారం చెల్లించారు. ఉద్యోగుల పరిహారం చట్టం కింద 4 కేసుల్లో రూ. 54,80,000 పరిహారం చెల్లించారు. 17 వాటా విభజన కేసులు, 20 ఎం.వి.సి కేసులు, 71 సివిల్ కేసులు పరిష్కరించి నగదును పరిహారం అందజేశారు.

కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శాంతి, న్యాయమూర్తి రాజేష్ హొసమని

### 23 ఏళ్ల నాటి వ్యాజ్యానికి స్వస్తి

23 ఏళ్లుగా పెండింగ్ ఉన్న సివిల్ సూట్ నం: 335/2002, తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సివిల్ సూట్ నం 643-2026, ఐదేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న 4 చెక్కు బౌన్స్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. మొత్తం కేసులు పరిష్కారమైనవి 7354 కేసులు, వాటి ద్వారా పరిహారం మొత్తం రూ. 16,99,82,418 ఇచ్చిపుచ్చుకోవడంపై ఒప్పందాలు చేసుకున్నారు. జిల్లాలో 13 న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి, న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి రాజేష్ ఎన్.హొసమని ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కురుగోడు ఉరుసు

ఉరుసులో ప్రార్థనలు చేస్తున్న స్పీకర్ ఖాదర్, ఎమ్మెల్యే గణేశ్

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: జగద్గురు హజరత్ ఖాజా సయ్యద్ షా ఖాదరలింగ సాహెబ్(స్వామి) నాలుగో వార్షిక ఉరుసు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉరుసు సందర్భంగా శనివారం రాత్రి గంధం ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖ వీధుల్లో గంధం ఊరేగింపు కంప్లి రహదారి మీదుగా నగరంలో పలు ప్రముఖ రహదారులు, కూడళ్లలో నిర్వహించారు. బాణసంచా పేల్చారు. తాసిరామ్, రామ్ డోలు, తదితర కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉరుసు సందర్భంగా ఆదివారం ఉదయం జగద్గురు హజరత్ ఖాజా సయ్యద్ షా ఖాదరలింగ సాహెబ్(స్వామి) ప్రత్యేక పూజలు చేసి ప్రార్థనలు చేశారు. జిల్లా నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందు జాగ్రత్తగా కురుగోడులో భద్రత ఏర్పాట్లు చేశారు. విధానసభ స్పీకర్ యు.టి.ఖాదర్ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో తోరగణల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. కొంత సేపు విశ్రాంతి తీసుకుని రోడ్డు మార్గాన బయలుదేరి ఉరుసులో పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలోని రైతులు, యువత సుఖ సంతోషాలతో జీవనం సాగించాలన్నారు. బెళగావి విధానసభ సమావేశంలో ముఖ్యమంత్రి ఉత్తర కర్ణాటకలోని సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. స్పీకర్‌తో పాటు ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్, మాజీ మంత్రి పి.టి.పరమేశ్వరనాయక్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అలిబాబ హుసేని తదితరులు ఉన్నారు.

## తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 14-12-2025 (ఉ. 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1618.42 | 1629.25 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 532 | 3,419 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 16,688 | 5,828 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 57.012 | 91.274 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

(c) eenadu

ఏపుగా పెరిగిన వృక్షాల మధ్య నీటి కొలనులు

# సందర్శకుల తాకిడి.. పెరిగిన రాబడి

## బన్నేరుఘట్టకు మంచి రోజులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనాన్ని సందర్శించే సందర్శకుల సంఖ్య పెరిగింది. గత రెండువారాల్లో సందర్శకుల రాకతో రూ.60 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలు, విదేశీయులు నిత్యం ఉద్యానవనాన్ని సందర్శిస్తున్నారని అందువల్ల ఆదాయం గణనీయంగా పెరుగుతోందని చెబుతున్నారు. ఏపుగా పెరిగిన వృక్షాలు, ఎటువైపు చూసినా పచ్చదనం మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది. సెలవు రోజుల్లో పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులు ఉద్యానవనం సందర్శించేందుకు వెళ్తున్నారు. సందర్శకుల కోసం బీఎంటీసీ ప్రత్యేక బస్సులు ఉన్నాయి. పర్యాటక శాఖ ఉద్యానవనాన్ని సందర్శించేందుకు ప్రత్యేక వాహనాలను నడుపుతోంది. సఫారీ, జంతు ప్రదర్శనశాల, సీతాకోక చిలుక ఉద్యానవనాన్ని సందర్శించేందుకు అవకాశం ఉంది. రాత్రిళ్లు అక్కడ ఉండేందుకు జంగిల్ లాడ్జిలను నిర్మించారు. సందర్శన, జంగిల్ లాడ్జిల్లో ఉండేందుకు పర్యాటక శాఖ నిర్ణయించిన రుసుం చెల్లించాలి. జంగిల్ లాడ్జిల్లో సందర్శకులు ఉండేందుకు అనుమతిస్తున్నారు.

**ఆకట్టుకునేలా ఉద్యానవనం**

నగర దక్షిణ ప్రాంతంలో బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం 731.88 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఉద్యానవనంలో 270 జాతుల మొక్కలు ఉన్నాయి. 150 రకాల సీతాకోక చిలుకలు, వివిధ రకాల 250 రకాల పక్షులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 72 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాగిహళ్లి అటవీ ప్రదేశాన్ని సఫారీగా అభివృద్ధి చేశారు. సఫారీలో 28 పులులు, ఏడు తెల్లపులులు, 23 సింహాలు ఉన్నాయి. వాటితో పాటు జీబ్రా, కంచ గాడిదలు, రెండువందలకు పైగా ఏనుగులు, వివిధ రకాల పాములు, జింకలు, కోతులు, అడవి పందులు, అడవి దున్నలు, ఎలుగుబంట్లు, తదితర జంతువులు ఉద్యానవనంలో ఉన్నాయి. చిన్నపాటి సెలయేర్లు, వాగులు ఉండటంతో జంతువులకు తాగు నీటి సమస్య తలెత్తలేదని అధికారులు తెలిపారు. వివిధ పండ్ల వృక్షాలు ఉన్నాయి. నిత్యం అక్కడ ఉండే ప్రాణులకు ఆహారాన్ని సిబ్బంది వేస్తున్నారు. కొందరు దాతలు ముందుకు వచ్చి సింహాలు, పులులు, ఏనుగులు, జింకలు, జీబ్రా తదితర జంతువులను దతత్త తీసుకుని వాటి ఆహార ఖర్చును భరిస్తున్నారు. ఇలా 315 మంది వివిధ జంతువులను దతత్త తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఉద్యానవనంలో ఏనుగుల దండు

పులుల సంచారం




గోద పత్రికను విడుదల చేసి ప్రదర్శిస్తున్న సభ్యులు, న్యాయమూర్తులు

## నూతన పన్ను విధానంతో మెరుగైన సేవలు

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకే నూతన పన్ను విధానాన్ని కేంద్రం రూపొందిస్తోందని సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్కొన్నారు. అఖిల భారత ట్యాక్స్ ప్రాక్టీషనర్ల సమాఖ్య నిర్వహించిన 28వ జాతీయ సదస్సును ప్రారంభించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.వెంకట రమణిని అభినందించి మాట్లాడారు. ఆదాయపు పన్ను చట్టాలను జారీలోకి తీసుకువచ్చిన ఆరు దశాబ్దాల అనంతరం పలు చట్టాలను రద్దు చేసి, కొత్త చట్టాన్ని రూపొందించారన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జారీలోకి వస్తున్న ఈ నూతన పన్ను విధానంలో తేలికగా అర్థం చేసుకునేలా, డిజిటల్ మార్పులను ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేలా, పారదర్శకత ఉండేలా రూపొందించారని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి వస్తువులు, సేవల పన్నులు చెల్లించే కాలికి కూడా ఇప్పటికే ఆ ప్రక్రియను కేంద్రం సరళీకృతం చేసిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ పన్నులను నిజాయతీగా, పారదర్శకతతో చెల్లిస్తే 2047 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తి జస్టిస్ విభు బక్రు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్ర ఛార్టర్డ్ అకౌంటెంట్ల సంఘం, ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ సంఘం ప్రతినిధులు సమీర్ ఎస్ జెన్ని, శివప్రకాశ్ విరక్తిమఠ, మంజునాథ్, ఎఫ్‌ఆర్ సింఘ్వి, జి.ఎస్. ప్రశాంత్, రాఘవేంద్ర పురాణిక్, రవీంద్ర కోరె, తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

## ‘మా ఇంట్లో దొంగలు పడ్డారు’

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: పద్మశ్రీ అవార్డు గ్రహీత, గ్రామీ అవార్డు విజేత రికీ కేజ్ తన ఇంట్లో దొంగతనమైందని తన ఎక్స్ కార్ప్ ఖాతాలో పోస్టు చేశారు. ఆన్‌లైన్‌లో ఆహారాన్ని సరఫరా చేసే జొమాటోకు చెందిన ఫుడ్ డెలివరీ బాయ్ తన ఇంటి చుట్టుపక్కల రెక్కీ నిర్వహించి, అనంతరం సంపుపై ఉన్న మూతను దోచుకు వెళ్లాడంటూ తన నివాసం ఆవరణలోని సీసీ కెమెరాల పుటేజ్‌లను ట్వీట్ చేశారు. బెంగళూరు నగర పోలీసులకు ఆ వీడియోలను ట్యాగ్ చేస్తూ ఈ వ్యక్తి ఎవరో గుర్తించడంలో సాయం చేయగలరా అని కోరారు. ఇటువంటి ఘటన మీకు కూడా ఎదురు కావచ్చు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. ‘రికీ, ఇది నిజంగా ఆందోళన కలిగించే అంశం. మా డెలివరీ భాగస్వాముల నుంచి ఇలాంటి ప్రవర్తనను మేం కచ్చితంగా ప్రోత్సహించం. అవసరమైన చర్యలు తీసుకునేందుకు అనువుగా మేం దీనిపై తక్షణమే దర్యాప్తు చేస్తున్నాం. మీ నుంచి వివరాలు పొందేందుకు దయచేసి మీ చరవాణి నంబరును మాకు ఇన్‌బాక్సులో పంపించగలరు’ అని జొమాటో కేర్ ప్రతినిధులు ఆయన ట్వీట్‌కు బదులిచ్చారు.

రికీ కేజ్

చెట్లకు అమర్చిన సీసీ కెమెరాలు

## సీసీ కెమెరాలకు సౌరశక్తి

చామరాజనగర, న్యూస్‌టుడే: బండీపుర అటవీ విభాగంలో సౌర శక్తితో పని చేసే సీసీ కెమెరాలను అటవీశాఖ అధికారులు అమర్చారు. వన్యప్రాణుల కదలికలను, వాటి గణతి కోసం వీటి సేవలను వినియోగించుకుంటామని అధికారులు తెలిపారు. అడవి అంచున ఉన్న గ్రామాల్లో ఇప్పటికీ వన్యప్రాణుల దాడులు కొనసాగుతున్నాయి. గుండ్లుపేట తాలూకా దేపాపురలో గురుమల్లప్ప అనే వ్యక్తికి చెందిన ఆవుపై పులి శనివారం దాడి చేసి చంపింది. చామరాజనగర, మైసూరు జిల్లాల పరిధిలో గత 50 రోజుల్లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది 22 పులులు, వాటి పిల్లలను బంధించిన విషయం విదితమే.

అభిమానులు సృష్టించిన దర్శన్ చిత్రం

## దర్శన్‌పై అభిమానుల పోస్టులు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: ఈసారి ఎన్నికల అనంతరం నటుడు దర్శన్ ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయన అభిమానులు పోస్టర్లు చేసి, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలతో పోస్టులు పెట్టారు. హత్య కేసులో కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న తమ అభిమాన నటుడు, నిర్దోషిగా బయటకు వస్తాడని పలువురు అభిమానులు విశ్వసిస్తున్నారు. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన రీల్‌లో దర్శన్ పంచ, చొక్కా వేసుకుని విధాన సౌధ ఆవరణలో కార్యకర్తలతో కరచాలనం చేస్తూ వెళ్తున్నట్లు వీడియో చేసి పోస్టు చేశారు. ఈపోస్టులు ఇప్పుడు వైరల్‌గా మారాయి. వాటిని కొందరు మెచ్చుకోగా, ఎక్కువ మంది విమర్శలు గుప్పించారు.

## విదేశీ పౌరుడ్ని కాపాడిన తీర ప్రాంత రక్షణదళం

కార్వార, న్యూస్‌టుడే: సరకులు తరలించే ఓడలో వస్తున్న ఉక్రెయిన్ దేశ పౌరుడు (62) గుండెపోటుకు గురయ్యాడు. సమాచారం అందుకున్న తీరప్రాంత రక్షణ దళానికి చెందిన సిబ్బంది, వైద్యుడిని తీసుకుని వెళ్లి అతనికి ప్రథమ చికిత్సను అందించింది. కార్వార నుంచి గోవా తీరం వరకు వెళ్లి ఆ ప్రయాణికుడ్ని తీసుకువచ్చి ఆసుపత్రిలో చేర్పించడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. తీర ప్రాంత రక్షణ దళం సేవలను ఓడ సిబ్బంది, రోగి కుటుంబ సభ్యులు ప్రశంసించారు.

అంబులెన్సు వద్ద తీరప్రాంత రక్షణ దళం

## వివాహాన్ని ఆపాలని.. యువతి గలాటా

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: చిక్కమగళూరులోని ఒక కల్యాణ మండపంలోకి వచ్చిన ఒక యువతి (29), అక్కడ జరుగుతున్న వివాహాన్ని అడ్డుకునేందుకు విఫలయత్నం చేసింది. పదేళ్లపాటు తనను ప్రేమించి, వివాహం చేసుకుంటానని నమ్మించిన శరత్ (30) ఇప్పుడు మరో యువతిని పెళ్లి చేసుకుంటున్నాడని ఆరోపించింది. వరుడి తరఫు బంధువులు ఆమెపై దాడి చేసి, అక్కడి నుంచి పంపించారు. చిక్కమగళూరుకు చెందిన శరత్ పదేళ్లుగా హాసనకు చెందిన యువతిని ప్రేమిస్తూ వచ్చాడు. వివాహ లాంఛనాలు తాము ఇవ్వలేమని యువతి తల్లిదండ్రులు చెప్పడంతో శరత్‌కు మరో యువతితో వివాహం నిశ్చయించారు. వివాహం జరుగుతున్న చోటుకు వచ్చిన ఆమెపై దాడి జరిగింది. బాధితురాలు చిక్కమగళూరు ఠాణాలో ఘటనపై ఫిర్యాదు చేసింది. శరత్‌కు ఇప్పటికే ఒక వివాహమై విడాకులు ఇచ్చి, ఈ రెండో వివాహాన్ని చేసుకున్నాడని ప్రాథమిక విచారణలో పోలీసులు గుర్తించారు.

వరుడు (ఎడమ), అతని ప్రేమికురాలు (కుడి)

## బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

| | |
|---|---|
| బీన్స్- | 55 |
| క్యారెట్- | 70 |
| బీరకాయలు- | 55 |
| క్యాబేజి- | 35 |
| క్యాలీఫ్లవర్(ఒక్కోటి)- | 30 |
| సొరకాయ- | 55 |
| దొండకాయలు- | 45 |
| పొట్లకాయ- | 45 |
| పచ్చి మిరపకాయలు- | 70 |
| కాకర కాయలు- | 55 |
| టమాటా(నాటు)- | 55 |
| టమాటా(సాధారణ)- | 45 |
| గుమ్మడి- | 35 |
| ఆలుగడ్డ- | 35 |
| ఉల్లి(మేలురకం)- | 25 |
| ఉల్లి(మామూలు)- | 20 |
| వెల్లుల్లి- | 140 |
| సాంబారు ఉల్లి- | 165 |
| బీట్‌రూట్- | 55 |
| వంకాయలు- | 55 |
| బెండకాయలు- | 55 |
| ముల్లంగి- | 55 |
| నిమ్మకాయ- | 120 |

**పండ్లు, ఫలాలు ధరలు**

| | |
|---|---|
| వాషింగ్టన్ ఆపిల్- | 385 |
| సిమ్లా ఆపిల్- | 265 |
| గ్రీన్ ఆపిల్- | 325 |
| అరటి కాయలు- | 35 |
| సపోటా- | 65 |
| పైనాపిల్- | 65 |
| బొప్పాయి- | 30 |
| ఆరంజి- | 95 |
| బత్తాయి- | 65 |

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

## అగ్నిప్రమాదంలో తండ్రీకుమారులకు గాయాలు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: వంటగ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై అనంతరం మంటలు లేచిన సంఘటనలో తండ్రీకుమారుడు గాయపడిన ఘటన ఆదివారం తెల్లవారుజామున ఎస్.ఆర్.నగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. గాయపడిన కరగప్పగార్డెన్ నివాసులు వెంకటేశప్ప(60) ఆయన కుమారుడు రాకేశ్(24) విక్టోరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి పక్కన హోటల్ నిర్వహిస్తున్నారు. రాత్రి ఇద్దరు హోటల్ నిద్రించారు. ఆసమయంలోగ్యాస్ సిలిండర్ లీక్ అయింది. తెల్లవారు జామున 2.30గంటలకు మూత్ర విసర్జన కోసం లేచిన వెంకటేశప్ప కరెంట్ స్విచ్ ఆన్‌చేశారు. దీంతో మంటలు రావడంతో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చి మంటలను ఆర్పారు. కేసు దర్యాప్తులోఉంది.

## ఇద్దరి యువకుల అరెస్టు

బెంగళూరు(యశ్వంతపుర): ప్రమాదకరమైన వీలింగ్ చేస్తున్న యువకులు చరణ్, మదన్‌ను అత్తిబెలె పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి హోసూరు రోడ్డులో ఇద్దరు ద్విచక్రవాహనంపై వీలింగ్ చేస్తున్న సమయంలో పోలీసులు గుర్తించి అదుపునకు తీసుకున్నారు. వీలింగ్‌ను ప్రశ్నించిన బస్సు డ్రైవర్లతో వీరు గొడవపడినట్లు పోలీసులు తెలిపారు.

## బ్రహ్మానంద గురూజీపై కేసు నమోదు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: నివేశనం ఇప్పిస్తానంటూ తన నుంచి నగదు తీసుకుని వంచించి, ఇప్పుడు తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ బ్రహ్మానంద గురూజీపై ఒక మహిళ (30) ఫిర్యాదు చేసింది. దొడ్డబళ్లాపుర తాలూకా మళెకోటె మహర్షి శ్రీ వాల్మీకి గురుకుల పీఠాధిపతి బ్రహ్మానంద గురూజీ నివాసానికి సమీపంలోనే వద్దే బాధిత మహిళ, తన భర్తతో కలిసి ఉండేవారు. రూ.13 లక్షల విలువైన నివేశనాన్ని రూ.12 లక్షలకు ఇప్పిస్తానని తనను నమ్మించారని, బయానాగా రూ.8 లక్షలు తీసుకుని, ఏడాదైనా రిజిస్ట్రేషన్ విషయాన్ని మాట్లాడలేదని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని అడిగేందుకు వెళితే, తన గదికి వచ్చి తనకు శారీరక వాంఛలు తీర్చాలని గురూజీ డిమాండ్ చేశారు. అతని ఫోన్‌కాల్స్, వీడియో కాల్స్, లైంగిక వేధింపులను తన చరవాణిలో రికార్డు చేసుకుంది. ఈ విషయం తెలుసుకుని రూ.50 వేలు ఇస్తానని, ఆ వీడియోలు, ఆడియో దస్త్రాలు తొలగించాలని ఆమెపై ఒత్తిడి చేశాడు. అన్ని సాక్ష్యాలను ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కలిసి అందించింది. ఆ మహిళ, ఆమె భర్త, ఇతర కుటుంబ సభ్యులు తనను నగదు కోసం వేధిస్తున్నారని, తప్పుడు ఆరోపణలతో బెదిరిస్తున్నారని గురూజీ పోలీసు ఠాణాలో మరో ఫిర్యాదు చేశారు.

## ఆరుగురికి కటకటాలు

హాసన, న్యూస్‌టుడే: కాఫీతోటల యజమాని జగన్నాథ శెట్టిపై మారణాయుధాలతో దాడి చేసి పరారైన ఆరుగురిని అరేహళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బేలూరు తాలూకా అరేహళ్లికి సమీపంలోని కాఫీ తోటలోని జగన్నాథ శెట్టి నివాసంలో నిందితులు దొంగతనానికి వెళ్లారు. అతనిపై దాడి చేసి, కొన్ని కాఫీ గింజల మూటలతో పరారయ్యారు. కార్యాచరణ చేపట్టి షాహిద్ ముబారక్ (19), జహీర్ (32), సాగర్ (21), ప్రజ్వల్ (21), హజీజ్ (22), సునీల్ (35)లను అరెస్టు చేశారు. వీరిలో సునీల్ వ్యాపారి. దొంగిలించుకు వచ్చిన కాఫీ గింజలు అని తెలిసినా, నిందితుల నుంచి కొనుగోలు చేశాడని ఇన్‌స్పెక్టర్ జగదీశ్ తెలిపారు.

## బస్సు చోరీకి యత్నం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆనేకల్ వద్ద శనివారం రాత్రి నిలిపి ఉంచిన బీఎంటీసీ బస్సును దొంగిలించేందుకు నలుగురు దుండగులు ప్రయత్నించారు. బస్సును వంద అడుగులు ముందుకు నడిపిన అనంతరం నియంత్ర తప్పి రహదారి పక్కన గోడను ఢీకొట్టి ఆగిపోయింది. అక్కడి నుంచి పరారవుతున్న నిందితుల్లో ఒకడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి మృతి

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: అతివేగంగా సంచరిస్తున్న సరకు రవాణా వాహనం ముందు సంచరిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో గాయత్రిలేఔట్ నివాసి కిరణ్(38) మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున కె.ఆర్.పురం పోలీసుఠాణా పరిధిలో జరిగింది. పాతమద్రాసు రోడ్డులో తెల్లవారు జామున ఒకటి గంటకు ఈసంఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బాలుడి తండ్రికి జరిమానా

మంగళూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 66లో నంతూరు వద్ద 2025 మార్చి 30 వేకువ జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు (17), ఒక వ్యక్తి (30) గాయపడ్డారు. కద్రి ట్రాఫిక్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బాలుడికి ద్విచక్ర వాహనం ఇచ్చిన ఆరోపణలపై అతని తండ్రి అబ్దుల్ హమీద్‌కు జేఎంఎఫ్‌సి ఎనిమిదో న్యాయస్థానంలో న్యాయమూర్తి ఫవాజ్ రూ.25 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని దాడి

బెళగావి, న్యూస్‌టుడే: ఎన్నిసార్లు పిలిచినా భార్య పుట్టింటి నుంచి వెనక్కు రావడం లేదని భీమా భోసలే అని వ్యక్తి అత్తింటికి వెళ్లి అందరిపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. అథణి తాలూకా తెలసంగ గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. భార్యను తీసుకువెళ్లేందుకు అత్తవారింటికి వచ్చిన భీమా భోసలే తనతో పాటు సీసాలో పెట్రోలు తెచ్చుకున్నాడు. నీతో మా అమ్మాయిని పంపమని చెప్పడంతో అత్త, మామలు, ఇతర కుటుంబ సభ్యులపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. స్థానికులు అక్కడకు చేరుకుని అతని ప్రయత్నాలను వమ్ము చేసి అథణి గ్రామీణ ఠాణా పోలీసులకు అప్పగించారు.

## తండ్రీకొడుకులపైనా..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: దొడ్డబళ్లాపురలోని పుట్టయ్యన అగ్రహారలో వెళ్తున్న కార్తిక్ (26) అనే యువకుడిపై ఐదుగురు దుండగులు శనివారం రాత్రి మారణాయుధాలతో దాడి చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్తిక్ తండ్రి మధుసూదన్ కూడా గాయపడ్డారు. స్థానికులు అక్కడికి రావడంతో నిందితులు పరారయ్యారు. స్థానికంగా ఒక యువతితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకుని యువతి కుటుంబ సభ్యులు గత నెల 23న రాజీ పంచాయితీ చేశారు. ఆమెను కలవకూడదని తీర్మానించినా, కార్తిక్ తీరు మార్చుకోకపోవడంతో ఈ దాడి జరిగిందని అనుమానిస్తున్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం దొడ్డబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

స్నానాల తొట్టెలో పాండా

నేతి డబ్బా

గోపురం కేకు

ఆఫ్‌రోడ్డు ట్రాకులో కారు

## ఆకాంక్షలకు అద్దం పట్టిన ప్రదర్శన

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: బెంగళూరు వార్షిక కేకులు, చక్కెర అచ్చుల ప్రదర్శన బేకరీ వ్యాపారానికి, కొత్త స్టార్టప్ అవకాశాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్యాలెస్ మైదానం త్రిపురవాసిని విభాగంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బేకింగ్ అండ్ కేక్ ఆర్ట్, మై బేకర్ స్టార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రదర్శన 1970లో మొదటిసారి ప్రారంభమైంది. ఆ ఏడాది నీలగిరీస్ గ్రూపు వ్యవస్థాపకుడు సి.రామచంద్రన్ ఒకే ఒక భారీ కేకును ప్రదర్శించారు. ఆహారం, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను మిళితం చేసేలా ఈ ప్రదర్శన ప్రతి ఏడాది కొనసాగుతూ వస్తోంది. డిజైనర్ కేకుల ధర రూ.3వేల రూ.4 వేల ధరల నుంచి ప్రారంభమవుతున్నాయి. వివాహాలు, పుట్టిన రోజు, శుభ కార్యక్రమాలు, క్రిస్మస్, కొత్త ఏడాది, పండగలు, సినిమా, ధారావాహికల చిత్రీకరణలతో పాటు ప్రత్యేక సందర్భాల్లో బహుమతులుగా ఇచ్చేందుకు వివిధ డిజైన్లలో కేకులు, చక్కెర అచ్చులతో బొమ్మలు చేయించుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోయింది. కేకులను ఆన్‌లైన్‌లో ఆర్డరు తీసుకుని దేశంలోని ప్రతి చోటుకు చేర్చే అంకుర పరిశ్రమలు కూడా తెరపైకి వచ్చాయని ఇప్పటి ప్రదర్శన నిర్వాహక ప్రతినిధి గౌతమ్ తెలిపారు. రెండు టన్నుల కేక్ కోట, 800 కిలోల వేలాం గణి చర్చి తదితరాలకు చక్కని స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రదర్శనలో ఎక్కువ వేడి వెదజల్లని లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. కేకుల తయారీపై ఆసక్తి ఉన్న వారికి లైవ్ బేకింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

EENADU Classifieds
JOBS

HYD యూనిటీ హౌంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. © 81215 41212.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

## మహాకవి సిద్ధం

ఆదికవి పంప తన సాహిత్యం ద్వారా కులవ్యవస్థ పోరాటాలు ఆధారంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బరగూరు రామచంద్రప్ప దర్శకత్వంలో నిర్మిస్తున్న ‘మహాకవి’ చిత్రం చిత్రీకరణ జోరుగా సాగుతోంది. బరగూరు రామచంద్రప్ప దర్శకత్వం వహిస్తున్న 25 చిత్రం కావడం విశేషం. పంప రాసిన ఆది పురాణంలో కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఈ కథ ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. పంప రాసిన కొన్ని పద్యాలను చిత్రంలో ఉంచారు. పంప పాత్రను శ్రీకిశోర్ నటిస్తుండగా హీరోయిన్‌గా అనుషా రై,ఆకాంక్ష, సుందరరాజ్, ప్రమీళాజోయియ్, కుమారగోవింద, సుందరరాజు అరసు, వత్సలా మోహన్, రాఘవ్, హనుమంతేగౌడ, శాంతరాజు తదితరులు నటిస్తుండగా శమితా మల్నాడ్ సంగీతం అందిస్తున్నారు.

మహాకవి చిత్రంలో అనుషారై

## క్లాస్ ఆఫ్ మైసూరు చిత్రీకరణ

నగరంలోని బండెమహంకాళి అమ్మ దేవస్థానంలో ‘క్లాస్ ఆఫ్ మైసూరు’ చిత్రం చిత్రీకరణను ప్రారంభించారు. నటుడు దత్తణ్ణపై మొదటి దృశ్యాన్ని చిత్రీకరించారు. సినీ నటి తారా అనురాధ క్లాప్ ఇచ్చారు. కళాకారులందరు మైసూరు పట్టు పంచెలు, మైసూరు పేట ధరించి కార్యక్రమానికి హాజరయ్యారు. మైసూరు ప్యాలెస్, అంబారి తదితర అంశాలు ఆధారంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకుడు గౌతమ్ బసవరాజు తెలిపారు. దత్తణ్ణ, రంగాయణ రఘు, తబలనాణి, బిరాదర్, శరత్ లోహితాశ్య తదితరులు నటిస్తున్నారు. నాలుగు పాటలకు జోకూస్ట్ర అందిస్తున్నారు.

సమావేశమైన చిత్ర బృందం

## ఆల్ఫా మ్యాన్ లవ్ వెగ్జాన్సి టీజర్ విడుదల

విభిన్నమైన ప్రేమకథ చిత్రం ‘ఆల్ఫా మ్యాన్ లవ్ వెగ్జాన్సి’ టీజర్ విడుదల చేశారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చినట్లు దర్శకుడు విజయ్ తెలిపారు. ప్రేమ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమన్నారు. కుటుంబ సమేతంగా థియేటర్‌కు వచ్చి చిత్రాన్ని తిలకించే విధంగా నిర్మించినట్లు చెప్పారు. హేమంత్‌కుమార్, కార్తిక్ మహేశ్, గోపిక సురేశ్, అవినాశ్, వినయ్‌బిద్దప్ప, మహంతేశ్, రాఘశివమొగ్గ తదితరులు నటిస్తున్నారు.

హేమంత్‌కుమార్, గోపికా సురేష్, తదితరులు

## మద్యపానంపై కుడుకనమ్మక్కు

కుటుంబాలు, సమాజంపై మద్యపాన ప్రతికూల ప్రభావాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ‘కుడుకనమ్మక్కు’ చిత్రం చిత్రీకరణ నగరంలోని శ్రీవిద్యాగణపతి దేవస్థానంలో ప్రారంభమైంది. ప్రాచీన కాలం నుంచి వస్తున్న మద్యపానం వల్ల ప్రజలు పడే కష్టాలను తెరపైకి తెచ్చినట్లు దర్శకుడు అస్కర్‌కృష్ణ తెలిపారు. ప్రజలను ఆలోచింపజేయడంతో పాటు హాస్యభరితంగా చిత్రం సాగుతుందన్నారు. చంద్రప్రభ వినోద్ గూబ్బరగాల, మిమిక్రీ గోపి, చైత్రాకూటూరు, ధరణి, తదితరులు నటిస్తుండగా మంజుకవి సంగీతం సాహిత్యం అందిస్తున్నారు.

కుడుకనమ్మక్కు చిత్రీకరణ ప్రారంభంలో నటీనటులు

-బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే

# బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

## వైభవంగా వాసవీ రథయాత్ర

వాసవీ రథయాత్రలో భక్తజనం

బెంగళూరు (కెంగేరి) : బెంగళూరు ఆర్యవైశ్య మండలి ఆధ్వర్యంలో వాసవీ రథయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసంఖ్యాత భక్తుల మధ్య విజయనగర హోసహళ్లి మెట్రో స్టేషన్ నుంచి ప్రారంభమైన రథయాత్ర చంద్రశేఖర్ ఆజాద్ క్రీడాప్రాంగణం వరకు సాగింది. ఒక్కూట అధ్యక్షుడు నాగమహేశ్, ప్రధాన కార్యదర్శి .శ్రీనివాస్, కోశాధికారి బదరీనాథ్, ఉపాధ్యక్షులు ఎనెన్.ఎన్.గుప్తా, రమేశ్‌బాబు, సత్యనారాయణగుప్తా, పదాధికారులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రాజ్యోత్సవం

కోరమంగల ప్రాంతంలోని సత్యసాయి సంస్కృత సదనలో ఆదివారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కన్నడ రాజ్యోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ సినీగాయకుడు రాజేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కన్నడ పాటలను ఆలపించారు. వాటికి సాఫ్ట్‌వేర్ యువత నృత్యం చేశారు. కన్నడ భాష నేర్చుకోవడంతో పాటు కన్నడ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని క్యానరీస్ సంస్థ సీఈఓ శేషాద్రి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ రామన్ సుబ్బరావ్, డైరెక్టర్లు చంద్రశేఖరయ్య, పుష్పరాజ్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బెంగళూరు (ఆడుగోడి)

# హోసూరు కబుర్లు

## గదగలో పరిషత్ మహా సమ్మేళనం

వేదిక మీద మనోహరన్, అశోక్‌చౌహాన్ తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : కర్ణాటక గదగలోని రాష్ట్ర మహాత్మాగాంధీ రూరల్ డెవలప్‌మెంట్ ఆడిటోరియంలో జాతీయ స్థాయి పంచాయతీ రాజ్ పరిషత్ మహా సమ్మేళనం జరిగింది. హోసూరుకు చెందిన పంచాయతీరాజ్ పరిషత్తు సభ్యులు, తమిళనాడుకు చెందిన సభ్యులు 30 మంది హాజరయ్యారు. తమిళనాడు పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కె.ఎ.మనోహరన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీరాజ్ పరిషత్ సిద్ధాంతాలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. పరిషత్‌ను దేశంలో బలపరచాలని తీర్మానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలవాలని నిర్ణయించారు. అఖిల భారత పంచాయత్‌రాజ్ పరిషత్ అధ్యక్షుడు అశోక్ చౌహాన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ప్రభాకర్ దంపతులు, కాంగ్రెస్ నాయకుడు సత్యమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు సరోజ, లలిత, మునిరత్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## జనవరి 16 నుంచి సఫలమ్మ జాతర

పూజలు చేస్తున్న వేణుగోపాల్ దంపతులు, నిర్వాహకులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు తాలూకా ఈవులపల్లి సమీపం కెలవరపల్లి వద్ద వెలసిన శక్తి దేవత సఫలమ్మ జాతర కమలమ్మ కుటుంబీకుల కాలం నుంచి జనవరిలో నిర్వహించడం ఆనవాయితీ. ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ఆవులపల్లికి గజేంద్రప్ప, త్యాగరాజు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణానికి లక్షలాది రూపాయలు వ్యయం చేశారు. మహాద్వారం నిర్మాణానికి సహకరించిన బెంగళూరుకు చెందిన న్యూబాల్డ్‌విన్ విద్యా సంస్థల అధిపతి డాక్టర్ వేణుగోపాల్ దంపతులు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ నిర్వాహకులు సత్కరించారు. జాతర, ఎద్దుల పరస జనవరి 16 నుంచి 25 వరకు జరుగుతాయి.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

పట్టణ వీధుల్లో సాగుతున్న ఊరేగింపు

డెంకణీకోట, న్యూస్‌టుడే : క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఆదివారం డెంకణీకోటలో గీతాభవాని ఊరేగింపు వైభవంగా సాగింది. అయ్యూరు రోడ్డు కూడలి నుంచి బైపాస్ రోడ్డు, బస్సు నిలయం, కోటవాకిలి మార్గంలో చర్చి వద్దకు చేరింది. ఊరేగింపులో బోధనలు, ప్రార్థనలు, పాటలు పాడుతూ క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాస్టర్ పాల్ రంగనాథన్ అధ్యక్షతన మత బోధకులు, పాదర్లు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రన్

డెంకణీకోట, న్యూస్‌టుడే : పట్టణంలోని సహకార సంఘం, రమణమహర్షి అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. డెంకణీకోట తహసీల్దార్ గంగై దీపం వెలిగించి ప్రారంభించారు. తళి ఎమ్మెల్యే రామచంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. దివ్యాంగులకు దుస్తులు, భోజన సామగ్రి, ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది రాంప్రకాశ్, లక్ష్మీపతి, ట్రాన్స్‌పోర్టు నాగరాజు, వేణుగోపాల్, నిర్మల, అరిమా సంఘ సభ్యుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

పోచంపల్లి (డెంకణీకోట) న్యూస్‌టుడే : పోచంపల్లి శివారు సంతూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోలైవనానికి చెందిన ఈశ్వరన్(44), గంగవరానికి చెందిన గోవిందస్వామి(34), కాట్టగరంకు చెందిన చిన్నకళణ్ణు(55) మారుతి కారులో సంతూరు నుంచి కావేరిపట్టణానికి వెళ్తుండగా వేడర్‌తడక్కల్ వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. క్షతగ్రాతులను పోచంపల్లి ఆసుపత్రికి తరలించారు. పోచంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కలెక్టర్, ఎస్పీ నగర పర్యటన

ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి కోలారు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఆర్ రవి, ఎస్పీ నిఖిల్, అధికారులు కోలారు నగరంలో పర్యటించారు. నగరంలో ప్రజల సమస్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వన్‌వే ట్రాఫిక్ సిగ్నల్‌ను పరిశీలించారు. రహదారుల నిబంధనలు పాటించాలని, శిరస్త్రాణం ధరించి ద్విచక్రవాహనాలు నడపాలని సూచించారు. అధికారులు పలు ప్రాంతాల్లో కాలినడకన పర్యటించారు. – న్యూస్‌టుడే, ముళబాగిలు

## కూచ్ బిహార్ ట్రోఫీ జట్టు సారథిగా అన్వయ్ ద్రావిడ్

బెంగళూరు (క్రీడలు) : మైసూరులో ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్న కూచ్ బిహార్ ట్రోఫీ క్రికెట్ కర్ణాటక జట్టుకు అన్వయ్ ద్రావిడ్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలో పాల్గొంటున్న రాష్ట్ర జట్టును కర్ణాటక క్రికెట్ సంఘం ప్రకటించింది. అదీశ్ డి. అరసు, ధ్రువ్‌కృష్ణన్, మణికంఠ శివానంద, అక్షత్ ప్రభాకర్-వైస్‌కెప్టెన్, సిద్ధార్థ్ అఖిల్, ఏపీ రోహిత్, ఆశాహకీమ్ పుత్తిగె, వైభవ్‌శర్మ, బి.ఆర్.రతన్, వరుణ్ పాటీల్, రెహాన్ మహమ్మద్-వికెట్‌కీపర్, కులదీప్‌సింగ్ పురోహిత్, ధ్యాన్‌మహేశ్ హిరేమఠ్, విరాట్ ఆర్.గౌడ పాల్గొంటారు.

## ప్రభుత్వానికి గ్రేటర్ తుమకూరు నివేదిక

జ్యోతి వెలిగిస్తున్న మంత్రి పరమేశ్వర్, జిల్లాధికారి శుభాకల్యాణ్ తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : గ్రేటర్ తుమకూరుగా ప్రకటించడానికి ప్రభుత్వానికి నివేదిక అందజేశామని, త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని హోంమంత్రి జి.పరమేశ్వర్ తెలిపారు. తుమకూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం సభాప్రాంగణంలో ఆదివారం ఈ-ఖాతా పత్రాల పంపిణీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, కర్ణాటక స్లమ్ అభివృద్ధి మండలి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గ్రేటర్ తుమకూరు ప్రకటనతో నగరానికి అధికంగా నిధులు వస్తాయని, రహదారులు, తాగునీరు, యూజీడీ, వీధిదీపాల వంటి సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. తుమకూరు, మైసూరు, హుబ్బళి-ధారవాడ జిల్లాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, 40 శాతం ప్రజలు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని, వారికి సౌకర్యాలు కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బెంగళూరు నగరాన్ని గ్రేటర్ బెంగళూరుగా తీర్చిదిద్దే విధంగా గ్రేటర్ తుమకూరుగా చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. తుమకూరులో 18 ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తున్నామని, పౌరకార్మికుల ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్, బీఎంటీసీ సంస్థ ఉపాధ్యక్షుడు నికేత్‌రాజ్ మౌర్య, జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ అశోక్ , సీఈవో ప్రభు, ఆరోగ్యాధికారి చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

హాజరైన లబ్ధిదారులు, తల్లిదండ్రులు, ప్రజలు

### ఒలింపిక్ క్రీడలను విజయవంతం చేయాలి

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరులో 2026 జనవరి 16 నుంచి 22వరకు జరిగే కర్ణాటక ఒలింపిక్ క్రీడలను విజయవంతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని హోంమంత్రి జి.పరమేశ్వర్ అధికారులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మహాత్మాగాంధీ క్రీడా మైదానంలోని సభాప్రాంగణంలో ఒలింపిక్ క్రీడల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తుమకూరులో దసరా ఉత్సవాలను విజయవంతంగా ఆచరించామని, అదే స్ఫూర్తితో ఒలింపిక్ క్రీడా పోటీలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గత ఏడాది మంగళూరులో ఈ పోటీలు జరిగాయని, ఈసారి ఇక్కడ నిర్వహించడం జిల్లాకు గర్వకారణంగా పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం నియమించిన ఉప సమితులు తమ బాధ్యతలు నిర్వహించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. వారం రోజుల పాటు జరిగే పోటీలను సామాన్య ప్రజలు తిలకించడానికి సౌకర్యాలు కల్పించాలన్నారు. 9 వేల మంది క్రీడాకారులు విచ్చేస్తారని, వారికి భద్రత, వసతులు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. సమావేశంలో బెంగళూరు బీఎంటీసీ ఉపాధ్యక్షుడు నికేత్‌రాజ్ మౌర్య, యువ సబలీకరణ శాఖ కమీషనర్ చేతన్, జిల్లాధికారి శుభాకల్యాణ్, జడ్పీ సీఈవో జి.ప్రభు, ఎస్పీ కె.వి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకలకు సర్వం సిద్ధం

క్రీస్తు జన్మవృత్తం తెలిపే బొమ్మలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలకు బెంగళూరు నగరం సిద్ధమవుతోంది. క్రైస్తవ ప్రార్థనా మందిరాల అలంకరణ, ఉపవాస ప్రార్థనలను మొదలయ్యాయి. ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేకులు, ట్రీలను సిద్ధం చేస్తున్నారు. శివాజీనగర సెయింట్ బెసిలికా చర్చి వద్ద క్రిస్మస్ బజారు ప్రారంభమైంది. నగరంలోని క్రైస్తవులు అక్కడికి వచ్చి పండగకు అవసరమైన ఉపకరణాలను తీసుకెళుతున్నారు. ఇళ్ల రంగుల దీపాలతో కూడిన నక్షత్రాలను కడుతారు. అవి ఈ బజారులో వ్యాపారులు అందుబాటులో ఉంచారు. బెంగళూరు నగరంతో పాటు హోసూరు, పలమనేరు, కోలారు, చిక్కబళ్లాపుర, ముళబాగిలు, హిందూపురం, పెనుగొండ, కదిరి, ధర్మవరం, గోరంట్ల తదితర ప్రాంతాల నుంచి అక్కడికి వచ్చి కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఏసుక్రీస్తు జన్మించిన పూరిపాకను ఇళ్లలో ఏర్పాటు చేసి అందులో క్రీస్తు, తల్లిదండ్రుల బొమ్మలు ఉంచి ప్రార్థనలు చేస్తారు. ఆ బొమ్మలను ఇజ్రాయిల్ నుంచి తెప్పిస్తామని వ్యాపారి జేమ్స్ తెలిపారు. క్రిస్మస్ బజారుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

## ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రముఖులను సత్కరిస్తున్న జాగృతి వేదిక సభ్యులు

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని వై.ఎన్.హోసకోటలో గడినాడు కన్నడ జాగృతి వేదిక పోతగానహళ్లి ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు, ఉత్తమ ఉపాధ్యాయులు, సేవారత్న ప్రశస్తి అవార్డులను ప్రదానం చేశారు. గడినాడు కన్నడ జాగృతి వేదిక అధ్యక్షుడు పి.హరికృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను విద్యార్థులు రాజా యదువంశీ, కె.ఎం.పృథ్వి రాజ్‌లకు, సేవారత్న అవార్డులను మనోజ్, చెన్నయ్య, నాగరాజప్ప, అనసూయమ్మ, శైలజ, శకుంతలమ్మలకు, ఉత్తమ ఉపాధ్యాయులుగా మల్లేశప్ప, మారుతీష్, రామకృష్ణప్పలకు ప్రశస్తిలను అందచేసి అభినందించారు. కన్నడ సాహిత్య పరిషత్తు ప్రముఖులను జాగృతి వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ సణ్ణనాగప్ప, సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, హోబలి అధ్యక్షుడు హోమ నాగరాజు, మధుగిరి గోవిందరాయ, హెచ్.మంజుల, వి.మారుతీష్, పి.ఎన్.ఉమణ్ణ, పి.ఆర్.మారుతీశ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త తొలగింపునకు కొత్త విధానం

అగర చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఇనుప జల్లెడ

బెంగళూరు (యశ్వంతపుర) న్యూస్‌టుడే : మురుగునీరు రహదారులు, జనజీవన ప్రదేశాల్లోకి ప్రవహించకుండా ప్రవాహాన్ని అడ్డుకట్ట వేసేందుకు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. వాననీటితో వచ్చే ప్లాస్టిక్ సంచులు, పాత వస్త్రాలు, కొయ్య ముక్కలు, డబ్బాలు, జంతు కళేబరాలు తదితర వాటి వల్ల కాలువలు పొంగి నీరు జనజీవన ప్రదేశాల్లోకి ప్రవహిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాల్లో ఉన్న లేఔట్‌లు ముంపునకు గురవుతున్నాయి. చిన్న వానకు కాలువలు పొంగి ప్రవహించి సమీపంలో ఉన్న లేఅవుట్లు ముంపునకు గురై ప్రజలను నిద్ర లేకుండా భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు ప్రాధికార నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కాలువ ముఖద్వారం వద్ద ఇనుప జల్లెడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నీటితో వచ్చే చెత్తను త్వరగా వేరు చేయడంతో పాటు చెరువులు, గుంతల్లోకి చెత్త రహిత నీరు ప్రవహించే విధంగా చేస్తున్నారు. ప్రస్తుతం లోతట్టు ప్రదేశాలైన శాంతినగర, కోరమంగల, మడివాళ, బీటీఎం లేఅవట్, సర్జాపుర, బెళ్లందూరు, ఇబ్బలూరు, పణత్తూరు, వర్తూరు, వైట్‌ఫీల్డ్, హెణ్ణూరు, భద్రప్ప లేఅవుట్ తదితర ప్రాంతాల్లో కాలువలకు ఇనుప జల్లెడలను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. తద్వారా ముంపు నుంచి లోతట్టు ప్రదేశాలను సంరక్షించవచ్చని అధికారులు తెలిపారు. అన్ని కాలువలకు వాటిని అమర్చుతామని వెల్లడించారు.

## కనకదాస క్షేత్రానికి బస్సు సౌకర్యం కల్పించండి

పావగడ : కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాసు జన్మించిన గ్రామమైన హావేరి జిల్లా బ్యాడగి తాలూకా బ్యాడ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం కురుబ సముదాయ ప్రముఖులు పట్టణ డిపో మేనేజరు శరణప్పకు వినతిపత్రం అందచేశారు. కురుబ సముదాయ ప్రజలు బ్యాడ గ్రామానికి వెళ్లాలంటే పలు బస్సులు మారడానికి పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడి నుంచి నేరుగా బ్యాడ గ్రామానికి చేరుకొనేలా బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. కాళిదాస విద్యావర్ధక సంఘం జిల్లా అధ్యక్షుడు మైలప్ప, నాయకులు అల్కుందప్ప, రవికుమార్, పి.వి.అనిల్, రాము, పునీత్, బాబు, పి.టి.జగన్నాథ్, ఓంకార్, మంజు పాల్గొన్నారు.

డిపో మేనేజరుకు వినతిపత్రం అందచేస్తున్న ప్రముఖులు

## ఏనుగుదాడిలో రైతు మృతి

రామనగర, న్యూస్‌టుడే : తోటకు నీరు కట్టేందుకు వెళ్లిన దుండమాద (50) అనే రైతు ఏనుగు దాడిలో మరణించారు. రామనగర సమీపంలోని దున్నసంద్రకు చెందిన రైతు ఆదివారం వేకువజామున తోటకు వెళ్లినప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. ఏనుగును బంధించేందుకు కార్యాచరణ ప్రారంభించామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి విషాదాంతం

మైసూరు, న్యూస్‌టుడే : హుణసూరు తాలూకా అంకనహళ్లి గేట్ వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. చిక్కాడిగనహళ్లి నివాసి రవి (37), అంకనహళ్లి నివాసి ప్రసన్న (42)లను నిందితులుగా గుర్తించారు. వీరిద్దరూ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో బాధితులు ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. బిళికెరె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## దాఖలాలు పరిశీలించి చర్యలు తీసుకోండి

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : బెంగళూరు దక్షిణ తాలూకా బీఎం కావల్‌లో 532 ఎకరాల 15 గుంటల అటవీ భూముల వివాదానికి సంబంధించి దాఖలాలను పరిశీలించి, చర్యలు తీసుకోవాలని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం పుణచ్చల పీఠం ప్రభుత్వానికి సూచనలు చేసింది. ఎంబీ నేమన్న గౌడ అనే వ్యక్తికి 1973లో ఆ భూములు లభించాయని, వారి కుటుంబ సభ్యులు వేసుకున్న అర్జీని ఏకసభ్య పీఠం పరిగణనలోకి తీసుకుంది. అతని కుటుంబ సభ్యులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీన్ని ప్రశ్నిస్తూ ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానంలో అప్పీలుకు వెళ్లింది. బీఎం కావల్ గ్రామంలోని 1382. 18 ఎకరాలను అటవీ భూమి అని ప్రకటిస్తూ 1933, 1935లలో నోటిఫికేషన్‌లను బ్రిటిష్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అదే ప్రాంతంలో 1973లో నేమన్నగౌడకు భూమి కేటాయించిన విషయంలో స్పష్టత లేదని, అంత మొత్తంలో భూమిని ఎందుకు కేటాయించారన్న అంశంలోనూ అతని వారసులు వివరణ ఇవ్వలేదన్నారు. అన్ని దాఖలాలను పరిశీలించి తదుపరి నిర్ణయాన్ని తీసుకోవాలని ధర్మాసనం సూచనలు చేసింది.

## హక్కుల సాధన కోసం రాష్ట్ర సమావేశం

అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పదాధికారులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : హక్కులు సాధన కోసం వచ్చే ఏడాది మే నెలలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తామని కర్ణాటక మాల మహాసభ ప్రకటించింది. ఆదివారం ఇక్కడ కర్ణాటక ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్టభద్రుల సంఘం సమావేశ మందిరంలో మాలమహాసభ అధ్యక్షుడు ఎల్.నాగేశ్వరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కర్ణాటకలో మాలల సంఖ్య తక్కువగా ఉందని పాలకులు భావించి తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉంచుతున్నారని తెలిపారు. అంబేద్కర్ అభివృద్ధి మండలి ఏర్పడిన దగ్గర నుంచి నేటి వరకు మాలల్లో ఒక్కరు కూడా మండలి పథకాలను పొందలేదన్న అంశాన్ని జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిషన్ వెల్లడించిదని గుర్తు చేశారు. వివిధ పథకాల రుణాలను మాలలకు వర్తింపజేయాలని, బోర్డు, కార్పొరేషన్ పదవుల్లో మాలలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. మహిళ, యువత, మేధావుల సమావేశాల్లో సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు సంపూర్ణ, ప్రధాన కార్యదర్శి టి.సంజీవరావు, కార్యదర్శులు వినోద్‌బాబు, శ్రీదేవి, కోశాధికారి కె.మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బోధన పరికరాల పంపిణీ

విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా బన్నేరుఘట్ట రోడ్డు బిళేకహళ్లిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిల్పా ఫౌండేషన్ బోధన పరికరాలు, పుస్తకాలు, బ్యాగులను అందజేసింది. యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ సంస్థ సహకారంతో వీటిని అందించామని ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ సతీశ్ బెట్టప్ప తెలిపారు. కార్యక్రమంలో బీమా సంస్థ ప్రతినిధులు కె సుధాకర్ శెట్టి, ఎం సంతోశ్, రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యాలయాలకు సెలవు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : దావణగెర ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్యామనూరు శివశంకరప్ప ఆదివారం సాయంత్రం మృతి చెందిన నేపథ్యంలో ఆయన గౌరవార్థం చిత్రదుర్గం, దావణగెర జిల్లాల పరిధిలోని దావణగెర విశ్వవిద్యాలయం, స్నాతకోత్తర కేంద్రాలు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు దావణగెర విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ బీఆర్ కుంబార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు ప్రకటించారు.

## సమావేశాల్లో పాల్గొంటేనే భత్యం ఇవ్వాలి

బెళగావి, న్యూస్‌టుడే : శీతాకాలం శాసనసభ సమావేశాల్లో పాల్గొనే సభ్యులకే వేతనం, భత్యాలు ఇవ్వాలని సహ కార్యకర్త భీమప్ప గడాద డిమాండ్ చేశారు. సభలో పాల్గొంటున్న వారి వివరాలను గుర్తించేందుకు బెంగళూరు తరహాలో ఇక్కడ కూడా బయో మెట్రిక్ వ్యవస్థను జారీలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉభయ సభలకు వస్తున్న సభ్యులు రిజిస్టరులో ఒక సంతకం చేసి, తమ పనుల నిమిత్తం వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ఆదివారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడారు. ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చించేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, విపక్ష నాయకులకు సమయం ఉండడం లేదని ఆరోపించారు. బెళగావి సమావేశాలంటే జాతరకు వచ్చి వెళ్తున్నట్లు చట్ట సభ ప్రతినిధులు ప్రవర్తిస్తున్నారని ఆక్రోశించారు. ఈసారి అధికార పార్టీ నేతలు డిన్నర్ పార్టీలతోనే కాలం వెళ్లదీశారని విమర్శించారు. ఎమ్మెల్యేలు 224 మందిలో 110 మంది కూడా పూర్తి స్థాయిలో ఈసారి సమావేశాల్లో పాల్గొనలేదని తెలిపారు. మిగిలిన సమావేశాలను ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చించాలని తమ ప్రాంత ఎమ్మెల్యేలను కోరుతున్నామని చెప్పారు.

## కడుపు నొప్పితో బలవన్మరణం

చామరాజనగర, న్యూస్‌టుడే: కొళ్లేగాల తాలూకా హొస హంపాపుర గ్రామానికి చెందిన ప్రియాంక (21) అనే నర్సింగ్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చివరి సంవత్సరం నర్సింగ్ చదువుతున్న ఆమె కడుపు నొప్పికి చికిత్స పొందుతూ వచ్చింది. అదే వ్యధతో కళాశాల నుంచి ఇంటికి వచ్చి శనివారం రాత్రి తన నివాసంలో ఉరి వేసుకుంది. కొళ్లేగాల గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఒకరి అరెస్టు

మంగళూరు, న్యూస్‌టుడే: టీమ్ ఎస్‌డీపీఐ 2025 పేజీలో హిందువులను అవహేళన చేస్తూ ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న ఒక వ్యక్తిని బజ్పె ఠాణా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మంగళూరుకు చెందిన అతను సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. విమానంలో వచ్చి దిగిన అతన్ని అరెస్టు చేసి, విచారణ చేపట్టామని నగర పోలీసు కమిషనర్ సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు.

## తల్వార్ పట్టుకొని రీల్స్

మంగళూరు, న్యూస్‌టుడే: చేతిలో తల్వార్ పట్టుకుని, డ్యాన్స్ చేస్తూ రీల్స్ చేసిన ఆరోపణలపై అమీర్ సుహేల్ (28), సురేశ్ (29)లను కావూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరు కావూరు బందరు జేఎం రోడ్డు, పంజిమొగరు ఉరుందాడి గుడ్డెకు చెందిన వారు. శనివారం వీరు రీల్స్ చేసి, తమ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. అవి వైరల్ కావడం, కొందరు పోలీసులకు ఆ వీడియోలను ఫార్వర్డ్ చేయడంతో పోలీసులు కార్యాచరణ చేపట్టి, వారిని ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు.

## స్తంభానికి కట్టి కొట్టారు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: ఈశ్వరనగర లేఅవుట్‌లో మహిళలు, యువతుల ముందు అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆరోపణలపై ఒక వ్యక్తిని (34) స్థానికులు శనివారం రాత్రి పట్టుకున్నారు. స్తంభానికి కట్టి, తీవ్రంగా కొట్టి, పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతన్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. నిందితుని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది


IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) PUNGANUR.
O.S. NO.103/2013.

Plaintiffs: T.G.Bhaskar & others
Defendants: D.Nagaraja (Died) & others

To,
D5- Chandrakala W/o Late D.Nagaraja
D6- D.Vinod Krishna S/o Late D.Nagaraja
Both D-5 & D-6 are R/at 9th Chavari, 8th Main Nanda Kumar Layout, Near Ramanjaneya Nagar, West End Park, Bangalore-560061.

SUMMONS TO DEFENDANTS NO.5 AND 6

పై దావాలో 5వ ప్రతివాది మరియు 6వ ప్రతివాది గారికి తెలియజేయడమేమనగా వాదులు బాకీ రాబట్టుకొనుటకుగాను పై కోర్టు నందు పైదావా దాఖలు చేసియుండగా మీకు కోర్టుద్వారా సమన్లు అందనందున కోర్టు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియచేయడమేమనగా సదరు దావా మీ హాజరు నిమిత్తం 16-12-2025 వ తేదీన పై కోర్టునందు వాయిదా కలదని తెలుపడమైనది. పై తేదీన మీరుగాని లేక మీ న్యాయవాది ద్వారాగాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనయెడల పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడును.

(By order of court)
K.V.Suryanarayana Rao., B.A., LL.B.,
T.Sreekanth., B.Com., LL.B.,
Advocates, Punganur.


## వాలంటీర్లకు సత్కారం

బాలలు, సంస్థ ప్రతినిధులతో వాలంటీర్లు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : బాలల హక్కుల రక్షణ కోసం శ్రమిస్తున్న స్వయం సేవకులను (వాలంటీర్లు) చైల్డ్ రైట్స్ అండ్ యూ (క్రై) సంస్థ ప్రతినిధులు సత్కరించారు. ఇండియన్ సోషియల్ ఇన్‌స్టిట్యూట్‌లో సంస్థ సీఈఓ పూజా మార్వా మాట్లాడుతూ సమాజంలో వివిధ రంగాలకు చెందిన యువత బాలల హక్కుల కోసం తాము నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని అభినందించారు. పాఠశాలలు, అనాథ శరణాలయాలకు వెళ్లి వారి హక్కులను బోధిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్, వేర్వేరు రంగాలకు చెందిన వాలంటీర్లు దియా పంచోలి, నిఖిత, భూమిక, చిన్నారులు పాల్గొన్నారు.

## అలరించిన బాలల క్రిస్మస్

బాలలతో తెలుగు క్రైస్తవ ప్రతినిధులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : నగరంలోని పులికేశినగరలోని మిస్పా తెలుగు చర్చిలో ముందస్తు బాలల క్రిస్మస్ వేడుకలు ఆదివారం కనులవిందుగా సాగాయి. సామూహిక ప్రార్థనలు పాస్టర్ రెవరెండ్ బెరాకా హ్యాండి నిర్వహించారు. బాలలకు బైబిల్‌లో నీతి కథలను చెప్పి నైతిక విలువలతో జీవించాలని, చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు రావాలని పిలుపు నిచ్చారు. ఏసుక్రీస్తు బాలలను అమితంగా ప్రేమించారని గుర్తు చేశారు. బాలలు ప్రదర్శించిన ఏసుక్రీస్తు జననం నాటిక అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్ర క్రైస్తవ పాటలు ఆలపించారు. బైబిల్ పఠనం, నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చర్చి పెద్దలు బాలలను అభినందించారు.

## ‘ఏఐతో సమస్యలకు పరిష్కారం’

దీపం వెలిగిస్తున్న వీణాశ్రీగోపాలన్, శ్రీనివాసరాజు తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : కృత్రిమ మేధో (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం కేవలం ఉపాధి అవకాశాలకు కాకుండా అనేక సమస్యలకు పరిష్కార మార్గమని విప్రో సంస్థ ఏఐ పరిహార సలహా మండలి అంతర్జాతీయ ప్రధాన అధికారి వీణాశ్రీగోపాలన్ తెలిపారు. శనివారం ఇక్కడ సర్ ఎం.విశ్వేశ్వరయ్య సాంకేతిక విద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేటి విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేఈటీ అధ్యక్షుడు వి.శ్రీనివాసరాజు, అకడమిక్ సమితి అధ్యక్షుడు కె.వి.శేఖర్‌రాజు, ట్రస్టీ సభ్యుడు ఎన్.జి.రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ తిప్పేస్వామి, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ఆచార్య కేవీఆర్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

# బళ్లారి

● బళ్లారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

చికిత్స అందిస్తున్న డాక్టర్ అంజలి

## మాజీ ఎమ్మెల్యేకు సిద్ధు ప్రశంస

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** బెళగావి జిల్లా ఖానాపుర నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి నింబాళ్కర్ సేవా నిరతిని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కొనియాడారు. గోవా నుంచి దిల్లీకి వెళ్తున్న ఒక విదేశీ మహిళ రెండుసార్లు అపస్మారక స్థితికి చేరుకోగా, సీపీఆర్ ద్వారా ఆమె ప్రాణాలు కాపాడారు. ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ దగ్గరుండి సేవలు అందించారు. చికిత్సకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చూశారు. ఆమె సేవానిరతిని అభినందిస్తూ, ఇతరులు అంజలిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచిస్తూ తన ఎక్స్ కార్ప్ ఖాతాలో ట్వీట్ చేశారు.

## బాలల రంగభూమి ప్రశస్తికి ఎంపిక



అక్కి

**రాయచూరు, న్యూస్‌టుడే :** రంగభూమి కళాకారుడు వి.ఎన్.అక్కికి బాలల రంగభూమి క్షేత్ర గౌరవ (2023-24) పురస్కారానికి ఎంపిక చేసినట్లు కర్ణాటక బాలవికాస అకాడమీ వెల్లడించింది. ఈ నెల 16న బెళగావి సువర్ణసౌధ ఉత్తరద్వారం గాంధీ విగ్రహం దగ్గర సభాభవనంలో పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఈ మేరకు కర్ణాటక బాలవికాస అకాడమీ యోజనాధికారి అక్కికి ఆహ్వానం పంపారు. అక్కి మూడు దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవలందిస్తున్నారు.

# అప్పుల ఉరి .. తీస్తోంది ఊపిరి

## ◆ రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రానికి రెండో స్థానం ◆ ఎన్‌సీబీఆర్ నివేదికలో వెల్లడి

**బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే:** కర్ణాటకలో గత రెండేళ్లలో 2,809 మంది అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కేంద్రం విడుదల చేసిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం రైతుల ఆత్మహత్య అంశంలో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది. పలు రాష్ట్రాలతో పోల్చితే అభ్యుదయ, ప్రగతిశీల రాష్ట్రంగా కర్ణాటకకు గుర్తింపు ఉంది. ఐటీ, బీటీ, సాంకేతిక రంగాల్లో కొత్త పుంతలు తొక్కుతున్నప్పటికీ అతివృష్టి, అనావృష్టి, ధరలు పడిపోవడం, వివిధ కారణాలతో పంట నష్టం, లాభదాయక ధరలు లభించకపోవడం, అప్పుల ఊబిలో చిక్కుకుని బయటకు రాలేక ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గతంతో పోల్చితే సూక్ష్మ రుణ సంస్థలు, ప్రైవేటు బ్యాంకుల వేధింపులు తగ్గడంతో ఆత్మహత్యల కేసులు తగ్గుముఖం పట్టినా, దేశంలో ఇప్పటికీ రెండో స్థానంలో ఆత్మహత్యలు కొనసాగడం దురదృష్టకరం.

పొలం దున్నుకుంటున్న రైతు

### ఆ జిల్లాల్లోనే అధికం

చందన సీమలో 2023-24 నుంచి 2025-26 నవంబరు వరకు 2,809 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 366 మంది వ్యవసాయేతర కారణాలతోనే ప్రాణాలు తీసుకున్నారని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ రెండున్నరేళ్లలో హావేరి (297), బెళగావి (260), కలబురగి (234), ధార్వాడ (195), మైసూరు (190), బీదర్ (159), హాసన (118), మండ్య (115) మంది బలవన్మరణం కేసులు నమోదయ్యాయి.

### పరిహారం ఏమూలకు?

పంట నష్టం, పంట కోసం చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారాన్ని అందిస్తామని ప్రకటించింది. పలు సాంకేతిక కారణాలు, రైతుల కుటుంబాల్లోని సభ్యుల మధ్య ఉన్న వివాదాలతో పలువురికి పరిహారాన్ని చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. బలవన్మరణానికి పాల్పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఒక్కటిగా ముందుకు వస్తే తక్షణమే పరిహారాన్ని విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో 2023-24లో ఆత్మహత్య చేసుకున్న వారిలో 1081 మంది కుటుంబాలకు రూ.54 కోట్లు, 2024-25లో 896 మంది కుటుంబాలకు రూ.44.80 కోట్లు, ఈ ఏడాది 193 మృతుల కుటుంబాలకు రూ.9.65 కోట్లను వితరణ చేశారు. మరో 233 మంది కుటుంబాలకు పరిహారాన్ని ఇచ్చే ప్రక్రియ పరిశీలన దశలో ఉందని అధికారులు తెలిపారు.

# రైళ్ల పొడిగింపుపై చిగురిస్తున్న ఆశలు

భూపతిరాజుకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

**రాయచూరు, న్యూస్‌టుడే :** విశాఖ-మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్-విశాఖ మధ్య ప్రతి రోజూ సంచరిస్తున్న రైళ్లను (12861, 12862) రాయచూరు వరకు పొడిగించాలన్న విజ్ఞప్తికి.. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. రాయచూరు ఎంపీ కుమారనాయక్ నేతృత్వంలో రాయచూరు తాలూకా కమ్మవారి సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు పి.టి.ఆనందరావు, ప్రతినిధులు బి.కొండయ్య, మద్దిపాటి రమేష్ శుక్రవారం పార్లమెంట్‌లో మంత్రులు అశ్వినివైష్ణవ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ (నరసాపురం ఎంపీ, ఆంధ్రా)ను భేటీ అయ్యారు. రైలును పొడిగిస్తే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు నేరుగా రైల్వే రవాణా సౌలభ్యం లభిస్తుందని, ఆదాయం సమకూరుతుందని అమాత్యులకు వివరించారు. ఎంపీ కుమారనాయక్ రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె.అరుణ లేఖ అందితే పొడగింపుపై నిర్ణయం తీసుకుంటామని వైష్ణవ్ హామీ ఇచ్చారు. కమ్మ సంఘం ప్రముఖులు హైదరాబాద్‌లో అరుణను శనివారం కలసి విషయాన్ని వివరించారు. ఆమె తాను రాయచూరు ఎంపీతో కలసి రైల్వే మంత్రికి లేఖ ఇస్తానని భరోసా ఇచ్చారు. గతంలో ఇలాంటి స్పందన లేదు. తాజాగా మంత్రి, ఎంపీలు సానుకూలంగా మాట్లాడినందున పొడిగింపుపై ఆశలు చిగురిస్తున్నాయి.

రాయచూరు రైల్వే స్టేషన్

### గుంతకల్లు రైల్వే విభాగం సిఫార్సులు చేసినా..

రాయచూరు మాజీ ఎంపీ అమరేశ్వరనాయక్ రైళ్లను రాయచూరు వరకు నడపాలని అప్పట్లో రైల్వే శాఖ మంత్రి వైష్ణవ్‌కు లేఖలు రాశారు. సికింద్రాబాద్ రైల్వేజోన్ ఉన్నతాధికారులు రాయచూరు పర్యటనకు విచ్చేసిన వేళల్లో పలు సంఘాలు మనవి పత్రాలు అందజేశాయి. గుంతకల్లు రైల్వే విభాగం అధికారులు ఏడాది క్రితం రైల్వే బోర్డుకు సిఫార్సు చేశారు. ఇదే ఏడాది రాయచూరుకు వచ్చిన రైల్వే సహాయ శాఖ మంత్రి సోమణ్ణ, అప్పటి దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు ప్రవాసాంధ్రులు విజ్ఞప్తి చేశారు. కొత్త రైల్వే బడ్జెట్‌లో ప్రకటించాలి. పొడగించడాన్ని ఎప్పుడైనా నిర్ణయం తీసుకోవచ్చు. కర్ణాటక నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సోమణ్ణ వేగంగా స్పందిస్తారన్న ప్రజల ఆశ తీరలేదు.

### వంద కిలోమీటర్ల దూరం..

మహబూబ్‌నగర్-రాయచూరు మధ్య దూరం కేవలం వంద కిలోమీటర్లే. కొత్త రైలు మార్గం వేసినందున గంటన్నర లోపు చేరుకోవచ్చు. విశాఖలో సాయంత్రం 6.43 గంటలకు బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు ఉదయం 8.54 గంటలకు మహబూబ్‌నగర్‌కు వస్తోంది. తిరిగి సాయంత్రం 4.13 గంటలకు విశాఖకు ప్రయాణమవుతుంది. 8 గంటలకు పైనా మహబూబ్‌నగర్‌లో వేచి ఉంటుంది. రాయచూరు వరకు రాకపోకలు సాగించేందుకు కావాల్సినంత సమయం దొరుకుతుంది. మధ్యలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, కృష్ణా స్టేషన్లు ఉన్నాయి. రాయచూరు, యాదగిరి జిల్లా ప్రయాణికులు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రకు రాకపోకలు సాగించేందుకు ప్రతి రోజు రైళ్లు లేవు. టాటా ఎక్స్‌ప్రెస్ వారానికి ఒక రోజు సంచరిస్తుంది. రాయచూరు, యాదగిరి జిల్లా ప్రజలు ప్రస్తుతం విజయవాడ, విశాఖకు వెళ్లాలంటే గుంతకల్లు మీదుగా ప్రయాణం చేయాలి. విశాఖ-మహబూబ్‌నగర్‌ను రాయచూరుకు వరకు తిప్పితే జిల్లా వాసులకే కాక ఆంధ్రా, తెలంగాణ ప్రయాణికులు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి నేరుగా రైలు సౌకర్యం లభిస్తుంది.

## సంక్రాంతి అనంతరం రాజకీయాల్లో మార్పులు

**బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే:** కర్ణాటక రాజకీయాల్లో మకర సంక్రాంతి అనంతరం మార్పులు ఉంటాయని కోడిమఠం స్వామి డాక్టర్ శివానంద శివయోగి రాజేంద్ర స్వామి పేర్కొన్నారు. కర్ణాటకలో అధికార పార్టీలో జరుగుతున్న రాజకీయాలు సుఖాంత్యం అవుతాయని చెప్పారు. శాసనసభలో పద్దు ప్రవేశపెట్టేంత వరకు రాజకీయాల్లో పోరు ఉంటుందని చెప్పారు. 'సంగమేశను అరివనె, ఆదరె ఒళహద్ద బందిదె. శివన ముడియ ఎరడు దుండు మల్లిగెగళు శివన బలపాద సేరియావు. ముందె సుఖాంత్యవాగలిదె' అంటూ తనదైన శైలిలో ఆయన భవిష్య వాక్కును వినిపించారు.

## రాయచూరులో దళిత సాహిత్య సమ్మేళనం

**రాయచూరు:** దళిత సాహిత్య పరిషత్ (బెంగళూరు), రాయచూరు జిల్లా దళిత సాహిత్య పరిషత్ సంయుక్తంగా ఈ నెల 20, 21వ తేదీల్లో స్థానిక రంగమందిరంలో 11వ అఖిల భారత దళిత సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహిస్తామని దళిత సాహిత్య పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ అర్జున్ గోళసంగి వెల్లడించారు. ఆయన ఆదివారం పత్రికా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మేళనం సర్వాధ్యక్షురాలిగా జయదేవి గాయకవాడను ఎంపిక చేశామన్నారు. విచార గోష్ఠి ప్రత్యేక ఉపన్యాసం, సాహిత్యంపై చర్చలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, విభిన్న రంగాల్లో సాధకులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని వివరించారు. 20వ తేదీ ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ మాజీ అధ్యక్షురాలు నరసమ్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, మాజీ ఉపాధ్యక్షుడు జయణ్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. బసవేశ్వర కూడలి నుంచి రంగమందిరం వరకు జరిగే ర్యాలీని సాహితీవేత్త బరగూరు రామచంద్రప్ప ప్రారంభిస్తారని, మంత్రులు బోసురాజు, శరణ ప్రకాష్ పాటిల్, ఎమ్మెల్యేలు శివరాజ్ పాటిల్, బసనగౌడ దద్దల్, ఎంపీ కుమారనాయక్ హాజరవుతారని విశదీకరించారు. సమావేశంలో తాయప్ప, హుస్సేనప్ప, అమరేశ్, ఆర్.కె.ఈరణ్ణ, నరసింహులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమావేశంలో అర్జున్ తదితరులు

## పోలీసు వేషం.. చేసేది మోసం

**బెంగళూరు(యశ్వంతపుర) :** సీసీబీ పోలీసులు పేరుతో పోలీసు యునిఫారం ధరించి ఒంటరిగా నివశించే మహిళలు ఉండే ఇళ్లలోకి ప్రవేశించి బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న యశ్వంతపుర మత్తికెరె నివాసి మల్లికార్జున(27), మల్లణ్ణ(36), ప్రమోద్(30), వినయ్(36)లను విద్యారణ్యపుర పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు మల్లికార్జున బళ్లారిజిల్లా సిరగుప్ప తాలూకా నివాసి. గతంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం కోసం అనేక సార్లు పోటీ పరీక్షలకు హాజరయ్యారు. ఎంపిక కాలేదు. దీంతో పోలీసు యునిఫాం ధరించి ప్రజలను బెదిరించి నగదు వసూలు చేయడం ప్రారంభించారు. అందుకు ముగ్గురు స్నేహితులు సహకరించారు. ఈనెల7న రాత్రి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని బెదిరించి నగదు, నగలు దోచుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కారు, ద్విచక్రవాహనం, రూ.45వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు

**రాయచూరు, న్యూస్‌టుడే :** జిల్లాలోని ఎనిమిది శిశు అభివృద్ధి యోజనాధికారి కార్యాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగనవాడీ కార్యకర్తలు, సహాయకుల ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అవసరమైన దాఖలాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ వెబ్‌సైట్ ద్వారా జనవరి 7 లోపు పంపుకోవాలని అధికారులు సూచించారు. ఏ గ్రామంలో ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయో తెలుసుకునేందుకు కార్యాలయాల పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## షెల్టర్ల నిర్వహణ పట్టని ఆర్టీసీ

**రాయచూరు, న్యూస్‌టుడే :** నగరంలోని బస్ షెల్టర్ల నిర్వహణను ఆర్టీసీ అధికారులు గాలికి వదిలేశారు. ప్రయాణికుల ఇబ్బందులను గమనించడం లేదు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ నిధి సాయంతో షెల్టర్లు నిర్మించారు. వాటి బాగోగులను ఆర్టీసీని చూసుకోవాలి. అసలు పట్టనట్లు వ్యవహరిస్తున్నందున సమస్యలు కొనసాగుతున్నాయి. ఠాగూర్ స్మారక విద్యాసంస్థ ఎదురుగా (అంబేడ్కర్ కూడలి- బసవేశ్వర కూడలి మధ్య) ఉన్న షెల్టర్‌లో చాలా కాలంగా కుర్చీలు లేవు. వేసిన ఆసనాలు ఏమయ్యాయో తెలియదు. ప్రత్యామ్నాయ వ్యవస్థ కల్పించాల్సిన ఆర్టీసీ పట్టించుకోవడం లేదు. ఒక అడుగు ఉన్న కట్ట మీద చాలా సేపు కూర్చోలేకపోతున్నారు. బస్సులు ఆలస్యమైతే నిలబడుతున్నారు. వర్షాకాలం, ఎండాకాలంలో కట్టలే దిక్కు. షెల్టర్లలోని సమస్యలపై పార్టీలు, సంఘాలు ఇంత వరకూ గళం విప్పలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

షెల్టర్‌లో కుర్చీలు లేని కట్టలు

## శామనూరు.. ఇకలేరు

### కన్నుమూసిన సీనియరు ఎమ్మెల్యే



**దావణగెరె, న్యూస్‌టుడే:** సీనియరు కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శామనూరు శివశంకరప్ప (95) ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. గత నెల రోజులుగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. నేడు దావణగెరెలో వీరశైవ లింగాయత విధి విధానాలకు అనుగుణంగా సకల ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా నేడు (సోమ) బెళగావిలో శీతాకాల శాసనసభ సమావేశాలను రద్దు చేశారు. పలు విద్యాసంస్థలను నెలకొల్పిన శివశంకరప్ప ప్రస్తుతం వీరశైవ మహాసభకు అధ్యక్షునిగానూ సేవలు అందిస్తున్నారు. ఆయన కుమారుడు ఎస్ఎస్ మల్లికార్జున్ ఉద్యాన శాఖ మంత్రిగా పని చేస్తుండగా, ఆయన కోడలు ప్రభా మల్లికార్జున్ లోక్‌సభకు మొదటిసారి ఎంపికయ్యారు. శివశంకరప్ప మృతికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులు, మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, బసవరాజ బొమ్మై, జగదీశ్ శెట్టర్, తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

## ప్రజలకు పరీక్ష పెడతారా?:

### మంత్రి కృష్ణబైరేగౌడ అసహనం

**బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే:** మెట్రో సిమెంట్ స్తంభం నిర్మించేందుకు రెండు నెలలు సమయంపడుతుందని కాని ఆరునెలల సమయం తీసుకుని వాహనదారులు, ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారా? అని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ ఉన్నతాధికారులపై విరుచుకుపడ్డారు. ఆదివారం ఇక్కడ మెట్రో రెండో-బి దశ నిర్మాణం సాగుతున్న నాగవార మెట్రో స్టేషన్ నుంచి బాగలూరు క్రాస్ వరకు జరుగుతున్న పనులను ఆదివారం ఆయన, బీఎంఆర్‌సీఎల్, ఉత్తర నగర పాలికె ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఉన్నతాధికారులు, గుత్తేదారులు పనితీరుపై ధ్వజమెత్తారు. కొన్నేళ్లు నుంచి మెట్రో పనులు సాగుతున్నాయని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మిగతా ప్రాంతాల్లో పనులు పూర్తి చేసిన ఇక్కడ ఎందుకు జాప్యం చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని మండిపడ్డారు. మెట్రో నిర్మాణ పనులు వ్యర్థాలతో పాదచారి మార్గాలు, సర్వీసు రహదారులు నిండి సంచరించలేని పరిస్థితి నెలకొందని తక్షణం వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అనవసరంగా కొన్ని రహదారులను మూసివేస్తున్నారని, దీనివల్ల సంచార రద్దీ పెరుగుతుందన్నారు. త్వరగా మెట్రో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## భజన మండలి వీడియోను పంచుకున్న భాజపా

**బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భజన మండలిని ఏర్పాటు చేసుకున్నారని కర్ణాటక భాజపా ఎద్దేవా చేసింది. శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ ఇద్దరూ హార్మోనియం వాయిస్తూ 'ఎష్టు దినా ఇల్లే కూరతి, నిన్న మనె బ్యారైతె' అంటూ పాడుతున్న వీడియోను కృత్రిమ మేధస్సుతో సృష్టించి పోస్టు చేశారు. అదే వీడియోలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, ఆమె సోదరుడు చెన్నరాజ్‌లు భజన చేస్తున్నట్లు వీడియోను రూపొందించారు. భాజపా కర్ణాటక శాఖ ఎక్స్ కార్ప్ ఖాతాలోని ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

## ఖగోళంపై విద్యార్థులకు అవగాహన

వివరిస్తున్న షంషుద్దీన్

**రాయచూరు, న్యూస్‌టుడే :** రోటరీ రాయచూరు ఈస్ట్, భారత జ్ఞానవిజ్ఞాన సమితి, గురుకృపా ట్రస్టు సంయుక్తంగా తాలూకా జేగరకల్ గ్రామంలో శనివారం రాత్రి విద్యార్థులకు నక్షత్రాలు, గ్రహాలు, తోకచుక్కల గురించి అవగాహన కల్పించారు. విశ్రాంత అధ్యాపకుడు షంషుద్దీన్ తోకచుక్కలు పుట్టడం, సూర్యుని చుట్టూ గ్రహాలు ఎలా తిరుగుతాయో వివరించారు. వీటిని ఎలా వీక్షించాలో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లను వినియోగించుకోవాలని సూచించారు. వాతవరణం, ఆకాశంలో సంభవించే సంఘటనల దృశ్యాలను గమనిస్తూ, పరిశోధనలు చేయటానికి ప్రయత్నించాలని కోరారు. ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించడాన్ని ఆలవరచుకోవాలని సలహా ఇచ్చారు. రోటరీ అధ్యక్షుడు రవీందర కురి, సభ్యుడు చేతనకుమార్, విజ్ఞాన సమితి జిల్లా సంచలకుడు హఫిజుల్లా, ముఖ్యులు ఉమేష్ జనార్దన్, వెంకటేష్, ఫరీదా బేగం, మౌనికా, అమరేశ్ పాల్గొన్నారు.

## ఆధునిక వచన సంకలన కృతి విడుదల

**మాన్వి, న్యూస్‌టుడే :** అభ్యుదయ సాహితీవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సువర్ణగిరి మఠ రచించిన ఆధునిక వచన సంకలన నుడి నైవేద్య కృతిని ఆదివారం స్థానిక గెలాక్సీ హాల్లో జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు మహాంతేశ్ మస్కి విడుదల చేశారు. శరణుల వచనాలను స్ఫూర్తిగా తీసుకొని ఆధునిక వచనాలను రచించే పరంపరను సిద్ధలింగయ్య నాంది పలికారన్నారు. ఇప్పుడా పరంపరను చంద్రశేఖర్ అందిపుచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కల్మఠ విరూపాక్ష పండితారాధ్యస్వామీజీ, చికల్‌పర్వి రుద్రమునీశ్వర మఠం సదాశివస్వామీజీ, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శరణబసవ, మాజీ అధ్యక్షుడు బసవ ప్రభుపాటిల్, ప్రతినిధులు పంపయ్యస్వామి, గిరెయ్యపాటిల్, చైతన్యప్రభు, రాచమ్మ సాంబయ్యస్వామి, త్రయంబకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

## మైనార్టీ విద్యార్థులకు ప్రోత్సాహధనం

**రాయచూరు, న్యూస్‌టుడే :** బీఈడీ (2025-26) చేస్తున్న మైనార్టీ విద్యార్థులకు రూ.25 వేల ప్రత్యేక ప్రోత్సాహధనాన్ని చెల్లించేందుకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ, జైన్, సిక్కు, బౌద్ధ, పార్శీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు సేవా సింధు యాప్ ద్వారా ఈ నెల 31 లోపు వివరాలు పంపుకోవాలని సూచించారు. ఎంపికైన వారి ఖాతాల్లో సొమ్మును నేరుగా జమ చేస్తారని వెల్లడించారు.

## కంపించిన భూమి

**దావణగెరె, న్యూస్‌టుడే:** దావణగెరె జిల్లాలో పలు ప్రాంతాలలో, చుట్టుపక్కల జిల్లాల్లో శనివారం రాత్రి భూమి కంపించిన అనుభవం స్థానికులకు కలిగింది. జగళూరు, కూడ్లిగి, చెళ్లకెరె తాలూకాల్లో శనివారం రాత్రి ఏడు గంటలకు పెద్ద చప్పుడు వినిపించింది. ఆ తర్వాత కొంత సమయానికే భూమి కంపించిన అనుభవం కావడంతో అందరూ పరుగులు పెడుతూ ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. రాత్రి పది గంటల వరకు ఇళ్ల వెలుపలే ఉండగా, మరికొందరు రాత్రంతా జాగారం చేస్తూ బయటే చలి మంటలు వేసుకుని కూర్చున్నారు.

## దివ్యాంగులకు చేయూత ఇవ్వాలి

**మాన్వి, న్యూస్‌టుడే :** సమాచార లోపం కారణంగా దివ్యాంగులకు సరిగా ప్రభుత్వ సదుపాయాలు అందలేదని, వారికి చేయూత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ పేర్కొన్నారు. స్థానిక టీఏపీసీఎంఎస్ మైదానంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రమాణిక ప్రయత్నాలు చేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కల్మఠం విరూపాక్ష పండితారాధ్య స్వామీజీ మాట్లాడుతూ దివ్యాంగులు సామాన్య ప్రజలకంటే అధిక సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. వారు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. ప్రముఖులు సజ్జద్ హుసేన్, సురేష్ విన్సెంట్, రాజా రామచంద్రనాయక్, మౌనేశ్‌నాయక్, వినోద్‌కుమార్, గుమ్మాబసవరాజ్, శివకుమార్ చల్మల్, లక్ష్మీ, సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

## ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్లే

**సిరుగుప్ప, న్యూస్‌టుడే:** పట్టణ పరిశుభ్రతలో నిమగ్నమయ్యే పౌరకార్మికులు ఆరోగ్యం అవగాహన పెంచుకోవడం వల్ల ఆరోగ్య ంగా విధులు నిర్వహించేందుకు దోహదపడుతుందని పట్టణంలోని సురక్ష ఆసుపత్రి వైద్యుడు కృష్ణవంశీ సూచించారు. నగరసభ, సురక్ష ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో పౌరకార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కృష్ణవంశీ, డాక్టర్ కొడాలి సిగ్ధ ఆధ్వర్యంలో కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ చెకప్‌లు నిర్వహించి, కార్మికులను ఉద్దేశించిన అనంతరం ఆయన మాట్లాడారు. పగలూ రాత్రీ తేడా లేకుండా విధులు నిర్వహించే పౌరకార్మికులు విధులు నిర్వహించే సమయంలో మాస్కులు, మురుగునీరు, చెత్త, చెదారం, శుభ్రపరిచేటప్పుడు కాళ్లు, చేతులు, తలకు రక్షణ కవచాలు ధరించాలి, మద్యపానం, ధూమపానం, గుట్కా, పొగాకు నమలడం వంటివి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. నగరసభ ఆరోగ్యాధికారి రంగస్వామి, ఉద్యోగులు తిప్పమ్మ, అమర్‌నాథ్, పౌరకార్మికులు పాల్గొన్నారు.

పౌరకార్మికులకు ఆరోగ్య విషయాలు వివరిస్తున్న వైద్యుడు కృష్ణవంశీ

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి విషాదాంతం

**మైసూరు, న్యూస్‌టుడే:** హుణసూరు తాలూకా అంకనహళ్లి గేట్ వద్ద ఆదివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. చిక్కాడిగనహళ్లి నివాసి రవి (37), అంకనహళ్లి నివాసి ప్రసన్న (42)లను నిందితులుగా గుర్తించారు. వీరిద్దరూ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో బాధితులు ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. బిళికెరె ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఏనుగుదాడిలో రైతు మృతి

**రామనగర, న్యూస్‌టుడే:** తోటకు నీరు కట్టేందుకు వెళ్లిన దుండమాద (50) అనే రైతు ఏనుగు దాడిలో మరణించారు. రామనగర సమీపంలోని దున్నసంద్రకు చెందిన రైతు ఆదివారం వేకువజామున తోటకు వెళ్లినప్పుడు ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక వారం నుంచి తమ గ్రామ పరిధిలో ఏనుగు తిరుగుతోందని ఫిర్యాదు చేసినా, అధికారులు స్పందించలేదని స్థానికులు ఆక్రోశించారు. ఏనుగును బంధించేందుకు కార్యాచరణ ప్రారంభించామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

### తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

| 14-12-2025 (ఉ॥ 8 గంటలకు) | ప్రస్తుతం | గత సంవత్సరం |
|---|---|---|
| నీటిమట్టం (అడుగుల్లో) | 1618.42 | 1629.25 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 532 | 3,419 |
| అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | 16,688 | 5,828 |
| నీటి నిల్వ (టి.ఎం.సి) | 57.012 | 91.274 |

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

## చరిత్ర పుటల్లోకి ఊర్వశి థియేటర్

**బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే:** బెంగళూరులో సింగిల్ స్క్రీన్ థియేటర్ల సంఖ్య క్రమేణా తగ్గిపోతూ వస్తున్నాయి. ఈ వరుసలో నగరంలో అతి పెద్ద థియేటర్లలో ఒకటిగా ఉన్న ఊర్వశి చేరనుంది. లాల్‌బాగ్ సమీపంలోని సిద్ధయ్య రహదారిలోని ఈ థియేటర్‌ను 1970లో నిర్మించారు. ఇది 1,100 సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెద్ద తెర, అత్యాధునిక సాంకేతికతలను అలవర్చుకున్న ఈ థియేటర్‌లో సేవలను వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి నిలిపి వేయనున్నారు. ఇప్పటికే నగరంలో కపాలి, సాగర్, త్రివేణి, కావేరి, స్టేట్స్, మూవీల్యాండ్, కెంపేగౌడ, మెజెస్టిక్ తదితర థియేటర్లను కూల్చి ఇతర నిర్మాణాలు, మినీ మాల్స్‌ను నిర్మించారు. ఊర్వశి థియేటర్ ఆవరణలో ఒక మాల్ వస్తుందని సమాచారం.

ఊర్వశి థియేటర్

## ఎమ్మెల్యే గారూ..సమస్యలు పరిష్కరించండి

**మాన్వి, న్యూస్‌టుడే :** రాయచూరు విధానసభ పరిధిలోని దద్దల్ గ్రామంలో నిర్వహించనున్న ఆంజినేయస్వామి, మారెమ్మదేవి జాతర సందర్భంగా దద్దల్ గ్రామానికి వచ్చిన హంపయ్యనాయక్‌ను ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ స్వాగతం పలికారు. మాన్వి పరిధిలోని కాతరకి గ్రామం నుంచి దద్దల్ వరకు రహదారి పనులను చేపట్టాలని స్థానికులు కోరారు. తాగునీటి సమస్యని పరిష్కరించాలన్నారు. రహదారి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అయ్యనగౌడ నాయక్, మౌనేశ్‌నాయక్, గోవిందరాజ్, ప్రముఖులు పాల్గొన్నారు.

హంపయ్యనాయక్‌ను స్వాగతిస్తున్న బసనగౌడ్ దద్దల్

(c) eenadu

## రైతు సజీవ దహనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా పిపిలి సమితిలోని సునాముహి గ్రామంలో ఆదివారం పంట పొలంలో రైతు నకుల్‌దాస్ సజీవ దహనమయ్యాడు. ఇటీవల పొలంలో ధాన్యం కోత చేశారు. మిగిలిన చొప్పకు రైతు నిప్పు పెట్టాడు. గాలి తీవ్రంగా ఉన్నందున మంటలు వ్యాపించాయి. అందులో చిక్కుకున్న రైతు బయటకు రాలేకపోయాడు. చేరువలో ఎవరూ లేకపోవడంతో కొద్ది సేపట్లో సజీవ దహనమయ్యాడు. కొంతసేపటి తర్వాత సమీప పొలాల రైతులు వెళ్లారు. కాలిన దేహం గమనించి పోలీసులకు, సమితి అధికారులకు తెలియజేశారు.

## కోత మిషన్‌లో పడి మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా బర్ధన్‌పూర్ గ్రామంలో ఆదివారం ధాన్యం కోత మిషన్‌లో పడి ఒక రైతు మృతిచెందాడు. కోత జరుగుతుండగా మిషన్ సమీపంలోకి రైతు అర్జునో దెహురి (45) వెళ్లడంతో ఆయనను లోపలికి లాగేసింది. వెంటనే చోదకుడు మిషన్ ఆపినా అప్పటికే దెహురి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## మంటల్లో దగ్ధమైన రూ.10 లక్షల విలువైన వరికుప్పలు

దగ్ధమవుతున్న వరికుప్పలపై నీరు చిమ్ముతున్న అగ్నిమాపక ఉద్యోగి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా సురడా సమితిలోని సంధికెందు గ్రామంలో ఆదివారం వేకువన వరికుప్పలు మంటల్లో చిక్కుకున్నాయి. ఉదయం 5.10 గంటలకు స్థానికుల సమాచారంతో సురడా అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలు నియంత్రించారు. అప్పటికే ఎక్కువ వరికుప్పలు మంటల్లో కాలి బూడిదగా మారాయి. గ్రామానికి చెందిన 11 మంది రైతులు పదిహేను ఎకరాల్లో కోసిన పైరును ఒకచోట కుప్పలుగా పోసుకున్నట్లు తెలిసిందని సురడా అగ్నిమాపక కేంద్రం ఇన్‌ఛార్జి అధికారి సందీప్ కుమార్ బెహర సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. కొంత మేర కాలిపోగా మిగిలిన ధాన్యాన్ని కాపాడామని, వాటిని రైతులు ఎండ బెట్టుకున్నారని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదని, దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మంటల్లో సుమారు రూ.10 లక్షల విలువైన ధాన్యం బూడిదైందని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బాధిత రైతులు వాల్మీకి బిశోయి, మాధవ బిశోయి, రామ బిశోయి తదితరులు విలేకరుల వద్ద బోరుమన్నారు.

### అగ్ని ప్రమాదం.. 20 ఎకరాల వరి బూడిద

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీపూర్ సమితి కుచేయి పొదర్ ఉపరకొండ గ్రామంలోని పొలంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పదిమంది రైతుల పంటలకు సంబంధించిన వరితో పాటు చోడి కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు 20 ఎకరాల్లో పండించిన పంట మొత్తం కుప్పలుగా వేసి ఉంచారు. ఇంతలో ఈ ప్రమాదం జరగడంతో సంవత్సరమంతా కష్టపడి పండించిన పంటంతా బూడిదయ్యిందని, ఇక మేము ఏం తిని బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలు గ్రామానికి దూరంగా ఉండడంతో సకాలంలో కల్లం వద్దకు చేరుకోలేక పోయామని రైతు కృష్ణ జొడియా అన్నారు. ఈ ప్రమాదంలో రామజొడియ, భీమ జొడియ, నరేంద్ర జొడియ తదితర రైతుల పంటలు కాలిపోయాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు.

కాలిన వరి కుప్పలు

## విద్యుత్తు వృథా చేయొద్దు ● కనకవర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విద్యుత్తును వృథా చేయొద్దని, చౌర్యం అరికట్టాలని, రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించకూడదని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ కోరారు. ఆదివారం జాతీయ విద్యుత్తు దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనేశ్వర్‌లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద జన చైతన్య సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పవర్ ఉత్పత్తిలో అగ్రగామి అవుతున్న రాష్ట్రంలో వినియోగదారులకు ఉత్తమ సేవలు ధ్యేయంగా చేసుకున్నామన్నారు. రాయితీలతో కూడిన సీఎం సూర్యఘర్ యోజన అందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి విశాల్‌కుమార్ దేవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజధానిలో సేవ సంస్థల వాలంటీర్లు, విద్యార్థులతో అవగాహనా ర్యాలీ చేపట్టారు. దీన్ని సింగ్‌దేవ్ జెండా ఊపి ప్రారంభించారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సింగ్‌దేవ్

## 17న బ్రహ్మపురకు ముఖ్యమంత్రి

మోహన్ చరణ్ మాఝి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఈ నెల 17న (బుధవారం) బ్రహ్మపుర పర్యటనకు వస్తున్నారు. ఆయన స్థానిక నీలకంఠనగర్‌లోని సరస్వతీ శిశు విద్యా మందిర్ ప్రాంగణంలో ఆ విద్యాసంస్థ 42వ వార్షికోత్సవంలో పాల్గొంటారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహక శిశు విద్యామందిర్ ఆహ్వానపత్రికలో పేర్కొన్నారు. సీఎం హెలికాప్టర్‌లో వచ్చి స్థానిక ప్రేమనగర్ మెయిన్ రోడ్డులోని సిటీ హైస్కూలు మైదానంలో దిగుతారు, అక్కడి నుంచి కారులో నీలకంఠనగర్‌లోని సరస్వతీ శిశు విద్యా మందిర్ ప్రాంగణానికి చేరుకుంటారని తెలిసింది. గంజాం జిల్లా యంత్రాంగం సిటీ హైస్కూలు మైదానంలో తాత్కాలిక హెలీప్యాడ్ కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. ఆదివారం యంత్రాలతో మైదానం చదును చేసే పనులు ముమ్మరంగా చేపట్టారు.

సిటీ హైస్కూలు మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణం పనులు

## రాస్తారోకోకు దిగిన స్థానికులు

దాడి చేస్తున్న శునకాలు..

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని గుసానినువాగాం శాస్త్రినగర్ మూడో లైను సమీపంలోని బిల్లా వీధిలో కుక్కల వీరంగంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. పక్షం రోజుల వ్యవధిలో 25 మందికిపైగా కుక్కల దాడిలో గాయపడ్డారు. దీనిపై స్థానిక ప్రముఖుడు లలిత మోహన్ మంగరాజ్ ఆధ్వర్యంలో పలువురు స్థానికులు జిల్లా బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) ఉప మేయరు ఆశీర్వాద పరిడాకు వినతిపత్రం ఇచ్చారు. తాజాగా ఆదివారం ఉదయం వీధిలో పప్పు దినుసులు విక్రయించేందుకు వచ్చిన వృద్ధురాలిని కుక్క కరిచింది. దీంతో స్థానికుల్లో ఆగ్రహం పెల్లుబికింది. తక్షణం వీధి శునకాల్ని మరో ప్రాంతానికి తరలించాలని డిమాండు చేస్తూ వీధి కూడలిలో టైర్లు కాల్చి రాస్తారోకో చేపట్టారు. మధ్యాహ్నం వరకూ ఇది కొనసాగింది. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. స్థానిక వార్డు కార్పొరేటరు ధిరేష్ సాబత్ తదితరులు వారితో మాట్లాడారు. బీఈఎంసీ అధికారులు శునకాల్ని మరో ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. స్థానిక ప్రముఖుడు లలిత మోహన్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వీధిలో శునకాల దాడితో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారన్నారు. దీనిపై బీఈఎంసీ అధికారులు, స్థానిక పోలీసులకు తెలియజేశామని, కుక్కల్ని పట్టుకునేందుకు వస్తున్న బీఈఎంసీ సిబ్బందిని వీధిలోని ఓ జంతు ప్రేమికురాలు అడ్డుకుంటోందని ఆయన పేర్కొన్నారు. శునకాలతో తీవ్రంగా భయపడి ఇలా రాస్తారోకోకు దిగాల్సి వచ్చిందని అన్నారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు. చిత్రంలో వార్డు కార్పొరేటరు ధిరేష్ సాబత్

కాలిపై కుక్క కరవడంతో గాయపడిన చిరువ్యాపారి (వృత్తంలో)

టైర్లు కాల్చి ఆందోళన చేస్తున్న స్థానికులు

## పెళ్లికి నిరాకరించిన యువతిపై చాకుతో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఆమెపై చాకుతో దాడి చేసిన యువకుడు అదే చాకుతో తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొంధమాల్ జిల్లా ఫుల్బాణీ టౌన్ ఠాణా పరిధిలోని పియోన్‌పడలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గంజాం జిల్లా భంజనగర్ ఠాణా పరిధిలోని బణిపల్లి గ్రామానికి చెందిన శుభం స్వయిన్ (22) అనే యువకుడితో కొంధమాల్ జిల్లా ఫుల్బాణీ టౌన్ ఠాణా పరిధిలోని పియోన్‌పడకు చెందిన యువతి సన్నిహితంగా ఉండేది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని ప్రమాణాలు కూడా చేసుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులు వేరే యువకుడితో కుదిర్చిన పెళ్లికి ఆమె అంగీకరించినట్లు స్వయిన్‌కు తెలిసింది. దీంతో ఆయన ఉదయం పియోన్‌పడలోని ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిని కలిసి పెళ్లి చేసుకుందామని కోరడంతో తిరస్కరించింది. దీంతో ఆగ్రహానికి గురైన స్వయిన్ చాకుతో ఆమెపై దాడి చేయగా, శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగు పొరుగు వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకోగా, వారిని చూసిన స్వయిన్ చాకుతో తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు.

## భాజపాతో సన్నిహితంగా ఉన్నవారు వెళ్లొచ్చు

● పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్

భక్తచరణ్‌దాస్

మహమ్మద్ ముఖిం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాజపాతో సన్నిహితంగా ఉన్నవారు పార్టీ వీడి వెళ్లొచ్చని పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ అన్నారు. ఆదివారం దిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ, మల్లిఖార్జునఖర్గే కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు నడిపిస్తున్నారన్నారు. వారి చిత్తశుద్ధిని శంకించి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పార్టీ సీనియర్ నేత మహమ్మద్ ముఖిం ఇటీవల పీసీసీ అధ్యక్షుడు దాస్, మల్లిఖార్జున్, రాహుల్‌లపై ప్రతికూల వ్యాఖ్యలు చేసి, అధిష్ఠానానికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఇది చర్చనీయాంశమైంది. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ ఏఐసీసీ నాయకత్వానికి తెలియపరిచింది. దిల్లీ పెద్దలు ముఖింపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదని పరిశీలకులంటున్నారు.

### హస్తినలో సీనియర్ నేతలు

ఏఐసీసీ నాయకత్వం దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో 'ఓట్ చోరీ'పై ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

### రేపోమాపో నిర్ణయం

అధిష్ఠానం ముఖిం విషయమై రేపోమాపో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు ముఖిం ప్రాంతీయ పార్టీ పెడతారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన కుమార్తె, కటక్-బారాబటి కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దోస్ తండ్రికి అండగా ఉంటారా? అన్నదిప్పుడు ఆసక్తికరంగా మారింది.

## తూర్పు రాష్ట్రాలకు ఉజ్వల భవిత: గవర్నర్ హరిబాబు

వేదికపై అతిథులతో కలిసి సంచిక ఆవిష్కరిస్తున్న గవర్నరు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ పూర్వోదయ భారత్ (తూర్పు) రాష్ట్రాల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా చేసుకున్న నేపథ్యంలో ఒడిశా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో 'పూర్వోదయ అంతర్జాతీయ సదస్సు-2025' జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ 'వికసిత్ భారత్-2047' ధ్యేయం నెరవేర్చడంలో తూర్పు రాష్ట్రాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇటీవల కాలంలో ఒడిశా సెమీకండక్టర్, ఐటీ, రైల్వే, ఓడరేవులు, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ముందంజ వేస్తోందని, భవిష్యత్‌లో ఈ రాష్ట్రం ఉత్పత్తి, ఉపాధి అవకాశాల్లో పోటీ పడుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వీసీ మాధ్యమంలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందంజ వేస్తోందన్నారు. ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ నేపాల్ రాయబారి శంకర్ ప్రసాద్ శర్మ, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ కార్యదర్శి అపర్ణారాయ్, కేంద్ర మాజీ కార్యదర్శి సిద్ధార్థ్ ప్రధాన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సంచిక ఆవిష్కరించారు.

## 30 బార్లపై ఆబ్కారీ దాడులు

భువనేశ్వర్, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని 30 బార్‌లపై ఆబ్కారీ శాఖ అధికారులు శనివారం రాత్రి దాడులు చేసి తనిఖీలు చేశారు. సత్యవిహార్, చంద్రశేఖర్‌పూర్, పటియా ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. నూతన సంవత్సర వేడుకలు పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నాయి.

### అధికారిపై దాడి

చంద్రశేఖర్‌పూర్ ప్రాంతంలో తనిఖీ నిర్వహిస్తున్న ఓ అధికారిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. దీనికి సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ ఘటనలో హస్తమున్న మిగతా వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు. అధికారిపై దాడికి పాల్పడిన ఘటనపై స్థానిక స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## పచ్చని.. పరిశుభ్ర పర్యావరణానికి ఉద్యమిద్దాం

మొక్కలు నాటుతున్న విద్యార్థులు. చిత్రంలో అతిథులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పచ్చని, పరిశుభ్రమైన పర్యావరణం అందరి లక్ష్యం కావాలని, ఈ దిశగా అంతా విరివిగా మొక్కలు నాటాలని, పాలిథిన్‌ల వినియోగానికి దూరంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అతిథులన్నారు. గంజాం జిల్లా కళ్లికోట సమితిలో నయికాణిపల్లిలోని వాగ్దేవి ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణం పరిరక్షణ, పరిసరాలు పరిశుభ్రత అంశంపై శనివారం ఓ సమావేశం జరిగింది. ఆర్యభట్ట ఫౌండేషన్ ముఖ్యుడు సుధీర్ రౌత్, ప్రకృతి ప్రేమికుడు శ్యాంసుందర్ ఖడంగా, దిగపొహండి సమితి విద్యాధికారి డాక్టర్ శంకర నారాయణ బెజ, సామాజికవేత్త సరోజ్ రంజన్ పట్నాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన వివిధ అంశాలను వారు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, అతిథులు మొక్కలు నాటి, చెత్త పోసేందుకు కుండీలను ప్రారంభించారు.

## యువతను ప్రోత్సహిస్తున్న టాటా స్టీల్

ప్రతిభావంతులను సత్కరిస్తున్న మంత్రి పాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రతిభావంతులైన యువతీ యువకులు శాస్త్ర, సాంకేతిక, ఖగోళరంగాల్లో పరిశోధనలకు చేయూతనిస్తున్న టాటాస్టీల్ యాజమాన్యం సేవలు ప్రశంసనీయమని శాస్త్ర, విజ్ఞానశాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని పఠానిసామంత ప్లానిటోరియంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిష్య శాస్త్రం, పఠాని సామంత పరిశోధనా కేంద్రంలో రాణించిన 30 మంది విజేతలకు మంత్రి పాత్ర్ టాటా సంస్థ తరపున సత్కరించారు. కార్యక్రమంలో సైన్స్ టెక్నాలజీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిత్ర అర్ముగం, టాటా ప్రతినిధులు పాల్గొన్నారు.

## శీతల గిడ్డంగుల కొరత తీరుతుంది: సింగ్‌దేవ్

సదస్సు ప్రారంభిస్తున్న సింగ్‌దేవ్. పక్కన అరవిందపాఢి, ఇతర అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శీతల గిడ్డంగుల కొరత తీరుతుందని, కొద్ది రోజుల్లో 50 గిడ్డంగులు ప్రారంభం కానున్నాయని వ్యవసాయశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని కృషిభవన్‌లో 'అన్నదాతలు, శీతల గిడ్డంగులు' అన్న అంశంపై సదస్సు జరిగింది. దీన్ని ప్రారంభించిన సింగ్‌దేవ్ మాట్లాడుతూ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో గిడ్డంగుల కోసం రూ.252 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రైతులు సొంతంగా ఇవి ప్రారంభిస్తే రాయితీలు కల్పిస్తున్నామని, నిర్వహణకు సంబంధించి అవగాహన శిబిరాలు చేపడుతున్నామన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తుల్లో ముందంజలో ఉన్న అన్నదాతలు గిడ్డంగుల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవిందపాఢి మాట్లాడుతూ గిడ్డంగులకు సంబంధించి సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇతర అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మేఘనాథ ప్రహరీలో మళ్లీ లీకైన నీరు

మేఘనాథ ప్రహరీపై నీరు లీకవడంతో నాచు పట్టిన ప్రాంతం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రం మేఘనాథ ప్రహరీ ఉత్తర దిశవైపు ఆదివారం మళ్లీ నీరు చిమ్మింది. ఆనందబజారు వైపు నుంచి నీరు చిమ్ముతున్నందున నాచు పట్టింది. దీని వల్ల ప్రహరీ బలహీనపడుతుందని భక్తులు పేర్కొన్నారు. గతేడాది నవంబరులో నీరు లీకైన సంగతి తెలిసిందే. అప్పట్లో దీన్ని ప్రసార సాధనాలు యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లగా పురావస్తుశాఖ (ఏఎస్ఐ) మరమ్మతులు చేసి కెమికల్ ప్లాస్టరింగ్ చేసింది.. అదేచోట మళ్లీ లీకవుతుండటంతో సేవాయత్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాలనాధికారి అరవింద పాఢి తక్షణ చర్యలు తీసుకోవాలని దైతాపతి సేవాయత్ సంఘం కార్యదర్శి చినాయక్‌దాస్ మహాపాత్ర్ డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పాలనాధికారి అరవిందపాఢి ఆదివారం సాయంత్రం పురావస్తుశాఖ (ఏఎస్ఐ) యంత్రాంగానికి లేఖ రాశారు. వెంటనే మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు.

## పొద్దున్న బోధన.. పొద్దుపోయాక వేదన

విద్యార్థులు పడుకున్న చోట పైన ప్రమాద స్థితిలో కలప

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి హికింపుట్ గ్రామ పంచాయతీకి చెందిన బిలాపుట్‌లో ఉండే గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద నడుస్తున్న బుద్ధదేవ్ విద్యాపీఠంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 284 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఒకే గది ఉంది. దానిని తరగతి గదిగా.. వసతిగృహంగా వినియోగించుకొని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గది పైకప్పు ప్రమాదకర స్థితిలో ఉంది. ఈ విద్యాపీఠం 2001లో ప్రారంభమైంది. 2009లో గ్రాంట్-ఇన్-ఎయిడ్ పొందిన తర్వాత, పాఠశాల 2012లో ప్రభుత్వ గ్రాంట్‌తో ప్రభుత్వ పాఠశాల హోదాను పొందింది. విద్యార్థులు పడుకున్న చోటే పైన కలప ఉంచడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క పైకప్పు రేకులకు రంధ్రాలు ఏర్పడి చలి, వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయాన్ని సమితి సంక్షేమ అధికారి సుబ్రత్ కుమార్ పరిడ దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరగా తన వద్ద ఎటువంటి సమాచారం లేదని సమాధానాన్ని దాటవేశారు.

### ప్రతిపాదనలు పంపించాం..

సమితి అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్ దొరను ప్రశ్నించగా విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి జిల్లా సంక్షేమ అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, నిధులు కోసం ప్రతిపాదనలు పంపి మంజూరు ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. తరగతి గదులు, విద్యార్థుల వసతి, మరుగుదొడ్లు, రోడ్లు, తాగునీటి సౌకర్యాల కోసం వివిధ ప్రభుత్వ పథకాల కింద నిధులు మంజూరు జరిగేలా కృషి చేస్తామన్నారు.

## తగ్గిన వెల.. రైతు విలవిల

దళారులకే లాభాలు తెస్తున్న క్యాలీఫ్లవర్

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: అనుకూలించిన వాతావరణం.. విరగకాసిన పంట.. మంచి ధరలు లభిస్తున్నాయన్న ఆనందంలో ఉన్న క్యాలీఫ్లవర్ రైతులు వారం రోజుల వ్యవధిలో హఠాత్తుగా పడిపోయిన ధరలతో తలలు పట్టుకుంటున్నారు. గంజాం సమితిలోని ఘూరెగోబిందపూర్, సాన్నొ రామచంద్రపూర్, సబుళయా పంచాయతీల్లో వివిధ గ్రామాల్లో రైతులు దీర్ఘకాలంగా ఈ పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఆయా పంచాయతీల్లో పంట విరగకాసింది. పంట కోతకొచ్చిన తొలి నాళ్లలో కిలో పువ్వును వ్యాపారులకు రూ.55-రూ.60లకు విక్రయించేవారు. తర్వాత ధర హఠాత్తుగా తగ్గిపోవడంతో రైతులు డీలా పడిపోయారు. వారం రోజుల వ్యవధిలో కిలోపై రూ.20లు తగ్గిందని, దీంతో వ్యాపారులు కిలోపువ్వును రూ.35లకు రైతుల నుంచి కొనుగోలు చేసి వినియోగదారులకు రూ.60లకు విక్రయిస్తున్నారని రైతులు మిథున్ నాహక్, పాణేశ్వర నాహక్‌లు విలేకరులకు చెప్పారు. ధరలు మరింత తగ్గితే లాభాల మాట అటుంచితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. దీంతో పలువురు రైతులు పంటను వీలైనంత త్వరగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు.

క్యాలీఫ్లవర్

విక్రయాలకు పువ్వులను సంచుల్లో సర్దుతున్న మహిళ

### ప్రభుత్వం మండీలు ఏర్పాటు చేయాలి

గంజాం జిల్లాలోని బ్రహ్మపుర తోపాటు భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి క్యాలీఫ్లవర్ ఎగుమతి అవుతోందని రైతులు తెలిపారు. పంటను ప్రభుత్వం మండీల ద్వారా కొనుగోలు చేయాలని వారు కోరారు. పంటకు సరైన ధర లభించకపోవడంతో రైతులు మెల్లమెల్లగా వ్యవసాయానికి దూరమవుతూ, ఉపాధికి రాష్ట్రేతర ప్రాంతాలకు వలస పోతున్నారని రైతులు బిజయచరణ నాహక్, హేమంత కుమార్ నాహక్ చెప్పారు. పంట ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజిలు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు.

భరణం విస్తీర్ణంలో సాగుకయ్యే ఖర్చు: రూ.30 వేలు ఆదాయం: కిలో ధర రూ.35-40ల మధ్య ఉంటే భరణానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ వస్తుంది

(c) eenadu

## అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నడక పోటీ విజేతలు

హైజంప్ చేస్తున్న జూనియర్ క్రీడాకారుడు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బాలబాలికలు, యువతీయువకుల పరుగులు, జంప్‌లు, త్రోలతో ఆ మైదానంలో క్రీడా వాతావరణం సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పోటీతత్వంతో ఆడుతున్నారు. గంజాం జిల్లా అథ్లెటిక్స్ సంఘం (జీడీఏఏ) ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్రీడామైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన పరుగు, ట్రిపుల్, హైజంప్, డిస్కస్‌త్రో, నడక తదితర అంశాల్లో జూనియర్, సీనియర్ బాలబాలికలు, పురుషులు, మహిళా క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. పోటీల మధ్యలో వివిధ అంశాల్లో వరుసగా మొదటిమూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జీడీఏఏ కార్యదర్శి జె.కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కేదార్‌నాథ్ చౌదరి, అథ్లెటిక్స్ విభాగం కార్యదర్శి ప్రమోద్‌కుమార్ మహరణా విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## దక్షిణాసియా దేశాలతో భారత్ బంధం దృఢమైనది

ముగింపు వేడుకలో వేదికపై ఎంపీ ప్రదీప్, ఉపకులపతి గీతాంజలి, ఉత్సవ నిర్వాహకులు

● గోపాల్‌పూర్‌లో ముగిసిన 3 రోజుల సోదర వేడుకలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: దక్షిణాసియా దేశాలతో భారత్ బంధం దృఢమైనదని, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తోందని బ్రహ్మపుర ఎంపీ ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహి చెప్పారు. గోపాల్‌పూర్ స్వర్గద్వార తీరంలోని ఓ అతిథి భవనంలో జరుగుతున్న సౌతాసియన్ సోదర భావ మూడు రోజుల వేడుకలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రదీప్ మాట్లాడుతూ విశ్వశాంతి, ఏకత్వం గురించి ప్రపంచదేశాలకు చాటుతున్న భారత్ సంస్కృతి విశిష్టమైనదని పేర్కొన్నారు. బ్రహ్మపుర విశ్వవిద్యాలయం ఉపకులపతి గీతాంజలి దాస్ పాల్గొన్నారు. భారత్‌కు చెందిన 18 రాష్ట్రాల కళాకారులు తమ హావభావాలు ప్రదర్శించారు.

### డాక్టర్ చిత్తరంజన్‌కు పురస్కారం

ఈ సందర్భంగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఒడిస్సీ నృత్య గురువు ఆచార్య చిత్తరంజన్ సహానీకి నిర్వాహకులు జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజలు.. ప్రారంభోత్సవాలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, చిత్రంలో బీఎంసీ మేయరు దొళాయ్, సరోజ్ సాబత్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఎంసీ) పరిధిలోని గురునిసియావాగలో ఆమా గావ్.. ఆమా పరివార్ ఆధ్వర్యంలో బ్రహ్మపుర ఎమ్మెల్యే నిధి నుంచి వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం భూమి పూజలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. బహుళార్థ భవనం, దమదమ, కొతక్ వీధుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, దొబా వీధిలో పాఠశాల భవనం, ఉత్తరేశ్వర హరిక్షేత్ర మండలి భవనం నిర్మాణం, దాదా నెహ్రూ వ్యాయామ కేంద్రం భవనాలకు భూమిపూజలు జరిగాయి. రాజేశ్వరనగర్‌లో కొత్త అంగన్‌వాడీ భవనం, మెయిన్ రోడ్డులో సత్యవాది పరమానాల నూతన భవనం ప్రారంభోత్సవాలు జరిగాయి. బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్, బీఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయ్, భాజపా గంజాం జిల్లా అధ్యక్షుడు సరోజ్ సాబత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్రీడల్లో రాష్ట్ర ఆటగాళ్లకు పతకాలు

పతకాలతో క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: దక్షిణాఫ్రికాలో ఈ నెల 8 నుంచి 13 వరకు జరిగిన యూఐపీఎం బైథలె, ట్రైథలె, లేజర్ రన్ ప్రపంచ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటి పతకాలు గెలుచుకున్నారు. ఇందులో పురుషుల విభాగంలో నిర్వహించిన ట్రైథలె బృంద అంశంలో క్రీడాకారులు ప్రణబ్ దాస్, అమియ కుమార్ ప్రధాన్‌లు చెరో రజత పతకం సాధించగా, అండర్-19 బాలుర విభాగంలో ట్రైథలె అంశంలో సూర్యాంసు మహాపాత్ర్ రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఇదే పోటీల్లో బైథలె అంశాల్లో కూడా ఈ క్రీడాకారులు రజత పతకాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర క్రీడాశాఖ ఆ వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసి విజేతలకు అభినందనలు తెలిపింది.

## కొరాపుట్‌లో క్రాస్ కంట్రీ పరుగు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం కొరాపుట్‌లో బీఎస్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ పరుగులో 900 మంది యువత పాల్గొన్నారు. కొరాపుట్ లోకోత్సవంలో భాగంగా నిర్వహించిన క్రాస్ కంట్రీ పరుగు నిర్వహణకు జిల్లాలో సేవలందిస్తున్న బీఎస్ఎఫ్ బృందాలు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. బీఎస్ఎఫ్ డీఐజీ సత్యవాన్ పరుగులో పాల్గొన్న యువతకు అభినందనలు తెలిపారు. పురుషుల విభాగంలో దాల్మని, రవి ముదులి, సిద్దార్థ్ వరుస స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో దేవయాని హరిజన్, దీప్తి రాణి, అంజనా వరుస స్థానాల్లో నిలిచారు. వారికి కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, ఎస్పీ రోహిత్ వర్మలు బహుమతులు అందజేశారు.

## మండేయిలో అలరించిన నృత్య ప్రదర్శనలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలోని కళలు, సంస్కృతులను పరిరక్షించేందుకు, కళాకారుల ప్రతిభను బయటకు తీసేందుకు మండేయి ఉత్సవం వేదికగా నిలిచింది. బొలంగీర్, గంజాం, మయూర్‌భంజ్‌లతో పాటు స్థానిక సమితులకు చెందిన వివిధ గ్రూప్ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయమూర్తి శుభకాంత్‌కుమార్ మహంతి విద్యాశాఖ మంత్రి నిత్యానంద్ గండ్, ఎమ్మెల్యేలు, అధికారులు కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

వేదికపై కళాకారులను అభినందిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు తదితరులు

## పరబ్ వేడుకలకు సన్నాహాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీ కళా సంస్కృతి పరిరక్షణ ఉద్దేశంతో నిర్వహించే పరబ్ వేడుకలకు జిల్లా కేంద్రం కొరాపుట్‌లో జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. నెల రోజులుగా సమితి స్థాయి వేడుకలతో పాటు క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ముఖ్య వేడుకలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పరబ్ మైదానంలో సభా వేదిక, స్టాల్స్, ఇతర అలంకరణల పనులు శరవేగంగా సాగుతున్నాయి. మైదానంలో రెండు లక్షల మంది పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది 356 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఓర్మాస్ జిల్లా కోఆర్డినేటర్ ఉమామహేశ్ తెలిపారు.

## 16న ఓటర్ల జాబితా విడుదల

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్ఐఆర్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం పూర్తయింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల జాబితా ఈనెల 16న విడుదల చేస్తామని ప్రకటించింది. అనంతరం జాబితాలో తప్పుల సవరణకు సమయం కేటాయిస్తారు. కొత్త ఓటర్ల జాబితా బీఎల్ఓల దగ్గర అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ఫిబ్రవరి 28న సమ్మేళన సమావేశం

సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

జయపురం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1 వరకు రెండు రోజుల పాటు జయపురంలో రాష్ట్రస్థాయి ఉత్కళ సమ్మేళన సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మంత్రులు, సీనియర్ అధికారులు హాజరు కావాలని జిల్లా సమ్మేళన సంఘ అధ్యక్షుడు మదన్‌మోహన్ నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం ఓ హోటల్‌లో సమావేశం జరిగింది.

## ఓపెన్ వాటర్ ఈతలో బాలలకు శిక్షణ

ఈతలో పాల్గొన్న వివిధ కేటగిరీల బాలలు. చిత్రంలో నిర్వాహకులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: కటక్‌లోని సిల్వర్ సిటీ బోట్ క్లబ్‌లో రాష్ట్ర బాలబాలికలకు ఈతలో శిక్షణ ఇచ్చారు. శనివారం నిర్వహించిన శిబిరంలో ఓపెన్ వాటర్‌లో ఈత కొట్టడం, ఆటతో కూడిన శిక్షణ తదితరాలపై వివిధ కేటగిరీల బాలలకు మెలకువలు నేర్పించారు. భువనేశ్వర్ బజాజ్ స్విమ్మింగ్ హెచ్‌పీసీ కేంద్రం నిర్వాహకులు, శిక్షకులు శిబిరంలో శిక్షణ తరగతులు జరిపి, ఈతలో అనుభవాలను వారికి వివరించారు.

## పొట్టి శ్రీరాములు వర్ధంతికి ఏర్పాట్లు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని దన్నింగ్ మైదాన్ ప్రాంతంలో ఉన్న మహాకవి గురజాడ విద్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తారు. పశ్చిమబెంగాల్ తెలుగు జాతి ఐక్యవేదిక, గురజాడ విద్యాలయం కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని స్థానిక తెలుగువారు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## మా తరాతరిణి శక్తిపీఠం ఈవోగా బినోద్ బెహర

తరాతరిణి శక్తిపీఠంలో దేవతామూర్తుల్ని దర్శించుకుని బయటకు వస్తున్న బినోద్ కుమార్ బెహర, చిత్రంలో ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా వాసుల ఆరాధ్య దైవం, సుప్రసిద్ధ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం మా తరాతరిణి శక్తిపీఠం కొత్త ఈవోగా పురుషోత్తంపూర్ తహసీల్దారు బినోద్‌కుమార్ బెహర శనివారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆయన శక్తిపీఠంలో దేవతామూర్తుల్ని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట అదనపు తహసీల్దారు సంగీతా సేథి, పురుషోత్తంపూర్ రాజా అధికారి సచ్చిన్ కుమార్, తరాతరిణి మందిరం అభివృద్ధి కమిటీ కార్యదర్శి ప్రమోద్ కుమార్ పండా, 'సేవాయత్' సంఘం అధ్యక్షుడు తపన్ రణా, ప్రధాన అర్చకుడు బాబులి బెహర తదితరులున్నారు. నూతన ఈవో బినోద్ బెహర ఆదివారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రస్తుతం శక్తిపీఠానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉందని, వారంతా దేవతా మూర్తుల్ని సజావుగా దర్శించుకునేందుకు ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు.

## అఖిలభారత నాటక పోటీలకు సన్నాహాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: సాంస్కృతిక కళాసేవా సంస్థ ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్ 67వ అఖిలభారత తెలుగు నాటిక పోటీలు డిసెంబరు నెల 20, 21 తేదీలలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు.

## జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు బ్రహ్మపుర క్రీడాకారులు

క్రీడాకారులు రమాసిస్, అమిత్, రజత్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పశ్చిమబెంగాల్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు జరగనున్న 53వ జాతీయ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టు సన్నద్ధమైంది. ఈమేరకు రాష్ట్ర జట్టులో బ్రహ్మపురకి చెందిన రమాసిస్ జెనా, అమిత్ కుమార్ పాత్ర్, రజత్ కుమార్ పాత్ర్ స్థానం పొందినట్లు గంజాం జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సురేష్ కుమార్ పాఢి ఆదివారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. జట్టు ఆదివారం పశ్చిమబెంగాల్‌కు బయలుదేరి వెళ్లింది.

## సిటీ స్కూల్‌లో వార్షిక క్రీడా పోటీలు

సైకిల్ రేస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని సిటీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న వార్షిక క్రీడాపోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎం. బి.సుజాత నేతృత్వంలో పాఠశాల మాజీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు హాజరై పోటీలు ప్రారంభించారు.

## వైద్య శిబిరంలో పూర్వ విద్యార్థులే డాక్టర్లు

వైద్య శిబిరంలో పూర్వ విద్యార్థులు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకొని పలు చోట్ల డాక్టర్లుగా స్థిరపడ్డారు. వారంతా ఈ విద్యాలయానికి వచ్చి ఆత్మీయ కలయిక అనంతరం ఒక మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇలా చదువుకున్న చోటే శిబిరం ఏర్పాటు చేయడంతో స్థానికులు వారిని అభినందించారు.

## భాషా పరిరక్షణలో సాహిత్యానిది కీలక పాత్ర

పుస్తక ఆవిష్కరణలో ద్యుతి, సుశాంత్ దాస్, మహంతి, నాయక్

రాయగడ, న్యూస్‌టుడే: ఒడియా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది. భాషా పరిరక్షణలో సాహిత్యానిది కీలక పాత్రని ప్రముఖ కవి, రచయిత దాస్ బెనుహర్ అన్నారు. ఆదివారం స్థానిక యుజీఎం ఐటీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమావేశ భవనంలో జరిగిన సాహితీ మహోత్సవ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, రాయగడ సాహితీ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డీకే మహంతి, ద్యుతి చంద్ర సాహు, సుశాంత్ నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

ఖరగ్‌పూర్: సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా హాజరైన ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ప్రజల పక్షాన కామ్రేడ్లు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ సర్కార్ దేశాన్ని గుల్ల చేస్తోందని, ప్రజలే ఆయనకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బెంగాల్లో మమతా పాలన అధ్వానంగా ఉందని ఆరోపించారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ మలంచా ప్రజాపతి ఘర్‌లోని శని, ఆదివారాల్లో సదస్సు జరిగింది. పల్లబ్ బెనర్జీ, స్వప్న బెనర్జీ, బాసుదేవ్ దత్త హాజరై ప్రసంగించారు.

ప్రసంగిస్తున్న అమర్‌జీత్ కౌర్

## తీర్థయాత్రకు బయలుదేరిన వయోవృద్ధులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణానికి చెందిన 15 మంది వయోవృద్ధులు ఆదివారం సీనియర్ సిటిజన్స్ తీర్థయాత్ర యోజనలో భాగంగా బయలుదేరారు. వీరంతా రాయగడ వరకు వ్యాన్‌లో వెళ్లి అక్కడ నుంచి రైలులో తమిళనాడులో రామేశ్వరం, మధురై వంటి పుణ్యక్షేత్రాలు దర్శించుకొని తిరిగి ఈనెల 21న పట్టణానికి చేరుకుంటారని పురాధ్యక్షుడు నరేంద్ర మహంతి తెలిపారు. వారందరి ప్రయాణం జయప్రదం కావాలని అదనపు ఈవో పూజారౌత్ అన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పర్లాఖెముండి పట్టణంలోని మహారాజ బాలుర ఉన్నత పాఠశాలలో 1991 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం గుమ్మ సమితి ఐదో మైలు ప్రాంతంలో ఉన్న హోంపారం తోటలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల అనంతరం కలిసిన వారంతా ఒకేచోట సమావేశం కావడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

– న్యూస్‌టుడే, పర్లాఖెముండి

## విజేతలకు బహుమతులు అందజేత

ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు పట్టుకున్న విద్యార్థులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు

జయపురం, న్యూస్‌టుడే: ఇటీవల కొరాపుట్ జిల్లాలో వివిధ కోర్టుల్లో బార్ అసోసియేషన్ తరపున జరిగిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం జయపురం కోర్టు ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి బిష్ణుప్రసాద్ నేతృత్వంలో అతిథులుగా జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రదీప్‌కుమార్ మహంతి, కుటుంబ కోర్టు న్యాయమూర్తి నిశిత్ నిశక్, పి.సుజాత పాల్గొని విజేతలకు ప్రశంసాపత్రాలు, ట్రోఫీలు అందజేశారు.

## రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు, పక్కన పుర అధ్యక్షురాలు నిర్మల, ఎంఎం అలీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని టౌన్‌హాల్ భవనంలో గజపతి రక్తదాతల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన శిబిరంలో 54 యూనిట్ల రక్తం సేకరించినట్లు సభ్యులు తెలిపారు. రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడటానికి యువకులు ముందుకు రావాలని అతిథిగా పాల్గొన్న పురపాలక అధ్యక్షురాలు నిర్మల శెఠి అన్నారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎంఎం అలీ, అధ్యక్షుడు గవర నవీన్‌కుమార్, సభ్యులు క్రాంతి బెహరా, కె.శరత్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పథోత్సవం

వేదికపై నవదుర్గల నాట్యం చేస్తున్న యువత

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఉత్సాహంగా పథోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన పాలనాధికారి మనోజ్ సత్యవాన్, ఎస్పీ రోహిత్ వర్మ, సబ్ కలెక్టర్ సస్యరెడ్డిని పురాధ్యక్షుడు నరేంద్ర మహంతి ఘనంగా స్వాగతించారు. ఉత్సవంలో ముగ్గులు, వంట, చిత్రలేఖన పోటీలతో పాటు పాటలు, నృత్య ప్రదర్శనలు జరిగాయి.

## రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న దాతలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖ తరపున ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. బ్యాంకు శాఖ మేనేజర్ సుబ్రత్ పండా నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో ముఖ్యఅతిథిగా బీడీవో సుకాంత్‌కుమార్ పట్నాయక్ హాజరయ్యారు. డా.రీతిక పాఢి అధ్యక్షతన 23 యూనిట్ల రక్తం సేకరించారు.

## పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువస్తాం

ఐక్యతగా పనిచేస్తామని చెబుతున్న నేతలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పొట్టంగి నియోజకవర్గంలో బిజద పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని జిల్లా అధ్యక్షులు జీను హికాక అన్నారు. నందపూర్ సమితి కాబుల్‌గుడలో ఆదివారం సమితి స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జీను మాట్లాడుతూ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు రఘురామ్ పడాల్, ప్రీతమ్‌పాఢి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలకా, ప్రఫుల్ల కుమార్ పంగి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతి మస్తీ, నేతలు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంత్యుత్సవం

కళాకారునికి సన్మానం చేస్తున్న సభ్యులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజు వీధిలో అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఘంటసాల 103వ జయంత్యుత్సవంలో భాగంగా చైతన్య మెలోడీస్ స్వర గానామృత లహరి సీజన్-2 ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు పాల్గొన్నారు. ముద్దాడ స్వాతి పాటలతో అందరినీ అలరించారు. చైతన్య మెలోడీస్ అధ్యక్షుడు ఐ.వెంకటరావు, ఉపాధ్యక్షుడు కె.చిరంజీవులు పాల్గొన్నారు.

EENADU Classifieds
JOBS
HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.
ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

## 19న ఉచిత వైద్య శిబిరం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రెస్‌క్లబ్ రజతోత్సవ భాగంగా ఈనెల 19న ఉచిత వైద్య శిబిరం సేన్‌మోడ్ ప్రాంతంలోని కార్యాలయంలో నిర్వహిస్తామని సంస్థ ప్రకటించింది. ఉచితంగా ఆరోగ్య, గుండె, నేత్ర, దంత తదితర వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు.

## ఆటో బోల్తా: ఒకరి మృత్యువాత, ఏడుగురికి గాయాలు

జయపురం, న్యూస్‌టుడే: బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వెళుతుండగా ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా ఏడుగురు గాయపడిన ఘటన కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు సమితి చంద్రపడ పంచాయతీ పాలిగూడ గ్రామానికి చెందిన హరి మాఝి(43) మేనమామ ఆదివారం మృతిచెందాడు. ఆయన అంతిమ కార్యక్రమంలో పాల్గొనేందుకు హరితో పాటు బంధువులు ఆటోలో జయపురం సమితి బర్నిపుట్ వచ్చి తిరిగి వెళుతుండగా దిగాపూర్ పంచాయతీ బురిడిపూర్ చౌక్ వద్ద ఆటో బోల్తాపడింది. చోదకుడితో సహా 8 మంది గాయపడగా, స్థానికులు వారిని జయపురంలో ఉన్న జిల్లా ప్రధానాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే హరి మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జయపురం, న్యూస్‌టుడే: రహదారిపై ధాన్యం ఆరబెడుతుండగా వాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన జయపురం పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో పంపుణి ప్రాంతానికి చెందిన బనమాలి గౌడ్ భార్య ముక్తా పొర్జా(38) రహదారిపై ధాన్యం ఆరబెడుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆమె తీవ్రంగా గాయపడటంతో జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యానికి కొరాపుట్ తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి


దీపేశ్ ప్రధాన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖుర్దా జిల్లా బాణపూర్ ఠాణా పోలీసులు శనివారం రాత్రి దశరథపూర్ గ్రామానికి చెందిన ఛబీంద్ర నాయక్‌కు సారా విక్రయంతో ప్రమేయం ఉందని ఠాణాకు తెచ్చి లాకప్‌లో ఉంచారు. ఆదివారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో పోలీసు వ్యాన్‌లో భువనేశ్వర్‌లోని క్యాపిటల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ప్రారంభమైన కొద్ది నిమిషాల్లో ఛబీంద్ర మృతిచెందాడు. ఆయన భార్య రితా నాయక్ విలేకర్లతో మాట్లాడుతూ లాకప్‌లో పోలీసులు తన భర్తపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, ఇది లాకప్‌డెత్ అని ఆరోపించారు. ఠాణా అధికారి రమేష్‌చంద్ర దేవతా విలేకర్లతో మాట్లాడుతూ ఛబీంద్రకు రక్తపోటు, ఇతర వ్యాధులున్నాయని, ఉదయం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో పోలీసు వ్యాన్‌లో ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించామన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని దశరథ్‌పూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## ఐబీ నదిలో విద్యార్థి గల్లంతు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రవుర్కెలా ఎన్ఐటీ విద్యార్థి నదిలో గల్లంతైన ఘటన సుందర్‌గఢ్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బరగఢ్ జిల్లా డుంగురి ప్రాంతానికి చెందిన దీపేశ్ ప్రధాన్ రవుర్కెలా ఎన్ఐటీలో చదువుతున్నారు. శనివారం స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన దీపేశ్ ఐబీ నదిలో గల్లంతయ్యారు. నది మధ్యలో ఉన్న ఓ బండరాయి వద్దకు చేరుకున్న ప్రధాన్ అదుపు తప్పి నీటిలో జారిపోయారు. సమాచారం అందుకున్న సుబ్దేగ, బలిశంకర్ అగ్నిమాపక సిబ్బంది చేరుకొని గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## మహిళపై వేధింపులు: నిందితుడి అరెస్టు

మనోజ్‌కుమార్ దాస్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఓ మహిళను చరవాణిలో వేధింపులకు గురిచేస్తున్న నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కటక్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బరంగ పోలీసు స్టేషన్ పరిధి బేల్‌గొచ్ఛియా ప్రాంతానికి చెందిన మనోజ్‌కుమార్ దాస్(27) గత కొద్ది రోజులుగా ఓ మహిళను వేధిస్తున్నాడు. ఆమె చరవాణికి నగ్న ఫొటోలు పంపిస్తూ హోటల్‌కు రమ్మని ఒత్తిడి చేస్తున్నాడు. తనతో శారీరక సంబంధం పెట్టుకోవాలని, లేదంటే ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాధితురాలు డిసెంబరు 1న సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత కొద్దిరోజులు మౌనంగా ఉన్న నిందితుడు పలు మొబైల్ నెంబర్లతో మళ్లీ వేధింపులు మొదలుపెట్టాడు. తన కోరిక తీర్చకపోతే భర్తను, పిల్లలను చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదుతో శనివారం నిందితుడిని అరెస్టు చేసి ఆయన నుంచి రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.

## పట్టుబడిన సిమ్‌కార్డుల మోసగాళ్లు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దిల్లీ షహీన్‌బాగ్ పోలీసులు శనివారం ఒడిశాలోని భద్రక్, జాజ్‌పూర్‌లలో దాడులు చేసి సిమ్‌కార్డులు యాక్టివేట్ చేసి విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు. దిల్లీకి చెందిన మొబైల్ ఫోన్ షాపుల యాజమాన్యాల ఫిర్యాదు మేరకు దిల్లీ పోలీసులు వీరిద్దరినీ పట్టుకున్నారు.

## శ్రీక్షేత్ర ప్రసాద్ అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పూరీ పోలీసులు జత్రా (నాటక) పార్టీకి చెందిన నటుడు శ్రీక్షేత్ర ప్రసాద్ దళైని శనివారం అరెస్టు చేశారు. ప్రసాద్ తనను మోసగించినట్లు నాటక పార్టీ నటి సోనాలిపండా ప్రసాద్ పోలీసులకు లిఖిత ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## అక్రమ ఆయుధాల కేసులో ఇద్దరు..

అటవీ అధికారుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న తుపాకులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఆయుధాలను కలిగి ఉన్న నేరంపై సిమిలిపాల్ అటవీ అధికారులు ఇద్దరు వేటగాళ్లను అరెస్టు చేశారు. అటవీ శాఖ వర్గాల సమాచారం మేరకు.. సౌత్ డివిజన్ పరిధిలో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది తుపాకులు కలిగి ఉన్న ఇద్దరిని గుర్తించారు. పట్టుబడిన నిందితుల్లో మయూర్‌భంజ్ జిల్లా ఖుంటా పోలీసు స్టేషన్ పరిధి జూడిదార్ గ్రామానికి చెందిన సుక్రోహా(32), చాలెహా(23) ఉన్నారు. వీరి నుంచి రెండు తుపాకులు స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు.

## పోలీసుల అదుపులో విద్యార్థి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ పోలీసులు శనివారం కుదనాగరి ప్రాంతానికి చెందిన 9వ తరగతి విద్యార్థి నుంచి గన్ స్వాధీనం చేసుకొని ఆయనను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు ధాన్యం కుప్పలు దగ్ధం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లా దేవ్‌గామ్ సమితిలోని డొలియా గ్రామంలో ఆదివారం సాయంత్రం పంట పొలంలో మూడు ధాన్యం కుప్పలు కాలిపోయాయి. నూర్పునకు సిద్ధంగా ఉంచిన కుప్పలు బూడిద కావడంతో రైతులు బావురుమంటున్నారు.

## గంజాయి మొక్కల ధ్వంసం


గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుడారి పోలీసుస్టేషన్ పరిధి ఖైరాగుడ సమీపంలో 2.5 ఎకరాల్లో అక్రమంగా సాగు చేస్తున్న 7,500 గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. ఆదివారం గుణుపురం ఎస్‌డీపీఓ బాబులి నాయక్, గుడారి ఐఐసీ సమర్పిత స్వయిన్, పోలీసులు చేరుకొని మొక్కలకు నిప్పుపెట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

# ఆపదలో అండగా నిలిచారు...

విద్యార్థి తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ భారతి

పలాస, న్యూస్‌టుడే: తోటి విద్యార్థి కుటుంబానికి అండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం నిలిచారు. వజ్రపుకొత్తూరు మండలం హకుంపేటకు చెందిన వంక లిఖిత్‌కుమార్ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో చిన్నబడాం శ్రీకృష్ణసాహితీ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఆయన తండ్రి కృష్ణారావు ఈ నెల 2న నువ్వలరేవు గ్రామ వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారికి ఆర్థిక సాయం చేసేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.40 వేలు నగదు సేకరించారు. ఆదివారం ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులకు పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, డైరెక్టర్ కవిటి రేణుకేశ్వరరావు అందజేశారు.

# వెంకన్న ఉత్సవాలకు వేళాయె

తోటపల్లి వేంకటేశ్వరస్వామి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రాలో చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో బి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 14న గోదాదేవి కల్యాణంతో వేడుకలు ముగుస్తాయన్నారు. ఈ నెల రోజుల పాటు ఉదయం వేంకటేశ్వరస్వామి, గోదాదేవి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పకీరు నాయుడు తదితరులు ఉన్నారు.

# పోరాటాలతోనే గిరిజనుల్లో చైతన్యం

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జల్, జమీన్, జంగిల్ పేరుతో సీపీఐ ఆధ్వర్యంలో జరిపిన పోరాటాల ఫలితంగా గిరిజనుల్లో చైతన్యం వచ్చిందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామి, పుక్కల అరెలమ్మ పేర్కొన్నారు. ఆదివారం కంచిలి మండలం భువనపురం గిరిజన శాఖకు చెందిన సీనియర్ నాయకుడు భువన ప్రధాన్ ఆధ్వర్యంలో గ్రామంలో పార్టీ జెండా ఎగురవేశారు. సీపీఐ పార్టీ ఏర్పడి వంద వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఐ.లోకనాథం, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భళా బాలికలు..!

## కోలాటంలో రాణిస్తున్న ఉర్లాం విద్యార్థినులు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

శిక్షకుడు రామారావుతో శిష్య బృందం

వారంతా మారుమూల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థినులు. ఆసక్తి, పట్టుదలకు తోడు మంచి గురువు ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు ఉర్లాం ఎస్సీ కాలనీ చిన్నారులు. సామాజిక మాధ్యమాల్లో చూసి కోలాటంపై ఆసక్తి పెంచుకున్నారు. ఒక బృందంగా ఏర్పడి ఖాళీ సమయాల్లో ఇంటి వద్దనే సాధన చేస్తూ పలుచోట్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. అదే సమయంలో తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరిగింది. గుడికి అర్చకుడిగా గ్రామానికి చెందిన చల్ల రామారావు ఎంపికయ్యారు. తిరుమలలో ప్రత్యేక శిక్షణ పొందిన ఆయన విద్యార్థినులకు కోలాటంలో తర్ఫీదు ఇవ్వడంతో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. పండగలు, గ్రామ దేవత ఉత్సవాలు, వినాయక, నందెన్న, దేవీ విగ్రహాల నిమజ్జనోత్సవంలో ప్రదర్శనలు ఇస్తూ భళా అనిపించుకుంటున్నారు.

**అదృష్టంగా భావిస్తున్నాం:** మాలో ఆసక్తిని గమనించి కుటుంబ సభ్యులు మాకు మంచి తోడ్పాటు ఇచ్చారు. వారి సహకారంతోనే కోలాటం నేర్చుకొని వివిధ సందర్భాల్లో గ్రామంలో నృత్యాలు ప్రదర్శించి మెప్పు పొందుతున్నాం. మా నాన్నే గురువు కావడం అదృష్టంగా భావిస్తున్నాం.

– రాజ్యలక్ష్మి, బీటెక్, ప్రవర్షిణి, ఇంటర్ విద్యార్థినులు

**ఆసక్తి గమనించాను:** విద్యార్థినుల్లో ఆసక్తి గమనించి మా కాలనీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాను. పలు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రదర్శనలు ఇవ్వాలని మమ్మల్ని ఆహ్వానిస్తున్నారు. సుందరాపురం, చిలకపాలెం, నడగాం, చిక్కాలవలస గ్రామాల వారు సైతం ఆసక్తితో నా వద్ద శిక్షణ పొందుతున్నారు. వీరికి మరింత తర్ఫీదు ఇచ్చి తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన ఇవ్వాలనేదే నా లక్ష్యం.

– చల్ల రామారావు, శిక్షకుడు

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం బొడ్డవలస డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో 1983-85 ఇంటర్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆలవెల్లి శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయుడైన సోమునాయుడు, తదితరులను సన్మానించారు.

# అంతరించిపోకుండా.. అడుగులు వేస్తున్నారు!

● తీర ప్రాంతాల్లో ఆలివ్ రిడ్లేల సంరక్షణ కేంద్రాల నిర్వహణ

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, పాతశ్రీకాకుళం

అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. మెరైన్, కోస్ట్ గార్డు, మత్స్య శాఖలు సహకారం అందిస్తున్నాయి.

● ఆలివ్ రిడ్లేలు శ్రీలంక నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి రాష్ట్ర తీర ప్రాంతాలకు చేరుకుని గుడ్లు పెట్టి సంతానోత్పత్తి పెంచుకొంటాయి. నిషేధిత సమయంలో మత్స్యకారులు వేట వల్ల, తీరంలో కుక్కలు, నక్కలు గుడ్లు పాడు చేయడంతో ఉత్పత్తి తగ్గిపోతోంది. దీంతో ట్రీ ఫౌండేషన్ నివారణ చర్యలు చేపట్టింది. జిల్లాలో తీర ప్రాంతాల్లో 16 సంరక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి జనవరి నుంచి కేంద్రాలు ప్రారంభించి సముద్రం నుంచి ఒడ్డుకు వచ్చిన తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి జాగ్రత్తగా పొదిగించి వాటిని మూడు నెలల తరువాత తిరిగి సముద్రంలో విడిచిపెట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

● జిల్లాలో గత రెండేళ్లలో వేల సంఖ్యలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు చనిపోయినట్లు ఓ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సర్వేలో వెల్లడైంది. ఐక్యరాజ్యసమితి సైతం ఈ జాతి అంతరించి పోయే దశలో ఉందని ప్రకటించింది.

● జిల్లాలో 11 మండలాల పరిధిలో 167 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. జిల్లాలో శ్రీకాకుళం రేంజ్ పరిధిలో రెండు, టెక్కలి రేంజ్ పరిధిలో నాలుగు, కాశీబుగ్గ రేంజ్ పరిధిలో పది తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది. జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో 7,79,660 ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

● అంతరించిపోకుండా ఉండాలంటే ఫిషరీష్ రెగ్యులేటరీ చట్టం ప్రకారం.. సముద్ర ఒడ్డు నుంచి ఎనిమిది నాటికల్ మైళ్ల (12 కిలోమీటర్లు) దాటి ఇంజిన్ బోట్లతో వేట చేయకూడదు. సంప్రదాయ బోట్లు, తెప్పలతోనే వేట చేయాలి.

సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న స్థానిక మత్స్యకారులు

**జిల్లాలో వివరాలు**

| సంవత్సరం | విడిచిపెట్టిన తాబేళ్ల పిల్లలు |
|---|---|
| 2022 | 1,80,308 |
| 2023 | 1,69,373 |
| 2024 | 1,44,981 |
| 2025 | 2,84,998 |
| మొత్తం | 7,79,660 |

జిల్లాలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. వాతావరణం సహకరిస్తే ఈ ఏడాది 3 లక్షలు వరకూ తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.వెంకటేష్, జిల్లా అటవీశాఖాధికారి

# ఎడతెగని కథ..ఎడమ కాలువ వ్యథ..!

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

వంశధార ఎడమ ప్రధాన కాలువ..
ప్రారంభించి 47 ఏళ్లు..
షట్టర్ల కుంభకోణం జరిగి 15 ఏళ్లు..
ఇలా కాలం గడిచిపోతున్నా
ఆధునికీకరణ కల మాత్రం నెరవేరట్లేదు.
ప్రభుత్వాలు మారుతున్నాయి..
అంచనాలు సవరిస్తున్నారే తప్ప
పనులు పట్టాలెక్కడం లేదు..
అన్నదాతల కష్టాలకు తెర పడట్లేదు.

నందిగాం మండలం నరేంద్రపురం వద్ద శిథిలమైన కాలువ షట్టర్లు

వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా మారుతోంది. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో కళ్ల ముందు నీరున్నా రైతులు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికే ఎక్కడికక్కడ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. మరోవైపు షట్టర్ల కుంభకోణం కేసు కొలిక్కిరాక పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోని దుస్థితి

**నేటికీ తేలని కుంభకోణం..**

2006-09 సంవత్సరాల్లో ఎడమ ప్రధాన కాలువపై షట్టర్ల ఏర్పాటుకు పనుల్లో రూ.కోట్ల అవకతవకలు జరిగాయి. పరికరాలు తీసుకోకుండానే లావాదేవీలు చేయడం, దస్త్రాల్లో వివరాలు నమోదు చేయకపోవడం, అగ్రిమెంట్లలో తప్పుడు తేదీలు వేయడం వంటి అనేక ఫిర్యాదులు సీఐడీ, విజిలెన్స్, అనిశా అధికారుల వరకు వెళ్లాయి. దీంతో పనులు నిలిపేశారు. ఆ కుంభకోణం నేటికీ కొలిక్కిరాలేదు.

**ఇదీ పరిస్థితి..**

● 1978లో ప్రారంభించిన తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టలేదు.
● కాలువపై స్ట్రక్చర్లు ధ్వంసమయ్యాయి. షట్టర్లు కొట్టుకుపోయాయి. డిస్ట్రిబ్యూటర్లు, రెగ్యులేటర్లు శిథిలమయ్యాయి. నీటి నిల్వ సామర్థ్యం 1,700 క్యూసెక్కులకు తగ్గిపోయింది.
● చేసేదేమీ లేక రైతులు కర్రచెక్కలు, ఇసుక బస్తాలు, గడ్డివాములు అడ్డు పెట్టుకొని నీరు మళ్లించుకుంటున్నారు.
● 2022-23లో రూ.954 కోట్లతో తాత్కాలికంగా అంచనాలు రూపొందించారు. పనులు చేయకపోవడంతో ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఆధునికీకరణకు రూ.1,600 కోట్లు అవసరమవుతాయని అధికారులు ఇటీవల లెక్కగట్టారు.

**చర్యలు తీసుకుంటాం..** వంశధార ఎడమ ప్రధాన కాలువను దశలవారీగా ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇటీవల జరిగిన నీటి పారుదల సలహామండలి సమావేశంలోనూ దీనిపై చర్చించాం. వీలైనంత త్వరగా పనులు జరిగేలా కృషి చేస్తాం. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి

| వంశధార ఎడమ కాలువ స్వరూపం ఇదీ.. | సామర్థ్యం: | పొడవు: | విస్తరించిన మండలాలు | ఆధారపడిన గ్రామాలు | ఆయకట్టు పరిధి: |
|---|---|---|---|---|---|
| | 2,480 క్యూసెక్కులు | 104.82 కి.మీ. | 12 | 398 | 1,48,230 ఎకరాలు |

# అమృత్ నిధులతో రయ్..రయ్

● జోరుగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంతోపాటు ఒడిశాలోని చికిటి, గోపాల్‌పూర్ నియోజకవర్గ ప్రయాణికుల అవసరాలు తీరేలా రాష్ట్ర సరిహద్దు రైలు నిలయం ఆధునికీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 26న ప్రధానమంత్రి వర్చువల్ విధానంలో రూ.17.98 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కొంతకాలం నెమ్మదిగా జరిగినా, ఇప్పుడు వేగం పుంజుకున్నాయి.

రూపుదిద్దుకుంటున్న ఇచ్ఛాపురం కొత్త రైల్వేస్టేషన్ భవనం

కొత్తగా నిర్మిస్తున్న పాదచార వంతెన

★ ప్రధానంగా రైల్వే స్టేషన్ భవనం, రెండో ప్లాట్‌ఫాం నుంచి నాలుగో ప్లాట్‌ఫాం వరకు పాత వంతెనను పొడిగిస్తూనే మరోవైపు కొత్త పాదచార వారధి పనులు 70 శాతం పూర్తి చేశారు. దీనికి లిఫ్ట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.

**అన్ని సౌకర్యాలు కల్పిస్తాం..**

అమృత్ భారత్ నిధులతో పాటు అదనంగా వెచ్చిస్తూ పనులు చేపడుతున్నాం. నాలుగో ప్లాట్‌ఫాం రూపుదిద్దుతున్న నేపథ్యంలో అటువైపు టికెట్ల విక్రయాలతో పాటు విశ్రాంతిగదులు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని మరోసారి తూర్పుకోస్తా రైల్వే డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కట్టా సూర్యప్రకాశరావు, డీఆర్‌యూసీసీ సభ్యుడు, ఇచ్ఛాపురం

★ రెండు ప్లాట్‌ఫాంలపైనా కొత్త షెడ్లు నిర్మించారు. తాగునీటి వసతి కల్పించారు. ప్రయాణికుల పాత విశ్రాంతి భవనం, పాత టికెట్ల విక్రయ కేంద్రాలను తొలగించి, కొత్త భవనంలో కలుపుతున్నారు.

★ స్టేషన్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు రెండు వైపులా రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఆటోలకు స్థలాన్ని కేటాయించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఎంపీ నిధులతో కుర్చీలు ఏర్పాటు చేశారు.

★ రత్తకన్న, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారు గాంధీనగర్ మీదుగా స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఒడిశా గ్రామాలు కూడా ఇటు ఉన్నాయి. వీరి సౌలభ్యం కోసం పశ్చిమ దిశ ప్రధాన ద్వారం, టికెట్ల విక్రయ కేంద్రం, విశ్రాంతి మందిరం అవసరం.

★ తూర్పు ముఖద్వారం బయట నుంచి పశ్చిమ దిశలోని వెలుపల వరకూ ర్యాంప్ విధాన పాదచార వంతెన నిర్మించాలని సర్వత్రా కోరుతున్నారు. స్టేషన్ తూర్పువైపున జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పశ్చిమాన డిగ్రీకళాశాల, సినిమా థియేటర్, పురపరిధిలోని వార్డులు, 30 గ్రామాలు ఉన్నాయి. వీరికి ఈ పాదచార వంతెన అవసరమని స్థానికులు చెబుతున్నారు.

# రేకులు మార్చండి..

వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు సమీపంలో ఉన్న ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రం షెడ్ మరమ్మతులకు గురైంది. కేంద్రం ఏర్పాటు చేసి దాదాపు పదేళ్లు కావొస్తుండటంతో రేకులు తుప్పు పట్టి పాడవుతున్నాయి. దీంతో వర్షాలకు కారిపోయి, దుమ్ము, ధూళితో లోపల పరిసరాల అపరిశుభ్రంగా మారుతున్నాయి. సత్వరమే రేకులు మార్చాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం జేఈ సతీష్ తెలిపారు.– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

# అధ్వాన మార్గం..

ఇచ్ఛాపురం పురపాలకసంఘం నాలుగో వార్డులోని జీఐసీ కాలనీలో చాలా వరకు రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కాలంలో ఏర్పాటు చేసిన కచ్చా రహదారి మార్గంలోనే నేటికీ రాకపోకలు సాగిస్తుండటంతో అవస్థలు తప్పడం లేదని, కాలువలూ సరిగా లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

# నిర్మించకుండానే శిథిలం..

మందస మండలం బేతాళపురం సచివాలయ భవనం అసంపూర్తిగా ఆగిపోయింది. మూడేళ్లుగా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. దీంతో నిర్మాణం పూర్తికాక ముందే శిథిలమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టిన ప్రాప్తికి బిల్లులవ్వక గుత్తేదారు పనులు ఆపేశారు. కొంతైనా నిధులు అందితే పనులు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారని సర్పంచి ఎం.సింహాద్రి తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

# రాళ్లు వేశారు.. మురుగు ఆపేశారు

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గాంధీనగర్ కూడలి వద్ద కాలువపై పలకలు లేకపోవడంతో వాహనాలు వెళ్లేందుకు కాలువల్లో రాళ్లు పడేశారు. వాహనం వెళ్లిన తర్వాత రాళ్లు తొలగించకపోవడంతో మురుగునీరు వెళ్లలేక అడ్డంగా ఉండిపోతోంది. కాలువల్లో రాళ్లు తొలగించి పలకలు వేసేలా చర్యలు తీసుకుంటామని పుర ఏఈ కిరణ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

# దయచేసి వినండి.. నీళ్లు రావండి..

పూండి రైల్వేస్టేషన్‌లో తాగునీటికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కుళాయిలున్నా నిరుపయోగంగా మారాయి. తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక స్టేషన్ మాస్టర్ కృష్ణారావును వివరణ కోరగా స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తామని తెలిపారు.– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

# నేను పంపు కొడతా.. నువ్వు నీరు తాగు!

నీటిని తాగుతున్న ఆవు

పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఓ ఆవు చాలా సమయం నుంచి దాహార్తితో వేచి చూస్తుంది. ఇది గమనించిన ఓ వ్యక్తి సమీపంలో ఉన్న బోరును కొట్టడంతో కడుపు నిండా నీరు తాగి దాహాన్ని తీర్చుకొని వెనుదిరిగింది. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. –న్యూస్‌టుడే, పాలకొండ

# మన ఊరు పాచిపెంట గ్రూప్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

మనఊరు పాచిపెంట గ్రూప్ సభ్యులు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో మన ఊరు పాచిపెంట గ్రూప్ సభ్యులు ఆదివారం పెద్దగెడ్డ జలాశయ, విశాఖ రాయపూర్ హరిత రహదారి సమీప తోటలో ఆత్మీయ సమ్మేళనంలో ఆనందాలు పంచుకున్నారు. వీరిలో చాలామంది ప్రభుత్వ, ఇతర సంస్థల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, మరికొందరు పలు వృత్తుల్లో విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, హైదరాబాద్ ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినవారు. నాలుగేళ్ల కిందట వీరంతా మన ఊరు పాచిపెంట వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడ్డారు. అప్పటి నుంచి ఏటా డిసెంబరులో కుటుంబసభ్యులందరితో ఏదో ఒక ఆదివారం కలుసుకుంటున్నారు.


**ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్**
(మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ)
CCS Estd. 1997
ఖాతా నెం. 50/6596 పి.నెం 126/1/2185/6319 గ్రౌండ్ ఫ్లోర్
శివమందిర్ జం., ఉమాశంకర్ థియేటర్ దగ్గర, రాయగడ ఫోన్: 06856-352629
Email: citizen.rgd@gmail.com website: www.citizensociety.co.in
**బంగారు నగల వేలము ప్రకటన**
ఈ క్రింది సుదహరించిన ఖాతాదారులు తమ బంగారు ఆభరణములు హామీపై తీసికొనిన అప్పును తిరిగి చెల్లించమని డిమాండ్ నోటీసు రిజిస్టరు వేలం నోటీసులు ద్వారా తెలియపర్చిన దర్శిలా సదరు అప్పును తీర్చనందున సదరు ఆభరణములను సొసైటీ నిబంధనలు ప్రకారం తేది: 21-12-2025 ఆదివారం ఉ॥10.30 గం॥లకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును.
గమనిక: ఏ విధమైన కారణం తెలుపకుండానే వేలం వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు బ్రాంచ్ మేనేజరు గారికి అధికారం కలదు.

| Sl.No | Loan No. | Loan Name | Loan Date | Gross Wt |
|---|---|---|---|---|
| 1 | 401009527387 | RAJIV LOCHAN PANDA | 30-08-2024 | 16.20 Gms |

బ్రాంచ్ మేనేజర్


# గండ్లు.. రైతన్నకు కడగండ్లు

★ మొంథా ప్రభావంతో ధ్వంసమైన సాగునీటి కాలువల గట్లు

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ఈ ఏడాది అక్టోబరులో వచ్చిన మొంథా తుపాను వరదలు సాగునీటి వనరులపై తీవ్ర ప్రభావం చూపాయి. అంచనాకు మించి నష్టం మిగిల్చాయి. రబీ పంటలకు సాగునీరు సరఫరా కానీ పరిస్థితికి తెచ్చాయి. ఎక్కువ శాతం పలాస నియోజకవర్గంలో సాగునీటి వనరులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల కాలువలు, గెడ్డలకు 33 చోట్ల గండ్లు పడ్డాయి. ఎక్కువ శాతం సునాముధి, సంకుజోడు సిస్టంలకు గండ్లు ఏర్పడ్డాయి. దీంతో రైతులు కొన్ని చోట్ల శ్రమదానం చేసి ఇసుక బస్తాలతో వాటిని పూడుస్తున్నారు.

సాబకోట సమీపంలో సునాముధిగెడ్డకు ఏర్పడ్డ గండి

★ మందస మండల పరిధిలోని ప్రధాన సాగునీటి వనరు సునాముధిగెడ్డ, సంకుజోడు సిస్టంకు కోలుకోలేని దెబ్బ తీశాయి. ఈ రెండు సాగునీటి వనరులతో పాటు డబార్సింగి, దామోదర్‌సాగర్, చాకిరేవుగెడ్డలకు 28 చోట్ల భారీ గండ్లు ఏర్పడ్డాయి.

★ పలాస మండలంలోని వరహాలగెడ్డకు రెంటికోట, మరదరాజపురం, చినంచల, పెదంచాల సమీపాల్లో నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. రెంటికోట, చినంచల రైతులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి కొన్ని గండ్లు మట్టి బస్తాలతో పూడ్చారు.

★ వజ్రపుకొత్తూరు మండలంలో రాకాసిగెడ్డకు భారీ గండి పడి శివారు ఆయకట్టుకు సాగునీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది. దీంతో రబీ పంటల సాగు ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండికోట సమీపంలో గెడ్డ నుంచి పొలాల్లోకి నీరు రాకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న రైతులు

★ మందస మండలం సుంకుజోడు సిస్టంలో ఏర్పడిన గండ్లను బాలిగాం రైతులు ఇసుక బస్తాలతో పూడుస్తున్నారు. ఈ గండ్లు పడిన చోట్ల సిమెంటు కాంక్రీటు గోడలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం..**

గండ్లను పూడ్చడంతో పాటు ఆ ప్రదేశాల్లో మళ్లీ ఇబ్బందులు రాకుండా సిమెంటు కాంక్రీటు గోడలు నిర్మించడానికి రూ.4.22 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– జలవనరులశాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు

# లిఫ్టు అడిగి ఎక్కితే.. ప్రాణం పోయింది

విజయలక్ష్మి (పాత చిత్రం)

సీతానగరం, న్యూస్‌టుడే: ఆ ఒంటరి మహిళ చికెన్ తెచ్చుకుందామని ఇంటి నుంచి వెళ్లింది. తెలిసిన వ్యక్తి బండి ఎక్కింది. అదే ఆమె ప్రాణం తీసింది. ప్రమాదవశాత్తూ వాహనం పైనుంచి జారి పడి మృతిచెందింది. ఈ ఘటన పార్వతీపురం మండలం సీతానగరం మండలం అంటిపేట గ్రామ శివారున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రెడ్డివానివలస గ్రామానికి చెందిన ఆర్.విజయలక్ష్మి(55) అంటిపేటలోని మాంసం దుకాణానికి వెళ్లగా ఎక్కువ మంది ఉండటంతో సమీప పనుకుపేట కూడలికి బయలుదేరారు. మధ్యలో రెడ్డివానివలసకు చెందిన ఆర్.వెంకటనాయుడును లిఫ్టు అడిగి.. ద్విచక్ర వాహనం ఎక్కారు. కొద్ది దూరం వెళ్లాక జారి పడడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు ఆమెను బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయనగరం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త ఈశ్వరరావు ఎనిమిదేళ్ల కిందట మృతి చెందాడు. కుమారులు వెంకటరమణ, శ్రీకాంత్‌లు హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. ఆమె గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ ఒంటరిగా ఉంటోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.


సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

ఈనాడు
తమిళనాడు
సోమవారం డిసెంబరు 15, 2025

మంజూర్ అవలాంచ్ ప్రాంతంలో పచ్చికబయలుపై తెల్లగా మెరుస్తున్న మంచు

## మంచు కురిసే వేళలో..

**ఊటీలో ఆహ్లాదకరంగా వాతావరణం**

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** నీలగిరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీలో ఏటా నవంబర్, డిసెంబరు నెలల్లో మంచు కురుస్తుంది. ఈ ఏడాది మామూలుకన్నా భిన్నంగా గత వారం ఊటీ, మంజూర్, కున్నూర్‌లో మంచు తీవ్రత పెరిగింది. ఊటీ బొటానికల్ గార్డెన్‌లో 4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కాందల్, తలైకుందాలో శనివారం జీరో డిగ్రీల సెల్సియస్, మంజూర్ సమీపంలోని అవలాంచీలో 1 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. దీంతో పలు ప్రాంతాలు కశ్మీరులా దర్శనమిచ్చాయి.

## 18న విజయ్ బహిరంగ సభకు అనుమతి

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఈరోడ్ జిల్లాలో 18వ తేదీ టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొనే బహిరంగ సభకు జిల్లా ఎస్పీ సుజాత అనుమతి మంజూరు చేశారు. సభకు అనుమతి కోరుతూ పార్టీ తరఫున వినతి సమర్పించారు. ఈ నేపథ్యంలో సభా స్థలిని ఎస్పీ పరిశీలించారు. హిందూ దేవాదాయశాఖ స్థలాన్ని రూ.50 వేలకు అద్దెకు తీసుకొని ఉపయోగించుకోవచ్చని సూచిస్తూ నిర్వహణకు అనుమతిచ్చారు.

# భాజపా.. మత పిచ్చి తలకెక్కిన ఏనుగు

**డీఎంకే యువజన విభాగ మహానాడులో ఉదయనిధి స్టాలిన్ ఆగ్రహం**

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** భాజపా మత పిచ్చి తలకెక్కిన ఏనుగని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మండిపడ్డారు. తిరువణ్ణామలై సమీపం మలంపాడిలో డీఎంకే యువజన విభాగ మహానాడు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జిల్లా సరిహద్దులోని మేల్‌చెంగంలో మంత్రి ఈవీ వేలు నేతృత్వంలో ఘనస్వాగతం పలికారు. రోడ్‌షో ద్వారా సీఎం స్టాలిన్ ప్రజలకు అభివాదం చేసుకుంటూ వేదిక వద్దకు వచ్చారు. పార్టీ జిల్లా విభాగం తరఫున మంత్రి ఈవీ వేలు బహూకరించిన వెండి సింహాసనంపై ముఖ్యమంత్రి ఆశీనులయ్యారు. 91 శాసనసభ నియోజకవర్గాలకు చెందిన యువజన విభాగ నిర్వాహకులు, జిల్లా కార్యదర్శులు తదితర 1.30 లక్షల మంది పాల్గొన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా తమిళనాడు 16శాతం జీఎస్‌డీపీ వృద్ధిని సాధించిందని చెప్పారు. సిద్ధాంత శత్రువులు ఉదయనిధి వారి ప్రమాదకరమని అంటున్నారని, అంతలా సిద్ధాంతాలపై బలంగా ఆయన ఉన్నారని కొనియాడారు. ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ... యువజన సమీకరించడం సాధారణ విషయం కాదన్నారు. తమిళనాడు ఎప్పుడూ దిల్లీకి ఔట్ ఆఫ్ కంట్రోల్‌లో అన్నారు. భాజపా అంటే మత పిచ్చి తలకెక్కిన ఏనుగుగా పోల్చారు. ఆ ఏనుగు నియంత్రించే అంకుశం మన ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందన్నారు. అది మోదీ, అమిత్‌షాకు తెలిసినందునే పాత, కొత్త బానిసలను ఒక్కటిగా చేరుస్తున్నారని విమర్శించారు. నాటి నుంచి నేటి వరకు తమిళనాడును కాపాడేందుకు ముందు వరుసలో డీఎంకే ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత పోటీ చేసేందుకు ముఖ్యమంత్రి అవకాశాలు కల్పించాలని కోరారు. పాల్గొన్న పార్టీ శ్రేణులకు మటన్ బిర్యానీతో విందు ఏర్పాటు చేశారు.

కార్యకర్తలు బహూకరించిన వెండి సింహాసనంపై కూర్చున్న సీఎం స్టాలిన్

## 17న రాష్ట్రానికి రానున్న రాష్ట్రపతి

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు జిల్లా వేలూరు నగరం సమీపంలోని శ్రీపురం స్వర్ణ దేవాలయాన్ని ఈనెల 17వ తేదీ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించనున్నారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని స్వర్ణ దేవాలయం, పరిసర ప్రాంతాలను 17వ తేదీ రెడ్‌జోన్‌గా ప్రకటించామని, ఆయా ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయడానికి నిషేధమని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## జనవరి 13న ప్రధాని...

**సైదాపేట:** మూడు రోజుల పర్యటనగా వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి రానున్నట్లు సమాచారం. రైతులతో కలిసి పొంగల్ వేడుకలు జరుపుకునేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. 13న రామేశ్వరంలో జరిగే కాశీ తమిళ సంగమం ముగింపు వేడుకలో పాల్గొన్నున్నారు. అలాగే భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తలపెట్టిన 'తమిళగం తలైనిమిర తమిళనిన్ పయనం' పర్యటన ముగింపు వేడుకగా పుదుకోట్టైలో జరిగే కార్యక్రమంలో మోదీ పాల్గొంటారని సమాచారం.

# ఐఏఎస్ అధికారిణి.. పర్యావరణ హితకారిణి!

తనకొచ్చిన యూఎన్ అవార్డును ముఖ్యమంత్రి స్టాలిన్‌కు చూపుతున్న సుప్రియా సాహు

తమిళనాడులో వినూత్న ప్రాజెక్టుల అమలు

ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాల్లో తనదైన ముద్ర

ఐక్యరాజ్య సమితి అత్యున్నత పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ 2025' అవార్డును అందుకున్నారు తమిళనాడు రాష్ట్ర పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు. ఓ అధికారిణిగా తన విధుల్లోనూ ఛాంపియన్‌గా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రాన్ని దేశానికే స్ఫూర్తిగా నిలపడంలో తనవంతుగా కృషి చేస్తున్నారు. ఆమె ప్రస్థానాన్ని చూస్తే ఎన్నో పర్యావరణహిత పనులు కనిపిస్తాయి.

– ఈనాడు–చెన్నై, న్యూస్‌టుడే–ప్యారిస్

తమిళనాడు 2024లో, అంతకుముందు 15ఏళ్లలో ఎప్పుడూలేనంత వేడిని అనుభవించింది. ఇది పెనుప్రమాదంగా మారబోతోందని గుర్తించిన సుప్రియా సాహూ.. దేశంలోనే తొలిసారిగా 'రాష్ట్ర నిర్దిష్ట విపత్తు'ను అధికారికంగా ప్రకటించి చారిత్రాత్మక అడుగు వేశారు. భవిష్యత్తులో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రణాళికల్ని చేపడుతున్నారు. అధికారిణిగా ఇదొక్కటే కాదు, ఇలాంటి ఎన్నో నిర్ణయాలు రాష్ట్రాన్ని ప్రభావితం చేశాయి. పర్యావరణ, వాతావరణ మార్పులు, అటవీశాఖలో అదనపు ప్రధాన కార్యదర్శిగా సుమారు 5ఏళ్లుగా విధుల్లో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా తమిళనాడులో వినూత్న ప్రాజెక్టులు చేపడుతున్నారు.

### ఏనుగులకు అండగా..

ఏనుగుల్ని ఆమె ఎక్కువగా ప్రేమించేవారు. 'ప్రకృతిలో కుటుంబాలు ఎలా ఉండాలో, నాయకత్వ లక్షణాలు ఎలా ఉండాలో అవి నేర్పుతాయి' అని ఎప్పుడూ చెబుతుంటారామె. అవి రైలు ప్రమాదాలకు గురికాకుండా కోయంబత్తూరులోని మదుక్కరై అడవుల్లో రైలు పట్టాలకు పక్కనే 'ఏఐ' కెమెరాల్ని, రైల్వే అండర్ బ్రిడ్జి బాటల్ని వేశారు. ఏనుగుల జాడను ఏఐ అప్రమత్తం చేయడం, సిబ్బంది వాటిని పట్టాలకు దూరంగా పంపడం నిత్యం జరుగుతున్నాయి. ఇలా కొన్నివేల ఏనుగుల్ని కాపాడారు. రాష్ట్రవ్యాప్తంగా కర్బన ఉద్గారాల్ని తగ్గించి హరితాన్ని పెంచేలా తన హయాంలో 10కోట్ల మొక్కల్ని నాటించారు. 65 కొత్త రిజర్వ్ ఫారెస్ట్‌లను ఏర్పాటుచేశారు. చిత్తడినేలల సంఖ్యను 1 నుంచి 20కి పెంచారు. తీర జిల్లాల్లో మడఅడవుల్ని రెట్టింపు చేశారు. అరుదైన జాతివృక్షాల సంరక్షణ కోసం ప్రభుత్వ సాయంతో రూ.6కోట్లతో ప్రత్యేక నిధిని తెచ్చారు. వివిధ పర్యావరణహిత కార్యక్రమాల్లో ఆమె రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మందికి ఉపాధి చూపించినట్లుగా నివేదికలు చెబుతున్నాయి.

### మంచి పనులతో యూఎన్ఈపీ డాక్యుమెంటరీ

2000లో నీలగిరి కలెక్టర్‌గా చేసేటప్పుడు అక్కడి పశువులు, జంతువులు ప్లాస్టిక్‌ను తిని చనిపోతుండటాన్ని గమనించి చలించిపోయారామె. ఆ ఘటనలు తన జీవితంపై ఎంతో ప్రభావితం చూపాయంటారు. ఆ సమయంలో 'ఆపరేషన్ బ్లూ మౌంటైన్' నినాదంతో ఆ జిల్లాలో వాడిపడేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించారు. ఇది తమిళనాడులో విప్లవానికి నాంది పలికింది. అప్పటినుంచి ఆమె వార్తల్లో నిలుస్తూనే వస్తున్నారు. కొంతకాలం క్రితం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రీన్ క్లైమేట్ కంపెనీని స్థాపించారామె. రాష్ట్రంలో తీరముప్పు, వాతావరణ మార్పులు, తీసుకురావాల్సిన పరిష్కారాలపై ఈ విభాగం పనిచేసేలా చేస్తున్నారు. ఇదిప్పుడు అన్ని ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తోంది. గతేడాది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్ఈపీ)తో కలిసి పాఠశాలల పైకప్పుల్ని చల్లబరిచే 'గ్రీన్ స్కూల్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అత్యాధునిక కూల్‌పెయింట్ వేసి 5-8డిగ్రీల వేడిని తగ్గించి చూపించారు. దీన్నిప్పుడు 300 పాఠశాలల్లో అమలుచేసేలా చర్యలు చేపడుతున్నారు. ప్రయోగాత్మకంగా చెన్నైలోని పలు ప్రజల ఇళ్లకూ దీన్ని అమలుపరుస్తున్నారు. ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. యూఎన్ఈపీ దీనిపై డాక్యుమెంటరీ చేసింది.

### ఆ ఘటన కదిలించింది

సుప్రియా సాహూ మాట్లాడుతూ... "2004 సునామీ సంభవించినప్పుడు శిథిలాల నుంచి బాలిక మృతదేహాన్ని వెలికితీయడం చూశాను. ఆ ఘటన ఇప్పటికీ నా కళ్లలో మెదులుతోంది. ఈ ముప్పు ఎందుకొచ్చింది, ఎవరి చేసిన తప్పునకు వచ్చిందనే ఆలోచనలు చాలాకాలం మెదిలాయి. ఆ తర్వాత నాకు పర్యావరణ, వాతావరణమార్పులు, అటవీశాఖ బాధ్యతలు రావడంతో నా కళ్లారా చూసిన పర్యావరణ ప్రభావాలకు పరిష్కారం చూపే దిశగా పనిచేయడం మొదలుపెట్టాను. ఏటా వేడిగాలులు పెరుగుతున్నాయి. భవిష్యత్తు ముప్పు కళ్లముందు కనిపిస్తోంది. పరిష్కార మార్గంలో ప్రజల్లోని వివిధ వర్గాలతో కలిసి పనిచేస్తున్నాం. ఇళ్ల ప్రాంగణాల్లో నర్సరీల్ని పెంచడం, ఇంటిని చల్లబరిచే కార్యక్రమాల్ని తేవడం లాంటివీ చేస్తున్నాం" అని పేర్కొన్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన సుప్రియా సాహు సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్. చిన్నతనం నుంచి పర్యావరణంపై ఎంతో ప్రేమను పెంచుకున్నారామె. తండ్రి ప్రభుత్వ అధికారి కావడంతో ఆయన వెంట పలు రాష్ట్రాలు తిరుగుతూ పెరిగారు. వృక్షశాస్త్రంలో పీజీ చేశారు. ఐఏఎస్ అయ్యాక దూరదర్శన్ జనరల్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలకుగానూ ఆమెను 'కౌన్ బనేగా కరోడ్‌పతి' కార్యక్రమానికి ఆహ్వానించారు. సామాజిక మాధ్యమాల్లో సమాజాన్ని ప్రభావితం చేసే పర్యావరణ అంశాల్ని పంచుకుంటూ ఉంటారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా అశోక్‌నగర్‌లోని ఆంజనేయర్ భక్తసభ ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ ఆర్.ఎన్.రవి స్వామివారిని దర్శించుకున్నారు - న్యూస్‌టుడే, చెన్నై

## ఆలయానికి చేరుకున్న మహాదీప పాత్ర

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో జరిగిన కార్తిక దీపోత్సవాల్లో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి గిరిపై వెలిగించిన మహాదీప దర్శనం శనివారంతో ముగిసింది. దీంతో దీపం వెలిగించిన లోహపాత్రను ఆదివారం ఆలయానికి చేర్చారు. అక్కడ పాత్రకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత్రకు అంటిన కాటుకను సిబ్బంది సేకరించారు. దీనిని ఆలయంలో జరగనున్న నటరాజస్వామి ఉత్సవంలో మహాదీపం వెలిగించడానికి నేతిని కానుకగా ఇచ్చిన భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు.

కొండ పైనుంచి లోహపాత్రను కిందకు తీసుకొస్తున్న సిబ్బంది

# పుదుచ్చేరిలో కొత్త పార్టీ ఆవిర్భావం

**స్థాపించిన జోస్ చార్లెస్**

ప్రసంగిస్తున్న జోస్ చార్లెస్ ◗ పార్టీ జెండా చూపుతున్న జోస్ చార్లెస్, వివిధ మతాల పెద్దలు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి రాష్ట్రంలో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధినేత, వ్యాపారవేత్త అయిన మార్టిన్ కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ 'లక్ష్య జన నాయగ కట్చి(ఎల్‌జీకే)' పేరుతో కొత్త రాజకీయ పార్టీని ఆదివారం ప్రారంభించారు. 2026లో పుదుచ్చేరిలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. గతేడాది నుంచే పుదుచ్చేరిలో జేసీఎం మక్కల్ మండ్రం పేరిట జోస్ చార్లెస్ మార్టిన్ కామరాజర్‌నగర్, ముదలియార్‌పేట్టై తదితర ఐదు నియోజకవర్గాలలో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రానున్న ఎన్నికల బరిలో దిగేందుకు కొత్త పార్టీని పెట్టారు. ఆదివారం పుదుచ్చేరి హార్బర్‌కు చేరుకుని ఓడలో సముద్రంలోకి వెళ్లి పార్టీ జెండాను సముద్రం మధ్యలో ఎగురవేశారు. అనంతరం పుదుచ్చేరి మెరీనా సముద్ర తీరాన జరిగిన కార్యక్రమంలో పార్టీ నిర్వాహకులు, సిద్ధాంతాలను జోస్ చార్లెస్ వివరించారు. డబ్బు సంపాదనకు తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సిండికేట్‌లా పనిచేస్తున్నాయని చెప్పారు. పుదుచ్చేరిలో మహిళలకు భద్రత లేని పరిస్థితి నెలకొందన్నారు. రంగసామి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలను నడిరోడ్డులో నిలబెట్టిందన్నారు. ప్రజల జీవనాధారం పెరగాలన్నారు. సాధారణ కుటుంబానికి చెందిన తాము దేవుని అనుగ్రహంతో నేడు మంచి స్థితిలో ఉన్నామన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన రావాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి పుదుచ్చేరిని సింగపూర్‌గా మారుస్తానని తెలిపారు.

# కడలూర్ మహానాడులో కూటమిపై ప్రకటన

కురుంకాళీశ్వర ఆలయంలో విజయ ప్రభాకరన్, ప్రేమలత

**చెన్నై, న్యూస్‌టుడే:** ఎన్నికల కూటమి ఏర్పాటుపై వచ్చే ఏడాది జనవరి 9న కడలూర్‌లో జరగనున్న మహానాడులో ప్రకటించనున్నట్లు డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత తెలిపారు. డీఎండీకే యువజన విభాగం కార్యదర్శి విజయ ప్రభాకరన్ పుట్టినరోజు సందర్భంగా కోయంబేడులోని కురుంకాళీశ్వర ఆలయంలో తన తల్లి ప్రేమలతతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత పార్టీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఉన్న పార్టీ వ్యవస్థాపకుడు, తన తండ్రి దివంగత విజయకాంత్ సమాధి వద్ద నివాళులర్పించారు. ప్రజలకు భోజనం అందించారు. పార్టీ కార్యాలయంలో నిర్వాహకుల మధ్య కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. తర్వాత విలేకర్లతో ప్రేమలత మాట్లాడుతూ... తగిన సమయంలో ఆశావహులకు దరఖాస్తుల అందజేత గురించి ప్రకటిస్తామన్నారు. కెప్టెన్ గురుపూజ పనులు జరుగుతున్నాయని, 'ఉళ్లం తేడి-ఇల్లం నాడి' ప్రచార పర్యటన మూడో విడత విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఎన్నికలకు డీఎండీకే సిద్ధంగా ఉందన్నారు. విజయ్‌కాంత్ ఉన్నప్పుడు రాష్ట్రం, కేంద్రంలోని పార్టీలు డీఎండీకేకు మిత్రపక్షాలుగా ఉన్నాయని, ఎన్నికల కూటమి గురించి తగిన సమయంలో శుభవార్త అందిస్తామని తెలిపారు. కడలూర్ జనవరి 9న జరగనున్న మహానాడులో కూటమి గురించి మంచి నిర్ణయం వెలువడుతుందని, ఎవరితో కూటమి, ఎన్ని సీట్లు, ఏయే నియోజకవర్గాలు వంటి వివరాలను అప్పుడు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎవరితోనూ అధికారికంగా కూటమి చర్చలు జరగలేదన్నారు.

## అభ్యర్థులను టీవీకే అధ్యక్షుడు ప్రకటిస్తారు

**చెన్నై, న్యూస్‌టుడే:** రానున్న శాసనసభ ఎన్నికల్లో తిరుచెంగోడు నియోజకవర్గం నుంచి టీవీకే ప్రచార ప్రధానకార్యదర్శి అరుణ్‌రాజ్ బరిలోకి దిగనున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దానిపై టీవీకే అధిష్ఠానం స్పష్టత ఇచ్చింది. పార్టీ ఐటీ వింగ్ విడుదల చేసిన ప్రకటనలో... గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు విజయ్ మాత్రమే ప్రకటిస్తారని తెలిపింది. టీవీకే అభ్యర్థుల ప్రకటన గురించి జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ప్రస్తుతం జరిగేది నియోజకవర్గాలు, బూత్ స్థాయి బాధ్యుల సమాలోచనలు మాత్రమేనని పేర్కొంది. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన తర్వాత పార్టీ అధ్యక్షుడు ప్రకటిస్తారని వెల్లడించింది. తగిన సమయంలో తగిన అభ్యర్థులను ఆయన రంగంలోకి దించుతారని తెలిపింది. అప్పటివరకు రంగాన్ని సిద్ధం చేద్దామని, ప్రజాసేవలో దృష్టి సారిద్దామని పిలుపునిచ్చింది.

### తిరువళ్లూరు జిల్లా కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

**చెన్నై:** అక్రమాలకు పాల్పడుతున్న టీవీకే తిరువళ్లూర్ మధ్య జిల్లా కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద పలువురు కార్యకర్తలు ఆందోళనకు పాల్పడ్డారు. పనైయూర్‌లోని టీవీకే ప్రధానకార్యాలయం వద్ద ఆ పార్టీ తిరువళ్లూర్ జిల్లా కార్యకర్తలు ఆదివారం ఆందోళన నిర్వహించారు. పార్టీ తిరువళ్లూర్ మధ్య జిల్లా కార్యదర్శి మణికంఠన్ పార్టీ పదవులు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకొని మోసానికి పాల్పడుతున్నారని, ఆదవ్ అర్జున చిత్రపటాన్ని బ్యానరులో ఉపయోగించిన తాలూకా కార్యదర్శి ప్రదీప్‌ను తొలగించారని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బంకమట్టితో కళారూపాలు

☛ తయారు చేస్తున్న ట్రాన్స్‌జెండర్ ☛ చక్కటి ఆదాయం అందుకుంటున్న ప్రగతి

ప్రగతి

బంకమట్టితో తయారుచేసిన కళాఖండం

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** బంకమట్టితో కళాఖండాలు తయారుచేస్తూ తమిళనాడుకు చెందిన ఓ ట్రాన్స్‌జెండర్ చక్కటి ఆదాయం అందుకుంటున్నారు. ఇతరులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. చెంగల్పట్టు జిల్లా మఱైమలైనగర్ సమీప సిద్ధమనూర్‌కు చెందిన ప్రగతి(34) ట్రాన్స్‌జెండర్. చిన్నప్పటి నుంచి మట్టిబొమ్మల తయారీ, చిత్రలేఖనంపై ఆసక్తి. తల్లిదండ్రుల సహకారంతో మట్టిపాత్రలు, ఇతర కళాఖండాల తయారీలో ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాలలో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. సంక్రాంతి సమయంలో మట్టి పొయ్యిలు, కుండలు, వినాయక చవితికి గణేశ ప్రతిమలు, కార్తిక దీపోత్సవానికి రకరకాల ప్రమిదలు సంప్రదాయరీతిలో తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. వినియోగదారుల అభిరుచికి తగ్గట్లు ఇంటి గోడలను అలంకరించేలా కుడ్యచిత్రాలు కూడా తయారు చేసిస్తున్నారు. మఱమలైనగర్, వండలూర్, ఊరపాక్కం, గూడువాంజేరి, సింగపెరుమాళ్ కోవిల్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు నేరుగా వచ్చి కావాల్సిన కళాఖండాలను ఆర్డర్లు ఇచ్చి తీసుకెళుతుంటారు. పరిమాణం, ఆకృతిని అనుసరించి ధరలు ఉంటాయి. నెలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం అందుకుంటున్నారు. 'వెట్రి పాదై' పేరిట ట్రాన్స్‌జెండర్ల స్వయం ఉపాధి బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. అందులో సభ్యులుగా ఉన్న ఐదుగురికి కళాఖండాల తయారీ నేర్పించి ఉపాధి కల్పిస్తున్నారు. ది ఏరో ఫైనార్ట్స్ అండ్ క్రాఫ్ట్ అకాడమీ మొదలుపెట్టారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి హస్తకళల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే వేసవి శిబిరాల్లో పాఠశాల విద్యార్థులకు బొమ్మలు గీయడం, రంగులు వేయడం, మట్టి బొమ్మల తయారీ నేర్పుతున్నారు.

# నగదు మోసానికి పాల్పడుతున్న అన్బుమణి

**ఈసీకి రామదాస్ ఫిర్యాదు**

**సైదాపేట, న్యూస్‌టుడే:** దరఖాస్తుల పేరుతో అన్బుమణి నగదు మోసానికి పాల్పడుతున్నట్లు పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ఎన్నికల కమిషన్, తమిళనాడు డీజీపీకి ఫిర్యాదు చేశారు. రామదాస్ ఇచ్చిన ఫిర్యాదులో... పీఎంకే తరఫున పోటీ చేసేవారి నుంచి దరఖాస్తుల పేరుతో అన్బుమణి నగదు వసూలు చేస్తున్నారని, పీఎంకే తరఫున దరఖాస్తులు పొందేందుకు పీఎంకే వ్యవస్థాపకుడిని అయిన తనకే అధికారం ఉందని తెలిపారు. పీఎంకే పేరును ఉపయోగించేందుకు అన్బుమణికి ఎలాంటి అధికారం లేదన్నారు. 14వ తేదీ నుంచి పీఎంకే తరఫున పోటీ చేసేందుకు బీ-ఫారాలు పొందాలని అన్బుమణి ప్రకటించిన నేపథ్యంలో రామదాస్ ఈ ఫిర్యాదు చేయటం గమనార్హం.

# టైలర్ కుమార్తె.. ఫ్లయింగ్ ఆఫీసర్

**అడ్డంకులను అధిగమించి ఘనత**

**వడపళని, న్యూస్‌టుడే:** కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు, అన్ని రకాల అడ్డంకులను అధిగమించి పట్టుదలతో భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు తిరునెల్వేలికి చెందిన ఆర్.పొన్‌షర్మిణి. తిరునెల్వేలిలో జన్మించిన ఈమె చెన్నైలో పెరిగింది. తల్లిదండ్రులు అవిశ్రాంతంగా టైలర్లుగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి కుటుంబంలో జన్మించిన షర్మిణికి చిన్నతనం నుంచే కృషి, సంకల్పంతో ఏదైనా సాధించాలనే ఆలోచన మెదులుతూ ఉండేది. పాఠశాల, కళాశాలల్లో చదివే రోజుల్లోనే ఆమె చురుకైన అథ్లెట్, ఎన్‌సీసీ క్యాడెట్‌గా రాణించేది. ఈ క్రమంలో ఆమె గొప్ప క్రీడాకారిణి కావాలని కలలు కంటుండేది.

### పార్ట్‌టైమ్ ఉద్యోగాలతో చదువు

ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు కనిపిస్తున్నా చదువుపై ధ్యాస పెంచుకోవాలనే ఆలోచనతో దానిపై దృష్టి ఎక్కువగా సారించింది. ఉపకార వేతనాలు సాధించి, కుటుంబంలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ట్యూషన్లు చెప్పడం, టూరిస్ట్ గైడ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా చేశారు.

కుటుంబీకులతో ఆర్.పొన్‌షర్మిణి

### యువతకు స్ఫూర్తిగా..

గ్రాడ్యుయేషన్ తర్వాత ఓ సంస్థలో ఉద్యోగంలో చేరింది. అక్కడ విశ్రాంత సాయుధ దళాల అధికారుల కింద పని చేసేది. వారు రక్షణ రంగంలో ఉద్యోగంలో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలు, ఆ యూనిఫాం గురించి చెపుతుంటే, ఆమెకు చిన్నతనంలో తను అనుకున్న సంఘటనలు గుర్తుకొచ్చేవి. ఆమె కఠోర కృషి ఫలితంగా 2025లో ఆటమ్న్ టర్మ్ పద్ధతిలో దిండిగల్లు, తెలంగాణలోని 'ఎయిర్ ఫోర్స్ అకాడమీ'లో 'వుమెన్ క్యాడెట్ కెప్టెన్' (డబ్ల్యూసీసీ)గా చేరింది. ఈ క్రమంలో శనివారం (డిసెంబరు 13)న 'కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్'లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాన్ని సాధించుకోవడంతో పొన్‌షర్మిణి అనుకున్న కల నెరవేరింది. సాయుధ దళ విభాగంలో చేరి దేశానికి సేవలందించాలనుకునే యువతకు, కుటుంబ సమస్యలు, ఇతర నేపథ్యాలతో సంబంధం లేకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించిన, ఫ్లయింగ్ ఆఫీసర్ పొన్‌షర్మిణి స్ఫూర్తిగా నిలుస్తుంది.

(c) eenadu

## సీనియర్ కళాకారులకు పురస్కారాలు

పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

**వడపళని, న్యూస్‌టుడే:** శ్రీ మన్నార్‌గుడి సాంబశివ భాగవతార్ కల్చరల్ ట్రస్ట్ వార్షిక మార్గళి సంగీతోత్సవాలు శనివారం సీనియర్ సంగీత కళాకారులకు పురస్కారాల ప్రదానంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి మైలాపూరులోని శ్రీ త్యాగరాజ సంగీత విద్వత్ సమాజం వేదికగా నిలిచింది. వైద్య రంగంలో ఐదు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్న ఎస్.వెంకటేశన్ 'జీవిత సాఫల్య పురస్కారం', కర్ణాటక సంగీత విద్వాంసులు ఆర్.రాజారామ్, కోల్‌కతా మీన్ శంకర్, 'గాన కళా శిరోమణి', వడపళని జె.రామకృష్ణ భాగవతార్ 'నామసంకీర్తన శిరోమణి' పురస్కారాలందుకున్నారు. 'అలిండియా విష్ణు సహస్రనామ కల్చరల్ ఫౌండేషన్ ఛైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టీఎస్ శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలందజేశారు. మన్నార్‌గుడి సాంబశివ భాగవతార్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, 3,000 కంటే ఎక్కువ స్వరకల్పనలు చేశారని శ్రీధర్ అభివర్ణించారు. ఐటీఎమ్ మూర్తి చెందిన 'శ్రీ త్యాగరాజ సంగీత విద్వత్ సమాజం' ఉపాధ్యక్షుడు ఎస్.రాజారామన్‌కు సంగీత విద్వాంసుడు టీవీ గోపాలకృష్ణన్ నివాళి అర్పించారు. సమాజం ఉపాధ్యక్షుడు ఎ.రాజీ, శ్రీ మన్నార్‌గుడి సాంబశివ భాగవతార్ కల్చరల్ ట్రస్ట్ ట్రస్టీ ఎస్.మాధవన్ తదితరులు ప్రసంగించారు.

## రేపు పరమాచార్య వార్షిక ఆరాధన

**కాంచీపురం, న్యూస్‌టుడే:** ముక్తి పొందిన కంచి కామకోటి పీఠం 68వ అధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి వార్షిక ఆరాధనోత్సవాన్ని 16వ తేదీ కంచి కామకోటి పీఠంలోని పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి బృందావనంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేదపారాయణం, విద్వత్ సదస్సు, ఉపన్యాసం, నామసంకీర్తనం మొదలైన క్రతువులను ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు రుద్ర పారాయణం, బృందావనంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి అభిషేకాలు, ఆరాధనలు జరుపుతారు. బాల శంకరాచార్య శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి పూజలు చేస్తారు. ఏర్పాట్లను శంకర మఠం శ్రీకార్యం విశ్వనాథ శాస్త్రి, మేనేజర్ సుందరేశ అయ్యర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## ఆధార్ సేవా కేంద్రాల సంఖ్య పెంచాలి

**చెన్నై, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని ఆధార్ సేవా కేంద్రాల సంఖ్యను పెంచాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను దక్షిణ చెన్నై డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ కోరారు. ఈ మేరకు దిల్లీలో మంత్రికి ఆమె అందించిన లేఖలో... ఆధార్ పునరుద్ధరణ, సవరణల కోసం ప్రజలను పలుమార్లు తిప్పిస్తున్నారని, దరఖాస్తులను ఆకారణంగా తిరస్కరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల సరిపడా ఆధార్ సేవా కేంద్రాలు లేవని, వాటి సంఖ్యను పెంచాలని కోరారు. నగర ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ సంఖ్యలో నివసించే ప్రాంతాల్లోనూ అదనంగా ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనవసరమైన తిరస్కరణలను తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు. బోగస్ కేటాయింపులను విశ్వసనీయతతో అమలు చేయడాన్ని ప్రోత్సహించాలని, కేంద్రాల్లో పనిచేసే అధికారులకు తగిన శిక్షణ, సూచనలను అందించాలని కోరారు.

## సైబర్ నేరాల బారినపడకుండా అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టరు ఉషారాణి

**ప్యారిస్, న్యూస్‌టుడే:** సైబర్ నేరాల బారినపడకుండా పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నై విరుగంబాక్కం, అరుణాచలం రోడ్డులో ఉన్న అపార్ట్‌మెంట్‌లలో నివాసం ఉంటున్నవారికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సైబర్ క్రైం విభాగ ఇన్‌స్పెక్టరు ఉషారాణి పాల్గొని డిజిటల్ అరెస్టు, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఆన్‌లైన్ పెట్టుబడుల గురించి అవగాహన కల్పించారు.

# సీఎంఆర్ఎల్ వశం కానున్న ఎమ్మార్టీఎస్ మార్గం

**- న్యూస్‌టుడే, వడపళని**

చెన్నై నగరంలో ఎళ్ల తరబడి ఉన్న 'మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎమ్మార్టీఎస్) మార్గాన్ని చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్(సీఎంఆర్ఎల్) తన ఆధీనంలోకి తీసుకునేందుకు వచ్చే జనవరిలో ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, దక్షిణ రైల్వేల మధ్య డిసెంబరులోనే ఒప్పందాలపై సంతకాల కార్యక్రమం జరుగుతుందని భావించారు. అయితే రైల్వే అధికారులతో చర్చలు జరిగి, ఆ తర్వాత నిర్దిష్ట అభిప్రాయానికి రావడానికి, చేపట్టనున్న ప్రక్రియను అధికారికంగా ప్రకటించేందుకు కొంత సమయం పట్టవచ్చని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్టీఎస్ మార్గాన్ని చెన్నై మెట్రో రైలు స్థాయికి పెంచాలని యోచనలో ఉంది. ఈ ప్రాజెక్టుకు రూ.4,200 కోట్ల మేరకు వ్యయ అవసరం ఉండొచ్చు. ఎమ్మార్టీఎస్ నెట్‌వర్క్‌లోని అన్ని వ్యవస్థలను మార్చాల్సిన అవసరం, తదితర పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే మొత్తం ఖర్చు ఎంత కాగలదో నిర్ణయించి చెప్పగలమని అధికారి ఒకరన్నారు.

### జనవరిలో ఒప్పందాలకు అవకాశం

### ప్రపంచ బ్యాంకుతో చర్చలు

ప్రాజెక్టుయ్యే నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చర్చలు జరుపుతోందని సీఎంఆర్ఎల్ అధికారులన్నారు. ఏసీతో కూడిన మూడు బోగీల రైళ్లను 25 కొనుగోలు చేయడానికి టెండరు సిద్ధం చేస్తున్నామని, ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత, టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. చెన్నై బీచ్-వేళచ్చేరి మార్గంలో ఉన్న స్టేషన్ల స్థాయిని పెంచడానికి ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికలో ముందుగా ఆయా స్టేషన్ల స్థాయిని పెంచుతూ, పునరుద్ధరణ పనులు చేయాలని వివరించారు. ఒప్పందాల పనులు ముగిసిన తర్వాత మార్గంలోని స్టేషన్ల మెరుగుదలపై ఇంకా వివరాలతో ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసేందుకు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను సీఎంఆర్ఎల్ నియమించనుంది. దీని ఆధారంగా పనులను టెండరు ఆహ్వానిస్తామని మరో అధికారి చెప్పారు.

### సీయూఎంటీఏ సిఫారసు

ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్న 'చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(సీయూఎంటీఏ)' సమగ్ర మొబిలిటీ ప్లాన్‌లో రైళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు 'తమిళనాడు రైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎన్‌రైల్)' సంస్థను సిఫారసు చేసింది. ఈ సంస్థ సీఎంఆర్ఎల్ ఆధీనంలోకి రానున్న ఎమ్మార్టీఎస్ ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించగలదని సీయూఎంటీఏ పేర్కొంది.

## 15 నుంచి 'ఈడీఐఐ'లో ప్రత్యేక శిక్షణ

**వడపళని, న్యూస్‌టుడే:** వ్యవస్థాపక అభివృద్ధి (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్)పై 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్(ఈడీఐఐ)' ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ అందిస్తోంది. గిండీ సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఈడీఐఐ ఎస్‌పీ రోడ్డులోని కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుంది. బేసిక్స్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, బిజినెస్ ఎథిక్స్, మార్కెటింగ్ అండ్ బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్, మార్కెట్ సర్వే, ప్రాజెక్ట్ రిపోర్ట్ ప్రిపరేషన్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, జీఎస్టీ, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ వంటి వాటిల్లో శిక్షణ అందిస్తారు. 18 ఏళ్లకు పైబడి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు శిక్షణలో పాల్గొనేందుకు అర్హులు. ముందుగా వచ్చే వారికి అవకాశం కల్పిస్తారు. హాస్టలు వసతి కూడా ఉంది. పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలి. వివరాలకు 86881 02600 నంబరుపై సంప్రదించాలి.

## డీఎంకే ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం

విలేకరులతో మాట్లాడుతున్న సభాపతి అప్పావు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమలను డీఎంకే ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని శాసనసభాపతి అప్పావు తెలిపారు. కన్నియాకుమరి జిల్లా కుళచ్చల్ సమీపం ఉడైయార్‌విళైలోని సీఎస్ఐ ఫిజియోథెరపీ ప్రైవేటు కళాశాలలో ఆదివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 30లక్షల ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని చెప్పిన డీఎంకే కేవలం 3 లక్షలు మాత్రమే సృష్టించిందని అన్బుమణి చేసిన ఆరోపణల గురించి విలేకరులు ప్రశ్నించారు. దీనికి అప్పావు స్పందిస్తూ... డీఎంకే ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈల సంఖ్య పెరిగిందన్నారు. వాటికి రాయితీలు, విద్యుత్తు కనెక్షన్లు మొదలైన అన్ని సౌకర్యాలను కల్పించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కామరాజర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలపై మాట్లాడుతూ.. కామరాజర్ గురించి అనుచితంగా ఎవరు మాట్లాడినా అడ్రస్ లేకుండా పోవడంతోపాటు మర్యాద పోగొట్టుకుంటారని చెప్పారు.

## 17న పీఎంకే కార్యనిర్వాహక కమిటీ సమావేశం

**సైదాపేట, న్యూస్‌టుడే:** పీఎంకే కార్యనిర్వాహక కమిటీ సమావేశం ఈనెల 17న జరగనుంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి రామదాస్ మధ్య గొడవలు కొలిక్కిరాలేదు. అదే సమయం పీఎంకే తరఫున పోటీ చేయాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చని అన్బుమణి రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 17వ తేదీ రామదాస్ నేతృత్వంలో పీఎంకే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇందులో పార్టీ అభివృద్ధి, అసెంబ్లీ ఎన్నికలు తదితర వ్యవహారాల గురించి చర్చించనున్నారు.

శిక్షణ పొందిన వారితో వర్సిటీ డైరెక్టరు తరనిక్కరసు తదితరులు

## పాండిచ్చేరి వర్సిటీలో ముగిసిన శిక్షణ తరగతులు

**వడపళని, న్యూస్‌టుడే:** పాండిచ్చేరి వర్సిటీలోని 'మాళవీయ మిషన్ టీచర్ ట్రెయినింగ్ సెంటర్(ఎంఎంటీటీసీ)'లో 'షార్ట్ టర్మ్ ప్రోగ్రామ్ ఆన్ డాటా అనలిటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫర్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అంశంపై శిక్షణ కార్యక్రమం 8 నుంచి 13వ తేదీ వరకు విజయవంతంగా జరిగింది. ఈ మేరకు వర్సిటీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. శిక్షణలో వర్సిటీ ఆచార్యులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా ఆచార్యులు పాల్గొన్నారని, పరిశ్రమ రంగాల నుంచి డాటా అనలిటిక్స్, ఏఐలో అనుభవమున్న వారు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారని తెలిపింది. శిక్షణను వర్సిటీ ఆచార్యులు, డైరెక్టర్ కె.తరనిక్కరసు, చెన్నై యాక్సెంచర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉదయకుమార్ రామమూర్తి ప్రారంభించారు. వర్సిటీ రిజిస్ట్రార్, ఆచార్యులు రజనీష్ భుటాని శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

## ఎన్నికల్లో గెలుపునకు ఉత్సాహంగా పని చేయాలి

**సైదాపేట, న్యూస్‌టుడే:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపునకు ఉత్సాహంగా పని చేయాలని నిర్వాహకులు, కార్యకర్తలకు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎన్నికల పనుల్లో భాగంగా 234 నియోజకవర్గాల్లో బూత్ కమిటీ సమావేశాలు, కార్యశాలలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. 15వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ పనులు సక్రమంగా జరిగేందుకు ప్రణాళిక రచించి అమలు చేస్తున్న రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు.నాగరాజన్, బూత్ కమిటీ రాష్ట్ర ఆర్గనైజర్ జయప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నారద గాన సభలో సంగీతోత్సవాలు ప్రారంభం

**వడపళని, న్యూస్‌టుడే:** నారద గాన సభలో మార్గళి సంగీతోత్సవాలు శనివారం 'ఇసై, నాట్య నాటక విళా'తో ఘనంగా ప్రారంభమయ్యాయి. మృదంగ విద్వాంసుడు తిరువారూరు భక్తవత్సలం 'నాదబ్రహ్మం', సీనియర్ కళాకారుడు సీతానారాయణన్ 'గోటువాద్యం నారాయణ అయ్యంగార్', నాదస్వర విద్వాంసుడు ఎస్ఆర్‌జీఎస్ మోహనదాస్ 'తిరునెల్వేలి పి.సుబ్రమణ్య అయ్యర్' పురస్కారాలు స్వీకరించారు. భక్తవత్సలం సృజనాత్మక మృదంగ విద్వాంసుడని ప్రముఖ సంగీతకారుడు, మృదంగ విద్వాంసుడు టీవీ గోపాలకృష్ణన్ అభివర్ణించారు. చెన్నైలో కళాకారులను ప్రేక్షకులకు పరిచయం చేయడంలో ఈ సభ కీలక పాత్రను పోషిస్తోందని నారద గాన సభ అధ్యక్షుడు మోహన్ శ్రీనివాసులు పేర్కొన్నారు.

పురస్కారాలందుకున్న తిరువారూరు భక్తవత్సలం, సీతా నారాయణన్, ఎస్ఆర్‌జీఎస్ మోహన్‌దాస్

## యాదవులకు రిజర్వేషన్ కల్పించే పార్టీతో పొత్తు

### గోకుల మక్కళ్ కట్చీ సమావేశంలో తీర్మానం

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులకు అంతర్గత రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చే పార్టీతో పొత్తు పెట్టుకోవాలని గోకుల మక్కళ్ కట్చి సమావేశంలో తీర్మానించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో గోకుల మక్కళ్ కట్చి, తమిళనాడు యాదవ సంఘాల తరఫున సాంస్కృతిక ఉత్సవం ఆదివారం జరిగింది. యాదవ మహాసభ నిర్వాహకులు త్యాగరాజన్, రామకృష్ణన్, గోకుల మక్కళ్ కట్చి వ్యవస్థాపకుడు ఎంవీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీ శేఖర్ మాట్లాడుతూ.. తమిళనాడులోని యాదవులు రెండు తరాలుగా విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. వెనుకబడిన తరగతుల జాబితాలో యాదవులకు ప్రత్యేక అంతర్గత రిజర్వేషన్ కోసం చాలా కాలంగా పోరాడుతున్నామని తెలిపారు. ఈనెల 22వ తేదీ తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చే పార్టీతో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలా కాకుంటే 100 నియోజకవర్గాలలో ఒంటరిగా పోటీ చేస్తామన్నారు. రాష్ట్ర నిర్వాహకులు దురైబాబు, కలూ యాదవ్, మోహన్, సంపత్ కుమార్, ముత్తు కృష్ణన్, న్యాయవాది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవీ శేఖర్

# 'ఐఐటీఎం'లో 'ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025'

**వడపళని, న్యూస్‌టుడే:** ఐఐటీ మద్రాస్‌లో 59వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025 ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ తిరుపతిలతో కలిసి నిర్వహిస్తున్న వార్షిక జాతీయ స్థాయి క్రీడా పోటీలు 21వ తేదీ వరకు జరగనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సాయి సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ క్రికెట్ ఆటగాడు శ్రీధరన్ శ్రీరామ్, ఇండియా బాస్కెట్ బాల్ టీమ్ కెప్టెన్ ముయిన్ బెక్ హఫీజ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఐఐటీ మద్రాస్ 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్స్' పేరుతో క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ అనలిటిక్స్' కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్ క్రీడలను కెరీర్‌గా కొనసాగించాలనుకునే విద్యార్థులకు ఐఐటీలో జరుగుతున్న పోటీలు ఓ వేదికగా ఉండగలవని సాయి సుదర్శన్ పేర్కొన్నారు. మూడు ఐఐటీల నుంచి ఈ ఏడాది 3,800 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఐఐటీ మద్రాస్ నుంచి 550 మంది బాలురు, 400 మంది బాలికలు పాల్గొంటున్నారు. ఐఐటీ మద్రాస్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పాల్గొంటోంది. ఐఐటీ హైదరాబాద్ అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీ బాల్, ఐఐటీ తిరుపతి చెస్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్నాయి.

ప్రసంగిస్తున్న క్రికెటర్ సాయి సుదర్శన్
● పతాకావిష్కరణలో డైరెక్టరు కామకోటి

## అసత్య ప్రచారం చేస్తున్న మా.సుబ్రమణియన్

**సైదాపేట, న్యూస్‌టుడే:** ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ అసత్య ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి సి.విజయభాస్కర్ విమర్శించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఆస్పత్రులు సహా ప్రజారోగ్యశాఖ కార్యాలయాల్లో ఉద్యోగ ఖాళీలు లేవని మంత్రి మా.సుబ్రమణియన్ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాల ఆస్పత్రులు తదితరాల్లో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది, ఫార్మసిస్టులు లేరని పేద ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. మంత్రి చెప్పింది నిజమైతే నవంబర్ 21న 1100 వైద్యుల ఖాళీలకు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేసిందని ప్రశ్నించారు.

## మంత్రి కేఎన్ నెహ్రూపై కేసు నమోదు చేయాలి

**సైదాపేట, న్యూస్‌టుడే:** మంత్రి కేఎన్ నెహ్రూపై కేసు నమోదు చేయాలని ఎంపీ ఇన్బదురై తమిళనాడు అవినీతి నిరోధకశాఖకు లేఖ రాశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగాలకు లంచం తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రాష్ట్ర డీజీపీకి పంపిన లేఖ ప్రకారం మంత్రి కేఎన్ నెహ్రూపై కేసు నమోదు చేయాలని కోరారు.

## విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణ పనులు ముమ్మరం

**మహాబలిపురం, న్యూస్‌టుడే:** చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి పురపాలక సంఘం, పరిసర ప్రాంతాల్లోని 15కు పైగా గ్రామాల్లో కొత్తగా ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నవారి సంఖ్య పెరుగుతోంది. అంతేకాకుండా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలు, కళాశాలలు, వైద్యశాలలు, పాఠశాలల సంఖ్య కూడా అధికమవుతోంది. దీంతో విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. ఈ కారణంగా అనేక ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గూడువాంజేరి సమీపం పెరుమాట్టునల్లూర్‌లో రూ.34 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. దీని గురించి విద్యుత్తుశాఖ అధికారులు మాట్లాడుతూ.. పెరుమాట్టునల్లూర్‌లో కొత్తగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్ పనులు 6 నెలల్లో పూర్తవుతాయని, తరువాత అందుబాటులోకి రాగానే గూడువాంజేరి, నందివరం, పెరుమాట్టునల్లూర్, మేల్‌కాల్వాయ్, అత్తువాణి, విష్ణుప్రియా నగర్, కుములి తదితర 15కు పైగా ప్రాంతాలకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్తు సరఫరా అవుతుందని తెలిపారు.

## తమిళనాడు నేతలకు ఉత్తరాదిలో గుర్తింపు లేదు

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** తమిళనాడు నేతలకు ఉత్తరాది రాష్ట్రాల్లో గుర్తింపు లేదని ఎంపీ తిరుచ్చి శివ పేర్కొన్నారు. తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపం దేవనూర్‌పుదూర్‌లో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ జన్మదిన వేడుకలు ఆదివారం జరిగాయి. ఇందులో పాల్గొన్న ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ... 100 రోజుల ఉపాధి హామీ పథకానికి ఇవ్వాలిన నిధులను కేంద్రం విడుదల చేయలేదన్నారు. తాము హిందీని వ్యతిరేకించేవాళ్లం కాదన్నారు. ఉత్తరాది రాష్ట్రాల నేతలను తమిళనాడులో గౌరవిస్తున్నామని చెప్పారు. కానీ, తమిళనాడు నేతలకు ఉత్తరాదిలో గుర్తింపు లేదన్నారు. దీని గురించి పార్లమెంట్‌లో మాట్లాడానని చెప్పారు.

## 'ఆర్ఎస్ఎస్ గవర్నర్‌గా మారిన ఆర్ఎన్.రవి'

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్ రవి ఆర్ఎస్ఎస్ గవర్నర్‌గా మారారని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విమర్శించారు. తంజావూర్ జిల్లా తిరువిడైమరుదూర్ పంచాయతీలో నిర్మించిన ఆరు భవనాలను మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ముఖ్యమంత్రి తమిళనాడులో పాలన అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆర్ఎస్ఎస్ గవర్నర్‌గా మారిపోయారని ఆరోపించారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం ఏం చేసినా అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రభుత్వంపై తరచూ నిందలు మోపుతున్నారని మండిపడ్డారు.

## పుదుచ్చేరి సీఎం అభ్యర్థిని నేను కాదు

### ఎంపీ జగద్రక్షగన్

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** రానున్న ఎన్నికల్లో పుదుచ్చేరిలో డీఎంకే పాలన రావడం ఖాయమని, తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని డీఎంకే ఎంపీ జగద్రక్షగన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో డీఎంకే పోలింగ్ బూత్ ఏజెంట్లకు శనివారం సాయంత్రం జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిరోజూ పుదుచ్చేరి పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. డీఎంకేని ఇక్కడ కూడా కాపాడాలని పలు సలహాలు ఇస్తున్నారని తెలిపారు. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో డీఎంకే అధికారంలోకి వస్తుందని, అయితే పాలన డీఎంకే నేతృత్వంలో ఉంటుందా? లేదా? అన్నది తమ నాయకుడే నిర్ణయిస్తారన్నారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదన్నారు. తనను ఇక్కడికి పార్టీ పనుల కోసమే పంపించారన్నారు. తాను ఆ పని మాత్రమే చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి 'ఉడాన్ ఉత్సవ్'

**వడపళని, న్యూస్‌టుడే:** దివ్యాంగులకు వైద్యం, పునరావాస కల్పనకు నిధులు సేకరించే నిమిత్తం నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న 'ముక్తి ఎంఎస్ దాదా ఫౌండేషన్' శనివారం 'ఉడాన్ ఉత్సవ్' పేరిట సంగీత కార్యక్రమాన్ని నిర్వహించింది. ముంబయి మహిళా బృందం ప్రదర్శన ఇచ్చింది. దశాబ్దాలుగా నడుస్తున్న తమ సంస్థ మొదటిసారిగా ప్రజల నుంచి నిధులు సేకరించేందుకు సంగీత ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు సంస్థ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ ట్రస్టీ మీనా దాదా పేర్కొన్నారు. ఈ ఏడాది అందే నిధుల ద్వారా దివ్యాంగులకు ఉద్యోగ శిబిరాలు కూడా నిర్వహించనున్నామని, పేద వర్గాల నుంచి మరింత మందిని దత్తత తీసుకోవాలనుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది అందిన నిధులు 2,000 మందికి పైగా జీవనోపాధి కల్పించేందుకు, 15వేల మందికి కృత్రిమ అవయవాలను ఉచితంగా అందించేందుకు దోహద పడతాయని కార్యక్రమానికి అధ్యక్షత వ్యవహరించిన శివ్‌కుమార్ గోయెంకా సియాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం కార్యక్రమంలో కర్ణాటక బ్యాంక్ ఛైర్మన్ ప్రదీప్ కుమార్ పంజా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సవేరా హోటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ నీనా రెడ్డిని ఫౌండేషన్ సత్కరించింది.

## ఒంటరి మహిళలందరికీ 'మహిళా హక్కు' సాయం

### ముఖ్యమంత్రి హామీ

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఒంటరి మహిళలందరికీ మహిళ హక్కు పథకం కింద సాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ హామీ ఇచ్చారు. ధర్మపురి జిల్లా పాప్పిరెడ్డిప్పట్టిలో ఆదివారం జరిగిన మాజీ మంత్రి పళనియప్పన్ ఇంటి వివాహ వేడుకలో స్టాలిన్ పాల్గొన్నారు. వెంట ముత్తరసన్, తిరుమావళవన్, మంత్రులు సుబ్రమణియన్, సామినాథన్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అదనంగా 17 లక్షల మంది మహిళలకు మగలిర్ ఉరిమై తొగై నగదు అందజేసినట్టు గుర్తు చేశారు. అన్నాడీఎంకే మాజీ మంత్రులు పద్ధతిగా బదులివ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో 7వ సారిగా డీఎంకే మోడల్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అభిప్రాయపడ్డారు.

## డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు

### ఇండియా ఏఐ మిషన్ సంచాలకులు

మహ్మద్ సఫీరుల్లా

**చెన్నై, న్యూస్‌టుడే:** డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు మార్గదర్శకాలు ఉన్నాయని ఇండియా ఏఐ మిషన్ సంచాలకులు మహ్మద్ సఫీరుల్లా తెలిపారు. ఐఐటీఎం ప్రాంగణంలో జరిగిన 2 రోజుల 'ఏఐ' సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా ఆయన 'ఈటీవీ భారత్'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. భారతదేశంలో ఏఐ సాంకేతిక ప్రభావం గురించి శిఖరాగ్ర సదస్సు తొలిసారిగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 15న దిల్లీలో జరగనుందన్నారు. సురక్షిత, విశ్వసనీయమైన ఏఐ, ఏఐ వనరులను ప్రజాస్వామ్యం చేయడం, సైన్స్, మానవ పెట్టుబడి, సామాజిక సాధికారత తదితర 7 అంశాలపై ఈ సదస్సు జరగనుందని తెలిపారు. ఏఐ సాంకేతికతకు మార్గదర్శకాలను నవంబరులో కేంద్ర ఎలక్ట్రానిక్, సాంకేతిక సమాచార మంత్రిత్వశాఖ విడుదల చేసిందన్నారు. డీప్‌ఫేక్ టెక్నాలజీని దుర్వినియోగం చేసి చెప్పని విషయాలను చెప్పినట్లు వీడియోలను ఎడిట్ చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. కృత్రిమ మేధ సాంకేతికతకు ఇండియా ఏఐ మిషన్ అండగా ఉందన్నారు. డీప్‌ఫేక్ టెక్నాలజీ నియంత్రణకు విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏఐ రక్షణ సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. భద్రత వస్తేనే విశ్వసనీయత వస్తుందని, అప్పుడే ఏఐ అత్యధికంగా ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఏఐ గురించి పాఠశాలల్లో అధికంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

## శరవణ స్టోర్స్ గోల్డ్ ప్యాలెస్‌కి చెందిన రూ.107 కోట్ల విలువైన ఆస్తులు జప్తు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** శరవణ స్టోర్స్ గోల్డ్ ప్యాలెస్ సంస్థకి చెందిన రూ.107 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యలు చేపట్టింది. చెన్నై శరవణ స్టోర్స్ గోల్డ్ ప్యాలెస్ సంస్థ 2017లో ఇండియన్ బ్యాంకులో తప్పుడు ఆర్థిక నివేదిక దాఖలు చేసి రెండు విడతలుగా రూ.240 కోట్ల రుణం తీసుకుంది. ఎందుకు రుణం తీసుకున్నారో అందుకు ఆ నగదుని వినియోగించకుండా మరో పనికి ఉపయోగించి మోసానికి పాల్పడినట్లు బ్యాంకు గుర్తించింది. మొదట ఈ కేసుని సీబీసీఐడీ దర్యాప్తు చేయగా తర్వాత సీబీఐకి బదిలీ అయింది. అదేవిధంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కూడా కేసు నమోదు చేసింది. అనంతరం సదరు సంస్థకి చెందిన రూ.235 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ ఫిబ్రవరి 17వ తేదీ ఇండియన్ బ్యాంకుకి అప్పగించింది. మిగిలిన రూ.40 కోట్ల ఆస్తులను బ్యాంకుకి అప్పగించాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో వాటిని కూడా స్వాధీనం చేసుకుని శనివారం అప్పగించింది. ఇప్పటివరకు రూ.275 కోట్ల ఆస్తులను ఇండియన్ బ్యాంకుకి అప్పగించింది. అదేవిధంగా తప్పుడు ఆర్థిక నివేదిక దాఖలు చేసి సరకు నిల్వలను పెంచి చూపుతూ యాక్సిస్ బ్యాంకు వద్ద రూ.118.88 కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై దర్యాప్తు చేసిన ఈడీ.. 2023లో రూ.74.06 కోట్ల ఆస్తులు జప్తు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం రూ.66.93 కోట్లను జప్తు చేసి యాక్సిస్ బ్యాంకుకి అప్పగించింది. గత రెండు రోజుల్లో శరవణ స్టోర్స్ గోల్డ్ ప్యాలెస్ సంస్థ నుంచి రూ.107 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసి బ్యాంకులకు అప్పగించింది.

EENADU Classifieds
JOBS
HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

## మళ్లీ ఆస్పత్రిలో చేరిన నల్లకన్ను

**చెన్నై, న్యూస్‌టుడే:** సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను(100) ఆరోగ్య సమస్యలతో మళ్లీ ఆస్పత్రిలో చేరారు. నల్లకన్ను గత ఆగస్టు 22న అదుపుతప్పి కింద పడి గాయపడటంతో అప్పట్లో ఆయన్ను నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. శ్వాససంబంధిత సమస్య ఏర్పడటంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో అక్టోబరు 10న డిశ్చార్జి చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా ఆయనకు శ్వాస సంబంధిత సమస్య తలెత్తడంతో మళ్లీ ఆయన్ను రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన చేయలేదు.

## పందిరి కూరగాయల సాగుకు ప్రధాని ప్రశంసలు

### సేంద్రియ పద్ధతిలో రాణిస్తున్న 84ఏళ్ల రైతు

రైతు పళనిసామి

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** సేంద్రియ సాగులో మంచి ఫలితాలు కనబరుస్తున్న 84ఏళ్ల రైతు పళనిసామికి ప్రధాని ప్రశంసలు దక్కాయి. కోయంబత్తూర్‌లో జరిగిన దక్షిణ భారత సేంద్రియ వ్యవసాయ సదస్సులో తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపంలోని కేత్తనూర్‌కు చెందిన కేవీ పళనిసామిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించి అవార్డుతో సత్కరించారు. తద్వారా గత 37 ఏళ్లుగా ఆయన చేస్తున్న పందిరి కూరగాయల సాగు మరింత ప్రాచుర్యం పొందింది. కేత్తనూర్‌లో 60 ఎకరాల పొలంలో కూరగాయలు పండిస్తున్న పళనిసామి రాష్ట్రంలో గుర్తింపు పొందారు. తన సాగు పద్ధతుల గురించి పళనిసామి మాట్లాడుతూ.. తన తండ్రి వెంకటసామి సేంద్రియ వ్యవసాయంలో మార్గదర్శకుడని చెప్పారు. డిప్లొమా మెకానికల్ చదివిన తనకి వ్యవసాయంపై ఆసక్తి కలిగిందని తెలిపారు. తన భార్యకి కూడా వ్యవసాయంపై ఆసక్తి ఉన్నందున ఆమెతో కలిసి సేంద్రియ వ్యవసాయం ప్రారంభించినట్టు వివరించారు.

## పి.చిదంబరం ఆరోపణలపై స్పందించిన విమానాశ్రయ అధికారులు

**చెన్నై, న్యూస్‌టుడే:** చెన్నై విమానాశ్రయంలో దుర్వాసన వీస్తోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలపై విమానాశ్రయ అధికారులు స్పందించారు. దిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో శనివారం చెన్నై చేరుకున్న ఎంపీ పి.చిదంబరం 4వ టెర్మినల్ మార్గంగా బయటకు వచ్చారు. అప్పుడు భయంకరమైన దుర్వాసన వచ్చిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆయన ఆరోపించారు. ఓ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇలాంటి పరిస్థితి ఉండొచ్చా? ఇది చెన్నై విమానాశ్రయం మేనేజర్లు, భారత పౌర విమానయాన సంస్థ అధికారులు, విమానాశ్రయ సిబ్బంది దృష్టికి వెళ్లలేదా? దీనిని వారు ఎలా భరిస్తున్నారు? అంటూ ప్రశ్నించారు. దీనిపై చెన్నై విమానాశ్రయం అధికారులు స్పందించి అదే సామాజిక వేదిక ద్వారా పి.చిదంబరానికి సమాధానం ఇచ్చారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగని విధంగా ప్రయాణికుల సంచారం ఎక్కువగా లేని సమయంలో చెత్త కుప్పలను తొలగించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం వేళ చెత్తను వాహనం తీసుకెళ్లిన 10 నిమిషాల తర్వాత మీరు ఆ ప్రాంతానికి వచ్చారని, అందువల్ల మీకు దుర్వాసన వచ్చిందని, విమానాశ్రయాన్ని సిబ్బంది పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారని, దానిని అధికారులు 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నారని వివరణ ఇచ్చారు.

(c) eenadu

## వడం ఫస్ట్‌లుక్ విడుదల

**చెన్నై, న్యూస్‌టుడే:** కేదరన్ దర్శకత్వంలో విమల్, సంగీత జంటగా నటించిన చిత్రం 'వడం'. ఇందులో నట్టి అలియాస్ నట్రాజ్ సుబ్రమణియం ముఖ్యపాత్రలో నటించారు. చిత్రానికి డి.ఇమాన్ సంగీతం అందించారు. చిత్రీకరణ పనులు మదురై, కోయంబత్తూర్, దిండుక్కల్ తదితర ప్రాంతాల్లో జరిగింది. ఈ నేపథ్యంలో ఫస్ట్‌లుక్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. దర్శకనటుడు శశికుమార్ ఫస్ట్‌లుక్‌ను తన సామాజిక మాధ్యమాల పేజీలో విడుదల చేసి 'మట్టి, ప్రజలు, మర్యాద, వీరత్వం గురించి మాట్లాడే చిత్రమిది' అని తెలిపారు.

## డీఎంకే కార్యకర్తలకు కానుకల అందజేత

**ఉత్తుకోట, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా ఉత్తుకోట సమీపంలో అనందేరిలో డీఎంకే కార్యకర్తలకు నూతన సంవత్సర కానుకలు అందజేసే కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. యూనియన్ కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా డీఎంకే జిల్లా కార్యదర్శి రమేష్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాసనసభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించి ఆయా సెగ్మెంట్లలో అధిక ఓట్లు తెచ్చిపెట్టే దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా యువజన విభాగ కార్యదర్శి లోకేష్, యూనియన్ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

## ఓపీఎస్ సమావేశం 23వ తేదీకి వాయిదా

### ముఖ్య ప్రకటన చేసే అవకాశం

**సైదాపేట, న్యూస్‌టుడే:** ఈనెల 15న జరగాల్సిన ఆలోచనా సమావేశం 23వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కమిటీ సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం ప్రకటించారు. అన్నాడీఎంకే నుంచి విడిపోయిన శక్తులను డిసెంబరు 15వ తేదీలోగా ఏకం చేసేందుకు ఎడప్పాడి పళనిస్వామి చర్యలు తీసుకోవాలని, లేకుంటే డిసెంబరు 15న ముఖ్య నిర్ణయం తీసుకోనున్నట్లు పన్నీర్‌సెల్వం గత నెలలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఢిల్లీ వెళ్లి అమిత్‌షా తదితర భాజపా పెద్దలను కూడా కలిశారు. ఈ నేపథ్యంలో 23వ తేదీ జరిగే సమావేశానికి సీనియర్ నేత బన్రూటి రామచంద్రన్ నేతృత్వం వహించనున్నారు. అన్నాడీఎంకేలో చేరేందుకు పలు యత్నాలు చేసినా విఫలమైన ఓపీఎస్ తన రాజకీయ వైఖరిపై స్పష్టతకు రావాల్సిన సమయం వచ్చింది. అదే సమయంలో ఓపీఎస్ మద్దతుదారుడిగా ఉన్న మనోజ్ పాండియన్ డీఎంకేలో చేరారు. అలాగే మాజీ మంత్రి వైద్యలింగం కూడా ఇంకా ఓపీఎస్‌ను నమ్ముకుని ఉంటే లాభం లేదని, వేరే పార్టీలో చేరాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆయన్ను పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ డీఎంకేలోకి రావాలని కోరినట్లు కూడా వార్తలు వచ్చాయి. అలాగే అన్నాడీఎంకే ఏకం కావాలని ఈపీఎస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సెంగోట్టయన్ తనతో కలిసి అన్నాడీఎంకే విలీనానికి పాటుపడతారని పన్నీర్ భావించారు. అయితే సెంగోట్టయన్ టీవీకేలో చేరడం దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్నాడీఎంకేలో చేర్చుకునేందుకు ఈపీఎస్ నిరాకరించడం, భాజపా నుంచి ఎలాంటి సహకారం లభించకపోవడంతో ఓపీఎస్ వేరే పార్టీ పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

సంచార బస్సు ● లోపల ఫొటోలు తిలకిస్తున్న సందర్శకులు

## ఆకట్టుకుంటున్న ఎంటీసీ సంచార బస్సు ప్రదర్శన

**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ తరఫున సంచార బస్సు ప్రదర్శనను టీనగర్ బస్టాండ్‌లో ఆదివారం ప్రారంభించారు. ఇందులో చెన్నై ప్రజా రవాణా చరిత్ర, అభివృద్ధి, సాంకేతిక మార్పులు, భవిష్యత్తు ప్రణాళికలు తెలుసుకునేలా ఫొటోలు, వివరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు, విద్యార్థులు, మహిళలు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సౌకర్యాల గురించి వివరణలు ఇచ్చారు.

## వృద్ధశిర నదిపై వంతెన నిర్మాణానికి సన్నాహాలు

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం తక్కోళం-పేరంబాక్కం రోడ్డులో వృద్ధశిర నది ప్రవహిస్తోంది. నదిపై ఉన్న కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమస్యను తక్కోళం పట్టణ పంచాయతీ అధికారులు జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ చంద్రకళ రూ.13.65 కోట్ల వ్యయ అంచనాతో నదిపై పైవంతెన నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ చంద్రకళ నిర్మాణానికి సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు.

## రాహుల్ గాంధీతో నేడు పీసీసీ నేతల సమావేశం

**చెన్నై, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో తమిళనాడు, పుదుచ్చేరి పీసీసీ నేతలు సోమవారం సమావేశం కానున్నారు. వచ్చే ఏడాది తమిళనాడు, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ రెండు చోట్ల డీఎంకే, కాంగ్రెస్ ఒకే కూటమిలో ఉన్నా వచ్చే శాసనసభ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే కూటమిలో కాంగ్రెస్ చేరనుందనే ప్రచారం జరుగుతోంది. ఇది డీఎంకే, కాంగ్రెస్ మధ్య విభేదాలు కలిగించేలా మారింది. ఇటీవల విజయ్‌తో కాంగ్రెస్ నిర్వాహకుడు ప్రవీణ్ చక్రవర్తి భేటీ కావడం ఈ వ్యవహారానికి ఆజ్యం పోసినట్లయింది. దీంతో ఈ వ్యవహారాలతో పాటు వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరిని నిర్ధారించేందుకు తమిళనాడు, పుదుచ్చేరి నేతలతో సమావేశమయ్యేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం సమయం కేటాయించారు. రాష్ట్రం నుంచి టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, సీనియర్ నేతలు పి.చిదంబరం, తిరునావుక్కరసర్, కేఎస్ అళగిరి, కేవీ తంగబాలు తదితర 21 మంది, పుదుచ్చేరి నుంచి కాంగ్రెస్ నేత వైద్యలింగం, మాజీ కేంద్ర మంత్రి నారాయణసామి తదితర 15 మంది ప్రతినిధులు రాహుల్ గాంధీతో సమావేశం కానున్నట్లు సమాచారం.

### కేరళలో కాంగ్రెస్ గెలుపు తమిళనాడు ఎన్నికలకు ట్రయల్ రన్

సెల్వ పెరుంతగై

**చెన్నై, న్యూస్‌టుడే:** కేరళలో కాంగ్రెస్ కూటమి గెలుపు తమిళనాడు ఎన్నికలకు ట్రయల్ రన్ అని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలిపారు. ఆయన తన ప్రకటనలో.. కేరళలో జరిగిన పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి భారీ గెలుపు సాధించిందన్నారు. 2026లో తమిళనాడులో జరగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ 'ఇండియా' కూటమి భారీ గెలుపు అందుకుని మళ్లీ సుపరిపాలనను అందిస్తుందని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలు ట్రయల్ రన్‌గా ఉన్నాయని తెలిపారు.

ఆవిష్కరించిన పుస్తకాలతో పి.సుశీల తదితరులు ● సంగీత గేయధారణ కార్యక్రమంలో సాయికృష్ణ యాచేంద్ర, శోభారాజా తదితరులు

## ఇప్పటికీ పాటలు పాడాలన్న ఆసక్తి తరగలేదు

పి.సుశీల

**టీనగర్, న్యూస్‌టుడే:** తనకు 90 ఏళ్లు నిండినా పాటలు పాడాలన్న ఆసక్తి మాత్రం తరగలేదని ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీల పేర్కొన్నారు. వ్యాపారవేత్త శోభ రాజా ఆధ్వర్యంలో సంగీత కళాకారుడు డా.వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర రాసిన కవిత్రయ శ్రీకృష్ణ దర్శనం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం చెన్నై టీనగర్‌లోని శారదా విద్యాలయ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఘనంగా జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సుశీల ప్రసంగించారు. తెలుగు సాహిత్యం మధురమైనదని, దానికి సంగీతం తోడైతే అనిర్వచనీయమైన అనుభూతి కలిగిస్తుందని పేర్కొన్నారు. తెలుగు సినీ రంగంలో సినీ సంగీత దర్శకులు అనేకమంది అందించిన సంగీతంలో తాను అనేక పాటలు పాడి మధురమైన అనుభూతిని పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మధురానుభూతులను పంచుకున్నారు. సుశీల ఆవిష్కరించిన తొలి ప్రతిని తెలుగు ప్రముఖులు వీఏకే రంగారావు, రెండో ప్రతిని ఆచార్య ఎల్బీ శంకరరావు అందుకున్నారు. ముందుగా సాయికృష్ణ యాచేంద్ర బృందం సంగీత గేయధార 430వ కార్యక్రమం జరిగింది. అవధానం తరహాలో జరిగిన ఈ కార్యక్రమంలో పృచ్ఛకులుగా ఆచార్య ఎల్బీ శంకరరావు, సంగీత దర్శకులు సాలూరి వాసురావు, డా.కాసల నాగభూషణం, జె.శ్రీనిబాబు, రచయిత చిర్రావూరి మదన మోహన శర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో డా.ఏవీ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కోడిగుడ్డు ధర రూ.6.25

**విల్లివాక్కం:** మునుపెన్నడూ లేనివిధంగా ఫారం కోడిగుడ్డు కొనుగోలు ధర భారీగా పెరిగింది. మూడు రోజుల్లో 15 పైసలు పెరిగి రూ.6.25కు చేరింది. నామక్కల్‌లో నిర్వహించిన ఎన్ఈసీసీ సమావేశంలో ఫారాల యజమానుల అభిప్రాయాలు సేకరించారు. అప్పుడు అన్ని జోన్‌లలో గుడ్డు ధర పెంచుతున్న నేపథ్యంలో ఇక్కడ కూడా పెంచాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ ప్రకారం 15 పైసలు పెంచారు. మాంసపు కోడి ధర రూ.114, గుడ్ల కోడి ధర రూ.100గా నిర్ణయించారు.

## మార్గబంధీశ్వర ఆలయంలో ప్రత్యేక ఉత్సవం

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు సమీపం విరింజిపురం వద్ద ఉన్న మార్గబంధీశ్వర ఆలయంలో కార్తిక మాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు అర్ధరాత్రి 12 గంటలకు ఆలయ కోనేరులో స్నానాలు ఆచరించారు. పిల్లలులేని మహిళలు, పెళ్లికాని యువతులు తడి దుస్తులతో ఆలయ ప్రాంగణంలో నిద్రించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయ ఆవరణలో తడి దుస్తులతో నిద్రిస్తున్న మహిళలు

అలంకరణలో శ్రీ వళ్లీ దేవసేన సమేత స్వామివారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు

## తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వాహనాల్లో, కాలినడకన కొండపైన ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం తరపున ఏర్పాట్లు చేశారు.

## 'నేవీ హాఫ్ మారథాన్' విజయవంతం

**వడపళని, న్యూస్‌టుడే:** చెన్నైలో 'నేవీ హాఫ్ మారథాన్' ఆదివారం విజయవంతంగా జరిగింది. మూడు రకాల కేటగిరీల్లో జరిగిన మారథాన్‌లో 8,000 మంది పాల్గొన్నారు. వార్ మెమోరియల్ వద్ద ప్రారంభమైంది. వీల్ ఛైర్ అథ్లెట్లు, గైడ్‌ల సాయంతో దృష్టిలోపం ఉన్న రన్నర్లు, దివ్యాంగులు, కమ్యూనిటీ గ్రూపులో పాల్గొన్నారు. చెన్నై పోలీసుల సహకారం, నావికాదళ సమన్వయంతో కార్యక్రమం సాగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎన్ఈబీ స్పోర్ట్స్, కావేరి హాస్పిటల్స్, జేఎం బాక్సీ లాజిస్టిక్స్ వంటి ప్రముఖ సంస్థలు కార్యక్రమానికి సహకరించాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

విజేతలకు నగదు బహుమతి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

## రెట్టకన్ వంతెన గుండా రాకపోకలు బంద్

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా అరక్కోణం పట్టణంలోని పళణిపేట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (రెట్టకన్ వంతెన) ఉంది. చెన్నై నుంచి అరక్కోణం వరకు రైల్వేశాఖ నాలుగు లైన్లు నిర్మించింది. ఈ లైన్లను అరక్కోణం సమీపంలోని పులియమంగళం స్టేషన్ యార్డు నుంచి అరక్కోణం రైల్వే స్టేషన్ వరకు అనుసంధానం చేయలేదు. ప్రస్తుతం నాలుగు లైన్ల అనుసంధానం పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు రెట్టకన్ వంతెన మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు రైల్వే, మున్సిపాలిటీ అధికారులు ప్రకటించారు.

## రెండు కార్లు, ఆటో ఢీ: ఇద్దరి మృతి

**తిరువణ్ణామలై, న్యూస్‌టుడే:** చెన్నై మేడవాక్కం ప్రాంతానికి చెందిన అన్సర్(35), ఫాతిమా(41), రాజలక్ష్మి(36), అశోక్(40) కలిసి కారులో తిరువణ్ణామలై వెళ్లి శనివారం సాయంత్రం చెన్నైకి తిరుగు పయనమయ్యారు. అలాగే చెన్నై ముగప్పేర్ ప్రాంతానికి చెందిన సుభాష్(59), ఆయన బంధువులు హంసభాయ్(77), లక్ష్మి(48) కారులో చెన్నై నుంచి చెంగల్పట్టు జిల్లా చిత్తామూరుకు బయలుదేరారు. వందవాసి చేత్తుపట్టు రోడ్డులో వడవణక్కంబాడి జంక్షన్ వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో ఆటోను ఢీకొట్టాయి. ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగాలు నుజ్జునుజ్జయ్యాయి. అన్సర్, హంసభాయ్ అక్కడికక్కడే మృతి చెందారు. రెండు కార్లు, ఆటోలో ఉన్న 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదానికి గురైన కారు

### అనుమానాస్పద స్థితిలో అక్కాచెల్లెళ్లు...

**రెడ్‌హిల్స్:** తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపం ఎడప్పాళ్యం రామ్మూర్తి నగర్‌కు చెందిన రమణి(50), రేఖ(43) అక్కాచెల్లెళ్లు. వీరి ఇంటి తలుపులు శనివారం రాత్రి వరకు తీయకపోవడంతో అనుమానించిన స్థానికులు చోళవరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు పగులగొట్టి లోపలకెళ్లి చూడగా అక్కాచెల్లెళ్లు విగతజీవులుగా పడిఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు కంపెనీ ఉద్యోగి...

**విల్లివాక్కం:** ధర్మపురి జిల్లా పాలక్కోడు సమీపం కొమ్మనాయకన్‌హళ్లి గ్రామానికి చెందిన గోవిందరాజ్(35) ఓ ప్రైవేట్ కంపెనీ పని చేస్తున్నారు. ఈయన శనివారం పాలక్కోడు-ధర్మపురి రోడ్డులో చెల్లియంపట్టి ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ వాహనం ఢీకొంది. ప్రమాదంలో గోవిందరాజ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మదికోన్‌పాలయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుండెపోటుతో ఖైదీ...

**ట్రిప్లికేన్:** కోయంబత్తూరు జిల్లా కారమడై సమీపం పొన్నిపాళ్యంకి చెందిన రంగసామి(64) పోక్సో కేసులో అరెస్టయ్యి 2024 నుంచి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చింది. వెంటనే జైలు సిబ్బంది కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

### రైలు, ప్లాట్‌ఫారం మధ్య చిక్కుకుని ప్రయాణికుడు...

**ట్రిప్లికేన్:** కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి కోయంబత్తూరు మీదుగా చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం తెల్లవారుజామున కోయంబత్తూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఓ వ్యక్తి రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫారం మధ్య చిక్కుకున్నారు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేశారు. ఆయన దిల్లీకి చెందిన మనోజ్‌కుమార్ (53) అని, ఇనుప వస్తువుల వ్యాపారి అని, వ్యాపారం నిమిత్తం తరచూ కోయంబత్తూరు వస్తుంటారని తెలిసింది. కేసు దర్యాప్తులో ఉంది.

### రెండో అంతస్తు పైనుంచి పడి బాలుడు...

**ప్యారిస్:** చెన్నై ఎంజీఆర్ నగర్‌లోని కార్పొరేషన్ పాఠశాల ప్రాంగణంలో కొత్త భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌కి చెందిన సౌమెన్ బెరా (15) అనే బాలుడు శనివారం సాయంత్రం రెండో అంతసు పైనుంచి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ పత్రాలతో బ్యాంకులో రుణం పొందిన ఇద్దరిపై కేసు

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు సమీపం కాట్పాడి గాంధీ నగర్‌కు చెందిన మణికంఠరామ్(40)కు స్థానికంగా వాణిజ్య సముదాయం ఉంది. అదే ప్రాంతానికి చెందిన గౌతమ్(35) అందులో ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని, వేలూరు తోటపాళయానికి చెందిన స్నేహితుడితో కలిసి చేపలు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరూ నకిలీ అద్దె ఒప్పంద పత్రాలను సృష్టించి రెండు ప్రభుత్వరంగ బ్యాంకులలో తలా రూ.10 లక్షల చొప్పున రుణం పొందారు. మోసాన్ని గుర్తించిన మణికంఠరామ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహితకు లైంగిక వేధింపులు

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు జిల్లా వేలూరు నగరం సమీపంలోని కాట్పాడి మాగి మండలం ప్రాంతానికి చెందిన 32ఏళ్ల వివాహిత ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా శనివారం స్నానం చేసి దుస్తులు మార్చుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవరు దశరథన్ అలియాస్ అప్పున్(40) ఆమె ఇంట్లోకి ప్రవేశించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మహిళ కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు వచ్చి ఆమెను కాపాడారు. దశరథన్ వారిపై దాడికి ప్రయత్నించాడు. వారు ప్రతిఘటించడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## డిజిటల్ అరెస్టు పేరుతో ఐఐటీఎం మాజీ శాస్త్రవేత్తను మోసగించిన సైబర్ నేరగాళ్లు

**ప్యారిస్:** ఐఐటీ మద్రాసు విశ్రాంత శాస్త్రవేత్త రామసామి ప్రస్తుతం సెంట్రల్ స్కిన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రత్యేక తరగతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రామసామికి ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు.. తాము సీబీఐ అధికారులమని చెప్పారు. మీ సెల్‌ఫోన్ నంబరు చట్ట వ్యతిరేక పనులకు ఉపయోగించడంతో కేసు నమోదు చేసినట్లు బెదిరించారు. అదే విధంగా డిజిటల్ అరెస్టు చేశామని, ఎవరితో మాట్లాడకూడదని తెలిపారు. దీంతో భయపడిపోయిన రామసామి తన బ్యాంకు ఖాతా వివరాలు మొదలైన వాటిని వారికి చెప్పారు. దీంతో వారు ఆయన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.57 లక్షలు తీసుకుని, మళ్లీ తన బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత వారు ఆయన్ను మోసం చేసినట్లు గ్రహించి పోలీసులకి ఫిర్యాదు చేశారు. సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హైకోర్టు న్యాయవాది ఆత్మహత్య

**వేళచ్చేరి, న్యూస్‌టుడే:** విళుపురం జిల్లా దిండివనం రోషనై వెల్లవారి రోడ్డు ప్రాంతానికి చెందిన సామిచంద్రన్(38) మద్రాస్ హైకోర్టులో న్యాయవాది. ఈయనకు తిరుక్కోవిలూర్‌కు చెందిన కామాక్షి అనే మహిళతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. ఇదిలా ఉండగా కుటుంబ కలహాలతో కామాక్షి రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనోవేదనతో ఉన్న సామిచంద్రన్ శనివారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### కుటుంబ కలహాలతో కూలీ...

**విల్లివాక్కం:** నామక్కల్ జిల్లా అవినాశిపట్టికి చెందిన కూలీ చెంగోట్టువేల్(37), సత్య దంపతులు. వీరి మధ్య మూడు నెలల క్రితం గొడవ జరిగింది. అప్పటి నుంచి చెంగోట్టువేల్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు తిరుచెంగోడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

## బస్సు బోల్తా.. 40 మందికి గాయాలు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** చెన్నై నుంచి కన్నియాకుమరికి శనివారం రాత్రి 40 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు బస్సు బయలుదేరింది. ఆదివారం ఉదయం కన్నియాకుమరి జిల్లా తోవాళై వద్ద వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాయపడినవారిని ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదానికి గురైన బస్సు

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.11.60 లక్షల మోసం

**వేలూరు, న్యూస్‌టుడే:** వేలూరు సమీపం కాట్పాడి బ్రహ్మపురానికి చెందిన జెనీఫర్(37) వీఐటీ వర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గత నెలలో ఆమె వాట్సాప్‌కు ఓ సందేశం వచ్చింది. అందులో.. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఉంది. నమ్మిన జెనీఫర్ గత నెల 21వ తేదీ నుంచి ఈనెల 9వ తేదీ వరకు రూ.11.65 లక్షలను దశలవారీగా పెట్టుబడి పెట్టారు. ఆ డబ్బును తిరిగి పొందేందుకు సంబంధిత వ్యక్తులను సంప్రదించడానికి యత్నించగా కుదర్లేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి వేలూరు ఎస్పీ కార్యాలయంలోని సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వడ్డీ వ్యాపారి అదృశ్యం

**అరక్కోణం:** రాణిపేట జిల్లా ఆర్కాడు పట్టణం వరదరాజన్ వీధికి చెందిన పన్నీర్‌సెల్వం(52) స్థానికంగా నగల కుదువ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈనెల 4వ తేదీ దుకాణం మూసేసి తాళాలు, సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్తున్నానని ఇంట్లోవారికి చెప్పి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. వాహనాన్ని తన దుకాణం ముందు నిలిపిన పన్నీర్‌సెల్వం తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. భార్య పరిమళాదేవి శనివారం ఆర్కాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## మహిళ హత్య కేసులో కుమార్తె, అల్లుడి అరెస్టు

**వేలూరు, న్యూస్‌టుడే:** తిరుపత్తూరు జిల్లా పుత్తూర్నాడు సమీపం నడికుప్పం గ్రామానికి చెందిన సంపశివం భార్య చిన్నకాళి ఈనెల 11వ తేదీ పొలంలో గాయాలతో మృతి చెంది పడి ఉన్న విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తులో.. చిన్నకాళి రెండో కుమార్తె గీత ఈనెల 10వ తేదీ నడుంకుప్పం వద్ద ఉన్న 6 ఎకరాల పొలాన్ని తన పేరిట రాయాలని తల్లిని కోరిందని, అందుకు ఆమె నిరాకరించడంతో వాగ్వాదం జరిగిందని, ఆగ్రహించిన గీత అదేరోజు రాత్రి బహిర్భూమికి తోడురావాలని తల్లిని తీసుకెళ్లింది. అక్కడ భర్త చిదంబరంతో కలిసి బండరాయితో చిన్నకాళి తలపై కొట్టి, గొంతుకోసి హత్య చేసినట్లు తేలింది. దీంతో గీత, చిదంబరాన్ని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు.

### భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్త...

**ట్రిప్లికేన్:** మయిలాడుతురై జిల్లా కుత్తాలం సమీపం కండియూర్‌కి చెందిన ఆదిత్యన్, ప్రేమ దంపతులు. కొన్ని నెలలుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి మళ్లీ జరిగింది. ఆగ్రహంతో ఆదిత్యన్ భార్యపై డీజిల్ పోసి నిప్పంటించాడు. స్థానికులు కాపాడి తిరువారూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ఘటనపై కుత్తాలం పోలీసులు ఆదిత్యన్‌ను అరెస్టు చేశారు.

### సీఎండీఏ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ముగ్గురు...

**ప్యారిస్:** చెన్నై కోట్టూర్‌పురంలోని చెన్నై మహానగర అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఎండీఏ) కార్యాలయం తాళాలు పగులగొట్టి ఆరు ల్యాప్‌టాప్‌లు చోరీ చేసినట్లు కార్యాలయ సూపర్‌వైజర్ పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడిన ఆకాష్, హేమనాథన్, గోకులకృష్ణన్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 5 ల్యాప్‌టాప్‌లు, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురిని శనివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

అరెస్టయిన నిందితులు

### మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణ సామగ్రి చోరీ చేసిన ముగ్గురు...

**ప్యారిస్:** చెన్నై మెరీనా, లైట్‌హౌస్ ప్రాంతాల్లో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం తీసుకొచ్చిన రూ.97 లక్షల విలువైన వస్తువులను లారీ డ్రైవర్లు అజయ్‌మసి, గోవిందబస్వాన్, క్లీనర్ ఆదిత్యలు చోరీ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని శనివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

### ఘర్షణకు పాల్పడిన ఐదుగురు కళాశాల విద్యార్థులు...

**మహాబలిపురం:** చెన్నై-చెంగల్పట్టు మధ్య నిత్యం రైలులో పయనించే పచ్చయప్పన్, నందనం కళాశాలల విద్యార్థుల మధ్య 'పల్లావరం రూట్ తల' విషయంపై గొడవలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా ఈనెల 11వ తేదీ చెన్నై బీచ్ నుంచి తాంబరం వెళుతున్న రైలులో ఇరు కళాశాలల విద్యార్థులు పయనించారు. అప్పుడు 'పీఆర్‌టీ' అంశంపై రెండు కళాశాలల విద్యార్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రైలు క్రోంపేటకు చేరుకోగానే కిందకు దిగి ఘర్షణకు దిగారు. ఘటనలో ఆకాష్(18) అనే విద్యార్థి తీవ్రంగా గాయపడటంతో తాంబరం ప్రభుత్వ హెడ్ క్వార్టర్స్ ఆసుపత్రిలో చేర్చారు. ఘటనపై తాంబరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి నందనం కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులను ఆదివారం అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### చోరీ కేసులో అక్కాచెల్లెళ్లు...

**వేలూరు:** దిండిగల్ జిల్లాకు చెందిన అశోక్‌కుమార్ భార్య ఇళయరాణి విరుచ్చిపురంలోని అగర్వాల్ కంటి ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. ఆమె కుటుంబం విరుచ్చిపురం పెరుమాళ్ కోవిల్ వీధిలో అద్దెకు ఉంటోంది. అదే ఇంట్లో కింద పోర్షన్‌లో లక్ష్మి(43) అనే మహిళ ఉంటోంది. ఈమె చెల్లెలు తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపం మాధనూరు తోట ప్రాంతానికి చెందిన అంజలి(22) వేలూరులోని అడుకంపారై ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ నియంత్రణ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తోంది. ఈ క్రమంలో గత నెల 20వ తేదీ అశోక్‌కుమార్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స అనంతరం తదుపరి చికిత్స నిమిత్తం దిండిగల్‌కు వెళ్లారు. అప్పుడు కింద పోర్షన్‌లో ఉంటున్న లక్ష్మికి ఇంటి తాళాలు ఒక సెట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో లక్ష్మి.. ఆమె చెల్లెలు అంజలితో కలిసి అశోక్‌కుమార్ ఇంట్లో ఆరు సవర్ల బంగారు నగలను కాజేసింది. ఆదివారం అశోక్‌కుమార్ కుటుంబం ఇంటికి వచ్చి చూడగా నగలు కనిపించలేదు. ఫిర్యాదు మేరకు బాగాయం పోలీసులు దర్యాప్తు చేపట్టి లక్ష్మి, అంజలిని అరెస్టు చేశారు.

### నగదు మోసం కేసులో దంపతులు...

**కోయంబత్తూరు:** కోయంబత్తూరు జిల్లా వాగరాయపాళ్యంకి చెందిన మార్కండేయన్ రైతు. ఈయన భార్య సుకన్య వస్త్ర పరిశ్రమ గోదాములో పని చేస్తోంది. ఇదిలా ఉండగా మేట్టుపాళ్యం సమీపం కుమరన్‌కుండ్రుకి చెందిన దంపతులు పీటర్, రేవతి... మార్కండేయన్‌ను సంప్రదించారు. తమ హెర్బల్ ఉత్పత్తుల కంపెనీలో సూపర్‌వైజర్‌గా నియమిస్తామని, ఉత్పత్తులను అమ్మి చాలా డబ్బులు సంపాదించుకోవచ్చని తెలిపారు. అయితే ముందుగా కొంత డబ్బులు కట్టాలని చెప్పడంతో మార్కండేయన్ అప్పు చేసి పలు విడతలుగా రూ.84.42 లక్షలు ఇచ్చారు. అదే విధంగా పీటర్ దంపతులు రైతు భూమి పత్రాలు, పాస్‌పోర్టులు కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తీసుకున్న డబ్బులు తిరిగివ్వాలని మార్కండేయన్ అడగడంతో నిరాకరించారు. దీంతో మార్కండేయన్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పీటర్, రేవతిని అరెస్టు చేశారు.

పీటర్, రేవతి

### లంచం తీసుకున్న సహాయ ఇన్‌స్పెక్టర్...

**ఆర్కేనగర్:** పుదుకోట జిల్లా పన్నిరెండాంపట్టికి చెందిన వీరమణికి అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తికి భూ వివాదాలు ఉన్నాయి. దీని గురించి వీరమణి ఆదనకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వీరమణి మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుకుగాను రసీదు (సీఎస్ఆర్) ఇవ్వాలని అడిగారు. అందుకు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.10వేలు లంచం అడిగాడు. దీంతో వీరమణి అవినీతి నిరోధకశాఖకు ఫిర్యాదు చేశారు. వారి సూచనతో రసాయనం పూసిన కరెన్సీ నోట్లను శనివారం వీరమణి శంకర్‌కు ఇస్తుండగా అనిశా అధికారులు అరెస్టు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

## ఆధ్యాత్మిక శోభితం.. భక్తి పరవశం

ఏలూరు పవరుపేటలోని గంగానమ్మ జాతర నేత్ర పర్వంగా కొనసాగుతోంది. ఆదివారం వినుకొండ అంకమ్మ భూమిపై పాదం మోపే మట్టాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక రథంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొలుపుల కమిటీ అధ్యక్షుడు మామిళ్లపల్లి పార్థసారథి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పవరుపేట వీధిలోని పాత గంగానమ్మ ఆలయంలో జాతర సందర్భంగా.. నగర మేయర్ షేక్ నూర్జహాన్ కుటుంబ సమేతంగా అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, పవరుపేట(ఏలూరు నగరం)

## లోక్‌అదాలత్‌లో 10,798 కేసుల పరిష్కారం

### ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 34 బెంచ్‌లు ఏర్పాటు చేసి.. 10,798 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. ఏలూరు 1,988, భీమవరం 974, చింతలపూడి 1,248, జంగారెడ్డిగూడెం 971, కొవ్వూరు 1,092, నరసాపురం 434, పాలకొల్లు 458, తాడేపల్లిగూడెం 1,433, తణుకు 1,082, నిడదవోలు 919, భీమడోలు 153 కేసులు రాజీ చేసినట్లు చెప్పారు. వీటిలో 238 [illegible] ప్రీ లిటిగేషన్, 153 క్రిమినల్, 294 మోటారు వాహన ప్రమాద కేసులున్నట్లు వివరించారు. లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన న్యాయమూర్తులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి ఆమె ఆదివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## పిడికిలి బిగిస్తే పతకమే!

**మార్టేరు, న్యూస్‌టుడే:** మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈ యువతి బాక్సింగ్‌లో సత్తాచాటుతున్నారు. ఈమె ఇటీవల విశాఖపట్నంలో జరిగిన మహిళల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. త్వరలో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు. నత్తారామేశ్వరం పరిధి వడలపాలెంకి చెందిన తేజస్విని వెంకట శైలజ ఎమ్మెస్సీ పూర్తి చేశారు. జిల్లా స్థాయిలో వివిధ చోట్ల జరిగిన పోటీల్లో తొమ్మిదిసార్లు పాల్గొని రెండు స్వర్ణ, నాలుగు రజత పతకాలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో 14 స్వర్ణ, 6 రజత పతకాలు సాధించారు. 2022లో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ సీనియర్ మహిళల టోర్నీలో స్వర్ణ పతకం సాధించారు.

**ఐపీఎస్ సాధనే లక్ష్యం..** 'ప్రస్తుతం సివిల్స్ పరీక్షకు సిద్ధమవుతున్నా. ఐపీఎస్ సాధించడమే నా లక్ష్యం. భవిష్యత్తులో ఏ స్థాయిలో ఉన్నా మరికొందరికి బాక్సింగ్‌లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తా.' అని తేజస్విని వెంకట శైలజ చెప్పారు.

## చలికి వణుకు.. పట్టదు కునుకు

### వసతి గృహాల్లో సమస్యల మోత

**మండవల్లి, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, ఆగిరిపల్లి, నూజివీడు రూరల్, ముసునూరు, న్యూస్‌టుడే:** వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న బాలబాలికలు అత్యధిక సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, పెచ్చులూడుతున్న గదులు, స్నానపు గదుల లేమి, నేలపై పడకలతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుంటే, దోమ తెరలు లేక దోమలతో యుద్ధాన్ని చేస్తున్నారు. చలికి కునుకు పట్టక ఇక్కట్లు పడుతున్నారు.

**ముదినేపల్లి** బీసీ బాలుర వసతి గృహంలో 40 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. నేలపైనే పడుకుంటున్నారు. దోమ తెరలు లేక దోమలతో కుస్తీ పట్టాల్సి వస్తోందన్నారు.

**ముసునూరు** వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ పెచ్చు ఊడి ఎక్కడ పడుతుందోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలన

**కైకలూరు** వసతిగృహంలో 1 నుంచి టెన్త్ వరకు 79 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. అదనపు మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదులకు హాజరయ్యేందుకు ఆలస్యం అవుతోందని వాపోతున్నారు.

**కలిదిండి** ఎస్సీ బాలుర వసతిగృహంలో 90 మంది ఉన్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు, బయటి వ్యక్తులతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు తిష్ఠ వేస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వసతి గృహాలు ఇలా..
ఎస్సీ 52 విద్యార్థులు 4,620
బీసీ 30 విద్యార్థులు 2 వేల వరకు

నూజివీడు బీసీ హాస్టల్ కిటికీకి అడ్డుగా పెట్టిన చెక్క

**ఆగిరిపల్లి** సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 70 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. తాగు నీటికి ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో కుళాయి నీటినే తాగు నీటిగా వినియోగిస్తున్నారు. విద్యార్థులకు మంచాలు లేకపోవడంతో నేలపైనే దుప్పట్లు పరచుకొని నిద్రించాల్సి వస్తోంది.

**జర భద్రం బిడ్డో..** నూజివీడులో వెనకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహాన్ని 1997లో ప్రభుత్వం నిర్మించింది. ప్రస్తుతం 35 మంది విద్యార్థులున్న భవనం శ్లాబ్ మొత్తం ధ్వంసమైంది. పలు చోట్ల పెచ్చులూడి విద్యార్థులు నిద్రించే గదుల్లో పడుతున్నాయి.

ఆగిరిపల్లిలో తాగు నీటికి పంచాయతీ కుళాయే దిక్కు

**త్వరలో పరిష్కారం..** దీనిపై ఎస్సీ, బీసీ వెల్ఫేర్ డీడీలు విశ్వకుమార్ రెడ్డి, నాగరాణిని సంప్రదించగా.. సమస్యలను ఇప్పటికే పరిశీలించామని, త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

## చేతికిస్తారా.. చేతులెత్తేస్తారా!

### స్మార్ట్ కార్డులకు ఏడాదిగా నిరీక్షణ

ఏలూరుకు చెందిన ఎలక్ట్రీషియన్ కె.లక్ష్మణరావు ఇటీవల కొత్త ద్విచక్ర వాహనం కొన్నారు. ఆర్సీ కార్డుకు రూ.200, పోస్టల్ సర్వీసుకు రూ.35 కలిపి రూ.235 చలానా చెల్లించారు. 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆర్సీ రాలేదు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు లక్ష్మణరావు వాహనాన్ని పట్టుకున్నారు. ఆర్సీ చూపాలని కోరగా.. ఆయన కార్డు రాలేదని బదులిచ్చారు. పోలీసులు చలానా రాసేయడంతో.. విధిలేక ఆ మొత్తం చెల్లించారు.

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో రోజూ 300కు పైగా డీఎల్, ఆర్సీలు జారీ అవుతుంటాయి. వీటిలో 200కు పైగా డీఎల్(డ్రైవింగ్ లైసెన్సు)లు, 100కు పైగా వాహన ఆర్సీ(రిజిస్ట్రేషన్)లుంటాయి. కొన్నాళ్లుగా వీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 37,767 కార్డులు పెండింగ్ ఉన్నాయి. వాహనదారులకు ఎంతో అవసరమైన, విలువైన ఆర్సీ, డీఎల్ కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం చేసుకోవడంతో. . చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కార్డుల స్థానంలో ఆన్‌లైన్ కాగిత రూపంలో పత్రాలు తెరపైకి తెచ్చారు. దీంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చడంతో.. దీన్ని పరిష్కరించాలని కూటమి ప్రభుత్వ రవాణా శాఖను ఆదేశించింది. పాత పద్ధతిలో కార్డులు అందజేయాలని అధికారులు నిర్ణయించగా.. ప్రక్రియ టెండర్ల దశలోనే నిలిచిపోయింది. 'స్మార్ట్ కార్డుల టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఆ వెంటనే కార్డులు ముద్రించి వాహనదారులకు అందజేస్తాం' అని జిల్లా రవాణా శాఖ ఇన్‌ఛార్జి ఉప కమిషనర్ కృష్ణారావు తెలిపారు.

పెండింగ్ కార్డుల వివరాలిలా..
ఆర్సీలు: 8,967
డీఎల్: 28,800

## చెరువు చూపలేరు.. చెర ఆపలేరు

పునాదుల్లో ఆగిన ఈ నిర్మాణం జంగారెడ్డిగూడెంలోని రైతు బజారు. రూ.32 లక్షలతో కొన్నేళ్ల కిందట చేపట్టారు. తీరా ఇది ఊర చెరువులో కడుతుండటంతో సాంకేతిక సమస్య తలెత్తి నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. మరో స్థలంలో కట్టేందుకు యత్నిస్తున్నారు.

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం పట్టణంలో చెరువులు ఆక్రమించి నివాసాలు, వాణిజ్య సముదాయాలు, పెద్ద పెద్ద భవంతులు కట్టుకోవడం చాలా కాలంగా పరిపాటి అయ్యింది. అయితే గతంలో గూడు లేని కొందరు చిన్న చిన్న ఆవాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించేవారు. ఇవి కాలక్రమేణా చేతులు మారాయి. దీంతో వీటిని చేజిక్కించుకున్నవారు ఇప్పుడు దుకాణాలు, వాణిజ్య ప్రాంగణాలు నిర్మిస్తున్నారు. దర్జాగా కట్టే భవంతులను నిలువరించడంలో పురపాలక సంఘం, పట్టణ ప్రణాళిక విభాగం చేష్టలుడిగింది. సంబంధిత జలవనరుల, రెవెన్యూ శాఖలు కూడా మౌనం వహిస్తున్నాయి.

జంగారెడ్డిగూడెంలోని కొన్ని చెరువుల్లో 2022 నాటి లెక్కల ప్రకారం ఆక్రమణలు ఇలా..

| చెరువు | ఎకరాలలో | నివాసాలు |
|---|---|---|
| ఊర | 7.67 | 216 |
| రాముడు | 8.11 | 343 |
| కేసరి | 8.15 | 413 |
| పాకనాటికుంట | 4.29 | 118 |
| పోడూరివారి | 3.64 | 116 |
| రాముడుకుంట | 3.75 | 210 |

**అన్నీ కబ్జా పర్వం**

పట్టణంలో ఉన్న చెరువుల్లో అధిక భాగం నేడు ఆక్రమణల్లోనే ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు సుమారు 35.50 ఎకరాలలోని చెరువు భూములు ఆవాసాలుగా మారాయి. వీటిలో సుమారు 1,416 నివాసాలు ఏర్పాటైనట్లుగా గుర్తించారు. ఆక్రమిత భూముల విలువ సుమారు రూ.100 కోట్లు పైమాటే. మురుగు, వర్షం నీరు పారాల్సిన చెరువుల్లో నివాసాలు ఉండటంతో పట్టణంలో వీటి ప్రవాహాలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఏలూరు రోడ్డు, అశ్వారావుపేట రోడ్డు, బుట్టాయగూడెం రోడ్డు, కొవ్వూరు రోడ్డు ఇలా ప్రధానమైన రహదారులు వర్షం కురిస్తే నీట మునుగుతున్నాయి.

పరదాల మాటున ఏలూరు రోడ్డులోని వాణిజ్య ప్రదేశంలో కడుతున్న ఈ నిర్మాణం ఊరచెరువులోనిది. ఇక్కడ ప్రభుత్వ భవనాలు కట్టేందుకు అడ్డుగా ఉన్న నిబంధనలు ఈ కట్టడాలకు పనికిరావడం లేదా అన్న సందిగ్ధత తలెత్తుతోంది.

మాట్లాడుతున్న పార్థసారథి, చిత్రంలో ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ వీరాంజనేయులు, వడ్డి కార్పొరేషన్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు

## సాగు వివాదానికి పరిష్కారం చూపుతాం

### కొల్లేరు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్న మంత్రి

**నిడమర్రు, న్యూస్‌టుడే:** కొల్లేరు భూముల్లో సంప్రదాయ సాగు వివాదానికి శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. తోకలపల్లిలో కొల్లేరు రైతులతో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తాం. ఎవరైనా హాని కలిగించాలని చూస్తే.. వారిని మేమే అడ్డుకుంటాం. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొల్లేరులో సంప్రదాయ వ్యవసాయం చేసుకునేందుకు రైతులు వెళ్తుంటే.. వారిని అధికారులు అడ్డుకోవడం సరికాదు. పర్యావరణంతో పాటు ప్రజల జీవితాలూ ముఖ్యం. కొల్లేరు సమస్యను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం' అని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, వడ్డి కార్పొరేషన్ అధ్యక్షురాలు గంటసాల వెంకటలక్ష్మి రైతుల సమస్యలను ప్రస్తావించారు. లంక గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

## చకచకా.. ఎంచక్కా

### వేగంగా వైద్య కళాశాల భవనాల నిర్మాణం

**ఈనాడు-ఏలూరు:** ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు గత ప్రభుత్వంలో నత్తను తలపించాయి. దీంతో విద్యార్థుల బోధనకు ఆటంకం కలిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే వేగం పుంజుకున్నాయి. 2026 ఆగస్టు నాటికి పనుల పూర్తికి ప్రభుత్వం గడువు పొడిగించింది. జగన్ సర్కార్ ఆ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదు. గుత్తేదారుకు పూర్తిస్థాయిలో స్థలాలు అప్పగించలేదు. పనులు ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణమే. ఈ విషయం తెలుసుకున్న కూటమి ప్రభుత్వం సమీక్షించి నిర్మాణాలకు సరిపడా స్థలాన్ని కేటాయించి గుత్తేదారుకు బిల్లులు చెల్లించడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2022లో పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.215 కోట్ల విలువైనవి జరిగాయి. 2.76 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో జీ+4 భవనాలు నిర్మించాలి.

**అందుబాటులోకి గ్యాలరీలు..** వైద్య విద్యార్థులు క్లినికల్ పరీక్షల నిర్వహణ, బోధనకు గ్యాలరీ అవసరం. కనీసం దాన్ని వైకాపా ప్రభుత్వం నిర్మించలేదు. మూడో సంవత్సరం విద్యార్థులకు ఒక క్లినికల్ గ్యాలరీ నిర్మించి రెండు మాసాల క్రితమే అప్పగించగా రెండో ఏడాది వారికి మరొకటి సిద్ధం చేస్తున్నారు. ఇది వారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. 2023లో తరగతులు ప్రారంభం కాగా ప్రస్తుతం పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాలు పూర్తి చేయాల్సి ఉంది.

## పడవ సిద్ధం పదండి చూద్దాం

పక్షుల కేంద్రంలో ప్రారంభమైన బోటు షికారు

**కైకలూరు, న్యూస్‌టుడే:** బోటు షికారు ఎప్పుడెప్పుడు చేసేద్దామని పర్యాటకులు ఎదురు చూస్తుంటారు. ఉభయ రాష్ట్రాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన ఆటపాక పక్షుల కేంద్రంలోని 270 ఎకరాల భారీ చెరువులో బోటు షికారుకు అధిక ప్రాధాన్యం ఉంది. ఇక్కడ సహజ సిద్ధ వృక్షాలతో పాటు పక్షుల విడిది కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌పై వేలాది పక్షులు కనువిందు చేస్తాయి. అయితే ఇక్కడ సమృద్ధిగా నీరు ఉన్నా గత తుపాను ప్రభావంతో ఈ పక్షుల కేంద్రం మూతపడి బోటు షికారు నిలిచి సందర్శకులు అసంతృప్తి చెందారు. అటవీ శాఖ అధికారులు ఇక్కడ పరిస్థితులను మెరుగుపరచి కొన్నిరోజులుగా బోటు షికారును అందుబాటులోకి తెచ్చారు. మునుపెక్కడా చూడని బుల్లి పిట్టలు, భారీ పక్షులను అతి దగ్గర నుంచి చూసే వెలుసుబాటు రావడంతో బోటులో పయనించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. దీంతో పక్షుల కేంద్రాలు పర్యాటకుల సందడితో పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

**అదనపు బోటు:** గత కొన్నేళ్లుగా పక్షుల కేంద్రంలో చిన్నపాటి రెండు బోట్లు తప్ప పదిమందికి సరిపోయే బోట్లు అందుబాటులో లేవు. అందులో ఎప్పుడూ ఒక బోటు మరమ్మతులకు గురై ఉంటోంది. అధికారులు ఈ సారి పర్యాటకులకు పూర్తి సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.

నూతన బోటును అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అదనపు బోట్లు సిద్ధం చేశారు. శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించి, మరుగుదొడ్లు ఆధునికీకరించి మరిన్ని సదుపాయాలు కల్పించారు. 'పక్షుల సందర్శనకు వచ్చే పర్యాటకులకు పూర్తి వసతులు కల్పించాం' అని డీఆర్వో రంజిత్‌కుమార్ తెలిపారు.

## పరీక్ష రుసుము చెల్లింపు గడువు 19

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** ఏపీ సార్వత్రిక విద్యా పీఠం(ఏపీవోఎస్ఎస్) దూర విద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 19 వరకు గడువు విధించినట్లు డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు యథావిధిగా 'మీ కోసం'

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు.

## క్రీడా, సాంస్కృతిక పోటీలు రేపు

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లాలో విద్యా దాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు స్థాపించిన విద్యాలయాల్లో ఈ నెల 16న క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. మూర్తిరాజు జయంతి సందర్భంగా మొత్తం 68 విద్యా సంస్థల్లో వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## 17 నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ దర్శనం ఈనెల 17వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తామని సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ ఆదివారం తెలిపారు.

## ఆరోగ్య కేంద్ర నిర్మాణాలకు నిధుల మంజూరు

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాల నిర్మాణాలను పూర్తికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో వివిధ దశల్లో నిలిచిన 128 నిర్మాణాలకు ఉపాధి హామీ నిబంధనలకు అనుగుణంగా రూ.20.73 కోట్లు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులకు అనుమతి మంజూరు చేస్తూ.. కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి చేయాల్సిన పనుల్లో చివరి దశలో 49, పై కప్పు పూర్తయినవి 56, శ్లాబ్ దశలో 19, బేస్‌మెంట్ స్థాయిలో 4 ఉన్నట్లు గుర్తించారు.

## నట్టింట్లో జోడెడ్ల బండి!

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** జిల్లాకు చెందిన కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న పలు హస్త కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. పాలకొల్లు మండలం దగ్గులూరులో తయారయ్యే ఎడ్ల బండి నమూనా ఆకృతులకు మంచి గిరాకీ ఉంది. ఇంటి హాలులో టీపాయ్‌లుగా, దేవుడి గదిలో మండపాల్లా వీటిని అలంకరించుకుంటున్నారు. ఎవరైనా ప్రముఖులు జిల్లాకు వచ్చినప్పుడు వీటినే జ్ఞాపికలుగా అందిస్తున్నారు. గతంలో భీమవరంలో నిర్వహించిన అల్లూరి శత జయంతి వేడుకలకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీకి ఇలాంటి జోడెడ్ల బండిని స్థానిక నాయకులు ఆయనకు జ్ఞాపికగా అందించారు. అడుగు నుంచి నుంచి 9 అడుగుల పరిమాణం వరకు ఇలాంటి బళ్లు లభిస్తున్నాయి. వీటి తయారీకి ఉపయోగించే ఎద్దులను ఫైబర్, ఇతర మిశ్రమాలతో, బళ్లను టేకు, ఇతర కలపతో తయారు చేస్తున్నారు. దగ్గులూరుతో పాటు అత్తిలి మండలం పాలూరులో వీటిని తయారుచేసి విక్రయిస్తున్నారు.

## అతివ పొదుపునకు మరింత ప్రోత్సాహం

### కొత్త డ్వాక్రా సంఘాలకు పునరుత్పాదక నిధి

**నూజివీడు, న్యూస్‌టుడే:** మహిళల ఆర్థిక స్వావలంబనకు.. వారి జీవనోపాధులు మెరుగుపరచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మహిళల ఆర్థికాభ్యున్నతికి బాటలు వేసిన సీఎం చంద్రబాబు వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించాలని నిర్ణయించారు. ప్రతి మహిళా తన కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలవాలనే లక్ష్యంతో కొత్త డ్వాక్రా సంఘాలకు ఊతమిస్తున్నారు. పొదుపు ద్వారా బ్యాంకుల లింకేజీ రుణాలు పొంది స్వయం ఉపాధి పొందడమే లక్ష్యంగా తోడ్పాటును అందిస్తున్నారు. దీనిలో భాగంగా 2024 ఆగస్టు 2 నుంచి 2025 నవంబరు 30 వరకు కొత్తగా ఏర్పడిన గ్రామీణ ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించే డ్వాక్రా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ (పునరుత్పాదక నిధి) మంజూరు చేశారు. ఒక్కో సంఘానికి రూ.15 వేలు చొప్పున ఖాతాలకు జమ చేశారు. నిర్దేశించిన కాలంలో జిల్లాలో 37 డ్వాక్రా సంఘాలు ప్రారంభించగా, వీటికి రూ.5,55,000 విడుదల చేశారు.

**రూ.20లక్షల వరకు రుణం..** డ్వాక్రా సంఘంలో ప్రతి సభ్యురాలు నెలకు రూ.100 చొప్పున పొదుపు చేస్తారు. ఆరు నెలలు తర్వాత రివాల్వింగ్ ఫండ్‌ను పరిగణలోకి తీసుకుని బ్యాంకులు రూ.75 వేల వరకు రుణం మంజూరు చేస్తాయి. సంఘం సీనియారిటీ ఆధారంగా రూ.20 లక్షల వరకు రుణం ఇస్తారు. తద్వారా పొదుపు మహిళలు వివిధ స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది.
- విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు

సంఘాలు: 41,533
సభ్యులు: 4,06,660

నిర్వాహకులతో విజేతలు

## బాలల పండగ ముగిసింది.. బహుమతి తెచ్చింది

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో హేలాపురి బాలోత్సవం అట్టహాసంగా జరగ్గా.. సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మూడో రోజు ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలోత్సవం అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ..నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు సాంత్వన చేకూర్చేలా, నూతనోత్తేజం నింపేలా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. బాలోత్సవం ప్రతినిధులు నరసింహారావు, డి.వెంకటేశ్వర్లు, ఎం.కోటేశ్వరరావు, డి.హేమసుందర్, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## హే కృష్ణా.. కాలువ సాగనంటోందయ్యా!

**పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే:** ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని ఆరు మండలాలు.. సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగునీరందించే ఏలూరు- కృష్ణా కాలువ నిర్వహణపై రోజు రోజుకూ తీసికట్టుగా మారుతోంది. వైకాపా పాలనలో కాలువ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. దాంతో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోయి.. నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది.

కూటమి ప్రభుత్వ హయాంలోనైనా కాలువకు పునర్వైభవం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా.. నిర్వహణ పనులు మాత్రం చేపట్టలేదు. ఫలితంగా కాలువలో తూడు, గుర్రపు డెక్క పెరిగిపోతూ.. నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. ఇటీవల పెదపాడు మండలం వట్లూరులో రైతులు ఆందోళనకు దిగారు. రబీ మొదలవుతున్న నేపథ్యంలో.. అధికారులు, పాలకులు స్పందించి నిర్వహణ పనులు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

**నివేదించాం..** 'జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో చర్చించాం. ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని నివేదించాం. కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం' అని పెదపాడు డీసీ ఛైర్మన్ బొప్పుడి కాశీబాబు తెలిపారు.

(c) eenadu

## ఊరూ వాడా.. క్రిస్మస్ సందడి

బెరాకా ప్రార్థన మందిరంలో కొవ్వొత్తుల ప్రదర్శనలో విశ్వాసులు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** పల్లెలు, పట్టణాలు అంతటా క్రిస్మస్ సందడి మొదలైంది. నూజివీడు నియోజకవర్గంలో చర్చిలు విద్యుద్దీపాలతో వెలుగులీనుతున్నాయి. ఆగిరిపల్లి బెరాకా ప్రార్థన మందిరంలో కొవ్వొత్తుల ప్రదర్శనలు, క్యారల్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ నెల 24న క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్ ఆరాధన, 31న రాత్రి విశేష వార్షిక కృతజ్ఞతార్పణ ఆరాధన, జనవరి 1న నూతన సంవత్సర ఆరాధనలు నిర్వహించనున్నారు.

## ఇలానూ చేయొచ్చు.. శ్రీవారి సేవ

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ఆకలితో ఉన్న భక్తులకు అన్నం పెట్టడం ఎంత పుణ్యమో.. వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మందులు అందించడం వల్ల అంతే పుణ్య ఫలం లభిస్తుందని భావించారు. అవసరం మేరకు కావాల్సిన మందులను ఎప్పటికప్పుడు అందజేస్తూ.. శ్రీవారి భక్తులకు సేవ చేస్తున్నారు.

**స్వచ్ఛందంగా..** ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే.. వారికి చికిత్స అందించేందుకు కొండపైన 'శ్రీవేంకటేశ్వరస్వామి ప్రాణదాన పథకం' ద్వారా ప్రథమ చికిత్స కేంద్రాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. ఆ కేంద్రానికి అవసరమైన మందులను దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచితంగా అందజేస్తున్నారు. గత రెండేళ్లలో 48,209 మంది భక్తులకు అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్, డిజిటల్ మానిటర్, ఆక్సిజన్ సిలిండర్లు, చక్రాల కుర్చీలు వంటి పరికరాలను దాతలు అందజేశారని దేవస్థానం ప్రథమ చికిత్స కేంద్రం వైద్యాధికారి ఆర్.రాజేంద్ర తెలిపారు.

**కష్టాలు చూసి..** సుమారు ఏడేళ్లుగా భక్తులు, స్వామివారి సేవ చేసేవారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నా. స్వామివారి సన్నిధికి కాలినడకన వచ్చే భక్తుల కష్టాలను చూశా. వారికి సేవ చేయాలన్న ఆలోచనతో ముందుకొచ్చా. పర్వదినాల్లో, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నా.
**- అలపాటి వెంకట సాంబశివరావు, దాత, తెనాలి**

**భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి**

శ్రీవారి సన్నిధిలో భక్తుల ఆరోగ్య సమస్యను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందించాలనుకున్నా. సుమారు అయిదేళ్ల నుంచి మందులు అందిస్తున్నా. ఇందుకు నా స్నేహితులు కూడా సహకరిస్తున్నారు. స్వామి ఆలయానికి వచ్చిన భక్తులు ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలని భావిస్తున్నా.
**- గర్రే సురేశ్, దాత, విజయవాడ**

**అత్యవసరమైన సమయంలో..**

ఆలయానికి వచ్చిన భక్తులు ప్రమాదాలకు గురైనప్పుడు దెబ్బలు తగులుతాయి. ఆ సమయంలో వారికి ఉపయోగపడే కట్లు కట్టేందుకు అవసరమైన డ్రెస్సింగ్ మెటీరియల్‌ను అందిస్తున్నా. దాదాపు మూడేళ్లుగా భక్తులకు ఇలాంటి సేవ చేయడం నాకు సంతృప్తిగా ఉంది.
**- మడిపల్లి సత్యనారాయణ స్వామి, విజయవాడ**

## అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** విర్డ్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 11 నుంచి జరుగుతున్న ఎముకల వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. మొత్తం 56 మందిని పరీక్షించి భుజం, మోకాలు, చెయ్యి, తుంటి సమస్యలు ఉన్న 20 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయగలగడం తమ వైద్య సౌలభ్యానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు కామినేని శ్రీనాథ్(యూఎస్ఏ), భవ్యానంద్, కృష్ణ కిరణ్, కంభంపాటి శ్రీనివాస్, బాలాజీ, పి.వి.నాగేంద్రప్రభాకు, సింధు, రమ్య, మహిత, విర్డ్ ట్రస్ట్ సభ్యులు వి.నారాయణమూర్తి, ఎస్‌వీవీఎస్ఎన్ నివృతరావు తదితరులు పాల్గొన్నారు.

## టెట్‌కు 179 మంది హాజరు

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కొనసాగింది. మొత్తం 200కి 179 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 21 మంది పరీక్ష రాయలేదని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

## ఆధునికంలో పురాతనం

### అబ్బురపరుస్తున్న కనుకొల్లులోని ఓ ఇల్లు

**మండవల్లి, న్యూస్‌టుడే:** ఎవరైనా ఇంటిని నిర్మించాలంటే ఆధునిక హంగులతో కట్టేందుకు ఇష్టపడుతుంటారు. కానీ మండవల్లి మండలం కనుకొల్లులో చెందిన కొలుసు నరేశ్ ఇల్లు అందుకు పూర్తి విరుద్ధంగా వందేళ్ల కిందటి పురాతనమైనదిగా కనిపిస్తోంది. డిజైన్‌తో పాటు కిటికీలు, తలుపులను సైతం పురాతన తీరులోనే ప్రత్యేకంగా తయారు చేయించారు. భీమవరంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆ కుటుంబం సొంతూరులోని దుర్గమ్మ ఆలయం మరమ్మతులకు డబ్బు వెచ్చించింది. ప్రస్తుతం ఈ ఇల్లు పూజారులు ఉండేందుకు నిర్మిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇంటి నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తూ 20వ శతాబ్దపు వాస్తు, డిజైన్ ఉండేలా చర్యలు చేపట్టారు. ఇంటి గుర్తులను అనవాళ్లుగా ఉన్న ఆ ఇంటిని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రత్యేకంగా వచ్చి చూస్తున్నారు.

ఇంటికి ఏర్పాటు చేసిన అలనాటి మోడల్ తలుపు, కిటికీలు

## ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు కేశఖండనశాల, శ్రీవారి దర్శన క్యూలైన్, ప్రసాదాల కౌంటర్లలో బారులు తీరారు. సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డ తల్లులను ప్రత్యేక క్యూల ద్వారా దర్శనానికి అనుమతించారు. ఆలయానికి తూర్పు వైపున శ్రీవారి కళాతోరణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## కనరో భాగ్యము..!

### 16 నుంచి శ్రీవారి ధనుర్మాస ఉత్సవాలు



**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14వరకు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ధనుర్మాసంలో శ్రీవారి సుప్రభాత సేవ ఉండదని, దానికి బదులు తిరుప్పావై సేవ జరుగుతుందని చెప్పారు. నిత్యం ఉదయం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

**30న ఉత్తర ద్వార దర్శనం..** ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రూ.100, రూ.200 టిక్కెట్లతోపాటు రూ.500 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. ముక్కోటి ఏకాదశి నుంచి వచ్చే 2026వ సంవత్సరం జనవరి 9 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో నేపథ్యంలో సాయం కాల సమయంలో జరిగే ఆర్జిత సేవలు ఉండవని వెల్లడించారు.

**29న గిరి ప్రదక్షిణ..** ముక్కోటి ఏకాదశి ముందు రోజు డిసెంబర్ 29న స్వామివారి గిరిప్రదక్షిణ నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆలయ తొలి మెట్టు దగ్గర ప్రారంభమై కొండ చుట్టూ సుమారు 6 కి.మీ. మేర గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఈవో తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తామని చెప్పారు.

## విద్యార్థులూ.. ప్రధానితో మాట్లాడతారా!

**ఉంగుటూరు, నూజివీడు, న్యూస్‌టుడే:** పబ్లిక్ పరీక్షల ముందు విద్యార్థుల్లో ఉండే భయాలు, ఒత్తిడి, ఆందోళనను తొలగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. పండగ వాతావరణంలో పరీక్షలు రాసేలా పిల్లల్లో ప్రేరణ నింపుతున్నారు. విద్యార్థులు తమ సందేహాలు, అనుభవాలు, ప్రశ్నలు, పరీక్షలకు సన్నద్ధతతో పాటు వివిధ అంశాలపై నేరుగా ప్రధాన మంత్రితో మాట్లాడే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులూ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది.

**ప్రతిభతో అవకాశం..** వివరాలు నమోదు చేసిన తర్వాత తెరపై కనిపించే చిన్న మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతిభ ఆధారంగా ప్రధాన మంత్రితో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ప్రశంసా పత్రాలు అందిస్తారు. విజేతలకు నేరుగా ప్రధానితో మాట్లాడే అవకాశం కల్పిస్తారు. వారికి ఎగ్జామ్ వారియర్స్ కిట్లను బహుమతిగా అందజేస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐవో కె.యోహాను సూచించారు.

**రిజిస్ట్రేషన్ ఇలా..** https:///innovateindia1.mygov.in వెబ్‌సైట్‌లో పార్టిసిపేట్ బటన్‌పై క్లిక్ చేసి విద్యార్థి, టీచర్, తల్లిదండ్రుల్లో ఒక ఆప్షన్ ఎంచుకోవాలి. చరవాణి లేదా ఈ-మెయిల్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలి.

**రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ:** జనవరి 11, 2026
**కార్యక్రమం నిర్వహించేది:** జనవరి 26, 2026.

**జిల్లా సమాచారం..**
**6-10 తరగతుల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు:** 753
**విద్యార్థుల సంఖ్య:** 1,34,014
**మొత్తం ఇంటర్మీడియట్ కళాశాలలు:** 140
**విద్యార్థులు:** 36,753
**కార్యక్రమం:** పరీక్షా పే చర్చ
**ఎవరు అర్హులు:** 6 నుంచి 12 తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు
**ప్రశ్న:** గరిష్ఠంగా 500 అక్షరాలు మించకూడదు.

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

**వీరవాసరం, న్యూస్‌టుడే:** పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి(ప్రథమ), విజయనగరం(ద్వితీయ), శ్రీకాకుళం(తృతీయ), బాలికల విభాగంలో విజయనగరం(ప్రథమ), పశ్చిమగోదావరి(ద్వితీయ), తూర్పుగోదావరి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను డీఈవో ఇ.నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్ నాయుడు అందజేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత, కె.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలురు, బాలికల ఏపీ జట్లను ఎంపిక చేశారు.

## విశ్రాంత పురపాలక ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి.శాస్త్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రేవూరి గోగురాజు(భీమవరం), ప్రధాన కార్యదర్శిగా డి.వి.ఎస్.ఎన్.మూర్తిమురళి(కాకినాడ), ఉపాధ్యక్షులుగా సీహెచ్.హరిబాబు(గుంటూరు), ఎం.వి.నారాయణరెడ్డి(రాజమహేంద్రవరం), బి.మునుస్వామి(అనంతపురం), పి.వి.టి.రమణరావు(విశాఖపట్నం), కోశాధికారిగా జి.వేణుగోపాలస్వామి(తుని), కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.సత్యనారాయణ(కాకినాడ), జె.శ్యామ్‌రాజ్(అనంతపురం), ప్రాంతీయ కార్యదర్శులుగా ఎం.వి.రామారావు(రాజమహేంద్రవరం), బి.వెంకటరామయ్య(అనంతపురం) నియమితులయ్యారు. ముఖ్య అతిథులుగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘాధ్యక్షుడు గాతల జేమ్స్, రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## పరుగులు దండిగా.. వికెట్లు మెండుగా..

### క్రికెట్‌లో రాణిస్తున్న యువతులు

**తణుకు, న్యూస్‌టుడే**

క్రికెట్ అబ్బాయిల ఆటే అన్న పరిమితులు చెరిపేసి అద్వితీయ ఆటతీరుతో ప్రశంసలందుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు. ఇటీవల మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ గెలవడంతో దేశవ్యాప్తంగా అమ్మాయిలకు ఈ ఆటపై ఆసక్తి పెరుగుతోంది. అదే స్ఫూర్తితో సాగుతున్నారు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలోని విద్యార్థినులు. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్సిటీ స్థాయి ఎంపికల్లో సత్తాచాటి సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు.



**అన్నయ్య స్ఫూర్తితో..**

మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ఒకవైపు కూలి పనులు, మరోవైపు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఇంటి వద్ద అన్నయ్యతో ఆడటం మొదలు పెట్టి తన వద్దే మెలకువలు నేర్చుకుంటూ ఆల్‌రౌండర్‌గా మారా. పదో తరగతిలో పాఠశాల తరఫున పాల్గొని సత్తాచాటాను. కళాశాలలో చేరిన తర్వాత నుంచి మరింత పట్టుదలతో ఆడటం మొదలుపెట్టా. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయం, మైసూరు విశ్వవిద్యాలయాల తరఫున రాజమహేంద్రవరం, మైసూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో మ్యాచులు ఆడా. ఇటీవల జరిగిన పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున ప్రతిభ కనబరచి సౌత్ జోన్‌కు ఎంపికయ్యాను. జాతీయ జట్టులో స్థానం సంపాదించి, పైలెట్ అవ్వాలనేది నా ఆశయం.
**- బి.రేవతి, పూళ్ల, డిగ్రీ మూడో సంవత్సరం**



**నాన్న ఆట చూస్తూ..**

నాన్న మంచి క్రికెటర్. ఆయన ఆడుతుంటే చూసి ఆసక్తి పెంచుకున్నా. పాఠశాల స్థాయిలో చిన్నగా ఆడటం మొదలుపెట్టా. ఇంటర్ నుంచి సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా వివిధ ప్రాంతాల్లో ప్రతిభ కనబరిచా. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్సిటీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (ఉమెన్) క్రికెట్ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ ఎంపికల్లో సత్తాచాటి జనవరి 16న నుంచి తమిళనాడులో జరగబోయే సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యా. ఇది నాకు మంచి అవకాశంగా భావిస్తున్నా. భారత జట్టుకు ఆడాలనేదే నా లక్ష్యం.
**-ఎం. మౌనిక, తణుకు, డిగ్రీ రెండో సంవత్సరం**

## సాంకేతికతతో నేరాల నియంత్రణ: ఎస్పీ

మాట్లాడుతున్న ప్రతాప్ శివకిశోర్

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** సాంకేతికత వ్యవస్థను అందిపుచ్చుకొని నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం స్కోర్-10 సోషల్ సర్వీసు రెస్పాన్సిబిలిటీ సంస్థ డైరెక్టర్ నారాయణ స్వరూప్‌తో కలిసి వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థల ప్రతినిధులు, చోదకులతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. స్కోర్-10 ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రూ.లక్ష వరకు ఉచిత బీమా పథకం అమలు చేస్తున్నారన్నారు. ఆటో వాలాలకు ఆర్థిక భద్రత కలిగించాలన్నదే దీని ముఖ్యోద్దేశమన్నారు. నేర చరిత్ర కలిగిన వారి వివరాలు స్కోర్-10 సంస్థ పోలీసు శాఖకు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్, సీఐలు మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ సుస్మిత వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన కనుమర్తి లక్ష్మీ నరసింహ ఆనంద్ కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి శనివారం వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ సుభాష్ ఆధ్వర్యంలో ఎస్సై వీరప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన ముత్యాల గణేశ్, శీలం ఆంజనేయులు, కటూరి సుబ్రహ్మణ్యం అనుమానాస్పదంగా సంచరించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తిరుమలాపురంలోని ఇంటి దొంగతనంతో పాటు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని ఏఎస్పీ తెలిపారు. దీంతో నిందితుల వద్ద నుంచి వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి రూ.లక్ష విలువైన వెండి, బంగారు వస్తువులు, కారు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. నిందితులు ముత్యాల గణేశ్‌పై 11 కేసులు, శీలం ఆంజనేయులుపై 9, కటూరి సుబ్రహ్మణ్యంపై 8 కేసులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయన్నారు.

నిందితుల అరెస్టు చూపుతున్న ఏఎస్పీ సుస్మిత

తణుకు సమ్మేళనంలో మాట్లాడుతున్న బొండా ఉమ

## కాపుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

**తణుకు, న్యూస్‌టుడే:** కాపు సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. అందరూ ఏకతాటిపై నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం తణుకులోని సీఎం కల్యాణ మండపంలో నిర్వహించిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. కాపు నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించగా, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ఆనాడు మోహనరంగా ఒక విప్లవాత్మక మార్పు కోసం ఉద్యమిస్తే కుట్రపూరితంగా హత్య చేశారనే నిజాన్ని గుర్తించాలన్నారు. బీసీలు, కాపులు, దళితులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కాపునాడు జాతీయ అధ్యక్షులు గల్లా సుబ్రహ్మణ్యం, కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, నల్లా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు

మాట్లాడుతున్న దేవప్రకాశ్

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని జలవనరుల శాఖ ముఖ్య పర్యవేక్షక ఇంజినీరు చిలకపాటి దేవప్రకాశ్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ప్రొవెన్షియల్ వర్క్ ఛార్జ్‌డ్ మినిస్టీరియల్, లాస్ట్ గ్రేడ్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పశ్చిమ గోదావరి జిల్లా 42వ మహాజన సభ ఆదివారం నిర్వహించారు. దేవప్రకాశ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సొసైటీ నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తోందని చెప్పారు. నీరు- ప్రగతి పర్యవేక్షక ఇంజినీరు బి.వెంకటస్వామి, ఉప పర్యవేక్షక ఇంజినీరు పుట్టా ధనంజేయులు మాట్లాడుతూ.. సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సొసైటీ నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ కార్యదర్శి జవంగుల బాపయ్య, హరనాథ్, కె.పి.వెంకన్న, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆరుద్ర జయంతిని అధికారికంగా నిర్వహించండి

పూర్ణచందును సన్మానిస్తున్న నాయకులు

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర శత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆరుద్ర సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ జి.వి.పూర్ణచందు కోరారు. స్థానిక సాహిత్య మండలిలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యాన ఆరుద్ర శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచందుకు జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జాతిని ప్రగతి శీలక బాటలో నడిపిన వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు. మహ్మద్ ఖాజావలీ ఆధ్వర్యంలో హేలాపురి గాయకులు ఆలపించిన సినీ మధుర గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

**ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE**
**Tender Notice No.04 EE/APMSIDC/Eluru/2025-26, Dt. 15-12-2025**

Tenders are invited in "e Procurement" for the works "Construction of Stand Alone Government **Ayurveda Dispensarys** at 1) Munduru, 2) Dubacherla, 3) Jinnuru, 4) Veeravasaram, 5) Elurupadu, 6) Rajavaram, 7) Polavaram, 8) Kovvuru, 9) Palakollu, 10) Jaanampeta, Construction of Stand Alone Government **Homeopathy Dispensarys** at 1) Pragadavaram, 2) Tadikalapudi, 3) Kalla, 4) Lakshamaneswaram. **Last date receipt of Tenders 23-12-2025.** The other details can be had at website www.eprocurement.gov.in For further details please Contact Ph.No. 77807 14114.

Sd/- **EE, APMSIDC Division, Eluru, Eluru & W.G. Districts**

### తల్లిదండ్రులు మందలించారని..

## బాలుడి ఆత్మహత్యాయత్నం

**పోలవరం, న్యూస్‌టుడే:** తల్లిదండ్రులు మందలించారని ఓ బాలుడు పురుగుమందు తాగిన ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం పనికి వెళ్లాడు. అక్కడి వారితో గొడవ పడి.. ఇంటికి వచ్చాడు. ఆ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గొడవలు ఎందుకు అంటూ మందలించారు. మనస్తాపం చెందిన ఆ బాలుడు పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. ప్రస్తుతం పరిశీలనలో ఉంచామని, పరిస్థితిని బట్టి రాజమహేంద్రవరం తరలిస్తామని వైద్యులు తెలిపారు.

### వసతి గృహం ఆవరణలో..

## ఆకతాయిల హల్‌చల్

### పోలీసుల అదుపులో యువకుడు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** నగరంలోని ప్రైవేటు వసతి గృహాల వద్ద రాత్రివేళ ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. ఆయా వసతి గృహాల దగ్గరకొచ్చి అరుపులు, కేకలు వేయడం.. ఒక్కోసారి కిటికీల్లో నుంచి నీళ్లు, రాళ్లు విసరడం చేస్తున్నారు. విద్యార్థినులు భయభ్రాంతులకు గురై.. వసతి గృహాలకెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి ఓ యువకుడు వసతి గృహంలోకి చొరబడటంతో.. అప్పటికే మాటు వేసిన సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని గాలాయగూడెం వాసిగా గుర్తించారు. పోలీసులు వసతి గృహాల భద్రతపై దృష్టి సారించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## డీఏ బకాయిల చెల్లింపునకు డిమాండ్

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్‌వీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ భవనంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. తోట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఉద్యోగులకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, అప్పటి వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడి పదవీ కాలాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ తీర్మానించారు. సంఘ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు వైజీఎల్ నారాయణ, ముఖ్య సలహాదారు లింగేశ్వరరావు, కోశాధికారి జె.మణికంఠకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్పుతో ఫలితం శూన్యం: వ్యకాసం

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం పేరు మార్చినంత మాత్రాన పేదలకు ఒరిగేది శూన్యమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో సంఘ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. శేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంపై తీవ్ర దాడి మొదలు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు వెంకటేశ్వరరావు, కేశవరెడ్డి, వెంకట్రావు, ఈశ్వరరావు, పెద్దయ్య పాల్గొన్నారు.

## జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

**సామర్లకోట, న్యూస్‌టుడే:** జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కాకినాడ జిల్లి సామర్లకోటకు చెందిన క్రీడాకారుడు యాతం నాగబాబు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పల్లపర్రులో నిర్వహించిన 45వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ 2025 ఛాంపియన్‌షిప్ పోటీల్లో 100, 1,500 మీటర్ల పరుగులో బంగారు, 800 మీటర్ల పరుగులో రజత పతకాలు సాధించారు. 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా మలేరియా విభాగంలో పనిచేస్తున్న నాగబాబు ఇప్పటికే అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక వర్గంపై పెను దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు కర్షక, కార్మిక లోకం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు పుప్పాల కన్నారావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, బండి వెంకటేశ్వరరావు, కిశోర్, అప్పలరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**92.7 FM Rajamahendravaram** 92.7 Mee FM
**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

**EENADU Classifieds**

**BUSINESS SERVICES**
ఆదిత్య మోటార్స్, జంగారెడ్డిగూడెం ... 12,000/- to 18,000/- Contact Cell: 85006 44978.

బంగారం బ్యాంకులో/ ప్రైవేటు సంస్థలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

**గమనిక**

**BUSINESS OFFER**
ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం ... సంప్రదించండి: 78160 98199.

**JOBS**
HYD యూనిట్ ... Cell: 81215 41212.
టెలికాలింగ్ & Data Entry ... 8464016870, 8639439870

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర** ... 6.75 ... 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

(c) eenadu

## రాగి తీగ కొనుగోలు చేయొద్దు: సీఐ

**పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే:** విద్యుత్తు నియంత్రికలు, మోటార్లు దొంగిలించే వారి వద్ద నుంచి ఎట్టి పరిస్థితుల్లో రాగి తీగ కొనొద్దని సీఐ సీహెచ్ రాజశేఖర్ హెచ్చరించారు. పెదవేగి సర్కిల్ కార్యాలయంలో పాత సామగ్రి కొనుగోలుదారులతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. ఎవరైనా విద్యుత్తు నియంత్రికలు, వ్యవసాయ బోరు మోటార్లలోని రాగి తీగలు చోరీ చేసి తీసుకొస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతుల జీవనాధారంపై ప్రభావం చూపే దొంగతనాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

దుకాణదారులతో మాట్లాడుతున్న రాజశేఖర్

# ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హార్ట్‌ఫుల్‌నెస్ సొసైటీ జోనల్ సమన్వయకర్త ఆర్‌వీ అప్పారావు అన్నారు. నగరంలో సంస్థ ఆధ్వర్యాన ఆదివారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పారావు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి కాపాడాలని పిలుపునిచ్చారు. సంస్థ జిల్లా సమన్వయకర్త పి.విజయసారథి, ఏలూరు ఇన్‌ఛార్జి ఎ.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ప్రతినిధుల ప్రదర్శన

## మమ్మేలమ్మా.. రాట్నాలమ్మ

**రాట్నాలకుంట(పెదవేగి) న్యూస్‌టుడే:** రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన చేసి.. పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రాట్నాలమ్మను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.58,034 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

## వేడుకగా భవానమ్మ ఊరేగింపు

**భీమడోలు:** పూళ్ల గ్రామ దేవత భవానమ్మ వార్షిక పంట జాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అమ్మవారి ఘటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు భవానమ్మకు కర్పూర హారతులిచ్చి సాగనంపారు.

## సూర్య దేవాయ నమః

**పవరుపేట(ఏలూరు నగరం):** పవరుపేట సూర్య దేవాలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకాలంకరణ, పూజలు చేశారు. భక్తులు జగత్తుకు వెలుగులిచ్చే సూర్యనారాయణుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రాములోరి సేవలో కృష్ణంనాయుడు

**కైకరం(ఉంగుటూరు):** కైకరం సుందర సీతా రామ స్వామి ఆలయాన్ని కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు ఆదివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

## పూడికతీత పనులు ప్రారంభం

**దెందులూరు, న్యూస్‌టుడే:** దోసపాడు పంట కాలువలో చేపడుతున్న పూడికతీత పనులను గోదావరి కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అత్తులూరి చంద్రశేఖర్, పోతునూరు సాగునీటి వినియోగదారుల సంఘాధ్యక్షుడు చలసాని రాంబాబు ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రబీలో సాగునీటి సమస్య తలెత్తకుండా ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో రూ.10 లక్షలతో పూడిక తీయిస్తున్నట్లు చెప్పారు. సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

☛ గణపవరం మండలం కొత్తపల్లికి చెందిన బుల్లెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ పీహెచ్‌సీకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలన్నీ చేశాక కొన్ని మందులిచ్చారు. బీపీ మాత్రల్లేవని చెప్పడంతో.. బయట కొనాల్సి వచ్చింది.

☛ మొయ్యేరుకు చెందిన కృష్ణ వరి కోత కోస్తుండగా.. ప్రమాదవశాత్తు చేతి వేళ్లు తెగిపోయాయి. పూళ్ల పీహెచ్‌సీకి వెళ్లగా.. చికిత్స చేసినానంతరం కొన్ని మందులిచ్చి ఆయింట్‌మెంట్ లేదని సిబ్బంది చెప్పారు. చేసేదేం లేక ప్రైవేట్ దుకాణంలో కృష్ణ ఆయింట్‌మెంట్ కొనుగోలు చేశారు.

☛ శీతాలం కొండేపాడుకు చెందిన తాతేలు జలుబు, తీవ్ర దగ్గుతో పెదనిండ్రకొలను పీహెచ్‌సీకెళ్లారు. అక్కడ రక్త నిర్ధారణ పరీక్ష చేసి.. దగ్గు మందు బయట తీసుకోండని సిబ్బంది సమాధానమిచ్చారు.

# కొన్నే ఇక్కడ.. కొనుక్కోండి అక్కడ !

## పీహెచ్‌సీల్లో వేధిస్తున్న మందుల కొరత

పరిశీలన

**గణపవరం, భీమడోలు, నిడమర్రు గ్రామీణం- న్యూస్‌టుడే:** గ్రామీణులకు వైద్య సేవలందించడంలో కీలక పాత్ర పోషిస్తోన్న పీహెచ్‌సీల్లో మందుల కొరత వేధిస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకెళ్తుంటారు. అక్కడ పరీక్షలు చేసినానంతరం.. కొన్ని రకాల మందు ల్లేవని సిబ్బంది చెబుతుండటంతో.. నిరాశగా వెనుతిరుగుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అధిక మొత్తం వెచ్చించి ప్రైవేట్ దుకాణాల్లో కొంటున్నారు. మూణ్నెల్లుగా సమస్య వేధిస్తున్నా.. పరిష్కారానికి వైద్యారోగ్య శాఖాధికారులు చొరవ చూపకపోవడం బాధాకరం.

గణపవరం పీహెచ్‌లో మందులకు వేచి ఉన్న వ్యక్తి

### చలిగాలులతో సతమతం

శీతాకాలం నేపథ్యంలో జలుబు, దగ్గు, జ్వరంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పీహెచ్‌సీలకొచ్చే రోగుల్లో అత్యధికులు వీరే. ఆయా రోగాలకు అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో.. సుమారు రూ.200-300 వెచ్చించి బయట కొంటున్నారు. గణపవరంలో ఆయింట్‌మెంట్‌లు సైతం బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### నెల రోజులుగా పూర్తిగా..

నిడమర్రు మండలం క్రొవ్విడి, బావాయిపాలెం, బువ్వనపల్లి, మందలపర్రు, గుణపర్రు; ఉండి మండలం కలిగొట్ల, ఆరేడు, పాందువ్వ గ్రామాల ప్రజలు గణపవరం ఆసుపత్రికే వస్తుంటారు. మూణ్నెల్లుగా పాక్షికంగా, నెల రోజులుగా పూర్తిగా కొన్ని మందులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'ప్రతిపాదిత మందుల జాబితా పెట్టే క్రమంలో సాంకేతిక సమస్యలు నెలకొన్నాయి. ఈ కారణంగానే మందుల కొరత ఏర్పడింది. గణపవరంలో నెలకొన్న సమస్యను సత్వరమే పరిష్కరిస్తాం' అని పశ్చిమ గోదావరి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని గీతాబాయి తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| ఏలూరు అర్బన్: | 80085 74486 | ఏలూరు టూటౌన్: | 80085 74487 |
| దెందులూరు: | 80085 74535 | పెదపాడు, పెదవేగి: | 80085 74483 |
| భీమడోలు: | 80085 74527 | నిడమర్రు గ్రామీణం: | 97040 21765 |
| ఉంగుటూరు: | 94939 90333 | గణపవరం: | 99480 66777 |

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ? పెదవేగి నుంచి రాట్నాలకుంట కెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ దారిలో ఎక్కడా సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. **- రమేశ్, వాహనదారుడు**

✔ పెదవేగి- రాట్నాలకుంట మార్గంలో సూచికలు ఏర్పాటు చేయిస్తాం. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- శ్రీకర్, ర.భ.శా. డీఈ, ఏలూరు**

## బాగు చేశారు.. కూర్చున్నారు!

ఈనాడు కథనానికి స్పందన

ఏలూరు ఆశ్రమం కూడలిలోని జాతీయ రహదారి పక్కన ఆటోనగర్ వైపు రెండు బస్ షెల్టర్లను ఎట్టకేలకు బాగు చేశారు. 'ఇవి బస్టాపులా.. కూర్చోనేదెలా?' శీర్షికన అక్టోబరు 15న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. బస్ షెల్టర్ల చుట్టుపక్కల మొలిచిన పిచ్చి మొక్కలు తొలగించి ప్లాట్‌ఫాం నిర్మించారు. **- ఈనాడు, ఏలూరు**

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**దుగ్గిరాల(పెదవేగి) న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల విడిది కార్యాలయంలో ఆదివారం ఆయన్ను పలువురు నియోజకవర్గ ప్రజలు కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. చింతమనేని మాట్లాడుతూ.. ప్రాధాన్య క్రమంలో ఆయా అర్జీలన్నింటికీ పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పాడి రైతుల అభ్యున్నతికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది తోడ్పాటునందించాలని ఆదేశించారు. అనంతరం పినకడిమిలో ఇటీవల పాముకాటుకు గురైన పామర్తి యాన్సీ రాణి వైద్య సేవలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల చెక్కు అందజేశారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

**వంగవీటి స్థానం సుస్థిరం.. పెదవేగి(పెదపాడు):** పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. పెదవేగి మండలం ములక్కాయపాడులో ఆదివారం రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సురేశ్, నాయకులు గంగాధరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 3 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి: కొలుసు

**నిడమర్రు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే 3 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పత్తేపురంలో గృహ నిర్మాణ శాఖ నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవం ఆదివారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో రూ.20 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ.. కాలనీకి తాగునీటి వసతి కల్పించాలని కోరారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ.. 2014-19 మధ్య నిర్మించిన ఇళ్లకు రూ.8.5 కోట్ల బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు, నాయకులు నరసింహరాజు, ముత్యాల స్వామి, దొరబాబు, బాబీ రాజు పాల్గొన్నారు. ✦ పత్తేపురంలో రూ.4 కోట్లతో నిర్మించనున్న విద్యుత్తు ఉపకేంద్రానికి మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. ట్రాన్స్‌కో ఎస్‌ఈ సాల్మన్‌రాజు, ఈఈ అంబేడ్కర్, ఏడీఈ భీమశంకరరావు, ఏఈ ప్రసాదరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు తాళాలు అందజేస్తున్న పత్సమట్ల, గన్ని, చిత్రంలో మంత్రి పార్థసారథి

## చదరంగం పోటీల విజేత అనురూప్

**ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక శాంతి నగర్‌లోని పీపుల్ ఫస్ట్ గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం అండర్- 15 జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేశారు. జి.అనురూప్ మోహన్(ప్రథమ), బి.ప్రణీత్(ద్వితీయ), జి.అభిషేక్ అప్పురామ్(తృతీయ), బి.మోక్షిత్(చతుర్థ), ఆర్.తనీశ్(పంచమ) స్థానాల్లో నిలిచారు. జి.యోహాన్, జి.హెచ్.అరుణ పోటీలను పర్యవేక్షించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి నంది దాండి కృష్ణ, ఆర్‌ఎస్ ఎం.కృష్ణ మోహన్, కోశాధికారి రెహమాన్, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సందడే సందడి!

మోతేవారితోట నమస్తే పార్కులో ఉయ్యాల ఊగుతున్న యువకులు

ఏలూరు నగరంలోని పలు ఉద్యానాలు ఆదివారం పిల్లలు, పెద్దలతో సందడిగా కనిపించాయి. ఆహ్లాద వాతావరణంలో ఆటవిడుపుగా మారాయి. మోతేవారితోటలోని నమస్తే, రామచంద్రరావుపేట ఎన్టీఆర్ ఉద్యానాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. పలువురు యువకులు సైతం ఉయ్యాల ఊగుతూ ఆనందంగా గడిపారు. **- న్యూస్‌టుడే, ఏలూరు**

ఆర్.ఆర్.పేట ఎన్టీఆర్ మున్సిపల్ పార్కులో పిల్లల కోలాహలం

## 20 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన, 16న విద్యుత్తు పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, 17న కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి. 18న మహిళలు, 19న రైతులు, గ్రామీణులకు విద్యుత్తు పొదుపుపై అవగాహన కల్పించనున్నారు. 20న ఆయా పోటీల విజేతలకు విద్యుత్తు భవన్‌లో ఎస్‌ఈ సాల్మన్‌రాజు బహుమతులు అందించనున్నారు.

## చుట్టూ చెత్త.. చుట్టుపక్కల చింత!

గణపవరం మండలం పిప్పరలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించడం లేదు. యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై ఇష్టానుసారంగా పడేస్తున్నారు. ఆక్వా చెరువులు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

## మురుగు కదలక.. దుర్గంధం వీడక

నిడమర్రు మండలం మందలపర్రులో పారిశుద్ధ్యం లోపించింది. ప్రాథమిక పాఠశాల సమీప వీధిలో డ్రెయిన్ నిర్మించలేదు. మురుగు రోడ్డు పక్కన ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- న్యూస్‌టుడే, మందలపర్రు(నిడమర్రు గ్రామీణం)**

## ఉంటుందా.. ఊడుతుందా!

నిడమర్రు మండలం చానమిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతి రోజు సుమారు 15 మంది పిల్లలు వస్తుంటారు. ఇక్కడ చిన్నారుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్డి శిథిలావస్థకు చేరింది. తలుపు సైతం దెబ్బతిని ఉంటుందా.. ఊడుతుందా అన్న స్థితికి చేరింది. **- న్యూస్‌టుడే, చానమిల్లి (నిడమర్రు గ్రామీణం)**

## నీటి వృథా.. పట్టని వ్యధ

పెదవేగి మండలం కూచింపూడి పాఠశాల వెనుక మంచినీటి పైపులైన్ దెబ్బతింది. నీరు వృథాగా రోడ్డుపైకి చేరి నిలిచిపోతోంది. ఫలితంగా తాగునీరు కలుషితమవుతోంది. దీన్ని తాగి అనారోగ్యం బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, కూచింపూడి(పెదవేగి)**

## పడిందా గేటు.. ఓపిక నశించేటట్టు!

ఏలూరు నగరం పవరుపేటలోని రాజీవ్ స్వేప్ వారధి మరమ్మతుల నేపథ్యంలో.. వాహనదారులు నరకం చూస్తున్నారు. పవరుపేట రైల్వే గేటు మీదుగా పలు ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సి వస్తుండటంతో.. గేటు పడినప్పుడల్లా చోదకులు ఎండలోనే నిరీక్షించాల్సి వస్తోంది. **- న్యూస్‌టుడే, పవరుపేట(ఏలూరు నగరం)**

## కొల్లేరు ప్రజల వలసబాట: కొఠారు

**దెందులూరు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వ హయాంలో కొల్లేరు లంక గ్రామాల ప్రజలకు ఉపాధి లేక వలస వెళ్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆరోపించారు. ఏలూరు నగరంలోని విడిది కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉండి.. కొల్లేరు గ్రామాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. దెందులూరు నియోజకవర్గంలో 12 వేల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ కాలేదన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో 52 వేల సంతకాలు సేకరించామని, వీటిని త్వరలోనే తాడేపల్లి వైకాపా కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌కు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# కొంగొత్త సొబగులు!

ఎట్టకేలకు గుంతల రోడ్లకు మోక్షం

● ఏలూరు గ్రామీణ మండలం మాదేపల్లి నుంచి కాట్లంపూడి వరకు ప్రధాన రహదారిని రూ.1.13 కోట్లతో నిర్మించిన దృశ్యమిది. మాదేపల్లి నుంచి జాలిపూడి, చాటపర్రు మీదుగా లంక గ్రామాలు, చాటపర్రు కొమడవోలు మీదుగా ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఉపయుక్తంగా మారింది. మల్కాపురం సమీప కొమడవోలు ఇందిరమ్మ కాలనీ అప్రోచ్ రోడ్డుకు రూ.73 లక్షలు మంజూరయ్యాయి.

● దెందులూరు మండలం చల్ల చింతలపూడి నుంచి కండ్రిగ నరసింహాపురం వయా తిమ్మనగూడెం వరకు 2.5. కి.మీ.ల రహదారి ఏర్పాటుకు రూ.1.38 కోట్లు, జాతీయ రహదారి నుంచి ఉండ్రాజవరం 2.13 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.1.17 కోట్లు విడుదలయ్యాయి.

● పెదవేగి మండలం విజయరాయి నుంచి సూర్యారావుపేట కి.మీ. మేర రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు, దుగ్గిరాల నుంచి చుట్టగుంట వరకు 3.65 కి.మీ. రహదారి ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. పెదపాడు నుంచి వట్లూరు వరకు 6.79 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.3.74 కోట్లు విడుదలయ్యాయి.

**దెందులూరు, ఏలూరు గ్రామీణ- న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులకు కొత్త సొబగులు చేకూరుతున్నాయి. అయిదేళ్ల పాలనలో వైకాపా సర్కారు పల్లె దారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కొత్త రోడ్లు నిర్మించకపోగా.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులూ చేయలేదు. ఫలితంగా ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారులు మెరుగుపడుతున్నాయి. ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు చేపట్టారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు, పెదవేగి, ఏలూరు గ్రామీణ, దెందులూరు మండలాల్లోని పలు రహదారులు అభివృద్ధి చేశారు.

## సుధారాణి నియామకంపై హర్షం

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** కేంద్ర సమాచార కమిషనర్‌గా ఏలూరుకు చెందిన రేలంగి సుధారాణిని నియమించడంపై పలువురు నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు. తెదేపా నాయకుడు ఎరుకల సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం పెట్రోలియం సహజ వాయువుల రెగ్యులేటర్ కమిటీ సభ్యురాలిగా ఉన్న ఆమెను సమాచార శాఖ కమిషనర్‌గా నియమిస్తూ ప్రధాన మంత్రి నేతృత్వంలోని నియామక కమిటీ సిఫార్సు చేయడం ఆనందంగా ఉందన్నారు. సమర్థురాలైన సుధారాణి ఏ పదవిలోనైనా రాణించగలరని ఆయన పేర్కొన్నారు.

## చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** స్థానిక విజయగార్డెన్స్ నెహ్రూ కాలనీకి చెందిన నీలాటి గౌరీశంకర్(37) సెంట్రింగ్ పనులు చేస్తుంటారు. ఈ నెల 9న పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో గుడివాడ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలోని వట్లూరు సమీపంలో వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గౌరీ శంకర్‌ను సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

**కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం కడకట్ల ప్రాంతానికి చెందిన చేపల బాలు, సిర్రా చరణ్, గెడ్డం జగన్ వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్లారు. రాత్రి తిరిగి గూడేనికి వస్తుండగా.. మార్గం మధ్యలోని కైకరం వద్దకు వచ్చే సరికి వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో ముగ్గురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

## యువకుడికి గాయాలు

**గణపవరం:** సరిపల్లెకు చెందిన శింగంపల్లి కిశోర్ ఆక్వా సాగు చేస్తుంటారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై చెరువు వద్దకెళ్లారు. తిరిగి ఇంటికొస్తుండగా.. భీమవరం నుంచి గణపవరం వైపు వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## పోలీసులకు అనుమానితుల అప్పగింత

**ఉంగుటూరు:** తిమ్మయ్యపాలెంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని స్థానికులు పట్టుకుని చేబ్రోలు పోలీసులకు అప్పగించారు. ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి గ్రామ సమీప కొత్తగూడెం ఆయిల్‌పామ్ తోటలో పెంచుతున్న పందెం కోళ్లు చోరీకి గురయ్యాయి. ఈ ఏడుగురు కోడి పుంజులను ఎత్తుకెళ్లి ఉండొచ్చన్న అనుమానంతో.. వారిని పోలీసులకు అప్పగించారు.

## 15 మంది జూదరుల అరెస్టు

**ఏలూరు నేరవార్తలు:** స్థానిక ఆర్ఆర్ పేటలోని ఓ డార్మెంటరీలో జూదమాడుతున్నారన్న సమాచారంతో.. రెండో పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. 15 మందిని జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.52,233 స్వాధీనం చేసుకున్నారు. చొదిమెళ్లకు చెందిన రవికుమార్ జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**భీమడోలు:** కురెళ్లగూడెంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పది మంది జూదరులను అదుపులోకి తీసుకొని.. వారి వద్ద నుంచి రూ.8,100 స్వాధీనం చేసుకున్నారు.

## మధ్యాహ్నపువారిగూడెంలో చోరీ

**టి.నరసాపురం:** మధ్యాహ్నపువారిగూడేనికి చెందిన దొరబాబు మూడు నెలల కిందట వ్యవసాయ పనుల కోసం జీలుగుమిల్లి మండలం అంకంపాలెం వెళ్లారు. ఈ నెల 11న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో రేకు పెట్టెలో ఉన్న రూ.65 వేల రూపాయలు విలువైన వెండి వస్తువులు, 90 వేల విలువైన బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. ఆ మరుసటి రోజు గమనించిన బాధితుడి తండ్రి సోమరాజు ఇచ్చిన ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి రాజు తెలిపారు.




(c) eenadu

# పోలవరం

•పోలవరం •చింతలపూడి


## గుబ్బల మంగమ్మకు నైవేద్యాలు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

## పట్టిసీమకు భక్తుల తాకిడి

**పోలవరం, న్యూస్‌టుడే:** పట్టిసీమలోని గోదావరి మధ్యలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు కార్లు, ద్విచక్ర వాహనాలపై తరలి రావడంతో రేవు కళకళలాడింది. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

## ఘనంగా హనుమద్ హోమం

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టిన పూజాది కాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చదరంగం పోటీల విజేత అనురూప్

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక శాంతి నగర్‌లోని పీపుల్ ఫస్ట్ గ్లోబల్ స్కూల్లో ఆదివారం అండర్- 15 జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని.. ఎత్తుకు పైఎత్తు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేశారు. జి.అనురూప్ మోషె(ప్రథమ), బి.ప్రణీత్(ద్వితీయ), జి.అభిషేక్ అవుహమ్(తృతీయ), బి.మోక్షిత్(చతుర్థ), ఆర్.తనీశ్(పంచమ) స్థానాల్లో నిలిచారు. జి.యోహాన్, జి.హెచ్.అరుణ పోటీలను పర్యవేక్షించారు.

## సత్తా చాటి.. బహుమతి గెలిచి..

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలలో భాగంగా స్థానిక సూర్య జూనియర్ కళాశాలలో శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌లో జరిగిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్.రామదుర్గ, పి.శ్రావణి, ఎం.గాయత్రి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి కళాశాల అధినేత ఈడా సూర్యచంద్ర శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అశోక్ బహుమతులు అందజేశారు.

గెలుపొందిన విద్యార్థులతో సూర్య విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు

## ఇవేనా రైతు సేవా కేంద్రాలు?

● పునాదులు దాటని నిర్మాణాలు ● పట్టించుకోని అధికారులు

**బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, న్యూస్‌టుడే:** మన్యం గ్రామాల్లో చేపట్టిన రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాలు పలు చోట్ల పూర్తయ్యేందుకు నోచుకోక వెక్కిరిస్తున్నాయి. గత ప్రభుత్వం వీటిని పూర్తి చేసేందుకు తీవ్ర నిర్లక్ష్యం చేసింది. పనులు చేసిన మేరకు బిల్లులు చెల్లించేందుకు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు ఎక్కడికక్కడ వదిలేసి చేతులెత్తేశారు. అప్పట్లో ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవనానికి రూ.21.80 లక్షలు మంజూరు చేశారు. ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో పనులు చేపట్టారు. 'ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.' అని డీఈ ఎం.శ్రీనివాసు తెలిపారు.

**బుట్టాయగూడెం** మండలం కోటనాగవరంలో చేపట్టిన రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం పునాదుల స్థాయిలోనే నిలిచిపోయింది. ఆ ప్రదేశం అంతా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. భవనం పూర్తి కాక గ్రామంలోని గ్రామ సచివాలయంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.

**పోలవరం** మండలం పట్టిసీమలో చేపట్టిన భవన నిర్మాణ పనులు పునాదులు తీసి, కాలమ్స్ నిలబెట్టే వరకు జరిగాయి. ఆ తరుణంలో పనులు చేపట్టిన స్థలం తనకు చెందినదని స్థానికుడు కోర్టుకు వెళ్లడంతో నిర్మాణం నిలిచిపోయింది. అప్పటి నుంచి ఈ అంశం కోర్టులో నడుస్తోంది. మారుమూల గ్రామం గెడ్డపల్లిలో పునాదుల వరకు పనులు చేశారు. గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేక నిర్మాణ సామగ్రిని చేరవేయడం కష్టం కావడంతో గుత్తేదారు చేతులెత్తేశారు.

**వేలేరుపాడు** మండలం రామవరంలో చేపట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రైతు సేవా కేంద్రాన్ని చాలీచాలని అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు.


10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..

జంగారెడ్డిగూడెం: 80085 74478

కొయ్యలగూడెం: 80085 74947

చింతలపూడి: 76759 19086


**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** ? యూనియన్ బ్యాంకు దారిలో పంచాయతీ కార్యాలయం కూడలి వద్ద శ్లాబ్‌లో కలిపే రాళ్ల(మెటల్ చిప్స్) గుట్టతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- పార్థు, కన్నాపురం**

✔ చర్యలు తీసుకుంటాం. **- జగదీశ్ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి**

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** ? చింతలపూడి మండలం రేచర్ల గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నుంచి యర్రగుంటపల్లి, మద్దిమత్తినగూడెం, అల్లిపల్లి, సీతానగరం వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారింది. బాలావారిగూడెం వెళ్లే రోడ్డు మరింత దారుణంగా ఉంది. **- రాయప్ప, రైతు, చింతలపూడి**

✔ ప్రధాన రహదారుల మరమ్మతులు, నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే అన్ని రహదారులు మరమ్మతులు చేస్తాం. **- శ్రీకర్, డీఈ, ఆర్‌అండ్‌బీ**

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** ? చింతలపూడి పట్టణం ప్రధాన రహదారి వెంబడి పశువులు సంచరిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. **- ఖాదర్‌వలీ, స్థానికుడు**

✔ పశువుల యజమానులకు నోటీసులు ఇస్తాం. స్పందించకుంటే గోశాలకు తరలిస్తాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

? కొవ్వురిగూడెం ప్రధాన రహదారి మొత్తం గుంతలు పడి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. **- కాంతారావు, సామాజిక కార్యకర్త**

✔ రహదారికి మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం. **- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

## వైద్య శిబిరానికి స్పందన

**చింతలపూడి, న్యూస్‌టుడే:** తెదేపా నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావుకు చెందిన జీవీఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శివాపురంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మణిపాల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలకు చెందిన వైద్యులు శిబిరంలో సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డీఐజీ విజయానంద్, తెదేపా మండలాధ్యక్షుడు చింతం విష్ణు, చింతలపూడి పట్టణ అధ్యక్షుడు తాటి అప్పారావు, మాటూరి వెంకట్రామయ్య, చిట్లూరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

## శాస్త్రీయ విద్యా విధానం అమలుకు పోరాటం

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** శాస్త్రీయ విద్యా విధానం అమలుకు పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో జిల్లా విద్యా వైజ్ఞానిక తరగతులను ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాన్ని మార్చుకోవాలన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడిగా కాకి నాని, ప్రధాన కార్యదర్శి బి.వినోద్‌కుమార్‌తో పాటు మరో 11 మంది సభ్యులతో పీడీఎస్‌యూ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం తదితరులు పాల్గొన్నారు.

## 'పల్లె పల్లెకు మన ఎమ్మెల్యే చిర్రి'

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు 'పల్లె పల్లెకు మన ఎమ్మెల్యే చిర్రి' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం అంకన్నగూడెం, రాచన్నగూడెం పంచాయతీ గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న జనార్దన్

## సమస్యలు అధిగమించేందుకు సంఘటితం కండి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** దేశ విభజన కాలం నుంచి నేటివరకు హిందూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి హిందువులంతా సంఘటితం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ ప్రచారక్ జనార్దన్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని కె కన్వెన్షన్ హాల్‌లో హిందూ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సమాజంలోని అన్ని రంగాల్లోని వారితో కలిసి పనిచేస్తోందన్నారు. హయగ్రీవ లలిత పీఠం వ్యవస్థాపకులు దుర్గ బాబు, దాకారపు కృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో.. ఉపాధి బాటలో..

### ఆర్థికాభివృద్ధి దిశగా గిరిజన మహిళలు

**కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే:** ఆదివాసీల అభివృద్ధి కోసం కేంద్రం అమలు చేస్తున్న వన్‌ధన్ వికాస కేంద్రాలు వారి ఉపాధికి బాటలు వేస్తున్నాయి. ఐటీడీఏ కేఆర్‌పురం పరిధిలోని పోలవరం మండలం గెడ్డపల్లి పంచాయతీకి చెందిన గెడ్డపల్లి, తంగేడు కొండ, గిన్నెపల్లి, ధార్వాడ, చెలుకలూరు, చీమలూరు గ్రామాల కొండరెడ్డి మహిళలు సభ్యులుగా అభినవ వన్‌ధన్ వికాసకేంద్రం ఏర్పాటైంది. అటవీ ఉత్పత్తుల విక్రయాలతో మహిళలు ఆర్థిక స్వావలంబనకు సంఘం చేయూతగా నిలుస్తోంది. కన్నాపురంలో దాత కానుమిల్లి వెంకట నరసమ్మ పేరున ఏర్పాటైన మహిళా సేవాసదనం ఖాళీగా ఉండటంతో అధికారుల సూచన మేరకు ఈ కేంద్రం అక్కడ కొనసాగుతోందని వెలుగు ఏపీడీ రాజాబాబు తెలిపారు.

**అడ్డాకులను తీసుకొస్తాం..**

అడవిలో దొరికే అడ్డాకులను సేకరించి బుధవారం సంతకొచ్చినప్పుడు వారానికోసారి తీసుకొచ్చి కేంద్రంలో అప్పగిస్తాం. ఆకు ముమ్మరంగా దొరికినప్పుడు ఆదాయం బాగుంటుంది. **- కెచ్చెల బుల్లమ్మ, గెడ్డపల్లి**

**కుట్టడం నేర్చుకున్నాం..**

అడ్డాకులను ఆరబెట్టి సిద్ధం చేశాక యంత్రంపై విస్తరిగా కుట్టడం నేర్చుకున్నాం. విస్తరాకులు అట్టలపై అంటుకునేలా యంత్రంపై ఒత్తడం తెలుసుకున్నాం. పనులు లేని సమయంలో విస్తరాకుల పనులు ఆదుకుంటున్నాయి. **- సొంట్రు ఈశ్వరి**

**దారులు బాగోలేక ఇబ్బంది పడుతున్నాం**

కొండలపైనున్న గ్రామాల నుంచి కిందకు దిగి దూరం ప్రయాణించి రావాలి. దారులు బాగోలేవు. వాహనాలు తిరగవు. ఇబ్బంది పడుతున్నాం. 15 గ్రూపుల నుంచి 150 మంది వరకు కేంద్రంలో సభ్యులుగా ఉన్నాం. అడవుల్లో అడ్డాకులతో పాటు మిగిలిన ఉత్పత్తులను సేకరిస్తాం. ఐటీడీఏ అధికారులు, ప్రభుత్వ ఆఫీసుల్లో కార్యక్రమాలకు మా దగ్గర తయారైన ఆకులనే తీసుకెళ్తారు. బయట మార్కెట్‌లోకి విస్తర్లను తీసుకెళ్లి అమ్మాలని అనుకుంటున్నాం. **- చుండ్రు శారద, సర్పంచి, గెడ్డపల్లి, కేంద్రం అధ్యక్షురాలు**

**డిమాండ్ బాగుంది..**

కలెక్టరు వెట్రిసెల్వి ప్రోత్సాహంతో ఐటీడీఏ పీవో, ఇతర అధికారులు మా కేంద్రానికి అవసరమైన సూచనలు అందిస్తున్నారు. ఉమర్ ఆలీషా ట్రస్టు, ఐటీడీఏ అధికారుల సహకారంతో మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాం. విస్తరాకుల సరఫరాకు డిమాండ్ బాగుంది. **- సోదెం మంగమ్మ, శిక్షకురాలు**

## గుంతలు పడి.. ప్రమాదకరంగా మారి

చింతలపూడి పట్టణం మినీ బైపాస్ శివారు గురుభట్లగూడెం ప్రధాన రహదారి మలుపులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వాహనాలు వస్తే తప్పించడానికి ఇబ్బంది పడుతున్నాం. గుంతలతో ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని చోదకులు వాపోతున్నారు. 'ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు పూడ్చి సమస్య పరిష్కరిస్తాం.' అని ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీకర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, చింతలపూడి పట్టణం**

## యంత్రం పొలంలో.. ధర అందనంత దూరంలో..

### వరి కోత మిషన్ల నిర్వాహకుల ఇష్టారాజ్యం

'చింతలపూడి మండలం ఉర్లగూడెం పంచాయతీకి చెందిన పి.రత్నం మూడెకరాల్లో వరి సాగు చేశారు. మూడు ఎకరాల్లో వరి కోత యంత్రంతో కోత కోయిస్తే గంటకు రూ.4,000 రైతు వద్ద నుంచి వసూలు చేశారు. మూడెకరాలకు రూ.12వేలు ఖర్చయింది. గతేడాదితో పోలిస్తే ధర భారీగా పెంచారని రైతు వాపోతున్నారు.

**చింతలపూడి, న్యూస్‌టుడే:** వరికోత యంత్రాల నిర్వాహకుల దోపిడీ అన్నదాతకు గుండెకోత మిగులుస్తోంది. పెరిగిన పెట్టుబడి భారంతో నలిగిపోతున్న రైతన్నను ఈ పరిణామం గోరుచుట్టుపై రోకటి పోటులా వేధిస్తోంది. దిత్వా తుపాను, కోతల ఎద్దడిని ఆసరాగా తీసుకుని రేటు భారీగా పెంచి వరి రైతుల వెన్ను విరుస్తున్నారు. ధరలు క్రమబద్ధీకరించే వ్యవస్థ లేకపోవడంతో నష్టపోతున్నారు.

చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్‌లో మొత్తం 30,900 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వరి దిగుబడులు బాగా వచ్చాయి. వర్షాలు అనుకూలంగా పడటంతో ఎకరాకు సుమారు 35 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. సబ్‌డివిజన్‌లో ఇప్పటికే 80 శాతం కోతలు పూర్తయ్యాయి. నిరుడు కోత యంత్రానికి గంటకు రూ.3 వేలు తీసుకున్నారు. తుపానుకు ముందు డిమాండ్ పెరగడంతో గంటకు రూ.4,500 వసూలు చేశారు. తుపాను తర్వాత అందరూ కోతలు మొదలు పెట్టగా.. ఎద్దడిని బూచిగా చూపి రూ.3,700-రూ.4,000 వసూలు చేస్తున్నారు.

**సబ్ డివిజన్‌లో ఇలా..**

| మండలం | ఎకరాలు |
|---|---|
| చింతలపూడి | 17,400 |
| లింగపాలెం | 7,500 |
| కామవరపుకోట | 3,500 |
| టి.నరసాపురం | 2,500 |

**పెరిగిన కూలీల ఖర్చు**

ఇదే అదనుగా కూలీలు కొండెక్కి కూర్చున్నారు. ఎకరాకు కోత కోసి, కుప్ప వేసి, ధాన్యం తీస్తే రూ.15వేలకు పైగా వసూలు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనంగా పెట్టుబడి వ్యయం పది శాతం పెరిగింది. వరి కోత యంత్రం చేరుకోలేని చోటకు కూలీలతోనే కోతలు కోయించాల్సిన పరిస్థితి. కూలీల ఖర్చు కూడా గతంతో పోలిస్తే బాగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతుకు మద్దతు ధర ఏటా పెంచుతున్నా.. అంతకుమించి పెట్టుబడి వ్యయం పెరుగుతుంటంతో వరి పంట నష్టదాయకంగా మారుతోంది.

## కల్వర్టుపై గొయ్యి

దిప్పకాయలపాడు, కిచ్చప్పగూడెం మార్గంలో తూర్పుకాలువ పైపు కల్వర్టు కాంక్రీట్ అప్రోచ్ ఇటీవల వరదలకు కుంగి పెద్ద రంధ్రం పడింది. వరద తాకిడికి అడుగున మట్టి కొట్టుకుపోయి అగాధంలా ప్రమాదకరంగా మారింది. స్థానికులు కర్రను సూచికగా ఏర్పాటు చేసి గొయ్యి చుట్టూ రాళ్లు అమర్చి వాహన చోదకులను అప్రమత్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ**

## పని చేస్తున్నాం.. పస్తులుంటున్నాం..

### ఏళ్లుగా జీతాలు రాక.. లస్కర్ల ఇబ్బందులు

ఎర్ర కాలువ జలాశయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** '2015లో లస్కర్‌గా ఉద్యోగంలో చేరా. మూడేళ్లుగా జీతాలు పడటంలేదు. బయట అప్పులు తెచ్చి కుటుంబాన్ని పోషించాల్సి వస్తోంది. అప్పుల భారం పెరిగి ఇంటిని అమ్ముకునే స్థాయికి వచ్చా.' అని డి.గాంధీలాల్ వాపోయారు. ఇదీ ఆయన ఒక్కరి బాధే కాదు.. జిల్లాలోనే మధ్యతరహా ప్రాజెక్టుగా పేరొందిన జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్ర కాలువ జలాశయంలో పని చేసే లస్కర్ల ప్రస్తుత దుస్థితి. వరదలు, ఇతర విపత్కర పరిస్థితుల్లో సైతం విధులు నిర్వర్తిస్తూ.. ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షిస్తున్న లస్కర్లు, ఇతర సిబ్బందికి ఏళ్ల తరబడి జీతాలు పడకపోవడంతో వారు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రూ.25 లక్షలకు పైగా బకాయిలు ఉండటంతో చేస్తున్న ఉద్యోగం వదలలేక.. కొత్త పనులకు వెళ్లలేక సిబ్బంది కాలం వెళ్లదీస్తున్నారు.

**40 నెలలుగా..** ఎర్ర కాలువ ప్రాజెక్టు పరిధిలో పనిచేయడానికి 2015లో ఆరుగురిని ఎన్‌ఎంఆర్‌లు (నామినల్ మస్టర్ రోల్)గా విధుల్లోకి తీసుకున్నారు. ప్రాజెక్టు హెడ్ ఆఫ్ ది అకౌంట్ ద్వారా ఏటా ప్రాజెక్టు నిర్వహణకు సుమారు రూ.20 లక్షల మేర నిధులు రావడంతో వాటి నుంచి లస్కర్‌కు రూ.16,500, వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు రూ.18,800 జీతాలను అధికారులు చెల్లించేవారు. గత వైకాపా హయాంలో 2022 నుంచి నిధులను నిలిపేయడంతో సిబ్బందికి 40 నెలలుగా జీతాలతో పాటు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు లేకుండా పోయాయి. అయితే ఈ ఏడాది ఆగస్టులో కేవలం రెండు నెలల జీతాల బకాయిలు మాత్రమే సిబ్బంది ఖాతాల్లో జమ చేశారు. మొత్తం 15 మంది ఉండాల్సింది.. ప్రస్తుతం ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. అందులో జీతాలు రాకపోవడంతో ఒకరు ఇటీవల ఉద్యోగాన్ని మానేశారు. దీంతో జలాశయం, కాలువల నిర్వహణ బాధ్యత కష్టతరమవుతోంది. 'ఎన్‌ఎంఆర్ సిబ్బంది జీతాల బకాయిలు విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.' అని జలవనరులశాఖ డీఈ సునీత తెలిపారు.

## పోలవరాన్ని కొత్త జిల్లాలో కలపాలి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** నూతనంగా ఏర్పాటు చేయనున్న జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ బుట్టాయగూడెం మండలం చెంచుగూడెం, ఇనుమూరు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి పలు నినాదాలతో నిరసన కొనసాగించారు. ముంపు మండలాలు, పునరావాస కాలనీలు ఉన్న పోలవరం నియోజకవర్గాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న జిల్లాలో చేర్చకపోవడం సరికాదని పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ వాపోయారు. జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

## ఆర్థిక సాయం అందజేత

**వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఇటీవల రామవరంలో హన్సిక్, వేలేరుపాడులో సురేశ్ మృతి చెందారు. వారి కుటుంబాలకు వేలేరుపాడు తెదేపా, సీపీఐ నాయకులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్, సీపీఐ సీనియర్ నాయకుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** లక్కవరం తెదేపా సీనియర్ నాయకుడు కొఠారి దొరబాబు ఆర్థిక సాయంతో లక్కవరంలోని 150 మంది వృద్ధులు, వికలాంగులు, పేదలకు తెదేపా గ్రామ నాయకులు ఆదివారం దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో నాయకులు పాకలపాటి ప్రసాద్, టీవీబీఏ గోపాలరావు, చెరుకూరి సురేశ్, కొండ్రెడ్డి సోమరాజు, కొదమ మంగరాజు, ఆరుగొల్లు బజారు, రంగ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభల విజయవంతానికి పిలుపు

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** విశాఖపట్నంలో వచ్చే నెల 4న జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో కార్మికసంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు విజ్ఞప్తి చేశారు. యర్రంపేటలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభల గోడపత్రికలు ఆవిష్కరించారు.

## మానసిక ఆందోళన లేకుండా చదవండి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థులు మానసిక ఆందోళన చెందకుండా నాణ్యమైన విద్యనభ్యసించి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవాలని మానసిక ఆరోగ్య జిల్లా కౌన్సిలర్లు ఎం.సుధీర్‌కుమార్, పి.ప్రేమ్, పి.కవిత అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్యం ఆధారిత చదువును ప్రతి విద్యార్థి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రెయిన్లు లేక.. ఉండలేక..

మండలంలోని యర్రబోరు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయినేజీ వ్యవస్థ లేక.. మురుగు ఇళ్ల మధ్య నిలిచి దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి పలుమార్లు మండల పరిషత్తు కార్యాలయంలో వినతులు ఇచ్చినా. . ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ**

## రైతుకు విద్యుదాఘాతం

**పోలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని బోడిగూడెం గ్రామానికి చెందిన పి.పోశయ్య ఆదివారం సాయంత్రం పొలంలోకి ఇనుప పైపు తీసుకు వెళ్తుండగా. . 11 కేవీ లైన్ తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు.

## ప్రమాదంలో ఒకరికి గాయాలు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** ముప్పినవారిగూడెం సమీపాన ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆటో ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న పోలవరానికి చెందిన రామకోటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని 108లో బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి జంగారెడ్డిగూడెం తీసుకెళ్లారు. గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. ఆయన ఈ ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు.

## అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

**కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం కడకట్ల ప్రాంతానికి చెందిన చేపల బాలు, సిర్రా చరణ్, గెడ్డం జగన్ వ్యక్తిగత పనుల నిమిత్తం శనివారం ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్లారు. రాత్రి తిరిగి గూడేనికి వస్తుండగా. . మార్గం మధ్యలోని కైకరం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో ముగ్గురు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

## మధ్యాహ్నపువారిగూడెంలో చోరీ

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** మధ్యాహ్నపువారిగూడెంలోని ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన గుమ్మల్ల దొరబాబు మూడు నెలల కిందట వ్యవసాయ పనుల కోసం జీలుగుమిల్లి మండలం అంకంపాలెం వెళ్లారు. ఈ నెల 11న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో రేకు పెట్టెలో ఉన్న రూ.65 వేల రూపాయలు విలువైన వెండి వస్తువులు, 90 వేల విలువైన బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. ఆ మరుసటి రోజు గమనించిన బాధితుడి తండ్రి సోమరాజు ఇచ్చిన ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి రాజు తెలిపారు.

## జూద శిబిరంపై దాడి

**చింతలపూడి, న్యూస్‌టుడే:** మండలంలోని చింతంపల్లి గ్రామంలో జూద శిబిరంపై ఆదివారం దాడి చేసి రూ.4,200 నగదుతో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

(c) eenadu

# నూజివీడు

• నూజివీడు • కైకలూరు

## సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న అప్పారావు

**మండవల్లి, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ తెంటు అప్పారావు అన్నారు. మండవల్లిలో ఆదివారం ఐక్యవేదిక నాయకులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం గురించి అవతగతమయ్యేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఐక్యవేదిక మండలాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, అర్జునరావు, శ్రీనివాస్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దింట్లమ్మకు విశేష పూజలు

**కైకలూరు, న్యూస్‌టుడే:** కొల్లేటికోటలో కొలువుదీరిన మత్స్యకారుల ఆరాధ్య దైవం పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానానికి భక్తులు బారులు తీరారు. ఆదివారం కావడంతో ఉభయ జిల్లాలు, విశాఖపట్నం, ఒడిశా, తెలంగాణ నుంచి విచ్చేసిన భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో పెద్దింట్లమ్మకు పలు రకాల అభిషేకాలు, పూజలు, సాయంత్రం పంచ హారతుల సేవ వైభవోపేతంగా చేశారు. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

| | | | |
|---|---|---|---|
| నూజివీడు | :80085 74698 | ఆగిరిపల్లి: | 9121229090 |
| ముసునూరు | :93983 81268 | చాట్రాయి: | 8008574700 |
| కైకలూరు | :73060 88555 | మండవల్లి: | 8106099008 |
| కలిదిండి | :90594 84862 | ముదినేపల్లి: | 8008574693 |

**ముసునూరు, న్యూస్‌టుడే:** ? ముసునూరు మండలం చింతలవల్లి ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. **-సాయికుమార్, చింతలవల్లి**

✔ డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి నీరు పోయేందుకు చర్యలు తీసుకుంటాం. **- నీరజ, కార్యదర్శి**

**కైకలూరు, న్యూస్‌టుడే:** మండలంలోని పందిరిపల్లెగూడెం నుంచి కొల్లేటికోట వెళ్లే మార్గంలో పంచాయతీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని స్థానికుడు లక్ష్మీనారాయణ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెలగని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

స్పందనకు వందనం

**కైకలూరు, న్యూస్‌టుడే:** మండలంలోని రామవరం ఆర్‌సీఎం చర్చి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని గ్రామస్థుడు బెనర్జీ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన మురుగునీరు మళ్లించి సమస్యను పరిష్కరించారు.

## శ్రామికులకు మరింత ఉపాధి

### 100 నుంచి 125కు పనిదినాల పెంపు

**నూజివీడు, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రస్తుతం అమల్లో ఉన్న కుటుంబానికి ఏడాదికి 100 పని దినాలను 125కి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇది శ్రామికులకు వరం కానుంది. ఇంటి పట్టునే ఉపాధి, వలసల నివారణకు ఉద్దేశించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం(నరేగా) పూజ్య బాపూ గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మారింది. రోజువారీ కనీస వేతనాన్ని సవరించడంతో స్వల్పంగా పెరుగుదల ఉండనుంది.

**కుటుంబాలకు వెన్ను దన్నుగా..** పని దినాల పెంపుతో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన వేలాది కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. వ్యవసాయం, ఉద్యాన పంటలకు పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, కూలీలకు ఎంతో మేలు జరగనుంది. నియోజకవర్గంలో పథకం కింద జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, పాడి పోషకులకు వెన్నుదన్నుగా గోకులాల నిర్మాణం, మ్యాజిక్ డ్రెయిన్లు, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాలు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోజుకు శ్రామికుల గరిష్ఠ వేతనం రూ.307 కాగా జిల్లాలో సగటున రూ.280 పొందుతున్నారు.

**నియోజకవర్గ సమాచారం..**

| మండలం | శ్రామికులు | పాల్గొనేవారు |
|---|---|---|
| నూజివీడు | 24,870 | 18,980 |
| ఆగిరిపల్లి | 22,752 | 17,761 |
| ముసునూరు | 26,383 | 23,150 |
| చాట్రాయి | 23,722 | 18,696 |

**సంఖ్య పెరుగుతుంది**

వంద రోజుల పని దినాల్ని 125 రోజులకు పెంచడంతో ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకునే శ్రామిక కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది
**- శ్రీనివాస్, ఏపీడీ, డ్వామా, నూజివీడు.**

## ఘనంగా హనుమద్ హోమం

**జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టిన పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఆర్వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

## కళలకు జీవం పోస్తున్నారు

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** మరుగున పడుతున్న కళలకు నేటి యువత విద్యార్థులు జీవం పోస్తున్నారని పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణ స్వామి తెలిపారు. ఏక పాత్రాభినయం, నృత్యం వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో యువతీ యువకులు తమ హావభావాలతో పోటీ పడటం అబ్బుర పరిచిందన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో రోటరీ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, తెలుగు వ్యాసరచన, వాలీబాల్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏకపాత్రాభినయాలు నుంచి వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చి ఆకట్టుకున్నారు. విజేతలకు రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షుడు సజ్జా శశికాంత్, కార్యదర్శి మండా శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త బోయపాటి ముఖర్జీ, క్లబ్ సభ్యులు యార్లగడ్డ రాజగోపాల్, మల్లిశెట్టి శ్రీనివాస్, పైడి అనిల్, పీడీ వెంకటరత్నం, సాయి భాస్కర్, సత్యనారాయణ, పేర్ల ప్రశాంత్, పొట్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొని బహుమతులు అందించారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకోసం స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. గురుకుల్ ఆదివారం గుడివాడ రోటరీ క్లబ్, ప్రెస్టీజ్ క్లబ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్, గంజాయి వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు ఉత్సాహంగా గ్రామ వీధుల్లో సైకిల్‌పై నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. గంజాయితో యువత భవిష్యత్తు నాశనం చేస్తున్నారని, మత్తు పదార్థాల వంటివి ఎక్కడైనా విక్రయిస్తుంటే మనకెందుకు అనుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎస్సై వీరభద్రరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, కార్యదర్శి కిరణ్‌బాబు, సైకిల్ క్లబ్ సభ్యులు వంశీ, మాగంటి శ్రీనివాసరావు, వైద్యుడు మనోజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 'అమరావతికి సాయం అందిద్దాం'కు విశేష స్పందన

వైష్ణవిని అభినందిస్తున్న పుష్పవతి దంపతులు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** అమరావతి అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేసేందుకు చిన్న వయస్సులోనే అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అయిన వైష్ణవి ప్రారంభించిన 'అమరావతికి జీవం పోద్దాం.. రూ.116 సాయం చేద్దాం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని గుడివాడకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు మాగంటి శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లిలో ఆదివారం పలువురు వైష్ణవిని కలిసి శాలువా కప్పి అభినందించారు. జనరల్ సర్జన్ పొట్లూరి వంశీకృష్ణ మాట్లాడుతూ వైద్యులుగా కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఐఎంఏ, అన్ని ఆసుపత్రుల్లో గోడపత్రికలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సీఆర్‌డీఏ ఖాతాకు విరాళాలు వేశారు. కృష్ణా జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ శాయన పుష్పవతి దంపతులు, వైద్యుడు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా సాధనకు పోరాడండి: పీడీఎస్‌యూ

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** శాస్త్రీయ విద్యా సాధనకు పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్, ఎం.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం ధర్మప్ప స్మారక భవనంలో జిల్లా విద్యా వైజ్ఞానిక తరగతులను జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై మాట్లాడారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడిగా కాకి నాని, ప్రధాన కార్యదర్శి బి.వినోద్‌కుమార్‌తో పాటు మరో 11 మంది సభ్యులతో పీడీఎస్‌యూ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.భూషణం తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యుల కొరత.. తీరని వెత

మూతపడిన ముసునూరు పశువైద్యశాల

**ముసునూరు, న్యూస్‌టుడే:** వ్యవసాయం గిట్టుబాటు కాని రైతులు.. దాని అనుబంధ రంగమైన పాడి పరిశ్రమను నమ్ముకొని పశు పోషకులుగా జీవిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్యుల కొరత వేధిస్తుండటంతో పశువుల వ్యాధుల బారిన పడినప్పుడు వైద్యులు అందుబాటులో లేక పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో పశు వైద్యుల కొరత వేధిస్తోంది. వైద్యులు ఏళ్ల కిందట బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి శాశ్వత వైద్యులను నియమించకుండా పక్క గ్రామాల నుంచి ఇన్‌ఛార్జులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆ వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సిబ్బందే డాక్టర్ అవతారం ఎత్తాల్సి వస్తోంది. సరైన సమయంలో చికిత్స అందక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఖాళీగా పోస్టులు..** నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో పశుపోషణపై ఆధారపడి జీవించే కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ముసునూరు మండలం గుళ్లపూడి, ముసునూరు గ్రామాల్లో మూడేళ్ల కిందట వైద్యులు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి వైద్యులను నియమించలేదు. ఒక్కో మండలంలో 25 వేలకు పైగా పశు సంపదతో పాటు, 50 వేలకు పైగా మూగజీవాల సంఖ్య ఉంది. ఇటీవల ముసునూరులో పశు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో చికిత్స అందక ఓ రైతు గేదె మృతి చెందింది.

☛ చాట్రాయి మండలం చనుబండ, చిత్తపూరు, చాట్రాయి గ్రామాల్లో పశు వైద్యశాలలు ఉన్నా.. ఒక్కచోట కూడా వైద్యులు లేరు. ఏళ్ల నుంచి పశు వైద్యులను నియమించకపోవడంతో సిబ్బందే సేవలందిస్తున్నారు.

**కైకలూరు నియోజకవర్గంలో..** ముదినేపల్లి మండలంలో 7 పశు వైద్యశాలలు ఉండగా పెద్దగొన్నూరు, ప్రొద్దువాక గ్రామాల్లో పశు వైద్యులు లేరు. ఈ రెండు కేంద్రాలు ముదినేపల్లి గ్రామ పశువైద్యుడు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

★ కలిదిండి మండలంలో సానారుద్రవరంలో నాలుగేళ్ల నుంచి పశువైద్యుడు లేరు. పక్క గ్రామ పశువైద్యుడు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

నియోజకవర్గాల్లో పశు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. వాటి భర్తీకి గతంలోనే ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నియామకాలు చేపడితే ఖాళీల భర్తీకి అవకాశం ఏర్పడుతుంది. ఉన్న సిబ్బందితో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.
**- ప్రసాదరావు, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ**

## కూలేవరకు.. వేచి చూడాల్సిందేనా?

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

**ముసునూరు, న్యూస్‌టుడే:** ప్రజల దాహార్తి తీర్చే తాగు నీటి పథకాల నిర్వహణ గాలికొదిలేయడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ముసునూరు మండలం గోపవరంలో 60 వేలు, గోగులంపాడులో 90 వేలు, యల్లాపురంలో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకులను ఏళ్ల క్రితం నిర్మించారు. అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. ట్యాంకు పైకి ఎక్కేందుకు మెట్లు సైతం విరిగిపోయాయి. ఇనుముతో వేసిన మెట్లు తుప్పు పట్టాయి. స్తంభాలు బీటలు వారి పిల్లర్లు పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో వీటిని శుభ్రం చేయడం కూడా చాలాచోట్ల మానేశారు. వాటి స్థానే కొత్త ట్యాంకులను నిర్మించేందుకు కార్యాచరణ లేకపోవడంతో ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ సురేశ్‌ను సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## తాగునీటి చెరువు కల సాకారమయ్యేనా?

**కలిదిండి, న్యూస్‌టుడే :** పది ఎకరాల మంచినీటి చెరువు తవ్వుకోవాలన్న కల సాకారం కోసం కోరుకొల్లు ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ గ్రామంలో 15వేలకుపైగా జనాభా ఉన్నారు. తగిన విస్తీర్ణంలో తాగునీటి వనరులు లేవు. ఈ పంచాయతీ పరిధిలోని ప్రధాన గ్రామంతో పాటు రెండు ఎస్సీ కాలనీలు, మందబయలు కాలనీ, బొబ్బిలిగూడెం, చైతన్యపురం ఉప గ్రామాలు ఉన్నాయి. కోరుకొల్లు రోడ్డు, కలిదిండి రోడ్డులో కొన్ని కుటుంబాలు ఉన్నాయి. అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొంది. ఫిల్టరు బెడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఓవర్‌హెడ్ ట్యాంకులు బలహీనంగా ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తాగునీటి సరఫరా వ్యవస్థ అధ్వానంగా ఉంది. ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కోరుకొల్లులో పర్యటించినప్పుడు గ్రామ పెద్దలు ఈ విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పది ఎకరాల తాగునీటి చెరువు నిర్మిస్తే ఎద్దడి తీరుతుందన్నారు.

## పట్టు జారితే ప్రమాదమే..

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** జీవనోపాధి కోసం నిత్యం ప్రమాదకరంగా వలస కూలీలు ప్రయాణం చేస్తున్నారు.. కుటుంబ పోషణ నిమిత్తం చేపలు, రొయ్యల పట్టుబడి కూలీలుగా వందలాది మంది పనిచేస్తున్నారు. ఏ గ్రామంలో పట్టుబడి ఉన్నా వలలతో పాటు సుమారు 20 నుంచి 30 మంది కూలీలను మినీ వ్యాన్ ట్రక్కులో ఎక్కి ప్రయాణం చేస్తున్నారు. మట్టి రహదారుల్లో సైతం వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో తరచూ కూలీలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో నిత్యం ఇటువంటి వాహనాలు సుమారు 60 నుంచి 80 వాహనాల వరకు కనిపిస్తున్నాయి. వీటిని మాత్రం ఏ అధికారులు పట్టించుకోవడం లేదు.

## వంతెన దాటాలంటే హడలే!

రెయిలింగ్ లేక ప్రమాదకరంగా ఉన్న వంతెన

**ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే:** ఆటపాక కెనాల్ రోడ్డులో నడక వంతెన ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. కాలనీవాసుల రాకపోకలకు వీలుగా పంట కాలువపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. సుమారు 250 కుటుంబాలు నివాసం ఉండే ఈ ప్రాంతంలో ప్రధాన జాతీయ రహదారికి చేరుకునేందుకు ఈ వంతెనే ప్రధాన ఆధారం. వంతెనపై ద్విచక్ర వాహనాలు వచ్చే సమయంలో పాదచారులు తప్పుకొనే వీలు లేకుండా పోయింది. ఇక ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా కాలువలో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ ఈవో ఎం.రవికిరణ్‌ను సంప్రదించగా.. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెయిలింగ్ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వ్యాపారిపై దాడి.. నిందితుడిపై కేసు

**కైకలూరు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో గృహోపకరణాలు విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మోదుగుగుంట గ్రామానికి చెందిన వెంట్రప్రాటి వీర రాఘవులు వాయిదాల విధానంలో ఫర్నిచర్ విక్రయిస్తుంటారు. కొన్నేళ్లుగా కైకలూరు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మండలంలోని దొడ్డిపట్లలో వస్తువులు విక్రయించేందుకు వచ్చారు. గ్రామానికి చెందిన పంచదార నాగమణి కొన్ని వస్తువులు కావాలని అడగ్గా.. పాత బకాయి చెల్లించాలని కోరారు. అక్కడే ఉన్న నాగమణి కుమారుడు రమేశ్ కల్పించుకుని వీర రాఘవులతో గొడవపడి అతని సెల్‌ఫోన్ పగులగొట్టడంతో పాటు దాడి చేసి గాయపరిచాడు. గాయాలతో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితుడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామీణ ఠాణా హెడ్ కానిస్టేబుల్ విజయబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## లాభాల్లో పాడి రైతులకు వాటా

**చాట్రాయి, న్యూస్‌టుడే:** జిల్లా మిల్క్ యూనియన్ లాభాల్లో పాడి రైతులకు నగదును పంపిణీ చేస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని పాల సేకరణ సంఘ అధ్యక్షురాలు మందలపు పద్మావతి తెలిపారు. తుమ్మగూడెం పాల సేకరణ సంఘంలో ఆదివారం సభ్యులకు రూ.2,87,800 పంపిణీ చేస్తూ మిల్క్ యూనియన్ అమలు చేసే రాయితీ పథకాలు వివరించారు. కార్యదర్శి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

తుమ్మగూడెంలో నగదు పంపిణీ చేస్తున్న పద్మావతి

## మురుగుతో అవస్థ

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని పెరికెగూడెం-కొత్తూరు వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై మురుగు నీరు తిష్ఠ వేసింది. స్థానికులు గృహ వినియోగ నీటిని ఇష్టానుసారంగా రోడ్డుపైకి వదులుతున్నారు. నీరు ముందుకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు ఉన్న ప్రాంతమంతా బురద మేట వేయడంతో వాహనదారులు జారుతూ అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు అతి వేగంతో నీటిలో వెళ్లే సమయంలో మురుగు నీరు రోడ్డుపై రాకపోకలు సాగించేవారిపై పడుతోంది. పంచాయతీ ఈవో రాధికను వివరణ కోరగా.. మురుగునీరు బయకుట మళ్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## కాలువ పూడ్చడంపై రైతుల ఆందోళన

గట్టుపై కూర్చుని నిరసన

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** సాగునీరు అందించే కాలువ పూడ్చేయడంపై ఆదివారం మధ్యాహ్నం బంటుమిల్లి మండలం రామవరపు మోడుకు చెందిన రైతులు వైవాకలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పల్లెకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రామవరపుమోడుకు చెందిన రైతులకు వైవాక పరిధిలో 1983లో భూములు పంపిణీ చేశారన్నారు. వాటిని ఏళ్ల నుంచి తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. వాటితో పాటు సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద తుమ్మిడి డ్రెయిన్ నుంచి వచ్చే కాలువను పూడ్చేసి చేపల చెరువు రైతు పది చక్రాల లారీ వెళ్లేలా దారి వేసుకున్నారని తెలిపారు. దీనివల్ల తమ పొలాలకు నీరు అందే పరిస్థితి లేదని, వెంటనే ఆ దారిని తొలగించాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి రైతులతో, చేపల చెరువు యజమానితో మాట్లాడారు. కాలువను పూడ్చి ఏర్పాటుచేసిన దారిని తొలగించడానికి అంగీకరించడంతో ఆందోళన విరమించారు. రైతులు కృపారావు, బొర్రా నరసింహారావు, గూడవల్లి శ్రీనివాసరావు, బడుగు రవి, కట్టా ఆది శేషు, పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం

**చింతలపూడి, న్యూస్‌టుడే:** తెదేపా నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావుకు చెందిన జీవీఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శివాపురంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మణిపాల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలకు చెందిన వైద్యులు శిబిరంలో సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డీఐజీ విజయానంద్, తెదేపా మండలాధ్యక్షుడు చింతం విష్ణు, చింతలపూడి పట్టణ అధ్యక్షుడు తాటి అప్పారావు, మాటూరి వెంకట్రామయ్య, చిట్లూరి ధర్మరాజు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 2,340 కేసులు పరిష్కారం

**నూజివీడు రూరల్, న్యూస్‌టుడే:** నూజివీడు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 2,340 కేసులు పరిష్కరించినట్లు నూజివీడు 15వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.నాగ శైలజ తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 63, క్రిమినల్ కేసులు 2,277 ఉన్నాయన్నారు. వీటి ద్వారా బాధితులకు రూ.2,78,53,817 పరిహారం అందిందన్నారు.

## మెరుగు పడిన ఫిల్టర్ బెడ్లు

ఈనాడు కథనాలకు స్పందన

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని కానుకొల్లు గ్రామస్థులకు సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. గ్రామంలోని రక్షిత తాగునీటి పథకం వద్ద ఫిల్టర్ బెడ్లలో జమ్ము, మొక్కలు మొలవడంతో శుద్ధి చేయని నీటినే సరఫరా చేస్తున్నారని ఈనెల 6న 'ఈనాడు'లో 'కళ్లతోనే చూడలేం..నోట్లో ఎలా పోస్తాం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శితో కలిసి ఫిల్టర్ బెడ్ల దుస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబ్బందితో జమ్ము, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగింపజేసి శుభ్ర పరిచారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతుల కోసం రూ.7 లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

**తీరిన తాగునీటి అవస్థలు.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా తాగు నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పశువుల ఆసుపత్రి, కొండకాలనీ, యాదవుల వీధి, సగర్ల వీధి ప్రాంతాలకు తాగు నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ మోటారు మరమ్మతులకు గురవ్వడంతో సమస్య ఏర్పడింది. దాంతో 'ఈనాడు'లో ఈనెల 10న 'గొంతెండుతున్నా పట్టదా..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దానికి డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు స్పందించారు. ఆయన ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ శుక్రవారం తాగునీటి ట్యాంకు మోటారు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దాంతో స్థానిక ప్రజలు హర్షం తెలిపారు.

## నిప్పు పెడితే.. ముప్పే..

### చెత్త కుప్పలు, వరి తుక్కు దహనం

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంత తెలిపినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఫలితంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు ప్రజలను ఊపిరాడనివ్వకుండా చేస్తున్నాయి. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని, చెత్తను యథేచ్ఛగా రహదారులు పక్కన పంచాయతీ ఆధ్వర్యంలో మరో పక్క వరి పైరు తుక్కును రైతులు తగలబెడుతున్నారు. దీనివల్ల గాలి, నీరు, వాతావరణం కాలుష్యం ఏర్పడుతోంది.

**పంట వ్యర్థాలు..** కైకలూరు నియోజకవర్గంలో సుమారు 29 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇందులో అత్యధికంగా యంత్రాలతో కోతలు కోస్తున్నారు. దీంతో వరి మోడులతో పాటు గడ్డి అధికంగా ఉంటోంది. దీనిని తొలగించ లేక రైతులు నిప్పు పెట్టి కాలుస్తున్నారు. దీనివల్ల భూమిలో పంట పోషకాలు, మేలు చేసే బ్యాక్టీరియా, మిత్ర పురుగులు చనిపోతాయి. తద్వారా భూసారం తగ్గి పంటలు దిగుబడిపై ప్రభావం చూపుతాయని నిపుణులు అంటున్నారు.

**ఇలా చేస్తే మేలు..** వరి తుక్కును కట్టలు కట్టుకోవడంతో పశుగ్రాసం కొరత అధిగమించవచ్చు. పశువులు లేని వారు విక్రయించుకుని కొంత ఆదాయం పొందవచ్చు. తుక్కు, వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేసి చేలలో వేసుకుంటే రసాయన ఎరువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. అలాగే గ్రామాల్లో సేకరించిన చెత్తకు నిప్పు పెట్టకుండా నిర్మించిన చెత్త సంపద కేంద్రాల వినియోగంలోకి తీసుకువచ్చి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేస్తే సమస్య పరిష్కారమవటంతో పాటు పంచాయతీకి ఆదాయం ఏర్పడుతుంది.

**సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలున్నా..**

తుక్కు, చెత్త దహనం చేయడం వల్ల వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) దిగజారి పోతుంది. దీంతో 2021లో ఈ చర్యలను నిలిపివేయాలని న్యాయస్థానం ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోక అనర్థాలు తప్పడం లేదు. మన జిల్లాలోనూ అదే తరహాలో పంట వ్యర్థాలను కాల్చడం ఆందోళన కలిగిస్తోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం..**

పంట పొలాల్లోని తుక్కును ఏరి పక్కన వేసుకోవాలి. చిన్నచిన్న మొదళ్లు ఉంటే తొలగించుకోవాలి. వ్యర్థాలను కాల్చితే మిత్ర పురుగులు, సూక్ష్మ ధాతువులు నశించి నేల సారం కోల్పోతుంది. పర్యావరణానికి హాని కలుగుతుంది. దానిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
**- జి.వెంకటమణి, ఏడీఏ, మండవల్లి**

## పందుల సంచారంతో ఇక్కట్లు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ముదినేపల్లిలో పందులు సంచారం విపరీతంగా పెరిగాయి. ఏ బజారులో చూసినా పందులే ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు చెత్తకుప్పలు తొలగించకపోవడంతో వాటిలో పందుల సంచారంతో దుర్వాసన వెలువడుతోందని ఆ ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్‌ను సంప్రదించగా వెంటనే చెత్త తొలగింప చేసి, పందుల నిర్వాహకులకు వాటిని బయటకు వదలకుండా నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని వివరించారు.

(c) eenadu

## విజయానందం

కాకినాడ జేఎన్‌టీయూ మైదానంలో నిర్వహించిన దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలు ఆదివారం ముగిశాయి. ఆయా రాష్ట్రాల వర్సిటీల జట్లు పాల్గొన్న టోర్నీలో చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎస్పీ బిందుమాధవ్, జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు ఎం.సి.హెచ్.ఆర్.కృష్ణంరాజు తదితరులు హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు.

**- న్యూస్‌టుడే, గాంధీనగర్**

## బతుకు బాట.. మెతుకు వేట

గోదావరి ఒడ్డున తెల్లవారుజామున మొదలయ్యే జీవన పోరాటం ఇది. పి.గన్నవరం మండలం జొన్నలంకకు చెందిన మత్స్యకారులు రాత్రి వేళ వేట ముగించుకుని గోదావరిలోనే లంగరు వేసి పడవను నిలుపుతారు. ఉదయం వేళ మళ్లీ వేట మొదలుపెడతారు. నీరు తగ్గడంతో పడవ ఇసుకలో చిక్కుకున్నప్పుడు మత్స్యకారుల సమష్టి శ్రమ మొదలవుతుంది. ఇసుక నీటిలో కొందరు వెనుక నుంచి గెంటుతుంటే మరికొందరు ముందు నుంచి లాగుతూ పడవను గోదావరిలోకి తోస్తారు. ఉదయం మొదలైన ఈ శ్రమ రాత్రి వరకు కొనసాగాల్సిందే. **-న్యూస్‌టుడే, కోనసీమ**

## నా ప్రయాణంలో.. నాన్నే మార్గదర్శి..!

**'ఈనాడు'తో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

ఈనాడు, కాకినాడ

'ఐఏఎస్ అవ్వాలన్నది నా చిన్ననాటి కల. దాన్ని చేరుకోవడానికి దారి చూపించింది మా నాన్నే. చదువు, క్రమశిక్షణ విషయంలో ఆయన సూచించిన మార్గాన్ని అనుసరించడంతోనే రెండు సార్లు విఫలమైనా మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించగలిగాను' అని కాకినాడ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన జేసీ 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విషయాలు ఆయన మాటల్లోనే..

### కష్టం తెలిసేలా పెంచారు

మాది ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ. మా నాన్న పేరు భరత్. యూపీ క్యాడర్ ఐఎఫ్ఎస్ అధికారిగా పనిచేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగారు. ఆయన చాలా క్రమశిక్షణతో నన్ను, తమ్ముడ్ని పెంచారు. ఆర్థికంగా వనరులున్నప్పటికీ మాకు ఆ తరహా వసతులు కల్పించకుండా కష్టం విలువ తెలిసేలా తక్కువ వనరులతోనే నెగ్గుకొచ్చేలా మార్గదర్శకం చేసేవారు. ఆయనను చూసే నాలో ఐఏఎస్ అవ్వాలని ఆసక్తి కలిగింది. మా తమ్ముడు యూపీలో న్యాయవాదిగా చేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఈ ఏడాదే పెళ్లి చేసుకున్నా. నా భార్య కూడా సివిల్స్ సాధనలో ఉన్నారు.

### ఏలూరులో తెలుగు నేర్చుకున్నా..

మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశాను. సివిల్స్ మొదటి ప్రయత్నంలో డిఫెన్స్ సెక్టార్ పోస్టు వచ్చింది. వద్దనుకుని రెండోసారి రాసినా, ఇంటర్వ్యూలో మార్కులు కొంచెం తగ్గడంతో సాధ్యం కాలేదు. నిరాశ చెందకుండా మూడోసారి గట్టిగా ప్రయత్నించా. పొలిటికల్ సైన్స్ ఐచ్ఛికంగా ఎంచుకుని 2020లో రాసిన యూపీపీఎస్సీ పరీక్షల్లో 362 ర్యాంకుతో నా కల నెరవేర్చుకోగలిగాను. 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా ఏలూరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశాను. అక్కడే తెలుగు నేర్చుకున్నాను. తర్వాత పెనుగొండ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించాను. ఎన్నికల విధుల్లో బాగా చేశాం. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఏడాది కాలం పనిచేసి ఇప్పుడు కాకినాడ జేసీగా వచ్చాను.

### సమస్య పరిష్కారంలోనే సంతృప్తి

'ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న పోస్టులో పనిచేయడం అంటే ఇష్టం. వారి సమస్యలను విని సకాలంలో పరిష్కరించిన తర్వాతే సంతృప్తి ఉంటుంది. ఇదివరకు పనిచేసిన చోట అదే సూత్రం అమలుచేశా.. ఇప్పుడూ అలానే పనిచేయాలనుకుంటున్నా. ఇక్కడ విధుల్లో చేరాక ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించా. వాటి లోటుపాట్లపై అధికారులతో సమీక్షలు చేస్తూ రైతులకు ఇబ్బందుల్లేకుండా చేస్తున్నాం. అర్జీల పరిష్కారంపైనా దృష్టిసారించాం.

### పద్యాలు రాస్తా.. గార్డెనింగ్ చేస్తా..

'పద్యాలు రాయడం, పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం. టెన్నిస్, ఫుట్‌బాల్ ఆడుతా. ఇంట్లో గార్డెనింగ్ అంటే ఆసక్తి. మొక్కలతో ఎక్కువ సమయం గడుపుతా. విద్యార్థులెవరైనా చదువు పూర్తయిన తర్వాత లక్ష్యాలను పెట్టుకుని సాధన చేయడం కాదు.. చదువుతూనే లక్ష్యం వైపు ప్రయాణం చేస్తేనే విజయం సాధిస్తారన్నది నా నమ్మకం'.

## చోరీలతో వేదన.. ఛేదనతో సాంత్వన

### సాంకేతికత సాయంతో దొంగల పట్టివేత

ఈనాడు, కాకినాడ
– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

జిల్లాలో చోరీ కేసులు పెరుగుతున్నాయి. ఇళ్ల తాళాలు బద్దలుకొట్టి దొంగలు సొత్తును ఎత్తుకుపోతున్నారు. ప్రయాణాల్లో విలువైన వస్తువులను పట్టుకుపోతున్నారు. వాహనాలను సైతం మాయం చేస్తున్నారు. గతంలో ఈ కేసులను ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారేది. ప్రస్తుతం కాకినాడ పోలీసులు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ దొంగలను పట్టుకుంటున్నారు. చోరీకి గురైన సొత్తును రికవరీ చేసి తిరిగి బాధితులకు అందజేస్తూ వారికి సాంత్వన కలిగిస్తున్నారు.

ఇటీవల రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

### భారీ కేసుల్లో వేగంగా స్పందన..

- ఈ ఏడాది సెప్టెంబరులో గండేపల్లి పీఎస్ పరిధిలో తాళ్లూరులోని ఓ దాబా వద్ద ఆగి ఉన్న బస్సులో 624 గ్రాముల బంగారంతో ఉన్న బ్యాగ్ చోరీకి గురైంది. పోలీసులు రెండు నెలల్లోనే ఈ కేసును ఛేదించారు. విజయనగరానికి చెందిన ముగ్గురు పాతనేరస్థులను పట్టుకుని మొత్తం రూ.60 లక్షలు విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- కాకినాడ నగర, రూరల్ పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన 7 బంగారం చోరీ కేసులను పోలీసులు తక్కువ రోజుల్లోనే ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.41 లక్షలు విలువైన 331 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షలు విలువ గల వెండిని రికవరీ చేశారు.
- ఇటీవల జిల్లాలో నమోదైన ఆరు చోరీ కేసులను విజయవంతంగా ఛేదించి రూ.59 లక్షల విలువైన 350 గ్రాముల బంగారం, 12.4 కేజీల బంగారం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపించారు.

☛ ఈ ఏడాది జిల్లాలో నమోదైన చోరీ కేసుల్లో 11.53 కిలోలు బంగారానికి 5.21 కిలోలు రికవరీ చేశారు.

☛ మొత్తం 429 మోటారుసైకిళ్లకు గాను 324 పట్టుకున్నారు.

☛ స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల విలువ: రూ.2.13 కోట్లు

**గత మూడేళ్లలో జిల్లాలో...**

| ఏడాది | చోరీ కేసులు | ఛేదించినవి |
|---|---|---|
| 2023 | 675 | 525 |
| 2024 | 738 | 394 |
| 2025 (డిసెంబర్ 1) | 929 | 557 |

### రికవరీలు పెంచుతున్నాం..

దొంగతనాల కేసుల్లో రికవరీల శాతం పెంచుతున్నాం. గతేడాది 53 శాతం ఉంటే.. ఈ ఏడాది 67 శాతానికి తీసుకువచ్చాం. సాంకేతికతను వినియోగించి సత్ఫలితాలు సాధిస్తున్నాం. నెలాఖరు నాటికి మరింత రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

**-బిందుమాధవ్, ఎస్పీ, కాకినాడ**

## నాగావ్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు.. ప్రయాణికుల ఆందోళన

అన్నవరం స్టేషన్‌లో నిలిపిన రైలు, బయటకు వచ్చిన ప్రయాణికులు (అంతర చిత్రం) పొగలు వచ్చిన బోగీ కింద భాగం

**అన్నవరం, న్యూస్‌టుడే:** సిల్‌ఘాట్ నుంచి తాంబరం వెళ్లే నాగావ్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగి కింద భాగం నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. విశాఖపట్నం - రాజమహేంద్రవరం మార్గంలో వెళ్తున్న ఈ రైలులోని ఎస్ 7 బోగీ కింద నుంచి పొగలు రావడాన్ని ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ప్రయాణికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు అన్నవరం స్టేషన్‌లో ఉదయం 10.30 గంటలకు నిలిపివేశారు. ఇక్కడ రైలుకు హాల్ట్ లేదు. సాంకేతిక బృందం అక్కడకు చేరుకుని పరిశీలించారు. బోగి కింద భాగంలో బ్రేక్ వద్ద సాంకేతిక సమస్య కారణంగా పొగలు వచ్చాయని గుర్తించి మరమ్మతులు చేశారు. సుమారు 20 నిమిషాల తర్వాత రైలు ముందుకు వెళ్లింది. పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెంది స్టేషన్‌లో ఒక్కసారిగా దిగిపోయారు. సాంకేతిక సమస్య అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

## కొబ్బరి రైతులకు తీపి కబురు

**మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం**

న్యూస్‌టుడే, అంబాజీపేట

కోనసీమ కొబ్బరి రైతులు ఎదురు చూపులు ఫలించాయి. కేంద్రమంత్రివర్గం ఈ నెల 12న తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా కొబ్బరికి మద్దతు ధర పెంచింది. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైస్(సీఏసీపీ) సిఫార్సులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది. గతేడాది మిల్లింగ్ కోప్రా రకం క్వింటాకు రూ.11,582, బాల్‌కోప్రాకు రూ.12,100 ధర నిర్ణయించగా ప్రస్తుతం 2026 సీజన్‌కు సంబంధించి మిల్లింగ్ కోప్రా రూ.12,027, బాల్ కోప్రా(బంతి కొబ్బరికి) రూ.12,500 మద్దతు ధరను ప్రకటించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రకటించారు. గతేడాది డిసెంబరులో మిల్లింగ్‌కోప్రా రకానికి క్వింటాలుకు రూ.422, బంతి కొబ్బరికి రూ.100 మేర పెంచారు. ఈ ఏడాది (2026 సీజన్‌కు) మిల్లింగ్ కోప్రాకు రూ.445, బంతి కొబ్బరికి రూ.400 మద్దతు ధర పెంపు చేశారు. గతేడాది మిల్లింగ్ కొబ్బరికి ఉన్న మద్దతు ధర రూ.11,582కు రూ.445 కలిపి ప్రస్తుతం రూ.12,027 ధర ఇవ్వనున్నారు. బంతి కొబ్బరికి గతేడాది రూ.12,100 ఉంటే ఈ ఏడాది రూ.400 కలిపి రూ.12,500గా నిర్ణయించారు.

అంబాజీపేట మార్కెట్‌లో ఆరబెట్టిన మిల్లింగ్ కొబ్బరి

**అయిదేళ్లలో మద్దతు ధరలు ఇలా.. (క్వింటా రూ.లలో)**

| ఏడాది | మిల్లింగ్ కోప్రా | బాల్ కోప్రా |
|---|---|---|
| 2022 | 10,590 | 11,000 |
| 2023 | 10,860 | 11,750 |
| 2024 | 11,160 | 12,000 |
| 2025 | 11,582 | 12,100 |
| 2026 (కొత్త సంవత్సరం) | 12,027 | 12,500 |

## మొసళ్ల పట్టివేతకు బోను ఏర్పాటు

బోను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో ప్రసాద్

**అయినవిల్లి:** మొసళ్లను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఎఫ్‌వో ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. రెండురోజులుగా మొసలి సంచరిస్తోన్న ఇక్కడి పరిసరాలను పరిశీలించారు. ఆదివారం ప్రత్యేకంగా తయారుచేయించిన 12 అడుగుల బోను తీసుకువచ్చి ముక్తేశ్వరం రేవు సమీపంలో ఏర్పాటు చేశారు. రెండు మూడు రోజుల్లో బోనులో చిక్కే అవకాశం ఉందన్నారు.

## ఎయిర్‌బస్‌లు వస్తున్నాయోచ్..

**కోరుకొండ, సీతానగరం, న్యూస్‌టుడే:** మధురపూడి విమానాశ్రయం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు చిన్న విమాన సర్వీసులకే పరిమితమైన ఈ విమానాశ్రయం పెద్ద విమానాల రాకపోకలకు సుగమమైంది. ఇండిగో విమానయాన సంస్థ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎయిర్‌బస్‌లను ఈనెల 16 నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నద్ధమవుతోంది. వీటితో ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రాల రాజధాని భాగ్యనగరానికి ప్రయాణికుల రాకపోకల సంఖ్య మరింత పెరుగుతుంది.

### ఒకేసారి రెండు...

విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు ఒకేసారి రెండు ఎయిర్‌బస్‌లు కొత్తగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు దిల్లీ, ముంబయి నగరాలకు మాత్రమే ఇవి ఉన్నాయి. ఇక నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు అనుసంధానం కానున్నాయి. దీంతో ఈ సంఖ్య నాలుగుకు చేరుతుంది.

### పెరగనున్న ప్రయాణికులు

రోజూ హైదరాబాద్‌కు ఆరు సర్వీసులు ఉన్నాయి. ఆయా సర్వీసులతో సుమారు 600 వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం నుంచి అయిదు ఏటీఆర్ సర్వీసుల స్థానంలో రెండు ఎయిర్‌బస్‌లు వస్తున్నాయి. వీటి ద్వారా ప్రయాణికుల సంఖ్య 800కు చేరే అవకాశం ఉంది.

### బెంగళూరుకు అలయన్స్ ఎయిర్..

రాజమహేంద్రవరం నుంచి బెంగళూరుకు మరో విమాన సర్వీసును నడిపేందుకు అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఇండిగో రాత్రిపూట నడుస్తుండగా ప్రయాణికుల డిమాండ్ నేపథ్యంలో ఉదయం మరొకటి నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### ఏటీఆర్ నుంచి ఎయిర్‌బస్

గత పదేళ్లుగా హైదరాబాద్‌కు ఏటీఆర్ విమానాలు మాత్రమే ఉన్నాయి. ఇవి 72 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగి ఉంటాయి. దశలవారీగా హైదరాబాద్‌కు ప్రయాణికుల డిమాండ్ పెరగడంతో ఒక సర్వీసుతో ప్రారంభమై ఇప్పటి వరకు ఆరుకు చేరింది. ఏటీఆర్‌లను తగ్గించే యోచనలో ఎయిర్‌బస్‌లకు ప్రాధాన్యం పెంచనున్నారు. ఈ నేపథ్యంలో 180 మంది ఒకేసారి ప్రయాణించవచ్చు.

### అందుబాటులోకి మరిన్ని సర్వీసులు

ప్రయాణికుల డిమాండ్ మేరకు సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు భారతీయ విమానాశ్రయాలధికార సంస్థ కృషి చేస్తోంది. అందుకనుగుణంగా విమానయాన సంస్థల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తాం.

**- ఎన్‌కే శ్రీకాంత్, ఎయిర్‌పోర్టు డైరెక్టరు**

**విమాన సర్వీసులు బయలుదేరు సమయం(గంటలకు)**

- **హైదరాబాద్:** ఉదయం 8.30, మధ్యాహ్నం 3.30, రాత్రి 9.30
- **దిల్లీ:** ఉదయం 10.15
- **చెన్నై:** మధ్యాహ్నం 12.15
- **ముంబయి:** సాయంత్రం 6.25 (మంగళ, గురు, శనివారాలు)
- **బెంగళూరు:** రాత్రి 7.15
- **తిరుపతి:** మధ్యాహ్నం 12.30 (మంగళవారం), ఉదయం 11.05 (గురు, శనివారాలు)

## నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

**సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే:** కాకినాడ కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతులను అధికారులకు నేరుగా అందజేయవచ్చని చెప్పారు.

## కాకినాడ డిపోలో నిలిచిన అద్దె బస్సులు

**సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే:** తమకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదంటూ కాకినాడ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సుల డ్రైవర్లు ఆదివారం బస్సులను నిలుపుదల చేశారు. దీంతో కాకినాడ డిపో నుంచి రావులపాలెం, తుని, రాజమహేంద్రవరం రూట్లలో వెళ్లే మొత్తం 12 బస్సులు ఉదయం నుంచి డిపోలో నిలిచిపోయాయి. డ్రైవర్లు మాట్లాడుతూ జీతాల కోసం బస్సుల యజమానికి ఫోన్ చేస్తున్నా స్పందించడం లేదన్నారు. రేపటిలోగా జీతాలు చెల్లిస్తేనే విధులకు హాజరవుతామని డ్రైవర్లు తెలిపారు.

## ఆనంద తరంగం

చొల్లంగిలో సముద్ర మొగ వద్ద స్పీడ్ బోటుపై షికారు చేస్తున్న పర్యాటకులు

పర్యాటకుల తాకిడితో మడ అడవుల్లో సందడి నెలకొంది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం సందర్శకులతో కిటకిటలాడింది. విద్యార్థులు మడ అడవుల్లోని వన్యప్రాణులు, వృక్ష, చేప జాతులపై అధ్యయనం చేశారు. ఇంగ్లాండ్‌కు చెందిన మే, రోజ్, బాబి, వేద చొల్లంగి పర్యాటక కేంద్రానికి వచ్చారు. చెక్కల వంతెనపై నడుస్తూ బోటు షికారు చేశారు.

**-న్యూస్‌టుడే, తాళ్లరేవు**

## స్వామివారి రథానికి మరమ్మతులు

**అంతర్వేది, న్యూస్‌టుడే:** అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దివ్య రథాన్ని మరమ్మతుల నిమిత్తం షెడ్ నుంచి ఆదివారం బయటకు తీశారు. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా రథానికి అర్చకస్వాములు, ఏసీ నాగవరప్రసాద్, వాహన సేవకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గోవిందనామ స్మరణతో బయటకు తీసుకొచ్చారు. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తారు. అనంతరం అనుమతి పత్రాన్ని అందిస్తారు. జనవరి 29న రథోత్సవం జరగనుంది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669




(c) eenadu

# మెట్ల మార్గంపై పేరు.. చిరకాలం గుర్తుండేలా..

**● నేడు సత్యదేవుని మెట్లోత్సవం**

అన్నవరం మెట్లమార్గం (అంతర చిత్రం)మెట్లపై దాత పేరు

అన్నవరం, న్యూస్‌టుడే: దానమైనా.. ధర్మమైనా చిరకాలం గుర్తుండేలా చేయాలనేది పెద్దల మాట. దీనికి నిదర్శనమే అన్నవరం సత్యదేవుని చెంతకు చేరే మెట్లమార్గం. నేడు సత్యదేవుని మెట్లోత్సవం ఘనంగా జరగనుంది.

**రత్నగిరిపై ప్రత్యేకత ఇదీ..**

సత్యదేవుని కొలువై ఉన్న రత్నగిరికి చేరుకోవడానికి పూర్వం సరైన మార్గం లేక భక్తులు ఇబ్బంది పడేవారు. ఆలయ నిధులు, దాతల సహకారంతో 1950లో 384 మెట్లతో మార్గాన్ని నిర్మించారు. దైవకార్యానికి చేయూతనిచ్చిన వారి సహకారం గుర్తుండేలా మెట్లపై పేర్లు చెక్కి నిర్మించారు. క్రమంగా రాయి అరుగుదల కారణంగా పేర్లు స్పష్టంగా కనిపించకున్నా.. ఇంకా అనేకమంది పేర్లు స్పష్టంగానే ఉన్నాయి. చాలా మంది భక్తులు ఈ మార్గంలో వెళ్లే సమయంలో పక్కన పడిఉన్న రాళ్లు ఒకదానిపై ఒకటి పేరుస్తుంటారు. ఇలా పేర్చడం వల్ల తమ సొంతింటి కల నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. ఏటా ధనుర్మాసం ప్రారంభంలో మార్గశిర ఏకాదశి రోజున మెట్లోత్సవం నిర్వహిస్తారు. మెట్టుమెట్టుకు పూజ చేస్తూ, పసుపు, కుంకుమ పువ్వులతో అలంకరిస్తూ, హారతి వెలిగిస్తూ వందలాది మంది భక్తులు కొండపైకి చేరుకుంటారు. సోమవారం ఉదయం 7 గంటలకు గ్రామసేవ జరుగుతుంది. అనంతరం కొండ దిగువన తొలిపావంచాల వద్ద (మెట్ల మార్గం ప్రారంభంలో) స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం 9 గంటలకు ఉత్సవాన్ని ప్రారంభిస్తారు.

# రామోజీ ఫిల్మ్‌సిటీ వేదిక.. శీతాకాల వేడుక

**● ఈ నెల 18 నుంచి నెల రోజుల సందడి**

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: శీతాకాల వేడుకలతో పర్యాటకులను అలరించేందుకు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ముస్తాబైంది. ఈనెల 18వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే 'వింటర్ ఫెస్ట్'కు సర్వంసిద్ధమైంది. జనవరి 18 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో సందర్శకులను మంత్రముగ్ధులను చేసే సినీ మ్యూజిక్‌తో పాటు సెలవు రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకొనే కార్నివాల్ పరేడ్, మనసుకు హత్తుకొనేలా మ్యూజికల్ గ్లో గార్డెన్, మాయాలోక్‌తో పాటు మరెన్నో అలరించే అంశాలు ఉండనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా స్టూడియో టూర్..** వేడుకల్లో భాగంగా ఫిల్మ్‌సిటీ సందర్శన సమయం రాత్రి 9 గంటల వరకు పొడిగించారు. ప్రకాశవంతమైన వాతావరణంలో ఫిల్మ్‌సిటీ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో ఫెస్ట్‌ను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు అద్వితీయ సినిమా సెట్ల సందర్శనతో సాగే స్టూడియో టూర్ ఆకట్టుకుంటుంది. లైవ్ షోలు, వైల్డ్ వెస్ట్ స్టంట్స్, ఉత్తేజకరమైన రైడ్స్, సాహసాల వేదిక సాహస్, బర్డ్ పార్కు సందర్శనతో ఇదో మధుర జ్ఞాపకంగా మలుచుకోవచ్చు.

**న్యూ ఇయర్ పార్టీ...**

డిసెంబరు 31న నూతన సంవత్సరంలోకి అడుగిడే క్షణాలను సరికొత్త ఉత్సాహంతో గడిపేందుకు రామోజీ కార్నివైబ్ 2026 ఉంటుంది. వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్‌డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. అపరిమిత ఆహారం, పానీయాలతో వీనులవిందైన సంగీత ప్రదర్శనలతో సాగే ఈ వేడుకలో సందర్శకులు పాలుపంచుకోవచ్చు.

**● 'వింటర్ ఫెస్ట్'కు సర్వం సిద్ధం**

**అబ్బురపరిచే కార్నివాల్**

అద్భుత శకటాలతో అబ్బురపరిచే కార్నివాల్ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో చిన్నా పెద్దా అందరూ సరికొత్త అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. మిరుమిట్లు గొలిపే ఫిల్మ్‌సిటీ అందాల మధ్య ఆనందతీరాలను చవిచూడవచ్చు. మ్యూజికల్ గ్లో గార్డెన్ సరికొత్త లోకాన్ని కళ్ల ముందుకు తెస్తుంది. ఐకానిక్ సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ సందర్శనతో వీక్షించవచ్చు. సెట్ల డిజైన్, కళాత్మక నైపుణ్యంతో తెరవెనుక జరిగే కృషి కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది.

**ప్రత్యేక ప్యాకేజీలు, సౌకర్యాలు**

వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకలకు వివిధ ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ కోసం క్రెష్ సౌకర్యాలను పర్యాటకులు వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకు:
www.ramojifilmcity.com
లాగిన్ అవ్వండి.
కాల్ సెంటర్ నంబర్: 7659876598

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ నూతన సంఘం ఏర్పాటు

సంఘ నూతన సభ్యులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల నూతన సంఘ ఆవిర్భావ కార్యక్రమం ఆదివారం డెయిరీఫారం సెంటర్‌లోని సీజీఎస్టీ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ విశ్రాంత శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు, ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత అదనపు కమిషనర్ డీవీ సుబ్బారావు, సీజీఎస్టీ విశ్రాంత అదనపు కమిషనర్ వీవీఎస్ఎన్ కుమారవర్మ, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ఎన్.సాయిరామ్‌లు పాల్గొన్నారు. కాకినాడలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై సమైక్యంగా పోరాడాలని తీర్మానించారు. ఈ సందర్భంగా కాకినాడ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కుమారవర్మ, ఉపాధ్యక్షుడిగా తురగా సూర్యారావు, కార్యదర్శిగా కేవీ ఆర్ వరప్రసాద్, సహ కార్యదర్శిగా కె.రాజేష్, కోశాధికారిగా పి.సాగర్, కన్వీనర్‌గా మూర్తి, ఇతర బాధ్యతల్లో రాజు, ప్రసాదరావు, రవిశంకర్ పట్నాయక్, అబ్బాయి తదితరులు ఎన్నికయ్యారు

# ఓబీసీలో చేర్చేవరకు పోరాడదాం

**● తూర్పు కాపుల ఆత్మీయ మహాసభ పిలుపు**

ఏలేశ్వరం: తూర్పుకాపులను ఓబీసీలో చేర్చే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని ఏలేశ్వరంలో ఆదివారం జరిగిన తూర్పుకాపు ఆత్మీయ మహాసభలో వక్తలు స్పష్టం చేశారు. ఓబీసీ రిజర్వేషన్ కల్పించకపోవడం వల్ల తూర్పు కాపులు విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర పంక్షన్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి తూర్పుకాపు సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓబీసీ సాధన లక్ష్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర, మినహా జిల్లాల్లో బతుకు తెరువు కోసం వలస వెళ్తున్న తూర్పుకాపులను ఆర్థిక, సామాజిక, రాజకీయ అభ్యున్నతికి సమష్టిగా నిలవాలన్నారు. బీసీలుగానే ఉన్నా ఓబీసీలో చేర్చాలని చాలా కాలంగా పోరాడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు ఓబీసీ ఇవ్వాలని సంఘ నేతలు అలమంద చలమయ్య, పైల సుభాష్ చంద్రబోస్, శిడగం వెంకటేశ్వరరావు, కర్రోతు సత్యనారాయణ, శిడగం కన్నారావు, శంకర్ తదితరులు డిమాండ్ చేశారు. ఇదే లక్ష్యంతో పోరాడతామన్నారు. సామాజిక వర్గ నాయకులు జిల్లా నలుమూలల నుంచి విచ్చేశారు.

సమావేశంలో తూర్పుకాపు సంఘ జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్ తదితర నేతల సంఘీభావం

# ఆలయాల్లో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

సామర్లకోట, పిఠాపురం, న్యూస్‌టుడే: సామర్లకోట భీమేశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. తొలుత ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కాలభైరవుడు, ధ్వజస్తంభం, ఏకశిలా నంది విగ్రహం, ఉపాలయాలను దర్శించుకున్నారు. బాలాత్రిపురసుందరి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ నంది మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అధికారులు అందజేశారు. ఆయన వెంట జిల్లా న్యాయమూర్తులు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు. ♦ పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురంలోని కుంతీమాధవ స్వామి ఆలయం, పాదగయ క్షేత్రాలను జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. కుంతీమాధవ స్వామి, కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు, పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లకు పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు అందజేశారు. జిల్లా జడ్జి గంధం సునీత, 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మహాలక్ష్మిని అభినందిస్తున్న నాయకులు

# సగరుల అభివృద్ధికి కృషిచేస్తా..

జగ్గంపేట గ్రామీణం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సగరసంఘం అధ్యక్షుడిగా జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన గుర్రం మహాలక్ష్మి (అబ్బు) ఎన్నికయ్యారు. ఆదివారం చెందుర్తిలో నిర్వహించిన సగర సంఘం ఎన్నికలో మహాలక్ష్మి 23 ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థి తంగెళ్ల రాధాకృష్ణపై గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలో 52 గ్రామాల్లో సగరులు నివాసం ఉంటున్నారని ప్రతి రెండేళ్లకోసారి సంఘం ఎన్నికలు పెద్దల సమక్షంలో నిర్వహిస్తామన్నారు. సగరుల అభివృద్ధికి సంఘాన్ని పటిష్ఠం చేసేందుకు కృషిచేస్తానని మహాలక్ష్మి పేర్కొన్నారు. జగ్గంపేట నుంచి మొదటిసారిగా ఎన్నికైన మహాలక్ష్మిని సంఘ పెద్దలు, ఇతర నాయకులు అభినందించారు.

# ఆలోచన అదిరింది!

స్కూటీ సీటుకు రక్షణ కవచం

పిఠాపురంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోజుకు 10 నుంచి 20 మంది కుక్కకాటుతో ఆసుపత్రికి వెళ్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై నిలిపిన ద్విచక్ర వాహనాల సీట్లను కొరికేస్తున్నాయి. వీటి నుంచి రక్షణకు స్థానిక మిరపకాయల వీధిలో పాస్టర్ వేమగిరి శామ్యూల్‌రాజు సీటుకు అల్యూమినియం రేకుతో రక్షణ కవచం తయారు చేయించారు. ఇందుకు రూ.600 వరకు ఖర్చు చేశారు. ఇది చూసిన పలువురు కుక్కల బారి నుంచి వాహనాల సీటు కవర్లను కాపాడుకునేందుకు ఈ విధానం అనుసరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

# లోవ ఘాట్ రోడ్డులో భక్తులకు అవస్థలు

ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారుల అవస్థలు

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానంలోని ఘాట్‌రోడ్డుపై భక్తులకు అవస్థలు తప్పలేదు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనార్థం వాహనాలలో తరలివచ్చిన భక్తులు ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ గంటల తరబడి నిలిచిపోవడంతో అసహనానికి గురయ్యారు. భారీ వాహనాలను సైతం కొండపైకి అనుమతించడంతో ఈ పరిస్థితి నెలకొందని భక్తులు వాపోతున్నారు. దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిపై అధికారులు రానున్న కాలంలోనైనా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

వేడుకలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్, వేదికపై వీసీ ప్రసాద్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సూరంపాలెం, రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. కాకినాడలోని జేఎన్‌టీయూకే క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్‌లో తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు 3-0 తేడాతో చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీ జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది. తృతీయస్థానం కోసం జరిగిన పోటీల్లో కేరళలోని కాలికట్ యూనివర్సిటీ జట్టు 3-2 తో తమిళనాడులోని భారతీయార్ యూనివర్సిటీ జట్టుపై గెలిచింది. బహుమతి ప్రదానోత్సవానికి అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు ఎం.సిహెచ్.ఆర్.కృష్ణంరాజు, ఎస్పీ గరికపాటి బిందు మాధవ్, జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఏఐయూ అబ్జర్వర్ ఇ.త్రిమూర్తులు పాల్గొన్నారు. విజేతలకు కప్‌లు, నగదు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా తీసుకుంటూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. దక్షిణ భారత స్థాయిలో తొలిసారిగా వాలీబాల్ పోటీలకు 138 జట్లు పోటీ పడటం అభినందించదగ్గ విషయమన్నారు. టోర్నమెంట్ కన్వీనర్ జి.శ్యామ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.పి.రాజు మాట్లాడుతూ తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జయపురలో జరిగే జాతీయ అంతర్ వర్సిటీ పోటీలకు అర్హత సాధించాయన్నారు. రెక్టార్ పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, యూనివర్సిటీ డైరెక్టర్లు, కోచ్‌లు, మేనేజర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

నాగబాబు

సామర్లకోట: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు సామర్లకోటకు చెందిన క్రీడాకారుడు యాతం నాగబాబు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రులో నిర్వహించిన 45వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ 2025 ఛాంపియన్‌షిప్ పోటీల్లో 100, 1,500 మీటర్ల పరుగులో బంగారు, 800 మీటర్ల పరుగులో రజత పతకాలు సాధించారు. 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జిల్లా మలేరియా విభాగంలో పనిచేస్తున్న నాగబాబు ఇప్పటికే అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

# పిఠాపురంలో క్షుద్రపూజల కలకలం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో ఆదివారం క్షుద్రపూజల కలకలం రేగింది. అగ్రహారం పశువుల సంత వద్ద ఓ టెంట్ హౌస్ ఎదురుగా ఆరుబయట అరుగుపై గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజల కోసం ముగ్గులు, పసుపు, కుంకుమ వేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రెండు నెలల క్రితం కూడా ఇదే విధంగా చేశారని అక్కడివారు ఆరోపిస్తున్నారు.

## ధరవరలు

**అంబాజీపేట కొబ్బరి మార్కెట్**

| కొబ్బరి (క్వింటాళ్లలో) | ధర (రూ॥లలో) |
|---|---|
| కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి): | 17,500 |
| పాతకాయ: గండేరా | 28,000 |
| గటగట | 25,000 |
| కొత్తకాయ: గండేరా | 27,000 |
| గటగట | 24,000 |
| నీటి కాయ (వెయ్యింటికి): | |
| పాత (ముక్కుడు) కాయ | 15,000-16,000 |
| కొత్త (పచ్చి) కాయ | 14,000-15,000 |
| కొబ్బరినూనె మార్కెట్: | |
| 15 కిలోలు | 6,000 |
| కిలో | 400 |

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

**వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో**

| | |
|---|---|
| ఫారంరేటు | 120-00 |
| రిటైల్ లైవ్ | 147-00 |
| డ్రెస్డ్ | 213-00 |
| స్కిన్‌లెస్ | 243-00 |

# ప్రార్థనాలయాల్లో కార్యకలాపాలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: భారీ పోలీసు బందోబస్తు మధ్య గొల్లప్రోలు కొత్తపేట వీధిలోని రెండు ప్రార్థనాలయాల్లో కార్యకలాపాలు ఆదివారం కొనసాగాయి. ఈ నెల 7న నెలకొన్న ఘటనతో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ నిబంధనల మేరకు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు కాకినాడ ఆర్డీవో మల్లిబాబు శనివారం అనుమతి ఇచ్చారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్ రామ్‌కుమార్ పర్యవేక్షించారు. పిఠాపురం, సర్పవరం సీఐలు శ్రీనివాస్, పెద్దిరాజు, పలువురు ఎస్సైలు, పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

కార్యాలయం వద్ద ఆందోళనకారులతో చర్చిస్తున్న తహసీల్దార్ రామ్‌కుమార్, డీఎస్పీ సత్యనారాయణ

**పలు సంఘాల ఆందోళన**

ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు సంఘాల సభ్యులు ఆందోళన చేపట్టారు. గొల్లప్రోలు శివారున ఉన్న ఓ మండపం వద్ద ఆయా సంఘాల సభ్యులు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసు అధికారులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. అనుమతి లేని ప్రార్థనాలయాల్లో కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు తిరిగి అనుమతి ఎందుకిచ్చారంటూ ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై ఆందోళన చేపట్టేందుకు సన్నద్ధం కాగా పోలీసులు అడ్డుకున్నారు. భారీసంఖ్యలో సభ్యులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేశారు. వారితో తహసీల్దార్ రామ్‌కుమార్, డీఎస్పీ సత్యనారాయణ చర్చించారు. జిల్లా అధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# రోడ్డు విభాగినిని ఢీకొట్టి లారీ బోల్తా

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు వద్ద కెనాల్ రోడ్డులో విభాగినిని ఢీ కొట్టి లారీ బోల్తా పడింది. ఆదివారం తెల్లవారుజామున కాకినాడ వైపు నుంచి రామహేంద్రవరం వెళ్తున్న లారీ పైవంతెన వద్ద అదుపు తప్పి విభాగినిని ఢీకొంది. డ్రైవరు, క్లీనరు సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

[illegible]

| | |
|---|---|
| రిజర్వు ధర (రూ.లలో) | రూ. 85,24,800/- |
| ధరావతు (రూ.లలో) | రూ. 8,52,480/- |
| బిడ్ పెంపుదల మొత్తం | రూ. 10,000/- |
| ధరావతుతో బిడ్/ టెండరు దాఖలుకు చివరి తేదీ | 30-12-2025 |
| బహిరంగ ఇ-వేలం తేదీ, సమయము | 31-12-2025 |

**స్థిరాస్తి షెడ్యూలు**

[illegible]

https://www.axisbank.com/auction-retail
https://www.bankeauctions.com

తేదీ: 15-12-2025 స్థలం: తూర్పు గోదావరి
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

[illegible]

| | |
|---|---|
| రిజర్వు ధర (రూ.లలో) | రూ.24,80,000/- |
| ధరావతు (రూ.లలో) | రూ. 2,48,000 |
| బిడ్ పెంపుదల మొత్తం | రూ. 10,000/- |
| ధరావతుతో బిడ్/ టెండరు దాఖలుకు చివరి తేదీ | 30.12.2025 |
| బహిరంగ ఇ-వేలం తేదీ, సమయము | 31.12.2025 |

**స్థిరాస్తి షెడ్యూలు**

[illegible]

https://www.axisbank.com/auction-retail
https://www.bankeauctions.com

తేదీ: 15.12.2025 ప్రదేశం: తూర్పు గోదావరి
సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

FINANCIAL SERVICES

**స్థిరాస్తులపై తూర్పు,** పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396999669.

JOBS

**Wanted Tele-callers.** Experienced/ Insurance/ Age: Above 30 years/ Female. Kakinada, Contact Cell: 98494 21277.

**స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్** కంపెనీ, రాజమండ్రి బ్రాంచ్ నందు పని చేయుటకు ADM మరియు సేల్స్ మేనేజర్స్ కావలెను. సంప్రదించండి సెల్: 98668 47345.

**రిసెప్షనిస్ట్ - Cum - కంప్యూటర్ ఆపరేటర్(M),** 40 సం॥లోపు, A&B షిఫ్ట్, జీ:12 వేలు, లోకల్ & అనుభవంగలవారు కావలెను. శ్రీగ్రాండ్ హోటల్, రాజమండ్రి ✆ 80996 64555.

**HYD యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**రాజమండ్రి, కొవ్వూరు,** అనకాపల్లిల్లో ప్రా॥కం. షోరూమ్స్ లో సె.గార్డ్స్, సూపర్‌వైజర్స్, జీ: 12 to15 వేలు, రూం+బో., రాజ్ సెక్యూరిటీ, Rjy, 9392269369, 9492444369.

**రాజమండ్రి, ప్రముఖ** రియల్‌ఎస్టేట్ సంస్థలో టీ పెట్టుటకు Female (స్త్రీ) కావలెను. Contact Cell: 93924 41891.

**రాజమండ్రి ప్రముఖ** రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్ కమ్ ఎకౌంటెంట్ (Female), టాలీలో 2 సం॥ అనుభవం ఉండాలి. ✆ 93924 41891.

**★కోనసీమ జిల్లాలో** క్రెడిట్‌కార్డ్ సేల్స్ చేయడానికి ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ★బైక్ & ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి. ★ జీతం: 15,000 + ఇన్సెంటివ్స్. Cont: 9030212623, 9966442928

**వైజాగ్ షాపింగ్** మాల్స్‌లో పని చేయుటకు 18-35 వయసు. యువతీ, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము 9704637370, 9949904532.

MARKETING/ SALES

**Wanted FMCG** field sales executive & delivery boys. 2 yrs exp - Must have bike - contact on 9100940494

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-75 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

# కాకినాడ

## హిందూ ధర్మం, సంస్కృతిని పరిరక్షించాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే: హిందువులంతా ఐక్యంగా ఉండి హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పరిరక్షించుకోవాలని సామాజిక సమరసత జిల్లా సంయోజక్ డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకను పురస్కరించుకుని ఆదివారం పేర్రాజుపేట బస్తీలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. కర్రి అచ్యుతరామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వీరభద్రరావు, ఆర్‌ఎస్‌ఎస్ మహిళానేత కమల పాల్గొని ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నిమ్మకాయల వీరభద్రరావు, వీహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు పట్నాయక్, రవివర్మ, మాలకొండయ్య, ఏడిద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి జేఎన్‌టీయూకేలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నారు. దీనిపై ఆదివారం కచేరిపేటలోని యూటీఎఫ్ హోంలో సమావేశం జరిగింది. జవివే జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సురేష్ పాల్గొని 21, 22, 23 తేదీల్లో సైన్స్ ప్రయోగాలు, క్విజ్, రాపిడ్ రౌండ్, పరీక్ష, ఫీల్డ్ ట్రిప్, సైంటిస్టులతో ముఖాముఖి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌హెచ్‌పి.వర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు మేకా సుబ్బారావు, వీఎస్.రెడ్డి, దాడి పద్మనాభం, సమతా కన్వీనర్ ఉమ మంగతాయారు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

### మలుపులో ముప్పు

కాకినాడ పోస్టల్ కాలనీ నుంచి శాంతినగర్ ప్రధాన రహదారిలో మలుపు వద్ద ఇనుప మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ఇనుప రేకులు బయటకు చొచ్చుకొచ్చి మలుపు తిరిగే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని నగరవాసులు విన్నవిస్తున్నారు.

### ఆదమరిస్తే ప్రమాదమే..

కాకినాడ పోస్టల్ కాలనీ మూడో వీధి మలుపు వద్ద కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. స్లాబురాయి శిథిలమవడంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని వాహన దారులు వాపోయారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని నగర వాసులు విజ్ఞప్తిచేస్తున్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

## బరిలో దిగితే.. పతకం రావాల్సిందే

### జూడోలో రాణిస్తున్న యువత

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు కాకినాడకు చెందిన యువతీ, యువకులు. తమకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆత్మరక్షణ విద్య జూడోలో సత్తా చాటుతున్నారు. అనేక జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల కాకినాడ డీఎస్‌ఏలో నిర్వహించిన సీనియర్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పలువురు బంగారు పతకాలు సాధించారు. జాతీయస్థాయిలోనూ రాణిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

### గాయాలైనా ఇష్టంతో సాధన

ఎంపీడీ(మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న జోగేశ్వరరావు మత్స్యకారుడు, అమ్మ ధనలక్ష్మి గృహిణి. గత పదేళ్ల నుంచి జూడోలో శిక్షణ పొందుతున్నా. అనేక సార్లు గాయాలపాలైనా ఇష్టంతో సాధన చేస్తున్నా. ఇప్పటి వరకూ 15 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా ఏడు పతకాలు సాధించా. ఇప్పటివరకూ రెండు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. సీనియర్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో 73కేజీల విభాగంలో పాల్గొని బంగారు పతకం సాధించా. వ్యాయామోపాధ్యాయుడుగా స్థిరపడాలనేది నా లక్ష్యం. – రాజు

### ఎనిమిదేళ్లుగా శిక్షణ

ఎంబీఏ పూర్తిచేశా. నాన్న అబ్దుల్ రెహమాన్ టైలర్ పని చేస్తారు. అమ్మ సలీమా గృహిణి. గత 8 ఏళ్ల నుంచి జూడోలో శిక్షణ పొందుతున్నా. ప్రతి రోజూ 4 గంటలు సాధన చేస్తా. ఇప్పటివరకూ 12 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా 8 పతకాలు సాధించా. అయిదుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. సీనియర్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకంతో సత్తా చాటా. ఎస్సై కావాలనేది నా కల. – నవాజ్‌జానీ

### జాతీయస్థాయిలో పతకమే లక్ష్యం

డిగ్రీ ద్వితీయ ఏడాది చదువుతున్నా. నాన్న జోషఫ్ తంబి తాపీ మేస్త్రి, అమ్మ సుజాత గృహిణి. ఆత్మరక్షణకు గత ఆరేళ్ల నుంచి జూడోలో శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ 13 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా 13 పతకాలు సాధించా. 10 సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఖేలో ఇండియాలో పోటీల్లో సైతం పాల్గొన్నా. జాతీయస్థాయిలో పతకంతో పాటు రైల్వేలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. – అలేఖ్య

కార్యక్రమంలో పాల్గొన్న బిక్కిన తదితరులు

## కాకినాడలో వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం నగరంలోని రామారావుపేట మూడులైట్ల జంక్షన్ వద్ద విక్టోరియా వాటర్ వర్క్స్ ప్రాంగణంలో ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీప్రసన్న, మాజీ ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, సీనియర్ నేత పైడా కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ ఈ నెల 21న వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. 25న అటల్ జయంతి కార్యక్రమాన్ని భారీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రాంకుమార్, సీనియర్ నేత యెనిమిరెడ్డి మాలకొండయ్య, పైడా భవన ప్రసాద్, టి.పద్మజ, గూటూరు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక అర్బన్ తహసీల్దారు కార్యాలయ ఆవరణలో విశ్రాంతి ఉద్యోగుల సంఘ భవనంలో సంఘ ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు సవరపు చిన పాపారావు అధ్యక్షత వహించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. [illegible] ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి [illegible] తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

## 38 ద్విచక్రవాహనాల స్వాధీనం

మసీదు సెంటర్ (కాకినాడ): జిల్లాలోని రెండు ప్రాంతాల్లో ఆదివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 38 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, శ్రీహరిరాజు పర్యవేక్షణలో కాకినాడ టుటౌన్ పీఎస్ పరిధిలో రేచర్లపేట, సామర్లకోట పరిధిలో జగనన్న కాలనీల్లో తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో రెండు డ్రోన్లు వినియోగించారు.

వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

## లయన్స్ విజన్ క్లబ్ సేవలు అభినందనీయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: లయన్స్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలు, [illegible] క్రమం తప్పకుండా వృద్ధాశ్రమాలకు సహకారం అందించడంతోపాటు, విద్యార్థులకు సేవలందించడం అభినందనీయమని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.కోటేశ్వరరావు అన్నారు. విజన్ క్లబ్ ఆధ్వర్యంలో రామారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఓరియంటల్)లో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులకు డాక్టర్ రావుల శ్రీరామ్, డాక్టర్ స్వరూప్‌లు కంటి, దంతవైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. జోన్ ఛైర్‌పర్సన్ సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షురాలు నల్లమిల్లి శ్రీదేవిరెడ్డి, కార్యదర్శి బులుసు శ్రీవాణి, కోశాధికారి జయలక్ష్మి, మణిబాబు, ప్రసన్న, కృష్ణమూర్తి, మెట్ట రాధా తదితరులు పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ ద్వారకానగర్‌లోని శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసం ఆదివారం సందర్భంగా భక్తులు పండ్లరసాలు, పంచామృతం, జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19న కనక మహాలక్ష్మి అమ్మవారికి మహా కుంభాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు స్వయంగా అమ్మవారిని అభిషేకించవచ్చన్నారు. ఆలయ అర్చకులు కొండవీటి బ్రహ్మయ్యశర్మ, ఆలయ ప్రతినిధులు [illegible], డి.జగన్నాథనాయుడు, నల్లి బాబు, బుచ్చులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

## బీసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా శ్రీను

నియామక పత్రం అందుకుంటున్న శ్రీను

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: బీసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షునిగా తూరంగికి చెందిన కర్రి శ్రీను నియమితులయ్యారు. ఆదివారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ నుంచి ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఈతకోటలో జరగనున్న బీసీ సదస్సు జయప్రదానికి కృషిచేస్తానన్నారు.

## వ్యాధిగ్రస్థులను ఆదుకోవడం సమాజ బాధ్యత

గాంధీనగర్, న్యూస్‌టుడే: పేదలు, అన్నార్తులు, వ్యాధిగ్రస్థులను ఆదుకోవడం సమాజ బాధ్యతని స్వామి వివేకానంద పేర్కొన్నారని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వి.ఎల్.గాంధీ, కేవీఎస్.శర్మ తెలిపారు. ఆదివారం శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో చిన్నారులకు [illegible] పాఠశాల పిల్లలు సుమారు రూ.40 వేలకు పైగా సేకరించిన విరాళంతో పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల నిర్వాహకులు [illegible], శ్రీదేవి, వక్కలంక రామకృష్ణ, కె.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఆనంద్, కిషోర్, హెచ్‌ఎం మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సాయం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన కుచ్చెర్లకోట హరిబాబు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఫుట్‌వేర్ సంస్థలో పనిచేసిన ఆయనకు కాకినాడ పాదరక్షల వ్యాపార సంఘం (ఫుట్‌వేర్ అసోసియేషన్) తరఫున రూ.10వేలు ఆర్థిక సాయాన్ని సంఘ అధ్యక్షుడు చిలుకూరి మనోజ్‌కుమార్ చేతుల మీదుగా ఆదివారం అందించారు. రామచంద్రరావు, రవి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పగిలిన పైపులైను.. నీరంతా రోడ్డుపాలు

కాకినాడ కుంభాభిషేకం చేపల రేవు సమీపంలో వంతెన వద్ద పైపులైను పగిలిపోవడంతో నీరు రోడ్డంతా పారుతోంది. దీంతో వంతెన పైనుంచి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జారుతుండడంతో ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

## అధ్వాన రహదారితో అవస్థలు

కాకినాడ సినిమారోడ్డులోని కల్పనా సెంటర్ వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది. మొత్తం ధ్వంసమై గుంతగా ఏర్పడింది. దాంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

## ప్రమాదకరంగా ఇనుపచట్రం..

కాకినాడ పల్లంరాజునగర్‌లోని ఓ వీధిలో ఇనుపచట్రం ప్రమాదకరంగా ఉంది. రహదారి మధ్యలో ఉన్న దీనికి ఓ పక్క రంధ్రం పడింది. దాంతో ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇనుప చట్రం వద్ద రంధ్రాన్ని పూడ్చాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

## బీచ్‌లో మొక్కల సంరక్షణ చర్యలు, శ్రమదానం

'సమాజం కోసం మూడు గంటలు' కార్యక్రమంలో భాగంగా కాకినాడకు చెందిన ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ ఆదివారం ఎన్టీఆర్ బీచ్‌లో శ్రమదానం నిర్వహించింది. సంస్థ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యుల బృందం కోకోనట్ ప్లాంటేషన్ వద్ద ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. అనంతరం కొబ్బరి మొక్కలను నీరు పోసి కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సంస్థ సభ్యులతోపాటు అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

## సాంస్కృతిక వారసత్వాన్ని నిలిపేందుకు కృషి

గాంధీనగర్: దశాబ్దాలుగా సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తూ, జాతీయ సమైక్యతకు కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఎంతగానో కృషి చేస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిత్‌మోహన్ మిత్రకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

నటుడు, గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్రకు జీవిత సాఫల్య పురస్కారాన్ని దియంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, పంచాంగకర్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తిల చేతుల మీదుగా అందజేశారు. జిత్‌మోహన్ దంపతులను ఘనంగా సత్కరించారు. సంస్థ వ్యవస్థాపకుడు జీఎస్‌జే.కుమార్, టి.రవికుమార్, గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, వైఎస్‌వీఎస్ మూర్తి, పున్నమరాజు, ఉమామహేశ్వరావు, తురగా సూర్యారావు, లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తీరంలో మత్స్యసందడే

౧౦ కిలోలకు పైగా బరువున్న సొర చేప

కాకినాడ తీర ప్రాంతంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు పలు రకాల పసందైన చేపలు చిక్కాయి. వాటిని ఆదివారం స్థానిక కుంభాభిషేకం చేపల రేవుకు తరలించి విక్రయించారు. అందులో నెమలి కోనెం, కొమ్ముకోనెం, సొర వంటి భారీ చేపలతోపాటు టూనా చేపలు, పండుగప్ప, కొయింగలు, మాగలు, గొరసలు, టేకు చేపలు ఉన్నాయి. ఆదివారం కావడంతో మత్స్య ప్రియులు చేపలను కొనుగోలు చేసేందుకు భారీగా తరలివచ్చారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

కొమ్ముకోనెం చేపలు

## డ్రోన్లతో ప్రత్యేక నిఘా

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగిస్తున్నామని ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం తెలిపారు. నేరాలను అరికట్టేందుకు బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడే అసాంఘిక వ్యక్తులపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కాకినాడలోని జేఎన్‌టీయూ, డెయిరీఫాం, ఘాటీ సెంటర్, కల్పనాసెంటర్, సర్పవరం, ఇంద్రపాలెం, తొండంగి, అన్నవరం, తుని తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రోన్లతో నిఘా ఏర్పాటుచేశామన్నారు.

## క్రికెట్ కిట్ అందజేత

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ ఉపాధ్యాయుల క్రికెట్ జట్టుకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ చేతులమీదుగా క్రికెట్ కిట్‌ను అందజేశారు. మూడు రోజుల పాటు కాకినాడలో జరుగుతున్న రాష్ట్ర ఉపాధ్యాయులు క్రికెట్ పోటీలు నేపథ్యంలో కాకినాడ అర్బన్ జట్టుకు కిట్‌ను అందజేసినట్లు హరీష్ తెలిపారు. ఎంఈవో-1, 2 సుబ్బారావు, రవి, జట్టు కెప్టెన్ రామతేజ్, వైస్‌కెప్టెన్ ఎల్.శ్రీనివాస్ తదితరులున్నారు.

## విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యలు అవసరం

కాకినాడ నగరం: పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. స్థానిక శ్రీనగర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల జరిగిన తైక్వాండో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆమె జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా అందించే కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అర్జునరావు, కర్రి నారాయణరావు, శిక్షకులు సత్యనారాయణ, తులసి, త్రిమూర్తులు, అరుణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటనపై కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. తాళ్లరేవు మండలం, చినబొడ్డు వెంకటాపాలేనికి చెందిన డి.సూర్యనారాయణ(59) కాకినాడలో మందులు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన అతడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

## తల్లీపిల్లల అదృశ్యంపై కేసు

మసీదుసెంటర్: తల్లి, ఇద్దరు పిల్లల అదృశ్యంపై కాకినాడ కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. స్థానిక జగన్నాథపురానికి చెందిన 30 ఏళ్ల వివాహిత, ఆమె ఇద్దరు పిల్లలు కలిసి ఈ నెల 13న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయారు. వారి కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతకగా ఆచూకీ లభించలేదు. దీనిపై వివాహిత భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## వృద్ధురాలికి తీవ్రగాయాలు

మసీదుసెంటర్: అగ్నిప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం కాకినాడలో చోటుచేసుకుంది. స్థానిక సాలిపేటకి చెందిన పి.సత్యవతి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద గ్యాస్ స్టౌపై టీ కాస్తుండగా చీరకు నిప్పంటుకోవడంతో ఆమె ముఖం, ఛాతీ, పొట్ట, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పి జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

## కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాకు విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జగన్నాథపురం శివారు ప్రాంత లేఅవుట్ స్థలంలో నాయకర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా, ఇతర ప్రాంతాల నుంచి నాయకర్ అభిమానులు, పూర్వ విద్యార్థులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సభకు జిల్లా సాధన సమితి సభ్యుడు చెక్కా అజయ్‌వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తమిళనాడులోని పీఎంకే పార్టీ ఉపాధ్యక్షుడు గుణనిధి ధనరాజ్, తెలంగాణ మత్స్యకార సంఘ రాష్ట్ర నేత టీవీ రావు తదితరులు హాజరయ్యారు. సాధన సమితి నాయకులు మాట్లాడుతూ అనేక జిల్లాలకు నాయకుల పేర్లు పెట్టిన వైకాపా ప్రభుత్వం నాయకర్ పేరును మాత్రం విస్మరించిందన్నారు. నాయకర్ తన యావదాస్తిని పేదల విద్య, ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం దానం చేశారని వారు గుర్తుచేశారు. ఆయన పేరును జిల్లాకు పెట్టాలని పలువురు నాయకులు కోరారు. గుణనిధి ధనరాజ్, టీవీ రావు మాట్లాడుతూ నాయకర్ జిల్లా సాధనకు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల తరఫున మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. పంపన రామకృష్ణ, నల్లం శ్రీను, వైదాడి నూకరాజు, మల్లాడి వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో నాయకుల సంఘీభావం

పోటీల్లో విజేతలతో అతిథులు

## ఉత్సాహంగా జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలను భానుగుడి పైవంతెన పక్కన గల సినర్జీ పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. జూనియర్, సీనియర్, కళాశాల, పురుషులు, మహిళల విభాగాల్లో సుమారు 180 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీహెచ్‌పి జ్యేష్ఠ కార్యకర్త గరిమెళ్ల అన్నపూర్ణయ్యశర్మ మాట్లాడుతూ భగవద్గీత సమాజంలో మానవుల మధ్య నైతిక విలువలు పెంచుతుందన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్, సంస్కృత విభాగ్ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీకృష్ణవాణ, ఉదయభానోజీరావు, గోవిందు, నాగమణి, రుద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి



మాటలకందని ఆప్యాయత అనురాగాలతో మంచికి మారు పేరుగా మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి ఆకస్మికంగా మమ్మల్ని వీడి దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అశ్రునయనాలతో..
భార్య: రాధా సర్వేంద్రరావు
కొడుకు: రాహుల్, కోడలు: అర్చన
మనుమరాళ్లు: ఆన్య, శాన్వి
కూతురు: అంకిత, అల్లుడు: హర్షిత్
మనుమరాళ్లు: ఆశ్వ, షనాయ
మరియు కుటుంబ సభ్యులు
శ్రీ గరికెన సర్వేంద్రరావు గారు
DOB: 12-09-1945 DOD: 14-12-2025
Nestle's Colonial, Flat No. E3, East Point Colony, Vizag. Cell: 9966813212, 9573949667

# కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

## తీరంలో పర్యాటకుల సందడి

సర్పవరం: సూర్యారావుపేట పరిధి సముద్ర తీరానికి ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చినవారు ఉత్సాహంతో కాలక్షేపం చేశారు. మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రతాచర్యలు చేపట్టారు.

## వైకాపా నిర్ణయంతోనే నీటి ఎద్దడి: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: గతంలో వైకాపా నాయకులు ఏలేరు ఆధునికీకరణను అడ్డుకోవడంతోనే సాగునీటి ఎద్దడి సమస్యలు ఎదురవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. ఆదివారం పిఠాపురం తెదేపా కార్యాలయంలో రైతుల ఇబ్బందుల పరిష్కారంపై నీటి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. శివారు ఆయకట్టు వరకు పీబీసీ, ఏలేరు నుంచి నీరు అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కాలువలు శుభ్రం చేయాలని, నాగులాపల్లి, కొమరగిరి, రమణక్కపేట, కొండెవరం గ్రామాల రైతుల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. నాయకులు సత్యనారాయణరెడ్డి, గాది రాజబాబు, కృష్ణారెడ్డి, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
ఉ. 10 - మ. 1 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

**సమస్య:** కరప మండలం కూరాడ బీసీకాలనీలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఇబ్బందిగా ఉంది. **- వెంకటేశ్వరరావు**

**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, కరప**

**సమస్య:** వాకలపూడి సంతోష్‌నగర్‌లోని మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోంది. **- ప్రభాకరరావు**

**పరిష్కారం:** కార్యదర్శి పాండురంగారావుకు చెప్పగా కార్మికులను కేటాయించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, సర్పవరం**

**సమస్య:** గొల్లప్రోలు కరణంగారి తోటలో వ్యర్థాలతో కాలువ మూసుకుపోయి మురుగు ప్రవహించక దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

**పరిష్కారం:** ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్‌కు చెప్పగా సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

**సమస్య:** పిఠాపురం సీతయ్యగారి తోటలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. **- రమేష్**

**పరిష్కారం:** తాగునీటి సరఫరా పర్యవేక్షణాధికారి జగన్నాథ్‌కు చెప్పగా మరమ్మతులు చేయించి వృథాకు అడ్డుకట్ట వేశారు. **- న్యూస్‌టుడే, పిఠాపురం**

**సమస్య:** పెద్దాపురం పట్టణంలో శివాలయం వీధిలో చెత్తకుప్పలతో ఇబ్బంది పడుతున్నాం. **- ప్రసాద్, పెద్దాపురం**

**పరిష్కారం:** పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలపగా తొలగింపు చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

**సమస్య:** ఉప్పాడ పంచాయతీ వినాయక ఆలయం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

**పరిష్కారం:** పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది పంపి చెత్త తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, కొత్తపల్లి**

# ఆదిలోనే ఆందోళన.. సాగునీటికి నిరీక్షణ

### రబీ నారుమళ్లు వేసిన రైతులు

న్యూస్‌టుడే - పిఠాపురం

పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ గ్రామీణ నియోజకవర్గాల్లో ఖరీఫ్ పనులు పూర్తి చేసిన రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని 25 రోజుల క్రితం జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ప్రకటించడంతో పీబీసీ (పిఠాపురం బ్రాంచి కెనాల్) ఆయకట్టు కింద నారుమళ్ల ప్రక్రియ చేపట్టారు. ఈ నెల 1న తూర్పు డెల్టాకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 4,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో 3 వేల క్యూసెక్కులు మండపేట వైపు మళ్లించారు. మిగిలిన 1,400 క్యూసెక్కులు పీబీసీకి వదిలారు. క్రమేణా ప్రవాహం తగ్గిపోయి ప్రస్తుతం 200 క్యూసెక్కులు కూడా రావడం లేదు. నారుమళ్లు వేసి 15 రోజులు అవుతున్నా శివారుకు నీరు చేరకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ప్రవాహం లేని చిత్రాడ పీబీసీ కాలువ

మండలాల వారీగా ఆయకట్టు ఎకరాల్లో

| మండలం | పీబీసీ | ఏలేరు |
|---|---|---|
| పిఠాపురం | 2,135 | 21,027 |
| గొల్లప్రోలు | 5,115 | 1,044 |
| కొత్తపల్లి | 14,076 | -- |
| పెద్దాపురం | -- | 9,692 |
| సామర్లకోట | 5,076 | -- |
| కాకినాడ రూరల్ | 2,907 | -- |

### నేడు ఏలేరు జలాల విడుదల..

ఏలేరు కింద 31,763 ఎకరాల ఆయకట్టు ఉంది. సోమవారం ఏలేరు ప్రాజెక్టు నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఈ నీరు వస్తే రబీ సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు ఎదురుచూస్తున్నారు.

### మూడు రోజుల్లో పుష్కలంగా నీరు..

పీబీసీ నుంచి ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీరు వస్తోంది. మరో రెండు రోజుల్లో 400 క్యూసెక్కులు వస్తుంది. ప్రస్తుతం నారుమళ్లకు నీరు బాగానే ఉంది. నాట్లు వేసేందుకు నీరు కావాలని కోరుతున్నారు. ఏలేరు నుంచి కూడా సోమవారం నుంచి 500 క్యూసెక్కులు నీరు విడుదలవుతుంది. నాట్లు సమయానికి 1200 క్యూసెక్కుల నీరు అందుతుంది. మూడు రోజుల్లో శివారు ఆయకట్టుకు నీరు అందుతుంది. రైతులు ఆందోళన చెందనవసరం లేదు. **- సంతోష్‌కుమార్, డీఈఈ, పీబీసీ**

## నిబంధనలకు విరుద్ధం.. ప్రమాదాల పయనం

రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం పట్టణానికి వచ్చే పలు భారీ వాహనాలు గుర్రాల సెంటర్‌లో ఎడమవైపు నుంచి కాకుండా నేరుగా వెళ్తుండటంతో జగ్గంపేట వైపు నుంచి పట్టణంలోకి ప్రవేశించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరూ ఊహించని ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు కూడా ఇవి అడ్డుగా వస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. దీనిపై ఎస్సై వి.మౌనిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

## 17న పెన్షనర్ల దినోత్సవం

పెద్దాపురం, న్యూస్‌టుడే: ఈ నెల 17న స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న పింఛనుదార్ల సంఘ భవనంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు సంఘం పట్టణ అధ్యక్షుడు ఎస్.సుదర్శన్ తెలిపారు. 75 సంవత్సరాలు నిండిన సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పింఛనుదార్లంతా హాజరుకావాలని కోరారు.

## విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పట్టణ పరిధి 33 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరిశ్రమల ప్రాంతానికి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు. పెద్దాపురం నుంచి సామర్లకోట ఏడీబీ రహదారిలోని అన్ని పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

## కాలనీవాసులకు మందుల పంపిణీ

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్ బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివారం వాకర్స్ సంఘం, కాకినాడ ట్రినిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మధుమేహంపై డా.రామ్మూర్తితో ఉచిత వైద్యశిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వాకర్స్ సంఘ సభ్యులు, కాలనీవాసులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రత్నప్రసాదరావు, శ్రీధర్, శ్రీవాణి, కుమార్‌యాదవ్, సుబ్బారావు, సూర్యనారాయణ తదితరులు సేవలు అందించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో ఇంటి నుంచే పనిచేస్తూ డబ్బు సంపాదించుకోవచ్చని ఆశచూపి మోసపూరిత లింకులు పంపి డబ్బు దోచుకుంటున్న కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. మోసపోయినట్లు గుర్తించిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

## సూర్యనారాయణస్వామి కల్యాణానికి ఏర్పాట్లు

పెద్దాపురం, న్యూస్‌టుడే: జి.మామిడాడలో సూర్యనారాయణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో సభ్యులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జనవరి 25న రథసప్తమి, 29న ఏకాదశి నాడు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని తీర్మానించారు.

రథం లాగుతున్న భక్తులు

### కనకదుర్గమ్మ రథోత్సవం

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట పట్టణంలోని ఖాజీ మార్కెట్ సెంటర్‌లో కనకదుర్గ అమ్మవారి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసం సందర్భంగా నెల రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 18న అఖండ దీపోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. కోలాటం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

### ఉత్సవాలకు సిద్ధం..

పిఠాపురం, న్యూస్‌టుడే: ధనుర్మాస ఉత్సవాలకు పిఠాపురంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం సిద్ధమవుతోంది. ఆలయ అర్చకుడు విజయ జనార్దనాచార్యులు సుందరంగా విగ్రహాలను ప్రత్యేక పూలతో అలంకరించారు.

## 36 ఏళ్ల నాటి స్నేహం

పిఠాపురం: వారంతా 36 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్నారు. ఉప్పాడ కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1989లో పదో తరగతి పూర్తిచేసిన వీరంతా అయిదేళ్ల క్రితం వాట్సాప్ గ్రూపు ద్వారా ఒకటయ్యారు. అప్పటి నుంచి ఏటా డిసెంబరులో సమావేశమవుతున్నారు. పూర్వ విద్యార్థి ఉప్పులూరి సురేష్‌కు చెందిన మామిడి తోటలో కలుసుకున్నారు. ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేసి, కలిసి భోజనాలు చేశారు. చిన్ననాటి సంగతులు, స్నేహితుల బాగోగులు తెలుసుకున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో..

## అయిదు దశాబ్దాలకు కలుసుకున్నారు..

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలులోని శ్రీ శేర్ పేరాజ్ లంబాజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 50 ఏళ్ల తరువాత ఆత్మీయ సమ్మేళనంలో స్నేహితులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. చిన్ననాటి సంగతులు, కుటుంబ పరిస్థితులను ముచ్చటించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి 59 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు చేసిన గోల్డెన్ జూబ్లీ కమిటీని స్నేహితులు అభినందించారు.

## పూర్వ విద్యార్థికి సత్కారం

చక్రపాణి దంపతులను సన్మానించిన హెచ్ఎం రాజ్యలక్ష్మి

గొల్లప్రోలు: గొల్లప్రోలులో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల చుట్టూ రూ.50 లక్షలతో ప్రహరీ నిర్మించిన పూర్వ విద్యార్థి రెడ్డి చక్రపాణి, నిర్మల దంపతులను హెచ్ఎం రాజ్యలక్ష్మి, సిబ్బంది ఆదివారం సన్మానించారు. 1975-76లో పదో తరగతి చదివిన చక్రపాణి సొంత నిధులతో మూడున్నర ఎకరాల్లో ఉన్న పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారన్నారు. తన తండ్రి నాగూరయ్య పేరిట సేవలందిస్తున్న చక్రపాణిని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

## నియంత్రిక.. రక్షణలేక..

రమణయ్యపేట కాపుల రామాలయం వద్ద విద్యుత్తు నియంత్రిక ఎలాంటి రక్షణ కవచం లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. సత్యనారాయణ అనే పాఠకుడు 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. రక్షణ కవచం లేక మనుష్యులతోపాటు పశువులకూ అపాయకరంగా ఉంది. ఏఈ రాజు చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, సర్పవరం**

## రాళ్లుతేలి ఛిద్రం.. ప్రయాణం నరకం

గుడివాడ నుంచి పులిమేరు వెళ్లే రహదారి ఛిద్రం కావడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర గుంతలు, రాళ్లుతేలి అధ్వానంగా తయారయింది. ఈ సమస్యను ర.భ.శాఖ డీఈఈ రాఘవరావు దృష్టికి తీసుకువెళ్లగా రహదారి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. **– న్యూస్‌టుడే, పెద్దాపురం**

## చెత్త పేరుకుపోయి ఇక్కట్లు

గొల్లప్రోలు ఈబీసీ కూడలిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన, దోమల ఉద్ధృతితో అగచాట్లు పడాల్సి వస్తుంది. చెత్తను తొలగించే పనులు చేపడతామని ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ తెలిపారు. **– న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

## అల్లుకుంటున్న అపాయం..



కరప మండలం పెదకొత్తూరులోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో విద్యుత్తు స్తంభానికి ముళ్లతీగలు అల్లుకోవడంతో ఎప్పుడే ప్రమాదం చోటుచేసుకుంటుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమస్య గురించి ఏఈ ఈశ్వర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి ఆయా ప్రాంతాల్లో అల్లుకున్న ముళ్ల తీగలను తొలగిస్తామని తెలిపారు. **– న్యూస్‌టుడే, కరప**

## రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం

పెద్దాపురం పట్టణం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారిపై డంపర్ బిన్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డు దిగువన కాకుండా వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉంచడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా డంపర్‌బిన్‌ను రహదారి పక్కకు జరిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, పెద్దాపురం**

## హక్కులపై అవగాహన

సర్పవరం: వాకలపూడిలో ఆదివారం 'ది వాకలపూడి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్', ఆల్ ఇండియా ఉమెన్స్ ఆర్గనైజేషన్ దిల్లీ శాఖ, మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ కార్యదర్శి, కుడా మాజీ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారులు కమిషన్ ప్రతినిధులు చెక్కా సుశీల, చాగంటి నాగేశ్వరరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాజీ కార్పొరేటర్ ఉషారాణి, ప్రతినిధులు అమ్మాణి, మంగాదేవి, భవానీ పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల క్రిస్మస్ వేడుకలు

పిఠాపురం: పట్టణంలోని ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరీ (ఏబీసీ) చర్చిలో ఆదివారం సాయంత్రం చిన్నారుల (సండే స్కూల్ విద్యార్థులు) క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నృత్య ప్రదర్శనలు, శాంతాక్లాజ్ వేషధారణ, నాటికలు ఆకట్టుకున్నాయి. పాస్టర్ థియోఫిలాస్, అధ్యక్షుడు గుబ్బల సాల్మన్ రాజు, సండే స్కూల్ సూపరింటెండెంట్ దేవర్శిని డానియేల్, డాక్టర్ గుబ్బల అనిలా, సుజాతీ కెనడి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

## రబీకి ఆందోళన చెందొద్దు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలంలో ఏర్పడిన సాగునీటి కొరత గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో జనసేన నాయకుల బృందం యండపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంది. మాజీ ఎమ్మెల్యే దొరబాబు, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, జ్యోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకర్ పేరు పెట్టే వరకు ఉద్యమం

వాహనాలను ప్రారంభిస్తున్న వీరబాబు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసిన దివంగత మల్లాడి సత్య లింగ నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు నామకరణం చేసే వరకు ఉద్యమం ఆగదని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు అన్నారు. కాకినాడలో జరిగిన సభకు తాళ్లరేవు మండలానికి చెందిన అగ్నికుల క్షత్రియులంతా ఆదివారం కాకినాడ తరలి వెళ్లారు. వాహనాలకు ఆయనతో పాటు తెదేపా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, సాధన సమితి నాయకుడు ఓలేటి నరసింహమూర్తి జెండా ఊపి ప్రారంభించారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: దుర్గాడలో ఇద్దరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆదివారం అందజేశారు. తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మల బాబు, మండల యువత అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీపతి, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ బేతా సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మడికి సన్యాసిరావు పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** మండలానికి చెందిన 16 మందికి వైద్య ఖర్చుల కోసం రూ.7 లక్షల చెక్కులను బాధితులకు మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

## సంక్రాంతికి రహదారుల నిర్మాణాలు పూర్తి

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలకు అత్యధిక నిధులు కేటాయించిందని, సంక్రాంతికి నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కోరింగలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.72 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. పాత కోరింగ సమీపంలో రూ.13 కోట్లతో వంతెన నిర్మాణం చేస్తామన్నారు. పంచాయతీరాజ్ డీఈ బి.సత్య శ్రీనివాస్, మండల ఇంజినీర్ కె.అప్పారావు, సర్పంచి పెయ్యల మంగేష్, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి పాల్గొన్నారు.

## మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వ్యవసాయ కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కమిడి సత్య శ్రీనివాస్ అన్నారు. తాళ్లరేవులో ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన సభలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ నెల 16, 17 తేదీల్లో తాళ్లరేవులో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రెండవ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. సభలకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హాజరు కానున్నారన్నారు. సంఘ మండల అధ్యక్షుడు దుప్పి అదృష్టదీపకుడు, నేరుడుమిల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

## రానా పుట్టినరోజు వేడుకలు

పిఠాపురం : సినీ నటుడు రానా పుట్టిన రోజు వేడుకలను ఆదివారం పిఠాపురంలో ఘనంగా నిర్వహించారు. హీరో వెంకటేష్, హీరో రానా హెల్పింగ్ హ్యాండ్స్ సిద్ధం చేసిన సంక్రాంతికి వస్తున్నాం బుక్ ఆఫ్ రికార్డ్స్ పుస్తకాన్ని పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో ఎస్సై మణికుమార్ ఆవిష్కరించారు. అభిమాన సంఘ నాయకులు వడ్డి నాని, సాయి, నాగబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

## అద్దె భవనాలు.. నేలపైనే నిద్ర

న్యూస్‌టుడే, తాళ్లరేవు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులంతా కళాశాలలో చదువుకుంటూ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్నారు. వీరంతా బి.ఫార్మసీ, ఇంజినీరింగ్, డిప్లొమా చదువుతున్నారు. తాళ్లరేవు మండలం కొత్త కోరింగలో పోస్టు మెట్రిక్ ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలుర వసతి గృహాలు వేర్వేరుగా ఉన్నాయి. వీటిలో 245 మంది విద్యార్థులు ఉన్నారు. మూడు వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనం లేని దుస్థితి.

కొత్త కోరింగలో బీసీ బాలుర వసతి గృహంలో నిద్ర పోతున్న విద్యార్థులు

### ఇదీ పరిస్థితి..

ఎస్సీ బాలికల వసతి గృహంలో 83 మంది ఉన్నారు. విద్యార్థినులంతా నాలుగు ఇరుకు గదుల్లోనే ఉంటున్నారు. అక్కడే పుస్తకాలు, దుస్తులు ఉన్న చోటనే వీరంతా నేలపైనే నిద్ర పోతున్నారు. మంచాలు, చాపలు లేవు, దుస్తులు భద్రపరుచుకునేందుకు పెట్టెలు లేవు. ఆర్వో ప్లాంట్లు సదుపాయం లేదు. కాస్మోటిక్ ఛార్జీలు బాలికలకు రూ.250, బాలురకు రూ.100 చెల్లిస్తున్నారు. చలి కాలం నేలపై నిద్ర పోయేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ ప్రైవేట్ కళాశాల నుంచి డబ్బాలతో నీళ్లు తెచ్చుకుని విద్యార్థులు తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## కొత్త విధానాలు తెలుసుకున్నాం.. ఆచరిస్తాం

• శిక్షణ పూర్తిచేసుకున్న మత్స్యకారులు

ఉప్పాడ చేరుకున్న మత్స్యకారులు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం యు.కొత్తపల్లి మండలంలోని 60 మంది మత్స్యకారులను రెండు బృందాలుగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో శిక్షణకు పంపింది. వారు శిక్షణ పూర్తిచేసుకుని ఆదివారం రాత్రి తిరిగి ఉప్పాడకు చేరుకున్నారు. ఈ నెల 8న ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లిన మత్స్యకారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో వారంపాటు పర్యటించాయి. మత్స్యశాఖ అధికారులు వారికి స్వాగతం పలికారు.

### చేపల నుంచి ఉత్పత్తుల తయారీ

కేరళలోని నిఫాట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేపలతో అనేక ఉత్పత్తులు తయారు చేస్తున్న విధానం బాగుంది. తయారీ విధానంపై మాకు శిక్షణ ఇచ్చారు. అక్కడ హార్బర్, అనుసరిస్తున్న విధానాలు బాగున్నాయి. **- సూరాడ శ్రీను**

### వలల తయారీ విధానం తెలుసుకున్నాం

కేరళ, తమిళనాడులో వలల తయారీ, చేపలు శుభ్రం చేయడం, ఐస్‌లో నిల్వ చేసే అంశాలను తెలుసుకున్నాం. నేను నేర్చుకున్న అంశాలపై ఇక్కడ యువతకు అవగాహన కల్పిస్తా. **- మైలపల్లి రవి**

(c) eenadu

# తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

## కెరటాలతో ఆట.. తీరంలో సందడి

ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు చిన్నారులతో దానవాయిపేట తీరం సందడిగా మారింది. చిన్నారులు సముద్ర కెరటాలతో ఆటాడుకుంటూ సరదాగా గడిపారు. పలువురు స్వీయచిత్రాలు తీసుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు.

– న్యూస్‌టుడే, తొండంగి

## ఘనంగా సత్యదేవుని రథ సేవ

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడు సార్లు ఊరేగించారు. భక్తులు స్వామి సేవలో పాల్గొన్నారు.

రథంపై స్వామి, అమ్మవార్లు

## అన్ని దారులూ మురారి దుర్గమ్మ తోట వైపే..

గండేపల్లి మండలం మురారి దుర్గమ్మ అమ్మవారి తోటకు వెళ్లే భక్తులకు ఆహ్లాదం, భక్తి పరవశమే. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాలోని పలుగ్రామాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి తోటకు పోటెత్తారు. తీర్థం వెళ్లిన మొదటి ఆదివారం కావడంతో దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని, తోటలో కుటుంబాలతో గడిపి వెళ్లారు. - న్యూస్‌టుడే, గండేపల్లి

తోటంతా భక్తులు, వారి వాహనాలతో ఇలా..

## రద్దీకి తగ్గ సర్వీసుల్లేవ్..!

• ప్రయాణికులకు తప్పని అవస్థలు

రౌతులపూడి, కోటనందూరు, శంఖవరం, న్యూస్‌టుడే: రౌతులపూడి, కోటనందూరు, శంఖవరం మండలాల నుంచి రోజూ వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక.. బస్సుల్లో రద్దీ పెరిగింది.పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణం సాగించే వారే అధికంగా ఉన్నారు. బస్సుల్లో నిండుగా ప్రయాణికులు ఉండడంతో పలు చోట్ల బస్సులు నిలపని పరిస్థితి నెలకొంది.

సర్వీసులు పెంచాలనే డిమాండ్: కాకినాడ - కోటనందూరు, తుని - కోటనందూరు - కాకినాడ, తుని - నర్సీపట్నం, తుని - కాకినాడ, రాజమహేంద్రవరం - తుని సర్వీసులు ఈమండలాల్లో నడుస్తున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాలు, వారాంతాల్లో రద్దీ అధికంగా ఉంటోందని, రద్దీకి తగ్గట్టు సర్వీసులు పెంచాలనే డిమాండ్ కొన్ని రోజులుగా ఉంది. ఆయా సమయాల్లో బస్సు ఎక్కేందుకు కూడా ఖాళీ ఉండడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఫుట్‌బోర్డుపైనే ఉండి ప్రయాణం చేయాల్సి ఉండడంతో, ప్రమాదాలు జరిగే అవకాశమూ ఉంది. శంఖవరం మండలంలోని ఉపప్రణాళికా ప్రాంతమైన పెదమల్లాపురం ప్రాంతానికి ఇటీవల బస్సు సర్వీసు కేటాయించడంతో వారి ఏళ్ల కళ సాకారమయ్యింది. రౌతులపూడి మండలంలోని రాఘవపట్నం, ఎస్.పైడిపాల, గుమ్మరేగుల ప్రాంతానికి తుని డిపో నుంచి బస్సు నడపాలనే డిమాండ్ ఉంది. రౌతులపూడి నుంచి తుని ప్రాంతానికి ఒక్క సర్వీస్ మాత్రమే నడుస్తోంది, మరో సర్వీసు పెంచాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం కోటనందూరు- కాకినాడకు అదనపు సర్వీసులు నడపాలి. ప్రైవేటు సర్వీసులు తక్కువగా నడిచే శంఖవరం, రౌతులపూడి ప్రాంతాల్లో ప్రజలు ఆర్టీసీ సర్వీసులపైనే అధికంగా ఆధారపడుతున్నారు. కత్తిపూడిలో నెల్లిపూడి సెంటరు, రౌతులపూడిలో బస్సు షెల్టర్లు, రౌతులపూడి సామాజిక ఆసుపత్రి వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేయాల్సి ఉంది. రద్దీ దృష్ట్యా సర్వీసులను పెంచడం ద్వారా ఆయా మార్గాల్లో ప్రయాణం సాగించే వృద్ధులు, విద్యార్థులు, మహిళలకు సౌకర్యంగా ఉంటుంది.

## చుట్టూ అంధకారం.. ప్రయాణ సంకటం..?

• హైవేపై మరమ్మతులకు గురవుతున్న దీపాలు

గండేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి ప్రయాణం అంటే వేగంగా తక్కువ సమయంలో గమ్యాన్ని చేరవచ్చు. అయితే ఈ ప్రయాణం పగలు మాత్రమేనా, రాత్రులు పరిస్థితి ఏమిటని వాహనదారుల ప్రశ్న. ఎందుకంటే హైవేపై రాత్రి సమయాల్లో వెలగాల్సిన దీపాలు వెలగకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన రోడ్డు నిర్వాహకులు, పోలీసులు నిఘా లోపంతో ఇబ్బందులు తప్పడం లేదు.

హైవే పరిధిలోని వివరాలివా..

| మండలం | కి.మీ. | కూడళ్లు |
|---|---|---|
| గండేపల్లి | 16 | 8 |
| జగ్గంపేట | 3 | 2 |
| ఏలేశ్వరం | 6 | 3 |
| ప్రత్తిపాడు | 7 | 4 |
| తుని గ్రామీణం | 15 | 5 |

78 కి.మీ. మేర వెలగకపోవడంతో..

రాజానగరం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నాలుగు నియోజకవర్గాల పరిధిలో హైవే ఉంది. ఈ నియోజకవర్గాల్లో రహదారిపై పదుల సంఖ్యలో గ్రామాలు, కూడళ్లు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలోనూ, కూడళ్ల వద్ద రాత్రి సమయాల్లో వాహనదారులు, రహదారి వెంబడి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా హైవే దీపాలు రాత్రి సమయాల్లో వెలుగుతూ ఉండాలి. ఇవి అన్నిచోట్ల తరచూ ఒకేసారి మొరాయిస్తుండడం ప్రమాదాలకు తావిస్తోంది.

మల్లేపల్లిలో చీకటిలో బిక్కుబిక్కుమంటూ కూడలి దాటుతున్న గ్రామస్థులు

చీకట్లో కనిపించని రెడ్‌కోన్స్

దివాన్‌చెరువు నుంచి తుని వరకు రహదారిపై 90 కి.మీ పరిధిలో 60కిపైగా బ్లాక్ స్పాట్‌లు, 120 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ పరిధిలో కొన్నిచోట్ల నిర్వాహకులు ప్రస్తుతం రోడ్డు పనులు చేస్తున్నారు. అప్పుడే వేసిన రోడ్లపై వాహనాలు వెంటనే తొక్కకుండా రాత్రి సమయాల్లో ఒకవైపు రెడ్‌కోన్స్ వదిలేస్తున్నారు. దీపాలు వెలగకపోవడం, గాలికి అడ్డదిడ్డంగా పడిన కోన్స్ వలన రోజూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. హైవేపై నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం భారీ ప్రమాదాలకు తావిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

హెచ్‌జీ ఫ్యూజ్ తెగడంతో దీపాలు వెలగడం లేదు

విద్యుత్తు నియంత్రికల నుంచి హైవే దీపాలకు సరఫరా అయ్యే హార్న్ గ్యాప్ ఫ్యూజ్ మరమ్మతులకు గురవ్వడంతో దీపాలు వెలగడం లేదు. నిర్వహణ పనులు జరుగుతున్నపుడు కేబుల్స్ మరమ్మతులకు గురవ్వడంతో దీపాలు అక్కడక్కడ వెలగడం లేదు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. అన్నిచోట్ల దీపాలు వెలిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. - శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్, ఎన్‌హెచ్ నిర్వహణ

## సీఆర్‌ఎంటీల ఆత్మగౌరవ దీక్ష

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత, వేతనాలు పెంపుదల, డీఎస్సీలో వెయిటేజీ తదితర డిమాండ్లతో సీఆర్‌ఎంటీలు చేపడుతున్న ఆత్మగౌరవ దీక్షను విజయవంతం చేయాలని సీఆర్‌ఎంటీ సంఘ ప్రతినిధులు జీవీవీ సత్యనారాయణ, రామకృష్ణ, రవి కోరారు. డిసెంబరు 15న కాకినాడ కలెక్టరేట్ ముందు, 22న అమరావతిలో ఎస్పీడీ కార్యాలయం ముందు చేపట్టే ఈ దీక్షలకు ప్రతి సీఆర్‌ఎంటీ హాజరుకావాలన్నారు. గత ఐదేళ్లుగా జీతాలు పెరగక ఇబ్బంది పడుతున్నామన్నారు. సీఆర్‌ఎంటీలకు క్లస్టరు విధానం రద్దు చేయాలనే తదితర 12 డిమాండ్లతో ఈ దీక్ష జరుగుతుందన్నారు.

## రాష్ట్ర స్థాయి పరుగు పోటీలకు విద్యార్థిని ఎంపిక

శంఖవరం, న్యూస్‌టుడే: తొండంగి మండలం జి.ఎం.పేటలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కె.కొత్తూరు పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని దుర్గాభవాని ప్రతిభచాటింది. జిల్లాస్థాయిలో అండర్-16 విభాగంలో 2 కి.మీ.పరుగుపందెంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినికి వ్యాయామ ఉపాధ్యాయులు బాబురావు, హెచ్‌ఎం రామేశ్వరరావు, సీతారామయ్య తదితరులు అభినందించారు.

జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

## జీఎంపేటలో మండలస్థాయి అథ్లెటిక్ పోటీలు

తొండంగి, న్యూస్‌టుడే: జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన క్రాస్ కంట్రీ మీట్ కమ్ సెలక్షన్స్ మండల స్థాయి పోటీలు శ్రీకృష్ణ యాదవ యూత్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జీఎంపేటలో నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీలు సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌రెడ్డి, గోపిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో అద్దరిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పిక్కి జగదీష్, యజ్జల లక్ష్మణ్‌తేజ 2, 6 కి.మీ పరుగు పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24న పెద్దాపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ చూపిన వారికి నాయకులు యనమల రాజేష్, కోడ వెంకటరమణ, తాటిపర్తి శ్రీను, దూలం మురళి, చొక్కా కాశి, రమణ, తదితరులు పతకాలు ప్రదానం చేశారు.



సామాజిక మాధ్యమ కార్యకర్తలతో ఎమ్మెల్యే సత్యప్రభ

## అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నెటిజన్లందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని పార్టీ సామాజిక మాధ్యమ కార్యకర్తలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. పెదశంకర్లపూడి తెదేపా కార్యాలయంలో వారితో ఆదివారం సమావేశమయ్యారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనినీ, గణాంకాలు, దృశ్యాలు, పక్కా సమాచారంతో ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ బలోపేతానికి దోహదపడేలా ప్రతి సామాజిక మాధ్యమ కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రత్యర్థుల దుష్ప్రచారాలను ఎప్పటికపుడు తిప్పికొడుతూ వేగంగా, వివరంగా అన్ని వేదికలపైనా సమాచారం చేరవేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## అరెకరంలో ఎకరం దిగుబడి

స్ఫూర్తి

ఉన్నది అరెకరం అయితే సాగు మాత్రం ఎకరంలో వచ్చే దిగుబడి. ఇదేలా సాధ్యం అంటున్నారా.. తుని మండలం లోవకొత్తూరు గ్రామ రైతులను పలకరిద్దాం... గ్రామానికి చెందిన రైతు తనకున్న అరెకరం భూమిలో క్యాబేజీ పంట సాగు చేస్తున్నారు. వాటి మధ్య ఉన్న నిడివిలో బంతి, చామంతి పూల మొక్కలు సాగు చేయడంతో ఎకరం సాగులో చేపట్టే దిగుబడిని సాధించడం విశేషం. కూరగాయ పంటల మధ్యలో పూల సాగు చేపట్టడం ద్వారా తెగుళ్ల వ్యాప్తిని నివారించడంతో పురుగుల మందు వినియోగం తగ్గడంతో పెట్టుబడి తగ్గుతుందని వ్యవసాయాధికారులు తెలపడం విశేషం. ఆ దిశగా గ్రామంలోని రైతులు అంతరపంట సాగుపై దృష్టిసారించి లాభాల బాటన నడుస్తున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

## అద్దంలా మార్గం.. వాహనదారుల హర్షం

గండేపల్లి మండలం జడ్.రాగంపేట నుంచి నాయకంపల్లి వెళ్లే ర.భ.శాఖ రోడ్డును 3 కి.మీ. మేర రూ.80 లక్షలతో ఇటీవల పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ దారిలో రాకపోకలు సాఫీగా ఉంటున్నాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

## బండెనక బండి.. ప్రమాదాల తోవ

రాత్రి సమయంలో హైవేపై నిలిపిన వాహనాలను ఢీకొనడంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే వాటిని నివారించాల్సిన నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. మండలంలోని వి.కొత్తూరు, తిమ్మాపురం, తేటగుంట జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్స్ వద్ద వాహనచోదకులు రోడ్డుపై ఇలా వాహనాలు నిలపడం వల్ల తరుచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితిని నివారించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

## ప్లాస్టిక్ సంచులే పంటకు రక్ష

తొండంగి మండలంలో ఖరీఫ్ పంట కోత దశకు చేరుకుంది. ఇలాంటి సమయంలో పక్షులు తరచూ పంటను ఆరగిస్తున్నాయి. చేతికొచ్చిన పంట పక్షుల పాలవుతుందని కొందరు తొండంగి, కృష్ణాపురం గ్రామాలకు చెందిన కొంతమంది రైతులు పండిన వరి పంట చుట్టూ కర్రలు పాతి వాటికి ప్లాస్టిక్ సంచులు కట్టారు. గాలులకు ఆ సంచుల నుంచి శబ్దాలు వస్తుండడంతో పక్షులు పంటపై వాలడం లేదు. – న్యూస్‌టుడే, తొండంగి

## నీరు రాదు.. గొంతు తడవదు

ధర్మవరం గ్రామంలోని ఐదో వార్డులో తాగునీటి కష్టాలు చిత్రంగా ఉన్నాయి. గతంలో డాబాపై ట్యాంకుకు కొళాయి నీరు అలవోకగా వెళ్లే పరిస్థితి నుంచి 3 నుంచి 6 అడుగుల లోతు సంపులో గొట్టం అమర్చినా నీటి సరఫరా అవ్వడం లేదు. జీఎల్ఆర్‌తో నీరు అందిస్తున్నామని పంచాయతీ వర్గాలు చెపుతున్నా నీటి ఎద్దడి వెంటాడుతోంది. పెరిగిన అవసరాలకు అనుగుణంగా నీటి పథకాలు అందుబాటులో లేకపోవడంతో పాటు పూర్వపు పైపులైన్ల తీరును సమీక్షించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతోందని అంటున్నారు. ఈవిషయమై పీజీఆర్ఎస్‌లో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుకు కొత్తగా పైపులైను వేస్తామని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. – న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

## కోనేరు ఆధునికీకరణ పనులు ప్రారంభం

జగ్గంపేట గ్రామీణం: రాజపూడిలో శ్రీదుర్గా రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కోనేరు ఆధునికీకరణ పనులు ఆదివారం ప్రారంభించారు. 'ఉపాధి హామీ' పథకం నిధులతో చేపట్టనున్న ఈ పనులను తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ప్రారంభించారు. నాయకులు యస్వియస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, ఆలయకమిటీ ఛైర్మన్ ముచ్చు సూరిబాబు, వైస్ ఛైర్మన్ గెడ్డం శ్రీను, ప్రధాన అర్చకులు పాలంకి బద్రినారాయణమూర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న జ్యోతుల నవీన్

## రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని జె.అన్నవరంలో రూ.32.9 లక్షలతో నిర్మించే రక్షిత తాగునీటి పథకానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఈమేరకు తెదేపా మండల అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, గ్రామ నాయకులు బాజింకి కన్నారావు శ్రీనివాస్, శ్రీకాంత్, సత్యనారాయణ తదితరులు భూమి పూజ చేశారు. జల్‌జీవన్ నిధులతో నిర్మిస్తున్న ఈ నీటి పథకం వల్ల గ్రామంలో తాగునీటి సమస్య ఉండదన్నారు.

జె.అన్నవరంలో ..

## సమాజాభివృద్ధికి కృషి చేయాలి

శంఖవరం, న్యూస్‌టుడే: హిందూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మప్రచారక్ పి.వి.జగన్నాథ్ అన్నారు. కత్తిపూడిలో వర్తక సంఘం కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రత్తిపాడు ఖండ హిందూసమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచ సూత్రాలు అందరూ పాటించాలన్నారు. చిన్నారుల నృత్య, నాటిక ప్రదర్శనలు అలరించాయి. కోట కృష్ణకుమార్, ప్రేమజ్యోతి, జ్యోతుల శ్రీనివాస్, గౌతు అర్జిబాబు, రామలింగేశ్వరరావు, రమణ, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ఖండ సభ్యులు

## లోవకు పోటెత్తిన భక్తజనం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానంలోని వసతి గదులు నిండిపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలోని చెట్లుకింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 15 వేలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దేవస్థానానికి రూ.5.20 లక్షలు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

లోవలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

## నైతిక విలువలతో ముందుకు సాగాలి

తుని, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ నైతిక విలువలతో ముందుకు సాగాలని సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు యువిఏఎన్ రాజు అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీసత్యసాయి మందిర్‌లో సుపథ స్వచ్ఛంద సేవా సంస్థ, జగద్గురు పీఠం (విజయనగరం) ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాతృభాష, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, విలువలు పెంపొందించేందుకు గత 22 ఏళ్లుగా సంస్థ కృషిచేస్తున్నట్లు రాజు వివరించారు. ప్రతిభా పరీక్షల్లో 18 పాఠశాలల నుంచి 376 మంది విద్యార్థులు పాల్గొని తెలుగు భాష నేర్చుకుందాం, పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, శ్రీకృష్ణ చరితామృతం వంటి వాటిలో పోటీపడ్డారు. ప్రముఖులు చక్కా కామేశ్వరరావు, దండెం మధుసూదన్‌రావు, గ్రంధి వెంకట గణేష్, పద్మజలు విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందించిన ప్రముఖులు

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు సమీపంలోని నరేంద్రగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. ఢీకొన్న వాహనం వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వయసు 40 ఏళ్ల లోపు ఉంటుందని ఎర్ర చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు, గుండుతో ఉన్నాడని, ఘటనాస్థలంలో ఎటువంటి ఆధారాలు లేవని ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. ఆచూకీ తెలిస్తే 94407 96570, 94407 96530 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పెట్టుబడి సాయం.. రైతుకు ఊతం

న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం: సన్న, చిన్నకారు రైతులకు పంటల పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలతో రైతులకు మేలు చేకూరుతుంది. సాగును లాభసాటిగా మార్చడమే ప్రధాన లక్ష్యంగా ఆర్థిక స్థిరత్వం, భరోసా కల్పించడం కోసం నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట సాగు చేసే సమయంలో పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి నష్టపోకుండా ఏటా ఒక్కో రైతుకు రూ.20వేలు మూడు దఫాలుగా జమ చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు ఏర్పడిన నష్టాల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుంది.

సాగుకు దమ్ము

రైతులకు ప్రయోజనం..: ఖరీఫ్, రబీ పంటలు ప్రారంభ సమయంలో పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యాపారస్థులు, బ్యాంకుల నుంచి అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. రైతులకు ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ పథకాలతో రైతుకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవసాయాధికారులు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14 వేలు, పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6 వేలు మూడు దఫాలుగా జమచేస్తారు. అయితే 2019 రికార్డుల ఆధారంగానే పీఎం కిసాన్ నిధులు జమ అవుతున్నాయని దీంతో కొత్తగా ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు ఈ పథకం వర్తించడంలేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అలాగే డిపట్టా, భూదానం, ఇతర సాంకేతిక సమస్యలు ఉన్న కొందరు రైతులకు నగదు జమకావడంలేదని రైతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని త్వరలోనే పథకాలు వర్తించేలా చర్యలు చేపడతామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా...

అర్హులు, అనర్హుల వివరాలివీ..

| మండలం | లబ్ధి రైతులు | అనర్హులు |
|---|---|---|
| జగ్గంపేట | 8,635 | 178 |
| కిర్లంపూడి | 6,630 | 120 |
| గండేపల్లి | 9,368 | 58 |

అర్హులు అందరికీ పథకం..: మండల పరిధిలోని రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు వర్తించేలా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సాంకేతిక అడ్డంకులు తొలగించే చర్యలు చేపడుతున్నాం. రైతు బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, ఎన్‌పిసిఐ పూర్తికాని రైతులకు పథకం వర్తించడం లేదని అటువంటి రైతులను గుర్తించి వారి నుంచి అవసరమైన పత్రాలు తీసుకుని లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఇంకా ఎవర్కైనా పథకం వర్తించకపోతే గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందిని కలసి అవసరమైన పత్రాలు అందిస్తే పథకం వర్తించే విధంగా చర్యలు చేపడతాం.

- నరసింహం, వ్యవసాయాధికారి, జగ్గంపేట

## సురక్షితంగా తల్లి చెంతకు చిన్నారి

తుని పట్టణం: మార్కెట్‌లో తప్పిపోయిన చిన్నారి క్షేమంగా తల్లి చెంతకు చేరాడు. జంగారెడ్డిగూడెంనకు చెందిన జి.పరీక్షిత్ అనే నాలుగేళ్ల బాలుడు తల్లితో కలిసి తుని అమ్మమ్మ నివాసానికి వచ్చాడు. అయితే ఆదివారం మార్కెట్‌కు తల్లితో వెళ్లిన చిన్నారి రద్దీలో తప్పిపోయాడు. ఆమె ఎంత వెతికినా కనిపించకపోవడంతో సీఐ ఎం.గీతారామకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో తక్షణం స్పందించిన పోలీసులు వెతికి, ఫీడర్‌రోడ్డులో ఉన్న బాబును ఏఎస్సై రత్నం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తల్లితో పరీక్షిత్

## అగ్నిప్రమాదాల్లో అప్రమత్తతే ఆయుధం

గండేపల్లి, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాలపై అప్రమత్తతతో ఉండడమే మన ముందస్తు ఆయుధమని జగ్గంపేట అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ అన్నారు. జడ్.రాగంపేట శివారున ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సమస్య సంభవించినప్పుడు ముందుగా మనమే నిలువరించేందుకు డీసీపీ సిలిండర్, సీవో-2 సిలిండర్లతో ఏవిధంగా అరికట్టవచ్చో సిబ్బందికి వివరించారు. ఆసుపత్రి డైరెక్టర్ యర్రబాబు, సందీప్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

(c) eenadu

# నిధులిచ్చి.. దారిచూపి

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన కౌతాళం మండల పరిధిలో రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా హళ్విగోనికి రోడ్డు పూర్తిగా రూపు కోల్పోయింది. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనదారులు నరకయాతన అనుభవించేవారు. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ప్రభుత్వానికి నివేదికలు పంపగా వెంటనే నిధులు మంజూరయ్యాయి.

జరుగుతున్న రహదారి పనులు

**రూ.3 కోట్లు మంజూరు**

4.5 కిలోమీటర్ల మేర హళ్విగోనికి రహదారి నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో గుత్తేదారుకి పనులు అప్పగించారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇవి పూర్తైతే సుమారు 12 గ్రామాలకు చెందిన ప్రజల కష్టాలు తీరనున్నాయి. కౌతాళం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హళ్వి గ్రామం నుంచి కోసిగి మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఈ బాటకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ● గత ప్రభుత్వం రహదారి నిర్మాణానికి మంజూరు చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో పనులు జరుగుతుండటంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు డయల్ యువర్ సీఎండీ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సోమవారం ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్య 8977716661 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఈనాడు కర్నూలు
సోమవారం డిసెంబరు 15, 2025

జనవాసిపురం వద్ద ఏర్పాటు చేయనున్న స్మార్ట్ సిటీ

# గృహానందమే

**టౌన్‌షిప్‌లలో స్థలాల అభివృద్ధికి చర్యలు**

'స్మార్ట్ టౌన్‌షిప్'ల పేరుతో గత వైకాపా సర్కారు హడావుడి చేసింది. ఆ తర్వాత పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌గా మార్చింది. ప్రస్తుతం కడా పరిధిలో లేఅవుట్ల అభివృద్ధి కోసం టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎమ్మిగనూరులోని కాలనీలో మౌలిక వసతులకు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ

**భారీగా దరఖాస్తులు**

ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది పట్టణాల్లో 500 ఎకరాలు సేకరిస్తామని గత సర్కారు పేర్కొంది. చివరికి ఎమ్మిగనూరులో 110, ఆళ్లగడ్డలో 14.50 ఎకరాలు సేకరించారు. వసతుల కల్పనకు బనవాసిలో రూ.58 కోట్లు, ఆళ్లగడ్డలో రూ.8.93 కోట్లతో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు.

**ప్లాట్లుగా విభజించి..**

● ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారంలో 110.10 ఎకరాలు కేటాయించారు. మూడు సెంట్ల ప్లాట్లు 447, నాలుగు సెంట్లు 460, ఐదు సెంట్ల ప్లాట్లు 199గా విభజించారు. ● 39 ఎకరాల్లో ముళ్లపొదలు తొలగించారు. మట్టి రోడ్లు వేసి వదిలేశారు. 25 ఎకరాల్లో రాళ్లు పాతారు. రూ.25 లక్షలతో పనులు చేపట్టగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.18 లక్షల బిల్లులు చెల్లించారు. మిగిలిన 70 ఎకరాల్లో పనులు చేపట్టాల్సి ఉంది.

**ఈ-యాప్ పద్ధతిలో..**

బనవాసి టౌన్‌షిప్‌లో ఇళ్ల స్థలాలకు ఆన్‌లైన్లో 267 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న వారు ముందుగా పది శాతం చెల్లించాలి. ఒప్పందం చేసుకున్న తేదీ నుంచి నెలలోపు 30 శాతం, ఆరు నెలల్లోపు 30 శాతం, 12 నెలల్లోపు లోపు లేదా రిజిస్ట్రేషన్ సమయంలోగా మిగతా 30 శాతం చెల్లించాలని గత సర్కారు హయాంలో నిర్ణయించారు. ఈ పద్ధతిని మార్చి ఈ- యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# తవ్వకాలు.. ఇసుకేస్తే రాలనంత

**వాగులను కొల్లగొడుతున్న అక్రమార్కులు**

ఆలూరు గ్రామీణం, ఆస్పరి, న్యూస్‌టుడే : వాగులు, వంకల్లోని ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రతిరోజూ ట్రాక్టర్లలో భారీగా తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారికి కిలోమీటర్ల దూరంలో బీడు పొలాల్లో దారులు ఏర్పాటుచేసుకుని వాగు నుంచి ఇసుక తీసుకెళ్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ట్రాక్టర్లలో తరలుతున్న ఇసుక

**కన్నెత్తి చూడరు..**

ఆస్పరి మండల పరిధిలోని బిళేకల్లు, పుప్పాలదొడ్డి, యాటకల్లు గ్రామాలను ఆనుకుని హంద్రీ వాగు వెళుతుంది. వర్షాలు పడిన సమయంలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున ఇసుక మేటలు వేస్తోంది. ప్రకృతి పరంగా వస్తున్న ఆ ఇసుక అక్రమార్కులకు ఆదాయం సమకూరుస్తోంది. పలువురు పెద్దఎత్తున ఇసుక తవ్వి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. దూరాన్ని బట్టి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అయినప్పటికీ ఇటు రెవెన్యూ, అటు పోలీసు యంత్రాంగం ఏమాత్రం కన్నెత్తి చూడటం లేదు.

**పంటల సాగుతో..**

మండలంలోని వెంగళాయదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న చెరువు కింద వెయ్యి ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరింది. ఈ నేపథ్యంలో రైతులు వివిధ పంటలు సాగు చేసుకుంటున్నారు. నీరు లేకుంటే చెరువు కింద ఉన్న భూముల్లో ఇసుక కోసం అక్రమ తవ్వకాలు చేపట్టేవారు. గతంలో చెరువు కింద ఉన్న పోరంబోకు భూమిని అనధికారికంగా ఆక్రమించుకుని తవ్వకాలు జరిపారు. ప్రస్తుతం వంకలు, వాగుల్లో తవ్వకాలు చేపట్టడం గమనార్హం.

**అంతా అడ్డదారుల్లో..**

వాగుల్లో తవ్విన ఇసుకను ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలకు ప్రతిరోజూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇసుక తవ్వే ప్రాంతం నుంచి ఆదోనికి సుమారు 30 కి.మీ. దూరం ఉంటుంది. ఈ నేపథ్యంలో దొడగొండ, కలపరి, బైలుపత్తికొండ, గార్లపెంట మీదుగా ఆదోని మండలం బసరకోడు నుంచి ఆదోనికి తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పు ఇసుకను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్ముకుంటుండం గమనార్హం. మరోవైపు 35 కి.మీ. దూరంలో ఉన్న ఎమ్మిగనూరుకు.. డి.కోటకొండ, చిన్న పెండేకల్లు, పెద్దపెండేకల్లు మీదుగా రవాణా చేస్తున్నారు. సమీప ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారు.

## ఊరంతా భీమలింగప్పలే

చిప్పగిరి మండల పరిధిలోని బెల్డోణ గ్రామంలో 650కిపైగా గృహాలున్నాయి. 3,500 మంది నివసిస్తున్నారు. ఊర్లో కొలువుదీరిన భీమలింగేశ్వరస్వామిని ఇక్కడి వారు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఇంట్లో పుట్టిన మొదటి సంతానానికి భీమ వచ్చేలా పేర్లు పెట్టుకోవడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆయన శిష్యురాలైన సంజమ్మ పేరునూ మరికొందరు పెట్టుకుంటున్నారు. గ్రామంలో సగం మందికిపైగా భీమ, భీమలింగేశ్వర, భీమేశ్, భీమక్క, భీమన్న, భీమప్ప, భీమలింగప్ప, సంజమ్మ, సంజక్క, సంజప్ప, సంజన్న పేర్లు పెట్టుకోవడం విశేషం. వేములవాడ భీమ కవి 13వ శతాబ్దంలో బెల్డోణ గ్రామంలో కొలువుదీరారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కరవు కాటకాలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో భీమలింగేశ్వరుని అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురవడం. . పంటలు బాగా పండటంతో నాటి నుంచి నేటి వరకు గ్రామస్థులంతా ఆయన్నే కొలుస్తున్నారు. గ్రామానికి చెందినవారు దేశవిదేశాల్లో ఎక్కడ స్థిరపడినా ఏటా ఏప్రిల్‌లో ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరవుతారు.– న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం, చిప్పగిరి

# ధర చూస్తే.. గుడ్లు తేలేయాల్సిందే

గత కొన్ని వారాలుగా కోడిగుడ్డు ధర పెరుగుతూ పోతోంది. గత నెలలో వంద గుడ్ల ధర రూ.645 పలకగా.. ప్రస్తుతం రూ.700కు చేరింది. ఒక గుడ్డు సరాసరిన రూ.7.16 నుంచి రూ.7.50 పలుకుతోంది. కిరాణా దుకాణాల్లో వ్యాపారులు రూ.8కు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలు వినియోగదారులను బెంబేలెత్తిస్తుండగా.. కొద్ది నెలల కిందట కోళ్లకు వచ్చిన వ్యాధులతో డీలా పడిన పౌల్ట్రీ రైతులను కోలుకునేలా చేస్తున్నాయి.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) ధరల ప్రకారం నవంబరులో కోడిగుడ్డు ధర రూ.5.80 వద్ద మొదలవగా.. అత్యధికంగా రూ.6.45కు చేరుకుంది. గత నెల సగటు ధర రూ.6.14గా ఉంది. ఈనెల రూ.6.35 వద్ద ప్రారంభం కాగా.. 13వ తేదీనాటికి రూ.6.56కు చేరుకుంది. ఇప్పటివరకు ఈనెల సగటు ధర రూ.6.48గా ఉంది. ● గత వారం చికెన్ కిలో రూ.200 ఉండగా.. ఆదివారం కిలో రూ.240-రూ.260కు విక్రయించారు. మాంసం ధర రూ.850 నుంచి రూ.వెయ్యికి చేరింది. చికెన్, మాంసం కొనుగోలు చేయలేని పేదలు కోడిగుడ్ల కూర వండుకునేవారు. ప్రస్తుతం అవి కొండెక్కడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయని పేదలు ఆవేదన చెందుతున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి**

● ఉమ్మడి జిల్లాలో 12.90 లక్షల కోళ్ల సంపద ఉంది. అయితే బ్రాయిలర్ కోళ్ల సంఖ్య చాలా తక్కువ ఉంది. ఉమ్మడి జిల్లాలో 13.50 లక్షల కుటుంబాలున్నాయి. నెలకు సరాసరిన 1.60 కోట్ల కోడిగుడ్ల విక్రయాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం కోడిగుడ్డు ధర రూ.8కు చేరడంతో జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే వినియోగదారులపై రూ.60 లక్షలకుపైగా భారం పడింది. ● ఉమ్మడి జిల్లాలో బ్రాయిలర్ కోళ్ల పరిశ్రమలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో పొరుగు జిల్లాలు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కోడిగుడ్లు దిగుమతి చేసుకుంటున్నారు.

## క్రికెట్‌లో మేఘన కీర్తి

ఆదోని పట్టణానికి చెందిన వై.మేఘనారెడ్డి క్రికెట్‌లో రాణిస్తోంది. మీడియం పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తోంది. అండర్-15 విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ చాటి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికవడం విశేషం. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె క్రికెట్‌పైనా మక్కువ పెంచుకుంది. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని క్రికెట్ శిబిరంలో రెండేళ్లుగా బౌలింగ్‌లో సాధన చేస్తోంది. కోచ్ బాలాజీరావు పర్యవేక్షణలో అవసరమైన మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతోంది. ఇటీవల శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైంది. ఈనెల 19వ తేదీ వరకు నెల్లూరులో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటోంది. రాష్ట్ర జట్టుకు ఎంపికవడమే తన లక్ష్యమని మేఘనారెడ్డి పేర్కొంటోంది. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

# ఆస్తి పన్ను ఎగమేత

**● ఏళ్లుగా పక్కదారి పట్టిన నిధులు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను విధింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని పలువురు అవినీతికి పాల్పడ్డారు. ఫలితంగా ఖజానాకు భారీ గండి పడింది.
– న్యూస్‌టుడే, ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు పురపాలికలు, నంద్యాల పట్టణం

ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. 3,02637 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. ఏటా రూ.127.23 కోట్లకుపైగా పన్ను సమకూరుతుంది. ఇంటింటి సర్వేతో కొత్తగా 60 వేల మందిని గుర్తించాల్సి ఉంది. సుమారు రూ.20 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా.

**పురపాలికల్లో ఇంటింటి సర్వేలో గుర్తించి పన్ను పరిధిలోకి తెచ్చిన భవనాలు, లభించిన ఆదాయం**

| ప్రాంతం | కొత్తగా పన్ను పరిధిలోకి వచ్చినవి | సమకూరిన ఆదాయం |
|---|---|---|
| కర్నూలు | 15,000 | రూ.5 కోట్లు |
| నంద్యాల | 928 | రూ.80 లక్షలు |
| ఆదోని | 1,500 | రూ.70 లక్షలు |
| ఎమ్మిగనూరు | 518 | రూ.40 లక్షలు |

**సిబ్బంది స్వాహాపర్వం**

● నంద్యాలలోని పలు ప్రాంతాల్లో ఒక్కోరకమైన నిర్మాణం జరిగితే.. మరోరకమైన పన్ను విధించారు. మూడంతస్తుల ఇంటికి పన్ను వేయాల్సి ఉండగా.. ఒక అంతస్తు మాత్రమే ఉన్నట్లు పన్ను పరిధిలో చూపారు. మరో ప్రాంతంలో కొందరు డబ్బులు వసూలు చేసి స్వాహా చేశారు.

● ఆదోనిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పన్ను పరిధిలో రాని 50కిపైగా ఇళ్లను గుర్తించి తగిన చర్యలు చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మామూళ్లు తీసుకుని పన్నులు వేయకుండా అక్రమాలకు పాల్పడ్డారు.

● టిడ్కో బాండ్ల జారీలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం ఇంటింటి ఆస్తి పన్ను సర్వే చేపట్టింది. ఇప్పటివరకు ఓ కొలిక్కి రావడం లేదు.

**20 శాతం మందికిపైగానే..**

పురపాలక సంఘాల పరిధిలో పన్ను పరిధిలోకి రాకుండా ఉన్న కట్టడాలను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సరాసరిన 20 శాతానికిపైగా ఆస్తి పన్ను ఎగవేతదారులుంటారని అంచనా వేసి లక్ష్యం విధించింది. పన్ను పరిధిలో రానివి, కొత్తగా అదనపు నిర్మాణాలు చేపట్టినవి.. భవనాల విస్తరణ తదితరాలను గుర్తించి పన్నులు విధించాల్సి ఉండగా.. అనుకున్న లక్ష్యాలను సిబ్బంది సాధించలేదు.

## 18 మంది సీఐలకు స్థానచలనం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు రేంజ్ పరిధిలో 31 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 18 మంది సీఐలకు స్థానచలనం కలిగింది.

## శ్రీశైలం జలాశయం నీటిమట్టం 880.70 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి 880.70 అడుగులు, నీటి నిల్వ 192.0906 టీఎంసీలుగా నమోదైంది. సుంకేసుల జలాశయం నుంచి 11,238 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది.

## దాతల ఔదార్యం.. విద్యార్థులకు బస్సు సౌకర్యం

ఉయ్యాలవాడ మండల పరిధిలోని బోడెమ్మనూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రైవేటు పాఠశాలకు దీటుగా ఒకటిగా నిలిచింది. విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారు. అక్కంపల్లె, కాకరవాడ, పుచ్చకాయలపల్లె, పాంపల్లె, కల్వటాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వస్తుంటారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో నిత్యం అవస్థలు పడేవారు. గుర్తించిన కర్నూలుకు చెందిన డా.బావిరెడ్డి సుబ్బారెడ్డి తన సొంత నిధులతో 2019లో బస్సును సమకూర్చారు. పాఠశాలతోపాటు గ్రామంలో వసతులు కల్పించే ఉద్దేశంతో దాతలంతా కలిసి 2002లో బోడెమ్మనూరు ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేశారు. విదేశాల్లో స్థిరపడిన వైద్యులు రమేష్‌రెడ్డి, ఫణివర్ధన్‌రెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు చేయూతనిస్తుండటంతో బస్సు నిర్వహణ సాగుతోంది. బస్సు చోదకుడికి నెలకు రూ.12 వేలు వేతనం, వాహన నిర్వహణకు రూ.33 వేల ప్రకారం ఏటా రూ.4.50 లక్షలు ఖర్చవుతుందని సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఫలితంగా గతంలో పాఠశాలలో 60 మంది విద్యార్థులుండగా. . ప్రస్తుతం 153 మంది చదువుతున్నారు. – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

# మిరపను నల్లిపేస్తోంది

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఈ ఏడాది మిర్చి సాగు గణనీయంగా సాగు తగ్గింది. అధిక వర్షాల నేపథ్యంలో ఉన్న కొద్ది మిరప పంట సైతం దెబ్బతింటోంది. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పలు ప్రాంతాల్లో మిరప కుళ్లిపోవడం, మొక్కలు చనిపోయాయి. వర్షాలు తగ్గినప్పటికీ చాలా చోట్ల పంట ఎదగడం లేదు. దీనికితోడు నల్లి, పేను కారణంగా పంట దెబ్బతింటోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకు ముడతగా మారి చిగురు రావడం లేదు. పెద్దఎత్తున మందులు పిచికారీ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోతోందని.. చలి తీవ్రత పెరిగినా నల్లి బెడద తీవ్రం మాత్రం తగ్గడం లేదని పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, కౌతాళం

# పొగమంచు

**● తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చలి తీవ్రత పెరిగిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచుతో రహదారులపై వాహనాలు కనపడక పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతు నగరం, కర్నూలు వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రతిరోజూ 1.50 లక్షలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావడం. . వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రహదారులను పొగమంచు కప్పేస్తోంది. పొగ మంచు నేపథ్యంలో వాహనాలు కనపడక పలువురు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

1. ప్రస్తుతం పొగమంచు కప్పేస్తున్న నేపథ్యంలో తెల్లవారుజామున, రాత్రివేళల్లో కాక పగటి పూట ప్రయాణించడం శ్రేయస్కరం.
2. మలుపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ వాహనాలను ఓవర్‌టేక్ చేయకూడదు. ఒంపులు, మూల మలుపుల వద్ద ఇండికేటర్లు తప్పనిసరిగా వేయాలి. ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలి.
3. రాత్రివేళల్లో లోబీమ్ లైట్లు వాడాలి. హైబీమ్ లైట్ల నుంచి వచ్చే కాంతి విచ్ఛిన్నమై ఎదురుగా వచ్చే వాహనాలను చూడటం ఇబ్బందిగా ఉంటుంది. ఫాగ్ లైట్లతో ఎదురుగా వచ్చే వాహనాలకు మన వాహనం కనిపిస్తుంది.
4. చలికాలంలో రోడ్డు తడిగా మారి టైర్లు జారుతాయి. బ్రేకులు నెమ్మదిగా.. జాగ్రత్తగా వేయాలి. సడన్ బ్రేక్ వేస్తే వాహనం బోల్తా కొట్టే ప్రమాదముంది.
5. రోడ్డును దట్టమైన పొగమంచు కమ్మేసి ఉంటే సురక్షితమైన ప్రదేశంలో నిలపడం మంచిది. ఇండికేటర్లు తప్పనిసరిగా వాడాలి.
6. వాహనాలను అతివేగంతో ఓవర్‌టేక్ చేయకూడదు. కొన్నిసార్లు ఎదుటి వాహనాల వేగాన్ని అంచనా వేయడం కష్టమవుతుంది.

**నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు**

| తేదీ | కనిష్ఠం |
|---|---|
| 8 | 17.8 |
| 9 | 16.9 |
| 10 | 16.1 |
| 11 | 15.2 |
| 12 | 14.9 |

చిప్పగిరి వద్ద పొగమంచులో వెళ్తున్న వాహనాలు

## హౌసింగ్ ఏఈ, డీఈకి తాఖీదులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : పక్కాగృహాల నిర్మాణానికి సంబంధించిన ఇనుము నిల్వల్లో తేడాలను గుర్తించి బాధ్యులైన హౌసింగ్ ఏఈ, డీఈకి తాఖీదులు ఇచ్చినట్లు జిల్లా గృహ నిర్మాణం సంస్థ పీడీ టి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. 'గోదాముల్లో ఇంటి గుట్టు' శీర్షికన ఈనెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో మంజూరైన 51,507 గృహాలకు అవసరమైన 5808.55 టన్నుల ఇనుము సరఫరా చేశారు. అందులో 5351.33 టన్నులు సరఫరా చేయగా 473.09 టన్నులు జిల్లాలోని 26 గోదాముల్లో నిల్వ ఉందని పీడీ టి.చిరంజీవి తెలిపారు. కోసిగి గోదాములో సుమారు 83 టన్నుల ఇనుము నిల్వ తేడా ఉన్నట్లు గుర్తించి సంబంధిత ఏఈ, డీఈకి తాఖీదులు ఇచ్చినట్లు వెల్లడించారు. కోడుమూరు, కోసిగి, కల్లూరు, మద్దికెర మండలాల పరిధిలో 1403 బస్తాల సిమెంటు నిల్వ ఉందన్నారు.

# నాణ్యత కప్పేసి.. నిధులు మెక్కేసి

**● పీఎంశ్రీ పనుల్లో అక్రమాలు**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కేంద్రం పీఎంశ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మైదానాలు, ప్రయోగశాలలు అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. పనులను నాసిరకంగా చేసి నిధులు దిగమింగారు.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీఎంశ్రీ కింద 54 పాఠశాలలను ఎంపిక చేశారు. సైన్సు ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సౌర ఫలకాల ఏర్పాటు, ఆర్వో ప్లాంట్లు, కిచెన్ గార్డెన్లు తదితర వాటి కోసం నంద్యాల జిల్లాలో 44, కర్నూలు జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. నంద్యాల జిల్లాకు ఈ పథకం కింద రూ.15.61 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి.

**పర్యవేక్షణ కరవై..**

పలు ప్రాంతాల్లో పనులు ఇష్టారాజ్యంగా జరిగాయి. పెద్దఎత్తున ప్రజాధనం వృథా అయింది. పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టినప్పటికీ.. వీటిని స్థానిక నాయకులే చేశారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించారు.

**రూ.3.50 లక్షలు వెచ్చించినా..**

ఎమ్మిగనూరు బాలిక జడ్పీ పాఠశాల క్రీడా మైదానాన్ని రూ.3.50 లక్షలతో అభివృద్ధి చేశారు. ఈ పనుల్లో ఎక్కడా నాణ్యత కానరావడం లేదు. వేసిన మట్టిని కూడా సరిగా క్యూరింగ్ చేయలేదు. రోలింగ్ చేయకపోవడంతో మైదానమంతా ఎగుడు దిగుడుగా కనిపిస్తోంది.

**పైపై మెరుగులే..**

→ కోవెలకుంట్ల ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో రెండు ప్రయోగశాలలు నిర్మించారు. అటువైపు.. ఇటువైపు గోడలు నిర్మించి పైకప్పు వేసి మమ అనిపించేశారు. ఫలితంగా వర్షం పడిన సమయంలో పైకప్పు నుంచి నీళ్లు కారుతూ తటాకాన్ని తలపిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చివరికి ల్యాబ్‌లను ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

→ కర్నూలు జిల్లాలోని పెరవలి, పెద్దపాడు, నంద్యాల జిల్లాలోని కొణిదేల, కొత్తపల్లి, ఎన్.కొత్తపల్లె పాఠశాలల్లో జరిగిన పనులపై ఆరోపణలు వచ్చాయి.

→ అవుకులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రయోగశాల పనులు పూర్తికాకుండా మధ్యలోనే ఆపేశారు. ఫలితంగా విద్యార్థినుల అవస్థలు అన్నీఇన్నీకావు.

→ ఆత్మకూరు, రుద్రవరం, అవుకు మోడల్ స్కూళ్లలోని క్రీడా మైదానం పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది.

→ కర్నూలు జిల్లాలోని నందవరం, తుగ్గలి, హాలహర్వి, కర్నూలు, హొళగుంద, ఆదోని తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు సంబంధించి మైదానం పనుల్లో నాణ్యత కానరావడం లేదు. చాలా పాఠశాలల్లో క్రీడా కోర్టులు అలంకారప్రాయంగా మారాయి.

## రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు కృషి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్క్‌కు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. కర్నూలు నియోజకవర్గ తెదేపా క్లస్టర్, కోక్లస్టర్, యూనిట్, వార్డు, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం కర్నూలులో నిర్వహించారు. నియోజకవర్గ నూతన కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి మాట్లాడుతూ.. కర్నూలు అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు కర్నూలు ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్లలో కూడా అభివృద్ధి చేసేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అక్కడ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. ఇదే ప్రాంతంలో కలెక్టరేట్ కూడా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్‌సింగ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు జగదీష్ గుప్తా, సంతోష్, సంజీవలక్ష్మి, కాణిపాకం ఆలయ బోర్డు సభ్యురాలు రాజ్యలక్ష్మి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శేషగిరి శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, తెదేపా నాయకులు

(c) eenadu

## అదుపు తప్పితే.. అనంత లోకాలకే!

కోవెలకుంట్ల, బనగానపల్లి మండలాల్లో వ్యవసాయ పనుల కోసం మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయిస్తారు. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామ సమీపంలో ఆదివారం ఓ ట్రాక్టర్ ఇంజిన్‌పై అధిక సంఖ్యలో మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రమాదం తప్పదు. ఇటువంటి ప్రయాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం

## స్వచ్ఛస్ఫూర్తికి తుప్పు

మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ యాళ్లూరులో చెత్త వ్యర్థాలు తరలించే స్వచ్ఛ ఆంధ్ర రిక్షాలు మూలనపడ్డాయి. గ్రామంలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి వ్యర్థాలు సేకరించాల్సిన రిక్షాలు అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీ కార్యాలయం వెనుక తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామంలో పారిశుద్ధ్య సేవలు సరిగా కొనసాగడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, యాళ్లూరు(గోస్పాడు)

## ధాన్యం ఆరబోత కష్టమైంది

వరి సాగు చేసిన రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం దొర్నిపాడు మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ధాన్యం ఆరబెట్టేందుకు స్థలాలు లేకపోవడంతో మండలం గుండా ప్రవహించే కేసీ ప్రధాన కాల్వ గట్టుపై ఆరబెడుతున్నారు. దొర్నిపాడు, అమ్మిరెడ్డినగర్, అర్జునాపురం, రామచంద్రాపురం, వెంకటేశ్వరనగర్ గ్రామాల పరిధిలో రైతులు ఆరబెట్టడానికి స్థలాలు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దొర్నిపాడు

## నాటి బందీఖానా.. జ్ఞాపకాల ఖజానా

వందేళ్ల క్రితం నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరకుండా ఉపయోగపడుతోంది. బనగానపల్లె పట్టణంలోని పాత పోలీసు స్టేషన్(ప్రస్తుత గ్రామీణ సీఐ కార్యాలయం) భవనానికి 120 ఏళ్ల చరిత్ర ఉంది. నవాబుల కాలంలో పది సెంట్ల విస్తీర్ణంలో 1905లో ఐదు గదులుగా దీన్ని నిర్మించారు. అప్పట్లో నేరస్థుల విచారణ నిమిత్తం బందీఖానాగా ఉపయోగించుకునేవారు. 2006లో స్వల్ప మరమ్మతులు చేశారు. ఆనాటి నిర్మాణ శైలిలో, పాటించిన నాణ్యత ప్రమాణాలతో భవనం నేటికీ వన్నెతగ్గకుండా విలసిల్లుతోంది. – న్యూస్‌టుడే, బనగానపల్లె గ్రామీణం

## అవుకు జలాశయం ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

అవుకు, న్యూస్‌టుడే: అవుకు జలాశయం పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జలవనరుల శాఖ అధికారులతో కలిసి అవుకు జలాశయాన్ని పరిశీలించారు. తిమ్మరాజు చెరువు కట్ట నీటి లీకేజీ, కుంగిన రాతిపరుపు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే జలాశయంలో సమస్యలు తలెత్తాయని విమర్శించారు. లీకేజీ సమస్యను ఈ నెల చివరి నాటికి పరిష్కరిస్తామని వెల్లడించారు. మరమ్మతులకు ఇప్పటికే రూ.? కోట్లు కేటాయించామని, అవసరాన్ని బట్టి అదనపు నిధులు సమకూర్చనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపే ఏర్పాట్లు చేస్తామన్నారు. జలవనరుల శాఖ ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ శుభకుమార్, డీఈ సాయికిరణ్, తెదేపా నాయకులు బీవీ ప్రతాప్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, రమణ, నాగిరెడ్డి, మద్దిలేటిగౌడు, తిక్కన్న పాల్గొన్నారు.

మరమ్మతు వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

## యువ క్రీడాకారులు.. ఖోఖోలో ప్రతిభావంతులు

☛ ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆళ్లగడ్డలో సన్నద్ధం

**ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. ఆటలపై ఇష్టంతో రాణిస్తున్నారు ఆత్మకూరుకు చెందిన అబ్దుల్ జుబేర్, శ్రీనివాసులు. శ్రీరాజరాజేశ్వరి ఐటీఐ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ.. ఖోఖోలో పతకాల పంట పండిస్తున్నారు. ఈనెల 9వ తేదీన పగిడ్యాలలో జరిగిన అండర్-18 విభాగంలో వీరిద్దరూ ఎంపికై 20, 21, 22వ తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి అసోసియేషన్ పోటీల్లో పాల్గొనడానికి ఆళ్లగడ్డ క్యాంపెయిన్‌లో సిద్ధమవుతున్నారు.

### ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా..

- సలాంబాషా, ఆసియా కుమారుడు అబ్దుల్ జుబేర్. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవటంతో రకరకాల పనులు చేస్తూ చదువుతున్నాడు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి నుంచే ఖోఖో క్రీడను ఎంచుకున్నాడు.
- 2022లో స్కూల్ గేమ్స్ విభాగంలో ఆత్మకూరు క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు.
- 2023లో అండర్-14 విభాగంలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2024లో చిత్తూరులో జరిగిన జూనియర్ విభాగం రాష్ట్రస్థాయి అసోసియేషన్ క్రీడలో మూడో స్థానం.
- 2023లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో మూడవ స్థానం.
- 2025లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో ఉత్తమ ప్రతిభ.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ ఖోఖో పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు.

### టీ హోటల్లో పనిచేస్తూ..

లింగస్వామి, హైమావతి కుమారుడు శ్రీనివాసులు. లింగస్వామి రజక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివే సమయంలో ఖోఖోను ఎంచుకున్నాడు. ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేకపోవటంతో ఆత్మకూరులోనే టీ దుకాణంలో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో క్రీడలకు ఉపయోగిస్తున్నాడు.

- 2022లో ఆత్మకూరులో స్కూల్ గేమ్స్ విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2023లో అండర్-14 విభాగంలో స్కూల్ గేమ్స్ క్రీడల్లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2023లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో మూడవ స్థానం.
- 2024లో అండర్-17 ఎస్‌జీఎఫ్ విభాగంలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సెమీఫైనల్.
- 2024లో మహారాష్ట్రలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ప్రతిభ.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ జట్టులో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపిక.
- 2024లో అండర్-14 విభాగంలో మహారాష్ట్రలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయిలో ప్రతిభ.
- 2025లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో ఉత్తమ ప్రతిభ.

## వడ్డెర సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

**నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే:** వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడం, మైనింగ్‌లో రాయితీలు పెంచడం వంటి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. స్థానిక హోటల్‌లోని సమావేశ భవనంలో ఆదివారం వడ్డెరాజుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పాల్గొని మాట్లాడారు. వడ్డెరులు రాజకీయంగా ఎదగాలన్నారు. అందరూ ఐకమత్యంగా ఉంటూ వడ్డెర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రధర్, నియోజకవర్గం అధ్యక్షుడు పల్లె వెంకటసుబ్బయ్య, కార్యదర్శి వేణు, సభ్యులు జనార్దన్, సుబ్బరాయుడు, వడ్డె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను గజమాలతో సన్మానిస్తున్న సంఘం సభ్యులు

## విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

**ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీల నిర్వహించడం హర్షణీయని రోటరీ క్లబ్ జిల్లా ప్రతినిధులు త్రివిక్రమ్ జోషి, ఉపవిద్యాధికారి రాజేంద్రప్రసాద్, అధ్యాపకుడు కల్యాన్‌కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టరు సైపుల్లా, కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి, యూత్ అధికారి సాబీర్, వికాస్ అన్నారు. క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. వ్యాయామ అధ్యాపకులు, పీఈటీలను సన్మానించారు. విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యుడు సునిల్‌రెడ్డి అధ్యక్షతన భోజన వసతి కల్పించారు. రోటరీ క్లబ్ సభ్యులు షన్ముక, శ్రీధర్‌రెడ్డి, జీవన్‌సింగ్, విట్టా మురళీధర్, సోమశేఖర్‌రెడ్డి, భరత్‌షా, ప్రశాంత్‌గాంధి, సుబ్బయ్య, వీరేశ్‌స్వామి, పద్మనాభయ్యశెట్టి పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న క్రీడాకారులతో రోటరీ క్లబ్ సభ్యులు

## ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

**కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే :** ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యతని కర్నూలు జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈ ఆర్.ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని కర్నూలు డివిజన్ పవర్‌హౌస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు, యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, డీఈఈ కమర్షియల్ విజయభాస్కర్, డీఈఈలు సుబ్బన్న, నాగప్రసాద్, చంద్రమోహన్, ఏఈలు పాల్గొన్నారు.

వారోత్సవాల్లో పాల్గొన్న ఎస్ఈ ప్రదీప్‌కుమార్

## రూ.50 లక్షల వ్యయంతో షెడ్ల నిర్మాణం

**ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ఆదోని పట్టణంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రణమండల ఆంజనేయస్వామి క్షేత్రంలో రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు ఆదోని పట్టణానికి వ్యాపారి మణికంఠ శ్రీకారం చుట్టారు. రణమండల ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంలో షెడ్ల నిర్మాణం, 21 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం ఆలయంలో భూమి పూజ చేశారు. తన తండ్రి హెబ్బటం నరసింహులు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు దాత మణికంఠ తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దాత

## మాజీ ఎమ్మెల్యేపై చర్యలకు మహిళా కమిషన్ ఆదేశం

**కర్నూలు, న్యూస్‌టుడే :** కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌ను ఆదేశించింది. కర్నూలుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. మెప్మా ప్రాజెక్టు కింద లెక్చరర్‌గా, ఫ్యాషన్ డిజైనర్‌గా మహిళలకు శిక్షణ ఇచ్చే తనకు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా హఫీజ్‌ఖాన్ పరిచయం అయ్యారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్పొరేటర్ సీటు ఇప్పిస్తానని రూ.3.70 కోట్లు తీసుకున్నారని అందులో ఆరోపించారు. తనను హైదరాబాద్‌కు తీసుకెళ్లి నగ్నపూజలో పాల్గొనాలని బలవంతం చేశారని, తాను ప్రతిఘటించడంతో తనపై లైంగిక దాడి చేశారని ఆరోపించారు. పార్టీ తనకు కార్పొరేటర్ స్థానానికి బీ.ఫారం ఇవ్వకుండా మోసగించారన్నారు. తర్వాత ఆయన భార్య పేరుతో తనకు ప్రామిసరీ నోట్లు, బాండ్లు ఇచ్చారని వెల్లడించారు. పోలీసులు, మీడియాకు ఆధారాలు ఇస్తానని చెప్పిన తర్వాత తమ ఇంట్లోని ఆయా పత్రాలు చోరీకి గురయ్యాయన్నారు. దీనిపై అప్పటి ఎస్పీకి ఫిర్యాదు చేశామని, 2022 ఫిబ్రవరి 25న అతని అనుచరుడు తనపై హత్యాయత్నం చేయగా కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. తనకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని ఆమె మహిళా కమిషన్‌ను కోరారు. ఈనెల 11న బాధితురాలి వినతిని స్వీకరించిన మహిళా కమిషన్ ఆమెకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. విచారణ జరిపించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంది. తీసుకున్న చర్యల నివేదికను వీలైనంత త్వరగా తనకు పంపాలని కమిషన్ కార్యదర్శి సూచించారు. గత ప్రభుత్వం హయాంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో బాధితురాలు ధైర్యంగా రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు.

## ఆదోని జిల్లా సాధనకు కలిసికట్టుగా పోరాడుదాం

★ 29వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు ★ ఐకాస ఆధ్వర్యంలో రాస్తారోకో

**ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే:** ఆదోని జిల్లా సాధనే లక్ష్యంగా ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడుదామని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, ఆదినారాయణ రెడ్డి, కోదండ, దస్తగిరినాయుడు, లలితమ్మ, నూర్‌అహ్మద్ తదితరులు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని కోట్ల కూడలి వద్ద ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన రిలే నిరహారదీక్షలు ఆదివారం 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐకాసా ఆధ్వర్యంలో నాయకులు, గజ్జహళ్లి గ్రామస్థులు పెద్దఎత్తున కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన ఆదోని ప్రాంతాన్ని ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేశారు. ఆదోని జిల్లాగా ప్రకటించేంతవరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షురాలు ఉషారాణి, పీవోడబ్ల్యూ నాయకురాలు సుజ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని పట్టణంలోని కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేస్తున్న ఐకాస నాయకులు, గజ్జహళ్లి గ్రామస్థులు

- ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం ఏపీఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు, పీవోడబ్ల్యూ స్త్రీవిముక్తి మహిళా సంఘం మహిళా నాయకులు దీక్షలో కూర్చొని తమ మద్దతు తెలిపారు. ఈ దీక్షలో మహిళా ఉద్యోగులు మంజుల, లక్ష్మి, ధనలక్ష్మి, అరుణజ్యోతి, నరసమ్మ, సుజాత, ఇ.లక్ష్మి, ఎం.సరళ, కల్యాణి, గంగమ్మ, పీవోడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకులు కళావతి, ధనశ్రీ, నీలమ్మ, శాంతమ్మ, హనుమంతమ్మ తదితరులు కూర్చొని మద్దతు తెలిపారు.

రిలేదీక్షలో ఏపీ ఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు, పీవోడబ్ల్యూ మహిళా సంఘం నాయకులు, మూడో తరగతి విద్యార్థిని ధనశ్రీ

## బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలి

**కర్నూలు నగరం, న్యూస్‌టుడే :** బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని విశ్రాంత డీజీపీ, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డా.జి.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఓబీసీ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రిజర్వేషన్‌ల ప్రకారం బీసీలకు సీట్లు కేటాయిస్తే రాజ్యాధికారం సాధించుకుంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలు, నగదు బదిలీలు అవసరం లేదని, అధికారం ఇవ్వాలని కోరారు. మాజీ ఎంపీ డా.సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ కులగణన తప్పనిసరిగా నిర్వహించి, ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సభలో వామన్‌మేశ్రం, చౌదరి వికాస్‌పటేల్, విశ్రాంత ఆర్డీవో నాగమ్మ, విశ్రాంత డీఈవో శంకర్‌గౌడ్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఓబీసీల హక్కులపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు.



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తదితరులు

## యువతి కిడ్నాప్ యత్నం విఫలం

**కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే :** ఓ యువతిని అపహరించేందుకు కొందరు యువకులు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఉలిందకొండ ఎస్సై ధనుంజయ తెలిపిన వివరాల మేరకు.. దూపాడు సమీపంలోని డా.కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఆదివారం కర్నూలు నగరం ఎన్ఆర్‌పేటకు చెందిన ఓ యువతి టెట్ పరీక్ష రాసేందుకు వచ్చారు. ఉదయం 8.45 గంటల సమయంలో డోన్‌కు చెందిన హర్ష మరికొందరు కారులో వచ్చి ఆమెను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా ఆ యువతి కేకలు వేయడంతో ఆమె తల్లిదండ్రులు అక్కడున్న వారు అడ్డుకున్నారు. దీంతో ఆ యువకులు అక్కడి నుంచి కారులో పరారయ్యారు. రమ్య ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి యువకుల కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

## హైందవ ధర్మాన్ని పరిరక్షిద్దాం

మాట్లాడుతున్న ఆచార్య అభినవ శంకరానంద స్వామీజీ

**బేతంచెర్ల, న్యూస్‌టుడే:** దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంతోపాటు హైందవ ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఆచార్య అభినవ శంకరానంద స్వామీజీ, వక్త భరత్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో శేషారెడ్డి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు గౌరి ఉస్సేన్‌రెడ్డి, మారుతీశర్మ అధ్యక్షతన హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వారు ముఖ్య వక్తలుగా ప్రసంగిస్తూ.. హిందువులంతా సంఘటితం కావాలని, ప్రతి ధార్మిక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. పురాతన దేవాలయాల పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, జిల్లా కార్యదర్శి నాగమోహన్, బుగ్గన ప్రసన్నలక్ష్మి, వీరారెడ్డి, మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

**పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే:** పత్తికొండ పట్టణంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం విషయంలో వ్యక్తిపై దాడి చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ నాలుగు రోజుల తర్వాత మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. పత్తికొండ సీఐ జయన్న తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ మండలానికి చెందిన ఓ మహిళకు కొన్నేళ్ల కిందట దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన నాగేంద్రతో వివాహం జరిగింది. కొన్ని రోజుల కిందట భర్తతో విభేదాల కారణంగా దూరంగా పత్తికొండలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా దేవనకొండ మండలం భైరవకుంట గ్రామానికి చెందిన లింగమూర్తి(39) తో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమె ఇంటిపై భర్త నాగేంద్ర నిఘాపెట్టాడు. ఈ నెల 10వ తేదీన లింగమూర్తి మహిళ ఉన్న ఇంట్లోకి వెళ్లిన విషయాన్ని గమనించిన నాగేంద్ర భార్యతో పాటు లింగమూర్తిపై దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన అతన్ని కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


గౌరవనీయ IIవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టు, ఆదోని, కర్నూలు జిల్లా
G.W.O.P.No.28/2025
**పిటీషనర్:** ఈడిగ నాగేష్ గౌడ్, S/o. ఈడిగ ఆంజినేయులు గౌడ్, హిందూ, వయసు: 62 సంవత్సరాలు, రైతు, R/o. H.No.1/30, బి.సి.కాలని, పేసాలదిన్నె గ్రామం, ఎమ్మిగనూరు మండలం, కర్నూలు జిల్లా.
**ప్రతివాదులు:** లేరు
ప్రకటన
పైన పేర్కొన్న పిటీషనర్, గార్డియన్స్ అండ్ వార్డ్స్ చట్టం, 1890, సెక్షన్ 9(2) కింద పిటీషన్ దాఖలు చేసి, మైనర్ అయిన మాస్టర్ ఈ.అఖిల్ గౌడ్ (జననం: 12-11-2019) పేరున 01-08-2022న బహుమతిగా రిజిస్టర్ చేయబడిన అస్థిర ఆస్తిని విక్రయించుటకు గాను, ఈ గౌరవనీయ న్యాయస్థానం అనుమతి కోరినట్లు ప్రజలకు తెలియజేయడమైనది. పిటీషనర్ తెలిపిన ప్రకారం, కుటుంబ పరిస్థితులు, నివాస మార్పులు మొదలైన కారణాల వల్ల ఆ ఆస్తిని విక్రయించి, మైనర్ ప్రయోజనార్థం మరొక తగిన ఆస్తిని కొనుగోలు చేయాలనుకుంటున్నాడు. ఈ పిటీషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, విచారణ తేదీ:31-12-2025కి ముందు ఈ గౌరవనీయ న్యాయస్థానం ఎదుట తమ అభ్యంతరాలను దాఖలు చేయవచ్చును. నిర్దేశిత సమయంలో ఎటువంటి అభ్యంతరాలురాని పక్షంలో, కోర్టు రికార్డు ఆధారంగా పిటీషన్‌ను విచారించి తగు నిర్ణయం తీసుకుంటుంది.
**ఆస్తి షెడ్యూల్:** కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు SRO పరిధి, పేసాలదిన్నె గ్రామం, సర్వే నం: 55/A, విస్తీర్ణం: ఎకరం: 1.00
**సరిహద్దులు: తూర్పు:** కురువ హనుమంతమ్మ భూమి, **పడమర:** పిటీషనర్‌కు చెందిన మిగిలిన భూమి, **ఉత్తరం:** ఈడిగ మద్దిలేటి భూమి, **దక్షిణం:** పింజరి సెకమ్మ భూమి
విచారణ తేదీ: 31-12-2025
Sd/- V.URUKUNDU, Advocate
Yemmiganur & Adoni. Cell: 81062 19115.


## రబీ పంట బీమా.. రైతుకు ధీమా

● నష్టాలు ఎదుర్కొనేందుకు అవకాశం

**కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:** ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిని నష్టాల బారిన పడే రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రబీ 2025-26 సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), పునర్‌నిర్మిత వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీఎస్ఐ) పథకాలు అమలు చేస్తున్నాయి. ఆయా పథకాల కింద పండించిన పంటలకు బీమా చేయడం ద్వారా తక్కువ ప్రీమియంతో రైతులు ఆర్థిక నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. పంటల బీమా కోసం ప్రభుత్వం నంద్యాల జిల్లాకు అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీ, కర్నూలు జిల్లాకు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. వాతావరణ ఆధారిత పంటల బీమా కింద కర్నూలు జిల్లాలో టమాటా, నంద్యాల జిల్లాలో మామిడి పంటలను నోటిఫైడ్ చేశారు. టమాట పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ చివరి గడువు కాగా.. మామిడి పంటకు ఈనెలాఖరు వరకు గడువు ఉంది.

◆ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి పంటకు ఈనెలాఖరు వరకు, మిగిలిన అన్ని నోటిఫైడ్ పంటలకు ఈనెల 15వ తేదీలోగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

**కర్నూలు జిల్లాలో వివరాలు**

| పంట పేరు | యూనిట్ | బీమా మొత్తం | రైతు వాటా (శాతాల్లో) | ప్రీమియం (రూ.లలో) |
|---|---|---|---|---|
| పప్పుసెనగ | గ్రామం | 28,000 | 1.5 | 420 |
| వరి | మండలం | 42,000 | 1.5 | 630 |
| వేరుశనగ | మండలం | 32,000 | 1.5 | 480 |
| జొన్న | మండలం | 19,800 | 1.5 | 297 |
| ఉల్లి | జిల్లా | 45,000 | 3 | 1,350 |

### ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందాలు

ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద కర్నూలు జిల్లాలో టాటా జనరల్లీ ఇన్సూరెన్సు కంపెనీతో ఒప్పందం చేసుకోగా.. నంద్యాల జిల్లాలో జనరల్లీ సెంట్రల్(ఫార్మర్లీ ఫ్యూచర్ జనరల్లీ ఇన్సూరెన్సు) ఒప్పందం చేసుకున్నాయి. కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద పప్పుసెనగ, వరి, జొన్న, వేరుసెనగ, ఉల్లి, నంద్యాల జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద పప్పుసెనగ, వరి, జొన్న, మినుము, వేరుసెనగ, ఉల్లి పంటలను నోటిఫైడ్ చేశారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులు చెల్లించాల్సిన ప్రీమియం రైతు వాటాగా 1-5 శాతం వరకు పంట రకాన్ని బట్టి చెల్లిస్తే సరిపోతుంది. మిగతా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. పంటల బీమాలో కొన్ని గ్రామ, మరికొన్ని మండల, జిల్లా కేటగిరిల్లో ఉన్నాయి. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తమ పంటలకు బీమా చేయించడం మేలని అధికారులు సూచిస్తున్నారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్ / ముత్తూట్ / మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 7659988728.

వెంటనే కావలెను. లేడీ రిసెప్షనిస్ట్/ సూపర్ వైజర్ (Qly: Graduate), హౌస్ కీపింగ్ బాయ్స్, రూమ్ బాయ్స్, వెయిటర్స్, సెక్యూరిటీ గార్డ్స్ (9 గంటలు డ్యూటీ) కావలెను. దూర ప్రాంతాల వారికి రూమ్ + భోజనం కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 83419 57788, 94943 33443.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్ (స్త్రీ B.Tech/ M.Com) & మార్కెటింగ్ మేనేజర్స్ & ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 91604 64972.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

## శతాబ్ది ఉత్సవం హిందూ సమ్మేళనం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వంద సంవత్సరాలు కావడంతో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గోవర్ధనగిరి గ్రామంలో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నాగేంద్ర అన్నారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి కృష్ణవేణి సంఘ్ ప్రతినిధులు సుబ్బలక్ష్మమ్మ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన అవసరం

మద్దికెర, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది అశ్విని, తదితరులు పేర్కొన్నారు. మద్దికెరలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆదివారం మొదటగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.


# ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ


## నేటి నుంచి ధనుర్మాస పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: స్థానిక సిద్దేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించేందుకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజ పంపనగౌడ, శివ శంకరగౌడ ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు నిత్యం సిద్దేశ్వర స్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: మండలంలోని గుమ్మనూరులో తాగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలి. కేంద్రం లేక పెంచాపాడు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. – మల్లికార్జున, గుమ్మనూరు

✔: సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామ పంచాయతీ నిధులతో శుద్ధజల కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తాం. – లక్ష్మీదేవి, సర్పంచి, గుమ్మనూరు

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: చిరుమాన్‌దొడ్డి గ్రామంలో విద్యుత్తు దీపాలు కొన్ని కాలనీల్లో వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంటోంది. – రాజ్‌కుమార్, చిరుమాన్‌దొడ్డి

✔: కాలనీలను పరిశీలించి విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి, చిరుమాన్‌దొడ్డి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఆర్టీసీ బస్టాండు సమీపంలోని లక్ష్మీనగర్‌కు వెళ్లే దారి బురదమయంగా మారింది. వ్యర్థాలు తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. – సమీప కాలనీ ప్రజలు, పత్తికొండ.

✔: బస్టాండ్ ప్రహరీకి ఆనుకొని చుట్టుపక్కలవారే నిత్యం చెత్తా చెదారం వేస్తుంటారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి వ్యర్థాలను తొలగిస్తాం. – మద్దిస్వామి, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య విభాగం బాధ్యుడు

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: చిగిలి జడ్పీ పాఠశాల కొండపై ఉంది. విద్యార్థుల రక్షణార్థం చుట్టూ ప్రహరీ నిర్మించాలి. – నెట్టేకల్లు, రమేశ్, స్థానికులు

✔: జడ్పీ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం. – రాజేంద్రప్రసాద్, ఎంఈవో, ఆస్పరి

## ఎర్రజెండా.. మారని అజెండా

ఆస్పరి మండలంలోని బిల్లేకల్లు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో చిన్నపాటి వంతెన ఓ వైపు పెద్ద బండ రాళ్లు పడిపోయి ఉన్నాయి. పత్తికొండ నుంచి చిన్నహుల్తి, జూటూరు మీదుగా బిల్లేకల్లు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లేందుకు 40 కి.మీ. ఉంది. ఈ రహదారి సింగిల్ బీటీ రహదారి. పత్తికొండ నుంచి ఆస్పరి-ఆదోని మీదుగా వెళ్లాలంటే సుమారు ఎమ్మిగనూరుకు వెళ్లాలంటే సుమారు 65 కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో కర్నూలుకు వాహనాలు కార్లు, మినీ బస్సులు ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయం వెళ్లాలంటే.. చిన్నహుల్తి, జూటూరు, బిల్లేకల్లు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇలా వెళ్లడంతో సుమారు 25 కి.మీ. దూరం తగ్గడంతో పాటు టోల్‌ప్లాజా రుసుం కూడా మిగులుతుంది. అధికంగా వాహనాలు ఇదే రహదారిలో తిరుగుతున్నాయి. నిత్యం సుమారు రెండు వేలకు పైగానే వాహనాలు తిరుగుతున్నాయి. బిల్లేకల్లు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో కైరుప్పల వద్ద ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతింది. ఓ వైపు రాళ్లు పడిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. స్థానికులు రాళ్లు ఏర్పాటు చేసి, తెల్లటి సున్నం వేయడంతో పాటు రెండు ఎర్రని గుడ్డలు కట్టారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

# ఉపాధి కోర్సులు.. భవితకు పునాదులు

■ పీఎంశ్రీ పథకం కింద ఉపకరణాల పంపిణీ ■ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కోర్సులు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి సాధించి తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద విద్యార్థులకు స్వయం ఉపాధి కోర్సులు ప్రవేశపెట్టింది. ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద కొనసాగుతున్న స్వయం ఉపాధి కోర్సుల నిర్వహణ కోసం అవసరమైన పరికరాలు పంపిణీ చేసింది. ఈ పరికరాలతో విద్యార్థులకు స్వయం ఉపాధిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులు సన్నద్ధమవుతున్నారు. – న్యూస్‌టుడే, ఆదోని విద్య

ఆదోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలకు మంజూరైన కుట్టు మిషన్లు, తదితర యంత్రాలు

### అందుబాటులో యంత్రాలు

పాఠశాలలో కొనసాగుతున్న స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి పీఎంశ్రీ పథకం కింద ఐదేళ్ల పాఠశాలకు రూ.10 లక్షలు విలువ చేసే పరికరాలు పంపిణీ చేశారు. రూ.4 లక్షలు విలువ చేసే కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ తదితర పరికరాలు, రూ.4 లక్షలు విలువ చేసే మిక్సీ, ఎలక్ట్రానిక్స్ ఇస్త్రీ పెట్టెలు, ఫ్యాన్లు తదితర పరికరాలు అందించారు. రూ.2 లక్షలు విలువ చేసే ఆటోమొబైల్స్‌కు సంబంధించిన పరికరాలు పంపిణీ చేశారు.

### గత ఏడాది నుంచి శిక్షణ

ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 750 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో గత ఏడాది నుంచి పీఎంశ్రీ పథకం కింద అప్పెరల్ (కుట్టు, అల్లికలు) కోర్సు, ఎలక్ట్రానిక్స్ కోర్సు, ఆటోమొబైల్ కోర్సులు ప్రవేశపెట్టారు. ఇందు కోసం ముగ్గురు శిక్షకులను సైతం నియమించారు. రోజూ ఒక తరగతి కోసం విద్యార్థులకు సమయం కేటాయించి శిక్షణ ఇస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సైతం నిర్వహిస్తూ.. ప్రోత్సహిస్తున్నారు. ఈ కోర్సు పూర్తిచేసి, ధ్రువపత్రాలు పొందితే.. భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి.

### విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- రవి, ప్రధానోపాధ్యాయుడు, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, ఆదోని

పీఎంశ్రీ పథకం కింద పాఠశాలలో అప్పెరల్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి కోర్సులు ప్రవేశపెట్టారు. ఇందు కోసం ముగ్గురు శిక్షకులను సైతం ఏర్పాటు చేశారు. రోజూ ఒక తరగతిలో స్వయం ఉపాధిని సంబంధించి శిక్షణ ఇస్తున్నాం. ఐదేళ్లకు రూ.10 లక్షలు విలువ చేసే పరికరాలు అందించారు. వాటి కోసం పాఠశాలలోని ఓ ప్రత్యేక గదిని కేటాయించి, విద్యార్థులకు ఆ గదిలోనే శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొంది సద్వినియోగం చేసుకోవాలి.

ఆదోని నూతన బైపాస్ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

## బైపాస్ రహదారిపై బారికేడ్లు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో కొత్తగా నిర్మించిన జాతయ బైపాస్ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ప్రారంభమైన ఈ రహదారిపై వారం వ్యవధిలోనే మూడు ప్రమాదాలు జరిగాయి. దీనిపై ఈ నెల 13న 'ఈనాడు'లో ప్రచురితమైన 'భయ' పాస్ రహదారి' అనే కథనానికి ఆదోని ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్, ఎంవీఐ శిశిరదీప్తి, తాలుకా ఎస్సై రామాంజనేయులు, ఎన్‌హెచ్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. రహదారిని పరిశీలించారు. జాతీయ రహదారిపై కూడళ్ల సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున రహదారి మీదుగా వెళ్లే వాహన చోదకులకు ముఖం కడిగించి పంపించారు.

## జనులకు జలం.. పనులకు జీవం

మండలంలో జల్‌జీవన్ మిషన్ పథకం నిధులు రూ. కోటితో చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బెల్డోణ, తిమ్మాపురం, చిప్పగిరి ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకులు పూర్తికావచ్చాయి. అవి పూర్తయితే తిమ్మాపురం, చిప్పగిరి, నేమకల్లు, నగరడోణలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు వినియోగంలోకి వస్తాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వెంకటరమణి తెలిపారు. బెల్డోణ, చిప్పగిరి, ఖాజీపురం ఎస్ఎస్ ట్యాంకులతో పాటు గ్రామీణ నీటి పథకాల ద్వారా ఈ ట్యాంకులకు నీరు మళ్లించి ప్రజలకు నీటి సరఫరా చేయనున్నారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

## గ్రామస్థులు కదిలారు.. దారి బాగు చేశారు

హాలహర్వి నుంచి గూళ్యం వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. గుంతల పడిన దారిలో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం కిందట గూళ్యానికి చెందిన వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతో హాలహర్వికి చెందిన ప్రసాద్ ట్రాక్టర్లతో గరుసు వేసి చదును చేశారు. ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు వీలుగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

## ముందరి తాళ్ల బంధం



హొళగుంద బస్టాండు ప్రధాన రహదారి, పాత పోలీసు స్టేషన్ పక్కన వంకపై కల్వర్టు నిర్మించారు. ఈ మార్గం నుంచి స్థానికులు బీసీ కాలనీ, సంత మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. కాల్వపై పైకప్పు సగం వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. ఈ నెల 11న ద్విచక్ర వాహనాదారుడు అదుపుతప్పి పడి మృతిచెందాడు. దీంతో కల్వర్టుకు ఇరువైపులా బండరాళ్లు అడ్డుగా ఉంచి, ప్రమాద సూచికలుగా కర్రలను పాతి ప్లాస్టిక్ కవర్లు కట్టారు. సంబంధిత అధికారులు కాల్వపై పైకప్పు వేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

## బల్లూరు బడికి వెళ్లలేరు

హాలహర్వి మండలం బల్లూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిత్యం ముక్కుమూసుకొని ఉండాల్సిన పరిస్థితి. పక్కనే మురుగు కాల్వ ఉండటంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. బడికి వచ్చినప్పటి నుంచి ఇంటికెళ్లే దాక ముక్కు మూసుకోవాల్సిందే. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు స్పందించి పాఠశాల వద్ద ప్రవహించే మురుగ కాల్వపై పైపులైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

## సంక్షిప్త సమాచారం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు సామాజిక సేవలోనూ ఎప్పుడూ ముందుంటామని పోస్టల్ డాక్ సేవల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆలూరులో ఆదివారం ఆదోని ఆస్పత్రి వైద్యుల నేతృత్వంలో 45 మంది రక్తదానం చేశారు. ఆలూరు, డోన్ ఎస్పీఎంలు నాగరాజు, రంగన్న, బీపీఎం, ఎస్పీఎంల న్యాయసలహాదారుడు నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వినియోగించాలని భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు కోరారు. స్వదేశీ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పిస్తూ పత్తికొండలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కరణం నరేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, వీరేశ్, గోపాల్, మహేశ్ పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 17న శ్రీగిరి గోవర్ధన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జ్ఞానేశ్వర్‌గౌడ్ తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తిచేసిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పల్లె కబుర్లు

పెరవలి (మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలిలో వెలసిన షేక్ హజరత్ హుసేన్ 67వ ఉరుసును పురస్కరించుకొని స్వామి వారి పూల చాదర్‌ను భక్తులు ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సమక్షంలో వేకువ జామునే గ్రామంలోని వీధుల్లో ఉత్సవం చేపట్టారు. దర్గాను చేరుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

చిట్యాల(కృష్ణగిరి), న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలం తెదేపా సీనియర్ నాయకులు, చిట్యాల గ్రామం మాజీ సర్పంచి ఆర్ఈ గుండాలయ్య గౌడు(64) ఆదివారం గుండె పోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన గతంలో చిట్యాల గ్రామ సర్పంచిగా పనిచేశారు. ఆయన మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కుటుంబానికి విధేయుడిగా ఉండేవారు. విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేఈ జయన్న సంతాపం తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

తెర్నేకల్ (దేవనకొండ), న్యూస్‌టుడే: తన కుమారుడిని చూసి, తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిట్టెమ్మ(53) కరివేములలో తన కుమారుడి వద్దకు వెళ్లారు. తిరిగి ఈ నెల 11న తన గ్రామానికి చెందిన రత్నాచారి ద్విచక్ర వాహనంపై తెర్నేకల్‌కు వెళ్తుండగా.. మార్గం మధ్యలో ట్రాక్టర్‌ను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 13వ తేదీ అర్ధరాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## క్రీడలతో మానసికోల్లాసం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: నిత్యం పాఠాలు చెబుతూ బిజీ బిజీగా ఉండే ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు మానసిక ఉల్లాసం అందిస్తోందని ఆదోని ఇన్‌ఛార్జి ఉప విద్యాధికారి రాజేంద్రప్రసాద్, మండల విద్యాధికారి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. క్రికెట్ తుది పోరుకు ఆదోని, గోనెగండ్ల జట్లు, త్రోబాల్‌లో కౌతాళం, హొళగుంద జట్లు చేరాయి. సోమవారం ఫైనల్స్ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో స్పోర్ట్స్ కో-ఆర్డినేటరు కవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## దత్తత గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం సుల్తానాపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నామని, అక్కడ అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ అన్నారు. ఆదోని మండలం సుల్తానాపురం గ్రామంలో దెబ్బతిన్న రహదారికి కృష్ణమ్మ సొంత ఖర్చులతో ఆదివారం గరుసు వేయించి బాగు చేయించారు. కార్యక్రమంలో గ్రామస్థులు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, భాస్కర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయిస్తున్న కృష్ణమ్మ

## కాలమానపట్టికల ఆవిష్కరణ

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర కాలమానపట్టికలు విడుదల చేశారు.

కాలమానపట్టికలు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో సంఘం అధ్యక్షుడు నీలి లక్ష్మణస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సభ్యులు వగ్గా వీరసేన, చిలక నిత్యానంద, బోడ నరసింహులు, సిరసాలు మల్లికార్జున, జక్కా వీరేశ్, వేణుగోపాల్, మహిళా మండలి అధ్యక్షురాలు శ్యామల, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## శిరస్త్రాణం ధరించకపోతే చర్యలు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా శిరస్త్రాణం ధరించాలని, లేదంటే చర్యలు తప్పవని ఆదోని తాలుకా సీఐ నల్లప్ప, ఎస్సై రామాంజనేయులు అన్నారు.

అవగాహన కల్పిస్తున్న తాలుకా సీఐ నల్లప్ప, తదితరులు

ఆదోని పట్టణ శివారులోని ఆస్పరి రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలంలో కొత్తగా ప్రతిపాదించిన పెద్దహరివాణం మండలంలో 16 గ్రామాలను విలీనం చేయొద్దని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కోరారు. ఆదోనిలో ఆదివారం ఆదోని తెదేపా బాధ్యుడు, మాజీ

మీనాక్షినాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు

ఎమ్మెల్యే మీనాక్షినాయుడును ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. న్యాయం జరగకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నారాయణ, కారెప్ప, రాజశేఖర్ గౌడు, గోపాల్‌రెడ్డి, రామస్వామి, విరుపాక్షి, మల్లికార్జున, శేషన్న, రాము, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

హొళగుంద, న్యూస్‌టుడే: ఆదోనిలో రిలే దీక్షలకు ఆదివారం గజ్జహళ్లి యువకులు మద్దతు తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాన్ని విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామలింగ, విశ్వనాథ్, హరున్ బాషా, రమేష్ ఆచారి, పూజారి రామలింగ,

ఆలూరు: మాట్లాడుతున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు

బీమా, శివ, రామ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లా చేస్తే పరిశ్రమలు వస్తాయని.. వాటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు అన్నారు. ఆదోని జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఆలూరులో ఆదివారం మూడో రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు కత్తి రామాంజనేయులు, రామలింగయ్య, భూపేష్, ఎల్లప్ప, చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత శుభ్రతతో వ్యాధుల నివారణ

■ ఈనాడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడపిల్లలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, చిన్న చిన్న జబ్బులను నిర్లక్ష్యం చేస్తే అవి తీవ్రస్థాయి రోగాలుగా మారతాయని పత్తికొండ మండల వైద్యాధికారిణి ఎం.సుజాత అన్నారు. పత్తికొండ ఎస్సీ బాలికల వసతిగృహంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో వసతిగృహ అధికారిణి పావని అధ్యక్షతన నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏ చిన్న అనారోగ్యం తలెత్తినా ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం బాలికలు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సాయిబాబా, పర్యవేక్షణాధికారులు వరలక్ష్మి, ప్రకాశ్, సీహెచ్‌వోలు కరుణ, అనిల్‌కుమార్, మౌనిక, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు శ్రీకళ, నాగలక్ష్మి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బాలికలు రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలని రామళ్లకోట పీహెచ్‌సీ వైద్యాధికారి భువనతేజ అన్నారు. వెల్దుర్తి బీసీ బాలికల వసతి గృహంలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్యశిబిరం నిర్వహించారు. వసతి గృహంలోని 773 మంది విద్యార్థుల్లో 180 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మోహన్, ఎమ్ఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం కుసుమప్రియ, ఆశ కార్యకర్త చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: శీతాకాలంలో గజ్జి, తామర వంటి అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వసతిగృహాల్లో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని ఆస్పరి ప్రాథమిక వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. ఆస్పరిలో ఎస్సీ బాలుర వసతి గృహంలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం సుమారు 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంరక్షకులు నాగరాజు, ఏఎన్ఎంలు రుద్రమ్మ, వసుంధర, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, ఇందిరమ్మ, గోవిందమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి బాలకృష్ణారెడ్డి

హొళగుంద, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం అందించాలని గజ్జహళ్లి ప్రాథమిక వైద్యాధికారిణి రాధ అన్నారు. హొళగుంద మండల పరిధి ఇంగళదహాళ్ గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి వార్డెన్ ఎల్లమ్మ అధ్యక్షతన వైద్య శిబిరం నిర్వహించారు. 143 మంది విద్యార్థులకు బరువు, ఎత్తు పరీక్షలతో పాటు, జలుబు, దగ్గు, చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థులకు అవగాహన కలిగేలా నీటి ట్యాంకు, స్నానపు గదుల వద్ద, డయేరియా, చేతులు శుభ్రత పోస్టర్లు అతికించారు.

వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధ


ఆదోని To చెన్నై
(వయా ఎమ్మిగనూరు, కర్నూలు, తిరుపతి)
VRCR Travels Brand New
2+1 A/c Sleeper Coach
Starting from 14/12/2025 Sunday

ఆదోని అడ్రసు:
DWARAKA TRAVELS
9666761177
VRCR Head Office
9393622234
చెన్నై అడ్రసు:
VRCR TRAVELS
Koimbeedu
9440068966, 9440368966
చెన్నైలో బస్సు పోవు మార్గం : కొయంబేడు, గిండి, షోలింగనూరు, OMR Road, సిరిసిరి, కేలంబాకం


(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

## దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారోత్సవాల్లో భాగంగా ఆదివారం కుర్ని కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పింఛన్లు పెంచామని తెలిపారు. దివ్యాంగుల కోసం ఇళ్లు కేటాయిస్తామన్నారు. రాబోయే పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అర్హత కలిగిన దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించి పోటీ చేయిస్తామన్నారు. త్వరలో మూడు చక్ర వాహనాలు మంజూరు చేస్తామన్నారు. సదరన్ క్యాంపుల్లో తప్పుగా తక్కువ శాతం కేటాయిస్తే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణ స్వామి, దివ్యాంగుల సంఘం గౌరవ అధ్యక్షులు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు. అధ్యక్షులు నాగరాజు, మార్కెట్‌యార్డు అధ్యక్షులు మల్లయ్య, తెదేపా పట్టణ అధ్యక్షులు మహేష్, ముల్లాకలీముల్లా, చిక్కంజానయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన పత్తికే మంచి ధర

సోగనూరులో పత్తిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర అంతంత మాత్రమే పలుకుతోంది. సీసీఐ ద్వారా క్వింటా రూ.8,110 మద్దతు ధరకు కొంటున్నారు. బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.6వేల నుంచి రూ.7వేలకు కొనుగోలు చేస్తున్నారు. పత్తి రంగు మారిందని, నాణ్యంగా లేదని సీసీఐ కేంద్రంలో కొర్రీలు వేసి వెనక్కి పంపుతున్నారు. దీంతో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రానికి గ్రేడింగ్ చేసి తీసుకెళ్తున్నారు.

## వేరుసెనగ ధర రూ.8,302

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,302 మధ్యస్థ ధర రూ.8,149 కనిష్ఠ ధర రూ.2,371లకు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,020 కనిష్ఠ ధర రూ.5,800 పలికింది.

## నిలిచిపోయిన నీటి సరఫరా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: నీటిని విడుదల చేసే వాల్వ్ విరిగిపోవడంతో పట్టణంలో సగం కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం పెద్ద పార్కులో ఉన్న నీటి ట్యాంకు నుంచి నీటి సరఫరా విడుదల కావాల్సి ఉంది. పార్కులో వాల్వ్ విరిగిపోవడంతో చుక్క నీరు కూడా ఆయా కాలనీలకు సరఫరా కాలేదు. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ?: నెరుడుప్పల గ్రామ శివారులో చెత్త సంపద కేంద్రం, నూతన సచివాలయానికి వెళ్లే రహదారిని ముళ్ల పొదలు కప్పేశాయి. దీంతో రాకపోకలకు కష్టంగా ఉంది. ముళ్ల పొదల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. - **రామలింగప్ప, నెరుడుప్పల**

✔: అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **-అనంతశయన, డిప్యూటీ ఎంపీడీవో, గోనెగండ్ల.**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: హెచ్‌బీఎస్ కాలనీలో ఐదోలైన్‌లో వీధి దీపం వెలగడం లేదు. **-రమేష్, కాలనీవాసి**

✔: కొత్త వీధి దీపం అమర్చుతాం **-గంగిరెడ్డి, కమిషనర్**

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: ?: పట్టణంలోని మునుగాల రహదారిలో గల డంపింగ్ యార్డ్ వద్ద రహదారిపై చెత్త చెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-వీరన్న, మల్లాపురం గ్రామం.**

✔: సమస్యను పరిశీలించి చెత్తను తొలగించే చర్యలు చేపడతాం. **-రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని మేకడోన దళితవాడలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం. ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాల్వలు శుభ్రం చేయించాలి. **-నర్సయ్య, మేకడోన గ్రామం**

✔: దళితవాడలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి చర్యలు చేపడతాం. **-ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.**

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగి మండలం చింతకుంట గ్రామంలో డ్రైనేజీ కాలువలో ఇసుక పూడిక పెరిగి మురుగు నీరు ముందుకు పారడం లేదు. **-హనుమంతు, చింతకుంట**

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలో ఉండే పూడికను తొలగిస్తాం. -ఈరన్న, సర్పంచ్, చింతకుంట

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: కోడుమూరు పట్టణంలోని చేనేత కాలనీలో నాలుగు రోజుల నుంచి చెత్త బండి రావడం లేదు. **- సూరి, కాలనీవాసి**

✔: పారిశుద్ధ్య సిబ్బందితో చెత్త బండ్లను పంపిస్తాం. **-వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

# పండించినా.. ఫలితం లేక

## రైతు బజారు నిర్మిస్తే తీరనున్న అన్నదాతల కష్టాలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉప విభాగంలో చాలా మంది రైతులు ఏడాది పొడవునా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసి ఉపాధి పొందుతున్నారు. దళారుల దగా, వ్యాపారుల కమీషన్‌తో రైతు నుంచి చేయి మారగానే ధరను అమాంతంగా పెంచేస్తున్నారు. శ్రమించిన రైతులకు సాగు ఖర్చులు రాక నష్టపోతున్నారు. కూరగాయల ధరలు చౌకగా ఉన్న వినియోగదారులకు చేతికందే లోపు ధర పెరుగుతోంది. రైతులకు గిట్టుబాటు, వినియోగదారులకు చౌకగా కూరగాయలు, ఆకు కూరలు అందించేందుకు రైతు బజారు ఏర్పాటుకు నిధులు మంజూరైనా అధికారుల స్థలాభావంతో నిర్మాణం అటకెక్కింది.

### 5 వేల ఎకరాల్లో సాగు

ఎమ్మిగనూరు, గోనెగండ్ల, పెద్దకడబూరు, నందవరం, మంత్రాలయానికి చెందిన పలు గ్రామాల ప్రజలు వంకాయ, బెండకాయ, చిక్కుడు వంటి కూరగాయలతో పాటు ఆకు కూరలు సాగు చేస్తున్నారు. 12వేల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. చిన్న సన్నకారు రైతులు ఏడాది పొడవునా కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తున్నారు. ఇక్కడి నుంచి కొత్తిమీర, చౌళకాయ, బెండకాయ వంటి పంటలను హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు వంటి ప్రాంతాలకు రవాణా చేస్తారు.

బోడబండ వద్ద వేసిన పందిరి టమాటా

### ఏర్పాటులో నిర్లిప్తత

రైతు బజారు కోసం 2018లో రూ.68లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయి నిర్మాణానికి పునాదులు తవ్వారు. కేటాయించిన స్థలం తమదంటూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానానికి వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ స్థలం చూపడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. నేటికి రైతు బజారు నిర్మాణం జరగలేదు.

### తాజాగా రూ.1.70కోట్ల ప్రతిపాదనలు

వ్యవసాయ మార్కెట్‌లో రైతు బజారు నిర్మాణం కోసం తాజాగా రూ.1.70కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. యార్డులో కోసిగి రహదారి గేటు దగ్గర ఖాళీగా ఉన్న 30 సెంట్ల స్థలం కేటాయించారు. 42 స్టాల్స్, ఆరు దుకాణాలు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈసారైనా నిధులు మంజూరై రైతు బజారు నిర్మాణం పూర్తయ్యేనా అన్న సందేహం కూరగాయల రైతులు వ్యక్తం చేస్తున్నారు.

### వినియోగదారులపై భారం

ఈ ఏడాది టోకున ఉల్లి కిలో రూపాయి పలికితే మార్కెట్లో వినియోగదారుడు రూ.10ల నుంచి రూ.15లకు కొన్నాడు. రైతులు మాత్రం రవాణా ఖర్చులు రాక నష్టపోతున్నారు. కూరగాయలు, ఆకు కూరలు వ్యాపారుల చేతిలోకి వెళ్లగానే ధరలకు రెక్కలు వచ్చి కిలో రూ.10 నుంచి రూ.20లకు అమ్ముకుంటారు. రైతు బజారు నిర్మాణంతో ఈ దందాకు తెరపడనుంది.

### వెంటనే టెండర్ పిలుస్తాం –సుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి ఈఈ, మార్కెట్‌శాఖ

రైతు బజారు నిర్మాణానికి రూ.1.70కోట్లకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్ ప్రక్రియ నిర్వహించి రైతు బజారు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

## ఆదమరిస్తే వాగులోకే

కర్నూలు-కోడుమూరు రహదారిలో పెద్దపాడు గ్రామ మలుపు వద్ద వక్కెర వాగు వంతెనపై రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. కంప చెట్లు ఏపుగా పెరిగి వంతెను కప్పేశాయి. దీంతో వంతెన పక్కన వంక ఉన్న విషయం తెలియని పరిస్థితి. గతంలో రక్షణ గోడ ఉండే ఈ మార్గంలో ఇరువైపుల వంతెనపై వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సిందే. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

## నిర్మించారు.. వదిలేశారు

మండలంలోని గుడేకల్‌లో శ్రీరామనగర్ వద్ద రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామ సచివాలయం నిర్మించారు. సచివాలయం ముందు గుంతలు వంటివి పూడ్చకుండా వదిలేశారు. సచివాలయం నిర్మించినా ప్రారంభించలేదు. ప్రారంభించి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

## మురుగు నీటితో తిప్పలు

మండలంలోని దేవిబెట్టలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కొన్ని నెలలుగా డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయక చెత్తాచెదారంతో కాల్వలు నిండి దుర్గంధం వస్తోందని గ్రామస్థులు తెలిపారు. మురుగు కాల్వ నీరు వీధుల్లో ప్రవహిస్తూ దోమలకు నిలయంగా మారింది. డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

## ఇరుకు దారితో ఇబ్బందులు..

కోసిగి నుంచి పెద్దతుంబలం క్రాస్ వరకు సింగల్ రోడ్డు కావడంతో దాదాపు 30 ఏళ్ల నుంచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు రెండు వైపులా కోసుకుపోవడంతో ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. కోసిగి నుంచి పెద్దతుంబలం వరకు దాదాపు 12 కిలోమీటర్ల రోడ్డు దారుణంగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తూ ఎదురుగా వస్తున్న వాహనాలకు సైడ్ ఇచ్చే సమయంలో పలు సార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. –న్యూస్‌టుడే, కోసిగి

## 'మిగులు భూమిని పేదలకు పంచండి'

మంత్రాలయం, న్యూస్‌టుడే: మిగులు భూమిని పేదలకు పంచడంలో రెవెన్యూ అధికారులు ఎందుకు అలసత్వం చేస్తున్నారని సుప్రీంకోర్టు న్యాయవాది పురుషోత్తం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కల్లుదేవకుంటలో ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబరు 67బి2ఏలో 2.34 ఎకరాలు ఉండగా.. భూరికార్డుల్లో 2.71 ఎకరాలు వచ్చిందని అన్నారు. 2.34 ఎకరాల భూమి కోర్టులో పెండింగ్‌లో ఉండగా, ఏ వివాదం లేని 37 సెంట్లు పేదలకు పంచాలని జులైలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశామని అన్నారు. ఇంకా అలసత్వం చేస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పేదలకు పంచేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి సోదరుడు తిరుమల రెడ్డి, కుమార్తెలు అరుణ, కరుణలు, భాజపా మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.

## చలికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌతాళం మండల వైద్యాధికారిణి పావని అన్నారు. చలి తీవ్రతతో ప్రధానంగా వృద్ధులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు, పెద్దలు అలర్జీ, తదితర చర్మవ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. జలుబు, దగ్గు తదితర వచ్చే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.

## తుంగభద్ర తీరంలో ప్రత్యేక క్యూలైన్లు

నది వరకు క్యూలైన్లో వేచివున్న భక్తులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆదేశాల మేరకు మఠం అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తుంగభద్ర నది తీరంలో కల్పవృక్ష ద్వారాల సమీపంలో నుంచి మధ్యలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రెండు రోజులు వరుస సెలవులు రావడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మంత్రాలయం తరలివచ్చారు. దీంతో ఆదివారం క్యూలైన్ తుంగభద్ర నదిలో నుంచి ప్రారంభించారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

పూలచింత(నందవరం), న్యూస్‌టుడే: నందవరం మండల పరిధిలోని పూలచింత గ్రామంలో క్రిస్మస్ పురస్కరించుకొని తెదేపా సీనియర్ నాయకులు బండే గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటను ఆదివారం తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ముగతి ఈరన్న గౌడ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహభావం పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉరుకుంద ఆలయానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానం అభివృద్ధికి గుడికల్ గ్రామానికి చెందిన బోయ ఉలిగయ్య, నారాయణ, కవిత రూ.1,01,500లను విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు వీరేంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష అందజేత

ముగతి(నందవరం), న్యూస్‌టుడే: నందవరం మండల పరిధిలోని ముగతి గ్రామంలో లక్ష్మమ్మదేవి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన భీమారెడ్డి కుమారుడు రంగారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం గ్రామ పెద్దలకు అందజేశారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఈరన్నగౌడ్, వీరపాక్షి రెడ్డి, కొండారెడ్డి, గుగ్గిరి నరసింహులు, కొండన్న, రామన్న, అంజినయ్య, బోయ ఈరన్న, హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతంలో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సీఐటీయూ నాయకులు రాముడు ఆరోపించారు. సీఐటీయూ సమావేశాన్ని ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించారు. రాముడు మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, మురుగు కాల్వలు శుభ్రం చేసే కార్మికులకు ప్రతి నెలా రూ.6వేల గౌరవ వేతనం పంపిణీ చేయడం లేదన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈపీఎఫ్ జమ చేయాలన్నారు. ఆరు నెలలుగా వేతనాలు పంపిణీ చేయకపోవడంతో కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉందన్నారు. నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా సాధనతోనే అభివృద్ధి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనతోనే అభివృద్ధి సాధ్యమని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ కన్వీనర్ రామతీర్థం ఆమ్రేశ్ అన్నారు.


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ రామతీర్థం ఆమ్రేశ్

మంత్రాలయంలో ఆదివారం బూదూరు, చిలకలదోణ గ్రామానికి చెందిన జయన్న, సంసోన్, బుడుమయ్య, చిన్నన్న, రంగయ్య, ఏసేపు, లక్ష్మన్న, విజయుడు, వీరేశ్, మల్లేశ్, నాగరాజు రామింజిని, దేవదానంలు రిలే నిరహార దీక్షలో కూర్చున్నారు. ఆమ్రేశ్ మాట్లాడుతూ.. ఆదోని జిల్లా సాధించకపోతే ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు సామెల్, సుందర్రాజు, ప్రసన్నకుమార్, రాజేశ్, ఉసేని, దేవేంద్ర, మోహన్ తదితరులు సంఘీభావం తెలిపారు.

## కొత్త జిల్లా ఏర్పాటుతోనే సంక్షేమం

వివిధ సంఘాల ఆధ్వర్యంలో మద్దతు ఇచ్చిన నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతంలో పూర్తిగా వెనుకబడిన తాలూకాలు అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లా కేంద్రంగా చేయాలని వాల్మీకి సంఘం నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలేనిరాహార దీక్షకు వాల్మీకి సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. కొండయ్య మాట్లాడుతూ పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గంలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు యాపిలయ్య, మునిస్వామి, నారాయణ, రామన్న, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

☛ ఆదోని జిల్లా కేంద్రంగా చేయాలని వైకాపా ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్న నేతలకు వైకాపా మాజీ ఎంపీ బుట్టా రేణుక మద్దతు తెలిపారు. ఆదోని సాధన కోసం పోరాటం నిరంతరం కొనసాగిస్తామన్నారు.

## ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే పోరాటం తప్పదు

కోడమూరు పట్టణం, న్యూస్‌టుడే: నకిలీ పట్టాతో కోడుమూరు గ్రంథాలయ స్థలాన్ని ఆక్రమిస్తే పోరాటం తప్పదని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. కోడుమూరు పట్టణంలో ఆదివారం యూత్ రిక్రియేషన్ కేంద్రంలో భాజపా మండల అధ్యక్షుడు మహేష్ నాయుడు అధ్యక్షతన రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. దస్త్రాలు నకిలీవని వారు ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న భాజపా మండల అధ్యక్షుడు మహేష్

## సంక్షిప్త సమాచారం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు వెంకటేష్ నాయక్ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లుగా ఉన్న వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై నిరంజన్‌రెడ్డి సూచించారు. మండలంలోని రౌడీషీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు రప్పించి గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని, గొడవలు, అల్లర్లకు దిగరాదని పేర్కొన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యంపై మంత్రాలయంలో విచారణ చేపట్టినట్లు సీఐ రామానుజులు తెలిపారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీకి చెందిన మహిళ మంత్రాలయంలో అదృశ్యమైనట్లు, మఠం పరిసర ప్రాంతాలు, తుంగభద్ర నది తీరం వెంట విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు సీఐ రామానుజులు తెలిపారు. ఆదివారం భారీగా భక్తులు తరలిరావడంతో కిలోమీటరు మేర వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సి.బెళగల్ ఎస్సై వేణుగోపాల్ రాజు అన్నారు. బ్రహ్మణ దొడ్డి గ్రామంలో ఎస్సై పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు.

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కోడుమూరు శిక్షణ ఎస్సై మణికంఠ అన్నారు. ఆదివారం కోడుమూరులోని రహదారిలో తనిఖీలు చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, శిరస్త్రాణం లేని వారిపై జరిమానా విధించారు.

## గొర్రెల కాపరులను ఆదుకోవాలి

గూడూరు, న్యూస్‌టుడే: పెంచికలపాడు శివారులో వాహనం ఢీకొని గొర్రెలు మృతి చెందాయని, వాటి కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం వాటి వివరాలను నాగలాపురం ఎస్సైకి అందించి, గొర్రెల కాపరులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణ, రాముడు, కరణం, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

## రహదారి.. ఆరంభంలో అసంపూర్తి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు నుంచి సోగనూరుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో నాబార్డు నిధుల కింద రూ.2కోట్లతో రహదారి నిర్మించారు. కానీ పట్టణం శివారులో దాదాపు అర కిలోమీటరు మేర రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. రహదారి అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి నుంచి పురపాలక డంపుయార్డుకు వాహనాలు తిరుగుతాయి. రోడ్డు ఆరంభంలో నిర్మించకుండా వదిలేయడంతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. రహదారి నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని అధికారులు తెలిపారు. పరిహారం అందించాలని రైతులు న్యాయస్థానానికి వెళ్లడం వల్ల పట్టణ శివారు నుంచి రహదారిని నిర్మించకుండా వదిలేసినట్లు చెబుతున్నారు.

# రోడ్డు వేసి.. నాణ్యత మరచి

✦ ఐదేళ్లకే ఏర్పడిన గుంతలు

కోడుమూరు, న్యూస్‌టుడే: రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో తక్కువ కాలంలోనే గుంతలు ఏర్పడుతున్నాయి. కోడుమూరు మండల పరిధిలోని ప్యాలకుర్తి నుంచి గూడూరుకు వరకు ఉన్న 5 కిలోమీటర్ల బీటీ రహదారి అధ్వాన స్థితిలోకి చేరుకుంది. దాదాపు రూ.2.50 కోట్ల నిధులతో 2019లో నాటి వైకాపా ప్రభుత్వం ఈ దారిని నిర్మించింది. రోడ్డు వేసి మమ అనిపించారు. కానీ నాణ్యత లేకుండా నాసిరకంగా పనులు చేశారు. దీంతో బీటీ రహదారి నిర్మించి ఐదేళ్లు పూర్తి కాకముందే రహదారికి అక్కడక్కడ లోతైన గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు కోతకు గురవుతోంది.

### మరమ్మతులు లేక

ప్యాలకుర్తి గ్రామానికి సమీపంలో పెద్ద గుంత ఏర్పడగా, గూడూరు సమీపంలోని మలుపు వద్ద రోడ్డంతా కోతకు గురైంది. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు నిత్యం అంతరాయం ఏర్పడుతోంది. ఈ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గతంతో ఈ రోడ్డు మంజూరుకు తెదేపా ప్రభుత్వం నాబార్డు ద్వారా రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయిస్తే.. వైకాపా అధికారంలోకి వచ్చి తూతూ మంత్రంగా రోడ్డు నిర్మించి నిధులు మెక్కేసింది. దీంతో నేడు ఈ రోడ్డు రోజు రోజుకు అధ్వాన్న స్థితిలోకి చేరుకుంటోంది. కనీస మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రహదారిపై ఏర్పడ్డ గుంత

### నిర్మాణ వివరాలు

రహదారి: ప్యాలకుర్తి నుంచి గూడూరుకు
బీటీ వేసిన దూరం: 5 కిలోమీటర్లు
నిధుల మంజూరు: నాబార్డు ఆర్‌డీఐఎఫ్
రోడ్డు నిర్మాణానికి వ్యయం: రూ.2.50 కోట్లు

### కనీసం పూడ్చడం లేదు: వెంకటేశ్వర్లు, ప్యాలకుర్తి

ఏదైనా పనులు చేసుకోవడానికి గూడూరుకు, పొలాలకు వెళ్లాలంటే ఈ దారిలోనే వెళ్లాలి. కానీ అప్పటి వైకాపా హయాంలో తారు రోడ్డును తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డుకు అక్కడక్కడ పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎడ్లబండ్లు, వాహనాలు గుంతల్లో పడే ప్రమాదం ఉంది. కనీసం సంబంధిత అధికారాలు గుంతలు పూడ్చాలి. ప్రజా సమస్యలను పట్టించుకుంటేనే ప్రమాదాలు జరగవు.

(c) eenadu

# కర్నూలు

•కర్నూలు •పాణ్యం

## సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా జీవించండి

ర్యాలీని ప్రారంభిస్తున్న రత్నరూత్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు సైకిల్ తొక్కి ఆరోగ్యంగా ఉండాలని జిల్లా సైనిక సంక్షేమాధికారిణి రత్నరూత్ సూచించారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా సైనిక సంక్షేమ బోర్డు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు డీఎస్ఏ స్టేడియం నుంచి నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కర్నూలు సెంటర్ ఇన్‌ఛార్జి కార్తికేయ, జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.బాబురాజ్, విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ : ఆధునికీకరణ పనుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్తు ఉండదని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. డీ2 సెక్షన్ పరిధిలో బిర్లా కాంపౌండ్, రాఘూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, డీ1 సెక్షన్ పరిధిలో స్వామిరెడ్డినగర్, దేవనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ : **?:** ఎఫ్‌సీఐ కాలనీ, మహాలక్ష్మినగర్, అరోరానగర్‌లలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు**

**?:** వీకర్‌సెక్షన్ కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది. నివారణ చర్యలు చేపట్టాలి. - **మనోజ్**

**✔:** సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక అధికారులు

## బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలు డీఎస్ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో మూడు రోజుల పాటు నిర్వహించిన భూషణ్‌రావు స్మారక రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో అనంతపురం జట్టు రాజమహేంద్రవరం జట్టుపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది.

విజేత అనంతపురం జట్టుతో మంత్రి టీజీ భరత్

మూడోస్థానం కోసం జరిగిన పోటీలో చిత్తూరు జట్టు కర్నూలుపై విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందని చెప్పారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి దాదాబాషా, తదితరులు పాల్గొన్నారు.

## నదులు ఆక్రమించి.. నగరాన్ని ముంచి

✳ యథేచ్ఛగా హంద్రీ, తుంగభద్ర భూముల కబ్జా
✳ నోటీసులు ఇచ్చేందుకు అధికారుల కసరత్తు

ఇవి కల్లూరు పరిధిలోని హంద్రీనది బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలు. హంద్రీ వెంబడి సర్వేచేసి నది హద్దు ఇది అంటూ గతంలో స్తంభాలను పాతారు. ఈ ప్రాంతంలో చాలా వరకు నదీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగర పరిధిలోని వాగులు, నదులు అడుగడుగునా ఆక్రమణలకు గురయ్యాయి. వాటి తీర ప్రాంతాన్ని ఎవరికి వారు దర్జాగా కబ్జా చేసేశారు. బఫర్ జోన్‌లోని స్థలాలకు కూడా కొంతమంది అక్రమార్కులు పట్టాలు సృష్టించారు. వారికి రెవెన్యూ అధికారులు సహకరించారు. ప్రస్తుతం ఆ భూముల్లో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు వెలిశాయి. సంబంధిత శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించారు. ప్రస్తుతం హంద్రీ నది స్థలంలో అక్రమంగా నివసిస్తున్న వారికి నోటీసులు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు.

### పలు కాలనీలకు ముంపు ముప్పు

తుంగభద్ర నదికి వరద వచ్చిన ప్రతిసారి తీరం వెంబడి ఉన్న రోజావీధి, ప్రకాష్‌నగర్, సాయిబాబా సంజీవయ్య నగర్, కొత్తపేట, ఖండేరి, కల్లావీధి, రాంబొట్ల ఆలయం ప్రాంతం, బండిమెట్ట కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. హంద్రీనదిలో వరద ఉద్ధృతి పెరిగితే కల్లూరులోని చెంచు కాలనీ, వడ్డెగేరి, బుధవారపేటలోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోతాయి.

### విలువైన స్థలాలు అన్యాక్రాంతం

కర్నూలు నగరంలో తుంగభద్ర, హంద్రీనదులు, కేసీ కాలువ, వక్కెరవాగుతో పాటు సుద్దవాగు ప్రవహిస్తుంది. ఈ జల వనరులకు సంబంధించిన భూములు పలు ప్రాంతాల్లో అన్యాక్రాంతమయ్యాయి. వీటిలో భారీ భవనాలు సైతం నిర్మించారు. వారికి నగరపాలక పట్టణ ప్రణాళిక అధికారులు అనుమతులు ఇవ్వడం గమనార్హం.

◆ నగర పరిధిలో హంద్రీనది సుమారు 5 కి.మీ.ల మేర ప్రవహిస్తోంది. కల్లూరు పరిధి ముజఫర్‌నగర్ నుంచి కల్లూరు, బుధవారపేట మీదుగా ప్రవహించి జొహరాపురం సమీపంలో తుంగభద్ర నదిలో కలుస్తుంది. ముజఫర్‌నగర్ నుంచి కల్లూరు వరకు హంద్రీనదికి చెందిన స్థలంలో భవనాలు కట్టుకొని నివాసం ఉంటున్న వారు, పట్టాలు కలిగున్న దాదాపు 600 మందికి నోటీసులు ఇచ్చేందుకు కల్లూరు రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

◆ వక్కెరవాగు పెద్దపాడు నుంచి కల్లూరు మీదుగా సుమారు 6 కి.మీ ప్రవహించి ఆనంద్ థియేటర్ సమీపంలో హంద్రీనదిలో కలుస్తుంది. కల్లూరు పరిధిలో ఈ వాగు ఆక్రమణలతో కుచించుకుపోయింది.

## పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్ డిమాండు చేశారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనేతర పనులతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ అంశాలపై ఈనెల 18వ తేదీన జిల్లా కేంద్రంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్

### 21న సాహితీ సదస్సు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కర్నూలు ఎస్టీయూ భవన్‌లో ఈనెల 21న 90 ఏళ్ల తెలుగు అభ్యుదయ సాహిత్యం అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్ తెలిపారు. నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఆహ్వాన పత్రికలను డా.హరికిషన్, సత్యనారాయణ, పుల్లా రామాంజనేయులుతో కలిసి ఆయన విడుదల చేశారు.

## అరకొర పనులు.. వాహనదారులకు పాట్లు

అభివృద్ధి పనుల కోసం రహదారులను తవ్వి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకుండా వదిలేస్తుండటం వాహనదారుల పాలిట శాపంగా మారింది. వెంకటరమణ కాలనీలోని ప్రధాన రహదారి మధ్యలో పైపులైను మరమ్మతుల కోసమని రెండు వారాల కిందట గుంత తవ్వారు. తర్వాత మట్టితో కప్పెట్టి అక్కడ సిమెంటు దిమ్మెలను అడ్డుగా పెట్టి చేతులు దులిపేసుకున్నారు. ఇదే రోడ్డులో రెండు రోజుల కిందట ప్రధాన పైపులైను పగిలిపోవడంతో మరోచోట భారీ గుంత తవ్వి మరమ్మతులు చేశారు. దాన్ని కూడా సరిగా పూడ్చకుండా వదిలేశారు. నిత్యం విపరీతమైన రద్దీ ఉండే రహదారిలో ఈ గుంతలు, దారికి అడ్డుగా ఉన్న దిమ్మెల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారి నపడే ఆస్కారముంది. గుంతల్ని సక్రమంగా పూడ్చి తారుతో ప్యాచ్‌వర్క్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

## మురుగు తటాకం.. భరించరాని దుర్గంధం

దిన్నెదేవరపాడు రోడ్డు నుంచి శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల ముందు నుంచి నంద్యాల జాతీయ రహదారికి చేరుకునే రోడ్డుకు ఇరువైపులా కాలనీలు వెలిశాయి. నగర శివారు ప్రాంతంలోని ఈ కాలనీల్లో మురుగు కాలువల్లేక వర్షం నీరు, మురుగు ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో నిల్వ చేరి చెరువులను తలపిస్తోంది. వీటి కారణంగా ఈ ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. దోమల సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. సమస్యను నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

## యశిత.. ఉషూలో విజేత

యశ్వితరెడ్డి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : యుద్ధ క్రీడ ఉషూలో కర్నూలుకు చెందిన యశిత సత్తా చాటుతోంది. పట్టుదలతో నేర్చుకుని.. కత్తి పట్టి కఠోర సాధనతో ఆటపై పట్టు సాధించింది. 2025 ఖేలో ఇండియా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పోటీపడి పతకం సాధించాలన్న లక్ష్యంతో నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిత్యం సాధన చేస్తోంది.

● కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో నివసించే శ్రీలత, రాఘవేంద్రరెడ్డి దంపతుల కుమార్తె యశితారెడ్డి. ఏడో తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని 2023 నుంచి ఉషూ క్రీడలో శిక్షణ పొందుతోంది. ● 2024 అక్టోబరు 26న కర్నూలు నగరంలోని కిడ్స్ వరల్డ్‌లో జరిగిన సబ్‌జూనియర్ పోటీల్లో టైచీ జాన్ (కత్తి) ఈవెంట్‌లో స్వర్ణ పతకం గెలుపొందింది. ● 2024 నవంబరు 10న రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో టైచీ జాన్ ఈవెంట్‌లో బంగారు పతకం అందుకుంది. ● 2025 ఆగస్టు 1న కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా జిల్లాస్థాయి ఉషూ పోటీల్లో టైచీ జాన్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. ● ఈనెల 8 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖేలో ఇండియా ఉషూ పోటీల్లో గ్రూప్-బి విభాగంలో బంగారు పతకం అందుకుంది. ● ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్రీడాకారిణులతో ఎంపీ బస్తిపాటి నాగరాజు

## క్రీడాకారిణులకు అభినందన

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి ఈత పోటీల్లో ఏపీ తరఫున పాల్గొంటున్న కర్నూలుకు చెందిన క్రీడాకారిణులను ఎంపీ బస్తిపాటి నాగరాజు అభినందించారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం క్రీడాకారులు ఆయన్ను కలిశారు. అండర్-19 విభాగంలో హేమలత, అండర్-17 బాలికల విభాగంలో కె.శ్రుతి, సిరి చేతన్‌రాజ్, పి.లహరి పోటీ పడనున్నారు.

### రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో జిల్లాకు రెండో స్థానం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరంలో ఈనెల 8 నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి రన్నర్స్ ట్రోఫీని సాధించారు. కర్నూలు నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉషూ సంఘం అధ్యక్షుడు బిజినపల్లి సందీప్ ఆదివారం క్రీడాకారులను అభినందించారు. పతకాలు సాధించిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైష్ణవి, పునర్విక, జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన వారికి ట్రోఫీ అందజేస్తున్న సందీప్

### ఐడీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) రాయలసీమ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ అధ్యక్షులుగా డాక్టర్ నాగలక్ష్మీరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ సురేష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ దత్తసాయి కిరణ్, కోశాధికారిగా డాక్టర్ సందీప్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం నుంచి ఏపీ ఐడీఏ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ రామచంద్రారెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ మెంబరుగా డాక్టర్ కిషోర్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దంతవైద్యులు మురళీధర్‌రెడ్డి, మంజునాథ్, మజార్, శ్రీనివాసులు, అశోక్, భార్గవ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షులు డాక్టర్ నాగలక్ష్మీరెడ్డి, సెక్రెటరీ డాక్టర్ సురేష్‌గౌడ్‌తో నూతన కార్యవర్గ సభ్యులు

### దాతలు వృద్ధులకు చేయూతనివ్వాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వృద్ధులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని వైద్యుడు డా.శంకర్‌శర్మ కోరారు. నగరంలోని గురుదత్త పాలిక్లినిక్‌లో నిరుపేద వృద్ధులకు ఆదివారం ఆయన దుప్పట్లు, చలికోట్లు పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డా.శంకర్‌శర్మ

### అలరించిన సంగీత విభావరి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ఘంటసాల జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని శ్రీశైలం ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్ పి.కొండయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమాన్ని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రకాశం జిల్లా ఘంటసాల సంఘం అధ్యక్షులు నాగశ్రీ, రామాంజనేయులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గాయకులు ఘంటసాల పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. గాయనీ గాయకులను అతిథులు సత్కరించారు.

### హిందువులు ఐక్యతతో ముందుకు సాగాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : హిందువులు ఐక్యతతో ముందుకు సాగాలని కర్నూలు చిన్మయ మిషన్ మాతాజీ సుప్రేమానంద సరస్వతి, విభాగ్ సేవా ప్రముఖ్ అంకె శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కల్లూరు ఎస్టేట్ బస్తీ-2లో ఆదివారం హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కర్నూలు నగర ప్రముఖ్ డా.చల్లా వాసురెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మద్దిలేటి యాదవ్, నాగేంద్ర, కేతన్‌కుమార్, రాధిక, సుశీలమ్మ, భీమేశ్వర్‌రెడ్డి, శేఖర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న అతిథులు

### సంస్కృతభాషపై పట్టు అవసరం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : మాతృభాషతో పాటు సంస్కృత భాషపై పట్టు సాధించడం అవసరమని తెలుగు అధ్యాపకురాలు పార్వతీదేవి చెప్పారు. నగరంలోని బుధవారపేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సంస్కృతంలో సర్టిఫికేట్ కోర్సును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసదేసికన్, కుమారి సంధ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### సేవాగుణం అలవర్చుకోండి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని సీఐడీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు పెద్దయ్యనాయుడు సూచించారు. నగరంలోని నందికొట్కూరు రోడ్డులోని అభయగిరి ఆశ్రమంలో ఆదివారం ఆయన చిన్నారులకు దుస్తులు, నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలు, అనాథలకు కేటాయించినప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. ఆత్మవిశ్వాసంతో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ పర్యవేక్షణ కమిటీ సభ్యుడు లయన్ రాయపాటి శ్రీనివాస్, నవమణి, చిన్నమ్మబాయి, తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన మాంసం విక్రయించాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : వినియోగదారులకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలని ఏపీ మాంసం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు దుకాణదారులకు సూచించారు. కర్నూలు నగరంలోని మద్దూరునగర్, పాతనగరం, మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిసరాలు, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండు ప్రాంతాల్లోని మాంసం దుకాణాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాతనగరంలో 15 కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మలై చికెన్ పెద్ద ఎత్తున సరఫరా అవుతోందని, దానిని తినడం వల్ల వినియోగదారుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, నగరపాలక పశు వైద్యాధికారి డా.మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగర పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఎస్టీబీసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.షాలేమ్‌రాజు, ఎస్.జీవన్‌రావు, డా.ఆర్ఆర్‌డీ సంజీవరాజు, ఆర్.దాస్, పి.విలియమ్స్ క్రీస్తు సందేశాన్ని బోధించారు. పార్కు రోడ్డులోని ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. యూత్ డైరెక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సన్మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.

ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పాటలు పాడుతున్న యువతీయువకులు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : స్టాంటన్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కరుణసాగర్, విలియం స్టాంటన్ పాస్టర్, సంజీవ్ క్రిస్టోఫర్, కృపదానం, డాక్టర్ సృజన, మెడికవర్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంక్షిప్త సమాచారం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు ఊరువాకిలి సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఆదివారం నాయకుడు భరత్ సింహారెడ్డితో పాటు పలువురు యువత రక్తదానం చేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎఫ్‌సీఐ కాలనీలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాట్రవత్ మధునాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, సరుకుల నిల్వ గదిని, దస్త్రాలను పరిశీలించారు. వసతిగృహం నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు నగర హోటళ్లు, బేకరీల కార్మికుల సంఘం 3వ మహాసభలు జనవరి 7న నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు.

## ఇక్కడ రహదారులే మురుగు కాలువలు

◆ పలు కాలనీల్లో సమకూరని డ్రైనేజీ వ్యవస్థ ◆ పారిశుద్ధ్య లోపంతో ప్రజల అవస్థ

వెంకటరమణ కాలనీ పరిధిలోని అమీన్ అబ్బాస్‌నగర్‌లో ప్రధాన రహదారిలో కాలువలు లేక మురుగునీరు రోడ్ల వెంట పారుతోంది. దీంతో దుర్వాసన, పందుల సంచారం, దోమల సమస్య అధికమై ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

బాలాజీనగర్ పరిధిలోని వీనస్‌కాలనీలో కాలువల నిర్మాణం కోసం గుంతలు తీసి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా పనులు చేయకపోవడంతో పారిశుద్ధ్య సమస్య వేధిస్తోంది. ఇళ్ల ముందు గుంతపై బండలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని కాలనీల్లో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన కాలువలు ఛిద్రమయ్యాయి. పక్క గోడలు కూలిపోయి పూర్తిగా పూడిపోయాయి. మరికొన్ని కాలనీల్లో కాలువల జాడే లేదు. దీంతో మురుగునీరు వీధుల్లో, రోడ్లపైనే పారుతోంది. ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. ఫలితంగా భరించలేని దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. తమ కాలనీలో కాలువలు నిర్మించి మురుగు సమస్యకు పరిష్కారం చూపాలని దశాబ్దాలుగా విన్నవిస్తున్నా.. నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**పన్నులు కడుతున్నా అభివృద్ధి సున్నా**

● కర్నూలు నగరంలోని 52 వార్డుల పరిధిలో 630 కి.మీల వరకు మురుగు కాలువలు ఉన్నాయి. శివారు ప్రాంతాలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న కాలనీల్లో మాత్రం కాలువల కొరత తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి నగరపాలక సంస్థకు ఏటా రూ.కోట్లలో పన్నులు వసూలవుతున్నాయి. తమ నుంచి పన్నులు కట్టించుకుంటున్న అధికారులు వసతుల కల్పనపై మాత్రం దృష్టిపెట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సంతోష్‌నగర్, మహాలక్ష్మినగర్, సోమప్పకాలనీ, ఇంజినీర్స్‌కాలనీ, సోమశెట్టినగర్, ప్రియానగర్, బాలాజీనగర్, ఆటోనగర్, రాజీవ్‌గృహకల్ప, మారుతీ మెగాసిటీ తదితర కాలనీల్లో మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేవు.

● నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సరస్వతినగర్, సోమిశెట్టినగర్, ధనలక్ష్మినగర్, ఎన్జీవోకాలనీ, ముజఫర్‌నగర్, ఆదిత్యనగర్, విఠల్‌నగర్, తదితర కాలనీల్లోని శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు.

● ఎఫ్‌సీఐ కాలనీ-2, ఇందిరాగాంధీ బీసీకాలనీ నుంచి శాంతినగర్, రేడియో స్టేషన్ మీదుగా వైజంక్షన్ వరకు బళ్లారి రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేవు.

### ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నగరం

జెండా ఊపి స్వచ్ఛత పనులను ప్రారంభిస్తున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలును స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. క్లీన్, గ్రీన్ సిటీ కార్యక్రమంలో భాగంగా నగరంలో ఆదివారం ఖాళీ స్థలాల్లో పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల చొరవతో స్వచ్ఛంద సంస్థలు 27 జేసీబీలను అందించాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్యాధికారి డా.నాగశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### చెరువులోకి దూసుకెళ్లిన కారు.. ప్రయాణికులు సురక్షితం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట శివారులో చెరువులోకి కారు దూసుకెళ్లింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. కర్నూలు నగరం నిర్మలానగర్‌కు చెందిన చిప్పగిరి శ్రావణ్‌కుమార్ (50), ధనలక్ష్మి (48), మాకా జయప్రకాష్ (62), సుభద్రాదేవి (57) దంపతులు తిరుమలకు కారులో బయల్దేరి వెళ్లారు. ఆదివారం స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని చెర్లోపల్లి సమీపంలో కారు నడుపుతున్న శ్రావణ్‌కుమార్ నిద్ర మత్తులో చెరువులోకి తీసుకెళ్లారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎస్.ఐ.రామ్మోహన్ గుర్తించి కారులో ఉన్న వారిని బయటికి తీసుకొచ్చారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కారును క్రేన్ సాయంతో బయటకు తీసేటప్పుడు జాతీయ రహదారిపై వాహనాలు కొద్ది సేపు నిలిచిపోయాయి.

(c) eenadu

ఈనాడు
నంద్యాల
సోమవారం డిసెంబరు 15, 2025 5

బనవాసిఫారం వద్ద ఏర్పాటు చేయనున్న స్మార్ట్ సిటీ

# గృహానందమే

**• టౌన్‌షిప్‌లలో స్థలాల అభివృద్ధికి చర్యలు**

'స్మార్ట్ టౌన్‌షిప్'ల పేరుతో గత వైకాపా సర్కారు హడావుడి చేసింది.. ఆ తర్వాత పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌గా మార్చింది. ప్రస్తుతం కుడా పరిధిలో లేఅవుట్ల అభివృద్ధి కోసం టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎమ్మిగనూరులోని కాలనీలో మౌలిక వసతులకు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ

**భారీగా దరఖాస్తులు**

ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది పట్టణాల్లో 500 ఎకరాలు సేకరిస్తామని గత సర్కారు పేర్కొంది. చివరికి ఎమ్మిగనూరులో 110, ఆళ్లగడ్డలో 14.50 ఎకరాలు సేకరించారు. వసతుల కల్పనకు బనవాసిలో రూ.58 కోట్లు, ఆళ్లగడ్డలో రూ.8.93 కోట్లతో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు.

**ప్లాట్లుగా విభజించి..**

- ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారంలో 110.10 ఎకరాలు కేటాయించారు. మూడు సెంట్ల ప్లాట్లు 447, నాలుగు సెంట్లు 460, ఐదు సెంట్ల ప్లాట్లు 199గా విభజించారు.
- 39 ఎకరాల్లో ముళ్లపొదలు తొలగించారు. మట్టి రోడ్లు వేసి వదిలేశారు. 25 ఎకరాల్లో రాళ్లు పాతారు. రూ.25 లక్షలతో పనులు చేపట్టగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.18 లక్షల బిల్లులు చెల్లించారు. మిగిలిన 70 ఎకరాల్లో పనులు చేపట్టాల్సి ఉంది.

**ఈ-యాప్ పద్ధతిలో..**

బనవాసి టౌన్‌షిప్‌లో ఇళ్ల స్థలాలకు ఆన్‌లైన్‌లో 267 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మొదట పది శాతం చెల్లించాలి. ఒప్పందం చేసుకున్న తేదీ నుంచి నెలలోపు 30 శాతం, ఆరు నెలల్లోపు 30 శాతం, 12 నెలల్లోపు లోపు లేదా రిజిస్ట్రేషన్ సమయంలోగా మిగతా 30 శాతం చెల్లించాలని గత సర్కారు హయాంలో నిర్ణయించారు. ఈ పద్ధతిని మార్చి ఈ-యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం తెలిపారు. తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్‌లో లేదా టోల్‌ఫ్రీ నంబరు 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.

## బండలు జారి.. బతుకులు తెల్లారి

జాతీయ రహదారి 340 నిర్మాణంలో భాగంగా సీతారాంపురం-బేతంచెర్ల మధ్యలో కొండను తొలిచి పనులు పూర్తి చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా మట్టితోపాటు రాళ్లు జారి పడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బండరాళ్లు జారి వాహనాలపై పడితే పెను ప్రమాదం జరిగే అవకాశముంది. – ఈనాడు, కర్నూలు

# నాణ్యత కప్పేసి.. నిధులు మెక్కేసి

**• పీఎంశ్రీ పనుల్లో అక్రమాలు**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కేంద్రం పీఎంశ్రీ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల్లో మైదానాలు, ప్రయోగశాలల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టిన పలువురు నాసిరకంగా చేసి నిధులు దిగమింగారు. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, ఎమ్మిగనూరు

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ కింద 54 పాఠశాలలను ఎంపిక చేశారు. సైన్సు ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సౌర ఫలకాల ఏర్పాటు, కిచెన్ గార్డెన్లు తదితర వాటి కోసం నంద్యాల జిల్లాలో 44, కర్నూలు జిల్లాలో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. నంద్యాల జిల్లాకు రూ.15.61 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. పనుల్లో నిబంధనలు పాటించలేదు.



**రూ.3.50 లక్షలు వెచ్చించినా..**

ఎమ్మిగనూరు బాలిక జడ్పీ పాఠశాల క్రీడా మైదానాన్ని రూ.3.50 లక్షలతో అభివృద్ధి చేశారు. ఈ పనుల్లో ఎక్కడా నాణ్యత కానరావడం లేదు. వేసిన మట్టిని కూడా సరిగా క్యూరింగ్ చేయలేదు. రోలింగ్ చేయకపోవడంతో మైదానమంతా ఎగుడు దిగుడుగా కనిపిస్తోంది.

**పర్యవేక్షణ కరవై..**

పలు ప్రాంతాల్లో పనులు ఇష్టారాజ్యంగా జరిగాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత కొరవడింది. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం వృథా అయింది. పాఠశాల యాజమాన్య కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టినప్పటికీ.. వీటిని స్థానిక నాయకులే చేశారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరించారు.

**పైపై మెరుగులే..**

→ కోవెలకుంట్ల ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో రెండు ప్రయోగశాలలు నిర్మించారు. అటువైపు.. ఇటువైపు గోడలు నిర్మించి పైకప్పు వేసి మమ అనిపించేశారు. ఫలితంగా వర్షం పడిన సమయంలో పైకప్పు నుంచి నీళ్లు కారుతూ తటాకాన్ని తలపిస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చివరికి ల్యాబ్‌లను ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

→ కర్నూలు జిల్లాలోని పెరవలి, పెద్దపాడు, నంద్యాల జిల్లాలోని కొణిదేల, కొత్తపల్లి, ఎన్.కొత్తపల్లె పాఠశాలల్లో జరిగిన పనులపై ఆరోపణలు వచ్చాయి.

→ అవుకులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రయోగశాల పనులు పూర్తికాకుండా మధ్యలోనే ఆపేశారు. ఫలితంగా విద్యార్థినుల అవస్థలు అన్నీఇన్నీకావు.

→ ఆత్మకూరు, రుద్రవరం, అవుకు మోడల్ స్కూళ్లలోని క్రీడా మైదానం పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. చాలా ప్రాంతాల్లో పనులు అధ్వానంగా సాగాయి.

→ కర్నూలు జిల్లాలో నందవరం, తుగ్గలి, హాలహర్వి, కర్నూలు, హొళగుంద, గూడూరు, ఆదోని తదితర ప్రాంతాల్లోని పాఠశాలల మైదానం పనుల్లో ఎక్కడా నాణ్యత కానరావడం లేదు. చాలా ప్రాంతాల్లోని క్రీడా కోర్టులు అలంకారప్రాయంగా మారాయి.

## ఊరంతా భీమలింగప్పలే

చిప్పగిరి మండల పరిధిలోని బెల్డోణ గ్రామంలో 650కిపైగా గృహాలున్నాయి. 3,500 మంది నివసిస్తున్నారు. ఊర్లో కొలువుదీరిన భీమలింగేశ్వరస్వామిని ఇక్కడి వారు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఇంట్లో పుట్టిన మొదటి సంతానానికి భీమ వచ్చేలా పేర్లు పెట్టుకోవడం పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఆయన శిష్యురాలైన సంజమ్మ పేరునూ మరికొందరు పెట్టుకుంటున్నారు. గ్రామంలో సగం మందికిపైగా భీమ, భీమలింగేశ్వర, భీమేశ్, భీమక్క, భీమన్న, భీమప్ప, భీమలింగప్ప, సంజమ్మ, సంజక్క, సంజప్ప, సంజన్న పేర్లు పెట్టుకోవడం విశేషం. వేములవాడ భీమ కవి 13వ శతాబ్దంలో బెల్డోణ గ్రామంలో కొలువుదీరారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కరవు కాటకాలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో భీమలింగేశ్వరుని అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురవడం. పంటలు బాగా పండటంతో నాటి నుంచి నేటి వరకు గ్రామస్థులంతా ఆయన్నే కొలుస్తున్నారు. గ్రామానికి చెందినవారు దేశవిదేశాల్లో ఎక్కడ స్థిరపడినా ఏటా ఏప్రిల్‌లో ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు తప్పనిసరిగా హాజరవుతారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం, చిప్పగిరి

**కళా నీరాజనం**

శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం కళారాధనలో భాగంగా ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన శ్రీరాయన శ్రీనివాసరావు బృందం, హైదరాబాదుకు చెందిన శ్రీ రాజరాజేశ్వర భారత కళామితి బృందం వారు వేర్వేరుగా ఆధ్యాత్మిక గీతాలకు నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు ప్రసాదాలు, ప్రశంసాపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

# ఆస్తి పన్ను ఎగమేత

**• ఏళ్లుగా పక్కదారి పట్టిన నిధులు**

**సిబ్బంది స్వాహాపర్వం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను విధింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారుల్లో అడ్డు అదుపు లేకపోవడంతో పలువురు అవినీతికి పాల్పడ్డారు. ఫలితంగా ఖజానాకు భారీ గండి పడింది. – న్యూస్‌టుడే, ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు పురపాలికలు, నంద్యాల పట్టణం

ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాలున్నాయి. 3,02637 మంది ఆస్తి పన్ను చెల్లింపుదారులున్నారు. ఏటా రూ.127.23 కోట్లకుపైగా పన్ను సమకూరుతుంది. ఇంటింటి సర్వేతో కొత్తగా 60 వేల మందిని గుర్తించారు. సుమారు రూ.20 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరనుందని అంచనా.

**పురపాలికల్లో ఇంటింటి సర్వేలో గుర్తించి పన్ను పరిధిలోకి తెచ్చిన భవనాలు, లభించిన ఆదాయం**

| ప్రాంతం | కొత్తగా పన్ను పరిధిలోకి వచ్చినవి | సమకూరిన ఆదాయం |
|---|---|---|
| కర్నూలు | 15,000 | రూ.5 కోట్లు |
| నంద్యాల | 928 | రూ.80 లక్షలు |
| ఆదోని | 1,500 | రూ.70 లక్షలు |
| ఎమ్మిగనూరు | 518 | రూ.40 లక్షలు |

→ నంద్యాలలోని పలు ప్రాంతాల్లో ఒక్కో రకమైన నిర్మాణం జరిగితే.. మరోరకమైన పన్ను విధించారు. మూడంతస్తుల ఇంటికి పన్ను వేయాల్సి ఉండగా.. ఒక అంతస్తు మాత్రమే ఉన్నట్లు పన్ను పరిధిలో చూపారు. మరో ప్రాంతంలో కొందరు డబ్బులు వసూలు చేసి స్వాహా చేశారు.

→ ఆదోనిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పన్ను పరిధిలో రాని 50శాతం పైగా ఇళ్లను గుర్తించి తగిన చర్యలు చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మామూళ్లు తీసుకుని పన్నులు విధించకుండా అక్రమాలకు పాల్పడ్డారు.

→ టిడ్కో ఇళ్ల జారీలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టింది. ఇప్పటివరకు ఓ కొలిక్కి రావడం లేదు.

**20 శాతం మందికిపైగానే..**

పురపాలక సంఘాల పరిధిలో పన్ను పరిధిలోకి రాకుండా ఉన్న కట్టడాలను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సరాసరిన 20 శాతానికిపైగా ఆస్తి పన్ను ఎగవేతదారులుంటారని అంచనా వేసి లక్ష్యం విధించింది. పన్ను పరిధిలో రానివి, కొత్తగా అదనపు నిర్మాణాలు చేపట్టినవి.. భవనాల విస్తరణ తదితరాలను గుర్తించి పన్నుల పరిధిలోకి తేవాలని ఆదేశించింది. అనుకున్న లక్ష్యాలను సిబ్బంది సాధించలేదు.

## క్రికెట్‌లో మేఘన కీర్తి

ఆదోని పట్టణానికి చెందిన వై.మేఘనారెడ్డి క్రికెట్‌లో రాణిస్తోంది. మీడియం పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తోంది. అండర్-15 విభాగంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ చాటి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికవడం విశేషం. ఆదోనికి చెందిన వై.మేఘనారెడ్డి తొమ్మిదో తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రికెట్‌పై మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శిక్షణ తీసుకుంటోంది. కోచ్ బాలాజీరావు పర్యవేక్షణలో బౌలింగ్‌లో అవసరమైన మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతోంది. ఇటీవల శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపి సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైంది. ఈనెల 19వ తేదీ వరకు నెల్లూరులో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటోంది. రాష్ట్ర జట్టుకు ఎంపికవడమే తన లక్ష్యమని మేఘనారెడ్డి పేర్కొంటోంది. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

## దాతల ఔదార్యం.. విద్యార్థులకు బస్సు సౌకర్యం

ఉయ్యాలవాడ మండల పరిధిలోని బోడెమ్మనూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఒకబస్సు నిలిచింది. విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నారు. అల్లూరుపల్లె, కాకరవాడ, పుచ్చకాయలపల్లె, పాంపల్లె, కల్వటాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వస్తుంటారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడేవారు. దీనిని గుర్తించిన కర్నూలుకు చెందిన డా.బావిరెడ్డి సుబ్బారెడ్డి తన సొంత నిధులతో 2019లో బస్సును సమకూర్చారు. పాఠశాలతోపాటు గ్రామంలో వసతులు కల్పించే ఉద్దేశంతో దాతలంతా కలిసి 2002లో బోడెమ్మనూరు ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేశారు. విదేశాల్లో స్థిరపడిన వైద్యులు రమేష్ రెడ్డి, ఫణివర్ధన్‌రెడ్డి, వి.సుబ్బారెడ్డి తదితరులు చేయూతనిస్తున్నారు. వాహన నిర్వహణకు రూ.33 వేల ప్రకారం ఏడాదికి రూ.4.50 లక్షలు ఖర్చవుతుందని సొసైటీ అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, కార్యదర్శి కె.కృష్ణారెడ్డి తెలిపారు. ఫలితంగా గతంలో 60 మంది విద్యార్థులుండగా.. ప్రస్తుతం 153 మంది చదువుతున్నారు. – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

# పొగమంచు

**• తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పే**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చలి తీవ్రత పెరిగిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పొగమంచుతో రహదారులపై వాహనాలు కనపడక పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది. – న్యూస్‌టుడే, నంద్యాల రైతు నగరం, కర్నూలు వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన రహదారుల్లో ప్రతిరోజూ 1.50 లక్షలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావడం.. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో రహదారులను పొగమంచు కప్పేస్తోంది. పొగమంచుతో వాహనాలు కనపడక పలువురు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

1. ప్రస్తుతం పొగమంచు కమ్మేస్తున్న నేపథ్యంలో తెల్లవారుజామున, రాత్రివేళల్లో కాస్త ఆగిచూసి ప్రయాణించడం శ్రేయస్కరం.
2. మలుపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓవర్‌టేక్ చేయకూడదు. ఒంపులు, మూల మలుపుల వద్ద ఇండికేటర్లు తప్పనిసరిగా వేయాలి. ప్రతి వాహనంలో ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలి.
3. రాత్రివేళల్లో ప్రయాణించే సమయంలో లోబీమ్ లైట్లు వాడాలి. హైబీమ్ లైట్ల నుంచి వచ్చే కాంతి విచ్ఛిన్నమై ఎదురుగా వచ్చే వాహనాలను చూడటం ఇబ్బందిగా ఉంటుంది. ఫాగ్‌లైట్లు వాడడం ద్వారా ఎదురుగా వచ్చే వాహనాలకు మన వాహనం కనిపిస్తుంది.
4. చలికాలంలో రోడ్డు తడిగా మారి టైర్లు జారుతాయి. బ్రేకులు నెమ్మదిగా.. జాగ్రత్తగా వేయాలి. సడన్ బ్రేక్ వేస్తే వాహనం బోల్తా కొట్టే ప్రమాదముంది.
5. రోడ్డుపై దట్టమైన పొగమంచు కమ్మేసి ఉంటే సురక్షితమైన ప్రదేశంలో నిలపడం మంచిది. ఇండికేటర్లు తప్పనిసరిగా వాడాలి.
6. వాహనాలను అతివేగంతో ఓవర్‌టేక్ చేయకూడదు. కొన్నిసార్లు ఎదుటి వాహనాల వేగాన్ని అంచనా వేయడం కష్టమవుతుంది.
7. వాహనానికి.. వాహనానికి మధ్య తప్పనిసరిగా దూరం పాటించాలి.

**నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు**

| తేదీ | కనిష్ఠం |
|---|---|
| 8 | 17.8 |
| 9 | 16.9 |
| 10 | 16.1 |
| 11 | 15.2 |
| 12 | 14.9 |

చిప్పగిరి వద్ద పొగమంచులో వెళ్తున్న వాహనాలు

## పనులు దారిన పడుతున్నాయ్

నందికొట్కూరు నుంచి జిల్లా కేంద్రమైన నంద్యాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నందికొట్కూరు నుంచి మిడుతూరు మండలం సుంకేసుల బాట వరకు గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రతి

దెబ్బతిన్న ప్రాంతాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తూ..

రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. గత వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులకు కూడా నిధులు కేటాయించలేదు. చివరికి గతుకుల రోడ్డుపై జనం రాకపోకలు సాగించేవారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు

**రూ.10 లక్షల కేటాయింపు**

రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం అందుకనుగుణంగా నిధులు కేటాయిస్తోంది. అధికారులు పంపిన ప్రతిపాదనలు పరిశీలించి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో నందికొట్కూరు-నంద్యాల రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. సుమారు రూ.10 లక్షలు విడుదల చేయడంతో అధికారుల పర్యవేక్షణలో ఆదివారం పనులు ప్రారంభించారు. ముందుగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పొక్లెయిన్ పెట్టి బీటీని తొలగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కూలీలను ఏర్పాటు చేసి గుంతల్లోని వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం కంకర మిక్సింగ్ వేసి పనులు చేయనున్నారు. దీంతో జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సౌరభం

**మొదటి విడతలో 45,666 మందికి..**

**• ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రభుత్వం చేయూత**

ఎస్సీ, ఎస్టీ విద్యుత్తు వినియోగదారులకు ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్తు అందిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1,63,283 మంది ఎస్సీ, 16,288 మంది ఎస్టీ వినియోగదారులు రాయితీ పొందుతున్నారు. ప్రస్తుతం వీరి ఇళ్లపై 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర ఫలకాలను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్లలో అర్హులైన ఎస్సీ, ఎస్టీలను గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహించారు. ప్రస్తుతం మొదటి విడతలో ఫలకాలు ఏర్పాటు చేసేందుకు గుత్తేదారులకు అనుమతులు సైతం జారీ చేసింది. – న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

కర్నూలు జిల్లాలో మూడు డివిజన్ల పరిధిలో 23,076, నంద్యాల జిల్లాలో మూడు డివిజన్ల పరిధిలో 22,590 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల ఇళ్లపై మొదటి విడతలో భాగంగా సౌర ఫలకాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన ఫలకం నుంచి 120 యూనిట్ల వరకు విద్యుదుత్పత్తి జరుగుతుంది. రెండు కిలోవాట్లకు 240 యూనిట్ల వరకు ఉత్పత్తవుతుంది.

| డివిజన్ | లబ్ధిదారులు |
|---|---|
| కర్నూలు | 8,928 |
| ఆదోని | 7,399 |
| ఎమ్మిగనూరు | 6,749 |
| నంద్యాల | 2,123 |
| ఆత్మకూరు | 10,912 |
| డోన్ | 9,555 |

**ఒప్పంద పత్రం రాయించుకుని..**

ఎస్సీ, ఎస్టీలు తమ ఇళ్లపై స్థలం చూపిస్తే రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా వినియోగదారుడి నుంచి ఒప్పంద పత్రం రాయించుకుని పనులు మొదలు పెడతారు. ఈ మొత్తానికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. లబ్ధిదారుడు ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. "ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇతర లబ్ధిదారులు సైతం సూర్యఘర్ పథకం కింద రాయితీతో అందించే ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలి" అని కర్నూలు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు.

## చనిపోతూ నలుగురికి పునర్జన్మ

ప్రశాంత్ (పాత చిత్రం)

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణానికి చెందిన ప్రశాంత్ చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేశారు.. పాములపాడు మండల పరిధిలోని భానుముక్కల మలుపు వద్ద శుక్రవారం రాత్రి అతను రహదారి ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తలలో రక్తస్రావం కావడం.. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. దీంతో ప్రశాంత్ తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, కృష్ణవేణి కన్నీటి పర్యంతమయ్యారు. చేతికొచ్చిన కొడుకు మృత్యువాత పడటంతో వారిని సముదాయించడం ఎవరి తరం కాలేదు. ఈ నేపథ్యంలో తమ కుమారుడి అవయవాలు దానం చేయాలని నిర్ణయించుకున్నారు. జీవన్‌దాన్ సంస్థకు తెలియజేయడంతో వారు వైద్యుల సాయంతో కళ్లు, మూత్రపిండాలు, కాలేయం, గుండె సేకరించారు. అవయవ దానంతో నలుగురికి ప్రాణదాతగా నిలిచిన ప్రశాంత్ అంత్యక్రియలకు జనం పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

# ముప్పు.. ఏదీ కనువిప్పు

**• వంతెనలకు రక్షణ గోడలు కరవు**

బనగానపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రధాన రహదారులపై నిర్మించిన కొన్ని వంతెనలకు రక్షణ గోడలు కరవయ్యాయి. ఫలితంగా అప్పుడప్పుడూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. నియోజకవర్గ పరిధిలో 200 కి.మీ.కు పైగా ఆర్అండ్‌బీ రహదారులున్నాయి. నేషనల్ హైవేకు సంబంధించి 100 కి.మీ.లు, పంచాయతీ రహదారులు 300 కి.మీ.పైగా ఉన్నాయి. ప్రధాన రహదారులపై ఉన్న వంతెనలకు సంబంధించి చాలా ప్రాంతాల్లో రక్షణ గోడలు కరవయ్యాయి. – న్యూస్‌టుడే, బనగానపల్లి

అప్పలాపురం సమీపంలో కానరాని రక్షణ గోడ

**ప్రయాణికులకేదీ భద్రత**

బనగానపల్లి-నంద్యాల వెళ్లే మార్గంలో అప్పలాపురం సమీపంలో పురాతన వంతెనకు రక్షణ గోడలు నిర్మించలేదు. అప్పుడప్పుడూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వీధి దీపాలు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఏఏ ప్రాంతంలో ఎలా..**

- పండ్లాపురం సమీపంలో నిర్మించిన పురాతన వంతెనకు సంబంధించిన రక్షణ గోడలు కూలిపోయాయి.
- అవుకు మండలం పాలేరు వాగు సమీపంలో వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి.
- జాతీయ రహదారి 544డి మార్గంలో టంగుటూరు, గోస్పాడు మండలం తెల్లపురి వద్ద వంతెనలపై రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.
- కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ వెళ్లే మార్గంలో భీమునిపాడు వద్ద, సంజామల మండలం పేరుసోముల-తిమ్మనాయునిపేట వెళ్లే మార్గంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.
- బనగానపల్లి నుంచి పాణ్యం మీదుగా నంద్యాల వెళ్లే ప్రధాన రహదారిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు కొత్త వంతెనలు నిర్మించింది.
- "నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. పూర్తిగా ఇబ్బందిగా ఉన్నచోట తాత్కాలిక రక్షణ గోడలు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతానికి ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేస్తాం" అని నేషనల్ హైవే డీఈ రవిచంద్ర తెలిపారు.

# శవాగారం.. దుర్గంధభరితం

**• ఫ్రీజర్ పనిచేయక ఇబ్బందులు**

నంద్యాల సర్వజన ఆసుపత్రికి వందలాది మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రతిరోజూ 1,500 వరకు ఓపీ ఉంటుంది. ప్రమాదాలబారిన పడినవారు. తీవ్ర అస్వస్థతకు గురైనవారు వైద్యాలయంలో చేరుతుంటారు. చికిత్స పొందుతూ కోలుకోలేక పలువురు మృతి చెందుతుంటారు. గుర్తుతెలియని మృతదేహాలను ఆస్పత్రికి తీసుకొస్తుంటారు. వీటిని శవాగారంలో భద్రపరచాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం

మరమ్మతులకు గురైన ఫ్రీజర్

**పక్కన పెట్టేసి..**

శవాగారంలో రెండు మృతదేహాలను ఉంచేలా ఒక ఫ్రీజరుతోపాటు మరో ఫ్రీజర్ అందుబాటులో ఉండేది. రెండు మృతదేహాలు ఉంచే పరికరం మరమ్మతులకు గురవడంతో దానిని పక్కన పెట్టేశారు. రిపేరు చేయాల్సి ఉన్నా అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవల ఒకేరోజు మూడు మృతదేహాలు వచ్చాయి. ఒకదానిని మాత్రమే భద్రపరిచారు. ఫ్రీజర్లు లేక సమస్యలు ఎదురవుతున్నాయి. దుర్వాసనతో ఆస్పత్రి సిబ్బందితోపాటు బాధితుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు.

**అందుబాటులో ఉంచితే..**

నంద్యాల ఆస్పత్రికి అనుబంధంగా వైద్య కళాశాల ఏర్పాటైంది. వైద్య విద్యార్థులకు ప్రయోగ పాఠాలు నేర్పేందుకుగాను మృతదేహాలు భద్రపరిచేలా ఎక్కువ ఫ్రీజర్లు అందుబాటులో ఉండాల్సి ఉంది. ప్రస్తుతం వైద్య కళాశాలలో నాలుగు మృతదేహాలు ఉంచేలా ఫ్రీజర్ ఉంది. ఈ నేపథ్యంలో దీనిని శవాగారంలో ఉంచేలా చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. బాధిత కుటుంబాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

(c) eenadu

## అదుపు తప్పితే.. అనంత లోకాలకే!

కోవెలకుంట్ల, బనగానపల్లి మండలాల్లో వ్యవసాయ మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయిస్తారు. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామ సమీపంలో ఆదివారం ఓ ట్రాక్టరు ఇంజిన్‌పై అధిక సంఖ్యలో మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రమాదం తప్పదు. ఇటువంటి ప్రయాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం

## స్వచ్ఛస్ఫూర్తికి తుప్పు

మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ యాళ్లూరులో చెత్త వ్యర్థాలు తరలించే స్వచ్ఛ ఆంధ్ర రిక్షాలు మూలనపడ్డాయి. గ్రామంలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి వ్యర్థాలు సేకరించాల్సిన రిక్షాలు అధికారుల నిర్లక్ష్యంతో పంచాయతీ కార్యాలయం వెనుక తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామంలో పారిశుద్ధ్య సేవలు సక్రమంగా కొనసాగడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, యాళ్లూరు(గోస్పాడు)

## ధాన్యం ఆరబోత కష్టమైంది

వరి సాగు చేసిన రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం దొర్నిపాడు మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ధాన్యం ఆరబెట్టేందుకు స్థలాలు లేకపోవడంతో మండలం గుండా ప్రవహించే కేసీ ప్రధాన కాల్వ గట్లపై ఆరబెడుతున్నారు. దొర్నిపాడు, అమ్మిరెడ్డినగర్, అర్జునాపురం, రామచంద్రాపురం, వెంకటేశ్వరనగర్ గ్రామాల పరిధిలో రైతులు ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, దొర్నిపాడు

## నాటి బందిఖానా.. జ్ఞాపకాల ఖజానా

వందేళ్ల క్రితం నిర్మించిన భవనం నేటికీ చెక్కుచెదరకుండా ఉపయోగపడుతోంది. బనగానపల్లి పట్టణంలోని పాత పోలీసు స్టేషన్(ప్రస్తుత గ్రామీణ సీఐ కార్యాలయం) భవనానికి 120 ఏళ్ల చరిత్ర ఉంది. నవాబుల కాలంలో పది సెంట్ల విస్తీర్ణంలో 1905లో ఐదు గదులుగా దీన్ని నిర్మించారు. అప్పట్లో నేరస్థుల విచారణ నిమిత్తం బందిఖానాగా ఉపయోగించుకునేవారు. 2006లో స్వల్ప మరమ్మతులు చేశారు. ఆనాటి నిర్మాణ నైపుణ్యం, పాటించిన నాణ్యత ప్రమాణాలతో భవనం నేటికీ చెక్కుచెదరకుండా నిలిచిఉంది. - న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

## అవుకు జలాశయం ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

అవుకు, న్యూస్‌టుడే: అవుకు జలాశయం పరిధిలో నెలకొన్న సమస్యలను గుర్తించి శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జలవనరుల శాఖ అధికారులతో కలిసి అవుకు జలాశయాన్ని పరిశీలించారు. తిమ్మరాజు చెరువు కట్ట నీటి లీకేజీ, కుంగిన రాతిపరుపు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే జలాశయంలో సమస్యలు తలెత్తాయని విమర్శించారు. లీకేజీ సమస్యను ఈ నెల చివరి నాటికి పరిష్కరించాలని వెల్లడించారు. మరమ్మతులకు ఇప్పటికే రూ.కోట్లు కేటాయించామని, అవసరాన్ని బట్టి అదనపు నిధులు సమకూర్చనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో నీటిని నింపే ఏర్పాట్లు చేస్తామన్నారు. జలవనరుల శాఖ ఎస్ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ శుభకుమార్, డీఈ సాయికిరణ్, తెదేపా నాయకులు బీసీ ప్రభాకర్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, రమణ, నాగిరెడ్డి, మద్దిలేటిగౌడు, తిక్కన్న పాల్గొన్నారు.

మరమ్మతు వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

## యువ క్రీడాకారులు.. ఖోఖోలో ప్రతిభావంతులు

☛ ఈ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆళ్లగడ్డలో సన్నద్ధం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా.. ఆటలపై ఇష్టంతో రాణిస్తున్నారు ఆత్మకూరుకు చెందిన అబ్దుల్ జుబేర్, శ్రీనివాసులు. శ్రీరాజరాజేశ్వరి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ.. ఖోఖో పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. ఈనెల 9వ తేదీన పెద్దిపాడులో జరిగిన అండర్-18 విభాగంలో వీరిద్దరూ ఎంపికై 20, 21, 22వ తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి అసోసియేషన్ పోటీల్లో పాల్గొనడానికి ఆళ్లగడ్డ క్యాంపులో సిద్ధమవుతున్నారు.

### ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా..

సంజాబాషా, ఆసియా కుమారుడు అబ్దుల్ జుబేర్. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవటంతో రకరకాల పనులు చేస్తూ చదువుతున్నాడు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి నుంచే ఖోఖో క్రీడను ఎంచుకున్నాడు.

- 2022లో స్కూల్ గేమ్స్ విభాగంలో ఆత్మకూరు క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో జిల్లాస్థాయి జట్టుకు ఎంపికయ్యాడు.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు.
- 2023లో అండర్-14 విభాగంలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2024లో చిత్తూరులో జరిగిన జూనియర్ విభాగం రాష్ట్రస్థాయి అసోసియేషన్ క్రీడలో మూడో స్థానం.
- 2023లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో మూడవ స్థానం.
- 2025లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో ఉత్తమ ప్రతిభ.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ ఖోఖో పోటీల్లో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపికయ్యాడు.

### టీ హోటల్లో పనిచేస్తూ..

లింగస్వామి, హైమావతి కుమారుడు శ్రీనివాసులు. లింగస్వామి రజక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివే సమయంలో ఖోఖోను ఎంచుకున్నాడు. ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేకపోవటంతో ఆత్మకూరు లోనే టీ దుకాణంలో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో క్రీడలకు ఉపయోగిస్తున్నాడు.

- 2022లో ఆత్మకూరులో స్కూల్ గేమ్స్ విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2023లో అండర్-14 విభాగంలో స్కూల్ గేమ్స్ క్రీడల్లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానం.
- 2023లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో మూడవ స్థానం.
- 2024లో అండర్-17 ఎస్‌జీఎఫ్ విభాగంలో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సెమీఫైనల్.
- 2024లో మహారాష్ట్రలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ప్రతిభ.
- 2023లో సబ్ జూనియర్స్ విభాగంలో మహారాష్ట్రలో జరిగిన జాతీయ జట్టులో ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపిక.
- 2024లో అండర్-14 విభాగంలో మహారాష్ట్రలో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయిలో ప్రతిభ.
- 2025లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీ సీఎం కప్‌లో ఉత్తమ ప్రతిభ.

## వడ్డెర సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడం, మైనింగ్‌లో రాయితీలు పెంచడం వంటి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. స్థానిక హోటల్‌లోని సమావేశ భవనంలో ఆదివారం వడ్డెరరాజుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పాల్గొని మాట్లాడారు. వడ్డెరలు రాజకీయంగా ఎదగాలన్నారు. అందరూ ఐకమత్యంగా ఉంటూ వడ్డెర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రధర్, నియోజకవర్గం అధ్యక్షుడు పల్లె వెంకటసుబ్బయ్య, కార్యదర్శి వేణు, సభ్యులు జనార్దన్, సుబ్బరాయుడు, వడ్డె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను గజమాలతో సన్మానిస్తున్న సంఘం సభ్యులు

## హైందవ ధర్మాన్ని పరిరక్షిద్దాం

మాట్లాడుతున్న ఆచార్య అభినవ శంకరానంద స్వామీజీ

వేతంచెర్ల, న్యూస్‌టుడే: దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంతోపాటు హైందవ ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఆచార్య అభినవ శంకరానంద స్వామిజీ, వక్త భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో రైల్వేస్టేషన్ ఉన్నత పాఠశాల మైదానంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు గౌరి ఉస్సేన్‌రెడ్డి, మారుతీశర్మ అధ్యక్షతన హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తూ.. హిందువులంతా సంఘటితం కావాలని, ప్రతి ధార్మిక కార్యక్రమానికి పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. పురాతన దేవాలయాల పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, జిల్లా కార్యదర్శి నాగమోహన్, బుగ్గన ప్రసన్నలక్ష్మి, వీరారెడ్డి, మధుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాగంటిలో భక్తుల సందడి

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ వీణా విద్వాంసులు డా. వివేకానందసూర్య సంగీత కార్యక్రమం భక్తులను అలరించింది.

పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## ప్రభుత్వ పాఠశాలల్లో కెరీర్ ఫెస్ట్ నిర్వహించాలి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 15నుంచి 18వ తేదీ వరకు కెరీర్ ఫెస్ట్ నిర్వహించాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు సమన్వయ కర్త నిత్యానంద రాజులు ఆదేశించారు. జిల్లా జీసీడీవో నాగసువర్చల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కార్యాలయంలో కెరీర్ ఫెస్ట్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ.. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో స్వీయ అవగాహన నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్తు, ప్రణాళిక, సామర్థ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తులు, బలాలను గుర్తించి సరైన విద్యావృత్తి మార్గాన్ని ఎంపిక చేసుకునేలా పాఠశాల స్థాయిలో రోజూవారి కార్యక్రమాలు రూపొందించినట్లు వివరించారు. ఆరోగ్య కౌన్సిలర్లు, వృత్తి శిక్షణాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిత్యానంద రాజులు

## కల్యాణ మండపం అభివృద్ధికి కృషి

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలంలో శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ కల్యాణ మండపం అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంఘ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దిగువ అహోబిలంలో నూతనంగా నిర్మిస్తున్న కాపు, బలిజ కల్యాణ మండపం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సత్రం అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నాగిరెడ్డి, సంజీవరాయుడు, తిరుపాల్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న కమిటీ సభ్యులు

## బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని విశ్రాంత డీజీపీ, ఏబీఎస్పీ జాతీయ సమన్వయకర్త డా. జి. పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఓబీసీ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రిజర్వేషన్‌ల ప్రకారం బీసీలకు సీట్లు కేటాయిస్తే రాజ్యాధికారం సాధించుకుంటామన్నారు. బీసీ స్థానాల్లో అగ్రకులాల వారు పోటీ చేసి పదవులు చేజిక్కించుకుంటున్నారని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో ఒకే కుటుంబంలో ఒకరి తర్వాత ఒకరు ఎమ్మెల్యే అవుతున్నారని, ఇతర ప్రాంతాల్లో వారిపై కేసులు నమోదైనా స్థానికంగా గెలుస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీలు, నగదు బదిలీలు బీసీలకు అవసరం లేదని, అధికారం ఇవ్వాలని కోరారు. మాజీ ఎంపీ డా. సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ కుల గణన తప్పనిసరిగా నిర్వహించి, ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఓబీసీ హక్కుల సాధన కోసం గ్రామస్థాయిలో ఉద్యమాలు చేయాలన్నారు. సభలో వామన్‌మేశ్రం, చౌదరి వికాస్‌పటేల్, విశ్రాంత ఆర్డీవో నాగమ్మ, విశ్రాంత డీఈవో శంకర్‌గౌడ్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈసందర్భంగా ఓబీసీల హక్కులపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

## ఆదోని జిల్లా సాధనకు కలిసికట్టుగా పోరాడుదాం

❒ 29వ రోజుకు చేరిన రిలే నిరాహారదీక్షలు ❒ ఐకాస ఆధ్వర్యంలో రాస్తారోకో

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనే లక్ష్యంగా ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడుదామని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడు, ఆదినారాయణరెడ్డి, కోదండ, దస్తగిరినాయుడు, లలితమ్మ, నూర్‌అహ్మద్ తదితరులు పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని కోట్ల కూడలి వద్ద ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన రిలే నిరహారదీక్షలు ఆదివారం 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐకాసా ఆధ్వర్యంలో నాయకులు, గజ్జహళ్లి గ్రామస్థులు పెద్దఎత్తున కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన ఆదోని ప్రాంతాన్ని ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేశారు. ఆదోని జిల్లాగా ప్రకటించేంతవరకు ఈ ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షురాలు ఉషారాణి, పీవోడబ్ల్యూ నాయకురాలు సుజ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రిలేదీక్షల్లో ఏపీ ఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు, పీవోడబ్ల్యూ మహిళా సంఘం నాయకులు, మూడో తరగతి విద్యార్థిని ధనశ్రీ

కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేస్తున్న ఐకాస నాయకులు, గజ్జహళ్లి గ్రామస్థులు

◆ ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో ఆదివారం ఏపీఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు, పీవోడబ్ల్యూ స్త్రీవిముక్తి మహిళా సంఘం మహిళా నాయకులు దీక్షలో కూర్చొని తమ మద్దతు తెలిపారు. ఈ దీక్షలో మహిళా ఉద్యోగులు మంజుల, లక్ష్మి, ధనలక్ష్మి, అరుణజ్యోతి, నరసమ్మ, సుజాత, ఇ.లక్ష్మి, ఎం. సరళ, కల్యాణి, గంగమ్మ, పీవోడబ్ల్యూ స్త్రీ విముక్తి నాయకులు కళావతి, ధనశ్రీ, నీలమ్మ, శాంతమ్మ, హనుమంతమ్మ తదితరులు కూర్చొని మద్దతు తెలిపారు.

## రూ.50 లక్షల వ్యయంతో షెడ్ల నిర్మాణం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రణమండల ఆంజనేయస్వామి క్షేత్రంలో రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు ఆదోని పట్టణానికి వ్యాపారి మణికంఠ శ్రీకారం చుట్టారు. రణమండల ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంలో షెడ్ల నిర్మాణం, 21 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం ఆలయంలో భూమి పూజ చేశారు. తన తండ్రి హెబ్బటం నరసింహులు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు దాత మణికంఠ తెలిపారు.

షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దాత

## ఇంధన పొదుపు అందరి బాధ్యత

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యతని కర్నూలు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని కర్నూలు డివిజన్ పవర్‌హౌస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలు, యువత, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, డీఈఈ కమర్షియల్ విజయభాస్కర్, డీఈఈలు సుబ్బన్న, నాగప్రసాద్, చంద్రమోహన్, ఏఈలు పాల్గొన్నారు.

వారోత్సవాల్లో పాల్గొన్న ఎస్ఈ ప్రదీప్‌కుమార్

## రబీ పంట బీమా.. రైతుకు ధీమా

● నష్టాలు ఎదుర్కొనేందుకు అవకాశం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిని నష్టాల బారిన పడే రైతులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రబీ 2025-26 సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), పునర్నిర్మిత

వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీఎస్ఐ) పథకాలు అమలు చేస్తున్నాయి. ఆయా పథకాల కింద పండించిన పంటలకు బీమా చేయడం ద్వారా తక్కువ ప్రీమియంతో రైతులు ఆర్థిక నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. పంటల బీమా కోసం ప్రభుత్వం నంద్యాల జిల్లాకు అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీ, కర్నూలు జిల్లాకు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది. వాతావరణ ఆధారిత పంటల బీమా కింద కర్నూలు జిల్లాలో టమాటా, నంద్యాల జిల్లాలో మామిడి పంటలను నోటిఫైడ్ చేశారు. టమాట పంటకు బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వ తేదీ చివరి గడువు కాగా.. మామిడి పంటకు ఈనెలాఖరు వరకు గడువు ఉంది.

◆ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి పంటకు ఈనెలాఖరు వరకు, మిగిలిన అన్ని నోటిఫైడ్ పంటలకు ఈనెల 15వ తేదీలోగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

### నంద్యాల జిల్లాలో వివరాలు

| పంట పేరు | యూనిట్ | బీమా మొత్తం | రైతు వాటా (శాతం) | ప్రీమియం (రూ.లలో) |
|---|---|---|---|---|
| పప్పుసెనగ | గ్రామం | 28,000 | 0.30 | 84 |
| వరి | మండలం | 42,000 | 0.30 | 126 |
| జొన్న | మండలం | 19,800 | 0.30 | 59 |
| మినుము | మండలం | 19,000 | 0.25 | 48 |
| వేరుసెనగ | జిల్లా | 32,000 | 0.20 | 64 |
| ఉల్లి | జిల్లా | 45,000 | 0.20 | 90 |

### ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందాలు

ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద కర్నూలు జిల్లాలో టాటా జనరల్లీ ఇన్సూరెన్సు కంపెనీతో ఒప్పందం చేసుకోగా.. నంద్యాల జిల్లాలో జనరల్లీ సెంట్రల్(ఫ్యార్మర్లీ ఫ్యూచర్ జనరల్లీ ఇన్సూరెన్సు) ఒప్పందం చేసుకున్నాయి. కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద పప్పుసెనగ, వరి, జొన్న, వేరుసెనగ, ఉల్లి, నంద్యాల జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద పప్పుసెనగ, వరి, జొన్న, మినుము, వేరుసెనగ, ఉల్లి పంటలను నోటిఫైడ్ చేశారు.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులు చెల్లించాల్సిన ప్రీమియం రైతు వాటాగా 1-5 శాతం వరకు పంట రకాన్ని బట్టి చెల్లిస్తే సరిపోతుంది. మిగతా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. పంటల బీమాలో కొన్ని గ్రామ, మరికొన్ని మండల, జిల్లా కేటగిరిల్లో ఉన్నాయి. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తమ పంటలకు బీమా చేయించడం మేలని అధికారులు సూచిస్తున్నారు.

## రూ.5 కోట్లతో రేషన్ డీలర్ ఐపీ!

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రేషన్ డీలర్ రూ.5కోట్లకు ఐపీ పెట్టినట్లు సమాచారం. పట్టణంలోనే 30నుంచి 40 మంది బాధితులు ఉన్నట్లు తెలిసింది. ఓ వ్యాపారి వద్ద రూ.20లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో ఆ వ్యాపారి ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా రూ.5కోట్ల నుంచి రూ.8కోట్ల వరకు అప్పులు ఉంటాయని బాధితులు ఆరోపిస్తున్నారు. తీసుకున్న మొత్తంతో ఆన్‌లైన్ వ్యాపారాలు, రియల్ ఎస్టేట్, చీటీలు నడిపినట్లు సమాచారం. 15 రోజుల నుంచి సదరు రేషన్ డీలర్ లేకపోవడంతో ఇంటి చుట్టూ తిరుగుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ అడగ్గా బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు.

## మహిళ మృతిపై కేసు నమోదు

తువ్వపల్లె(రుద్రవరం), న్యూస్‌టుడే: మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన వరాలు(44) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఏఎస్సై బాలన్న తెలిపారు. వరాలు శనివారం రాత్రి ఇంట్లో, భర్త వెంకటచంద్రుడు బయట పడుకున్నాడన్నారు. తెల్లవారుజామున భర్త లేచి ఇంట్లోకి వెళ్లి చూడగా వరాలు చీరతో ఉరి వేసుకుని మృతి చెందిందన్నారు. మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## అమడాలలో వృద్ధుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అమడాల గ్రామంలో ఓ వృద్ధుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దిలేటి(85) కుటుంబ, అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది విషద్రావణం తాగారు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్ / ముత్తూట్ / మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 7659988728.

వెంటనే కావలెను. లేడీ రిసెప్షనిస్ట్/ సూపర్ వైజర్ (Qly: Graduate), హౌస్ కీపింగ్ బాయ్స్, రూమ్ బాయ్స్, వెయిటర్స్, సెక్యూరిటీ గార్డ్స (9 గంటలు డ్యూటీ) కావలెను. దూర ప్రాంతాల వారికి రూమ్ + భోజనం కల్పించబడును. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 83419 57788, 94943 33443.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్ (స్త్రీ B.Tech/ M.Com) & మార్కెటింగ్ మేనేజర్స్ & ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 91604 64972.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

## మంత్రి ఫరూక్‌ను కలిసిన ఆల్‌మేవా నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను ఆల్‌మేవా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కార్యాలయంలో ఆదివారం ఆల్‌మేవా నూతన కమిటీ కలిసి సన్మానించింది. మంత్రి మాట్లాడుతూ.. మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఛైర్మన్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్, రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్ బాషా, గౌరవాధ్యక్షుడు మహ్మద్ అబులైజ్, అంజాద్ బాషా, మహ్మద్ గౌస్, మహ్మద్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటుకు భూమిపూజ

పగిడ్యాల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మాపురంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో రూ.5 లక్షలు వెచ్చించి ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 28కి పైగా ప్లాంట్లు ఏర్పాటు చేసిన ఘనత నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికే దక్కిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సుజాత, తెదేపా నాయకులు సురేష్‌రెడ్డి, జయరాముడు, సత్యంరెడ్డి, జంగాల శేఖర్, జంగాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మాపురంలో భూమి పూజ చేస్తున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

## పంటలకు మద్దతు ధర కల్పించాలి

పగిడ్యాల, న్యూస్‌టుడే: లక్ష్మాపురంలో ఆర్వో ప్లాంట్ శంకుస్థాపనకు హాజరైన బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అనంతరం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మొక్కజొన్న, వరి, ఉల్లి, పత్తి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు, వ్యాపారులు కుమ్మక్కై అన్నదాతల కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. పంటలకు మద్దతు ధరల కల్పనపై ఎంపీ శబరి ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ముచ్చుమర్రి నాగరాజు, పెద్ద మద్దిలేటిగౌడు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక సిండికేట్

★ అనధికార డిపోలు.. అధికంగా వసూళ్లు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల స్టాక్ యార్డుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించినప్పుడు తొలుత ఒక గుత్తేదారుడు అధికారికంగా తీసుకున్నారు. తర్వాత ఆయన ఒక నాయకుడి 'నీడ'లో కొంతకాలం పనిచేశారు. కానీ, 'లెక్క'ల్లో తేడా రావడంతో నిర్వహణ గాడి తప్పింది. 'ఒప్పందం'తో మరో నాయకునికి ఈ డిపోను అప్పగించారు. ఇక్కడి నుంచి అసలు కథ ప్రారంభమైంది. గొలుసు దుకాణాల మాదిరిగా పలుచోట్ల అనధికార డిపోలు ఏర్పాటు చేసి ఇసుక ధరను పెంచేశారు.

పద్మావతినగర్‌లో ఇసుక విక్రయ కేంద్రం

### ఎక్కడపడితే అక్కడ విక్రయాలు

టన్ను ఇసుక ధర రూ.850 లుగా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, జిల్లా కేంద్రం నంద్యాలలో రూ.950 పైగా విక్రయిస్తున్నారు. నిర్మాణాల్లో ఉపయోగించే ప్లాస్టింగ్ ఇసుక(నున్నది) రూ.1000 వరకు ధర ఉంది. ప్రభుత్వం ఈ రకం ఇసుకకు రూ.920 ధరను మాత్రమే నిర్ణయించింది. ప్రభుత్వ ధర కన్నా టన్ను మీద రూ.100 ఎక్కువగా విక్రయాలు జరుపుతున్నారు. చిన్న లారీలో 35 టన్నులు, పెద్ద లారీలో 53 టన్నుల ఇసుక వస్తుంది. ఈ ప్రకారం పెద్ద లారీ ఇసుక కొనుగోలు చేస్తే రూ.5,300 వరకు అదనపు ఆదాయం తీసుకుంటున్నారు. ఈ ఇసుక కూడా నిర్దేశిత ఇసుక స్టాక్ పాయింట్లలో కాకుండా ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియోజకవర్గ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ వద్దనే కొనుగోలు చేయాలి. కానీ, నంద్యాలలో కొంతమంది నాయకుల జోక్యంతో స్టాక్ పాయింట్లలో కాకుండా అనధికారికంగా వివిధ ప్రాంతాలు, కాలనీల్లో డిపోలు ఏర్పాటు చేశారు. స్టాక్ పాయింట్ డిపో హోల్డర్ అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యక్తుల ద్వారా ఇసుక విక్రయాలు సాగుతున్నాయి.

### బిల్లులు లేవు

నంద్యాల ఇసుక స్టాక్ పాయింట్లలో చూపించేందుకు నామమాత్రపు నిల్వలు ఉంటాయి. ఇసుక రీచ్‌ల నుంచి ఇక్కడికి వచ్చే వాహనాలు అరకొర మాత్రమే. కొనుగోళ్లు ఇక్కడ జరగడం లేదు. కంప్యూటర్ బిల్లింగ్ అనేదే ఇక్కడ లేదు. నంద్యాలలో స్టాక్ పాయింట్ నుంచి కాకుండా డిపోల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పెద్దఎత్తున ఇసుక అవసరమున్న వారు దళారి నుంచి కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో ఎక్కడికక్కడే అనధికార ఇసుక డిపోలు వెలిశాయి. నూనెపల్లె, రైల్వేస్టేషన్, పద్మావతినగర్, వైఎస్సార్.నగర్, నందమూరినగర్, కాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. తక్కువ పరిమాణంలో ఇసుక కావాల్సిన వారు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేసి తీసుకుపోతుండగా.. ఎక్కువ అవసరమైన వారు నేరుగా దళారినే ఆశ్రయిస్తున్నారు. ఈ కొనుగోళ్లకు బిల్లులు ఇవ్వడం లేదు. ఇక్కడి తూకాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ట్రాక్టరులో 4 టన్నుల ఇసుక పడుతుండగా.. వినియోగదారునికి చేరే లోపు తక్కువ ఉంటుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఉచిత వైద్య శిబిరం

మిడుతూరు, న్యూస్‌టుడే: జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి- సిస్టోపిక్ ల్యాబ్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా మిడుతూరులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన రోగులకు బీపీ, షుగర్, న్యూరోపతి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాషా తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరునెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: సాయిబాబా నగర్ బీసీ హాస్టల్ వద్ద కాల్వలు శుభ్రం చేయడం లేదు. వ్యర్థాలతో కాల్వ నిండిపోయింది. **- లక్ష్మి, స్థానికురాలు**

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో వీధికుక్కల బెడద అధికమైంది. బయటికెళ్లాలంటే భయంగా ఉంది. **- గోపాల్**

✔: సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కలు పట్టించి సమస్య పరిష్కరిస్తాం. **- లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని ఎస్ కొత్తూరు గ్రామంలో దోమల బెడద ఎక్కువై ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నాం. **- పరమేశ్**

✔: దోమల మందు పిచికారీ చేయిస్తాం. **- వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో, పాణ్యం**

ఆత్మకూరు పట్టణం: ?: రెడ్డిగారివీధి నుంచి పెద్దబజారుకు వెళ్లే మార్గంలో కిరాణా దుకాణం వద్ద ఉన్న వీధి దీపం వెలగడం లేదు. **- సంపత్, స్థానికుడు**

✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- షాహీర్‌బాషా, పురపాలక ఏఈ**

?: సాయంత్రం, రాత్రి వేళల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్తూ సామాన్యులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. **- రాఘవేంద్ర, వాహనదారుడు**

✔: యువకులకు గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తాం. **- నారాయణరెడ్డి, ఎస్సై**

కొత్తపల్లి : ?: గోకవరంలోని బీసీ కాలనీలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- నాగేశ్వరరావు, స్థానికుడు**

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- మారెన్న, గ్రామ సర్పంచి**

?: ముసలిమడుగు బీసీ కాలనీలో ట్యాంక్ నుంచి నీరు వృథాగా పోతోంది. **- రాజు, స్థానికుడు**

?: ముసలిమడుగులోని కాల్వల్లో ఉన్న మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసన వస్తుంది. **- రాకేష్**

✔: నీరు వృథా కాకుండా, మురుగు కదిలేలా చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి**

## మొలకెత్తిన నిర్లక్ష్యం

గడివేములలోని ఆదర్శ పాఠశాలలో రెండో అంతస్తులోని తరగతి గదుల గోడలపై చెట్లు మొలకెత్తాయి. అవి మొలిచి రెండేళ్లవుతున్నా తొలగించకపోవడంతో అవి పెరిగి పెద్ద వృక్షాలుగా మారుతున్నాయి. దీంతో గోడలు బీటలు వారి తరగతి గదులు శిథిలమయ్యే అవకాశం ఉందని ఇంజినీరు సిబ్బంది తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, గడివేముల**

## కాల్వలు లేక రోడ్డుపై నిల్వ

మండలంలోని బిల్లలాపురం గ్రామంలో కొన్నేళ్ల నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కాల్వలు లేక రోడ్డుపై మురుగు నిలిచి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్డుకు ఒకవైపు చెరువు కట్ట నుంచి కిందకు దిగే రోడ్డు ఉండటం.. మరో వైపు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు ఎత్తుగా ఉండడంతో మురుగు రోడ్డుపైనే నిలిచి పాచి పట్టి వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. కొన్ని ఇళ్లలోని నీరు కూడా రహదారిపై చేరడంతో సమస్య ఏర్పడింది. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, బిల్లలాపురం(నంద్యాల గ్రామీణం)**

## మైదానం కాదు.. మురుగు కూపం

నంద్యాల పట్టణం కాంతినగర్ చివర్లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా మారాయి. ఈ ప్రాంతాల్లో కాల్వలు లేక స్థానికులు మురుగును ఖాళీ స్థలాల్లోకి వదలుతున్నారు. దీంతో నీరు నిలిచి దోమలు, విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం**

## పునాదులు దాటని దేవాలయ నిర్మాణం

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానంది దేవస్థానానికి దత్త దేవాలయంగా ఉన్న తమ్మడపల్లెలోని కాశీవిశ్వేశ్వర దేవాలయ నిర్మాణం పునాదుల్లోనే ఆగిపోయింది. ఈ ఆలయ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యంతో దేవాదాయశాఖ సీజీఎఫ్ ద్వారా సుమారు రూ.1.30 కోట్లకుపైగా మంజూరు చేసింది. మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ఏడాది భూమి పూజ చేశారు. అయితే నిర్మాణం పునాదులకే పరిమితమైంది. త్వరగా ఆలయ నిర్మాణ పనులు పూర్తిచేయాలని భక్తులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, మహానంది**

## పచ్చదనం హరించి.. అక్రమార్జన గడించి

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పచ్చటి చెట్లు నేలకొరుగుతున్నాయి. వ్యాపారమే ధ్యేయంగా కొందరు స్వార్థపరులు పొలాలు, రహదారుల వెంట ఉన్న తుమ్మ, వేప చెట్లను నరికేసి మొద్దులను విక్రయిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం పచ్చటి చెట్లను నరకకూడదన్న నిబంధన ఉంది. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఏళ్ల నాటి వృక్ష సంపద కనుమరుగవుతోంది. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఇప్పటికైనా పచ్చదనంపై గొడ్డలి వేటు పడకుండా నియంత్రించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, నందికొట్కూరు**

మాట్లాడుతున్న భూమా బ్రహ్మానందారెడ్డి

## ఇంద్రధనుస్సు పథకాలతో దివ్యాంగులకు లబ్ధి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు పింఛను పెంచడంతోపాటు ఇంద్రధనుస్సు పథకాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమల్లోకి తీసుకువచ్చారని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కోర్టు వద్ద ఆదివారం రాయలసీమ వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు బాలసుబ్బయ్య దివ్యాంగులకు నిత్యావసర సరకులు, ట్రై సైకిళ్లు, దుస్తులు పంపిణీ చేశారు. భూమా బ్రహ్మానందారెడ్డి మాట్లాడుతూ..దివ్యాంగులు ఎటువంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. 350 మంది దివ్యాంగులకు నిత్యావసర సరకులు, ట్రై సైకిళ్లు, దుస్తులు పంపిణీ చేశామని.. ఇందుకు దాతలు దస్తగిరి రెడ్డి, పబ్బతి వేణు, తులసిరెడ్డి, భాస్కర్, మనోహర్‌రెడ్డి తదితరులు సహకరించినట్లు బాలసుబ్బయ్య తెలిపారు. సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, ఖాజావలిఖాన్, చంద్రయ్య గౌడ్, సంజీవరాయుడు, గోపాల్, జగదీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఈ విధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్నారు. జీవో నంబరు 590, 107, 108లను వెంటనే రద్దు చేయాలన్నారు. పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండు చేస్తూ.. డిసెంబరు 18న నంద్యాల వైద్య కళాశాల వద్ద, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో బాబాఫకృద్దీన్, రమేష్ బాబు, సోమన్న, శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రంగనాయుడు

## సద్భావన భవనం నిర్మించాలి

సమావేశంలో పాల్గొన్న ఆల్‌మేవా నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాలలో ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం కింద సద్భావన భవనం నిర్మించాలని ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా, గౌరవాధ్యక్షుడు అబులైస్ డిమాండు చేశారు. పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం ఆల్‌మేవా వార్షిక సదస్సు నిర్వహించారు. ఆత్మకూరు, సిరివెళ్ల, చాగలమర్రి, ఆళ్లగడ్డ, డోన్ డివిజన్ల ఉద్యోగులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ..ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించి, వారి వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలి. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ ఎండీ ఫరూక్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ గౌస్, కోశాధికారిగా మహమ్మద్ ఖాసీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షోయబ్‌జమాలను ఎన్నుకున్నారు. సయ్యద్ హుస్సేన్, అంజద్ పాషా, సలీం, రోషన్‌వలి, అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పరిరక్షణ అవసరం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని రక్షించుకుంటే దేశాన్ని రక్షించినట్లేనని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ ప్రచారక్ శివప్రసాద్, మహానంది జగద్గురు పీఠాధిపతి నిత్యానందభారతి, సంస్కృత కవి విజయ్‌కుమార్ అన్నారు. పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాలలో ఆదివారం పాణ్యం ఉపమండల హిందూసమ్మేళనం నిర్వహించారు. సనాతన ధర్మం, హిందూధర్మ సూత్రాలు, ఆచారాలు తదితర విషయాలపై వివరించారు. మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే విజయాలు అందుతాయని, ప్రతి ఒక్కరిలో సేవా గుణం, భక్తి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయానికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్‌చౌదరి, నెరవాటి వరలక్ష్మి, గోపికృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల వీరంగం

● నంద్యాలలో ప్రజల భయాందోళన

పట్టణంలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి, పగలూ తేడా లేకుండా వెంటపడి కరుస్తున్నాయి. రోజూ పదుల సంఖ్యలో ప్రజలు కుక్క కాటుకు గురవుతున్నారు. అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులను గాయపరుస్తున్నాయి. నంద్యాల పట్టణంలో సుమారు 3,400 కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. వీటి నియంత్రణలో మాత్రం అధికారులు అలసత్వం వహిస్తున్నారు. అధికారులు వాటికి కు.ని. శస్త్ర చికిత్సలు చేసి వాటిని మళ్లీ అవే ప్రాంతంలో వదలడంతో సమస్య తగ్గడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా మూడేళ్లపాటు కు.ని.శస్త్ర చికిత్సలు చేస్తే కుక్కల నియంత్రణ సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

● నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్‌లో చిన్నారి ఆడుకుంటూ ఉండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆసుపత్రికి తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయిచారు.

● ఆత్మకూరు పట్టణం ఇస్లాంపేటలో చిన్నారి రోడ్డుపై ఆడుకుంటూ ఉండగా వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు తరమడంతో ప్రాణాలతో బయటపడింది. ప్రస్తుతం చికిత్స పొందుతోంది.

### వెంటపడి గాయపరుస్తూ..

పట్టణంలోని సాయిబాబానగర్, ఎన్జీవోస్ కాలనీ, విజయపురి కాలనీ, బైర్మల్ వీధి, వైఎస్సార్‌నగర్, ఎంఎస్‌నగర్, నందమూరినగర్, కాంతినగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. పిల్లలను రోడ్లపైకి, పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.

### 1618 కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

నంద్యాలలో వీధికుక్కల నియంత్రణకు అధికారులు కు.ని. శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. శివారుల్లో శస్త్రచికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆపరేషన్ల వివరాలు, వాటి అవయవాలను ఆర్గాన్ కమిటీకి నివేదిస్తున్నారు. ఒక్కొక్క శునకానికి రూ.1650 ఖర్చు చేసి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది 1,618 ఆపరేషన్లు పూర్తి చేశారు. మిగిలిన వాటికి కౌన్సిల్‌లో అనుమతి పొందిన తర్వాత మళ్లీ కు.ని ఆపరేషన్లు చేయనున్నారు.

## ధాన్యం లారీ బోల్తా

కొత్తపల్లి, న్యూస్‌టుడే: పొలాల్లోని వరి ధాన్యం తీసుకెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన గువ్వలకుంట్లలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పొలాల్లో నుంచి 340 బస్తాల వరి ధాన్యం బస్తాలు వేసుకుని వస్తుండగా, దారిలో చెట్లు ఉండటంతో వాటిని తప్పించే క్రమంలో లారీ వెనుక టైరు ఎత్తుగా ఉన్న గుట్టను ఎక్కింది. దాంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గడివేముల, న్యూస్‌టుడే: గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగార్జునరెడ్డి హెచ్చరించారు. పెసరవాయి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ఇరువర్గాల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. మారణాయుధాల ఉంటాయనే అనుమానంతో తనిఖీలు నిర్వహించారు. దస్త్రాలు సక్రమంగా లేని ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెసరవాయి గ్రామంలో స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సిబ్బంది

## యువకుడి అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: 2021లో నమోదైన యువకుడి అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై జయశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఆ యువకుడిని తల్లికి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అప్పుల పాలై, హైదరాబాద్ వెళ్లి ఏదైనా ఉద్యోగం చేసి అప్పులు తీర్చుతానని ఇంట్లోంచి 2021 నవంబర్ 21న వెళ్లాడు. అప్పటి నుంచి తమ కుమారుడి ఆచూకీ లేదని తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ యువకుడి ఆచూకీ హైదరాబాద్‌లో గుర్తించి, పోలీసులు క్షేమంగా తల్లి వద్దకు చేర్చారు.

వెంకటేశ్వర్లును తల్లికి అప్పగిస్తున్న సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్సై జయశేఖర్

## సంక్షిప్త సమాచారం

మిడుతూరు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దశరథ రామయ్య తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

పాణ్యం గ్రామీణం: పాణ్యం సమీపంలో జాతీయ రహదారిపై విజయానికేతన్ పాఠశాల వద్ద ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టన్నాయి. ఇద్దరికి గాయాలు కాగా.. వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

పాణ్యం గ్రామీణం: ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. క్షీరాభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు.

నంద్యాల పట్టణం: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పింఛను ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని ఆర్‌జేయూపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం. షరీఫ్ పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారు గృహ నిర్మాణం, పిల్లల పెళ్లిళ్లు చేయాలని ఎదురు చూస్తుంటారనే విషయాన్ని ఆయన ఆదివారం గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ చేసిన రోజునే రావాల్సిన మొత్తం చెల్లించాలన్నారు.

## బాల చైతన్యం.. సంపూర్ణ వికాసం

★ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'స్కౌట్స్ అండ్ గైడ్స్' అమలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ప్రతి పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయినిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో శిక్షణ అందజేశారు. పాఠశాలలో కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ప్రత్యేక యూనిఫాంలు, శిక్షణ కూడా అందించారు. ఈ వారం నుంచి పాఠశాలలో ఈ విధానాన్ని అమలు చేస్తామంటూ ప్రధానోపాధ్యాయుడు దేవానంద్ వివరించారు.

పేరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాల
మొత్తం విద్యార్థులు: 558
స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు: 40
బృందాలు: 05 (ఒక్కోదాంట్లో 8మంది)
విధులు నిర్వర్తించే రోజు: ప్రతి గురువారం
ప్రోత్సాహకాలు: ప్రవేశ్, ప్రథమ్ సోపాన్, రాష్ట్రపతి పురస్కార్ బ్యాడ్జిలు, అవార్డులు

### ఉద్దేశం ఇలా..

- శిక్షణలో భాగంగా ప్రధానంగా ఆరు లక్షణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతారు.
- స్వీయ క్రమశిక్షణ, దేశభక్తి, కరుణ, మానవ విలువలు, సంబంధాల గురించి వివరిస్తున్నారు.
- చదువు పూర్తయిన తర్వాత ఏ రంగాన్ని ఎంచుకోవాలో దిశానిర్దేశం చేస్తారు.
- క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానం గురించి తెలియజేస్తున్నారు.
- మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య చర్యలు, శుద్ధజలం సరఫరా, జాతీయ పండుగలు, దేశభక్తి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.
- ప్రమాదాలు జరిగితే రక్షించుకోవడం, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో నేర్పుతున్నారు.

### నాయకత్వ లక్షణాలపై అవగాహన

**- సునీత, స్కౌట్స్ అండ్ గైడ్**



స్కౌట్స్ అండ్ గైడ్స్ విధానంలో నాయకత్వ లక్షణం ముఖ్యమైంది. చదువు పూర్తయి సమాజంలోకి వెళ్లిన తర్వాత నాయకులుగా ఎదగడం, ప్రజలకు సేవ చేయడం, సమస్యలు, సవాళ్లను అధిగమించడం అంశాలను నేర్చుకుంటున్నాం. సమస్య వస్తే స్వతహాగా ఎలా పరిష్కరించుకోవాలో తెలుసుకుంటున్నాం.

### భవిష్యత్తులో ఉపాధిపై సలహాలు

**- శ్రీహర్షిత, స్కౌట్స్ అండ్ గైడ్**

పాఠశాల విద్య పూర్తయిన తర్వాత భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కంప్యూటరు విద్య, ఆన్‌లైన్, ఆర్థిక సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉన్నత చదువులు చదవలేకపోయినా జీవనోపాధి ఎలా పొందాలో వివరిస్తున్నారు. ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

### విద్యార్థి దశలోనే అవగాహన

**- నందీశ్వర్ కుమార్, మాస్టర్**

స్కౌట్స్ అండ్ గైడ్స్ విధానంపై జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చాం. దేశభక్తి, సైనిక చర్యలు, పాఠశాల బహిరంగ పర్యటనలు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపై సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

(c) eenadu

# ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

## చెట్ల కొమ్మల తొలగింపు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో నెలకొన్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పట్టణ ఏఈ శివ పేర్కొన్నారు. ఆదివారం డోన్ క్రాస్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు వరకు, రైల్వే స్టేషన్ సమీపంలో 11కేవీ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. వినియోగదారులు విద్యుత్తు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకునివస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప తెలిపారు. ఆదివారం ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు సచివాలయ ఉద్యోగులు అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడా పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ట్యాంకుల శుభ్రత తప్పనిసరి

శిరివెళ్ల, న్యూస్‌టుడే: నీటి ట్యాంకుల శుభ్రతను పాటించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. యర్రగుంట్లలో ఓవర్ హెడ్ ట్యాంకుశుభ్రతను ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా ట్యాంకులను శుభ్రపరచాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో కాల్వలు పూడికకు గురయ్యాయి.
**- నరసింహులు, అహోబిలం.**

✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం. **-అశ్విన్, ఈవోపీఆర్డీ.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: పచ్చర్ల గ్రామం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయాలి. **- దేవమ్మ.**

✔: కార్మికులతో పరిశుభ్రం చేయిస్తాం. **-వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, మహదేవపురం.**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: ఇందిరానగర్‌లో కంబాలపాడు రహదారి పక్కనే కాల్వ పక్కన వ్యర్థాలు పోగయ్యాయి. తొలగించాలి. **- మనోహర్, ఇందిరానగర్.**

✔:సిబ్బందితో వ్యర్థాలను తొలగించే చర్యలు తీసుకుంటాం.

?: శ్రీనివాసనగర్‌లో ప్రధాన కాల్వలో పూడిక పేరుకుపోయింది. **- ప్రభాకర్, ఆటోనగర్.**

✔: సిబ్బందితో పూడిక తొలగించే చర్యలు తీసుకుంటాం.

**(పై రెండు సమస్యలకు ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ సమాధానాలు ఇచ్చారు)**

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: కొలిమిగుండ్లలోని కొండపేట కాలనీలో మురుగు రహదారిపై పారుతోంది. కాల్వను శుభ్రం చేయాలి. **- కాలనీవాసులు.**

?: కొలిమిగుండ్లలోని నాయునిపల్లె కాలనీలో వీధి దీపాలు వెలగటంలేదు. **- శ్రీనివాసులు, కాలనీవాసి.**

✔: పరిశీలించి సిబ్బందితో అవసరమైన పనులు చేయిస్తాం. **- చంద్రమౌళీశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో.**

అవుకు, న్యూస్‌టుడే: ?: అవుకులో వీధి కుక్కల సంతతి పెరిగి పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. **- రంగడు, అవుకు.**

✔: కుక్కల దాడులు నియంత్రించేలా చర్యలు తీసుకుంటాం. **-హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, అవుకు.**

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

సమస్యను తెలుసుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు రాగా మంత్రి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలను అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు బాధితులు ఓపిక పట్టాలని మంత్రి కోరారు.

### దర్గాల్లో మంత్రి బీసీ ప్రార్థనలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో హజరత్ సయ్యద్ సిద్ధిఖి జలాల్ రహమ్మతుల్లా అలైహి, బదియుద్దీన్‌షా ఖాద్రి రహమ్మతుల్లా దర్గాల్లో ఆదివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బురానుద్దీన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### బడి ఏర్పాటుకు గ్రామస్థుల వినతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పాపసానికొట్టాల గ్రామంలో చాలా కాలంగా మూత వేసిన ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో బడి లేకపోవడంతో విద్యార్థులకు దూరంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

## నిర్వహణ దూరం.. నీరు కలుషితం

◆ అపరిశుభ్రంగా ట్యాంకు పరిసరాలు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ట్యాంకులకు చిల్లులు ఉండటంతో తాగు నీటి సరఫరా ప్రశ్నార్థకమవుతోంది. పంచాయతీల కాలంలో నాలుగు నీటి ట్యాంకులను నిర్మించారు. స్థానిక కొండపేటలోని నీటి ట్యాంకులకు చిల్లులుపడ్డాయి. ఒకవైపు నీరు లీకవుతుండగా, నాచు పెరిగి పచ్చగా పాచి పట్టి ఉన్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ట్యాంకు వద్ద ఉన్న నీటి వాల్వ్ వద్ద లీకేజీ ఉండటంతో నీరంతా వృథా అవుతోంది. పురపాలక అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న నీటి ట్యాంకుల బాగుకు సరైన చర్యలు తీసుకోవడం లేదు. ట్యాంకుల చుట్టూ చెత్తాచెదారం వేస్తుండటంతో నీరు కలుషితమవుతోందని అవుతోందని నివాసితులు బెంబేలెత్తుతున్నారు.

### కనీస మరమ్మతులు కరవు

☛ పంచాయతీ హయాంలో కొండపేటలో 2.50 లక్షల లీటర్ల చొప్పున రెండు జీఎల్ఎస్ఆర్ నీటి ట్యాంకులు, 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, చిగురుమానుపేటలో 2.50 లక్షల సామర్థ్యం ఉన్న జీఎల్ఎస్ఆర్ నీటి ట్యాంకులు ఉన్నాయి. వాటిలో 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న మూడింటికి రంధ్రాలు పడ్డాయి. గతంలో పుర అధికారులు రూ.లక్షలు వెచ్చించి నామమాత్రంగా మరమ్మతులు చేపట్టడంతో లీకేజీలు అవుతున్నాయి.

కొండపేటలో లీకేజీకి గురైన నీటి ట్యాంకు

☛ ఐదు లక్షల నీటి ట్యాంకుపై భాగాన సిమెంటు దిమ్మెలు ఊడిపోయి కడ్డీలు తేలుతున్నాయి. కొండపేటలో ఒక నీటి ట్యాంకు వద్ద చెత్తాచెదారం, వ్యర్థాలను స్థానికులు పారబోస్తుండటంతో అపరిశుభ్రంగా కన్పిస్తోంది. ట్యాంకులను కూడా 15 రోజులకోసారి శుభ్రం చేయాల్సి ఉండగా అలా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకుల మరమ్మతులకు, వాటి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

☛ నీటి ట్యాంకుల ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారాయి. ఆ ప్రాంతంలో వాహనాలను నిలపడం, ట్యాంకు పక్కనే భవనాలకు చెందిన వ్యర్థాలు పారవేయడం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆ పరిస్థితి ఏర్పడింది. ట్యాంకుల చుట్టూ ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో స్థలం ఆక్రమణలకు గురవుతోంది.

☛ గాజులదిన్నె ప్రాజెక్టుకు చెందిన ఉపరితల వంతెన ట్యాంకులు మూడు, జీఎల్ఎస్ఆర్ ట్యాంకు ఒకటి చొప్పున ఉన్నాయి. వాటిల్లో తారకరామానగర్ శివారులో కాకతీయ ట్యాంకు లీకేజీకి గురవుతుంది. దీంతో నీరు కలుషితమవుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

### పెచ్చులూడి పడుతున్నాయ్



డోన్ పట్టణంలోని పాతపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఒక గది వర్షాలకు కారుతూ పైకప్పు పెచ్చులుడుతోంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎక్కడ పెచ్చులు ఊడి పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల నాడు- నేడు కింద ఎంపికైంది కానీ గది పైకప్పు మరమ్మతు పనులు చేపట్టలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

### నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

ఆళ్లగడ్డ మండలం ఎస్.లింగందిన్నె గ్రామంలో చెత్త సంపద కేంద్రం అధ్వానంగా మారింది. షెడ్డు పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. వ్యర్థాలు నిల్వ చేసే దిమ్మెలు సైతం దెబ్బతిన్నాయి. షెడ్డు శిథిలం కావడంతో చెత్తను దానికి నుంచి నిల్వ చేయడం లేదు. ఫలితంగా కేంద్రం నిరుపయోగంగా మారి పరిసరాల్లో ముళ్లపొదలు నిండాయి. అధికారులు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఎస్.లింగందిన్నె(ఆళ్లగడ్డ గ్రామీణం)

### రాళ్లు తేలి.. దుమ్ము రేగి

రుద్రవరం మండలంలోని పేరూరు నుంచి శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామానికి వెళ్లే రహదారి రాళ్లు లేచి గుంతలమయంగా మారింది. ఇది ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందల సంఖ్యలో వాహన రాకపోకలు సాగుతుంటాయి. రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పేరూరు(రుద్రవరం)

### ప్రవేశాలు పెంచి.. పునఃప్రారంభించండి

చాగలమర్రి మండలంలోని కలుగొట్లపల్లె గ్రామంలో ఒకప్పుడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉండేది అని చెప్పుకునే రోజులు వచ్చాయి. పదేళ్ల క్రితం దాదాపు వంద మంది దాకా ఉన్న పాఠశాల ప్రస్తుతం విద్యార్థులు లేక మూతపడింది. ఐదేళ్ల క్రితం ఇక్కడ ముగ్గురు విద్యార్థులే ఉండడంతో పాఠశాల మూతపడింది. దీంతో పాఠశాల గదులు కొందరు ఆకతాయిలకు అడ్డాగా మారింది. విద్యార్థుల ప్రవేశాలు పెంచి పాఠశాలను మళ్లీ పునఃప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కలుగొట్లపల్లె(చాగలమర్రి)

## ఆర్థిక సాయం అందజేత

యనకండ్ల(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యనకండ్ల గ్రామానికి చెందిన చాంద్‌బాషా, ఖాసింబీ దంపతులకు ముగ్గురు సంతానం. ముగ్గురూ శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. దీనిపై ఈనెల 9వ తేదీన 'ఈనాడు'లో '25 ఏళ్లు దాటినా.. అమ్మా.. ఆకలి అడగలేరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దాత ఆర్థికసాయం అందజేశారు. కర్నూలు వాసవీనగర్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు ఆదివారం యనకండ్ల గ్రామానికి చేరుకుని బాధిత తల్లిదండ్రులకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నగదు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు

## సభను జయప్రదం చేయండి

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఈనెల 27న తేదీన దివ్యాంగుల వారోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆదివారం నంద్యాల జిల్లా దివ్యాంగుల జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలన్నారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేల పింఛను, రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. నాయకులు బాలపుల్లన్న, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలో పందుల బెడద తీవ్రమైంది. పట్టణంలోని కాలనీల్లో సమూహాలుగా సంచరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ మాజీ ఎమ్మెల్యే బి.పి.శేషారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం పాతబస్టాండులో ఆయన విగ్రహానికి వైకాపా నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: దివంగత బీపీ శేషారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల సిబ్బంది పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శేషారెడ్డి వర్ధంతిని నిర్వహించారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: యర్రగుంట్ల గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో గ్రామ సింహాల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమూహంగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై కరిచేందుకు ఎగబడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణంలో ఆళ్లగడ్డ బలిజ సంఘం నాయకులు ఆదివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పుట్టగ శ్రీకృష్ణ మఠాధిపతి శ్రీసుగుణేంద్ర తీర్థ స్వామి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు 'అభినవ కృష్ణదేవరాయ పవన్ కల్యాణ్' బిరుదును ఇవ్వడాన్ని హర్షిస్తూ కార్యక్రమం నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పాపసానికొట్టాల గ్రామంలో రచ్చకట్ట వీధిలో సీసీ రోడ్డు లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: హుస్సేనాపురం గ్రామంలో చెత్త సంపద కేంద్రం వినియోగంలోకి తేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. సంపద కేంద్రం మందు బాబులకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తలనీలాలు, చీరసారెలు, బియ్యం బేడలు వంటి చిరుకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం ఆదివారం భక్తుల సందడితో కనిపించింది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

## హైందవ ధర్మానికి ఐక్యతే రక్ష

మాట్లాడుతున్న పాండురంగానంద భారతి స్వామిజీ

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: హైందవ ధర్మానికి ఐక్యతే రక్ష అని రాధాకృష్ణ పీఠం నెరవాడ పీఠాధిపతి పాండురంగానంద భారతి స్వామిజీ అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హిందువులు అందరూ ఐక్యంగా ఉండి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. శ్రీశైలం సమాజ స్ఫూర్తి కేంద్రానికి చెందిన చింతా మునీశ్వర్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలను గౌరవించాలన్నారు. స్వదేశీ వస్తువులే వాడాలన్నారు. కార్యక్రమంలో మాతాజీ రుక్మిణీ, అనంతానంద భారతి, సాయిసృజన పాల్గొన్నారు.

## అహోబిలంలో ఆర్‌యూ వీసీ

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వెంకట బసవరాజు దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఎగువ, దిగువ ఆలయాల్లోని స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను అతిథి మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు ఆళ్లగడ్డ అనంత విద్యా సంస్థల అధినేత అనంత రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు శంకరాచారి ఉన్నారు.

## ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఏపీ ఎన్జీవో సంఘం ధ్యేయమని ఈ సంఘం తాలూకా అధ్యక్షుడు షమీవుల్లా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ ఎన్జీవో తాలూకా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రాజశేఖర్ ప్రకటించారు. తాలూకా అధ్యక్షుడిగా షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి నాగకేశాలు, కోశాధికారిగా మహమ్మద్‌రఫి, అసోసియేట్ అధ్యక్షుడిగా పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవిచంద్ర, సహాయ కార్యదర్శిగా లక్ష్మీబాయి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు పలువురు అభినందనలు తెలిపారు.

## బాధిత రైతులను ఆదుకోండి

గొట్లూరు(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని గొట్లూరు గ్రామంలో కేసీ పంట కాల్వలు పొంగి 150 ఎకరాల్లో శనగ పంట నీట మునిగిన విషయం తెలిసిందే. ఏపీ రైతు సంఘం నాయకులు భాస్కర్, బాలనరసింహుడు గొట్లూరులో దెబ్బతిన్న పంటను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించి బాధిత అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ తరఫున ఈక్రాప్ ద్వారానైనా రైతులకు పంటల బీమా వర్తింపజేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు రోసిరెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

## ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ధరణీ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో సోమశేఖర్ ఆదివారం తెలిపారు. నిధులు దుర్వినియోగం జరిగినట్లు తనకు తెలియదన్నారు. పాఠశాలను సందర్శించి పూర్తిస్థాయి సమాచారం తెలుసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లగా తాను ప్రస్తుతం ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడిగా కొనసాగుతున్నానని, నిధుల దుర్వినియోగం గురించి తనకు తెలియదని తెలిపారు.

## మాల మహానాడు కమిటీ ఎన్నిక

బనగానపల్లి, న్యూస్‌టుడే: దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బండి దేవాంతకుడు డిమాండు చేశారు. బనగానపల్లిలో ఆదివారం మాల మహానాడు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన వెంకట నరసింహుడు, కార్యదర్శిగా బాలహుసేని, కోశాధికారిగా బంగి మద్దిలేటి, గౌరవాధ్యక్షుడిగా రామమద్దిలేటి, మరో ఐదుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నాగరాజు, బి.మద్దిలేటి, బెన్ని, శివుడు తదితరులు పాల్గొన్నారు.

## రామాచారి సాహిత్యం కమనీయం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: డాక్టర్ రామాచారి రచించిన సాహిత్యం కమనీయమని విశ్రాంత తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తి గ్రామానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ బి.రామాచారి రచించిన 'ప్రశ్నోత్తర రత్నమాలిక' పుస్తకావిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ కేవీ రమణాచారి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెనిగళ్ల రాంబాబు, నరేంద్రకృష్ణ, నరసింహాచార్య పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

## మధ్యంతర భృతి మంజూరు చేయాలి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పింఛనర్లకు మధ్యంతర భృతిని 30 శాతం మంజూరు చేయాలని పింఛనర్ల సంఘం అధ్యక్షుడు కె.ఎన్.భానుసింగ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం స్థానిక పింఛనర్ల సంఘం సమావేశ భవనంలో ప్రధాన కార్యదర్శి గాలయ్య అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. భానుసింగ్ మాట్లాడుతూ.. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, బకాయిలు ఒకేసారి చెల్లించాలని కోరారు. వివిధ శాఖల్లో పదవీవిరమణ పొందిన ఉద్యోగులను తమ సంఘంలో సభ్యులుగా చేర్చుకుని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గోపాల్, దాసప్ప, రామదాసురెడ్డి పాల్గొన్నారు.

## నలుగురిపై కేసు నమోదు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని సిమెంట్‌నగర్ గ్రామానికి చెందిన బైనపల్లె గోవిందు ఇంటి వద్ద కుళాయి నీళ్లు పట్టుకునే విషయంలో అదే గ్రామానికి చెందిన మహేష్, కృప, రాంబాబు, సుశీలలు గొడవ పెట్టుకొని దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

## రహదారి నిబంధనలు పాటించండి

గోడపత్రాలు విడుదల చేస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, బీసీ రాజారెడ్డి తదితరులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: వాహనచోదకులు రహదారి నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని బనగానపల్లి మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి కోరారు. ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాల గోడ పత్రాలను సీఐతో కలిసి ఆయన ఆవిష్కరించారు. రాజారెడ్డి మాట్లాడుతూ. . వాహనదారులు, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో సొంత నిధులు వెచ్చించి గోడ పత్రాలు తయారు చేయించానన్నారు. అనంతరం గోడ పత్రాలను ఆర్టీసీ బస్సులకు అంటించారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ శశిభూషణ్, యూనియన్ నాయకులు వలి, శ్రీనివాసులు, చౌడయ్య పాల్గొన్నారు.

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: నేరప్రవృత్తిని మానుకోవాలని, ఘర్షణలకు పాల్పడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పోలీసు స్టేషన్‌లో పలువురు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వివాదాల్లో ఉన్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవ్వరైనా గొడవలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు వెంకటేశ్వర్లుశెట్టి, నబి, హెడ్‌కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, చెన్నయ్య పాల్గొన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: సర్కిల్ పరిధిలోని సమస్య, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో రౌడీషీటర్లు చిన్నపాటి ఘర్షణలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని సీఐ దస్తగిరిబాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన మంత్రణం నిర్వహించారు.

## ఆత్మీయ కలయిక.. సంతోషాల వేదిక

సంజామల: జడ్పీ ఉన్నత పాఠశాలలో..

సంజామల, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని విశ్రాంత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పేరుసోముల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత గురువులు సర్వేశ్వరరావు, వీరోజీరావు, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, క్రిష్ణన్న, విజయమ్మ, పురందరేశ్వరి, పూర్వ విద్యార్థులు గూటం బాలుయాదవ్, వెంకటేశ్వర్లు, గంగారాజు, మధుమోహన్, విఘ్నేశ్వరరెడ్డి, పుల్లయ్య, అంజలిదేవి, లావణ్యకుమారి, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1999-2000 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు రామసుబ్బయ్య, శ్రీను, యశ్వంత్, శరత్, కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పూర్వ విద్యార్థులంతా హాజరై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు సిస్టర్ అల్ఫాన్‌షా, సిస్టర్ బాలథెరిస్సా, మైఖేల్, ఉషారాణి, విజయకుమారి, కొర్నేలియ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: గురువులతో పూర్వ విద్యార్థులు

## కుక్కలు.. బాబోయ్ తిప్పలు!

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: 'ఆలస్యం.. అమృతం... విషం' ఆలస్యమైతే అమృతం విషమవుతుందన్నట్లుగా ఆళ్లగడ్డలో కుక్కల నియంత్రణ కోసం 'ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్)' నిర్వహించే విషయంలో ఆళ్లగడ్డ పురపాలక శాఖ చేసిన ఆలస్యం పుర ప్రజలకు శాపంగా మారింది. పురపాలిక పరిధిలో ఉన్న ఆడకుక్కల్లో దాదాపు 80 శాతం కుక్కలు కూనల్ని కన్నాయి. ఎక్కడ చూసి కుక్కలు, వాటి పిల్లలు కన్పిస్తున్నాయి. ఈ స్థితిలో ఏబీసీ కార్యక్రమం ఆరంభమైంది.

శునకాలను పట్టుకుంటున్న సిబ్బంది

### ఆలస్యంగా నిర్ణయం

★ పురపాలక శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఆగస్టులో 1,054 శునకాలు ఉన్నాయి. వీటికి ఏబీసీతోపాటు, ఏఆర్‌వీ(యాంటీ రేబిస్ వ్యాక్సిన్) వేయాలని నిర్ణయించారు. ఒక్కో కుక్కకు ఏబీసీ కోసం రూ.1,450, వ్యాక్సిన్ కోసం రూ.200. మొత్తంగా రూ.1,650 ఖర్చు పెట్టేలా కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇందు కోసం రూ.17,39,100 ఖర్చు చేస్తూ డిసెంబరు 5న చర్యలు చేపట్టారు.

★ గణాంకాలను ఆగస్టు వరకే తీసుకోగా ఈ నాలుగు నెలల్లోనే వందలాది ఆడకుక్కలు కూనల్ని కన్నాయి. ఇప్పుడు గణాంకాలు మారిపోవడంతో ఎక్కడ చూసినా కుక్క పిల్లలు కన్పిస్తున్నాయి. ఇలాంటి స్థితిలో ఏబీసీ నిర్వహణ సత్ఫలితాలు ఇస్తుందన్నది అనుమానంగా మారింది. ఈ కార్యక్రమం ఆరునెలల కిందట చేపట్టి ఉంటే మంచి ఫలితాలు వచ్చి ఉండేవని ప్రజలు అంటున్నారు.

### ఒంటరిగా వెళ్లాలంటే భయం

ఆళ్లగడ్డ పురపాలికలో ప్రతి వీధిలోనూ కుక్కల దెబ్బకు ప్రజలు అల్లాడి పోతున్నారు. నవంబరు 1న ఒక్కరోజే 18 మంది కుక్కకాట్లకు గురయ్యారు. రాత్రి సమయాల్లో కుక్కలకు భయపడి ప్రజలు రాకపోకలను సాగించలేని స్థితి ఏర్పడింది. కుక్కల దాడిలో మూడేళ్ల కిందట పట్టణంలోనే నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పుడు కుక్కలు ఈనిన పిల్లలు పెద్దవైతే ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

(c) eenadu

ఈనాడు
పల్నాడు
సోమవారం డిసెంబరు 15, 2025


# మూలిగితే మూలకే.. సేవలకు నెలలే!

గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహణ లోపంతో సమస్యలు

ఈనాడు, అమరావతి

వైద్య పరికరాలు మూలిగితే చాలు మూలకెళ్లిపోతున్నాయి. నిర్వహణ లోపంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వైర్లు కొరికేసి పరికరాలను ఎలుకలు పాడు చేస్తుంటే.. అవి మరమ్మతుల పేరిట నెలల తరబడి వినియోగానికి రావడం లేదు. గుంటూరు జీజీహెచ్ ఆరు జిల్లాలకు వైద్య ప్రదాయిని. నిత్యం 5వేల మందికి పైగా రోగులకు చికిత్స అందిస్తారు. 1500 మంది ఇన్‌పేషంట్లుగా సేవలు పొందుతారు. ఇంతటి కీలకమైన వైద్యాలయంలో కొన్ని విభాగాల పరంగా నిర్వహణ లోపాలు సమస్యగా తయారయ్యాయి.

### సీటీ స్కాన్లు ఎప్పుడు పనిచేస్తాయో తెలియదు..

ప్రధానంగా కొన్ని యంత్ర పరికరాలు తరచూ మొరాయిస్తుండడం సమస్యను జటిలం చేస్తోంది. పరిమితికి మించి రోగుల రాకతో వాటిపై ఒత్తిడి పడుతోంది. రేడియాలజీ విభాగంలో ఇది తరచూ జరుగుతోంది. సీటీ స్కాన్లు ఎప్పుడు పనిచేస్తాయో, ఎప్పుడు మొరాయిస్తాయో అర్థం కాని పరిస్థితి. ఇక ఆపరేషన్ థియేటర్లలో ఓటీ లైట్ల నుంచి ఎండోస్కోపీ, ల్యాపరోస్కోపీ వంటి కీలక యంత్రాల వరకు ఇలాగే తయారయ్యాయి. సీయామ్ మిషన్లు, అనస్తీషియా వర్క్ స్టేషన్లు తరచూ మొరాయిస్తున్నాయి.

### లెక్కల్లోకి వచ్చేది తక్కువే

జీజీహెచ్‌లోని మొత్తం 3,121 పరికరాల్లో 49 పని చేయడం లేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో క్రిటికల్ కేర్ పరికరాలు 7, నాన్ క్రిటికల్ కేర్ పరికరాలు 42 ఉన్నాయి. 118 తుక్కు కింద మార్చేందుకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నా ఇంతకు మూడింతలు మూలకు చేరాయన్నది బహిరంగ రహస్యం.

### ఆ వెంటిలేటర్లు ఉన్నా లేనట్లే..

కొవిడ్ అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు గుంటూరు జీజీహెచ్‌కు పీఎం కేర్ కింద 100కు పైగా వెంటిలేటర్లు వచ్చాయి. ఇవన్నీ మూన్నాళ్లకే మూలకు చేరడంతో సమస్య ఏర్పడింది. వీటికి వారెంటీలు, మరమ్మతులు చేసే కాంపొనెంట్లు దొరక్క మూలకు పెట్టేశారు. అసలే స్థలాభావంతో ఇబ్బంది పడుతున్న జీజీహెచ్‌లో ఇది మరింత జటిలంగా మారింది. ఏం చేయాలో అర్థం కాక అధికారులు వీటిని ఆస్పత్రి ప్రాంగణంలోనే నిల్వ చేశారు.

మూలన పడేసిన వెంటిలేటర్లు

### వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

ఆసుపత్రిలో కీలక పరికరాలను యుద్ధప్రాతిపదికన వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కొన్నింటిని వార్షిక నిర్వహణ కింద బాగు చేయించాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.
– ఎస్.ఎస్.వి.రమణ, సూపరింటెండెంట్

# కాల్‌సెంటర్ సేవలు వినియోగించుకోండి

నరసరావుపేట అర్బన్: ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్ ద్వారా అధికారులకు పంపవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 15న సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు కాల్‌సెంటర్ నంబరు 1100కు ఫోన్ చేసి అర్జీ పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీదారులు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. సమస్యలు పరిష్కారానికి సంబంధించిన సమాచారం ఫోన్‌కు వస్తుందని తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదును వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్జీలపై పరిష్కారానికి సంబంధించిన అంశాలపై సమాధానాలు, నోటీసులు వాట్సాప్ సందేశాల ద్వారా అర్జీదారులు గమనించాలన్నారు.

# అనురాగాల వేదిక.. ఆత్మీయ వేడుక

వైభవంగా సాగర్ ఏపీఆర్‌జేసీ స్వర్ణోత్సవం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురిసౌత్

తరగతి గదులు.. చదివిన పాఠాలు.. నాటి జ్ఞాపకాలు.. స్నేహితుల కబుర్లు, ఆత్మీయ పలకరింపులు.. ఆనంద డోలికలు.. ఉద్వేగాలు.. ఆశీస్సులు, తీపిగుర్తుల కలబోతగా నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జేసీ ప్రాంగణం కోలాహలంగా మారింది. రెండురోజుల పాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల స్వర్ణోత్సవం ఆదివారం ముగిసింది. పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు.

### బ్యాచ్‌ల వారీగా ఫొటోషూట్..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి చదువుకున్న వారంతా పలువురు కార్లలో నాగార్జునసాగర్‌వైపు ఆదివారం ఉదయం నుంచే బారులుదీరారు. 1975 మొదలుకొని ఇప్పటి వరకు ఈ కాలేజీలో చదువుకున్న వారు బ్యాచ్‌ల వారీగా ప్రధాన వేదిక వద్ద గ్రూప్ ఫొటోలు దిగారు. కొందరు పాటల రూపంలో భావోద్వేగాలను వ్యక్తీకరిస్తే.. మరికొందరు ప్రసంగాల రూపంలో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. వివిధ రకాల పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. తరగతి గదులు, కూర్చున్న బెంచీలు కుటుంబ సభ్యులకు చూపిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.

నృత్యాలతో పూర్వవిద్యార్థుల సందడి

☛ పూర్వ విద్యార్థులకు ప్రస్తుతం చదువుతున్న ఇంటర్ విద్యార్థులంతా సాయమందించారు. కొందరు ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ వచ్చే వాహనాలకు దారిచూపారు. అల్పాహారం వడ్డిస్తూ.. ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. రాష్ట్రాలు విడిపోయినా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులే కళాశాలలో చదువుతున్నారు. ఈ కళాశాల ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు తెలంగాణ జిల్లాల విద్యార్థులు కూడా ఇక్కడ చదువుకున్నారు. ఇప్పుడు వారి రాకతో మరింత కళ వచ్చినట్లయింది.

కుటుంబ సభ్యులతో మొదటిబ్యాచ్ విద్యార్థులు

# పోలీసుల గుండెల్లో 'కార్లు' పరిగెడుతున్నాయ్!

ఎస్సై సస్పెన్షన్‌తో మిగతా అధికారుల్లో ఆందోళన

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఏఎస్సై కుమారుడే కదా అని ఇంతకాలం అతనితో అంటకాగిన పోలీసుల గుండెల్లో కార్లు పరిగెడుతున్నాయి. అవునండీ.. వెంకటనాయుడి ముఠా అపహరించిన కార్లను తీసుకొచ్చి పల్నాడు జిల్లాలో తక్కువ ధరకే అమ్మినట్లు.. వాటిని పలువురు పోలీసులు, రాజకీయ నాయకులు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి చాలామంది నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని సమాచారం. ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని ఎలాగైనా కార్ల వ్యవహారం కప్పిపుచ్చి బయటకు రాకుండా చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఎలాగూ రోడ్డు ప్రమాదంలో నిందితులను రిమాండ్‌కు పంపాం కాబట్టి అక్కడితో ముగిసిపోవాలని కొందరు పోలీసులు ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకుంటున్నట్లు తెలిసింది. సదరు ఏఎస్సైని వెల్దుర్తి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేసినప్పటికీ కుమారుడి నేరాల చిట్టాలో తండ్రి పాత్ర ఏంటనే విషయంపై విచారణ చేస్తారా లేదా అన్నది ఆసక్తిగా మారింది. అరెస్టు చేసిన వెంకటనాయుడి బృందం అయిదుగురితో పాటు నకరికల్లు మండలం నర్సింగపాడుకు చెందిన భాను, నరసరావుపేటలో ఉంటున్న అంజిలు కలిసి సుమారు వందల కార్లు తెలంగాణలో అపహరించి పోలీసు అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల వద్ద ఉండే వారికి విక్రయించినట్లు తెలుస్తోంది. సస్పెండైన ఎస్సై రహంతుల్లా వద్ద నాలుగు కార్లను కూడా స్వాధీనం చేసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు. గుంటూరులోని ఓ షెడ్డులో విక్రయానికి తొమ్మిది కార్లు ఉంచినట్లు కూడా తెలిసింది. నకరికల్లు మండలం త్రిపురాపురానికి చెందిన వ్యక్తి పేరుతో వెంకటనాయుడు బృందం ఫాస్టాగ్‌లు ఏర్పాటు చేసుకుని వాహనాల్లో తిరిగినట్లు టోల్‌గేట్ల ద్వారా పోలీసులు తెలుసుకున్నారు. సదరు వ్యక్తిని కూడా పిలిపించి విచారించారు. ముఠాలో భాను, అంజిలు ఇంకా పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారు. వెంకటనాయుడు బృందం అరాచకాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి రావాలంటే సిట్‌లేదా సీఐడీ దర్యాప్తు చేపడితేనే సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సమస్యలకు పరిష్కారం చూపేది సాహిత్యమే

గుంటూరు సాంస్కృతికం: సమస్యలకు సాహిత్యం పరిష్కారం చూపుతుందని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్ అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ధార్మిక ప్రాంగణంలో సోమేపల్లి సాహితీ పురస్కారాల సభ ఆదివారం జరిగింది. రమ్యభారతి సాహిత్య పత్రిక వ్యవస్థాపకుడు చలపాక ప్రకాష్, రచయితల సంఘం సభ్యుడు శ్రీవశిష్టల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో విల్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాహిత్యంలో మానవతా విలువలు ఉండాలన్నారు. సభకు రమ్యభారతి సాహిత్య పత్రిక నిర్వాహకుడు వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించారు.

# ఉన్నతికి కళాశాల పునాది

పూర్వ విద్యార్థుల ఉద్ఘాటన

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, విజయపురిసౌత్: నాగార్జునసాగర్ గురుకుల జూనియర్ కళాశాల చదువే తమ ఉన్నతికి పునాది అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. స్వర్ణోత్సవాల వేళ పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. మరోవైపు కాలేజీకి నిధుల పరంగా ఇబ్బందుల్లేవని కానీ.. అధ్యాపక బృందం కొరత వేధిస్తోందని, నిష్ణాతులైన అధ్యాపకుల్ని నియమించడంలో చొరవ చూపాలని పలువురు వక్తలు కోరారు.

### కల నెరవేరింది

ఏపీఆర్‌జేసీలో చదువుకోవడం నా కల. అది నెరవేరింది. 1978-80 బ్యాచ్ మాది. బైపీసీ చదివా. ఈ కళాశాలలో చదువుకోవడం నాడు ప్రతి పేద విద్యార్థికి లక్ష్యంగా ఉండేది. ఏపీఆర్‌జేసీలో విద్యనభ్యసించడంతో నా ఉన్నతికి బాటలుపడ్డాయి. చైనా, జపాన్, కెనడా దేశాలకు విదేశాంగ శాఖ కార్యదర్శిగా, తర్వాత హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్టు ఉన్నతాధికారిగా విధులు నిర్వర్తించానంటే ఇక్కడ వేసిన పునాదులే కారణం. – రాజశేఖర్ విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి

### కళాశాల ఉన్నతికి చేయూత

నేను 1988-90 బ్యాచ్ బైపీసీ విద్యార్థిని. ఇక్కడ నేర్చుకున్న వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు జీవితంలో ఉపయోగపడ్డాయి. ఇక్కడకు రావడానికి మూడు కారణాలున్నాయి. నా గత జ్ఞాపకాలు. శరీరం వయసురీత్యా అలానే ఉన్నా.. మనసుమాత్రం 35 ఏళ్ల వెనక్కి వెళ్లింది. ఇంతవరకు సాగర్‌కు వచ్చే అవకాశం రాలేదు. 50 ఏళ్ల పరివారంతో మమేకం అవ్వడం సంతోషంగా ఉంది. కాలేజీ ఉన్నతికి న్యాయపరమైన రూపం కల్పించి ఒక ట్రస్టు ఏర్పాటు చేస్తే నా వంతు సాయమందిస్తా. ఇలాంటి గురుకులాల ఉన్నతికి ఇది దోహదం చేస్తుంది.
– జస్టిస్ తుకారాంజీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

### విలువలతో కూడిన విద్య: మల్లారెడ్డి, మాజీ ఐజీ

మొదటిబ్యాచ్‌లో విద్యార్థుల్లో ఇద్దరు ఐఏఎస్, ఐపీఎస్‌లయ్యారు. అందులో నేను ఐపీఎస్ కావడం ఆనందంగా ఉంది. ఏపీఆర్‌జేసీ ప్రారంభించినప్పుడు టైగర్‌వ్యాలీలో చెట్లకింద చదువుకున్నాం. పాములు, జింకలు మా కాలేజీ చుట్టుపక్కలే తిరుగుతుండేవి. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేకపోయినా కష్టపడి చదివాం. క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను అందుకున్నాం. ఇప్పుడు సకల సౌకర్యాలుంటున్నా మెరికలు బయటకు రావడం లేదు.

### నాయకత్వ లక్షణాలు నేర్చుకున్నా

మాది 1983-85 బ్యాచ్. ఎండీ అనస్తీషియా వైద్యనిపుణుడిగా స్థిరపడ్డా. 1999లో తెలుగుదేశం పార్టీ ఎంపీగా పార్వతీపురం నుంచి పోటీచేసి గెలుపొందా. కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, టీం స్పిరిట్, అన్నివిభాగాల్లో తర్ఫీదు, క్రమశిక్షణ ఇక్కడ నేర్చుకోవడం వల్లే రాజకీయాల్లో ఎంపీగా రాణించా. ప్రస్తుతం శ్రీకాకుళం జేమ్స్ మెడికల్ కాలేజీలో హెచ్‌వోడీగా చేస్తున్నా. –డా.డీవీజీ శంకర్‌రావు, మాజీ ఎంపీ

# అవయవదానం.. స్కాన్‌తో చైతన్యం

గుంటూరు జీజీహెచ్‌లోని పలు ప్రాంతాల్లో 'మరణించినా జీవించండి' క్యూఆర్ కోడ్‌ను అంటించి అవయవదానంపై సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ అవగాహన కల్పిస్తున్నారు. కోడ్‌ను స్కాన్ చేయగానే మూడు పేజీల కరపత్రం డౌన్‌లోడ్ అవుతుంది. ఇందులో అవయదానంపై పూర్తి వివరాలు పొందుపరిచారు.
- ఈనాడు, అమరావతి

# ఉమ్మడి జిల్లాలో రెండు రైల్వేస్టేషన్ల ప్రత్యేకత

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు రైల్వేస్టేషన్లది ప్రత్యేక స్థానం. సాధారణంగా రైలు ఓ స్టేషన్‌కు చేరి అక్కడి నుంచి ముందుకు వెళ్లకుండా వెనక్కి తిరిగి వెళ్లే ముగింపు రైల్వేస్టేషన్లు అరుదు. ఆంగ్లేయుల కాలంలోనే ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేపల్లె, మాచర్ల పట్టణాల్లో రెండుచోట్ల ఈ ముగింపు స్టేషన్లు నిర్మించారు. పేదలు ప్రయాణించడానికి, ఆయా ప్రాంతాల్లో పండే పంట ఉత్పత్తులను నగరాలకు చేర్చడానికి నిర్మించిన ముగింపు స్టేషన్లు ఇప్పటికీ వేలాదిమందికి సేవలు అందిస్తున్నాయి. –ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

# ఇదీ దోమతెర కథ!

గుంటూరు ఆర్టీసీ బస్టాండులో బస్సులు ప్రవేశించే వైపు ఉన్న ప్లాట్‌ఫాం పైన ఇలా వరుసగా తాళాలు వేసిన దోమతెరలు కనిపిస్తాయి. బస్సుల్లో నైట్ డ్యూటీలకు వెళ్లే కండక్టర్లు, డ్రైవర్లు రాత్రి బస చేసే ప్రాంతాల్లో దోమల బెడద తట్టుకునేందుకు దోమతెరలను తీసుకెళ్తారు. వాటిని ఎవరూ తస్కరించకుండా ఇలా తాళాలు వేస్తామని ఉద్యోగులు తెలిపారు. –ఈనాడు, అమరావతి

# మత్తు జోలికి వెళ్లకు... జీవితాన్ని చీకట్లోకి నెట్టకు!

కారంచేడు గేట్, రామకృష్ణాపురం (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: ❖ మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. రోజుకు 30 వరకు ఈ తరహా కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు

❖ ఇటీవల చీరాల పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.1.50 లక్షలు జరిమానా విధించారు.

ఈ ఏడాదిలో నమోదైన మొత్తం కేసులు: 1379

సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు: 972

తాగి వాహనాల నడపడం చాలా మందికి ఫ్యాషన్‌గా మారింది. ఇందులో యువత ఎక్కువగా కనిపిస్తోంది. మద్యం తాగడంతో మనిషి నిగ్రహశక్తిని కోల్పోతారని ఓవైపు నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సమయంలో అనుకోకుండా ప్రమాదం జరిగితే ఇంట్లో వారికి తీరని దుఃఖాన్ని మిగుల్చుతున్నారు. కొన్నిసార్లు ఎదుట ప్రయాణించే వాహన చోదకులకు తీవ్ర గాయాలవుతున్నాయి. ఫలితంగా వారి జీవితాల్లో చీకట్లు నెలకొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధిక శాతం మద్యం తాగినవే కావడం గమనార్హం. వీటిపై పోలీసులు అనేక హెచ్చరికలు చేస్తున్నారు. అవగాహన కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. అయినా చాలా మందిలో కనువిప్పు కలగడంలేదు.

# చౌక దుకాణాల్లో 'కొత్త' కానుక

జొన్నలు, రాగులు, గోధుమ పిండి పంపిణీకి సన్నాహాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

కొత్త సంవత్సరం, సంక్రాంతి కానుకగా చౌకధరల దుకాణాల్లో జొన్నలు.. రాగులు.. గోధుమ పిండి పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, జొన్నలు, రాగులు కొన్ని నెలలపాటు పంపిణీ చేసింది. సంక్రాంతి కానుకగా సరకుల్ని తక్కువ ధరకు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ❖ డిసెంబరులో చౌకధరల దుకాణాల్లో పంపిణీకి పల్నాడు జిల్లాకు 150 మెట్రిక్ టన్నుల జొన్నలు కేటాయించారు. కార్డుదారుల నుంచి వాటికి డిమాండ్ ఉంది. జనవరిలో 400 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసేలా ఇండెంట్ పెట్టారు. బియ్యం వద్దనుకుంటే జొన్నలు అందజేస్తున్నారు. ❖ ప్రస్తుతం అందజేస్తున్న బియ్యంలో రెండు, మూడు కిలోలు తగ్గించి వాటి స్థానంలో రాగులు ఇచ్చే ఆలోచన చేస్తున్నారు. ఒక కుటుంబం 25 కిలోల బియ్యం తీసుకుంటే అందులో మూడు నుంచి ఐదు కిలోల బియ్యం తగ్గించి వాటికి బదులు రాగులు ఇవ్వనున్నారు.

| జిల్లా | చౌకధరల దుకాణాలు | మొత్తం బియ్యం కార్డులు |
|---|---|---|
| పల్నాడు | 1,289 | 6,43,453 |
| బాపట్ల | 1,123 | 4,79,994 |

❖ మార్కెట్‌లో గోధుమ పిండి కిలో రూ.60 నుంచి రూ.65 వరకు ఉంది. దీన్ని ప్రభుత్వం చౌకధరల దుకాణాల్లో కిలో రూ.16కే అందించనుంది. కార్డుకు కిలో చొప్పున ప్యాకెట్ల రూపంలో ఇవ్వనుంది. కందిపప్పు కూడా పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. కొత్త సంవత్సరంలో కార్డుదారులకు నిండుగా సరకులు అందనున్నాయి. రాయితీ సరకులతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది.

# కాలం చెల్లితే.. ఫీజుల మోతే!

నరసరావుపేట, న్యూస్‌టుడే: కాలం చెల్లిన వాహనాలతో రోడ్లపైకి వస్తే ఇక ఫీజుల మోత మోగనుంది. ఎలాంటి వాహనమైనా వాటి కాలపరిమితి 15 ఏళ్లే. అంతకు మించి వాటిని తిప్పకూడదన్న విషయం చాలామందికి తెలిసిందే. పదిహేను ఏళ్లు దాటినా వినియోగించాలంటే ఫిట్‌నెస్ పరీక్షలు (ఎఫ్‌సీ) పూర్తి చేసుకుని రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. జిల్లాలో పాత ద్విచక్ర వాహనాలు, కార్లను వేరే రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్కడి రిజిస్ట్రేషన్ నంబరుతోనే చాలామంది తిప్పుతున్నారు. పేరొందిన కంపెనీల వాహనాల గడువు ముగిసినా రీ-మోడల్, మార్పులుచేసి వినియోగిస్తున్నారు. ఇకనుంచి అధికారుల కళ్లుగప్పి ఎఫ్‌సీలు చేయించకుండా వాహనాలు తిప్పే పరిస్థితి ఉండబోదు. నిఘాకు తోడు కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన ఫీజులు వాహనదారులకు భారం కాబోతున్నాయి.

### ఫిట్‌నెస్ రుసుము సహా పెరిగిన ఇతర ఛార్జీలు

❖ సర్టిఫికెట్ ఫీజు, గ్రాంట్, రెన్యువల్ ఫీజులు. వీటికి తోడు జీఎస్‌టీ ఛార్జీలు జోడించి కేంద్రం వాహనదారులపై భారీ భారాన్ని మోపింది. ఫీజుల చెల్లింపులో ఆలస్యం చేసినా మరింత భారం పడుతుంది. ❖ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ టెస్టింగ్ కేంద్రాల్లో రుసుములు చెల్లించి పరీక్ష చేయించుకోవాలి. అలా అనుమతి పొందిన తర్వాతే రోడ్లపై రావాలి.

❖ ఫీజుల వివరాలు ఇలా.. (జీఎస్‌టీ అదనం)
❖ మోటారు సైకిల్ : 15-20 సంవత్సరాల్లోపు రూ.1,500. అంతకు మించితే రూ.3 వేలు.
❖ ఆటో రిక్షా, క్యాబ్ : 20 సంవత్సరాల్లోపు రూ.4,500, అంతకు మించితే రూ.9 వేలు.
❖ ఎల్‌జీవీ, ఎల్ఎంవీ : 15-20 ఏళ్లలోపు రూ.8,500.. ఆపైబడి రూ.17 వేలు.
❖ ఎంజీవీ : 15-20 ఏళ్ల లోపు రూ.11,300.. ఆపైబడి రూ.22,600.
❖ హెచ్‌జీవీ: 15-20 ఏళ్ల లోపు రూ.14 వేలు.. అంతకు మించితే రూ.28 వేలు.
❖ జిల్లాలో రవాణా వాహనాలు: 59 వేలు ❖ రవాణేతర వాహనాలు : 4.80 లక్షలు

# వయసు 88.. పతకాలు 160

బాపట్ల భీమావారిపాలేనికి చెందిన విశ్రాంత ఉద్యోగి, మాస్టర్ క్రీడాకారుడు లేళ్ల వెంకట రామారావు అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నారు. 88 ఏళ్ల వయసులో రోజూ మైదానానికి వెళ్లి జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ సాధన చేస్తున్నారు. రాజస్థాన్‌లోని హల్వార్‌లో ఈ ఏడాది నిర్వహించిన 44వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 85 ఏళ్లకు పైగా వయసున్న క్రీడాకారుల విభాగంలో జావెలిన్‌త్రోలో పసిడి పతకం గెలిచారు. డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. బాపట్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచారు. ఇప్పటి వరకు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో 100 పసిడి, 40 రజత, 20 కాంస్య పతకాలు సాధించారు. పాఠశాల దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నారు. కళాశాల స్థాయిలో జిల్లా, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పదుల సంఖ్యలో పతకాలు సాధించారు. తర్వాత హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూనే క్రీడల్లో సాధన చేశారు. రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఉద్యోగ విరమణ అనంతరం వెటరన్ క్రీడాకారుడిగా పోటీలకు హాజరవుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో నడక, వ్యాయామం, అథ్లెటిక్స్‌లో సాధన చేస్తున్నారు. ఆటలతో చలాకీగా ఉంటున్నానని, ఇదే తన ఆరోగ్య రహస్యమని రామారావు తెలిపారు. క్రీడల్లో మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నారు.
- బాపట్ల, న్యూస్‌టుడే

# చుక్కేస్తే.. టికెట్ చినిగినట్లే..!

వినుకొండ, న్యూస్‌టుడే: భద్రతకు ఆర్టీసీ పెద్దపీట వేస్తోంది. బస్సులతో పాటు సిబ్బంది క్రమశిక్షణపై కఠినంగా వ్యవహరిస్తోంది. మద్యం తాగి విధులకు హాజరైతే ఇంటికి పంపేలా చర్యలు చేపట్టింది. ప్రతి డిపోలో డ్రైవర్, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందిని ఉదయం బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తారు. రీడింగ్‌ను బట్టి శిక్ష ఉంటుంది. రక్షణ దళంతో పాటు తనిఖీ అధికారుల వద్ద మిషన్లు అందుబాటులో ఉంటాయి. వినుకొండ డిపోలో అక్టోబర్‌లో ముగ్గురు కాల్‌ఆన్‌డ్రైవర్లు పట్టుబడటంతో వారిని విధులకు దూరంగా ఉంచారు. ఈనెలలో ఇప్పటి వరకు ఇద్దరు పట్టుబడ్డారు. జిల్లాలోని అన్ని డిపోలలో ఈ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు

### క్రమశిక్షణ చర్యలు ఇలా..

బ్రీత్‌ఎనలైజర్ స్ట్రాతో పీల్చినప్పుడు 10మి.గ్రా/100మి.లీ నమోదయితే క్రమశిక్షణా పత్రంపై సంతకం చేసి ఇంకెప్పుడూ తాగనని ప్రతిజ్ఞచేయాలి. రెండోసారి పట్టుబడితే సంజాయిషి ఇవ్వాలి. ఇది సర్వీసు రికార్డులో నమోదు చేస్తారు. 10 నుంచి 30 మి.గ్రా వరకు మొదటి, రెండోసారి నమోదు అయితే ఆరోజు గైర్హాజరుగా నమోదు చేస్తారు. ఏడాది పాటు ఇంక్రిమెంట్ వాయిదా వేస్తారు. మూడోసారి అయితే రెండేళ్ల వార్షిక ఇంక్రిమెంట్‌ను ఆపేస్తారు. 30మి.గ్రా/100 మి.లీ.దాటితే ఇంక్రిమెంట్ తగ్గించడంతో పాటు బదిలీ వేటు పడుతుంది. మూడోసారి పట్టుబడితే విధుల నుంచి తొలగిస్తారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

# చేపలు లేక.. వేట సాగక

## జీవనోపాధి లేక మత్స్యకారుల ఆవేదన

తాడువాయి కృష్ణానదిలో ఒడ్డున ఉన్న చేపల వేట పడవలు

అచ్చంపేట, క్రోసూరు, న్యూస్‌టుడే

కృష్ణానదిలో చేపల వేట సాగక.. జీవనోపాధి లేక ఇబ్బంది పడుతున్నామని అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు నుంచి అమరావతి వరకు నది పరివాహక ప్రాంతం పరిధిలోని అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో సుమారు 100 మత్స్యకార కుటుంబాలు చేపల వేటతో జీవనం సాగిస్తున్నాయి. పులిచింతల ప్రాజెక్టు వద్ద చేపల వేటకు తెలంగాణ ప్రాంతం, ఎన్టీఆర్ జిల్లా మత్స్యకారులు వస్తున్నారు. వీరితో స్థానికులకు తరచూ వివాదం కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు, తాడువాయి వద్ద నదిలో 25 లక్షల చేపపిల్లలు వదిలారు. వరదలతో చేపలతోపాటు వలలు, నావలు కొట్టుకుపోయాయి. దీంతో వేట సాగడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

### అప్పులతో జీవనం

నవంబరులో నదికి 6 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చింది. పడవ వలలు కొట్టుకుపోయాయి. నదిలో చేపలే కరవయ్యాయి. పెద్ద చేపలు లేవు. గురకటు వరకే పడుతున్నాయి. అవి కిలో రూ.50కు అమ్ముతున్నాం. ఇతర పనులకు వెళ్లలేం. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నాం. తాడువాయి వద్ద నదిలో చేపపిల్లలు వదలాలి. - శ్రీనివాసరావు, మత్స్యకారుడు

### ప్రభుత్వం ఆదుకోవాలి

పులిచింతల ప్రాజెక్టు వద్ద చేపలు పట్టనివ్వడం లేదు. ఎటూ పోలేక ఇబ్బందే ఉంటున్నాం. మత్స్య శాఖ మా లైసెన్సులు రెన్యువల్ చేయలేదు. వలలు కొనుగోలుకు రుణాలు అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం. - భవానీశంకర్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు

# ఆహారం.. కొంగల విహారం

పురుగుల కోసం చేరిన ఈ కొంగల గుంపు వరిచేను-వినుకొండ దారిలోని సీతారామపురం వద్ద కనిపించింది. మాగాణి చేలు దమ్ము చేస్తున్నప్పుడు బురద మట్టిలో కనిపించే పురుగులను ఆరగించేందుకు సమూహాలుగా చేరాయి. కొన్ని పొలాల్లోని మొరకలపై వేచి చూస్తుండగా.. మరికొన్ని తక్కువ ఎత్తులో ఎగురుతూ చూపరులను ఆకర్షించాయి. - న్యూస్‌టుడే, వినుకొండ

# నెరవేరనున్న ఉపముఖ్యమంత్రి హామీ

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 5న నిర్వహించిన మెగా పీటీఎంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆ పాఠశాలకు 25 కంప్యూటర్లు, గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వి.కృష్ణతేజ, కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా వాటిని సోమవారం సాయంత్రం పాఠశాలకు అందజేయనున్నట్లు జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట రాజారమేష్ ఆదివారం తెలిపారు.

# పీపీపీ విధానంతో విప్లవాత్మక మార్పులు: కొమ్మాలపాటి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: దేశంలో వైద్యరంగంలో పీపీపీ విధానాన్ని అమలు చేయడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీపీపీ విధానాన్ని కేంద్రప్రభుత్వం కూడా ఆచరించేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాన్ని పార్లమెంట్ స్థాయీ సంఘం సమర్థించిందని తెలిపారు. జగన్ బృందం పీపీపీ విధానంపై దుష్ప్రచారం చేస్తూ దాని విమర్శిస్తున్నారు. నకిలీ సంతకాలు సేకరించి చేసే ఫేక్ ప్రచారాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. రాష్ట్ర విద్యార్థులు వైద్య విద్య అభ్యసించేందుకు విదేశాలు వెళ్లే అవసరం లేకుండా సీఎం నాణ్యమైన వైద్య విద్య, వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# ప్రజల పక్షాన పోరాటాలే సీపీఐ లక్ష్యం

పతాకాన్ని ఆవిష్కరించిన నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పోరాటాలు చేస్తుందని జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లో ఆదివారం సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వందేళ్ల ఉత్సవాలు డిసెంబరు 26న జరుగుతాయని విజయవంతం చేయాలన్నారు. లెనిన్‌నగర్‌కు చెందిన సీనియర్ నేతలకు నివాళులు అర్పించారు. దేశంలో కార్మికుల హక్కుల సాధన, రైతుల భూమి సమస్యల పరిష్కారం, వేతనాల పెంపు ఇలా పలు అంశాలపై పేదల హక్కుల కోసం పోరాడిన ఘనమైన చరిత్ర సీపీఐదని చెప్పారు. ఈనెల 22న నియోజకవర్గ స్థాయిలో శత వార్షికోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. పట్టణ కార్యదర్శి షేక్ చిన్న జాన్ సైదా, ఉప్పలపాటి రంగయ్య, మదన్మోహన్‌రాజు, ఉన్నారు.

# పోషణ వాటిక.. ఆరోగ్య కానుక

## అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ సాగు

శ్రీనివాసనగర్ (నరసరావుపేట పట్టణం), న్యూస్‌టుడే

పోషకాహారం పూర్తి స్థాయిలో అందక పలువురు చిన్నారులు వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని అధిగమించి పిల్లలను పుష్టిగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా కార్యాచరణ చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తూనే సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు లబ్ధిదారులకు అందించాలనే ఉద్దేశంతో పోషణ వాటికలు ఏర్పాటు చేసింది. మొదటి విడతలో భాగంగా తాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్డి సౌకర్యాలున్న కొన్ని కేంద్రాలను ఈ పథకంలో ఎంపిక చేశారు. సాగుకు రూ.10 వేల చొప్పున మంజూరు చేసింది. పోషణ వాటికలతో పౌష్టికాహారం అందడంతో పాటు మొక్కల పెంపకంపై పిల్లలకు అవగాహన కలుగుతోంది.

### మూడు శాఖల అనుసంధానం

ఈ పథకం అమలుకు మూడు శాఖల సిబ్బంది సమన్వయం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది స్థల

గోగులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వాటికలో పెరిగిన ఆకుకూరలు

సేకరణ చేసిన అనంతరం ఉపాధి హామీ సిబ్బంది ఆధ్వర్యంలో భూమిని శుభ్రం చేసి మడులు ఏర్పాటు చేస్తారు. సేంద్రియ పద్ధతిలో సాగు సిబ్బంది విత్తనాలు, అవసరమైన జీవం, జీవామృతం, కషాయాలు తయారు చేసి అంగన్‌వాడీ సిబ్బందికి అందిస్తున్నారు.

### రక్తహీనత నివారణకు..

పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటుంది. దాని నివారణకు తాజా పోషకాలు అందించడమే సరైనదని గుర్తించిన కేంద్రం పోషణవాటికల నిర్వహణకు నిధులు మంజూరు చేసింది. తాజా కూరగాయలు, ఆకుకూరలు పండించి కార్యకర్తలు గర్భిణులకు పంపిణీ చేయటంతో పాటు పిల్లలకు పెట్టే ఆహారంలోనూ ఆకుకూరలను ఉంచుతున్నారు.

### ధరల పెరుగుదలతో ప్రమేయం లేకుండా..

కూరగాయల ధరలు పెరుగుతున్న సమయంలో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఉంటున్నారు. మెనూ ప్రకారం ఆకుకూరలు తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తాజా ప్రయత్నంతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. సొంత భూములు లేని కేంద్రాలకు పండించిన ఆకుకూరలను అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. వీటి పోషణ అంతా కార్యకర్తలు, ఆయాలే చూసుకుంటున్నారు.

### నిరంతర ప్రక్రియ

పోషణవాటికలను ఎల్లప్పుడూ కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తుంది. దానికి అనుగుణంగా ఒక పంట ముగిశాక వదిలేయకుండా మళ్లీ నేలలో మట్టిని తిరగబెట్టి విత్తనాలు చల్లుతున్నారు. రొంపిచర్ల మండలంలో సుబ్బయ్యపాలెం, అలవాల, విప్పర్లపల్లి గోగులపాడులో పోషణవాటికలను ఏర్పాటు చేసినట్లు సూపర్‌వైజర్ మరియకుమారి తెలిపారు.

# జిల్లాలో 22 మంది ఎస్సైలు బదిలీ

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లాలో పలు పోలీసు స్టేషన్లకు 22 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ కృష్ణారావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 16మందిని వివిధ స్టేషన్లకు అనుసంధానం చేసి పూర్తి బాధ్యతలు అప్పగించారు. మిగతా ఆరుగురు శిక్షణ ఎస్సైలుగా పనిచేస్తూ పలు స్టేషన్లకు నియమితులయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి..

| ఎస్సై పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| ఆర్. వెంకటేశ్వరరావు | సత్తెనపల్లి రూరల్ | నాదెండ్ల |
| ఎం. వెంకటేష్‌బాబు | అచ్చంపేట | శావల్యాపురం |
| పి. గోపి | క్రోసూరు | బెల్లంకొండ |
| పి. నరేష్ | ఐనవోలు | అమరావతి |
| జి. రాంబాబు | నాగార్జునసాగర్ | వినుకొండ |
| కె. పవన్ కుమార్ | పిడుగురాళ్ల | మాచవరం |
| జి. రాజశేఖర్ | వినుకొండ | సత్తెనపల్లి పట్టణం |
| బి. ఆర్. యశ్వా | సత్తెనపల్లి పట్టణం | నరసరావుపేట రెండో పట్టణం |
| షేక్ ఖాశిం వలి | నరసరావుపేట గ్రామీణ | దాచేపల్లి |
| ఆర్. శ్రీకాంత్ | చిలకలూరిపేట గ్రామీణ | నరసరావుపేట గ్రామీణ-2 |
| పి. రమేష్ | మాచర్ల పట్టణం (ఇన్‌ఛార్జి) | మాచర్ల పట్టణం |
| ఎల్. లోకేశ్వరరావు | శావల్యాపురం | రొంపిచర్ల |
| ఎం. సత్యనారాయణ | వినుకొండ | వెల్దుర్తి |
| జె. శ్రీనివాసరావు | సత్తెనపల్లి పట్టణం | అమరావతి |
| కె. లేఖా ప్రియాంక | నరసరావుపేట రెండో పట్టణం | చిలకలూరిపేట గ్రామీణ |
| జి. పుల్లారావు | నాదెండ్ల | డీఎస్బీ నరసరావుపేట (వినుకొండకు అనుసంధానం) |
| డి. ప్రవీణ్ | బెల్లంకొండ | డీఎస్బీ నరసరావుపేట |
| సీహెచ్ మణికృష్ణ | రాజుపాలెం (ఇన్‌ఛార్జి) | రాజుపాలెం |
| పి. అనిల్ | ముప్పాళ్ల (ఇన్‌ఛార్జి) | ముప్పాళ్ల |
| కె. సతీష్ | నకరికల్లు (ఇన్‌ఛార్జి) | నకరికల్లు |
| కె. వేణుగోపాల్ | ఈపూరు (ఇన్‌ఛార్జి) | ఈపూరు |
| టి. తిరుపతిరావు | డీఎస్బీ నరసరావుపేట (ఇన్‌ఛార్జి) | డీఎస్బీ నరసరావుపేట |

# క్రీడలతో స్నేహం బలోపేతం

## ముగిసిన షటిల్ టోర్నమెంట్

జిల్లా స్థాయిలో విజేతలు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : క్రీడలతో శారీరదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం సమకూరుతాయని, స్నేహబంధం బలపడుతుందని సీఆర్ కళాశాల ఎండీ చుండి వేణుబాబు, అధ్యక్షుడు, కరస్పాండెంట్ చుండి రంగనాయకులు అన్నారు. నాదెండ్ల మండలం గణపవరం సీఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల స్థాయి డబుల్ ఓపెన్ షటిల్ టోర్నమెంట్ పోటీల ముగింపు సభలో ఆదివారం మాట్లాడారు. సీఆర్ కళాశాల షటిల్ ఆటగాళ్లు, బత్తుల ప్రసాద్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీలు విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా విజేతలైన ఉమ్మడి జిల్లాల స్థాయిలో చంద్రం టీమ్ (విజయవాడ), ఖాదర్ మస్తాన్‌టీం (చిలకలూరిపేట), జాక్సన్, పృథ్వి టీమ్ (గణపవరం), సుబ్రహ్మణ్యం టీమ్ వరుసగా తొలి నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఖాదర్ టీమ్ (ప్రథమ), జాక్సన్, పృథ్వి టీమ్ (ద్వితీయ), ఆది టీమ్ (తృతీయ)

నియోజకవర్గ స్థాయిలో బహుమతులు అందుకున్న క్రీడాకారులు

బహుమతులు పొందారు. మొత్తం రూ.50వేల నగదు బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా నాగయ్య, రమేష్, నరేంద్ర, యాకోబు వ్యవహరించారు. కమిటీ సభ్యులు యశ్వంత్ చౌదరి, సాయి చౌదరి, మణికంఠ, నాని, బాషా పర్యవేక్షించారు. బహుమతులకు సహకారం అందించిన దాతలు శ్రీనివాసనాయక్, షేక్ సుభాని, రమేష్, అబ్రహం, దాసరి ధనలక్ష్మి, వెంకట గోపి, సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాసరావును సత్కరించారు.

# త్రికోటేశ్వర ఫాం ల్యాండ్ వెంచర్ ప్రారంభం

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆంజనేయులు, ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ తదితరులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో కోటప్పకొండ నుంచి గోనెపూడి వెళ్లే మార్గంలో చుట్టూ పచ్చదనంతో నిండిన ఎత్తైన కొండలు, ఆహ్లాదకర వాతావరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రికోటేశ్వర ఫాంల్యాండ్ వెంచర్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటప్పకొండ గతం కన్నా ఎంతో అభివృద్ధి చెందిందని, మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో అభివృద్ధి పనులు బాగా జరిగాయన్నారు. అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో మంచి వాతావరణంలో వెంచర్ ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. సుందరమైన ఇళ్ల నిర్మాణంతో పాటు చిల్డ్రన్స్‌పార్కు, స్విమ్మింగ్‌పూల్, పది రకాలైన ఆర్గానిక్ మొక్కల పెంపకం చేపడతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచుమర్తి భూపతిరావు, నాగసుశీల, మల్లెం సుభాష్, బండి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వేల్పూరులో నేత్రదానం

వెంకటేశ్వర్లు (పాత చిత్రం)

వేల్పూరు(శావల్యాపురం), న్యూస్‌టుడే : మండలంలో వేల్పూరు గ్రామానికి చెందిన కల్లూరి వెంకటేశ్వర్లు (74) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలని నిర్ణయించుకుని జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సంద్రపాటి చలపతిరావుకు తెలిపారు. వెంటనే ఆయన శంకర నేత్రాలయ వైద్యశాలకు సమాచారం అందించారు. వైద్యులు వచ్చి వెంకటేశ్వర్లు కళ్ల నుంచి కార్నియా సేకరించారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు అభినందించారు.

# పచ్చదనమే.. పచ్చందమే

ఎక్కడైనా చెట్టు కొమ్మలు పచ్చని ఆకులతో కళకళలాడుతుండటం తెలిసిందే. రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు సమీపంలో అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కనే ఓ చెట్టు కాండం, కొమ్మల వరకు పచ్చగా కనువిందు చేస్తోంది. తీగజాతి మొక్క అల్లుకోవడంతో చెట్టు మొత్తం పచ్చగా కనిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. - న్యూస్‌టుడే, రొంపిచర్ల

# అయ్యప్ప భక్తుడి మృతి

చైతన్య (పాత చిత్రం)

అమరావతి, వేమూరు, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్ష తీసుకుని స్వామి దర్శనానికి వెళ్లిన భక్తుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వేమూరు మండలం కుచ్చెళ్లపాడు గ్రామానికి చెందిన గాజుల చైతన్య (22) కొన్నాళ్లుగా అమరావతిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 11న శబరిమలలో అయ్యప్ప స్వామి దర్శనానికి ఇరుముడితో బయలు దేరి వెళ్లాడు. తోటి భక్తులతో కలిసి పంబానదిలో స్నానం చేసి స్వామి దర్శనానికి బయలుదేరగా తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే సమీప ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని ఆదివారం అమరావతికి అంబులెన్స్‌లో తీసుకొచ్చారు.

# పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన పానకాలపాలెంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మేడపికి చెందిన పామూరు వెంకట స్వామి (21) వినుకొండ మండలం పానకాలపాలెం లోని చేపల చెరువుల వద్ద కాపలాగా ఉంటున్నాడు. కుటుంబంలో జరిగిన చిన్నపాటి గొడవతో మనస్తాపం చెంది మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. దీంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామకోటి తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.


91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ. 5 - ఉ. 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ. 7 - ఉ. 11 |
| నువ్వా నేనా | ఉ. 11 - మ. 2 |
| సత్యభామ | మ. 2 - సా. 5 |
| లైట్ తీస్కో | సా. 5 - రా. 9 |
| సరదాగా కాసేపు | రా. 9 - రా. 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా. 12 - తె. 5 |

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297



EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

SAREES

పాతపట్టు చీరలు: కంచి, వెంకటగిరి, గద్వాల్ ప్యూర్ జరీ చీరలు మీ ఇంటి వద్దనే 1000/- నుండి లక్ష రూ|| దాకా కొనబడును. ✆ 81251 68645.

MARRIAGE SERVICES

కాపు, 29Y, 5'.4'' ఐర్లాండ్‌కు వరుడు మరియు కాపు 29Y, 5'.11'' ఐర్లాండ్‌కు వధువు కావలెను. భరత్ మ్యారేజ్ లింక్స్, తెనాలి. ✆ 98499 70373.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

23 లక్షలకే రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటి నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం|| 89196 28403.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు మున్సిపాలిటీ పరిధిలో లాల్ పురం గ్రామం ఆనుకొని 33 Ft రోడ్‌లో బ్యాంక్‌లోన్ సదుపాయంతో ఓపెన్ ప్లాట్స్ అమ్మకంనకు కలవు. స్పాట్‌హౌస్ కన్‌స్ట్రక్షన్ చేసుకోబడును. ✆ 83098 12757, 88861 12399

JOBS

Jayalakshmi Nexa Hiring for Autonagar Guntur. Good opertunity for Freshers/Experienced. Whatsapp: 91007 87054.

Karthikeya Infraces సంస్థ నందు పనిచేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతం 12,000 -30,000 + ఇన్సెంటివ్, అర్హత 10th -డిగ్రీ, Age 18-20 Yrs. ✆ 88861 12399, 88862 12399.

30-65Yrs బ్యాంక్ అనుబంధ సంస్థలో జీతం + Inc 35వేలు టీమ్‌మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q:10th, డిగ్రీ. రిటైర్డ్ బిజినెస్ ఇన్సూరెన్స్ ఏజంట్స్ మ్యూచువల్‌ఫండ్స్. నోటార్గెట్. ✆90524 70111

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్‌ఎస్టేట్ సర్వీసెస్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50) టెలీకాలర్స్ (10) DDOలు (10) కావలెను. 99920 82456.

రాయల్ ఎంఫీల్డ్ షోరూమ్ తాడేపల్లి నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ & మెకానిక్ కావలెను. Contact: 99891 28328.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. సంప్రదించగలరు. ✆ 8978480429.

గుంటూరులోని ప్రముఖ కళాశాల ఉమెన్స్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో పనిచేయుటకు లేడీ రెసిడెన్షియల్ వార్డెన్ (శాఖాహారులు మాత్రమే) కావలెను. ✆ 83310 33743.

గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఔట్‌సోర్స్ డేటా ఎంట్రీ చేయుటకు కంప్యూటర్ స్పీడ్ టైపింగ్‌లో అనుభవమున్న ఆపరేటర్స్ కావలెను. 8885050664, 9908780954.

శ్రీనిధి ఎంటర్ ప్రైజెస్‌వారి అద్దంకిఆఫీసులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (ట్యాలీ) తెలిసినవారు కావలెను. అద్దంకికి చెందిన వారై ఉండాలి. 9247424587.

మా రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ లీడర్స్, గృహిణులు, Govt/ pvt & Rtd వారు, LIC /చిట్స్ / ఇన్సూరెన్స్ /సాఫ్ట్‌వేర్స్ /NRIలు కావలెను. ✆ 9502822335

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వంట మనిషి కావలెను: గుంటూరు పట్టణంలో ఏ.టి.అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్‌లో అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579.

గుంటూరు, ఆటోనగర్, HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. PT/FT. 77996 89889, 80745 46302.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541



శ్రీ భవన్నారాయణ స్వామి వారి దేవస్థానం, ఇనుమెళ్ళ ఈపూరు మండలం, పల్నాడు జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. నిల్/2025 తేది. 14-12-2025

దేవాదాయ ధర్మదాయ శాఖ పల్నాడు జిల్లా, ఈపూరు మండలం, ఇనుమెళ్ళ గ్రామము నందు వేంచేసియున్న శ్రీ భవన్నారాయణ స్వామి వారి దేవస్థానం పునర్నిర్మాణమునకు అంచనా విలువ 88,68,800-00 కొరకు ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్స్ ది. 15-12-2025 ఉదయం గం|| 10.00 ని|| నుండి ది. 29-12-2025 సాయంత్రం గం|| 4.00 ని. వరకు డౌన్‌లోడ్ చేసికొనవచ్చును. మిగతా వివరములు కొరకు http://tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. ఇతర వివరములకు వినుకొండ గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణాధికారి వారిని కార్యాలయము పనివేళలలో సంప్రదించగలరు.



SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032

బ్రాంచ్ : ఒంగోలు: డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001, వెబ్‌సైట్ : www.shriramfinance.in

లాంఛనముగా స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఒంగోలు 1 నందు బ్రాంచి ఆఫీస్ కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీతలు ఈ క్రింద తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని ది.11-12-2025 న లాంఛనముగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతల యొక్క పేరు మరియు చిరునామా :

1) చలువాది మోహన్ మణిదీప్, తండ్రి : సిహెచ్ శ్రీనివాసరావు, నివాసము: డి.నెం.12-1218, విరాట్ నగర్, పేర్నమిట్ట (విలేజ్), సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523002.

2) చలువాది సుభాషిణి, భర్త : సిహెచ్ శ్రీనివాసరావు, నివాసము: డి.నెం.46-128-294, విరాట్ నగర్ 4వ లైన్, పేర్నమిట్ట (విలేజ్) సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523002.

3) ముద్దా రామంజనేయులు, తండ్రి : ముద్దా శ్రీనివాసరవు, నివాసము: డి.నెం.2-115, కొత్త కాలని, కనకర్లపూడి, శావల్యాపురం, గుంటూరు జిల్లా - 523646.

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము : రూ.44,71,659/-(అక్షరాల నలభై నలుగు లక్షల డెబ్బై ఒక వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)

లోన్ అకౌంట్ నెంబరు : ONGL2TF2304030002

డిమాండ్ నోటీసు తేది : 08-08-2025

స్థిరాస్తుల వివరములు

షెడ్యూల్-1: (దస్తావేజు నెం.131/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112లో, సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022 తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన సర్వే నెం.112/3 నందలి ఎ. 26.43 సెంట్లు అందులోని ఎ.0.97 సెంట్లలోని స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 30 అ||లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ||లు మొత్తం 2160 చ||అ||లు లేదా 240 చ||గ||లు లేదా 200 చ||మీ||లు స్థలము. దీనికి హద్దులు: తూర్పు: జి.కృష్ణ గారి భూమి, పడమర : కాసు వరప్రసాద్ గారి భూమి, ఉత్తరం: కాసు వరప్రసాద్ గారి భూమి, దక్షిణం: 20 అ||ల వెడల్పు గల రోడ్డు.

షెడ్యూల్-2: (దస్తావేజు నెం.132/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం. ఎల్.డి.ఎస్/సి/221/2022 తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద ఎ.26.43 సెంట్లలోని ఎ.0.97 సెంట్ల స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 30 అ||లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ||లు మొత్తం 2203.2 చ||అ||లు లేదా 244.8 చ||గ||లు లేదా 204 చ||మీ||లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: కె.శ్యామ్ సుందర రావు నుండి సి. సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్తి పడమర : డొంక, ఉత్తరం: 20అ||ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: వై.సత్యవతి నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్తి.

షెడ్యూల్-3: (దస్తావేజు నెం.133/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022, తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద పడమరకు 30.6 అ||లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ||లు మొత్తం 2203.2 చ||అ||లు లేదా 244.8 చ||గ||లు లేదా 204 చ||మీ||లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: ఇతరుల యొక్క భూమి, పడమర : డొంక, ఉత్తరం: కె.వెంకటరమణమ్మ నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్తి, దక్షిణం: 20 అ||ల వెడల్పు గల రోడ్డు.

షెడ్యూల్-4: (దస్తావేజు నెం.140/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022, తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద ఎ.26.43 సెంట్లు అందులోని ఎ.0.97 సెంట్లలోని స్థలము యొక్క విస్తీర్ణము తూర్పు నుండి పడమరకు 30.6 అ||లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ||లు మొత్తం 2203.2 చ||అ||లు లేదా 244.8 చ||గ||లు లేదా 204 చ||మీ||లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: గొల్లా ఆంజనేయులు ఇతరులకు అమ్మిన భూమి, పడమర : కె.వెంకటరమణమ్మ నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్తి, ఉత్తరం: 20అ||ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: గొల్లా ఆంజనేయులు ఇతరులకు అమ్మిన భూమి.

పైన పేర్కొన్న నాలుగు షెడ్యూలు ఐటంలు గల ఆస్థిలో "సుభాషిణి దాల్ మిల్" అనే పేరుతో గల దాల్ మిల్ మరియు ఖాళీ స్థలము కలదు.

మొత్తం 4 ఐటంల మొత్తం విస్తీర్ణం 973.6 చ||గ||లు, దానిలో 2970 చ||అ||ల విస్తీర్ణములో ఎసిసి షెడ్, అసెస్‌మెంట్ నెం. 1035049830, గణపతినగర్, పాత డోర్ నెం.12-1350, కొత్త డోర్ నెం.46-128-820/1తో నిర్మించబడినది.

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం. 1285/2023 ప్రకారం చలువాది సుభాషిణి, భర్త: చలువాది శ్రీనివాసరావు వారి పేరుతో కలదు.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (యస్‌యఫ్‌యల్) అధీకృత అధికారి పైన పేర్కొనబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తరువాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖాఆస్తులను దారి మళ్ళించుట గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

తేది : 11-12-2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


(c) eenadu

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

**మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే:** విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నరసరావుపేట పట్టణంలోని మహాత్మాగాంధీ ఆసుపత్రి, పనసతోట, కమ్మరి బజార్, మార్కెట్ ఏరియా, పెద్ద చెరువు, మహాలక్ష్మి నగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 నుండి 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు డీ-1 సెక్షన్ ఏఈ రఫీ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వైభవంగా గాయత్రి హోమం

**రొంపిచర్ల, న్యూస్‌టుడే:** లోక కల్యాణం కోసం రొంపిచర్లలో రాజుల కల్యాణ మండపం వద్ద గాయత్రి హోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. మాతాజీ, శ్రీరామశర్మ ఆచార్య జ్యోతి శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని రొంపిచర్ల గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు దంపతులు పాల్గొన్నారు.

# నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

వినుకొండ: జీవీ ఆంజనేయులుకు పుష్పగుచ్ఛం అందించిన డీఈవో రామారావు

## విద్యారంగ ప్రగతిలో కీలకపాత్ర పోషించండి

**వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యారంగ పురోగతిలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా కీలకపాత్ర పోషించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జిల్లా విద్యాధికారి పీవీజే రామారావుకు సూచించారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా రాష్ట్రం గర్వించే స్థాయిలో నిలిచేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, తదితర అంశాల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా జాతీయస్థాయిలో జిల్లాకు సముచిత స్థానం దక్కేలా ప్రోత్సహించాలన్నారు. ఆదివారం ఆయన వినుకొండ, చిలకలూరిపేటలోని నివాసాల్లో ప్రజాప్రతినిధులను మర్యాద పూర్వకంగా వేర్వేరుగా కలిశారు. వినుకొండ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే జీవీ సూచించగా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో కమిటీ ఏర్పాటు చేసి పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళ్తానని చెప్పారు. డీఈవో వెంట నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి బి.వి.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మరియరాజు, సీపీఎస్ ఉపాధ్యాయుల కన్వీనర్ గద్దె రామకోటేశ్వరరావు, ఎన్‌టీఏ సీనియర్ నాయకులు నెట్టెం రాజాచౌదరి, హైస్కూల్ హెచ్‌ఎం వరప్రసాద్ తదితరులు ఉన్నారు. చిలకలూరిపేటలో ఎంఈవో సత్యనారాయణసింగ్ పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని జమీందార్ ఫంక్షన్‌హాల్ ఎదురు సందులో కొందరు చెత్తను డ్రెయినేజీలో పడేస్తున్నారు. దీంతో మురుగుపారడం లేదు. దుర్వాసన వెదజల్లుతోంది. **- సుబ్బారావు స్థానికుడు**

✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి**

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? పట్టణంలోని 25వ వార్డులో బొందిలిపాలెంలోని చింతచెట్టు వద్ద పైపులైన్ లీకై రోడ్డుపై నీళ్లు పారుతున్నాయి. నీటి వృథాతో పాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- ఉదయ్**

✔ పరిశీలించి పైపులైన్ మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **- అన్సర్, పురపాలక సంఘ ఏఈ** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

## ఇక గుంతల్లేని రహదారులు

**న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల, వినుకొండ**

రొంపిచర్ల వద్ద రహదారిపై గుంతలకు తారు వేశారిలా..

**గుం**తల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రహదారులకు మహర్దశ పడుతోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకూ పెద్దపీట వేస్తోంది. గత వైకాపా పాలనలో రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకోలేదు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశల వారీగా రహదారులను అభివృద్ధి చేస్తోంది. గతేడాది తొలుత ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. గోతులు పూడ్చి తారు వేశారు. ఇటీవల తుపాను, భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మెయింటెనెన్స్ నిధులతో మరమ్మతుల పనులు ప్రారంభించారు. రొంపిచర్ల మండల పరిధిలో అన్నవరం నుంచి ముప్పాళ్ల వరకు, అల్లూరివారిపాలెం నుంచి అచ్చయ్యపాలెం వరకు, తురిమెళ్ల నుంచి బొగ్గరం వరకు, విప్పర్లపల్లి నుంచి సుబ్బయ్యపాలెం సమీపంలోని రాష్ట్రీయ రహదారి జంక్షన్ వరకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రూ.10లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏఈ రవీంద్రబాబు తెలిపారు.

✦ వినుకొండ నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి పీఆర్‌ఆర్ ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. బాగా దెబ్బతిన్న ఆరు రోడ్లకు రూ.8.61 కోట్లు కేటాయించారు. ఇందులో వినుకొండ, కొప్పెరపాడు ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి చినకంచర్ల వరకు వయా పెదకంచర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు కేటాయించారు. ఇదే మండలంలోని మారుమూల గ్రామం గణేషునిపాలెం వయా రామలింగాపురం రోడ్డును రూ.2.06 కోట్లుతో నిర్మించనున్నారు. తారు లేచి రూపం కోల్పోయిన పెరుమాళ్లపల్లె వయా గోనుగుంట్లవారిపాలెం రహదారికి రూ.1.16 కోట్లు కేటాయించారు. శావల్యాపురం మండలం వేల్పూరు పంచాయతీ శివారు గ్రామం వెలమవారిపాలెం రోడ్డుకు రూ.32 లక్షలు కేటాయించగా ఈ మొత్తం చాలదని అధికారులు తెలిపారు. సుమారు 2.62 కి.మీలలో ఎక్కువ భాగం దెబ్బతిందని తెలిపారు. కొప్పెరపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నూజండ్ల మండలం జంగాలపల్లె వరకు రూ.2.24కోట్లు కేటాయించారు. బొల్లాపల్లి మండలం పోలాయిపాలెంలో 1.670 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.73లక్షలు మంజూరు చేశారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతారని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గుంతలు పూడ్చి ఒక లేయర్ తారు వేస్తారని చెప్పారు.

## షాట్‌పుట్‌లో మెరిసిన సిరి

**నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే:** విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజ్ఞాన్ బాల మహోత్సవ్ జోనల్ పోటీల్లో పట్టణానికి చెందిన కేరిడ్జ్ పాఠశాల విద్యార్థిని ఎ.సిరిచందన అండర్-14 షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపల్ జి.బర్నబాస్ ఆదివారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటనేని నాసరయ్య, పీఈటీ సురేంద్ర, భవాని, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ తదితరులు అభినందించారు.

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

## సీఎం సహాయనిధితో నాణ్యమైన వైద్యం

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** ముఖ్యమంత్రి సహాయనిధితో నాణ్యమైన వైద్యం అందించి పేదల ప్రాణాలు నిలబడుతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానికంగా తన నివాసంలో ఏర్పాటైన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న 10వ వార్డుకు చెందిన గోసెయ్యకు రూ.5లక్షలు, 34వ వార్డుకు చెందిన వాంకడవత్ బాల కోటమ్మబాయికి రూ.70వేల విలువైన ఎల్‌వోసీలను వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అందించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన మందిర ప్రతిష్ఠ వేడుకలు

భక్తి గీతాలు ఆలపిస్తున్న విశ్వాసులు

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలో 113 ఏళ్ల నాటి పురాతన మేరీకర్ల్స్ సెంటినరీ బాప్టిస్టు చర్చి పునర్నిర్మాణం తర్వాత మూడ్రోజులుగా నిర్వహించిన ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. కోల్‌కతాకు చెందిన బైబిల్ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ సుబతోశేఖర్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా చర్చి సంఘం అధ్యక్షుడు బొమ్మ బాబూరావు మాట్లాడుతూ 2015లో చర్చి పునర్నిర్మాణం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కొవిడ్ కారణంగా మధ్యలో పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో మందిరం నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రతిష్ఠ చేపట్టినట్లు వివరించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ మున్నంగి ఎలీషా తదితరులు పర్యవేక్షించారు.

## పూర్వ విద్యార్థుల స్వర్ణ సంబరం

గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** చిలకలూరిపేట ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూలులో 50 సంవత్సరాల క్రితం పదో తరగతి చదువుకుని రాష్ట్రంతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సందడి చేశారు. ఒరేయ్.. ఎలా ఉన్నావురా.. ఎక్కడ ఉంటున్నావు.. ఏం చేస్తున్నావు.. పిల్లల బాగోగులు ఇలా ఒకరినొకరు పలకరించుకుంటూ ఉత్సాహంగా, ఆనందంగా తమ బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. ఆప్యాయంగా ఒకరినొకరు కౌగిలించుకుని చదువుకున్న తరగతి గదుల్లో చిన్ననాటి ముచ్చటలు చెప్పుకుని మైమరిచి పోయారు. అప్పటి గుర్తులు ఎస్‌వీబీ దూళిపాళ్ల కాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కందిమళ్ల రాంబాబు (అమెరికా), కందిమళ్ల కృష్ణమూర్తి (యూనియన్ బ్యాంక్ ఏజీఎం), నాగరాజు చంద్రశేఖరరావు (వైజాగ్ స్టీల్ ఏజీఎం), రత్నకుమారి (యూనియన్‌బ్యాంక్ ఏజీఎం), బి.వి.రమణ, మహ్మద్‌మియా తదితరులు పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ప్రసాద్ వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, చిటిపోటు పట్టాభి రామారావు, ఎస్.వెంకటసుబ్బారావు, చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, కార్యదర్శి మైలవరపు శివానందకుమార్, ఉపాధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం సంతోషంగా విందు ఆరగించారు.

## బస్సు సౌకర్యం కల్పించరూ!

**నూజండ్ల, న్యూస్‌టుడే:** విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మార్కెట్ యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణ, తలార్లపల్లి, త్రిపురాపురం పంచాయతీ నేతలు వినుకొండ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. వినుకొండ నుంచి జంగాలపల్లి, మదమంచిపాడు దేవస్థానం, కొత్త, పాత త్రిపురాపురాలు, గొల్లపాలెం, తలార్లపల్లె, దాట్లవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా నూజండ్ల వరకు బస్సు నడపాలన్నారు. త్వరలో బస్సు సర్వీస్ ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కుంటా కోటిరెడ్డి, గుడిపూడి ఏసురత్నం, ఆళ్ల గురవారెడ్డి, కేశవరెడ్డి, యలమంద తదితరులున్నారు.

## పసుమర్రులో సందడిగా సెమీక్రిస్మస్

వేడుకల్లో డాక్టర్ అమృతవల్లి, సుబ్బారావు తదితరులు

**పసుమర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే :** మండలంలోని పసుమర్రు గ్రామంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుస్తులు, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నోడల్ అధికారి అమృతవల్లి, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ వంశీకృష్ణ, హనుమంతరావు, సిబ్బంది వాసుదేవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే:** సమాజంలో శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్ల నేరాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నడుచుకోవాలని సూచించారు. అల్లర్లు, దాడులకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిపై కేసులు ఎత్తివేసే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, ఎస్సై కిషోర్ తదితరులున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ హనుమంతరావు

## అక్రమం కనిపించదా?

**జి**ల్లా కేంద్రం నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఆవులసత్రం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో నిత్యం వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుపై దృష్టిపెట్టిన అధికారులు ఈ ప్రాంతంలో మాత్రం ఆక్రమణలు తొలగించటం లేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఓ వైపు బార్, దుకాణాలు, మరో వైపు వైద్యశాలలు ఉండటంతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటోంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని టీపీవో సాంబయ్య దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆ ప్రాంతంలో ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

## పూడిక తీయక.. మురుగు పారక..

**న**రసరావుపేట పట్టణంలో డ్రెయినేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల నెలల తరబడి కాలువల్లో పూడిక తీయడం లేదు. అంతేకాక చాలామంది వ్యర్థాలు కాలువలో పడేస్తున్నారు. నరసరావుపేట వినుకొండ పైవంతెన కింద శ్రీ సుందర రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణ గుడి ఎదుట డ్రెయినేజీ నిండి మురుగు రోడ్డుపై పారుతోంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మురుగు నీటిలో నడవాల్సి వస్తోందని పాదచారులు, స్థానికులు వాపోతున్నారు. దీనిపై పారిశుద్ధ్య అధికారిణి రమాదేవిని సంప్రదించగా సిబ్బందిని పంపి వెంటనే కాలువల్లో పూడిక తీయిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

## తవ్వారు.. మరమ్మతులు మరిచారు!

**గుం**టూరు - వినుకొండ జాతీయ రహదారిపై నరసరావుపేట డంపింగ్ యార్డ్ సమీపంలో మరమ్మతులు చేసేందుకు అధికారులు అక్కడక్కడ పికిలింగ్ (తవ్వి) చేసి వదిలేశారు. దీంతో గత 25 రోజులుగా ఈ మార్గంలో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారుజామున మంచు భారీగా కురిసిన సమయంలో రహదారిపై తీసిన గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జాతీయ రహదారి ఏఈ నవాజ్ షరీఫ్‌ను వివరణ అడగ్గా ఆ ప్రాంతంలో రోడ్డు మెత్తగా మారడంతో మరమ్మతులు చేసేందుకు తవ్వామని నాలుగైదు రోజుల్లో పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్

## మలుపు.. పొంచిన ముప్పు

**శా**వల్యాపురం - కారుమంచి మార్గంలో పొలిమేర వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. తొమ్మిది గ్రామాలకు చెందిన ప్రజలు శావల్యాపురం, వినుకొండకు ఈ మార్గంలో రాకపోకలు చేస్తుంటారు. జిల్లా కేంద్రం నరసరావుపేట వెళ్లడానికీ ఇదే అనువుగా ఉంటుంది. ముఖ్యంగా బొందిలిపాలెం, శానంపూడి, ముండ్రువారిపాలెంకు చెందిన విద్యార్థులు ప్రతి రోజు శావల్యాపురం జడ్పీ పాఠశాలకు ఆటోలు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వస్తుంటారు. మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్సై లేళ్ల లోకేశ్వరరావును వివరణ కోరగా మలుపు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, శావల్యాపురం

కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

## 22న హిందూ సమ్మేళనం

**వినుకొండ:** పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీ మైదానంలో ఈనెల 22న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. గుంటి ఆంజనేయస్వామి గుడిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు పెద్దలు పాల్గొని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఇతర మతాలను గౌరవిస్తూ హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్న సందేశాన్ని సమ్మేళనాల ద్వారా ప్రజల్లోకి పంపించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహణ సమితి అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని 32 వార్డుల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సమ్మేళనం కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో కార్యక్రమ నిర్వహణ కమిటీ కార్యదర్శి కోట ప్రకాష్‌బాబు, ఉపాధ్యక్షుడు బి.రవికుమార్, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు బంగారయ్య, గజవల్లి పవన్ పాల్గొన్నారు.

## ప్రమాదమని తెలిసి.. పరిమితికి మించి..

**ఆ**దమరిస్తే ప్రాణాలకే ప్రమాదమని, తెలిసినా అవేమీ పట్టనట్లు ప్రయాణికులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో శానంపూడి, బొందిలిపాలెం, కనమర్లపూడి తదితర గ్రామాల నుంచి శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రతి రోజూ విద్యార్థులు ఆటోలో వస్తున్నారు. పరిమితికి మించి ఎక్కడమే కాక ఆటో వెనుక నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. శావల్యాపురం-కారుమంచి మార్గంలో పలు ప్రమాదకరమైన మలుపులు, అక్కడక్కడ గుంతలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ప్రయాణాలు నిరోధించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులు, విద్యార్థులను తీసుకొచ్చే ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అయినా వినకుంటే తగిన చర్యలు చేపడతామని ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు. ఉదయం సమయంలో పాఠశాలకు వచ్చే ఆటోలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. – న్యూస్‌టుడే, శావల్యాపురం

## రక్షణ కరవైన ప్రయాణం

గోడలు కూలి ప్రమాదకరంగా వంతెన

**మం**డలంలో కొప్పుకొండ పరిధిలో ఎన్నెస్పీ కాలువపై ఉన్న వంతెన రెండు వైపులా రక్షణ గోడలు కూలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం సాగర్ కాలువ తవ్విన సమయంలో ఏర్పాటు చేసిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ దారిలో నిత్యం కొప్పుకొండ, తండా మరో నాలుగు గ్రామాల ప్రజలు వెళ్తుంటారు. ఈ వంతెన వద్ద రోడ్డు 'యు' ఆకారంలో ఉండటంతో రాత్రివేళ కొత్తవారు వస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కనీసం రక్షణ గోడ ఉన్నా వంతెన ఉన్న సంగతి తెలుస్తుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి కాలువపై గోడ ఏర్పాటు చేయాలని ఈ మార్గంలో తిరిగే ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ శ్రీనివాసరావును సంప్రదించగా ఎన్నెస్పీ కాలువపై ఉన్నందున ప్రస్తుతం ప్రతిపాదనలు తయారు చేసి అనుమతులు రాగానే వేసవిలో నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

## 16న టిడ్కో గృహ లబ్ధిదారుల సమావేశం

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే:** టిడ్కో గృహ సముదాయంలో మంగళవారం జరగనున్న లబ్ధిదారుల సమావేశాన్ని విజయవంతం చేయాలని పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట రాజారమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పురపాలక సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో మొదటి ఫేజ్ కింద 4512 గృహాలను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారన్నారు. వైకాపా ప్రభుత్వంలో టిడ్కో గృహాలను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిలకలూరిపేట టిడ్కో గృహ సముదాయాన్ని ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆలోచన చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా వీధి దీపాలు, రవాణా సౌకర్యం, పాఠశాల, వైద్యశాల ఏర్పాటుపై దృష్టిసారించారన్నారు. లబ్ధిదారులంతా గృహాల్లో చేరితే మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రెండో ఫేజ్‌లో 1008 గృహాల నిర్మాణం జరుగుతుందన్నారు.

## అయిదుగురు జూదరుల అరెస్టు

**వేలూరు(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే :** మండలంలోని వేలూరులో కోతముక్క ఆడుతున్న అయిదుగురిని ఆదివారం పట్టుకుని అరెస్టు చేసినట్లు గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.15,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పీఎస్ఐ ఆర్.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్తు మోటారు చోరీ

**బొందిలిపాలెం(శావల్యాపురం), న్యూస్‌టుడే :** చేపల చెరువు వద్ద నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు మోటారు చోరీకి గురైన సంఘటన మండలంలోని బొందిలిపాలెంలో చోటు చేసుకుంది. పందివాగు సమీపంలో చేపల చెరువు వద్ద ఉన్న విద్యుత్తు మోటారును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు నిర్వాహకుడు జొరిగె ఈశ్వరయ్య పేర్కొన్నారు.

## పడిగాపులు.. ఉరుకులు పరుగులు

**న**రసరావుపేట బస్టాండ్ ప్రతిరోజూ సాయంత్రమైతే చాలు ప్రయాణికుల పడిగాపులు, ఉరుకులు.. పరుగులు. రణగొణ ధ్వనులతో నిండిపోతోంది. విద్యా సంస్థల నుండి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, జనంతో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడుతోంది. సెలవు రోజులైతే పరిమిత బస్సులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కడంతో కనీసం కండక్టర్ నిలబడేందుకు కూడా జాగా దొరకడం లేదు. ఇది నిత్యకృత్యంగా మారిందని, ప్రయాణికులకు చాలినన్ని బస్సులు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై డిపో మేనేజర్ శ్రీనివాసరావును అడగ్గా ప్రయాణికుల ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

బస్సు ఎక్కేందుకు గుమిగూడిన ప్రయాణికులు

## బాలోత్సవ దాతలకు సత్కారం

దాతలతో కమిటీ నేతలు

**నరసరావుపేట అర్బన్:** జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన 3వ పిల్లల పండగ బాలోత్సవం నిర్వహణకు సహకరించిన దాతలను కమిటీ నేతలు సత్కరించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రెండ్రోజుల్లో పదివేల మంది విద్యార్థులు 69 అంశాల్లో పోటీ పడి ప్రతిభను చాటారన్నారు. అంతరించిపోతున్న కళలు, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు బృహత్ కార్యక్రమం నిర్వహించామని కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు ఎంఎస్ఆర్కే ప్రసాద్, బాధ్యులు భాగేశ్వరి, మహమ్మద్ గౌస్, అంజిరెడ్డి వేదిక అందించిన కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవకులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

చిలకలూరిపేట చేరిన సైకిల్‌యాత్ర

సైకిల్ యాత్ర చేస్తున్న నాగేశ్వరరావుకు సంఘీభావం

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** మీ సేవ సిబ్బందికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ ఇ (మీ)సేవ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగేశ్వరరావు కోరారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 7న తిరుపతిలో ప్రారంభించిన సైకిల్ యాత్ర ఆదివారం చిలకలూరిపేట చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేశ్ గతంలో యువగళం పాదయాత్ర చేసిన సందర్భంలో మీ సేవకులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అమరావతిలో సచివాలయం వద్ద సైకిల్‌యాత్ర ముగించుకుని అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు దుర్గాప్రసాద్, ఎం.పవన్, ఎస్కే యూనస్, సువర్ణ తదితరులు ఆయనకు సంఘీభావం ప్రకటించారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము-కడప, 5వ అంతస్తు, స్టాండర్డ్ భవనము, బొమ్మిడాల కాంప్లెక్స్, కలెక్టరేట్ దగ్గర, గుంటూరు-522004. ఫోన్: 9502391097, 73884 33176
టెండర్ల ఆహ్వానం కొరకు సంక్షిప్త ప్రకటన
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా "నరసరావుపేట బ్రాంచి" ఇంటీరియర్స్ ప్రతిపాదిత ఫర్నీషింగ్ వర్క్ కోసం అర్హతగల బిడ్డర్ల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నది. టెండర్లను ఆహ్వానిస్తున్న వివరణాత్మక ప్రకటన కోసం వెబ్‌సైట్ https://www.centralbankofindia.bank.in /en/active-tender AND/OR on https://centralbank.abcprocure.com/EPROC/ ని సందర్శించండి.
టెండర్ల సమర్పణకు చివరి తేది: 28-12-2025 మధ్యాహ్నం 3.30 గం.ల వరకు.
రీజనల్ హెడ్, రీజనల్ ఆఫీస్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కడప.
సంప్రదించవలసిన వ్యక్తి: 1) వి.భాస్కరుడు, సీనియర్ మేనేజర్, మొబైల్: 9502391097
2) రాకేష్ రంజన్, ఛీఫ్ మేనేజర్, మొబైల్: 73884 33176

(c) eenadu

# సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

## 17 నుంచి ధనుర్మాసోత్సవాలు

నరసింహస్వామి

గురజాల (గ్రామీణ), న్యూస్‌టుడే: జంగమహేశ్వరపురంలోని పల్నాటి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి ధనుర్మాసోత్సవాలు జరగనున్నట్లు ఆలయ పండితులు వేణుగోపాలాచార్యులు తెలిపారు. నెలరోజులు స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ముక్కోటి ఏకాదశి, భోగి, సంక్రాంతి రోజు ప్రత్యేక వాహనాలపై స్వామిని దర్శించుకునే అవకాశం భక్తులకు కల్పిస్తామన్నారు.

## తండాలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

పిచ్చిచెట్లు తొలగిస్తున్న వలంటీర్లు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: ఏపీఆర్‌డీసీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామం బ్రహ్మానందపురం తండాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా శిబిరం ఆదివారం ముగిసింది. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామాభివృద్ధి, సామాజిక చైతన్యం లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ షేక్ మొహమ్మద్ బాషా ఆధ్వర్యంలో తండాలో కలువల శుభ్రం, పిచ్చిమొక్కల తొలగింపు, పరిసరాల శుభ్రత, సర్వే తదితర కార్యక్రమాలు చేపట్టారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గురజాల బైపాస్‌లోని మలుపుల వద్ద విద్యుత్తు బల్బులు వెలగడం లేదు. రాత్రివేళ మలుపు కనిపించక, ప్రమాదాలు జరుగుతున్నాయి. - శ్రీనివాసరావు, గురజాల ✔ మలుపుల వద్ద విద్యుత్తు బల్బులు వెలిగేలా చూస్తాం. - ప్రకాష్, ఏఈ

? గురజాలలోని దండిగాస్టు వద్ద రాత్రివేళ చీకటిగా ఉంది. వంతెనపై ఇరువైపులా వాకింగ్ ట్రాక్‌పై గోతులు ఉన్నాయి. - మల్లేశ్వరి, గురజాల ✔ దండిగాస్టు వద్ద దీపాలు ఏర్పాటు చేస్తాం. నడక మార్గాన్ని బాగు చేయిస్తాం. - శివన్నారాయణరావు, కమిషనరు - న్యూస్‌టుడే, గురజాల

? గ్రామం నుంచి మాచర్ల వెళ్లే రహదారి వెంట చెత్తవేదాలు వేస్తున్నారు. దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. - సుబ్బయ్య, రచ్చమల్లపాడు ✔ అక్కడ్నుంచి చెత్తను దూరం తొలగిస్తాం. - ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

? గ్రామంలోని మసీదు బజారులో మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. ఇళ్ల ముందు నీరు చేరుతోంది. దోమల బెడద పెరుగుతోంది. - పట్లవీడు గ్రామస్థులు ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి, కాలువల్లో పూడిక తీయిస్తాం. - చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, దాచేపల్లి

? అమరావతిలోని పెట్లం మాలపల్లెలో మురుగు కదలక ఎక్కడికక్కడే నిల్వ చేరి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - సురేష్, కాలనీ వాసి ✔ కాలువల్లో పూడిక తీయించి, మురుగు లేకుండా చర్యలు తీసుకుంటాం. - నాగరాజు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, అమరావతి ? కారంపూడిలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. జనంపై దాడి చేస్తున్నాయి. - అంజనేయులు, కారంపూడి ✔ త్వరలో కోతులను పట్టించి, అటవీ ప్రాంతంలో విడిచి పెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - కశ్యానాయక్, కార్యదర్శి - న్యూస్‌టుడే, కారంపూడి

## గ్రామీణ రహదారులకు మహర్దశ

### రూ.35.5 కోట్ల నిధులు మంజూరు

75త్యాళ్లూరు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో పల్లెపండగ 1.0లో భాగంగా రూ.10 కోట్లతో పలు రహదారులను బాగు చేయించారు. మిగిలిన రహదారుల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.21.5 కోట్లు, డీఎంఎఫ్ (మైనింగ్ ఫండ్స్) ద్వారా రూ.3.70 కోట్లు, పీఆర్‌ఆర్ కింద రూ.4.50 కోట్లు, జడ్పీ నిధులు రూ.1.5 కోట్లు, పీఎంయూ రూ.3.5 కోట్లు.. మొత్తం రూ.35.5 కోట్లు మంజూరైంది. దీంతో నియోజకవర్గంలోని రహదారుల రూపురేఖలు మారనున్నాయి.

★ 75త్యాళ్లూరు గ్రామం నుంచి తమ్మవరం మీదుగా అమరావతి-క్రోసూరు ప్రధాన రహదారి చేరుకునేందుకు 7.5 కిలోమీటర్లు గుంతలు పడి ప్రయాణం ప్రయాసగా మారింది. అడుగుకో గుంత పడి ఆ మార్గంలో ప్రయాణమంటే హడలిపోయే పరిస్థితి. ఈ రోడ్డు అభివృద్ధికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. త్వరలో పనులు

తమ్మవరం-75త్యాళ్లూరు రహదారి

చేపట్టి, ప్రయాణం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోనున్నారు.

★ బెల్లంకొండ మండలం మన్నెసుల్తాన్‌పాలెం నుంచి వెంకటాయపాలెం వరకు 10 కిలోమీటర్ల రోడ్డుకు రూ.5 కోట్లు, గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి రూ.4 కోట్లు, రామాంజనేయపురంలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.1.5 కోట్లు నిధులు కేటాయించారు. అయితే అటవీశాఖ అనుమతుల కోసం నిరీక్షిస్తున్నారు. మైనింగ్ ఫండ్స్ రూ.3.70 కోట్లతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు నిర్మించనున్నారు. అలాగే ఉంగుటూరు నుంచి కంభంపాడు, కేవీపాలెం నుంచి అంబడిపూడి వరకు రూ.3.5 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

## దస్త్రంలో కదలిక

### నిర్వాసితులకు ఊరట

మాచవరం, న్యూస్‌టుడే

వేమవరం ఎస్సీ కాలనీ

వేమవరం ఎస్సీ కాలనీవాసులకు త్వరలో శుభవార్త అందనుంది. ఇన్నాళ్లు పులిచింతల కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయిన జీవితాలకు ఉపశమనం లభించనుంది. నిర్వాసితులకు అందజేసే ప్రయోజనాల కోసం ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. నిధుల మంజూరుకు యత్నాలు జరుగుతున్నాయి. విజయవాడలోని సహాయ, పునరావాస కార్యాలయం అధికారులు సంబంధిత పనులపై దృష్టి సారించారు. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కారణంగా వేమవరం గ్రామం పాక్షికంగా ముంపునకు గురవుతోంది. ఇక్కడ మిగిలిన వర్గాలతోపాటు ఎస్సీ కాలనీ ముంపు పరిధిలోకి వెళ్లింది. అధికారులు అందరికీ పరిహారం అందజేసినా, పునరావాసం చూపడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఇప్పటికీ చాలామంది పులిచింతల కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కొందరికి ప్రయోజనాలతోపాటు, మరికొందరికీ వన్‌టైం సెటిల్‌మెంట్ అందాల్సి ఉంది. అయితే ఎస్సీ కాలనీలోని దాదాపు 120 మందికి అప్పట్లో వేమవరం పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు, ప్రయోజనాలు, పునరావాస కేంద్రంలో రోడ్లు, మంచినీరు, పాఠశాల, విద్యుత్తు సౌకర్యం, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టారు. మరో 74మందికి సాయం అందాల్సి ఉంది. 2020లో వీరికి పునరావాస కేంద్రం పక్కనే ఉన్న స్థలంలో ఇంటి పట్టాలు అందజేశారు. ఇంటి నిర్మాణానికి, వస్తువుల రవాణా, నిర్మాణ సమయంలో భృతి, వృత్తిదారు కూలీ వేతనాలు, ఇతర ప్రయోజనాలు ఇప్పటి వరకు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కాలనీవాసులు తమ సమస్యను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జిల్లా అధికారులు, విజయవాడలోని సహాయ, పునరావాస కమిషనర్‌తో మాట్లాడి సిఫార్సు లేఖ అందజేశారు. దాంతో నిధులు విడుదలకు, సంబంధిత దస్త్రంలో కదలిక మొదలైంది. రూ.2.01 కోట్లు విడుదల కానున్నట్లు సమాచారం.

## ఏపీ రెవెన్యూ సర్వీసెస్ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ బాధ్యులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ నూతన అధ్యక్షుడిగా క్రోసూరు తహసీల్దార్ వీవీ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బి.సుబ్బారావు (సీనియర్ సహాయకుడు, సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయం), ఉపాధ్యక్షులుగా ఎన్.ధనలక్ష్మి (పెదకూరపాడు తహసీల్దార్), రాజశేఖర్ (ఓఎస్, ఆర్డీవో కార్యాలయం), కార్యదర్శిగా డి.వెంకటేశ్ (జూనియర్ సహాయకుడు, ఆర్డీవో కార్యాలయం), సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్యామలత (డిప్యూటీ తహసీల్దార్, పెదకూరపాడు), కేవీ నరసింహారెడ్డి (సీనియర్ సహాయకుడు, ఆర్డీవో కార్యాలయం), కోశాధికారిగా ఎస్‌కే జానీ బాషా (డిప్యూటీ తహసీల్దార్, అచ్చంపేట), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా టి.హైమారావు (జేఏ, ముప్పాళ్ల), ఎన్.రత్నకుమార్ (జేఏ, అమరావతి), జిల్లా కౌన్సిలర్‌గా జి.అనిత (జేఏ, క్రోసూరు మండలం) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ముప్పాళ్ల తహసీల్దార్ నగేష్ వ్యవహరించారు.

## ఫ్యాక్షనిజం ప్రోత్సహిస్తే జైలుకే

రెంటచింతల, న్యూస్‌టుడే: మాచర్ల నియోజకవర్గంలో ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహిస్తే ఎంతటివాడికైనా చిప్పకూడే నని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని 8 గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. సుమారు రూ.2.60 కోట్లతో అంతర్గత సిమెంటు రహదారులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు, రూ.44 లక్షలతో జల్‌జీవన్ పనులకు శంకుస్థాపన చేశారు. రెంటాల ఆంజనేయస్వామి ఆలయం, మల్లవరం దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలు హత్య రాజకీయాలు, గ్రామాల్లో వైషమ్యాలు సృష్టించి పబ్బం గడుపుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో జల్‌జీవన్ పథకం ద్వారా 150 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి, ప్రతిఇంటికి సాగర్ జలాలు అందించటమే ధ్యేయమన్నారు. మాచర్లలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్నారు. సత్రశాల, రెంటాల, కారంపూడిలోని పురాతన ఆలయాల పునరుద్ధరణకు సుమారు రూ.7 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వరికపూడిశెల పనులు త్వరలో ఆరంభిస్తామన్నారు. మల్లవరం పేద రైతులు సాగుచేసుకుంటున్న సుమారు 300 ఎకరాలకు పాసుపుస్తకాలు ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరారు. నాయకులు హనిమిరెడ్డి, బ్రహ్మారెడ్డి, అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారావు, గురవారెడ్డి, ప్రభురాజు, బాలసైదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో పూలతో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి స్వాగతం

### మహిళలకు ప్రోత్సాహం ఇవ్వాలి

మాచర్ల (కారంపూడి): మహిళ అభ్యున్నతికి పీ4 విధానంలో స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సాహం ఇవ్వాలని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆదివారం కేసీపీ నేతృత్వంలో 40 మంది మహిళలకు కుట్టు, అల్లికల్లో శిక్షణతోపాటు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీపీ పరిశ్రమ ప్రజల అవసరాలు తీర్చేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, కమిషనర్ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

## 22న హిందూ సమ్మేళనం

వినుకొండ: పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీ మైదానంలో ఈనెల 22న హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. గుంటి ఆంజనేయస్వామి గుడిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు పెద్దలు పాల్గొని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఇతర మతాలను గౌరవిస్తూ హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్న సందేశాన్ని సమ్మేళనాల ద్వారా ప్రజల్లోకి పంపించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వహణ సమితి అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని 32 వార్డుల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సమ్మేళనం కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో కార్యక్రమ నిర్వహణ కమిటీ కార్యదర్శి కోట ప్రకాష్‌బాబు, ఉపాధ్యక్షుడు బి.రవికుమార్, వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు

## ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడి ఎన్నిక

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా చదలవాడ శ్రీరామ్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నాయకులు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్‌ప్రెసిడెంట్‌గా పి.బాలాజి, కార్యదర్శిగా షేక్ నజీర్, సహాయ కార్యదర్శిగా ఎస్.కె.ఇస్మాయిల్, కోశాధికారిగా గణేష్‌ను ఎన్నికయ్యారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

నిదానంపాటి అమ్మవారు

దుర్గి, న్యూస్‌టుడే: అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే అమ్మవారి సన్నిధికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి బిందె తీర్థం, అభిషేకాలు, నక్షత్రహారతి, చండీహోమం, పల్లకిసేవ, గోపూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

## సుందరకాండ పారాయణం

75త్యాళ్లూరు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: 75త్యాళ్లూరు అవధూత అయోధ్యస్వామి ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అంజన్న విగ్రహానికి అభిషేకం నిర్వహించి తమలపాకులు సమర్పించారు. భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. విష్ణువర్ధన్‌రెడ్డి సుందరకాండ పారాయణం భక్తుల్ని ఆకట్టుకుంది. ఆశ్రమ నిర్వాహకులు కోటేశ్వరమ్మ, రామకృష్ణ, రామకోటిరెడ్డి, శివ, నాగేశ్వరరావు, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏ వాహనం ఎటొస్తుందో?

అడ్డదిడ్డంగా రాకపోకలు

రెండు జాతీయ రహదారులను కలిపే కూడలి కొండమోడు జంక్షన్. ఇది ప్రమాదాలకు నిలయంగా మారింది. దూరం నుంచి వచ్చే వాహనాలతోపాటు, సమీపంలోని ముగ్గురాయి క్వారీల నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లు కూడలిలో ప్రధాన రహదారిపైకి చేరుకోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పైగా గుంటూరు నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్లే వాహనాలు రహదారిని క్రాస్ చేసే సమయంలో, నరసరావుపేట వైపు నుంచి బస్సు దిగిన ప్రయాణికులు క్రోసూరు, రాజుపాలెం వెళ్లేందుకు రోడ్డు దాటే క్రమంలోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ఆటోవాలాలు, లారీలు, ఇతర వాహనాలు జంక్షన్‌లో అడ్డదిడ్డంగా నడుపుతున్నారు. కూడలిలో సిగ్నల్‌తోపాటు బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్సై మణికృష్ణ మాట్లాడుతూ అక్కడ సమస్యను పరిశీలించి, అవసరమైతే సిబ్బందిని నియమిస్తామన్నారు.

- కొండమోడు(రాజుపాలెం), న్యూస్‌టుడే

## రెయిలింగ్ విరిగినా.. పట్టించుకోరే

అమరావతిలోని ప్రధాన వీధిలో పర్యాటకుల కోసం నడక మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ పలుచోట్ల తుప్పు పట్టి విరిగిపోయింది. కాలచక్ర మ్యూజియం, అమరేశ్వరాలయం సమీపంలో పూర్తిగా పడిపోయింది. నెలలు గడిచినా పట్టించుకునే వారేలేరు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- అమరావతి, న్యూస్‌టుడే

## హెచ్చరిక బోర్డులు ఏవీ?

కొండమోడు-సత్తెనపల్లి మార్గంలో బెల్లంకొండ బ్రాంచి కాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ దెబ్బతింది. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాజుపాలెం

## ఆశ్రమాల్లో అన్నదానం

అన్నదానం చేస్తున్న తెలుగు మహిళా విభాగం బాధ్యులు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు ఫణీంద్ర జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమం, పరివర్తన ఆశ్రమాల్లో ఆదివారం తెదేపా నాయకులు అన్నదానం, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. - సత్తెనపల్లి, న్యూస్‌టుడే

## హక్కుల సాధనకు పోరాడాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మోహనరావు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: హక్కుల సాధనకు ప్రైవేట్ పాఠశాలల యజమానులు కలిసి పోరాడాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వికాస్ పాఠశాలలో అప్స డెమోక్రటిక్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఎం.వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని చెప్పారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడిగా వంగా సతీష్‌రెడ్డి, సెక్రటరీగా గంధం శ్యామ్‌కుమార్, జిల్లా కోశాధికారిగా రామయ్యను ఎన్నుకున్నారు.

## 17న పింఛనుదారుల దినోత్సవం

అమరావతి, న్యూస్‌టుడే: ఈ నెల 17న అమరావతిలోని పెన్షనర్స్ కార్యాలయంలో పింఛనుదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తెలిపారు. 75 ఏళ్లు నిండిన పింఛనుదారులను సన్మానిస్తామన్నారు. యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని వారు తెలిపారు.

## ఉమ్రా యాత్రకు పయనం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్లకు చెందిన 13 మంది ఉమ్రా యాత్రకు బయలు దేరారు. ఈ సందర్భంగా స్థానిక షాదీఖానా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## అపూర్వ సమ్మేళనం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు జడ్పీ పాఠశాలకు చెందిన 2013-14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదేళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు డి.బాబూరావు, బి.తులసి సౌజన్య తదితరులను సత్కరించారు. పాఠశాలకు మైక్, వాటర్ ట్యాంకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు.


పెదమక్కెన జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

క్రోసూరులో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

### మూడు దశాబ్దాల తర్వాత..

సత్తెనపల్లి: మూడు దశాబ్దాల తర్వాత చదువులమ్మ ఒడిలో మళ్లీ కలిశారు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాల్యం, పాఠశాల చదువు, స్నేహాలు, క్రీడల్లో ప్రతిభ, ఉపాధ్యాయుల దండన వంటి మధుర స్మృతులను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాలకు రూ.50 వేలు విలువచేసే సామగ్రిని అందజేశారు. సమ్మేళనానికి కోఆర్డినేటర్లుగా అనితాజ్యోతి, వెంకటరమణ వ్యవహరించారు. సర్పంచి అన్నపూర్ణసాంబశివరావు, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుక

కేకు కోస్తున్న తెదేపా నాయకులు, పాస్టర్ తదితరులు

వేల్పూరు(అచ్చంపేట),: మండలంలోని వేల్పూరు లూథరన్ చర్చి వద్ద సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సర్పంచి శంకర్, గోవిందరావు, పాస్టర్ రవికుమార్, ఉపాధ్యాయులు సుందరరావు, సంస్థ డైరెక్టర్ వినయ్‌కుమార్, లక్ష్మణబాబు, న్యాయవాది పాపారావు తదితరులు కేక్ కోశారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ పండగను ఆహ్వానించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వీరయ్య, సుజాత నేతృత్వంలో చిన్నారులు క్రీస్తు జననం నాటిక ప్రదర్శించారు.

దుప్పట్లు పంపిణీ.. ఎస్.మణి ట్రస్టు ఆధ్వర్యంలో వేల్పూరులో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు ఎస్.రాజారావు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. అంబేడ్కర్ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి చంద్రయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు మృతి

పిచ్చయ్య

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విధులు నిర్వర్తించి ఇంటికి చేరుకున్నాక, రాత్రిపూట గుండె నొప్పితో హోంగార్డు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బొదిలవీడు గ్రామానికి చెందిన పిచ్చయ్య (55) వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నారు. శనివారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గుండెలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పగా.. ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిచ్చయ్య మృతదేహాన్ని సందర్శించి పోలీసులు నివాళులు అర్పించారు.

### ట్రాక్టర్, బైకు ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బతుకు తెరువుకు ఇతరప్రాంతానికి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా పామూరు నుంచి తెలంగాణలోని ఆర్మూర్‌కు ఉపాధి నిమిత్తం నర్సింహులు అనే వ్యక్తి బైక్‌పై బయలుదేరాడు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారులోకి రాగానే, శిరిగిరిపాడు వైపు వెళ్తున్న వరిగడ్డి ట్రాక్టరు ఢీకొంది. దీంతో నర్సింహులు తలకు బలమైన గాయాలయ్యాయి. కాలు విరిగింది. క్షతగాత్రుడ్ని మాచర్ల ఆసుపత్రికి తరలించారు.

## బియ్యం లారీ బోల్తా

రెంటచింతల, న్యూస్‌టుడే: అనంతపురం నుంచి మిర్యాలగూడెం వెళుతున్న బియ్యం లోడు లారీ ఆదివారం తెల్లవారుజామున పాలువాయి జంక్షన్‌లో బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 10 క్వింటాళ్ల బియ్యం రోడ్డుపాలైంది. పోలీసులు కేసు పరిశీలిస్తున్నారు.

## బాలోత్సవ దాతలకు సత్కారం

నరసరావుపేట అర్బన్: జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన 3వ పిల్లల పండగ బాలోత్సవం నిర్వహణకు సహకరించిన దాతలను కమిటీ నేతలు సత్కరించారు. ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలకు ధన్యవాదాలు తెలిపారు. రెండ్రోజుల్లో పదివేల మంది విద్యార్థులు 69 అంశాల్లో పోటీ పడి ప్రతిభను చాటారన్నారు. అంతరించిపోతున్న కళలు, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రోత్సహించేందుకు బృహత్ కార్యక్రమం నిర్వహించామని కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు ఎంఎస్‌ఆర్కే ప్రసాద్, బాధ్యులు భాగేశ్వరి, మహమ్మద్ గౌస్, అంజిరెడ్డి వేదిక అందించిన కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లీ చెట్టుకింద చదువులు

శివాలయం ఏరియా (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే

గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల భవన నిర్మాణాలు చేపట్టింది. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో విద్యార్థులకు చెట్ల కింద తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. పట్టణంలోని లెనిన్‌నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, కరాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలల గదుల్లో నిర్వహిస్తున్నారు. తరగతి గదుల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

### ఒకే ఆవరణలో రెండు

పిడుగురాళ్ల లెనిన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 400 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 2017లో ఏర్పాటు చేశారు. జడ్పీ పాఠశాలకు మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. నాడు-నేడు కార్యక్రమంలో రెండస్తుల భవన నిర్మాణం చేపట్టారు. గదుల్లో ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, విద్యుత్తు పనులు చేపట్టకుండా వదిలేశారు. దీంతో ప్రాథమిక పాఠశాల ఆవరణలోనే ఉన్నత పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారు. 300 మంది విద్యార్థులు ఉండగా.. అయిదు గదులు కేటాయించారు. గదులు చాలక వరండాల్లో, చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తి చేసి, విద్యార్థుల కష్టాలు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కరాలపాడులోనూ ఇదే పరిస్థితి. ఇక్కడి ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కూడా చెట్ల కిందనే తరగతులు నిర్వహిస్తున్నారు. నాడు -నేడు ద్వారా ఆరు గదులు మంజూరు కాగా.. మూడు గదుల నిర్మాణం జరిగింది. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

కరాలపాడులో చెట్టు కింద తరగతులు

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు

75త్యాళ్లూరు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నియోజకవర్గ సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 590తోపాటు గతంలో తీసుకొచ్చిన జీవోలు రద్దు చేయాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీపీపీ విధానం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్యం, విద్య దూరమవుతుందన్నారు.

(c) eenadu

## వై..వై.. వయ్యారి నేనే..!

సినీనటి శ్రీలీల రాజాంలో ఆదివారం తళుక్కున మెరిశారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేయడంతో ఈమెను చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. తెలుగులో మాట్లాడి అందర్నీ ఉత్సాహపరిచారు. వారితో స్వీయ చిత్రాలు దిగుతూ ఉల్లాసపరిచారు. నేపథ్య సంగీతానికి అభినయిస్తూ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. ఆమెను చూసి యువత కేరింతలు కొట్టారు. – న్యూస్‌టుడే, రాజాం

## వెంకన్న ఉత్సవాలకు వేళాయె

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో బి.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 14న గోదాదేవి కల్యాణంతో వేడుకలు ముగుస్తాయన్నారు. నెల రోజులపాటు ఉదయం వేంకటేశ్వరస్వామి, గోదాదేవి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పకీరు నాయుడు ఉన్నారు.

## సంగీత ఝురి.. తరగని నిధి

ఆహ్వానం పలుకుతోంది మహారాజా సంగీత, నృత్యకళాశాల..

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం.. ఆ పేరు చెబితేనే దేశ విదేశాల్లో ఠక్కున గుర్తొచ్చేది సంగీతం, సాహిత్యం. పూసపాటి రాజవంశీయులు కళలను ప్రోత్సహిస్తూ.. ఏర్పాటు చేసిన సంగీత, నృత్య కళాశాల వందేళ్లకు పైగా విరాజిల్లుతోంది.. వేల మందిని ప్రపంచానికి అందించింది.. ఇక్కడ విద్య నేర్చుకున్న వారు సినీ, సాహిత్య రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. ఈ విద్యానిలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఇటీవల ఎంపీ అప్పలనాయుడు సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారు.

### పదేళ్లు నిండితే చాలు..

సంగీతం, నృత్య కళాశాలలో చేరాలంటే.. ఏటా జులై, ఆగస్టు నెలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. జులై నాటికి పదేళ్లు నిండి చదవడం, రాయడం వస్తే చాలు దరఖాస్తుకు అర్హులు. ఆగస్టు దాటిన తర్వాత అయితే నామమాత్రపు అపరాధ రుసుముతో దరఖాస్తు చేయొచ్చు.

### తరగతుల సమయం

ప్రస్తుతం కళాశాలలో సర్టిఫికెటు, డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఇవి నాలుగేళ్లు, డిప్లొమా కోర్సు రెండేళ్లు. ● సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులైతే డిప్లొమాలో చేరడానికి అర్హులు. ● పీజీ సెట్ రాస్తే కళాశాలల్లో చేరి ఆయా కోర్సులు పూర్తి చేయొచ్చు. రోజూ ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

### ఇంకెక్కడెక్కడ ఉన్నాయి..

రాష్ట్రంలో విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులో ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ ప్రావీణ్యం పొందిన వారి ప్రదర్శనలకు పలు వేదికల్లో గుర్తింపు లభిస్తోంది. ఉపాధి పరంగా ఈ కోర్సులు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధకులుగా చేరే అవకాశం ఉంటుంది.

కళాశాల ఆవరణలో ఘంటసాల విగ్రహం

### కోర్సులు.. బోధకులు

- గాత్రం - ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, దేవి సుజాత నేర్పిస్తున్నారు.
- వీణ - శాస్త్రి
- వయోలిన్ - సురేష్‌కుమార్
- నాదస్వరం - ఎన్.గోపాలరావు
- డోలు - ఎ.శ్రీనివాసరావు
- మృదంగం: ఎన్.రాధాకృష్ణ
- భరతనాట్యం: డి.హిమబిందు

### దక్షిణ భారతంలోనే మొదటి కళాశాల

శతాబ్దానికి పైబడి చరిత్ర కలిగిన ఈ కళాశాలను 1910లో అప్పటి విజయరామ గజపతి ఏర్పాటు చేశారు. సౌతిండియాలోనే మొట్టమొదటిగా విజయనగరం కోటకు సమీపంలో పాఠశాలగా ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వ ఆధీనంలోని వెళ్లింది.

### ప్రముఖులకు తొలి అడుగులిక్కడే..

ప్రపంచ కీర్తినార్జించిన ప్రముఖులు సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, గాయని పి.సుశీల, సంగీత కళానిధి నేదుకూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యనారాయణ, సాలూరు రాజేశ్వరరావు, సాలూరి హనుమంరావు, ద్వారం వెంకటస్వామి నాయుడు, నరసింగరావు నాయుడు, వాసా కృష్ణమూర్తి ఇక్కడే ఓనమాలు దిద్దారు. ఇటీవల భరతనాట్యంలో దేశవిదేశాల్లో రాణిస్తున్న అన్నా నిహాథామస్ ఇక్కడే శిక్షణ పొందారు.

**భవిష్యత్తు తరాలకు అందించాలి..** సంగీత, నృత్య కళాశాలను నేటి యువత వినియోగించుకోవాలి. కళను నిలబెట్టేలా, సంస్కృతిని కాపాడేలా చూడాలి. ఇందులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో 505 మంది వివిధ కోర్సులు నేర్చుకుంటున్నారు.
– కె.శాస్త్రి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, మహారాజ సంగీత, నృత్య కళాశాల

సాధన చేస్తున్న విద్యార్థి

## ఈ రోజు మెనూ ఆకలి!

● భామిని గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

తల్లిదండ్రులతో ఆరుబయట ఉన్న విద్యార్థులు

భామినిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వంట గ్యాస్ మొరాయించడంతో ఆదివారం విద్యార్థులు ఆకలితో గడపాల్సి వచ్చింది. సెలవు దినం కావడంతో తమ పిల్లలను చూడడానికి వచ్చిన తల్లిదండ్రులు ఈ పరిస్థితిని చూసి చలించిపోయారు. మధ్యాహ్నం 12.30కు అందాల్సిన భోజనం 3 గంటలకు అందకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ప్రిన్సిపల్, గురుకుల పాఠశాల సిబ్బందికి మధ్య సమన్వయ లోపమే దీనికి కారణమని పలువురు అంటున్నారు. దీనిపై పాఠశాల ప్రిన్సిపల్ విజయనిర్మల వద్ద ప్రస్తావించగా రెగ్యులేటర్ మరమ్మతులకు గురైనా విద్యార్థులకు అల్పాహారం అందించామని, మెకానిక్ సరైన సమయానికి రాకపోవడంతో మధ్యాహ్నం భోజనం ఆలస్యమైందని వివరించారు. – న్యూస్‌టుడే, భామిని

ప్రిన్సిపల్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

## మీ పల్లె ప్రగతి.. మీకు తెలుసా?

పార్వతీపురం మన్యం జిల్లాలో.. ● మండలాలు: 15 ● పంచాయతీలు: 451 ● నివాసాలు: 2,13,755 ● జనాభా: 7,40,938

న్యూస్‌టుడే, పార్వతీపురం

మీ ఊరికి ప్రభుత్వం ఎంత నిధులు ఇచ్చింది.. ఆ మొత్తంతో ఏఏ పనులు చేశారు.. దేనికి ఎంత ఖర్చు చేశారో మీకు తెలుసా? నిజానికి ఈ వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నం చేసినా.. ఓ పట్టాన చెప్పే పరిస్థితి ఉండదు. అయితే నిరాశ చెందాల్సిన పని లేదు. మీ చేతిలోని చరవాణి ద్వారా మీ గ్రామ ఆర్థిక స్థితి, ప్రగతి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. అదెలాగో చూద్దామా..

### జనాభా ప్రాతిపదికన..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలను నిర్వహించడానికి ఏటా నిధులు కేటాయిస్తాయి. వీటిని పంచాయతీలో జనాభా ప్రాతిపదికన తలసరి లెక్కన విభజించి విడుదల చేస్తారు. ఈ మొత్తంతో ప్రజల అవసరాలు తీర్చేలా పనులు చేపట్టడం పంచాయతీ పాలకుల బాధ్యత. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు దీపాల ఏర్పాటు వంటి పనులకు వెచ్చించడం పరిపాటి.

### వివరాలన్నీ ఒకే యాప్‌లో..

- ఊరి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం 'గ్రామ స్వరాజ్' యాప్‌ను తీసుకొచ్చింది.
- మీ చరవాణిలోని ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీలను వరుసగా ఎంచుకోవాలి.
- తర్వాత 'అప్రూవ్ యాక్టివిటీస్'పై క్లిక్ చేస్తే పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పనులకు ఎంతెంత వెచ్చించారో తెలుసుకోవచ్చు.
- కొన్ని సందర్భాల్లో ఇందులో సమాచారం ఉండకపోవచ్చు. ఆ సమయంలో మళ్లీ వెనక్కి వచ్చి, 'ఫైనాన్షియల్ ప్రోగ్రెస్'ను తెరవాలి.
- ఇందులో ఆర్థిక సంవత్సరాన్ని ఎంపిక చేసుకుంటే.. పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి? ఏఏ పనులకు ఎంత ఖర్చు అయ్యింది? అనే సమాచారాన్ని బిల్లుల రూపంలో తెలుసుకోవచ్చు. మరెందుకు ఆలస్యం మీ ఊరి ప్రగతిని తెలుసుకోవడానికి 'గ్రామ స్వరాజ్' యాప్‌ను పరిశీలించండి.

నిధులెంత వచ్చాయి.. దేనికి ఖర్చు చేశారు

విజయనగరం జిల్లాలో.. ● మండలాలు: 27 ● పంచాయతీలు: 775 ● నివాసాలు: 5.5 లక్షలు ● జనాభా: 18 లక్షలు

## జలపాత హోయలు.. పర్యాటకుల సందడి

సాలూరు మండలంలోని శిఖపరువు, దళాయివలస జలపాతాలకు ఆదివారం సందర్శకులు క్యూ కట్టారు. కార్తికమాసం ప్రారంభమైన నాటినుంచి ఈ రెండు జలపాతాల వద్ద అధిక సంఖ్యలో సందర్శకులు హాజరవుతున్నారు. ఆదివారం కూడా అదే స్థాయిలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జలపాతాల వద్ద స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## నేడు వినతుల స్వీకరణ

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టరు కార్యాలయం సెల్లార్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో వినతులు స్వీకరించనున్నారు. దీంతోపాటు సంయుక్త కలెక్టరు యశ్వంత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమావేశ మందిరం-4లో రెవెన్యూ క్లినిక్ జరుగుతుంది. రెవెన్యూ శాఖ పరిష్కరించాల్సిన భూ సమస్యలు, వివాదాలను అక్కడే పరిశీలిస్తారు. సాధారణ వినతులను పీజీఆర్‌ఎస్ మందిరంలో స్వీకరించి పరిష్కారాన్ని చూపిస్తారు. వారంలో మిగిలిన అయిదు రోజుల్లో ఏర్పాటు చేసిన పీజీఆర్‌ఎస్ విభాగంలో యంత్రాంగం వినతులు స్వీకరించి, ఆయా శాఖలకు పరిష్కారం కోసం పంపిస్తారు.

## 24 నుంచి కందికొత్తల ఉత్సవాలు

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే కంది కొత్తల ఉత్సవాలను వేడుకగా నిర్వహించాలని పలు గిరిజన సంఘాల నాయకులు నాగభూషణరావు, శేఖర్, శంకరరావు, రమణ తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో ఉత్సవాలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తీర్మానం చేశారు. అనంతరం పలువురు అభిప్రాయాలను సేకరించారు.

## ప్రకృతి ఒడిలో ఆనందాల హరివిల్లు

సీతంపేట మన్యంలో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి వన భోజనాలు చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సందడి చేశారు. సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో పలు క్రీడలు, బోటింగ్, తదితరాలను సందర్శిస్తూ ఆనందంగా గడిపారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు. పలు ప్రాంతాల్లో పర్యాటకుల కోలాహలం కనిపించింది. ఎస్సై వై. అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, సీతంపేట

## ఉపాధి నిధులేగా.. పోతే పోనీ!

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వస్తు వినియోగ మొత్తం(మెటీరియల్ కాంపొనెంట్) నిధులు వినియోగానికి గడువు దగ్గర పడుతోంది. జిల్లా వ్యాప్తంగా వేతనదారులు చేసిన పనిని బట్టి వస్తు వినియోగ నిధులు వస్తాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మన్యం జిల్లాలో రూ.210 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉంది. 2026 మార్చి 31 నాటికి ఈ నిధులు ఖర్చు చేయకపోతే మురిగిపోయే నిధుల జాబితాలో చేరిపోతాయి. అంటే వృథాగా వెనక్కి వెళ్లిపోయినట్లే. – న్యూస్‌టుడే, పార్వతీపురం

పాలకొండలోని డెప్పిగూడలో రోడ్డు నిర్మాణానికి కంకరవేసి వదిలేసిన గుత్తేదారు

### గతేడాది రూ. 10 కోట్లు వెనక్కి..

2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా యంత్రాంగం పరుగులెత్తిస్తే.. రూ.204 కోట్లు విలువైన పనులు చేయగలిగారు. అప్పటికీ దాదాపు రూ.10 కోట్లకు పైగా వెనక్కి వెళ్లిపోయాయి. జిల్లాకు 2025-2026లో రూ.210 కోట్లు విలువైన పనులు చేపట్టాల్సి ఉంది. వీటితో బీటీ రోడ్లు, సీసీ రహదారులు, గోకులాలు, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చెక్‌డ్యాంల నిర్మాణం వంటి పనులు చేయొచ్చు. క్షేత్రస్థాయిలోనూ సమస్యలు బోలెడు ఉన్నాయి. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధి చూపడం లేదు. ఈ నిధులతో పనుల నిర్వహణకు సంబంధించి సమీక్షలు, సమావేశాలు ఏమీ నిర్వహించలేదు. ఇప్పటివరకు ఎనిమిదిన్నర నెలల్లో రూ.100 కోట్లు వరకు ఖర్చు చేయగలిగారు. మిగిలిన మూడున్నర నెలల్లో రూ.104 కోట్లు విలువైన పనులు చేయగలరా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంకా 80 వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో లక్ష్యం చేరగలమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### చొరవ చూపితేనే అభివృద్ధి

సవరించిన నిబంధనల ప్రకారం చెల్లింపుల్లో అడ్డంకులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఏదైనా పని విలువ రూ.50 లక్షలు దాటితే దానికి సంబంధించిన చెల్లింపులకు సాంకేతిక ఇబ్బంది వస్తోంది. మంజూరైన రహదారులు అన్నీ దాదాపుగా పెద్ద మొత్తంలో పనులే కావడం వల్ల పూర్తి చేస్తే చెల్లింపులు జరగవనే ఆందోళన గుత్తేదారుల్లో ఉన్నట్లు తెలిసింది. దీంతో పనులు చేయడం లేదు. అధికారులు చొరవ చూపి అవగాహన కల్పిస్తే.. రూ.104 కోట్లు మురిగిపోకుండా.. వాడే అవకాశం ఉంది.

● పనుల నిర్వహణలో యంత్రాంగం నిర్లక్ష్యం
● రూ. 110 కోట్లు.. మూడు నెలలే గడువు

### చెల్లింపుల్లో ఇబ్బందుల్లేవు..

రూ.50 లక్షలు దాటిన పనులకు చెల్లింపుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు సూచించారు. కలెక్టరు దీనిపై తగు చర్యలు తీసుకుంటారు. పనులు అనుకున్న సమయంలో పూర్తి అవుతాయి.
– కె.రామచంద్రరావు, పీడీ, డ్వామా, పార్వతీపురం మన్యం జిల్లా

## గృహనిర్మాణంలో నిర్లక్ష్యపు చెదలు!



అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

సాలూరు, న్యూస్‌టుడే: ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తాం.. ఇది గత ప్రభుత్వం మాట. కానీ పట్టణ పేదలకు నిర్మాణానికి అనువుగాని చోట ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. చినుకుపడితే జగనన్న కాలనీ నీటి మయమవుతోంది. రోడ్లు, సదుపాయల్లేవు. నెలిపర్తి-2 లేఅవుట్‌లో 417 మందికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో 250 వరకు పనులు ప్రారంభించారు. మరో 65 మంది పూర్తిచేసి గృహప్రవేశాలుచేశారు. ఎగిలినవి మధ్యలో ఆగిపోయాయి. సొంతింటి కల నెరవేర్చుకోడానికి అప్పులు చేసి, ఇంటిళ్లపాది కష్టపడి కట్టుకున్నా.. ఫలితం లేకపోయింది. అద్దెంటికే పరిమితం అవుతున్నారు. పునాదులు, గోడలు బీటలువారుతున్నాయి. ముళ్లపొదలు పెరిగి, తలుపులు, కిటికీలకు చెదలు పట్టాయి. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరైతే సమస్య పరిష్కరిస్తామని పుర కమిషనరు రత్నకుమార్ చెప్పారు.

ఓ ఇంటి తలుపులకు పట్టిన చెదలు

## ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ ద్వారా సరికొత్త సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ కారుమంచి నరసింహ అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన హ్యాకథాన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలన్నారు. పోటీల కన్వీనర్లు డా.జి.జయసుమ, డా.ఆర్.రాజేశ్వరరావు, హైదరాబాద్‌కు చెందిన జెన్ ఏఐ వర్సిటీ సీఈవో డా.హను, అకడమిక్ అధికారి సాజీ, డా.జి.జె.నాగరాజు, ఆర్.డి.వి.వి. శివరాం తదితరులు పాల్గొన్నారు.

## గట్టు చప్పుడు కాకుండా.. ఇసుక తవ్వకాలు

నాగావళి నదీ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా కారణంగా గట్టు కోతకు గురై ప్రమాదస్థితికి చేరింది. పాలకొండతోపాటు శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం సరిహద్దులో అక్రమార్కులు విరుచుకుపడుతున్నారు. అధికారుల కళ్లుగప్పి అడ్డదారుల్లో ఇసుక తరలిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే నదీ పరివాహక ప్రాంతాలు వరదల సమయంలో ముంపునకు గురవుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తితో మాట్లాడగా కందకాలు తీస్తున్నామని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

## కదిలిన కరి.. ఇక్కట్లు పరారీ!

● 20 ఏళ్లుగా మన్యంలో తిష్ఠ.. నేడు ఒడిశాకు

న్యూస్‌టుడే, పాలకొండ

పంటలు నాశనం.. ఆస్తులు ధ్వంసం.. ప్రాణాలకు నష్టం.. పొలానికి వెళ్లాలంటే భయం.. వీధిలోకి అడుగుపెట్టాలంటే హడలు.. ఏ వైపు నుంచి ఏనుగుల గుంపు వచ్చి దాడిచేస్తాయోనన్న ఆందోళన. ఇదీ మన్యంలోని గజరాజులతో నిత్యం ప్రజలకు ఎదురవుతున్న సమస్య. సుమారు రెండు దశాబ్దాలుగా సీతంపేట, భామిని, పాలకొండ ప్రాంతాల్లో సంచరిస్తూ.. గిరిజనులకు కంటిమీద కునుకులేకుండా చేసిన కరిరాజుల గుంపు ఎట్టకేలకు ఒడిశా ప్రాంతానికి చేరుకున్నాయి. దీంతో సీతంపేట మన్యం ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు.

మన్యం సరిహద్దులోని ఒడిశా ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

### ఆందోళన తీరింది..

ఎప్పుడు ఏ గ్రామంపై దాడి చేస్తాయో అని అనుక్షణం భయంతోనే గడిపేవారు. నిత్యం తమ పంటలను నాశనం చేయడంతో తమకు ఉపాధైన పోడు సాగుకు గిరిజనులు దూరమయ్యారు. ఎట్టకేలకు గుంపు తరలిపోవడంతో గిరిజనులకు ఊరట లభించింది.

### 9 నుంచి 4..

జిల్లాలో సంచరించిన 9 ఏనుగుల సంఖ్య నాలుగుకు చేరింది. మూడు విద్యుదాఘాతంతో మృత్యువాత పడగా.. మరో రెండు అనుమానాస్పదంగా మృతి చెందాయి. ఏజెన్సీకి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పంటలను నాశనం చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. మైదాన ప్రాంతాల్లో సంచరించడంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపేవారు.

### 2007లో ప్రవేశం..

10 ఏనుగుల గుంపు 2007లో ఒడిశా నుంచి వచ్చి సీతంపేట ప్రాంతంలోకి ప్రవేశించాయి. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఆహారం, నీరు కోసం గ్రామాల వైపు వస్తూ ప్రాణ, ఆస్తి నష్టం కలిగించాయి. అప్పటి నుంచి జిల్లాలోనే తిష్ఠ వేశాయి. వీటిని తరలించేందుకు అటవీ అధికారులు 'ఆపరేషన్ గజ' చేపట్టారు. దీనిలో ఒక ఏనుగు మృత్యువాత పడడంతో నిలిపివేశారు. అప్పటి నుంచి తొమ్మిది ఏనుగులు మాత్రమే పాలకొండ రేంజ్ అటవీ ప్రాంతంలో ఉండేవి.

**భారీగా నష్టం..** వీటి వల్ల భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. దాదాపు రెండువేల ఎకరాల్లో పంట నష్టం, 18 మంది మృత్యువాత పడ్డారు. రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

**ఒడిశా వైపు వెళ్లాయి..** ప్రస్తుతం కరిరాజులు ఒడిశా రాష్ట్రంలో సంచరిస్తున్నాయి. కొన్ని రోజుల కిందట నాగావళి నది దాటి వెళ్లినట్లు ట్రాకర్లు గుర్తించారు. వాటి సంచారంపై నిఘా ఉంచాం.
– రామారావు, రేంజర్, అటవీశాఖ

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి



మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..
ప్రకటనలపై జీఎస్టీ 5% శాతం అదనం
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

# ఇక్కడ అందానికి.. అక్కడ ఆపదకు!!

పార్వతీపురంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన అద్దం

చిదిమి కూడలి వద్ద పెట్టారిలా..

ఈ చిత్రాల్లోని అద్దాలను చూశారా.. చూసేందుకు చక్కగా ఉన్నాయి కదూ.. వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ రెండింటి విభిన్న అంశాలకు సంబంధించినవి. 1. విద్యార్థులు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు మన్యంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో 'ముస్తాబు' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన పలు కథనాలకు దాతలు స్పందిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆదిత్య కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు జిల్లాలోని రెండు ఎస్సీ వసతి గృహాలకు ఇటీవల రూ.7 వేల విలువైన ముస్తాబు సామగ్రిని అందజేశారు. పార్వతీపురం, మరిపివలస కేంద్రాలకు సమకూర్చారు. ఇందులో పెద్ద అద్దాలు ఉండడంతో చిన్నారులు సంబర పడుతున్నారు. 2. పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో మలుపులు, అనుసంధాన ప్రాంతాలు అధికం. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నివారణలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఇలా ఎక్కడికక్కడే అద్దాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో వాహనాల చిత్రాలు కనిపిస్తే కాస్త అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం,పాలకొండ, వీరఘట్టం

## రైతు కళ్లల్లో ఉప్పొంగిన గంగ

ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్ల పాలైంది. దీంతో రైతు కళ్లల్లో కన్నీరు ఏరులై పారింది. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి తౌడు ఖరీఫ్‌లో పండిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లుకు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం ట్రాక్టరు ద్వారా తీసుకెళ్తుండగా అదుపు తప్పి బస్తాలతో సహా రహదారి పక్కనున్న చెరువులోకి బోల్తా కొట్టింది. పంటంతా తడిసిపోవడంతో బోరుమన్నారు. ఇప్పుడెలా అమ్మేది అని వాపోయారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

చెరువులో పడిన ట్రాక్టరు, నీటిలో ధాన్యం బస్తాలు

## ఒరిగింది.. ఉరికిస్తోంది!!

డంపింగ్‌యార్డు వద్ద ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం

సాలూరు పురపాలిక పరిధిలోని డంపింగ్‌యార్డు సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇటువైపు రోజూ విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ నాగేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి, వెంటనే సరిచేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు

## అమ్మవారి సేవలో అదనపు న్యాయమూర్తి

న్యాయమూర్తి షణ్ముఖరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, అధికారులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారిని అదనపు జిల్లా న్యాయమూర్తి(గాజువాక) జి.షణ్ముఖరావు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని ఇచ్చారు.

## పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పీడీ పోస్టును గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీహరి తెలిపారు. ఎంపీఈడీలో 50 శాతం కలిగి ఉండాలని, సెట్‌నెట్ పీహెచ్‌డీ ఉన్న వారికి, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. డిసెంబరు 18 ఉదయం 10:30 గంటలకు జరగబోయే ఇంటర్వ్యూ, డెమోకు హాజరు కావాలన్నారు.

**చికెన్ ధరలు**

| రకం | బ్యాగ్‌లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 135 | 240 | 250 |

# నష్టాలను ఆప్కోవాలని!!

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

గత ప్రభుత్వం ఆప్కో వస్త్ర వాణిజ్య మండలిని పూర్తిగా గాలికొదిలేసింది. నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేయకపోవడం, సకాలంలో చెల్లింపులు జరగక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈక్రమంలో కార్మికులు, సిబ్బందితో పాటు దుకాణాలు సైతం తగ్గాయి. అంతేకాకుండా వస్త్ర ప్రియులకు కావాల్సిన దుస్తులు కూడా అందేవి కావు. ఈ నేపథ్యంలో సంస్థ గత అయిదేళ్లలో లక్ష్యాలను చేరుకోలేకపోయింది. దీంతో గాడిలో పెట్టేందుకు కూటమి చర్యలు తీసుకుంటోంది. క్రిస్మస్, సంక్రాంతికి పెద్దఎత్తున అమ్మకాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు రాయితీలు ఇవ్వాలని సూచించింది. ఇప్పటికే విజయనగరం రీజియన్ పరిధిలో రూ.70 లక్షల సరకు కొనుగోలు చేశారు.

రీజియన్ పరిధిలో లక్ష్యాల పెంపు

ఆప్కో కేంద్ర కార్యాలయంలోని దుకాణం

**రూ.7.20 కోట్ల లక్ష్యం..**

రీజియన్ పరిధిలో విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని దుకాణాలకు ఈ ఏడాది రూ.7.20 కోట్ల అమ్మకాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు రూ.1.20 లక్షలు మాత్రమే అమ్ముడయ్యాయి. పండగల సమయంలో రూ.3 కోట్ల మేర చేపట్టాలని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే కొత్త రకం నేత దుస్తులను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులంతా నేత వస్త్రాలనే కొనాలని ఇప్పటికే ప్రభుత్వం కోరింది.

**ఆన్‌లైన్ విధానంలో..** మార్కెటింగ్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ప్రభుత్వం జతకట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్ర తదితర వాటితో ఒప్పందం చేసుకుంది. నేతన్నలు తయారు చేసే వస్త్రాలను అందులో అమ్ముకునేందుకు అవకాశం కల్పించింది.

**200 రకాలు..**

లక్ష్యాలను అధిగమించి, నష్టాలను తగ్గించేందుకు ఈసారి 200 రకాల వరకు దుస్తులను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, కోల్‌కతా, బెంగళూరు తదితర ప్రాంతాల్లో తయారైన పట్టు చీరలను సైతం దుకాణాల్లో ఉంచారు. ఒక్కో షోరూమ్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు సరకు ఉంది.

**తగ్గిన దుకాణాలు..**

రీజియన్ పరిధిలో వైకాపా అధికారంలోకి రాకముందు 27 ఆప్కో దుకాణాలుండేవి. ఇందులో నాలుగు వరకు పెద్ద మాల్స్. ప్రస్తుతం అన్నింటి సంఖ్య 18కి చేరింది. రెండు మాల్స్ మూతబడ్డాయి. సిబ్బంది కూడా తగ్గిపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు లేరు. పొరుగు సేవల సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

**ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు..** సంక్రాంతికి అపార్టుమెంట్లు, జన సముదాయం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్టాళ్లు వేయనున్నాం. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేపడతాం. నేతన్నలకు మరో రూ.12 లక్షల వరకు బకాయిలు అందాలి. ప్రస్తుతం ఉన్న రకాల్లో ఒక్కోదానిపై 30 నుంచి 40 శాతం వరకు రాయితీలు అందిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి. – మురళీకృష్ణ, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి, ఆప్కో

## రాజాంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పాలకొండ రహదారిలో సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం ప్రారంభించారు. పురపాలిక వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి మాల్స్ రావడం ఆనందంగా ఉందన్నారు. యాజమాన్యాన్ని అభినందించారు. ఇది తమ 44వ షోరూమ్ అని సీఎంఆర్ సంస్థల ఛైర్మన్ మావూరి వెంకట రమణ తెలిపారు. అన్ని వర్గాలకు అనుకూలమైన ధరల్లో దుస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కొత్తా శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త చెలికాని జగన్నాథస్వామి, సీఎంఆర్ ఎండీ మోహన్‌బాలాజీ, జీఎం ఎన్.లింగమూర్తి పాల్గొన్నారు.

రిబ్బన్‌ను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చిత్రంలో సీఎంఆర్ సంస్థల ఛైర్మన్ మావూరి వెంకటరమణ, పారిశ్రామికవేత్తలు తదితరులు

## వెటరన్.. అదిరెన్

బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి వెటరన్ ఛాంపియన్‌షిప్ పోటీలు విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వివిధ కేటగిరీల్లో 35 నుంచి 70 ఏళ్ల వయసుగల వారు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో తలపడ్డారు. విజేతలకు బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఏ.నాయుడు బహుమతులను అందజేశారు. వారంతా వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 26 వరకు నగరంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంటుకు అర్హత సాధించారని చెప్పారు. సంఘ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు పొందిన విజేతలతో కేఏ.నాయుడు తదితరులు

## లిఫ్టు అడిగితే ప్రాణం పోయింది

విజయలక్ష్మి (పాతచిత్రం)

సీతానగరం, న్యూస్‌టుడే: ఆ ఒంటరి మహిళ మాంసం తెచ్చుకుందామని ఇంటి నుంచి వెళ్లింది. తెలిసిన వ్యక్తి ద్విచక్ర వాహనం ఎక్కింది. అదే ఆమె ప్రాణం తీసింది. ప్రమాదవశాత్తూ వాహనం పైనుంచి జారిపడి మృతిచెందింది. ఈ ఘటన సీతానగరం మండలం అంటిపేట గ్రామ శివారున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రెడ్డివానివలస గ్రామానికి చెందిన ఆర్.విజయలక్ష్మి(55) అంటిపేటలోని మాంసం దుకాణానికి వెళ్లగా ఎక్కువ మంది ఉండటంతో సమీప పనుకుపేట కూడలికి బయలుదేరారు. మధ్యలో రెడ్డివానివలసకు చెందిన ఆర్.వెంకటనాయుడును లిఫ్టు అడిగి.. ద్విచక్ర వాహనం ఎక్కారు. కొద్ది దూరం వెళ్లాక జారి పడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు ఆమెను బొబ్బిలిలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయనగరం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త ఈశ్వరరావు ఎనిమిదేళ్ల కిందట మృతి చెందాడు. కుమారులు వెంకటరమణ, శ్రీకాంత్ హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తున్నారు. ఆమె గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ ఒంటరిగా ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

## రాత్రికిరాత్రే అయిదు దేవాలయాల్లో చోరీ

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం బానాది పంచాయతీలోని అయిదు దేవాలయాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. స్థానికులు, అర్చకుడు ఎం.కిశోర్ శర్మ, వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పొలిమేరల్లోని శివాలయం, వినాయక మందిరం, ఆంజనేయస్వామి గుడి, పరదేశమ్మ, మరిడిమాంబ అమ్మవార్ల ఆలయాల్లోని హుండీలను కొల్లగొట్టారు. వెండి వస్తువులను వదిలేసి కేవలం నగదు మాత్రమే తీసుకుని ఉడాయించారు. చోరీకి గురైన సొమ్ము సుమారు రూ.41 వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేయగా, రూ.2 లక్షలని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరిస్తున్నారని ఎస్సై సుదర్శన్ తెలిపారు. బానాది- ఆనందపురం రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

## 25 టన్నుల బియ్యం పట్టివేత

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన లారీతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.9.50 లక్షల విలువైన 25 టన్నుల(500 బస్తాలు) బియ్యాన్ని పాచిపెంట మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంకట సురేశ్ వివరాల ప్రకారం.. ఒడిశా ప్రాంతానికి శనివారం రాత్రి బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. పి.కోనవలస చెక్‌పోస్టులో సిబ్బంది, వీఆర్వోలు శ్రావణి, రామారావుతో కలిసి తనిఖీలు చేపట్టారు. లోడ్‌తో వస్తున్న లారీ చోదకుడ్ని ప్రశ్నించగా పార్వతీపురం మండలం తాళ్లబురిడికి రామకృష్ణా రైస్ మిల్లు నుంచి జయపూర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని కేసు నమోదు చేసి, సరకును పాచిపెంట సీఎస్‌డీటీ హేమలతకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలో బాలిక ఆత్మహత్యాయత్నం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలంలోని ఓ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వసతిగృహంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆశ్రమ పాఠశాలలో ఇటీవలి ఎఫ్‌ఏ-1 పరీక్షలు జరిగాయి. సదరు బాలిక కాపీకొట్టి మార్కులు తెచ్చుకుందంటూ తోటి విద్యార్థులు హేళన చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బాత్‌రూమ్ క్లీనర్ తాగింది. కడుపునొప్పి రావడంతో పాఠశాల సిబ్బంది తోణాం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సాలూరు ప్రాంతీయా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి చరవాణిలో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## నగరంలో మెగా ట్రేడ్ ఫెయిర్

విజయనగరం చరిత్రకు చిరునామా అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లీ పేరడైజ్ మైదానంలో వివిధ వర్తక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన మెగా ట్రేడ్ ఫెయిర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. వందల రకాల వస్తువులు, పరికరాలు, పదార్థాలు ఒకే చోట అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. అనంతరం స్టాళ్లను సందర్శించారు. హోల్‌సేల్, రిటైల్ ధరలకే లభిస్తాయన్నారు. ఈనెల 16 వరకు అందుబాటులో ఉంటుందని ఫెయిర్ నిర్వాహకులు ముఖేష్, రమేష్, కృష్ణ, రాకేష్, ప్రదీప్ తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్


EENADU Classifieds

EDUCATION

Professional English Training Projects at schools, Colleges, Hotels & Corporate Offices CONVO English Club C:7286099991.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీ గాయత్రీ జ్యోతిష్యం. 25 సం VZMలో స్థిరపడి ఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం, మీకు ఎటువంటి సమస్యలున్నా ✆ 9701778711.

REAL ESTATE

FLAT FOR SALE

Mudidam 4KM from VZM Vijaya Residency F Nos. 101, 202, 304, 910 + 80 Sft. Ready to Occupy 25 Lakhs. ✆ 9440306999, 9441716590

JOBS

విజయనగరంలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతీయువకులు కావలెను. జీతం- 10,000-13,500. Ph: 9030588502, 9154296345

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయసు. యువతి, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము 9704637370, 9949904532.

FACULTY/ TEACHERS

Faculty for B.Sc Nursing College Q:M.Sc(Nursing), B.Sc(Nursing) Candidates C:8008083353,7799772299 EMail:balajee.nursing@gmail.com

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8 గం|| డ్యూటీ. జీతం: 18815/- PF, ESI. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11 మంది (Ex-Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం: 30000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## ఎన్‌టీఏలో ఎస్టీయూ నాయకుల చేరిక

ఎమ్మెల్సీ చిరంజీవిరావుతో సంఘం నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎస్టీయూ మాజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమరాన జోగారావు, సీహెచ్.సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.మురళీతో సహా 23 మంది కార్యవర్గ సభ్యులు సంఘానికి రాజీనామా చేశారు. వారంతా ఆదివారం నగరంలోని ఏపీఎన్జీవో హోంలో నిర్వహించిన ఎన్‌టీఏ(నోబుల్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సమక్షంలో అసోసియేషన్‌లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కె.జోగారావు, ప్రధాన కార్యదర్శి బి.గోవింద నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లుగా చిప్పాడ సూరిబాబు, ఎం.మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.చిరంజీవినాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా జి.రవి, అదనపు ప్రధాన కార్యదర్శిగా పడాల లక్ష్మణరావు, ఆర్థిక కార్యదర్శిగా పి.మహేష్, సీపీఎస్ కన్వీనర్‌గా బి.ఈశ్వరరావు తదితరులకు పదవులు లభించాయి. ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బి.హైమారావు వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

## 19న సుపరిపాలన యాత్ర

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి మట్టా ప్రసాద్ అన్నారు. ఈనెల 19న విజయనగరంలో సుపరిపాలన యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. యాత్రలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని చెప్పారు. వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, నాయకులు కోటగిరి నారాయణరావు, కుసుమంచి సుబ్బారావు, పతివాడ రాజేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న మట్టా ప్రసాద్, రాజేష్‌వర్మ, రెడ్డి పావని, సుబ్బారావు తదితరులు

## ప్రాబబుల్స్ జట్లకు 60 మంది ఎంపిక

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాలబాలికల(జూనియర్స్) ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 19 నుంచి 21 వరకు ప్రకాశం జిల్లాలో, 24 నుంచి 26 వరకు సీనియర్స్ టోర్నమెంటు గుడివాడలో జరగనున్నాయి. ఆయా పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఆదివారం విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. రన్నింగ్, ఛేజింగ్, పోల్‌టచ్ విభాగాల్లో 20 మంది చొప్పున 60 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్ జట్లకు ఎంపిక చేశారు. ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమలనాభరావు, గోపాలరావు పాల్గొన్నారు.

ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారిణులు

## నగరంలో ఒకేసారి 400 మంది పోలీసుల తనిఖీలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఒకేసారి 400 మంది సిబ్బంది, అధికారులు తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 వరకు 80 ప్రాంతాల్లో నలుగురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, 350 మంది సిబ్బంది దాడులు చేశారని ఎస్పీ దామోదర్ తెలిపారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశామని, శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సైలెన్సర్లను తొలగించినట్లు చెప్పారు. మైనర్ డ్రైవింగ్, శిరస్త్రాణం ధరించని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం తాగి నడుపుతున్న 50 మంది అరెస్టు చేశామని వెల్లడించారు.

గంటస్తంభం వద్ద ప్రజలు, చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## శ్రీరాం విద్యాపీఠం పూర్వ విద్యార్థుల సందడి

గరివిడిలోని శ్రీరాం విద్యాపీఠం విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానికంగా ఉన్న ఓ వేడుకా మందిరంలో జరిగింది. విద్యాపీఠం పరిధిలోని శ్రీరాం ఉన్నత పాఠశాల, గోదావరి దేవి సరాఫ్ ఉన్నత పాఠశాల, శ్రీరాం జూనియర్ కళాశాల, ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో చదివిన 150 మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వెంకటేశ్వరరావును, ఐవీఎఫ్ జిల్లా సంఘం ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మరో పూర్వ విద్యార్థి గుప్తాను సన్మానించారు. – న్యూస్‌టుడే, గరివిడి

వేదికపై నృత్యం చేస్తున్న మహిళలు

(c) eenadu

## అధ్వానంగా ఉన్నా.. అక్కడే వండేస్తాం!

వీరఘట్టం జిల్లా పరిషత్తు పాఠశాలలోని వంటశాల ప్రాంగణం అధ్వానంగా దర్శనమిస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో వ్యర్థాలు అక్కడే పారబోస్తుండడంతో నిల్వలు పేరుకుపోయి దుర్వాసన, ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో అవస్థల మధ్యనే ఆహారం తినాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఈవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, వీరఘట్టం గ్రామీణం

## ఏడాదిన్నరగా అసంపూర్తిగానే..

బలిజిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో సచివాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. సకాలంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు మధ్యలోనే వదిలేశారు. రూ.17.50 లక్షలతో తలపెట్టిన వెంగాపురం ఆరోగ్య ఉప కేంద్ర భవనం ఏడాదిన్నరగా మధ్యలోనే ఉంది. గంగాడ ఆర్‌ఎస్‌కే నిర్మాణం కూడా ఆగింది. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో, త్వరలో పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ జేఈ అంబేడ్కర్ అన్నారు.

– న్యూస్‌టుడే, బలిజిపేట

## రహదారి నిర్మాణం ఎప్పుడో?

మండల కేంద్రం జియ్యమ్మవలస నుంచి అప్పన్నదొరవలస మీదుగా శిఖబడి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. గతంలో వేసిన బీటీ రహదారి పూర్తిగా పాడైంది. గోతులుగా మారడంతో పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వానా కాలంలో బురదలో వెళ్లలేని దుస్థితి. ఇప్పటికైనా బాగు చేయాలని కోరుతున్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 2.45 కిలోమీటర్ల మేర నిర్మాణానికి రూ.1.27 కోట్లు మంజూరైనట్లు ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

## చెరువుల అభివృద్ధి పట్టదా?

పాలకొండ పట్టణ పరిధిలోని చెరువుల అభివృద్ధిని అధికారులు పూర్తిగా విస్మరించారు. వెంకటరాయుడు, రాయుడు కోనేరు, భగీరథ, కృష్ణమ్మ చెరువులు, కుర్మసాగరం నగర పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఇవన్నీ పూడికలు, తూటికాడ పెరిగి నీటి నిల్వ సామర్థ్యం కోల్పోతున్నాయి. ప్రముఖ ఆలయాలకు సమీపంలో ఉన్నా ఫలితం లేదు. మురుగునీరు చేరి కలుషితమై వినియోగానికి దూరమయ్యాయి. చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

## మురుగు నీటితో అవస్థలు

సీతానగరం మండలం కాశాపేట రైస్ మిల్లు సమీపంలో 36వ రాష్ట్ర రహదారిపై ప్రయాణిస్తే మురుగులో వెళ్లాల్సిందే. వేగంగా ప్రయాణించే వాహనాలకు రహదారిపై నిలిచిన మురుగు మరింత ఇబ్బంది పెడుతోంది. నిత్యం నీరు నిలిచి, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి పక్క ఉన్న కల్వర్టు నుంచి దిగువకు మురుగు ప్రవహించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కల్వర్టు పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ విజయకుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

### మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

| | |
|---|---|
| పార్వతీపురం | 8008566244 |
| పాలకొండ | 8008574299 |
| సాలూరు | 8008786820 |
| కురుపాం | 9849044696 |

? సీతానగరం పీఏసీఎస్ పాత భవనం ఒకవైపు గోడ కూలింది. మరోవైపు గోడ శిథిలావస్థలో ఉంది. - రామారావు, సీతానగరం

★ శిథిల భవనం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - ప్రసాద్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, సీతానగరం

? కిచ్చాడలోని వీధి కాలువలు పూడికలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. దోమలు బెడద ఎక్కువగా ఉంది. - గంగరాజు, సానికురు

★ వ్యర్థాలు తొలగించి, దోమల మందు పిచికారీ చేయిస్తాం. - రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

### వసతి గృహానికి దారి చూపారు

స్పందనకు వందనం

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని గిరిశిఖర గ్రామాల గర్ల్స్ హైస్కూల్ వసతి గృహానికి ఎట్టకేలకు రోడ్డు వేశారు. గుమడాం రోడ్డు నుంచి వసతి గృహానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండేది. దీనిపై ‘ఈనాడు’లో పలుమార్లు కథనాలను ప్రచురించాం. మంత్రి సంధ్యారాణి స్పందించి సమస్యను పరిష్కరించారు.

## వైకల్యం అడ్డురాలేదు.. విజయం ఆగలేదు!

రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న దివ్యాంగ క్రీడాకారులు

మైదానంలో సాయి, వినోద్, శ్రీను, దొర

### రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా..

బామినికి చెందిన కె.శ్రీను దివ్యాంగుడు. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేశారు. 2024 డిసెంబరులో విశాఖ జింక్ మైదానంలో నిర్వహించిన పారా క్రికెట్ పోటీల్లో సత్తా చూపారు. వీరి జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఇటీవల గుంటూరులో జరిగిన పారా క్రికెట్ పోటీల్లో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రథమ స్థానంలో నిలబడేలా చేశారు. రాష్ట్ర జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

అంగ వైకల్యం ఉందని అధైర్య పడలేదు.. అందరిలా తాము కాదని వెనకడుగు వేయలేదు. సంకల్ప బలం ఉంటే దేన్నైనా సాధించొచ్చని నిరూపించారు ఆ దివ్యాంగులు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించగలమంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారం రోజుల క్రితం గుంటూరులో పారా క్రికెట్ మీగా టోర్నమెంట్ జరిగింది. ఇందులో మన్యం జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన నలుగురు దివ్యాంగ క్రీడాకారులు కె.శ్రీను, ఆర్.వినోద్, ఎంఎల్ దొర, ఆర్.సాయి ఈనెల 29న విశాఖ పోర్టు స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

### బీటెక్ విద్యార్థి.. ఆల్ రౌండర్‌గా..

బామినికి చెందిన వినోద్ బీటెక్ పూర్తి చేశారు. క్రికెట్‌పై ఇష్టంతో అనేక పోటీల్లో పాల్గొన్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన పోటీల్లో ఆల్ రౌండర్‌గా ప్రతిభ చూపారు. రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. క్రీడల్లో ఏదో ఒకటి సాధించాలనే తపనతో ఆడుతున్నట్లు చెప్పారు. అందరు ఆటగాళ్లలానే తామూ ఆడగలమని చెబుతున్నారు.

### బౌలర్‌గా గుర్తింపు

మక్కువ మండలం గైశల గ్రామానికి చెందిన ఎంఎల్ దొర మంచి బౌలర్‌గా గుర్తింపు పొందారు. గత ఏడాది నుంచి మన్యం జిల్లా తరఫున క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలు అందుకున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తానని చెబుతున్నారు.

### ఐటీఐ కుర్రాడే క్రీడాకారుడు

పార్వతీపురానికి చెందిన ఆర్.సాయి ఐటీఐ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టంగా ఆటలు ఆడేవారు. కుటుంబీకులు సైతం ప్రోత్సహించారు. అదే సంకల్ప బలంతో గుంటూరులో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఓడితే ఎప్పుడూ బాధపడలేదని, విజయం కంటే అదే గొప్ప పాఠం నేర్పుతుందని అతను చెబుతున్నారు.

## ఫైనల్స్‌కు పార్వతీపురం జట్టు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం

ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం వెంకంపేట మైదానంలో జరిగిన డివిజన్‌స్థాయి సెమీ ఫైనల్స్‌లో సాలూరు జట్టుపై నెగ్గింది. పాలకొండ డివిజన్‌తో సెమీ ఫైనల్స్‌లో గెలిచిన జట్టుతో తలపడనుంది. పార్వతీపురం, కొమరాడ ఎంఈవోలు ప్రసాదరావు, నారాయణస్వామి, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు మురళి, నాగమణి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వాసుదేవరావు నాయుడు ఉన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

పార్వతీపురం, గ్రామీణం, న్యూస్‌టుడే: గోవా గవర్నరు పి.అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని ఆయన నివాసంలో పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు ఉన్నారు.

## దారులు బాగుపడనున్నాయి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జయకృష్ణ తెలిపారు. వీర రాజుపేట కూడలి నుంచి గుడివాడ వరకు రూ.4.65 కోట్లు, చింతలగ్రామానికి రూ.2 కోట్లు, పాలకొండ నుంచి లుంబూరుకి రూ.1.78 కోట్లు, వీరఘట్టం మండల పరిధిలో దశమంతపురం గ్రామానికి రూ.64 లక్షలు, సీతంపేట మండలం చిన్న కంబ రోడ్డు నుంచి అంటికొండ మీదుగా ఈతమానుగూడకు రూ.6.95 కోట్లతో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు.

### తెరపై ఈనాడు

★ శ్రీ సినిమా(ఎస్‌వీబీ): మోగ్లీ

★ టీబీఆర్: అఖండ-2, డ్రైవ్

### కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారులో ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో.. రూపాయిల్లో) ★టమాటా: 34, ★ వంకాయలు: 34, ★బెండ: 43, ★ బీర: 43, ★దొండ: 43, ★చిక్కుడు: 35, ★పచ్చిమిర్చి: 37, ★కాకర: 33, ★ క్యారెట్: 57, ★బీట్‌రూట్: 50, ★ఉల్లి: 23, ★బంగాళాదుంపలు: 20, ★అల్లం: 80, ★వెల్లుల్లి: 66, ★క్యాప్సికమ్: 80, ★అరటి కాయ: 5, ★ఆనపకాయ: 12

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

## రేకుల షెడ్డులో బోధన.. ఇది పన్నెండేళ్ల వేదన

సాలూరు మండలంలోని తోనాం పంచాయతీ బొర్రమామిడివలస గ్రామంలో పన్నెండేళ్ల క్రితం పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. స్లాబ్ వరకు నిర్మించి పనులను మధ్యలోనే ఆపేశారు. ఇప్పటి వరకూ పూర్తి కాకపోవడంతో కొన్నాళ్లు అద్దె భవనంలో, ఐదేళ్ల నుంచి స్థానికంగా ఉండే రేకుల షెడ్డులోనే తరగతులు బోధిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 15 మంది విద్యార్థులు ఉన్నారు. బొర్రమామిడివలస, తోనాం కొత్తూరు, మద్దేనవలస గ్రామాల్లోని విద్యార్థులకు ఇదొక్కటే పాఠశాల. దీన్ని పూర్తి చేయాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు. సమస్యను ఎంఈవో-2 వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

## నేను పంపు కొడతా.. నువ్వు నీరు తాగు..

పాలకొండ పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఓ ఆవు చాలా సమయం నుంచి దాహార్తితో బోరు వద్ద వేచి చూసింది. ఇది గమనించిన ఓ వ్యక్తి సమీపంలో బోరు కొట్టడంతో కడుపు నిండా నీరు తాగి వెనుదిరిగింది. మానవత్వంతో కూడిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. –న్యూస్‌టుడే, పాలకొండ

## సీతంపేటలో నేడు పీజీఆర్‌ఎస్

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నేడు(సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యాలయం సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తమ వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందజేసుకోవచ్చన్నారు.

## చెత్త బుట్టల ఏర్పాటు

వీరఘట్టం, గ్రామీణం, న్యూస్‌టుడే: వీరఘట్టం మండలంలోని నీలానగరం గ్రామంలో శ్రీ పోలమాంబ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా వీధుల్లో 10 పెద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు.

## కంకర వాహనం సీజ్

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండలో అక్రమంగా కంకరను తరలిస్తున్న వాహనాన్ని సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ ఆదివారం సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. అనుమతులు లేకుండా కంకర, ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ హెచ్చరించారు.

## వృద్ధులకు దుప్పట్ల అందజేత

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణ హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఆదివారం కోనవలస గ్రామంలోని 50 మంది వృద్ధులకు సుమారు రూ.20 వేలు విలువైన దుప్పట్లు, రగ్గులను అందించారు. నెల జీతంలో కొంత మొత్తాన్ని పేదల అవసరాలు తీర్చేందుకు వినియోగిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## దాతల సహకారంతో బడికి ఊపిరి

– న్యూస్‌టుడే, వీరఘట్టం

వీరఘట్టం మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1998లో స్థాపించారు. పాఠశాల భవనానికి అవసరమైన 5 ఎకరాల స్థలాన్ని న్యూజెర్సీలో ఉంటున్న గ్రామానికి చెందిన రౌతు దామోదరరావు ఉచితంగా అందజేశారు. ఇటీవల రూ.లక్షతో సైకిల్ షెడ్డును సైతం నిర్మించారు. ప్రభుత్వ సహాయంతో రెండు తరగతి గదులను నిర్మించారు. పాఠశాల ప్రాంగణం పచ్చని మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణంగా మలిచారు.

పాఠశాలలో నిర్మించిన కళా వేదిక

### స్ఫూర్తితో మరికొందరు..

అంతేకాదు దామోదరరావు మిత్రులు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నారు. శెట్టి నరహరి దంపతులు సత్యసాయి బాబా కళా వేదిక, సరస్వతీ దేవి విగ్రహాన్ని రూ.3 లక్షలతో ఏర్పాటు చేశారు. తోట రవీంద్ర బెంచీలు, తాగునీటి సౌకర్యానికి రూ.3.50 లక్షలు వెచ్చించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని 2015-16 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్, ఈ పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పర్రి రామ్మూర్తి అంబేడ్కర్, ఆయన తండ్రి జ్ఞాపకార్థం రవి మహాత్మా గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

సైకిల్ షెడ్డు

### సహకారం మరువలేనిది

దాతల ప్రోత్సాహంతో విద్యార్థుల వృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. దీనికి నిదర్శనం పాఠశాల ఏర్పడిన నాటి నుంచి గత విద్యా సంవత్సరం వరకు పదో తరగతిలో 94 నుంచి 100 శాతం ఫలితాలు సాధించారు. 8 సార్లు వందశాతం ఫలితాలు దక్కాయి. పిల్లలు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. దాతల సహకారం మరువలేనిదని హెచ్ఎం పి.సుధారాణి అన్నారు. ఇదే ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

## బోధకుల కొరత.. విద్యార్థులకు వెత

కళాశాలకు హాజరైన విద్యార్థులు వీరే

ఈ కోర్సులో చేరితే ఉద్యోగం, స్వయం ఉపాధి లభిస్తుందన్న భరోసాతో ఉన్న విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ప్రభుత్వ ఐటీఐలో విద్య మిథ్యగా మారుతోంది. ప్రథమ సంవత్సరం 148, ద్వితీయ సంవత్సరం 63 మంది ఓజేటీలో ఉన్నారు. ఫిట్టర్, ఎంవీఎం, డ్రెస్స్ మేకింగ్, వెల్డర్, ఈఎం లాంటి ఏడు ట్రేడులకు కేవలం ఇద్దరే ఔట్ సోర్సింగ్ శిక్షకులు. అంతేకాదు ప్రిన్సిపల్ కూడా లేరు. సీతంపేట నుంచి డిప్యుటేషన్‌పై వస్తున్నారు. దీంతో విద్యార్థుల హాజరు రెండంకెలు దాటట్లేదు. బోధకులను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని విప్ జగదీశ్వరి తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

## వాహన తనిఖీలు

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కుసిమి కూడలి వద్ద ఆదివారం సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏఎస్సై సంజీవు, సిబ్బంది ఉన్నారు.

## బాల వికాస్‌తో నైతిక విలువలు

చిన్నారులతో ఉపాధ్యాయులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బాలవికాస్‌తో చిన్నారులకు నైతిక, మానవీయ విలువలు బోధిస్తామని సత్యసాయి సేవా సంస్థ జిల్లా బాధ్యురాలు శ్రీదేవి పేర్కొన్నారు. పాలకొండ మండలంలోని పరుశురామపురం గ్రామంలో ఆదివారం బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి వారం విద్యార్థులకు ఉచిత తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు శ్రీరాములునాయుడు, శ్రీనువాస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పట్టు తప్పితే ముప్పే

పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో నిండిపోతోంది. గమ్యం చేరేందుకు కొంత మంది యువత ఫుట్ బోర్డుపై నిల్చుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. బస్సుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొమరాడ

## రూ.53 లక్షలతో నిర్మాణం

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట మండల పరిషత్తు కార్యాలయానికి ఆనుకుని ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఇంజినీరింగు అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ ఉన్న శిథిల భవనాన్ని పూర్తిగా కూల్చి, రూ.53 లక్షలతో టెండర్లు పిలిచినట్లు ఎంఈవో సామల సింహాచలం ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.

## ఆత్మీయ సమ్మేళనం.. ఆనందమయం

సాలూరు మండలంలోని బొడ్డవలస డా బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల 1983-85 ఇంటర్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆలవెల్లి శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తమకు బోధించిన ఉపాధ్యాయుడు సోమునాయుడు తదితరులను సన్మానించారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

‘మన ఊరు పాచిపెంట’ గ్రూప్ సభ్యులు ఆదివారం పెద్దగెడ్డ జలాశయం సమీప తోటలో కలిసి, ఆనందం పంచుకున్నారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేసిన విశాంత్ర ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉన్నారు. భవిష్యత్తులో అంతా కలిసి సామాజిక సేవలు చేయాలని నిర్ణయించుకున్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

తలవరం జిల్లా పరిషత్తు పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ ఆత్మీయ కలయిక నిర్వహించారు. పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులను ఆహ్వానించి, వారిని ఘనంగా సత్కరించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. – న్యూస్‌టుడే, వీరఘట్టం గ్రామీణం

## ఏనుగుల బీభత్సం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలం సీతంపేట గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఆదివారం ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. రైతులు సాగు చేస్తున్న కోకో తదితర మొక్కలు, మోటర్ పైపులను ధ్వంసం చేశాయి. చేతికి అందొచ్చిన చెరకు పంటను నాశనం చేశాయని రైతు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు.

సీతంపేటలో ధ్వంసం చేసిన పైపులు

## నిధుల వృథాకు సాక్ష్యమిదే!

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛాంధ్ర మిషన్ కింద మంజూరు చేసిన మూడు చక్రాల ఆటోలు చాలా చోట్ల మూలకు చేరాయి. ఇళ్ల నుంచి వేరువేరుగా తడి, పొడి చెత్త సేకరించి.. చెత్తశుద్ధి కేంద్రాలకు తరలించేందుకు బలిజిపేట మండలానికి ఏడు ఆటోలు మంజూరు చేశారు. సాంకేతిక లోపాలతో బలిజిపేట పంచాయతీకి చెందిన ఈ ఆటో ఆరంభం నుంచి సచివాలయం ఆవరణలోనే పడి ఉంది. ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి. విషయం ఎస్సీ కార్పొరేషన్ దృష్టిలో ఉందని, దీనిస్థానంలో వేరే బండితో చెత్త సేకరణ చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శేఖర్ అన్నారు. - న్యూస్‌టుడే, బలిజిపేట

## తాగునీరు.. తాగనీరూ!

అడారు గ్రామ ప్రజలు తాగునీరు సక్రమంగా అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ప్రధాన రహదారి, యాత వీధుల వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపులు మరమ్మతులకు గురై ఏడాదవుతున్నా ఇంతవరకు బాగు చేయలేదు. మరో వైపు ఆరు నెలల నుంచి పంచాయతీ కుళాయిల ద్వారా రక్షిత తాగునీరు 2 రోజులకు ఒక్కసారే వస్తోంది. దీంతో 200 కుటుంబాలు తాగునీటి కష్టాలు పడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వెంటనే బాగుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కావ్యశ్రీ తెలిపారు.

– న్యూస్‌టుడే, వీరఘట్టం గ్రామీణం

## శివయ్యా.. కనిపించవయ్యా..

బలరాముడు ప్రతిష్ఠించిన ఆలయాల్లో గుంప సోమేశ్వరాలయం ఒకటి. ఈ ఆలయం జంఝావతి, నాగావళి నదుల సంగమంలో వెలిసింది. కాశీ, శ్రీశైలం తర్వాత అంతటి ప్రాధాన్యమున్న దేవాలయం ఇది. ఇటీవల శివలింగంపై దేవాదాయ శాఖ వారు పెద్ద గొట్టాన్ని అమర్చారు. బయట భక్తులు కొట్టే కొబ్బరి నీరు దీని ద్వారా స్వామిని అభిషేకిస్తున్నాయి. కానీ దీనివల్ల శివలింగం పూర్తిగా కనిపించడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా దేవాదాయ శాఖాధికారి రాజారావు అన్నారు. – న్యూస్‌టుడే, కొమరాడ

## వద్దంటే సాగునీరు.. రైతులు బేజారు

తోటపల్లి ఎడమ కాలువ ద్వారా రైతుల పొలాలకు వద్దంటే సాగునీరు అందుతోంది. ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. దీంతో కొందరు రైతులు ఓవులను పొలాల్లోనే ఉంచారు. మరికొందరు పెసర, మినుము పంటలు వేశారు. అవసరం లేని సమయంలో సాగునీరు వస్తుండడంతో పంటకు నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటకు అందని సాగునీరు ఇప్పుడు రావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ డీఈఈ గనిరాజు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ

## రూ.8.82 కోట్లతో మరుగుదొడ్లు

పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో రూ.8.82 కోట్లతో చేపడుతున్న ఫ్రాబ్రికేటెడ్ మరుగుదొడ్ల నిర్మాణాలు తుది దశకు చేరాయి. ఇన్నాళ్లూ మరుగుదొడ్ల కొరతతో తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అమల్లో భాగంగా మరుగుదొడ్లు మంజూరు చేయడంతో సమస్యకు తెరపడింది. జిల్లా వ్యాప్తంగా 294 యూనిట్లు మంజూరు అయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నాలుగు చొప్పున రూ.3 లక్షలు కేటాయింపుతో పనులు చేపట్టారు. జిల్లాలో 280 యూనిట్లు పూర్తయ్యాయని కార్యనిర్వాహక ఇంజినీరు రామకృష్ణ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. - న్యూస్‌టుడే, పాచిపెంట

(c) eenadu

ఈనాడు
ప్రకాశం
సోమవారం 15 డిసెంబరు 2025


# డోలా.. భళా!

సగటున రెండు రోజుల్లోనే...

▶ దస్త్రాల పరిష్కారంలో జిల్లా మంత్రిదే అగ్రస్థానం

▶ కలెక్టర్‌కు 24, సంయుక్త కలెక్టర్‌కు 9వ స్థానం

దస్త్రాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో జిల్లాకు చెందిన మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రాష్ట్రంలో అగ్ర స్థానంలో నిలిచారు. మిగతా మంత్రులతో పోలిస్తే వేగంగా తక్కువ సమయంలో పూర్తి చేసి పనులు సాగేలా చూశారు. దస్త్రాలను ఈ-ఆఫీసు విధానమైన ఆన్‌లైన్‌లో పరిష్కరించడాన్ని ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీశాఖ మదింపు చేసింది. వివిధ శాఖల మంత్రులు, రాష్ట్ర సచివాలయంలోని వివిధ శాఖల అధిపతులు, కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు ఆన్‌లైన్‌లో దస్త్రాల పరిష్కారంలో తీసుకున్న చొరవపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్షించి మార్కులు వేశారు. కలెక్టర్ రాజాబాబు 24వ స్థానంలో నిలవగా, సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ 9వ స్థానంలో నిలిచారు. –ఈనాడు, ఒంగోలు

జిల్లాకు చెందిన మంత్రి డోలా దస్త్రాల పరిష్కారంలో ముందు వరుసలో నిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకున్నారు. జులై 15వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు మొత్తం 629 దస్త్రాలు రాగా, పాత వాటితో కలుపుకొని 651 దస్త్రాలు పరిష్కరించారు. సగటున ఒక్కో దాని కోసం రెండు రోజుల 41 నిమిషాల సమయం తీసుకున్నారు. ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు వివరాలు అడిగి పని పూర్తిచేసేందుకు చొరవ తీసుకున్నారు.

## కలెక్టర్ వద్ద 9 రోజుల సమయం

కలెక్టర్ రాజాబాబు వద్దకు సెప్టెంబరు 9వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు మూడు నెలల వ్యవధిలో మొత్తం 388 దస్త్రాలు రాగా 356 దస్త్రాలను పరిష్కరించారు. ఈ-ఆఫీసు విధానంలో దస్త్రాలు చూసేందుకు సగటున 9 రోజుల ఎనిమిదిన్నర గంటల సమయం తీసుకున్నారు. దస్త్రాలు తక్కువే అయినా పరిష్కారానికి ఎక్కువ సమయం తీసుకున్నారు. దీంతో రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు ప్రకటించిన ర్యాంకింగ్ జాబితాలో కలెక్టర్ రాజాబాబు దిగువన ఉన్నారు.

## జేసీ పర్వాలేదనిపించారు

సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ సగటున ఒక రోజు వ్యవధిలో దస్త్రం పరిష్కారానికి కృషి చేశారు. సెప్టెంబరు 9వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు మొత్తం 494 దస్త్రాలు రాగా 441 దస్త్రాలను పరిష్కరించారు. ఆన్‌లైన్‌లో దస్త్రాలు పని పూర్తి చేసిన విధానంపై చేసిన మదింపులో జేసీ రాష్ట్ర స్థాయిలో 9వ స్థానంలో నిలిచారు.

# కాల్ సెంటర్ 1100 సేవలు పొందండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. దాఖలు చేసిన అర్జీ పరిష్కారం కాకున్నా ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు; తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# మేం స్టెప్పేస్తే అదిరే

ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డులోని నెక్స్ట్‌జెన్ స్కూలులో ఆదివారం అట్టహాసంగా నిర్వహించిన కార్నివాల్ ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. వేడుకల్లో నిర్వాహక పాఠశాల విద్యార్థులతోపాటు ఇతర పాఠశాలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఆడుతూ పాడుతూ సందడి చేశారు. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

# జిల్లా కేంద్రం ప్రకటన.. ఖాళీ స్థలాల ఆక్రమణ!

▶ తర్లుపాడులో కబ్జాదారుల భూదాందా

▶ పట్టించుకోని అధికార యంత్రాంగం

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటనతో మార్కాపురం పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకబ్జాదారులు కబ్జాలకు తెర లేపారు. ప్రధానంగా మార్కాపురం పట్టణానికి తర్లుపాడు మండలంలోని గ్రామాలు 5, 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదనుగా అక్రమార్కులు ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. –న్యూస్‌టుడే, తర్లుపాడు

తర్లుపాడులో చదును చేసిన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

### ప్రభుత్వ భూముల కబ్జా..

తర్లుపాడు మండలం తుమ్మలచెరువు, బుడ్డపల్లె గ్రామాల మధ్య రహదారికి పక్కనున్న ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని సాగులోకి తెచ్చారు. తాడివారిపల్లెలో గతంలో పశువుల మేతగా వినియోగిస్తున్న వంద ఎకరాల భూములను రెవెన్యూ శాఖాధికారులతో కుమ్మక్కైన కొందరు స్వార్థపరులు దస్త్రాలను సృష్టించి పదేళ్ల కిందట రూ.40 లక్షలతో బయట వ్యక్తులకు విక్రయించారు. తాజాగా జిల్లా ప్రకటనతో ఆ భూమిని రూ.8.5 కోట్లతో మరో వ్యక్తి చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం కొత్తగా కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారి కొనుగోలు చేసిన వంద ఎకరాలతోపాటు చుట్టూ ఉన్న కొండలు, చెక్ డ్యాంలను సైతం తొలగించి మరో 20 ఎకరాలను ప్రభుత్వ భూమిని కలుపుకొన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### మేత భూములు సైతం...

నాగెళ్లముడుపు, తర్లుపాడు రహదారికిరువైపులా ఉన్న వాగు పోరంబోకు, పశువుల మేత బీడు భూముల్లో ఇప్పటికే ముళ్లచెట్లను తొలగించారు. నాగెళ్లముడుపు పంచాయతీలోని జగనన్న కాలనీ వెంబడి ఉన్న కొండ పోరంబోకు భూముల్లో చదును పనులు జరుగుతున్నాయి. మండల కేంద్రమైన తర్లుపాడులో మార్కాపురం పట్టణానికి వెళ్లే రహదారి వెంబడి ఉన్న సర్వే నంబరు 82-1లో 1.76 ప్రభుత్వ భూములను యంత్రాలతో చదును చేసి ఆక్రమించుకున్నారు. ఈ భూమి గ్రామానికి ఆనుకుని ఉండడంతో రూ.కోట్ల విలువ చేస్తుందని గ్రామస్థులు చెబుతున్నారు.

### ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తాం

భూకబ్జాలకు పాల్పడేవారు ఎంతటివారైనా సహించేదిలేదు. ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠినంగా వ్యవహరిస్తాం. గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం. –కె.కిశోర్‌కుమార్, తహసీల్దారు, తర్లుపాడు మండలం

## ముద్దసానమ్మ.. మనసా స్మరామి

మార్కాపురం మండలం కోలభీమునిపాడులో ముద్దసానమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. –న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

# తలుపులు పెట్టాలన్న తలపే లేదా?

చిత్రంలో కనిపిస్తున్నవి యర్రగొండపాలెం సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలోని స్నానపు గదులు. ఇవి శిథిలావస్థకు చేరడంతోపాటు కనీసం తలుపుల్లేని దుస్థితి నెలకొంది. భవనం కూలేందుకు సిద్ధంగా ఉండగా, గదులకు కిటికీలు గానీ, తలుపులు గానీ లేకపోవడంతో విద్యార్థులు చలికి గజగజలాడుతున్నారు. గతంలో ఇక్కడ 400 మంది విద్యార్థులుండగా, వసతుల్లేని కారణంగా ప్రస్తుతం 50 మంది మాత్రమే ఉంటూ చదువుకుంటున్నారు. మరుగు దొడ్లకు ఇదే పరిస్థితి. స్నానాలతోపాటు తాగునీటికి ఉప్పు నీరొచ్చే బోరే విద్యార్థులకు దిక్కుగా మారింది. ఇక్కడి అసౌకర్యాలతో విద్యార్థులు నిత్యం దుర్భర జీవనం సాగిస్తున్నారు. –న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

# సృజనతో షికారు

▶ రోబోటిక్ కారు ఆవిష్కరణలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఇటీవల దిల్లీలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపారు. కళాశాలలో ఇంజినీరింగ్ 4వ సంవత్సరం విద్యార్థులు బాదంపూడి సాయిలక్ష్మీనరసింహ (ఈసీఈ), బి.బెంజిమన్‌ప్రోక్లిన్ (ఈసీఈ), తాటికొండ వెంకటమన్విత (సీఎస్ఈ), ఎం.రేణుక (సీఎస్ఈ) రోబోటిక్ కారు ప్రాజెక్టును అద్భుతంగా రూపొందించి తృతీయ స్థానం అందుకున్నారు.

▶ దిల్లీకి చెందిన ఎన్ఎస్ఐసీ సెమీకండక్టర్స్ అంతర్జాతీయ కంపెనీ ఏఎంపీ-2025 జాతీయస్థాయి పోటీలు నిర్వహించింది. ఈ ఏడాది ఆగస్టులో హైదరాబాద్, దిల్లీ, బెంగళూరు కేంద్రాలుగా నిర్వహించిన రీజనల్ ఫినాలే పోటీల్లో 2,827 జట్లు పాల్గొన్నాయి. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ఉమ్మడి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అనంతరం దిల్లీలో నవంబరులో జరిగిన గ్రాండ్ ఫినాలే పోటీల్లో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 15 బృందాలు పాల్గొనగా, వీరు మూడో స్థానంలో నిలిచారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే ఒక బృందం తృతీయ స్థానంలో నిలవడంపై పలువురు నుంచి అభినందనలు అందుకున్నారు. కెమెరాలున్న రోబోటిక్ కారుతో ఒక ర్యాక్‌లో ఏ వస్తువులున్నాయి? ఎన్ని ఉన్నాయనేది గుర్తించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. రోబోటిక్ పనిచేసే విధానాన్ని ఆన్‌లైన్‌లో కోడింగ్ చేస్తున్నారు. దీన్ని రోబోటిక్‌లో చేర్చి అది పనిచేసేవిధంగా రూపొందించారు.

యువ

### ఐఐటీ బాంబేకు..

ప్రస్తుతం ఐఐటీ బాంబే కంపెనీ రోబోటిక్స్‌పై పలు ప్రాజెక్టుల ప్రజెంటేషన్‌కు పోటీలు నిర్వహించింది. మొత్తం మూడు రౌండ్లలో విద్యార్థులు ప్రదర్శించారు. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన ఆన్‌లైన్ టాస్క్ పోటీల్లో రోబోటిక్ సాయంతో పంట పొలాల్లో దెబ్బతిన్న పంటను గుర్తించడం, ఎరువుల వాడకం, మంచి పంట, కలుపు మొక్కలను గుర్తించి వేరు చేయడం ఇలా ప్రయోగాలు రూపొందించారు. స్టేజీ-1లో విద్యార్థులు అర్హత సాధించి స్టేజీ-2కు ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీ కళాశాల నుంచి మూడు బృందాలు అర్హత సాధించాయి.

అవార్డును అందుకుంటున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

# దుర్గం చర్చి వయసు 133 ఏళ్లు

చిత్రంలో కనిపిస్తోంది కనిగిరి పట్టణంలోని దుర్గం బాప్టిస్ట్ చర్చి. దీని వయసు 133 ఏళ్లు. బ్రిటిష్ పాలనలో నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. దీనిని 1892లో బ్రిటిష్ అధికారి రెవరెండ్ బ్రౌక్ పాలనలో నిర్మించారు. దీని నిర్మాణంలో వడ్డేపల్లి కోన సాగరం, కేరళ, చెన్నై, గోవా తదితర ప్రాంతాల కూలీలు శ్రమించారు. గోడల నిర్మాణానికి కోడిగుడ్డు సొన, గానుగ సున్నం వినియోగించారు. పైకప్పు కోసం కర్ణాటక రాష్ట్రం మంగుళూరు నుంచి పెంకులు, టేకు కలపను రంగూన్ నుంచి తెప్పించారు. చర్చిలో బ్రిటిష్ పాలకులు ఏర్పాటు చేసిన దర్పణం, గోడ గడియారం నేటికీ మనకు కనిపిస్తాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలు ముస్తాబు చేస్తున్నట్లు చర్చి కమిటీ పెద్దలు తెలిపారు. –న్యూస్‌టుడే, కనిగిరి

తూర్పుగంగవరం వద్ద కరవది మేజర్ కాలువలో సాగర్ జలాలు

# సగమూ రాదాయె.. సాగు లేదాయె

సాగర్ ఆయకట్టు రైతులకు ఇబ్బందుల్లేకుండా సాగునీరందిస్తామని ఎన్ఎస్పీ అధికారులు ప్రకటించడంతో కరవది మేజర్ కాలువ పరిధిలో సుమారు 20 వేల పైగా ఎకరాల్లో రైతులు వరి, మొక్కజొన్న, మిర్చి, పొగాకు తదితర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం కాలువ ద్వారా 280 క్యూసెక్కుల నీరు సరఫరా చేయాల్సి ఉండగా, 120 క్యూసెక్కులు మాత్రమే వస్తుండడంతో పంటలకు సక్రమంగా సాగునీరందడంలేదు. తాళ్లూరు, మాధవరం, కొత్తపాలెం శివరాంపురం, కేవీపాలెం, ఇలపావులూరు, గోనెపల్లివారిపాలెం, గాడిపర్తివారిపాలెం, పల్లామల్లి, దొడ్డవరం, తెల్లబాడు తదితర గ్రామాలకు సాగునీరందక పంటలు ఎండుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏఈ పవన్‌కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సాగర్‌నీరు సరఫరా చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, తాళ్లూరు, మద్దిపాడు

# కాశీవిశ్వేశ్వరా.. కబ్జాలు కనవా?

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని చెన్నకేశవనగర్‌కు ఆనుకుని ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. సర్వే సంఖ్య 225లోని 22.40 ఎకరాల ఆలయ భూముల్లో కొంతమంది ఆక్రమణదారులు శాశ్వత నిర్మాణాలు చేపట్టడమే కాకుండా బోర్లు వేయడంతోపాటు విద్యుత్తు మీటర్లు సైతం పొందిన అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆలయ భూముల మీదుగా కొందరు తమ నివాసాలకు రహదారులు సైతం నిర్మించుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈవో రావెళ్ల శివశంకర్ మాట్లాడుతూ ఆలయ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు జరగడంలేదని చెబుతుండడం గమనార్హం. –న్యూస్‌టుడే, అంజయ్యరోడ్డు (ఒంగోలు)

ఆలయ భూమిలో నిర్మిస్తున్న భవనం

# దరఖాస్తు చేసుకో.. కొత్త కార్డు పట్టుకో

న్యూస్‌టుడే, అర్ధవీడు

ఒకప్పుడు కొత్త రేషన్‌కార్డు పొందాలంటే అవస్థలు తప్పేవి కావు. నెలల తరబడి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చింది. గ్రామ సచివాలయాల్లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేవిధంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. డిజిటల్ సహాయకులకు ఆ బాధ్యతలను అప్పగించింది. జనవరి నుంచి జూన్ మధ్యలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జులైలో, జులై నుంచి డిసెంబరు మధ్యలో నమోదు చేసుకున్న వారికి జనవరిలో కొత్త రేషన్ కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తోంది.

రేషన్‌కార్డులు: 6.61 లక్షలు

చౌక ధరల దుకాణాలు: 1,392

### పెళ్లయినా... పిల్లలున్నా...

కొత్తగా పెళ్లయిన దంపతులకు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే గతంలో పెద్ద ప్రక్రియ ఉండేది. ప్రస్తుతం భార్యభర్తల ఆధార్, భర్త పాత రేషన్‌కార్డు పెళ్లి ధ్రువపత్రం తీసుకుని సచివాలయానికి వెళ్తే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో మ్యారేజ్ స్ప్లిట్ ఆప్షన్‌లో నమోదు చేస్తారు. వారికో నంబరు కేటాయించి దాని ఆధారంగా ఈకేవైసీ చేస్తారు. వీఆర్వో, తహసీల్దారు పరిశీలన అనంతరం అనుమతి రాగానే కొత్త కార్డు మంజూరు చేస్తారు. పిల్లల పేర్లు నమోదు చేసే ప్రక్రియ సైతం సులభతరమైంది. పిల్లల ఆధార్, జనన ధ్రువపత్రాలు, తల్లిదండ్రుల రేషన్‌కార్డు వివరాలు డిజిటల్ సహాయకులకు అందజేయాలి. వీఆర్వో, తహసీల్దారు పరిశీలన అనంతరం కార్డులో పిల్లల పేర్లు నమోదవుతాయి. చిరునామా మార్పు కోసం సైతం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

# మట్టి దందా.. ఆగేదుందా?

ఒక మట్టి లారీ బయటకెళ్లిందంటే రూ.8500లు. అదే రాత్రంతా లారీలు నడిస్తే రూ. లక్షల వ్యాపారం. అలా వచ్చిన ఆదాయంలో అధికారులతోపాటు నాయకులకు ముడుపులు చెల్లించి అక్రమార్కులు అక్రమ వ్యాపారానికి రాచబాట వేసుకుంటున్నారు. మద్దిపాడు పారిశ్రామికవాడ వెనుక వైపు బూరేపల్లి, అన్నంగి గ్రామాల సమీపంలోని కొండలు మట్టి దందాకు అడ్డాగా మారాయి. మొన్నటి వరకు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగించిన వారు బరితెగించారు. స్థానిక నేతలు పై స్థాయి నాయకుల పేరు చెప్పి తవ్వేస్తున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులందినా రెవెన్యూ శాఖాధికారులు హడావుడి చేసి మమ అనిపిస్తున్నారు. గతంలో వైకాపాలో చక్రం తిప్పిన కొందరు నాయకులు ప్రస్తుతం అధికార పార్టీ నాయకులతో జత కట్టి మట్టి అక్రమ రవాణాలతో సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు కొండలను పిండి చేసేస్తున్నారు.

–న్యూస్‌టుడే, మద్దిపాడు

# సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

న్యూస్‌టుడే, సి.ఎస్.పురం, పామూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పదో తరగతి విద్యార్థుల కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఈ నెల 6న కార్యక్రమం ప్రారంభమై వచ్చే ఏడాది మార్చి 14వ తేదీ వరకూ వంద రోజుల ప్రణాళిక అమలు జరుగుతోంది. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా అన్ని ఉన్నత పాఠశాలల్లో సెలవు రోజుల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తరగతులకు హాజరయ్యే పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే యోచనతో కూటమి ప్రభుత్వం వారికి సెలవు రోజుల్లోనూ బడిలోనే మధ్యాహ్న భోజనం అందిస్తోంది. ఈ నెల 7వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో అమల్లోకి తీసుకొచ్చారు.

పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

17,298 మందికి లబ్ధి..

జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి 17,298 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరంతా ఈ నిర్ణయంతో లబ్ధి పొందుతున్నారు. ఆదివారాలు, రెండో శనివారాలు కలుపుకొని వచ్చే ఏడాది మార్చి 16వ తేదీ వరకు 19 సెలవులొచ్చాయి. పండగలు, ఇతర సెలవులతో మొత్తంగా 25 రోజుల వరకు అదనంగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

# వారసత్వ భూములకు ఊతం

▶ రిజిస్ట్రేషన్లపై తగ్గిన ఛార్జీల భారం

న్యూస్‌టుడే, కలెక్టరేట్

వారసత్వంగా సంక్రమించే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఛార్జీల భారం తగ్గనుంది. ఆస్తుల పంపకాల విషయంలో కూటమి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. తండ్రి లేదా తల్లి మృతి అనంతరం కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి పంపకం ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుం విషయంలో మార్పులు చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో వారసత్వంగా రానున్న వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింత పెరగనుంది. భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఆస్తి పత్రాలు నమోదులో పాటించాల్సిన విధానాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ విడుదల చేసింది.

### వ్యవసాయ భూములకే..

జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో కుటుంబ ఆస్తులకు సరాసరిన రోజుకు 2 లేదా 3 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వ్యవసాయ భూములతోపాటు ఇతర స్థిరాస్తులు కూడా కలిపి ఇప్పటివరకు ఇకే దస్తావేజులు రాసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో వ్యవసాయ భూమికి మాత్రమే ఫీజుల భారం తగ్గించారు. ప్రస్తుతం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లకు ఆస్తి విలువపై ఒక శాతం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలి. వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల్లోపు ఉంటే స్టాంప్ డ్యూటీ రూ.100, రూ.10 లక్షలపైగా ఉంటే రూ.1,000 చెల్లిస్తే సరిపోతుంది. రిజిస్ట్రేషన్‌తో పట్టాదారు పాసుపుస్తకాలతోపాటు పూర్తిహక్కులు వారసులకు రానున్నాయి. జిల్లాలోని 2.70 లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

### స్టేట్‌మెంట్లు నమోదు చేసి..

వారసత్వంగా సంక్రమించే వ్యవసాయ భూముల వివరాలకు సంబంధించి ఇప్పటివరకు కుటుంబ పెద్ద మృతిచెందితే ఆయన కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రంతో భూవివరాల మార్పిడి (మ్యుటేషన్)కు సచివాలయాల్లో దరఖాస్తు చేసేవారు. సభ్యుల నుంచి వీఆర్వో స్టేట్‌మెంట్ నమోదు చేసి ఆర్ఐ ద్వారా తహసీల్దారుకు నివేదిస్తారు. తదనంతరం భాగపంపిణీ ప్రకారం వెబ్‌ల్యాండ్‌లో రైతుల పేర్లు నమోదు చేసేవారు. ఇందుకు రెవెన్యూశాఖాధికారులు విస్తీర్ణం ఆధారంగా రూ.5 వేలు నుంచి రూ.20 వేలు వరకు అనధికారికంగా వసూలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# జనహితం... ఆమె అభిమతం

▶ సమాజ సేవలో ఉపాధ్యాయిని బషీరున్నీసాబేగం

న్యూస్‌టుడే, కనిగిరి

వనితా వందనం

తన వంతు ప్రయత్నంగా సమాజంలో కొంతైనా మార్పు తీసుకురావాలనే ధ్యేయంతో ఓ పక్క పాఠశాలలోని విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ.. మరోపక్క ప్రదర్శనలు, కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతుతున్నారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని షేక్ బసీరున్నీసాబేగం. ఈమె కనిగిరి మండలం చల్లగిరగల పంచాయతీ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరమహిళలు, దేశ చరిత్రపై ఏకపాత్రాభినయం నాటికలు ప్రదర్శిస్తున్నారు. పాఠశాలలో సైతం తాను నటించి ప్రదర్శించడమే కాకుండా విద్యార్థులతో రాణి రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినినాయుడు, చాకలి ఐలమ్మ, సావిత్రిబాయిపులె ఇలా ఎంతోమంది నారీమణులపై ప్రదర్శనలిస్తున్నారు. ప్లాస్టిక్‌తో వచ్చే వ్యాధులు, మూఢ నమ్మకాల ద్వారా జరిగే అనర్థాలు, బాల్య వివాహాల కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణ తదితర వాటిపై గ్రామాల్లో నాటికలు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తన ప్రదర్శనల ద్వారా గ్రామీణ ప్రజలతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను చైతన్యవంతులను చేస్తూ అందరితోనూ శెభాష్ అనిపించుకుంటున్నారు. 'సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలపై ప్రదర్శనలివ్వడం ద్వారా అన్ని వర్గాలవారిని చైతన్యవంతులుగా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని చెబుతున్నారు షేక్ బషీరున్నీసా.

మేకులపై నిలబడిన బషీరున్నీసా బేగం

(c) eenadu

# చెరువు నిండుగా.. దాహార్తి తొలగగా..!

● పట్టణం, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధికి అవకాశం

పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, పరిసర ప్రాంతాల నివాసితుల దాహార్తి తీర్చడానికి, కరవు సమస్యల దూరం చేయడానికి అండగా నిలుస్తోంది.. మార్కాపురం చెరువు.
- న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

పూర్తి స్థాయిలో నిండిన మార్కాపురం చెరువు

### దశాబ్దం అనంతరం నిండుకుండలా...

మొంథా తుపాను పుణ్యమా అని మార్కాపురం చెరువు దాదాపు 10 సంవత్సరాల తరువాత పూర్తిస్థాయి నిండటం విశేషం. దీంతో పట్టణానికి దాదాపు 3 సంవత్సరాల వరకు నీటి సమస్య ఉండదని అధికారులు, ప్రజలు చెబుతున్నారు. గతంలో చెరువులో నీరు లేకపోవడంతో పట్టణ శివారులోని డ్రైవర్స్‌కాలనీ, ఎస్టేట్, పీఎస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో చాలా బోర్లు వట్టిపోయాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో చెరువు నిండటంతో పుష్కలంగా డీప్‌బోర్లకు నీరు వస్తుంది.● నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని త్రిపురాంతకం మండలం దూపాడు నుంచి మార్కాపురం పట్టణానికి 2005లో సాగర్ నీటి పైపులైను ఏర్పాటు చేశారు. ఈ పథకం నడుస్తున్నా పురవాసులకు వేసవిలో నీటి కష్టాలు వెంటాడేవి.

### గజపతి రాజుల కాలంలో...

ఒడిశా రాజధానిగా చేసుకొని పరిపాలించిన గజపతి రాజుల ఏలుబడిలో ఉప అధికారి తెలుగు రాయుడు 15వ శతాబ్దంలో మార్కాపురం చెరును తవ్వించారని చరిత్ర చెబుతోంది. ● మొత్తం 584 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు కాల క్రమంలో 50 నుంచి 80 ఎకరాల దాకా ఆక్రమణలకు గురైందని లెక్కలు చెబుతున్నాయి.

### రెండు దశాబ్దాలుగా వరి సాగు లేదు

దీని కింద వరి సాగు విస్తీర్ణం 1,101 ఎకరాలు. సుమారు రెండు దశాబ్దాలుగా వరిసాగు చేయడం లేదు. కారణం ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడం. దీనికితోడు వర్షాలు లేక చెరువు ఎండిపోవడం. అయితే నవంబర్‌లో కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయి నిండి అలుగు పారింది. ప్రస్తుతం మార్కాపురం చెరువు కట్ట పైకి వెళితే ఒక పక్క నిండిన చెరువు.. మరో పక్క చిల్లచెట్లతో ఉన్న మాగాణి పొలాలు మనకు కనిపిస్తాయి.

## సనాతన బోర్డు ఏర్పాటుకు డిమాండు

మాట్లాడుతున్న స్వామీజీలు, మఠాధిపతులు, సాధువులు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందువులకు సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు స్వామీజీలు, మఠాధిపతులు, సాధువులు కోరారు. సాధు సంత్ పరిషత్ అధ్యక్షుడు త్రిపుర భైరవేశ్వరానంద, త్రిపురాంతక క్షేత్ర పరిరక్షణ విభాగ్ అధ్యక్షుడు యామర్తి ధనుంజయరావు ఆధ్వర్యంలో బాలాత్రిపురసుందరీదేవి ఆలయం సమీపంలో ఆదివారం హిందూ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులు, ముస్లింలకు ప్రభుత్వాలు పలు రాయితీలు కల్పిస్తున్నాయని, అదేవిధంగా హిందువులు, స్వామీజీలు, మఠాధిపతులకు కూడా ఇవ్వాలని కోరారు. సనాతన బోర్డు ఏర్పాటుచేసి దేవాదాయ శాఖకు అనుబంధం చేయాలన్నారు. సమావేశంలో బెనారస్ స్వామి, నక్షత్రం మౌన స్వామి, అరుణాచలం రుద్రాక్ష స్వామి, మంగళగిరి గౌడీయ మఠం పీఠాధిపతి బాలస్వామి, పంచలింగాల పీఠాధిపతి నరసింహ స్వామి, నెల్లూరు శ్రీనివాస యోగి, తిరుపతి భాగ్యేశ్వర రుషి, అన్నమయ్య పీఠాధిపతి విజయ శంకర స్వామి, మాతాజీలు, సాధు సంత్‌లు, త్రిపురాంతక క్షేత్ర పరిరక్షణ విభాగం కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంను కలవాలంటూ పోస్టుకార్డులు


తయారు చేసిన ప్రత్యేక గిఫ్ట్, పోస్టు కార్డులతో హుస్సేన్ పీరా

న్యూస్‌టుడే, కంభం: కంభం పట్టణానికి చెందిన సయ్యద్ హుస్సేన్ పీరా (88) తెదేపా సీనియర్ కార్యకర్త. ఆయన పార్టీకి సంబంధించిన గుర్తులను తయారు చేస్తూ గుర్తింపు పొందారు. 2021లో చంద్రబాబు నాయుడు ఆయన్ను పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించుకొని మరీ మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కలవాలని చెప్పారు. ప్రజాదర్బార్‌లో రెండు సార్లు సీఎంను కలిసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దాంతో ఆయన ముఖ్యమంత్రిని కలిసేందుకు, విషయం తెలియజేసేందుకు పోస్టు కార్డులు సీఎంకు రాశారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కల్పించాలని కోరుతూ పోస్టు కార్డులు రాసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కోసం పార్టీ సింబల్ గిఫ్ట్ తయారు చేసినట్లు చెప్పారు. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరారు.

వై.కొత్తపల్లెలో తెగులు సోకిన బొప్పాయి తోట

## బొప్పాయికి తెగులు.. రైతన్నకు దిగులు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఏర్పడిన ముసురు, వాతావరణ మార్పులతో బొప్పాయి పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. తడి వాతావరణంలో వచ్చే వైరస్ తెగులు రైతులను కలవరపెడుతోంది. నియోజకవర్గంలో దాదాపు 2వేల హెక్టార్లకుపైగా ఈ పంట సాగైంది. ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ఈ వైరస్ వ్యాప్తి తగ్గడంలేదని, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని రైతులు వాపోతున్నారు. మెగ్నీషియం, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పిచికారీ చేస్తే కొంతైనా ఫలితముంటుందని ఉద్యాన అధికారులు పేర్కొంటున్నారు.

## ప్రజల గుండెల్లో రంగా చిరస్మరణీయుడు

వెంకయ్య, రంగా, కృష్ణదేవరాయల విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్న వంగవీటి రాధ, గొట్టిపాటి లక్ష్మి తదితరులు

దర్శి, న్యూస్‌టుడే: పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి, రంగా తనయుడు రాధా అన్నారు. దర్శి పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహన్‌రంగా, మాజీ సర్పంచి వెంకయ్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. లక్ష్మి, రాధ మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి వచ్చి అంచెలంచెలుగా ఎదిగి ప్రజలకు సేవలు అందించారన్నారు. రంగా ఆశయ సాధనకోసం నేటి యువత కృషి చేయాలన్నారు. శ్రీకృష్ణదేవరాయలు ఆనాడు ప్రజలకోసం పని చేశారని, మాజీ సర్పంచి వెంకయ్య సేవలు మరువలేమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి నియోజకవర్గ అభివృద్ధికి లక్ష్మి నిరంతరం కష్టపడుతున్నారని రాధా అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, నాయకులు డా.లలిత్‌సాగర్, మద్దిశెట్టి శ్రీధర్, వరికూటి నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, ఏఎంసీ ఛైర్‌పర్సన్ నాగవేణి సుబ్బారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. ఒంగోలులోని 49వ డివిజన్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా విధానాలపై చర్చించి ప్రత్యామ్నాయ పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. తొలుత సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు వి.మాలకొండయ్య, జి.రమేష్, వీరాస్వామి, డి.వెంకటేశ్వర్లు, రామయ్య, ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పునాదుల్లో ఎస్సీ బాలికల వసతి గృహం పనులు

## శరవేగంగా వసతి గృహ నిర్మాణం

న్యూస్‌టుడే, చీమకుర్తి: చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయం పక్కనే ఎస్సీ బాలికల వసతి గృహం నూతన భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. దీనికోసం డీఎంఎఫ్ నిధులు రూ2. కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. నిధులు మంజూరైనా విద్యార్థినులకు తాత్కాలిక వసతి సమస్యగా మారడంతో నెలల తరువాత పనులు ప్రారంభించని పరిస్థితి. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలతో ఎట్టకేలకు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల భవనంలో పిల్లలకు తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గుత్తేదారు పనులు ప్రారంభించారు. ముందుగా పాత భవనాన్ని తొలగించారు. ప్రస్తుతం పునాదుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తి అయితే ఆ మేరకు విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లవుతుంది.

పతకాలతో జిల్లా క్రీడాకారులు

## ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బాపట్లలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రకాశం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పతకాల వారీగా 19 బంగారు, 12 వెండి, ఇత్తడి 8 చొప్పున సొంతం చేసుకున్నారు. 14 మంది క్రీడాకారులు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించనున్న 7వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ విషయాన్ని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.సురేష్‌కుమార్, దాసరి విజయభాస్కర్ తెలిపారు.

## రూ.1.59 కోట్లతో వాటర్ షెడ్ పనులకు భూమిపూజ

మొక్కను నాటుతున్న పీడీ నజీముద్దీన్, నాయకులు

టంగుటూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన- వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ (పీఎం కేఎస్‌వై-డబ్ల్యూడీసీ2.0) పథకం కింద టంగుటూరు మండలం కొణిజేడులో నీటి కుంట ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ మెరుగుపరచడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన జీవనోపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ఈ గ్రామంలో వాటర్ షెడ్ నిర్మాణానికి రూ.1.59 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటర్ షెడ్ పీడీ నజీముద్దీన్, వాటర్ షెడ్ చైర్మన్ గుమ్మా శ్రీను, ఇతర అధికారులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్ మల్లికార్జున, కిరణ్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రామారావు, సంతనూతలపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దు దాడిలో రైతు మృతి

అర్ధవీడు, న్యూస్‌టుడే: ఎద్దు దాడి చేయడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన గన్నేపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గన్నేపల్లికి చెందిన షేక్ పెద్దమాబు (65) రైతు. ఆదివారం ఆయన పొలంలో పనులు చేస్తున్నారు. కాడి నుంచి తప్పిస్తున్న క్రమంలో ఓ ఎద్దు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై శివ నాంచారయ్య పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## రైళ్లలో చోరీలు జరగకుండా ప్రత్యేక నిఘా

దస్త్రాలను తనిఖీ చేస్తున్న శైలేష్ కుమార్

దొనకొండ, న్యూస్‌టుడే: రైళ్లలో దొంగతనాలు జరగకుండా నిఘా పెంచామని గుంటూరు డివిజినల్ ఆర్పీఎఫ్ అడిషనల్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్ కుమార్ తెలిపారు. దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ స్టేషన్‌లోని దస్త్రాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైళ్లలో ప్రయాణికుల బంగారు ఆభరణాల చోరీ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నందున.. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి కొంతమంది దొంగలను పట్టుకున్నామని చెప్పారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. త్వరలో డ్రోన్ కెమెరాలు వస్తాయని, వాటి సహాయంతో ఎక్కడ ఉన్నా నిందితులను గుర్తిస్తామని తెలిపారు. డివిజన్‌లో 10 ఆర్పీఎఫ్ స్టేషన్లు ఉన్నాయని, సిబ్బంది కొరత ఉందని త్వరలో కొత్తవారిని ఎంపిక చేస్తామన్నారు. ప్రయాణికులు తమ సామాన్లు, ఫోన్లు భద్రపరచుకోవాలని కిటికీల పక్కన కూర్చున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏఎస్సై వీరాంజనేయులు, సిబ్బంది కోటిరెడ్డి, ప్రకాష్, మల్లికార్జున, అజయ్ పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లకు బానిసై యువకుడి ఆత్మహత్య

కంభం, న్యూస్‌టుడే : రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై కుమారి కథనం మేరకు.. మార్కాపురం మండలం బిరుదులనరవకు చెందిన కిక్కిరి నరేంద్రరెడ్డి (23) బీటెక్ చదివాడు. తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై మూడు రోజుల కిందట సొంతూరికి వచ్చాడు. తిరిగి శ్రీసిటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ హైదరాబాద్‌లో ఉంటున్న తన అన్న నాగార్జునరెడ్డికి చరవాణిలో మెసేజ్ పెట్టాడు. తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కింద పడి మృతిచెందాడు. తల, మొండెం వేరయ్యాయి. మృతుడికి తండ్రి మునిరెడ్డి, సోదరుడు ఉన్నారు. తల్లి చాలా కిందట మృతి చెందింది. నంద్యాల రైల్వే ఎస్సై కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీటి సమస్య నివారణకు ట్యాంకర్లతో సరఫరా

ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు గ్రామ పంచాయతీలో ఆదివారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. గుండ్లకమ్మ జలాశయం సీపీడబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి పథకం మోటార్లు మరమ్మతుల వల్ల నీటి సరఫరా నాలుగు రోజులపాటు నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మద్దిపాడు గ్రామ పంచాయతీ సర్పంచి మద్దినేని వెంకటేశ్వర్లు, కార్యదర్శి నూరుల్లా ఆధ్వర్యంలో రెండు ట్రాక్టర్ ట్యాంకర్లతో అరుంధతి నగర్, ఇస్లాంపేట ప్రజలకు నీరు సరఫరా చేశారు. విడతల వారీగా గ్రామస్థులకు అందిస్తామని అధికారులు తెలిపారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక ట్రిపుల్ ఐటీ కళాశాలను హయ్యర్ ఎడ్యుకేషన్ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ సందర్శించారు. ఆధారం కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సుధాకర్ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో ఎల్.చంద్రశేఖర్, డీన్ రూపన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎ.పావని, ప్రోగ్రామ్ అధికారులు లావణ్య, భాస్కర్, చాముండేశ్వరీదేవి, మాధవీలత, మాలకొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుష్కరాల పేరుతో ప్రజా ధనం వృథా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పుష్కరాల్లో మునిగితే పుణ్యం కాదు అంటు రోగాలు వస్తాయని భారత హేతువాద సంఘాధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య వివరించారు. ఆదివారం ఎన్జీవో కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుష్కరాలకు రూ.వేలకోట్ల ప్రజాధనం వృథాగా ఖర్చు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగల్ కాలేషా బేగ్, సభ్యులు పి.ఎస్.రంగారెడ్డి, ఒంగోలు నాగేశ్వరరావు, సుబాని, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 125, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251

మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ సుచిత్ర

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయండి

టంగుటూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి పాటుపడాని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా ముప్పవరపు సుచిత్ర, నాయకులు తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట టంగుటూరు, నాగులుప్పలపాడు మండలాల తెదేపా అధ్యక్షులు చదలవాడ చంద్రశేఖర్, తేళ్ల మనోజ్, సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఒంగోలులో ఆదివారం జరిగింది. టంగుటూరు మండలం ఆలకూరపాడుకు చెందిన లేళ్లపల్లి రాజేష్‌బాబు (37) ఒంగోలులోని థైరోకేర్ ల్యాబ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఆ ల్యాబ్ నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. రాజేష్‌బాబు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. అతని సమీప బంధువు మట్టిగుంట జనార్దనర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్సై ఫణిభూషణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంచికంటి బోధన స్ఫూర్తిదాయకం

మంచికంటి వెంకటేష్‌ను సన్మానిస్తున్న పలు సాహితీ సంస్థల ప్రతినిధులు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: జిల్లాలోని కొండెపి మండలం జాళ్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా మంచికంటి వెంకటేష్ మాస్టారు విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పిల్లల వికాసానికి బడినే కేంద్రంగా చేసుకొని అమలు చేస్తున్న బోధనా పద్ధతులు స్ఫూర్తిదాయకం అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్, సోషల్ మీడియా ద్వారా ప్రశంసించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అన్ని సోషల్ మీడియా గ్రూపుల్లోను ఈ విషయాన్ని ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, శ్రీకృష్ణదేవరాయల సాంస్కృతిక సేవా సంస్థ, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లా గ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తేళ్ల అరుణ, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, కుర్రా ప్రసాద్ బాబు, కాంతి నల్లూరి, కాళహస్తి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటన మండలంలోని ముప్పవరంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నుంచి టంగుటూరు మీదుగా గోగినేనివారిపాలేనికి బస్సు వెళ్తుంది. ముప్పవరం గ్రామం మలుపు వద్ద ప్రయాణికులు దిగేందుకు ఆగింది. ఈ క్రమంలో కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్న లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై పెద్దపెద్ద కేకలు వేశారు. ఎవరికీ ఎటువంటి అపాయం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# అప్పు తీర్చేందుకు మత్తు దందా

● ముగ్గురు నిందితుల అరెస్టు.. ॥ గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

అరెస్టయిన నిందితులు

ఈనాడు, హైదరాబాద్: బెంగళూరులోని డ్రగ్స్ ముఠాలతో సంబంధాలు పెంచుకొని సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న యు.కార్తిక్ (37), సీహెచ్.బాలాజీ (32), టి.దీపక్ (29)లను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన కార్తిక్ అలియాస్ అలెక్స్ చదువు మధ్యలో ఆపేశాడు. కొంతకాలం మిల్క్ ఏజెన్సీ, గ్రానైట్ వ్యాపారం చేసి నష్ట పోయాడు. సుమారు రూ.2 కోట్ల వరకు ఉన్న అప్పుల నుంచి బయటపడేందుకు అడ్డదారి ఎంచుకున్నాడు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చి నేరేడ్‌మెట్‌లో స్థిరపడిన బావమ్మర్ది బాలాజీతో కలిసి మత్తుదందా ప్రారంభించాడు. 2016లో బీఎస్సీ పూర్తిచేసిన బాలాజీ 2022 నుంచి తండ్రి వ్యాపారం చూసుకుంటున్నాడు. ఎండీఎంఏకు అలవాటపడ్డాడు. డ్రగ్స్ విక్రయిస్తూ అరెస్టయ్యాడు. జైలు నుంచి రాగానే బావతో జతకట్టాడు. వీరిద్దరికీ జీడిమెట్లకు చెందిన దీపక్ తోడవటంతో ముగ్గురు కలసి మత్తు పదార్థాలు సరఫరా, విక్రయం ప్రారంభించారు. ప్రధాన నిందితుడు బాలాజీ బెంగళూరులోని నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ గ్రాము 4 నుంచి 5 వేలకు కొనుగోలు చేసేవాడు. ఆ సరుకును మిగిలిన ఇద్దరు గ్రాము 7 నుంచి 8 వేలకు విక్రయించేవారు. నూతన సంవత్సర వేడుకలకు పెద్దఎత్తున ఎండీఎంఏ తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. వారి కదలికలపై నిఘా ఉంచిన ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి, ఎస్సై బి.మనోజ్‌కుమార్, మాసబ్ ట్యాంక్ డీఐ శ్రీనివాసరావు బృందం అరెస్ట్ చేసింది.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

FLAT FOR SALE

23 లక్షలకే రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటి నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం|| 89196 28403.

ఒంగోలు NH5 దగ్గర అండర్ కన్‌స్ట్రక్షన్ 2BHK అపార్ట్‌మెంట్ Rs 4500/- SFT లోన్ సౌకర్యం కలదు. సంప్ర: 9490938346.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE

ఒంగోలు మంగమూరురోడ్డు మిలటరీ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఈస్ట్ ఫేస్ 13 గదులు 16 వెడల్పు 61 లోతు స్థలం అమ్మబడును. సెల్.9247846496.

JOBS

Wanted Spare Parts In-charge, Assistant, Customer Relationship Executive & Cashier. Location: Saripudi Suzuki, Wood Complex, Ongole. ✆ 77999 60199 & 149.

ఫ్యామిలీమార్ట్ సూపర్ మార్కెట్, శారీ షాపుల్లో పని చేయుటకు సేల్స్‌గర్ల్స్, డేటా ఎంట్రీ చేసే వారు కావాలి (గర్ల్స్). అడ్రస్: సాయిబాబా టెంపుల్ రోడ్ OPP: కాంగ్రెస్ పార్టీ ఆఫీసు, 4 రోడ్స్ జంక్షన్ (లాయరుపేట కొంజేడు బస్టాండ్, గద్దలగుంట, మర్రిచెట్టురోడ్స్) ఒంగోలు ప్రకాశం. 9849466026

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్ /ముత్తూట్ /మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 97039 71968.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌చార్జ్స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

ఒంగోలు రజా హిందుస్తాన్ నిధి బ్యాంకు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 9966352087

BRఇన్‌ఫ్రాకాన్ నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లమో, B.Tech, M.Tech కల్గి పైపులైన్లు ఇరిగేషన్ వర్క్స్ నందు 3 నుండి 4 సం||ల అనుభవం కల్గి ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాలలో పనిచేయుటకు పూర్తి బయోడేటాను info@brinfracon.comకు పంపగలరు. ✆ 7995557831.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ACCOUNTING

Wanted Tally Accountant (Male) 3+ Years Experience. With Computer Knowledge & Accounts. Contact: 9703402722

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..
B/w 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

# మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

## పిల్లల చదువుల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకం

మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం పట్టణం: పిల్లల చదువుల్లో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైందని మార్కాపురం డీఎస్పీ నాగరాజు అన్నారు. పట్టణంలోని ఓంసాయి వికాస్ విద్యానికేతన్‌లో ఆదివారం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి, చెడులు, సమాజ పరిస్థితులు, చరవాణి ప్రభావం వంటి వాటిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్.గమనం, పాఠశాల ప్రిన్సిపల్ పీవీ.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక జిల్లాతో పశ్చిమప్రాంత అభివృద్ధి

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

పొదిలి, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతం అభివృద్ధి ప్రత్యేక జిల్లాతోనే సాధ్యమని తెదేపా నాయకులు అన్నారు. ఆదివారం మాదాలవారిపాలెం గ్రామంలో తెదేపా ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లాగా చేసినప్పుడే ప్రత్యేక నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్, నాయకులు డి.అంజిరెడ్డి, ఓబులరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, యల్లమంద, వెంకట్రావు, ఖుద్దూస్, నరసింహారాజు, గ్రామ తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తవ్వకాలతో నిలిచిన నీటి సరఫరా

సైడ్ కాలువలో దెబ్బతిన్న పైపులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలోని పాత రిజిస్ట్రార్ బజారు, అసిఫ్‌నగర్, మసీదు బజారులో డ్రైనేజీ కోసం కాలువలు తీశారు. ఈ పనుల కారణంగా ఇరవై రోజుల నుంచి ఆయా కాలనీలకు సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. కాలువలు తీసే సమయంలో నీటి పైపులు పగిలిపోయాయి. తదనంతరం కొన్నిచోట్ల మరమ్మతులు చేపట్టినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సరఫరా పునరుద్ధరించి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జడ్సన్‌పాల్‌ను సంప్రదించగా, కాలువల నిర్మాణంతో పైపులు దెబ్బతిన్నాయన్నారు. త్వరలో నీటి సరఫరా చేస్తామన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడాదుస్తుల అందజేత

దాత అందించిన క్రీడా దుస్తులతో ఎంఈవో-I మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన క్రీడా దుస్తులను బేస్తవారపేటకు చెందిన తెదేపా నాయకులు యాలం వెంకటేశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

## టిప్పర్ బీభత్సం.. నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురంలోని డీజీపేట రహదారిలో ఆదివారం రాత్రి ఓ టిప్పర్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం పడడం వల్ల విద్యుత్తు కండక్టర్ తీగలు గృహాలపై పడ్డాయి. వెంటనే విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన ఈ టిప్పర్లను డ్రైవర్లు వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## అత్త గొంతుకోసిన అల్లుడు

చికిత్స పొందుతున్న రమణమ్మ

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: అత్తపై అల్లుడు దాడి చేసి గొంతు కోశాడు. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు అతనిపై దాడి చేసి గాయపర్చారు. ఈ సంఘటన మండలంలోని గడ్డమీదపల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డమీదపల్లెకు చెందిన ఎర్రబోలు చిననారాయణ తన కుమార్తె అంజలిని.. అత్త రమణమ్మ సోదరుడు వీరనాగరాజుకు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఏడు నెలల కిందట అంజలిని భర్త మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి చిననారాయణకు అత్త రమణమ్మకు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి చిననారాయణ మద్యం తాగి అత్త ఇంటికి వెళ్లి ఆమెపై కత్తితో దాడిచేసి గొంతు కోశాడు. దీంతో రమణమ్మ బంధువులు దాడి చేయడంతో చిన నారాయణకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులను ఆసుపత్రిలో చేర్పించారు. ఇద్దరికీ ప్రాణాపాయం లేదని బంధువులు చెప్పారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## ట్రాక్టర్ బోల్తా..

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ జాతీయ రహదారిలో ట్రాక్టర్ బోల్తా కొట్టిన సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులు సింగరాయకొండలో వంట సామగ్రి కొనుగోలు చేసుకుని ట్రాక్టరులో తిరిగి వెళ్లే క్రమంలో కందుకూరు వెళ్లే పైవంతెన సమీపంలోని సర్వీసు రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ట్రాక్టరులో కూర్చుని ఉన్న నాగేశ్వర్, రాహుల్, మట్టాలతోపాటు మరొకరు గాయపడ్డారు. స్థానికుల సంచారంతో అక్కడికి చేరుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## ప్రోత్సహిస్తున్నారు.. పతకాలు తెస్తున్నారు

❖ క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

క్రీడావని

విద్యార్థులను ప్రోత్సహిస్తే చదువులోనే కాదు ఆటల్లోనూ ప్రతిభ చూపుతారు. ఇందుకు ఉదాహరణగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలుస్తున్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌సత్తార్, పీడీలు సుబ్రహ్మణ్యం, విజయ్‌ల ప్రోత్సాహంతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. - న్యూస్‌టుడే, కంభం

### అథ్లెట్‌గా రాణించాలని..



పాఠశాలలో పదో తరగతి చదువుతున్న **ఎం.మనోజ్‌కుమార్** లాంగ్ జంప్ విభాగంలో ప్రతిభ చూపుతున్నాడు. జిల్లా స్థాయిలో బహుమతులు సాధించాడు. భవిష్యత్తు మరిన్ని బహుమతులు సాధించేందుకు పీడీల వద్ద శిక్షణ పొందుతున్నాడు. అథ్లెటిక్‌గా సాధించాలని సాధన చేస్తున్నానని తెలిపాడు.

### ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యం

కంభానికి చెందిన **కె.శివనాగేష్** స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో హేమర్ త్రో పోటీల్లో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించాడు.

### పోటీల్లో రాణించేందుకు కృషి చేస్తున్నా..



కంభం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న **డి.ఖాదర్ బాషా** పరుగు పోటీల్లో ప్రతిభ చూపుతున్నాడు. మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన 3 కిలో మీటర్ల పరుగులో మొదటి స్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాడు. భవిష్యత్తు పరుగు పోటీల్లో రాణించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

## తెలుగు పోటీల్లో రాణింపు

ప్రశంసాపత్రంతో రోహిత్

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక విశ్వభారతి పాఠశాల విద్యార్థి రఘుపతి రోహిత్ రాయల్ ఇటీవల 'మన సంస్కృతి సంస్థ' నిర్వహించిన తెలుగు ప్రతిభా పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం దక్కించుకున్నాడు. తిరుపతిలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో వీసీ కృష్ణమూర్తి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## ఖురాన్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

విజేతలతో జేఐఎం సభ్యులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం యుఎఫ్ క్యూసీ-జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏ-1గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దైవ చింతన పెరుగుతుందన్నారు. చిన్నానాటి నుంచే విద్యార్థులకు మంచి అలవాట్లు, కట్టుబాట్లు నేర్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం గెలుపొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. జేఐఎం నాయకులు అబ్దుల్ రహమాన్, అలీ, గౌస్‌ఖాన్, ఇస్మాయిల్, జమాత్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనాల సమర్పణ

పోలేరమ్మ అమ్మవారు

కంభం: పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కుంకుమబండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి చీరలు, గాజులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వాహన పూజలు చేశారు.

మార్కాపురం పట్టణం : పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ఆలయంలో వెలసిన నాగమయ్య విగ్రహాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా విళక్కి మహోత్సవం..

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం విళక్కి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పడిపూజ చేశారు. అనంతరం అర్చకులు పాలు, నెయ్యి, తేనె, పుష్పాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మాలధారుల శరణు ఘోషతో ఆలయం మార్మోగింది. ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

• రాచర్ల, న్యూస్‌టుడే: రాచర్ల పంచాయతీలోని అయ్యప్పస్వాములు స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేసి ఇరుముడులు కట్టుకొని ఆదివారం శబరిమలకు బయలుదేరివెళ్లారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని స్వామికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అన్నదాన కమిటీ ఛైర్మన్ సుధీర్‌కుమార్‌రెడ్డి, తెదేపా నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: పట్టణంలోని బోర్డు స్కూల్ సమీపంలో రైతు సేవా కేంద్రం ఎదురుగా రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోయి పక్కనే ఉన్న పంట కాలువలో పడుతోంది. చెత్తను తొలగించాలి. – శ్రీనివాసులు, స్థానికుడు
✓: రైతు సేవా కేంద్రం వద్ద ఉన్న చెత్త తొలగింపజేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో, కంభం

?: పట్టణంలోని గాంధీ, నెహ్రూ, పేరం బజార్లలో గత కొద్ది రోజులుగా మురికి కాలువల్లో మురుగు సరిగా తీయడం లేదు. దీంతో ఎక్కడి మురుగు అక్కడ నిలిచి దుర్వాసన వస్తోంది. దీనిపై మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. -పి.కుమార్, పట్టణవాసి
✓: ఆ సమస్య మా దృష్టికి రాలేదు. పట్టణంలో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఈ సమస్యను కూడా పరిష్కరించేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. -డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

?: రంగాపురం గ్రామంలోని మసీదు, సచివాలయం సమీపంలోని ప్రధాన వీధులన్నీ మురుగుతో అపరిశుభ్రంగా ఉన్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. – రమేష్, రంగాపురం.
✓: పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి పారిశుద్ధ్య పనులు చేపడతాం.
–వీరరాజు, ఈవోపీఆర్డీ, అర్ధవీడు.

?: వై.పాలెం నుంచి త్రిపురాంతకం వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి గోతులు పడి అధ్వానంగా తయారైంది. కొత్త రోడ్డు వేయించి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి. –అంజి, వై.పాలెం
✓: రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. –షబ్బీర్, ఆర్అండ్‌బీ ఏఈ
- న్యూస్‌టుడే, కంభం, మార్కాపురం పట్టణం, అర్ధవీడు, యర్రగొండపాలెం

## అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు

ఎల్.కోట పంచాయతీ సూరేపల్లిలోని మినీ మంచినీటి ట్యాంకు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. దాని చుట్టూ పాచిపట్టి ఉంది. నీరు పట్టుకునేందుకు ఇబ్బందికరంగా మారింది. ట్యాంకు నిండినా మోటారు ఆపకపోవడంతో జలం వృథాగాపోతోంది. సిబ్బందిని పంపించి ట్యాంకు, పరిసరాలు బాగు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి తరంగిణి తెలిపారు.
- కంభం, న్యూస్‌టుడే

## చంద్రన్నను కలిసేందుకు సైకిల్ యాత్ర

నంద్యాల జిల్లాకు చెందిన తెదేపా నాయకుడు పార్టీ అధినేతను కలిసేందుకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. పాతకోట గ్రామానికి చెందిన పగడాల సొసైటీ డైరెక్టర్, తెదేపా నాయకుడు కొట్టం శంకర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు ఈ నెల 12న బయలుదేరారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి లోకేశ్‌ను కలిసి యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని కోరనున్నట్లు చెప్పారు. మేడపి పార్టీ కన్వీనర్ ఆనందరావు, గుర్రం సునీల్ తదితరులు స్వాగతం పలికారు. - త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే

## నిర్వహణ నీటికొదిలి..

మండలంలోని కేతగుడిపి పంచాయతీలోని తాగునీటి ట్యాంక్ కుళాయిల నిర్వహణ పట్టించుకోకపోవడంతో అవి దెబ్బతిన్నాయి. నీరంతా లీకవుతోంది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికుడు వెంకటసుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి చైతన్య తెలిపారు. -తర్లుపాడు, న్యూస్‌టుడే

మాజీ మంత్రి సుచరిత నుంచి అవార్డు అందుకుంటున్న అరుణ్‌దీప్

## కంభంవాసికి సేవా రత్న అవార్డు

కంభం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన చింతల అరుణ్‌దీప్‌కు అంబేడ్కర్ విశిష్ట సేవా రత్న అవార్డు వచ్చింది. గుంటూరులో ఆదివారం జరిగిన మాల మహాసభ, మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి సుచరిత, తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 18 ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలకు అంబేడ్కర్ చిత్రపటాలను ఉచితంగా అందజేస్తున్నందుకు అవార్డు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన్ను పలువురు అభినందించారు.

## అన్నదానాలతో ఆధ్యాత్మిక పయనం

☛ 21 ఏళ్లుగా స్వాములకు భిక్ష

ఆదర్శం

ఇటీవల నిర్మ మహేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

న్యూస్‌టుడే, పొదిలి

పొదిలిలోని అయ్యప్ప సేవా సమితి ఇరవై ఒక్క వసంతాలుగా స్వాములకు అన్నదానం చేస్తూ ఆధ్యాత్మిక బాటలో పయనిస్తోంది. మధ్యాహ్నం వేళ ఏర్పాటుచేస్తున్న ఈ భిక్ష సకల మాలధారణ స్వాములకు ఎంతగానో ఉపకరిస్తోంది.

2002లో కనిగిరి మండలం పునుగోడులోని శుద్ధ చైతన్యానందస్వామి వారిచే భిక్ష ప్రారంభమైంది. అప్పటినుంచి ప్రతి ఏటా పొదిలిలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం నుంచి సంక్రాంతి వరకు దీన్ని కొనసాగిస్తున్నారు. 2004 నుంచి 2008 వరకు మాజీ శాసనసభ్యుడు దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి ఈ పవిత్ర క్రతువుకు సహకారం అందజేశారు. ఆ తరువాత కొంతమంది దాతలు, భక్తుల సహకారంతో దీన్ని కొనసాగిస్తున్నారు. ఒక్కరోజు అన్న ప్రసాదం అందించేందుకు రూ.16 వేల వరకూ ఖర్చవుతోందని కమిటీ సభ్యులు చెప్పారు.

### నిత్యం అయిదు వందలమందికి..

నిర్మమహేశ్వరస్వామి ఆలయ షెడ్డులో స్వాములకు అన్నప్రసాద వితరణ జరుగుతోంది. ప్రతి రోజు మధ్యాహ్నం 500 మంది అయ్యప్ప, భవానీ, సాయిబాబా, శివ, గోవింద మాలధారణ స్వాములకు భిక్ష అందిస్తున్నారు. వారితోపాటు మరో 40 పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పొదిలి నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం అధికారులు సహకరిస్తున్నారు.

### దాతల సాయంతో కొనసాగిస్తున్నాం

పొదిలి అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో భిక్ష కొనసాగిస్తున్నాం. స్వచ్ఛందంగా సేవ చేసేందుకు పలువురు ముందుకొస్తున్నారు.
– ఎ.శంకరరావు, అయ్యప్పసేవా సమితి ఉపాధ్యక్షుడు

ర్యాలీలో పాల్గొన్న బాలవికాస్ విద్యార్థులు



## గిద్దలూరులో విద్యార్థుల నడక

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు పట్టణంలో ఆదివారం ఉదయం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల నడక కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి ప్రేమ ధ్యానమందిరం కన్వీనర్ ఎస్.అనంతరామయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలవికాస్ విద్యార్థులు ప్ల కార్డులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు , చిన్నారులు పాల్గొన్నారు.

## చుట్టూ మురుగు.. ఇంకేం చదువు

☛ విద్యార్థుల నరకయాతన

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

అక్కడి గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో వసతులు కొరవడి విద్యార్థులు అవస్థల పాలవుతున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలోని ఈ విద్యాలయంలో 350 మంది విద్యార్థులకు గానూ కేవలం 185 మంది మాత్రమే ఉన్నారు. వసతి సమస్య వల్లే ఇక్కడ చేరేందుకు పిల్లలు ఆసక్తి చూపడం లేదు. ఎనిమిది వసతి గదులకు గానూ కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. దీంతో గత్యంతరం లేక తరగతి గదులనే వసతి గదులుగా వినియోగించుకోవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువుకోవడం వీలు కావడంలేదని వాపోతున్నారు.

వంటగది వెనక మురుగుతో నిండిన కాలువ

అపరిశుభ్ర వాతావరణంలో భోజనాలు

### వ్యర్థాలన్నీ నిలిచిపోయి..

విద్యాలయంలో విద్యార్థులు భోజనాలు చేసేచోట అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వ్యర్థ జలాల పక్కనే కూర్చొని భోజనం చేస్తున్నారు. వసతి గృహంలోని వ్యర్థ జలాలు బయటకు పోయే మార్గం లేకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించింది. వంట గది వెనుక ఉన్న కాలువలో మురుగంతా నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. విద్యార్థులు స్నానాలు చేసేచోట ట్యాంకు వద్ద పాచిపట్టి మురికికూపంలా మారింది. దీంతో విద్యార్థులకు అష్టకష్టాలు తప్పడం లేదు. ట్యాంకును శుభ్రం చేయడం లేదు. విద్యాలయం ప్రధానగేటు పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. 18 మరుగుదొడ్లు ఉండాల్సి ఉండగా, 11 మాత్రమే ఉన్నాయి. అందులో రెండు నిరుపయోగంగా ఉన్నాయి. అయిదు మంది పనివారికి గానూ కేవలం ముగ్గురు మాత్రమే అందుబాటులో ఉన్నారు. కనీసం బ్లీచింగ్ సైతం చల్లడం లేదు. దీనిపై ప్రిన్సిపల్ సురేష్ బాబును సంప్రదించగా 'నిధుల కొరత ఉందని, ఉన్నతాధికారులకు నివేదించి సమస్యలు పరిష్కరిస్తా'నన్నారు.

నాగార్జునరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



## 'విశేష సేవలందించిన కందులు'

కంభం, న్యూస్‌టుడే : కంభం మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి జయంతిని పురస్కరించుకొని స్థానిక బై జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో [illegible] మాజీ ఎంపీపీ రవికుమార్ యాదవ్, మార్కాపురం జిల్లా సాధన సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

# కనిగిరి
• కనిగిరి • దర్శి • కొండపి

## సీఐటీయూ మహాసభల జయప్రదానికి వినతి

టంగుటూరు, న్యూస్‌టుడే: సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము కోరారు. ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో 18వ అఖిల భారత మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం టంగుటూరు పంచాయతీ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోజెస్, శ్రీను, తిరుమలరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు వేయండి.. కాలువలు నిర్మించండి

❖ ఎమ్మెల్యేకు పట్టణ వాసుల వినతి

బోయపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని బోయపాలెం, తొమ్మిదో వార్డు తదితర ప్రాంతాల్లో చాయ్ 3.0 కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వీధిలో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, రోడ్ల సమస్యలను ఆయా కాలనీ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో ప్రతి రోజు మున్సిపల్ అధికారులు తిరిగి ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. తాను వార్డు పర్యటనకు వస్తున్నట్లు తెలిసినా కొందరు అధికార్లు రాక పోవడం సరికాదన్నారు. త్వరలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయి పథకం పనులను పూర్తిచేసి, ప్రజలకు నీటి సమస్యలు తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు షేక్ ఫిరోజ్, జంషీర్, చొప్పరపు తిరుతపయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండు

మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై డిమాండ్ చేశారు. స్థానిక వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం ఆ శాఖ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరామయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ప్రభుత్వం పీఆర్సీని ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, బోధనేతర పనులు తొలగించి యాప్‌ల భారాల నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, హైస్కూల్ ప్లస్‌లలోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలైన వైవీ సుబ్బారావు, జె.భారతి, బదిలీపై ఇతర మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా, నాయకులు పాల్గొన్నారు.

❖ **యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా నాగరాజు**

యూటీఎఫ్ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా కందెర నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కుండా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల గౌరవాధ్యక్షుడిగా ఎన్.వెంకటరామయ్య, సహాధ్యక్షులుగా షేక్ చాంద్‌బాషా, ఎం.సత్యవతి, కోశాధికారిగా బీవీఎస్ రమేష్, కార్యదర్శులుగా ఐ.కొండయ్య, జి.లక్ష్మీనారాయణ, పీఎం.రసూల్, ఎన్.లక్ష్మీనారాయణమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా వి.సాంబశివరావు, జె.వెంకటరావు, ఎంవీ లక్ష్మమ్మ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## విద్యార్థుల సందడి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నీసా బేగం ఆధ్వర్యంలో పీఎంశ్రీలో భాగంగా ఆదివారం విహారయాత్రకు తరలివెళ్లారు. మల్లవరం డ్యాం, వల్లూరమ్మ ఆలయాన్ని సందర్శించారు.

## బడుగులేరు బాలికలు.. మైదానంలో మెరుపులు

న్యూస్‌టుడే, కనిగిరి

వారంతా పేదింటి, పల్లెటూరు బాలికలు. పాఠశాల స్థాయిలోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిత్యం సాధన చేస్తూ విజయాలను సొంతం చేసుకుంటున్నారు. వారే కనిగిరి మండలం బడుగులేరు జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు. వ్యాయామ ఉపాధ్యాయుడు జ్యోతిబాబు ఆధ్వర్యంలో ఇప్పటికే వారు రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. వారు సాధించిన విజయాలు, అందుకు చేస్తున్న కృషిని తెలుసుకుందామిలా..

సాఫ్ట్‌బాల్ సాధన చేస్తున్న విద్యార్థినులు

### సాఫ్ట్‌బాల్‌లో బ్లెస్సీ రేచల్ సత్తా

బడుగులేరుకు చెందిన బ్లెస్సీ రేచల్ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి, ప్రస్తుతం అండర్-17 విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికైంది. ఏలూరులో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గతంలో అండర్-14 విభాగంలో అనంతపురం, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది.

### విజయాల్లో కీలకపాత్ర

టి.నిహారిక 9వ తరగతి చదువుతోంది. ఓ వైపు చదువుకుంటూనే సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్‌లో రాణిస్తుంది. అనంతపురం, అన్నమయ్య జిల్లా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి తదితర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది.

### జట్టులో గోల్ కీపర్‌గా

ఎ.కోమలి తొమ్మిదో తరగతి చదువుతుంది. అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటింది. పైగా జిల్లా జట్టుకు ప్రధాన గోల్ కీపర్‌గా వ్యవహరిస్తుంది. మరింత సాధన చేసి జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావడమే తన లక్ష్యమంటుంది.

### లక్ష్యం.. జాతీయ స్థాయి

కనిగిరి మండలం గానుగపెంటకు చెందిన ఎం.సాయిలక్ష్మి బడుగులేరు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. అండర్-14 విభాగంలో జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించడమే తన ధ్యేయమని ఆమె చెబుతుంది.

## ఆనంద ఆదివారం.. ఒత్తిడి దూరం

కోలాట ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

దర్శి, న్యూస్‌టుడే: ఉల్లాసంగా గడపడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు 'హ్యాపీసండే' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెదేపా దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ఆదివారం దర్శి ఎస్సీ బాలికల వసతిగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. వసతిగృహాల్లో ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం, నృత్య ప్రదర్శనలు అలరించాయి. మాజీ ఎమ్మెల్యే పాపారావు, నాయకులు లలిత్‌సాగర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై మురళి, మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కొవ్వొత్తుల ప్రదర్శన

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని దుర్గం బాప్టిస్టు చర్చిలో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్త్రీల సమాజం అధ్యక్షురాలు దాసరి శ్యామల ఆధ్వర్యంలో క్రైస్తవులు క్యాండిల్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వాక్య సందేశకురాలు డా.రెవరెండ్ శ్యామల సుకుమార్ క్రిస్మస్ పండగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు దైవకటాక్షం, జి.నాగభూషణం, ప్రతాప్, ఎం.విక్టర్, కె.జక్రయ్య, డి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

క్యాండిల్స్ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

## మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం ఎస్సీ కాలనీలో నెల కొన్న అపరిశుభ్రత కారణంగా కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన మురుగునీరు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. –వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు

✓: వెంటనే అక్కడి సమస్యపై విచారించి, త్వరితగతిన పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. –పి.అజిత, ఎంపీడీవో

?: కురిచేడు మండలం బోధనంపాడులో కొన్ని రోజులుగా కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, మహిళలు వీధుల్లో తిరగాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. – నాగభూషణం, స్థానికుడు

✓: సర్పంచి, మండల అధికారులతో మాట్లాడి వాటి నివారణకు చర్యలు చేపడతాం.– వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

?: సింగరాయకొండలో వారం రోజుల నుంచి కుళాయిల్లో తాగునీరు రావడం లేదు. ఉన్న చేతిపంపులు పనిచేయకపోవడంతో వాడుక నీటికి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాం. –శ్రీకాంత్, భైరాగిమాణ్యం

✓: రామతీర్థం నుంచి నీరు సరఫరా అవుతున్న పైపులు, మన్నేరు బావి నుంచి వచ్చే నీటి పైపులు ధ్వంసమయ్యాయి. త్వరలో మరమ్మతులు చేసి తాగునీరు సరఫరా చేస్తాం. –రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ

?: సింగరాయకొండ హనుమాన్‌నగర్‌లో పారిశుద్ధ్య కార్మికులు పది రోజుల క్రితం కాలువల్లో వ్యర్థాలు తొలగించి రహదారిపై వేయడంతో అపరిశుభ్రంగా మారి దుర్వాసన వస్తోంది. –శ్రీనివాసరావు, స్థానికుడు

✓: కార్మికులు పూర్తి స్థాయిలో విధులకు హాజరు కాకపోవడంతో పనుల్లో జాప్యం ఏర్పడింది. త్వరలో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం. –సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: హనుమంతునిపాడు మండలంలో తుపాను కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. మిగిలినవి కూడా తెగుళ్లబారిన పడ్డాయి. మినుము, అలసంద పైర్లను సాగుచేసిన రైతులను ఆదుకోవాలి – జి.భార్గవ, రైతు

✓: పంట నష్టం అంచనావేసి నివేదిక పంపించాం. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి సహాయం అందుతుంది. –రవికుమార్, మండల వ్యవసాయాధికారి

?: మర్రిపూడి మండలం కూచిపూడి ఎస్సీ కాలనీలో బోరు మరమ్మతులకు గురికావడంతో నీటికి ఇబ్బందిగా ఉంటుంది. –బాలయ్య, కూచిపూడి

✓: మెకానిక్‌ను పంపించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. –నాగూర్‌వలీ, ఎంపీడీవో

- న్యూస్‌టుడే, తాళ్లూరు, కురిచేడు, సింగరాయకొండ గ్రామీణం, హనుమంతునిపాడు, మర్రిపూడి

## రహదారికి మరమ్మతులు

స్పందనకు వందనం

తాళ్లూరు: తాళ్లూరు-వెల్లంపల్లి రహదారిలో తెల్లబాడు పెట్రోలు బంకు ఎదురుగా పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ విషయమై 'ఈనాడు'లో గత నెల 15న 'గమనించకపోతే గమ్యం చేరలేరు' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. ఇదే మార్గంలో ఘడియాపూడి, మల్లవరం సమీపాన పెద్ద, పెద్ద గోతులేర్పడి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై గత నెల 19న 'గుంతలు... పూడ్చే దెవరు' శీర్షికన మరో చిత్ర కథనం ప్రచురితమైంది. ఏఈ వెంకటేశ్వరరెడ్డి ఆదివారం గుంతలను పూడ్పించారు.

## కదలని మురుగు.. వదలని దోమలు

తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధి సోమవరప్పాడులో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి పక్కనున్న కాలువల్లో పెద్ద ఎత్తున మురుగునీరు నిలిచిపోయింది. దీనివల్ల దుర్వాసన, దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో పి.అజితను వివరణ కోరగా.. వెంటనే సమస్యపై విచారించి త్వరితగతిన పారిశుద్ధ్య పనులు చేయిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, తాళ్లూరు

## ట్యాంకు ఉంది.. మంచినీరే లేదు

హెచ్‌ఎంపాడులోని పాతలైబ్రరీ వద్దనున్న మంచినీటి ట్యాంకు రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఈ ట్యాంకుకు నీరు సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన డీప్‌బోర్ మరమ్మతులకు గురికాగా దానిని బాగుచేయడం లేదు. అప్పటి నుంచి ట్యాంకు వృథాగానే ఉంది. దీంతో ప్రజలు సాగర్‌నీటి కోసం నిత్యం పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ని వివరణ కోరగా.. నిధులు విడుదలైతే డీప్‌బోరుకు మరమ్మతులు చేయించి ట్యాంకుకు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

## విజ్ఞానం.. విహారం

పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చొరవతో విజ్ఞానయాత్రకు తరలివెళ్లారు. అయిదు ఆర్టీసీ బస్సుల్లో మూడు వందల మంది భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామిని దర్శించుకున్నారు. ఆ ప్రాంతాల చారిత్రక ప్రాధాన్యతను తెలియజేయనున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య, మండల తెదేపా అధ్యక్షుడు వేమూరి రామయ్య, నాయకులు పాల్గొన్నారు. పీసీపల్లిలో విజ్ఞాన యాత్రకు బయులు దేరుతున్న చిత్రమిది. –న్యూస్‌టుడే, పీసీపల్లి

## ఆరాధనోత్సవం.. అత్యంత వైభవం

కనిగిరి పట్టణంలో ఆదివారం కాశీనాయన ఆరాధనోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కనిగిరితో పాటు, మార్కాపురం, నెల్లూరు, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, కనిగిరి

## నాగార్పమ్మకు ప్రత్యేక పూజలు

మండల కేంద్రమైన ముండ్లమూరులో నాగార్పమ్మ కొలుపులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని బేతపూడి, దొడ్డాల వంశస్థులు ఈ ఉత్సవాలు నిర్వహించారు. మూడు రోజులుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేకార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూలు, పండ్లు, కొబ్బరికాయ, పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. –న్యూస్‌టుడే, ముండ్లమూరు

## ఆలయంలో చోరీకి యత్నం

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని నందనమారెళ్ల బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి దుండగులు యత్నించారు. ఎస్సై టి.శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగలగొట్టేందు ప్రయత్నించారు. ఎంతకీ పగలక పోవడంతో పక్కనే పడేసి వెళ్లి పోయారు. లోపల ఉన్న వస్తువులన్నింటిని చిందర వందర చేశారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన భక్తులు పూజారికి తెలియజేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సూచించారు.

## ట్రాక్టర్ బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ జాతీయ రహదారి సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా కొట్టిన సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులు మండల పరిధిలో 11 కేవీ విద్యుత్తు తీగల ఏర్పాటు పనులు చేస్తున్నారు. వీరు శానంపూడి రోడ్డులో తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. సింగరాయకొండలో వంట సామగ్రి కొనుగోలు చేసుకుని ట్రాక్టరులో తిరిగి వెళ్లే క్రమంలో కందుకూరు వెళ్లే పైవంతెన సమీపంలోని సర్వీసు రోడ్డులో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ట్రాక్టరులో కూర్చుని ఉన్న నాగేశ్వర్, రాహుల్, మట్టాలతోపాటు మరొకరు గాయపడ్డారు. స్థానికుల సంచారంతో అక్కడికి చేరుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## టిప్పర్ బీభత్సం.. నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.ఎస్.పురంలోని డీజీపేట రహదారిలో ఆదివారం రాత్రి ఓ టిప్పర్ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం పడడం వల్ల విద్యుత్తు కండక్టర్ తీగలు గృహాలపై పడ్డాయి. వెంటనే విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన ఈ టిప్పర్లను డ్రైవర్లు వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతున్నారని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

## మాజీ సర్పంచి మృతికి సంతాపం

దొనకొండ, న్యూస్‌టుడే: మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి దుగ్గెంపూడి కాశయ్య (77) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. తెదేపాలో ఎన్నో పదవులు చేపట్టిన ఆయన పార్టీ బలోపేతానికి కృషి చేశారని నాయకులు గుర్తు చేసుకున్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నాయకులు గ్రామానికి వచ్చి కాశయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్

పామూరు, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పామూరు పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహనదారులకు తగు సూచనలిచ్చారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. పోలీసులకు సహకరిస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఎస్సై వెంకటేశ్వరనాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## 17న పింఛనుదారుల దినోత్సవం

దర్శి: ఈ నెల 17న నిర్వహించే జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాసరయ్య, రామారావు పిలుపునిచ్చారు. దర్శిలో ఆదివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్థానిక రామాలయంలో నిర్వహించే కార్యక్రమంలో నియోజకవర్గంలోని అయిదు మండలాల సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## మలుపు.. ప్రమాదాల పిలుపు

న్యూస్‌టుడే, దర్శి

దర్శి-గంగవరం రహదారిలో బొట్లపాలెం వద్ద మలుపు

దర్శి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో మలుపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ఎంతో మంది గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి. అనేక చోట్ల కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో వాహన చోదకులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

❖ **ప్రమాదకరంగా దర్శి-గంగవరం రోడ్డు...**

దర్శి నుంచి గంగవరం, చీమకుర్తి వరకు ఉన్న రెండు వరుసల రహదారిలో అనేక చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మార్గంలో దర్శి మండలం పొతకమూరు, బొట్లపాలెం, బెల్లంకొండవారిపాలెం, గంగవరం, పాటిమీదవారిపాలెం గ్రామాల సమీపంలో మలుపులు వాహనచోదకులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత ఏడాది ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై పలువురు మరణించటంతో పాటు అనేక మంది గాయాలపాలయ్యారు. రాజంపల్లి నుంచి కొత్తపల్లితో పాటు రామచంద్రాపురం, దర్శి నుంచి తూర్పువెంకటాపురం, గణేషునిపురం వైపుగా దొనకొండ వెళ్లే మార్గం, చందలూరు వైపుగా దొనకొండ రోడ్డులో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

❖ దర్శి-కురిచేడు ప్రధాన మార్గంలో వెంకటాచలంపల్లి సమీపంలో కొండ వద్ద మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రోడ్డు పక్కనే వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు కాశీనాయన వృద్ధాశ్రమం ఉన్నాయి. మలుపు కనిపించక అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆశ్రమం వద్ద పలువురు వృద్ధులు వాహనాలకు ఢీకొని మృతి చెందారు.

❖ పలు మార్గాల్లో మలుపులకు సమీపంలోనే ప్రభుత్వ పాఠశాలలు ఉండడంతో ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. మలుపుల వద్ద పలు సందర్భాల్లో విద్యార్థులు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవటం ద్వారా ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



# ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

## నీటిపన్ను తగ్గిస్తూ తీర్మానం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పురపాలక సంఘంలో నెలకు రూ.100గా ఉన్న తాగునీటి పన్నును రూ.50కి తగ్గిస్తూ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. గతంలో పురపాలక సంఘంలో నీటి పన్ను నెలకు రూ.20గా ఉండేది. ఈ మొత్తాన్ని ఒక్కసారిగా రూ.100కి పెంచడంతో పేదలకు అదనపు భారంగా మారింది. దీనిపై అప్పట్లో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పలువురు ఈ సమస్యను పాలక వర్గం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో రూ.100గా ఉన్న నీటి పన్నును రూ.50కి తగ్గిస్తూ జులై నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఈమొత్తం అమల్లోకి రానుందని పురపాలక సంఘం వారు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇంధన పొదుపుపై నేడు అవగాహన ర్యాలీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక రామనగర్‌లోని జిల్లా విద్యుత్తు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తుశాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు నగర వాసులతోపాటు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

**ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే**

?: నగరంలోని రాజపానగల్ రోడ్డులో కాలువలపై ఈగలు, దోమలు పెరిగిపోయి నివాసాల్లోకి వస్తున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. దోమల నివారణకు కాలువలపై బ్లీచింగ్ చల్లాలి. - **శివ, రాజేష్, ఒంగోలు**

✓: సిబ్బందిని పంపి కాలువల్లో బ్లీచింగ్ చల్లిస్తాం. దోమలు, ఈగల కట్టడికి చర్యలు తీసుకుంటాం. - **యన్. పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్.**

**నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే**

?: కనపర్తి గ్రామంలోని రెడ్డిపాలెం సమీపంలో తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లు రెండు చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. ఆరు నెలలుగా అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

**- వెంకటేశ్వరెడ్డి, రామకుమార్, ఎన్.పాడు**

✓: సిబ్బందిని పంపించి క్షేత్ర స్థాయిలో పరిశీలింపజేస్తాం. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **తేళ్ల రవికుమార్, ఎంపీడీవో**

## ప్రతిజ్ఞ చేశారు.. సంకల్పం మరిచారు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి..తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులకు అందించాలి. ఇంటిచుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి... ఇవి గ్రామాల్లో తరచూ అధికారులు చెబుతున్న మాటలు. అంతేకాకుండా వారితో ప్రతిజ్ఞలు సైతం చేయిస్తున్నారు. ఇదే సమయంలో పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మద్దిపాడు మండలాలోని పలు గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనం..

.-**న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు, మద్దిపాడు**

### ◆ స్వచ్ఛతకు దూరంగా పల్లెలు

మద్దిపాడులో రహదారి వెంట మాంసం, చేపల విక్రయాలు

### రోడ్ల పక్కన పేరుకున్న చెత్త కుప్పలు

సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు మద్దిపాడు మండలాల పరిధిలో 45 గ్రామ పంచాయతీలున్నాయి. మద్దిపాడు, నాగులుప్పలపాడు మండల కేంద్రాల్లో ప్రధాన వీధుల వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడికలు సకాలంలో తీయక వర్షాలు పడినప్పుడు ఆ మురుగు వర్షపు నీటితో కలిసి రోడ్లపైకి చేరుతోంది.

● నాగులుప్పలపాడు నుంచి పారిశ్రామిక వాడకు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో నాగులుప్పలపాడు సమీపంలో రహదారి వెంబడి వ్యర్థాలు పడేస్తున్నారు.

### దోమలకు ఆవాసాలుగా...

మురుగు నీరు కాలువల్లోంచి కదలక దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలువలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. మద్దిపాడు మండల కేంద్రంలోని ఇస్లాంపేట, హరిజన వాడ, బీసీ కాలనీలో పాటు దొడ్డవరం, మల్లవరం, పునరావాస గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రతి ఆదివారం మాంసం దుకాణదారులు మాంసం విక్రయించి వ్యర్థాలను రహదారి పక్కనే పారబోస్తున్నారు. ● ఉప్పుగుండూరులోని చీరాల రహదారిలో సాయిబాబా గుడికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలను పడేస్తున్నారు. ● స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పచ్చదనం, పరిశుభ్రత చేపట్టాలని చేస్తున్న స్వచ్ఛ ప్రతిజ్ఞలు కాగితాలకే పరిమితమౌతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల కార్నివాల్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని కొప్పోలు రోడ్డులోగల నెక్స్ట్‌జెన్ స్కూలులో నిర్వహించిన కార్నివాల్ ఆకట్టుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెక్స్ట్‌జెన్ విద్యార్థులతోపాటు ఇతర పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన బాలోత్సవంలో ఉత్తమ ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ మురళీధరరెడ్డి మాట్లాడుతూ స్టాల్స్‌లో వచ్చిన డబ్బులతో అనాథ, వృద్ధాశ్రమాల్లో సరకులు అందజేస్తారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపల్ ఆర్ఎల్‌వీ రమేష్ పాల్గొన్నారు.



కర్రసాము పోటీలో విద్యార్థులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

## 1,500 మందికి నేత్ర పరీక్షలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డీజేఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు మరింతగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. డీజేఆర్ ట్రస్ట్, అగర్వాల్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని సాయిబాబా ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 1500 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించిన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. ఉచితంగా కళ్లద్దాలు,మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సాయి యశ్వంత్, లక్ష్మీ శిరీష, జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


## PUBLIC NOTICE

Under the instructions of my clients **1. Vennapusa Srinivasa Reddy S/o. Narsareddy, aged about 48 years, agriculturalist, S.N Padu Village and Mandal, Prakasam District, 2. Bolledu Prasanna Kumari W/o. Subba Rao, aged about 42 years, Resident of Ongole 3. Thallapalli Venkata Suresh S/o. Subramanyam aged about 34 years, resident of Bestavari Peta, 4. Pathakottu Suresh S/o. Pichireddy, aged about 34 years,** S.N padu Village and madnal I issue the following public notice to the public at large.

That our clients purchased the flats in the apartment complex constructed in Survey No.270/2, Z.P Colony, Ongole, under Registered Sale Deeds bearing Document Nos.1.1603/2018, 2. 2333/2018, 3. 2172/ 2018 and 4. 1602/2018 from Dumpa Venkata Reddy and Sri. B. Singareddy and the said property is in our clients possession. Previously, the Canara Bank authorities issued the sale notice and our clients challenged the said proceedings in S.A. 161/2019 on the file of Hon'ble Debts Recovery Tribunal, Visakhapatnam and the same was dismissed and my clients are making efforts to prefer appeal against the said order and in the mean while, the Canara Bank is proposing to sell the entire property by infringing my clients rights in the below schedule mentioned property. Hence, this public notice.

**SCHEDULE PROPERTY**

Prakasam District, Ongole Sub-Reg., Ongole corporation limits, Ongole, Z.PColony area, Sy.No.270/ 2, constructed building with five floors and our clients having each two Flats in 4th floor and 5th Floor vide Flat No.'s , 402, 501 and 502.

Ongole Sd/- **MACHIRAJU SRINIVASA RAO**
14-12-2025 Advocate, Ongole


## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి

చీమకుర్తి, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేస్తామని జెడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్ కుమార్‌లు అన్నారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో రూ.12.50 కోట్లతో చేపట్టనున్న పనులను ఆమోదించారు. సమావేశంలో ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ జిల్లాపరిషత్ ద్వారా చీమకుర్తి మండలానికి రావాల్సిన నిధులను పూర్తిస్థాయిలో తీసుకువచ్చి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో పనులు చేపట్టి చీమకుర్తి మండలాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. మద్దిపాడు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, ఎంపీడీవో కె.రాఘవేంద్ర, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● **ఎట్టకేలకు కుదిరిన అంగీకారం:** చీమకుర్తి మండల పరిషత్‌లో అభివృద్ధిపనులు చేపట్టే విషయమై ఎట్టకేలకు అధికార, ప్రతిపక్షం మధ్య అంగీకారం కుదరడంతో రూ.12.50 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మండల పరిషత్‌లో రూ.20కోట్లకు పైగా నిధులు ఉన్నా ఏడాదిన్నర కాలంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు జరగని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ చొరవ చూపడంతో మండల పరిషత్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పాల్గొన్న జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఒంగోలు గ్రామీణం: లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఒంగోలులో నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కరవది బజార్ రోడ్డు, సత్యనారాయణపురం, విజేత వైద్యశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదు.

## కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి

చీమకుర్తి, న్యూస్‌టుడే: పారిశ్రామిక నగరమైన విశాఖపట్నంలో జరగనున్న అఖిల భారత సీఐటీయూ 19వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సీటూ అధ్యక్షులు కాలం సుబ్బారావు కోరారు. చీమకుర్తిలోని పంగులూరు కృష్ణయ్య భవనంలో ఎన్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం సదస్సు జరిగింది. సుబ్బారావు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి పోరాట మార్గం రూపొందించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానాలతో అటు కార్మిక వర్గం, ఇటు రైతాంగం దోపిడీకి గురవుతోందన్నారు. ఆయా సంఘాల నాయకులు పి.ఆంజనేయులు, జి.అప్పలనాయుడు, కనకరాజు, టి.శ్రీను, ప్రభుదాసు, ఏడుకొండలు, బెజవాడ శ్రీనివాసరావు, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుబ్బారావు

(c) eenadu

# చెరువు నిండుగా.. దాహార్తి తొలగగా..!

● పట్టణం, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధికి అవకాశం

పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, పరిసర ప్రాంతాల నివాసితుల దాహార్తి తీర్చడానికి, కరవు సమస్యల దూరం చేయడానికి అండగా నిలుస్తోంది.. మార్కాపురం చెరువు.

- న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

పూర్తి స్థాయిలో నిండిన మార్కాపురం చెరువు

### దశాబ్దం అనంతరం నిండుకుండలా...

మొంథా తుపాను పుణ్యమా అని మార్కాపురం చెరువు దాదాపు 10 సంవత్సరాల తరువాత పూర్తిస్థాయి నిండటం విశేషం. దీంతో పట్టణానికి దాదాపు 3 సంవత్సరాల వరకు నీటి సమస్య ఉండదని అధికారులు, ప్రజలు చెబుతున్నారు. గతంలో చెరువులో నీరు లేకపోవడంతో పట్టణ శివారులోని డ్రైవర్స్‌కాలనీ, ఎస్టేట్, పీఎస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో చాలా బోర్లు వట్టిపోయాయి. ప్రస్తుతం పూర్తిస్థాయిలో చెరువు నిండటంతో పుష్కలంగా డీప్‌బోర్లకు నీరు వస్తుంది. ● నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని త్రిపురాంతకం మండలం దూపాడు నుంచి మార్కాపురం పట్టణానికి 2005లో సాగర్ నీటి పైపులైను ఏర్పాటు చేశారు. ఈ పథకం నడుస్తున్నా పురవాసులకు వేసవిలో నీటి కష్టాలు వెంటాడేవి.

### గజపతి రాజుల కాలంలో...

ఒడిశా రాజధానిగా చేసుకొని పరిపాలించిన గజపతి రాజుల ఏలుబడిలో ఉప అధికారి తెలుగు రాయుడు 15వ శతాబ్దంలో మార్కాపురం చెరువును తవ్వించారని చరిత్ర చెబుతోంది. ● మొత్తం 584 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు కాల క్రమంలో 50 నుంచి 80 ఎకరాల దాకా ఆక్రమణలకు గురైందని లెక్కలు చెబుతున్నాయి.

### రెండు దశాబ్దాలుగా వరి సాగు లేదు

దీని కింద వరి సాగు విస్తీర్ణం 1,101 ఎకరాలు. సుమారు రెండు దశాబ్దాలుగా వరిసాగు చేయడం లేదు. కారణం ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడం. దీనికితోడు వర్షాలు లేక చెరువు ఎండిపోవడం. అయితే నవంబర్‌లో కురిసిన వర్షాలకు చెరువు పూర్తిస్థాయి నిండి అలుగు పారింది. ప్రస్తుతం మార్కాపురం చెరువు కట్ట పైకి వెళితే ఒక పక్క నిండిన చెరువు.. మరో పక్క చిల్లచెట్లతో ఉన్న మాగాణి పొలాలు మనకు కనిపిస్తాయి.

# జాతీయ తైక్వాండో పోటీలకు ఒంగోలు విద్యార్థులు

తైక్వాండో ప్రదర్శనలో విద్యార్థులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 40వ జాతీయ తైక్వాండో పోటీలకు ఒంగోలు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక సీవీఎన్ క్లబ్‌లో అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నేషనల్ తైక్వాండో 5వ డాన్ కోచ్ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలిండియా పోర్టుట్రస్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ ఛైర్మన్ ఖలీఫాతుల్లా బాషా ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కోచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 50 మంది ఇంటర్నేషనల్ స్థాయిలో బ్లాక్‌బెల్ట్ సాధించారన్నారు. ఇప్పుడు 20 మంది పోటీలో గెలిచి జాతీయస్థాయి పోటీలకు వెళ్లబోతున్నట్లు తెలిపారు.

# ప్రమాదాల నివారణకే ప్రత్యేక తనిఖీలు

వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై వెంకట సూర్య

మద్దిపాడు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య తెలిపారు. మండల పరిధిలో అత్యంత రద్దీగా ఉండే పారిశ్రామిక వాడ, సీతారామపురం కొష్టాల్, వెల్లంపల్లి కూడళ్లలో మద్దిపాడు పోలీసులు ఎస్సై వెంకటసూర్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గం 05-00 ల నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 12 మంది ప్రత్యేక అదనపు బలగాలతో తనిఖీలు నిర్వహించారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చేస్తున్న వారిని నిలుపుదల చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రహదారి భద్రతా నియమాలు పాటించాలన్నారు.

# విగ్రహావిష్కరణ ప్రొటోకాల్‌పై మేయర్ అసంతృప్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించనందుకు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక పాత బైపాస్‌రోడ్డులోని వెంగముక్కపాలెం కూడలి వద్ద డివైడర్‌పై విగ్రహావిష్కరణకు భాజపా నాయకులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకంపై మేయర్ పేరు లేదు. ఈ విషయం తెలుసుకున్న ఆమె విషయాన్ని కలెక్టర్ రాజాబాబు దృష్టికి తీసుకెళ్లి అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి మేయర్‌ను సంప్రదించగా తన డివిజన్‌లో విగ్రహావిష్కరణ జరుగుతుందని, అనుమతికోసం సంప్రదించకపోగా, ప్రొటోకాల్‌కూడా పాటించకపోవడం సరికాదన్నారు.

# పేదల జీవనోపాధికి అండ

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:పేదల జీవనోపాధికి సూర్యశ్రీ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ అన్నారు. ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ బాషా ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలో నివాసముంటున్న షహనాజ్ జీవనోపాధికి 98 ఫ్రెండ్స్ ఫౌండేషన్ సహకారంతో టిఫిన్ బండిని ఆదివారం ఆయన అందజేసి ప్రారంభించి మాట్లాడారు.

# శరవేగంగా వసతి గృహ నిర్మాణం

పునాదుల్లో ఎస్సీ బాలికల వసతి గృహం పనులు

న్యూస్‌టుడే, చీమకుర్తి: చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయం పక్కనే ఎస్సీ బాలికల వసతి గృహం నూతన భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. దీనికోసం డీఎంఎఫ్ నిధులు రూ2. కోట్లు మంజూరైన సంగతి తెలిసిందే. నిధులు మంజూరైనా విద్యార్థినులకు తాత్కాలిక వసతి సమస్యగా మారడంతో నెలల తరువాత పనులు ప్రారంభించని పరిస్థితి. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలతో ఎట్టకేలకు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల భవనంలో పిల్లలకు తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గుత్తేదారు పనులు ప్రారంభించారు. ముందుగా పాత భవనాన్ని తొలగించారు. ప్రస్తుతం పునాదుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తి అయితే ఆ మేరకు విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లవుతుంది.

# అప్పు తీర్చేందుకు మత్తు దందా

ఈనాడు, హైదరాబాద్: బెంగళూరులోని డ్రగ్స్ ముఠాలతో సంబంధాలు పెంచుకొని సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న యు.కార్తిక్ (37), సీహెచ్.బాలాజీ (32), టి.దీపక్ (29)లను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన కార్తిక్ అలియాస్ అలెక్స్ చదువు మధ్యలో ఆపేశాడు. కొంతకాలం మిల్క్ ఏజెన్సీ, గ్రానైట్ వ్యాపారం చేసి నష్ట పోయాడు. సుమారు రూ.2 కోట్ల వరకు ఉన్న అప్పుల నుంచి బయటపడేందుకు అడ్డదారి ఎంచుకున్నాడు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చి నేరేడ్‌మెట్‌లో స్థిరపడిన బావమర్ది బాలాజీతో కలిసి మత్తుదందా ప్రారంభించాడు. 2016లో బీఎస్సీ పూర్తి చేసిన బాలాజీ 2022 నుంచి తండ్రి వ్యాపారం చూసుకుంటున్నాడు. ఎండీఎంఏకు అలవాటుపడ్డాడు. డ్రగ్స్ విక్రయిస్తూ అరెస్టయ్యాడు. జైలు నుంచి రాగానే బావతో జతకట్టాడు. వీరిద్దరికీ జీడిమెట్లకు చెందిన దీపక్ తోడవటంతో ముగ్గురు కలిసి మత్తు పదార్థాలు సరఫరా, విక్రయం ప్రారంభించారు. ప్రధాన నిందితుడు బాలాజీ బెంగళూరులోని నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ గ్రాము 4 నుంచి 5 వేలకు కొనుగోలు చేసేవాడు. ఆ సరుకును మిగిలిన ఇద్దరు గ్రాము 7 నుంచి 8 వేలకు విక్రయించేవారు. నూతన సంవత్సర వేడుకలకు పెద్దఎత్తున ఎండీఎంఏ తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. వారి కదలికలపై నిఘా ఉంచిన ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి, ఎస్సై బి.మనోజ్‌కుమార్, మాసబ్ ట్యాంక్ డీఐ శ్రీనివాసరావు బృందం అరెస్ట్ చేసింది.

# తాగునీటి సమస్య నివారణకు ట్యాంకర్లతో సరఫరా

ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు గ్రామ పంచాయతీలో ఆదివారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. గుండ్లకమ్మ జలాశయం సీపీడబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి పథకం మోటార్లు మరమ్మతుల వల్ల నీటి సరఫరా నాలుగు రోజులపాటు నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మద్దిపాడు గ్రామ పంచాయతీ సర్పంచి మద్దిరాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి నూరల్లా అప్రమత్తమై రెండు ట్రాక్టర్ ట్యాంక్‌లతో అరుంధతీ నగర్, ఇస్లాంపేట ప్రజలకు నీరు సరఫరా చేశారు. విడతల వారీగా గ్రామస్థులకు అందిస్తామని అధికారులు తెలిపారు.

# 30 రోజులు తిరుప్పావై ప్రవచన యజ్ఞం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ధనుర్మాస వేడుకల బ్రోచర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు సతీమణి నాగసత్యలత ఆదివారం సంతపేటలోని సాయిబాబా మందిరంలో ఆవిష్కరించారు. తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వీటిని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరం అధ్యక్షుడు అలహరి చంచలరావు మాట్లాడుతూ 17వ తేదీ ఉదయం నుంచి తిరుప్పావై పాశురాలతో స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహిస్తామన్నారు. తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారు ఎన్నికచేసిన ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుతో తిరుప్పావై ప్రవచనం నిర్వహిస్తామన్నారు. జనవరి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో దామచర్ల లక్ష్మీ ప్రసన్న కుమారి, సాయిదుర్గ, నందిని, రమణ తదితరులు పాల్గొన్నారు.

# 340 మందికి ఉచిత వైద్య పరీక్షలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 340 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆదివారం విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, ఒంగోలు శ్రీరామ్ వైద్యశాల, హెచ్.సి.జి ఎమ్మెన్నార్ ఒంగోలు క్యాన్సర్ సెంటర్ నిర్వాహకులు ఎన్నారై వేజెండ్ల అనిల్‌కుమార్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని చేపట్టారు.

# ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

పతకాలతో జిల్లా క్రీడాకారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బాపట్లలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రకాశం జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో పతకాలు సాధించారు. పతకాల వారీగా 19 బంగారు, 12 వెండి, ఇత్తడి 8 చొప్పున సొంతం చేసుకున్నారు. 14 మంది క్రీడాకారులు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించనున్న 7వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ విషయాన్ని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.సురేష్‌కుమార్, దాసరి విజయభాస్కర్ తెలిపారు.

# ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సుధాకర్

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: స్థానిక ట్రిపుల్ ఐటీ కళాశాలను హయ్యర్ ఎడ్యుకేషన్ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఎం. సుధాకర్ సందర్శించారు. ఆదివారం కళాశాల్లో జరుగుతున్న ప్రత్యేక ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సుధాకర్ సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో ఎన్.చంద్రశేఖర్, డీన్ రూప సికుమార్, ఎన్ఎస్ఎస్ పీవో ఎ.పావని, ప్రోగ్రామ్ అధికారులు లావణ్య, భాస్కర్, దామోదరేశ్వరరెడ్డి, మాధవీలత, మాలకొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుష్కరాల పేరుతో ప్రజా ధనం వృథా

మాట్లాడుతున్న వెంకట సుబ్బయ్య

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పుష్కరాల్లో మునిగితే పుణ్యం కాదు అంటు రోగాలు వస్తాయని భారత హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు నార్నె వెంకట సుబ్బయ్య విమర్శించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల పేరుతో ప్రజాధనం వృథాగా ఖర్చు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హేతువాద సంఘం మొగల్ ఖాదర్ బేగ్, సభ్యులు ఎస్.వి.రంగారెడ్డి, ఒంగోలు నాగేశ్వరరావు, సుబాని, ఎస్.చంద్రశేఖర్‌బాబు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)
వెనామ్: బ్రాయిలర్ ఫారం ధర - 125, లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251

# మంచికంటి బోధన స్ఫూర్తిదాయకం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: జిల్లాలోని కొండపి మండలం జాళ్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా మంచికంటి వెంకటేశ్వర్లు మాధవ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పిల్లల విజ్ఞానికి బడినే కేంద్రంగా చేసుకొని అభ్యసన చేస్తున్న బోధన పద్ధతులు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్, సోషల్ మీడియా ద్వారా ప్రశంసించారు. రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అన్ని సోషల్ మీడియా గ్రూపుల్లోను ఈ విషయాన్ని ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవా సంస్థ, నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జిల్లా గ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తేళ్ల అరుణ, డాక్టర్ క్రొపాటి సుధాకర్, కర్రా ప్రసాద్ బాబు, కాంతి నల్లూరి, కాళహస్తి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచికంటిని సన్మానిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

# అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఒంగోలులో ఆదివారం జరిగింది. టంగుటూరు మండలం ఆలకూరపాడుకు చెందిన లేళ్లపల్లి రాజేష్‌బాబు (37) ఒంగోలులోని ఓ ల్యాబ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఆ ల్యాబ్ నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. రాజేష్‌బాబు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. అతని సమీప బంధువు మట్టిగుంట జనార్దనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్సై వి.భూషణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంఘం నాయకులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. ఒంగోలులోని 49వ డివిజన్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని, కార్మిక, ప్రజా విధానాలపై చర్చించి ప్రత్యామ్నాయ పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. తొలుత సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు వి.మాలకొండయ్య, జి.రమేష్, వీరస్వామి, డి. వెంకటేశ్వర్లు, రామయ్య, ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.


## శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032

బ్రాంచ్ : ఒంగోలు: డి.నెం.37-1-41, 1వ అంతస్థు, వరప్రసాద్ కాంప్లెక్స్, ట్రంక్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్-523001, వెబ్‌సైట్ : www.shriramfinance.in

### లాంఛనముగా స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది. ఎన్‌సిఎల్‌టీ బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 మరియు ఒంగోలు 1 నందు బ్రాంచి ఆఫీస్ కలిగి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్ముల్ని కంపెనీ/ఋణదాతగా సూచిస్తారు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (యస్‌యఫ్‌యల్) యొక్క అధీకృత అధికారి సదరు చట్టంలోని సెక్షన్ 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీతలు ఈ క్రింద తెలిపిన ప్రకారం బకాయి సొమ్ము మొత్తంను చెల్లించవలసినదిగా క్రింద ఉదహరించబడిన తేదీన డిమాండు నోటీసు జారీ చేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టంలోని సెక్షన్ 13(4) తో అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని ది.11-12-2025 న లాంఛనముగా స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతల యొక్క పేరు మరియు చిరునామా :

1) చలువాది మోహన్ మణిదీప్, తండ్రి : సిహెచ్ శ్రీనివాసరావు, నివాసము: డి.నెం.12-1218, విరాట్ నగర్, పేర్నమిట్ట (విలేజ్), సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523002.

2) చలువాది సుభాషిణి, భర్త : సిహెచ్ శ్రీనివాసరావు, నివాసము: డి.నెం.46-128-294, విరాట్ నగర్ 4వ లైన్, పేర్నమిట్ట (విలేజ్) సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా, పిన్‌కోడ్: 523002.

3) ముద్దా రామంజనేయులు, తండ్రి : ముద్దా శ్రీనివాసరవు, నివాసము: డి.నెం.2-115, కొత్త కాలని, కనకర్లపూడి, శావల్యాపురం, గుంటూరు జిల్లా - 523646.

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము : రూ.44,71,659/-(అక్షరాల నలభై నలుగు లక్షల డెభై ఒక వేల ఆరు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)

లోన్ అకౌంట్ నెంబరు : ONGL2TF2304030002

డిమాండ్ నోటీసు తేది : 08-08-2025

### స్థిరాస్తుల వివరములు

షెడ్యూల్-1: (దస్తావేజు నెం.131/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112లో, సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022 తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన సర్వే నెం.112/3 నందలి ఎ. 26.43 సెంట్లు అందులోని ఎ.0.97 సెంట్లలోని స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 30 అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ॥లు మొత్తం 2160 చ॥అ॥లు లేదా 240 చ॥గ॥లు లేదా 200 చ॥మీ॥లు స్థలము. దీనికి హద్దులు: తూర్పు: జి.కృష్ణ గారి భూమి, పడమర : కాసు వరప్రసాద్ గారి భూమి, ఉత్తరం: కాసు వరప్రసాద్ గారి భూమి, దక్షిణం: 20 అ॥ల వెడల్పు గల రోడ్డు.

షెడ్యూల్-2: (దస్తావేజు నెం.132/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం. ఎల్.డి.ఎస్/సి/221/2022 తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద ఎ.26.43 సెంట్లలోని ఎ.0.97 సెంట్ల స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 30 అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ॥లు మొత్తం 2203.2 చ॥అ॥లు లేదా 244.8 చ॥గ॥లు లేదా 204 చ॥మీ॥లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: కె.శ్యామ్ సుందర రావు నుండి సి. సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్థి పడమర : డొంక, ఉత్తరం: 20అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: వై.సత్యవతి నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్థి.

షెడ్యూల్-3: (దస్తావేజు నెం.133/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022, తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద పడమరకు 30.6 అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ॥లు మొత్తం 2203.2 చ॥అ॥లు లేదా 244.8 చ॥గ॥లు లేదా 204 చ॥మీ॥లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: ఇతరుల యొక్క భూమి, పడమర : డొంక, ఉత్తరం: కె.వెంకటరమణమ్మ నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్థి, దక్షిణం: 20 అ॥ల వెడల్పు గల రోడ్డు.

షెడ్యూల్-4: (దస్తావేజు నెం.140/2004 ప్రకారం) ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ జిల్లా, పేర్నమిట్ట గ్రామ పంచాయతీ మరియు గ్రామ అకౌంట్స్, సర్వే నెం.112 లో సర్వే నివేదిక మరియు సంతనూతలపాడు మండల రెవిన్యూ ఆఫీసు ఉప విభజన ఎండార్స్‌మెంట్ నెం.ఎల్.డి.ఎస్/సి/221/2022, తేది.21-03-2022 ప్రకారం ఉప విభజన నెం.112/3 క్రింద ఎ.26.43 సెంట్లు అందులోని ఎ.0.97 సెంట్లలోని స్థలము యొక్క విస్తీర్ణము తూర్పు నుండి పడమరకు 30.6 అ॥లు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 72 అ॥లు మొత్తం 2203.2 చ॥అ॥లు లేదా 244.8 చ॥గ॥లు లేదా 204 చ॥మీ॥లు స్థలమునకు దీనికి హద్దులు: తూర్పు: గొల్లా ఆంజనేయులు ఇతరులకు అమ్మిన భూమి, పడమర : కె.వెంకటరమణమ్మ నుండి సి.సుభాషిణి కొనుగోలు చేసిన ఆస్థి, ఉత్తరం: 20అ॥ల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: గొల్లా ఆంజనేయులు ఇతరులకు అమ్మిన భూమి.

పైన పేర్కొన్న నాలుగు షెడ్యూలు ఐటంలు గల ఆస్థిలో "సుభాషిణి దాల్ మిల్" అనే పేరుతో గల దాల్ మిల్ మరియు ఖాళీ స్థలము కలదు.

మొత్తం 4 ఐటంల మొత్తం విస్తీర్ణం 973.6 చ॥గ॥లు, దానిలో 2970 చ॥అ॥ల విస్తీర్ణములో ఎసిసి షెడ్, అసెస్‌మెంట్ నెం. 1035049830, గణపతినగర్, పాత డోర్ నెం.12-1350, కొత్త డోర్ నెం.46-128-820/1తో నిర్మించబడినది.

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం. 1285/2023 ప్రకారం చలువాది సుభాషిణి, భర్త: చలువాది శ్రీనివాసరావు వారి పేరుతో కలదు.

సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా (యస్‌యఫ్‌యల్) అధీకృత అధికారి పైన పేర్కొనబడిన స్థిరాస్తులను ఋణగ్రహీతల నుండి లాంఛనముగా స్వాధీనత తీసుకొనడమైనది. ఈ నోటీసు తరువాత ఏ వ్యక్తికి విక్రయించుట గాని, ట్రాన్స్‌ఫర్ చేయుట గానీ, లీజు లేదా తనఖాఆస్తులను దారి మళ్ళించుట గానీ యస్‌యఫ్‌యల్ వారి లిఖితపూర్వక అనుమతి లేకుండా చేయరాదు.

తేది :11-12-2025, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

FLAT FOR SALE

23 లక్షలకే రాజధాని అమరావతి హైవే మీద గ్రేటెడ్ కమ్యూనిటి నందు 2BHK ఫ్లాట్స్ కలవు ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే సం|| 89196 28403.

ఒంగోలు NH5 దగ్గర అండర్ కన్‌స్ట్రక్షన్ 2BHK అపార్ట్‌మెంట్ Rs 4500/- SFT లోన్ సౌకర్యం కలదు. సంప్ర: 9490938346.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PLOT FOR SALE

ఒంగోలు మంగమూరురోడ్డు మిలటరీ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో ఈస్ట్ ఫేస్ 13 గదులు 16 వెడల్పు 61 లోతు స్థలం అమ్మబడును. సెల్.9247846496.

JOBS

Wanted Spare Parts Incharge, Assistant, Customer Relationship Executive & Cashier. Location: Saripudi Suzuki, Wood Complex, Ongole. ✆ 77999 60199 & 149.

ఫ్యామిలీమార్ట్ సూపర్ మార్కెట్, శారీ షాపుల్లో పని చేయుటకు సేల్స్‌గర్ల్స్, డేటా ఎంట్రీ చేసే వారు కావాలి (గర్ల్స్). అడ్రస్: సాయిబాబా టెంపుల్ రోడ్ OPP: కాంగ్రెస్ పార్టీ ఆఫీసు, 4 రోడ్స్ జంక్షన్ (లాయరుపేట కొంజేడు బస్టాండ్, గద్దలగుంట, మర్రిచెట్టురోడ్స్) ఒంగోలు ప్రకాశం. 9849466026

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్ /ముత్తూట్ /మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 97039 71968.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

ఒంగోలు రజా హిందుస్తాన్ నిధి బ్యాంకు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 9966352087

BRఇన్‌ఫ్రాకాన్ నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లమో, B.Tech, M.Tech కల్గి పైపులైన్లు ఇరిగేషన్ వర్క్స్ నందు 3 నుండి 4 సం||ల అనుభవం కల్గి ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాలలో పనిచేయుటకు పూర్తి బయోడేటాను info@brinfracon.comకు పంపగలరు. ✆ 7995557831.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ACCOUNTING

Wanted Tally Accountant (Male) 3+ Years Experience. With Computer Knowledge & Accounts. Contact: 9703402722

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...

B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500 Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం డిసెంబరు 15, 2025

## తరువు.. మాతృత్వపు తనువు

సింహపురి సుందరీకరణలో భాగంగా నెల్లూరు నగరంలోని పలు కూడళ్లు, డివైడర్లలో నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వివిధ ఆకృతుల్లో పెంచిన మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలిలో బిడ్డను లాలిస్తున్న అమ్మ ఆకారంలో ఏర్పాటు చేసిన ఆకృతి చూపరులను ఇట్టే కట్టిపడేస్తోంది – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

## రేపటి నుంచి రైలు గేటు మూసివేత

బోగోలు మండలంలోని శ్రీ వేంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ యార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నందున.. స్టేషన్‌కు దక్షిణం వైపు ఉన్న 146వ లెవల్ క్రాసింగ్ గేటును ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రసన్నుడి ఆలయానికి వచ్చే భక్తులు, సమీప గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలుగా ఉన్న 144, 148 లెవల్ క్రాసింగ్ గేట్ల నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

# ఇంటి గుట్టు.. అధికారి కనికట్టు!

**విచారణ పేరుతో కాలయాపన ● గృహ నిర్మాణశాఖలో తప్పు చేసిన వారిపై చర్యలకు వెనకడుగు**

ఈనాడు, నెల్లూరు

'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం పేరుతో పేదలకు ఇళ్లు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికిన గత ప్రభుత్వం.. దోచుకోవడమే ధ్యేయంగా పనిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినా.. కొందరు అధికారుల తీరుతో అడుగు ముందుకు పడటం లేదు. విచారణ పేరుతో కాలం వెళ్లదీస్తూ.. క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి, పేదలకు న్యాయం చేయడం లేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారి వేణుగోపాల్‌ను హెడ్ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఇటీవల రాష్ట్ర అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. ఇక్కడి నుంచి కదలకపోవడం విమర్శలకు తావిస్తోంది.



వెంకటేశ్వరపురంలో నిర్మించిన ఇళ్లు

### రిపోర్టు చేయకపోవడంపై ఆగ్రహం

రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పేదల గృహాల్లో పురోగతిని తెలుసుకునేందుకు గృహనిర్మాణశాఖ కార్యదర్శి అజయ్‌జైన్ గత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా నెల్లూరులో పరిస్థితిని తెలిపేందుకు ఇక్కడి పీడీ హాజరుకాగా.. అతనిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు ఇచ్చినా.. పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసే వరకు నెల్లూరుపై సమీక్షించవద్దని గృహనిర్మాణశాఖ డీఎంకు సూచించినట్లు సమాచారం. ఆ అధికారి మాత్రం తనను కలెక్టర్ రిలీవ్ చేయలేదని, అందుకే రాలేదని చెబుతుండటం గమనార్హం.

### నామమాత్రపు చర్యలు

జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారుల నిర్లక్ష్యంతో ఇళ్ల నిర్మాణం జరగడం లేదు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారు. పేదల ఇళ్లలో అక్రమాలకు పాల్పడిన, ఇంటి సామగ్రిని పక్కదారి పట్టిస్తూ.. అడ్డంగా దొరికిన అధికారులపైనా నామమాత్రపు చర్యలు తీసుకున్నారనే విమర్శలున్నాయి.

### అంతటా వెనుకబాటే..

జిల్లాలో ఆప్షన్-3లో నిర్మించిన ఇళ్లలో నాణ్యతను పరిశీలిస్తే.. సుమారు 6,588 ఇళ్లు నివాసానికి పనికిరావని గుర్తించారు. పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా గ్రామీణ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు చేపట్టిన ఆవాస్ సర్వేలోనూ జిల్లా వెనకబడి ఉంది. మొత్తం 60,845 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 9,029 మాత్రమే పూర్తి చేశారు. కావలి డివిజన్‌లో పెద్దఎత్తున సిమెంట్‌ను పక్కదారి పట్టించినట్లు తేలినా.. సర్దుబాటు చేసుకునేలా సహకరించినట్లు ఆరోపణలున్నాయి.

# కలలు కల్లలై.. కన్నీటి ధారలై..

## రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

మాధవ, మనోజ (పాత చిత్రాలు)

న్యూస్‌టుడే, ఆత్మకూరు

కన్నబిడ్డలే శ్వాస, ధ్యాసగా కష్టపడుతున్నారు. పుడమినే నమ్ముకుని పుట్టెడు కష్టాలు ఎదురైనా వ్యవసాయం చేస్తూ.. వచ్చే అరకొర ఆదాయాన్ని వారి చదువులకే వెచ్చిస్తూ.. వారిపై ఆశలు పెట్టుకున్నారు. పెద్ద చదువులు చదివించి.. ఉన్నత స్థానాల్లో చూడాలని.. తమ కష్టాలు తీరుతాయని కలలుకన్నారు. విధి కన్నుకుట్టి.. కన్నవారిని దూరం చేయడంతో ఆ ఇద్దరు ఆడబిడ్డలు అనాథలై కుమిలికుమిలి ఏడుస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

● ఆత్మకూరు మండలం బోయిళ్ల చిరువెళ్లకు చెందిన మాధవ (40), మనోజ (35) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పిల్లల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని వారిని హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నారు. పెద్దకుమార్తె మనస్విని నెల్లూరులో ఇంటర్, చిన్న కుమార్తె తేజశ్విని ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. చిన్న కుమార్తెను చూడాలని ఆదివారం మధ్యాహ్నం ఆత్మకూరుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఇష్టమైన ఆహారం తెచ్చి తినిపించారు. ఆనందంగా ఇంటికి పయనమయ్యారు. కడప నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా ముందు వెళ్లే వాహనాన్ని అధిగమించే క్రమంలో వీరి బైక్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ అక్కడికక్కడే తనువు చాలించారు. కారులోని వారు సురక్షితంగా బయటపడ్డారు. మృతదేహాలను 108 వాహనంలో జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బోయిళ్ల చిరువెళ్లలోని బంధుమిత్రులు పెద్దసంఖ్యలో వైద్యశాలకు తరలివచ్చారు. వారి రోదనలతో ఆసుపత్రి ఆవరణ మిన్నంటింది. కుమార్తెలకు విషయం తెలియడంతో వైద్యశాలకు వచ్చి విగతజీవులుగా పడిఉన్న తల్లిదండ్రులను చూసి మాకు దిక్కెవరంటూ కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఆత్మకూరు ఎస్‌ఐ జిలానీ సంఘటన స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేశారు.

కుమార్తెను ఓదారుస్తున్న బంధువులు

# సుందరీకరణ కల బ్రహ్మోత్సవ కళ

బిలకూటక్షేత్రం కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కొండ దిగువన ఈశాన్యంలో ఉన్న పుష్కరిణి సుందరీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చిలో జరిగే స్వామివారి తెప్పోత్సవం పుష్కరిణిలో నిర్వహించాలనే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 21 నాటికి ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతుల దాతృత్వంతో రూ.2 కోట్లతో పనులు జరుగుతున్నాయి. చక్రస్నాన కార్యక్రమం కూడా ఇక్కడే జరగనుండడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

# ఉప్పు.. ఉపాధి

**అల్లూరు కేంద్రంగా 50 వేలమందికి పనులు**

న్యూస్‌టుడే, అల్లూరు

ఉప్పుతో ఉపాధా? ఇదేంటి అనుకుంటున్నారా.. నిజమే. తయారీలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండటమే కాదు.. రవాణా, వ్యాపారరంగంలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వివరాలు తెలుసుకోవాలని ఉందా.. కథనం చదవాల్సిందే. అల్లూరు మండల తీర ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో ఉప్పు తయారీ అవుతోంది. ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 50 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. మండలంలోని ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతంలో సుమారు ఆరువేల ఎకరాల్లో తయారీ మడులున్నాయి. భౌగోళికంగా ఇక్కడి తీర ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పు తయారీకి అనుకూలంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో ఉత్పత్తి అవుతోంది. తూర్పు తీరంలో తమిళనాడు ట్యూటికోరిన్ తరువాత అల్లూరు ప్రాంతంలోని ఉప్పు నాణ్యతకు పేరుంది.

### ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ఇస్కపల్లి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న ఉప్పు భూములను ఉపాధి కోసం సొసైటీలను ఏర్పాటు చేసి లీజుకు ఇస్తుంటారు. దీంతో ఈ ప్రాంతంలో వివిధ వర్గాల ప్రజలు తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు క్వింటా ఉప్పు రూ.90 ఉండేది. ఇటీవల రూ.450కి అమ్ముతున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఇందులో రెండు రకాల ఉప్పు ఉంది. మొదటి రకం ఆహార తయారీ పరిశ్రమల్లో, రెండోది పారిశ్రామిక కేంద్రాల్లో వినియోగిస్తుంటారు. సంవత్సరంలో మూడు నెలలు మినహా మిగిలిన సమయాల్లో తయారీ అవుతుంది.

### సెంటిమెంటు

ఉప్పు సత్యాగ్రహం అల్లూరు ప్రాంతంలో జరిగింది. ఆ సమయంలో గోగులపల్లి, ఇస్కపల్లి ప్రాంతాల నుంచి ఎంతో మంది ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన సందర్భాలున్నాయి. నూతనంగా రవాణా వాహనం కొనుగోలు చేస్తే, మొదటి లోడుగా ఉప్పును తీసుకుపోవడం సెంటిమెంటుగా భావిస్తారు. ఇది ఇప్పటికీ కొనసాగుతోంది.

# చెట్టు నీడలో.. తరాల జాడలో..

**పెద్దపట్టపుపాలెంలో సమష్టి నిర్ణయాలు**

న్యూస్‌టుడే, ఉలవపాడు

సముద్ర తీరప్రాంత మత్స్యకార గ్రామాలు ప్రత్యేకతను సంతరించుకుంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. సమష్టి నిర్ణయాలు తీసుకుంటూ.. గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. మండలంలోని పెద్దపట్టపుపాలెం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. పంచాయతీలో సుమారు 3,500 మంది నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఇంటి పేరున ఒక కాపు సభ్యులుగా ఉంటారు. వీరందరూ అయిదుగురు గ్రామ పెద్దలను నియమించుకుంటారు. వీరి సమక్షంలోనే రచ్చబండ వద్ద సమస్యలు పరిష్కరించుకుంటారు. తప్పు చేస్తే జరిమానా విధిస్తారు. గ్రామ సమస్యలతో పాటు.. పల్లెల మధ్య తలెత్తే వివాదాలు కూడా ఇరు గ్రామాల పెద్దలు రచ్చబండ వద్దే పరిష్కరిస్తారు. గ్రామంలో శుభ, అశుభ కార్యక్రమాలకు తలారి అనే వ్యక్తి ద్వారా బంధుమిత్రులకు కబురు పంపుతారు. ఇది ఎంతో కాలం నుంచి వస్తోంది. వేట సమయంలో సముద్రంలో తలెత్తే వివాదాలు రచ్చబండ వద్దే పరిష్కరించుకుంటారు. గ్రామంలో ప్రధానంగా చేపల వేటతో పాటు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. 500 ఎకరాలకు పైగా భూముల్లో వరి పండిస్తున్నారు. వంద ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. వేట నిషేధ సమయంలో గతంలో ఇళ్లకే పరిమితం అయ్యేవారు. ప్రస్తుతం కూలీ పనులకు వెళుతున్నారు.



ఈనాడు కథనం

పంచాయితీ జరిగేది ఈ వేపచెట్టు కిందే

### అభివృద్ధి ఇలా..

గ్రామానికి చెందిన వంద మంది యువకులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, పోలీసులు, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 70 శాతం వీధుల్లో సిమెంటు రోడ్లు నిర్మించుకున్నారు. సొంత నిధులతో రెండు ఆలయాలు అభివృద్ధి చేసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చారు. ఇక్కడి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతారు.

# శత.. సంకల్పం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో 'సంకల్ప్' కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇది ఫిబ్రవరి 20 వరకు కొనసాగనుంది. కార్యక్రమం జిల్లాలోని 23 ప్రభుత్వ కళాశాలలు, రెండు ఎయిడెడ్, ఒక మున్సిపల్ జూనియర్ కళాశాలలో జరుగుతోంది. ఉదయం 9.10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బోధన, రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

**ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు**

ప్రత్యేక తరగతుల్లో కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

### ఎ, బి, సి కేటగిరులుగా విభజన

అర్ధ సంవత్సరం పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి కేటగిరులుగా విభజించారు. ఎ కేటగిరి విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. బి, సి గ్రేడు విద్యార్థులకు ఇంటర్ బోర్డు అందించిన స్టడీ మెటీరియల్‌లోని ముఖ్యమైన ప్రశ్నలు చెప్పడం, చదివించడం, చూడకుండా రాయించడం చేస్తున్నారు. ఈ నెల 15 నుంచి ప్రీఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఈనెల 21 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టడీ అవర్స్ నిర్వహించి నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తారు. విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేయడంతో పాటు వారిని చదివించడానికి కేర్ టేకర్లను నియమించారు. విద్యార్థులకు ఐఐటీ, నీట్‌పై రోజుకొక పిరియడ్ కేటాయించి బోధిస్తున్నారు.

### ప్రత్యేక కార్యక్రమం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యక్రమం 'సంకల్ప్' అమలు చేస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతుల ద్వారా బోధిస్తున్నాం.

– బీవీ కృష్ణారెడ్డి, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి

| | |
|---|---|
| జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు | 26 |
| ప్రథమ సంవత్సరం విద్యార్థులు | 3,465 మంది |
| ద్వితీయ సంవత్సరం | 3,104 |

# కోత.. రైతు కలత

**నిధులివ్వని వైకాపా ప్రభుత్వం**

సంగం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో భూములు కోతకు గురవుతూ పేద రైతులు నష్టపోతున్నారు. సంగం బ్యారేజీకి దిగువన అత్యంత సమీపంలో పెన్నానది గట్టు పూర్తిగా ధ్వంసమైంది. దానికి మరమ్మతులు చేసి పటిష్ఠం చేసేందుకు ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపేద ఎస్సీ రైతులకు శాపంగా మారింది. రాజంపేట జిల్లాలోని అన్నమయ్య జలాశయానికి గండి పడటంతో 2021 నవంబరు 19వ తేది అర్ధరాత్రి నుంచి 20వ తేదీ ఉదయం వరకు సంగం ఆనకట్ట మీదుగా పెన్నానదిలో 5.5లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహించి దిగువన ఎడమ వైపు గట్టు దాటి సమీప ప్రాంతాలను ముంచెత్తింది. అప్పుడే సంగం బ్యారేజీకి దిగువన ఎడమ వైపు గట్టు కోతకు గురై ధ్వంసమైంది.

**దస్త్రాలకే పరిమితం..** 2022 మే నెల తొమ్మిదో తేదీన అప్పటి జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పరిశీలించి మరమ్మతులకు ఆదేశించడంతో రూ.66లక్షలతో తయారు చేసిన ప్రతిపాదనలు దస్త్రాలకే పరిమితమయ్యాయి. అప్పటి నుంచే తెలుగుగంగ విభాగం అధికారులు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. తెర్లపై దిగువన కోతకు గురయ్యే ప్రాంతాలకు జాగ్రత్త వహించాల్సి ఉంది. అయినా నెల్లూరు జిల్లాలో కొనసాగుతున్న వరద ప్రవాహం ఎడమ వైపు గట్టును కోతకు గురి చేస్తుండటంతో సమీపంలో ఎస్సీల భూములు అందులో కలుస్తూ నష్టపోతున్నారు.

# కోనేటి.. ఆక్రమణ కనరేంటి!

**కలెక్టర్ ఆదేశించినా చర్యలేవి?**

న్యూస్‌టుడే, వెంకటాచలం

రూ.కోట్ల విలువైన భూమిపై భూబకాసురుల కన్ను పడింది. దాన్ని రక్షించాలంటూ స్వయాన కలెక్టర్ ఆదేశించినా.. ఏ అధికారి చొరవ చూపడం లేదు. ఫలితంగా మళ్లీ పరులపాలవుతోంది. వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన సర్వే నెంబర్ 16లో మొత్తం 402 అంకణాల కోనేటి స్థలం ఉండగా.. జాతీయ రహదారి విస్తరణలో సగం పోగా.. ప్రస్తుతం సుమారు 200 అంకణాలు ఉంది. ఇక్కడ అంకణం రూ.లక్షకు పైనే పలుకుతోంది. అంటే.. స్థలం విలువ రూ.2కోట్లకు పైమాటే. పక్కనే నిర్మాణాలు చేపట్టిన వారు దీన్ని శుభ్రం చేయడంతో పాటు ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా మట్టి తరలించి యంత్రాలతో చదును చేశారు. సమీపంలో పక్కా నిర్మాణాలు చేపట్టిన వారు ప్రభుత్వ స్థలం సొంతమైనట్లు అవసరాల కోసం ఏకంగా కాలువ ఏర్పాటు చేయడంతో పాటు అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు.

అనుమతి లేకుండా అక్రమంగా తవ్విన కాలువ

### నెలరోజులైనా పట్టించుకోరా..

కోనేటి స్థలం ఆక్రమణలపై 'ఈనాడు'లో గత నెల 6న 'కోనేటి స్థలంపై కన్ను' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ సమయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించి స్థల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు వేశారు. పరిరక్షణ బాధ్యతలు పంచాయతీకి అప్పగిస్తామని చెప్పారు. నెల రోజులు గడిచినా నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదాసీనంగా ఉంటే స్థలం మొత్తం ఆక్రమణల పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### స్థలాన్ని పరిశీలన చేయిస్తా

కోనేటి స్థలం ఆక్రమణ నాదృష్టికి రాలేదు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా పనులు నిర్వహిస్తే చర్యలు తప్పవు. పంచాయతీ అధికారులను పంపి స్థలాన్ని పరిశీలన చేయిస్తా. అనంతరం రక్షణకు చర్యలు తీసుకుంటాం.

– కల్పన, ఎంపీడీవో

# స్కేటింగ్‌లో బంగారం

న్యూస్‌టుడే, నెల్లూరు (క్రీడా విభాగం)

రమ్య

ఇష్టంతో ఆటపై ఆసక్తి పెంచుకున్న చిన్నారి.. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయస్థాయిలో రాణిస్తోంది. స్కేటింగ్ రింకులో అడుగు పెడితే చాలు.. పతకాల పంట పండాల్సిందే. విన్యాసాలు చేస్తూ ప్రత్యర్థికి చెమటలు పట్టిస్తూ.. జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తోంది. నగరానికి చెందిన అద్వైక రమ్య. తాజాగా శనివారం విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారం, వెండి పతకాలు సాధించి అబ్బుర పరిచింది. నెల్లూరు నగరానికి చెందిన ఎ.మోహన్ కుమార్, శ్వేత దంపతుల కుమార్తె అద్వైక రమ్య. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. స్కేటింగ్‌లో కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు.. శిక్షకుడు జితేంద్ర వద్ద చేర్పించారు. క్రీడలో మెలకువలు తెలుసుకుని ఆటలో పట్టు సాధించింది.

### దేశానికి పేరు తీసుకొస్తా

అంతర్జాతీయ స్థాయిలో రాణించి.. ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించి దేశానికి పేరు తీసుకొస్తానని రమ్య తెలిపింది. తల్లిదండ్రులు, శిక్షకుల సహకారంతో ప్రతిభ చూపుతున్నట్లు వివరించింది.

### పతకాల పంట

2022లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి, 2023లో జరిగిన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ) పోటీల్లో మూడు వెండి పతకాలు సొంతం చేసుకుంది. గత ఏడాది జరిగిన ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో మూడు, జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. అదే ఏడాది ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో బంగారం, వెండి పతకాలు కైవసం చేసుకుంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పుట్టినరోజు శుభాకాంక్షలు
పెళ్లి వేడుకల ప్రకటనలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

## మేయర్ రాజీనామా ఆమోదం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈనెల 18న మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆమె శనివారం పదవికి రాజీనామా చేయడం సంచలనంగా మారింది. మేయర్ తన ప్రతినిధి ద్వారా కలెక్టర్ క్యాంపు కార్యాలయ పేషీలో ఆదివారం లేఖను అందించారు. రాత్రికి రాజీనామాకు ఆమోద ముద్ర పడింది. దీంతో గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నారు.

### ఇన్‌ఛార్జిగా రూప్‌కుమార్‌కు అవకాశం

మేయర్ రాజీనామాకు ఆమోదం తెలపడంతో ఇన్‌ఛార్జి మేయర్‌గా రూప్‌కుమార్ యాదవ్ కొనసాగనున్నారు. అందరు కార్పొరేటర్లు ఆయనకు మద్దతు తెలిపినట్లు సమాచారం. మరోవైపు తెదేపా నేతలు కార్పొరేటర్లను చెన్నై నుంచి విమానంలో గోవాకు తరలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేస్తే కొత్త మేయర్‌ను ఎన్నుకోనున్నారు.

# అతివల ఆరోగ్య రక్ష.. సఖి సురక్ష

న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

**జిల్లాలో 6,247 మందికి వైద్య పరీక్షలు**

వైద్య పరీక్షలకు తరలివచ్చిన మహిళలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సఖి సురక్ష పథకానికి విశేష స్పందన లభించింది. పథకం ద్వారా 35 ఏళ్లు పైబడిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో జాతీయ అర్బన్ ఆరోగ్య మిషన్ (ఎన్‌యూహెచ్‌ఎం) సహకారం, ఈ-వైద్య ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలను ఈనెల ఆరో తేదీ నుంచి నిర్వహించారు. తొలి విడతలో 5,102 మంది సభ్యులకు పరీక్షలు నిర్వహించాలని నిర్దేశించగా.. 6,247 మంది శిబిరాలకు హాజరయ్యారు.

### కౌన్సెలింగ్ అవసరం

శిబిరాల్లో మహిళలకు 16 రకాల పరీక్షలు నిర్వహించారు. మానసిక ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఆందోళన, ఒత్తిడి వంటి అంశాల్లో కౌన్సెలింగ్ అవసరాన్ని గుర్తించారు. పరీక్షలను పూర్తి చేసి రిపోర్టును వారి ఆధార్ అనుసంధాన ఫోన్ నంబరుకు పంపించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రత్యేక ఆరోగ్య కార్డులు అందించారు. రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా కవరేజ్ ఉంటుంది. ఏడాదిలో కనీసం నాలుగు సార్లు టెలీ కన్సల్టేషన్ సేవలు అందుబాటులో ఉంటాయి. సంవత్సరం రోజుల పాటు హెల్త్ సీఆర్పీలు వారి ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ ఉంటారు. మొదటి విడత వైద్యశిబిరాలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని మెప్మా పీడీ లీలారాణి తెలిపారు.

| నగరం/పట్టణం | లక్ష్యం | హాజరైన వారు |
|---|---|---|
| కావలి | 849 | 637 |
| నెల్లూరు రూరల్ | 1833 | 2660 |
| నెల్లూరు నగరం | 1832 | 2514 |
| కందుకూరు | 588 | 425 |

(c) eenadu

## కండలేరు డ్యాం.. నిర్వహణ అధ్వానం

పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాల పరిధిలో 21 వేల ఎకరాలకు సాగునీరందించే కండలేరు ఎడమ కాలువ కట్ట వద్ద ముళ్ల చెట్లు పెరిగి అధ్వానంగా ఉంది. ఇటీవల ఒక అంబులెన్సు కట్టపైకి వెళ్లి ముళ్ల పొదల్లో చిక్కుకుంది. బయటకు తీసేందుకు రెండు రోజులు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా డ్యాం నిర్వహణపై ఉన్నతాధికారులు స్పందించి శుభ్రం చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు

## ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యమేనా!

నెల్లూరు పెన్నానది వంతెన సమీపంలో ఓ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు వెళుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే ఆర్టీఏ అధికారులు కనీసం ప్రధాన మార్గాల్లో తనిఖీలు చేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదం తప్పదని చూసిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులైనా ఇలాంటివి పరిశీలించి అడ్డుకోవాలని పలువురు సూచిస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

## షాదీమంజిల్ పనులు పూర్తయ్యేనా..!

బుచ్చిలో షాదీమంజిల్ విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ ఎక్కువ మంది పేదలు వివాహాలు జరుపుతుంటారు. ఇరుకుగా ఉండటంతో వెనుక స్థలంలో అదనపు భవనం పనులు చేపట్టారు. గత వైకాపా పాలనలో పట్టించుకోకుండా వదిలేశారు. ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని, కూటమి పాలనలోనైనా పూర్తి చేయాలని పలువురు వాపోతున్నారు. వైస్‌ఛైర్మన్ సుప్రజ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేసేలా ఉన్నతాధికారులకు నివేదించారని, నిధులు మంజూరుకాగానే పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాలెం

## నాలుగు దశాబ్దాల అపూర్వ కలయిక

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు నాలుగు దశాబ్దాల అనంతరం సమావేశమయ్యారు. స్థానిక ప్రైవేట్ మందిరంలో వారంతా చదువుకున్న రోజుల్లో గడిపిన మధుర క్షణాలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. గురువుల కృషితో తామంతా జీవితంలో స్థిరపడగలిగామని పలువురు అభిప్రాయపడ్డారు. అందరిని ఒక చోట తీసుకొచ్చిన పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, చలమయ్య, ప్రసాద్, హరికృష్ణ, మహ్మద్, హరిబాబు తదితరులకు తోటి స్నేహితులు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు, సంగం, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మార్కెట్ కమిటీ ఆవరణలో రైతన్న.. మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆత్మకూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనార్దననాయుడు, సభ్యులతో పాటు డీసీసీ సభ్యులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ సోమశిల, కండలేరు జలాశయాలు, ఇతర వనరులలో 150 టీఎంసీల నిల్వ ఉందన్నారు. సోమశిల హైలెవల్ కాలువ పూర్తి చేసి మెట్ట మండలాలకు సాగు, తాగునీరు ఇవ్వాలన్నదే లక్ష్యమన్నారు. ● సంగం మండలం మక్తాపురంలో జరిగిన సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.పది లక్షల కోట్ల అప్పులు, దానికి రూ.1.4లక్షల కోట్ల పెండింగ్ బిల్లులను ఈ ప్రభుత్వానికి అప్పగిస్తే వాటిని చెల్లించేందుకే గతేడాది కాలం కష్టపడాల్సి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కేంద్రం నుంచి వివిధ రకాల పథకాలకు అవసరమైన నిధుల కేటాయింపు కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఆత్మకూరు ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, నాయకులు గిరినాయుడు, మోహన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు.

ఆత్మకూరులో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి ఆనం

## అప్పు తీర్చేందుకు మత్తు దందా

### ముగ్గురు నిందితుల అరెస్ట్.. 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: బెంగళూరులోని డ్రగ్స్ ముఠాలతో సంబంధాలు పెంచుకొని సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న యు.కార్తీక్ (37), సీహెచ్. బాలాజీ (32), టి.దీపక్ (29)లను అరెస్ట్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం తెలిపారు. నిందితుల నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన కార్తీక్ అలియాస్ అలెక్స్ చదువు మధ్యలో ఆపేశాడు. కొంతకాలం మిల్క్ ఏజెన్సీ, గ్రానైట్ వ్యాపారం చేసి నష్ట పోయాడు. సుమారు రూ.2 కోట్ల వరకు ఉన్న అప్పుల నుంచి బయటపడేందుకు అడ్డదారి ఎంచుకున్నాడు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చి నేరేడ్‌మెట్‌లో స్థిరపడిన బామ్మర్ది బాలాజీతో కలిసి మత్తుదందా ప్రారంభించాడు. 2016లో బీఎస్సీ పూర్తిచేసిన బాలాజీ 2022 నుంచి తండ్రి వ్యాపారం చూసుకుంటున్నాడు. ఎండీఎంఏకు అలవాటపడ్డాడు. డ్రగ్స్ విక్రయిస్తూ అరెస్టయ్యాడు. జైలు నుంచి రాగానే బావతో జతకట్టాడు. వీరిద్దరికీ జీడిమెట్లకు చెందిన దీపక్ తోడవటంతో ముగ్గురు కలిసి మత్తు పదార్థాలు సరఫరా, విక్రయం ప్రారంభించారు. ప్రధాన నిందితుడు బాలాజీ బెంగళూరులోని నైజీరియన్ల నుంచి ఎండీఎంఏ గ్రాము 4 నుంచి 5 వేలకు కొనుగోలు చేసేవాడు. ఆ సరకును మిగిలిన ఇద్దరు గ్రాము 7 నుంచి 8 వేలకు విక్రయించేవారు. నూతన సంవత్సర వేడుకలకు పెద్దఎత్తున ఎండీఎంఏ తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. వారి కదలికలపై నిఘా ఉంచిన ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి, ఎస్సై బి.మనోజ్‌కుమార్, మాసబ్ ట్యాంక్ డీఐ శ్రీనివాసరావు బృందం అరెస్ట్ చేసింది.

## నిరుపేద కుటుంబాల్లో సౌర వెలుగులు

న్యూస్‌టుడే, సంగం, కొడవలూరు

విద్యుత్తు భారం.. వాతావరణ కాలుష్యం తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం సౌర విద్యుత్తును ప్రోత్సహిస్తోంది. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీల గృహాల్లో వెలుగులు విరజిమ్మేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటివరకు ఎవరైతే ఉచితంగా సరఫరా పొందుతున్నారో ఆయా లబ్ధిదారుల కుటుంబాలకు ఎలాంటి వ్యయం లేకుండా రెండు కిలోవాట్స్ గల సౌర పలకలు ఏర్పాటు చేయనున్నారు. వారికి అద్దె రూపంలో ప్రతి నెలా రూ.200 వంతున అందించనున్నారు.

ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర పలకలు

### రూ.10.18 కోట్ల మేరకు రాయితీ..

జిల్లాలో 38 మండలాల పరిధిలో 1,27,301 కుటుంబాలకు డిస్కం ప్రతి నెలా ఉచిత విద్యుత్తు సదుపాయం కల్పిస్తుంది. వారికి నెలకు 200 యూనిట్ల వరకు ఎలాంటి రుసుము విధించడం లేదు. ఫలితంగా ఒక్కో కుటుంబానికి నెలకు రూ.800 వంతున రూ.10.18 కోట్లు డిస్కంకు వ్యయమవుతుండగా, ఆమేరకు లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు.

డివిజన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు

| డివిజన్ | లబ్ధిదారులు | ఆమోదం | అనుమతి | పరిశీలన | శాతం |
|---|---|---|---|---|---|
| కావలి | 19,612 | 4,749 | 4,625 | 124 | 75.79 |
| నెల్లూరు గ్రామీణం | 44,538 | 11,343 | 10,271 | 1,072 | 74.53 |
| కోవూరు | 31,007 | 8,886 | 8,845 | 41 | 71.43 |
| నెల్లూరు నగరం | 9,912 | 3,434 | 3,354 | 80 | 65.36 |
| ఆత్మకూరు | 22,232 | 9,810 | 9,534 | 276 | 55.87 |

### రూ.1.5 లక్షల వంతున..

వారికి నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కలిగింది. ఇప్పటి వరకు కేవలం వినియోగదారులుగా ఉండగా ఇక నుంచి సౌర విద్యుత్తు ఉత్పత్తిదారులుగా మారనున్నారు. రూ.1.5 లక్షల వ్యయంతో నాలుగు సౌరపలకలు, ఇతర పరికరాలను ఉచితంగా అమర్చనున్నారు.

### నెలకు రూ.200 చొప్పున..

నాలుగు పలకలు ఏర్పాటు చేసేందుకు 200 చదరపు అడుగుల స్థలం అవసరమవుతుంది. ఒక్కో అడుగుకు రూపాయి వంతున రూ.200ల మేర వారి డిస్కం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుండటం విశేషం.

### 36,629 మందికి అనుమతి..

జిల్లా వ్యాప్తంగా సంబంధిత లబ్ధిదారులతో మాట్లాడగా 38,222 మంది సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుకు ఆమోదం తెలపగా వారిలో 36,629 మందికి అనుమతి లభించింది. త్వరలో లబ్ధిదారుల గృహాల్లో పరికరాలేర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, ఆ పథకం నోడల్ అధికారి శేషాద్రి బాలాజీ తెలిపారు.

## వాజ్‌పేయీ పాలనలో దేశం ప్రగతిపథం: వాకాటి

నెల్లూరు (పద్మావతి సెంటర్), న్యూస్‌టుడే: మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయీ హయాంలో దేశం ప్రగతిబాట పట్టిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వాకాటి నారాయణ రెడ్డి ప్రకటించారు. నగరంలో సోమవారం జరగనున్న అటల్- మోదీ సుపరిపాలన యాత్ర సభ ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. వాజ్‌పేయీ విగ్రహం ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారులు విస్తరించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సభ సందర్భంగా అయ్యప్పగుడి దగ్గర నుంచి మొదలయ్యే ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఇందులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొంటారన్నారు. ఆయన వెంట దిల్లీలో తితిదే బోర్డు సభ్యులు సుమంత్‌రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

విగ్రహాన్ని పరిశీలిస్తున్న నారాయణరెడ్డి తదితరులు

## అటెండర్‌తో ఉపాధ్యాయుడి విధుల నిర్వహణపై విచారణ

వింజమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుడికి బదులు అటెండర్ విధులకు హాజరైన విషయమై ఎంఆర్సీలో ఆదివారం కావలి డిప్యూటీ డీఈవో ఎం.హరి ప్రసాద్ విచారణ చేపట్టారు. మండలంలోని జనార్దనపురం పాఠశాలలో శనివారం ఈ సంఘటన జరగగా.. చర్చకు దారితీసిందవి. దీంతో ఎంఈవో-1, 2లు రమేష్, మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు ఆవుల రాజు, ఎంఆర్సీ అటెండర్ శ్రీహరిలను విచారించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ పూర్తి విచారణ నివేదికను డీఈవోకు పంపుతానన్నారు.

ఎంఆర్సీలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఈవో ఎం.హరి ప్రసాద్

## దూసుకొచ్చిన మృత్యుశకటం..

### గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలుడి దుర్మరణం

అనంతసాగరం, న్యూస్‌టుడే: వారిది రైతు కుటుంబం.. ఎన్నో ఆశలతో కుమారుడిని కష్టపడి చదివిస్తున్నారు.. ఉన్నత స్థాయిలో చూడాలనుకున్న వారి ఆశలు కల్లలయ్యాయి.. ఆదివారం సరదాగా పొలం వద్దకెళ్లి ఇంటికొస్తుండగా వాహనం ఢీకొని మృతిచెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... చాపురాలపల్లికి చెందిన సన్నపురెడ్డి శ్రీనివాసులు, సుప్రజ దంపతుల రెండో కుమారుడు **ఆనంద్ రెడ్డి**(11) కలువాయిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్నారు. అక్కడే హాస్టల్‌లో ఉంటూ శనివారం ఆత్మకూరులో నవోదయ పరీక్ష ప్రవేశ పరీక్షరాసి ఇంటికొచ్చారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో పొలం వద్దకెళ్లారు. సాయంత్రం వారంతా తిరిగొస్తున్నారు. చాపురాలపల్లి జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా చుంచులూరు నుంచి పెంచలకోన వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలై కొనఊపిరితో ఉండగా కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఎస్సై సూర్యప్రకాశ్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నారు.

## యుద్ధ కళ.. పతకాలు భళా!

● పేరు ❖ ఊరు
✤ సాధించిన విజయాలు ✦ లక్ష్యం

ఆసక్తి ఉంటే రాణించడం సులభమేనని విద్యార్థులు నిరూపిస్తున్నారు... చిన్నప్పటి నుంచి లక్ష్యంతో సాధన చేసి ఎక్కడ పోటీలు జరిగినా సత్తా చాటుతున్నారు... విభిన్నమైన క్రీడ అయిన ఫెన్సింగ్‌లో పతకాలు సాధిస్తున్నారు... బుచ్చిలో అండర్-14 విభాగంలో 69వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని గతంలో తాము సాధించిన విజయాలను గుర్తుచేసుకొని ప్రస్తుత పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధించిన వారిపై ప్రత్యేక కథనం. –న్యూస్‌టుడే, బుచ్చి

ఫెన్సింగ్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

### నిత్య సాధనతో విజయం..

● జంపాని చరణ్‌సాయి ❖ ఒంగోలు ✤ గతేడాది కాకినాడలో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్‌లో వ్యక్తిగతంగా రజత పతకం దక్కించుకున్నారు. జట్టు పరంగా పలు పతకాలు సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ పొందుతున్నారు. ✦ ఒలింపిక్స్‌లో పతకం.

### బరిలో దిగితే పతకమే..

● కె.హర్షిత ❖ బాపట్ల ✤ కాకినాడలో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ పోటీల్లో వ్యక్తిగత విభాగంలో రజత పతకం, ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించి నేషనల్ పోటీలకు ఎంపికయ్యారు. టీం విభాగంలో వెండి పతకం సాధించింది. బరిలో దిగితే పతకమే లక్ష్యంగా రాణిస్తున్నారు. ✦ ఒలింపిక్స్‌లో ఆడడం

### కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..

● టి.దీపిక ❖ చిత్తూరులోని నరహరిపేట ✤ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, టీం విభాగంలో బంగారుపతకం సాధించారు. స్కిప్పింగ్‌లో సైతం జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో మెరుగ్గా రాణిస్తున్నారు. ✦ ఆర్మీలో చేరడం.

### జాతీయ స్థాయిలో రాణించేలా..

● తనూజ ❖ చిత్తూరు ✤ జిల్లాస్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని రాణించారు. బుచ్చిలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. టీం విభాగంలో విజయాలకు కీలకపాత్ర పోషించి, బంగారు పతకం దక్కింది. జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నారు. ✦ పోలీసు

## వివాహిత ఆత్మహత్య

సీతారామపురం, న్యూస్‌టుడే: బావిలోకి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు సీతారామపురానికి చెందిన ఆకుల మల్లికార్జున, భాగ్యమ్మ(29)దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామపొలాల వద్ద ఉన్న బావిలో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. సీఐ వెంకట్రావు, ఎస్సై శివకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాచార స్రవంతి

### బంగారం ధరలు

గ్రాముధర: రూ.12,643
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)
సవర ధర: రూ.1,01,144
వెండి గ్రాము : రూ.198.00

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ | 143 |
| లేయర్ | 122 |
| బ్రాయిలర్స్ | 254 |
| బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్ | 280 |
| లేయర్ మాంసం | 207 |

## నిలిచిన సరఫరా.. నిరుపేదలకేదీ ఆసరా..?

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కోవూరు

| | |
|---|---|
| మొత్తం రేషన్ కార్డులు | 7,32,331 |
| చౌకదుకాణాలు | 1,513 |
| ప్రతి నెలా అవసరమైన కందిపప్పు | 732 టన్నులు |
| రేషన్ దుకాణాల్లో కేజీ ధర | రూ.60 |
| మార్కెట్‌లో ధర | రూ.120–140 |

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా కందిపప్పు ఊసే లేకపోవడంతో కార్డుదారులు పెదవి విరుస్తున్నారు. గతంలో తెదేపా పాలనలో ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, చక్కెర, చింతపండు, వంటనూనె, రాగిపిండి వంటి చాలా రకాల సరకులను చౌక ధరలకు అందించింది. తరువాత కొలువుదీరిన వైకాపా ప్రభుత్వం అరకొరగా కందిపప్పు సరఫరా చేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని నెలలు ఇచ్చారని, పండగ సమయాల్లో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు విన్నవిస్తున్నారు.

### పండగకైనా ఇచ్చేనా..

జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుదారుల్లో అధిక శాతం నిరుపేదలున్నారు. పది నెలలుగా రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.120 నుంచి రూ.140 వరకు ఉంది. అధిక ధరను వెచ్చించి కొనుగోలు చేసే శక్తి లేని వారు చౌక దుకాణాలను ఆశ్రయిస్తుంటారు. వచ్చే నెల సంక్రాంతి(పెద్ద పండగ) నాటికైనా అందుబాటులోకి వస్తుందా అంటూ రేషన్ డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు.


22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా మిత్రులకు, శ్రేయోభిలాషులకు, జిల్లా ప్రజలకు, అధికారులకు, అనధికారులకు ఇవే మా హృదయపూర్వక 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
CAR ZONE
Ultimate Car Decors
కరెంటు ఆఫీసు సెంటర్, దర్గామిట్ట, నెల్లూరు-4. ఏ.పి. సెల్ : 95504 73299,
email : nellore.carzone@gmail.com సెల్ : 94406 91303



SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లెవెల్-3, వోకార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్, సి-2 బ్లాక్, బాంద్రాకుర్లా కాంప్లెక్స్, (బాంద్రా ఈస్ట్), ముంబై -400051, ఫోన్: 022 4241 0400, 022 4060 3100
నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
కార్యాలయం చిరునామా : జోనల్ ఆఫీస్, డి.నెం.26-2-7, 2వ అంతస్థు, పద్మావతి ప్లాజా, కెనరా బ్యాంక్ ప్రక్కన, ఏ.కె.నగర్, నెల్లూరు (జిల్లా)-524004
బ్రాంచ్ కార్యాలయం : నెల్లూరు - 2 వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

తుమ్మకూరి శేఖర్ గారికి చెందిన స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ లోని రూల్ 9(1)తో కలిపి చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 ప్రకారం, ప్రతిపాదిత విక్రయనోటీసు తేది 29.10.2024 ముగిసిన 30 రోజుల తరువాత స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 సెక్షను 13(8) చట్టం 54/2002 r/w 8(6) ప్రకారం ఆస్తుల ను తిరిగిపొందు హక్కును వినియోగించుటలో మీరు విఫలం అయినందున, ఈ ఇ-వేలం అమ్మకం ప్రకటన జారీ చేయబడింది. ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులు / సహ-దరఖాస్తుదారులు / సహ-ఋణగ్రహీతలకు తెలియజేయునది. ఇది మీకు తెలియ చేయడానికి:
1. మేము అనగా మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్) తెలిపేదేమంటే, "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" అనునది "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో, గౌరవనీయ ఎన్‌సిఎల్‌టి, చెన్నై ఆదేశానుసారం 09.11.2022న సి.పి.నెం. 69-76/2002 ద్వారా కలిసిపోయినది, తరువాత మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ కింద రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ధృవీకరించిన విధంగా "సర్టిఫికెట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ పర్స్యుయంట్ టు ఛేంజ్ ఆఫ్ నేమ్" ప్రకారం మెసర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ లిమిటెడ్ పేరు మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మారింది. కంపెనీస్ యాక్ట్ 2013 కింద నమోదైనది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయుటకు ఆర్బీఐతో నమోదు అయినది. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డోర్ నెం.26-2-7, 2వ అంతస్తు, పద్మావతి ప్లాజా, కెనరాబ్యాంకు పక్కన, ఎ.కె.నగర్ నెల్లూరు (జిల్లా) - 524004 మరియు బ్రాంచి ఆఫీసు నెల్లూరు 2 (ఇకపై కంపెనీ / రుణదాత గా వ్యవహరించబడును) యొక్క అధీకృత అధికారి దిగువ నోటీసును కింది విధంగా జారీ చేస్తున్నారు.
2. సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002, (SARFAESI) చట్టంగా ఇకపై తెలియచేయబడుతుంది) సెక్షన్ 13(2) ప్రకారం జారీ చేయబడిన మా డిమాండు నోటీసు తేది 26.08.2022 ని చూడండి, దీని లోన్ అకౌంట్ సం. **NELL3TF2002290002** లో మొత్తం బకాయి **రూ.42,34,077/- (అక్షరాలా నలభై రెండు లక్షల ముప్పై నాలుగు వేల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే)** లను నోటీసు అందుకొన్న తేది నుంచి 60 రోజులలోగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు అందచేసిన రుణాన్ని పూర్తిగా మీచే చెల్లించు వరకు వర్తించు అదనపు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించాలని మిమ్ములను కోరియున్నాము. కానీ మీరు చెల్లించుటలో విఫలం చెందారు, కోరిన విధంగా బాకీ చెల్లించుటలో నిర్లక్ష్యం చేసారు.
3. తరువాత, సెక్షను 13(4)కింద సెక్యూర్డ్ క్రెడిటార్ నోటీసు తేదిన 08.11.2022ను ఇంతకుముందే జారీ చేసారు మరియు అధీకృత అధికారిచే ప్రాతినిధ్యం వహిస్తున్న సెక్యూర్డ్ క్రెడిటార్, SARFAESI చట్టం మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని ప్రొవిజనులను పూర్తిగా పాటిస్తూ మరియు వాని ప్రకారం అడ్వకేట్ కమిషనర్ ద్వారా దిగువ వివరించిన ఆస్తులను 21-12-2023న భౌతికంగా స్వాధీనం చేసుకొన్నారు మరియు చట్టం మరియు నిబంధనల ప్రకారం బహిరంగవేలం మరియు / లేదా ఇతర విధానాల ద్వారా దిగువ వివరించిన హామీగా గల ఆస్తులను విక్రయించాలని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నోటీసు ప్రచురణ తేది నుంచి 30 రోజుల తరువాత, చట్టంలోని నియమ నిబంధనల ప్రకారం"ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అది అక్కడ అలాగే" ప్రాతిపదికన, ఆన్‌లైన్ బహిరంగ వేలం ద్వారా, డిమాండు నోటీసు తేది 26.08.2022 ప్రకారం గల బకాయి **రూ.42,34,077/- (అక్షరాలా నలభై రెండు లక్షల ముప్పై నాలుగు వేల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే)** లను వడ్డీ, ఖర్చులు, వెలలు మరియు న్యాయపరమైన మరియు ఇతర అనుబంధ ఖర్చులతో సహా రాబట్టుకొనుటకు గానూ విక్రయించబడును.

| ఋణగ్రహీత/ సహఋణ గ్రహీత/ హామీదారు/ తనఖాదారుల పేర్లు | 13(2) డిమాండ్ నోటీసు తేది & బకాయి మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది | స్థిరాస్తి వివరములు | ధరావత్తు సమర్పణకు బ్యాంకు ఖాతా వివరములు | ఈ-వేలం తేది & సమయం | సంప్రదించవలసిన వ్యక్తి & ఆస్తి తనిఖీ తేది |
|---|---|---|---|---|---|---|
| 1) తుమ్మకూరి శేఖర్, తండ్రి: టి. సుబ్బయ్య, డోర్ నెం.3/156, నాగేంద్ర నగర్, సపలాకుల గార్డెన్స్, 3వ మైలు దగ్గర, మైపాడు రోడ్డు, నెల్లూరు (జిల్లా)-524002 (ఋణగ్రహీత) 2) తుమ్మకూరి సుగుణ, భర్త: టి. శేఖర్, డోర్ నెం.3/156, నాగేంద్ర నగర్, సపలాకుల గార్డెన్స్, 3వ మైలు దగ్గర, మైపాడు రోడ్డు, నెల్లూరు (జిల్లా)-524002 (హామీదారు) 3) తుమ్మకూరి సుధీర్ కుమార్, తండ్రి: టి. శేఖర్, డోర్ నెం.3/156, నాగేంద్ర నగర్, సపలాకుల గార్డెన్స్, 3వ మైలు దగ్గర, మైపాడు రోడ్డు, నెల్లూరు (జిల్లా)-524002 (హామీదారు) 4) సన్నిబోయిన సుశీలమ్మ, భర్త: యస్ సుబ్బారావు, డోర్ నెం.3/155, నాగేంద్ర నగర్, సపలాకుల గార్డెన్స్, 3వ మైలు దగ్గర, మైపాడు రోడ్డు, నెల్లూరు (జిల్లా)-524002 (హామీదారు) | చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.42,34,077/- (అక్షరాలా నలభై రెండు లక్షల ముప్పై నాలుగు వేల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ + చార్జీలు ఋణ ఖాతా నెం. NELL3TF2002290002 క్రింద గల బకాయి. డిమాండ్ నోటీస్ తేది: 26-08-2022 | 21.12.2023 భౌతిక స్వాధీనం. తాకట్టు ఋణ భారాలు: తెలియవు. | యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు ఉప జిల్లా, ప్రస్తుతం స్టోన్‌హౌస్‌పేట ఉప జిల్లా, నెల్లూరు గ్రామీణ మండలం, అల్లిపురం, సవలాకుల తోటలు, ప్రస్తుత నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, పట్టా నెం.46, సర్వే నెం. 231/1లో మొత్తం ఎకరా 3.09 సెంట్లు మరియు దానిలో 2.09 సెంట్లు మరియు దానిలో ఎకరా 1.59 సెంట్ల భూమి లేఅవుట్ కింద ఇళ్ల ప్లాట్లుగా మార్చబడినది. మరియు దానిలో నెం.3లో ప్లాట్ 20 అంకణాల 36 చ॥గ॥ల విస్తీర్ణంలో ఉంది. లేదా 134.124 చ॥మీ॥ల స్థలం మరియు దానిలో డోర్ నెం. 28/1-ఎ-3-156 కలిగిన అసెస్‌మెంట్ నెం. 1031105397 తో నిర్మించిన ఆర్.సి.సి. భవనం. హద్దులు: తూర్పు: 12అ॥ల వెడల్పు కామన్ పాసేజ్-25.3 అ॥లు, పడమర: కోట వెంకటయ్య భూమి-25.3 అ॥లు, ఉత్తరం: పొరెడ్డి కృష్ణారెడ్డి భూమి-56 అ॥లు, దక్షిణం: సానిబోయిన సుబ్బారావు ప్లాట్ నెం.2లోని స్థలం-61 అడుగులు. వీటిలోపల 20 అంకణాలు 36 చ॥గ॥లు లేదా 134.124 చ॥మీ॥ల స్థలం ఉంది. మరియు దానిలో ఆర్.సి.సి. భవనంతో పాటూ అన్ని పిక్చర్లు మరియు అనుబంధ స్థలం, అన్ని సౌలభ్య హక్కులతో సహా నిర్మించబడినది. రిజర్వు ధర : రూ.33,11,100/- ధరావతు: రూ.3,31,110/- బిడ్ పెంపుదల: రూ.25,000/- మరియు వాటి గుణకాలలో ధరావతు సమర్పించుటకు ఆఖరు తేది : 22-01-2026, ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 05 గం॥ల వరకు | శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్యాంక్ పేరు: యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్: బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ముంబై-400710 ఖాతా నెం. 230010200005265, IFSC Code : UTIB0000230 | 24.01.2026 సమయం: ఉదయం 11:00 గం. నుండి మధ్యాహ్నం 01:00 గం. వరకు | టి. విజయ్ కుమార్ +91 9949940787 కస్టమర్ కేర్ నెం. 022-40081572 ఆస్తుల పరిశీలన తేది: 19-01-2026 సమయం: ఉదయం 11:00 గం. నుండి సాయంత్రం 05:00 గం. వరకు |

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారులు పైన పేర్కొన్న మొత్తాన్ని వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో సహా ఇ-వేలం తేదీకి ముందుగా అంటే 24-01-2026 నాటి ఇ-వేలం ప్రక్రియ ప్రారంభమయ్యే ముందుగా చెల్లించాలని ఇందుమూలముగా తెలియజేయుచున్నాము. లేని పక్షంలో ఆస్తి వేలం వేయబడుతుంది/ అమ్మబడుతుంది మరియు మిగిలిన బకాయిలు ఏవైనా ఉంటే వడ్డీ మరియు ఖర్చులతో తిరిగి రాబట్టుకొనుటకు తగిన చర్యలు తీసుకోబడును.
ఆసక్తిగల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్ సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణలో మొదలగున వాటి సహాయం కొరకు మెస్సర్స్ **శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్**, సంప్రదించవలసిన వ్యక్తి: **అసద్ ఖాన్, మొబైల్ నెం.7128695102, గౌరవ్ నంబూద్రి, మొబైల్ నెం.9833929415**, గౌరవ్ నంబూద్రి gaurav.n@samil.in నందు సంప్రదించగలరు.
[illegible]
తేది: 12-12-2025, ప్రదేశం: నెల్లూరు సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



EENADU Classifieds

BUSINESS SERVICES
SERVICES

తిరుమల క్రియేషన్స్
ఎగ్జిబిషన్ కమ్ సేల్
డిసెంబర్ 2025-15, 16, 17 తేదీలలో
సోమ, మంగళ, బుధవారాలలో
ఉ 10 గం. నుండి సా. 8 గం. వరకు
హ్యాండ్ బ్లాక్స్ ప్రింటింగ్, బ్రష్ పెయింట్ శారీస్ & డ్రెస్సెస్
కడి ప్రింట్స్‌లో, పల్లవి కాటన్, వసుంధర కాటన్, జార్జెట్, కాటన్ కోటా, మంగళగిరి ప్రింటెడ్ శారీస్ మరియు డ్రెస్ మెటీరియల్స్ లభించును.
వేదిక: నెల్లూరు టౌన్ హాల్ A/C వి.ఆర్.సి. సెంటర్, నెల్లూరు. 87900 16396

REAL ESTATE
PLOT FOR SALE

**4 ఎకరాల** కమర్షియల్‌ల్యాండ్ కావలి నుండి పెదపవని రోడ్డుఫేసింగ్‌లో, రాజువారి చింతలపాలెం, గుడ్లూరు క్రాస్ రోడ్, కావలిటౌన్‌కి 12కి.మీ Contact ✆ 9246883568

**కోట క్రాస్‌రోడ్డు** దుగరాజపట్నం NHకు ఆనుకొని ఉన్న కమర్షియల్ & రెసిడెన్షియల్‌కు అనువైన 25 or 50 అం|| ప్లాట్స్ అమ్మబడును. Contact ✆ 7893888794

JOBS

WANTED VISHNU CARS (AUTHORIZED MARUTHI SUZUKI DEALER)
మారుతి సుజుకి డీలర్ విష్ణు కార్స్
డ్రైవింగ్ స్కూల్ కొరకు నెల్లూరు, తిరుపతిలో పనిచేయుటకు డ్రైవర్లు, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను.
91543 33072

**గుంటూరు మాస్టర్** మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు :22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. Contact ✆ 9248733372.

**శ్రీ వెంకటేశ్వర** ఫైనాన్స్ నెల్లూరు బ్రాంచ్ నందు పనిచేయుటకు టీమ్ లీడర్స్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్, బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ & టెలీకాలర్స్ కావలెను. Contact Number ✆ 9989866066, 7680886106

**ప్రముఖ కంపెనీలో** పనిచేయుటకు అడ్మిన్ స్టాఫ్-2, ఆఫీస్ స్టాఫ్-2 ఉత్సాహవంతులైన యువకులు కావలెను. Qly: ఏదైనా డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం. ✆ 9177111153

**BRఇన్‌ఫ్రాకాన్ నందు** పని చేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లమో, B.Tech, M.Tech కల్గి పైపులైన్లు ఇరిగేషన్ వర్క్స్ నందు 3 నుండి 4 సం||ల అనుభవం కల్గి ప్రకాశం, నెల్లూరు, అనంతపురం జిల్లాలలో పని చేయుటకు పూర్తి బయోడేటాను info@brinfracon. comకు పంపగలరు. Contact-Number ✆ 7995557831.

**HYD యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**దేశవిదేశాలకు కొరియర్** పంపే మా సంస్థ DTDC కొరియర్ నందు పనిచేయుటకు లేడి రిసెప్షనిస్ట్ కావలెను. మాగుంటలేఅవుట్, నెల్లూరు. Ph: 8906989079

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

## హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

హిందూ సమ్మేళనానికి హాజరైన ప్రతినిధులు

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. దేశానికి ఆత్మ, ప్రాణం హిందూ ధర్మమే నన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పాటై 100 ఏళ్ల పూర్తయిన సందర్భంగా పట్టణంలోని అంకమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు భగవద్గీతపై వ్యాసరచన, శ్లోకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కందుకూరు ఇన్‌ఛార్జి డాక్టర్ టి.మల్లికార్జున, ఒంగోలు అచలానంద ఆశ్రమం పరిపూర్ణ సిద్ధానంద స్వామీజీ, డాక్టర్ కె.వి.అశోక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బేతనీపేటలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**బిట్రగుంట, న్యూస్‌టుడే:** బోగోలు బేతనీపేటలో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేకును కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కోసి అందరికి పంచారు. ఆయన మాట్లాడుతూ ఏసు జీవితం ప్రపంచ శాంతికి మార్గదర్శకమని అన్నారు. అనంతరం క్రైస్తవ పాటల పోటీలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులందించారు. పేదలకు వస్త్ర, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ విజయ్య, నాగులవరం సింగిరేవిండో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

**కావలి:** పట్టణ ప్రజలకు టీబీఎస్ చారిటబుల్ ట్రస్ట్ పేరిట అందుతున్న సేవలు ఆదర్శమని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లును ఆయన ప్రశంసించారు. ఆదివారం టీబీఎస్ సంస్థ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. స్వచ్ఛంద సేవకుల రాయపాటి బిలీప్, హరనాథ్, బాల్లి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు శింగమనేనిపల్లెలో గ్రామసభ

**వలేటివారిపాలెం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఒక గ్రామం ఒక నెల నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా 16న శింగమనేనిపల్లెలో గ్రామసభను నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు ఎం.నయీం అహ్మద్ తెలిపారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో భూసమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పేదలకు సామగ్రి పంపిణీ

**కావలి, న్యూస్‌టుడే:** పీ-4 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ హాస్టల్ విశ్రాంత వార్డెన్ ఖాదర్‌బాషా, జయచంద్రనాయుడు ఆదివారం కావలి సంయుక్త సంస్థ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిత్యానందం, ప్రభుత్వ వైద్యులు సుబ్బారెడ్డి, పద్మజ, నిర్వాహకులు గంగపట్నం చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## క్రాకుటూరు విద్యార్థికి ప్రతిభా పురస్కారం

**కలిగిరి:** తిరుపతిలోని మన సంస్కృతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తెలుగు, హిందీ భాషల్లో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో మండలంలోని క్రాకుటూరు విద్యార్థిని ప్రతిభ చూపింది. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయ ఉపకులపతి జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది. రూ. 2వేల నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు హరితను సత్కరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

**సమస్య:** పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు సమీపంలోని రాజావీధిలో ప్రైవేట్ పాఠశాల ముందు రోడ్డుపై పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతోంది. **- శేఖర్, స్థానికుడు**

**సమాధానం:** విషయం మా దృష్టికి రాలేదు. తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటాం. **- శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలిపురపాలకం**

? గుడవళ్లూరులోని ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే రహదారిలో పంచాయతీ బోర్ లీకవడంతో నీరు వృథాగా పోతోంది. **- బాబు, స్థానికుడు**

✓ మరమ్మతులు చేపడతాం. **- ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి కొండాపురం, న్యూస్‌టుడే**

? బలిజపాలెంలో సిమెంట్ రోడ్డు పై నీరు నిలుస్తోంది. **- సురేష్, గ్రామస్థుడు**

✓ పరిశీలించి నీరు నిలబడకుండా తగిన చర్యలు తీసుకుంటాం. **- మాధవరావు, పంచాయతీ కార్యదర్శి -లింగసముద్రం, న్యూస్‌టుడే**

? మార్తులవారిపాలెం నుంచి వీర్నకొల్లుకు వెళ్లే రోడ్డు మార్గం బాగోలేక 12 కిలోమీటర్లు తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తుంది. **- పెంచలయ్య**

✓మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- రవీంద్ర, ఏఈ కలిగిరి, న్యూస్‌టుడే**

? స్థానిక గ్రంథాలయం ఎదురు వీధిలో సిమెంటు రహదారిపై అడ్డుగా గ్రావెల్ పోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- యశ్వంత్‌సాయి, స్థానికుడు**

✓ చర్యలు తీసుకుంటాము. **- వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుడ్లూరు, న్యూస్‌టుడే**

? వి.ఆర్.కోటలో పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు అధికంగా ఉన్నాయి. **- శ్రీనివాసులు**

✓ పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. **- శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ లింగసముద్రం**

? కావలి పట్టణం ఎంపీ ట్రంకురోడ్డు బృందావనకాలనీ ముందు రహదారి అంచున గుంత ఏర్పడింది. **- శ్రీరాంమాల్యాద్రి, స్థానికుడు**

✓ మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- శ్రావణ్‌కుమార్, కమిషనర్ కావలి**

? పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పడమటి వడ్డెపాలేనికి వెళ్లే కూడలిలో ఆటోలు రోడ్డుకు అడ్డుగా నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. **- శ్రీనివాసరావు, బలిజపాలెం.**

✓ ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం. **- శివనాగరాజు, పట్టణ ఎస్సై కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే**

## గొలుసుకట్టు.. చూసీచూడనట్లు!

ఏరా.. మన ఊరిలో తాగడానికి నీటికీ.. పొలాల్లో వేయడానికి యూరియాకు.. కరవైనా ఉంటుందేమో కానీ మద్యానికి కాదురా... నాలుగు అడుగులు వేస్తే అట్టా దొరుకుతుంది. ఫోన్ చేస్తే ఇట్టా వచ్చేస్తుంది. ఎప్పుడు పడితే అప్పుడు.. ఫుల్ కిక్కురా.. ఇది మందుబాబుల మనోగతం. అధికారులు, పాలకులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో ఊరూరా మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటవుతున్నాయి.

**కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** అక్కడే దొరుకుతుంది. ఇక్కడ కాదు.. అనడానికి లేదండోయ్.. ఏ గ్రామంలో చూసినా గొలుసు మద్యం దుకాణాలు తారసపడతాయి. కానీ అధికారులకు మాత్రం కనిపించదు, వినిపించదు లేదనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. కందుకూరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 92 పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతులతో 17 మద్యం దుకాణాలు ఏర్పాటు కాగా.. సుమారు 180కు పైగా గొలుసు దుకాణాలు వెలిశాయి.

### ప్రత్యేక సిబ్బందితో రవాణా

గొలుసు దుకాణాలకు మద్యం సరఫరా చేసేందుకు అనుమతులు ఉన్న ప్రధాన దుకాణదారులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. వారికి ద్విచక్ర వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. వీరి దగ్గర బెల్టుదుకాణాల నిర్వాహకులు [illegible] మద్యం కొను

మాచవరం సమీపంలో నిర్వహిస్తున్న గొలుసు దుకాణం

చేయకపోతే వారిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. దాడులు చేయించి బెదిరిస్తున్నారు. అనంతరం మంతనాలు చేసి సదరు వ్యక్తుల వద్దే కొనుగోలు చేయించేలా చూస్తున్నారు. సమస్యలు లేకుండా క్రయవిక్రయాలు జరిగేలా చూసుకోవాలని సలహాలు, సూచనలు సైతం ఇస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇటీవల కందుకూరు మండలంలోని ప్రధాన గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసులు లేకుండా మంతనాలు చేసి పంపించారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

### అధికంగా వసూలు

గొలుసు దుకాణాల్లో ఒక్కో మద్యం సీసాను రూ.30 నుంచి రూ. 50 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. మద్యం అమ్మకాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నా.. ఆ దిశగా దృష్టిసారించడం లేదు. ఇదంతా అధికారులు, అనుమతులు పొందిన మద్యం దుకాణదారుల కనుసన్నల్లో నడుస్తున్నాయా అని పలువురు ఆరోపిస్తున్నారు.

### తనిఖీలు చేస్తున్నాం:

రోజూ తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా అమ్మకాలు చేస్తుంటే కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం దొరికితే ఎవరిని వదిలి పెట్టే పరిస్థితి లేదు. స్థానిక దుకాణాల నుంచి గ్రామాలకు సరఫరా జరగటం లేదు. బయట వ్యక్తులు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారనే సమాచారంపై తనిఖీలు చేస్తున్నాం.

ఎస్.శ్రీనివాసులు, ఎక్సైజ్ సీఐ

## విద్యార్థులు.. పోటీల్లో విజేతలు

కావలి, కందుకూరులోని పలు కళాశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. సమకాలీన అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. **- కావలి, కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే**

కందుకూరు పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎమ్.నిహారిక, బి. లక్ష్మీచైతన్య, కె.దీక్షితలు విజేతలుగా నిలిచారు. వీరికి విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాలభాస్కర్‌రావు, బి.నరేంద్రబాబు, అకడమిక్ డీన్ షాహుల్‌హమీద్, ప్రిన్సిపల్ ఇర్ఫాన్‌లు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ జి.బాలభాస్కర్‌రావు

❖ కందుకూరు పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎన్.స్వాతి, వి. సుచరిత, సిహెచ్.పావని విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ నాగూర్‌వలి, అధ్యాపకులు బహుమతులను అందజేశారు.

బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నాగూర్‌వలి, అధ్యాపకులు

కావలి పట్టణంలోని శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో పోటీలు జరగగా.. జి.ధనుష్, సయ్యద్ ఫిరోజుద్దీన్, షేక్ ముర్తుజాలు విజేతలుగా నిలిచారు. వారికి కళాశాల కరస్పాండెంట్ కె.కోటేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్

కావలి పట్టణంలోని మేధా కళాశాలలో పోటీలు జరగగా డి.చరణ్, టి. పూజిత, పి.దీపికలు విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపల్ ఎన్.లోకేశ్ బహుమతులు అందజేశారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

## చర్చిలో రక్తదాన శిబిరం

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** క్రిస్మస్ పండగను పురస్కరించుకుని పట్టణంలోని విలియంకేరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మహిళా కానిస్టేబుల్ కె.అనూష ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ కందుకూరు శాఖ ఛైర్మన్ సీహెచ్.వెంకటరామాంజనేయులు పాల్గొని రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. పాస్టర్ ఎ.ప్రతాప్ రక్త, నేత్ర, అవయవదానం గురించి సందేశమిచ్చారు. ఈసందర్భంగా పలువురు మహిళలు పాల్గొని రక్తదానం చేశారు.

## ఉచిత వైద్యపరీక్షలు

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఒంగోలుకు చెందిన ఉపాస్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 430 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోగులు, కుటుంబసభ్యులకు ఉచిత భోజనవసతి కల్పించారు. జెన్నెట్ టెక్నాలజీస్, దోస్త్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని మాజీ సర్పంచి జనార్ధన్ ప్రారంభించగా నిర్వాహకులు వివేక్ మిత్ర బృందం పర్యవేక్షించింది.

## సమన్వయంతో పనిచేయాలి

**వలేటివారిపాలెం, న్యూస్‌టుడే:** గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని భాజపా నియోజకవర్గ సమన్వయకర్త హరిబాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వైకుంఠం మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవులు, మోసేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో భాజపా నాయకులు

## బీటీఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్లా

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఒంగోలులో ఆదివారం జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) జిల్లా మహాసభలో జిల్లా అధ్యక్షుడిగా కందుకూరుకు చెందిన షేక్ అబ్దుల్లాను ఎన్నుకున్నారు. ఆయన ప్రస్తుతం మండలంలోని పాలూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కె.మోహన్‌రావు, యలమంద, భగత్‌సింగ్, కేశవరావు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, కరేటి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## సంపద కేంద్రం.. నిరుపయోగం

మండలంలోని ఆర్.ఆర్.పాలెంలో ప్రభుత్వం రూ.10 లక్షలతో నిర్మించిన డంపింగ్ కేంద్రం నిరుపయోగంగా మారింది. అధికారులు దీన్ని పరిశీలించి వినియోగంలోకి తీసుకొచ్చినా కొద్ది రోజుల నుంచి ఇందులో చెత్తను నిల్వచేయడం లేదు. **- న్యూస్‌టుడే, లింగసముద్రం**

## స్తంభం ఒరిగింది.. ప్రమాదం గుర్తించండి

మదనగోపాలపురం నుంచి ఆనందపురానికి వెళ్లే మార్గంలోని వేణుగోపాలస్వామి భూముల సమీపంలో విద్యుత్తు లైను ప్రమాదకరంగా ఉంది. వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా అయ్యే స్తంభాలు ప్రమాదకరంగా కిందకు వాలి ఉన్నాయి. అటు వైపుగా వెళ్లే రైతులు ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం**

## తాగునీరు లీకై.. రోడ్డుపాలై..!

తిమ్మారెడ్డిపల్లె ఎస్సీ కాలనీ వద్ద తాగునీరు సరఫరా చేసే పైపులైను లీకై నీరంతా వృథాగా పోతోంది. దీంతో భోగ్యంవారిపల్లె - చాకలికొండ వెళ్లే ప్రధాన రోడ్డు రొచ్చు అవుతోంది. ద్విచక్రవాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. మరమ్మతులు చేయించి నీరు లీకు కాకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి హరి తెలిపారు. **- న్యూస్‌టుడే, వరికుంటపాడు**

## పెచ్చులూడిపడుతున్నాయి

కొకొల్లువారిపల్లె బీసీ బాలుర వసతి గృహం స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం రెండు గదులు మాత్రమే బాగున్నాయి. మిగిలిన గదులతోపాటు వరండాలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియచేశామని వార్డెన్ రమేష్ తెలిపారు. **- న్యూస్‌టుడే, వరికుంటపాడు**

## అపూర్వ కలయిక

**గుడ్లూరు, న్యూస్‌టుడే:** స్థానిక జిల్లా పరిషత్తు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 1982-83 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గుడ్లూరులో సమావేశమయ్యారు. నాలుగు దశాబ్దాల తర్వాత అందరూ ఒక చోట చేరడంతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అంతా కలియతిరిగారు.

## వేర్వేరు చోట్ల ప్రమాదాలు.. పలువురికి గాయాలు

**దుత్తలూరు, న్యూస్‌టుడే:** పలు మండలాల పరిధిలో ఆదివారం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. దుత్తలూరు పంచాయతీపరిధిలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన ఖాజారసూల్ తన మనవరాలు జస్మాతో ద్విచక్ర వాహనంపై దుత్తలూరు వచ్చారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో కావలి వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న మరోవ్యక్తి 167బీజీ జాతీయ రహదారి పై వంతెన దిగుతుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ఖాజారసూల్, జస్మాకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. **దగదర్తి:** ఉలవపాడు మండలం పెదపట్టపుపాలేనికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంపై నెల్లూరు వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడడంతో. హైవే మొబైల్ సిబ్బంది అతనికి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు. **జలదంకి:** జలదంకి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు ఆయిల్ పట్టించుకునేందుకు స్థానిక పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్నాయి. గుంటూరు నుంచి వరి కోత మిషన్‌ను తీసుకుపోతున్న లారీ అదుపు తప్పి ట్రాక్టర్లను ఢీ కొనడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముందు వాహనంలో ఉన్న డ్రైవర్ ఎం.రమేష్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ట్రాక్టర్లల్లో మనుషులు లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. విచారణ చేస్తున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు.

## పాతూరు శివాలయంలో చోరీ

**కావలి, న్యూస్‌టుడే:** పట్టణంలోని పాతూరు శివాలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ దుండగుడు ఆలయంలోకి ప్రవేశించి హుండీని కోనేటి ఒడ్డు వద్దకు పట్టుకెళ్లి ధ్వంసం చేశాడు. అనంతరం నగదు తీసుకుని పరారయ్యాడు. క్లూస్‌టీం వచ్చి వివరాలను సేకరించింది. ఈవో అరవ రాధాకృష్ణ, ప్రధాన అర్చకులు శశిధర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టణ శివారులో వృద్ధుడి మృతదేహం

**కావలి, న్యూస్‌టుడే:** పట్టణ శివారులోని అల్లిగుంటపాలెం గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వీఆర్వో శ్రావణికి సమాచారం అందించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తి వయసు 70 సంవత్సరాల ఉండొచ్చని వివరాలు తెలియాల్సి ఉందని కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## లేబర్‌కోడ్‌ను విరమించుకోవాలి

**గుడ్లూరు :** లేబర్‌కోడ్‌ను ప్రభుత్వాలు విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆటో వర్కర్స్‌యూనియన్ కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. జనవరిలో విశాఖపట్నంలో జరగనున్న అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని కోరారు.

## 91 కేసుల పరిష్కారం

**కలిగిరి:** స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈఏడాది 91 కేసులు పరిష్కరించినట్లు సీఐ అబ్దుల్‌జలీల్ తెలిపారు. కావలి కోర్టు పరిధిలో 61, ఉదయగిరి కోర్టు పరిధిలో 30 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. జరిమానా రూపంలో రూ. 4,22,241 కట్టించామని ఆయన తెలిపారు.

## కొత్త పంచాయతీలకు వేళాయె..!

**కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:** స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో రాజకీయ సందడి ఇప్పుడిప్పుడే మొదలైంది. దీనికి తోడు కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో స్థానిక రాజకీయ, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఆయా ప్రాంత వాసులు, గ్రామస్థాయి నాయకులు ఆసక్తి చూపుతున్నారు.

### రెండు ప్రధాన నిబంధనలు

కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం రెండు ప్రధాన నిబంధనలు తీసుకొచ్చింది. ప్రస్తుతమున్న పంచాయతీ పరిధిలోని గ్రామానికి(హ్యాబిటేషన్), పంచాయతీ కేంద్రానికి మూడు కిలోమీటర్లకు పైగా దూరం ఉంటే అలాంటి వాటిని కొత్త పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించింది. అలాగే ఏదైనా ఒక హ్యాబిటేషన్ లేదా హ్యాబిటేషన్లు కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు కావాలనుకుంటే అక్కడి జనాభా మూడు వేలకు పైగా ఉండాలని నిబంధన విధించింది. కాగా కందుకూరు నియోజకవర్గంలో ఈ రెండో నిబంధన ప్రకారం మూడు వేలకు పైగా జనాభా ఉన్న హ్యాబిటేషన్లు లేవు. కానీ మొదటి నిబంధన ప్రకారం పంచాయతీ కేంద్రానికి మూడు కిలోమీటర్లు పైగా దూరంలో ఉండే హ్యాబిటేషన్లు 11కు పైగా ఉన్నాయి.

### ప్రతిపాదనలు పంపాం: కృష్ణమోహన్, డీఎల్పీవో

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంచాయతీల విభజనపై ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగింది. వచ్చిన ప్రతిపాదనలను జిల్లా అధికారులకు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

### నియోజకవర్గంలో కొత్తగా మరో 11

కందుకూరు నియోజకవర్గంలోని వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, కందుకూరు, ఉలవపాడు మండలాల్లో ఇప్పటివరకు 92 పంచాయతీలున్నాయి. ప్రస్తుతం వీటిలో 11 పంచాయతీలను విభజించి కొత్తగా మరో 11 ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేశారు.

### మండలాల వారీగా విభజన జరగనున్న వాటి వివరాలు ఇలా..

కందుకూరు మండలంలోని పాలూరు-దొండపాడు పంచాయతీ నుంచి దొండపాడు, వలేటివారిపాలెం మండలంలోని లింగపాలెం నుంచి రోళ్లపాడు, చుండి నుంచి కాకర్లపాలెం, గుడ్లూరు మండలంలోని మోచర్ల నుంచి తెట్టు, చినలాటిరిపి నుంచి జానకంపేట, పరకొండపాడు పంచాయతీ నుంచి అగ్రహారం, లింగసముద్రం మండలంలోని పెంట్రాల నుంచి చీమలపెంట, రాళ్లపాడు పంచాయతీలు ఉలవపాడు మండలంలోని కరేడు నుంచి అలగాయపాలెం, పెదపట్టపుపాలెం నుంచి రెడ్డిపాలెంలతోపాటు ఉలవపాడు పంచాయతీలోని కె. రాజుపాలెం, భీమవరం పంచాయతీలోని ఎల్. రాజుపాలెం గ్రామాలను ఒకటిగా కలిపి రాజుపాలెం పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు.

## పంట కాలువలు.. ఆక్రమణలు

**లింగసముద్రం, న్యూస్‌టుడే:** చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సరిగా చేరాలంటే పంట కాలువలు చాలా అవసరం. అలాంటిది వాటిని ఆక్రమించి.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షాకాలంలో దిగువకు నీరు వెళ్లే మార్గం లేక రహదారిపై చేరుతుంది. ఆ సమయంలో రాకపోకలు చేయాలంటే గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. పొలాలు సైతం బీడుగా మారిపోయాయి. మండల కేంద్రమైన లింగసముద్రంలోని పరిస్థితి ఇది.

లింగసముద్రంలోని కొత్త చెరువు నుంచి దిగువన ఉన్న పొలాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు పది వరకు పంట కాలువలు ఉన్నాయి. గ్రామం విస్తరించే కొద్దీ రోడ్డు పక్క ఉన్న సమీప పొలాలను రైతులు అమ్ముకున్నారు. దీంతో వాటి గుండా దిగువకు వెళ్లే పంట కాలువలను ఆక్రమించుకుని పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దీంతో కాలువలు పూర్తిగా రూపురేఖలు లేకుండా కనుమరుగయ్యాయి.

ఆక్రమణకు గురైన పంట కాలువ

### బీడుగా పొలాలు

రోడ్డుకు మరో వైపు ఉన్న పొలాలను ఇళ్ల ప్లాట్లుగా మార్చారు. దీంతో వాటి తరువాత ఉన్న పొలాలకు నీరు వెళ్లే దారిలేక బీడు భూములుగా మారాయి. దాదాపు వంద ఎకరాలు సాగుకు దూరమయ్యాయి. ఈ పరిస్థితి పదిహేను ఏళ్ల నుంచి కొనసాగుతుంది. పది, ఇరవై సెంట్ల కమతాలు మాత్రమే ఉన్న చిన్నకారు రైతులు ఏమి చేయలేక మిన్నకుండిపోతున్నారు. కూలీ పనులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను పునరుద్ధరించాలని వారంతా కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ సాగునీటి కాలువల ఆక్రమణలపై పరిశీలన చేస్తామన్నారు.

## సమస్యలు పరిష్కరించేలా చర్యలు

**జలదంకి, న్యూస్‌టుడే:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ జి.వెంకట రమణయ్య వెల్లడించారు. ఆదివారం జలదంకి ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. జలదంకి, అన్నవరం గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, కాలానుగుణ జ్వరాలు ప్రబలే ప్రమాదముందంటూ ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. పలు గ్రామాల్లో రైతులకు సక్రమంగా యూరియా అందటం లేదని, కొందరు గ్రామ నాయకులే లారీల్లో వచ్చిన బస్తాలను దుకాణాల్లో పెట్టించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారని జలదంకి ఉప సర్పంచి కె.మాలకొండారెడ్డి ఆరోపించారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మురుగు కాలువలు లేక నివాసాల ముందు మురుగు చేరి దోమలు ప్రబలుతున్నాయన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఎంపీడీవో ఎం.బ్రహ్మయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ కె.అప్పలనాయుడు, పరిపాలనాధికారి శ్రీధర్, ఏవో ఎం.శ్రీవాణి పాల్గొన్నారు.

## మరమ్మతులకు గురైన రోడ్డు

**లింగసముద్రం, న్యూస్‌టుడే:** తిమ్మారెడ్డిపాలెం- గంగపాలెం గ్రామాల మధ్య గల రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించడం కష్టంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వి.ఆర్.కోట, విశ్వనాథపురం గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారా రవాణా సాగిస్తుంటారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

(c) eenadu

## తాగునీరు కలుషితం.. పట్టించుకోని అధికారులు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలోని శివాజీ నగర్‌లో తాగునీరు కలుషితమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా డ్రైనేజీ కాలువలు మరమ్మతులు పనులు చేస్తుండగా పైపులు ధ్వంసమై మురుగు నీరు పైపుల్లోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నీరు తాగడం వలన వ్యాధులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా మండల అధికారులు పరిశీలించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పోలింగ్ కేంద్రం పరిశీలన

సైదాపురం, న్యూస్‌టుడే: సైదాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు సుభద్ర ఆదివారం పరిశీలించారు. ఇక్కడి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల మ్యాపింగ్, కొత్త ఓటర్ల చేర్పులపై ఆమె పరిశీలించారు. వీఆర్వో హజరత్తయ్య, ఇతర సిబ్బంది ఉన్నారు.

# కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యులు గుంపల మంజుల గాంధీ విగ్రహానికి పట్టు, నూలు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్థలదాత పొనకా కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: కొడవలూరు మండలంలోని కొడవలూరు గిరిజనకాలనీలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. – శీనయ్య
సమాధానం: దోమల నివారణ చర్యలు చేపడతాం.– వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో
? అనంతసాగరం మండలం రేవూరులోని ఎస్సీ కాలనీ వద్ద వృక్షాలు పేరుకున్నాయి. – కృష్ణ
✓ సిబ్బందిని పంపి వృక్షాలు తొలగిస్తాం. – రమణారావు, పంచాయతీ కార్యదర్శి
? రాపూరులోని బజారువీధి, తూర్పువీధిలో తాగునీటి కుళాయి లీకేజీ సమస్య ఎక్కువగా ఉంది. – స్థానికులు
✓ పరిశీలించి కుళాయిల నీటి లీకేజీలను అరికడతాం. – భవాని, ఎంపీడీవో
? ఇందుకూరుపేట మండలం గంగపట్నం-పల్లిపాలెం ప్రధాన రహదారిలో ముళ్ల చెట్లు పెరిగిపోయి రోడ్డుపైకి వ్యాపించాయి. – శివకుమార్
✓ సిబ్బందిని పంపి తొలగిస్తాం. – శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ
? అనంతసాగరంలోని రామాలయం వీధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, మహిళలు వీధిలో సంచరించాలంటే భయపడుతున్నారు. – భాస్కర్, గ్రామస్థుడు
✓ పశు వైద్యుల సహకారంతో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం. – ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి
? పొదలకూరు రూరల్ పరిధిలోని మరుపూరులో వేగ నిరోధకాలు అధికంగా ఉండడంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. – అమీర్, స్థానికుడు
✓ అనవసరమైన వాటిని తొలగిస్తాం. – వహీద, పంచాయతీ కార్యదర్శి
? సంగం మండలం కొరిమెర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట మైదానంలో వర్షపు నీరు నిల్వతో ఆటలకు ఇబ్బందిగా ఉంది. –ప్రదీప్‌కుమార్
✓ పరిశీలించి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, పంచాయతీ కార్యదర్శి
? రాపూరు పంట పొలాల్లో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. డిస్కం అధికారులు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. – రైతులు
✓ సమస్య పరిష్కరిస్తాం. – సురేశ్, డిస్కం ఏడీఈ
? అనంతసాగరం మండలం ముస్తాపురంలోని మస్జిద్ వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. – బాషా, గ్రామస్థుడు
✓ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. – ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి
? పొదలకూరు మండలం విరువూరు-మహ్మదాపురం మార్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దారుణంగా దెబ్బతింది. గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – గోపాల్, స్థానికుడు
✓ నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేయిస్తాం.–శ్రీనివాసులు, రభ ఏఈ
? చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లిలో నియంత్రిక తక్కువ ఎత్తులో ఉంది. – స్థానికులు
✓ నియంత్రిక ఎత్తు పెంచేలా చర్యలు తీసుకొంటాం. – లిఖితేష్‌రెడ్డి, డిస్కం ఏఈ

## ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

మాట్లాడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, న్యూస్‌టుడే: కృష్ణపట్నంలోని ఆలయాల అభివృద్ధిపై తాను మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కృష్ణపట్నం శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల ఛైర్మన్ మామిడాల శ్రీనివాసులతో పాటు పాలకమండలి సభ్యులతో ఆదివారం సోమిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. ప్రస్తుతం ఆలయాల అభివృద్ధి పనులకు రూ. 2.50 కోట్లతో టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. కృష్ణపట్నం ఆలయాల తరహాలో ముత్తుకూరులో కల్యాణ మండపం నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్పీ చేసిన మరోక కార్యక్రమంలో మాట్లాడారు... ఆయుష్మాన్ వైకాపా పాలనలో అధ్వానంగా మారిన రోడ్లకు కూటమి ప్రభుత్వం కొత్త రూపు తెస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో రూ. 11.45 కోట్లతో 21 కిలోమీటర్ల మేర అయిదు రోడ్ల పనులు చేయనున్నట్లు వెల్లడించారు. అధ్వానంగా ఉన్న ముత్తుకూరు-మామిడిపూడి రోడ్డు నిర్మాణానికి రూ. 2.16 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కోవూరు, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు హెచ్చరించారు. కోవూరు పోలీసు స్టేషన్‌లో ఆయన 70 మంది రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలు అదుపు చేసేందుకు రోడ్డు ప్రమాదాల నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్, రాత్రి వేళలో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై ముత్యాలరావు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలం జంగాలపల్లిలో ఈనెల 16, 23, 30 తేదీల్లో గ్రామ సమస్యల పరిష్కార వేదిక సమావేశాలు నిర్వహిస్తామని తహసీల్దారు పద్మజకుమారి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒక గ్రామంలో నాలుగు పర్యాయాలు గ్రామాలను సందర్శించి స్థానికంగా ఉండే అన్ని రెవెన్యూ సమస్యలు, ఇతర సమస్యలు తెలుసుకొని దరఖాస్తులు స్వీకరించి త్వరగా పరిష్కరిస్తామన్నారు. అందుకోసం ప్రజల వద్దకు ప్రభుత్వ అధికారులను తీసుకెళ్లాలని తలపెట్టిన నూతన కార్యక్రమం నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల పరిధిలోని సమస్యలపై ప్రజలు ధరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

# ఉపాధిలో దొంగ మస్టర్లకు చెక్

### ఆధార్ అనుసంధానంతో అనర్హుల తొలగింపు

• పొదలకూరు పట్టణ సమీపంలోని ఒక గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న జాబ్‌కార్డుల ఆధారంగా ఆధార్ అనుసంధానం చేపట్టగా 30 శాతం కూడా దాటలేదంటే అనర్హులు ఎంత మంది ఉన్నారో వెలుగులోకి వచ్చింది.

• వెంకటాచలం, రాపూరు, సైదాపురం మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో సిబ్బంది జాబ్‌కార్డులు పరిశీలించగా గ్రామంలో కొన్నేళ్లగా హైదరాబాద్, బెంగళూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారు ఎక్కువ మంది ఉన్నారు. కొన్ని చోట్ల పనులు చేయకుండానే దొంగ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని అధికారులు గుర్తించారు.

కాలువ శుభ్రం చేస్తున్న కూలీలు →

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, కొడవలూరు

ఉపాధి హామీ పథకంలో సవాల్‌గా మారిన దొంగ మస్టర్ల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముఖ ఆధారిత హాజరు విధానం ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఒకరే రెండు, మూడు చోట్ల వేర్వేరు చోట్ల నమోదు చేసుకొని అక్రమాలకు పాల్పడేవారు.. కొందరు అనర్హుల పేర్లు నమోదు చేసి నగదు స్వాహా చేస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ఆధార్ అనుసంధాన ప్రకియ చేపట్టడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. నూతన నిబంధనల ప్రకారం డ్వామా అధికారులు పలువురి కార్డులు రద్దు చేశారు. అధికారులు మరింత నిశితంగా పరిశీలిస్తే భారీగా దొంగ కార్డులు వెలుగులోకి వస్తాయని సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

• కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలోని అధిక గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు పనులు చేస్తున్న శ్రామికుల ఫొటోలు తీసి ఇష్టప్రకారం మరికొంత మందిని చేర్చి అక్రమాలకు పాల్పడేవారు. బయట ప్రాంతాల్లో ఉండేవారి పేర్లతో జాబ్‌కార్డులు సేకరించి వారంతా స్థానికంగా పనులు చేస్తున్నట్లు చూపించి నిధులు స్వాహా చేసేవారు. దీనిపై క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వచ్చాయి. ఉపాధి పథకంలో నిబంధనల్లో కేంద్రం మార్పులు చేసింది. పనులకు వచ్చే కూలీల ఫొటో ఆధారం కాకుండా ముఖ ఆధారిత నమోదు ప్రవేశపెట్టారు. నాలుగు గంటల వ్యవధిలో రెండు సార్లు ముఖ అధికారిత ఫొటో తీసి ఆధార్‌కు అనుసంధానం చేసేలా నిబంధన పెట్టారు. నకిలీ జాబ్‌కార్డులతో పాటు, మృతులు, పనికి రాకుండా ఉంటున్న పలు జాబ్‌కార్డులు వెలుగులోకి వచ్చాయి. వాటన్నింటిని అధికారులు రద్దు చేస్తున్నారు. గ్రామాల్లో అన్ని కార్డులకు ముఖ ఆధారిత ఫొటోలు తీసి ఆధార్‌తో అనుసంధానం చేయగా పనులకు వచ్చే కార్డులు మాత్రమే ఉంటున్నాయి. సామాజిక తనిఖీ ద్వారా అక్రమార్కులను గుర్తించి వారి నుంచి నిధులు రికవరీకి చర్యలు తీసుకోనున్నారు.

• డ్వామా ఏపీవో జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఆధార్ అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అనర్హుల జాబ్‌కార్డులు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

**కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో తొలగించినవి..**

| మండలం | జాబ్ కార్డులు | రద్దయినవి |
|---|---|---|
| వెంకటాచలం | 9,868 | 1,888 |
| తోటపల్లిగూడూరు | 8,316 | 200 |
| పొదలకూరు | 13,300 | 1,204 |
| మనుబోలు | 5,962 | 830 |
| ముత్తుకూరు | 5,939 | 814 |
| ఇందుకూరుపేట | 7,392 | 873 |
| కొడవలూరు | 6,333 | 286 |
| కోవూరు | 4,659 | 244 |
| బుచ్చి | 5,421 | 227 |
| రాపూరు | 9,868 | 1,708 |
| సైదాపురం | 8,181 | 1,179 |
| కలువాయి | 8,461 | 887 |

● మండలం ● జాబ్ కార్డులు ● రద్దయినవి

## భూవివాదంపై ఆర్డీవో విచారణ

పాలూరులో విచారిస్తున్న ఆర్డీవో అనూష

సైదాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పాలూరులో భూవివాదం ఫిర్యాదుపై నెల్లూరు ఆర్డీవో అనూష ఆదివారం విచారించారు. గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొందరు దళితులు ఆక్రమించుకుని వివిధ పంటలను సాగుచేస్తున్నారు. పంటలు తమవంటూ గ్రామంలోని కొందరు దౌర్జన్యం చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో విచారణకు వచ్చారు. తమ ఆధీనంలోని భూమికి పట్టాలివ్వాలని అక్కడి ప్రజలు కోరారు. భూమి కావాల్సిన వారు రెవెన్యూ అధికారులకు విన్నవించుకుంటే భూమి కేటగిరీని బట్టి అర్హులైన పేదలకు పట్టాలిస్తామని సూచించారు. తహసీల్దారు సుభద్ర, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## బోధపతిదిబ్బలో పురావస్తు తవ్వకాలు ప్రారంభం

రామతీర్థంలో పరిశీలిస్తున్న అధికారులు

విడవలూరు, న్యూస్‌టుడే: రామతీర్థంలో కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వెనక వైపు ఉన్న బోధపతిదిబ్బ పురాతన అవశేషాలకు నిలయం. ఎత్తయిన దిబ్బ ప్రదేశంలో పురావస్తు శాఖ అధికారులు తవ్వకాలు ఆదివారం ప్రారంభించారు. ఇటీవల జరిపిన ట్రయల్ తవ్వకంలో ప్రదేశం సామర్థ్యాన్ని సూచించే టెర్రకోట వలయం కనిపించింది. ఇక్కడ లభించిన ఇతర ముఖ్యమైన పురాతన వస్తువుల్లో ప్రారంభ చారిత్రక కాలం నాటి ఎరుపు సామగ్రి, పాలిష్ చేసిన నల్ల వస్తువులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇటుక పరిమాణం శాతవాహన, ఇక్ష్వాకు రాజవంశాలకు చెందినదిగా చెబుతున్నారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడానికి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అమరావతి సర్కిల్ తవ్వకాలు ప్రారంభించినట్లు వివరించారు. ఎస్ఏఐ డైరెక్టర్ డాక్టర్ దేబేంద్రనాథ్ బోయ్, సహ డైరెక్టర్ సూర్యప్రకాశ్, అవరావతి సర్కిల్ అధికారులు సాంబశివరావు, డిప్యూటీ ఎస్ఏఈ ప్రసన్నకుమార్, యశ్వంత్ సిబ్బంది పాల్గొన్నారు.

## 31 నుంచి సీఐటీయూ మహాసభలు

అనంతసాగరం : సీఐటీయూ అఖిల భారత మహాసభలు ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరుగుతాయని సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్ అన్నారు. అనంతసాగరంలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ జెండాను యూనియన్ నాయకులు ఆదివారం ఆవిష్కరణ చేశారు. అన్వర్ బాషా, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఎప్పటికి పూర్తయ్యేనో..!

సైదాపురం మండలం కొమ్మిపాడులో నిర్మించిన సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా మారింది. గత పాలనలో ఒక్కో భవనానికి రూ. 40 లక్షల రూపాయలు మంజూరైనా గుత్తేదారు పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. అప్పటి ప్రజాప్రతినిధికి విన్నవించినా పట్టించుకోలేదని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, సైదాపురం, బుచ్చి

## సాగునీరందక అవస్థలు

కోవూరు మండలం చెర్లోపాలెంలో శ్మశాన వాటికకు వెళ్లే దారి సమీపంలో ప్రధాన పంట కాలువ పూడిక తీయకపోవడంతో వరద నీరు పొలాల్లోకి చేరుతోంది. నార్లు వేసిన పొలాలు నీట మునిగాయని రైతులు వాపోతున్నారు. గుర్రపుడెక్క పెరిగి సాగునీటికి ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

## రూ.లక్షలు వెచ్చించారు.. తాళం వేశారు

కోవూరు మండలం మోడేగుంటలో రూ. లక్షలు వెచ్చించి ప్రభుత్వం చెత్త సంపద కేంద్రం నిర్మించారు. నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. చెత్త రోడ్లపై కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. ప్రజాధనం వెచ్చించి నిర్మించినా నిరుపయోగంగా వదిలేశారని, పంచాయతీ, సచివాలయ, మండల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

## పేరుకుపోయిన నీరు.. స్థానికుల బేజారు

దిత్వా తుపాను కారణంగా కురిసిన వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల ఇళ్లలోకి నీరు చేరగా.. మరికొన్ని చోట్ల నివాసాల మధ్య గల ఖాళీ స్థలాలను చుట్టుముట్టింది. పొదలకూరులోని టీపీనగర్‌లోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంది. బయటకెళ్లే వీలు లేకపోడంతో దుర్వాసనతో సతమతమవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

## గుంతలమయం

వెంకటాచలం-కసుమూరు ప్రధాన రహదారిపై అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతలపాళెం, అనకాడి వడ్డిపాళెం, పాలిచెర్లపాడు మలుపు రోడ్డు, కనుపూరు తదితర ప్రాంతాల్లో గుంతలున్నాయి. కనుపూరు చెరువు సమీపంలో కొంత మేర రోడ్డు కుంగి పోయింది. ఈమార్గంలో నిత్యం కసుమూరుకు వందలాది వాహనాలు వెళుతుంటాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

## కూలీలను వదిలొస్తూ.. బల్కర్ ఢీకొని మేస్త్రీ దుర్మరణం

విడవలూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ కూలీలకు పని చూపించి తిరిగొస్తుండగా లారీ ఢీకొట్టడంతో మేస్త్రీ దుర్మరణం చెందిన ఘటన ఆదివారం విడవలూరు మండల పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు కథనం మేరకు.. దండిగుంటకు చెందిన కావలి వెంకటరమణయ్య (50) వివాహం చేసుకొని బుచ్చిలో స్థిరపడ్డారు. వ్యవసాయ కూలీలను తీసుకొచ్చి విడవలూరు, బుచ్చి మండలాల్లో పనులు చేయిస్తున్నారు. ఈనేపథ్యంలో బెంగాల్‌కు చెందిన కూలీలను విడవలూరు మండలం రామతీర్థంలో వరి నాట్లు వేయించేందుకు తీసుకొచ్చారు. ఆదివారం దండిగుంటకు చెందిన స్నేహితుడు నట్టం వెంకటేశ్వర్లుతో కలిసి ద్విచక్రవాహనంపై రామతీర్థం వెళ్లి కూలీలకు పని చూపించి తిరిగి దండిగుంట వైపు వస్తున్నారు. రామతీర్థం కూడలిలో వెనుక నుంచి బల్కర్ లారీ బైకును ఢీకొట్టడంతో వెంకటరమణయ్య రోడ్డుపై పడగా బల్కర్ పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బైకుపై వెనుక కూర్చున్న వెంకటేశ్వర్లుకు గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై నరేశ్, సీఐ సురేంద్రబాబు ఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## ఆలయ ప్రాంగణం.. అపరిశుభ్రం

కోవూరులోని పంచాయతీ కార్యాలయం వెళ్లే మార్గంలో ఆంజనేయస్వామి గుడి వెనుక పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా మారింది. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోవూరు

## గిరిజనులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

కుడితిపాలెంలో పంపిణీ చేస్తున్న నాయకులు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: కోవూరు తెదేపా యువత ఉపాధ్యక్షులు దొడ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఇందుకూరుపేట కుడితిపాలెం గిరిజన కాలనీలో ఆదివారం ఉచిత గ్యాస్ కిట్లను పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల రవీంద్ర చౌదరి పాల్గొని పలువురికి కిట్లను అందజేశారు. వీపీఆర్ దంపతుల ఆశయాలను ముందుకు తీసుకెళుతూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న మల్లికార్జున్‌ను అభినందించారు. నాయకులు శ్రీనివాసులు, ఇస్మాయిల్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోమశిలకు 6,708 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో ఆదివారానికి ఎగువ ప్రాంతాల నుంచి 6,708 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 74.568 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.458 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 277 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

## జంగాలపల్లి వద్ద 108లో ప్రసవం

శిశువుతో ఈఎంటీ శ్రీహరి

అనంతసాగరం, న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 ద్వారా ఆత్మకూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. లింగంగుంట గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నారాయణమ్మకు ఆదివారం ఉదయం ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారమివ్వడంతో గ్రామానికి వైద్య సిబ్బంది చేరుకున్నారు. ఆత్మకూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో జంగాలపల్లి గ్రామం వద్ద పురిటి నొప్పులు అధికమై ఆడ శిశువుకు జన్మనిచ్చింది. 108 ఈఎంటీ శ్రీహరి ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ఈఎంటీ శ్రీహరి, పైలట్ నరసింహా రెడ్డిలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

వెంకటాచలం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన వెంకటాచలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గుర్తు తెలియని వృద్ధుడు (55) వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ రహదారి దాటుతుండగా... నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడి వివరాల కోసం ఆరాతీస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కోవూరు, న్యూస్‌టుడే: వైజాగ్‌కు చెందిన ముగ్గురు అయ్యప్ప భక్తులు కారులో శబరిమల నుంచి విశాఖపట్నంకు వెళుతుండగా కోవూరు లారీ యార్డు సమీపంలో ఆదివారం వేకువ జామున జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో కారు దెబ్బతింది.. ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారు డ్రైవర్ నిద్రమత్తే కారణమని భావిస్తున్నారు. అనంతరం వారు మరో కారులో విశాఖపట్నంకు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

## అదుపుతప్పి ఆటో బోల్తా

కొడవలూరు, న్యూస్‌టుడే: మలుపు వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. గండవరం నుంచి నార్తురాజుపాళెం వస్తుండగా పంచాయతీ వద్ద మలుపులో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఇద్దరు బాలికలతో పాటు రవి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా స్థానిక వైద్యశాలలో చేర్పించారు.

## చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అపుస్మా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. బుచ్చి మండలం రేబాలలో ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు ఆదివారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ చదువుతోపాటు క్రీడల్లో సైతం విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. ● ఆత్మకూరులో జరిగిన పోటీల్లో లాంగ్ జంప్, షాట్‌పుట్ పరుగు పోటీలు నిర్వహించారు.

## పొంచి ఉన్న ప్రమాదం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణ పరిధిలోని గాంధీ పార్కు వెనుక అయిదు దేవాలయాలు ఒకే చోట ఉన్నాయి. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రధాన రోడ్డు మీద ఉన్న మురుగు కాలువపై సిమెంట్ పలకలు ధ్వంసమయ్యాయి. గుంత పడి ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయాల్లో గుర్తించక అందులో పడి ప్రమాదాలు జరగుతున్నాయి. పంచాయతీ అధికారులు, సచివాలయు సిబ్బంది, మండల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. సత్వరం మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు.

కల్వర్టు వద్ద ఉన్న గుంత

# అన్నదాతలకు అండగా.. కూటమి ప్రభుత్వం భరోసా

● విరువూరుకు చెందిన రైతు జయరామయ్య ఏడు ఎకరాల్లో వరి సాగు చేశారు. తుపాను ప్రభావంతో మూడెకరాల్లో పంట నీటమునిగి నష్టపోయారు. పదిహేనేళ్లుగా పొలాన్ని కౌలుకు తీసుకొని వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సాగుకు సమాయత్తమవుతున్నారు.

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, కొడవలూరు

కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో దిత్వా తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా ఎడతెరపిలేని వర్షం కురిసింది. పంట పొలాల్లో నీరుచేరడంతో నారుమడులు దెబ్బతిన్నాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. పొదలకూరు మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో సాగుచేయగా మూడు వేల ఎకరాల్లో పంట మునిగింది. జిల్లా వ్యాప్తంగా నీట మునిగిన పంట వివరాలను వ్యవసాయాధికారులు ఆయా మండలాల వారీగా నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు. తక్షణం రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలను పంపిణీ చేసిందన్నారు. మొంథా తుపానుతో నష్టపోయిన రైతులకు కాస్త ఊరట లభించింది. నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నయ్యారు.

### పదకొండు ఎకరాల్లో సాగుచేశా..

వెంకటరమణయ్య, మరుపూరు



ఇరవై ఏళ్లుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పదకొండు ఎకరాల్లో కెఎన్ఎం రకం సాగు చేయగా, ఏడెకరాల్లో పంట నీట మునిగింది. ఎకరాకు రూ. 25 వేలు ఖర్చయింది. మొత్తం రూ. 3.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం అందించిన రాయితీ విత్తనాలతో సాగుకు సిద్ధమవుతున్నారు.

### భారం తగ్గింది : శ్రీధర్‌రెడ్డి, మరుపూరు.



మూడు దశాబ్దాలుగా పొలం కౌలుకు తీసుకొని వరి సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు ఎనిమిది ఎకరాల్లో సాగు చేయగా అయిదెకరాల్లో పంట నీట మునిగిందన్నారు. రూ. 2.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాలతో మరలా సాగుకు సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు.

(c) eenadu

# నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

నూతనంగా ఎంపికైన కమిటీ నాయకులు

## ఉపాధ్యాయులకు భారంగా బోధనేతర విధులు: ఏపీటీఎఫ్

**నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే :** విద్యార్థులకు స్వేచ్ఛగా బోధించేలా ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో నెల్లూరు గ్రామీణ మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కిషోర్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా శీనయ్య తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర విధులు భారమయ్యాయని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, పరిశీలకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కొత్త చట్టాలతో కార్మికులకు నష్టం: సీఐటీయూ

**నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త చట్టాలతో కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సీఐటీయూ అఖిల భారత మహాసభలపై గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ నుంచి జనవరి నాలుగు వరకు విశాఖపట్నంలో అఖిల భారత మహాసభలు జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా 15వ తేదీ వాడవాడలా

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఎర్రజెండాలు ఎగురవేయాలన్నారు. 26న ముత్తుకూరు గేట్ సెంటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. జనవరి 4న చలో విశాఖ చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షులు శ్రీనివాసులు, ఆర్.శ్రీనివాసులు, కామాక్షి, బాబురావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇంధన పొదుపుపై ప్రదర్శన

**నెల్లూరు (విద్యుత్తు):** ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ కె.రాఘవేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్తు భవన్ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హిమాన్షుశుక్లా ప్రారంభిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

**నెల్లూరు (మార్కెట్ సెంటర్):** ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ జనసేన సైనికుల సహకారంతో న్యూరాలజీ సమస్యతో బాధపడుతున్న నెల్లూరులోని గాంధీనగర్‌కు చెందిన మెయినుద్దీన్‌కు రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బాధితుడికి ఈ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున్‌యాదవ్ మాట్లాడుతూ బాధితుడి పరిస్థితి తెలుసుకున్న క్వీన్స్‌ల్యాండ్ జనసైనికులు ఆర్థిక సహాయం చేశారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జమీర్, చదలవాడ హరీష్, కృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మెయినుద్దీన్‌కు చెక్కు అందిస్తున్న జనసైనికులు

## రద్దీ మార్గం ఆక్రమణల వలయం

### ప్రభుత్వ స్థలాన్ని అద్దెకిస్తున్న కబ్జాదారులు

వేదాయపాళెం: జీఎన్‌టీ రోడ్డులో ఆక్రమణలు

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నగరంలో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు అధికమయ్యాయి. జీఎన్‌టీ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. ఇరువైపులా కబ్జాదారులు పాగా వేస్తున్నారు. స్థలాలను ఆక్రమించడమే కాకుండా ఇతరులకిచ్చి రూ.వేలకు వేలు అద్దె తీసుకుంటున్నారు. నగరంలో ఈ తతంగం ప్రభుత్వాసుపత్రి నుంచి కరెంటాఫీసు, వేదాయపాలెం, అయ్యప్పగుడి వరకు జరుగుతుంది.

**తగ్గుతున్న విస్తీర్ణం:** నగరంలోని వేదాయపాలెం, అయ్యప్పగుడి, ప్రభుత్వాసుపత్రి, కరెంటాఫీసు సెంటరు తదితర ప్రాంతాల్లో 100 అడుగుల వరకు రోడ్డును విస్తరించారు. అనంతరం కొద్దిరోజులకే ఇరువైపులా ఆక్రమించారు. వేదాయపాలెంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం నుంచి గాంధీనగర్‌కు వెళ్లే మలుపులో పండ్లు, కార్పెంటర్ దుకాణాలు ఏర్పాటుచేశారు. మలుపులో వాహనాలు తిరగడం కష్టంగా మారింది. జీఎన్‌టీ రోడ్డులో ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

### సొంత జాగీరులా..

కొందరు స్థలాల యజమానులు తమ భవనాల ముందున్న రహదారిపై ఖాళీ స్థలం నగరపాలకసంస్థకు చెందినదే అయినా.. తమ సొంతమైనట్లు పెత్తనం చెలాయిస్తూ దుకాణాలకు అద్దెకు ఇస్తున్నారు. నెలకు ఒక్కో దుకాణంపై రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. రోజురోజుకీ ఇలా ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ దుకాణాలు, రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

### ప్రజలకు నరకం

రహదారుల పక్కనున్న స్థలాలను ఆక్రమించడంతో పాదచారులు నడిచేందుకు మార్గమే లేకుండాపోయింది. 100 అడుగుల వరకు ఉన్న మార్గాలు సగానికిపైగా తగ్గిపోవడంతో ట్రాఫిక్ సాగడం లేదు. పెద్ద వాహనాలు తిరిగే అయ్యప్పగుడి, వేదాయపాలెం ప్రాంతాల్లో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. దీనిపై కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ రోడ్లపై ఆక్రమణలను తొలగిస్తామని వివరించారు.

## సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలి: సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాయి

**నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే :** సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా జనవరి 10వ తేదీ కోవూరులో జరిగే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి కోరారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సీపీఐ పోరాటాలు ప్రారంభించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26న వాడవాడలా జెండాలు ఆవిష్కరించాలన్నారు. జనవరి 18వ తేదీ తెలంగాణలో జరిగే ఉత్సవాల్లో జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలానీఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లీలామోహన్, కామేశ్వరరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శీనయ్య, కోశాధికారి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the 1st Addl. Senior Civil Judge: Nellore
O.S.No.84 / 2024
Bandi Tanuja - Plaintiff
Vs
Kandala Kameswara Rao - Defendant
**Notice to Defendant**
Kandala Kameswara Rao, S/o. Late Veeraiah, R/o. D.No. Sri Krishna Avenue, Flat No. 306, 4th Floor, 5th Lane, Dega Homes, Haranathapuram, Nellore-3. SPSR Nellore District.
పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే 29-12-2025దికి వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
పి.జ్ఞానప్రసూనాంబ. B.Sc., B.L., వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

## 16న పరీక్ష నైపుణ్యాలపై అవగాహన

**నెల్లూరు (విద్య) న్యూస్‌టుడే :** పదోతరగతి పబ్లిక్ పరీక్షలపై ప్రభుత్వ, జిల్లాపరిషత్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తామని ఇండియా ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ కన్వీనర్ కె.డొమినిక్‌రెడ్డి తెలిపారు. దీనిపై ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నగరంలోని పురమందిరంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. పాల్గొనదలచిన వారు 944193 5461, 89190 53022 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి వృద్ధుడి బలవన్మరణం

**నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే:** రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘైనమిది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వేదాయపాలెం జనశక్తి నగర్‌లో ఉంటున్న వెంకటేశ్వర్లు (63)కు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అయ్యప్ప గుడి వద్ద ఉన్న వంతెన సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారంతో నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఉన్న బ్యాగులోని ఆధార్ కార్డును గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

bd since 1879 బోంబేడయింగ్
స్టాకిస్టు శ్రీనివాస్ నెల్లూరు 28వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
15 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699
1 కొనండి 2 ఉచితం
మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి.
రు.799ల సింగిల్ బెడ్‌షీట్స్ 3కొనండి కేవలం రు.1000లు మాత్రమే
ప్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రు.1000లు మాత్రమే
పిల్లో 1కొనండి 1ఉచితం
రు.799ల టర్కిష్‌టవల్ రు.299లు మాత్రమే
ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం
రు.399ల పిల్లో కవర్సు పెయిర్ 1కొనండి 1ఉచితం
సుందరం / శ్రీమాన్ లుంగీ 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
శ్రీనివాస్ ట్రంక్‌రోడ్, నెల్లూరు సెల్ : 9849587286

## భయపెడుతున్న మ్యాన్‌హోల్

నగరంలోని బారకాస్‌లో మ్యాన్‌హోల్ గుంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో ఉన్న దీనిపై మూత లేకపోవడంతో వాహన రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. వాహనచోదకులు ప్రమాదాలకు గురవకుండా స్థానికులు కర్రకు వస్త్రాన్ని కట్టి హెచ్చరికగా పెట్టారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

## బాబోయ్ దుర్గంధం

నగరంలోని సుజాతమ్మ కాలనీలో భారీగా చెత్త పేరుకుపోయింది. డస్ట్‌బిన్ పూర్తిగా నిండిపోయి రోడ్డుపై పడడంతో కుళ్లి దుర్వాసన వస్తోంది. జీఎన్‌టీ రోడ్డులో నుంచి పొదలకూరు రోడ్డులోకి వచ్చే మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

## నీటి మడుగు.. కనిపించదా!

నగరంలోని పొదలకూరు రోడ్డు నిప్పో సెంటర్‌లో పది రోజులుగా రోడ్డుపై పారుతున్న నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోల్ నుంచి నీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

## గుంత.. వాహనదారుల చింత

నగరంలోని కొండాయపాలెం కూడలిలో గుంతతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ ఉన్న గుంత ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దదైంది. దగ్గరికి వచ్చే వరకు కనబడక వాహనదారులు పడిపోతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

## ర.భ ఇన్‌ఛార్జి ఈఈగా డీఈ మహబూబ్

**నెల్లూరు (జడ్పీ) :** ర.భ నెల్లూరు డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈగా సీనియర్ డీఈ షేక్ మహబూబ్‌ను నియమిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న ఎ.వేణుగోపాల్ కావలి, కోవూరు డివిజన్ల బాధ్యతలు చూస్తున్నారు. శాఖాపరమైన పాలనా వ్యవహారాల దృష్ట్యా ఆయన్ను తప్పించి సీనియర్ డీఈ షేక్ మహబూబ్‌కు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

**మేమున్నాం.. మీకు తోడుగా!** (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

**సమస్య:** ఫత్తేఖాన్‌పేట రైతుబజారు ఎదురుగా జీఎన్‌టీ రోడ్డుపై పశువులు చేరుతున్నాయి. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. – శ్రీధర్‌రెడ్డి, స్థానికుడు

**సమాధానం:** పశువులను గోశాలకు తరలిస్తాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? మనుమసిద్ధినగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – ఆదిలక్ష్మి, స్థానికురాలు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

## చదువుతో పాటు క్రీడలూ అవసరమే

**నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అవసరమని నెల్లూరు ఆర్డీవో నాగఅనూష పేర్కొన్నారు. నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ధనలక్ష్మీపురం నారాయణ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులు నారాయణ మెడికల్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ఏజీఎం రవివర్మ, ఆర్ఐ ఆదిశేషయ్య, కోఆర్డినేటర్ రాఘవరెడ్డి, ప్రిన్సిపల్ సుధీర్‌కిరణ్, నాగమణి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఆర్డీవో నాగఅనూష

## ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే:** నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా షేక్ నసీర్ అహ్మద్, కార్యదర్శిగా సుబ్బరాయుడు, కోశాధికారిగా సీతారి రత్నయ్య, గౌరవాధ్యక్షుడిగా బిరదవోలు రామ్మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వినుకొండ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

## శుభమస్తులో లక్కీ డ్రా

డ్రా తీస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్

**నెల్లూరు (మార్కెట్ సెంటర్):** శుభమస్తు షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, సంక్రాంతి కార్నివాల్‌లో భాగంగా ఎలక్ట్రిక్ స్కూటీ ఏడో లక్కీ డ్రా ఆదివారం జరిగింది. ట్రాన్స్‌కో ఈఈ శ్రీధర్ డ్రా తీయగా.. అద్దంకి ప్రాంతానికి చెందిన డేనియల్ మోహన్ విజేతగా నిలిచారు. శుభమస్తు నిర్వాహకులు మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని 39 స్కూటీలు, రెండు కార్లు బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు.

## అడవులతో పర్యావరణ పరిరక్షణ

**నెల్లూరు (విద్య):** నగరంలోని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి పొదలకూరు రోడ్డు వరకు గ్రీన్ హార్ట్‌ఫుల్‌నెస్ రన్ నిర్వహించారు. ఇందులో రామచంద్ర మిషన్ రీజినల్ ఫెసిలిటేటర్ ఎంజీ గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అడవులను సంరక్షించాలని కోరారు. రామచంద్ర మిషన్‌కోఆర్డినేటర్ గంగాధర్, వైద్యులు వెంకటకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ పరమేశ్వరరావు, సెంటర్ కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్నేహశీలికి శ్రద్ధాంజలి

కీ॥శే॥ సూరిశెట్టి వెంకటేశ్వరరావు గారు
ధనలక్ష్మి డైయింగ్ వర్క్, కాపువీధి, నెల్లూరు.
ఆదరణ, ఆత్మీయతలతో అందరి హృదయాలలో కొలువైన మంచి మనిషి, స్నేహశీలి శ్రీ సూరిశెట్టి వెంకటేశ్వరరావు గారు తేది: 14-12-2025 ఆదివారం స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుమారులు, మాకు అత్యంత ఆప్తులైన S. నరేంద్ర, S. గిరి, S. ఉమా సురేంద్ర గార్లకు మరియు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.
అంత్యక్రియలు తేది: 15-12-2025 సోమవారం ఉదయం 9 గం॥ కాపువీధిలోని వారి స్వగృహము నుంచి బయలుదేరును. కావున తెలియజేయడమైనది.
శోకతప్త హృదయాలతో... J.L. నారాయణ & సన్స్




(c) eenadu

## 114 మందికి చేతనం

అనంత సాంస్కృతికం

**సందర్భం:** స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు కాలిపర్స్ పంపిణీ

**శిబిరం:** భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని కమలానగర్‌లోని ఓ సొసైటీ భవనంలో కృత్రిమ కాళ్లు, చేతుల కాలిపర్స్ శిబిరం నిర్వహణ

**ఆధ్వర్యం ఎవరిది?** ప్రాంతీయ పరిషత్ కన్వీనర్ పరుచూరు రమేశ్‌బాబు అధ్యక్షతన ఉమ్మడి అనంత జిల్లా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు విశ్రాంత ప్రిన్సిపల్ రామకృష్ణ, ప్రముఖ న్యాయవాది హరికృష్ణ, కన్వీనర్ రమణానాయుడుల సారథ్యం

**ఎవరెవరు వచ్చారు:** ప్రకాశం, కర్నూలు, ఉమ్మడి అనంత జిల్లాలోని 114 మంది దివ్యాంగులు హాజరై కొలతలు ఇచ్చారు.

**పునర్వాస యోజన:** భారత్ వికాస్ పరిషత్ జాతీయ శాశ్వత పథకమైన వికలాంగుల పునర్వాస యోజన కార్యక్రమంలో భాగంగా ప్రమాదాలు, దీర్ఘకాలిక జబ్బులు, పోలియో వికలాంగులకు అనంత శాఖ వారిచే కాలిపర్స్ ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు.

## అంజన్నపై ఆన.. నిజమే చెబుతా

నల్లచెరువు మండలం పాత రైల్వేస్టేషన్ సమీపంలో వెలిసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ప్రమాణాలకు ప్రసిద్ధి. శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడ ఆంజనేయస్వామి గుడిని నిర్మించినట్లు జన ప్రతీతి. దురాశతో తమదికాని డబ్బు, ఆభరణాలను కాజేసిన వారు ఆంజనేయుడి సన్నిధిలో ప్రమాణం చేస్తుంటారు. శనివారం రోజున చన్నీటి స్నానం చేసి పోగొట్టుకున్న వ్యక్తి.. నిందమోపబడిన వ్యక్తి స్వామి సన్నిధిలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ఒకరకంగా రాజదర్బార్‌లో పంచాయితీ జరిగే రీతిన ఇక్కడి పూజారి సమక్షంలో ప్రమాణం చేయాల్సి ఉంటుంది. తప్పుచేసిన వ్యక్తులు ప్రమాణానికి సిద్ధమవగానే పశ్చాత్తాపంతో ఆ సొమ్మును పోగొట్టుకున్నవారి ఇళ్లలో వారం పది రోజుల్లో పడేస్తుంటారు. పోలీస్‌స్టేషన్‌లలో తెగని పంచాయితీలు స్వామి చెంతన పదుల సంఖ్యలో పరిష్కారం అవుతుంటాయని గ్రామస్థులు తెలిపారు. - న్యూస్‌టుడే, కదిరి పట్టణం

## 16, 17 తేదీల్లో రైల్వేగేటు మూసివేత

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** ముదిగుబ్బలోని రైల్వే గేటును 16, 17వ తేదీల్లో మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శివంపతాశర్మ తెలిపారు. ఎల్‌సీ నెంబర్ 26 వద్ద రైల్వేపట్టాల నిర్వహణతో పాటు తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతపురం నుంచి కదిరికి వెళ్లే వాహనదారులు ముదిగుబ్బ బైపాస్ మీదుగా, పులివెందుల నుంచి బుక్కపట్నం వైపు వెళ్లే చోదకులు ముదిగుబ్బ పాతూరు మీదుగా రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు.

## పట్టెడన్నం పంచుతున్నారు

యాచకుడికి భోజనం అందిస్తూ..

**తాడిపత్రి, న్యూస్‌టుడే :** తాడిపత్రికి చెందిన యువత యాచకులు, అభాగ్యులకు మేమున్నామంటూ తోడుగా నిలుస్తున్నారు. ఏ దిక్కులేని వారి ఆకలి తీరుస్తున్నారు. వినూత్నంగా ఆలోచించి పట్టణంలో ఉన్న పలు హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని సేకరించి పొట్లాలు కట్టి అన్నార్తుల కడుపు నింపుతున్నారు. తాడిపత్రిలోని వేర్వేరు కాలనీలకు చెందిన వరుణ్, కల్యాణ్, ఇమ్రాన్, రాజు, భాస్కర్ బృందంగా ఏర్పడ్డారు. అనుకున్నదే తడవుగా గతేడాది నవంబరులో 'మేము సైతం..మీకోసం' సంస్థను ఏర్పాటు చేశారు. అప్పట్లో కొన్ని హోటళ్లకు వెళ్లి 'మిగిలిన ఆహారాన్ని ఇవ్వండి, పొట్లాలు కట్టి యాచకులకు అందిస్తాం' అని అడిగేవారు. కొందరు స్పందించి ఆహారం అందించారు. తొలి రోజుల్లో బస్టాండు, రైల్వేస్టేషన్, చింతల రాయుడు, బుగ్గరామలింగేశ్వర ఆలయాల వద్ద యాచకులకు ఇచ్చి ఆకలి తీర్చారు. ప్రతి రోజూ 50 మందికి పైగానే సేవలందించారు. క్రమేణా ఆ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

### ఐదుగురితో ప్రారంభమై..

ఐదుగురితో ప్రారంభమైన సేవా బృందం 30 మంది సభ్యుల వరకు చేరింది. వీరంతా కలిసి హోటళ్ల యజమానులు, శుభకార్యాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు. భవిష్యత్తు సేవల్ని అనాథ ఆశ్రమాలకు విస్తరిస్తామని చెబుతున్నారు సంస్థ ప్రతినిధి వరుణ్.

## సీట్లు.. పాట్లు

బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు ఎగబడ్డారు. ఈ దృశ్యం ఉరవకొండ ఆర్టీసీ బస్టాండులో కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయాల సందర్శన, సొంత పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండు కిక్కిరిసిపోయింది. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉండటం గమనార్హం. మధ్యాహ్నం వరకు బస్సులన్నీ రద్దీగా కనిపించాయి. - న్యూస్‌టుడే, ఉరవకొండ

## లక్ష్యమే.. శిఖరాగ్రం!



కిలిమంజారో పర్వతంపై చిరంజీవి

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** అందరిలా మనముండటం కన్నా.. కొంత భిన్నంగా ఉండటం ప్రధానం అనుకున్నారు గుంతకల్లు మండలం నలకలపెంటకు చెందిన చిరంజీవి. చిన్నతనం నుంచే కొండలెక్కడం అలవాటు చేసుకున్నారు. తర్వాత పర్వతారోహణకు నడుం బిగించారు. తండ్రి విరూపాక్షి సాధారణ రైతు. కుమారుడికి పర్వతారోహణపై ఆసక్తి ఉండటంతో గుర్తించి ప్రోత్సహించారు.

### ప్రభుత్వం తరపున ఠీవిగా సాగి..

తాజా ప్రభుత్వం తరపున పర్వతారోహణ పోటీల్లో పాల్గొని దక్షిణాఫ్రికా దేశం టాంజానియాలోని 19,340 అడుగుల ఎత్తు ఉన్న కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశారు. కశ్మీర్‌లోని 12,087 అడుగుల ఎత్తైన తులియాన్, పహల్గామ్ పర్వతాలను ఎక్కి సత్తాచాటారు. ప్రస్తుతం అమెరికాలోని అకాన్కాగువా పర్వతాన్ని ఎక్కడానికి విజయవాడలో శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరంతోపాటు ఇతర ఖండాల్లోని ఎత్తైన అన్ని పర్వతాలను ఎక్కాలని ఉన్నట్లు తన లక్ష్యమని చిరంజీవి చెబుతున్నారు. గుంతకల్లులో పర్వతారోహణపై ఉత్సాహం ఉన్న వారికి శిక్షణ ఇస్తుండటం విశేషం.

## ఆటలో అరటిపండేనా!

**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే:** జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల్లో ముఖ్యమైంది అరటి. రైతు కష్టపడి అధిక దిగుబడులు సాధిస్తున్నా.. నాణ్యత లేక ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం 'ఉద్యాన సాగు అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)'లో భాగంగా జిల్లాలో అరటి పంట సంరక్షణకు 2025-26 ఆర్థిక ఏడాదికి రూ.3.80 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నాణ్యత పెంచేందుకు జిల్లా ఉద్యానవన శాఖ వెచ్చించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వారి పరిస్థితి, సమస్యలు ఆటలో అరటిపండు చందంగా మారాయి. ఇప్పటివరకు ఒక్క పైసా ఖర్చు చేయలేదనంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. పంట నాణ్యత లేక వ్యాపారులు కొనడం లేదు. కర్షకులు పంటను తొలగించడం లేదా పశువులు, గొర్రెలకు మేతకు వదిలేసే పరిస్థితి నెలకొంది.

| ఉమ్మడి అనంతపురం జిల్లాలో.. |
|---|
| సాగు విస్తీర్ణం |
| 30,000 హెక్టార్లు (అంచనా) |
| హెక్టారుకు పెట్టుబడి వ్యయం |
| రూ.2.72 లక్షలు |
| దిగుబడి అంచనా |
| హెక్టారుకు 160.55 టన్నులు |

### ఏం జరిగింది

ఉద్యానవన శాఖ అధికారులు ఫ్రూట్‌కేర్ కార్యక్రమంపై రైతులకు అవగాహనతో సరిపెడుతున్నారు. కనీసం ఒక్క హెక్టారులోనూ ఫల సంరక్షణ చేయలేదు.

### పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

విపణిలో పంట ఉత్పత్తులు కిలో రూ.8లకు పడిపోతే మార్కెటింగ్ శాఖ జోక్యం చేసుకోవాలి. గతంలో దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. అధికారులు రంగంలోకి దిగి రైతుల నుంచి గెలలు కొనాలి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి విక్రయించాలి. ఇదేం జరగలేదు. ధరల పతనమైన తర్వాత కలెక్టర్ ప్రశ్నిస్తే మార్కెటింగ్, ఉద్యానవన శాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం గమనార్హం.

### చేయాల్సింది ఇలా..

ఫల సంరక్షణ కార్యక్రమం కింద 1,500 హెక్టార్లలో అరటి నాణ్యత పెంచాలనేది లక్ష్యం. రూ.3.80 కోట్ల నిధులను మొక్క నాటిన నాటి నుంచి కోత వరకు వెచ్చించాలి. ఒక్కో రైతుకు హెక్టారుకు రూ.25,500 ఇవ్వాలి. మొగ్గ తొడిగిన తర్వాత బడ్ ఇంజెక్షన్ వేయాలి. 45 రోజుల తర్వాత వివిధ రకాల మందులు పిచికారీ చేయాలి. గెలలకు కవర్లు కట్టాలి. ఇవన్నీ సకాలంలో పాటిస్తే అరటి దిగుబడి పెరగడంతో పాటు గెలలు నాణ్యతగా కాస్తాయి. వ్యాపారులు కొనేందుకు పోటీ పడతారు. రైతులకు మంచి ధర దక్కుతుంది.

### ఫ్రూట్‌కేర్ అమలు చేస్తున్నాం

-ఉమాదేవి, ఉప సంచాలకురాలు, ఉద్యాన శాఖ

జిల్లాలో అరటి నాణ్యత పెంచేందుకు ఫ్రూట్‌కేర్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. రూ.3.80 కోట్ల నిధులతో ఈ ఆర్థిక ఏడాదిలో 1500 హెక్టార్లలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొంత అమలు చేశాం. పూర్తిస్థాయిలో నిధులు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

## రాయితీల రంగరింపు..

**అనంతపురం(రాంనగర్), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం మల్బరీ రైతులకు సిల్క్ సమగ్ర పథకం కింద పలు రాయితీలు ప్రకటించింది. పట్టు పురుగుల వ్యాధి నిరోధకాల మందులకు ఇటీవల టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఆమేరకు గుత్తేదారుడు మందులు సరఫరా చేశారు. దరఖాస్తు చేసుకొని వాటా చెల్లించిన రైతులకు వాటిని రాయితీపై పంపిణీ చేయనున్నారు. అంతేకాకుండా యాంత్రీకరణ పథకం కింద పరికరాలు, యంత్రాలు అందించనున్నారు.

### వ్యాధి నిరోధక మందులు

- ★ యూనిట్ల మంజూరు : 600
- ★ ఒక్కో యూనిట్‌లో ఎన్ని రకాలుంటాయి: 6
- ★ ఏయే మందులు ఉంటాయి: సున్నం, విజేతపొడి, క్లోరిన్‌డైయాక్సైడ్, పోషణ మందు, బ్లీచింగ్ పొడి, అత్రాపొడి
- ★ యూనిట్ ధర : రూ.5 వేలు
- ★ జనరల్ : రూ.3,750 రాయితీపోనూ రూ.1,250 రైతు వాటా చెల్లించాలి.
- ★ ఎస్సీ, ఎస్టీలు : రూ.4,500 రాయితీపోనూ రైతు వాటా రూ.500 చెల్లించాలి.

### యంత్ర పరికరాలు

- ★ యూనిట్ల మంజూరు : 25
- ★ ఎన్ని రకాలు: 7
- ★ ఏయే యంత్రాలు: బ్రష్‌కట్టర్, కోత, కలుపు యంత్రం, పవర్‌టిల్లర్, పెద్ద కత్తెర, చిన్న కత్తెర, పవర్ స్ప్రేయర్
- ★ జనరల్: 15 యూనిట్లు కేటాయించగా 50 శాతం రాయితీ.
- ★ ఎస్సీ, ఎస్టీలు: 5 యూనిట్ల చొప్పున 90 శాతం రాయితీ

### రైతులు సద్వినియోగం చేసుకోండి

- విజయకుమార్, జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి

మందులు, యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కేల్లో, పట్టుపరిశ్రమశాఖ అధికారులను సంప్రదించాలి. దరఖాస్తు చేసుకుని, రైతు వాటా చెల్లించిన వారికి పంపిణీ చేస్తాం. రాయితీలను మల్బరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## గుత్తి కోట.. పర్యాటక బాట: కలెక్టర్

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తి కోట ప్రాంతాన్ని ఆదివారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. జనవరి 24-25న రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కలెక్టర్ కొత్తపేట గ్రామం వైపు ఉన్న రహస్య సొరంగ మార్గాన్ని పరిశీలించారు. జాతీయ రహదారి నుంచి నేరుగా కోటలోకి కొత్తపేట నుంచి వెళ్లేందుకు వీలుగా సొరంగ మార్గాన్ని పునఃనిర్మించేందుకు చర్యలు చేపట్టేందుకు ఆయన పరిశీలించారు. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు విడుదల చేసింది.

## ఘన ప్రస్థానం.. నిత్యనూతనం

గుంతకల్లు రైల్వే జంక్షన్ ఆంగ్లేయుల కాలంలో (1870) రూపుదిద్దుకుంది. ఇప్పటికి 155 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో స్టేషన్‌తోపాటు డివిజన్‌లో రైల్వేలైన్ల నిర్మాణం జరిగింది. 1886 నుంచి 1994 వరకు ఆవిరి (స్టీమ్) ఇంజిన్లతో రైళ్లు నడిపారు. ప్రత్యేకంగా స్టీమ్ లోకో షెడ్డు ఉండేది. ప్రస్తుతం దీని స్థానంలో రైల్వేస్టేషన్‌కు కొత్త భవనాలు, ప్లాట్‌ఫాం, అత్యాధునిక వసతులతో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. నాటి ఆవిరి ఇంజిన్ రైళ్లతో మొదలుకొని నేటి విద్యుత్తు రైళ్ల వరకు జంక్షన్ ప్రస్థానం కొనసాగుతుండటం విశేషం.

-న్యూస్‌టుడే, గుంతకల్లు

**ప్రత్యేకతలు**

- రైల్వే లైన్లు : ఉత్తర, దక్షిణ భారతదేశమంతటా..
- స్టేషన్ గుండా వెళ్లే రైళ్లు: 110
- ఉద్యోగులు: 8 వేలు
- రోజువారీ ప్రయాణికులు: 20 వేలు

## అతివకు ఆర్థిక ఆసరా

"**రాయదుర్గం, న్యూస్‌టుడే:** మహిళల స్వావలంబనకు కూటమి ప్రభుత్వం చేయూత నిస్తోంది. మహిళల స్వయం ఉపాధితో పాటు ఆర్థికాభివృద్ధిలో నానాటికీ ఎదుగుతున్న సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ప్రభుత్వం నూతన పొదుపు సంఘాల ఖాతాలకు రివాల్వింగ్ ఫండ్‌ను జమ చేసింది. సీఎం చంద్రబాబు మొదటి నుంచి సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2వేల కొత్త సంఘాలకు రూ.3కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసింది. ఇందులో 1278 బీసీ సంఘాలకు, 509 ఎస్సీ, 213 ఎస్టీ సంఘాలకు సామాజిక వర్గాల వారీగా లబ్ధి చేకూరనుంది. దీని ద్వారా ఒక్కో సంఘానికి రూ.15 వేలు అందనుంది."

### సంఘం ఆవశ్యకత

రివాల్వింగ్ ఫండ్‌తో సంఘం నిధి పెరుగుతుంది. దీంతో సభ్యులకు అవసరాన్ని బట్టి అంతర్గత రుణాలు మంజూరుకు, బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తాలను రుణాలు పొందటానికి ఇది దోహదం చేస్తుంది. రుణాల ద్వారా సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని వారి ఆదాయాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు.

### 152 సంఘాలకు రూ.22.80 లక్షల మంజూరు

2024 ఆగస్టు 2 నుంచి 30.11.2025 మధ్య ఏర్పాటైన కొత్త సంఘాలకు సామాజిక వర్గాల వారీగా ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్‌ను మంజూరు చేసింది. జిల్లాలో 152 కొత్త సంఘాలకు రూ.22.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో 111 బీసీ, 32 ఎస్సీ, 9 ఎస్టీ సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేశారు.

### సంఘాల అభివృద్ధికి ఎంతో మేలు

- గంగాధర, వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజరు, అనంతపురం

ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం సంఘాల అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుంది. రివాల్వింగ్ ఫండ్ ద్వారా మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి.

## మొండి బకాయి.. తేలని లడాయి!

**అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** బీఎస్ఎన్ఎల్ సంస్థలో టెలిఫోన్ సౌకర్యం తీసుకున్న వినియోగదారులు కొందరు సకాలంలో బిల్లులు చెల్లించని కారణంగా బకాయిలు పేరుకుపోతున్నాయి. వాటిని వసూలు చేయడం అధికారులకు కత్తి మీద సాములా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ టెలిఫోన్ ఎక్స్ఛేంజీల పరిధిలో 8 వేలమంది వినియోగదారుల బకాయి భారీ మొత్తంలో ఉంది.

★ బీఎస్ఎన్ఎల్ సంస్థ పలు సేవలను (టెలికాం ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రొవైడర్) టీఐపీ ప్రైవేట్ ఏజెన్సీలకు టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వడం, బకాయిలు వసూలు బాధ్యతలు అప్పగించింది. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలకు దరఖాస్తు చేసిన వినియోగదారులకు టెలిఫోన్, మోడెం, పరికరాలు సమకూర్చి కనెక్షన్లు ఇచ్చినపుడు, బకాయి వసూలు చేసిన సమయంలో 50 శాతం మొత్తాన్ని కమిషన్ రూపంలో ఏజెన్సీలకు చెల్లించేలా బీఎస్ఎన్ఎల్ యాజమాన్యం మార్గదర్శకాలు రూపొందించి, అమలు చేస్తోంది. కొన్ని ఏజెన్సీల సిబ్బంది టెలిఫోన్ కనెక్షన్ ఇచ్చే సమయంలో చూపినంత ఆసక్తి, బకాయి వసూలు సమయంలో చూపించక పోవడంతో రూ.కోట్ల రూపాయల సొమ్ము పేరుకుపోతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ టెలిఫోన్ సౌకర్యం కోసం దరఖాస్తు చేసిన వినియోగదారుడు ఏ ఎక్స్ఛేంజీ పరిధిలో ఉన్నారో ఆ ఏజెన్సీ సిబ్బందికి ఫోన్ సౌకర్యం ఇవ్వాలి. టెలిఫోన్ సౌకర్యం తీసుకున్నపుడు, బిల్లులు సకాలంలో చెల్లించకుండా డిస్‌కనెక్షన్ చేసుకున్న వినియోగదారుడితో బకాయిలు వసూలు చేసినందుకు సదరు ఏజెన్సీకి 50 శాతం కమీషన్ సంస్థ చెల్లించేలా నిబంధనలున్నాయి. టెలిఫోన్ కనెక్షన్ ఇచ్చిన ఏజెన్సీకి డిస్‌కనెక్షన్ చేసుకుంటున్న సమాచారాన్ని ఇవ్వాలని నిబంధన ఉంది. టెలిఫోన్ సేవలు రద్దు చేసుకుంటున్నామని సమాచారం ఇచ్చినా సకాలంలో ప్రైవేట్ ఏజెన్సీలు స్పందించక పోవడం బకాయిలు పేరుకుపోవడానికి దారి తీస్తోందని పరిశీలనలో తేలింది.

### వసూలుకు చర్యలు..

- ముజీబ్ పాషా, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జీయం

ఉమ్మడి అనంతపురంలో 8వేల మంది వినియోగదారుల నుంచి రూ.1.2 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. టెలిఫోన్ సౌకర్యం తీసుకుని, సకాలంలో బిల్లులు చెల్లించని వారి నుంచి బకాయిలు వసూలుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతినెలా లోక్ అదాలత్‌లో కేసులు వేసి కొంత బకాయి సొమ్ము రాబడుతున్నాం. కోర్టు వరకు వెళ్లకుండా గడువులోపు ఇస్తామన్న వారితో చర్చించి కొంతమేరకు వసూలు చేస్తున్నాం. సకాలంలో స్పందించని ఏజెన్సీ సిబ్బందికి తాఖీదులు జారీ చేస్తున్నాం.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

## 11 పోస్టులు.. 137 దరఖాస్తులు

**అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే:** జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) అనుబంధ శిశుగృహ పోస్టులకు తీవ్ర పోటీ నెలకుంది. 11 పోస్టుల కోసం ఏకంగా 127 మంది దరఖాస్తు చేశారు. తుది గడువు ముగియడంతో పోస్టుల కేటగిరీల వారీగా దరఖాస్తుల సంఖ్య లెక్క తేలింది. ఈనెల 8 నుంచి 14 దాకా ఖాళీగా ఉన్న పోస్టుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను వడపోసి తుది ప్రాథమిక ప్రతిభా జాబితా చేస్తామని ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ చల్లా లలిత చెప్పారు. త్వరలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పార్టుటైం డాక్టర్ పోస్టుకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదన్నారు.

| కేటగిరీల వారీగా దరఖాస్తు ఇలా | |
|---|---|
| మేనేజర్ | 29 |
| సోషల్ వర్కర్ | 27 |
| 2 నర్సు పోస్టులు | 39 |
| 6 ఆయా | 36 |
| 1 చౌకీదార్ పోస్టు | 6 |

## ఉద్యానం.. అపూర్వ నామధేయం

ఓ పూర్వ విద్యార్థి తాను చదువుకున్న కళాశాలకు, విద్యార్థులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి కళాశాల ఆవరణంలో అందమైన పార్కును ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ముంబయిలో బ్యాంకింగ్ వ్యవస్థలో పనిచేస్తున్న చెట్టనాథన్ కళాశాలకు ఆరు గదులను నిర్మింపజేయడమే కాకుండా కంప్యూటర్లు, డెస్కులు, నోటు పుస్తకాలు, బీరువాలు తదితర వాటికి రూ.1.50 కోట్లకు పైగానే ఖర్చుచేశారు. అతని సేవలకు గుర్తింపుగా పార్కును ఏర్పాటు చేసి దానికి చెట్టనాథన్ పార్కుగా నామకరణం చేశారు. త్వరలో దీన్ని అతని చేతుల మీదుగా ప్రారంభింప జేయాలని నిర్ణయించినట్లు కళాశాల అధికారులు చెప్పారు. ఏర్పాటు చేసిన పార్కు కళాశాలకు అందంగా మారింది. - న్యూస్‌టుడే, గుంతకల్లు

## కల్యాణ వైభోగమే..

అనంతపురం నగరం ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరాలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం భక్త జనరంజకంగా సాగింది. గోవిందమాల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకను వీక్షించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గోవిందనామ స్మరణతో భక్తిభావం వెల్లివిరిసింది.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

## పేద మహిళలకు ఉజ్వల యోజన

"**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే:** కట్టెలు, బొగ్గుల పొయ్యిల ద్వారా వచ్చే విషపూరిత పొగను పీల్చకుండా మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని తీసుకొచ్చింది. అదే ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై). నాలుగేళ్లుగా ఆగిపోయిన ఈ పథకాన్ని మళ్లీ పునఃప్రారంభించారు. ఈ పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువనున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి."

### పూర్తిగా ఉచితం

సిలిండర్‌కు రూ.1,700, రెగ్యులేటర్‌కు రూ.150, ఒక మీటరు పైపు రూ.100, గ్యాస్ పుస్తకం రూ.25, ఇంట్లో బిగించేందుకు రూ.75 కలిపి రూ.2,050 ఈ మొత్తాన్ని ఆయిల్ కంపెనీలే భరిస్తాయి. మొదటి సిలిండర్ ఉచితం. తర్వాత తీసుకునే సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. ఈ పథకం అమలుకు జిల్లా ఉజ్వల కమిటీని నియమించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ప్రతినిధి జిల్లా కోఆర్డినేటర్‌గా, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి సభ్యుడిగా ఉంటారు.

మకోసం

### కావాల్సిన ధ్రువపత్రాలు

- ● రేషన్‌కార్డులో పేర్కొన్న పేర్ల మీద ఎటువంటి గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలి.
- ● రేషన్‌కార్డు ఉన్న వలస కార్మికులూ సంబంధిత పత్రాలు జతపరచి కనెక్షన్ పొందవచ్చు.
- ● నెలకు రూ.10 వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. రెవెన్యూ అధికారులతో ఆదాయ ధ్రువీకరణ పత్రం జతపరచాలి.
- ● అర్హులైన పేద మహిళలు ఏజెన్సీల వద్దకు వెళ్లి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- ● 14.2 కిలోల సింగిల్ సిలిండర్ లేదా 5 కిలోల రెండు సిలిండర్లు పొందవచ్చు.
- ● అర్హులైన ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌పీజీ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధీర్ పేర్కొన్నారు.

## విజయ వీరులకు సత్కారం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:

**సందర్భం:** మాజీ సైనికులకు అనంతపురంలో సన్మానం

**ఎవరికి :** 'ఆపరేషన్ విజయ్' పేరుతో 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న జిల్లా మాజీ సైనికులకు, 1965లో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు

**ఆధ్వర్యం :** సంఘం అధ్యక్షుడు కెప్టెన్ డి. షేకన్న




సత్కారం పొందిన మాజీ సైనికులు

**నేపథ్యం**

బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం ఆ యుద్ధం ఆపరేషన్ విజయ్ పేరుతో 1971 డిసెంబరులో 13 రోజులపాటు జరిగిందని గుర్తుచేశారు. ఇందులో 93 వేల మంది పాకిస్థాన్ సైనికులను బందీలుగా పట్టుకున్నామని వెల్లడించారు. 1971లో పాల్గొన్న వారిలో కెప్టెన్ షేకన్న, అబ్దుల్‌ఖాదర్, ఖాజాసాహెబ్‌లు ఉన్నారు. ఇదే సందర్భంగా 1965లో యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులు సిద్ధన్న, రామచంద్రారెడ్డి, జి.నాగభూషణం, బాబారత్నం, నంజేగౌడ, సి.కల్లప్పలనూ సత్కరించారు.

(c) eenadu

## ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు (సోమవారం) ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య అభిషేక, స్వర్ణకవచ సేవలు. 10 గంటలకు శ్రీవారికి ఆర్జిత కల్యాణం. దర్శన వేళలు.. ఉదయం 6 నుంచి 6.30 వరకు, 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంట, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వ దర్శనం.

## సంతల ఆదాయం రూ.3.40 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శని, ఆదివారం గొర్రెలు, మేకలు, పశువుల వారం సంతలు నిర్వహించారు. సంతలతో మొత్తం రూ.3,40,350 ఆదాయం వచ్చింది. ఇందులో గొర్రెలు, మేకల సంతలో రూ.2,08,550 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.1,31,800 ఆదాయం వచ్చిందని, సోమవారం ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి, ఏడీఎం రామవేంద్ర కుమార్ తెలిపారు.

# దివ్యాంగ బాలల భవితకు భరోసా

చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వారు అడుగు తీసి వేయలేరు. సరిగా మాట్లాడలేరు. కనీసం తమ పనులు తాము చేసుకోలేరు. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన వారి దయనీయ పరిస్థితి ఇది. అటువంటి చిన్నారులకు విద్యతోపాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి సాధారణ స్థితికి తెచ్చేలా కృషి చేస్తున్నాయి. జిల్లాలో 31 భవిత కేంద్రాల్లో 4,180 మంది దివ్యాంగులు ఉన్నారు. ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఎన్నో సేవలు అందిస్తున్నా సరైన అవగాహన లేక కొందరు వాటిని అందిపుచ్చుకోలేక పోతున్నారు.

### రవాణా ఖర్చులు చెల్లింపు

కేంద్రానికి వచ్చే వినికిడిలోపం, మస్తిష్క పక్షపాతం, బుద్ధి మాంద్యం, అంగవైకల్యం ఉన్న బాలలకు నెలకు రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు, బాలికలకు రవాణా, స్టైపండ్ కలిపి నెలకు రూ.500 చొప్పున పది నెలలకు చెల్లిస్తారు.

### అందిస్తున్న సేవలు

ప్రతి కేంద్రంలో బుద్ధిమాంద్యం, వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఒక్కొక్క ఉపాధ్యాయుడు, చిన్నారుల బాగోగులు చూడటానికి ఒక ఆయా ఉంటారు. మానసిక, శారీరక వికాసం కోసం యోగా, ధృఢత్వానికి ఇండోర్ ఆటలు ఆడిస్తారు. ప్రతి సోమవారం ఫిజియోథెరపీ చికిత్సలు, ప్రతి శనివారం చిన్నారుల ఇళ్లకు వెళ్లి గృహ ఆధారిత విద్య నేర్పిస్తారు. పిల్లలు, తల్లిదండ్రులకు సంబాషణ పరమైన సలహాలు, పిల్లలకు సర్జరీలు, వీల్ చైర్ల వంటి ఉపకరణాల కోసం సూచనలు చేస్తారు. ప్రస్తుత సరిగా లేని పిల్లల పరిశీలను మెరుగుపరచటం, వినికిడి కార్యక్రమాలు వారి చేయుటలను తీర్చిదిద్దటం, విద్యావసరమైన బోధనలు చేస్తారు. పింఛన్ల కోసం సదరం సర్టిఫికెట్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే ఉపకరణాలకు కూడా, రైలు పాసుల కోసం యూడీఐడీ సర్టిఫికెట్లు అందజేస్తారు.

### అవగాహన కల్పిస్తున్నాం

భవిత కేంద్రాల సేవలపై విస్తృత ప్రచారం జరపాల్సి ఉంది. అంగవైకల్యం కలిగిన ఎందరో పిల్లల తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక సేవలు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రవాణా ఖర్చు కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది.
- వెంకటరమేశ్, ఎంఈవో, రాయదుర్గం

# తెగుళ్లు సోకి పంటలు నష్టపోతున్నారా?

◆ శాస్త్రవేత్తలతో మాట్లాడి నివారణోపాయం పొందండి
◆ రేపు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. పంటలకు తెగుళ్ల తీవ్రత అధికమైంది. ప్రధానంగా చీని, దానిమ్మ, అరటి, మామిడి, టమాటా వంటి పంటలతో పాటు పప్పుసెనగ, వేరుసెనగ, వరి పంటలకు తెగుళ్లు ఆశించాయి. పూత, కాయ ఆలస్యంగా కావడంతోపాటు పురుగులు, తెగుళ్లు ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. రేకులకుంట ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ రమణ, డాక్టర్ శారద, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ క్రిశాల రాధిక, ఇతర అధికారులతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించనున్నారు. ఇబ్బందులు ఉన్న వారు ఒక్క ఫోన్ చేయండి. అమూల్యమైన సలహాలు, సూచనలు పొందండి.

| | |
|---|---|
| ఫోన్ చేయాల్సిన తేదీ | : 16-12-2025 (మంగళవారం) |
| సమయం | : ఉదయం 9 నుంచి 10.30 గంటల మధ్య |
| ఫోన్ చేయాల్సిన నంబర్లు | : 94906 95704, 94413 23352, 98487 11064 |

# సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహణ భేష్

సెంట్రల్ వర్సిటీలో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి రంగనాథ్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహణ చాలా బాగుందని కర్ణాటక ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన సెంట్రల్ యూనివర్సిటీని వీసీ కోరితో కలిసి సందర్శించారు. వర్సిటీ ఏర్పాటైన ఆర్నేళ్లలోనే అనేక విజయాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ సాధారణ విద్యలోని సైద్ధాంతిక పరిమితులు, భావనలు గురించి క్లుప్తంగా వివరించారు. విద్యార్థులకు పలువురి విజయగాథలను, పైలెట్ ప్రాజెక్టుల గురించి తెలుసుకోవాలన్నారు. సంస్థాగత అభ్యాసం, నాయకత్వ వికాసంపై నిరంతర పరిశీలన చేయాలన్నారు. చదువుతో పాటు, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారులు జావేద్ అక్తర్, ద్వారకా, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో న్యాయవ్యవస్థ

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు

సమావేశంలో మాట్లాడుతున్న కె.చంద్రు

ఆర్వేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాక్ స్వాతంత్ర్యాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవాలని మద్రాస్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాలలోని డ్రామా హాల్లో బార్ కౌన్సిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన 'రాజ్యాంగ పరిరక్షణ' సదస్సుకు చంద్రు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనేది స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో ప్రాధాన్యం కలిగిన నినాదమన్నారు. నేడు మన దేశంలోని ప్రజలు ఎటువంటి దుస్తులు ధరించాలి. తిండి ఏం తినాలి అనే విషయాన్ని కూడా పాలకులు నిర్ణయించే స్థాయికి వచ్చిందని, దీన్ని బట్టి చూస్తే వ్యక్తిగత స్వేచ్ఛ హరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వ సంస్థల పేర్లను మార్పు చేసే ప్రయత్నంలో ఉన్నారని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు రోజ్‌గార్ యోజనగా మార్చేందుకు బిల్లు ప్రవేశపెట్టారన్నారు. గాంధీ, నెహ్రూ పేర్లు మోదీ, అమిత్‌షాలకు ఇష్టం లేదని ఆరోపించారు. దళితుడైన భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరిన లాయర్‌ను కనీసం అరెస్టు చేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఐలు కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ప్రముఖ కార్డియాలజిస్టు వంశీకృష్ణ, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రసూన, హేమలత పాల్గొన్నారు.

# విజయనగర సామ్రాజ్య రాకుమార్తె శాసనం గుర్తింపు

గుడిపల్లిలో బృందావనాన్ని చూపుతున్న ఉపాధ్యాయుడు గోపి, పక్కన గ్రామస్థుడు శ్రీనివాసులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపల్లిలో పురాతన కాలం నాటి సజ్జగుంట రంగనాథస్వామి ఆలయ వద్దగల అత్యంత అరుదైన విజయనగర సామ్రాజ్య రాకుమార్తె 'సామాయి' శాసనాన్ని ఆదివారం గుర్తించినట్లు బుక్కపట్నం ఉపాధ్యాయుడు, చరిత్రకారుడు కె.గోపి తెలిపారు. విజయనగర సామ్రాజ్యాధికుడు శ్రీకృష్ణదేవరాయలు ఇక్కడి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామిని ప్రతిష్ఠించినట్లు ప్రతిష్ఠించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయానికి ఉత్తర దిక్కున ఉన్న బృందావనం రాతి గోడలపై విజయనగర సంగమ వంశ మూడో రాజైన రెండవ హరిహర రాయల కుమార్తె అయిన సామాయి పేరుతో క్రీ.శ 1398వ సంవత్సరం మే ఒకటిన శిలా శాసనం వేయించారని ఆయన చెప్పారు. పుణ్యం కోసం హరిహర రాయలు బృందావనాన్ని నిర్మించినట్లు ఈ శాసనంలోని సారాంశం తెలుగు, కన్నడ భాషల్లో అక్షరాలున్నట్లు తెలియజేశారు. సాధారణంగా విజయనగర పాలనా కాలంలో శాసనాలను రాజుల పేరు మీద వేయించినట్లు చరిత్రకారుల పరిశోధనలో లభ్యమవు తున్నాయని, అయితే ఇందుకు భిన్నంగా ఒక రాకుమార్తె పేరుతో వేయించిన శాసనం వెలుగుచూడటం ఇదే తొలిసారి అని ఉపాధ్యాయుడు గోపి తెలియజేశారు. భారత పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సహకారంతో ప్రాచీన ఆలయాలు, శాసనాల మీద తను చేస్తున్న పరిశోధనలో భాగంగానే ఇక్కడి అరుదైన శాసనాన్ని వెలుగులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట పలువురు గ్రామస్థులు ఉన్నారు.

# అందాల సౌందర్య

శ్రీమతి ఆంధ్రప్రదేశ్ -2025లో రన్నరప్‌గా విజేత

హిందూపురం, మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర పట్టణానికి చెందిన సోను సౌందర్య ప్రస్తుతం హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన 'శ్రీమతి ఆంధ్రప్రదేశ్ -2025' పోటీల్లో రన్నరప్‌గా నిలిచారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ అందాల పోటీల్లో తన అద్భుతమైన ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకొంది. ఇప్పటికే అక్టోబర్ మాసంలో నిర్వహించిన పోటీల్లో 'శ్రీమతి విజయవాడ' కిరీటాన్ని దక్కించుకొంది. హిందూపురంలో గ్లాం స్టూడియో హౌస్ ఆఫ్ బ్యూటీ నిర్వహిస్తున్న ఈమె మేకప్ రంగంలోనూ రాణిస్తూ పట్టణంలో ప్రత్యేక గుర్తింపు పొంది ఎంతో మంది గృహిణిలకు ఆదర్శంగా నిలిచారు. రాష్ట్రస్థాయి అందాల పోటీలో రన్నరప్‌గా నిలిచిన సోనూ సౌందర్య కు పట్టణ ప్రముఖులు, పలువురు అభినందనలు తెలిపారు.

## 16న జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 16న జిల్లా పురుష, మహిళల, జూనియర్ బాలబాలికల ఖోఖో జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడా విభాగం జిల్లా కార్యదర్శి నిరంజన్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీప్రసాద్, రాఘవేంద్ర, ప్రభాకర్ ఆదివారం పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు నిర్ధారణ ధ్రువపత్రంతో పాటు ఆధార్‌కార్డుతో పాల్గొనాలని సూచించారు.

# బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం

విజేత జట్టుకు కప్పు అందిస్తున్న మంత్రి భరత్

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరినాలో మూడు రోజుల పాటు నిర్వహించిన భూషణ్‌రావు స్మారక రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో అనంతపురం జట్టు రాజమహేంద్రవరం జట్టుపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోటీలో చిత్తూరు జట్టు కర్నూలుపై విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందని చెప్పారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి దాదాబాషా, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆందోళన పట్టదా?

ఆసుపత్రి ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: పద్మావతి క్లీనింగ్ ఏజెన్సీస్ నిర్వాహకులు, గుత్తేదారుడైన భాస్కర్ నాయుడును పిలిపించి కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయూ, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు నాగేంద్రకుమార్, ముత్యాజ, సాకే హరి, సురేష్, మల్లికార్జునరెడ్డి, రామిరెడ్డి డిమాండ్ చేశారు. 42 రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి నుంచి తొలగించిన కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆదివారం ఆసుపత్రి ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. మహిళా కార్మికులు ఉదయం అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు, మహిళా పోలీసులు కార్మికురాళ్లను అరెస్ట్ చేసి బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఆర్డీవో సమక్షంలో సంప్రదింపులు

శనివారం ఆసుపత్రిలో కార్మికులకు, గుత్తేదారులకు మధ్య జరిగిన గొడవపై జిల్లా కలెక్టర్ ఆర్డీవో కేశవనాయుడు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఆర్డీవో కలిసి కార్మిక, ప్రజా, కులసంఘాల నాయకులతో మాట్లాడారు. గుత్తేదారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 20 ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని డిగ్రీ ఉండాలని, 50 ఏళ్లలోపు వయసు ఉండాలని నిబంధనలు చూపటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మరుగుదొడ్లలో యాసిడ్ చల్లి శుభ్రం చేసిన వీరి కష్టాలు అధికారులకు కనబడటం లేదా అంటూ ప్రశ్నించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

Wanted Managers & Sales Staff for Anantapur Biggest Furniture Store Mamatha Furniture. 2yrs Exp & Computer Skills. Sal: Upto 25K + Incentives. Interview 14 & 15th Dec. @ 11 AM - 4Pm. # Gooty Road, Opp: Market Yard, ATP.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ & డిగ్రీ వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ✆ 9248733372.

స్కూల్ నందు అనుభవం గల Vice Principal మరియు A.O కావలెను. Cell: 9440045441.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

# ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ విజేత కుశాల్

కుశాల్‌కు కప్ అందజేస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట సీతా రామాంజనేయ కల్యాణమండపంలో రెండు రోజులుగా జరుగుతున్న డా.ఎస్.నాగమణి మెమోరియల్ ఆల్‌ఇండియా ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా అనంతపురానికి చెందిన కుశాల్ నిలిచాడు. ఆదివారం టోర్నీ ముగిసింది. విజేతకు కప్‌తో పాటు రూ.15వేలు నగదును ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ధర్మవరం అధ్యక్షుడు డా.వాసుదేవరెడ్డి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విజయవాడకు చెందిన మల్లేశ్వరరావు రూ.10వేలు, కప్, తృతీయ స్థానం సాధించిన అనంతపురానికి చెందిన లాలిత్య రూ.8వేలు, కప్‌ను టోర్నీ ఆర్గనైజింగ్ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాషా, ఈశ్వరప్ప, గౌరవాధ్యక్షుడు డా.సుబ్బారావు, డా.రవిప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. వివిధ స్థానాల్లో నిలిచిన 32 మంది క్రీడాకారులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఏపీ చెస్ సంఘం కార్యదర్శి సుమన్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శీలా నాగేంద్ర, జయరామ్ పాల్గొన్నారు.

# యువత సామాజిక సేవలో భాగమవ్వాలి

యువతతో సంస్థ సీఈవో, సిబ్బంది

రొద్దం, న్యూస్‌టుడే : సమాజంలో ప్రతి యువత వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు, సామాజిక సేవలోనూ భాగం కావాలని కల్పవల్లి సీఈవో చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని కోగిర సమీపంలోని కల్పవల్లి సీఈవో చిరంజీవి ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన యువతకు టింబక్టు కలెక్టివ్ సంస్థ పర్యావరణ పరిరక్షణతో పాటు ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కల్పవల్లి సంరక్షణతో పాటు యువతత అటవీ ప్రాంతంలో కొన్నివేల మొక్కలు నాటించి, వాటి సంరక్షణకు వాచర్స్‌ను నియమించారన్నారు. దీంతో వందల ఎకరాల్లో పచ్చదనం అభివృద్ధి చెందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు రవి, రమేశ్, సతీష్, ఆది, కిరణ్,లతో పాటు వాచర్స్ పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని యువకుడి వీరంగం

## కత్తితో హెడ్‌కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

దాడికి యత్నిస్తున్న రవి

పామిడి, న్యూస్‌టుడే : పామిడి పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఆదివారం మతిస్థిమితం లేని రవి అనే యువకుడు కత్తితో వీరంగం చేశాడు. దుస్తులు కొనడానికి వెళ్లిన రవి డబ్బులు ఇవ్వకుండా దుకాణ యజమానులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకోగానే వారి వాహనంపై కర్రతో దాడి చేసి వెంబడించాడు. పట్టుకోవడానికి వెళ్లిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులుపై కత్తితో దాడికి యత్నించాడు. త్రుటిలో ప్రమాదం తప్పింది. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కాగా సదరు యువకుడు మతిస్థిమితం లేని కారణంగా విశాఖలో వైద్యం తీసుకున్నటు పోలీసులు తెలిపారు.

# మామిడి మొక్కల నరికివేత

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దురదకుంట గ్రామానికి చెందిన రాముడు అనే రైతు పొలంలో దుండగులు మామిడి మొక్కలను నరికేశారు. ఆదివారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిచూడగా దాదాపు 36 మొక్కలు నేలపై పడి ఉన్నాయని రైతు వాపోయారు. రెండేళ్ల క్రితం కడియం నుంచి 300 మొక్కలు తెచ్చి 4 ఎకరాల్లో నాటినట్లు చెప్పారు. ఓర్వలేకనే కొందరు ఉద్దేశపూర్వకంగా మొక్కలను నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.90 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గ్రామీణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కవలల జననం.. బాలింత విషాదాంతం

గంగమ్మ

బెళుగుప్ప, న్యూస్‌టుడే: పదేళ్ల తర్వాత కవల పిల్లలు పుట్టారన్న సంతోషం.. పిల్లలను తనివితీరా చూడకుండానే ఆ తల్లి మృతి చెందటంతో బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. హృదయాలను కలచి వేసిన ఈ ఘటన బెళుగుప్ప మండలంలోని గంగవరం గ్రామంలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం హవలిగి గ్రామానికి చెందిన గంగమ్మ (28)కు శివకుమార్‌తో పదేళ్ల కిందట వివాహం జరిగింది. పురిటి నొప్పులు రావడంతో ఆమెను కళ్యాణదుర్గంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం కవలలకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే బాలింతకు రక్తస్రావం ఆగకపోవడంతో అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు చిన్నారులకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

# ట్రాక్టర్ ఢీకొని ఉపాధ్యాయుడి దుర్మరణం

హరికృష్ణ

అమడగూరు (ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరులోని విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హరికృష్ణ(36) అనే ఉపాధ్యాయుడు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు. . ముదిగుబ్బ మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన హరికృష్ణ అమడగూరు మండలం జౌకులకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో కర్ణాటకలోని బాగేపల్లికి వెళ్లారు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా అమడగూరు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# కారు ఢీకొని ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

## హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఘటన

క్షతగాత్రులు లక్ష్మీనరసింహ, భార్గవ్

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర సమీకృత వసతిగృహం వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆదివారం ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బాలుర వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు లక్ష్మీనరసింహ, భార్గవ్‌కు హాస్టల్ సిబ్బంది గురుప్రసాద్ తన ద్విచక్రవాహనాన్ని ఇచ్చారు. కొత్తపల్లి సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నారని, మిగిలిపోయిన భోజనాన్ని తెమ్మన్నారు. విద్యార్థులు అక్కడికి వెళ్లి భోజనాన్ని తెచ్చిన తర్వాత, పాత్రలను తిరిగి ఇచ్చి రమ్మని చెప్పారు. పిల్లలు ద్విచక్రవాహనంపై వడ్డివారిపల్లి సమీపంలో హైవేను దాటుతుండగా, కదిరి నుంచి గోరంట్ల వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మీనరసింహ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనిపై వసతిగృహం వార్డెన్ కృష్ణనాయక్ వివరణ కోసం న్యూస్‌టుడే ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

### విద్యార్థులు రోడ్డుమీదకు ఎలావచ్చారు : మంత్రి

పెనుకొండ: వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడతామని, వసతిగృహంలో ఉండాల్సిన విద్యార్థులు రోడ్డు మీదకు ఎలా వచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రశ్నించారు. వసతి గృహం విద్యార్థులు గాయపడడంపై మంత్రి సవిత కలెక్టర్, జిల్లా ఎస్పీతో అమరావతి నుంచే చరవాణిలో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈఘటనపై డీఎస్‌డబ్ల్యూవో రెడ్డిబాలాజీతోనూ మంత్రి చరవాణిలో మాట్లాడారు. తక్షణం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి, చోదకుడిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# పొలం వివాదంతో రైతు ఆత్మహత్యాయత్నం

కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఉన్న అశ్వర్థ

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : సోదరుల మధ్య తలెత్తిన పొలం వివాదంలో తనకు న్యాయం జరగలేదని ఓ రైతు మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన పెద్దపప్పూరు పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం జరిగింది. శింగనగుంటపల్లికి చెందిన అశ్వర్థకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ఆ భూమిని తబ్జుల గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడికి ఆరేళ్ల పాటు కౌలుకు ఇచ్చాడు. అశ్వర్థ సోదరుడు పెద్దకుళ్లాయప్ప అన్నదమ్ముల పొలాల మధ్య ఇతరులకు కౌలుకు ఇస్తే సమస్యలు ఉత్పన్నం అవుతాయని, తనకే భూమి కౌలుకు ఇవ్వాలని అడిగాడు. దీనికి అతను ఒప్పుకోలేదు. న్యాయం కోసం శనివారం పోలీసులను ఆశ్రయించాడు. గొడవలకు వెళ్లకుండా సామరస్యంగా ఉండాలని సోదరులిద్దరికీ పోలీసులు సూచించారు. ఈక్రమంలో పెద్దకుళ్లాయప్ప పొలంలో దుక్కి దున్నడానికి వెళ్లాడు. ఆ వెంటనే అశ్వర్థ కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లి పురుగు మందు తాగేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకొని పెద్దకుళ్లాయప్పను పోలీస్టేషన్‌కు పిలిపించి విచారించారు. అశ్వర్థ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హత్య కేసు ఛేదన

## ముగ్గురు నిందితుల అరెస్టు

నిందితులను చూపుతూ వివరాలు తెలుపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వ్యక్తి హత్య కేసును ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం డీఎస్పీ విజయ్‌కుమార్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దేవరవంక గ్రామానికి చెందిన ముత్తప్ప(44) అనే వ్యక్తి అమడగూరు మండలం ఆకులవారిపల్లిలో సెప్టెంబరు 3న దారుణ హత్యకు గురయ్యాడు. కర్ణాటక రాష్ట్రం కొత్తపల్లికి చెందిన సురేష్‌తో ముత్తప్పకు భూవివాదం ఉంది. మరోవైపు చామాలవారిపల్లి సోమశేఖర అనే వ్యక్తి ముత్తప్ప అన్న కూతురుతో అసభ్యంగా ప్రవర్తించగా, ముత్తప్ప చెప్పుతో కొట్టించాడు. ఈ నేపథ్యంలో సురేష్, సోమశేఖర కలిసి ముత్తప్పను చంపాలని నిర్ణయించుకున్నారు. ముత్తప్ప అమడగూరు మండలం ఆకులవారిపల్లిలో పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పథకం ప్రకారం సురేష్, సోమశేఖర బోయిపల్లికి చెందిన ఆనందతో కలిసి సెప్టెంబరు 3న ఆకులవారి పల్లికి వెళ్లారు. ముగ్గురూ కలిసి ముత్తప్ప తలపై నరికి దారుణంగా హత్య చేశారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా నిందితులు ఆదివారం ఓడీచెరువు మండలం మహమ్మదాబాద్ వద్ద ఉండగా అరెస్టు చేశారు. కేసును ఛేదించిన నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీసీ ఎస్సై మల్లికార్జున రెడ్డి, కానిస్టేబుళ్లు లోకేశ్వర, కరుణాకర్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, డీటీఆర్బీ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

# హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

## వాహనాల ఆకస్మిక తనిఖీలు

కారును పరిశీలిస్తున్న శిక్షణ ఎస్సై గోపాలకృష్ణ, హెచ్‌సీ సత్యనారాయణ

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** స్థానిక కత్తపల్లి మలుపు వద్ద ఆదివారం సాయంత్రం శిక్షణ ఎస్సై గోపాలకృష్ణ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. కార్లు, ఇతర వాహనాలను నిలిపి పరిశీలించారు. వేగంగా, ముగ్గురు కలిసి వెళ్తున్న ద్విచక్ర వాహనాలను ఆపి చోదకులు, యువకులకు ప్రమాదాల గురించి శిక్షణ ఎస్సై అవగాహన కల్పించారు.

## భక్తిశ్రద్ధలతో కనకదాస జయంతి

**హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** పట్టణంలోని మోతుకపల్లిలో ఆదివారం కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన జ్యోతులను ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, మోతుకపల్లి గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

జ్యోతులతో వస్తున్న మహిళలు, ఎమ్మెల్యే పీఏ బాలాజీ తదితరులు

## మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

**సమస్య:** మడుగుబల్లో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-హనుమంతరాయుడు**
**సమాధానం:** రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **-లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి**
**సమస్య:** మద్దనకుంట బీసీ కాలనీలో కుళాయిల్లో నీరు రావడం లేదు. **-కుమార్**
**సమాధానం:** నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. **-అంబరీశ్, పంచాయతీ కార్యదర్శి**
**సమస్య:** బెంగళూరు రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఖాళీ ప్రదేశంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **-గోకుల్**
**సమాధానం:** పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. **-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**
**సమస్య:** పెద్దగువ్వలపల్లిలో పైపులు లీకేజ్ కావడంతో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. **-బాషా**
**సమాధానం:** పరిశీలించి చర్యలు చేపడతాం. **-గోవిందప్ప కార్యదర్శి, రొద్దం**
**సమస్య:** స్థానిక కెనరా బ్యాంకు వీధిలో కాలువలు నిండిపోయాయి. **-రమేశ్**
**సమాధానం:** పంచాయతీ వర్కర్ల ద్వారా తొలగించి శుభ్రం చేయిస్తాం. **-గోవిందప్ప, ఇన్‌ ఎంపీడీఓ, రొద్దం**
**-న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం సాంస్కృతికం, రొద్దం**

## సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

**గుడిబండ:** మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం...మీకు తోడుగా శీర్షిక ప్రచురించగా బాధ్యులు స్పందించారు. పీఎస్‌పాళ్యం ఇందిరమ్మ కాలనీలో సర్పంచి సతీశ్‌బాబు, పీజీపల్లిలో సర్పంచి సతీశ్‌బాబు వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పూజారిపల్లి రోడ్డుపై సర్పంచి కవిత, తాళికెరలో సర్పంచి రంగస్వామి హరితహారాయకుల ద్వారా ముళ్లపొదలను తొలగించ చేశారు. కరికెర ఎస్సీ కాలనీలో ఉన్న విద్యుత్తు సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పరిష్కరించి నియంత్రిక ఏర్పాటు చర్యలు తీసుకున్నారు.

**హిందూపురం సాంస్కృతికం:** పట్టణంలోని పరిగి రోడ్డు నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రహదారి మొదట్లో పేరుకుపోయిన చెత్తను, పెనుకొండ రోడ్డు నుంచి శ్రీనివాస థియేటర్‌కు వెళ్లే రహదారిలో కాలువలను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

**హిందూపురం గ్రామీణం:** ఎస్.రప్పక్లిలో డ్రైనేజీలను శుభ్రం చేశారు. పందులు దూరంగా ఉంచాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు.

**రొళ్ల, న్యూస్‌టుడే:** జీఎన్ పాళ్యం గ్రామంపై ప్రాంతానికి నీరు వెళ్లేలా సర్పంచి హరీశ్ గేట్‌వాల్వు ఏర్పాటు చేయించారు. ఆర్.గొల్లహట్టిలో ఎస్టీవాడ వీధి దీపాలు వెలగకుండా సర్పంచి చిన్నరంగప్ప కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించారు. దొడ్డేరి దళిత కాలనీలో సర్పంచి అనిత కుళాయిలను బిరడాలు బిగించి సక్రమంగా నీరందించారు. కె.బ్యాడిగెర ఇందిరమ్మ కాలనీలో సర్పంచి లక్ష్మమ్మ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. రొళ్ల మధుడి రోడ్డులో వేసిన చెత్తను ఈవోఆర్డీ సుధాకర్ గ్రీన్‌అంబాసిడర్లతో తొలగించి శుభ్రం చేయించారు.

# శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తర్ఫీదు

☛ పకడ్బందీగా పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

మడకశిర బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులు

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మెగా పీటీఎంలు నిర్వహించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పరస్పర సహకారంతో విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. పది పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వంద రోజుల ప్రణాళికతో వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ముందుకెళ్తున్నారు.

**20 మంది పర్యవేక్షకుల నియామకం:** వంద రోజుల ప్రణాళిక సక్రమంగా అమలయ్యేందుకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా 20 ఉన్నత పాఠశాలలకు 20 మంది పర్యవేక్షకులను నియమించారు. ఆయా పాఠశాలలను పర్యవేక్షిస్తూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పునశ్చరణ తరగతులు, ఉదయం నేర్చుకున్న సబ్జెక్టుపై సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించి వాటిని పరిశీలిస్తున్నారు. మార్చి 14 వరకు ప్రణాళిక బద్ధంగా కార్యక్రమం అమలయ్యేందుకు చర్యలు చేపట్టారు.

**దాతల సహకారం:** గతంలో ఎప్పుడూ లేని విధంగా పది విద్యార్థుల చదువులకు దాతలు తోడ్పాటునందిస్తున్నారు. నాలుగైదు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే విద్యార్థులు ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థులకు ఇప్పటికే గౌడనహళ్లి, పాపసానపల్లి పాఠశాలల్లో దాతలు అల్పాహారం అందిస్తున్నారు. అమిదాలగొంది, మడకశిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 800 మందికిపైగా విద్యార్థులున్నారు. ఈ పాఠశాలల్లో అల్పాహారం అందిస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

**ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ:** నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో పేద విద్యార్థులకు పది పరీక్షల ఫీజులు కూడా భారం కాకూడదన్న ఉద్దేశంతో 3వేల మంది విద్యార్థులకు పదోతరగతి పరీక్ష ఫీజులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెల్లించారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా వెళ్తున్నారు.

**ప్రత్యేక తరగతులు**

ప్రతి పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలవుతోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టులపై స్లిప్ టెస్టులు జరుగుతున్నాయి. పది పరీక్షలకు విద్యార్థులను సర్వం సిద్ధం చేస్తున్నాం. ఈ విద్యా సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం. **-భాస్కర్, ఎంఈఓ, మడకశిర**

## బోరు వేశారు.. నీళ్లివ్వడం మరిచారు

టీడీపల్లి ఇందిరమ్మ కాలనీ వద్ద తవ్వించిన బోరు

**మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే:** టీడీపల్లి ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం బోరు తవ్వించారు. ఆరు నెలలు కావస్తున్నా పైపులు బిగించి నీరందించ లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న పాత బోరుకు సింగిల్ ఫేస్ మోటారు అమర్చి నీరందిస్తున్నారు. ఇందిరమ్మ కాలనీ ప్రజలతో పాటు తండా వాసులు కూడా ఈ బోరు నుంచే నీటిని పట్టుకువెళ్తున్నారు. రెండు గ్రామాల్లో 150 కుటుంబాలున్నాయి. సింగిల్ ఫేస్ బోరు నుంచి వచ్చే నీరు చాలడం లేదు. కొత్తగా తవ్వించిన బోరుకు పైపులు బిగించి, మోటారు అమర్చి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సర్పంచితో మాట్లాడి కొత్త బోరుకు మోటారు, పంప్‌సెట్ బిగించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

## ఆనందం.. అపూర్వ సమ్మేళనం

**పరిగి, న్యూస్‌టుడే:** పరిగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పవన్, భాస్కర్, ఓబులేశు, అశ్వత్థనారాయణ, గిరీష్, హిదయతుల్లా, అశోక్ పాల్గొన్నారు.

**పెనుకొండ:** దాదాపు 37ఏళ్ల క్రితం చదువుకున్న వారందరూ ఆదివారం స్థానిక త్రిపుర రిసార్ట్‌లో ఒకే వేదికపై పూర్వవిద్యార్థులంతా కలిశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదోతరగతి అభ్యసించిన విద్యార్థులందరూ కలిసి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు.

పరిగి: ఆనాటి గురువులతో ..

పెనుకొండలో 55 ఏళ్లకు ఒక చోట చేరి..

## సాహితీ వేత్తను కోల్పోవడం బాధాకరం

**హిందూపురం, న్యూస్‌టుడే:** ప్రముఖ కవి, సాహితీవేత్త గాయత్రి వేద మంత్ర ద్రష్ట కోడిమడుగు నాగేశ్వరశర్మను కోల్పోవటం బాధాకరమని పలువురు రచయితలు, కవులు అన్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ఆయనకు పట్టణంలో రెండు రోజుల కిందట బెంగళూరులోని ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన కోడిమడుగు నాగేశ్వరశర్మకు ఆదివారం గాయత్రి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జి.రంగారావు, బ్రాహ్మణసేవా ట్రస్ట్ కార్యదర్శి జేవీ ప్రసాద్, సంస్కృత పండితులు సత్యనారాయణశర్మ, రచయిత బల్లూరు రాఘవేంద్రరావు, పఠజీబాషాశర్మ, రామయ్య, బాలాజీలు నివాళి అర్పించారు.

## వారం రోజుల్లో అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు

చెరువు కట్టపై కంపచెట్ల తొలగింపును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి

**అమరాపురం, న్యూస్‌టుడే:** జిల్లాలోనే మారుమూలన ఉన్న అమరాపురం చెరువుకు మరో వారం రోజుల్లో కృష్ణా జలాలు వస్తాయని మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న పనులను పరిశీలించారు. రెండు మూడు రోజుల్లో చెరువు కట్టపై ఎలాంటి పిచ్చి మొక్కలు లేకుండా చేయాలని కోరారు. తాను, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, ముఖ్యమంత్రితో పట్టుబట్టి ఆఖరున ఉన్న చెరువుకు నీరు అందించేలా ఒప్పించామని చెరువు నిండితే ముఖ్యమంత్రితోనే జలహారతి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు గడిక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి, తాలూకా ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్, స్థానిక నాయకులు ప్రసాద్, చెన్నప్ప, తిప్పేస్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తి పట్టదా?

**పెనుకొండ, న్యూస్‌టుడే:** మావటూరు బీసీ కాలనీలో దశాబ్దాల క్రితం సిమెంటు రోడ్డు నిర్మాణంలో పక్కన ఉన్న చేతి పంపును రోడ్డులో వదిలేశారు. రోడ్డు నిర్మించిన తరువాత ట్రాక్టర్లకు అడ్డు వస్తోందని వినియోగంలో లేని పంపును పక్కకు వంచిపెట్టి వదిలేశారు. అందులో పైపులు, పంపు, అన్నింటినీ దశాబ్దకాలంగా నిరుపయోగంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కనీసం చేతిపంపును ఊడదీసి, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

**పెనుకొండ, న్యూస్‌టుడే:** రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని నారాయణ వైద్యశాలల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.చంద్రబాబు సూచించారు. ఆదివారం పట్టణంలోని తిలిదే కల్యాణ మండపం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కాబూల్ స్పెషాలిటీ వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వైద్యశాల ఎండీ డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ పట్టణంలో మొదటిసారిగా అత్యాధునిక వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో వైద్యశాల ప్రారంభించామన్నారు. ఇక్కడ జనరల్ మెడిసిన్, అంటువ్యాధులు, చర్మవ్యాధులు, డెమోటో సర్జికల్, కాస్మోటిక్, జననేంద్రియ, మూత్రవ్యాధులు, శస్త్రచికిత్సలు,ల్యాబ్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రామ్‌ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాస్ఫూర్తితో రాణించాలి

**అగళి, న్యూస్‌టుడే:** ఆటలో గెలుపు, ఓటములు ముఖ్యం కాదని క్రీడా స్ఫూర్తితో ఆడి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాణించాలని తెదేపా యువ నాయకుడు ఎన్‌బీటీ మంజునాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులుగా జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో 25జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన పోటీలో అగళి, గోరంట్ల జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో గోరంట్ల జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతి కింద రూ.33,333లను గోరంట్ల జట్టుకు మంజునాథ్ అందజేశారు. రెండవ బహుమతిని అగళి జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ మండల యువకులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, పీఏసీఎస్ ఛైర్మన్ కుమారస్వామి, నాయకులు శివానంద్, శివలింగప్ప, నరసింహమూర్తి పాల్గొన్నారు.

గోరంట్ల జట్టుకు బహుమతులు అందజేస్తున్న మంజునాథ్

## పేదలకు దుప్పట్ల పంపిణీ

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్ల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గంపల వెంకటరమణారెడ్డి వందమందికి పైగా పేదలను గుర్తించి శీతాకాలం నేపథ్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందుకోసం కమ్మవారిపల్లి రహదారిలో ఉన్న ఆయన ఇంటిలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసగుప్తా, లక్ష్మీనరసు, మాజీ సర్పంచి వాసునాయక్, అంజనరెడ్డి, నాయవాది తిప్పానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బోర్లకు అమర్చిన తీగల చోరీ

**మడకశిర, న్యూస్‌టుడే :** నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లి గ్రామంలో రాత్రి వేళల్లో బోర్లకు అమర్చిన కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసుకుని వెళ్తున్నారని రైతులు వాపోతున్నారు. నరసంహిప్ప 100మీ, లక్ష్మీనారాయణరెడ్డి 30, రవీంద్రారెడ్డి 2మీటర్లు తీగలను శనివారం రాత్రి కత్తిరించి తీసుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బసవ పున్నయ్యకు ఘన నివాళి

పున్నయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

**సోమందేపల్లి, న్యూస్‌టుడే:** సామ్యవాద, అభ్యుదయ భావాలతో పేదల సమస్యలపైన, స్వాతంత్ర్యం పోరాటంలోనూ పాల్గొన్న గొప్ప సీపీఎం నేత బసవ పున్నయ్య అని ఆపార్టీ నాయకులు పెద్దన్న, వెంకటేశులు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, గోవిందప్ప కొనియాడారు. ఆయన జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నివాళి అర్పించారు. నాగరాజు, హనుమక్క, కిష్టప్ప తదితరులు ఈవేడుకల్లో పాల్గొన్నారు.

## దుకాణాన్ని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

**తూముకుంట నుంచి కార్మికులను తీసుకొస్తుండగా ఘటన**

ప్రమాద ఘటనలో ప్రైవేట్ బస్సు

**హిందూపురం, న్యూస్‌టుడే:** తూముకుంట పారిశ్రామికవాడ నుంచి ఆదివారం ఉదయం 35 మంది కార్మికులను పట్టణానికి తీసుకొస్తున్న ఓ ప్రైవేట్ బస్ అతివేగంగా వచ్చి రామదేవాలయం సమీపంలోని సెల్ దుకాణాన్ని ఢీకొట్టింది. ఉదయం 6:30 గంటల ప్రాంతంలో దుకాణాన్ని తెరవక పోవటం, ఎప్పుడూ రద్దీగా ఉన్న ఈ రహదారిలో ఎలాంటి వాహనాలు రాకపోకలు లేనందున ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ప్రమాదంలో దుకాణం గోడకూలి బస్సు అద్దాలు పగిలి పోయాయని స్థానికులు తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నీటి వృథాను అరికట్టరూ..

చెరుకూరులోని ప్రధాన రహదారి పక్కనే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయికి బిరడా లేక నీరు వృథాగా పోతోంది. కొంత కాలంగా ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. మరమ్మతులు చేపట్టి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రమేశ్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడుతామన్నారు. **-న్యూస్‌టుడే, రొద్దం**

## పాఠశాల ఆవరణ అపరిశుభ్రం

గొల్లమారనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఇటుకలు రాసి చెత్త, చెదారం ఉండటంతో అపరిశుభ్రంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద అదనపు గది నిర్మాణానికి ఇటుకలు తెచ్చి వేశారు. భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో విషపు పురుగులు సంచరిస్తున్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎంపీడీవో రామారావు వివరణ కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిశుభ్రం చేయిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

## ట్యాంకుకు నీరు నింపండి

దిన్నేహట్టిలో నీటి ట్యాంకు నిరుపయోగంగా ఉంది. విద్యుత్తు ఉన్న సమయంలో మాత్రమే కుళాయిల్లో నీరు సరఫరా అవుతోందని, మిగతా సమయాల్లో తాగునీటికి ఇబ్బందులు పడతామని గ్రామప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ట్యాంకుకు నీరునింపి సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సర్పంచి అశ్వర్థ మాట్లాడుతూ తాగునీటి నింపి సరఫరా చేస్తామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

## తొలగని చెత్త.. దుర్వాసనే అంతా

కొడికొండకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెత్త, చెదారం దుర్వాసన వస్తోంది. బెంగళూరు ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న దుకాణదారులు అక్కడ చెత్తను వేస్తున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి నాగేంద్రను వివరణ కోరగా పంచాయతీ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తామన్నారు. దుకాణదారులు అక్కడ చెత్తను వేయకుండా చూస్తామన్నారు. **-న్యూస్‌టుడే, చిలమత్తూరు**

## వృద్ధుడి ఆత్మహత్య

**రొద్దం, న్యూస్‌టుడే :** మండలంలోని లక్సానిపల్లికి చెందిన నారాయణప్ప(79) ఏడాది నుంచి అనారోగ్యంతో మంచానపడ్డాడు. బంధువులు చికిత్సలు చేయించినా నయం కాలేదు.. ఈమేరకు మనస్తాపంతో శుక్రవారం రాత్రి ఇంటి పక్కనే ఉన్న పెట్రోల్ బాటిల్ తీసుకుని ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు, బంధువులు గుర్తించి వెంటనే పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినా కోలుకోలే శనివారం మృతిచెందాడు. అతడి మనువరాలు వందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగేంద్ర తెలిపారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

**లేపాక్షి, న్యూస్‌టుడే:** మండలంలోని మల్లిరెడ్డిపల్లి మలుపులో ఆదివారం ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సును ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. హిందూపురం నుంచి చెక్‌పోస్టుకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా లేపాక్షి నుంచి అతివేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం మల్లిరెడ్డిపల్లి మలుపులో బస్సు వెనుక చక్రానికి ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న పూలకుంటకు చెందిన పవన్‌తో పాటు మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# సామాజిక సేవ.. ఆధ్యాత్మిక తోవ

☛ ఆదర్శంగా మారెమ్మ ఆలయ కమిటీ

ఆలయం, భోజనశాల

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్లలోని నాలుగు రోడ్ల కూడలిలోని గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన మారెమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సుమారు 16 ఏళ్లుగా సామాజిక, ఆధ్యాత్మిక రంగాల్లో ప్రజలు, భక్తులకు సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 2010లో ఆలయ కమిటీ ఏర్పడి ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

**కమిటీ ఆధ్వర్యంలో సాగిస్తున్న కార్యక్రమాలు**

- ఆలయ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన శంకర 12 సెంట్ల స్థలం ఉచితంగా ఇచ్చారు.
- మూడేళ్లుగా కంటి, గుండెకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ
- ప్రతి శుక్రవారం పుట్టపర్తికి చెందిన భక్తుల ఆధ్వర్యంలో సాధారణ వైద్య శిబిరం కొనసాగింపు
- ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు నారాయణ సేవ
- ఇటీవల 20 ఆవులతో గోశాల ఏర్పాటు. వాటి నిర్వహణ కోసం రెండెకరాల పొలాన్ని కొనుగోలు చేశారు.
- ఆలయానికి సమీపంలో ప్రభుత్వం 12 సెంట్ల స్థలం ఇచ్చింది. అక్కడ అనాథ శరణాలయం ఏర్పాటుకు భవన నిర్మాణం జరుగుతోంది
- ప్రతిఏటా వరమహాలక్ష్మి వ్రతాన్ని మహిళలు సామూహికంగా నిర్వహణకు ఏర్పాట్లు, ఉగాదికి గ్రామోత్సవం
- ఏడాదికి రెండుమూడు సార్లు పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు వస్త్రాల పంపిణీ చేస్తున్నారు.

**అమ్మవారిపై నమ్మకం పెరిగింది**



ఇక్కడ జరుగుతున్న కార్యక్రమాలతో పాటు అమ్మవారిపై భక్తి, నమ్మకం పెరిగాయి. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. వారానికి రెండు రోజులు ఎంతమంది భక్తులు వచ్చినా భోజన వసతి కల్పిస్తున్నాం. ఆలయ అభివృద్ధికి కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు బాగా ఇస్తున్నారు. దీంతో ప్రతి కార్యక్రమం ఎంతో వేడుకగా భక్తిశ్రద్ధలతో చేయగల్గుతున్నాం. **-దేవీస్వామి, ఆలయ పూజారి**

## 'హిందూ సమాజ నిర్మాణానికి ఏకమవ్వాలి'

ప్రసంగిస్తున్న దత్తానందగిరి స్వామి, హాజరైన రాష్ట్ర ఆర్‌ఎస్ఎస్ ప్రముఖ్ తిరుపతయ్య తదితరులు

**పరిగి, న్యూస్‌టుడే:** భారత దేశంలో హిందూ సమాజ నిర్మాణం కోసం హిందువులంతా ఏకం అవ్వాలని, కులాలకు అతీతంగా హిందుత్వ భావన ప్రతి ఒక్కరిలోనూ రావాలని కోనకన్వాశ్రమం దత్తానందగిరిస్వామి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) గ్రామీణ సేవా వికాస్ ప్రముఖ్ తిరుపతయ్యలు పిలుపు నిచ్చారు. ఆదివారం పరిగిలో హిందూసమ్మేళన సమితి గౌరవాధ్యక్షుడు పరిగి వేణుగోపాలరావు అధ్యక్షతన హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందువులు సనాతనులని దేశ రక్షణ కోసం హిందువులంతా సంఘటితమై కృషి చేయాలని పిలుపు నిచ్చారు. విద్యానిధి జూనియర్ కళాశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు, కుమారి సుష్మిత నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆహుతులను అలరించాయి. ఇండియన్ డిజైన్ వస్త్ర పరిశ్రమ ప్రొడెక్షన్ మేనేజర్ సుజాత, భాజపా మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఆర్ఎస్ఎస్ సంఘ్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

☛ ఒక్కగానొక్క కుమారుడి మృతితో విషాదఛాయలు

**గోరంట్ల, న్యూస్‌టుడే:** గోరంట్లలోని మార్కెట్‌యార్డు సమీపంలో శనివారం రాత్రి ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన శిరగంవాండ్లపల్లికి చెందిన అశోక్ కుమార్ బెంగళూరులో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. గ్రామానికి చెందిన శివప్ప, రామలక్ష్మమ్మ దంపతుల ఏకైక కుమారుడు అశోక్ చిన్నవయస్సులోనే ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య రాణి, ముగ్గురు కుమారులు సాకేత్, కర్నల్, కమల్‌దీప్ ఉన్నారు. పిల్లలు ముగ్గురు ఏడేళ్ల వయస్సులోపు వారే. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

## బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం

పట్టణంలోని నిజాంవలి కాలనీలో వీధి కుక్కల దాడిలో గాయపడి సగం చెవిని కోల్పోయిన బాలుడు యాసిన్ వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ మొత్తాన్ని తెదేపా పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, నాయకులు హైదర్‌వలి, జావెద్, షఫీ, టోపీవలి, షాన్‌వాజ్ ఆసుపత్రికి వెళ్లి బాలుడి తల్లిదండ్రులు షాషిస్తా, అంజాద్‌వలికి అందజేశారు. -న్యూస్‌టుడే, కదిరి పట్టణం

## 17న తెదేపా నియోజకవర్గ స్థాయి సమావేశం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, న్యూస్‌టుడే:** తెదేపా నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం కదిరిలో మాట్లాడుతూ పీవీఆర్ ఫంక్షన్ హాలులో 17న ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. పలు కీలక అంశాలపై చర్చ జరుగుతుందని, పట్టణ, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ ఆలయంలో ముక్కోటి ఏకాదశిని కనులపండువగా జరిపేందుకు శక్తివంచన లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన మైనార్టీ షాదీ మహల్‌ను సందర్శించి మరమ్మతులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

### మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

**సమస్య:** చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లి నుంచి బ్రహ్మణపల్లి గ్రామానికి వెళ్లే మట్టిదారి పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలు గగనమయ్యాయి. దారి బాగుకు చర్యలు చేపట్టగలరు.
**- శివప్ప, స్థానికుడు**

**సమాధానం:** రోడ్డు పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.
**- అబ్దుల్ ఖాదర్, పీఆర్, మండల ఇన్‌ఛార్జి ఏఈ**

**సమస్య:** చెన్నేకొత్తపల్లి కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ పాఠశాలల్లో కోతుల బెడద అధికమైంది. విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.
**- ఆదర్శ పాఠశాల, కస్తూర్బా విద్యాలయ విద్యార్థులు**

**సమాధానం:** సమస్యను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.
**- మారుతి ప్రసాద్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

**సమస్య:** మండలంలోని తగరకుంట రహదారికి ఆనుకొని నీటి ట్యాంకుతో పాటు నీటి నిల్వ కోసం తొట్టెను నిర్మించారు. రెండు నిరుపయోగంగా మారడంతో నీరు నిల్వ లేక ఖాళీగా ఉన్నాయి.
**- రాజేకుమార్, స్థానికుడు.**

**సమాధానం:** నిరుపయోగంగా మారిన వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం.
**- మనోహర్, పంచాయతీ కార్యదర్శి**

**సమస్య:** మండలంలోని బాలేపాళ్యంలో రహదారికి ఆనుకొని ప్రభుత్వ పాఠశాల ఉంది. పాఠశాల సమీపంలో తీవ్ర మలుపు ఉండటం వల్ల వాహనాల వేగానికి కళ్లెం వేయాలి. విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు జరిగే ప్రమాదముంది.
**- పెద్దిరెడ్డి,స్థానికుడు.**

**సమాధానం:** మలుపు వద్ద వేగనియంత్రికలు ఏర్పాటు చేస్తాం. **- కరుణాకర్,పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, కనగానపల్లి

# పాడి.. బతుకుబాటకు దారి

### పాల సేకరణ కేంద్రం నిర్వహిస్తున్నాం

అరెకరం సొంత భూమితో పాటు కౌలుకు తీసుకుని పంటలు వేసి తీవ్రంగా నష్టపోయా. కనీసం పెట్టుబడులు రాక అప్పులు మిగిలాయి. నేను, నా భార్య కూలీలుగా మారాం. బాగా ఆలోచించి నాలుగు ఆవులు కొనుగోలు చేశా. అరెకరంలో సాగు చేసిన పచ్చగడ్డి మేతగా వేస్తున్నా. రోజువారీ 20 నుంచి 40 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతోంది. వచ్చే ఆదాయంతో పిల్లలను ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నా. మరోవైపు గ్రామంలో పాల సేకరణ కేంద్రం నిర్వహిస్తున్నా. రోజూ 200 లీటర్ల పాలను శీతలీకరణ కేంద్రానికి పంపుతున్నాం. వచ్చే కమీషన్‌తో కొంత ఆదాయం వస్తోంది. **- నరసింహులు, పాడిరైతు, ఇరంగంపల్లి**

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** ఆరుగాలం కష్టపడి సాగుచేసి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలందక నష్టపోతున్న అన్నదాతలు పాడి వైపు దృష్టి సారించారు. రెండు నుంచి నాలుగైదు పాడి పశువులను కొనుగోలు చేసి ఆదాయ బాట పడుతున్నారు. అధిక పాలు ఇచ్చే సంకర జాతి పశువుల పోషణకు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఏడాది పొడవునా రోజువారీ ఆదాయం చేతికందుతోంది. పంటలతో పోలిస్తే పాడి లాభసాటిగా ఉందని అంటున్నారు. తమ పిల్లల చదువుతో పాటు కుటుంబాల జీవనోపాధికి పాడి దన్నుగా నిలుస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

### పంటలకు ప్రత్యామ్నాయం

కొన్నేళ్ల పాటు కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసి నష్టపోయాం. కుటుంబం గడవడం ఇబ్బందిగా మారింది. గత్యంతరం లేక భర్తతో కలిసి కూలీ పనులకు వెళ్లాం. పంటలకన్నా పాడి మేలని భావించాం. కొంత అప్పుచేసి నాలుగు ముర్రా గేదెలు కొన్నాం. ప్రస్తుతం కౌలు భూమిలోనే గడ్డి సాగుచేశాం. రోజూ రెండు పూటలా 10 నుంచి 20 లీటర్ల వరకు పాలు వస్తున్నాయి. గేదె పాలు కావడంతో మంచి ధర పలుకుతోంది. ఉన్నత చదువు పూర్తి చేసిన కుమారుడు ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకున్నాం. రోజువారీ ఆదాయంతో మెరుగైన జీవనం సాగిస్తున్నాం. **- రమణమ్మ, కొత్తచెరువు**

## రసవత్తరంగా ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు

కొత్తచెరువు: పోటీకి సిద్ధమైన ఉపాధ్యాయ క్రీడాకారులు

**కదిరి:** ప్రభుత్వ ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో తనకల్లు, ఎన్పీకుంట మండలాల జట్లు ఫైనల్స్‌కే చేరినట్లు పీడీలు హరిప్రసాద్, రెడ్డెప్ప తెలిపారు. కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సెమీఫైనల్స్ పోటీలు జరిగాయి. తనకల్లు నిర్ణీత 15 ఓవర్లలో 186 పరుగులు చేసింది. ఛేదనలో అమడగూరు జట్టు 84 పరుగులకే ఆలౌటై ఓడింది. మరో మ్యాచ్‌లో కదిరి జట్టుపై ఎన్పీకుంట జట్టు గెలిచింది.

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో బుక్కపట్నం, గోరంట్ల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నట్లు పీడీలు వెంకటేశ్, రామకృష్ణ తెలిపారు. ఉదయం జరిగిన మ్యాచ్‌లో ఓడీసీ జట్టుపై బుక్కపట్నం, మధ్యాహ్నం పుట్టపర్తిపై గోరంట్ల జట్లు గెలిచాయి. సోమవారం బుక్కపట్నం, గోరంట్ల జట్లు ఫైనల్స్‌లో తలపడతాయని పీడీలు వెల్లడించారు.

## ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

మాట్లాడుతున్న శ్రీనివాసులు

**కొత్తచెరువు, న్యూస్‌టుడే:** విద్యాహక్కు చట్టం అమల్లోకి రాకముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం కొత్తచెరువులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ఆంధ్రప్రదేశ్ అధికారులు సుప్రీంకోర్టు తీర్పు పేరుతో టెట్ రాయాలని నిర్బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని కోరారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్.చంద్ర మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికలో సెలవు రోజులను మినహాయించి వారిపై ఒత్తిడి తగ్గించాలని కోరారు. పురపాలిక ఉన్నత పాఠశాలల్లో కొరతగా ఉన్న తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు పీవీ మాధవ, రాష్ట్ర నాయకులు ముత్యాలప్ప, రవీంద్రారెడ్డి, బలరాముడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌తో విద్యార్థినులకు భద్రత

అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం సభ్యుడు

**కదిరి, న్యూస్‌టుడే:** శక్తి యాప్‌తో విద్యార్థినులు భద్రత పొందవచ్చని శక్తి బృందం సభ్యులు చలపతి, షౌకత్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం శక్తి యాప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శక్తి బృందం సభ్యులు మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఆపదలు ఎదురైన సమయాల్లో 100, 112, 181, 101, 1930, 1098 నంబర్లకు ఫోన్ చేసి సాయం పొందవచ్చన్నారు. ప్రతి అమ్మాయి వద్ద ఈ ఫోన్ నంబర్లు ఉండాలని, శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

క్రీడాకారులను సత్కరించిన తెదేపా నాయకులు

**బుక్కపట్నం, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తగు ప్రోత్సాహం అందిస్తే కచ్చితంగా ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెదేపా హిందూపురం పార్లమెంటు కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాల క్రీడాకారుడు మురళి ఎస్కేయూ తరఫున సౌత్‌జోన్ వాలీబాల్, కొత్తచెరువుకు చెందిన హాకీ క్రీడాకారుడు నవదీప్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు పీడీ వెంకటేశ్‌ను ఆదివారం బుక్కపట్నంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు శ్రీనివాసులు, నాయకులు చెన్నకేశవులు, మంజునాథ్, ఈశ్వరయ్య, ఉపాధ్యాయుడు తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## కలిశారు.. జ్ఞాపకాలు పంచుకున్నారు

బత్తలపల్లిలో పూర్వ విద్యార్థుల సందడి

**బత్తలపల్లి, న్యూస్‌టుడే:** మండలంలోని నల్లబోయనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1997-98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం జరుపుకొన్నారు. అందరూ కలిసి 27 ఏళ్లనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.

**తనకల్లు, న్యూస్‌టుడే:** తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97 ఏడాది పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. తాము చదువుకున్న తరగతి గదుల్లోని బెంచీలపై కూర్చొని ఆనాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులతో కలిసి సందడి చేశారు. అనంతరం విందు ఆరగించారు. గురువులను సత్కరించి వారి ఆశీర్వాదం పొందారు.

## పూర్వ విద్యార్థుల ఔదార్యం

**కదిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని కుటాగుళ్ల పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పూర్వ విద్యార్థులు తీర్చారు. 1991లో పదో తరగతి చదివిన విద్యార్థులు నాగరాజు, భీమయ్య, గంగయ్య, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, నగేష్ కలిసి ఆదివారం పాఠశాలలో బోరు వేయించడంతో నీటి సమస్య తీరింది. ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** మండలంలోని ఎనుములవారిపల్లిలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అయ్యప్ప మూలవిరాట్‌కు వివిధరకాల అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి వాహనంలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మాలధారులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**ధర్మవరం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డా.అబీద్ హాజరైన 110 మందికి నేత్ర పరీక్షలు జరిపారు. వీరిలో 75 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగభూషణ తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు దాత రామిరెడ్డిని సన్మానించారు. రోటరీక్లబ్ ప్రతినిధులు నరేంద్రరెడ్డి, ప్రసన్నకుమార్, రమేష్‌బాబు, శ్రీనివాస్, జయసింహ, శివయ్య, సుదర్శనగుప్త ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## అనాథలు, వృద్ధులకు దుప్పట్ల అందజేత

ధర్మవరం: రైల్వేస్టేషన్‌లో దుప్పట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

**ధర్మవరం, న్యూస్‌టుడే:** పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ఆరుబయట చలికి ఇబ్బందులు పడుతున్న అనాథలకు ఆదివారం రాత్రి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. చలి తీవ్రత పెరగడంతో రహదారుల పక్కన, రైల్వే స్టేషన్ వద్ద ఇబ్బందులు పడుతుండటం గమనించిన దాతలు అశ్వర్థనారాయణ, రాజశేఖర్, శ్రీనివాసులు, చంద్ర, రెడ్డెప్ప సహకారంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి సభ్యులు తెలిపారు.

**కదిరి, న్యూస్‌టుడే:** పట్టణంలోని నిరాశ్రయులైన వృద్ధులకు శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ మోమిన్ సలీంబాషా దుప్పట్లు పంపిణీ చేశారు. చలి విపరీతంగా పెరిగిన నేపథ్యంలో బస్టాండు, ఆలయాలు, సత్రాలు, దర్గా తదితర ప్రాంతాల్లో వణుకుతున్న దాదాపు 70 మంది వృద్ధులకు దుప్పట్లు పంచినట్లు సలీంబాషా తెలిపారు.

### తహసీల్దారు సారూ.. ఇటు చూడండి

తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే సీసీ రోడ్డును పిచ్చిమొక్కలు కమ్ముకున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్దే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఎలాగుంటుందో అంచనా వేయవచ్చని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇకనైనా మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్పందించి వెంటనే ఆ మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, గాండ్లపెంట

### చేతిపంపును పట్టించుకోండి

మండలంలోని వెలిచెలమల మూడు రోడ్ల కూడలిలో ఉన్న చేతిపంపునకు మరమ్మతులు చేయించి వినియోగంలో తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. వివిధ పనుల కోసం తలుపుల, కదిరి, ఎన్పీకుంటకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఇక్కడే వేచిఉంటారు. వారి దాహార్తి తీర్చడానికి బోరు అవసరం. దీనిపై పంచాయతీ కార్యదర్శి అలీ మాట్లాడుతూ చేతిపంపును బాగు చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామన్నారు.
–న్యూస్‌టుడే, నంబులపూలకుంట

### అర కిలోమీటరు.. 60 గుంతలు

బుక్కపట్నం సమీప బైపాస్ రహదారిపై పడిన గుంతలతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బుక్కపట్నం నుంచి ముదిగుబ్బకు వెళ్లే రోడ్డులో అర కిలోమీటరు మేర 60 గుంతలు పడ్డాయని, ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ వన్నూరుస్వామి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి గుంతలను పూడ్చుతామని తెలిపారు. –న్యూస్‌టుడే, బుక్కపట్నం

### రైల్వే వంతెన కింద ఎన్నాళ్లీ తిప్పలు?

పట్టణంలోని గాంధీనగర్ రైల్వే కింది వంతెన రోడ్డుపై ఊటనీరు చేరి భరించలేని దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు, పాదచారులు తిప్పలు పడుతున్నారు. పట్టణం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే ఈ మార్గమే దిక్కు. ఇకనైనా పురపాలక, రైల్వే అధికారులు స్పందించి వంతెన మార్గంలో ఊటనీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ధర్మవరం

### నిరుపయోగంగా నీటి ట్యాంకు

నల్లమాడ మండలం సోమగుట్టపల్లిలో నిర్మించిన తాగునీటి మినీ ట్యాంకు నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం రూ.వేలు వెచ్చించి నిర్మించిన ఈ ట్యాంకును వినియోగంలోకి తెస్తే నీటి కష్టాలు కొంతైనా తీరుతాయని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. -న్యూస్‌టుడే, నల్లమాడ

## బాధిత కుటుంబాలకు చేయూత

**నల్లమాడ, న్యూస్‌టుడే:** నల్లమాడలో అక్టోబరు మాసంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు అరుణ్‌కుమార్, లక్ష్మణసాయి మృతి చెందారు. వారి కుటుంబాలకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అబ్బు చెరో 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఏ సమస్య వచ్చిన తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ మహేష్, నాయకులు వంశీ, పవన్‌కల్యాణ్ తదితురులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చిన యువకులు

**నంబులపూలకుంట, న్యూస్‌టుడే:** మండలంలోని పుల్లగూరవాండ్లపల్లి-పెదరాంపల్లి మట్టిరోడ్డుపై పడిన గుంతలను ఆదివారం యువకులు శ్రమదానం చేసి పూడ్చారు. ఈ మార్గంలో పలువురు ద్విచక్ర వాహనచోదకులు గుంతల్లో పడి గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాటిమానుగుంత గ్రామ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పలుగు, పార చేతబట్టి మట్టి వేసి గుంతలను పూడ్చారు.

## అనుచిత పోస్టులపై చర్యలకు డిమాండ్

**కదిరి పట్టణం, న్యూస్‌టుడే:** జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవమానించేలా సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం కదిరి గ్రామీణ సీఐ నాగేంద్రను కోరారు. గాండ్లపెంట మండలం చామాలగొండికి చెందిన హరినాయుడు, మరికొందరు తమ అధినేతపై అసభ్య పదజాలంతో ఫేస్‌బుక్‌లో పోస్టులు చేశారని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ జనసేన ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ సీఐకు వినతిపత్రం అందజేశారు.

## రేపటి నుంచి తలుపులలో ఉరుసు

**తలుపుల, న్యూస్‌టుడే:** తలుపుల ఎగవపేటలో హజరత్ షహామీరీ ఔలియా ఉరుసు, హజరత్ సయ్యద్ షాహ్‌ఖాదిర్ అలీ పాషా షహామీరీ 22వ గంధం 16న జరుగుతుందని దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షహమీర్ ఖాదరీ తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం నమాజులు, సాయంత్రం 4.50 గంటలకు తలుపుల ప్రధాన వీధుల గుండా గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అదేరోజు రాత్రి 10 గంటలకు పీఠాదిపతి రచించిన షుక్ర్ పుస్తకావిష్కరణ, కవి సమ్మేళనం తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

## సాహితీవేత్తను కోల్పోవడం బాధాకరం

**హిందూపురం:** ప్రముఖ కవి, సాహితీవేత్త గాయత్రి వేద మంత్రాధ్యయన కేంద్రం అధ్యక్షుడు కొడిమడుగు నాగేశ్వరశాస్త్రిని కోల్పోవటం బాధాకరమని పలువురు రచయితలు, కవులు అన్నారు. అనారోగ్యంతో రెండు రోజుల కిందట బెంగళూరులోని ఆసుపత్రిలో తుదిశ్వాస వదిలిన కొడిమడుగు నాగేశ్వరశాస్త్రికి ఆదివారం గాయత్రి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జి.రంగారావు, బ్రాహ్మణసేవా ట్రస్ట్ కార్యదర్శి జేవీ ప్రసాద్, సంస్కృత పండితులు సత్యనారాయణశాస్త్రి తదితరులు నివాళులర్పించారు.

## నిరుపయోగంగా వ్యవసాయ గోదాములు

కనగానపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి పదేళ్ల కిందట అప్పటి మంత్రి పరిటాల సునీత ఒక్కో గోదాముకు రూ.50 లక్షల చొప్పున రెండు వ్యవసాయ గోదాములు రూ.1 కోటి నిధులు కేటాయించడంతో సకాలంలో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గోదాములు వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. గోదాముల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి కళావిహీనంగా మారింది. ఎంపీడీఓ అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా...గోదాముల స్థితిగతులను పరిశీలించి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కనగానపల్లి**

## సామాజిక మాధ్యమాల్లో పోస్టుపై ఫిర్యాదు

**నల్లచెరువు, న్యూస్‌టుడే:** మండలంలోని దేవరెడ్డిపల్లికి చెందిన యువకుడు సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. దేవరెడ్డిపల్లికి చెందిన ధనుంజయ అనే యువకుడు కొన్నేళ్ల క్రితం ముస్లిం మతంలోకి మారాడు. తన పేరును షేక్ మహమ్మద్ హాషీఫ్‌గా మార్చుకున్నాడు. ఇటీవల సామాజిక మాధ్యమంలో 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూ పోస్ట్ పెట్టాడు. ఇది వైరల్‌గా మారడంతో మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు ధనుంజయ హిందువుల మనోభావాలు కించపరిచేలా పోస్టులు పెడుతున్నాడని, అతడిపై చట్టపర చర్యలు తీసుకోవాలంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రమణకు ఫిర్యాదు చేశారు.

# కూలీల ప్రాణాలు గాలిలో..

రైల్వే గుత్తేదారుల నిర్లక్ష్యం.. కూలీల ప్రాణాలకు ముప్పుగా మారింది. చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్, యర్రంపల్లి, దామాజిపల్లి తదితర సమీప ప్రదేశాల్లో నూతన రైల్వే ట్రాక్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు నిర్వహించేందుకు గుత్తేదారులు ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి 150 మంది కూలీలను సమకూర్చుకున్నారు. వారు చెన్నేకొత్తపల్లి, కోన క్రాస్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారు. అక్కడి నుంచి పనులు చేసే చోటికి 4 టిప్పర్ లారీలలో నిత్యం ప్రమాదకరంగా తరలిస్తున్నారు. సాయంత్రం పని ముగిసిన తరువాత తిరిగి కూలీలను వారి గుడిసెల వద్దకు ఇదే లారీల్లో చేరుస్తున్నారు. వాహనం ఏమాత్రం కుదుపులకు గురైనా లారీల వెనుక భాగంలో ఏ ఆపు లేకుండా కూర్చున్న కూలీలు కిందపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. **– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**

## ప్రమాదంలో మహిళ దుర్మరణం

**ధర్మవరం, న్యూస్‌టుడే:** ధర్మవరం మండలం తుంపర్తి కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లీశ్వరమ్మ (53) అనే మహిళ మృతి చెందింది. గ్రామీణ పోలీసులు తెలిపిన మేరకు.. తుంపర్తి కాలనీకి చెందిన శివ, తన తల్లి మల్లీశ్వరమ్మతో కలసి ద్విచక్రవాహనంలో ధర్మవరం పట్టణానికి బయలుదేరారు. ప్రధాన రహదారిపైకి చేరుకోగానే కొత్తచెరువు నుంచి ధర్మవరం వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మల్లీశ్వరమ్మ అక్కడికక్కడే చనిపోగా, శివకు పెద్ద దెబ్బలు తగిలాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మల్లీశ్వరమ్మ మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.




(c) eenadu

## ప్రమాదం జరిగితే బాధ్యులెవరు.?

మూలపేట పోర్టుకు రాళ్లు తీసుకెళ్తున్న వాహనాలపై పరదాలు కప్పకుండా, రక్షణ చర్యలు తీసుకోకుండా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తూ ఆదివారం రాత్రి కోటబొమ్మాళి ప్రధాన రహదారి మీదుగా వెళ్తున్న టిప్పర్‌ను అడ్డుకున్నారు. ఈ విషయమై ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాకపోవడంతో ఆ వాహనాన్ని స్టేషన్‌కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా స్థానికులు అదే మాదిరిగా వెళ్తున్న మరో వాహనాన్ని అడ్డుకున్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

## రాష్ట్ర స్థాయి పెంటాథ్లాన్ పోటీల్లో సత్తా

పరుగు పోటీని ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘ జిల్లా సలహాదారు సుందరరావు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నిర్వహించిన మోడ్రన్ పెంటాథ్లాన్ రాష్ట్ర స్థాయి పోటీలు ముగిశాయి. ఆదివారం పరుగు పందెం, ఈత పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. కోడిరామ్మూర్తి క్రీడామైదానంలో పోటీలను జిల్లా ఒలింపిక్ సంఘ సలహాదారు పి.సుందరరావు జెండా ఊపి ప్రారంభించారు. అండర్-17 బాలుర విభాగంలో జిల్లా క్రీడాకారులు కె.వాసుదేవరావు, కె.మహేశ్, జి.రమేశ్, బాలికల విభాగంలో ఎ.సంతోషిణి (శ్రీకాకుళం), బి.సాన్విత (కర్నూలు), జి.కావ్య (శ్రీకాకుళం) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-19లో జిల్లాకు చెందిన కె.కార్తీక్, బి.ఉదయ్‌కుమార్, జి.ఉదయ్‌కుమార్, బాలికల్లో ఎన్.శ్రీవాణి, జి.జ్యోతిక ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారిణి కె.కల్యాణి మూడో స్థానం దక్కించుకుంది. ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి బి.సాంబమూర్తి, జిల్లా వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పి.తవిటయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిచెన్ సెంటర్లు వద్దు

ప్రసంగిస్తున్న సంఘ గౌరవాధ్యక్షురాలు మహాలక్ష్మి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలని యూనియన్ గౌరవాధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఉత్తర డిమాండు చేశారు. శ్రీకాకుళం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్మార్ట్ కిచెన్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. వంట బిల్లులు, గౌరవ వేతనం సకాలంలో చెల్లించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రవీణ, కన్యాకుమారి, జయలక్ష్మి, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## భారం మోయలేం.. కష్టం కోయలేం..!

న్యూస్‌టుడే, నరసన్నపేట

### రైతుల్ని ఆదుకోని యంత్రాలు

వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవడంతో అన్నదాతలపై ఆర్థిక భారం అధికమవుతోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి నాట్ల నుంచి పంటను ఇంటికి చేర్చే వరకు వ్యయం గణనీయంగా పెరిగింది. ఎకరా విస్తీర్ణంలో కోతలు, నూర్పిళ్లకు రూ.5 వేల వరకు అదనంగా ఖర్చు చేశారు. గత నెలలో తుపాను ప్రభావంతో కోతలు వాయిదా పడి కాస్త జాప్యం కాగా.. ఇదే అదనుగా యంత్రాల నిర్వాహకులు కోతలు, నూర్పిడి ఖర్చులు అమాంతం పెంచేశారు. తప్పని పరిస్థితుల్లో అన్నదాతలు అదనంగా వ్యయం చేశారు.

### ఉపాధికి దూరం

◆ యంత్రాల కారణంగా వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. వాటి సంఖ్య పెరిగిపోవడంతో జిల్లాలో సుమారు 5.7 లక్షల మంది పనులకు దూరమయ్యారు.

◆ వ్యవసాయ పనుల కారణంగా ఉపాధి హామీ పథకం వేతనదారులు ఖాళీగా ఉంటున్నారు. కోతలకు ఎక్కువగా యంత్రాలు వినియోగిస్తుండటంతో చాలా మంది ఇళ్లకే పరిమితమవుతున్నారు.

◆ చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పనులకు కొద్ది మంది కూలీలను పిలుస్తున్నారు.

### 70 శాతం కోతలు పూర్తి

■ ఖరీఫ్‌లో 4,15,479 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 70 శాతం మేర కోతలు పూర్తయ్యాయి.

■ వర్షాల కారణంగా వరి కోతలు వాయిదా పడ్డాయి. వాతావరణం అనుకూలించగానే ఒక్కసారిగా పనులకు ఉపక్రమించారు.

■ కోత, నూర్పిడి యంత్రాలకు గిరాకీ పెరగడంతో ధరలు మారిపోయాయి.

■ ఒకేసారి కోత, నూర్పిడి చేసే కంబైన్డ్ హార్వెస్టర్ల వైపు అందరూ మొగ్గు చూపడంతో డిమాండ్ పెరిగింది.

■ గతేడాది ఎకరా విస్తీర్ణంలో వరి కోతకు రూ.2,500 వరకు తీసుకోగా.. ప్రస్తుతం రూ.3,700 వరకు వసూలు చేస్తున్నారు.

■ వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 112 యంత్రాలున్నాయని అంచనా. చిన్న యంత్రాలు 600 వరకు ఉంటాయని సమాచారం.

■ సుమారు 65 శాతం మేర యంత్రాలతోనే రైతులు వరి కోతలు చేయిస్తున్నారు. దీని ప్రకారం రైతులపై రూ.26.50 కోట్ల మేర అదనపు భారం పడింది.

### రూ.వెయ్యికి పైగా అదనంగా ఖర్చు

యంత్రాలు అందుబాటులోకి వచ్చినా సాగు ఖర్చు పెరిగిపోయింది. కోత యంత్రాల నిర్వాహకులు ధరలు భారీగా పెంచేశారు. గతేడాదితో పోల్చుకుంటే ఎకరానికి రూ.వెయ్యికి పైగా వ్యయం పెరిగింది.

-ఎస్.బాలరాజు, రైతు, నరసన్నపేట

## ఉద్యమ్ ఆధార్..!

### ఈ పత్రంతో వ్యాపారులకు బహుళ ప్రయోజనాలు



న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బ్యాంకు లావాదేవీలు, సిమ్ కార్డు తీసుకోవాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. పౌరుల అవసరాలకు ఇది ఎంతో కీలకం. ఇదే విధానంలో చిరు వ్యాపారులు, కుటీర పరిశ్రమల స్థాపకులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు పత్రమే ఉద్యమ్ ఆధార్.

◆ కొత్త వ్యాపారులు, ఇప్పటికే ఈ రంగంలో ఉన్న వారికి మరింత అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్ల కిందట ఉద్యమ్ ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. అందరికీ అవగాహన కల్పించి.. ఆసక్తి ఉన్న వారికి రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందజేస్తున్నారు. జిల్లాలో సుమారు 6,500 కార్డులు జారీ చేశామని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు.

◆ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలు చేసుకునే వారికి ఈ ధ్రువపత్రాన్ని అందజేస్తారు. ఇందులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు పూర్తిగా వస్తాయి. వ్యాపార నిర్వహణలో బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు తీసుకోవడానికి ఈ కార్డు ఉపయోగపడుతుంది. రాయితీ రుణాలు త్వరగా పొందొచ్చు.

### కార్డు పొందడం ఇలా..

ఈ కార్డు అవసరమైన వారు వెలుగు కార్యాలయం, సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి. పాన్, ఆధార్, దీంతో అనుసంధానమైన సెల్‌ఫోన్ తీసుకెళ్లాలి. మీసేవ కేంద్రంలో నిర్ణీత రుసుం చెల్లిస్తే దరఖాస్తు చేస్తారు.

◆ ప్రతి సమావేశంలో ఉద్యమ్ కార్డుతో ప్రయోజనాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని ఏపీఎం ఎస్.ప్రసాదరావు తెలిపారు. పొదుపు సంఘాల ద్వారా వ్యాపారం చేసే వారి వివరాలు తీసుకుంటున్నామని చెప్పారు.

## సోంపేటలో భూదందా..!

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేటలో నివాస ప్రాంతాలకు చేరువలో ఉన్న పలు చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారుల సహకారంతో సిబ్బంది దస్త్రాల్లో మార్పులు చేసి కొత్తగా సబ్ డివిజన్ ఏర్పాటు చేసి అడంగల్‌లో పేర్లు నమోదు చేస్తున్నారు. 10 చెరువుల భూములు ఇళ్ల స్థలాలుగా అభివృద్ధి చేయడానికి అనువుగా ఉండటంతో కొందరు చాకచక్యంగా సొంతం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల పక్కా నిర్మాణాలు వెలిశాయి. కాలువల ఆక్రమణలతో వరద నీరు వెళ్లడానికి అవకాశం లేక పలు వీధులు ముంపు బారిన పడుతుండగా ప్రధాన రహదారులు దెబ్బతింటున్నాయి.

జెన్నాగాయి చెరువులో ఆక్రమణలు గుర్తిస్తున్న రెవెన్యూ అధికారులు

### ఇళ్ల స్థలాలుగా మారుతున్న చెరువులు

★ జలంత్ర సోంపేటకు సంబంధించి సర్వే నంబరు 242లో 15.76 ఎకరాల్లో ఉన్న రామసాగర్ 2 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. ఆయకట్టు భూములకు సాగునీరందడం లేదు. తాగునీటి నిల్వకు అవకాశం లేని పరిస్థితి నెలకొంది.

★ ఆక్రమణలకు సంబంధించి అధికార పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఉల్లంఘనలు గుర్తించినా కట్టడాలను తొలగించలేదు.

### ఇదీ పరిస్థితి

★ సోంపేటలో బిరుసువాడ సర్వే నంబరు 202లో జెన్నాగాయి చెరువు 5.38 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇళ్ల స్థలాలకు అనువుగా ఉన్న గర్భంలో 3 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. ఇళ్ల స్థలాలుగా మారడంతో ఆయకట్టు భూములకు సాగునీరందే పరిస్థితి లేదు. ఇక్కడి కాలువలు కూడా కబ్జా కోరల్లో చిక్కుకోవడంతో రూ.ఆరేడు కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైంది.

★ చీకటి సోంపేటకు సంబంధించి గొల్లవాని చెరువు సర్వే నంబరు 55-5లో 21.80 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గాంధీనగర్‌కు ఆనుకుని ఇళ్ల స్థలాలకు అనువుగా ఉండటంతో 4 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. మరో 3 ఎకరాలకు అడంగల్ చేయించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఎకరా రూ.3 కోట్లకు పైగానే పలుకుతోంది.

★ బిరుసువాడ, మొగలికొత్తూరు, చీకటి సోంపేట, జలంత్ర సోంపేట పరిధిలో కాలువలు పెద్దఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. లేఅవుట్లలో భాగంగా 10 ఎకరాలకు పైగా అన్యాక్రాంతం కావడంతో వరద నీరు రహదారుల మీదుగా పారుతోంది.

★ కవిటి రోడ్డులో ఎకరా రూ.4 కోట్ల వరకు పలుకుతుండగా ఇక్కడ పోలీసు చెరువుకు సంబంధించి ఎకరా విస్తీర్ణం మేర కాలువ స్థలం మాయమైంది. పక్కా భవనాలు నిర్మించడంతో వరద నీరు బీల ప్రాంతానికి వెళ్లే అవకాశం లేక రాజుగారి పేట, ఇతర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి.

**చర్యలు తీసుకుంటాం..:** సోంపేటలో చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన హద్దులను పరిశీలిస్తాం. సర్వేయర్, ఇతర అధికారులతో చర్చించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

- బి.అప్పలస్వామి, తహసీల్దారు, సోంపేట

## పొందూరు ఖాదీకి జీఐ ట్యాగ్ రావడం హర్షణీయం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: పొందూరు ఖాదీకి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ రావడం హర్షణీయమని మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు నాలుగేళ్లుగా శ్రమించారని పేర్కొన్నారు. ఆయన కృషి ప్రశంసనీయమని.. అందుకు తగిన విధంగా కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. జీఐ ట్యాగ్‌తో నకిలీలను నివారించొచ్చని పేర్కొన్నారు. నేతన్నలకు ఎంతో ఉపయుక్తమవుతుందని పేర్కొన్నారు.

## అందుబాటులో 2,102 మెట్రిక్ టన్నుల యూరియా

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటలకు 2,102 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయశాఖాధికారి త్రినాథస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా లభ్యమవుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆహారం నాణ్యంగా ఉందా..?

### అన్న క్యాంటీన్ల పర్యవేక్షణకు సలహా కమిటీల నియామకం

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

పేదల ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లలో ఆహారం మరింత నాణ్యంగా అందేలా చర్యలు చేపట్టింది. ఇక్కడ రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు సమకూరుస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆహార నాణ్యతను నిరంతరం పరిశీలించేలా సలహా కమిటీలను నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**కలెక్టర్ ఆధ్వర్యంలో..:** జిల్లాలో ఎక్కువ మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నూతనంగా సలహా కమిటీల నియామకానికి చర్యలు తీసుకున్నాం. నాణ్యమైన, రుచికరమైన, శుభ్రమైన ఆహారాన్ని అందేలా నిరంతరం పర్యవేక్షిస్తాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు పరిశీలించి సూచనలు చేస్తారు.

- టి.రవి, పురపాలక కమిషనర్, ఆమదాలవలస

### 600-800 మంది వినియోగం

★ జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, కోటబొమ్మాళి, ఆమదాలవలసలో ఒక్కోటి, శ్రీకాకుళం నగరంలో 2 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు.

★ తక్కువ ధరకు నాణ్యమైన ఆహారాన్ని పేదలకు అందించి వారి ఆకలి తీరుస్తుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు, కార్మికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ రోజూ సుమారు 600 నుంచి 800 మంది వినియోగించుకుంటున్నారు.

★ కమిటీ ఛైర్మన్‌గా పురపాలక అధ్యక్షులు/కౌన్సిలర్ వ్యవహరిస్తారు. సభ్యులుగా వార్డు సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి, డ్వాక్రా సంఘం ప్రతినిధి, నోడల్ అధికారి ఉంటారు.

★ ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి మరింత మెరుగుపరిచేలా సలహా కమిటీలకు ప్రభుత్వం బాధ్యత అప్పగించనుంది.

★ ఆహారం నాణ్యత, శుభ్రత పర్యవేక్షించనున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రోజూ దస్త్రాలు, సీసీ ఫుటేజీలు పరిశీలించనున్నారు. భోజనానికి వచ్చిన వారి అభిప్రాయాలు సేకరించనున్నారు. ఆహార పట్టిక అమలులో కమిటీ సభ్యులు గుర్తించిన అంశాల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు.

## కౌలు రైతులకు బాసట..!

☛ జి.సిగడాం మండలం సీతంపేట పంచాయతీ పరిధి నక్కపేట గ్రామానికి చెందిన కౌలు రైతు ఎం.అసిరినాయుడు ఆరు ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం చేయూత అందిస్తే కొంత ఉపశమనం కలుగుతుందని ఆశిస్తున్నారు. ఇలాంటి వారు అన్ని మండలాల్లోనూ ఉన్నారు.

### రుణాల మంజూరుకు కార్యాచరణ

న్యూస్‌టుడే, జి.సిగడాం

కౌలు రైతులు వ్యవసాయానికి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ముందుకొచ్చింది. రుణాలిచ్చి పంటల సాగుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. సహకార సంఘాల నుంచి మంజూరు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసింది.

ఉమ్మడి జిల్లాలో పీఏసీఎస్‌లు: 49

రుణ అర్హత కార్డులున్న వారు: సుమారు 5 వేల మంది

### నిబంధనలివీ..

◆ కౌలు రైతులకు తప్పనిసరిగా సంబంధిత అధికారులు జారీ చేసిన పత్రాలు ఉండాలి.
◆ సంఘ పరిధిలో నివాసం ఉండి సభ్యత్వం ఉన్న వారే అర్హులు.
◆ సొంత ఇల్లు ఉన్న వారికి ప్రాధాన్యం.
◆ అసైన్డ్ భూములు సాగు చేస్తూ కౌలు పత్రం ఉన్న వారు అనర్హులు.
◆ రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తారు.
◆ కౌలు పత్రంలో సాగు చేసే భూమి ఎకరాకు తక్కువ ఉండకూడదు.
◆ రుణం పొందిన రోజు నుంచి ఏడాది లోపు అసలు, వడ్డీ కలిపి చెల్లించాలి.
◆ ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

### సాగుకు ప్రోత్సాహం

◆ పొలం కౌలుకు తీసుకుని చేస్తున్న రైతుల్లో పత్రాలు తీసుకున్న వారు సుమారు 5 వేల మంది ఉన్నారు.
◆ వారిని ప్రోత్సహించడానికి గత ప్రభుత్వాలు చర్యలు చేపట్టినప్పటికీ సరైన ఫలితం లేకపోయింది.
◆ కూటమి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) నుంచి రుణాలివ్వాలని సంకల్పించడంతో ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

కౌలు రైతులకు సంబంధించి రుణాల మంజూరుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఎంత మంది ఉన్నారు.. రుణ అర్హత కార్డుల సంఖ్య, ఇతర వివరాలు పరిశీలిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటాం.

- డి.సత్యనారాయణ, సీఈవో, డీసీసీబీ, శ్రీకాకుళం

## గిరిజన ప్రాంతాల్లో సత్యసాయి హెల్త్ కేర్ సేవలు

మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన ప్రాంతాల్లో సత్యసాయి హెల్త్ కేర్ పేరిట నూతన సేవకు శ్రీకారం చుట్టనున్నట్లు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. నగరంలోని సత్యసాయి పెద్ద మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలను దత్తత తీసుకుంటామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో మొబైల్ హెల్త్ కేర్ వాహనం ద్వారా నెలకు రెండు సార్లు సేవలందించనున్నట్లు చెప్పారు. గిరిజనులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. రానున్న అయిదేళ్లలో వెయ్యి గ్రామాల్లో సత్యసాయి భజన మండళ్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రతినిధులు కిల్లాన ఫల్గుణరావు, పి.నాగేశ్వరరావు, నరసింహమూర్తి, కమలా త్రివేణి సత్యసాయి శత జయంత్యుత్సవాల విశేషాలను వివరించారు. పెద్ద మందిరం కన్వీనర్ కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ₹16 కే కిలో గోధుమ పిండి

### రేషన్ దుకాణాల్లో పంపిణీకి ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, లావేరు

| | |
|---|---|
| రేషన్ డిపోలు | 1,603 |
| కార్డులు | 6,60,739 |
| లబ్ధిదారులు | 24 లక్షల మంది |

రేషన్ కార్డుదారులకు ప్రస్తుతం బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నారు. సంక్రాంతి నుంచి గోధుమ పిండి, రాగులు అందజేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. జిల్లాలో 45 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి అవసరమని పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

● జిల్లాలో గోధుమ పిండి పంపిణీ ప్రారంభిస్తే లబ్ధిదారులకు పండగే. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కిలో రూ.60 నుంచి రూ.75 మధ్య విక్రయిస్తున్నారు. ప్రభుత్వం రూ.16కే అందజేయాలని యోచిస్తోంది. ఒక కార్డుకు కిలో ప్యాకెట్ అందజేయనున్నారు.

● రాగులు పంపిణీకి అవసరమైన కార్డుదారుల వివరాలు సేకరించాలని ఉన్నతాధికారులు డీలర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ ఇస్తున్న విషయం విదితమే. బియ్యం రెండు, మూడు కిలోలు తగ్గించి ఆ మేరకు రాగులు ఇవ్వాలని చర్యలు తీసుకుంటున్నారు.

**ఉత్తర్వులు రాగానే ప్రారంభిస్తాం..:** జిల్లాలో రేషన్ కార్డుకు కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీకి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం.

- టి.వేణుగోపాలరావు, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ, శ్రీకాకుళం

## కొబ్బరికి తెగుళ్ల బెడద..!

న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

### తగ్గిపోతున్న దిగుబడులు

ఉద్దానంలో ప్రజల ప్రధాన జీవనాధారం కొబ్బరి సాగు. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో చాలా వరకు చెట్లు నేలకొరుగుతున్నాయి. మరికొన్ని పిడుగు పాటుకు గురై ధ్వంసమవుతున్నాయి. చీడపీడల బారిన పడి కొమ్మలు ఎండిపోయి ఎదుగుదలను నియంత్రిస్తున్నాయి. దిగుబడులు క్రమేపీ తగ్గిపోతున్నాయి. కాయలు నాణ్యత కోల్పోవడంతో గిట్టుబాటు ధర రావడం లేదు. వ్యాపారుల నిర్ణయించిన మొత్తానికే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారు.

వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి-శారదాపురం సమీపంలో వైరస్ వ్యాపించిన తోట

### నల్లగా మారి..ఎండిపోయి

★ వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు విస్తరించి ఉండగా.. వీటిపై ఆధారపడి 32 వేల మంది రైతులు జీవనం సాగిస్తున్నారు.

★ ఉద్దానం, తీర ప్రాంతాల్లో కొన్ని నెలలుగా కొబ్బరి తోటలకు తెగుళ్లు (సర్పిలాకార తెల్లదోమ) ఆశించడంతో కొమ్మలు నల్లగా మారి నాశనమవుతున్నాయి. కొన్ని రోజుల తర్వాత ఎండిపోయి రాలిపోతున్నాయి.

★ ఈ నేపథ్యంలో కాపు ఆలస్యంగా వస్తోంది. కాయలు తక్కువగా కాస్తున్నాయి. పరిమాణం చాలా చిన్నగా ఉంటోంది.

### తీవ్ర నష్టం

వజ్రపుకొత్తూరు మండలం కిడిసింగి, శారదాపురం, వజ్రపుకొత్తూరు, పీజేపురం, అమలపాడు, పీఎంపురం, యూఆర్కేపురం, మెట్టూరు, అక్కుపల్లి, బాతుపురం, చినవంక, బాపనిపేట పలాస మండలం బొడ్డపాడు, రంగోయి, మాకన్నపల్లి, గురుదాసుపురం, కొబ్బరివూరు, మందస మండలం బహడపల్లి, బిడిమి, లక్ష్మీపురం, రాంపురం, గంగువాడ, రట్టి, బేతాళపురం, దున్నూరు తదితర ప్రాంతాల్లో కొబ్బరికి తెగుళ్లు తీవ్ర స్థాయిలో ఆశించాయి. రైతుల నెలవారీ ఆదాయం పడిపోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**భరోసా కల్పించాలి:** ఒకటిన్నర ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నాను. కొన్ని రోజులుగా కొమ్మలు నల్లగా మారి ఎండిపోతున్నాయి. పిందె దశలో కాయలు రాలి పోతున్నాయి. మరికొన్ని పిక్క కాయలుగా మారిపోతున్నాయి. మందులు వాడుతున్నా పూర్తిగా నివారించలేకపోతున్నాం. పెట్టుబడి ఎక్కువగా పెట్టాల్సి వస్తోంది. అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి భరోసా కల్పించాలి.

- బమ్మిడి చంద్రశేఖర్, శారదాపురం

**జీవ నియంత్రణ పద్ధతులు అనుసరించాలి:** తెల్లదోమ ఆశించడంతో కొబ్బరి కొమ్మలు మసిగా తయారై ఎండిపోతాయి. ఆయా ప్రాంతాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తాం. జీవ నియంత్రణ పద్ధతులు అనుసరించాలి. గంజి పొడి, వేప నూనె పిచికారీ చేస్తే నివారించొచ్చు. మిత్ర పురుగులు, జీవశిలీంద్రం అట్టలు ఏర్పాటు చేయాలి.

- శంకర్‌దాసు, ఉద్యాన శాఖాధికారి, పలాస




(c) eenadu

# పిల్లలూ.. ప్రధానితో మాట్లాడతారా..?

'పరీక్షా పే చర్చ-2026' రిజిస్ట్రేషన్లు ప్రారంభం




న్యూస్‌టుడే, గార

కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ఏటా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడే సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. పరీక్షలు అంటే భయం పోగొట్టి.. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు గత 8 సంవత్సరాలుగా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో వచ్చే నెల జరగనున్న కార్యక్రమానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఇంకెందుకు ఆలస్యం.. గడువులోగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుందాం రండి..

## తల్లిదండ్రులూ పాల్గొనొచ్చు..

పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమవ్వాలి.. విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు.. వాటిని ఎలా అధిగమించాలి? అనుసరించాల్సిన మార్గాలు, తదితర అంశాలను కార్యక్రమంలో వివరిస్తారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ఇందులో భాగస్వాములు కావొచ్చు.

## ఇవి గుర్తుంచుకోండి..

★ రిజిస్ట్రేషన్‌కు innovateindia.my.gov. వెబ్‌సైట్‌లో 'పార్టిసిపేట్' బటన్‌పై క్లిక్ చేయాలి.
★ విద్యార్థి, టీచర్, తల్లిదండ్రులు అనే ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి. ★ ఈ మెయిల్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలి.
★ అనంతరం వచ్చే బహులైచ్ఛిక ప్రశ్నలకు సమాధానాలివ్వాలి.
★ కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ ప్రశంసాపత్రాలు అందిస్తారు.
★ విజేతలకు ప్రధానితో నేరుగా మాట్లాడే అవకాశంతో పాటు 'ఎగ్జామ్ వారియర్స్' కిట్లు బహుమతిగా లభిస్తాయి.

## లక్ష్యం 2 లక్షల మంది..

జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన కార్యక్రమంలో 1.17 లక్షల మంది భాగస్వాములు కాగా.. ఈసారి 2 లక్షల మంది పాల్గొనేలా చర్యలు చేపడుతున్నారు. పర్యవేక్షణ బాధ్యతలను వమరవల్లి ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ(డైట్)కు అప్పగించారు. లక్ష్యాన్ని అధిగమించేందుకు పాఠశాలల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డైట్ ప్రిన్సిపల్ ఎ.గౌరీశంకరరావు తెలిపారు.

❖ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 12, 2026 ❖ అర్హులు: 6 నుంచి 12వ తరగతుల విద్యార్థులు

# కంచు మోత.. కొంచెం కొత్తగా..!

బుడితిలో డిమాండ్ ఉన్న వస్తువుల తయారీపై శిక్షణ

తర్ఫీదు పొందుతున్న కార్మికులు

న్యూస్‌టుడే, సారవకోట

సారవకోట మండలం బుడితి గ్రామం కంచు, ఇత్తడి వస్తువులకు పెట్టింది పేరు. ఇక్కడ తయారు చేసే వస్తువులకు మంచి గిరాకీ ఉంది. లేపాక్షి సంస్థ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా విక్రయాలు జరుగుతున్నాయి. కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తే మరింత మెరుగైన.. డిమాండు ఉన్న వస్తువులు తయారు చేయొచ్చని లేపాక్షి అధికారులు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే ఒక విడత పూర్తికాగా.. ప్రస్తుతం రెండో దశ నడుస్తోంది.

గ్రామానికి చెందిన అద్దాల రామకృష్ణ, సూర్యకళ దంపతులను మాస్టర్ శిక్షకులుగా నియమించారు. తొలి విడతలో 2 నెలల పాటు 30 మంది కార్మికులకు శిక్షణ ఇప్పించారు. కార్మికుడికి రోజుకు రూ. 300, మాస్టర్ శిక్షకులకు రూ. 1,000 చొప్పున చెల్లించారు. నగిషీ వస్తువుల తయారీకి అవసరమైన ఇత్తడి, మైనం ఇతర సామగ్రిని కూడా లేపాక్షి అధికారులే సమకూరుస్తున్నారు. రెండో విడత ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. ప్రస్తుతం కొత్త డిజైన్లు, నగిషీ నైపుణ్యం మెరుగుకు పాటించాల్సిన మెలకువలను మరో మాస్టర్ శిక్షకుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రాజేంద్ర పోయమ్ వివరిస్తున్నారు.

## ఎక్కువగా తయారు చేస్తున్నవి..

పూలకుండీలు, బియ్యం బుట్టలు, గృహాలంకార వస్తువులు, పండ్ల బాల్టీలు, గ్లాసులు, గోడ గడియారాలు, జ్ఞాపికలు

## హామీతో నూతనోత్తేజం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ నెల 3న బుడితిలో పర్యటించి కార్మికులతో మాట్లాడారు. కంచు ఇత్తడితో డిజైన్, నగిషీ వస్తువుల తయారీకి కావాల్సిన అధునాతన యంత్రాలు అందించాలని వారు కోరారు. బృందాలుగా ఏర్పడితే రుణాల మంజూరు చేసి అవసరమైన యంత్ర పరికరాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. శిక్షణలో భాగంగా కార్మికులు చేసిన వస్తువులను సోమవారం కలెక్టర్‌కు అందజేయనున్నారు.

## వినియోగించుకుంటాం..

గతంలో నాబార్డు ద్వారా శిక్షణ పొంది కొన్ని వస్తువుల తయారీని నేర్చుకున్నాం. ఆ తర్వాత మా జీవితాలు మెరుగుపడ్డాయి. మళ్లీ లేపాక్షి అధికారులు తక్కువ బరువుతో నగిషీ, డిజైన్ వస్తువుల ఎలా చేయాలో తర్ఫీదు ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటాం.

– కరణం మేనక, కార్మికురాలు

# హోరాహోరీగా తలపడ్డారు.. విజేతలుగా నిలిచారు..

జావెలిన్ త్రో చేస్తున్న క్రీడాకారుడు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలం సంత సీతారాంపురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో గడిచిన మూడు రోజులనుంచి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. మూడో రోజు ఆదివారం పుట్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.

విజేతలు వీరే..: జావెలిన్ త్రో: కిరణ్‌కుమార్ (ప్రథమ) ( కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల, ఎచ్చెర్ల), పి. నిఖిల్ (ద్వితీయ) (వ్యవసాయ కళాశాల, బాపట్ల), రామానుజులు నాయక్(తృతీయ) (రాజమండ్రి వ్యవసాయ కళాశాల).
● రిలే రన్నింగ్ 400 , 100మీటర్లు: నైరా వ్యవసాయ కళాశాల(ప్రథమ), ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల, ఎచ్చెర్ల (ద్వితీయ), మహానంది వ్యవసాయ కళాశాల(తృతీయ) కర్నూలు.
● ట్రిపుల్ జంప్: బి.చంద్రశేఖర్(ప్రథమ) (బాపట్ల వ్యవసాయ కళాశాల), నిర్మల్(ద్వితీయ) (ఎస్.వి.వ్యవసాయకళాశాల, తిరుపతి), వి. లక్ష్మణ(తృతీయ) (ఉదయగిరి వ్యవసాయ కళాశాల)
● 200 మీటర్ల పరుగు పందెం: అక్షయ్ జయన్(ప్రథమ) (ఎస్.వి వ్యవసాయ కళాశాల, తిరుపతి), భాను ప్రకాశ్ (ద్వితీయ) (నైరా వ్యవసాయ కళాశాల), వైభవ్ లక్ష్మణ్(తృతీయ) (ఉదయగిరి వ్యవసాయ కళాశాల).

# మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

పతకాలు సాధించిన క్రీడాకారులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాపట్లలో జరిగిన పోటీల్లో 21 మంది పాల్గొని.. 24 పతకాలు సాధించారు. వివిధ విభాగాల్లో 5 బంగారు, 9 రజత, 10 కాంస్య పతకాలు అందుకున్నారు. పురుషుల విభాగంలో ఆర్జున్ రెడ్డి, జె.వి.ఎస్.జగన్నాథం, ఎన్.గోవిందరావు, పి.రామచంద్రరావు, బి.జానకీరావు, కె.సింహాచలం, మహిళల విభాగంలో జి.హైమావతి, ఎస్.రమాదేవి, ఎ.వాణి, పతకాలు సాధించారు. మాస్టర్స్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. ఆదివారం జిల్లాకు చేరుకున్న విజేతలను అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

# గుంతలో పడి యువకుడి దుర్మరణం

నర్సింగరావు (పాత చిత్రం)

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం జాతీయ రహదారిపై వంతెన స్తంభాల నిర్మాణానికి తవ్విన గుంతలో ద్విచక్రవాహనంతో పడిపోయి యువకుడు మృతి చెందాడు. లావేరు మండలం వేణుగోపాలపురానికి చెందిన దుర్గాశి నర్సింగరావు (26) రణస్థలం సమీపంలోని సామిల్లులో పని చేస్తుంటాడు. రాత్రి 10 గంటల సమయంలో వేణుగోపాలపురం వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా పాతపెట్రోలు బంకు వద్ద ట్రాఫిక్ మళ్లింపు మార్గంలో వెళ్లకుండా గుంత తవ్విన మార్గంలోకి వచ్చేయడంతో అందులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే పనుల్లో స్టాపర్లు సక్రమంగా పెట్టకపోవడంతో యువకుడు చనిపోయాడని స్థానికులు వాపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

**చికెన్ ధరలు**

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 150 | 255 | 275 |

కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు దంపతులను ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు శంకరశర్మ

ఎంపీ సుధామూర్తికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్ తదితరులు

# ఆదిత్యుని సేవలో ప్రముఖులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకూర్మం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు దంపతులు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్, ఎంపీ సుధామూర్తి ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధాన అర్చకులు శంకరశర్మ పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ● గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని ఎంపీ సుధామూర్తి సందర్శించారు.

## ఆదివారం ఆదాయం రూ.7.76 లక్షలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా స్వామికి రూ. 7,76,235 ఆదాయం వచ్చినట్లు ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

# జనసేన బలోపేతమే లక్ష్యం

లావేరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రలో జనసేన పార్టీ బలోపేతానికి క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు పిలుపునిచ్చారు. లావేరు మండల కేంద్రంలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం విజయనగరం జిల్లా క్రియాశీల నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, నియోజకవర్గ సమన్వయకర్తలతో అంతర్గత సమీక్ష సమావేశం నిర్వహించారు. జనసేన ప్రయాణంలో ముందుండి పని చేసిన 2 వేల మందికి పైగా కార్యకర్తలు, నాయకులకు అధినేత పవన్‌కల్యాణ్ పదవులు ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నాగబాబు

# రాజాంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పాలకొండ రహదారిలో సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం ప్రారంభించారు. పురపాలిక వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి మాల్స్ రావడం ఆనందంగా ఉందన్నారు. యాజమాన్యాన్ని అభినందించారు. ఇది తమ 44వ షోరూమ్ అని సీఎంఆర్ సంస్థల చైర్మన్ మావూరి వెంకట రమణ తెలిపారు. అన్ని వర్గాలకు అనుకూలమైన ధరల్లో దుస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కొత్తా శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త చెలికాని జగన్నాథస్వామి, సీఎంఆర్ ఎండీ మోహన్ బాలాజీ, జీఎం ఎన్.లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిబ్బన్‌ను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చిత్రంలో సీఎంఆర్ సంస్థల చైర్మన్ మావూరి వెంకటరమణ తదితరులు

# ఈ-శ్రమ్‌తో భరోసా

అసంఘటిత కార్మికులకు ప్రమాద బీమా

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

భవన నిర్మాణ కార్మికులా.. ఏదైనా గార్మెంట్స్ దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్నారా..? అయితే 'ఈ-శ్రమ్'లో పేర్లు నమోదు చేసుకోండి. ఇప్పటికే నమోదైతే సరే.. లేదంటే త్వరపడండి. దీంతో చాలా ప్రయోజనాలున్నాయి. జిల్లాలో ఇప్పటికే 3,73,125 మంది నమోదు చేసుకున్నారని, మిగిలినవారూ తప్పకుండా చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ దినేష్ తెలిపారు.

## ఉపయోగాలివి..

❋ సభ్యత్వం పొందిన ప్రతి సభ్యుడికి రూ. 2 లక్షల ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ. 2 లక్షలు, దివ్యాంగులైతే ఆర్థిక సాయం అందుతుంది. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ సరకులు తీసుకోవచ్చు.

## ఏం చేయాలంటే..

❋ 18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కార్మిక శాఖ కార్యాలయం, మీసేవా కేంద్రాలు, ఆధార్ లింక్ కలిగిన చరవాణి ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ సేవలు పొందొచ్చు.

అవసరమైన పత్రాలు: ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎఫ్‌సీ కోడ్, చరవాణి నంబరు.

## అర్హులు వీరే..

❋ వ్యవసాయం, ఆశా కార్యకర్తలు, ఇల్లు, దుకాణాల్లో పనిచేసేవారు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు, భవన నిర్మాణ కార్మికులు, మత్స్యకారులతో పాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో సభ్యత్వం లేనివారు అర్హులు. పూర్తి సమాచారానికి సమీప సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించొచ్చు.

**'సాఫ్ట్‌బాల్'లో బాలుర సత్తా..:** వీరవాసరం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. శ్రీకాకుళం బాలుర జట్టు తృతీయ నిలిచింది. విజేతలకు డీఈవో నారాయణ బహుమతులు అందజేశారు.

# చెప్పినా వినరేం..!

పలాస మండల పరిషత్తు కార్యాలయం ఆక్రమణల నిలయంగా మారుతోంది. పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం వెనుకభాగంలో కొంత స్థలంలో పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీన్ని మండల పరిషత్తు అధికారులు ఇటీవల తాత్కాలికంగా నిలిపివేయించారు. శని, ఆదివారాలు కావడంతో అక్రమార్కులు మళ్లీ పనులు చేపడుతుండటంతో ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు. పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వసంత్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

# తిలకంలో సిక్కోలు కళాకారులకే అవకాశం

మాట్లాడుతున్న షకలక శంకర్, చిత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: తాను దర్శకత్వం వహించనున్న తిలకం సినిమాలో సిక్కోలు కళాకారులకే అవకాశమివ్వనున్నట్లు సినీనటుడు షకలక శంకర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం సినిమాకు సంబంధించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు, డాక్టర్ పీజే నాయుడు, పీఎంజే బాబు, తెదేపా నగర అధ్యక్షుడు పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్య ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా పవన్

నూతన కార్యవర్గ సభ్యులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఇంటర్ విద్య ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా జె.పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా జి.రేవంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.నరేశ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా మధుబాబు, మహిళా కార్యదర్శిగా కె.యశోద తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారావు వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, ఎన్జీవో సంఘ నగర అధ్యక్షుడు శ్రీరామ్, పొందూరు శాఖ కార్యదర్శి నర్సునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తెదేపాలో చేరిన వైకాపా కార్యకర్తలు

మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీలో చేరిన సంతబొమ్మాళి మండల వైకాపా శ్రేణులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలానికి చెందిన 25 మంది వైకాపా కార్యకర్తలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. నిమ్మాడలో రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆదివారం కోటపాడు, వడ్డితాండ్ర గ్రామాలకు చెందిన వారు పసుపు కండువాలు వేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంటే కేవలం బటన్‌నొక్కుడు మాత్రమే కాదని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా పనిచేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోటపాడు మాజీ సర్పంచి అప్పన్న, నేతలు పాల్గొన్నారు.

EENADU e Classifieds

PROFESSIONAL SERVICES

43 సంవత్సర విశేష అనుభవంగల జియాలజిస్టుచే భూగర్భ జల పరిశోధన (మీటరు సర్వే) చేయబడును. సుంకరి అచ్యుతరావు, జియాలజిస్టు. ✆ 9440149542.

JOBS

Royal App నందు పనిచేయుటకు టెలికాలర్స్, కం|| ఆపరేటర్స్, అకౌంటెంట్స్, రిసెప్షనిస్ట్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. శ్రీకాకుళం, 7416567719.

శ్రీకాకుళం, నరసన్నపేట షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతీయువకులు కావలెను. జీతం- 10,500-12,000. Ph: 9154296345, 9030588502

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయసు. యువతి, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము 9704637370, 9949904532.

FACULTY/ TEACHERS

Faculty for B.Sc Nursing College Q:M.Sc(Nursing), B.Sc(Nursing) Candidates C:8008083353, 7799772299 E-Mail: balajee.nursing@gmail.com

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

SECURITY GUARDS

జైగణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8 గం|| డ్యూటీ. జీతం: 18815/- PF, ESI. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11 మంది (Ex-Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం: 30000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

# టెక్కలిలో అస్తవ్యస్తంగా అసెస్‌మెంట్ ప్రక్రియ

# పెద్ద ప్లానే..!

టెక్కలి పట్టణం

– న్యూస్‌టుడే, టెక్కలి

టెక్కలి పంచాయతీ పరిధిలో నకిలీ ప్లాన్ అప్రూవల్స్ కథ కొనసాగుతూనే ఉంది. దీనిపై 2021 నుంచి రెండేళ్ల పాటు 'ఈనాడు' వరుస కథనాలను ప్రచురితమయ్యాయి. అయినా అప్పటి అధికారులు ఆ పత్రాలు నకిలీవేనని గుర్తించినా సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు ముందుకురాలేదు. నిబంధనల ప్రకారం సుడా అనుమతులు తీసుకోవాలని తెలిసినప్పటికీ నకిలీ పత్రాలతో బ్యాంకులను సైతం తప్పుదారి పట్టించి రుణాలు పొందినవారిపై కేసులు నమోదు చేయాల్సి ఉన్నా చేయలేదు.

❖ రోటరీనగర్-2లో ఓ గృహ సముదాయ నిర్మాణం జరిగింది. దీనికి ఫోర్జరీ సంతకాలతో పంచాయతీ నుంచి నకిలీ ప్లాన్ అప్రూవల్ పొందారు. ఇళ్లు కొన్నవారు పంచాయతీ సిబ్బంది సంప్రదించడంతో అసలు గుట్టు బయటపడింది. అప్పటి అధికారులు సుడా అనుమతులు పొంది వస్తే అసెస్‌మెంట్ ఇస్తామని చెప్పారే తప్ప నకిలీ పత్రాలపై ఎలాంటి నోటీసులివ్వలేదు. తాజాగా నకిలీ ప్లాన్ అప్రూవల్స్‌కు అసెస్‌మెంట్ చేసేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

❖ టెక్కలి- చెట్లతాండ్ర మార్గంలో ఓ కల్యాణ మండపం ప్లాన్ నకిలీదని ఇటీవల అధికారులు గుర్తించారు. భారీగా అపరాధ రుసుం పడే అవకాశం ఉందని యజమానిపై సిబ్బంది ఒత్తిడి పెంచుతూ.. ఆయన నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు.

## మంత్రి హెచ్చరిస్తున్నా అంతే..

నకిలీ ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌ను అసెస్‌మెంట్‌లో చేర్పించి క్రమబద్ధీకరించేస్తామంటూ కొందరు మధ్యవర్తులు ముందుకొస్తున్నారు. పంచాయతీ సిబ్బంది వారి ఒత్తిళ్లను తిరస్కరించలేని పరిస్థితి నెలకొంది. ఇందుకు భారీ మొత్తాలు చేతులు మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి అచ్చెన్నాయుడు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పురావట్లేదు.

## కేసులు నమోదు చేస్తాం..

నకిలీవని గుర్తిస్తే ఆ ఇంటి ప్లాన్లను అసెస్‌మెంట్‌లో నమోదు చేయట్లేదు. సుడా అనుమతుల్లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ అలా చేయడం కుదరదు. క్షేత్రస్థాయిలో మరింత లోతుగా విచారణ జరిపి నకిలీ అనుమతులపై కేసులు నమోదు చేస్తాం. – వెంకట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

# 20న కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శన

శ్రీకాకుళం గ్రామీణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కల్లేపల్లిలోని సంప్రదాయం నాట్యగురుకులంలో ఈ నెల 20న కామసూత్ర కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన ఉంటుందని నాట్యగురుకులం సంచాలకురాలు స్వాతి సోమనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్ల తర్వాత తన శిష్యబృందంతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన పద్మభూషణ్ డా.వరప్రసాద్ రెడ్డి, చెన్నైకు చెందిన కళాసుధ శ్రీనివాస్, తోటకూర ప్రసాద్, ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు స్పష్టం చేశారు.

# ధర్మాన వ్యాఖ్యలు హాస్యాస్పదం: ఎమ్మెల్సీ దువ్వాడ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అతి తెలివితేటలు ప్రదర్శిస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. ఈమేరకు ఓ వీడియో సందేశాన్ని శనివారం అర్ధరాత్రి విడుదల చేశారు. ఆయన ఓడిపోయిన తర్వాత ఐదేళ్లు ఇంటికే పరిమితమవుతారని, ఎన్నికలకు ఆరునెలల ముందు మాత్రమే ప్రజల్లోకి వస్తారని విమర్శించారు. చుక్కల భూములు, 22ఏ జాబితాలో భూములు ఉండటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారని ధర్మాన విలేకరుల సమావేశంలో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన కాంగ్రెస్ హయాంలో రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు 70 ఎకరాలు కబ్జా చేశారని, టెక్కలి పట్టణ నడిబొడ్డున రూ. 70 కోట్ల విలువైన స్వర్ణకారుల భూమి, రాగోలులో ప్రభుత్వ భూమి కబ్జా చేశారని, వాటిని అమ్ముకునే వీలు లేకుండా పోవడంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైకాపాలో ఉన్నప్పటికీ జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర మంత్రుల వైఫల్యాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్ని నియోజకవర్గాల్లో పార్టీని సర్వనాశనం చేసిన చరిత్ర ఆయనదని, కింజరాపు, ధర్మాన సోదరులు ఒక్కటై కాళింగులు, కాపు సామాజిక వర్గాలను సమూలంగా నాశనం చేస్తున్నారని విమర్శించారు.

# 'ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ వైద్య కళాశాలలు'

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి నేతలు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. శ్రీకాకుళం నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రాజధానులుగా జగన్ విశాఖను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తే కూటమి నేతలు అప్పట్లో విషం చిమ్మారని గుర్తు చేశారు. అలాంటి విశాఖలో ఐటీ సంస్థలకు ఇప్పుడు వేల ఎకరాలు ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. పార్లమెంటరీ స్థాయీ సంఘం కొత్త కళాశాలలు పెట్టుకునేందుకు పీపీపీ విధానం అమలు చేయాలని చెప్పిందని, పాతవాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించమని చెప్పలేదన్నారు. అమరావతిలో 3 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 300 కోట్లు ఇచ్చారని ఆరోపించారు.

(c) eenadu

# పలాస

• పలాస • ఇచ్ఛాపురం

## స్వేచ్ఛావతి కాలనీలో మురుగు తిష్ఠ

ఇచ్ఛాపురం పుర పరిధి నాలుగో వార్డు స్వేచ్ఛావతి కాలనీలో నివాసాల నడుమ మురుగు తిష్ఠవేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షపునీరు, వాడుకనీరు నిల్వ ఉండటంతో దుర్వాసనతోపాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పుర పారిశుద్ధ్య అధికారి పి.ఉపేంద్రకుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## చిన్నారులకు భరోసా

కవిటి మండలంలోని గొనపపుట్టుగ గ్రామానికి చెందిన బడగల శివాజీ కళావతి దంపతుల మృతితో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దీంతో తల్లిదండ్రుల స్నేహితులు, భైరిపురం గ్రామస్థులు రూ. 1,03,000 వేలు చిన్నారుల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మరో రూ.5,500 నిత్యావసర సరకులు వారికి అందించారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తెదేపా కార్యాలయంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి బాధితులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన నలుగురు బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2,23,277 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పలాస మండల పార్టీ కార్యదర్శి దువ్వాడ సంతోష్‌నాయుడు పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో ప్రాణం పదిలం

సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణుడు మనోహర్

పలాస, న్యూస్‌టుడే: సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే ఆపదలో ఉన్న వారికి అండగా నిలవొచ్చని హృద్రోగ వైద్య నిపుణుడు పైల మనోహర్ అన్నారు. కాశీబుగ్గ శ్రీగురుకుల విద్యాలయంలో ఆదివారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు హరిరాజ్‌కుమార్ మాట్లాడుతూ జంక్ ఫుడ్‌లకు పిల్లలు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కింతల అశోక్‌వర్ధన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోశాల నిర్మాణానికి విరాళం

కంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని సీతయ్య వృద్ధాశ్రమంలో గోశాల నిర్మాణానికి దాతలు ముందుకొచ్చినట్టు నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహనరావు తెలిపారు. ఆదివారం బారువ గ్రామానికి చెందిన మడ్డు రవి కుమార్, పార్వతీ దంపతులు రూ. 10 వేలు, కాకినాడ పట్టణానికి చెందిన మల్లేశ్వరరావు, లక్ష్మి దంపతులు రూ. 10 వేలు అందజేశారన్నారు. ఈ ఆశ్రమంలో కృష్ణ గోశాల పేరిట నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.

## సారొస్తే సరే.. లేకుంటే సెలవే

★ ఏకోపాధ్యాయ బడుల్లో అస్తవ్యస్తంగా బోధన

కంచిలి మండలం దాకరాపల్లి ఏకోపాధ్యాయ పాఠశాలలో బోధిస్తున్న సీఎంఆర్‌టీ చంద్రశేఖర్

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచి ప్రైవేటు, కార్పొరేటు బడులకు దీటుగా వాటిని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. అందులో భాగంగానే వేసవి సెలవుల్లో ప్రత్యేక కార్యాచరణతో అధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించి ప్రవేశాలను పెంచేందుకు కృషి చేశారు. అయినప్పటికీ సర్కారు బడుల్లో చదివేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మరోవైపు ప్రభుత్వ నిబంధనలు మేరకు ఒక విద్యాలయంలో విద్యార్థుల సంఖ్య పెరిగితే అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలి. కానీ ఆ నిబంధనను పాటించకపోవడంతో ప్రస్తుతం కొనసాగుతున్న వారిపై పనిభారం పెరుగుతోంది.

★ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పని భారంతో సతమతమవుతున్నారు. ఉదయం పాఠశాల తెరవగానే ముందుగా విద్యార్థులకు హాజరు వేయాలి. అనంతరం పాఠశాల పరిశుభ్రత పర్యవేక్షించి వివరాలు పొందుపరచాలి.

★ మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలి. ఇలాంటి సమయంలో కొన్ని ప్రాంతాల్లో చరవాణి సిగ్నల్స్ సరిగ్గా అందక, వివరాలు నమోదు ప్రక్రియలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

★ ముఖ్యంగా 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు నాలుగు సబ్జెక్టులు ఉండటం, గురువు ఒక్కరే కావడంతో నాణ్యమైన బోధన అందడంలేదు. ఇలాంటి పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే సీఎంఆర్‌టీ ఇతర పాఠశాలకు చెందిన వారిని అక్కడికి పంపడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

ఇచ్ఛాపురం నియోజకవర్గ వివరాలు

| మండలం | మొత్తం పాఠశాలలు | ఏకోపాధ్యాయ |
|---|---|---|
| కంచిలి | 101 | 33 |
| కవిటి | 112 | 33 |
| ఇచ్ఛాపురం | 88 | 04 |
| సోంపేట | 94 | 06 |

### విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి..

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 20 మందికి మించితే అదనపు ఉపాధ్యాయుడిని నియమిస్తారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవటం ద్వారా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయి.

– విలియమ్, డిప్యూటీ డీఈవో టెక్కలి

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

? పలాస మండలం రెంటికోటలోని రెడ్డిక వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - **స్థానికులు** ★ మూడు రోజుల్లో శుభ్రం చేస్తాం. - **సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? ఇచ్ఛాపురం బజారు కూడలిలో రహదారి ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **పీవీ రమణయ్య, ఇచ్ఛాపురం**

★ రహదారిని ఆక్రమించినా, వాహనాలు నిలిపినా చర్యలు తీసుకుంటాం. ఈ సమస్య పరిష్కారం చేస్తాం.

- **ఎం.చిన్నంనాయుడు, సీఐ, ఇచ్ఛాపురం**

? ఇచ్ఛాపురం పురపాలకసంఘంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గతంలో పట్టించినా, సమీప ప్రాంతాలలోనే వదిలేయడంతో మళ్లీ తిరిగి వచ్చేశాయి. వాటిని దూర ప్రాంతాలకు, జంతుప్రదర్శనశాలకు తరలించండి.

- **పల్లంటి వెంకట ప్రసాద్, ఇచ్ఛాపురం**

★ ప్రభుత్వానికి ఈ సమస్యను నివేదించాం. ఆదేశాలను అనుసరించి చర్యలు చేపడతాం.

- **నల్లి రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## గతుకుల దారి..

ఇచ్ఛాపురం పురపరిధి నీలకంఠేశ్వరవీధి నుంచి రంగాల వీధి వెళ్లే దారి దుస్థితి ఇది. ఈ మార్గంలో ఆరు వీధుల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను పరిశీలించి, నిధుల మేరకు పనులు చేయిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## శిథిలం..కూలేందుకు సిద్ధం

కంచిలి మండలం జాడుపూడిలోని రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు చుట్టూ పెచ్చులూడి పడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ట్యాంకును కూల్చివేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

## తీరం.. అపరిశుభ్రం

గుణుపల్లి పంచాయతీలోని తీర రహదారి పక్కన చెత్త నిల్వలు పేరుకుపోయాయి. కొద్ది రోజులుగా చెత్తను తీసుకెళ్లకపోవడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దుర్వాసన వ్యాపిస్తోంది. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కార్యదర్శితో మాట్లాడి శుభ్రత చర్యలు తీసుకుంటామని ఈవో పీఆర్‌డీ తిరుమలరావు తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## వెలగని వీధి దీపాలు..!

పలాస మండలం సున్నాడలో తొమ్మిది వీధి దీపాలు రాత్రి వేళ వెలగక పోతుండటంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. బయటకు రావడానికి భయపడుతున్నామని చెబుతున్నారు. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి పద్మనాభం దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

## స్తంభం ఇలా.. మురుగు పారేదెలా?

పురపాలక సంఘ పరిధి బ్రాహ్మణవీధిలో కాలువ మధ్యలో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయడంతో మురుగు కదలట్లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీరు, వాడుకనీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ సమస్యపై అధ్యయనం చేసి, పరిష్కార చర్యలకు ప్రతిపాదిస్తామని కమిషనర్ రమేష్ అన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ఆపదలో అండగా నిలిచారు..

విద్యార్థి తండ్రికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ భారతి

పలాస, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: తోటి విద్యార్థి కుటుంబానికి అండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం నిలిచారు. వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటకు చెందిన వంక లిఖిత్‌కుమార్ పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని ఓ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. ఆయన తండ్రి కృష్ణారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఆర్థిక సాయం చేసేందుకు ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం రూ.1.40 లక్షలు సేకరించారు. ఆదివారం ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులకు పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, డైరెక్టర్ కవిటి రేణుకేశ్వరరావు అందజేశారు. ★ పలాస మండలం వీరభద్రపురానికి చెందిన తలగాపు వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు రూ. 20 వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. సంఘం ప్రతినిధులు మురళి, లింగరాజు పాల్గొన్నారు. ★ హుకుంపేటకు చెందిన వంక కృష్ణారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం నిమిత్తం హ్యాండ్స్ టుగెదర్ సంస్థ సభ్యులు రూ. 10 వేలు అందించారు. సంస్థ ప్రతినిధులు భాస్కర్, శంకర్, తదితరులు ఉన్నారు.

## పోరాటాలతోనే గిరిజనుల హక్కులు సాధన

కంచిలి మండలం భువనపురంలో నినదిస్తున్న గ్రామస్థులు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జల్, జమీన్, జంగల్ పేరుతో సీపీఐ ఆధ్వర్యంలో జరిపిన పోరాటాల ఫలితంగా గిరిజనులకు హక్కులు దక్కాయని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాలిన నారాయణస్వామి, పుక్కళ్ల అప్పన్న పేర్కొన్నారు. ఆదివారం కంచిలి మండలం భువనపురం గిరిజన శాఖ చెందిన సీనియర్ నాయకుడు భువన ప్రధాన్ ఆధ్వర్యంలో గ్రామంలో పార్టీ జెండా ఎగురవేశారు. సీపీఐ పార్టీ ఏర్పడి వంద వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఐ.లోకనాథం, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధనరాజ తులసమ్మకు పూజలు

అమ్మవారి ఘటాలను తీసుకెళుతున్న గ్రామస్థులు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం పరిధి నీలాపు పుట్టుగ గ్రామ చల్లదనం కోసం ఆదివారం ధనరాజ తులసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలాపు కామేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరంలో ఘటాలు, డప్పులు, కోయ నాటాల మధ్య గ్రామ దేవత పూజలు చేశారు. గ్రామ నుంచి లొద్దపుట్టి కూడలిలో ధనరాజ తులసమ్మ ఆలయానికి చేరుకుని ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఇచ్ఛాపురం మండలంలోని కొళిగాంలో యువసూర్య చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం 80 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎల్. పద్మనాభం, సుగ్గు ప్రేమ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

## ఎమ్మెల్సీ పరామర్శ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని భైరిపురం సర్పంచి పి.రామదేవి, బెలగాంకు చెందిన దుపాన డిల్లమ్మ, లండారిపుట్టుగ గ్రామానికి చెందిన ఎం.లోకనాథం ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం పరామర్శించారు. నర్తు శేషగిరి, వల్లభరావు, ఎం.ఈశ్వరరావు, గిరి పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

## భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భజన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణం తారకేశ్వర అయ్యప్పపీఠంలో మూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం కన్నెస్వాములు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాలధారులు స్వామి భజనలో పాల్గొని, భిక్షను స్వీకరించారు.

## ఉద్యానం.. కళావిహీనం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

★ అభివృద్ధికి నోచుకోని గాంధీపార్కు

పంచాయతీ కాలం నాటి నుంచి ఇచ్ఛాపురంలో ఉన్న గాంధీ ఉద్యానం ప్రస్తుతం కళావిహీనంగా తయారైంది. పురపాలకసంఘ నిర్వహణలో ఉన్న ఈ పార్కులోని కొబ్బరి చెట్ల ఫలసాయాన్ని క్రమం తప్పకుండా ఏటా వేలం వేస్తూ, ఆదాయం పొందడమే తప్పా, పార్కుకోసం ప్రత్యేక దృష్టి సారించిన పరిస్థితి లేకపోయింది. గత పాలక మండళ్లు దీని అభివృద్ధికి రూ.లక్షలు కేటాయించినా సమస్యలు అలాగే ఉన్నాయి.

★ ఇచ్ఛాపురం వాసులు సెలవు రోజుల్లో, ఉదయం, సాయంత్ర వేళల్లో సేదదీరేందుకు చిన్న పిల్లలతో గాంధీ పార్కుకు వస్తుంటారు. ఇక్కడ గతంలో ఏర్పాటుచేసిన జారుడు బల్లలు, ఊయలలు కొన్ని తుప్పుపట్టి మరమ్మతులకు గురికాగా, మరికొన్ని దీనావస్థలో ఉన్నాయి.

★ యువత కోసం వ్యాయామ ఉపకరణాలు (ఓపెన్ జిమ్) గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. అవి మరమ్మతులకు గురై మూలకు చేరాయి.

★ పార్కు అభివృద్ధికి 14వ ఆర్థిక సంఘ నిధులలో రూ. 40 లక్షలు కేటాయించి, అందులో రూ. 28 లక్షలతో పనులను ప్రారంభించారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

మరమ్మతులకు గురైన ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు

### టెండర్లు పిలిచాం..

పిల్లల ఆట వస్తువుల కోసం టెండర్లు పిలవడం, ఎంపిక జరిగాయి. త్వరలోనే పరికరాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. పురవాసులు సహకరించాలి.

- **ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**

కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, సంఘ నాయకులు

## సీఐటీయూ మహాసభల్ని విజయవంతం చేద్దాం

పలాస, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిలభారత మహాసభల్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు జరిగే సభల సందర్భంగా కాశీబుగ్గలో ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ మహాసభకు పెద్దఎత్తున కార్మికులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల పారిశుద్ధ్య సంఘ నాయకులు బి.స్వాతి, శకుంతల, టి.సుశీల, ఎం.స్వాతి, భగవతమ్మ, భారతి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మించండి

వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి తీర రహదారి నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారి అధ్వానంగా మారింది. కొంత కాలంగా కంకర పనులు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో నడవలేని పరిస్థితి నెలకొంది. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం, అటవీ శాఖ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తున్నట్లు పంచాయతీరాజ్ జేఈ నాగభూషణం తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

## నిర్లక్ష్యపు గుంత

ఇచ్ఛాపురం పుర పరిధి గొల్ల వీధి, దేవరవీధి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలోని రహదారి మధ్యలో గుంత ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళ గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని పుర కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## మెట్లు శుభ్రం..

స్పందనకు వందనం

ఇచ్ఛాపురంలో ఎర్రచెరువుకు వెళ్లే మార్గం చెత్తతో నిండిపోవడంతో ఈ విషయాన్ని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా స్థానికులు పురాధికారులకు నివేదించారు. వెంటనే కమిషనర్ నల్లి రమేష్ స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

## ఆటో చోదకుడికి గాయాలు

కోటబొమ్మాళి : జాతీయ రహదారిపై టెక్కలి- శ్రీకాకుళం మార్గంలో కన్నేవలస బంకు సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడింది. పలాస నుంచి వస్తుండగా.. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఘటనలో డ్రైవర్ సింహాచలం గాయపడగా చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## వందరోజుల ప్రణాళికపై సమీక్షించండి

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

పలాస, న్యూస్‌టుడే : పదో తరగతి 100 రోజుల ప్రణాళికపై పునఃసమీక్ష చేస్తేనే విద్యార్థులపై భారం తగ్గుతుందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గలో ఆ సంఘ పలాస మండల సర్వసభ్యసమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా టి.రామానాయుడు, ప్రధాన కార్యదర్శిగా టి.వి.ఎస్.నారాయణ, కార్యదర్శులు కె.వెంకటరావు, కె.వరలక్ష్మి, ఎస్.భీమశంకర్, ఈశ్వరరావు, జిల్లా కౌన్సిలర్‌గా మాధవ బెహరా ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి.సుభాష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపీకృష్ణ, మాజీ జిల్లా కార్యదర్శి పి.వి.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి గణిత పోటీలు

గణిత ఉపాధ్యాయులతో ఎంఈవో విశ్వనాథ్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే : గణిత దినోత్సవం పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి గణిత పోటీలను ఈ నెల 16న నిర్వహిస్తున్నామని గణితఫోరమ్ ప్రతినిధి కె.తేజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఇచ్ఛాపురం పుర బాలికోన్నత పాఠశాలలో సమావేశమై ఈ తీర్మానం చేశారు. నాలుగు మండలాల నుంచి వచ్చే వందకు పైగా గణిత ప్రాజెక్టులను ఇదే పాఠశాలలో ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిని సందర్శకులు, న్యాయనిర్ణేతలు పరిశీలించి విజేతలను గుర్తిస్తామన్నారు. గణిత దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామన్నారు.

## పాఠశాలలో అన్నీ సమస్యలే

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలోని మూడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. రెండు చోట్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్షిత మంచినీరు అందించేందుకు శుద్ధజల యంత్రాలను ఏర్పాటు చేశారు. రత్తకన్న ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం విద్యార్థులు తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.

★ ఇక్కడ మొత్తం 400 మంది విద్యార్థులు ఉన్నారు. నాడు- నేడులో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కొద్ది కాలమే పనిచేసి మరమ్మతులకు గురైంది. దీంతో బోరు నీటినే సింథటిక్ ట్యాంకుకు అందించి, దాని నుంచి విద్యార్థులు సేకరించే ఏర్పాటుచేశారు. అది పూర్తి రక్షిత నీరు కాకపోవడంతో ఇళ్ల నుంచి తాగునీటి సీసాలను తెచ్చుకుంటున్నారు. ఇక మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేక బాలికలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

★ గతంలో పాఠశాలలో వాడుకనీరు, వర్షంనీరు వెలుపలకు పంపించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ స్థానికులు మట్టి పోగులు వేయడంతో వాడుకనీరు పాఠశాల ఆవరణలోనే నిల్వ ఉంటోంది. దీంతో ఆరుబయట స్టడీ అవర్స్‌లో భాగంగా చదువుకునే పదో తరగతి విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం..

రత్తకన్న పాఠశాలను సందర్శించి, విద్యాశాఖ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు సహకారం అందిస్తే, సత్వరగా పనులు చేయిస్తాం.

- **ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**

## పొదలు తొలగించాల్సిందే..

సోంపేట మండలం రాణిగాం కూడలి నుంచి ఎర్రముక్కాం వెళ్లే రహదారి ఇరువైపులా పొదలు అల్లుకోవడంతో ఇరుకుగా మారింది. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వాటిని తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

శ్రద్ధాంజలి



మంచితనం, మంచి వ్యక్తిత్వం కలిగి సమాజంలో మంచిపేరు ప్రతిష్టలు సంపాదించిన మీరు మా నుండి దూరమైననూ మీ మధుర స్మృతులు మేము మరువలేకున్నాం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. వల్లంపాటి చంద్రరావు గారు

జననం: 15-05-1945 మరణం: 06-12-2025

భార్య: శ్రీమతి వల్లంపాటి ఈశ్వరి, కుమారులు - కోడళ్లు, కుమార్తె - అల్లుడు, మనుమరాళ్లు, మనుమలు బంధుమిత్రులు

# టెక్కలి
•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

## చెట్టుకొమ్మే సూచిక..!

నరసన్నపేట- పోలాకి మార్గంలో దేశవానిపేట సమీపంలో గొయ్యి ఏర్పడింది. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంత పడిన చోట ఓ చెట్టుకొమ్మను పెట్టారు. భూగర్భ పైపులైన్ ఏర్పాటు కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. సమస్యను ర.భ.శాఖ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

## పనికిరాని మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మైత్రీ కాలనీ సమీపంలోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు అల్లుకుపోయాయి. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి ఏఈ వెంకటేశ్వరరావు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా చర్యలు తీసుకున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్ ద్వారా వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: పోలాకి మండలం రహమాన్‌పురంలో వెలసిన కార్యాలయం వద్ద బోరు తవ్వకం చేపట్టి మధ్యలో వదిలేశారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.
– మల్లేశ్వరరావు, రహమాన్‌పురం

★ మోటారు గొట్టాలను గుర్తు తెలియని వ్యక్తులు కోసేశారు. దానిని బాగు చేయించి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.
– పి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి, రహమాన్‌పురం – న్యూస్‌టుడే, పోలాకి

?: నందిగాం నుంచి వజ్రపుకొత్తూరు మండలం పూండి వెళ్లే మార్గంలో కణితివూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది.
– కవిటి ప్రతాప్, కణితివూరు

★ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నూతన వారధి నిర్మిస్తాం.
– శేఖరరావు, ఈఈ, వంశధార ప్రాజెక్టు, టెక్కలి – న్యూస్‌టుడే, నందిగాం

**వాహనాల తనిఖీ..** కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరులో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ఎస్‌ఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అనుమతి పత్రాలు పరిశీలించారు. నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు.

## మేధోమథనంతో వికాసం

నరసన్నపేట: జ్ఞాపికలు అందుకున్న విజేతలు

టెక్కలి, నరసన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు మేధోమథనం అవసరమని మండల విద్యాశాఖాధికారి డి.తులసీరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్షలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు ఎంఈవో బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు దాశరథి, గణిత ఉపాధ్యాయుల సంఘం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.రుషి, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు. ★ నరసన్నపేట బోర్డు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. 84 మంది హాజరయ్యారు. విజేతలకు సత్యవరం జి.ప.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వకుళా రత్నమాల బహుమతులు అందజేశారు. తైలజ, కేశవరావు, నాగేశ్వరరావు, జయకృష్ణ, నూకరాజు పాల్గొన్నారు.

## తుప్పల్లో ట్రాక్టర్..!

రాయితీపై రైతులకు సేవలందించేందుకు ప్రభుత్వం అన్ని పీఏసీఎస్‌లకు గతంలో ట్రాక్టర్లను అందించింది. కొన్నేళ్లుగా వీటిని ఆరుబయట తుప్పల్లో వదిలేశారు. దీంతో లక్ష్యం నెరవేరలేదు. నిధులు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. మరమ్మతులకు గురవడంతో రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదు. కొత్తూరులో పరిస్థితి చిత్రంలో చూడొచ్చు. ఈ విషయాన్ని పీఏసీఎస్ సీఈవో నాగరాజు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

## కరవు తీరేలా.. సిరులు పండేలా..!

– న్యూస్‌టుడే, పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట

సాగుకు నీరు అవసరం. పల్లపు ప్రాంతాల్లో కాలువల ఆధారంగా పంటలు పండిస్తున్నారు. మెట్ట, కొండ ప్రాంతాలకు ఈ అవకాశం లేకపోవడంతో నీటి లభ్యత తక్కువగా ఉంటోంది. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతన్నలు ఏటా అవస్థలు పడుతున్నారు. వేల అడుగుల లోతు వరకు బోర్లు తవ్వించినా నీరు పడుతుందన్న ఆశ లేదు. వైకాపా అయిదేళ్ల పాలనలో ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. భూగర్భంలోకి నీరు ఇంకితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావించి నీటి కుంటలు నిర్మించాలని నిర్ణయించింది. ప్రతి మండలంలో 400 నుంచి 600 వరకు తవ్వించాలని అధికారులకు సూచించింది. మెట్ట ప్రాంతాలు అధికంగా ఉండే మండలాల్లో ఎక్కువగా, పల్లపు ప్రాంతాల్లో తక్కువగా లక్ష్యాలు నిర్దేశించింది.

పిరువాడలో తవ్విన నీటి కుంట

**నరసన్నపేట నియోజకవర్గ వివరాలు**

| మండలం | కుంటల లక్ష్యం | పూర్తయినవి |
|---|---|---|
| పోలాకి | 500 | 215 |
| నరసన్నపేట | 600 | 190 |
| సారవకోట | 640 | 605 |
| జలుమూరు | 420 | 235 |

### నిర్మాణం ఇలా..

నీటి కుంటల నిర్మాణానికి ఒక్కో దానికి అక్కడ లభ్యమయ్యే స్థలాన్ని బట్టి రూ.40 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేపడుతుండటంతో రైతులు చేతి సొమ్ము పెట్టుకోవాల్సిన పని లేదు. వర్షాలు పడిన తరువాత కుంటల్లో చేరిన నీరు భూమిలో ఇంకుతుండటంతో భూగర్భ జల మట్టాలు పెరుగుతున్నాయని కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీటిలోని నీటిని పొలాలకు, గట్లపై మొక్కలకు వాడుతున్నారు. మొత్తం మీద ప్రభుత్వ ఆశయం కొంత మేర నెరవేరుతోంది.

### నీటికి ఇబ్బంది లేదు

నాకు ఎకరా పొలం ఉంది. కొంత భాగం కొబ్బరి వేయగా మిగిలిన దానిలో కూరగాయలు సాగు చేస్తున్నాను. కుంట తవ్వడం వల్ల నీటికి ఇబ్బంది లేదు. వర్షాలు పడటంతో దీనిలో నీరు చేరి ఎంతగానో ఉపయోగపడుతోంది.
– టి.నారాయణరావు, పిరువాడ

### త్వరితగతిన పూర్తి చేస్తాం

మండలాల వారీగా మాకు ఇచ్చిన లక్ష్యాల్లో కొంతవరకు ఇప్పటికే పూర్తిచేశాం. మిగిలినవి త్వరితగతిన తవ్విస్తాం. క్షేత్రస్థాయి సిబ్బందితో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గట్లపై కూరగాయలు సాగుచేసే కర్షకులకు కుంటకు రూ.200 చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి.
– రమణారావు, యుగంధర్, నారాయణరావు, శేఖర్ ఏపీవోలు, నరసన్నపేట నియోజకవర్గం

## వంతెన.. ఏళ్లుగా యాతన

నందిగాం మండలంలోని పాత్రునివలస- హరిదాసుపురం రహదారిలో ఆనందపురం గ్రామ సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో నిర్మించిన వంతెన ఉంది. శిథిలావస్థకు చేరడంతో వారధిపై నుంచి రాకపోకలు చేసేందుకు ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని వంశధార ప్రాజెక్టు ఈఈ శేఖరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, నందిగాం

## ఉన్నా ఉపయోగం సున్నా..!

సంతబొమ్మాళి మండలం తెలగపేటలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నేళ్ల కిందట ఇంటింటికీ కుళాయిలు, ట్యాంక్ ఏర్పాటు చేశారు. మధ్యపాదంలో ఏర్పాటు చేసిన మోటారు తరచూ మరమ్మతులకు గురవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి రాజు చెప్పారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

## తుప్పలు.. తప్పని తిప్పలు

నరసన్నపేట మండలం తోటాడ- కానుకుర్తివానిపేట మార్గంలో జగన్నాథపురం వద్ద రహదారికి ఇరువైపులా పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపిస్తామని పీఆర్ ప్రాజెక్టు ఏఈ లావణ్య పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

## నామరూపాలు కరవు

గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు కొన్నేళ్ల కిందట జనాభా ప్రాతిపదికన పంచాయతీకి 2 నుంచి 4 చొప్పున మూడు చక్రాల బండ్లు అందించారు. వీటిని కొన్నాళ్లపాటు వినియోగించారు. ఆరుబయట వదిలేయడంతో నామరూపాలు కోల్పోయి నిరుపయోగంగా మారాయి. సారవకోట మండలం మదనాపురంలో బండి పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. సమస్యను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.అప్పన్న స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, సారవకోట

## దుర్వాసన, దోమల మోత..!

జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామంలో కాలువలు లేకపోవడంతో మురుగు వీధుల్లోనే ప్రవహిస్తోందని స్థానికులు వాపోతున్నారు. దోమలు, దుర్వాసనతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని, వ్యాధులు ప్రబలక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సమస్యపై జేఈ మధుసూదనరావును వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

## మూడు పంచాయతీల విభజన

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండలంలో 35 పంచాయతీలుండగా అలుదు, కుమ్మరిగుంట, గొర్రిబంద పంచాయతీల విభజనకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈమేరకు స్థానికులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. అలుదులో ఉండే వడ్డినవలస, మాకివలస గ్రామాలను వేరు చేసి వడ్డినవలస పంచాయతీగా, కుమ్మరిగుంట పరిధిలో 5 గ్రామాలుండగా బోడసముద్రం, సోమయ్యపేట గ్రామాలను వేరుచేసి బోడసముద్రం పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గొర్రిబంద పంచాయతీలో 9 గ్రామాలుండగా బురుజువాడ, జగన్నాథపురం, ఎగువకుంట, జవాద, రైవాడ, కేసన్నపేట, సైరిగాంపేటతో పాటు గుమ్మపాడు పరిధిలోని అగదల గ్రామాన్ని చేర్చి బురుజువాడ పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు.

### రేపటి లోగా గ్రామసభలు

విభజన ప్రక్రియకు సంబంధించి గ్రామసభలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించి ఈనెల 17న డీపీవో కార్యాలయానికి అందించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.అప్పన్న ఆదివారం తెలిపారు. విషయాన్ని ప్రజలకు తెలియజేసి మంగళవారం లోగా గ్రామసభలు పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించినట్లు చెప్పారు. నూతనంగా మూడు ఏర్పడితే మండలంలో పంచాయతీల సంఖ్య 38కు పెరుగుతుంది.

## ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై టెక్కలి- శ్రీకాకుళం మార్గంలో కన్నేవలస బంకు సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడింది. పలాస నుంచి వస్తుండగా.. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఘటనలో డ్రైవర్ సింహాచలం గాయపడగా చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ఉన్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## మలుపు.. ఆపదకు పిలుపు

కొత్తూరు మండలంలోని అలికాం- బత్తిలి రహదారిపై కర్లెమ్మ గ్రామం వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. మలుపును సూచించే బోర్డులు, వేగ నియంత్రికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ డీఈఈ సాగర్ వద్ద సమస్యను ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

## వరి.. ఆశలు ఆవిరి..!

చిన్నతామరాపల్లి గ్రామంలో కల్లాల్లో ధాన్యం నిల్వలు

వర్షాలు, సుడిదోమతో తగ్గిన దిగుబడి

– న్యూస్‌టుడే, నందిగాం

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో సుడి దోమ చాప కింద నీరులా వ్యాపించి రైతులకు నష్టాలు తెచ్చింది. మరోవైపు మొంథా తుపాను నిండా ముంచేసింది. కోతల ముందు ఏపుగా కనిపించిన చేను అన్నదాతల్లో ఆశలు రేకెత్తించింది. తీరా నూర్పిడి చేసే సరికి కన్నీరు మిగిల్చింది. గతేడాది ఎకరాకు 25 నుంచి 30 బస్తాలు దిగుబడి రాగా ఈ ఏడాది 13 నుంచి 14 మాత్రమే వచ్చే సరికి రైతులు లబోదిబోమంటున్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ సహాయకులు పంట నష్టం వివరాలను నమోదు చేసి, అధికారులకు అందించారు. పెద్దగా నష్టం జరగలేదని యంత్రాంగం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. నందిగాం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లో వరి పండించగా సుమారు 5 వేల ఎకరాల్లో పంటను రైతన్నలు నష్టపోయారు.

### పెట్టుబడి వృథా

నాకు 5 ఎకరాల పొలం ఉంది. రూ.54 వేల పెట్టుబడి పెట్టాను. 70 బస్తాల దిగుబడి వచ్చింది. నూర్పిడి సమయంలో పొల్లు శాతం ఎక్కువగా రావడంతో తీవ్రంగా నష్టపోయాను. తెగుళ్లు బారిన పడిన పంటకు మందులు కొట్టినా ప్రయోజనం కన్పించలేదు.
– మార్పు మల్లేశ్వరరావు, కోమటూరు

### పరిహారం అందించాలి

5 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేపట్టాను. 65 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి సైతం రాలేదు. ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం నష్ట పరిహారం ప్రకటించి, కౌలు రైతులను ఆదుకోవాలి.
– అగురు పోతన్న, నందిగాం

### ఎకరాకు 20 బస్తాలు..

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన వరి సాగు దిగుబడి ఎకరాకు సుమారు 20 బస్తాలు వచ్చినట్లుగా నమోదైంది. సాగునీటి వనరులు లేని కొండలు, మెట్ట ప్రాంతాల్లో ఇంకా తగ్గింది.
– పి.శ్రీకాంత్‌వర్మ, వ్యవసాయాధికారి, నందిగాం

## కంచె లేదు.. రక్షణ కరవు..!

నందిగాం ఎస్సీ కాలనీ శివారులో విద్యుత్తు నియంత్రికను సుమారు 4 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. చుట్టూ ఎటువంటి రక్షణ కంచె లేదు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు అటువైపు వెళ్లకుండా కాపలా కాయాల్సి వస్తోందని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తామని విద్యుత్తు శాఖ జేఈ నేతాజీ పేర్కొన్నారు – న్యూస్‌టుడే, నందిగాం

## వరికుప్ప దగ్ధం

నందిగాం, న్యూస్‌టుడే: నందిగాం పంచాయతీ పెంటూరు గ్రామానికి చెందిన బంగారి శిమ్మయ్య 80 సెంట్ల వరిచేను ఆదివారం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. బాధితుడు అదే గ్రామానికి చెందిన మట్ట రామారావు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన భూమి నరేంద్రపురం పంచాయతీ పాలవలస గ్రామ పరిధిలో ఉంది. తహసీల్దారు పి.సోమేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి రూ.30 వేలు నష్టం వాటిల్లినట్లుగా అంచనా వేశారు.

## ధర్మాన్ని పాటించాలి

పోలాకి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలని స్వామి రామయోగి సేవాశ్రమం అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం కోరారు. ఆదివారం కిల్లిబుచ్చెన్నపేటలోని ఆశ్రమంలో సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు.

## వైభవంగా హిందూ సమ్మేళనం

పాతపట్నం, న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతి జాగృతే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పట్టణంలోని ఎరుకోల మైదానం ఆవరణలో ఆదివారం హిందూ సమ్మేళనం వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జలుమూరు, న్యూస్‌టుడే: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పలు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం సైతం పాగోడు, చల్లవానిపేట, తిమడాం, శ్రీముఖలింగం, కరవంజ, లింగాలవలస, అల్లాడ, రామకృష్ణాపురం, పెద్దదూగాం ఉన్నత పాఠశాలల్లో తరగతులు ఏర్పాటు చేసి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

## బైక్ మెకానిక్ సంఘ కార్యవర్గ ఎన్నిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బైక్ మెకానిక్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాలిశెట్టి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా దున్న రాజేష్, కార్యదర్శిగా జోగి శివ, కోశాధికారిగా లింగరాజు ఎంపికయ్యారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

పాతపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారిణి సాయమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక గ్రంథాలయంలో "యు లవ్ రీడింగ్" కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానం అందించే వాటిని చదవాలని ఆమె తెలిపారు.

## అక్రమ నిర్మాణం అడ్డగింత

టెక్కలి: స్థానిక అయ్యప్పనగర్‌కు వెళ్లే రహదారిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఆదివారం శ్లాబ్ వేస్తుండగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడకు చేరుకుని పనులు నిలిపేశారు. సమస్యపై మంత్రి అచ్చెన్నాయుడికి ఫిర్యాదు చేస్తామని ఆ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సన్యాసిరావు తెలిపారు.

## నిర్మించారు.. ప్రారంభం మరిచారు

ఎల్ఎన్‌పేట మండలంలోని గ్రామాలకు మెగా రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు కరకవలస వద్ద సంపు నిర్మాణం చేపట్టారు. ఏడాది కావస్తున్నా దీనిని ప్రారంభించలేదు. దీంతో పలు పల్లెలకు తాగునీరందడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

## ఎట్టకేలకు దారి చూపారు..!

పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఈఈ సూర్యప్రకాశరావు

పదేళ్ల అనంతరం తిలారు రోడ్డుకు మోక్షం

– న్యూస్‌టుడే కోటబొమ్మాళి

గ్రానైట్ పరిశ్రమల వాహనాల రాకపోకలతో గోతులమయంగా మారిన నిమ్మాడ కూడలి- తిలారు రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. పరిశ్రమల భాగస్వామ్యంతో సీసీ రోడ్డు నిర్మించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించడంతో పనులు ప్రారంభించారు.

**ఇదీ పరిస్థితి..** ఈ రోడ్డు నిర్మాణానికి 2015 అక్టోబరులో మంత్రి అచ్చెన్నాయుడు భూమిపూజ చేశారు. రూ.80 లక్షల వ్యయంతో రహదారి నిర్మించారు. గోతులమయంగా మారినా గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు అభివృద్ధికి తొలిదశలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.8 కోట్లు మంజూరయ్యాయి. దీంతో అచ్చెన్న గత నెల 30న భూమిపూజ చేశారు. పనుల సమయంలో ఏఈతో పాటు తిలారు, నిమ్మాడ ఇంజినీరింగు, సాంకేతిక సహాయకులు పర్యవేక్షించాలని ఈఈ సూర్యప్రకాశరావుకు సూచించారు.

### నిత్యం రద్దీ

తిలారు, నిమ్మాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జలుమూరు మండలం రాయిపాడు, నిమ్మాడ గిడ్డంగులు, పాలిషింగ్ పరిశ్రమలు, తిలారు రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. తిలారు, తుంబయ్యపేట, నారాయణవలస గ్రామాలకు వెళ్లేందుకు రైల్వే అండర్ పాసేజీ నిర్మించడంతో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో ప్రస్తుతం ఉన్న రహదారిపై ఇనుప గజాలు వేస్తూ సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు.

### పటిష్ఠంగా నిర్మాణం

నిమ్మాడ కూడలి నుంచి తిలారు వరకు రహదారిని ఉపాధిహామీ పథకం నిధులతో పటిష్ఠంగా నిర్మిస్తున్నాం. నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు చేపడుతున్నాం.
– సూర్యప్రకాశరావు, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ, టెక్కలి

## బాధిత కుటుంబాలకు పరామర్శ

మెళియాపుట్టిలోని కొసమాల పంచాయతీ మాజీ సర్పంచి అంకడాల లోకనాథం మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పరామర్శించారు. కొసమాల, వసుంధర గ్రామాల్లో పర్యటించిన కార్యకర్తల మృతికి సంతాపం తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు, తెదేపా మండలాధ్యక్షుడు నంబాళ్ల వెంకట్రావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

## తరచూ ప్రమాదాలు.. తెరవరా కళ్లు

గొప్పిలి ప్రధాన కూడలిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. పలాస వైపు వెళ్లే రహదారిలో కల్వర్టుపై పలక విరిగిపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను ర.భ.శాఖ ఏఈ విక్రమ్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

(c) eenadu

# శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

## స్వర్ణోత్సవ సమ్మేళనం!

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివిన 1972 - 75 బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగరంలో జరిగింది. కళాశాలను విడిచి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారంతా కలిశారు. నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. సురంగి మోహనరావు, యెరుకోల మురళీమోహనరావు, నారా ఈశ్వరరావు, సీపాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

## బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

రణస్థలం, న్యూస్‌టుడే : రణస్థలం మండలంలోని తెప్పలవలస పంచాయతీ చినపట్నానపేట గ్రామంలో ధర్మవరపు కృష్ణుడు మూడు నెలల కిందట సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందారు. తెదేపా సభ్యత్వం తీసుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బీమా సొమ్ము రూ.5 లక్షల చెక్కును అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థినికి గాయాలు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని గాయపడిన ఘటన శ్రీకాకుళం నగరంలో జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చెందిన పోతుల జాహ్నవి శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం సాయంత్రం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆలయానికి వెళ్లి వస్తుండగా కారు ఢీకొనడంతో గాయపడ్డారు. సమీపంలోనే ఉన్న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై దొర తెలిపారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని..

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: సూర్యమహల్ కూడలి సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని నగరానికి చెందిన లక్ష్మణరావుకు గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై మెట్ట సుధాకర్ తెలిపారు.

## నేటి నుంచి తిరుప్పావై ప్రవచనాలు

గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: గార మండలంలోని కూర్మనాథస్వామి క్షేత్రంలో సోమవారం నుంచి జనవరి 14 వరకు ప్రతిరోజూ సాయంత్రం తిరుప్పావై ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీభాష్యం పద్మనాభాచార్యస్వామి తెలిపారు. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, తితిదే సౌజన్యంతో ఇది జరుగుతుందని చెప్పారు.

## కాల్చొద్దు.. నష్టం కలిగించొద్దు

న్యూస్‌టుడే, రణస్థలం

వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు

సారం కోల్పోతున్న నేల

ఖరీఫ్ సీజన్ ముగిసింది. వరి కోతలు పూర్తయ్యాయి. అనంతరం పొలంలో మిగిలిపోయిన వరి కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. నేల సారం కోల్పోవడంతోపాటు పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

● మొక్కజొన్న విషయంలోనూ పంట అనంతరం రోటవేటరుతో ముక్కలు చేసి నేలలో కలిపేయాలని వెల్లడిస్తున్నారు. వ్యర్థాలు పొలమంతా చల్లి నీరు కట్టి, రెండు మూడు రోజులు ఉంచితే కుళ్లిపోతుంది. పొలం ఆరిన తర్వాత జీరో టిల్లేజీ పద్ధతిలో మొక్కజొన్న నాటితే మంచి దిగుబడి సాధించొచ్చని చెబుతున్నారు.

● వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల ఉపరితలం నుంచి ఒక సెంటీమీటరు లోపు వరకు ఉష్ణోగ్రత ఎనిమిది డిగ్రీలు పెరిగి నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నాశనం అవుతాయి. కార్బన్ శాతం తగ్గిపోతుంది. ధూళి, పొగ వల్ల శ్వాసకోశ సమస్యలు వస్తాయి. నేలకు ప్రయోజనకరంగా మారే నత్రజని, భాస్వరం, పొటాష్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది.

పతివాడపాలెం పొలంలో కొయ్యలకు నిప్పు పెట్టిన దృశ్యం

● రణస్థలం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఖరీఫ్‌లో వరి 26,500, మొక్కజొన్న 16,500 ఎకరాల్లో సాగు చేశారు.

● 'పొలాల్లో వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుంది. భూసారం కోల్పోతుంది. రైతులు అలా చేయకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.' అని రణస్థలం ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు.

## భిన్నత్వంలో ఏకత్వమే భారతీయం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: విశ్వమానవ శ్రేయస్సును కోరేదే హైందవం అని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరం కత్తెర వీధిలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సహ ప్రచార ప్రముఖ్ వాసూజీ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమే భారతీయం అన్నారు. ఇప్పిలి వీధికి చెందిన మహిళలు లలితా సహస్ర నామపారాయణం, భజన కార్యక్రమం నిర్వహించారు.

## జొన్నలపాడులో సైనిక స్తూపం

గార (జొన్నలపాడు), న్యూస్‌టుడే: గార మండలం రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు గ్రామంలో సైనిక స్తూపం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. మాజీ సైనికులు, ప్రస్తుత జవాన్‌లు సంయుక్తంగా పనులు చేయిస్తున్నారు. సర్పంచి గొలివి వెంకటరమణమూర్తి, రుప్ప రమణమూర్తి, ఆళ్ల మల్లేశ్వరరావు, తాళ్ల పాపారావు, కలగ జగదీష్ తదితరులు ఉన్నారు.

భూమిపూజ పాల్గొన్న మాజీ సైనికులు

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: లక్ష్మీనగర్‌వీధిలో ఇష్టానుసారంగా ఆటోలు నిలుపుతున్నారు. ప్రయాణం కష్టంగా ఉంది. – రవి, స్థానికుడు

సమాధానం: చర్యలు తీసుకుంటాం. – బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

సమస్య: రైల్వేస్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనాలు పెట్టేందుకు తగిన పార్కింగ్ లేకపోవంతో ఇబ్బందులు పడుతున్నాం. – హరి, స్థానికుడు

సమాధానం: ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి, త్వరలోనే పార్కింగ్ ఏర్పాటు చేస్తాం. – ఉమామహేశ్వరావు, రైల్వే స్టేషన్ సూపరెండెంట్, శ్రీకాకుళంరోడ్డు.

## ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం కోదండరామాలయం ప్రాంగణంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం విశ్రాంత ఉపాధ్యాయులు తుమరాడ జగన్నాథ శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. 'మానవ జీవితంలో భగవద్గీత' అనే అంశంపై ఆయన మాట్లాడారు. మందిరం ప్రతినిధులు నారాయణమూర్తి, నిష్టల నరసింహమూర్తి, కోమలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపేశారు.. ఆ సంగతే మరిచారు

పొందూరు మండలం దల్లిపేట గ్రామంలో సచివాలయం భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో గ్రామంలోని పాత పంచాయతీ భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పనులు నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు

## ఇదండీ నిర్వహణ..!

ఆమదాలవలస మండలం నిమ్మతొర్లువాడ గ్రామంలో కాలువల్లో పూడికతో పాటు పచ్చని గడ్డి, పనికి రాని మొక్కలు పెరిగాయి. మురుగు నిలిచిపోతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడికలు తొలగించాలని కోరారు. తక్షణమే పూడికలు తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ గోపాలరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

## నీటి ఇబ్బందులు ఎన్నాళ్లు..?

పొందూరు మండలంలోని నరసాపురం అగ్రహారంలో జగనన్న కాలనీలో తాగునీటి పథకం నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. దీంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తిచేసి తాగు నీటిని అందించాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

## అడ్డుగా.. ప్రమాదకరంగా

ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేటు ఎదురుగా ప్రధాన రహదారిపై సెంటర్ లైటింగ్ విద్యుత్తు స్తంభం అడ్డుగా ఉండటంతో బస్సులు మలుపు తిప్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో కాస్త నిర్లక్ష్యంగా ఉంటే విద్యుత్తు స్తంభానికి బస్సు తగిలి పడిపోయే ప్రమాదం ఉంది. స్తంభాన్ని తొలగించాలని చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

## నాలుగేళ్లుగా ఇంతే..!

లావేరు మండలం వెంకటాపురం సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్ర నిర్మాణ పనులు అటక్కెకాయి. కేంద్రం పూర్తి చేయకపోవడంతో సచివాలయం పరిధిలో ఓ చిన్న అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఇంజినీరింగ్ అధికారిణి పి.శ్రీవల్లి వద్ద ప్రస్తావించగా నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే,లావేరు

## సైకిల్ యాత్ర జయప్రదం చేయండి

రణస్థలం, న్యూస్‌టుడే : గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈ నెల 15న నిర్వహించే సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం అన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

## పట్టు బిగిస్తున్నారు..!

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

జిల్లాలో ప్రాచీన క్రీడలకు పెద్దపాడు పెట్టింది పేరు. అక్కడి యువత సంప్రదాయ క్రీడల్లో తమదైన ప్రతిభ చూపిస్తున్నారు. బాహుబలంలో ప్రత్యర్థులను ఓడించడంలో శిక్షణ తీసుకుంటున్నారు. పెద్దపాడులోని రామాంజనేయ వ్యాయామశాలలో శిక్షకులు బొట్ట గోవిందరావు ఆధ్వర్యంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రెజ్లింగ్‌లో సాధన చేస్తున్న యువత క్రీడా విజయాలపై కథనం

సాధన చేస్తున్న క్రీడాకారులు

● బూర్జ తేజేశ్వరరావు ఆరేళ్ల నుంచి రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు వ్యవసాయ కూలీలైనా.. ప్రోత్సహించడంతో రెజ్లింగ్‌తో జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపుతున్నాడు. చిత్తూరు, నెల్లూరుల్లో జరిగిన అండర్-23 రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. క్రీడాకారుడి కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా చెబుతున్నాడు.

● ఏడు సంవత్సరాల నుంచి శిక్షణ తీసుకుంటున్న కొరద సూర్య రాష్ట్ర స్థాయిలో నాలుగు పతకాలు అందుకున్నాడు. జాతీయ స్థాయిలో అండర్-17 జూనియర్ విభాగం, అండర్-23 విభాగాల్లో దిల్లీ, అయోధ్య, ద్వారక, రాజస్థాన్‌లలో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం తన లక్ష్యంగా వివరించాడు.

● నిరీష్‌యాదవ్ తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులు. ఇప్పటి వరకు 5 రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో 92 కిలోల విభాగంలో పాల్గొననున్నాడు. జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు అందుకోవాలని కృషి చేస్తున్నట్లు చెప్పాడు.

● 'రెజ్లింగ్‌లో నైపుణ్యం సాధించేందుకు పెద్దపాడు గ్రామం నుంచి యువత ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. గత ఏడేళ్లుగా జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో అనేక మంది పాల్గొన్నారు.' అని పెద్దపాడు శిక్షకుడు బొట్ట గోవిందరావు తెలిపారు.

## చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతన అవసరం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచే పిల్లలకు ఆధ్యాత్మికతపై మక్కువ ఉండాలని జిల్లా సత్యసాయి సేవా సమితుల యూత్ సంయుక్త సమన్వయ కర్త సాయికృప అన్నారు. ఆదివారం ఆమదాలవలస మండలం అక్కులపేట-వేణుమ్మపేట సత్యసాయి సేవాసమితిలో నిర్వహిస్తున్న బాలవికాస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కులపేట వేణుమ్మపేట సత్యసాయి సేవా సమితి స్ఫూర్తితో ఆమదాలవలస, బూర్జ మండలాల్లో పలు గ్రామాల్లో బాలవికాస్ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆధ్యాత్మికతపై బోధన జరుగుతోందన్నారు.

చిన్నారులకు బోధిస్తున్న బాలవికాస్ గురువు

## కేంద్ర మంత్రి జన్మదినం ఉత్సవంలా నిర్వహిద్దాం

కలెక్టరేట్(శ్రీకాకుళం), గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జన్మదినాన్ని ఈ నెల 18న ఉత్సవంలా నిర్వహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో వేడుకల నిర్వహణపై సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవియేషన్ అంటే ఏమిటో తెలియని వారు కూడా రామ్మోహన్‌నాయుడిని విమానయాన రంగంలో బాద్‌షాగా గుర్తిస్తున్నారన్నారు. తెదేపా శ్రేణులు దీన్ని తిరుగులేని ఉత్సవంగా జరపాలన్నారు. అనంతరం రామ్మోహన్‌నాయుడి పోస్టర్లను ఆవిష్కరించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

**రాళ్లపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..** అభివృద్ధికి దూరంగా ఉన్న రాళ్లపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం శ్రీకూర్మం పంచాయతీ రాళ్లపేటలో రహదారి నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

## రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడిగా రామలింగస్వామి

శ్రీకాకుళం గ్రామీణం, సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన అధ్యక్షుడిగా లోకనాథం రామలింగస్వామి ఎన్నికయ్యారు. నగరంలోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవాధ్యక్షుడిగా చిట్టి వెంకటరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పన్నాల నరసింహమూర్తి, కార్యదర్శిగా బి.రామచంద్రదేవ్, కోశాధికారిగా ఐ.రమణరావు, ఉపాధ్యక్షులుగా కలగ గణేష్‌యాదవ్, మెట్ట వెంకటరాజు, బి.ఎన్.భూషణ్, సంయుక్త కార్యదర్శులుగా ఎన్ని రాజేశ్వరరావు, పైడి సత్యవతి, సొంగల గణేష్, బి.జ్యోతిలను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా పి.ఎం.జె.బాబు, బి.ఎ.మోహనరావు, న్యాయ సలహాదారుగా కంచరాన అప్పారావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గ సభ్యులు

## సంగీత ఝరి... సుస్వర లహరి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిరంలో ఆదివారం ఆరోహి సంగీత కళాశాల విద్యార్థుల సుస్వర లహరి కార్యక్రమం జరిగింది. కళాశాల వ్యవస్థాపకుడు పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 30 మంది బాలలు, మహిళలు రెండున్నర గంటల పాటు పలు పాటలను ఆలపించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ వారిని అభినందించారు. డా.పొగిరి సుగుణాకరరావు, గురజాడ విద్యాసంస్థల డైరెక్టర్ సంయుక్త, ఎల్.రామలింగస్వామి, కల్పన నంబాళ తదితరులు పాల్గొన్నారు.

పాట పాడుతున్న చిన్నారులు

## కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో)

● టమాటాలు 38 ● వంకాయలు 30/36 ● బెండ 58 ● పచ్చిమిర్చి 56 ● కాకర 48 ● బీర 54 ● క్యాలీఫ్లవర్ 25/30 ● క్యాబేజీ బుట్ట 30 ● క్యారెట్ 46 ● దొండ 36 ● బంగాళదుంపలు 20 ● ఉల్లిపాయలు 20/24 ● గోరు చిక్కుడు 48 ● ఆనప 26 ● అరటికాయ(జత) 18 ● గోల్కొండ చిక్కుడు 44 ● అల్లం 90 ● వెల్లుల్లి 90 ● బీట్‌రూట్ 44 ● క్యాప్సికం 80 ● కీరదోస 40 ● ముల్లంగి 26

- న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

## దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..!

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం తోటపాలెం గ్రామం నుంచి సైలాడపేట గ్రామం మీదుగా కొత్తపేట, అంబేడ్కర్ నగర్‌కు పోయే రహదారిలో దశాబ్దాల నుంచి ప్రజలు నరకం చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా.. సమస్య తీరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు చొరవ తీసుకున్నారు. రూ.3 కోట్ల నాబార్డు నిధులతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రేపు జిల్లా కేంద్రానికి చేరుకోనున్న అభ్యుదయం సైకిల్ యాత్ర

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: ప్రజాభాగస్వామ్యంతోనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉద్ఘాటించారు. అభ్యుదయం సైకిల్ యాత్ర మంగళవారం శ్రీకాకుళం నగరానికి చేరుతుందని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింహద్వారం, డే అండ్ నైట్ కూడలి మీదుగా రామలక్ష్మణ, సూర్యమహల్, ఏడు రోడ్ల కూడళ్ల వరకు యాత్ర సాగుతుందని పేర్కొన్నారు.

## గురుభక్తి చాటుకున్న శిష్యుడు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగం సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న డా.కె.హరికిషన్ తన రాసిన పుస్తకాన్ని విద్యాబుద్ధులు నేర్పిన ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫిలాసఫీ విశ్రాంత ఆచార్యుడు డా. జి.వి. రాజుకు ఆదివారం 'పోర్ట్రయల్ ఆఫ్ విమెన్ ఇన్ ఠాగూర్ 'అందజేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం వంగపల్లిపేటకు చెందిన హరికిషన్ బీఆర్ఏయూ ఏర్పాటైన నాటి నుంచి సహాయ ఆచార్యుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## దోమల బెడద.. దుర్వాసన

పొందూరు మండలం కింతలి గ్రామపరిధిలో ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న మార్గంలో వ్యర్థాలు పడేస్తుండటంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదని వెల్లడించారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

## తెరపై ఈనాడు

★ మారుతి: రాజు వెడ్స్ రాంబాయి ★ కిన్నెర: అమరకావ్యం ★ మారుతి: రాజు వెడ్స్ రాంబాయి ★ కిన్నెర: అమరకావ్యం ★ కీర్తన: అఖండ-2 ★ కీర్తిక: డ్రైవ్ ★ సన్‌మ్యాక్స్: మోగ్లీ ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): అఖండ-2 ★ సూర్యమహల్: అఖండ-2 ★ సరస్వతి: ఆంధ్ర కింగ్ తాలుకా – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

## రహదారులే.. డంపింగ్ యార్డులు

పొందూరు, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే

పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపు తదితర కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతమిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కార్యచరణ అమలు కావడం లేదు. గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసినా.. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారాలు గ్రామ శివారుల్లో వేసి అధ్వానంగా మారుస్తున్నారు. నియోజకవర్గంలోని 10 పంచాయతీల్లో ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

● పొందూరు మండలంలో 29 పంచాయతీల్లో బురిడికంచరాం, నర్సాపుర అగ్రహారం, బరంపురం, దల్లవలస, కింతలి, రాపాక, గోకర్ణపల్లి, లోలుగు తదితర గ్రామాల్లో రహదారుల పక్కన చెత్త నిల్వలు కనిపిస్తున్నాయి.

సరుబుజ్జిలి మండలం కొమనాపల్లి రహదారి పక్కన చెత్త నిల్వలు

● సరుబుజ్జిలి మండలంలో 21 పంచాయతీల్లో సరుబుజ్జిలి, గోనుపాడు, లొద్దలకాగితాపల్లి, రొట్టవలస, పాలవలస, రావివలస, పురుషోత్తపురం, సుభద్రపురం తదితర గ్రామాల్లో వ్యర్థాలను పందులు, కుక్కలు రోడ్లపైకి లాగేస్తూ చిందరవందర చేస్తున్నాయి. దీంతో రాకపోకలు చేసేవారికి ఇబ్బందులు కలుగుతున్నాయి.

● ఆమదాలవలస మండలంలో ఎన్టీవాడ, చీమలవలస, తొరగపేట, బొబ్బిలిపేట, కొత్తవలస, కొర్లకోట తదితర గ్రామాల్లో రహదారుల చెత్త వల్ల అపరిశుభ్రంగా మారుతున్నాయి.

● బూర్జ మండలంలో అన్నంపేట, అయ్యవారిపేట, కొల్లివలస, రామన్నపేట, పాలవలస, గోపీదేవిపేట, లక్ష్మింపురం, రాజుపేట తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

'గ్రామాల్లో చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల అధికారులకు సూచనలు చేశాం. రహదారుల పక్కన చెత్త నిల్వలు లేకుండా చూడాలని చెప్పాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.' అని డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల చెప్పారు.

## బహిరంగ ప్రకటనకు ఖండన

నా క్లయింట్ అయిన ఇనపకుర్తి జానకిరావు S/o సూర్యనారాయణ, [illegible] శ్రీకాకుళం వాస్తవ్యులు ఇచ్చిన భోగట్టాపై కూరాకుల శ్రీనివాసరావు S/o లేటు సూర్యనారాయణ 08-12-2025 తేదీన ఈనాడు పత్రికలో ఇచ్చినటువంటి బహిరంగ ప్రకటనకు ఖండన.

నా క్లయింటుపై కూరాకుల శ్రీనివాసరావు S/o లేటు సూర్యనారాయణ వేసిన IA 285/2024 in OS 373/2024 శ్రీకాకుళం IIIrd Addl. Jr. Civil Judge (Prosh & Excise) Courtలో ఇచ్చిన (Temparary) ఇంజంక్షన్ ఆర్డర్‌ను మరియు నా క్లయింటు వేసిన CMA 18/24లో ఫ్యామిలీ కోర్టు వారు ఇచ్చిన ఆర్డర్లను గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఆర్డరుపై అపీలు చేయడం జరిగింది. CRP 1767/2025 ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పై రెండు ఆర్డర్లుపై Suspend చేయడం జరిగినది. Interim Order IA 1/2025లో ఆ విషయము కూరాకుల శ్రీనివాసరావుకు S/o లేటు సూర్యనారాయణ కూడా తెలియును. అయినప్పటికీ తప్పుడు ప్రకటనలు చేసి మా క్లయింటుకు నష్టపరిచే ఉద్దేశంతో తప్పుడు ప్రకటనలు చేసి ఉన్నారు. షెడ్యూల్ ఆస్థిపై కూరాకుల శ్రీనివాసరావుకు ఎట్టి సంబంధము లేదు. ఇందుమూలంగా యావన్మందికీ ఈ బహిరంగ ఖండన ద్వారా తెలియజేయడమైనది.

నా క్లయింట్ ఇచ్చిన భోగట్టాపై కూరాకుల శ్రీనివాసరావు S/o లేటు సూర్యనారాయణ Insolventగా Principal Sr. Civil Judge, శ్రీకాకుళం వారు ఆయన వేసిన IP 3/2005లో Insolventగా డిక్లేర్ చేసి ఉన్నారు. ఆయనకు ఆస్తులు అమ్ముటకు గాని, కొనుటకు గాని Insolvent Order ప్రకారం చెల్ల నేరవు మరియు ఆయన ఎటువంటి లావాదేవీలుకు Insolventగా అనర్హుడు. అందువలన ఈ బహిరంగ ప్రకటన ఖండన ద్వారా యావత్ ప్రజానీకానికి తెలియజేయడమైనది. నా క్లయింట్‌కు దిగువ షెడ్యూల్ ఆస్థులపై సర్వ హక్కులు కలిగి ఉన్నారని మరియు క్రయ విక్రయాలుకు, తనఖా చేసుకొనుటకు నా క్లయింటు అర్హుడని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూల్ దాఖలా ఆస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్.డి., శ్రీకాకుళం మండలం, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, పాత శ్రీకాకుళం వార్డు, కలెక్టర్ ఆఫీసుకు పోయే రోడ్డుకు తూర్పు శ్రేణిలో యున్నటువంటిన్నీ ఆర్.యస్. నెం. 496/1, టి.యస్. నెం. 414/1కు కలిగినటువంటిన్నీ డోర్ నెం. 14-2-30రుకు దరిలో యున్నటువంటిన్నీ య. 0.16 సెంట్లు లేక 0.064 హెక్టార్లు అనగా 774.4 చ॥గ॥ లేకా 647.708 చ॥మీ॥ విస్తీర్ణం గల ఖాళీ స్థలంకు **హద్దులు:**

తూర్పు: రాకోటి భూలక్ష్మి వగైరాల పల్లం భూమి. దక్షిణ: రాకోటి భూలక్ష్మి వగైరాల పల్లం భూమి. పడమర: 80 అడుగుల వెడల్పు గల రోడ్డు. ఉత్తర: క్షత్రిదౌలత్ రాంసింగ్ గారి పల్లం భూమి కొంత మేర, నీరు పారే బట్టి కొంతమేర.

**పొన్నాడ మాధవి, బండారు నీలకంఠం**

అడ్వకేట్స్, న్యూకాలనీ, శ్రీకాకుళం, సెల్: 80740 11482

## బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ అయిన మాడుగుల శకుంతల W/o లేటు రాధాకృష్ణ, మాడుగుల సుధాకర్, S/o లేటు రాధాకృష్ణ మరియు మాడుగుల వెంకటేశ్వరరావు S/o లేటు రాధాకృష్ణ, Door. No. 2-50, అల్లినగరం న్యూస్ట్రీట్, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా వారిచ్చిన భోగట్టాపై ఇచ్చినటువంటి బహిరంగ ప్రకటన.

నా మొదటి క్లయింట్ భర్త మరియు రెండవ, మూడవ క్లయింట్స్ తండ్రి అయినటువంటి లేటు రాధాకృష్ణ, S/o లేటు రామ్మూర్తి గారు దిగువ షెడ్యూలు ఆస్థి Item No.1ని 1972లో లేటు మల్లిపెద్ది చిట్టిబాబు దగ్గర క్రయచీటీ ద్వారా దఖలుపడినది మరియు దిగువ షెడ్యూల్ ఆస్థిలో Item No. 2 మాడుగుల శకుంతల గారికి వారి తండ్రి మరియు అన్నదమ్ముల ద్వారా పసుపు, కుంకుమల క్రింద రిజిష్టర్ సెటిల్‌మెంట్ డీడ్ ద్వారా దఖలుపడి యున్నది. మా క్లయింట్స్ స్వాధీనంలో ఉన్న దిగువ షెడ్యూల్ ఆస్థిలో కొంతమేర మా క్లయింట్స్ రైస్‌మిల్లు మరియు కొబ్బరితోట కలిగియున్నవి. మల్లిపెద్ది తిరుమలరావు S/o లేటు మురళి, మల్లిపెద్ది శ్రీనివాసరావు, S/o లేటు మురళి మరియు మల్లిపెద్ది వంశీకృష్ణ S/o తిరుమలరావు అనబడే ఆసాములు తప్పుడు దస్తావేజులు సృష్టించి అమ్మజూపడానికి ప్రయత్నం చేయుచున్నారని మా క్లయింట్స్‌కు తెలిసి ఉన్నది. మా క్లయింట్స్ ఎచ్చెర్ల, తహాశీల్దారు గారికి మరియు ఆర్.డి.ఓ., శ్రీకాకుళం వారికి దరఖాస్తు చేసినారు. తదుపరి మా క్లయింట్స్ పేరున మ్యూటేషన్ చేయవలసిందిగా ఇరువురికి లీగల్ నోటీస్ కూడా ఇచ్చి యున్నారు. RDO, శ్రీకాకుళం వారు దిగువ షెడ్యూల్ ఆస్థిని మా క్లయింట్స్ ఇచ్చిన నోటీస్‌కు ఎంక్వైరీ చేసి మ్యూటేషన్ చేయమని ఎచ్చెర్ల తహాశీల్దారు వారికి Endorsement ఇచ్చియున్నారు. కావున దిగువ షెడ్యూల్ ఆస్థిని పై ముగ్గురు ఆసాములు మరియు వారి అన్నదమ్ములు ఎవరికైనను ఎటువంటి క్రయ విక్రయాలు, లేదా తనఖా లేదా అగ్రిమెంట్‌లు గాని చేసుకున్నచో చట్టరీత్యా నా క్లయింట్స్‌పై చెల్లనేరవనియూ, నా క్లయింట్స్ తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని యీ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

**షెడ్యూల్ దాఖలా ఆస్థి**

**ఐటమ్ నెం. 1:** శ్రీకాకుళం జిల్లా, పొందూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్, ఎచ్చెర్ల మండలం, చిలకపాలెం @ అల్లినగరం గ్రామం, పట్టా Nos. 570లో సర్వే నెం. 158/26 గల విస్తీర్ణం Ac. 0.10 సెంట్లు మాత్రమే. పట్టా నెం. 572లో సర్వే నెం. 183/27లో విస్తీర్ణం గల Ac. 0.09 సెంట్లు మాత్రమే మరియు పట్టా నెం. 493లో సర్వే నెం. 183/28 గల విస్తీర్ణం Ac. 0.0.3 సెంట్లు మాత్రమే పల్లపు భూమి యొక్క ఆస్థి.

**ఐటమ్ నెం. 2:** శ్రీకాకుళం జిల్లా, పొందూరు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, ఎచ్చెర్ల మండలం, చిలకపాలెం @ అల్లినగరం గ్రామం, పట్టా నెం. 493లో సర్వే నెం. 183/34లో గల విస్తీర్ణం 0.62 సెంట్లు మాత్రమే. మరియు పట్టా నెం. 495లో సర్వే నెం. 183/31లో విస్తీర్ణం గల Ac. 0.31 పల్లపు భూమి యొక్క ఆస్థి.

**పొన్నాడ మాధవి**

అడ్వకేట్, న్యూకాలనీ, శ్రీకాకుళం, సెల్: 80740 11482


(c) eenadu

ఈనాడు
తిరుపతి
సోమవారం డిసెంబరు 15, 2025 5

## సీఎం సహాయనిధి అందుకోండిలా..!

అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం పొందలేని నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆదుకుంటోంది. వైద్యచికిత్స ఆసుపత్రి రసీదులు భద్రపర్చుకుని స్థానిక ఎమ్మెల్యేలకు అందజేయాల్సి ఉంటుంది. వారి సిఫార్సులతో సీఎంవో కార్యాలయానికి పంపుతారు. అక్కడ రసీదుల పరిశీలన పూర్తయ్యాక దరఖాస్తుదారుల పేరిట చెక్కులు జారీ చేస్తారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రెండు వారాలకోసారి చెక్కులు విడుదలవుతుండటంతో బాధితుల చేతికి త్వరగానే నగదు అందుతోంది.

### దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి..

తెల్ల రేషన్‌కార్డుదారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సాయం కోసం ఏ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పత్రం, చికిత్స ఖర్చుల వివరాలు తెలియజేయాలి. చికిత్స పూర్తయితే ఆ వివరాలు, ఖర్చులు, బిల్లులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు పత్రం తీసుకున్నాక తుది రసీదులు సమర్పించాలి. బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ పత్రాలను వైద్య ఖర్చుల రసీదులకు జత చేయాలి. దరఖాస్తులు కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంటాయి. వాటిని కార్యాలయ సిబ్బంది పరిశీలించి వైద్య ఖర్చుల అవసరాన్ని బట్టి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేస్తారు.

దరఖాస్తు ఫారం, ఇతర సమాచారం కోసం : https:///apcmf.ap.gov.in

**- న్యూస్‌టుడే, పుత్తూరు**

## నేటి నుంచి శిరస్త్రాణం ధరిస్తేనే పెట్రోల్

**తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే:** సోమవారం నుంచి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వాటిని ధరించని వారి వాహనాలకు పెట్రోల్ నింపరాదనే నిర్ణయాన్ని అమలు చేస్తామని చెప్పారు. శిరస్త్రాణధారణ బరువుగా కాకుండా బాధ్యతగా గుర్తించాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు, భార్యాపిల్లల భవిష్యత్తుని శిరస్త్రాణం రూపంలో తలపై ధరించాలని సూచించారు.

శిరస్త్రాణం ధరించి ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

## ప్రత్యామ్నాయం.. పోషకాలు ఘనం

| జిల్లాలో కార్డులు: | నెలవారీ రాగి పంపిణీ: |
|---|---|
| 5,93,266 | 17,15,785 కిలోలు |
| యూనిట్లు: | జొన్నల పంపిణీ: |
| 17,10,420 | 17,67,643 కిలోలు |

జొన్నలు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** చౌక దుకాణాల్లో బియ్యం తీసుకుంటూ వచ్చిన కార్డు దారులకు బియ్యానికి బదులుగా రాగి, జొన్నలు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా రెండు నెలలుగా వీటి పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రాగులు, సజ్జలు, జొన్నలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో వాటిని తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తుండటం విశేషం.

### పేదలకు అందుబాటులో..

ధనవంతులు ఎంతైనా వ్యయం చేసి అవసరమైన వస్తువులు కొనుక్కోగలరు. పేదలకు కష్టం అవుతుందన్న భావనతో చౌకదుకాణాల్లో ప్రస్తుతం బియ్యంతో పాటు వీటిని అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో వ్యక్తికి ఐదు కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. రెండు నెలలుగా చౌక దుకాణాల ద్వారా బియ్యం నిల్వలు తగ్గించి అవసరమైన వాళ్లకు ఒకరికి కిలో రాగులు, జొన్నల పంపిణీకి జిల్లా పౌరసరఫరాల విభాగం చర్యలు చేపట్టింది. ఈ నెలకు జిల్లా వ్యాప్తంగా 17,10,420 మంది కార్డుదారులు లబ్ధిపొందనున్నారు.

### ఆరోగ్యం లక్ష్యంగా..

మధుమేహం వ్యాధి చాప కింద నీరులా వ్యాప్తి చెందుతోంది. వయసుతో సంబంధం లేకుండా పలువురు ఈ వ్యాధిన పడుతున్నారు. బియ్యంతో తయారు చేసిన అన్నంలో ఎక్కువగా చక్కెర, పిండి పదార్థాలు ఉండటంతో అన్నం తగ్గించాలని వైద్యులు చెబుతుండటంతో అందరూ రాగి, జొన్నలతో తయారయ్యే ఆహార పదార్థాలు తీసుకునేందుకు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో వీటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

## వరద ఛాయలు.. కన్నీటి చారలు

పాతపాళెం అరుంధతివాడ పరిధిలో పక్కాగృహం దుస్థితి



ఇసుకలో కూరుకుపోయిన నియంత్రిక, స్తంభం

రాయల చెరువు గండితో ఊహించని వరద ఆ పల్లెల జీవితాలను కన్నీటిమయం చేసింది. ప్రాణాలు కాపాడుకుంటే చాలు దేవుడా అన్నంతలా చుట్టేసింది. పశువులు, గృహోపకరణాలు కొట్టుకుపోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి కేవీబీపురం మండలంలోని కళత్తూరు, పాతపాళెం, ఎస్ఎల్‌పురం పంచాయతీల ప్రజలది. వరి, వేరుసెనగ పంటలు పూర్తిగా ఇసుకమేటల కింద పూడిపోయాయి. శ్రీగంధం, మహాగని చెట్లను వరద వేళ్లతో పెకలించడంతో పూర్తిగా ఎండిపోయాయి. రాయలచెరువు ప్రమాదం జరిగి 37 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ముంపు మిగిల్చిన పెనువిషాదం కళ్లకు కడుతోంది. పూర్తి సాయం కోసం అర్థిస్తున్నారు.

**-న్యూస్‌టుడే, కేవీబీపురం**



రాయలచెరువు లోపలి భాగం నెర్రెలిచ్చిన భూమి

**సాంకేతిక సమస్యలతో..**

సాంకేతిక సమస్యలతో కొన్ని కుటుంబాలకు పరిహారం ఆలస్యమైంది. త్వరలో జమ చేస్తాం. పాడి రైతులకు రూ.1.20 కోట్లు మంజూరైంది.

**- భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో**

కళత్తూరులో కూలిన గోడ వద్ద బాధితురాలు కాటమ్మ

ఎస్ఎల్‌పురం-కళత్తూరు మార్గంలో దెబ్బతిన్న కాజ్‌వే

ఎండిపోయిన శ్రీగంధం, మహాగని చెట్లను చూపుతున్న బాధితుడు బాబుశెట్టి

## విద్యుత్తు సేవలకూ.. ఓ లెక్కుంది..!

**చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే :** విద్యుత్తు వినియోగదారులకు సకాలంలో సేవలు అందజేసేందుకు.. ఒక్కో సేవకు ఒక్కో లెక్క ప్రకారం గడువు విధించారు. నిర్దేశిత సమయంలోగా సంబంధిత అధికారులు ఆ సమస్యను పరిష్కరించాలి. ఈ మేరకు పౌరసేవల సమయపాలన పట్టిక ఏర్పాటు చేశారు. గడువు ప్రకారం సేవలు అందించకుంటే సదరు వినియోగదారుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. సేవలను బట్టి రోజుకు రూ. 100-500 వరకు పరిహారం పొందొచ్చు.

| గడువు (గంటల్లో) | పట్టణాల్లో | గ్రామాల్లో |
|---|---|---|
| సాధారణ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ | 4 | 12 |
| ఓవర్ హెడ్‌లైన్ బ్రేక్‌డౌన్ | 6 | 24 |
| నియంత్రిక వైఫల్యం | 24 | 48 |
| మీటరు ఫిర్యాదులు(రోజులు) | 7 | 15 |

**ఎన్ని రోజుల్లో పరిష్కారం చూపాలంటే..**

- కొత్త కనెక్షన్: మూడు
- కాలిపోయిన మీటరు మార్పిడి: 7
- వినియోగదారుడి కారణంగా మీటరు కాలిపోతే: 7
- విద్యుత్తు సరఫరా (ఎల్‌టీ): 7
- 11కేవీ నుంచి: 15
- 33కేవీ నుంచి : 30
- అదనపు హెచ్‌టీసీ: 45
- యాజమాన్య హక్కు బదిలీ: 7
- కేటగిరీ మార్పు: 7
- ఎల్‌టీ1 ఫేజ్ నుంచి త్రీఫేజ్: 30
- ఎల్‌టీ నుంచి హెచ్‌టీకి: 60

## బరి తెగించారు.. చిన్నా!

- కుంట పోరంబోకులో అక్రమంగా రోడ్డు నిర్మాణం
- పుత్తూరులో వైకాపా నేతకు కూటమి నాయకుడి సహకారం

ప్రధాన రహదారి పక్కనే రియల్టర్ల భూమికి వేసిన రోడ్డు

**ఈనాడు, చిత్తూరు:** రాష్ట్రంలో అధికారం మారినా వైకాపా నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది.. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు డేగల్లా వాలిపోతున్నారు.. దీనికి కొందరు కూటమి నాయకులు సహకారం అందిస్తుండటం గమనార్హం..

పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు ఆనుకుని పుత్తూరు పురపాలిక పరిధిలోని చెర్లోపల్లి రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 126/7, 126/10లో కుంట పోరంబోకు భూమి 82 సెంట్లు ఉంది. పక్కనే చిన్నరాజుకుప్పం ముస్లిం, ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ స్థలం వెనక చిన్నరాజుకుప్పానికి చెందిన ఓ వైకాపా నాయకుడి కుటుంబ భూములు ఉన్నాయి. రూ.కోట్ల విలువజేసే సదరు భూములను తిరుపతి, పుత్తూరు చెందిన ఇద్దరు రియల్టర్లకు ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు.

### అడ్డం తిరిగిన కథ..

భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంపై సదరు రియల్టర్లు ప్రశ్నించడంతో వైకాపా నేత ముందున్న కుంట పోరంబోకు మీదుగా దారి వేసేందుకు యత్నించగా అక్కడి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో రియల్టర్లు వైకాపా నాయకుడికి ఇవ్వాల్సిన భారీ నగదును నిలిపేశారు.

### సర్దుబాటు చేశారిలా..!

భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు నియోజకవర్గంలోని ‘చిన్న’ నేతను ఆశ్రయించగా ఆయన వైకాపా నేతలతో కలిసి ముస్లింకాలనీ వాసుల్లో కొందరిని పిలిచి మాట్లాడారు. వారిని నయానా భయానా ఒప్పించి వెంటనే కొంత మొత్తాన్ని వారికి, సమస్య పరిష్కరించినందుకు సదరు ‘చిన్న’ నేతకు పెద్ద మొత్తంలో ఆ రియల్టర్లు నగదు ముట్టజెప్పినట్లు సమాచారం. తదనంతరం పనులు చకచకా మొదలై కుంట భూమిలో రోడ్డు నిర్మాణం పూర్తయింది. కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటి పైమాటే. పుత్తూరు-చిత్తూరు ప్రధాన రహదారిలో విలువైన కుంట పోరంబోకు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ‘చిన్న’ నేత హుకుం జారీచేయడంతోనే వారు ‘మౌనం’ దాల్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## వాక్యమే.. ఊరైంది

వ్యాకరణ పరిభాషలో కొన్ని పదాలు కలిపితే వాక్యం అంటారు. కానీ ఆ పేరుతో ఓ ఊరి పేరే ఉందని తెలిస్తే అవాక్కవ్వాల్సిందే. బాలాయపల్లి మండలం నిండలి పంచాయతీలోని మజరా గ్రామమే వాక్యం. గ్రామానికి ఈ పేరు ఎలా వచ్చిందనేది పూర్వీకులకు సైతం తెలియని పరిస్థితి. ఊరిలో మూడు కాలనీల్లో 266 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ జనాభా 750. గ్రామానికి చుట్టూ మూడు

మండలాలు, రెండు జిల్లాలు సరిహద్దు ఉన్నాయి. ఊరికి పడమరన డక్కిలి, ఉత్తరాన నెల్లూరు జిల్లా సైదాపురం, తూర్పు, దక్షిణాన బాలాయపల్లి మండలాలు ఉన్నాయి. గ్రామం నిమ్మ దిగుబడులతో ప్రత్యేక గుర్తింపు సాధించింది.

**- న్యూస్‌టుడే, బాలాయపల్లి**

## నాణ్యత చిక్కీపోయినా సరఫరా

- గోదాముల తనిఖీ మరిచిన అధికారులు

**తిరుపతి (విద్య), న్యూస్‌టుడే:** విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన అతికీలకమైన చిక్కీల సరఫరాలో ఇటీవల పలు లోటుపాట్లు వెలుగు చూశాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వారంలో మూడురోజుల పాటు చిక్కీలు అందజేస్తోంది. అయితే జిల్లాలో ఇటీవల యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లోని పాఠశాలలకు నాణ్యతలేని, మెత్తబడి బూజుపట్టిన చిక్కీలు సరఫరా చేయగా అక్కడి ఉపాధ్యాయులు గుర్తించి విద్యార్థుల నుంచి వాటిని వెనక్కు తీసుకున్నారు. అంతకుముందు జిల్లాలోని మరో 13 పాఠశాలలకు నాణ్యతలేని చిక్కీలు సరఫరా చేసినట్లు వెల్లడైంది. గుత్తేదారు నుంచి ఎటువంటి చిక్కీలు పాఠశాలలకు వెళ్తున్నాయో తనిఖీ చేసిన దాఖలాలు లేవని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

### 60 రోజుల్లోపు వాడాలి

వారంలో మూడు రోజులు చిక్కీలు, మరో మూడు రోజులు రాగిజావ, ఐదు రోజులపాటు కోడి గుడ్డు, శనివారం బెల్లంతో తయారుచేసిన తీపి పొంగలి ఇవ్వాల్సి ఉంది. వాస్తవానికి చిక్కీలు 60 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. తర్వాత మెత్తబడి దుర్వాసనతోపాటు బూజుపట్టి తినేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాంటి చిక్కీలు తింటే విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

### నిబంధనలు ఇలా..

విద్యాశాఖ నుంచి ఇద్దరు వెళ్లి గోదాముల్లోని నిల్వలు పరిశీలించాలి. నాణ్యత, తేదీ, లేబుల్ వంటివి తనిఖీ చేయాలి. టెండర్‌లో పేర్కొన్న మేరకు పరిమాణం, నాణ్యత ఉందా? లేదా? చూడాలి. బార్‌కోడ్ స్కాన్ చేసి పరిశీలించాలి. అన్నీ నిర్ధారించుకున్నాకే పాఠశాలల సరఫరాకు ఆమోదం తెలపాలి. నాణ్యత లేని చిక్కీలు సరఫరా చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, సదరు హెచ్‌ఎంలు వాటిని వెంటనే వెనక్కు పంపారని, నాణ్యత విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు.

## అటల్.. బాటలో

వాజ్‌పేయి చిత్రంతో రంగోలి

భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా చేపట్టిన యాత్ర ఆదివారం ఇక్కడికి చేరుకుంది. మర్రిగుంత కూడలిలో ఏర్పాటు చేసిన అటల్ విగ్రహాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్‌ధామీ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, భాజపా నేతలు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి, వరప్రసాద్, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

## హిమ వర్షం

శీతాకాలం మొదలై చలి విపరీతమైన వణుకు పుట్టిస్తోంది. అసలు హిమాలయాల్లో ఉన్నామా అన్నట్లు మంచు నిత్యం కప్పేస్తోంది. పుత్తూరు పట్టణంలో శనివారం కనిపించిన ఈ దృశ్యాన్ని ‘న్యూస్‌టుడే’ క్లిక్‌మనిపించింది. **- న్యూస్‌టుడే, పుత్తూరు**

## జూడోలో మనోడు

నంద కుమార్

యుద్ధక్రీడల్లో ఒకటైన జూడోలో తిరుపతికి చెందిన యువకుడు సత్తాచాటుతున్నాడు. ఇటీవల భోపాల్ వేదికగా జరిగిన దక్షిణాది అంతర విశ్వవిద్యాలయాల ఛాంపియన్‌షిప్‌లో టాప్- 4లో నిలిచి అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యాడు.

- తిరుపతి గ్రామీణ మండలం ఎమ్మార్‌పల్లిలోని చానప్పకాలనీకి చెందిన ఆర్.రాము, ఆర్.కవిత దంపతుల కుమారుడు పి.నందకుమార్. తితిదే ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ తుది సంవత్సరం అభ్యసిస్తున్నాడు. జూడోపై ఆసక్తితో పన్నెండేళ్ల వయసులో శాప్ శిక్షకుడు గోపి వద్ద సాధన మొదలుపెట్టాడు. మెలకువలతో జిల్లా, రాష్ట్రస్థాయిలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించి మొత్తం 17 వరకు పతకాలు కైవసం చేసుకున్నాడు.
- ఎస్వీయూ తరపున అంతర కళాశాల, అంతర వర్సిటీ పోటీల్లోనూ సత్తా చాటుతున్నాడు. నవంబరు 14 వరకు భోపాల్ వేదికగా జరిగిన దక్షిణ, పశ్చిమ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ప్రత్యర్థిని మట్టికరిపించి టాప్-4లో నిలిచి జనవరిలో పంజాబ్ రాష్ట్రం వేదికగా జరగనున్న అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. స్వర్ణ పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని, ఒలింపిక్స్‌లో రాణించడమే తన ధ్యేయమని చెబుతున్నాడు నందకుమార్.

**- న్యూస్‌టుడే, తిరుపతి (క్రీడలు)**

## 2 దూడల నుంచి.. రూ.2 లక్షల ఆదాయానికి...

**కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే:** అసలే పేదరికం.. ఇంటర్మీడియట్ వరకు చదివిన భర్త ఉపాధి కోసం బెంగళూరు పయనం.. వచ్చే రూ.15 వేల జీతంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో ఏడో తరగతి చదివిన ఆ ఇల్లాలు రెండు దూడలు కొని పాడి రంగంలోకి దిగారు. నేడు 17 ఆవులు పెంచుతూ పాలు సేకరిస్తున్నారు. నెలకు లక్షల్లో ఆదాయం సంపాదిస్తూ ఉత్తమ మహిళా రైతుగా ఎదిగారు గరిగచిన్నేపల్లికి చెందిన ఆర్.జయవేల్ భార్య నాగజ్యోతి.

### యూరియా లేకుండా గ్రాసం..

ఆవులకు మేతకోసం 1.50 ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేపట్టారు. తొలుత యూరియా వినియోగించేవారు. ఖర్చులు తగ్గించాలనే లక్ష్యంతో ఆవుల మూత్రం వృథాగా పోకుండా ఆవరణలో బావి తవ్వించారు. దానికి మోటారు అమర్చి మూత్రం పొలానికి మళ్లిస్తూ సారవంతమైన పశుగ్రాసం పండిస్తున్నారు. ఈమె కష్టం, మెలకువలను మెచ్చిన ఇండియన్ డెయిరీ సంఘం ఇటీవల తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ పాడి మహిళ పురస్కారానికి అందజేసింది.

### రోజుకు 200 లీటర్ల పాలు..

2016లో నాగజ్యోతి రెండు దూడలు కొన్నారు. వాటి ద్వారా ఆదాయంతో ఆవులు కొంటూ వచ్చారు. అలా ఇప్పుడు రోజుకు 200 లీటర్ల పాలను డైరీకి విక్రయిస్తున్నారు. ఖర్చులు పోనూ నెలకు రూ.2 లక్షలకుపైగా ఆదాయం సంపాదిస్తూ పిల్లలను చదివిస్తున్నారు.

మా నిపుణులను సంప్రదించండి- అపోలో చెన్నై
ఆర్థ్రోస్కోపి & మోకాలి మార్పిడి క్లినిక్
@ చిత్తూరు & అరగొండ
Apollo HOSPITALS CHENNAI
లక్షణాలు/రుగ్మతలు
- మోకాలు & తుంటి కీళ్ల సమస్యలు
- మోకాలు & తుంటి మార్పిడి శస్త్రచికిత్స కొరకు అభిప్రాయం కోరడం

డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి
MS (Ortho), FRCS (UK), M.D (France),
మోకాలి మార్పిడి, ఆర్థ్రోస్కోపి & రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జన్
చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్
అపోలో హాస్పిటల్స్, చెన్నై & వారి బృందం డా.శశిధర్ రెడ్డి &
డా.ప్రవీణ్ J, MBBS, MS (Ortho) అసోసియేట్ కన్సల్టెంట్

శుక్రవారం, 19 డిసెంబర్ 2025
ఉ.11.00గం. - మ.1.00గం.
అపోలో క్లినిక్
# 17-111
సుందరయ్యర్ వీధి
చిత్తూరు-517 001.

శుక్రవారం, 19 డిసెంబర్ 2025
మ.2.00గం - సా.4.00గం.
అపోలో హాస్పిటల్స్,
అరగొండ (గ్రా)
తవనంపల్లి (మం.)
చిత్తూరు (జిల్లా)

అపాయింట్‌మెంట్లకు కాల్ చేయండి. 91006 81066 / 98854 15915

## చోటా నేత.. చాటుగా మేత

యంత్రాలతో తరలిస్తూ దోపిడీ

తడ- సూళ్లూరుపేట సరిహద్దులో జాతీయ రహదారి పక్కన పాములకాలువలో యంత్రాలతో ఇసుక దోపిడీ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కాళంగి నది, పాముల కాలువలో ఇష్టారీతిన తవ్వకాలు సాగడంతో సూళ్లూరుపేట పట్టణంలో భూగర్భ జలాలు తాగేందుకు పనికి రాకుండా ఉప్పుగా మారాయి. నిర్మాణాలకు ఎవరైనా కాలువలో ఇసుక తరలించే ప్రయత్నం చేస్తే సూళ్లూరుపేటకు చెందిన చోటా నేత స్వయంగా పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫోన్‌చేసి మరీ పట్టిస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు అదే నేత ఎంచక్కా దోపిడీకి పాల్పడుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కాలువలోకి దిగే చోట ఇసుక తరలింపునకు లోతుగా తవ్వకాలు చేపట్టారు. పశువుల కాపర్లు, స్థానికులు ఎవరైనా కాలువలోకి దిగితే మునిగిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. **- న్యూస్‌టుడే, తడ**

104FM Tirupati
104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వానేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499



ప్రథమ వర్ధంతి
యహోవా భక్తుల మరణము
ఆయన దృష్టికి విలువగలది
కీర్తనలు: 116:15
కాలం గడుస్తున్నా
నీ సుమధుర జ్ఞాపకాలు
సువాసనలు
వెదజల్లుచున్నాయి.
కీ॥శే॥ D.JOSES CHARLES VIJAYRAJ
Advocate
(S/o M.SAROJA & LATE S.DEVADAS)
Retd Postmaster
Chittoor.
జననం 10.06.1955
మరణం 15.12.2024
ప్రేమతో సహోదరి
శ్రీమతి &
శ్రీ ఎం.రత్నకుమార్
మరియు
కుటుంబ సభ్యులు
చిత్తూరు

(c) eenadu

# ఆలయ దర్శిని

## కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో



**నిజరూప దర్శనం:** ఉ: 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా: 4.30-5.00

**సర్వదర్శనం:** ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30, మధ్యాహ్నం: 12.00 సాయంత్రం: 4.30, రాత్రి: 7-9 గంటలు.

**నిత్య సేవలు**

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00 వినాయకుడికి అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

## తిరుమల శ్రీవారి ఆలయంలో

**నిత్యోత్సవాలు:** ఈనెల 17 నుంచి తెల్లవారుజామున 3 గం.కు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. మంగళ, బుధ, గురువారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సా.5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

**సర్వదర్శనం:** తెల్లవారుజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు.

**వారోత్సవాలు:** ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

–న్యూస్‌టుడే, తిరుమల

## ముక్కంటి ఆలయంలో

**ఉదయం:** 3.00: పురవీధుల్లో జేగంట, 4.00: మంగళవాయిద్యాలు, 4.15: గోమాత పూజ, తిరుమంజనం, 5.00: ప్రథమకాల అభిషేకం (ఏకాంతం), 6.00: ద్వితీయ కాలాభిషేకం, 7.00: పరివార దేవతలకు నివేదన, 7.30: గోష్టిదేవత పురవీధుల ఉత్సవం, 10.30: ఉచ్చికాల అభిషేకం

**సాయంత్రం:** 5.00:ప్రదోష కాలాభిషేకం 6.30: నీరాజన మంత్రపుష్పం

**సర్వదర్శనం:** ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు.

**రాహు, కేతు పూజలు**

ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు

**అభిషేకాలు:** శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం). శుక్రవారం: మనోన్మణికి ఊంజల్‌సేవ

● శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9.00 గంటలకు, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 8.30కు పల్లియర పూజ నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

## అధికారం ఉండగా.. ఆరు అడుగులూ వదలం

ఆక్రమించిన స్థలంలో బోరు వేసి సాగుకు సిద్ధం చేసిన దృశ్యం

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** అధికారం ముందు అన్నీ దిగదుడుపే.. అన్న చందానికి అధికారి విలువైన శ్మశాన, కాలువ స్థలం ఆక్రమణకు గురైంది. కేవీబీపురం మండలం పీకేపంగ్రిగి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 34లో 3.78 ఎకరాల్లో సుమారు 1.50 ఎకరాలను గిరిజనులు, బీసీలు శ్మశాన స్థలంగా వినియోగించుకుంటున్నారు. ఈశ్మశాన స్థలానికి వెళ్లే మార్గాన్ని స్థానికుడు ఆక్రమించడంతో ఆ ఏడాది సెప్టెంబరులో రెవెన్యూ అధికారులు చొరవతో సర్వే చేసి ఆక్రమణలను తొలగించి సర్వేరాళ్లను పాతారు. ఈమార్గానికి జడ్పీ నిధులు రూ.4.50 లక్షలను కేటాయించారు. ఈ మార్గంలోని ఆక్రమణలు నుంచి తొలగించిన స్థానిక ప్రజా ప్రతినిధి బంధువులు మాత్రం ఎస్సీ, బీసీలు శ్మశాన దేహాలు పూడ్చిపెట్టే స్థలం సుమారు 1.50 ఎకరాలను దర్జాగా ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. అయినా పట్టించుకోక పోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రోశయ్యను వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదని, రెండు రోజుల్లో సమస్య ఉన్న ప్రాంతంలో సర్వే నిర్వహించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## క్రీడల్లో అగ్రదేశంగా భారత్

**తిరుపతి ఐఐటీలో ఘనంగా ప్రారంభమైన 58వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్‌మీట్**

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సతీష్ శివలింగం, ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** బహుక్రీడలకు నిలయమైన భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత సతీష్ శివలింగం తెలిపారు. తిరుపతి ఐఐటీలో ఆదివారం ఘనంగా 58వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభమైంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ సహకారంతో తిరుపతి ఐఐటీ ప్రధాన క్రీడా మైదానంలో నిర్వహించే క్రీడా పోటీలకు దేశంలోని 23 ఐఐటీల నుంచి క్రీడాకారులు హాజరై సైనిక బ్యాండ్, దేశభక్తి సంగీత ప్రదర్శనతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ శివలింగం సమావేశంలో మాట్లాడుతూ క్రీడల్లో భారతదేశం సాధించిన ఖ్యాతిని వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ మద్రాస్‌లో జరిగిన క్రీడా పోటీలను గుర్తు చేసుకుని అనుభవాలను వివరించారు. అనంతరం టెన్నిస్ పోటీలను నిర్వహించారు. విద్యార్థుల కార్యదర్శి అజయ్, ప్రొఫెసర్ ఎన్ఎన్ మూర్తి, అయ్యప్పన్, పవన్ పాల్గొన్నారు.

## గూడూరు-గుమ్మడిపూండి మధ్య రైల్వేలైను

**రూ.1,723 కోట్లతో డీపీఆర్ సిద్ధం**

**సరుకు రవాణాకు అనుకూలంగా**

నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద సరకు రవాణాకు సిద్ధం చేస్తున్న లైన్లు

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే

అభివృద్ధి భారత్‌ను ఆవిష్కరించే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం పశ్చిమ తీరంలో వ్యాపార వాణిజ్య, పారిశ్రామిక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు, పారిశ్రామిక కారిడార్లలో భాగంగా రహదారులు, ఓడరేవులు, రైలు మార్గాలను అభివృద్ధి చేస్తుండటం తెలిసిందే. ఇందులో భాగంగా గూడూరు-గుమ్మిడిపూండి మధ్య తమిళనాడును కలుపుతూ సుమారు రూ.1,723 కోట్ల వ్యయంతో మూడు, నాలుగు అదనపు లైన్ల నిర్మాణానికి రైల్వేశాఖ సన్నాహాలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి కేంద్రం ఆమోదం పొందింది.

తీరప్రాంతాల్లో ఉన్న ఓడరేవులకు అనుసంధానంగా, సరకు రవాణాకు ప్రత్యేకంగా, గూడ్స్ సాఫీగా వెళ్లేందుకు ఇప్పుడు ఉన్న రెండు లైన్లు కాకుండా మూడు, నాలుగు లైన్లు ఏర్పాటు చేయనున్నారు. సరకు రవాణాకు ఖరగ్‌పూర్-చెన్నై మధ్య ప్రత్యేక రైల్వే కారిడార్ నిర్మించాలని మొదట రైల్వేశాఖ భావించింది. అధిక వ్యయం అవుతుందని ఈ ప్రతిపాదన నిర్ణయాన్ని పక్కన పెట్టింది. ఈ ప్రతిపాదనలకు ముందే హావ్‌డా-చెన్నై ప్రధాన రైల్వే లైన్‌లో ఆయా మార్గాల్లో 3, 4 అదనపు లైన్ల నిర్మాణాన్ని వేగంగా నిర్మిస్తుండటం తెలిసిందే. ఇందులో భాగంగా విజయవాడ-గూడూరు 288 కి.మీ. మేర రూ.6,238 కోట్లతో మూడో లైను నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 260 కి.మీ. పూర్తయింది. ఇవికాకుండా ఇదే మార్గంలో విజయవాడ-గూడూరు మధ్య 293 కి.మీ. నాలుగో లైను నిర్మాణానికి కూడా టెండర్లు ఖరారు చేశారు. వీటితోపాటు తమిళనాడును అనుసంధానం చేసే దిశగా గూడూరు నుంచి సూళ్లూరుపేట వరకు, సూళ్లూరుపేట నుంచి గుమ్మిడిపూండి వరకు 3, 4 లైన్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేశారు. గత నెలలో రైల్వే జీఎం కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు.

**కొత్తగా నిర్మించనున్న 3, 4 రైల్వేలైన్లు**

| మార్గం | దూరం (కి.మీ) | వ్యయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| గూడూరు-సూళ్లూరుపేట | 55 | 1,248 |
| సూళ్లూరుపేట-గుమ్మిడిపూండి | 18 | 475 |

**ఇవీ ప్రయోజనాలు**

మూడు, నాలుగు లైన్లు అందుబాటులోకి వస్తే ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు వేగంగా పరుగులు తీస్తాయి. ఒకటి, రెండు లైన్లలో ప్రయాణికుల రైళ్లు మాత్రమే నడిచే అవకాశం ఉంటుంది. కొత్తగా నిర్మించే లైన్లు చిన్న చిన్న స్టేషన్లను అనుసంధానం లేకుండా వెళ్లే అవకాశం ఉంది.

## హైవే.. అయితేనేం ఆక్రమించేయ్

● నాయుడుపేట ఆనని అపార్ట్‌మెంట్ ఎదురుగా 71 జాతీయ రహదారి ఆనుకుని సర్వే నంబరు 157-1, 4, 5లో 2 ఎకరాలను స్థిరాస్తి వ్యాపారులు కొన్నారు. తరువాత జాతీయ రహదారి సరిహద్దుగా వేసిన ప్రహరీ గోడల్ని తొలగించారు. అవేమీ కనిపించకుండా గ్రావెల్‌తో నింపేశారు. సొంత స్థలంలా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

**నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:** ఎకరా రూ.5-10 కోట్లు పలికే పొలాలు. 71 జాతీయ రహదారి ఆనుకుని ఉండే ప్రభుత్వ, ప్రైవేటు భూముల్ని కలిపి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తోలి ప్లాట్లుగా మార్చారు. నిబంధనల మేరకు వసతుల కల్పన కోసం పదిశాతం భూమి వదిలారు. కానీ ఆ చర్యలేవీ ఇక్కడ కనిపించడం లేదు. జాతీయ రహదారి అంచు ప్రహరీ గోడల్ని సైతం కలిపేసి అమ్మేస్తున్నారు. రహదారి పొడవునా 100 మీటర్ల పైగానే పొడవుతో రహదారి భూమిని లేఅవుట్‌లో కలిపేసుకున్నారు. గతంలో ఓసారి జాతీయ రహదారుల అధికారులు అడ్డుకోవడంతో పనులు ఆపారు. ప్రస్తుతం మళ్లీ పనులు జోరుగా చేస్తున్నారు. వ్యాపారులతో కలిసి రాజకీయ నాయకులు ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారులు పరిశీలించి జాతీయ రహదారిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీబేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం

ఆలయం వద్ద భక్తుల సందడి

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారి ఆలయం ఎదురుగా వెలిసిన శ్రీబేడి ఆంజనేయస్వామికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. తితిదే ఆరోగ్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## సర్వదర్శనానికి 12 గంటలు

**తిరుమల, తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే:** శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 80,113 మంది దర్శించుకున్నారు. రూ.3.71 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

**13 వేల టోకెన్ల జారీ..** తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 13 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

## శ్రీవారి దివ్యప్రసాదములు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, రచయిత రమణదీక్షితులు తదితరులు

**తిరుమల, న్యూస్‌టుడే:** 'శ్రీవారి దివ్యప్రసాదములు' పుస్తకాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. స్థానిక తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్‌తో పుస్తక రచయిత, శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు ఆవిష్కరింపజేశారు. వీరితో పాటు సహా రచయిత కోటా నీలిమ, శ్రీఅష్టోత్తరశత చుక్కల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాజమహేంద్రవరం గొల్లపూడి వీరాస్వామి సన్ పబ్లిషర్స్ బుక్ సెల్స్ పుస్తకాన్ని ముద్రించారు. భక్తులు శ్రీవారి ప్రసాదాల విశిష్టతను తెలుసుకుని వారి గృహాల్లో, ఆలయాల్లో, ఉత్సవాల్లో సులభంగా ప్రసాదాలు తయారు చేసుకునేలా పూర్తి సమాచారాన్ని పుస్తకంలో అందుబాటులోకి తీసుకొచ్చామని రమణదీక్షితులు తెలిపారు.

## సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** ఈ నెల 26 నుంచి జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి తిరుపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం పోలీసు ఉన్నతాధికారులు, వర్సిటీ అధికారులతో కలిసి సభా ప్రాంగణాలు, పర్యటన మార్గాలను పరిశీలించారు. భద్రత, సమన్వయ అంశాలపై కీలక సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ వెంకటనారాయణ, భక్తవత్సలం, చెంచుబాబు పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రాధాన్యం.. విద్యార్థుల్లో వికాసం

### పాఠశాలలకు క్రీడా ఉపకరణాలు

పంపిణీ చేసిన ఉపకరణాలు

**తిరుపతి విద్య, శ్రీకాళహస్తి:** మైదానపు ఆటలను ప్రోత్సహించి విద్యార్థుల్లో క్రీడా వికాసాన్ని పెంపొందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగ్గట్టుగా అన్ని పాఠశాలలకు అవసరమైన క్రీడా ఉపకరణాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాలకు సంబంధించి 2,238 పాఠశాలలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఫౌండేషన్, ప్రీప్రైమరీ పాఠశాలలకు క్రీడా ఉపకరణాల కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**జిల్లాలో పాఠశాలలు**

- ఫౌండేషన్: 1,054
- ప్రీప్రైమరీ: 301
- ఆదర్శ: 613
- ప్రాథమికోన్నత: 08
- ఉన్నత: 262

**స్థాయిని బట్టి పరికరాలు:** పాఠశాల స్థాయి, అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలకు అనుగుణంగా క్రీడా పరికరాల కిట్లను పంపిణీ చేయనుంది. ఇందుకు సంబంధించి ఆర్నెల్ల క్రితమే ఆయా పాఠశాలల్లోని క్రీడా మైదానాల వసతి, విద్యార్థుల సంఖ్య, అవసరమైన క్రీడా పరికరాలు తదితర అంశాలకు తగ్గట్టుగా నివేదికలను విద్యాశాఖ తెప్పించుకుంది. ఆ ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోపు వాటికి రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.15 నుంచి రూ.17 వేలల్లోపు, ఉన్నత పాఠశాలలకు రూ.25 నుంచి రూ.30 వేలల్లోపు విలువైన క్రీడా ఉపకరణాల కిట్లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ● క్రికెట్ క్రీడా పరికరాలతో పాటు త్రోబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, త్రోబాల్, స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చదరంగం, ఫుట్ బాల్, కబడ్డీ, విలువిద్యకు సంబంధించిన ఉపకరణాలు కిట్‌లో ఉన్నాయి.

## సిందూర గణపతి.. ప్రకృతి ప్రణతి

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పాపవినాశనానికి వెళ్లే మార్గంలో జాపాలి క్షేత్రంలో శ్రీఆంజనేయ స్వామి కొలువై ఉన్నాడు. ఆవరణలో దశాబ్దాల కాలంనాటి భారీ మామిడి చెట్టు కాండం వద్ద ఏర్పడిన సహజ వినాయకుని ప్రతిమకు సిందూరం పూసి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు.

-ఈనాడు, తిరుపతి


EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, CHINTHAPATLA SNETHA (OLD NAME). D/o C. Muragaiah, D.No:1-6/4, Rajulapalem, Yerpedu, Chittoor, Andhra Pradesh. 517619. I Changed my Name to CHINTAPATLA SNETHA. Henceforth, I will be Known as CHINTAPATLA SNETHA.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

CHITTOOR, Ramnagar Colony, Main Road, Near RTC 1 Depot, 75x200 Total 15000sft East Face Vacant Site for SALE. 8500511987.

పుత్తూరు - నగరి మునిసిపాలిటీలో తక్షణమే ఇల్లు కట్టుకోవడానికి తక్కువ ధరకే రెసిడెన్షియల్/ కమర్షియల్ ప్లాట్స్ అమ్మబడును. మధ్యవర్తులు లేరు. ✆ 99515 17335.

తిరుపతి మోగాసిటీలో తక్కువ బడ్జెట్‌కే తూర్పుముఖం గల తుడా అప్రూవల్ ప్లాట్ తక్కువ ధరకు అందుబాటులో కలవు. ✆ 82470 75857, 94943 92069.

కోట క్రాస్‌రోడ్డు దుగరాజపట్నం NHకు ఆనుకొని ఉన్న కమర్షియల్ & రెసిడెన్షియల్‌కు అనువైన 25 or 50 అం॥ ప్లాట్స్ అమ్మబడును. ✆ 7893888794

JOBS

రాధాక్రిష్ణ స్టీల్స్. తిరుపతి అనుభవము కలిగిన లైసెన్సు గల డ్రైవర్లు కావలెను. ✆ 98663 01764.

SALES ENGINEER (Male - 1No) Exp: 0-3y. Qua: Any Degree, Telugu Must Sal: 15-20K/ Month + Incentive. Location: Chittoor. 7382936829, 8978407249.

WANTED: TEACHER for Lower/ Higher Section Hindi Subject. Experience 5 yrs. Cont: 99660 52499/ 88012 77691.

WANTED VISHNU CARS (AUTHORIZED MARUTHI SUZUKI DEALER) మారుతి సుజుకి డీలర్ విష్ణు కార్స్ డ్రైవింగ్ స్కూల్ కొరకు నెల్లూరు, తిరుపతిలో పనిచేయుటకు డ్రైవర్లు, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. 91543 33072

నైల్ లిమిటెడ్ రీసైక్లింగ్ ప్లాంట్ గాజుల మండ్యం నందు పనిచేయుటకు షిఫ్ట్ సూపర్‌వైజర్, మెయింటెనెన్స్/ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కావలెను. Q:B.Sc./B.Tech/ Diploma in Mechanical/ Electrical. 91776 89818. Email ID: karthik@ nilelimited. com.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

EENADU THE WAY CLASSIFIEDS B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


## గుట్టలనూ వదలడం లేదు

- రాత్రికిరాత్రి రహస్యంగా
- జేసీబీలతో చదును

చదును చేసిన చిన్నరాజుకుప్పం సమీప గుట్ట

**పుత్తూరు, న్యూస్‌టుడే:** భూముల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది.. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు.. సెలవు రోజులైతే చాలా జేసీబీలు పెట్టి చదును చేస్తున్నారు.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది.

పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలోని చిన్నరాజుకుప్పం దళితవాడకు చెందిన వైకాపా నాయకులు, ఓ కూటమి కార్యకర్తతో కలిసి 15 రోజుల క్రితం గ్రామ సమీప పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు కూతవేటు దూరంలోని గుట్టను జేసీబీతో చదును చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బందితో వెళ్లి పనులు నిలిపివేయించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మళ్లీ ఆ భూమిని అక్రమార్కులు దర్జాగా చదును చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గతంలో పనులు చేసిన సమయంలోనే వారిపై కేసులు పెట్టి ఉంటే మళ్లీ ఆక్రమణకు పాల్పడేవారు కాదు. చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెర్లోపల్లి రెవెన్యూలో ఇప్పటికే ఐదెకరాల మేర చదును చేశారు. పశువులు మేపుకోవడానికి గుట్ట లేకుండా చదును చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆ భూమిలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు..**

గుట్టభూమిని చదును చేసిన వారిని ఇప్పటికే పిలిచి హెచ్చరించాం. ఆదివారం కావడంతో జేసీబీతో చదును చేశారని తెలిసింది. తనకు తెలియగానే పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటికే జేసీబీతో పాటు వెళ్లిపోయారు. చదును చేసిన భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటా. **-వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు**

## ఐఐటీఎంలో ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025

◗ ప్రసంగిస్తున్న క్రికెటర్ సాయి సుదర్శన్ ◗ పతాకావిష్కరణలో డైరెక్టరు కామకోటి

**చెన్నై (వడపళని), న్యూస్‌టుడే:** ఐఐటీ మద్రాస్‌లో 59వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్-2025 ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ తిరుపతిలతో కలిసి నిర్వహిస్తున్న వార్షిక జాతీయ సాయి క్రీడా పోటీలు 21వ తేదీ వరకు జరగనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు సాయి సుదర్శన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ క్రికెట్ ఆటగాడు శ్రీధరన్ శ్రీరామ్, ఇండియా బాస్కెట్ బాల్ టీమ్ కెప్టెన్ ముయిన్ బెక్ హఫీజ్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి. కామకోటి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఐఐటీ మద్రాస్ 'స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అడ్మిషన్స్' పేరుతో క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. ఈ క్రమంలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ అనలిటిక్స్' కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్ క్రీడలను కెరీర్‌గా కొనసాగించాలనుకునే విద్యారులకు ఐఐటీలో జరుగుతున్న పోటీలు ఓ వేదికగా ఉండగలవని సాయి సుదర్శన్ పేర్కొన్నారు. మూడు ఐఐటీల నుంచి ఈ ఏడాది 3,800 మంది విద్యారులు పాల్గొననున్నారు. ఐఐటీ మద్రాస్ నుంచి 550 మంది బాలురు, 400 మంది బాలికలు పాల్గొంటున్నారు. ఐఐటీ మద్రాస్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్ క్రీడల్లో పాల్గొంటోంది. ఐఐటీ హైదరాబాద్ అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీ బాల్, ఐఐటీ తిరుపతి చెస్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్నాయి.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరుపతి(కలెక్టరేట్, నేరవిభాగం):** కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు.

## పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతికి ప్రముఖులు రాక సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు పోలీసు శాఖ పేర్కొంది.

## నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆదివారం నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో నలుగురు స్మగ్లర్లని అరెస్టు చేశారు. రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని బాలపల్లి, కోడూరు మండలం మొగిలిపెంట అడవుల్లో అనుమతులు లేకుండా ప్రవేశించిన తమిళనాడుకు చెందిన నలుగురిని పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

## రూ.1.80 కోట్లతో ఆర్జిత కౌంటర్లు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** బృహత్తర ప్రణాళిక అమలులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున బహుళ వసతులు కల్గిన ఆర్జిత టికెట్ కౌంటర్లు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు కౌంటర్లు సిద్ధం కావడంతో పాటు ముందు భక్తులు నిరీక్షించేందుకు వీలుగా స్టెయిన్‌లెస్ స్టీలుతో క్యూలైన్లు సిద్ధమయ్యాయి. ఈ నెలాఖరు నాటికి వీటిని పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ కౌంటర్లు పూర్తయితే అన్ని ఆర్జిత సేవలకు సంబంధించి టికెట్లు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉండటం, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసేందుకు వీలుగా ఇక్కడ వసతులు అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకమనే చెప్పాలి. తద్వారా నగదు చెల్లింపుల కష్టాల భారం కొంతైనా తగ్గే అవకాశముంది.

## కొలువుదీరిన నూతన పాలకమండలి

ప్రమాణ స్వీకారం చేసిన ఛైర్మన్ గిరినాయుడు, పాలకమండలి సభ్యులు

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** మండలంలోని గుడిమల్లంలో వెలిసిన శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఛైర్మన్‌గా గిరినాయుడు, సభ్యులుగా బాబు, అరుణ, హంస, గీత, రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, రేవతి, నిరంజన్, ఉషా చేత ఈవో రామచంద్రారెడ్డి ప్రమాణం చేయించారు. ఆలయాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు నాగరాజునాయుడు, పెద్దలు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

**తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే:** భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 19 తీర్మానాలను ఆమోదించారు. 68 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ తిరిగి ఎన్నికయ్యారు. ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

(c) eenadu

# తిరుపతి

• తిరుపతి • చంద్రగిరి

ఉపాధ్యాయుడు ధనంజయులు, పూర్వ విద్యార్థులు

## ఆత్మీయ కలయిక.. జ్ఞాపకాల పండుగ

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. తిరుచానూరు జిల్లా ఉన్నత పాఠశాలలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ధనంజయులు వద్ద 1984 నుంచి 1998 వరకు చదువుకున్న విద్యార్థులు కలిశారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. **40 ఏళ్ల తర్వాత సమ్మేళనం.. తిరుపతి(విద్య), న్యూస్‌టుడే:** ఒకేచోట చదువుకున్న వంద మంది విద్యార్థులు 40 సంవత్సరాల తర్వాత సమావేశమయ్యారు. ఆదివారం స్థానిక ఎస్వీ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి అభ్యసించిన వారు ఓ ప్రైవేటు హోటల్లో కలిశారు. ఉపాధ్యాయులు హనుమంత్ సింగ్, బాషా, సిద్ధయ్యనాయుడు, విశ్వనాథరెడ్డిలను సన్మానించారు. జ్ఞాపకాలు పంచుకున్నారు.

గురువులతో పూర్వ విద్యార్థులు

**విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ.. పాకాల:** పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో బాబ్జీ పేర్కొన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం మొగరాల జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

**ఎస్వీ గోశాల డైరెక్టర్‌గా శివకుమార్.. తిరుపతి(గ్రామీణం):** తితిదే ఎస్వీ గోసంరక్షణ శాల సంచాలకుడిగా డాక్టర్ శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ఇప్పుడు ఇక్కడకు రానున్నారు.

## అసలే బరువు.. ఆపై చరవాణి డ్రైవింగ్

తిరుమల రింగురోడ్డులో ద్విచక్రవాహన చోదకుడు బండిపై బరువైన ఇనుప స్టాండ్‌ను ఉంచుకున్నాడు. ఒక చేత్తో చరవాణిలో మాట్లాడుతూ వాహనాన్ని నడుపుతున్నాడు. తోటి వాహన చోదకులకు ఇబ్బంది కలిగించడంతోపాటు తనను ప్రమాదంలోకి నెట్టుకుంటున్న ఇటువంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తిరుమల**

# ఆటోల మాటున.. నేరాల బాటన

- ఆభరణాల దోపిడీ
- పూర్తికాని డిజిటలైజేషన్

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతికి భక్తులు, యాత్రికులు, విద్యార్థులు నిత్యం వేల సంఖ్యలో వస్తుంటారు. వారి ప్రయాణ అవసరాల నిమిత్తం ఆటోల సంఖ్య నగరంలో బాగా పెరిగింది. చంద్రగిరి, రేణిగుంట, తిరుచానూరు ప్రాంతాల నుంచి షేర్ ఆటోలు అధికంగా నగరంలోకి వస్తున్నాయి. ఇదే అదనుగా పక్క జిల్లాల నుంచి ఆటోలు నగరానికి చేరుతున్నాయి. వీటి మాటున నేరగాళ్లు ఆటోలు నడుపుతూ బంగారు నగలు కాజేస్తున్నారు. మోసాలకు పాల్పడుతున్నా ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ చర్యలు తీసుకోవడం లేదు.

**నగరంలో ఆటోలు: 10 వేలు**

ఇటీవల నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నగోవిందు

### పోలీసు నంబర్ల ఆటోలెక్కడ

నగరంలో తిరిగే ఆటో ఎవరిది.. వారి చిరునామా.. చోదకుడి నేర చరిత్ర.. ఇలా అన్ని విషయాలు గుర్తించేలా ఆటో డిజిటలైజేషన్ వ్యవస్థను పోలీసు శాఖ ప్రవేశపెట్టింది. ఇది భక్తులకు రక్షణ, వదిలివెళ్లిన వస్తువులకు భరోసా, మహిళలకు రక్షణ కల్పిస్తోంది. పోలీసు శాఖ ఇచ్చిన కోడ్‌ను స్కాన్ చేస్తే ఆటో వివరాలు ప్రయాణికులు, పోలీసులు తెలుసుకునేలా వాటిని ఏర్పాటు చేశారు. అయితే సగం ఆటోలు కూడా వీటిని తీసుకోలేదు. కొన్నైతే అనుమతులు లేకుండా తిరుగుతున్నాయి. మరికొందరు నేరగాళ్లను ఆటోలో ఉంచుకొని వారి మధ్యలో ప్రయాణికులను కూర్చోబెడుతున్నారు.

### యథేచ్ఛగా షేర్

జిల్లాలోకి చిత్తూరు, అన్నమయ్య, కడప, నెల్లూరు జిల్లాల నుంచి షేర్ ఆటోలు యథేచ్ఛంగా వస్తున్నాయి. వీటి మాటున నేరగాళ్లు ప్రయాణికుల ఆభరణాలను దోచుకుంటున్నారు.

### ఒంటరిగా వెళ్లలేం

శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు స్థానిక ఉపాధ్యాయ నగర్‌లో ఆటో ఎక్కారు. ఎవరూ లేని ప్రాంతం రాగానే అతని మెడలోని బంగారు గొలుసును.. అప్పటికే ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు లాక్కొని కిందకు దింపేశారు. వెంటనే డ్రైవర్ ఆటోను వేగంగా నడుపుతూ వెళ్లిపోయారు. అతని ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేయగా.. కొందరు ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు.

### మహిళలకు మరీ కష్టం

ఎస్వీ వ్యవసాయ కళాశాలకు చెందిన మహిళా ఉద్యోగి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు మార్గమధ్యలో వస్తున్న ఆటో ఎక్కింది. ఒకే కుటుంబానికి చెందిన ఆటో డ్రైవర్, ఇద్దరు మహిళలు.. ఉద్యోగి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కొని ఆమెను ఆటో నుంచి కిందకు నెట్టేశారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు.

## తిరుచ్చిపై శ్రీసూర్యనారాయణుడు

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన శ్రీసూర్యనారాయణుడు ఆదివారం తిరుచ్చిపై మాడవీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మ నక్షత్రం హస్తనక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాహనసేవలో ఏఈవో దేవరాజులు, ఉగ్రాణం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరాలు

**తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** పాత శానంబట్ల, బ్రాహ్మణపట్టు గ్రామాల్లో శ్రీ పద్మావతీ మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలు ఆదివారం ముగిశాయి. ప్రోగ్రాం అధికారిణులు శాంతిశ్రీ, భారతి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.

## అవకాశాలు అందిపుచ్చుకోవాలి

**తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే:** విద్యార్థినులు అవకాశాలను అందిపుచ్చుకొని లక్ష్యాన్ని సాధించాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం కళాశాలలో టాలెంట్స్ డే నిర్వహించారు.

## భారతీయ సంస్కృతి మహోన్నతం

**తిరుపతి(విద్య), న్యూస్‌టుడే:** భారతీయ సంస్కృతి ఉన్నతమైనదని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. మన సంస్కృతి వేడుకల్లో భాగంగా హిందీ ప్రతిభా పరీక్షల విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఉయ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ తహ సున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

**తిరుపతి(నగరపాలిక), న్యూస్ టుడే:** సమస్య: గోవిందరాజ స్వామి ఆలయం వెనుక ఉన్న ఎస్‌బీఐ వద్ద రోడ్డు మొత్తం వ్యాపారులు ఆక్రమించుకున్నారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. **– సురేష్, బైరాగిపట్టెడ**

సమాధానం: ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారులని హెచ్చరించి పరిష్కరిస్తాం. **–ఖాన్, డీసీపీ, నగరపాలిక**

సమస్య: పాత ప్రసూతి ఆసుపత్రి రోడ్డుకిరువైపులా కాలువలు ప్రమాదకరంగాఉన్నాయి. **–దినకర్, మంచాల వీధి**

సమాధానం: కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం. మరమ్మతులు చేయిస్తాం. **– శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక**

**తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే:** సమస్య: అగ్రహారం పంచాయతీ(రాయలచెరువు రోడ్డు) ప్రధాన రహదారిలో విభాజకాల వద్ద పేరుకుపోయిన మట్టిని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడం లేదు. భారీ వాహనాలు వస్తే దుమ్ము రేగుతోంది. **– నాగరాజు, స్థానికుడు**

సమాధానం: మట్టిని తొలగించేట్టు చర్యలు తీసుకుంటాం. **– విజయలక్ష్మి, అగ్రహారం ఇన్‌ఛార్జి కార్యదర్శి**

### దుమ్ము.. కళ్లను కమ్మేస్తోంది

చిగురువాడ స్వర్ణముఖి వంతెన వద్ద రాయలచెరువు రోడ్డుపై దుమ్మురేగుతోంది. తిరుపతి గ్రామీణం రామచంద్రాపురం మండలాల ప్రజలతోపాటు చిత్తూరు, తమిళనాడు ప్రాంతాల నుంచి ప్రజలు, యాత్రికులు తిరుపతికి వస్తారు. కళ్లు, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు, వాహనచోదకులు వాపోతున్నారు. ర.భ.శాఖ అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు తారు వేసి మరమ్మతు చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణం)**

### పూర్ణకుంభం మూలనపడింది

స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కూడలి వద్ద గతంలో ఏర్పాటు చేసిన పూర్ణకుంభాన్ని (రాతిశిల్పం) గరుడవారధి పనుల్లో భాగంగా గతంలో తొలగించారు. దాన్ని మున్సిపల్ పార్కు ప్రాంగణంలో భద్రపరిచారు. వారధి పూర్తయినా పూర్ణకుంభాన్ని మాత్రం అక్కడే వదిలిపెట్టారు. యథాస్థానంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తిరుపతి(మంగళం)**

### చేతిపంపు.. ఇంతేనా?

దోర్నకంబాల పంచాయతీ తాటికోన గిరిజన కాలనీలో చేతి బోరు మరమ్మతులకు గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం రాకముందే తాగునీటి కొరత ఏర్పడిదని, చిలుముపట్టి పాడైపోయిన పైపుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పల్లె ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చంద్రగిరి**

### అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్

గత ప్రభుత్వంలో రాయలచెరువు కట్టపై తుడా నిధులతో వాకింగ్ ట్రాక్స్, పర్యాటకులు, ప్రజలు సేద తీరడానికి అక్కడక్కడ బల్లలు, విశ్రాంతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇప్పటికీ ఆ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికీ పూర్తి అవుతాయోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. **-న్యూస్‌టుడే, రామచంద్రాపురం**

### వాహనాలతో అపరిశుభ్రత

రుయా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న శ్రీపద్మావతి నర్సింగ్ కళాశాల టీబీ వార్డు మార్గంలో నిరుపయోగ వాహనాలను డంప్ చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నిత్యం ఈ మార్గంలో విద్యార్థులు, రోగులు, వైద్యులు రాకపోకలు సాగిస్తుంటారు. విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

## నిబంధనలా.. మాకు కాదులే!

**ఈనాడు, తిరుపతి:** నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై వాహనచోదకులు యథేచ్ఛగా ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ఆదివారం తిరుపతి తనపల్లి క్రాస్ వద్ద హైవేపై పలువురు ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం ధరించకుండా ప్రయాణించారు. ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రమాదకరంగా వెళ్తూ కనిపిస్తున్నారు. హైవే డివైడర్ దాటకుండా తిరుచానూరు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసినా లెక్కచేయకుండా ఓటేరు, ఉప్పరపల్లి మార్గంలో ప్రయాణించారు. లోడు టిప్పర్లు పైన పట్టలేకుండా వెళ్తున్నాయి. దీంతో వెనుక వచ్చే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ వద్ద వాహనచోదకులు వన్‌వేలో ప్రమాదకరంగా వెళ్తున్నారు. పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. వాహనచోదకులు ఏమాత్రం పట్టించుకోవట్లేదు.

## ప్రధాని మోదీతో వికసిత భారత్ సాకారం

**తిరుమల, న్యూస్‌టుడే:** ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో వికసిత భారత్ సాకారమవుతోందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం శ్రీవారి నైవేద్య విరామ సమయంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడుతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ఆలయం వెలుపల సీఎం మాట్లాడుతూ.. 'అటల్ ఆశయం-మోదీతో సుసాధ్యం' యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మొత్తం యాత్ర చేపట్టినట్లు తెలిపారు. నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

వేడుకలు ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి, అతిథులు

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** తిరుపతిలోని సీఎస్‌కే తేజా డెంటల్ కళాశాలలో ఆదివారం 20వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి, సీవీఎస్ తేజా ట్రస్ట్ సభ్యులు సుమలత, కవిత, వరుణ్ సాయి, సాహితి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు.

## విజ్ఞానంతో న్యాయవిద్యకు సార్థకత

మాట్లాడుతున్న విశ్రాంత జస్టిస్ ధామా శేషాద్రినాయుడు

**తిరుపతి(విద్య), న్యూస్‌టుడే:** వివిధ సాహిత్య విజ్ఞాన గ్రంథాలను పఠించి ఆకళింపు చేసుకోవడం ద్వారా న్యాయశాస్త్ర విద్యను మరింత సార్థకం చేసుకోవచ్చని ముంబయి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దామా శేషాద్రినాయుడు అన్నారు. తిరుపతిలోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఛైర్మన్ తిప్పారెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కృపాసాగర్, ఎస్వీయూ న్యాయశాస్త్ర పూర్వ విభాగాధిపతి పుల్లారెడ్డి, ప్రిన్సిపల్ బిజయకుమార్ బెహ్రా పాల్గొన్నారు.

## సుబ్బరామనాయుడికి నివాళి

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** స్థానిక శ్రీనివాసపురానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కొమ్మినేని సుబ్బరామనాయుడు శుభస్వీకరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయకులు నరసింహయాదవ్, జేబీ శ్రీనివాస్, హేమాంబరధరరావు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కొమ్మినేని కుటుంబ సభ్యులు విజయకుమార్, గిరి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మొదలియార్లు

## కూటమి ప్రభుత్వంలోనే రాజకీయ గుర్తింపు

**పాకాల, న్యూస్‌టుడే:** మొదలియార్ సోదరులకు కూటమి ప్రభుత్వంలోనే రాజకీయంగా గుర్తింపు దక్కిందని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ బోర్డు సభ్యురాలు పద్మలతా కనకరాజన్, రాష్ట్ర మొదలియార్ సంక్షేమాభివృద్ధి బోర్డు డైరెక్టర్ ఎస్.శరవణన్ పేర్కొన్నారు. ఆదివారం పాకాలలో జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. వీరిని సభ్యులు సత్కరించారు.

## అలరించిన భరతనాట్య ప్రదర్శన

**తిరుచానూరు:** స్థానిక శిల్పారామంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఆదివారం తిరుచానూరుకు చెందిన శ్రీపద్మ కళాక్షేత్రం కళాకారుల నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఏవో సుధాకర్, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర్‌సింగ్ ధామీని కలిసిన నాయకులు

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీని తిరుపతి భాజపా నాయకులు కలిశారు. ఆదివారం రాత్రి శ్రీవారి ఆలయం వద్ద నాయకులు భవాని శంకర్, శివారాయల్ సీఎంను కలిసి శాలువ కప్పారు.

## ఉత్తరాఖండ్ సీఎంకు ఘన స్వాగతం

**తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీకి ఘన సత్కారం లభించింది. రేణిగుంటలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు వచ్చిన ఆయనకు భాజపా యువ మోర్చా నాయకుడు పృథ్వీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ ద్వారా ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. యువ మోర్చా నాయకులు కిషన్, జీవన్, హరి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ప్రణీత్, నేతలు

## సైకిళ్లు, ఆర్థికసాయం అందజేత

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** ఎడిఫై స్కూల్ డైరెక్టర్, ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెనుమాదు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఆయన సన్నిహితులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఉపాధ్యాయనగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయంలో మహిళలకు కుట్టుమిషన్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. విద్యార్థులకు రూ.2.5 లక్షల ఉపకార వేతనాలు అందించారు. ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.రెండు లక్షలు, అంధ విద్యార్థి హర్షవర్ధన్‌కు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ప్రణీత్ అందించారు.

శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న నాయకులు

## ప్రకృతి వ్యవసాయం చేయాలి

**తిరుపతి(మహిళా వర్సిటీ):** అందరూ సేంద్రీయ సాగు చేయాలని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ప్రహ్లాదరెడ్డి పేర్కొన్నారు. మహిళా వర్సిటీ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో దుర్గసముద్రంలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆదివారం శిక్షణ ప్రారంభమైంది. ఆచార్యులు నీరజ పాల్గొన్నారు.

## వాకర్స్‌కు డైరీల పంపిణీ

**తిరుపతి(బైరాగిపట్టెడ):** వినాయక సాగర్ వాకర్స్ క్లబ్ సభ్యులకు ఆదివారం నూతన సంవత్సర డైరీలను రెప్కో బ్యాంకు మేనేజర్ దీపిక, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అందజేశారు. క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, కార్యదర్శి చంద్ర, కోశాధికారి రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో పిచ్చికుక్క వీరంగం

**చంద్రగిరి:** కొత్తపేట భారతీనగర్‌లో రేబిస్ సోకిన పిచ్చికుక్క వీరంగం సృష్టించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం జనసంచారం ఉన్న భారతీనగర్‌లో నడిచే వారిపై, ద్విచక్ర వాహన చోదకులపై వెంటపడుతూ ఉంది. దీంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్కను పట్టుకుని గ్రామానికి దూరంగా విడిచి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


తృతీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఇంటర్నేషనల్ స్పెషాలిటీ మెడికేర్ సెంటర్
RTO సర్కిల్, మంగళం, తిరుపతి.
50% డిస్కౌంట్
ఉచిత వైద్య శిబిరం (15-12-25)
ECG, 2D, ECHO, TMT
BP, Sugar కొలెస్ట్రాల్ పరీక్షలు, కన్సల్టేషన్ ఉచితం
డా. షేక్ గులాం దస్తగిరి, సీనియర్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్
N.Mohan Kumar (Boby)
With Best Compliment from
BHIMESWARA ENTERPRISES
#7-21S3-92, R.N.Mada Street, Beside Kondanda Ramalayam Temple, TIRUPATI. Ph: 0877-2222237, 2952226
Cell: 93936 22226, 9866485919

శ్రద్ధాంజలి
మంచికి, మానవత్వానికి ప్రతిరూపం.. మనుషులందరూ మనోళ్లే అని... మా కుటుంబ దైవం శ్రీ సిద్దిరాజు గోపాలయ్య గారు 14.12.2025న తేది ఆదివారం స్వర్గస్థులైనారు.
దహనక్రియలు: 15.12.2025న తేది ఉదయం 10:30 నిలకు తిరుపతి, కరకంబాడి రోడ్డు, గోవిందధామంలో జరుగును.
శ్రీ సిద్దిరాజు గోపాలయ్య గారు
మరణం: 14.12.2025
కుటుంబ సభ్యులు

11వ వర్ధంతి
పూజ్యశ్రీ ఎం.వెంకటరమణ గారు
దివంగత శాసనసభ్యులు, తిరుపతి.
తిరుపతి పట్టణ ప్రజలకోసం అలుపెరుగని పోరాటం సాగించి అండగా నిలిచిన మీరు మమ్మల్ని వీడి 11 సం॥లు అయినా మాతో గడిపిన ఆనందక్షణాలు మాతో పదిలం... అనుక్షణం మిమ్మల్ని స్మరిస్తూ మీ జ్ఞాపకాలతో...
శ్రీమతి ఎం.సుగుణమ్మ, మాజీ శాసనసభ్యురాలు, తిరుపతి.
మరియు కుటుంబసభ్యులు
గమనిక: వర్ధంతి సందర్భంగా ఉ॥ 10 గంటలకు కపిలతీర్థం వద్ద ఉన్న ఘాట్ నందు నివాళి మరియు 12 గంటలకు రుయా వద్ద అన్నదాన కార్యక్రమం జరుగును.


(c) eenadu

# శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మీపతి, ప్రధానోపాధ్యాయులు

## ఆకట్టుకున్న ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

**శ్రీకాళహస్తి, తొట్టంబేడు :** ఉపాధ్యాయుల క్రీడా పోటీలతో శ్రీకాళహస్తిలో సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 11 మండలాలకు సంబంధించి పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో జరిగిన పోటీల్లో వివిధ క్రీడల్లో ఉపాధ్యాయులు తమదైన ప్రతిభతో సత్తా చాటారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కిషోర్, ఎంఈవో లక్ష్మీపతి, భాస్కర్, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, కృష్ణ, రవిచంద్ర పాల్గొన్నారు.

## గోవిందయ్యకు జాతీయ పురస్కారం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక అధ్యక్షులు గొడుగుచింత గోవిందయ్య వేటూరి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. చిత్తూరులో జరిగిన కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ సమావేశపు హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య సభ్యులు కేశవరెడ్డి, డాక్టర్ మద్రిపూడి దేవేంద్రరావు, ఎం.వి.శ్రీధర్‌రెడ్డి, నారాయణస్వామిల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

పురస్కారం అందుకుంటున్న గొడుగుచింత గోవిందయ్య

## సంస్కరణల ఘనత వాజ్‌పేయిదే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కోలా ఆనంద్

**రేణిగుంట, న్యూస్‌టుడే:** దేశంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి దేశాభివృద్ధికి పాటు పడిన వ్యక్తి మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రేణిగుంటలోని మర్రిగుంత కూడలి వద్ద వాజ్‌పేయి విగ్రహ విష్కరణకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తనకు చిన్నతనం నుంచి తెలుసునన్నారు. ఆయన విగ్రహాన్ని తన నియోజకవర్గమైన రేణిగుంట మండలంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప నాయకుడని హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ● మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశం గర్వించదగ్గ నేత అని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ అన్నారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయన హయాంలో దేశంలోని జాతీయ రహదారులతో పాటు అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు.

## చెంచయ్యనాయుడుకు సత్కారం

మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడును సత్కరిస్తున్న ముస్లిం ప్రతినిధులు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడును జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన జావిద్ ఘనంగా సత్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ముస్లిం ప్రతినిధులతో కలసి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ షఫీ, ఖాదర్, ముజీబ్, నయీం, మీర్జా, అల్లాబక్ష తదితరులు పాల్గొన్నారు.

**విద్యతోనే పేదరికంపై విజయం.. తొట్టంబేడు, న్యూస్‌టుడే:** విద్యతోనే పేదరికంపై విజయం సాధించడంతోపాటు ఉన్నత స్థితికి తోడ్పాటునందిస్తుందని హైకోర్టు న్యాయవాది రవికుమార్ అన్నారు. శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలనీలోని గిరిజన బాలికల పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు ఆదివారం ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

## చిట్టి బుర్రలకు మరింత పదును

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** ప్రాథమిక స్థాయిలో పునాది బలంగా ఉంటేనే అభ్యసన సామర్థ్యాలు మెరుగు పడతాయని దిగువ సాంబయ్యపాలెం ఫౌండేషన్ పాఠశాల ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ గ్యారంటీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ కార్యక్రమాన్ని శనివారం పాఠశాలలో నిర్వహించారు. ప్రతి విద్యార్థికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడంతో పాటు గణితంలో ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారంపై నైపుణ్యాలను సాధించేందుకు సరళ రీతిలో బోధనకు శ్రీకారం చుట్టినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు.

## తూట్లు.. తప్పని పాట్లు

### మందగమనంగా ఇళ్ల అభివృద్ధి

రాజీవ్‌నగర్ వద్ద నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలు

- మంజూరైన గృహాలు: 6,015-
- రద్దయినవి: 1,632
- కేటగిరి-1: 3,216-
- కేటగిరి-2: 304-
- కేటగిరి-3: 863-

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ఉగాది నాటికి టిడ్కో ఇళ్లు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. వైకాపా హయాంలో ఇక్కడ జరిగిన అవినీతి, అక్రమాలు, నిధులు దుబారా, చేపట్టిన పనులు సక్రమంగా లేకుండా పోయాయి. గత ప్రభుత్వ హయాంలో పడిన తూట్లను మెరుగు పరిచేందుకు అధికారులు ప్రయాసకు గురికావాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో రాజీవ్‌నగర్-ఎన్టీఆర్‌నగర్‌లో వీలైనంత త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**టిడ్కో ఇళ్ల లెక్కలు:** ఇక్కడి పురపాలక సంఘ పరిధిలో 2019వ సంవత్సరం తెదేపా ప్రభుత్వ హయాంలో 6015 టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. వివిధ కారణాల దృష్ట్యా ప్రారంభంలోనే 1632 ఇళ్లను రద్దు చేశారు. మిగిలిన 4,383 గృహాల్లో.. కేటగిరీ 1కి సంబంధించి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న లబ్ధిదారులకు (300 ఎస్ఎఫ్‌టీ) 3216, కేటగిరీ 2కు (365 ఎస్ఎఫ్‌టీ) ద్వారా 304, కేటగిరీ 3 (430 ఎస్ఎఫ్‌టీ) ద్వారా 863 ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి.

### నిధులు దుర్వినియోగం

టిడ్కో గృహ నిర్మాణాలకు సంబంధించి వైకాపా హయాంలో నిధులు యథేచ్ఛగా దుర్వినియోగం అయ్యాయి. లబ్ధిదారులకు తెలియకుండానే అక్రమంగా పట్టాలు మార్పు చేసుకున్న విషయమై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించడమే కాకుండా విచారణను చేపట్టింది.

ఏళ్లుగా నిర్మాణాలు చేపట్టి మళ్లీ వాటి బాగోగులపై దృష్టి సారించని కారణంగా భవనాలు, గదులకు సంబంధించిన గోడలు కళావిహీనంగా మారాయి. ఇలా గత ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఏర్పడ్డ తూట్లు పూడ్చుకునేందుకు ప్రస్తుతం అధికారులకు శిరోభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఉగాదిలోపు ఎంత మేర ఈ భవనాలు అందుబాటులోకి తీసుకు వస్తారన్నది వేచిచూడాల్సిందే.

● ప్రధానంగా వైకాపా రంగులు వేసేందుకు దాదాపు రూ.1.50 కోట్లు వ్యయం వృథా చేశారు.

● రూ.2 కోట్లు వ్యయంతో తలుపులు, ద్వారబంధాలు, కిటికీలు, అద్దాలు, షింక్‌లు, కుళాయిలు తదితర వాటిని అమర్చారు. సరైన పర్యవేక్షణ లేని కారణంగా చాల వరకు వస్తువులు మాయమయ్యాయి. మళ్లీ మళ్లీ అలా జరగకుండా ఉండేలా భద్రతా సిబ్బందిని నియమించారు.

● గృహాల మధ్య అంతర్గత రోడ్లు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తయిన రోడ్లు ఆశించిన మేర నాణ్యత లేకపోవడంతో ప్రారంభం కాకముందే గుంతలమయం అయ్యాయి.

● గృహాల నుంచి మురుగునీటి సరఫరాకు ఏర్పాటు చేసిన కాల్వలు సక్రమంగా చేపట్టలేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఏళ్లుగా పనులు నిలుపుదల చేయడంతో పిచ్చి మొక్కలు యథేచ్ఛగా పెరిగాయి.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** సమస్య: నివాస గృహాల మధ్య పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగునీటి గుంతలను తవ్వడం, వ్యర్థాలను బయట తీయడంతో దుర్గంధం వస్తోంది. **- సుహాసిని, శ్రీరాంనగర్ కాలనీ**

సమాధానం: ఇప్పటికే పలు దఫాలు పందుల పెంపకం దార్లకు సూచనలు చేశాం. మళ్లీ రానీయకుండా చర్యలు తీసుకుంటాం. **- దాము, పారిశుద్ధ్య విభాగం అధికారి, పురపాలక సంఘం**

**సత్యవేడు, న్యూస్‌టుడే:** సమస్య: పీవీపురం పంచాయతీ ఆనందపురం ఎస్టీకాలనీ వీధుల్లో లైట్లు వెలగక పోవడంతో రాత్రుల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- రాఘవయ్య**

సమాధానం: పది రోజుల్లో వీధిలైట్లు బిగించడానికి చర్యలు తీసుకుంటాం. **- పోలమ్మ, సర్పంచి**

**రేణిగుంట, న్యూస్‌టుడే:** సమస్య: రేణిగుంట వినాయక నగర్‌లో రైలు పట్టాల పక్కనే చెత్త నిండి పోవడంతో మురుగునీరు నిలిచింది. తొలగించాల్సి ఉంది. **- హరి**

సమాధానం: ఇక్కడ శుభ్రత చర్యలు చేయిస్తాం.
**- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: నాగలాపురం బ్రాహ్మణ వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పంచాయతీ చెత్త వాహనాలు ఈ వీధిలోకి రాకపోవడంతో రహదారుల వెంబడి వ్యర్థాలు పేరుకపోతున్నాయి. **- మురళి**

సమాధానం: రెండు రోజుల్లో వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- రాధిక, ఈవో**

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** సమస్య: మండలంలోని మేర్లపాకలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. **- కుమార్**

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.
**- రమణకుమార్, ఈవోపీఆర్‌డీ**

### ముళ్లచెట్ల తొలగింపు

**బీఎన్‌కండ్రిగ:** గాజులపెళ్లూరులో రహదారికి ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన ఈ నెల 1వ తేదీన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మీన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను తీయించారు. వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

### వీధి దీపాల పునరుద్ధరణ

స్పందనకు వందనం

**నాగలాపురం:** నాగలాపురం నటరాజు గుంట, బ్రాహ్మణవీధి, నాగలింగేశ్వరాలయాల వద్ద పంచాయతీ సిబ్బంది శనివారం నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలలో వీధి దీపాలు వెలగక పోవడంతో స్థానికుల ఇబ్బందులపై 12వ తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్పంచి చిన్నదురైసుధ వీధి దీపాలను పునరుద్ధరించారు.

## అలా తొలగించి.. ఇలా నిర్మించి

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** కూతవేటు దూరంలో అంతర్జాతీయ విమానాశ్రయం, చుట్టూ పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పడటంతో ఏర్పేడు మండలంలోని వికృతమాలలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ క్రమంలోనే స్థానికులతో పాటు స్థానికేతరుల కన్ను ఈ ప్రాంతం మీద పడుతుంది. సర్వేనంబరు 97, 98లో సుమారు 5.58 ఎకరాల విలువైన కాలువ పోరంబోకు స్థలం అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో ఇక్కడ పెద్దఎత్తున ఆక్రమణలు జరగడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగించింది. అయితే అదే కాలువ పోరంబోక స్థలంలో ప్రస్తుతం అక్రమ కట్టడాలు వెలుస్తుండటంతో స్థానికుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అరికట్టడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రూ.కోట్లు విలువైన కాలువ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పోరంబోకు స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కర్రసాము

### అలరించిన విద్యార్థుల విన్యాసం

ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఇంటర్ ఐఐటీ 58వ స్పోర్ట్‌మీట్ ప్రారంభోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఐఐటీ విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలతో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆకట్టుకునే వివిధ రకాల నృత్య ప్రదర్శనలు చేపట్టారు. కర్రసాము విన్యాసాలతో అతిథుల మన్ననలు పొందారు. మరికొందరు దేశభక్తిని పెంపొందించే సంగీతాన్ని ఆలపించారు. తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలతో పండుగ వాతావరణం నెలకుంది. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

## నీళ్లు.. దుర్గంధపు లోగిళ్లు

పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ ఉద్యానంలో రక్షిత మంచినీటి పథకం కింద నీళ్లు నిల్వ చేరుతున్నాయి. వర్షాలకు ఇక్కడ మడుగులా చేరాయి. వర్షాలు తగ్గినా నీటి నిల్వలు అలాగే ఉండటంతో అక్కడకు వెళ్లే వారితో పాటు చుట్టు పక్కల నివాస గృహాలకు దుర్గంధం తప్పడం లేదు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

## మురుగునీటితో ప్రజలకు ఇక్కట్లు

మండలంలోని వీర్‌కండ్రిగ గ్రామ జంక్షన్ వద్ద, సత్యవేడు-టీపీకోట రోడ్డు మార్గంలో మురుగు పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో తొక్కుకుంటూ ఇంటిలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ కాలువలు పూర్తిగా మట్టితో పూడి పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

## సిమెంటు బస్తాలతో కళాశాల విద్యార్థుల పాట్లు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వరండాలో గచ్చు సక్రమంగా లేక పోవడంతో దాతలు నిర్మాణానికి ముందుకు వచ్చి విరాళాలను అందించారు. ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో మిగిలిన సిమెంటు బస్తాలతో నిర్మాణ పనులు చేయించడానికి అధికారులు సిద్ధమయ్యారు. కూలీల ఖర్చు ఎందుకులే అనుకున్నారు కాబోలు ఇదుగో ఇలా విద్యార్థులతో సిమెంటు బస్తాలను ట్రాలీలపై వేయించి శనివారం కళాశాలకు తరలించారు. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

## నిరంతర వెలుగు.. నియంత్రణ కరవు

మండలంలోని బసవయ్యపాలెంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేక పోవడంతో పంచాయతీపై బిల్లుల భారం పడుతోంది. దీపాలు కొద్దికాలానికే కాలిపోతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పరిస్థితి లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు విద్యుత్తు వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

## గురవారెడ్డికి స్వాగతం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన రెడ్డివారి గురవారెడ్డికి పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పదవి ఖరారైన తరువాత శ్రీకాళహస్తిలో అడుగుపెట్టిన ఆయనకు ఆదివారం స్థానిక ఏపీసీడ్స్ కూడలి వద్ద పలువురు నేతలు ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. ఉమ్మడి జిల్లాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి శ్రమిస్తానని తెలిపారు.

గురవారెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుతున్న తెదేపా శ్రేణులు

## దిమ్మె తగిలింది.. దిమ్మ తిరిగింది

శ్రీకాళహస్తి పట్టణంలోని పాత రామసేతు వంతెనకు ఇరువైపులా వందేళ్ల ప్రస్థానాన్ని తెలియజేస్తూ గత ప్రభుత్వ హయాంలో సూచికలు ఏర్పాటు చేశారు. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయడంతో గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతో విరిగిపోయాయి. విరిగిన సూచికలు తొలగించిన అధికారులు దిమ్మెలను అలాగే వదిలేశారు. శనివారం కారు డ్రైవర్ దిమ్మెను చూసుకోక వాహనాన్ని నడపడంతో వాహనం దిమ్మెలను ఢీకొంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

## చురుగ్గా తెదేపా గ్రామ కమిటీ ఎన్నికలు

**కేవీబీపురం, న్యూస్‌టుడే:** మండలంలో తెదేపా గ్రామ కమిటీ ఎన్నికలను జిల్లా పార్టీ నాయకులు చురుగ్గా చేపట్టారు. కేవీబీపురం మండలంలో ఈఎన్నికల ప్రక్రియ ఆది, సోమవారాల్లో కొనసాగనుంది. ప్రతి పంచాయతీలోనూ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలను స్థానిక నాయకులు ఎన్నుకోనున్నారు. ఆదివారం మండలంలోని అంజూరులో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సురేష్‌రాజు, మండల ఎన్నికల పరిశీలకులు మునిరత్నం ప్రారంభించారు. 20 పంచాయతీల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, గోపీనాథరెడ్డి, సురేష్‌చౌదరి, లోకేష్‌చౌదరి, ముకేష్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, వెంకటకృష్ణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న నియోజకవర్గ, మండల తెదేపా పరిశీలకులు సురేష్‌రాజు, మునిరత్నం

## టీపీకోట తెదేపా అధ్యక్షుడిగా బాబూసాహెబ్

**నాగలాపురం, న్యూస్‌టుడే:** మండలంలోని టీపీకోట తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాబూసాహెబ్, కార్యదర్శిగా మునిశేఖర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ ఎన్నికలను పార్టీ పరిశీలకులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎంపికైన నేతలను మాజీ సర్పంచి మనోహర్, మైనారిటీ సెల్ నేత చాంద్‌బాషాలు సన్మానించారు

## శిరస్త్రాణ ధారణపై పోలీసుల అవగాహన ర్యాలీ

**నాగలాపురం, వరదయ్యపాలెం, న్యూస్‌టుడే:** నాగలాపురం, పిచ్చాటూరుల్లో ద్విచక్రవాహన చోదకులకు ఎస్సైలు సునీల్, రాఘవేంద్ర అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ కూడళ్లలో ఆదివారం వాహన చోదకులతో శిరస్త్రాణ ధారణ ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామాల్లో ద్విచక్ర వాహన చోదకులు, పోలీసు సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. వరదయ్యపాలెంలో ఎస్సై మల్లికార్జున్ అవగాహన కల్పించారు.

**పైపుల మరమ్మతు.. నాగలాపురం, న్యూస్‌టుడే:** మండలంలోని టీపీకోటలో తాగునీటి పైపులైను శనివారం దెబ్బతింది. పైపుల నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో గ్రామంలో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో సర్పంచి సక్కుబాయిని గ్రామస్థులు ప్రశ్నించడంతో ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో కూలీలు అందుబాటులో లేక పోవడంతో సర్పంచి భర్త సుబ్రహ్మణ్యం రెడ్డి పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు.

## పేదలకు సాయం ఆనందకరం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఏళ్ల తరబడి పేదలకు అండగా నిలవడం ఆనందకరమని పట్టణ సీఐ ప్రకాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని చిల్డ్రన్ ఫ్యాన్సీ స్టోర్ వద్ద ఆదివారం సంస్థ నిర్వహించిన కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రమం తప్పకుండా ప్రతి నెలా రెండో ఆదివారం సంస్థ నిర్వాహకులు మునీర్‌బాషా నిత్యావసర సరకులు అందజేయడం సంతోషమన్నారు. సంస్థ సభ్యులు రమేష్‌బాబు, రాజేశ్వరరావు, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్ బీభత్సం

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ బీభత్సం సృష్టించిన ఘటన మండలంలోని పిల్లమేడు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పెద్దకనపర్తి సమీపంలోని స్వర్ణముఖినది నుంచి వెంకటగిరి వైపు ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనాన్ని మెరుపు వేగంతో నడుపుతూ బీభత్సం చేశాడు. పిల్లమేడు సమీపంలో రోడ్డు పక్కకు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనంపై దూసుకెళ్లాడు. ఇసుకాసురుల హద్దులేని ఆగడాలతో నిత్యం హడలి పోతున్నామని ఆప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో ఇసుక తరలిస్తున్న అక్రమార్కులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## యువతి ఆత్మహత్య

**వరదయ్యపాలెం, న్యూస్‌టుడే:** యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలో నివాసం ఉంటున్న షఫియా(35) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. గమనించినవారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

## దురుసు ప్రవర్తన.. ముగ్గురు యువకుల అరెస్టు

**పిచ్చాటూరు:** మద్యం మత్తులో పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మండలంలోని శేషంబేడుకు చెందిన విజయ్(23), ఐజాక్(20), స్టాలిన్(20)లు శనివారం మధ్యాహ్నం స్థానిక సీఎస్ఐ చర్చి ప్రహరీ వద్ద మద్యం తాగుతుండగా హెడ్ కానిస్టేబుల్ చంద్రబాబు, కానిస్టేబుల్ కవిఅరసులు వారిని వారించారు. ముగ్గురు యువకులు పోలీసులను బెదిరించడంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పతకాలు చేతపట్టి.. పల్లెల్లో విజయ బావుటా

**సత్యవేడు, న్యూస్‌టుడే:** వీరంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. విజయమే లక్ష్యంగా వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విజయం సాధిస్తున్నారు ఇరుగుళం జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు.

### పోలీసు కావాలన్నదే ఆకాంక్ష

ఇరుగుళం జిల్లా ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. మా తల్లి దండ్రులు రాఘవులు, పద్మ. వరదయ్యపాళెం మండలం మోపురపల్లె స్వగ్రామం. చిన్నప్పటి నుంచి క్రీడలంటే మక్కువ. తండ్రి కోరిక మేరకు సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. భవిష్యత్తులో పోలీసు అధికారిగా పని చేయాలన్నదే ఆకాంక్షగా ముందుకు సాగుతున్నాను. **- వర్షిణి**

### ప్రజలకు సేవ చేయడమంటే ఇష్టం

మా తల్లిదండ్రులు పాండియన్, వసంతి. స్థానిక హైస్కూల్‌లో 8వ రతగతి చదువుతున్నాను. తండ్రి పాండియన్ శ్రీసిటీలో సెక్యూరిటీగా పని చేస్తున్నాను. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో జోనల్ స్థాయికి ఎంపికైయ్యాను. ప్రధానోపాధ్యాయులు చినబాబు ప్రోత్సాహంతో క్రీడలపై దృష్టి సారించాను. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లోనూ శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో వైద్యురాలిగా ప్రజలకు సేవచేయాలన్నదే లక్ష్యం. **- తేజశ్రీ**

### ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

తొమ్మిదో తరగతి చదువుతున్నాను. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి సాఫ్ట్‌బాల్ క్రీడల్లోనూ ప్రత్యేకంగా రాణిస్తున్నాను. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో సత్తా చాటేందుకు రోజు గంట పాటు శిక్షణ తీసుకుంటున్నాను. మొదటి మూడు స్థానాల్లో రాణించడానికి కృషి చేసి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తా. క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాం. **- శోభన**

### ప్రతిభను గుర్తించి శిక్షణ

పాఠశాల విద్యార్థులకు చదువుతోపాటు వారి ప్రతిభను గుర్తించి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. ఇటీవల జరిగిన మండల స్థాయిలో జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. సొంత నగదుతో కొన్ని ఆటవస్తువులను కొనుగోలు చేశాను. క్రీడల్లో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యం విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. **- మణి, పీడీ, ఇరుగుళం**

(c) eenadu

# గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

**గూడూరులో నిమ్మ ధరలు**

మొదటి రకం: కేజీ రూ. 16 నుంచి రూ. 20 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 15 వరకు

## పుస్తక పఠనంతో విజ్ఞానం

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** నిత్యం గ్రంథాలయంలో కొంత సమయం పుస్తక పఠనం చేయడం వల్ల మెరుగైన విజ్ఞానం పొందవచ్చని విశ్రాంత ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ గ్రంథాలయంలో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి, భాషా నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. గ్రంథాలయ అధికారిణి లీలావతి పాల్గొన్నారు.

## విజేతకు అభినందన

**కోట, న్యూస్‌టుడే:** విద్యానగర్‌లోని శ్రీవిద్యావికాస్‌లో అయిదో తరగతి చదివే వెంకటలాస్య పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాలు కైవసం చేసుకుంది. దీంతో విద్యార్థినిని శ్రీవిద్యా వికాస్ సొసైటీ ఛైర్మన్ లీలామోహన్‌కృష్ణ, కరాటే మాస్టర్, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

**కోళ్ల ధరలు**

| నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 143 |
| లేయర్ | 122 |
| బ్రాయిలర్స్ | 254 |
| బ్రాయిలర్స్ స్కిన్‌లెస్ | 280 |
| లేయర్ మాంసం | 207 |

చదును చేస్తున్న యువత

## యువత కదిలి.. గుంతలు పూడ్చి

**సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** మన్నారుపోలూరు హరిజనవాడలోని సీసీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమైంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో స్థానిక యువకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సొంతంగా రూ.15 వేలు ఖర్చు చేసి గుంతలకు మట్టితోలి పూడ్చారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. **కోట, న్యూస్‌టుడే:** తిన్నెలపూడిలో ఇటీవల కురిసిన వర్షాలకు దళితవాడకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశంతో తెదేపా మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మారెడ్డి సొంత నిధులు వెచ్చించి గ్రావెల్, మట్టి తోలి రహదారిని బాగు చేయిస్తున్నారు. ఆమె దాతృత్వాన్ని స్థానికులు అభినందించారు.

## 754 చెరువుల్లో.. 8 టీఎంసీల నీటి నిల్వ

**371 పనులకు అంచనాలు సిద్ధం**

**గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఇటీవల కురిసిన వర్షాలకు గూడూరు డివిజన్‌లోని గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని 754 జలవనరుల శాఖ చెరువుల్లో ప్రస్తుతం 8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది చెరువుల్లో నీరు నిల్వ ఉండటం రైతులకు కాస్త ఊరట కలిగిస్తోంది. రెండు నియోజకవర్గాల్లో 1,22,607 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుందని జలవనరుల శాఖ ఇంజినీర్లు చెబుతున్నారు.

వాకాడు చెరువులో నిండుగా నీరు

**రూ.24 కోట్ల వ్యయంతో**

రెండు నియోజకవర్గాల్లో 754 చెరువులు దిత్వా తుపాను ప్రభావానికి దెబ్బతిన్నాయి. చెరువుల కట్టలు, తూములు, కాలువలు పలు చోట్ల దెబ్బతినడంతో మొత్తం 371 పనులకు జలవనరుల శాఖ ఇంజినీర్లు అంచనాలు సిద్ధం చేశారు. వీటికి రూ.24 కోట్ల వ్యయం అవుతుందని జలవనరుల శాఖ గూడూరు ఈఈ బాబు తెలిపారు.

**బ్యారేజీ నిర్వహణకు రూ.4.50 కోట్లు**

వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ వద్ద నిర్వహణ పనులకుగాను రూ.4.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను ఇంజినీర్లు పంపారు. గేట్లు, రోప్‌ల మరమ్మతులు, తుప్పుపట్టిన పరికరాలు మార్చడం, ప్లాట్‌ఫాం, రెగ్యులేటర్, విద్యుత్తు మోటార్ల రిపేర్లు చేపడుతున్నట్లు ఈఈ బాబు చెప్పారు. 15 ఏళ్ల తర్వాత బ్యారేజీ నిర్వహణ పనులు చేపట్టేందుకు సిద్ధం కావడం గమనార్హం.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** సమస్య: పురపాలిక పరిధిలోని నాయిబ్రాహ్మణ కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే నిలుస్తోంది. **– సతీష్, గూడూరు**

సమాధానం: కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. **– వెంకటేశ్వర్లు, కమిషనర్**

### పారిశుద్ధ్య చర్యలు

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని గాంధీనగర్‌లో కాలువలో మురుగు ముందుకు కదలకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి తెచ్చారు. 6న ప్రచురితమైన సమస్యకు స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో కాలువను శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు.

## గోవిందయ్యకు జాతీయ పురస్కారం

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక అధ్యక్షులు గొడుగుచింత గోవిందయ్య వేటూరి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. చిత్తూరులో కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ సమావేశపు హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య సభ్యులు కేశవరెడ్డి, డాక్టర్ మఱ్ఱిపూడి దేవేంద్రరావు, ఎం.వి.శ్రీధర్‌రెడ్డి, నారాయణస్వామిల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## నిత్యావసరాల పంపిణీ

**తడ, న్యూస్‌టుడే:** తుపాను ప్రభావంతో జీవనోపాధి దెబ్బతిన్న గ్రద్దగుంట పంచాయతీ పరిధిలోని ఎస్టీలకు ఆదివారం నిత్యావసర సరకుల పంపిణీ చేపట్టారు. తెదేపా మండల అధ్యక్షులు కామిరెడ్డి మురళీరెడ్డి ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను అందజేశారు.

పరుగును ప్రారంభిస్తున్న డాక్టర్ రోహిణి

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరి రోహిణి తెలిపారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో గ్రీన్ హర్ట్ ఫుల్‌నెస్ రన్ ఆదివారం నిర్వహించారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ఆర్గానిక్ ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. మెడిటేషన్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.7.28 కోట్లతో రోడ్ల అభివృద్ధి

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** మండలంలో అయిదు పంచాయతీరాజ్ రోడ్లను రూ.7.28 కోట్లతో అభివృద్ధి పరచనున్నట్లు ఎంపీపీ తనూజారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అభివృద్ధి తీరుపై ఎంపీపీ సమీక్షించారు. ఎంపీ ల్యాండ్స్ కింద రూ.9.90 లక్షలతో రెండు రోడ్లు అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఉపాధి పథకం ద్వారా 41 ప్రాంతాల్లో సీసీ రోడ్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. సచివాలయాల వద్ద రూ.7.21 లక్షలతో సీసీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో గుణశేఖర్, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బహుమతుల ప్రదానం

బహుమతులు అందుకున్న విద్యార్థులు

**సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. శనివారం జరిగిన శ్రీమద్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో 500 మంది విద్యార్థులను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. నాగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ నారాయణరెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు కమ్మిరెడ్డి, శ్లోకాల కన్వీనర్ రాశిగోపి, ప్రఖండ అధ్యక్షులు వేనాటి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదాములో సరకులు పరిశీలిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్

## ‘తూకాల్లో తేడాలు రానివ్వొద్దు’

**నాయుడుపేట, న్యూస్‌టుడే:** అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం కొలతల్లో తేడాలు లేకుండా చూడాలని ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన పౌరసరఫరాల గోదాములో నిల్వ ఉన్న నిత్యావసర సరకులను పరిశీలించారు. సరకులు సకాలంలో అందించాలని గోదాము సిబ్బందికి సూచించారు. అనంతరం సరకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

దీక్ష చేస్తున్న ఐకాస నాయకులు

## ఎన్నికల హామీ అమలు చేయాలి

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఐకాస నాయకులు తెలిపారు. పట్టణంలోని గడియారం స్తంభం కూడలి వద్ద 8వ రోజు రిలే దీక్షలు కొనసాగించారు. ఉద్యోగ సంఘాల నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. దశరథరామిరెడ్డి, జమాలుల్లా, అట్ల రవి, శివకుమార్, శ్రావణ్‌కుమార్, మస్తానయ్య, మౌలాలీ పాల్గొన్నారు. గూడూరును జిల్లా చేయాలని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా నాయకుడు పెంచలనాయుడు విలేకర్ల సమావేశంలో డిమాండ్ చేశారు.

## రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎంపిక

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరు యూనిట్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎ.మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన ఎన్నికల్లో పలు మండలాలకు రెవెన్యూ అధికారులను ఎన్నుకున్నట్లు చెప్పారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామయ్య, వైస్ ప్రెసిడెంట్లుగా సందీప్‌కుమార్, మధులత, శివశంకర్‌రాజు, కార్యదర్శిగా అఖిల్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా వందన, పద్మావతి, మహేష్, కోశాధికారిగా చైతన్య, సభ్యులుగా ప్రసాద్, చక్రి, సాయికుమార్, వై.ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

ఎన్నికైన కమిటీని సత్కరించిన ప్రతినిధులు

## నూతన కమిటీ నియామకం

**కోట, న్యూస్‌టుడే:** గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలనే ఉద్దేశంతో పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో ఆదివారం జేఏసీ సమావేశం నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పునబాక జనార్దన్, కో కన్వీనర్‌గా రామకృష్ణారావు, కార్యదర్శిగా మీజూరుమాధవ్, సంయుక్త కార్యదర్శిగా హేమంత్ కుమార్‌శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మీజూరు మల్లికార్జునరావు, కోశాధికారిగా జమ్మిప్రసాద్ ఎన్నికయ్యారు. అనంతరం భవిష్యత్తు ప్రణాళికను రూపొందించారు.

ఎన్నికైన జేఏసీ కమిటీ ప్రతినిధులు

### వీధుల్లో మురుగు.. నట్టింట్లో రోగాలు

ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ చేరడంతో గ్రామీణ వీధులు అన్నీ అధ్వానంగా మారాయి. విందూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ముందు ఉన్న వీధిలో మురుగు నిల్వ చేరడంతో కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగులో దోమలు ఆవాసం ఏర్పరచుకోవడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గూడూరుపట్టణం**

### పేరుకున్న చెత్త.. వెదజల్లుతున్న దుర్వాసన

సూళ్లూరుపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని రోడ్డుపై చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త తొలగించకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై కార్యాలయ సిబ్బంది, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

### దుమ్ము రేగి.. ధూళి దరిచేరి

నాయుడుపేట పాత ఉప ఖజానా కార్యాలయం ఎదుట వీధిలో వాహనాల రాకపోకలతో దుమ్ము రేగుతోంది. దీంతో స్థానిక వ్యాపారులు గాలిని పీల్చలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి పెద్ద ఎత్తున దుమ్ము లేస్తుండటంతో దుకాణాలను మూతేయాల్సిన పరిస్థితి. లేకుంటే షాపులన్నీ దుమ్మూ, ధూళితో నిండుతున్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

### గుత్తే‘దారు’ణం

కోట మార్గంలోని ప్రధాన ర.భ శాఖ రోడ్డు గుంతలమయమైంది. దీంతో చోదకులు రాకపోకలు సాగించాలంటే నానా తంటాలు పడుతున్నారు. మూడేళ్ల కిందట రూ.18 కోట్లతో పనులు చేపట్టగా గుత్తేదారు మధ్యలోనే నిలిపివేశాడు. ఈ విషయమై ర.భ శాఖ అధికారులు స్పందిస్తూ త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. **- న్యూస్‌టుడే, కోట**

### ఇంటింటా దిన్నెకు ఉందో కథ

నాయుడుపేట భూపయ్య కాలనీలో ఇంటింటా ఓ సిమెంటు దిన్నె ఏర్పాటు చేసుకున్నారు. దీనికి కారణం తెలిస్తే అవాక్కవ్వాల్సిందే. కాలనీలో సిమెంటు రోడ్డుకు అవతలి వైపున ఉన్న కాలువలోకి ఇంటిలోని మురుగునీరు చేరేలా స్థానికులు పైపులు ఏర్పాటు చేసుకున్నారు. ఏవైనా వాహనాలు పైపులపై వెళ్తే పగిలిపోతాయని ఇలా సిమెంటు దిన్నెలను ఏర్పరిచారు. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

## తప్పిన మురుగు ముప్పు

**తడ, న్యూస్‌టుడే:** తడకంద్రిగ భువనేశ్వరాలయంలోకి మురుగు నీరు రావడంతో భక్తులు ఎదుర్కొన్న అవస్థపై ఈనాడులో ‘శివ శివా.. మన్నించు’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దాంతో సర్పంచి తుమ్మ జయప్రద స్పందించారు. సంబంధిత హోటల్ నిర్వాహకులతో చర్చించి మురుగు నీరు వెళ్లే కాలువ, తూముల్లో పేరుకున్న చెత్తా, చెదారాలను తొలగించే పనులు చేయించారు. శివాలయంలోకి మురుగు రాకుండా అడ్డుకున్నారు.

## అంచుల్లో పైపు.. చోదకుల్లో జంకు

నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయం, బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వద్ద జాతీయ రహదారిపై కొన్ని నెలలుగా పెద్ద ఇనుప పైపు వేసి ఉన్నారు. దీన్ని అక్కడి నుంచి తొలగించకపోవడంతో వాహనదారులకు కిందకు దిగేందుకు ఆస్కారం లేకుండా పోయింది. భారీ పైపును రోడ్డు అంచు నుంచి తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

## బాధ్యత తెలిసి.. సేవకు కదిలి

● సామాజిక కార్యక్రమాలు చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

**సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సమాజ సేవకు నడుంబిగించారు. ప్రిన్సిపల్ కే.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) లో సభ్యులుగా చేరి, సమాజసేవలో భాగస్వాములవుతున్నారు. ప్రత్యేక శిబిరాల్లో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. వారం రోజులపాటు సీజనల్ వ్యాధులు- నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మన్నారుపోలూరు ప్రాథమిక పాఠశాల, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

### ప్రజలతో ఎలా నడుచుకోవాలో



జాతీయ సేవా పథకం(ఎన్‌సీసీ)లో చేరి సమాజానికి మావంతు సేవ ఎలా చేయాలో నేర్చుకున్నా. అంతే కాకుండా ప్రజలతో ఎలా నడుచుకోవాలనే విషయం అర్థమైంది. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను పాఠశాలల్లో తెలియజేశాం. **- ప్రియాంక**

### మొక్కలు సంరక్షించడం నేర్చుకున్నా

సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటి వాటిని ఎలా సంరక్షించుకోవాలి అనే విషయం తెలుసుకున్నా. క్రమశిక్షణ నేర్చుకున్నా. వైద్య శిబిరంలో పాల్గొని రోగులకు వైద్యులతో ఉచితంగా పలు పరీక్షలు చేయించాం. **- ఝాన్సీ**

### జీవన విధానం తెలిసింది

సేవలపై ఆసక్తితో ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరా. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి దారి చూపాలని నిర్ణయించుకున్నా. పేదల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు తెలిశాయి. మురికివాడల్లో పరిసరాలు- పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాం. **- షాలిని**

విగ్రహావిష్కరణకు తరలి వెళ్తున్న భాజపా శ్రేణులు

## దేశాభివృద్ధిలో కీలకం వాజ్‌పేయీ

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** దేశ అభివృద్ధిలో మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయీ ఎంతో కీలకంగా వ్యవహరించారని భాజపా కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. ఆదివారం భాజపా కార్యాలయం నుంచి శ్రేణులు రేణిగుంటలో ప్రారంభించనున్న వాజ్‌పేయీ విగ్రహ ఆవిష్కరణకు తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రయాణం సులువుగా మారేందుకు చతుర్భుజ రోడ్ల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అనంతరం మాజీ ప్రధాని సేవలను కొనియాడారు. విగ్రహ ఆవిష్కరణకు భాజపా శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు.

## క్రీడలు.. గమ్యానికి బాటలు

● వాలీబాల్ ఆటలో సత్తా చాటుతున్న బాలికలు

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** వారంతా నిరుపేద కుటుంబ నుంచి వచ్చారు. చదువుతోపాటు క్రీడల్లో సత్తాచాటాలనే ధ్యేయంగా ముందుకు కదులుతున్నారు. లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. ఆటల్లో అదరగొడుతూ తామెవరికీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. తమ ఆటతీరుతో వాలీబాల్‌లో అండర్-14 జిల్లా జట్టుకు ఎంపికయ్యారు పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో వీరు క్రీడల్లో దూసుకుపోతున్నారిలా..

### డిఫెన్స్ స్పెషలిస్టులు

ఆర్.కవిత

ఆర్.మౌనిక

నాగరాజుపురానికి చెందిన వెంకటేష్ చిన్న వ్యాపారం చేసుకుంటూ కవిత, మౌనికను చదివిస్తున్నారు. కవితకు వాలీబాల్‌తో పాటు చిత్రలేఖనం, బొమ్మలు గీయడం అన్నా అమితమైన ఆసక్తి ఉంది. ఎనిమిదో తరగతి చదువుతున్న మౌనిక డిఫెన్స్ స్పెషలిస్ట్ పాత్ర పోషిస్తోంది.

### ఆల్‌రౌండర్ పాత్ర పోషిస్తూ

పట్టణంలోని నాగరాజు పురానికి చెందిన నారాయణ కుమార్తె **హేమప్రియ**కు చిన్నప్పటి నుంచే ఆటలపై మక్కువ. పాఠశాలలో ఈమె తొమ్మిదో తరగతి చదువుతోంది. వాలీబాల్ ఆటలో ఆల్ రౌండర్ పాత్ర పోషిస్తూ, జట్టుకు వెన్నెముక నిలుస్తోంది.

### స్పైకింగ్‌లో సమన్వయం

పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న కె.శ్రీనివాసులు, కె.రేవతి దంపతుల కుమార్తె **స్మైలీ**కి చిన్నప్పటి నుంచే వాలీబాల్ ఆట అంటే ఆసక్తి. సూళ్లూరుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమె వాలీబాల్‌లో సెట్టర్ పాత్ర పోషిస్తూ, స్పైకింగ్‌ను సమన్వయం చేస్తూ రాణిస్తోంది.

### అడుగేస్తే ఎదురుదాడే

పట్టణంలోని నాగరాజు పురానికి చెందిన వల్లూరు వెంకటేష్ మేస్త్రీగా పనులు చేసుకుంటూ **జాస్మిన్‌**ను చదివిస్తున్నారు. కుమార్తె అభిరుచిని గుర్తించి ఆటల్లో కూడా ప్రోత్సహించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆమె అటాకింగ్ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది.

## నాడు అరకొర.. నేడు నిత్య వినియోగం

పొలంలో మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

**వాకాడు, న్యూస్‌టుడే:** గత వైకాపా ప్రభుత్వంలో వ్యవసాయ పనుల కోసం డ్రోన్ పరికరాలు ఉన్నప్పటికీ అప్పట్లో రైతులకు అందుబాటులో లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొలాల్లో వీటి వినియోగం అధికమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం రాయితీతో పరికరాలను రైతుల గ్రూపులకు పంపిణీ చేయడంతో పొలాల్లో ప్రస్తుతం పంటలకు మందులను పిచికారీ చేస్తున్నారు.

**సమయం ఆదా**

డ్రోన్ ద్వారా ఎకరా పంటకు 6- 7 నిముషాల్లో మందును పిచికారీ చేయవచ్చు. అదే కూలీ ద్వారా అయితే గంట సమయం పడుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కూలీల ధరలు పెరిగిన నేపథ్యంలో డ్రోన్ పరికరం ద్వారా సులువుగా పురుగు మందులను పిచికారీ చేస్తున్నామని రైతులు వెల్లడిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి సన్న, చిన్నకారు రైతులకు డ్రోన్ పరికరాలు అందిస్తే వ్యవసాయం తక్కువ పెట్టుబడితో కూలీల రహితంగా చేయవచ్చని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాకాడులో నందగోపాల్ పొలాల్లో డ్రోన్ ద్వారా మందును పిచికారీ చేశారు.

(c) eenadu

# ఆలయ దర్శిని

## కాణిపాకం వరసిద్ధుడి వినాయక ఆలయంలో

**నిజరూప దర్శనం:**
ఉ.: 7-7.30, 8.30-9.00, 10.30-11.00,
సా. 4.30- 5.00

**సర్వదర్శనం:**
ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30,
మధ్యాహ్నం: 12.00
సాయంత్రం: 4.30,
రాత్రి: 7-9 గంటలు.

**నిత్య సేవలు**



సుప్రభాత సేవ,
గోపూజ: వేకువజామున 4.00
బిందుతీర్థ అభిషేకం: 4.30
పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు
క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45
ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు.
నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

## తిరుమల శ్రీవారి ఆలయంలో

**నిత్యోత్సవాలు**

ఈనెల 17 నుంచి తెల్లవారుజామున 3 గం.కు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. మంగళ, బుధ, గురువారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సా.5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

**సర్వదర్శనం:** తెల్లవాజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు.

**వారోత్సవాలు**

ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

–న్యూస్‌టుడే, తిరుమల

## ముక్కంటి ఆలయంలో

**ఉదయం:** 3.00: పురవీధుల్లో జేగంట, 4.00: మంగళవాయిద్యాలు, 4.15: గోమాత పూజ, తిరుమంజనం, 5.00: ప్రథమకాల అభిషేకం (ఏకాంతం), 6.00: ద్వితీయ కాలాభిషేకం, 7.00: పరివార దేవతలకు నివేదన, 7.30: గొబ్బిదేవత పురవీధుల ఉత్సవం, 10.30: ఉచ్చికాల అభిషేకం

**సాయంత్రం:** 5.00:ప్రదోష కాలాభిషేకం 6.30: నీరాజన మంత్రపుష్పం

**సర్వదర్శనం:** ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు.

**రాహు, కేతు పూజలు**

ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు

**అభిషేకాలు:** శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం).
**శుక్రవారం:** మనోన్మణికి ఊంజల్‌సేవ

● శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9.00 గంటలకు, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 8.30కు పల్లియర పూజ నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి


# యువ ప్లేయర్లకు అవకాశం

# ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

**ఈఎస్‌ఎల్ దరఖాస్తులకు నేడు ఆఖరి తేదీ**

EENADU SPORTS LEAGUE 2025

తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ..

కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీ త్వరలో ప్రారంభమవనుంది.

ఆసక్తిగలవారు సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలి.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY www.mits.ac.in MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ FM Partner: ఈ FM Mee FM TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఛాంపియన్స్ క్లబ్


ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్‌ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోరు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

### 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'కు బైక్



టోర్నీలో అసాధారణ ప్రదర్శన చేసే ఆటగాళ్లకు బైక్ బహుమతిగా లభించనుంది. సీనియర్ విభాగంలో, జూనియర్ విభాగంలో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచే ఆటగాళ్లకు బైక్‌ను అందజేయనున్నారు.

### ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

### వయసు నిబంధన

- బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- సీనియర్స్- 25 ఏళ్ల లోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు).
- అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

### క్రికెట్ జట్ల నమోదు ఇలా..

**ఈఎస్‌ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.**

**పురుషులు**

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

**మహిళలు**

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.
డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

**రిజిస్ట్రేషన్ కోసం**

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

**దరఖాస్తులు పంపాల్సిన చిరునామా**

ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు, నేంద్రగుంట(వి&పో), పాకాల(మం), తిరుపతి(జి) - 517112
వివరాలకు: 90634 38851, 80087 05935
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

**నాకౌట్ పద్ధతిలో..**

జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌లకు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.


# రామోజీ ఫిల్మ్‌సిటీ వేదిక..

# శీతాకాల వేడుక

● ఈ నెల 18 నుంచి నెల రోజుల సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: శీతాకాల వేడుకలతో పర్యాటకులను అలరించేందుకు ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీ ముస్తాబైంది. ఈనెల 18వ తేదీ నుంచి నెల రోజుల పాటు కొనసాగే 'వింటర్ ఫెస్ట్'కు సర్వంసిద్ధమైంది. జనవరి 18 వరకు జరిగే ఈ ఫెస్ట్‌లో సందర్శకులను మంత్రముగ్ధులను చేసే సినీ మ్యాజిక్‌తో పాటు సెలవు రోజుల్లో ఆబాలగోపాలాన్ని ఆకట్టుకునే కార్నివాల్ పరేడ్, మనసును హత్తుకునేలా మ్యూజిక్‌తో గార్డెన్, మాయాలోక్‌తో పాటు మరెన్నో అలరించే అంశాలు ఉండనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా స్టూడియో టూర్..** ఈ వేడుకల్లో భాగంగా ఫిల్మ్‌సిటీ సందర్శన సమయం రాత్రి 9 గంటల వరకు పొడిగించారు. ప్రకాశవంతమైన వాతావరణంలో ఫిల్మ్ సిటీ అందాలను వీక్షించే అవకాశం కల్పించారు. సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో ఫెస్ట్‌ను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు అద్భుతమైన సినిమా సెట్ల సందర్శనతో సాగే స్టూడియో టూర్ ఆకట్టుకుంటుంది. లైవ్ షోలు, వైల్డ్ వెస్ట్ స్టంట్స్, ఉత్తేజకరమైన రైడ్స్, సాహసాల వేదిక సాహస్, బర్డ్ పార్కు సందర్శనతో ఇదో మధుర జ్ఞాపకంగా మలుచుకోవచ్చు.

**న్యూ ఇయర్ పార్టీ..**

డిసెంబరు 31న నూతన సంవత్సరంలోకి అడుగిడే క్షణాలను సరికొత్త ఉత్సాహంతో గడిపేందుకు రామోజీ కార్నివైబ్ 2026 ఉంటుంది. వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్ డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. అపరిమిత ఆహారం, పానీయాలతో వీనులవిందైన సంగీత ప్రదర్శనలతో సాగే ఈ వేడుకలో సందర్శకులు పాలుపంచుకోవచ్చు.

'వింటర్ ఫెస్ట్'కు సర్వం సిద్ధం

**అబ్బురపరిచే కార్నివాల్**

అద్భుత శకటాలతో అబ్బురపరిచే కార్నివాల్ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో చిన్నా పెద్దా అందరూ సరికొత్త అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. మిరుమిట్లు గొలిపే ఫిల్మ్‌సిటీ అందాల మధ్య ఆనందతీరాలను చవిచూడవచ్చు. మ్యూజికల్ గ్లో గార్డెన్ సరికొత్త లోకాన్ని కళ్లముందుకు తెస్తుంది. బాహుబలి సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ సందర్శనతో వీక్షించవచ్చు. సెట్ల డిజైన్, కళాత్మక నైపుణ్యంతో తెరవెనుక జరిగే కృషి కళ్లముందు సాక్షాత్కరిస్తుంది.

**ప్రత్యేక ప్యాకేజీలు, సౌకర్యాలు**

వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకల కోసం ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ కోసం క్రెష్ సౌకర్యాలను పర్యాటకులు వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకు: www.ramojifilmcity.com లాగిన్ అవ్వండి. కాల్ సెంటర్ నంబర్: 7659876598


## శ్రీవారి దివ్యప్రసాదములు పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, రచయిత రమణదీక్షితులు తదితరులు

**తిరుమల, న్యూస్‌టుడే:** 'శ్రీవారి దివ్యప్రసాదములు' పుస్తకాన్ని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. స్థానిక తితిదే ఛైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్‌తో పుస్తక రచయిత, శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు ఆవిష్కరింపజేశారు. వీరితో పాటు సహ రచయిత కోటా నీలిమ, శ్రీఅష్టోత్తరశత చుక్కల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాజమహేంద్రవరం గొల్లపూడి వీరాస్వామి సన్ పబ్లిషర్స్, బుక్ సెల్స్ పుస్తకాన్ని ముద్రించారు. భక్తులు శ్రీవారి ప్రసాదాల విశిష్టతను తెలుసుకుని వారి గృహాల్లో, ఆలయాల్లో, ఉత్సవాల్లో సులభంగా ప్రసాదాలు తయారు చేసుకునేలా పూర్తి సమాచారాన్ని పుస్తకంలో అందుబాటులోకి తీసుకొచ్చామని రమణదీక్షితులు తెలిపారు.

## సర్వదర్శనానికి 12 గంటలు

**తిరుమల, తిరుపతి(తితిదే):** శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 80,113 మంది దర్శించుకున్నారు. రూ.3.71 కోట్ల హుండీ కానుకలు లభించాయి. **13 వేల టోకెన్ల జారీ..** తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 13 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది.

## క్రీడల్లో అగ్రదేశంగా భారత్

**తిరుపతి ఐఐటీలో ఘనంగా ప్రారంభమైన 58వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్‌మీట్**

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న సతీష్ శివలింగం, ఐఐటీ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ

**ఏర్పేడు, న్యూస్‌టుడే:** బహు క్రీడలకు నిలయమైన భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత సతీష్ శివలింగం తెలిపారు. తిరుపతి ఐఐటీలో ఆదివారం ఘనంగా 58వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్‌మీట్ ప్రారంభమైంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ సహకారంతో తిరుపతి ఐఐటీ ప్రధాన క్రీడా మైదానంలో నిర్వహించే క్రీడా పోటీలకు దేశంలోని 23 ఐఐటీల నుంచి క్రీడాకారులు హాజరై సైనిక బ్యాండ్, దేశభక్తి సంగీత ప్రదర్శనతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్ శివలింగం సమావేశంలో మాట్లాడుతూ క్రీడల్లో భారతదేశం సాధించిన ఖ్యాతిని వివరించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ మద్రాస్‌లో జరిగిన క్రీడా పోటీలను గుర్తు చేసుకుని అనుభవాలను వివరించారు. అనంతరం టెన్నిస్ పోటీలను నిర్వహించారు.

## గూడూరు-గుమ్మిడిపూండి మధ్య రైల్వేలైన్లు

### రూ.1,723 కోట్లతో డీపీఆర్ సిద్ధం

నాయుడుపేట రైల్వేస్టేషన్ వద్ద సరకు రవాణాకు సిద్ధం చేస్తున్న లైన్లు

అభివృద్ధి భారత్‌ను ఆవిష్కరించే దిశగా ఎన్‌డీఏ ప్రభుత్వం పశ్చిమ తీరంలో వ్యాపార వాణిజ్య, పారిశ్రామిక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు, పారిశ్రామిక కారిడార్లలో భాగంగా రహదారులు, ఓడరేవులు, రైలు మార్గాలను అభివృద్ధి చేస్తుండటం తెలిసిందే. ఇందులో భాగంగా గూడూరు-గుమ్మిడిపూండి మధ్య తమిళనాడును కలుపుతూ సుమారు రూ.1,723 కోట్ల వ్యయంతో మూడు, నాలుగు అదనపు లైన్ల నిర్మాణానికి రైల్వేశాఖ సన్నాహాలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి కేంద్రం ఆమోదం పొందింది.

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే:

### సరకు రవాణాకు అనుకూలంగా

తీరప్రాంతాల్లో ఉన్న ఓడరేవులకు అనుసంధానంగా, సరకు రవాణాకు ప్రత్యేకంగా, గూడ్స్‌లు సాఫీగా వెళ్లేందుకు ఇప్పుడు ఉన్న రెండు లైన్లు కాకుండా మూడు, నాలుగు లైన్లు ఏర్పాటు చేయనున్నారు. సరకు రవాణాకు ఖరగ్‌పూర్-చెన్నై మధ్య ప్రత్యేక రైల్వే కారిడార్ నిర్మించాలని మొదట రైల్వేశాఖ భావించినా అధిక వ్యయం అవుతుందని ఈ ప్రాజెక్టు నిర్ణయాన్ని పక్కన పెట్టింది. ఈ ప్రతిపాదనలకు ముందే హావ్‌డా-చెన్నై ప్రధాన రైల్వే లైన్‌లో అనేక మార్గాల్లో 3, 4 అదనపు లైన్లను వేగంగా నిర్మిస్తుండటం తెలిసిందే. ■ ఇందులో భాగంగా విజయవాడ-గూడూరు 288 కి.మీ మేర రూ.6,238 కోట్లతో మూడో లైను నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 260 కి.మీ పూర్తయింది. ఇవికాకుండా ఇదే మార్గంలో విజయవాడ-గూడూరు మధ్య 293 కి.మీ నాలుగో లైను నిర్మాణానికి కూడా తాజాగా సర్వే చేస్తున్నారు. వీటితోపాటు తమిళనాడును అనుసంధానం చేసే దిశగా గూడూరు నుంచి సూళ్లూరుపేట వరకు, సూళ్లూరుపేట నుంచి గుమ్మిడిపూండి వరకు 3, 4 లైన్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేశారు. గత నెలలో రైల్వే జీఎం కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు.

**కొత్తగా నిర్మించనున్న 3, 4 రైల్వేలైన్లు**

| మార్గం | దూరం (కి.మీ) | వ్యయం (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| గూడూరు-సూళ్లూరుపేట | 55 | 1,248 |
| సూళ్లూరుపేట-గుమ్మిడిపూండి | 18 | 475 |

**ఇవీ ప్రయోజనాలు**

మూడు, నాలుగు లైన్లు అందుబాటులోకి వస్తే ప్యాసింజర్, గూడ్స్ రైళ్లు వేగంగా పరుగులు తీస్తాయి. ఒకటి, రెండు లైన్లలో ప్రయాణికుల రైళ్లు మాత్రమే నడిపే అవకాశం ఉంటుంది. కొత్తగా నిర్మించే లైన్లు చిన్న చిన్న స్టేషన్లకు అనుసంధానం లేకుండా వెళ్లే అవకాశం ఉంది.

## సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** ఈ నెల 26 నుంచి జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి తిరుపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం పోలీసు ఉన్నతాధికారులు, వర్సిటీ అధికారులతో కలిసి సభా ప్రాంగణాలు, పర్యటన మార్గాలను పరిశీలించారు. భద్రత, సమన్వయ అంశాలపై కీలక సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ వెంకటనారాయణ, భక్తవత్సలం, చెంచుబాబు పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

**తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే:** భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. తిరుపతిలోని కచ్ఛపి ఆడిటోరియం వేదికగా మూడు రోజుల పాటు జరిగిన ప్రతినిధుల సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 19 తీర్మానాలను ఆమోదించారు. 68 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ తిరిగి ఎన్నికయ్యారు. ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

## శ్రీబేడి ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారి ఆలయం ఎదురుగా వెలిసిన శ్రీబేడి ఆంజనేయస్వామికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. తితిదే ఆరోగ్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆదివారం నిర్వహించిన రెండు వేర్వేరు దాడుల్లో నలుగురు స్మగ్లర్లని అరెస్టు చేశారు. రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని బాలపల్లి, కోడూరు మండలం మొగిలిపెంట అడవుల్లో అనుమతులు లేకుండా ప్రవేశించిన తమిళనాడుకు చెందిన నలుగురిని పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరుపతి(కలెక్టరేట్, నేరవిభాగం):** కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు.

## పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతికి ప్రముఖులు రాక సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు పోలీసు శాఖ పేర్కొంది.

## రూ.1.80 కోట్లతో ఆర్జిత కౌంటర్లు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** బృహత్తర ప్రణాళిక అమలులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున బహుళ వసతులు కల్గిన ఆర్జిత టికెట్ కౌంటర్లు అందుబాటులోకి రానున్నాయి. దాదాపు కౌంటర్లు సిద్ధం కావడంతో పాటు ముందు భక్తులు నిరీక్షించేందుకు వీలుగా స్టెయిన్‌లెస్ స్టీలుతో క్యూలైన్లు సిద్ధమయ్యాయి. ఈ నెలాఖరు నాటికి వీటిని పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ కౌంటర్లు పూర్తయితే అన్ని ఆర్జిత సేవలకు సంబంధించి టికెట్లు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉండటం, ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసేందుకు వీలుగా ఇక్కడ వసతులు అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకమనే చెప్పాలి. తద్వారా నగదు చెల్లింపుల కష్టాల భారం కొంతైనా తగ్గే అవకాశముంది.

## సిందూర గణపతి.. ప్రకృతి ప్రణతి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాపవినాశనానికి వెళ్లే మార్గంలో జాపాలి క్షేత్రంలో శ్రీఆంజనేయస్వామి కొలువై ఉన్నాడు. ఆవరణలో దశాబ్దాల కాలంనాటి భారీ మామిడి చెట్టు కాండం వద్ద ఏర్పడిన సహజ వినాయకుని ప్రతిమకు సిందూరం పూసి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు.

-ఈనాడు, తిరుపతి

## ఆటలకు ప్రాధాన్యం.. విద్యార్థుల్లో వికాసం

### పాఠశాలలకు క్రీడా ఉపకరణాలు

పంపిణీ చేసిన ఉపకరణాలు

**తిరుపతి విద్య, శ్రీకాళహస్తి:** మైదానపు ఆటలను ప్రోత్సహించి విద్యార్థుల్లో క్రీడా వికాసాన్ని పెంపొందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగ్గట్టుగా అన్ని పాఠశాలలకు అవసరమైన క్రీడా ఉపకరణాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాలకు సంబంధించి 2,238 పాఠశాలలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఫౌండేషన్, ప్రీప్రైమరీ పాఠశాలలకు క్రీడా ఉపకరణాల కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**జిల్లాలో పాఠశాలలు**

- ఫౌండేషన్: 1,054
- ప్రీప్రైమరీ: 301
- ఆదర్శ: 613
- ప్రాథమికోన్నత: 08
- ఉన్నత: 262

**స్థాయిని బట్టి పరికరాలు:** పాఠశాల స్థాయి, అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలకు అనుగుణంగా క్రీడా పరికరాల కిట్లను పంపిణీ చేయనుంది. ఇందుకు సంబంధించి ఆర్నెల్ల క్రితమే ఆయా పాఠశాలల్లోని క్రీడా మైదానాల వసతి, విద్యార్థుల సంఖ్య, అవసరమైన క్రీడా పరికరాలు తదితర అంశాలకు తగ్గట్టుగా నివేదికలను విద్యాశాఖ తెప్పించుకుంది. ఆ ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోపు వాటికి రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.15 నుంచి రూ.17 వేలల్లోపు, ఉన్నత పాఠశాలలకు రూ.25 నుంచి రూ.30 వేలల్లోపు విలువైన క్రీడా ఉపకరణాల కిట్లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ● క్రికెట్ క్రీడా పరికరాలతో పాటు త్రోబాల్, బాస్కెట్‌బాల్, బేస్‌బాల్, త్రోబాల్, స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చదరంగం, ఫుట్ బాల్, కబడ్డీ, విలువిద్యకు సంబంధించిన ఉపకరణాలు కిట్‌లో ఉన్నాయి.

(c) eenadu

అవార్డు అందుకుంటున్న అదనపు కమిషనర్ రమణమూర్తి, తదితరులు

## జీవీఎంసీకి అవార్డుల పంట

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీకి మూడు అవార్డులు వచ్చాయి. ఎంపవరింగ్, గ్రోత్, ప్రిజర్వింగ్ రూట్స్ థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ స్పీకర్ రీతూ ఖండూరి భూషణ్ హాజరయ్యారు. బ్యాలు, సోషల్ మీడియా వినియోగం, మహిళా సాధికారత, సామాజికాభివృద్ధి విభాగాల్లో జీవీఎంసీకి దక్కిన అవార్డులను అదనపు కమిషనర్ రమణ మూర్తి, పౌర సంబంధాల అధికారి ఎన్.నాగేశ్వరరావు స్వీకరించారు.

## అప్పన్నస్వామి దీవించు..

సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ తెలుగు సినీ కథానాయిక శ్రీలీల ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకుడు బి.సత్య శ్రీనివాస్ స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



# పచ్చిగా తిందాం.. పచ్చగా ఉందాం..!

**ఇళ్లల్లో మైక్రో గ్రీన్స్ పెంపకం**

**ఆసక్తి చూపుతున్న నగర ప్రజలు**

ఈనాడు, విశాఖపట్నం: మైక్రో గ్రీన్స్.. ప్రస్తుతం నగర ఫుడ్ కల్చర్‌లో ట్రెండింగ్ అవుతున్న విధానం. వారం నుంచి పది రోజుల వ్యవధిలో మూడు అంగుళాల మేరకు పెరిగే ఆకుకూరలు, కాయగూరలను ఇలా పిలుస్తారు. ఇళ్లల్లో సులభంగా, తక్కువ ఖర్చుతో పెంచుకోవచ్చు. అందుకే నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

**ఇంటి ఆవరణలోనే సులువుగా..**

- ఇంటి బాల్కనీ, పెరడు, గోడలపై మైక్రో గ్రీన్స్ పెంచొచ్చు.
- ట్రేలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ సీసాలు, కుండలు, ప్లాస్టిక్ వస్త్ర సంచులు, చిన్నపాటి తొట్టెల్లో పెంచొచ్చు.
- మట్టి, కోకో పీట్, వర్మికంపోస్టు తగిన మోతాదులో వేసి విత్తనాలు నాటితే సరిపోతుంది.
- వారం నుంచి రెండు వారాల్లో పంటను కోసుకోవాలి.
- రోజుకు మూడు, నాలుగు గంటలు ఎండలో ఉంచి తర్వాత ఇంట్లో పెట్టుకోవాలి.

మైక్రో గ్రీన్స్‌పై అవగాహన కల్పిస్తున్న సింధూరి

**మూడేళ్లుగా పెంచుతున్నా..:** స్నేహితుల ఇళ్లల్లో మైక్రో గ్రీన్స్ పెంచడాన్ని చూసి నాకు ఆసక్తి కలిగింది. ఇంట్లోని ఖాళీ ప్రదేశాల్లో, ఆరుబయట, గోడలపై కొబ్బరి చిప్పలు, చిన్న డబ్బాల్లో మూడేళ్లుగా పెంచుతున్నా. ఇంటి అవసరాలకే కాకుండా ఎవరైనా కావాలని అడిగితే ఇస్తున్నా. నగరంలో జరిగే ప్రదర్శనల్లో స్టాల్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నా.
– సింధూరి, మైక్రోగ్రీన్స్ పెంపకందారు

**ఈ పంటలు పండించుకోవచ్చు..:** బ్రకోలి, ముల్లంగి, కొత్తిమీర, పాలకూర, తోటకూర, బచ్చలి, పుదీనా, పెసలు, నువ్వులు, వేరుశనగ, ఆవాలు, క్యారెట్, బీట్‌రూట్, కాలీఫ్లవర్, క్యాబేజి, ఉల్లి, వెల్లుల్లి, సన్‌ఫ్లవర్ తదితర విత్తనాలు నాటుకోవచ్చు. అవి మొలకెత్తి మూడు అంగుళాలు పెరిగాక వేళ్లను కత్తిరించి ఆహారంగా తీసుకోవచ్చు.

**ఉడికించకుండా తినాలి..:** మైక్రో గ్రీన్స్ పెంచడం చాలా తేలిక. ఉడికించకుండా తింటే పోషకాలు నేరుగా అందుతాయి. ఇవి వ్యాధి నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. వీటిలో విటమిన్ సి, ఇ, ఎ, కె, బీ3, బీ6, బీ12, పీచుపదార్థం, క్లోరోఫిల్ ఉంటుంది. ఏయూలో ప్రయోగాత్మకంగా పండించిన మైక్రోగ్రీన్స్‌లో 60 ఎంజీ పోషకాలుంటే సాధారణంగా పండించిన వాటిల్లో సగానికన్నా తక్కువ ఉన్నాయి. ట్రేల పరిమాణం ఆధారంగా విత్తనాలు చల్లుకోవాలి.
– డాక్టర్ ఎం.రాజేశ్వరి, సహాయ ఆచార్యులు, ఏయూ ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ విభాగం

## 'తేజస్'.. ఆరితేరిన గగన విహారి..!

పద్మనాభం, న్యూస్‌టుడే: సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు పద్మనాభం మండలం అనంతవరం గ్రామానికి చెందిన కొర్రెడ్డి ఎస్వీటీ తేజస్. పుట్టింది మారుమూల గ్రామమైనా విద్యార్థి దశనుంచే విమానాల్లో ఎగరాలని కలలు కని సాకారం చేసుకున్నారు. హైదరాబాద్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో దిగ్విజయంగా శిక్షణ పూర్తి చేసుకుని ఫైటర్ ఫ్లైట్ వింగ్ ట్రైనీ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా అర్హత పొందారు. ఈ మేరకు ఈనెల 13న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ చేతుల మీదుగా ధ్రువీకరణపత్రం అందుకున్నారు. తేజస్ తల్లిదండ్రులు శివన్నారాయణ, సంధ్య. తండ్రి ప్రైవేటు ఉద్యోగి కావడంతో విజయనగరంలో స్థిరపడ్డారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కోరుకొండ సైనిక్ స్కూల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం యూపీఎస్సీలో 127వ ర్యాంకు సాధించి ఎన్‌డీఏ-పుణెలో సీటు సాధించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న అనంతరం హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో శిక్షణ పొంది ఈ విజయం సాధించారు.

## 'అంతర్జాతీయ' పిచ్‌కు అమలాపురం మట్టి..!

పీఎంపాలెం, న్యూస్‌టుడే: క్రికెట్ మైదానంలో ఓ జట్టు గెలుపు, ఓటములను నిర్ణయించడంలో క్రీడాకారుల ప్రతిభతో పాటు పిచ్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. టెస్టు, వన్డే, టీ20 మ్యాచ్‌లకు తగ్గట్టుగా పిచ్‌లను రూపొందిస్తారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ మైదానంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని చిదంబరం, చిన్నస్వామి క్రికెట్ మైదానాల్లో పిచ్ తయారీకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో లభ్యమయ్యే 'బ్లాక్ కాటన్' మట్టిని వినియోగిస్తున్నారు. అక్కడ ఓ రైతుకు చెందిన కొబ్బరితోటలో మట్టిని సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేయించి పిచ్‌ల తయారీకి అనుకూలమని నిర్ధారించారు. పదేళ్లుగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇదే మట్టిని వినియోగిస్తూ పిచ్‌ను తయారు చేస్తున్నారు.

**ఆ మట్టే ఎందుకంటే..:** క్రికెట్ పిచ్‌లకు బ్లాక్ కాటన్ మట్టి ఎంతగానో అనుకూలిస్తుంది. ఇందులో బంక, ఒండ్రు మట్టితో పాటు ఇసుక రేణువులు సైతం ఉంటాయి. దాన్ని మూడుసార్లు జల్లెడ పట్టి పిచ్ తయారీకి వాడుతున్నారు. దీనికి బీటలు వారే తత్వం తక్కువగా ఉంటుంది. నీటిని పీల్చుకునే స్వభావం ఉండడంతో వర్షం పడినా త్వరగా ఆరిపోతుంది. వేడిని సైతం గ్రహించడంలో సహాయ పడుతుంది.

అమలాపురం నుంచి స్టేడియానికి తీసుకొచ్చిన మట్టి

**ఉత్సాహం ఉరకలెత్తే..!**

ఆర్కే బీచ్‌లో ఆదివారం తెల్లవారుజామున నిర్వహించిన 'వైజాగ్ నేవీ మారథాన్'కు జనం పోటెత్తారు. ఈ సందర్భంగా 42కే, 10కే, 5కే పరుగు పోటీలు నిర్వహించారు. వేకువనే వేలాది మంది నగరవాసులు నీలి రంగు దుస్తులు ధరించి తీరంలో పరుగులు పెట్టారు. విజేతలకు రూ.10 లక్షలకు పైగా నగదు బహుమతులు అందజేశారు. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు

## కైలాసగిరి.. పర్యావరణం హారీ..!

**కాటేజీలు, రెస్టారెంట్లకు అనుమతులు**

**సీఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘన**

| ప్రాజెక్టు విస్తీర్ణం: | అంచనా విలువ: | గడువు: |
|---|---|---|
| 1.99 ఎకరాలు | రూ.20 కోట్లు | 18 నెలలు |

ఈనాడు, విశాఖపట్నం: నగర పర్యాటక సిరిగా ఖ్యాతిగాంచిన కైలాసగిరిపై భారం పడుతోంది. ఇప్పటికే 55కిపైగా దుకాణాలతో కిక్కిరిసిపోయింది. టాయ్ ట్రైన్, స్కై సైక్లింగ్, జిప్ లైనర్, గాజువంతెనలు ఉన్నాయి. మరోవైపు సింగపూర్ సంస్థతో ప్రత్యేక ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా కాటేజీలు, భారీ రెస్టారెంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఇలాంటి కట్టడాలు చేపట్టకూడదని గతంలో హైకోర్టు ఆదేశాలున్నాయి. తీర ప్రాంత క్రమబద్ధీకరణ (సీఆర్‌జెడ్) నిబంధనలు అతిక్రమిస్తున్నారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొండపై నిర్మించే కాటేజీల నమూనా

**గత ప్రభుత్వంలో ప్రతిపాదన..:** గత ప్రభుత్వంలో వీఎంఆర్‌డీఏ కైలాసగిరిపై ఏకో హైట్స్ కాటేజీలు, 360 డిగ్రీల రివాల్వింగ్ ఫైన్ డైన్ రెస్టారెంట్, జే వ్యూ కేఫ్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీన్ని ఓ వైకాపా నేత 33 ఏళ్ల లీజుకు కట్టబెట్టాలని చూశారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రాజెక్టు నిలిపివేయించారు. అప్పట్లో పిలిచిన టెండర్లను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు అదే ప్రాజెక్టును మళ్లీ పట్టాలపైకి తీసుకురావాలని నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి.

**నిర్మాణం ఇలా..**

**నేచర్ కాటేజీలు:** 20గదులు నిర్మిస్తారు. ఈవెంట్లు, సమావేశ మందిరం, పార్టీ హాలు, భోజనశాల ఉంటాయి.

**రివాల్వింగ్ రెస్టారెంట్:** ఒకేసారి వంద మంది కూర్చొని తినేలా నిర్మాణం.

**జే వ్యూ కేఫ్:** 60 మంది కూర్చునేలా దీన్ని నిర్మిస్తారు.

**మొదటి నుంచి వివాదాస్పదమే..:** కైలాసగిరిపై భారీ ప్రాజెక్టులు చేపట్టడం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధం. గతంలో ఇక్కడ నేచర్ కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ చేపట్టగా పర్యావరణవేత్తలు న్యాయస్థానంలో పోరాటం చేశారు. వెంటనే నిర్మాణాలు ఆపేయాలని న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ఆయా నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా కొత్త ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లడం గమనార్హం. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల పేరుతో కొండపై విధ్వంసానికి పాల్పడ్డారు. వందలాది వృక్షాలను తొలగించారు.

## చారిత్రక కట్టడం గాలికి..!

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని బ్రిటిష్ మహారాణి విక్టోరియా విగ్రహం కళ తప్పుతోంది. 120ఏళ్ల చరిత్ర గల ఈ కట్టడం నిర్వహణను జీవీఎంసీ గాలికి వదిలేసింది. బ్రిటిష్ పాలనకు గుర్తుగా 1904 [illegible] 24న బ్రిటిష్ మహారాణి విక్టోరియా విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ విగ్రహాన్ని లండన్ నుంచి తెప్పించారు. దాని చుట్టూ మార్బుల్ రాతితో కట్టడాన్ని నిర్మించారు. ప్రజలు చూసేందుకు వీలుగా ఇనుప గ్రిల్ ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా నిర్వహణ గాడి తప్పింది. విగ్రహం ఎదురుగా మద్యం దుకాణం ఉంది. కొంత మంది మందుబాబులు రాత్రుళ్లు వేదిక అరుగులపై కూర్చొని మద్యం తాగుతున్నారు. కనీసం శుభ్రం కూడా చేయడం లేదు. విగ్రహం సైతం దుమ్ముపట్టి పాడవుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చారిత్రక కట్టడాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిపోయిన విగ్రహం

## టెట్‌కు 90.18 శాతం అభ్యర్థుల హాజరు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 2462 మంది అభ్యర్థులకు గాను 2220 మంది(90.18శాతం) హాజరయ్యారని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఉదయం 11 కేంద్రాల్లో, మధ్యాహ్నం 1 కేంద్రంలో పరీక్ష నిర్వహించామన్నారు. తాను ఒక కేంద్రాన్ని, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏడు కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేసి సూచనలు అందించామన్నారు. అన్ని కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

## 100 కేజీలైనా ఉఫ్..!

**వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవి ప్రతిభ**

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది కనపల పల్లవి. తాజాగా రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో జరిగిన 'ఖేల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్'లో ఏయూ తరఫున బరిలోకి దిగిన ఆమె 69కేజీల కేటగిరిలో బంగారు పతకం కైవసం చేసుకుంది. 90కేజీలు, 110 కేజీల విభాగాల్లో రజత పతకాలు సాధించింది.

సాధించిన పతకాలతో..

**పోటీలను చూసి...:** పల్లవి సొంతూరు విజయనగరం సమీపంలోని కొండవెలగాడ గ్రామం. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తున్నారు. 8వ తరగతి చదువుతున్న రోజుల్లో కొండవెలగాడ గ్రామంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఆ ఆట చూసిన ఆమె తానూ నేర్చుకోవాలని భావించింది. చదువుతున్న పాఠశాల, తల్లిదండ్రుల సహకారంతో కోచ్ శిక్షణలో వెయిట్ లిఫ్టింగ్ సాధన చేసింది. అలా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకుంది. 2023 సంవత్సరం జులై, ఆగస్టు నెలలో నోయిడాలో జరిగిన కామన్ వెల్త్ ఛాంపియన్ షిప్ పోటీలు (జూనియర్స్) 64కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి సత్తా చాటింది. అంతేకాకుండా సీనియర్స్ 64కేజీల విభాగంలోనూ పోటీపడి రజత పతకం సొంతం చేసుకుంది. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలన్నదే తన లక్ష్యం అని పల్లవి చెబుతోంది.

## కృత్రిమ మేధ.. భవితకు తోవ

**విద్యార్థి స్థాయి నుంచే బోధన**

**సర్కారు బడుల్లో నూతన ఒరవడి**

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రపంచం ప్రస్తుతం ఏఐకి ముందు.. ఏఐకి తర్వాత అనే విధంగా మారిపోయింది. కృత్రిమ మేధ చేస్తున్న అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరు ఏఐ నైపుణ్యాలు కలిగి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం ఆయా నైపుణ్యాలున్న వారికే సొంతం కావచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వ సూచన మేరకు సైయెంట్ సంస్థ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది.

రోబోటిక్ హ్యాండ్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న శిక్షకురాలు

**ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు:** ఐదు ఆధునిక కంప్యూటర్లు, టేబుళ్లు, ప్రొజెక్టర్, తెర, రోబోటిక్ హ్యాండ్, జెట్ విమానం, జాయ్ స్టిక్, ప్రయోగాలకు అవసరమయ్యే సెన్సార్లు, వివిధ రకాల ఎల్ఈడీ లైట్లు, బ్యాటరీలు, ఓల్టేజ్ రెగ్యులేటర్‌లు, కెపాసిటర్లు, రెసిస్టర్లు, మాడ్యూళ్లు, తదితర సామగ్రి ఏర్పాటు చేశారు. శిక్షకులను నియమించి విద్యార్థులకు ఏఐ కోడింగ్‌పై తర్ఫీదు ఇస్తున్నారు.

**ఎంపిక చేసిన పాఠశాలలు..**

పెందుర్తి మండలంలోని వి.జుత్తాడ, గొరపల్లి, శాంతినగరం, వేపగుంట, రాంపురం జెడ్పీ, పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు.

**వృత్తి విద్యలో ఐటీ పరిచయం..:** వి.జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య బోధనలో భాగంగా ఐటీ అండ్ ఐటీఈఎస్‌లో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కంప్యూటర్లను సమకూర్చారు. శిక్షకుడిని నియమించి 9, 10 తరగతుల విద్యార్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు నేర్పిస్తున్నారు. ఇందులో భాగంగా కమ్యూనికేషన్, సెల్ఫ్ మేనేజ్‌మెంట్ తదితర నైపుణ్యాలను పెంచుతున్నారు.

★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సర్వీసులను పరిచయం చేస్తున్నారు. వీటిని విద్యార్థులు ఆసక్తితో నేర్చుకుంటున్నారని, ఈ నైపుణ్యాలతో విద్యార్థులకు ఉన్నత విద్య సులభమవుతుందని పాఠశాల హెచ్ఎం గేదెల అప్పలనాయుడు పేర్కొన్నారు.

## కాలుష్యం.. వాగులై పారే..!

పరవాడ మండలం భరణికంలోని మొల్లోడి వాగు ఇది.. ఒకప్పుడు స్వచ్ఛమైన జలాలతో కళకళలాడేది. ప్రస్తుతం ఫార్మాసిటీ నుంచి వ్యర్థ రసాయన జలాలను దీనిలోకి వదిలేయడంతో కాలుష్య కాసారంగా మారిపోయింది. ఫలితంగా పంట పొలాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి వాగును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పరవాడ

## ప్రభుత్వ బడిలో.. యూట్యూబ్ స్టూడియో

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విద్యార్థి దశలోనే పిల్లల్లో బహుముఖ నైపుణ్యాలు పెంపొందించాలని దాతలు నిర్ణయించారు. ఈ మేరకు నడుపూరు హైస్కూల్లో యూట్యూబ్ గ్రీన్ స్టూడియోను ఆదివారం ప్రారంభించారు. దీని కోసం ముందుకొచ్చిన నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షుడు శ్రీహరి మందాడి, కార్యవర్గ సభ్యులు కిరణ్ మందాడి, రోటరీ ఇంటర్నేషనల్ సౌత్ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, గ్లోసంస్థ ప్రతినిధి యార్లగడ్డ వెంకన్నచౌదరిలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అతిథులను విద్యార్థులు ఈ స్టూడియోలో ఇంటర్వ్యూ చేయడం విశేషం.

యూట్యూబ్ స్టూడియోలో ఎమ్మెల్యే పల్లాను ఇంటర్వ్యూ చేస్తున్న విద్యార్థిని


bd since 1879 బోంబే డయింగ్
స్టాకిస్టు మానస అశిల్‌మెట్ట 13వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
15 డిసెంబర్ 25 నేడే ఆఖరి రోజు
కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699
1 కొనండి 2 ఉచితం
మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి.
రు.799ల సింగిల్ బెడ్‌షీట్స్ 3కొనండి కేవలం రు.1000లు మాత్రమే
ప్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రు.1000లు మాత్రమే
పిల్లో 1కొనండి 1ఉచితం
రు.799ల టర్కిష్‌టవల్ రు.299లు మాత్రమే
ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం
రు.300ల పిల్లో కవర్సు పెయిర్ 1కొనండి 1ఉచితం
డోర్‌కర్టన్లపై 60% డిస్కౌంట్
సుందరం / శ్రీమాన్ లుంగీ 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
మానస అశిల్‌మెట్ట, సంపత్ వినాయకుడి గుడి దగ్గర విశాఖపట్నం. ఫోన్ : 2565646, 6666546


## ఫైనల్స్‌లోకి చండీగఢ్, హరియాణా జట్లు

రోలర్ హాకీలో తలపడుతున్న క్రీడాకారులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖలో జరుగుతున్న జాతీయస్థాయి రోలర్ హాకీ పోటీల్లో ఆదివారం పురుషుల సీనియర్స్ విభాగంలో తొలి సెమీ ఫైనల్ జరిగింది. ఈ పోటీలో చండీగఢ్ జట్టు 6-2 పాయింట్లతో పంజాబ్‌పై విజయం సాధించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో హరియాణా జట్టు 4-2 పాయింట్లతో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందింది. సోమవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



అమృతమూర్తికి అశ్రుతాంజలి
మాటలకందని ఆప్యాయత అనురాగాలతో మంచికి మారు పేరుగా మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి ఆకస్మికంగా మమ్మల్ని వీడి దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అశ్రునయనాలతో..
భార్య: రాధా సర్వేంద్రరావు
కొడుకు: రాహుల్, కోడలు: అర్చన
మనుమరాళ్లు: ఆన్యా, చాన్వి
కూతురు: అంకిత, అల్లుడు: హర్షిత్
మనుమరాళ్లు: ఆశ్నా, షనాయ
మరియు కుటుంబ సభ్యులు
శ్రీ గరికెన సర్వేంద్రరావు గారు
DOB: 12-09-1945 DOD: 14-12-2025
Nestle's Colonial, Flat No. E3, East Point Colony, Vizag. Cell: 9966813212, 9573949667


# గుదిబండలా.. 'యూజీడీ'..!

**చేతులెత్తేసిన గుత్తేదారు సంస్థ**

**తాజాగా ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆదేశాలు**

**జీవీఎంసీకి భారంగా ప్రాజెక్టు**

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ జీవీఎస్‌సీసీఎల్ (గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటి కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా పెందుర్తి, గాజువాకలో చేపట్టిన యూజీడీ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. గుత్తేదారు సంస్థ చేతులెత్తేయడంతో ఇప్పటి వరకు చేసిన పనులకు జీవీఎంసీ నిధులు చెల్లించేలా చర్యలు చేపట్టింది. మిగతా పనులకు తిరిగి ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**తప్పని ఇక్కట్లు:** రెండు ప్రాంతాల్లో యూజీడీ పనులకు టెండర్లు పూర్తయి, పనులు పూర్తయ్యే సరికి మరో ఐదేళ్లు పట్టే అవకాశాలున్నాయి. అప్పటి వరకు అసంపూర్తి పనులతో ప్రజలకు ఇక్కట్లు తప్పేలా లేవు

**రెండుసార్లు గడువు పెంపు:** తొమ్మిదేళ్ల క్రితం నగర పరిధిలోని పెందుర్తి, గాజువాక ప్రాంతాలలో యూజీడీ (భూగర్భ మురుగు వ్యవస్థ) ప్రాజెక్టు చేపట్టడానికి రూ.720 కోట్లతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**గాజువాకలో అసంపూర్తిగా యూజీడీ**

| ప్రాంతం | కనెక్షన్లు | పూర్తయినవి |
|---|---|---|
| పెందుర్తి | 15వేలు | 6000 |
| గాజువాక | 45వేలు | 5056 |

★ స్మార్ట్ సిటీ నిధులు రూ.100 కోట్లు, మిగతా జీవీఎంసీ సాధారణ నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. సకాలంలో నిధులు సమకూరకపోవడంతోపాటు కొవిడ్ కారణంగా గుత్త సంస్థ ఆయా పనులను సకాలంలో పూర్తి చేయలేకపోయింది. దీంతో ఇప్పటి వరకు రెండుసార్లు గడువు పొడిగించారు.

**జరిగిన పనులు ఇలా..**

★ పెందుర్తిలో పైపులైన్లు 226 కి.మీ. గాను 210 కి.మీ., మ్యాన్‌హోళ్లు 8048 గాను 7328, రహదారి పునరుద్ధరణ 226 కి.మీ. గాను 190 కి.మీ. పూర్తి చేశారు.

★ గాజువాకలో పైపులైన్లు 429 కి.మీ. గాను 170 కి.మీ., 19,638 మ్యాన్‌హోళ్లకు గాను 5289, రహదారి పునరుద్ధరణ 129 కి.మీ. గాను 88కి.మీ. పూర్తి చేశారు.

**ఆ ధరలతో చేయలేం:** పెందుర్తిలో రూ.309.94 కోట్లు, గాజువాకలో రూ.411 కోట్లు వ్యయం చేయడానికి ప్రారంభంలో నిర్ణయించగా, పెరిగిన ధరలతో ప్రస్తుతం పనులు చేయలేమని గుత్తేదారు లేఖ సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాగా పెందుర్తిలో పనులు పూర్తి చేయడానికి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గాజువాక ప్రాంతానికి ఇంకా ప్రతిపాదనలు తయారు చేస్తున్నామ'ని ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీరు ఏడుకొండలు తెలిపారు.


సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి


ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

**తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత:** సాగర్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం రుషికొండ బీచ్‌కు విచ్చేశారు. హఠాత్తుగా రెండేళ్ల కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.


యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ రిటెయిల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ డోర్ నం.43-9-141 శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీకన్యా మెయిన్ రోడ్, దొండపర్తి, విశాఖపట్నం-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్‌సాన్ రోడ్, ఐరోలి, నవీముంబయి–400 708 రిజిస్టర్డ్ ఆఫీసు: "త్రిశూల్" 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదుట, ఎల్లిస్‌బ్రిడ్జి అహ్మదాబాదు–380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6) మరియు 9(1) లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ అఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ–వేలం అమ్మకం ప్రకటన.

[illegible]

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవైనా ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో) | [illegible] |
| ధరావతు (రూ.లలో) | [illegible] |
| బిడ్ పెంపుదల సొమ్ము | [illegible] |
| ధరావతు బిడ్స్ తెలిపేందుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం | [illegible] |
| బహిరంగ ఇ–వేలం తేదీ సమయం మరియు ప్రదేశం | [illegible] |

స్థిరాస్తి షెడ్యూలు

[illegible]

అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https:// www.axisbank. com/auction-retail నందు ఇవ్వబడిన లింక్‌ను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ను చూడండి. వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదైని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ రాంబాబు 7382922383 మరియు శ్రీ కార్తిక్ 9080589635, అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం. మధ్య సంప్రదించవచ్చును.

ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేది: 15–12–2025 ప్రదేశం: విశాఖపట్నం

సం/– అధీకృత అధికారి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆం.ప్ర-530016.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

[illegible]

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవైనా ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో) | [illegible] |
| ధరావతు (రూ.లలో) | [illegible] |
| బిడ్ పెంపుదల సొమ్ము | [illegible] |
| ధరావతు బిడ్స్ తెలిపేందుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం | [illegible] |
| బహిరంగ ఇ–వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం | [illegible] |

స్థిరాస్తి షెడ్యూలు

[illegible]

తేది: 15–12–2025 ప్రదేశం: విశాఖపట్నం

సం/– అధీకృత అధికారి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్


# అట్టహాసంగా వైజాగ్ నేవీ మారథాన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నగర వాసులు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలో చేపట్టిన 'వైజాగ్ నేవీ మారథాన్' అట్టహాసంగా జరిగింది. అన్ని వర్గాల ప్రజలు ఏకరూప దుస్తులు ధరించి పెద్ద ఎత్తున పాల్గొనడంతో బీచ్‌రోడ్డు నీలిరంగుమయం అయింది. ఇందులో భాగంగా ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయ సమీపంలో ప్రారంభమైన 42కె రన్‌ను తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ఉదయం 4 గంటలకు జెండా ఊపి ప్రారంభించగా.. యువత ఐఎన్ఎస్ కళింగ వరకు పరుగు తీశారు. 21కె రన్‌ను నేవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రియా భల్లా, 10కె రన్‌ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్; 5కె రన్‌ను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రారంభించారు. నాలుగు కేటగిరీల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో విదేశీయులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 17 వేల మంది పాల్గొన్న ఈ ప్రక్రియలో రూ.10 లక్షలకు పైగా నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈసారి చేపట్టిన మారథాన్‌లో పాల్గొన్న రన్నర్‌కు బీమా సౌకర్యం కల్పించినట్లు వైస్ అడ్మిరల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రన్నర్స్‌కు ఆయన అభినందనలు తెలిపారు. అంతకు ముందు జరిగిన ఫ్లాష్‌మాబ్‌లో పలువురు దివ్యాంగులు సైతం పాల్గొనడం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.



42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్ కోసం సన్నద్ధత

ప్లకార్డుల ప్రదర్శన

మారథాన్‌ను ప్రారంభిస్తున్న తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

పరుగులో పాల్గొన్న నగరవాసులు

## త్వరలో అదనపు పార్సిల్ కౌంటర్లు

ఈనాడు కథనానికి స్పందన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ పార్సిల్ కేంద్రంలో త్వరలోనే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని కమర్షియల్ ఏటీఎం బాపిరాజు తెలిపారు. ద్వారకా బస్‌స్టాండ్‌లోని పార్సిల్ కేంద్రంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆదివారం 'ఈనాడు'లో 'సేవల్లో మెరుగు.. సౌకర్యాల్లో తరుగు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించారు. ప్రస్తుతం మూడు బుకింగ్, ఒక డెలివరీ, మరొకటి ట్రాకింగ్ కౌంటర్లు ఉన్నాయని, వాటి సంఖ్య పెంచేలా గుత్తేదారుడికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

## నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సేల్స్ అఫ్ ఆర్టికల్స్ అఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ(సరస్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఈనెల 15 సోమవారం నుంచి జాతీయ డ్వాక్రా బజార్ ఏర్పాటు చేయనున్నారు. 12 రోజుల పాటు ఈ బజార్‌ను కొనసాగించనున్నారు. పండగల సమయం, ప్రజల రాకపోకలు అధికంగా ఉండటం, మెరుగైన రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు విస్తృతంగా ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు విశాఖను ఎంపిక చేశారు. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆదాయ వనరులను పెంపొందించడం, గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. భారీ టెంట్లు వేసి 250 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఏపీతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 600 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ఇందులో పాల్గొంటున్నారు. హ్యాండ్‌లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్, చీరలు, పాల్స్, కార్పెట్లు, బెడ్‌షీట్లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, మసాలాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. వీటితో పాటు ఫుడ్‌స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ఆట పరికరాలు ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



డ్వాక్రా బజార్ కోసం ఏర్పాటు చేసిన టెంట్

## రిటైల్, వినోద కేంద్రంగా గాజువాక

గాజువాక, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం రిటైల్, వినోద కేంద్రాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందని ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావులు అన్నారు. ఆదివారం పాతగాజువాకలో సెలెస్ట్ మాల్‌లో ఫ్యాషన్ వరల్డ్ వస్త్ర షోరూమ్‌ను సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణతో కలిసి వీరు ప్రారంభించారు. సెలెస్ట్‌లో సకల సదుపాయాలు వినియోగదారులకు చేరువలో ఉన్నాయన్నారు. కంకటాల అధినేత మల్లిక్, పలువురు సెలెస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా, గంటా, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

## జాతీయస్థాయి క్విజ్‌లో పీజీ వైద్యుల సత్తా

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్ర వైద్య కళాశాల న్యూరోసర్జరీ విభాగం పీజీ డాక్టర్ అనుష్క, సుప్రియ జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో సత్తా చాటారు. ఇండోర్ వేదికగా న్యూరోలాజికల్ సొసైటీ అఫ్ ఇండియా (ఎన్ఎస్ఐ) వార్షిక సదస్సు జరుగుతోంది. దేశ నలుమూలల నుంచి హాజరైన పీజీల కోసం 'బ్రెయిన్ బజ్' పేరుతో క్విజ్ పోటీలు నిర్వహించింది. పోటీల్లో ఐదు బృందాలు పాల్గొనగా, ఏఎంసీ పీజీ డాక్టర్ అనుష్క, సుప్రియ బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. సదస్సు నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. డాక్టర్ అనుష్క, సుప్రియను ఏఎంసీ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్‌రాయ్, ప్రొఫెసర్ డాక్టర్ బి.హయగ్రీవరావు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి అభినందించారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ అనుష్క సుప్రియ, తదితరులు

## ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : అఖిలభారత రైల్వే ఆహ్వానపు డీఆర్ఎం కప్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రైల్వే మైదానంలో ప్రారంభమయ్యాయి. టోర్నీలో మొత్తం 14 జట్లు పాల్గొంటున్నాయి. ఈనెల 21న తుదిపోరు జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్ఎం లలిత్‌బోహ్రా మాట్లాడుతూ... క్రీడాకారులంతా ప్రతిభ చూపి, పతకాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఆర్ఎం సతీమణి, రైల్వే మహిళల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా, ఏడీఆర్ఎంలు శాంతారాం, రామారావు, క్రీడాధికారి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో డీఆర్ఎం బోహ్రా తదితరులు

## నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా సోమవారం కలెక్టరేట్‌లో, జీవీఎంసీ కార్యాలయాల్లో, నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిరప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కమిషనరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో అందించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు కాల్ సెంటర్ (1100) సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

## పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ ద్వారా వినియోగదారుల పార్సిల్స్‌ను పది కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేస్తామని ఆర్ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. డోర్ డెలివరీ మాసోత్సవంలో భాగంగా ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, అనకాపల్లి, నర్సీపట్నం బస్‌స్టేషన్లలో కేంద్రాల నుంచి డోర్ డెలివరీ సదుపాయం ఉందని, అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు.

## దయాల్బాగ్ వస్తు ప్రదర్శనకు విశేష స్పందన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ సమీప దయాల్‌నగర్‌లోని దయాల్బాగ్ విద్యా కేంద్రం ఆవరణలో ఆదివారం నిర్వహించిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన వచ్చింది. కాకినాడ చేనేత చీరలు, పుణె హ్యాండ్‌బ్యాగులు, ఆగ్రా స్పోర్ట్ షూ, రాయ్‌బరేలీ, జైపూర్ బెడ్‌షీట్లు, తిరుపూర్ బనియన్లు, కర్నూలు, కాకినాడ సబ్బులు, అగరుబత్తీలు, ఆగ్రా హోమియో ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. రూ.8లక్షల సరకు గంటన్నరలో అమ్ముడుపోయినట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. నగరం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులకు తొలి ప్రాధాన్యత సరకులు అందించామని కాలనీవాసులకు తరువాత స్టాకు తెప్పించి అందిస్తామని తెలిపారు.

కొనుగోలుదారులతో సందడిగా ఉన్న ప్రదర్శన

## నేడు పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జడ్పీ యూనిట్ ఎన్నికలు ఈనెల 15వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తామని ఎన్నికల అధికారి డి.సీతారామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఆవరణలో ఉన్న సంఘం భవనంలో ఎన్నికలు జరుగుతాయని, ఉద్యోగులంతా పాల్గొనాలని కోరారు. ఎన్నికల పరిశీలకులుగా విశ్రాంత ఎంపీడీఓ యూ.కూర్మారావు వ్యవహరిస్తారని చెప్పారు.

## పార్టీ అండగా ఉంటుందని భరోసా

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: చోడవరం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్.రాజు కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్సీ నాగబాబు కలిశారు. నగరంలోని జేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాజు పెద్ద కుమారుడు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో నాగబాబు వాళ్ల ఇంటికి వెళ్లి, యువకుడి యోగక్షేమాలపై ఆరా తీశారు. పార్టీ కోసం, ప్రజల కోసం కృషి చేస్తున్న రాజు కుటుంబానికి పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, పార్టీ శ్రేణులు అండగా ఉంటాయన్నారు. భీమిలి జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ పాల్గొన్నారు.

బాధిత యువకుడిని పలకరిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

## 'స్కేటింగ్ బ్రదర్స్'...అదుర్స్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన అన్నదమ్ములు పవన్ కార్తికేయ(11 ఏళ్ల విభాగం), నాగమురారి(13 ఏళ్ల విభగం) స్వర్ణ పతకాలు సాధించి ఔరా అనిపించారు. ఇన్‌లైన్ ఆల్పైన్ విభాగంలో కుమారులు సత్తా చాటడం ఎంతో ఆనందంగా ఉందని తండ్రి వెంకట సురేష్‌కుమార్ తెలిపారు.

పతకాలతో మురారీ, కార్తికేయ

## భయం వీడి... ధైర్యంగా సాగి..!

స్కేటింగ్‌లో 'విభిన్న ప్రతిభావంతుల' సత్తా

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక వుడాపార్కు స్కేటింగ్ రింక్ వద్ద 'విభిన్న ప్రతిభావంతులకు' పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులు, కోచ్‌ల సహాయ, సహకారాలతో పలువురు చిన్నారులు ట్రాక్‌పైకి చేరుకుని, ఆ తర్వాత పోటీలో పాల్గొని రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లారు. ఆంధ్ర, తమిళనాడు, కేరళ, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్, దిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా, ఒడిశా, పశ్చిమబంగా, పంజాబ్ రాష్ట్రాల నుంచి సుమారు 130 మంది క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు.

చిన్నారులను పోటీకి సిద్ధం చేస్తున్న తల్లిదండ్రులు

దూసుకెళ్తున్నారిలా..

## ఉన్నత విద్యకు ప్రోత్సాహం

అల్లిపురం, న్యూస్‌టుడే : విద్యార్థులంతా ఉన్నత విద్య అభ్యసించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం కాన్వెంట్ కూడలి సమీప విశాఖ జిల్లా గౌడ సంఘం కార్యాలయంలో గౌడ ఎడ్యుకేషన్ అవార్డుల ప్రదానోత్సంలో భాగంగా పలువురి విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుతోనే సమాజంలో ఉన్నతస్థాయి దక్కుతుందని, జీవితంలో మార్పు వస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గౌడ సంఘం నాయకులు సన్మానించారు. సంఘ ప్రతినిధులు ఎం.రామారావు, జె.ప్రసాద్, ఏ.శంకర్రావు, నారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న జిల్లా గౌడ సంఘం సభ్యులు

## నూతన నియామకం

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : ప్రపంచ టేబుల్‌టెన్నిస్ పోటీలకు టెక్నికల్ అధికారిగా నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి **డి.వి.ఎస్.వై.శర్మ** నియమితులయ్యారు. పోటీలు వచ్చే నెల 1 నుంచి 11 వరకు గుజరాత్‌లో జరగనున్నాయి. అలాగే ఆల్ ఇండియా ఎల్ఐసీ టేబుల్‌టెన్నిస్ పోటీలకు హాజరయ్యే ఏపీ జట్టుకు శర్మ మెంటార్‌గా వ్యవహరించనున్నారు. ఈ పోటీలు ఈనెల 24 నుంచి 30 వరకు ఇండోర్‌లో జరగనున్నాయి.

## బాక్సింగ్ ఛాంపియన్‌గా విశాఖ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులు జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం జట్టు టీం ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా.. శ్రీకాకుళం జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం ముగిసిన ఈ ఛాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం నాలుగు పసిడి, అయిదు రజత, మూడు కాంస్య పతకాలు సాధించింది. జీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాంబాబు, వ్యాపారవేత్త కోగంటి సత్యం, దీక్ష మీడియా ఛైర్మన్ జె.రాజేష్ అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు, ద్రోణాచార్య అవార్డీ ఐ.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

అతిథుల నుంచి ట్రోఫీ అందుకుంటున్న విశాఖ జట్టు

## పిచ్చికుక్క దాడి.. ఆరుగురికి గాయాలు

వేపగుంట, న్యూస్‌టుడే: వరలక్ష్మీనగర్‌లో ఆదివారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ప్రధాన మార్గంలో కనిపించిన ఆరుగురిని గాయపర్చి పారిపోయింది. ఈ ఘటనతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. గాయపడిన వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. వారిలో కార్తీక్‌లక్ష్మీ వినయ్ అనే బాలుడు తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు సమీప ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 111 | 113 |
| లైవ్ | 138 | 133 |
| డ్రెస్‌డ్ | 200 | 236 |
| స్కిన్‌లెస్ | 228 | 246 |


యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, శ్రీ గాయత్రి టవర్స్, 4వ అంతస్తు, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆం.ప్ర-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి–1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి– 400708. నమోదిత కార్యాలయం: 'త్రిశూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్–380006.

**స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ అఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ– వేలం అమ్మకం ప్రకటన.

[illegible]

| | |
|---|---|
| తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవైనా ఉంటే) | లేవు |
| రిజర్వు ధర (రూ.లలో) | [illegible] |
| ధరావతు (రూ.లలో) | [illegible] |
| బిడ్ పెంపుదల సొమ్ము | [illegible] |
| ధరావతు బిడ్స్ తెలిపేందుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం | [illegible] |
| బహిరంగ ఇ–వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం | [illegible] |

స్థిరాస్తి షెడ్యూలు

[illegible]

తేది: 15-12-2025 ప్రదేశం: విశాఖపట్నం

సం/– అధీకృత అధికారి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్



EENADU Classifieds

**BUSINESS SERVICES**

**లోకేష్ గోల్డ్** లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

**శ్రీవల్లి గోల్డ్** లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

**BUSINESS OFFER**

**మీకు సంఘంలో** గుర్తింపు, విదేశాలలో సత్కారం మరియు మీ పేరున పోస్టల్‌స్టాంపు ఆవిష్కరణ ఊహ కాదు నిజమే. ఇన్సూరెన్స్ రంగంలో అత్యున్నత పురస్కారంగా పేరు కల్గిన MDRT క్లబ్‌లో మెంబరుగా ఈ నెలలో చేరిన యెడల సాధ్యమే. చివరి తేది 24-12-2025. 8790189686.

**FINANCIAL SERVICES**

**స్థిరాస్తులపై విశాఖ** జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xerox పై 2nd మార్టిగేజ్ లోన్ ఇస్తాం. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్, ✆ 9396999669.

**REAL ESTATE**

**FLAT FOR SALE**

**AKKAYYAPALEM**

2 BHK flat North & South. Ready to occupy. Opp celebrations restaurant, Narasimha Nagar, NH5 Highway 48 bus stop. ✆ 8374764888.

**HOUSE FOR SALE**

**ATCHYUTAPURAM**

121 Sqyds North East Corner (Cellar+ G+1) House for Sale 2700 Sqft at Just 3300 Per Sft Brand New ✆ 9885824528.

**LAND FOR SALE**

**GENERAL**

**పూసపాటిరేగ మం.** గోవిందపురం రోడ్డు, హైవేకి 1/2km తా.రోడ్డు ఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట &13 ఎకరాలు 100' రోడ్డు ఉన్న స్థలం సేల్. ✆ 9440255187

**PLOT FOR SALE**

**PENDURTHI**

PLOT FOR SALE
Urgent Sale
933.33 Sqyds at
SRI BALAJI DEVELOPERS
VUDA Layout
Near Pendurthy, Gorapalli, Karakavanipalem
@ 18000/- Sqyd Negotiable
9030595527

**TO LET**

**COMMERCIAL**

**SIRIPURAM**

Commrl 2 flrs 1550 sft each 3BHK lift car AC Furnishd kitchn cellar VIP Rd CBM Compound. Contact Ph: 9848194142, 9290876448.

**JOBS**

Wanted 1) Drawing Teacher/ Artist @Vsp 2) Civil Engg/ Supervisor @ Lambasingi. Contact Ph: 7674888221, 7780706507.

Wanted Computer Operator (F) with Tally & MS Office, Salary 18K - 25K, Job @ Dabagardens, Vizag. Walk-in 17-12-25 (Wednesday) Contact Ph: 9848222131, 8125222131.

WANTED
A Well Established Org. Starts New Projects in 2 States. Urgently Required in AP State, VSP Branches.
❖ ADMINISTRATION STAFF : M/F
(A) OFFICE INCHARGES : 5 Posts
(B) OFFICE ASSISTANTS : 5 Posts
(C) P.R.O's: 3 Posts
Qlf: Age 30 Years and above any Degree min. 1Yr. Exp. in any sectors.
Monthly Package: 60,000 to 1 Lakh Nego.
INTERVIEWS ON : 15th, 16th &17th - Dec-25
INTERVIEW TIMINGS 10.00 AM to 7PM
Con: Y.K. Rao
DOCTORS COLONY, VSP
Ph: 8121100599

**మీ ఆఫీస్/ఫ్యాక్టరీ** కొరకు సెక్యూర్టీ హౌస్‌కీపింగ్ స్టాఫ్ or కాంట్రాక్ట్ లేబర్ కొరకు. Contact Ph: 9603722786. www.arabiaconsultancyservices.com

HYD **యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**వైజాగ్ షాపింగ్** మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయసు. యువతీ, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము Cont: 9704637370, 9949904532.

Dyd, **పోర్ట్,** HPCL, ప్లాంట్, బ్యాంక్ కాంట్రాక్టర్స్ వద్ద సూపర్‌వైజర్స్, హెల్పర్స్, సెక్యూరిటీ, ఫైర్ & సేఫ్టీ, హౌస్‌కీపింగ్ కావలెను. 10th to డిగ్రీ, ITI, బీటెక్. జీతం: 20K-40K. ✆ 9573635594, 9121044796.

**MARKETING/ SALES**

Hyd based Tissue MFG Company required field, sales, Executives, fresher/ Experience, Bike must, Age 22-35, Resume 7997409992.

**FACULTY/ TEACHERS**

Faculty for B.Sc Nursing College Q:M.Sc(Nursing), B.Sc(Nursing) Candidates C:8008083353,7799772299 E-Mail: balajee.nursing@gmail.com

**DRIVERS**

Experienced Auto driver age 20 to 45 years. Food and accommodation available. Contact Phone Number: 8897663366

**SECURITY GUARDS**

**జైగణేష్ సెక్యూరిటీ** సంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8 గం|| డ్యూటీ. జీతం: 18815/- PF, ESI. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11 మంది (Ex-Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం: 30000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.


(c) eenadu

# పెందుర్తి

**తెరపై ఈనాడు**
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: **అఖండ-2**
స్క్రీన్-2: **మోగ్లీ**

## పాలిథిన్ వినియోగాన్ని విడనాడాలి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని చేసే పాలిథిన్ వినియోగాన్ని ప్రతి ఒక్కరు విడిచిపెట్టాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా ఆదివారం చినముషిడివాడ ద్రోణంరాజునగర్‌లో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు కాలనీవాసులకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎన్.సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబును పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం ఉత్తరాంధ్రకు చెందిన జనసేన ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో పంచకర్ల పాల్గొన్నారు.

నాగబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు →

## మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –పి.మహేష్, సబ్బవరం. ✓: ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. –అశోక్ కుమార్, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, సబ్బవరం

?: సబ్బవరం పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో గోతులు ఏర్పడి రోగులు, సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. –ఎస్.నాగేంద్రకుమార్, సబ్బవరం. ✓: వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తాం. –పి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: పల్లినారాయణపురం రామాలయం సమీపంలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. –రామారావు, పల్లినారాయణపురం. ✓: వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. –హరి బహదూర్, ఏఈ, జోన్–8

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం దేశపాత్రునిపాలెం మలుపు వద్ద కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. –నగేశ్, స్థానికుడు. ✓: శిథిల కల్వర్టుకు త్వరలో మరమ్మతులు చేపడతాం. –లలిత, ఏఈ, ఆర్అండ్‌బి

## బాబోయ్.. ఫార్మా కాలుష్యం!

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ప్రాంత ప్రజలను ఫార్మా సిటీ కాలుష్య భూతం వెంటాడుతోంది. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడంతో భరణికంలోని మొల్లోడు గెడ్డవాగులో పెద్ద ఎత్తున స్తంభించాయి. వీటి నుంచి దుర్వాసన రావడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషజలాలు తరచూ మొల్లోడు గెడ్డవాగును ముంచెత్తాక పరవాడ సన్యాసిచెరువు, పెద్ద చెరువులతో పాటు భూగర్భజలాలను విషతుల్యం చేస్తున్నాయి. ఈ సమస్య రోజురోజుకు జటిలం అవుతున్నా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినపుడు నీటి నమూనాలు సేకరిస్తున్నారు తప్పా..ఎలాంటి చర్యలు ఉండడం లేదని అంటున్నారు.

**ప్రజారోగ్యంతో చెలగాటం**

రసాయన జలాల వల్ల పంట భూములు సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. వ్యాధుల భయం వల్ల పొలాల్లో పనిచేయడానికి కూలీలు రాకపోవడంతో రైతులు పంటలు వేయడం మానేశారు. ఈ జలాల వల్ల పశువులు తదితర జీవరాశులకు ముప్పు పొంచి ఉంది. భూములు అమ్ముకుందామంటే ఎవరూ కొనడానికి ముందుకు రావడం లేదు. రాంకీ ఫార్మా సంస్థలు రసాయన వ్యర్థ జలాలను బయటకు విడిచిపెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా అధికారులకు పట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

కాలువలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు

**నిబంధనలు ఉల్లంఘించి..**

నిబంధనల ప్రకారం ఫార్మాసిటీ నుంచి వర్షపు నీరు తప్ప.. ఇతర జలాలను బయటకు విడిచిపెట్టకూడదు. వ్యర్థ జలాలను శుద్ధి చేసిన తర్వాత తిక్కవానిపాలెం తీరానికి పైపులైన్ ద్వారా పంపాలి. శుద్ధి ప్రక్రియకు ఖర్చులు అధికం కావడం వల్ల రాంకీ ఫార్మా సంస్థల యాజమాన్యాలు ఆ జలాలను బయటకు విడిచిపెడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇవి కాలువల ద్వారా వచ్చి గెడ్డవాగులను, పొలాలను, చెరువులను కలుషితం చేస్తున్నాయి. నెల రోజుల క్రితం మొల్లోడు గెడ్డవాగును స్థానికులు, పీసీబీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పరిశీలించి యంత్రాంగం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించినా నేటికీ కార్యరూపం దాల్చలేదని స్థానికులు అంటున్నారు.

**ట్యాంకర్లతో తోడిస్తాం..**

మొల్లోడు గెడ్డవాగులోని వ్యర్థ జలాలను పరిశీలిస్తాం. ట్యాంకరు లారీలతో గెడ్డవాగులోని జలాలను రాంకీ సీఈటీపీకి తరలిస్తాం. వ్యర్థ జలాలు బయటకు రాకుండా రాంకీ ప్లాంటు వద్ద సంపుల నిర్మాణం జరుగుతోంది. అవి అందుబాటులోకి వస్తే ఇబ్బందులు తీరుతాయి. –ముకుందరావు, కాలుష్య నియంత్రణ మండలి, ఈఈ

## అ'పూర్వ' సమ్మేళనం

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో చదువుకున్న 1987-88 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. దువ్వపాలెం లోని ఓ రిసార్టులో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, మళ్ల శ్రీను, రెడ్డి సురేశ్, తాటిపాకల భాస్కరరావు, బండారు శ్రీను, తదితరులు మిత్రా గ్రూప్ పేరిట ఈ సమ్మేళనాన్ని నిర్వహించారు. స్నేహితులంతా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు, మిత్ర బృంద సభ్యులు

### షిప్‌యార్డు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో..

మల్కాపురం, న్యూస్‌టుడే : విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో షిప్‌యార్డు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చదివిన 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగర పరిధిలోని గ్రంథాలయంలో సందడిగా జరిగింది. కొన్ని దశాబ్దాల తర్వాత కలిసిన వీరు ఆనాటి సంగతులను మననం చేసుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ గడిపారు. ఆటపాటలతో అదరగొట్టారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో సమాజసేవకు కృషి చేయాలని పలువురు వక్తలు సూచించారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

## నేరమార్గం వీడి.. పరివర్తనతో మెలగాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరమార్గాన్ని వీడి సన్మార్గంలో పయనించాలని పెందుర్తి ఎస్సై భాస్కరరావు సూచించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. నేర ప్రవృత్తిని విడిచిపెట్టి కుటుంబ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై భాస్కరరావు

## మేహాద్రిలో స్నానాలు చేస్తే కఠిన చర్యలు

రిజర్వాయరు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయరులో స్నానాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ హెచ్చరించారు. రిజర్వాయరు వద్దకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో పోలీసులు ఆదివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల 'హెచ్చరికలు బేఖాతరు' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి సీఐ స్పందించి రిజర్వాయరు వద్ద గస్తీని పెంచడంతోపాటు హెచ్చరిక బోర్డులు పెట్టించారు. ఈ జలాశయంలో స్నానాలు చేయడం నిషేధమని, ఎవరైనా రిజర్వాయరులోకి దిగితే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## శ్రీసాయిమాధవనగర్ సమస్యల పరిష్కారానికి కృషి

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప శ్రీసాయిమాధవనగర్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ రాపర్తి కన్నా కాలనీ అసోసియేషన్ సభ్యులకు ఆదివారం హామీ ఇచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కన్నా పాల్గొన్నారు. కాలనీలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని, సెక్టార్ 2 వద్ద గెడ్డపై వంతెన నిర్మించాలని, సీనియర్ సిటిజన్స్‌కు సామాజిక భవనం నిర్మించాలని అసోసియేషన్ సభ్యులు కన్నాకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎ.సుబ్బారాయుడు, కార్యదర్శి త్రినాథరావు, పరిటాల భాస్కరరావు, ఆచంట రామకృష్ణతోపాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని వరాహలక్ష్మీనరసింహస్వామి వాకర్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. 93, 94 వార్డుల కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా గంట్ల దేముడు, అధ్యక్షులుగా శెశెట్టి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా సాలాపు రమణ, ఉపాధ్యక్షులుగా మామిడి కిరణ్, జిన్నాల రాము, కోశాధికారిగా సీరం అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.వి.సత్యానంద్, జాయింట్ సెక్రటరీగా బల్ల అప్పారావు, సలహాసంఘ సభ్యులుగా ముత్తా నాగరాజు, బాలాజీ రాములను ఎన్నుకున్నారు. సభ్యులతో కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని కార్పొరేటర్లు నూతన కమిటీకి సూచించారు. అనంతరం సబ్బవరం సమీప కృష్ణానగర్ మజ్జిగౌరమ్మ ఆలయం వద్ద జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఎన్నికైన సభ్యులతో కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా తదితరులు

## పేద కుటుంబాలకు చేయూత

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందిన వేద సంస్కృతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాడేరు సమీప మినుములూరు, 12వ మైలురాయి, అమ్మవారి పాదాలు, డల్లాపల్లి, లడ్డాపుట్ గ్రామాల గిరిజనులకు 100 రగ్గులు, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ట్రస్టు నిర్వాహకులు కిరణ్ శర్మ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనుకబడిన గిరిజనులను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు.

## సేవలకు గుర్తింపు

వేపగుంట: శంకర్ ఫౌండేషన్ ప్రతీ నెలా విడుదల చేసే విజనరీ ఇన్‌సైట్స్ లేఖా పత్రానికి లభించిన జాతీయ పురస్కారాన్ని ఆదివారం డెహ్రాడూన్‌లో ఫౌండేషన్ ప్రతినిధి, ప్రజా సంబంధాల అధికారి కె.బంగార్రాజు అతిథుల నుంచి అందుకున్నారు. అక్కడ జరిగిన 47వ అఖిల భారత ప్రజాసంబంధాల సదస్సులో ఈ అవార్డును అందుకున్నట్లు బంగార్రాజు పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సెలవురోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. అమ్మవారికి త్రికాల సమయంలో నిర్వహించిన పంచామృతాభిషేకంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో శ్రీచక్ర నవ వర్ణార్చన, లక్ష్మీహోమం, శప్తశతీ, వేదపారాయణం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

## 600 మందికి హెచ్‌పీవీ టీకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : నగరంలోని పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు చెందిన 9-14 ఏళ్లలోపు బాలికలకు వరుసగా రెండో రోజు హ్యూమన్ పాపిలోమ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ అందించారు. శని, ఆదివారాల్లో కలిపి మొత్తం 600 మంది బాలికలకు టీకాలు వేశామని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. గర్భాశయ ముఖం ద్వారా వచ్చే క్యాన్సర్ నియంత్రణకు వీలుగా ఆరు నెలల తర్వాత రెండో డోసు వేస్తామన్నారు.

## మల్లికార్జునుడికి నీరాజనం

పూజలందుకున్న స్వామివారు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పెందుర్తి ప్రశాంతినగర్‌లో కొలువైన స్వయంభూ భ్రమరాంబ సమేత లింగాల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం సంకీర్తన సేవ జరిగింది. అనకాపల్లికి చెందిన శివ కూటమి భక్త బృందం సభ్యులు మల్లికార్జునుడిని భజనలతో ఆరాధించారు. తొలుత అర్చకులు పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భజన బృందాన్ని సత్కరించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులు

## 16 నుంచి ధనుర్మాసోత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.భోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలకు చెందిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

వేపగుంట, న్యూస్‌టుడే: లక్ష్మీనరసింహనగర్ కృష్ణాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి, లక్ష్మీపురం పోర్టుకాలనీలోగల కళ్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీలు తెలిపాయి. 30వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, 14న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం జరుగుతుందని కమిటీలు తెలిపాయి.

గోపీజనవల్లభ స్వామి ఆలయంలో కృష్ణ భగవానుడు

## మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేత 'నెల్లూరు'

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

**విజేతలు వీరే..:** ఒక కిలోమీటర్ నడక, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రోలో పురుషుల 90 ఏళ్ల పైబడిన విభాగంలో డి. శేషగిరిరావు (నాగులపాడు, గుంటూరు జిల్లా) వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 75 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలో మీటర్ల నడక పందెంలో ఆర్.అప్పలనాయుడు, రామారావు, (విశాఖపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగుపందెంలో (65 ఏళ్ల పైబడి) శేషయ్య (గుంటూరు), సుబ్బరాజు (విశాఖపట్నం), 200 మీటర్ల పరుగు పందెం(70 ఏళ్లు పైబడి)లో ధనుంజయ (తిరుపతి), మూర్తి (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మూడు కిలోమీటర్ల నడక పందెంలో విశాఖపట్నానికి చెందిన బి. వెంకటలక్ష్మి ప్రథమంలో నిలిచారు. 65 ఏళ్ల పైబడిన విభాగ పరుగు పందెంలో ఎన్.రమణేశ్వరి (గుంటూరు), డి. నాగేశ్వరమ్మ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు.

ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కూటమి నేతలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఎంవీపీకాలనీలోని ఎల్ఐసీ ఐక్యతా భవన్‌లో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ విశాఖ జిల్లా 50వ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, 12వ పీఆర్సీ అమలు చేస్తారని ఆశించామని అవేవీ చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టీఆర్ అంబేడ్కర్, గౌరవ అధ్యక్షుడిగా అనకాపల్లి పైడిరాజు, సహ అధ్యక్షులుగా కె. ముత్యాలనాయుడు, ఎ. విజయకుమారి, కోశాధికారిగా కె. రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, రామకృష్ణ, రాజునాయుడు, సీహెచ్ సంతోష్, శ్రీనివాస్‌నాయుడు, వంగా రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సెలర్‌గా తాడాన అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రియాజ్ అహ్మద్, సభ్యులుగా వి.వి.గిరి, ఆడిటర్లుగా కుమారి, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

## శ్రీశయన సామాజికవర్గ సమావేశం

బంటాకాలనీ(వేపగుంట), న్యూస్‌టుడే: 92వ వార్డు బంటాకాలనీలో శ్రీశయన(సెగిడి) సామాజికవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. పలువురు సంఘ పెద్దలు ఈ సమావేశానికి హాజరై సామాజికవర్గ సమస్యలపై చర్చించారు. ఈనెల 28వ తేదీన సింహాచలం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీప తోటల్లో వనమహోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

## షాపింగ్ మాల్ ప్రారంభం

పెందుర్తి, న్యూస్‌టుడే: చినముషిడివాడలో ఆదివారం శ్రీభవాని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, సినీనటి శ్రీదేవి అతిథులుగా పాల్గొని మాల్‌ను ప్రారంభించారు. ఈ మాల్‌లో బంగారు, వెండి ఆభరణాలతో పాటు రెడీమేడ్ వస్త్రాలు లభిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవంలో సినీనటి శ్రీదేవి, ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న వైద్యులు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వవార్డు పరిధి నమ్మిదొడ్డి కూడలిలో ఆదివారం పులిచెర్ల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పులిచెర్ల మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి వైద్య సేవలందించేందుకు తమ ట్రస్టు ముందుకొచ్చిందన్నారు. వైద్యసిబ్బంది 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ట్రస్టు జనరల్ సెక్రటరీ డాక్టర్ రవిశంకర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ తపన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ చాటి.. బహుమతులు సాధించి..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వెన్నెలపాలెం కల్యాణ మండపంలో ఈనెల 13వ తేదీన పరవాడ పోలీస్ సబ్‌డివిజన్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన.. మత్తు పదార్థాలు లేని రేపటి కోసం-అవగాహన, విద్యా ప్రదర్శన (ఎక్స్‌పో)లో పలు విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ మండలాల్లోని 64 పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 500మంది విద్యార్థులు సుమారు 150 నమూనాలు ప్రదర్శించారు. వీటిలో మూడింటిని ఉత్తమంగా గుర్తించారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా బహుమతులు అందించారు. అవేంటంటే..

★ గంజాయి సాగు, రవాణాకు ముఠా సభ్యులు ఎక్కువగా పిల్లలను ఉపయోగిస్తున్నారు. విద్యార్థి దశలో యువత వీటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వివరిస్తూ ప్రదర్శించిన నమూనా ప్రథమస్థానం సాధించింది. దీనికి రూ.10వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నాం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలని నమూనాలో వివరించాం. – విజేత బృందం, లోటస్ ఇంగ్లిషు మీడియం స్కూల్, హరిపురం, రాంబిల్లి మండలం

★ గంజాయి నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలు వివరిస్తూ ప్రదర్శించిన నమూనాకు ద్వితీయ స్థానం లభించింది. రూ.9వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నాం. ఈ నమూనాలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు పోలీసులు అనుసరించే విధానాన్ని వివరించాం. మత్తు పదార్థాలతో దొరికితే శిక్షలు ఎలా ఉంటాయి? మత్తు పదార్థాల విక్రయ సమాచారం తెలిస్తే పోలీసులకు ఎలా తెలియజేయాలో వివరించాం. –సుమేధా హైస్కూల్ విద్యార్థులు, పరవాడ

★ ఒక మనిషి డ్రగ్స్‌కు అలవాటు పడక ముందు.... పడిన తర్వాత జీవితం, ప్రవర్తన ఎలా ఉంటుందనే విషయాలతో ప్రదర్శించిన నమూనాకు తృతీయ స్థానం లభించింది. డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత ఆరోగ్యం దెబ్బతిని జీవితం, చదువు నాశనం అవుతుంది. చివరికి మరణం వరకు వెళ్తుందని వివరించి రూ.8వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకున్నాం. –కైట్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు, అచ్యుతాపురం

## చేతుల శుభ్రతకు స్టాండ్ ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఇంతవరకూ చేతులు కడుక్కునేందుకు తగిన కుళాయి సదుపాయం ఉండేది కాదు. ఈ పరిస్థితిని తెలుసుకున్న ఎల్అండ్‌టీ సంస్థ సీఎస్సార్‌లో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించి ఆవరణలో కొత్తగా 15 కుళాయిలతో కూడిన చేతులు కడుక్కొనే స్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

కుళాయి స్టాండ్ వద్ద చేతులు శుభ్రపరచుకుంటున్న విద్యార్థులు

## నివాసితులకు మొక్కల పంపిణీ

వుడాకాలనీ (పెదగంట్యాడ), న్యూస్‌టుడే : నేచర్ గార్డెనర్స్ సంస్థ ఆధ్వర్యంలో గాజువాక వుడాకాలనీలో నివాసితులకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. వుడా ఓపెన్ ఆడిటోరియం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మాసవరపు ఐశ్వర్య మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో టెర్రస్ గార్డెనింగ్‌లో ప్రతి ఒక్కరూ తగిన మెలకువలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మొక్కల పెంపకాన్ని మహిళలు ఉద్యమంగా కొనసాగించాలని సూచించారు.

అందుకున్న మొక్కలతో కాలనీ వాసులు

(c) eenadu

# భీమిలి

**సినిమాలు**

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్- **అఖండ-2**
రాములమ్మ- **అఖండ-2**
తాతా- **మోగ్లీ**
సప్తగిరి- **ఆంధ్రా కింగ్ తాలుకా**

## ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు

**కొమ్మాది, న్యూస్‌టుడే:** జీవీఎంసీ 5వ వార్డు సాయిరాంకాలనీలో వారం రోజులుగా యాక్ట్స్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ ఎం.పద్మారావు హాజరయ్యారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉప్పాడ వెంకటరమణ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎండాడలో దుకాణాల తొలగింపు

ఎండాడ-రుషికొండ మార్గంలో..

**ఎండాడ, న్యూస్‌టుడే:** నడకమార్గాలు, రహదారి మార్జిన్లను ఆక్రమించి నడుపుతున్న దుకాణాలను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది తొలగిస్తున్నారు. జోన్-2 పరిధిలోని ఎండాడ-రుషికొండ 100 అడుగుల మార్గంలో కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి ఈ చర్యలు కొనసాగించారు. దీంతో దుకాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ★ జీవీఎంసీ అనుమతితో గుర్తింపు కార్డులు కలిగిన వారికి 8వ వార్డు పరిధి ఎండాడలో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడానికి సమాయత్తమైంది. వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థలం కేటాయించి వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు. ఈ తొలగింపులో డీసీపీ, ఏసీపీ హరిదాస్, శాస్త్రి, సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

**ఎండాడ, న్యూస్‌టుడే:** ?:అయ్యప్పనగర్ (కొమ్మాది)లో వీధి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. – **స్థానికులు** ✓: శుభ్రతకు చర్యలు తీసుకుంటాం. – **అయ్యప్పనాయుడు, జెడ్సీ**

?: పీఎంపాలెం పరిధి సాంకేతిక కళాశాల రోడ్డులోని కాలువల్లో మురుగనీరు రోడ్డుపైకి వస్తోంది. – **కాలనీవాసులు** ✓: పూడికలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – **సాయిరాం, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: బక్కన్నపాలెం (మధురవాడ) నవోదయకు వెళ్లే దారిలో స్తంభాలకు విద్యుద్దీపాలు అమర్చలేదు. – **స్థానికులు** ✓: త్వరలో విద్యుత్ దీపాలు అమర్చేలా చర్యలు తీసుకుంటాం. – **గాయత్రీ, విద్యుత్ ఏఈ**

?: వరాహగిరినగర్ (ఎండాడ)లో వీధి దీపాలు వెలగడం లేదు. – **వరాహగిరినగర్ వాసులు** ✓: పరిశీలించి మరమ్మతులు చేపడతాం. – **సాయిరాం, విద్యుత్ ఏఈ**

?: ఓజోన్ వ్యాలీ(మధురవాడ)లో రోడ్డు గతుకులమయంగా ఉంది. – **చాణిక్య** ✓: త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – **శ్రీనివాస్, ఏఈ**

?: సన్‌కాలనీ(సాగర్‌నగర్) దారిలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – **రవి** ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – **రాజారవికుమార్, ఆరోగ్య అధికారి**

## స్పందనకు వందనం

**పూడిక తొలగింపు: ఎండాడ, న్యూస్‌టుడే:** శిల్పారామం(ఎండాడ)కు వెళ్లే ప్రధాన దారిలోని కాలువల్లో పూడిక నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు నిత్యం ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి.. సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగించారు.

**ట్యాంక్ బండ్ శుభ్రత: ఎండాడ, న్యూస్‌టుడే:** ఎండాడ చెరువు (ట్యాంక్ బండ్) పరిసరాలు అధ్వానంగా ఉండటంతో పాదచారులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకున్నారు.

## చిట్టి బుర్రలకు పదును పెట్టేలా

**మధురవాడ, న్యూస్‌టుడే**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1-5 తరగతులు చదివే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. పూర్వ ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థికి పునాది బలంగా ఉండాలని 'గ్యారంటీ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ' (జీఎఫ్ఎల్ఎన్) పథకం ప్రారంభించింది.

**ఉదయం పాఠాలు, మధ్యాహ్నం ప్రాథమిక అంశాలు..:** ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పిల్లలకు పాఠాలు చెప్పడం, మధ్యాహ్నం నుంచి పాఠశాల విడిచే సమయం వరకు ప్రాథమిక అంశాలపై శిక్షణ ఇవ్వాలి. తెలుగు, ఆంగ్ల భాషల్లో చదవడం, రాయడం నేర్పించి, గణితంలో కూడికలు, తీసివేతలు, భాగహారం, గుణాకారాలు వచ్చేట్టు చేయాలి. దీనికి పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా సంయుక్తంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించడంతో జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఇటీవల కార్యాచరణ ప్రారంభమైంది.

**లక్ష్యం ఇలా...:** ఐదో తరగతి దాటినా ఎక్కువ మంది పిల్లలు పదాలు చదవలేక, లెక్కలు చేయలేని స్థితిలో ఉంటున్నారని విద్యాశాఖ, సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నవంబర్ 24 నుంచి డిసెంబర్ 6 వరకు చేపట్టిన బేస్‌లైన్ సర్వేలో వెల్లడైంది. ఫలితంగా విద్యార్థుల.. పై తరగతులకు వెళ్లినా చదవడం, రాయడంలో ఇబ్బంది పడుతూ చదువులో వెనకబడిపోతున్నారు. దీంతో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం 'జీఎఫ్ఎల్ఎన్' తీసుకు వచ్చింది. ఇటీవల ప్రారంభమైన పథకం కార్యాచరణ వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగనుంది. ఈలోగా ప్రతి విద్యార్థి పఠన, గణన, నైపుణ్యాల లక్ష్యాలను సాధించాల్సి ఉంటుంది.

## అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

**పద్మనాభం, న్యూస్‌టుడే:** అయినాడ గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదం బాధిత కుటుంబాలను యువ నాయకుడు గంటా రవితేజ ఆదివారం పరామర్శించారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ధైర్యం చెప్పి నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కె.దామోదరరావు, కె.రమణ, కె.లీలావతి, కె.నగేష్‌కుమార్, గెద్ద ప్రసాద్, పైల శ్రీను, కె.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న గంటా రవితేజ

## వంతెనకు అడ్డుపడం.. ఉపాధి కల్పించరూ..

**మధురవాడ, న్యూస్‌టుడే:** చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా మధురవాడ ఎత్తు వంతెన సమీపంలో పైడితల్లమ్మ చిల్లర వర్తకుల సంఘం సభ్యులు ఆదివారం రోడ్డు పక్కన బైఠాయించి నిరసన తెలియజేశారు. అక్కడ జాతీయ రహదారిపై నిర్మించనున్న నడక వంతెన నిర్మాణ పనులను తాము అడ్డుకోవడం లేదని, తమకు జీవనోపాధి లేకుండా చేయడం అన్యాయమన్నారు. వంతెన నిర్మాణానికి అవసరమైన స్థలం తీసుకోగా మిగిలిన చోట చిన్న బడ్డీలు పెట్టుకోవచ్చునని ముందుగా చెప్పిన అధికారులు ఇప్పుడు మాట మార్చి హెచ్చరించడం అన్యాయమన్నారు. వీరికి సీపీఐ(ఎం) జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు తదితరులు మద్దతుగా నిలిచారు. వంతెనకు ఆటంకం లేకుండా మిగిలిన కొంత స్థలాన్ని వారికి కేటాయిస్తే చిరు వ్యాపారుల కుటుంబాలు జీవనం సాగిస్తాయన్నారు. వీరికి న్యాయం జరిగే వరకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. నిరసనలో సంఘం నాయకులు బి.శ్రీను, పి.సంతోష్, కె.నారాయణరావు, కె.వీరంశెట్టి, ఎల్.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో రోడ్డు పక్కన బైఠాయించి నిరసన తెలుపుతున్న చిరువర్తకులు

## హడావుడిగా ప్రారంభించి.. అర్ధాంతరంగా వదిలేసి

**అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే:** జీవీఎంసీ 98వ వార్డు అడివివరం పరిధిలో నిలిచిపోయిన సింహాచలం బీఆర్టీఎస్ రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యే విధంగా సర్కారు చర్యలు తీసుకుంది. పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా పాత అడివివరం నుంచి హనుమంతవాక మార్గంలో సింహాచలంలోని గురుకులం ఎదురుగా రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇటీవల సీఐఐ సదస్సు నేపథ్యంలో హడావుడిగా ఇక్కడ పనులు ప్రారంభించి కొంత మేర బీటీ రహదారి నిర్మించి గురుకులం ఎదురుగా ఉన్న ప్రాంతంలో సగంలోనే పనులు నిలిపేశారు. నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రిని మార్గమధ్యలో వదిలేయడం వలన రాత్రివేళ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తి పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

రహదారి మధ్యలో ప్రమాదకరంగా మారిన నిర్మాణ సామగ్రి

పిల్లలు ఆటలాడుకునే పరికరాలు

## థీమ్ పార్కు.. ఆకట్టుకునేలా..

**ఎండాడ, న్యూస్‌టుడే:** 8వ వార్డు పరిధి వైఎల్పీలేఅవుట్ (ఎండాడ)లో ఏర్పాటు చేసిన బృందావన్ థీమ్ పార్కు ఆకట్టుకుంటోంది. బీచ్‌కు వెళ్లే దారిలో ఎకరా స్థలంలో రూ.1.30 లక్షల వ్యయంతో జీవీఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. పార్కులో రోజూ పిల్లలు, పెద్దలు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. పచ్చని చెట్ల మధ్య పెద్దలు వాకింగ్ చేసేలా ట్రాక్, సేద తీరేందుకు రకరకాలు కుర్చీలు, బెంచీలు, మినీ స్టేడియం వంటి సదుపాయాలను కల్పించారు.

పార్కులో ఫౌంటెయిన్ ఇలా..

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో నాగవంశ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అప్పలనాయుడు, తదితరులు

## విద్యతోనే ఉన్నతి సాధ్యం

**తగరపువలస:** పేదరికం, వెనుకబాటులను జయించాలంటే అది విద్యతోనే సాధ్యమని, అందుకే పిల్లలు బాగా చదువుకోవాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. నాగవంశ సంక్షేమ సంఘం ఆంధ్ర రాష్ట్ర, విశాఖ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో తగరపువలస సమీప తాళ్లవలసలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో ఆదివారం నిర్వహించిన వనభోజన మహోత్సవానికి హాజరై మాట్లాడారు. నాగవంశీయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నాగవంశ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు మాట్లాడుతూ తమ సామాజిక వర్గాన్ని బీసీ-డి నుంచి బీసీ-ఏ కేటగిరీలో చేర్చాలన్నారు. విశాఖలో నాగవంశ సంక్షేమ భవనం నిర్మించాలన్నారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త, విజయనగరం జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), తెదేపా నేత గంటా రవితేజ, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నాగవంశీయులు పెద్ద ఎత్తున తరలిరావడం ఐక్యతకు నిదర్శనమన్నారు. నృత్య ప్రదర్శనలు, లఘునాటికలు, గీతాలాపనలు, మిమిక్రీలు అలరించాయి. కార్యక్రమంలో నాగవంశ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగత నర్సింగరావు, లిఖిత, భీమిలి అధ్యక్షులు కంటుభుక్త ముత్యాలరావు, జెడ్పీటీసీ సభ్యులు గాడు వెంకటప్పుడు, సంఘం నేతలు ఎర్నింటి కృష్ణ, కనకల అప్పలనాయుడు, అప్పికొండ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఏవియేషన్ కార్యశాల

**తగరపువలస, న్యూస్‌టుడే:** తగరపువలస సమీప సింగనబంద ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో 'స్పేస్‌జెన్ ఏవియేషన్' సంస్థ సహకారంతో రెండ్రోజుల పాటు జరిగిన ఏవియేషన్ వర్క్‌షాప్ ఆదివారం సాయంత్రం ముగిసింది. పైలట్, స్కై డైవర్, విమాన డిజైనర్ కెప్టెన్ విగ్నో హాజరై విమాన నమూనాల నిర్మాణం, డ్రోన్ ఇంజినీరింగ్, ఫ్లయింగ్, రాకెట్ల డిజైన్ ప్రయోగం, ఫ్లైట్, డ్రోన్ సిమ్యులేటర్ల అనుభవం, టాక్టికల్ రాడార్ సిస్టంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తైలా భమిడిపాటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ అసెంబ్లింగ్‌ను విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

రుషికొండ తీరంలో సందర్శకులు

## రుషికొండ బీచ్‌లో సందడి

**సాగర్‌నగర్, న్యూస్‌టుడే:** రుషికొండ, సాగర్‌నగర్ తదితర సందర్శనీయ బీచ్‌లకు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. పిల్లాపాపలతో కుటుంబసభ్యులతో విచ్చేసిన వీరు సంతోషాల నడుమ వన భోజనాలు ఆచరించారు. మెరైన్ పోలీసులు, టూరిజం బ్లూఫ్లాగ్ బీచ్, జీవీఎంసీ లైఫ్‌గార్డులు సముద్ర స్నానాలు చేసేవారిని లోపలికి వెళ్లరాదంటూ ప్రచారమాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

## నడకదారులు.. నోళ్లు తెరిచాయ్

**మధురవాడ, న్యూస్‌టుడే:** పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా కాలువలపై సిమెంటు మూతలు సక్రమంగా లేక ప్రమాదాలను తలపిస్తున్నాయి. సేవా మార్గాలకు చేరువగా ఉన్న ఈ ప్రధాన కాలువలపై పాదచారులు పగలూ, రాత్రి నడక సాగిస్తుంటారు. కారుషెడ్డు, చంద్రంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో పలుచోట్ల పలకలు కాలువల్లో జారిపడి ఉన్నాయి. కొద్ది నెలల క్రితం సుమారు రూ.75 లక్షల నిధులతో ఓ గుత్తేదారు కాలువల్లో పూడిక తొలగించి పైన మూతలు సక్రమంగా అమర్చలేదు. దీంతో ప్రజలు కాలువలపై నడిచి వెళ్లేందుకు భయాందోళనకు గురవుతున్నారు. చేయాల్సిన పని చిన్నదైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలువురు ప్రమాదాలబారిన పడాల్సి వస్తోంది.

కారుషెడ్డు కూడలిలో కాలువలపై సిమెంటు పలకలు ఇలా...

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా

**సంగివలస(తగరపువలస), న్యూస్‌టుడే:** తగరపువలస పరిధి నమ్మివానిపేట అమేయ వరల్డ్ స్కూలు వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ, పాశ్చాత్య, జానపద, భాంగ్రా, ఫ్లాష్‌మాబ్ నృత్యాలతో ఆకట్టుకున్నారు. కింగ్‌డమ్ ఆఫ్ పూల్స్, ప్రాణదాన్, సీతారామకల్యాణం, తదితర లఘునాటికలు అలరించాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. పాఠశాల ఛైర్మన్ మోహన్ మండవ, కరస్పాండెంట్ అరుణ, ప్రిన్సిపల్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

## తెదేపా కార్యకర్తలకు భరోసా

**కొమ్మాది, న్యూస్‌టుడే:** జీవీఎంసీ 5వ వార్డులో వైఎస్ ఆర్‌నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న తెదేపా కార్యకర్త పి.విష్ణుమూర్తిని ఆదివారం ఎమ్మెల్యే గంటా తనయుడు రవితేజ పరామర్శించారు. పక్షవాతం బారిన పడి ఉన్నారని తెలుసుకున్న ఆయన స్వయంగా ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదే వార్డులో మరో తెదేపా కార్యకర్త వాసు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగి మంచాన పడిఉన్నారని తెలుసుకుని వెళ్లి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, యర్లగడ్డ జీవన్, ఓలేటి శ్రావణ్, వంకనూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**సంగివలస(తగరపువలస), న్యూస్‌టుడే:** జీవీఎంసీ రెండో వార్డు సంగివలస ప్రాంతంలో తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. విశ్వనాథం అనే వ్యక్తి కుటుంబీకులతో కలిసి ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. శనివారం తిరిగివచ్చేలోగా బీరువాలోని కిలో వెండి, రూ.70 వేల నగదు, తులం బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్ ఆదివారం చెప్పారు.

## అసంపూర్తి పనులతో అవస్థలు

**పద్మనాభం, న్యూస్‌టుడే:** పద్మనాభం-విజయనగరం మార్గంలో పద్మనాభం నుంచి రెడ్డిపల్లి సాధూమఠం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాలు గడిచినా పూర్తికాకపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణకు 2022లో అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. మూడు కిలోమీటర్ల నిడివి గల రోడ్డు విస్తరణ పనుల కోసం ఎన్‌డీబీ నిధులు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. విడతలుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రెడ్డిపల్లి స్టేట్ బ్యాంకు వరకు సుమారు 600 మీటర్ల మేర అసంపూర్తిగా దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శనలు

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

**కొమ్మాది, న్యూస్‌టుడే:** మధురవాడ శిల్పారామం (జాతర) కళావేదికపై ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నగరానికి చెందిన మీనాక్షి డాన్స్ అకాడమీ చిన్నారులు బిందుశ్రీ, యోగిని, లక్ష్మీప్రియ, కుసుమ, సంకీర్తన, ప్రత్యూష, కల్పన, శరణ్య వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు డి.మీనా దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులను అభినందించారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**భీమునిపట్నం, న్యూస్‌టుడే:** భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సన్‌స్కూల్లో నిర్వహించిన 26వ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. విశాఖ బ్లడ్ సెంటర్ నుంచి విచ్చేసిన సిబ్బంది 79 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. దాతలకు బ్లిస్ కేటరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.లక్ష్మీలావణ్య బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఆర్.బసవకృష్ణ మూర్తి, డా.ఎన్.ఎల్.రావు, ఎం.సూర్య శ్రీనివాస్, వి.శ్రీనివాసరెడ్డి, జి.నూకరాజు, ఎన్.శంకరరెడ్డి పాల్గొన్నారు.

భీమిలిలోని శిబిరంలో రక్తదాతలు

## బంగారు స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

**సింహాచలం, న్యూస్‌టుడే:** భక్తులు కొంగు బంగారమై సింహగిరిపై కొలువైన అప్పన్న స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## విలువలతో కూడిన విద్యను అందించాలి

**కొమ్మాది, న్యూస్‌టుడే:** పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం 18 నెలల్లోనే విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారిలో ఉన్న కృష్ణవికాస్ విజయం పాఠశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన విద్యార్థిగా ఉన్న తనను ఇదే పాఠశాలలో ప్రిన్సిపల్‌గా ఉంటున్న విజయమ్మ.. 1996-97లో విజ్ఞాన్‌లో తాను చదివే సమయంలో ప్రిన్సిపల్‌గా ఉంటూ నైతిక విలువలు నేర్పించడంతో మంచిస్థానంలో ఉన్నానన్నారు. కృష్ణ వికాస్ గ్రూప్ ఛైర్మన్ దాసరి మురళీకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ దాసరి వివేక్, ఛైర్మన్స్ ఆఫీస్ డైరెక్టర్ దాసరి లోకేశ్ మాట్లాడారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయలక్ష్మి, కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న యాజమాన్యం

## తెలికుల కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలి

**భీమునిపట్నం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం తెలికుల కార్పొరేషన్ పునరుద్ధరించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. స్థానిక గొల్లలపాలెం తోటల్లో ఆదివారం భీమిలి తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అంబటి శంకరరావు ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చేతివృత్తుల జాబితాల్లో తెలికులను చేర్చాలని, గానుగ ద్వారా నూనెను తయారుచేసిన వారికి ఉచిత విద్యుత్తు అందించాలని తీర్మానించారు. భీమిలి తెలికుల సంక్షేమ సంఘం ముద్రించిన 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బార మధుసూదన రావు, తెలికుల కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ సంకిన భవానిప్రియ, కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం, భీమిలి శాఖ ప్రతినిధులు తాడివాడ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

## హిందుత్వం ఒక జీవన విధానం

**ఆనందపురం, న్యూస్‌టుడే:** ప్రకృతితో జీవనం, ఆరాధనతో భారతీయుల జీవితం ముడిపడి ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆంధ్ర ప్రాంత బౌద్ధిక ప్రముఖ కొండపల్లి రామారావు అన్నారు. ఆదివారం పెద్దిపాలెం గ్రామంలో హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ. . భారతీయుల జీవనం విధానమే సనాతన ధర్మం అని పేర్కొన్నారు. హిందుత్వం అంటే మతం కాదని అదొక జీవన విధానమన్నారు. వివిధ కుల వృత్తులకు చెందిన వ్యక్తులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో భీమిలి యోగ చైతన్య ఆశ్రయం యోగాచార్యులు అప్పలనాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ తమ్మిన నరసింగరావు, ఉమామహేశ్వరరావు, బాలి రవిశంకర్, బంటుబిల్లి శంకర్, మరుపిళ్ల సురేష్, ఆకుల అబి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

వివిధ కుల వృత్తుల వ్యక్తులను సన్మానిస్తున్న నిర్వాహకులు

## ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

**భీమునిపట్నం, న్యూస్‌టుడే:** భీమిలి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఈనెల 15, 16 తేదీల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎంసీ మినీ స్టేడియంలో క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం, విశాఖ రూరల్, విశాఖ అర్బన్ మండలాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ఇవి రెవెన్యూ డివిజన్ స్థాయిలో భీమిలిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని భీమిలి ఎం.ఇ.ఓలు ఎం.శివరాణి, ఎ.జయప్రద పేర్కొన్నారు.

## ఆసియా యూత్ పారా అథ్లెటిక్స్‌లో సత్తా

**గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే:** దుబాయ్‌లో ఈనెల ఏడో తేదీ నుంచి ఆదివారం వరకూ జరిగిన ఆసియా యూత్ పారా గేమ్స్-2025లో బీచ్‌రోడ్డులోని తొట్లకొండ వద్దనున్న నేత్రవిద్యాలయం పూర్వ విద్యార్థిని వలసనైని **రవణి** అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. రన్నింగ్ 400 మీటర్ల విభాగంలో స్వర్ణం, 200, 1500 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించింది. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు, వీసీఎండీ భరణి, పారా స్పోర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, రామస్వామి తదితరులు అభినందనలు తెలిపారు.


## హెచ్చరిక నోటీసు

నా క్లయింట్స్ అయిన **1. శ్రీ వాసిపల్లి సురేష్ కుమార్ రెడ్డి తండ్రి హరిశ్చంద్రారెడ్డి**, శ్రీహరినగర్, పుచ్చకాయల సుబ్బారెడ్డి లేఅవుట్, నెల్లూరు-3 మరియు **2. నాగేశ్వరరెడ్డి బొమ్మవరం తండ్రి మునీశ్వరరెడ్డి**, రాజంపేట, కడపజిల్లా అనువారలు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా: నా క్లయింట్స్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **శ్రీమతి సోమి రాణి భర్త సోమి వెంకటరమణ**, టి.పి.టి.కాలనీ, నీలగిరిపార్కు దగ్గర, విశాఖపట్నం (అర్బన్) అనువారి వద్ద నుండి **తే 02-10-2023దిన** స్థిరాస్తి విక్రయ అగ్రిమెంటు పొందియున్నారు. అదే సమయములో సదరు **సోమి రాణి** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింట్స్‌కి స్వాధీనపరిచియున్నారు. మరియు సదరు **సోమి రాణి** గారు నా క్లయింట్స్ పేరిట GPA చేసియున్నారు. కావున ఎవ్వరైనా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు **సోమి రాణి** గారి వద్ద నుండి కొనుగోలు చేసినచో వారికి ఎలాంటి హక్కులు సంక్రమించవు. నా క్లయింట్స్ మీద బద్ధగించవు. అట్లు ఎవ్వరైనా కొనుగోలు చేసినచో నా క్లయింట్స్ అట్టి వారి మీద సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని యిందుమూలముగా హెచ్చరించడమైనది.

**ఆస్తి షెడ్యూలు**

విశాఖపట్నం జిల్లా మరియు భీమునిపట్నం రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, **ఆనందపురం మండలం, పెద్దిపాలెం** గ్రామంలోని **సర్వే నెం. 101/2రు (LPM 1554) విస్తీర్ణం య.2-46 సెంట్లు భూమికి హద్దులు: తూర్పు:** A.S.P. రావుకు చెందిన భూమి, **దక్షిణం:** కూరాకుల తాతయ్యలు మరియు వగైరాలకు చెందిన భూమి, **పడమర:** వేముల నూకయ్యరెడ్డి సోమి ఎస్టేట్స్ (&) హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అమ్మిన భూమి, **ఉత్తరం:** గుండు అప్పారాజుకు చెందిన భూమి. **యీ హద్దులలోని య.2-46 సెంట్లు లేక 0.984 హెక్టార్ల భూమి అన్ని సౌలభ్య హక్కులతో కలిపి.**

**జి.ఎస్.ఆర్. రవితేజరెడ్డి,** B.Com., L.L.B., L.L.M.,
అడ్వకేట్, పిరమిడ్ దగ్గర, లెక్చరర్స్ కాలనీ, మాగుంట లేఅవుట్ ఉత్తరం,
నెల్లూరు -3. సెల్: 70134 55477


(c) eenadu

# విశాఖ తూర్పు

## 21న పోర్టు పింఛనర్ల సర్వసభ్య సమావేశం

మాధవధార, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యలపై పోర్టు యాజమాన్యానికి ఎప్పటికప్పుడు వినతులు ఇస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని హార్బర్ అండ్ పోర్టు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు పేర్కొన్నారు. కొంగనగర్ వద్దనున్న పింఛనర్ల సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మాధవధార కళ్యాణ్ మండపంలో పింఛనర్ల సర్వసభ్య సమావేశం, వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆరోజు పింఛనర్ల సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశానికి పోర్టు విశ్రాంత అధికారులు పాల్గొంటారన్నారు.

## భౌ..భౌ..భయపెడుతున్నాయ్..!
### ఆసుపత్రులకు వరుసకడుతున్న కుక్కకాటు బాధితులు

ఆరిలోవ, న్యూస్‌టుడే

ఆరిలోవ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. శ్రీకాంత్ నగర్‌లో ఇటీవల పిచ్చికుక్క బీభత్సం సృష్టించి ఇద్దరిని కరిచింది. చినగదిలి కొండవాలు ప్రాంతంలో ప్రతి వీధిలోను సుమారు పదేసి కుక్కలు ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెదగదిలి కొండ ప్రాంతంలోని ఓ వీధిలో ఇటీవల పాల ప్యాకెట్ తీసుకెళ్తున్న బాలుడి వెంటపడి తరిమాయి. స్థానికులు రావడంతో ప్రమాదం తప్పింది. సంతపాలెంలో దూడపై దాడిచేసి గాయపరిచాయి. హెల్త్‌సిటీ బీఆర్టీఎస్ మార్గంలో కుక్కలు అడ్డంగా రావడంతో ద్విచక్ర వాహనదారుడు పడిపోయాడు. బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఆరిలోవ ప్రాంతంలోని ప్రాథమిక ఆసుపత్రుల్లో ప్రతి రోజు ఒక కుక్క కాటు కేసు నమోదవుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఆరిలోవ కొండవాలు ప్రాంతంలో..

**తూతూమంత్రంగా శస్త్రచికిత్సలు:** చినగదిలి దీనదయాళపురంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రం ఉంది. నగరంలో పట్టి తెచ్చిన కుక్కలకు ఇక్కడ కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ప్రతి రోజూ సగటున 40 కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నామని కేంద్రం సూపర్‌వైజర్ రవికుమార్ తెలిపారు. జోన్‌కి ఒక వాహనం చొప్పున 8 వాహనాలు కుక్కలు పట్టుకునేందుకు సిటీలో ప్రతి రోజు తిరుగుతున్నాయని చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో కుక్కల సంఖ్య తగ్గకపోగా పెరుగుతున్నాయి. తూతూమంత్రంగా కు.ని. శస్త్రచికిత్సలు చేస్తుండటమే దీనికి కారణమనే విమర్శలొస్తున్నాయి.

**ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు..:** శస్త్రచికిత్స అయిన తరువాత కుక్కలను ముడసర్లోవలో వదిలేస్తున్నారని అందుకే ఆరిలోవ ప్రాంతంలో కుక్కలు ఎక్కువగా ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఏబీసీ కేంద్రం సూపర్‌వైజర్ రవికుమార్‌ను వివరణ కోరగా.. 'ఒక ప్రాంతంలో పట్టిన కుక్కలను మరో ప్రాంతంలో వదిలితే అవి గమ్యస్థానాలకు చేరుకుంటాయి. కొత్తగా వచ్చే వాటిని అప్పటికే ఉన్నవి రానీయవు. నగరంలో గత ఏడాది నుంచి నరవ, కాపులుప్పాడలో కొత్తగా ఏబీసీ కేంద్రాలు ఏర్పాటు చేశాం. నగరంలో పిచ్చి కుక్క ఎక్కడ ఉన్నా సమాచారం ఇస్తే పట్టుకుని బంధిస్తామ'ని రవికుమార్ తెలిపారు.

★ 'చెవి కత్తిరించిన కుక్కలు నగరంలో ఎక్కడ ఉన్నా శస్త్రచికిత్స చేసినట్లు గుర్తించి వాటిని మళ్లీ పట్టుకోరు. వాటితో ప్రమాదం ఉండదు. రేబీస్ టీకాలు వేసి ఉండటంతో కరిచే అంత ఉద్రేకం వాటికి రాద'ని పశువుల వైద్యులు తెలిపారు.

## ఘనంగా వన సమారాధన

**ఆరిలోవ, న్యూస్‌టుడే:** ముడసర్లోవ ఉద్యానవనంలో ఆదివారం విశాఖ కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. అందరూ ఐక్యతతో అభివృద్ధి బాటలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీపురుపల్లి శాసనసభ్యులు కళా వెంకటరావు, ఎలమంచి శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్, వైకాపా నాయకులు అమర్‌నాథ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు మద్దింశెట్టి సురేష్, ఎర్రంశెట్టి సురేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన కుటుంబ సభ్యులు పిల్లలు పెద్దలతో ఆనందంగా ఆటపాటలతో గడిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, తదితరులు

## సభ్యుల ఐక్యతతో సంఘం బలోపేతం

**జగదాంబకూడలి, న్యూస్‌టుడే :** నగరంలో సర్దార్ గౌతులచ్చన్న స్మారక భవనాన్ని ఏర్పాటు చేయాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు టి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆదివారం సింహాచలం సమీపంలో శ్రీశయన సామాజిక వర్గం ఆత్మీయ వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులంతా ఐక్యంగా ఉంటూ, సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. గౌతులచ్చన్న జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంఘం ప్రతినిధులు విజయభాస్కర్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## నడకమార్గాల్లో ఆక్రమణల తొలగింపు

**మద్దిలపాలెం, న్యూస్‌టుడే :** ఎంవీపీకాలనీ సెక్టార్-11, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్ సమీప నడకమార్గాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను ఆదివారం తొలగించారు. పోలీసుల పర్యవేక్షణలో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, అధికారులు తొలగింపు పనులు చేపట్టారు. దీంతో స్థానిక వ్యాపారులకు, అధికారులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. పోలీసుల జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. రామలక్ష్మీ అపార్ట్‌మెంట్ ఏరియా, శివాజీపాలెం నుంచి ఇసుకతోట జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించామని జోన్-3 ఏసీపీ మధుసూదనరావు తెలిపారు. ఆదివారం మొత్తం 42 దుకాణాలు తొలగించారు.

జేసీబీతో దుకాణాలు తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది

టీపీఓ ప్రమీల, టీపీఎస్‌లు సాయిరాం, సూరిబాబు, సచివాలయం కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

**న్యూస్‌టుడే, మద్దిలపాలెం:** ?: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెం, రామకృష్ణనగర్ పార్కు ప్రాంతంలో పేరుకుపోతున్న వ్యర్థాలను తరలించకపోవడంతో దోమలు వృద్ధి చెంది, దుర్వాసన వ్యాపిస్తుంది. -అంజినేయులు, శివాజీపాలెం. ✓: తక్షణమే సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. - ప్రకాష్, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్.

**ఆరిలోవ, న్యూస్‌టుడే:** ?: 13వ వార్డు పరిధి పైనాపిల్‌కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం వీధుల కాలువలను శుభ్రం చేయడం లేదు. - సూరిరాజు ✓: సిబ్బందిని పంపి వీధులు, కాలువలను శుభ్రం చేయిస్తాం. - ఆర్.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

**విశాలాక్షినగర్, న్యూస్‌టుడే:** ?: ఎంవీపీ కాలనీ రైతుబజారు ఎదురుగా దర్శకశ్రనగర్‌లో రహదారి నిర్మాణంలో భాగంగా వెలువడిన వ్యర్థాలను రెండు నెలలుగా అక్కడే వదిలేశారు. రాత్రి వేళల్లో రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. - కృపాకర్ ✓: సమస్య పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటాం. - కెల్లి అప్పలనాయుడు, ఏఈ

**ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే:** ?: పాత డెయిరీ ఫారం కూడలి నుంచి రవీంద్రనగర్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. పశువుల సంచారం అధికంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. - రామకృష్ణ ✓: మరమ్మతులు నిర్వహించి సమస్య లేకుండా చూస్తాం. - రామకుమార్, వీధిదీపాల నిర్వహణ అధికారి

**పెదవాల్తేరు, న్యూస్‌టుడే:** ?: ఈస్ట్ పాయింట్ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడద వెంటాడుతోంది. -రాజు, రమణ, స్థానికులు ✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. -ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

## స్పందనకు వందనం

### దోమల నియంత్రణకు చర్యలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్, సుందర్‌నగర్ కొండవాలులో ఇటీవల దోమలు ఎక్కువయ్యాయని వీటివల్ల జ్వరాలు, చర్మవ్యాధులు అధికంగా వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి సమస్యపై ఈనెల 14న 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు మలేరియా విభాగం అధికారి మంగరాజు స్పందించి సిబ్బందిని పంపించి రసాయనాలను పిచికారీ చేయించారు.

### కాలువల్లో పూడికతీత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 19వ వార్డు లాసెన్స్‌బేకాలనీలోని మురుగు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్పందించారు. తమ సిబ్బందితో పూడికలు తీయించారు.

## కూటమి చొరవ అభినందనీయం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలుగు దండు వ్యవస్థాపకులు పరవస్తు ఫణిశయన సూరి అన్నారు. ఆదివారం తెలుగు దండు ఆధ్వర్యంలో మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భాషోద్యమకారుల విన్నపాలకు కూటమి ప్రభుత్వం స్పందించి, చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, భాషాభిమానులు డాక్టర్ కె.రాజమన్నార్, మజ్జి దేవిశ్రీప్రసాద్, ఎ.రామకృష్ణ, సూర్యనారాయణ, లలిత, ఆచార్య సూరప్పడు, కె.రంగారావు, రవిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సంఘం సభ్యులు

## ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : నగరంలోని పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాంనగర్‌కు చెందిన భరతనాట్య కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీలంకకు చెందిన ముగ్గురు నాట్య కళాకారులు ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపల్ హరిరామ్మూర్తి, నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

వేదికపై కళాకారుల నృత్యం

## పర్యావరణ అవగాహనపై గ్రీన్‌రన్

జెండా ఊపి గ్రీన్‌రన్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ గ్రీన్‌రన్ నిర్వహించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.బ్రహ్మానందరెడ్డి తమ కళాశాల ఎన్‌సీసీ వాలంటీర్లతో కలిసి పాల్గొన్నారు.

## నైతిక విలువలు, క్రమశిక్షణ పాటించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు అలవర్చుకోవాలని రవీంద్ర ఎడ్యుకేషనల్ ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.పి.రవీంద్ర అన్నారు. ఎంవీపీకాలనీ ఐఏఎం బిజినెస్ స్కూల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన అలుమ్నీ మీట్-2025 (పూర్వ విద్యార్థుల సమావేశం) ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్ర మాట్లాడుతూ... నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణ పాటిస్తేనే, ఉన్నత శిఖరాలకు చేరుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఐఏఎం డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అతిథులు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కూటమి నేతలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఎంవీపీకాలనీలోని ఎల్ఐసీ ఐక్యతా భవన్‌లో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ విశాఖ జిల్లా 50వ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, 12వ పీఆర్‌సీ అమలు చేస్తారని ఆశించామని అవేవీ చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టీఆర్ అంబేడ్కర్, గౌరవ అధ్యక్షుడిగా అనకాపల్లి పైడిరాజు, సహ అధ్యక్షులుగా కె. ముత్యాలనాయుడు, ఎ.విజయకుమారి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, రామకృష్ణ, రాజునాయుడు, సీహెచ్ సంతోష్, శ్రీనివాస్‌నాయుడు, వంగా రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సెలర్‌గా తాడాన అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రియాజ్ అహ్మద్, సభ్యులుగా వి.వి.గిరి, ఆడిటర్లుగా కుమారి, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు

## ప్రధాన మార్గంలో వ్యర్థాల బెడద

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు 17వ వార్డు పరిధిలోని మాజీ సైనికోద్యోగుల సంఘం రహదారి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇక్కడ భవన నిర్మాణ వ్యర్థాలు, అనధికారిక షాపుల కారణంగా స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ మాజీ సైనికోద్యోగుల సంఘం భవనం ఉండడంతో తరచూ సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఈ విషయంపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## మిరియాల వెంకటరావుకు నివాళి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం బాలల ప్రాంగణంలో ఆదివారం కాపు సామాజికవర్గ నాయకుడు మిరియాల వెంకటరావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పలువురు కాపు సామాజిక వర్గ నాయకులు వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నేతలు తమ్మిరెడ్డి శివశంకర్‌రెడ్డి, బొలిశెట్టి సత్యనారాయణ, మిరియాల ఫౌండేషన్ సభ్యులు కొఠారి అప్పారావు, మురళి, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, భీమిలి తెదేపా నాయకులు గంటా రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, తదితరులు

## అ వీ ఇ వీ

### నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్ శ్రీరాంనగర్ భగత్‌సింగ్ యువజన సేవాసంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా సీహెచ్ నారాయణరావు, అధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బి.శివాజీ, ఎస్.దాశరథి, కార్యదర్శిగా బి.ఆనందరావు, సహాయ కార్యదర్శిగా ఎ.ఈశ్వరరావు, కోశాధికారిగా ఎస్.రితికుమార్, సలహాదారులుగా ఎస్.వాసుదేవ్, న్యాయ సలహాదారులు బి.బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు ఉంటుందన్నారు.

### దాడిపై కేసు నమోదు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 22వ వార్డు పిఠాపురం కాలనీ బస్‌స్టాప్ సమీపంలో శనివారం రాత్రి భోగ రవిశంకర్ అనే వ్యక్తి దేవర శంకర్ అనే వ్యక్తిపై దాడికి పాల్పడ్డాడు. ఇరువురు పరస్పరం దాడి చేసుకోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరూ శివాజీపాలెంలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం దేవరశంకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ పేర్కొన్నారు.

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సీ షోర్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. రుషికొండలోని ఓ ప్రైవేటు తోటలో క్లబ్ సభ్యులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పి.తిరుపతిరావు బహుమతులు అందించారు. క్లబ్ సభ్యులు విజయానంద్, భీమారావు, ధనుంజయరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న సీ షోర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

## మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేత 'నెల్లూరు'

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు జిల్లా క్రీడాకారులు

**విజేతలు వీరే..:** ఒక కిలోమీటర్ నడక, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రోలో పురుషుల 90 ఏళ్ల పైబడి విభాగంలో డి. శేషగిరిరావు (నాగులపాడు, గుంటూరు జిల్లా) వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 75 ఏళ్లు పైబడిన విభాగంలో ఐదు కిలో మీటర్ల నడక పందెంలో ఆర్.అప్పలనాయుడు, రామారావు, (విశాఖపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగుపందెంలో (65 ఏళ్ల పైబడి) శేషయ్య (గుంటూరు), సుబ్బరాజు (విశాఖపట్నం), 200 మీటర్ల పరుగు పందెం(70 ఏళ్లు పైబడి)లో ధనుంజయ (తిరుపతి), మూర్తి (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మూడు కిలోమీటర్లు నడక పందెంలో విశాఖపట్నంకు చెందిన బి.వెంకటలక్ష్మి ప్రథమంలో నిలిచారు. 65 ఏళ్ల పైబడి పరుగు పందెంలో ఎన్.రమణేశ్వరి (గుంటూరు), డి. నాగేశ్వరమ్మ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు.

## జనవరి 4న మహా ప్రదర్శన

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జనవరి 4న మహా ప్రదర్శన నిర్వహిస్తామని సీఐటీయూ(సిటూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు తెలిపారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సిటూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సిటూ జాతీయ మహాసభలు జరుగుతాయని, చివరి రోజున మహా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సిటూ రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

## రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ ఎయిర్ అండ్ గ్యాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ సీహెచ్.కిషోర్‌కుమార్ మాట్లాడారు. నేటి యువత రక్తదానంపై అపోహలు వీడి, స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. శిబిరంలో 200 మంది దాతలు రక్తాన్ని అందించారు. క్లబ్ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు చింతా నేతాజీ, కార్యదర్శి భాస్కర్, సభ్యులు నరేంద్ర, జగన్, యాసిన్, బ్రహ్మానందం, మహేష్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దాతలు, హాజరైన సభ్యులు

## 600 మందికి హెచ్‌పీవీ టీకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : నగరంలోని పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు చెందిన 9-14 ఏళ్లలోపు బాలికలకు వరుసగా రెండో రోజు హ్యూమన్ పాపిలోమ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ అందించారు. శని, ఆదివారాల్లో కలిపి మొత్తం 600 మంది బాలికలకు టీకాలు వేశామని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. గర్భాశయ ముఖం ద్వారా వచ్చే క్యాన్సర్ నియంత్రణకు వీలుగా ఆరు నెలల తర్వాత రెండో డోసు వేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రవిచంద్ర, సీరం ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ రాంరతన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

## ఖైదీలకు భగవద్గీత బోధన

ఆరిలోవ, న్యూస్‌టుడే: కేంద్రకారాగారంలో ఖైదీలకు ఆదివారం ఇస్కాన్ ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు భగవద్గీతను బోధించారు. మానసిక రుగ్మతలు తగ్గేందుకు ప్రశాంతంగా ఉండేందుకు భగవద్గీత బోధనలు సహకరిస్తాయని కారాగారం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, జైలు అధికారులు పాల్గొన్నారు.

ఖైదీలకు భగవద్గీతను బోధిస్తున్న ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు

## వైద్య శిబిరాలు సద్వినియోగం

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ప్రజల సౌకర్యార్థం దాతలు ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీకాలనీలో జేడీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వార్డు తెదేపా నాయకులు సత్యనారాయణ, బోరధనరెడ్డి, జ్ఞానదీప్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో కాలనీవాసులు, స్థానిక నాయకులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదవాల్తేరు ఇందిరానగర్ కాలనీలో ఆదివారం ఉదయం కమ్యూనిటీ హాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందిరానగర్ యూత్ లిటరసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయా డయాగ్నోస్టిక్ సెంటర్ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయి ఉదయ్ కుమార్, శబరి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మీసాల కుంచిరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. .

వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

## అలరించిన నృత్య ప్రదర్శన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం లాసన్స్‌బే కాలనీలోని వన్ వరల్డ్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏయూ సెనేట్ శాశ్వత సభ్యులు డి.సత్యనారాయణ రెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ కె.సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ వర్ధంతి

కీ॥శే॥ శ్రీమతి
అంకం వెంకటవరలక్ష్మి గారు
జననం: 16-08-1946
కైలాసప్రాప్తి: 06-01-2024

అమరజీవికి అశ్రుతర్పణం
ఆబ్దికం-ఆరాధన తేది: 15-12-2025
ఇంటికి దీపం ఇల్లాలు-అది ఆరిపోతే చీకటే.
ఓ సహనశీలి-సపత్ని- వెంకట వరలక్ష్మీ!
మన సుదీర్ఘ వైవాహిక జీవితబంధం
ఆకస్మికంగా ఆగిపోయిన నీ అంతిమ శ్వాసతో
దూరమైనందుకు కలిగిన మనస్తాపం ఎన్నటికీ
తీరని వ్యధగానే ఉంటుంది. అందరి యెడల
నీ ఆత్మీయత, సేవానిరతి మరువలేనివి.
పుణ్యమూర్తివైన నీకు ఆ భగవంతుడు
ఆత్మ శాంతిని, కైలాస ప్రాప్తిని కలిగించాలని
మేము నిత్యము ఆ భగవంతుని
ప్రార్థిస్తున్నాము. ఎన్ని సంవత్సరములు
గడిచినా నీ జ్ఞాపకాలు
మా మదిలో పదిలం. నా జీవిత పర్యంతం
శోకతప్త హృదయుడనై కర్మానుష్ఠాను
బద్ధుడనై జీవించగలవాడను.

ఇట్లు: నీ జీవిత భాగస్వామి
అంకం సత్యనారాయణ
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
పాత డైరీఫారం, ఆదర్శనగర్, విశాఖపట్నం


(c) eenadu

# విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

తొలగించిన బడ్డీలను లారీలో తరలిస్తున్న సిబ్బంది

## బీఆర్టీఎస్ రహదారిలో ఆక్రమణల తొలగింపు

మాధవధార, న్యూస్‌టుడే: ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా మర్రిపాలెం బీఆర్టీఎస్ రహదారిలో ఆక్రమణలను ఆదివారం తొలగించారు. నడకమార్గంలో ఉన్న చిల్లర దుకాణాలను, బడ్డీలు, తోపుడు బండ్లు, కాలువలపై వేసిన సిమెంటు దిమ్మెలను తొలగించారు. కొన్ని బడ్డీలను క్రేన్లు, లారీల సహాయంతో తరలించారు. ఈ తొలగింపులు కొనసాగుతాయని ప్రణాళిక అధికారులు తెలియజేశారు.

## 'విశాఖ అంటే ఇష్టం..'

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం సాయంత్రం సినీనటి శ్రీలీల దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ కె. శోభారాణి అమ్మవారి ప్రసాదం అందించారు. అనంతరం శ్రీలీల మాట్లాడుతూ.. విశాఖ అంటే ఎంతో ఇష్టమని, జిల్లాలో సినీ చిత్రీకరణకు ఎన్నో ప్రకృతి అందాలు ఉన్నాయన్నారు.

నటి శ్రీలీలకు ప్రసాదం అందిస్తున్న ఈఓ శోభారాణి

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: బాలయ్యశాస్త్రి లేఅవుట్ రాధాకృష్ణనగర్ కొండవాలు ప్రాంతంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. రాకపోకలు సాగించే సమయంలో మహిళలు భయాందోళన చెందుతున్నారు. - శర్మ ✓: పోలీసుల గస్తీ పెంచుదాం. - ఉమాకాంత్, నాలుగో పట్టణ సీఐ

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: పట్టాభిరెడ్డితోటలోని 43ఏ/3 స్తంభానికి ఉన్న వీధిదీపం వెలగడం లేదు. -రామారావు ✓: మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. -అర్చన, వీధిదీపాల ఏఈ

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ ప్రధాన రహదారిలోని కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. మురుగు నిల్వ ఉండి తీవ్ర దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - ఎస్.కె.బాషా ✓: సిబ్బందిని పంపించి పూడికలు తొలగిస్తాం. - వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సూర్యాబాగ్, జగదాంబకూడలి: ?: జీవీఎంసీ 31వ వార్డు యల్లమ్మతోటలోని యల్లమ్మ తల్లి ఆలయం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. -పార్వతి, స్థానిక మహిళ ✓: పరిశీలించి, దోమల నివారణ మందు చల్లిస్తాం. -మల్లయ్యనాయుడు, జోన్-4, జెడ్సీ

## స్పందనకు వందనం

**ఎట్టకేలకు శుభ్రత పనులు:** జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 37వ వార్డు పెట్రోల్‌బంకు సమీప బీచ్‌రోడ్డులో భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగు లీకై, తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

**తీగలు సరి చేశారు..:** గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార ఎస్‌ఎవీఎస్ పాఠశాల వెనుక విభాగినిపై వీధి దీపాలకు ఉన్న విద్యుత్తు తీగలతో ప్రమాదం తప్పింది. విద్యుత్తు తీగలు బయటకు వదిలేయడంతో ప్రమాదం సంభవిస్తుందని ఈనెల 13న 'ఈనాడు'లో 'తాకితే ప్రమాదమే' శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. తీగలు సరి చేసి సమస్యను పరిష్కరించారు.

## పైపులైన్ పనులు.. నత్తతో పోటీ..

మాధవధార, న్యూస్‌టుడే

నగర ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేందుకు చేపడుతున్న పైప్‌లైన్ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు తిరిగే ప్రధాన, జాతీయ రహదారులను తవ్వేసి రోజుల తరబడి పూడ్చకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. విశాఖ ఉత్తరం నియోజకవర్గంలోని పలుకాలనీల్లోని తాగునీటి గొట్టాలకు ప్రధాన పైపులను అనుసంధానించే పనులు చేపడుతున్నారు. దీనికోసం రహదారులను తవ్వారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లను ఉంచారు. చాలాచోట్ల ఈ పనులు పూర్తిచేసి గుంతలను పూడ్చారు. నీటిని వదిలి టెస్టింగ్ చేయాలి. ఆ సమయంలో ఎక్కడైనా లీకులు ఏర్పడితే మళ్లీ పనులు చేపట్టాల్సి ఉంటుంది. అందువల్ల బారికేడ్లను తొలగించకుండా అలానే ఉంచారు.

ఆర్‌అండ్‌బీ వద్ద రోడ్డు తవ్వేసి స్టాపర్లు పెట్టిన దృశ్యం

■ జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ సిగ్నల్ పాయింట్ వద్ద పైపులైన్ల ఏర్పాటు కోసం వారం రోజుల క్రితం నుంచి బారికేడ్లు ఉంచడంతో చోదకులు రాత్రి సమయాల్లో నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి ఇలా వదిలేయడంపై ప్రయాణికులు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి సేవా రోడ్డు, కాలనీలకు వెళ్లే ప్రధాన మలుపు వద్ద అడ్డంగా బారికేడ్లను పెట్టడంతో సిగ్నల్ పాయింట్ నుంచి రాకపోకలు సాగించేటప్పుడు ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రి సమయాల్లో దీన్ని గమనించలేని చోదకులు వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారిని తవ్వేసి నిర్లక్ష్యంగా వదిలివేయడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెస్టింగ్ ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితిలో రోజుల తరబడి రహదారులపై ఇలా బారికేడ్లు వదిలేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్రమశిక్షణకు మారుపేరు వాకర్స్ క్లబ్

మురళీనగర్, న్యూస్‌టుడే: క్రమశిక్షణకు మారుపేరైన వాకర్స్ క్లబ్‌ను ప్రస్తుత కార్యవర్గ సభ్యులంతా కలిసి అభివృద్ధి పథంలో నడిపించారని అడ్వకేట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం డిసెంబరు నెల వాకర్స్ వాయిస్ సంచికను అతిథుల చేతులమీదుగా విడుదల చేశారు. ఈనెలలో జన్మదినం జరుపుకొంటున్న క్లబ్ సభ్యులకు చిరు కానుకలను అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు డి.డి.నాయుడు, జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఆధ్యాత్మిక గురువు ఎం.వి.రాజశేఖర్, పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సి.హెచ్.ప్రసాదరావు, వి.ప్రమీల, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ వాయిస్ సంచికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

## ధనుర్మాస పూజల కరపత్రాల ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: భక్త జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో ధనుర్మాస పూజా మహోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయంలో కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు సారిపాక సూర్యనారాయణ, వి.ఎస్.కుమార్ మాట్లాడుతూ ఈనెల 16 తేదీ నుంచి వచ్చే నెల జనవరి 14 వరకు కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. జనవరి 14న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

## 21న చిత్రలేఖనం పోటీలు, పెయింటింగ్ ప్రదర్శన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 'కళ' ఆర్ట్ సెంటర్‌లో భాగంగా ఈనెల 20, 21 తేదీల్లో చిత్రలేఖనం పోటీలు, పెయింటింగ్ ప్రదర్శనలు ఏపీయూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్.ఉష ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి 16 ఏళ్ల లోపు వయసు గలవారు చిత్రలేఖనం పోటీల్లో, అన్ని వయసుల వారు పెయింటింగ్ ప్రదర్శనలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తులైన ప్రదర్శకులు, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 95156 53968 నంబరులో సంప్రదించాలన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

గురుద్వారా, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ గేటు నెంబర్-2 టాక్సీ స్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో సుమారు 55 ఏళ్ల వ్యక్తి విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించి డ్రైవర్లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లో మృతుడి వివరాల కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796012, 9490391623 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: కూటమి నేతలు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. ఎంవీపీకాలనీలోని ఎల్‌ఐసీ ఐక్యతా భవన్‌లో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ విశాఖ జిల్లా 50వ కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, 12వ పీఆర్సీ అమలు చేస్తామని ఆశించామని ఆవేవీ చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టీఆర్ అంబేడ్కర్, గౌరవ అధ్యక్షుడిగా అనకాపల్లి పైడిరాజు, సహ అధ్యక్షులుగా కె. ముత్యాలనాయుడు, ఎ.విజయకుమారి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, మహ్మద్ రిజ్వాన్, రామకృష్ణ, రాజునాయుడు, సీహెచ్ సంతోష్, శ్రీనివాసనాయుడు, వంగా రామలక్ష్మిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిలర్లుగా తాతాజీ అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రియాజ్ అహ్మద్, సభ్యులుగా వి.వి.గిరి, ఆడిటర్లుగా కుమారి, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, తదితరులు

## కుసుమకుమారి దేవి జయంతి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మాతృశ్రీ కుసుమ కుమారిదేవి జయంతిని ఆదివారం డాబాగార్డెన్స్ ఆశ్రమంలో నిర్వహించారు. కుసుమ హరనాథ విగ్రహాలను అలంకరించి, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులు బి.వి.బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్.రమేష్, కోశాధికారి ఎస్.అప్పారావు, ఎంవీ.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో కుసుమ హరనాథులు

## భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సెలవురోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. అమ్మవారికి త్రికాల సమయంలో నిర్వహించిన పంచామృతాభిషేకంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో శ్రీచక్ర నవావరణార్చన, లక్ష్మీహోమం, శాంతికల్యాణం, వేదపారాయణం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

అలంకరణలో అమ్మవారు

హోమం చేస్తున్న అర్చకులు

## జనవరి 4న మహా ప్రదర్శన

మాట్లాడుతున్న సీటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జనవరి 4న మహా ప్రదర్శన నిర్వహిస్తామని సీఐటీయూ(సిటూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు తెలిపారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సిటూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సిటూ జాతీయ మహాసభలు జరుగుతాయని, చివరి రోజున మహా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సిటూ రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి స్పందన

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : మహారాణిపేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చిందని సీఐ దివాకర్ తెలిపారు. స్టేషన్ పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదేశాల మేరకు స్టేషన్ ఆవరణలో శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది హాజరై పలువురికి పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.

రోగులకు మందులు అందజేస్తున్న సీఐ దివాకర్

## రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

రక్తదానం చేస్తున్న దాతలు, హాజరైన సభ్యులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ ఎయిర్ అండ్ గ్యాస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ సీహెచ్.కిషోర్‌కుమార్ మాట్లాడారు. నేటి యువత రక్తదానంపై అపోహలు వీడి, స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. శిబిరంలో 200 మంది దాతలు రక్తాన్ని అందించారు. క్లబ్ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు చింతా నేతాజీ, కార్యదర్శి భాస్కర్, సభ్యులు నరేంద్ర, జగన్, యాసిన్, బ్రహ్మానందం, మహేష్ పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలతో సామాజిక సేవ

అల్లిపురం, న్యూస్‌టుడే : నగరంలోని మహారాణిపేట వద్ద ఉన్న సెయింట్ ఆంథోనీ చర్చి ఆడిటోరియంలో ఆదివారం లిజియన్ ఆఫ్ మేరీ సంస్థ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశాఖ అగ్రపీఠం వికార్ జనరల్ ఫాదర్ డి.బాలశౌరీ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి వెలిగించారు. సామాజిక సేవ, ప్రార్థనలే లిజియన్ ఆఫ్ మేరీ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఫాదర్ బెంజిమెన్, ఫాదర్ విజయభాస్కర్, ఫాదర్ కె.జయరాజు, విశాఖ రీజియన్ అధ్యక్షుడు చింతాడ టార్సిస్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సభ్యులతో ప్రార్థన చేయిస్తున్న ఫాదర్ డి.బాలశౌరీ

## నిత్య వ్యాయామంతో ఆరోగ్యం

శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ నారాయణరావు తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తూ, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు సూచించారు. జీవీఎంసీ 29వ వార్డు చందక వీధి సమీప దిబ్బలపాలెంలో శ్రీలాల్ బహుదూర్ శాస్త్రి యువజన సమాజం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మెడికవర్, పుష్పగిరి ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ నారాయణరావు, తెదేపా వార్డు అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 600 మందికి హెచ్‌పీవీ టీకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : నగరంలోని పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు చెందిన 9-14 ఏళ్లలోపు బాలికలకు వరుసగా రెండో రోజు హ్యూమన్ పాపిలోమ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ అందించారు. శని, ఆదివారాల్లో కలిపి మొత్తం 600 మంది బాలికలకు టీకాలు వేశామని చైతన్య స్రవంతి సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. గర్భాశయ ముఖం ద్వారా వచ్చే క్యాన్సర్ నియంత్రణకు వీలుగా ఆరు నెలల తర్వాత రెండో డోసు వేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రవిచంద్ర, సీరం ఇన్‌స్టిట్యూట్ మేనేజర్ రాంరతన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

## సభ్యుల ఐక్యతతో సంఘం బలోపేతం

మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు వాసుదేవరావు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగరంలో సర్దార్ గౌతులచ్చన్న స్మారక భవనాన్ని ఏర్పాటు చేయాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు టి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆదివారం సింహాచలం సమీపంలో శ్రీశయన సామాజిక వర్గం ఆత్మీయ వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులంతా ఐక్యంగా ఉంటూ, సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. గౌతులచ్చన్న జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు విజయభాస్కర్, వీర్రాజు, మోహన్‌రావు, కల్యాణి, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ అవగాహనపై గ్రీన్‌రన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ గ్రీన్‌రన్ నిర్వహించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.బ్రహ్మానందరెడ్డి తమ కళాశాల ఎన్‌సీసీ వాలంటీర్లతో కలిసి పాల్గొన్నారు.

జెండా ఊపి గ్రీన్‌రన్‌ను ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

## నూతన నియామకం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : భారతీయ విద్యా కేంద్రం విశాఖపట్నం ప్రచార విభాగ ప్రముఖ్‌గా ఎం.దేవ త్రినాథరావు నియమితులైనట్టు ఆదివారం బీవీకే సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. సంస్థ లక్ష్యాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కృషి చేస్తామని త్రినాథరావు తెలిపారు.

## ఆర్థికసాయం అందజేత

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 41వ వార్డు సెబాస్టియన్ కాలనీలో నివాసం ఉండే పి.గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వార్డు తెదేపా సీనియర్ నాయకుడు ఐతి రవిబాబు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు సాయం అందించారు. స్థానిక నాయకులు ఫ్రాన్సిస్, తదితరులు పాల్గొన్నారు.

## విహార యాత్రలతో విజ్ఞానం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు విహార యాత్రలు చేయడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని జీవీఎంసీ 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, తెదేపా అధ్యక్షుడు కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్‌జీజీఓఎస్‌కాలనీలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లారు. నగరంలోని సబ్ మెరైన్, టీయూ 142 యుద్ధ విమానం, గీతం యూనివర్శిటీ, తొట్లకొండ విజ్ఞాన ప్రదేశాలకు తీసుకెళ్లారు. యుద్ధ విమానాల తయారీ, ఉపయోగించే విధానం, సబ్ మెరైన్ పుట్టుపూర్వోత్తరాలను విద్యార్థులకు వివరించారు. తొట్లకొండలో బౌద్ధారామాలను సందర్శించి బుద్ధుడి కాలంనాటి సాంఘిక పరిస్థితులను తెలుసుకున్నారు.

తొట్లకొండపై విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు రాధాకుమారి, ఉపాధ్యాయులు, తదితరులు

## రౌడీషీటర్లు పరివర్తనతో మెలగాలి

మాధవధార, న్యూస్‌టుడే: రౌడీషీటర్ల పరివర్తనతో మెలగాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని కంచరపాలెం ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ ప్రవర్తన మార్చుకొని, పరివర్తనతో నడుచుకోవాలని, నిత్యం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. పరివర్తనతో మెలిగిన వారికి రౌడీషీట్ తొలగించేలా సిఫార్సు చేస్తామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న కంచరపాలెం ఎస్సై రవికుమార్

## 'విదేశీ పెట్టుబడులు సరికాదు'

కార్పొరేషన్, న్యూస్‌టుడే : బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం సరికాదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెట్టుబడులు 100 శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు కేంద్రం అనుమతి ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్రం తీరుతో బీమా రంగానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

## విద్యతోనే ఉన్నతి సాధ్యం

తగరపువలస, న్యూస్‌టుడే: పేదరికం, వెనుకబాటులను జయించాలంటే విద్యతోనే సాధ్యమని, అందుకే పిల్లలు బాగా చదువుకోవాలని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. నాగవంశ సంక్షేమ సంఘం ఆంధ్ర రాష్ట్ర, విశాఖ జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో తగరపువలస సమీప తాళ్లవలసలోని ఓ ప్రైవేటు లేఅవుట్‌లో ఆదివారం నిర్వహించిన వనభోజన మహోత్సవానికి హాజరై మాట్లాడారు. నాగవంశీయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేత 'నెల్లూరు'

పాలపర్రు (పెదనందిపాడు) న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు శ్రీ నారసింహా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నెల్లూరు జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా, మహిళా విభాగంలో విజేతగా నిలిచింది. విశాఖపట్నం క్రీడాకారులు పురుషుల విభాగంలో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొని పోటీలను విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలు 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే 45 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ట్రోఫీ అందుకుంటున్న నెల్లూరు జిల్లా క్రీడాకారులు

**విజేతలు వీరే..:** ఒక కిలోమీటర్ నడక, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రోలో పురుషుల 90 ఏళ్ల పైబడి విభాగంలో డి. శేషగిరిరావు (నాగులపాడు, గుంటూరు జిల్లా) వరుసగా మూడు బంగారు పతకాలు సాధించారు. 75 ఏళ్ల పైబడిన విభాగంలో ఐదు కిలో మీటర్ల నడక పందెంలో ఆర్.అప్పలనాయుడు, రామారావు, (విశాఖపట్నం) వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగుపందెంలో (65 ఏళ్ల పైబడి) శేషయ్య (గుంటూరు), సుబ్బరాజు (విశాఖపట్నం), 200 మీటర్ల పరుగు పందెం(70 ఏళ్ల పైబడి)లో ధనుంజయ (తిరుపతి), మూర్తి (గుంటూరు) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మూడు కిలోమీటర్ల నడక పందెంలో విశాఖపట్నంకు చెందిన బి. వెంకటలక్ష్మి ప్రథమంలో నిలిచారు. 65 ఏళ్ల పైబడి పరుగు పందెంలో ఎన్.రమణేశ్వరి (గుంటూరు), డి. నాగేశ్వరమ్మ (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు.

## 21న పోర్టు పింఛనర్ల సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదిరి అప్పారావు

మాధవధార, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యలపై పోర్టు యాజమాన్యానికి ఎప్పటికప్పుడు వినతులు ఇస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని హార్బర్ అండ్ పోర్టు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదిరి అప్పారావు పేర్కొన్నారు. కళింగనగర్ వద్దనున్న పింఛనర్ల సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మాధవధార కల్యాణ్స్ ఫంక్షన్ హాల్లో పింఛనర్ల సర్వసభ్య సమావేశం, వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆరోజు పింఛనర్ల సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశానికి పోర్టు విశ్రాంత అధికారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పులి ప్రకాశ్‌రావు, అన్నెపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


## 9వ వర్ధంతి

జననం: 28-01-1952 మరణం: 24-12-2016

Pydikondala V.N.PRATAP

Retd. BSNL Employee, Vizag.

మీరు మా నుండి దూరమై నేటికి 9 సంవత్సరము అయిన మీ జ్ఞాపకాలు మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ అశ్రునయనాలతో...

భార్య : సుగుణ

| | |
|---|---|
| కుమారుడు: నాగ శంకర్ | కోడలు: సొనాలి |
| కుమార్తె : అనామిక | అల్లుడు : జీను మహేష్ |
| మనుమరాండ్రు : తాన్య, జాస్మిత, హృత్విక | |


(c) eenadu

# గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

## వైద్య శిబిరం విజయవంతం

గాజువాక, న్యూస్‌టుడే : సిటూ అఖిల భారత మహాసభల సందర్భంగా 70వ వార్డు దళమికొండ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ప్రతిభ, కిషోర్‌బాబు నేతృత్వంలో వైద్య సిబ్బంది ఆరోగ్య సేవలందించారు. సంఘం నాయకులు పి.నర్సింగరావు అధ్యక్షత వహించారు. నాయకులు గొలగాని అప్పారావు, ఎం.రాంబాబు, నూకేశ్వరరావు మాట్లాడారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు.

శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

## నివాసితులకు మొక్కల పంపిణీ

పుడకలపాలెం(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: నేచర్ గార్డెనర్స్ సంస్థ ఆధ్వర్యంలో గాజువాక పుడకలపాలెంలో నివాసితులకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. పుడా ఓపెన్ జిమ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మానవరత్న ఐశ్వర్య మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో టెర్రస్ గార్డెనింగ్‌లో ప్రతి ఒక్కరూ తగిన మెలకువలు తీసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకాన్ని మహిళలు ఉద్యమంలా కొనసాగించాలని సూచించారు.

మొక్కలను ప్రదర్శిస్తున్న సభ్యులు

## మేడ మీద తీగలు.. యమపాశాలు..!

న్యూస్‌టుడే, గాజువాక

1 ఈనెల 1న శ్రీనివాసనగర్‌లో 5వ తరగతి చదువుతున్న బాలుడు ఆకాశ్ డాబా మీద గాలిపటం ఎగరేసే క్రమంలో ఆపైన ఉన్న హెచ్‌టీ తీగకు దారం చిక్కుకోవడంతో దాన్ని కదిపే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు.

2 అంతకు ముందు శ్రీనగర్ దరి సుందరయ్యకాలనీలో ఇంటి మేడపైకి వెళ్లి ఏదో సర్దుతుండగా లక్ష్మణ్ అనే యువకుడు హెటెన్షన్ తీగల తాకిడికి మృత్యువాతపడిన ఉదంతం ఎవరూ మరిచిపోలేరు. అప్పుడు జరిగిన ఈ సంఘటనలో చుట్టుపక్కనున్న నివాసాల్లో గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. ఇళ్ల పైకప్పులు, సీలింగ్‌లు ధ్వంసమై నష్టం కలిగించాయి.

... ఈ పదేళ్ల కాలంలో 11 మంది వరకూ మృతిచెందారు. మరో 15 మంది వరకూ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గాజువాక పట్టణ పరిధిలోని 70, 71, 72 వార్డుల్లోని వేలాది కుటుంబాల ఇళ్ల పై నుంచి వెళ్తున్న హెచ్‌టీ లైన్లు కలిగిస్తున్న నష్టమిది. హెచ్‌టీ లైన్ల తొలగింపు తమ చేతుల్లో లేదంటూ ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతుంటే.. పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించామంటూ జీవీఎంసీ, మండల రెవెన్యూ యంత్రాంగం సరిపుచ్చుకుంటోంది.

ఓ నివాసం పైనుంచి వెళ్తున్న హెచ్‌టీ తీగలు

### ఏమిటీ పరిస్థితి..?

పాతగాజువాక నుంచి ఆటో శ్రీనగర్ వెళ్లేంతవరకూ ఉన్నకాలనీలు హెచ్‌టీ లైన్ల కింద ఉన్నాయి. డ్రైవర్స్‌కాలనీ, శ్రామికనగర్, కుంచమాంబకాలనీ, చైతన్యనగర్, చినగంట్యాడ, అఖిలేష్‌కాలనీ, శ్రీనగర్, దుర్గానగర్, సుందరయ్యకాలనీ, అరుణోదయ కాలనీ, శ్రీరామ్‌నగర్, సంజీవనిపాలెం చుట్టుపక్క కాలనీలకు 133, 33 కేవీ లైన్లు శాపంగా పరిణమించాయి.

### తరచూ జరుగుతున్న ప్రమాదాలు

**అనుమతులు లేకపోయినా..:** హెచ్.టి. లైన్లు వెళ్లే ప్రాంతాల్లో రెండతస్తుల భవన నిర్మాణాలకు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు లేకపోయినా నివాసితులు గత మున్సిపాలిటీ హయాంలో (1991-2005) రాజకీయ సిఫార్సులతో అదనపు అంతస్తులను నిర్మించారు. హెచ్‌టీ లైనుకు రెండు, మూడు మీటర్ల దూరంలో నిల్చున్నా విద్యుదయస్కాంత తరంగాల ప్రభావం కనిపిస్తుంది. నివాసితులు ఎవరికివారే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా ఆదమరిచి కోరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

**ప్రమాదాలు ఇలా..**

డాబాల మీద గాలిపటాలు ఎగరవేసే క్రమంలోనో, డాబాలపైకి ఇనుప సామగ్రి, ఇతర వస్తువులు తరలించే క్రమంలో తీసుకెళ్లేటప్పుడో హెచ్‌టీ తీగలు తగిలి ప్రమాదాలపాలవుతున్నారు. గట్టిగా గాలివీచినా లైన్ల రాపిడికి నిప్పురవ్వలు ఎగిసి పడుతుంటాయని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. ఇళ్ల మీద హెచ్‌టీ లైన్లను మార్చాలని ఆయా నివాసిత సంఘాలు జిల్లా అధికారులపై వివిధ స్థాయిల్లో ఒత్తిళ్లు తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు సాగించినా ఫలితం లేకుండా పోయింది.

ధ్వంసమైన ఇంటి సీలింగ్

**శాశ్వత నివారణ చర్యలపై దృష్టి:** హెచ్‌టీ లైన్ల ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీనికి శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటాం. విద్యుత్‌శాఖ, జీవీఎంసీ, మండల రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ ఇతర శాఖల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తాం. -పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యే, గాజువాక

## 'సోగ్గాడు స్వర్ణోత్సవ' పుస్తకావిష్కరణ

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ఉమ్మడి రాష్ట్రాల శోభన్‌బాబు సేవా సంఘం కన్వీనర్ జె.త్రిమూర్తులు 'సోగ్గాడు స్వర్ణోత్సవ' పుస్తకం రచించారు. ఈ మేరకు గోపాలపట్నంలో శోభన్‌బాబు సేవా సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు చేతుల మీదుగా ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంఘ సభ్యులకు, అభిమానులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.సోములు, కన్వీనర్ జె.త్రిమూర్తులు, చందు సుబ్బారావు, రామదాసు, బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

## చట్ట పరిధి దాటితే చర్యలు తప్పవు

సింధియా, న్యూస్‌టుడే : చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు అన్నారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటర్లు తమ పాత ధోరణి వీడకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి షీటరు వ్యవహార శైలిని నిశితంగా పరిశీలన జరుగుతుందన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గొలగాని అప్పారావు

## 'విదేశీ పెట్టుబడులు సరికాదు'

కార్పొరేషన్: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం సరికాదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెట్టుబడులను 100 శాతానికి పెంచడం, బీమా చట్టాల సవరణ బిల్లుకు కేంద్రం అనుమతి ఇవ్వడం అన్యాయమన్నారు. కేంద్రం తీరుతో బీమా రంగానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

**సమస్య:** సనత్‌నగర్, పుడకలపాలెం వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. దీనికితోడు రైతుబజారు రోడ్డులో నడిచి వెళ్లే వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. -సతీష్, కనకిరెడ్డి -పెంటయ్య, శంకరరావు, కొరడ, **సమాధానం:** సిబ్బందిని పంపి నివారణ చర్యలు తీసుకుంటాం. -కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 89వ వార్డు వెంకటాపురం గొల్లవీధిలో కాల్వల్లో పూడికలు తీయడం లేదు. - మూర్తి, గొల్లవీధి ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. - గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం-నరవ రోడ్డు గోతులమయమైంది. - పైడిరాజు, గోపాలపట్నం ✓: రోడ్డు మరమ్మతులు చేపడతాం. - వెంకటలక్ష్మి, పనుల విభాగం డీఈ

## 'సేవలను ప్రజలకు చేరువ చేస్తా'

గాజువాక: ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గాజువాకకు చెందిన తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తన సేవలను గుర్తించి డైరెక్టర్ పదవి కల్పించడం పట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. పౌర సరఫరాల విభాగం సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు.

## కొత్త గుత్తేదారుకు సంత ఆశీలు బాధ్యతలు

అగనంపూడి: అగనంపూడి వారపు సంతలో వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు బాధ్యతలను సోమవారం నుంచి కొత్త గుత్తేదారుకు అప్పగించనున్నారు. ఈ మేరకు గత నెలలో నిర్వహించిన వేలంలో దేవాదాయశాఖ అధికారులు కొత్త వ్యక్తికి టెండరును ఖరారు చేశారు. స్థానిక శ్రీ జగన్నాథ స్వామి వారి ట్రస్టు బోర్డుకు చెందిన స్థలంలో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తున్నారు. అక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేస్తున్నారు. రెండేళ్ల కాలపరిమితికి నిర్వహించిన వేలం ద్వారా దేవాదాయశాఖకు రూ. 4.85 లక్షల ఆదాయం సమకూరింది. ఈనెల 15 నుంచి అమల్లోకి వచ్చే ఆశీల ధరల వివరాలను దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారిణి పద్మజ వెల్లడించారు.

## క్రికెట్ పోటీల లోగో ఆవిష్కరణ

లోగో ఆవిష్కరిస్తున్న భాజపా కన్వీనర్ కేఎన్ఆర్

పాతకర్నవానిపాలెం(గాజువాక), న్యూస్‌టుడే : బీహెచ్‌పీవీ మాజీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జనవరి 9 నుంచి 12 వరకూ భెల్ మైదానంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీల లోగోను భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, బుల్లితెర డీ-20 డ్యాన్సర్ ఝాన్సీ, కొరియోగ్రాఫర్ రమేష్ మాస్టర్‌లు ఆవిష్కరించారు. ఆదివారం గాజువాక భాజపా కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ ఉద్యోగుల కమిటీ సభ్యులు శివ, రాము, అప్పారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు విద్యా సామగ్రి వితరణ

గాజువాక, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాట్స్), రోటరీ ఇంటర్నేషనల్ సౌత్, గ్లో సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం చట్టివానిపాలెం, డ్రైవర్స్‌కాలనీ, పాత గాజువాక పాఠశాలలకు రూ.6లక్షల విలువైన విద్యా సామగ్రిని అందజేశారు. నాట్స్ అధ్యక్షుడు శ్రీహరి మందాడి, కార్యవర్గ సభ్యులు కిరణ్ మందాడి, రోటరీ ఇంటర్నేషనల్ సౌత్ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి, గ్లోసంస్థ ప్రతినిధి యార్లగడ్డ వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వితరణ కార్యక్రమంలో పాల్గొన్న నార్త్ అమెరికా తెలుగు సంఘం, రోటరీ, గ్లో ప్రతినిధులు

## నూతన భవనం నిర్మించాలి

కోన తాతారావుకు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

అగనంపూడి, న్యూస్‌టుడే : లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నూతన భవనం నిర్మించాలని స్థానిక కూటమి నాయకులు విశాఖ డీసీసీబీ అధ్యక్షుడు కోన తాతారావును కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన సొసైటీ భవనం శిథిలావస్థకు చేరుకుందని వివరించారు. అగనంపూడి, లంకెలపాలెం పరిసర గ్రామాలకు చెందిన 350 మంది సభ్యులు తీసుకున్న గ్యాస్ రుణాలను రద్దుచేయాలని కోరారు. కూటమి నాయకులు బి.సత్యనారాయణ, యు.అప్పలరాజు, సాలాపు అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 4న మహా ప్రదర్శన

మాట్లాడుతున్న సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జనవరి 4న మహా ప్రదర్శన నిర్వహిస్తామని సీఐటీయూ (సిటూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు తెలిపారు. ఆదివారం జగదాంబకూడలి సమీప సిటూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సిటూ జాతీయ మహాసభలు జరుగుతాయని, చివరి రోజున మహా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సిటూ రాష్ట్ర నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మల్కాపురం, న్యూస్‌టుడే : విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డుకాలనీలో షిప్‌యార్డు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో చదివిన 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగర పరిధిలోని గ్రంథాలయంలో సందడిగా జరిగింది. కొన్ని దశాబ్దాల తర్వాత కలిసిన వీరు ఆనాటి సంగతులను మననం చేసుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ గడిపారు. ఆటపాటలతో అదరగొట్టారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

## ప్లాస్టిక్ వద్దు.. వస్త్ర సంచి ముద్దు

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోరమాండల్ సహకారంతో ఎల్లపువానిపాలెం, చంద్రనగర్, లక్ష్మీనగర్, గోపాలపట్నం, మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో 'ఏక్ దిన్ సాత్ ఏక్ బ్యాగ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తుందన్నారు. ప్లాస్టిక్‌ను విడనాడాలని పలువురు వక్తలు కోరారు. అనంతరం వస్త్రసంచులు పంపిణీ చేశారు.

వస్త్రసంచులను పంపిణీ చేసిన సంఘ సభ్యులు

## అలరించిన శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలు

మల్కాపురం, న్యూస్‌టుడే : నగరంలో ఈనెల 31వ తేదీ నుంచి జరగనున్న సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలను పురస్కరించుకొని మల్కాపురం జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం శ్రామిక సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించారు. జీవీఎంసీ త్రినాథపురం కూడలిలో నిర్వహించిన ఈ ఉత్సవాలను మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ అప్పారావు ప్రారంభించారు. అనంతరం సమాజంలో మూఢనమ్మకాలు ఎలా వ్యాపిస్తాయో ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు బాల బయ్యన్న, సీఐటీయూ నాయకులు పెంటారావు, పైడిరాజు, నరేష్, వాసు, పి.రామారావు, బి.జగ్గునాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ..

## ఉత్సాహంగా వన సమారాధన

సింధియా, న్యూస్‌టుడే: సామాజిక ఐక్యతకు చిహ్నంగా ఆదివారం పారిశ్రామిక ప్రాంతం ఇందిరాకాలనీ, అశోక్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. సంఘ మాజీ, తాజా సంక్షేమ సభ్యులు పాల్గొని మాట్లాడారు. సంఘ అభివృద్ధికి సహకారాన్ని అందించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వన సమారాధనలో పిల్లలు, పెద్దలు, యువత ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అలరించారు.

## పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన

పార్క్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రమణ

ఎన్ఏడీకూడలి (కాకానినగర్) న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు కనకమహాలక్ష్మీనగర్‌లో సుమారు రూ. 13.47 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పార్క్ నిర్మాణ పనులకు స్థానిక వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోపాలరావు, రాంప్రసాద్, సుందర్, రాజాభాస్కర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## వంతెన ప్రారంభించినా.. తప్పని యాతన..

న్యూస్‌టుడే, సింధియా : పారిశ్రామిక ప్రాంత వాసులను నగరంతో అనుసంధానం చేస్తున్న నేవల్‌డాక్‌యార్డు వంతెన ఇటీవల ప్రారంభించినా ద్విచక్ర వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. వంతెన దాటిన వెంటనే గోస్తనీ గేటు వరకు మాత్రమే రహదారి బాగుంది. అక్కడ నుంచి ముందుకు వెళ్లడానికి ఆస్కారం లేకుండా మట్టిదిబ్బలతో పూర్తిగా మూసివేశారు. తిరిగి వెనక్కి వచ్చి డాక్‌యార్డు విజయనగర్ కాలనీ మీదుగా పోర్టు రైల్వే ట్రాక్ దాటుకుని జ్ఞానాపురం-ఆర్పీపేట వంతెన మీదుగా కాన్వెంటు జంక్షన్‌కు చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన మొదలు జ్ఞానాపురం రోడ్డు వరకు అవస్థలు తప్పడం లేదంటున్నారు..

ఇటీవల ప్రారంభమైన డాక్‌యార్డు వంతెన

**తిరుగు ప్రయాణ సమయంలో ఇక్కట్లు..:** కాన్వెంటు కూడలి నుంచి సింధియాకు చేరుకునే పాత మార్గం (టోల్ గేటు) మీదుగా రావడానికి సాగరమాల ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. ఈ పనులు ఎప్పుడో జరపాల్సి ఉంది. అయితే డాక్‌యార్డు వంతెన ఎలాగూ మూసివేయడంతో పెద్దగా ఉపయోగం ఉండదని భావించారు.

★ ఇటీవల పెట్టుబడుల సదస్సుకు ముందుగానే ఎలాగైనా ఒకవైపు అయినా మార్గాన్ని అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే గణబాబు చొరవతో పోర్టు యాజమాన్యం పనులు వేగవంతం చేసింది.

కొనసాగుతున్న సాగరమాల ప్రాజెక్టు పనులు

**మిలాన్ నాటికి పూర్తయ్యేనా?:** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈస్టర్న్ నేవల్‌కమాండ్ ఆధ్వర్యంలో జరగనున్న బహుళపక్ష సముద్ర విన్యాసాల (మిలాన్) నాటికి ఈ డాక్‌యార్డు వంతెన మీదుగా రాకపోకలకు ఆస్కారం ఉంటుందా అనే సందేహం తలెత్తుతోంది. పలు దేశాల నుంచి ప్రత్యేక ప్రతినిధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

## హమ్మయ్యా.... గొయ్యి పూడ్చారు

దువ్వాడ పైవంతెనపై పడిన గొయ్యిని పూడ్చుతున్న సిబ్బంది

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: దువ్వాడ పైవంతెనపై ఏర్పడిన గొయ్యిని రైల్వే అధికారులు ఆదివారం పూడ్చారు. వాహనదారులు పైవంతెనపై ఏర్పడిన గొయ్యి వల్ల ఇబ్బందులు పడేవారు. పలువురు ఫిర్యాదు చేయడంతో రైల్వే ఐవోడబ్ల్యూ లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ఆదివారం సిమెంట్ కాంక్రీటుతో పూడ్చడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

## చేతుల శుభ్రతకు స్టాండ్ ఏర్పాటు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ఇంతవరకూ చేతులు కడుక్కునేందుకు తగిన కుళాయి సదుపాయం ఉండేదికాదు. ఈ పరిస్థితిని తెలుసుకున్న ఎల్‌అండ్‌టీ సంస్థ సీఎస్సార్‌లో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయించి ఆవరణలో కొత్తగా 15 కుళాయిలతో కూడిన చేతులు కడుక్కునే స్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చింది.

విద్యార్థులు చేతులు కడుగుతూ..

## రహదారులపైనే డంపర్‌బిన్లు

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే: గోపాలపట్నం నుంచి ఎన్ఏడీకూడలి వరకు బీఆర్టీఎస్‌రోడ్డుకు ఇరువైపులా డంపర్ బిన్నులను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా దాదాపు 20 వరకు డంపర్ బిన్నులు ఉన్నాయి. రాత్రివేళల్లో వాహనాల వెలుగులకు డంపర్‌బిన్నులు కనిపించక వాటిని ఢీకొని గాయాలతో ఇళ్లకు వెళుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్టీఎస్ రోడ్డు మీద పెట్టిన డంపర్‌బిన్

## స్మార్ట్‌పోల్స్ అలంకారప్రాయమేనా?

గోపాలపట్నం, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీల్లో సేవలు, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పట్టణ డేటాను సేకరించడం, విశ్లేషించడానికి స్మార్ట్‌పోల్స్ ఏర్పాటు చేశారు. ఇందులోభాగంగా గోపాలపట్నం రైతుబజార్ ఎదురుగా, బాజీకూడలిలో స్మార్ట్‌పోల్స్‌ను ఐదేళ్ల క్రితం నిర్మించారు. వీటికి లైటింగ్, సెన్సార్లు, సీసీ కెమెరాలు, కమ్యూనికేషన్ మాడ్యూల్స్, వైఫై అమర్చారు. అయితే నేటికి వీటిని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో రోడ్డుపై అలంకారప్రాయంగా మారాయి.

గోపాలపట్నంలో స్మార్ట్‌పోల్

## గెడ్డను శుభ్రం చేయాలి

ఫోకస్

కరాస, న్యూస్‌టుడే: మర్రిపాలెం రైల్వేక్వార్టర్సులో ఉన్న మురుగు కాలువలను సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. దుర్గంధం నెలకొంటోంది. పైనుంచి కొట్టుకువచ్చిన వ్యర్థాలు, జంతు కళేబరాలు కూడా కాలువలో నిలిచిపోతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. గెడ్డను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది.

మర్రిపాలెం రైల్వేక్వార్టర్సు గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

## పైపు పగిలేే.. నీరు పోయే..!

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక 70వ వార్డు ఎల్వీనగర్ రోడ్డునెంబర్-8లో భూగర్భ పైపులైను పగిలిపోయి తాగునీరు నేలపాలైంది. ఉదయం వేళ కుళాయిలు విప్పేసరికి ప్రధాన పంపిణీ లైను నుంచి నీరంతా ధారాపాతంగా పోతోంది. గతవారం రోజులుగా పైపు పగిలిపోయినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడంలేదని, ఎగువ ప్రాంతాలకు నీరందడం లేదని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైపులీకేజీ దృశ్యం

## గుట్టుగా తెచ్చి.. గుట్టలుగా పోసి..

క్లిక్ క్లిక్

దారిపక్కన మట్టి గుట్టలు

బీసీరోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే: బీసీరోడ్డులో రాత్రికి రాత్రే మట్టి, డెబ్రిస్ తెచ్చి గుట్టలుగా పోస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యం చెందుతున్నారు. రోడ్డు విశాలంగా ఉన్నందున ట్రాక్టర్లు, టిప్పర్లతో ఎక్కడెక్కడి నుంచి మట్టి తెస్తున్నారు. ఇటీవల జీవీఎంసీ సిబ్బంది పరిశీలించి వెళ్లారేగానీ డంపింగ్‌ను ఆపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీసీరోడ్డులో ఇదీ పరిస్థితి..

8వ వర్ధంతి

మీరు మా నుండి దూరమై నేటికి 8 సంవత్సరాలు గడిచినా మీ మధుర జ్ఞాపకాలు మా మదిలో ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ బండారు అప్పారావు గారు
Retd. H.S.L.
మరణం: 15-12-2017

ఇట్లు
మీ కుటుంబ సభ్యులు
కణితి, వడ్లపూడి RHC.
Ph: 9949937999

(c) eenadu

## వై..వై.. వయ్యారి నేనే..!

సినీనటి శ్రీలీల రాజాంలో ఆదివారం తళుక్కున మెరిశారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేయడంతో ఈమెను చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. తెలుగులో మాట్లాడి అందర్నీ ఉత్సాహపరిచారు. వారితో స్వీయ చిత్రాలు దిగుతూ ఉల్లాసపరిచారు. నేపథ్య సంగీతానికి అభినయిస్తూ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. ఆమెను చూసి యువత కేరింతలు కొట్టారు. - న్యూస్‌టుడే, రాజాం

చిన్నారుల నృత్యాలు.. ఆటపాటలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. పెద్దలు, మహిళలు, యువత గీతాలతో అలరించారు. దినంతటికీ వేడుకైంది రాజాంలోని ఓ ఉద్యానం. రాజాం తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం ఆదివారం సందడిగా జరిగింది. వేల మంది తరలివచ్చారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, జగదీష్, మాజీ మంత్రి పడాల అరుణ, మామిడి శ్రీకాంత్, అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, వి.రాము పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, రాజాం

## హైలెస్సా.. హైలెస్సా..!

జాలరి నృత్యం చేస్తున్న చిన్నారి

# సంగీత ఝరి.. తరగని నిధి

ఆహ్వానం పలుకుతోంది మహారాజా సంగీత, నృత్యకళాశాల..

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం.. ఆ పేరు చెబితేనే దేశ విదేశాల్లో ఠక్కున గుర్తొచ్చేది సంగీతం, సాహిత్యం. పూసపాటి రాజవంశీయులు కళలను ప్రోత్సహిస్తూ.. ఏర్పాటు చేసిన సంగీత, నృత్య కళాశాల వందేళ్లకు పైగా విరాజిల్లుతోంది.. వేల మందిని ప్రపంచానికి అందించింది.. ఇక్కడ విద్య నేర్చుకున్న వారు సినీ, సాహిత్య రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. ఈ విద్యానిలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఇటీవల ఎంపీ అప్పలనాయుడు సీఎం చంద్రబాబును కోరగా సానుకూలంగా స్పందించారు.

### పదేళ్లు నిండితే చాలు..

సంగీతం, నృత్య కళాశాలలో చేరాలంటే.. ఏటా జులై, ఆగస్టు నెలల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. జులై నాటికి పదేళ్లు నిండి చదవడం, రాయడం వస్తే చాలు దరఖాస్తుకు అర్హులు. ఆగస్టు దాటిన తర్వాత అయితే నామమాత్రపు అపరాధ రుసుముతో దరఖాస్తు చేయొచ్చు.

### ఇంకెక్కడెక్కడ ఉన్నాయి..

రాష్ట్రంలో విజయనగరం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలులో ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ ప్రావీణ్యం పొందిన వారి ప్రదర్శనలకు పలు వేదికల్లో గుర్తింపు లభిస్తోంది. ఉపాధి పరంగా ఈ కోర్సులు ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బోధకులుగా చేరే అవకాశం ఉంటుంది.

### తరగతుల సమయం

ప్రస్తుతం కళాశాలలో సర్టిఫికెటు, డిప్లొమా కోర్సులు ఉన్నాయి. ఇవి నాలుగేళ్లు, డిప్లొమా కోర్సు రెండేళ్లు. ● సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులైతే డిప్లొమాలో చేరడానికి అర్హులు. ● పీజీ సెట్ రాస్తే కళాశాలల్లో చేరి ఆయా కోర్సులు పూర్తి చేయొచ్చు. రోజూ ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

కళాశాల ఆవరణలో ఘంటసాల విగ్రహం

### కోర్సులు.. బోధకులు

- గాత్రం - ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, దేవి సుజాత నేర్పిస్తున్నారు.
- వీణ -శాస్త్రి
- వయోలిన్ - సురేష్‌కుమార్
- నాదస్వరం - ఎన్.గోపాలరావు
- డోలు - ఎ.శ్రీనివాసరావు
- మృదంగం: ఎన్.రాధాకృష్ణ
- భరతనాట్యం: డి.హిమబిందు

### దక్షిణ భారతంలోనే మొదటి కళాశాల

శతాబ్దానికి పైబడి చరిత్ర కలిగిన ఈ కళాశాలను 1910లో అప్పటి విజయరామ గజపతి ఏర్పాటు చేశారు. సౌతిండియాలోనే మొట్టమొదటిగా విజయనగరం కోటకు సమీపంలో పాఠశాలగా ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వ ఆధీనంలోని వెళ్లింది.

### ప్రముఖులకు తొలి అడుగులిక్కడే..

ప్రపంచ కీర్తినార్జించిన ప్రముఖులు సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, గాయని పి.సుశీల, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, నూకల చినసత్యనారాయణ, సాలూరు రాజేశ్వరరావు, సాలూరి హనుమంతరావు, ద్వారం వెంకటస్వామి నాయుడు, నరసింగరావు నాయుడు, వాసా కృష్ణమూర్తి ఇక్కడే ఓనమాలు దిద్దారు. ఇటీవల భరతనాట్యంలో దేశవిదేశాల్లో రాణిస్తున్న అన్నా నిహాథామస్ ఇక్కడే శిక్షణ పొందారు.

భవిష్యత్తు తరాలకు అందించాలి.. సంగీత, నృత్య కళాశాలను నేటి యువత వినియోగించుకోవాలి. కళను నిలబెట్టేలా, సంస్కృతిని కాపాడేలా చూడాలి. ఇందులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో 505 మంది వివిధ కోర్సులు నేర్చుకుంటున్నారు.
- కె.శాస్త్రి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, మహారాజ సంగీత, నృత్య కళాశాల

సాధన చేస్తున్నవిద్యార్థి

## ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలి

ప్రథమ బహుమతి సాధించిన జీఎమ్మార్ విద్యార్థులు

న్యూస్‌టుడే, విద్యాభాగం: కృత్రిమ మేధ ద్వారా సరికొత్త సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీరింగ్ మేనేజర్ కారుమంచి నరసింహా అన్నారు. జీఎంఆర్‌ఐటీయూ గురజాడ విద్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన హ్యాకథాన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలన్నారు.

- రాజాం జీఎమ్మార్ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బి.సింధు, పి.భరత్ కుమార్, ఎ.పవన్‌కుమార్, ప్రవళిక ప్రథమ బహుమతిని గెల్చుకున్నారు. వీరికి రూ.25 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు.
- విశాఖలోని శొంఠ్యాంకు చెందిన ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థులు ఎ.సాయి కౌశిక్‌కుమార్, ఎస్.సతీష్, డి.చైతన్య, ఆర్.సాయిప్రసాద్ ద్వితీయస్థానంలో నిలిచి రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన చెరుకూరి లలిత ఆదిత్య, తరుణ్‌సాయి, సింగరాజు, టి.ప్రణీత్‌కుమార్ రూ.10 వేలు పొందారు.
- 10 బృందాలకు రూ.1000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు, ప్రశంసాపత్రాలు దక్కాయి.

## మీ పల్లె ప్రగతి.. మీకు తెలుసా?

పార్వతీపురం మన్యం జిల్లాలో.. ● మండలాలు: 15 ● పంచాయతీలు: 451 ● నివాసాలు: 2,13,755 ● జనాభా: 7,40,938

న్యూస్‌టుడే, పార్వతీపురం

మీ ఊరికి ప్రభుత్వం ఎంత నిధులు ఇచ్చింది.. ఆ మొత్తంతో ఏఏ పనులు చేశారు.. దేనికి ఎంత ఖర్చు చేశారో మీకు తెలుసా? నిజానికి ఈ వివరాలు తెలుసుకోవాలని ప్రయత్నం చేసినా.. ఓ పట్టాన చెప్పే పరిస్థితి ఉండదు. అయితే నిరాశ చెందాల్సిన పనిలేదు. ఇక మీ చేతిలోని ఫోన్ ద్వారా మీ గ్రామ ఆర్థిక స్థితి, ప్రగతి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. అదెలాగో చూద్దామా..

### వివరాలన్నీ ఒకే యాప్‌లో..

- ఊరి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం 'గ్రామ స్వరాజ్' యాప్‌ను తీసుకొచ్చింది.
- మీ చరవాణిలోని ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీలను వరుసగా ఎంచుకోవాలి.
- తర్వాత 'అప్రూవ్డ్ యాక్టివిటీస్'పై క్లిక్ చేస్తే పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పనులకు ఎంతెంత వెచ్చించారో తెలుసుకోవచ్చు.
- కొన్ని సందర్భాల్లో ఇందులో సమాచారం ఉండకపోవచ్చు. ఆ సమయంలో మళ్లీ వెనక్కివచ్చి 'ఫైనాన్షియల్ ప్రోగ్రెస్'ను తెరవాలి.
- ఇందులో ఆర్థిక సంవత్సరాన్ని ఎంపిక చేసుకుంటే.. పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి? ఎంత ఖర్చు అయ్యింది? ఏఏ పనులకు ఎంతెంత ఖర్చు చేశారు? అనే సమాచారాన్ని చిటికెలో తెలుసుకోవచ్చు. మరెందుకు ఆలస్యం మీ ఊరి ప్రగతిని తెలుసుకొనేందుకు 'గ్రామ్ స్వరాజ్' యాప్‌ను పలకరించండి.

### జనాభా ప్రాతిపదికన..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏటా నిధులు కేటాయిస్తాయి. వీటిని పంచాయతీలో జనాభా ప్రాతిపదికన తలసరి లెక్కింపు విధానంలో ఇస్తారు. ఈ మొత్తంతో ప్రజల అవసరాలు తీర్చేలా పనులు చేపట్టడం పంచాయతీ పాలకుల బాధ్యత. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు దీపాల ఏర్పాటు వంటి పనులకు వెచ్చించడం పరిపాటి.

నిధులెంత వచ్చాయి.. దేనికి ఖర్చు చేశారు

విజయనగరం జిల్లాలో.. ● మండలాలు: 27 ● పంచాయతీలు: 775 ● నివాసాలు: 5.5 లక్షలు ● జనాభా: 18 లక్షలు

## నాన్నా.. లే ఇంటికెళ్దాం..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- తండ్రి దుర్మరణం.. ఇద్దరు కుమారులు, సోదరుడికి గాయాలు

బాలుణ్ని ఆసుపత్రికి తీసుకువెళ్తున్న కానిస్టేబుల్ రమేష్

అప్పటి వరకూ తండ్రితో సరదాగా గడిపారు.. ఆదివారం సెలవు కావడంతో బీచ్‌కు వెళ్దామని కోరారు.. పిల్లల మాట కాదనలేక సోదరుడితో కలిసి బైకుపై బయలుదేరాడు ఆ తండ్రి.. దారంతా కబుర్లు చెబుతూ.. వెళ్తున్నారు.. అంతలోనే మృత్యువు లారీ రూపంలో వారిని కబళించింది. కళ్లముందే కన్నతండ్రి కానరాని లోకాలకు వెళ్లడం జీర్ణించుకోలేని ఆ చిన్నారులు.. లే నాన్నా.. ఇంటికి వెళ్దాం.. అంటూ గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ పిల్లల ఆక్రందనలు స్థానికుల కంట కన్నీరు పెట్టించింది. ఈ ప్రమాదంలో తండ్రి దుర్మరణం పాలవగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. -న్యూస్‌టుడే, కొత్తవలస



శంకరరావు (పాతచిత్రం)

పోలీసుల వివరాల ప్రకారం.. వేపాడ మండలం కుమ్మపల్లికి చెందిన గొల్ల శంకరరావు(50) తన కుమారులు పదేళ్ల శంకర్, ఏడేళ్ల హరనాథ్, సోదరుడు దారప్పడుతో కలిసి ద్విచక్ర వాహనంపై విశాఖ బీచ్‌కు బయలుదేరారు. అరకు రహదారిలో తుమ్మికాపల్లి గేటు సమీపానికి చేరుకోగా, వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో నలుగురూ రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయమైన శంకరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. దారప్పడు తలకి తీవ్రగాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించి, కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన కుమారులను కానిస్టేబుల్ రమేష్ కొత్తవలస పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. సీఐ షణ్ముఖరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి మరో సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. చోదకుడు స్టేషన్‌లో లొంగిపోయాడు.

## జోరుగా హుషారుగా షికారు పోదుమా!

పాపికొండలను పోలిన తాటిపూడి బోటు షికారు

చుట్టూ పచ్చని కొండల నడుమ నీలాకాశంలో తేలియాడే మబ్బులు.. చల్లగాలి సుతిమెత్తగా మేనును తాకుతుండగా జలవిహారం చేస్తుంటే ఎంత హాయిగా ఉంటుందో కదూ..! మీరూ ఆ అనుభూతి పొందాలనుకుంటున్నారా.. ఆలస్యమెందుకు తాటిపూడి జలాశయం చూసొద్దాం రండి.

జలాశయంలో అందుబాటులో ఉన్న బోట్లు.. ధరలు ఇలా..

| బోటు | సంఖ్య | ధర (రూ.లలో) | ఎంతమంది వెళ్లొచ్చు |
|---|---|---|---|
| వాటర్‌ట్యాక్సీ | 2 | 100 | 25 |
| గల్ఫ్‌బ్రీచ్ | 1 | 150 | కుటుంబం |
| స్పీడ్‌బోట్లు | 3 | 250 | 5 |
| ఫన్‌యాక్ | 2 | 200 | 5 |
| పెడల్ బోట్లు | 4 | 100 | 2 |
| స్వేన్ | 2 | 150 | 2 |
| కయాక్ | 4 | 150 | 2 |

న్యూస్‌టుడే, తాటిపూడి(గంట్యాడ)

తాటిపూడిలోని గోస్తనీ నదిలో బోటు షికారుకు గ్రహణం వీడింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో ఇక్కడ బోటు షికారు ప్రారంభమైన విషయం తెలిసిందే. వాటర్‌స్పోర్ట్సు సింపుల్ సంస్థ దీనికి సంబంధించిన నిర్వహణ దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సంస్థ 18 బోట్లు నడుపుతోంది. గల్ఫ్‌బ్రీచ్‌లో కుటుంబం మొత్తం వెళ్లొచ్చు. పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలకు అనుకూలంగా ఉంటుంది. హంస, పెడల్, స్పోర్ట్సు తదితర బోట్లు అందుబాటులో ఉన్నాయి. వాటర్ ట్యాక్సీలో 25 మంది వరకు ప్రయాణించవచ్చు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పర్యవేక్షకుడు కృష్ణ తెలిపారు. ఇక్కడికి తాటిపూడిలో అరకు, బొర్రా, లంబసింగి, వంజంగి, పుణ్యగిరి, వైకుంఠగిరి పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.

## రెక్కల కష్టం.. రెప్పపాటులో మాయం

ఆరుగాలం చెమటోడ్చిన రెక్కల కష్టం క్షణాల్లో అగ్నికి ఆహుతైంది.. చేతికొచ్చిన పంట కాలి బూడిదవడంతో రోదిస్తోంది రైతు కుటుంబం. బాడంగి మండలం బొత్సవానివలస పంచాయతీ గదబవలస గ్రామంలో గొర్లె లక్ష్మికి చెందిన సుమారు రెండెకరాల వరి పంట కోత కోసిన తర్వాత పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మూడు కుప్పలు వేసి ఉంచారు. శనివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పంటంతా కాలిపోయింది. స్థానికులు అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. 40 క్వింటాళ్ల ధాన్యానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని మహిళా రైతు కన్నీరు పెట్టుకుంది. రెవెన్యూ అధికారులు చేరుకుని నష్టం అంచనా వేశారు. - న్యూస్‌టుడే, బాడంగి

కాలిన పంట వద్ద గదబవలస గ్రామానికి చెందిన మహిళా రైతు గొర్లె లక్ష్మి

## కన్ను పడితే కనుమరుగే!

అక్రమార్కుల కన్నుపడితే కొండలు, గుట్టలు, చెరువు గట్లు అన్న తేడా లేదు. యంత్రాంగం చూసీచూడనట్లు ఉండడంతో మట్టి, గ్రావెల్ తవ్వి యథేచ్ఛగా తరలించేస్తున్నారు. వంగరలోని పీహెచ్‌సీ సమీపంలో కొండల దుస్థితి ఇందుకు నిదర్శనం. అక్రమార్జనే అజెండాగా అక్రమార్కులు గ్రావెల్ తవ్వి తరలించేస్తున్నారు. రూ.లక్షలు దోచేస్తూ.. పచ్చని కొండలు తొలిచేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ పరిశీలకుడు రామారావు తెలిపారు. - న్యూస్‌టుడే, వంగర

## ఏళ్లుగా నిరీక్షణ.. వారధులు పూర్తయ్యేనా?

న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం

గత వైకాపా ప్రభుత్వం వంతెనల నిర్మాణం గాలికొదిలేసింది. పనులు నత్తతో పోటీ పడుతూ ప్రజలకు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. కూటమి రాకతో కొన్నింటికి కదలిక వచ్చినా.. మరికొన్ని వేధిస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో దీనిపై ప్రస్తావించారు. అంచనాలు పెంచి తాజాగా ప్రతిపాదనలు పంపారు.

నిర్మాణంలో భోజరాజపురం వంతెన

### ఇదీ పరిస్థితి..

- బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లతో పనులు సాగుతునే ఉన్నాయి. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తయ్యే అవకాశం ఉంది.
- ఇదే నదిపై భోజరాజపురం వద్ద రూ.15 కోట్లతో వారధి మూడేళ్ల కిందట ప్రారంభమై పునాదికే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం నిధులివ్వడంతో మళ్లీ ప్రారంభమయ్యాయి. ఏప్రిల్‌కల్లా పూర్తయ్యే అవకాశం ఉంది.
- రామభద్రపురం మండలం పాతరేగ-కొత్తరేగ మధ్య ఏడొంపుల గెడ్డపై కాజ్‌వే నిర్మాణానికి మూడేళ్ల కిందట రూ.2 కోట్లు మంజూరు చేసినా పనులు చేయలేదు. తాజాగా మరో రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పెట్టారు.
- కోటశిర్లాం- దుప్పలపూడి మధ్య కాజ్‌వే కోసం రెండేళ్ల కిందట రూ.2 కోట్లు మంజూరైనా పనులు పూర్తి కాలేదు. మళ్లీ రూ.2.20 కోట్లతో ప్రతిపాదనలు పెట్టారు. కొండకెంగువ నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు ఏడొంపులగెడ్డపై మరో కాజ్‌వేకు రూ.2 కోట్లు వచ్చినా పనులు కాలేదు. తాజాగా రూ.3 కోట్లతో అంచనాలు పంపారు.

అసంపూర్తిగా నిలిచిపోవడంతో అవస్థలు

### వంతెన పూర్తికాక ఇబ్బందులు..

వర్షాకాలమొస్తే చాలు నదీ తీర ప్రాంత వాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మండల కేంద్రానికి వెళ్లాలన్నా, పొలం పనుల కోసం వెళ్లినా నది దాటాల్సిందే. చివరకు పాఠశాల చిన్నారులు కూడా భయం గుప్పెటలో నదిని దాటుతున్నారు. నదుల్లో కొట్టుకుపోతున్న సందర్భాలు లేకపోలేదు. నిర్మాణాలకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులు ప్రారంభించారు. బిల్లుల చెల్లింపుల్లో గత ప్రభుత్వం జాప్యం చేయడంతో మధ్యలో ఆపేశారు.

### తాజా ప్రతిపాదనలు వెళ్లాయి..

అపరిష్కృతంగా ఉన్న వంతెనల దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కొత్త అంచనాలతో ప్రతిపాదనలు పంపించాం. కొన్నింటికి నిధులు రావడంతో పనులు జరుగుతున్నాయి. మరికొన్ని వచ్చిన వెంటనే చేస్తాం.
- అప్పలరాజు, జేఈ, ర.భ.శాఖ, రుక్మాంగధనాయుడు ఏఈ, పంచాయతీరాజ్

కోట శిర్లాం- దుప్పలపూడి మధ్య వంతెనలేక అవస్థలు

- బాడంగిలోని గొల్లాది వద్ద రూ.15 కోట్లతో టెండర్లు మాత్రమే అయ్యాయి.
- తెర్లాంలోని కుసుమూరు -జనార్దనవలస వద్ద వేగావతి నదిపై రూ.12 కోట్లు మంజూరైనా పనులు చేయలేదు. 2022లో శిలాఫలకం వేసి వదిలేశారు.

## డిసెంబరు 10న దరఖాస్తు.. నవంబరు 28న పరిష్కారం!

పీజీఆర్ఎస్‌లో విజయనగరం నగరపాలక సంస్థ ఘనత

ఈనాడు, విజయనగరం

జిల్లాలోని ఓ పౌరుడు నగరంలోని ఓ సమస్య పరిష్కారానికి డిసెంబరు 10న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా.. ఇదే ఫిర్యాదుపై నవంబరు 28న ఆ సమస్య పరిష్కరించినట్లు దరఖాస్తుదారుడికి సమాచారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలో అన్ని ఫ్లెక్సీలు తొలగించాలని కోరుతూ కంటోన్మెంటుకు చెందిన వి.చైతన్యబాబు ఈ నెల 10న పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు అందజేశారు. ఆర్అండ్‌బీ కూడలి, కంటోన్మెంట్ ప్రాంతంలో తమకు నచ్చిన వారి ఫ్లెక్సీలు తొలగించకుండా వదిలేశారని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అందులో పేర్కొన్నారు. దీన్ని నవంబరు 28న పరిష్కరించినట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి విచారణ నివేదికను ఉన్నతాధికారులు, దరఖాస్తుదారుడికి పంపించగా విస్తుపోయారు. తనను విచారించకుండా, ఫొటో తీయకుండా, సంతకం చేయకుండా నివేదిక సమర్పించారని దరఖాస్తుదారుడు 'ఈనాడు' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సీఎంకి లేఖరాస్తానని ఆయన చెప్పారు.



విచారణ నివేదిక

నగరంలో తొలగించామని పురపాలక అధికారులు చెబుతున్న ఫ్లెక్సీలు ఇలా..

## చౌరస్తాల్లో.. వనితల చాయ్‌రస్తాలు

- మెప్మా ఆధ్వర్యంలో స్టాళ్ల ఏర్పాటు

న్యూస్‌టుడే-రాజాం

మహిళల ఆర్థికాభివృద్ధి, స్వావలంబన సాధించేలా.. చాయ్‌రస్తా ఫ్రాంఛైజ్ యూనిట్ల ఏర్పాటుకు మెప్మా అడుగులు వేస్తోంది. బ్యాంకు రుణం అందించి.. నెలనెలా రూ.వేలల్లో ఆదాయం అందుకునేలా ఆర్థిక భరోసా ఇచ్చేలా ప్రణాళికలు వేస్తోంది. విజయనగరం, రాజాం, బొబ్బిలి, నెల్లిమర్ల పట్టణాల్లో ఆసక్తి ఉన్న మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బ్రాండ్ ఇమేజ్‌తో వీటిని తీర్చిదిద్దనున్నారు. శుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన టీ, కాఫీ అందిస్తారు. గ్యాస్ అవసరం లేకుండా బటన్ నొక్కితే చాలు. . టీ, కాఫీ వచ్చేలా యంత్రాలను పెడతారు. పెట్టుబడి రూ.6.60 లక్షలు, ముడి సరకుకు రూ.50వేలు ఉండాలి. తొలివిడతలో 46 యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం.

### శిక్షణ.. దరఖాస్తు..

ఈ కేంద్రాల్లో పలు రకాల టీలను తక్కువ ధరకే అందుబాటులోకి తెస్తారు. కాఫీ, టీ, బూస్ట్, బోర్నవిటా, హార్లిక్స్, ఇలా ఏ తేనీరు అయినా రూ.20-30 గానే ధర నిర్ణయించారు. దరఖాస్తు చేసుకున్న మహిళలకు వీటి తయారీ, సరఫరా, నిర్వహణపై మూడు రోజుల పాటు గుంటూరు, విజయవాడల్లో శిక్షణ ఇస్తారు. అనంతరం అవుట్‌లెట్లను నలుగురు మహిళలు కలిసి నిర్వహించొచ్చు. 80-100 అడుగుల స్థలంలో కంటైనర్ స్టాల్ ఏర్పాటు చేస్తారు. మెప్మాకు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు 18-55 ఏళ్ల మధ్య ఉండాలి.

### సద్వినియోగం చేసుకోవాలి

రస్తా ఫ్రాంఛైజ్ యూనిట్లతో మంచి లాభాలు వస్తాయి. పెట్టుబడికి అవసరమైన నిధి బ్యాంకు నుంచి రుణం ఇప్పిస్తాం. సాంకేతిక, ఇతర సాయం సదరు సంస్థ అందిస్తుంది. నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- చిట్టిరాజు, పీడీ, మెప్మా

రోజుకు అమ్మకాలు.. లాభం ఇలా.. (రూ.ల్లో)

| విక్రయం | లాభం |
|---|---|
| 6,000 | 40,000 |
| 10,000 | 80,000 |
| 15,000 | 1,35,000 |
| 20,000 | 1,90,000 |
| 25,000 | 2,45,000 |

ఏర్పాటు ఎక్కడ..
- రద్దీ ప్రాంతాల ఎంపిక
- పట్టణాల్లో ఇప్పటికే చాలా వరకూ స్థలాల గుర్తింపు.
- బస్టాండ్లు, విద్యాసంస్థలు, వాణిజ్య కూడళ్లు, ఆసుపత్రులు, మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు

పట్టణాల్లో ఇలా...

| పట్టణం | సంఘం | సభ్యులు |
|---|---|---|
| విజయనగరం | 5,468 | 57,949 |
| బొబ్బిలి | 1,445 | 16,548 |
| నెల్లిమర్ల | 626 | 6,852 |
| రాజాం | 880 | 9,207 |

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..

ప్రకటనలపై ప్రత్యేకం 5% తగ్గింపు
నిర్యాణం, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ఈనాడు ప్రకటనల విభాగం
9000866020, 8008597609

(c) eenadu

# ఇక్కడ అందానికి.. అక్కడ ఆపదకు!!

1 పార్వతీపురంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన అద్దం

2 చిదిమి కూడలి వద్ద పెట్టారిలా..

ఈ చిత్రాల్లోని అద్దాలను చూశారా.. చూసేందుకు ఒక్కలా ఉన్నాయి కదూ.. వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ రెండు విభిన్న అంశాలకు సంబంధించినవే. 1. విద్యార్థులు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు మన్యంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో 'ముస్తాబు' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో వచ్చిన పలు కథనాలకు దాతలు స్పందిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆదిత్య కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు జిల్లాలోని రెండు ఎస్సీ వసతి గృహాలకు ఇటీవల రూ.7 వేల విలువైన ముస్తాబు సామగ్రిని అందజేశారు. పార్వతీపురం, మరిపివలస కేంద్రాలకు సమకూర్చారు. ఇందులో 'పెద్ద అద్దాలు ఉండడంతో చిన్నారులు సంబర పడుతున్నారు. 2. పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో మలుపులు, అనుసంధాన ప్రాంతాలు అధికం. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నివారణలో భాగంగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఇలా ఎక్కడికక్కడే అద్దాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో వాహనాల చిత్రాలు కనిపిస్తే కాస్త అప్రమత్తమయ్యే అవకాశం ఉంటుంది. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం,పాలకొండ, వీరఘట్టం

## రైతు కళ్లల్లో ఉప్పొంగిన గంగ

ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్ల పాలైంది. దీంతో రైతు కళ్లల్లో కన్నీరు ఏరులై పారింది. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి తౌడు జబీవల పండిన ధాన్యాన్ని సమీపంలోని మిల్లుకు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం ట్రాక్టరు ద్వారా తీసుకెళ్తుండగా అదుపు తప్పి బస్తాలతో సహా రహదారి పక్కనున్న చెరువులోకి బోల్తా కొట్టింది. పంటంతా తడిసిపోవడంతో బోరుమన్నారు. ఇప్పుడెలా అమ్మేది అని వాపోయారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

చెరువులో పడిన ట్రాక్టరు, నీటిలో ధాన్యం బస్తాలు

## ఒరిగింది.. ఉరికిస్తోంది!!

డంపింగ్‌యార్డు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

సాలూరు పురపాలిక పరిధిలోని డంపింగ్‌యార్డు సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇటువైపు రోజూ విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ నాగేశ్వరరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పరిశీలించి, వెంటనే సరిచేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు

## అమ్మవారి సేవలో అదనపు న్యాయమూర్తి

న్యాయమూర్తి షణ్ముఖరావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరాజు, అధికారులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారిని అదనపు జిల్లా న్యాయమూర్తి(రాజాం) జి.షణ్ముఖరావు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని ఇచ్చారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: బాపట్లలోని క్రీడా మైదానంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శృంగవరపుకోటకు చెందిన ఎం.సూర్యనారాయణ మూర్తి రెండు స్వర్ణాలు, ఒక రజత పతకం సాధించారు. జిల్లా తరఫున 45+ విభాగంలో పాల్గొని జావెలిన్ త్రో, డిస్క్ త్రో, హేమర్ త్రోలో మెరిశారు. ఈయన ఎస్.కోటలో 108 అంబులెన్సు పైలెట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ధ్రువపత్రం అందుకుంటున్న మూర్తి

# నష్టాలను ఆప్కోవాలని!!

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

గత ప్రభుత్వం ఆప్కో వస్త్ర వాణిజ్య మండలిని పూర్తిగా గాలికొదిలేసింది. నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను కొనుగోలు చేయకపోవడం, సకాలంలో చెల్లింపులు జరగక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈక్రమంలో కార్మికులు, సిబ్బందితో పాటు దుకాణాలు సైతం తగ్గాయి. అంతేకాకుండా వస్త్ర ప్రియులకు కావాల్సిన దుస్తులు కూడా అందేవి కావు. ఈ నేపథ్యంలో సంస్థ గత అయిదేళ్లలో లక్ష్యాలను చేరుకోలేకపోయింది. దీంతో గాడిలో పెట్టేందుకు కూటమి చర్యలు తీసుకుంటోంది. క్రిస్మస్, సంక్రాంతికి పెద్దఎత్తున అమ్మకాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు రాయితీలు ఇవ్వాలని సూచించింది. ఇప్పటికే విజయనగరం రీజియన్ పరిధిలో రూ.70 లక్షల సరకు కొనుగోలు చేశారు.

**రీజియన్ పరిధిలో లక్ష్యాల పెంపు**

### రూ.7.20 కోట్ల లక్ష్యం..

రీజియన్ పరిధిలో విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి. ఆ ప్రాంతాల్లోని దుకాణాలకు ఈ ఏడాది రూ.7.20 కోట్ల అమ్మకాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు రూ.1.20 లక్షలు మాత్రమే అమ్ముడయ్యాయి. పండగల సమయంలో రూ.3 కోట్ల మేర చేపట్టాలని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే కొత్త రకం నేత దుస్తులను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులంతా నేత వస్త్రాలనే కొనాలని ఇప్పటికే ప్రభుత్వం కోరింది.

ఆప్కో కేంద్ర కార్యాలయంలోని దుకాణం

**ఆన్‌లైన్ విధానంలో..** మార్కెటింగ్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ప్రభుత్వం జతకట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్ర తదితర వాటితో ఒప్పందం చేసుకుంది. నేతన్నలు తయారు చేసే వస్త్రాలను అందులో అమ్ముకునేందుకు అవకాశం కల్పించింది.

### 200 రకాలు..

లక్ష్యాలను అధిగమించి, నష్టాలను తగ్గించేందుకు ఈసారి 200 రకాల వరకు దుస్తులను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, కోల్‌కతా, బెంగళూరు తదితర ప్రాంతాల్లో తయారైన పట్టు చీరలను సైతం దుకాణాల్లో ఉంచారు. ఒక్కో షోరూమ్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు సరకు ఉంది.

### తగ్గిన దుకాణాలు..

రీజియన్ పరిధిలో వైకాపా అధికారంలోకి రాకముందు 27 ఆప్కో దుకాణాలుండేవి. ఇందులో నాలుగు వరకు పెద్ద మాల్స్. ప్రస్తుతం అన్నింటి సంఖ్య 18కి చేరింది. రెండు మాల్స్ మూతబడ్డాయి. సిబ్బంది కూడా తగ్గిపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు లేరు. పొరుగు సేవల సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

**ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు..** సంక్రాంతికి అపార్టుమెంట్లు, జన సముదాయం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్టాళ్లు వేయనున్నాం. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేపడతాం. నేతన్నలకు మరో రూ.12 లక్షల వరకు బకాయిలు అందాలి. ప్రస్తుతం ఉన్న రకాల్లో ఒక్కోదానిపై 30 నుంచి 40 శాతం వరకు రాయితీలు అందిస్తున్నాం. సద్వినియోగం చేసుకోవాలి. – మురళీకృష్ణ, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి, ఆప్కో

## రాజాంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని పాలకొండ రహదారిలో సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం ప్రారంభించారు. పురపాలిక వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇలాంటి మాల్స్ రావడం ఆనందంగా ఉందన్నారు. యాజమాన్యాన్ని అభినందించారు. ఇది తమ 44వ షోరూమ్ అని సీఎంఆర్ సంస్థల ఛైర్మన్ మావూరి వెంకట రమణ తెలిపారు. అన్ని వర్గాలకు అనుకూలమైన ధరల్లో దుస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కొత్తా శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త చెలికాని జగన్నాథస్వామి, సీఎంఆర్ ఎండీ మోహన్‌బాలాజీ, జీఎం ఎన్.లింగమూర్తి పాల్గొన్నారు.

రిబ్బన్‌ను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, చిత్రంలో సీఎంఆర్ సంస్థల ఛైర్మన్ మావూరి వెంకటరమణ, పారిశ్రామికవేత్తలు తదితరులు

**PUBLIC NOTICE**

Under the instructions of my client **M/s. SHRIRAM FINANCE LIMITED, Maharani Peta Branch, Visakhapatnam,** I issue the following notice to general public. My client intends to grant loan **M/s. SRI BALAJI INDUSTRIES,** a partnership firm represented by its Managing Partner **Mr. MADDIPATLA RAYAPPA SUBRAHMANYAM** S/o Late M Gopala Krishna Murthy by keeping the below mentioned schedule property as security by way of Registered Mortgage. As such if any one has any claims, charges, mortgages, Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices, otherwise, later objections will not bind my client in this regard.

**SCHEDULE OF THE PROPERTY**

Vizianagaram District, Bobbili Mandalam, Bobbili Sub-District, Mettavalasa Village, APIIC -AKA, Bobbili, Plot No.156/E an extent of 4813.85 Sq. yards or 4025 Sq. meters of site together with RCC building consisting of ground, first and second floors with plinth area of 6000 SFT, Power and Generator sheds with total plinth area of 859 SFT, production block consisting of ground plus three upper floors with total plinth area of 7017 SFT, is bounded by:

| | |
|---|---|
| EAST | Plot No.156/D |
| SOUTH | Private boundary |
| WEST | Plot No.156/F |
| NORTH | 30 meters wide road |

**KODURI SREENIVASA RAO**
**SMT. SIVA KUMARI JALADI**
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu Bazar, Seethammadhara, Visakhapatnam-13.
VISAKHAPATNAM Dt.13.12.2025.
**Cell No.9885166648**
Mail: sreenivaskoduri@gmail.com

## దరఖాస్తుల ఆహ్వానం

కురుపాం గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పీడీ పోస్టును గెస్టు లెక్చరర్ పద్ధతిలో భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీవరం ఆదివారం తెలిపారు.

**చికెన్ ధరలు**

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 135 | 240 | 250 |

## రాత్రికిరాత్రే అయిదు దేవాలయాల్లో చోరీ

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం బానాది పంచాయతీలోని అయిదు దేవాలయాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. స్థానికులు, అర్చకుడు ఎం.కిశోర్ శర్మ, వల్లంపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పొలిమేరల్లోని శివాలయం, వినాయక మందిరం, ఆంజనేయస్వామి గుడి, పరదేశమ్మ, మరిడి మాంబ అమ్మవార్ల ఆలయాల్లోని హుండీలను కొల్లగొట్టారు. వెండి వస్తువులను వదిలేసి కేవలం నగదు మాత్రమే తీసుకుని ఉడాయించారు. చోరీకి గురైన సొమ్ము సుమారు రూ.41 వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేయగా, రూ.2 లక్షలని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలు సేకరిస్తున్నారని ఎస్సై సుదర్శన్ తెలిపారు. బానాది- ఆనందపురం రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించనున్నట్లు చెప్పారు.

## 25 టన్నుల బియ్యం పట్టివేత

పాచిపెంట, న్యూస్‌టుడే: ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.9.50 లక్షల విలువైన 25 టన్నుల(500 బస్తాలు) బియ్యాన్ని పాచిపెంట మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంకట సురేశ్ వివరాల ప్రకారం.. ఒడిశా ప్రాంతానికి శనివారం రాత్రి బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. పి.కోనవలస చెక్‌పోస్టులో సిబ్బంది, వీఆర్వోలు శ్రావణి, రామారావుతో కలిసి తనిఖీలు చేపట్టారు. లోడ్‌తో వస్తున్న లారీ చోదకుడ్ని ప్రశ్నించగా పార్వతీపురం మండలం తాళ్లబురిడికి రామకృష్ణా రైస్ మిల్లు నుంచి జయపూర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని కేసు నమోదు చేసి, సరకును పాచిపెంట సీఎస్‌డీటీ హేమలతకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన లారీతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

## ఆశ్రమ పాఠశాలలో బాలిక ఆత్మహత్యాయత్నం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం మండలంలోని ఓ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని వసతిగృహంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆశ్రమ పాఠశాలలో ఇటీవలి ఎఫ్ఏ-1 పరీక్షలు జరిగాయి. సదరు బాలిక కాపీకొట్టి మార్కులు తెచ్చుకుందంటూ తోటి విద్యార్థులు హేళన చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బాత్‌రూమ్ క్లీనర్ తాగింది. కడుపునొప్పి రావడంతో పాఠశాల సిబ్బంది తొణాం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సాలూరు ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఏటీడబ్ల్యూవో కృష్ణవేణి చరవాణిలో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

## వెటరన్.. అదిరెన్

బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి వెటరన్ ఛాంపియన్‌షిప్ పోటీలు విజయనగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వివిధ కేటగిరీల్లో 35 నుంచి 70 ఏళ్ల వయసుగల వారు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో తలపడ్డారు. విజేతలకు బ్యాడ్మింటన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ.నాయుడు బహుమతులను అందజేశారు. వారంతా వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 26 వరకు నగరంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంటుకు అర్హత సాధించారని చెప్పారు. సంఘ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు పొందిన విజేతలతో కేవీ.నాయుడు తదితరులు

## నగరంలో మెగా ట్రేడ్ ఫెయిర్

విజయనగరం చరిత్రకు చిరునామా అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లీ పేరడైజ్ మైదానంలో వివిధ వర్తక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన మెగా ట్రేడ్ ఫెయిర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. వందల రకాల వస్తువులు, పరికరాలు, పదార్థాలు ఒకే చోట అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. అనంతరం స్టాళ్లను సందర్శించారు. హోల్‌సేల్, రిటైల్ ధరలకే లభిస్తాయన్నారు. ఈనెల 16 వరకు అందుబాటులో ఉంటుందని ఫెయిర్ నిర్వాహకులు ముఖేష్, రమేష్, కృష్ణ, రాకేష్, ప్రదీప్ తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## ఎన్‌టీఏలో ఎస్టీయూ నాయకుల చేరిక

ఎమ్మెల్సీ చిరంజీవిరావుతో సంఘం నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎస్టీయూ మాజీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుమరాన జోగారావు, సీహెచ్.సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.మురళీతో సహా 23 మంది కార్యవర్గ సభ్యులు సంఘానికి రాజీనామా చేశారు. వారంతా ఆదివారం నగరంలోని ఏపీఎన్జీవో హోంలో నిర్వహించిన ఎన్‌టీఏ(నోబుల్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సమక్షంలో అసోసియేషన్‌లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కె.జోగారావు, ప్రధాన కార్యదర్శి బి.గోవింద నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లుగా చిప్పాడ సూరిబాబు, ఎం.మురళీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.చిరంజీవినాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.రాంబాబు, ఉపాధ్యక్షుడిగా జి.రవి, అదనపు ప్రధాన కార్యదర్శిగా పడాల లక్ష్మణరావు, ఆర్థిక కార్యదర్శిగా పి.మహేష్, సీపీఎస్ కన్వీనర్‌గా బి.ఈశ్వరరావు తదితరులకు పదవులు లభించాయి. ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బి.హైమారావు వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

## 19న సుపరిపాలన యాత్ర

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి మట్టా ప్రసాద్ అన్నారు. ఈనెల 19న విజయనగరంలో సుపరిపాలన యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. యాత్రలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని చెప్పారు. వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, నాయకులు కోటగిరి నారాయణరావు, కుసుమంచి సుబ్బారావు, పతివాడ రాజేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న మట్టా ప్రసాద్, రాజేష్‌వర్మ, రెడ్డి పావని, సుబ్బారావు తదితరులు

## ప్రాబబుల్స్ జట్లకు 60 మంది ఎంపిక

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాలబాలికల(జూనియర్స్) ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 19 నుంచి 21 వరకు ప్రకాశం జిల్లాలో, 24 నుంచి 26 వరకు సీనియర్స్ టోర్నమెంటు గుడివాడలో జరగనున్నాయి. ఆయా పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఆదివారం విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. రన్నింగ్, ఛేజింగ్, పోల్‌టచ్ విభాగాల్లో 20 మంది చొప్పున 60 మంది క్రీడాకారులను ప్రాబబుల్స్ జట్లకు ఎంపిక చేశారు. ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమలనాభరావు, గోపాలరావు పాల్గొన్నారు.

ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారిణులు

## నగరంలో ఒకేసారి 400 మంది పోలీసుల తనిఖీలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా విజయనగరం జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. ఒకేసారి 400 మంది సిబ్బంది, అధికారులు తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 వరకు 80 ప్రాంతాల్లో నలుగురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, 350 మంది సిబ్బంది దాడులు చేశారని ఎస్పీ దామోదర్ తెలిపారు. పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశామని, శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న సైలెన్సర్లను తొలగించినట్లు చెప్పారు. మైనర్ డ్రైవింగ్, శిరస్త్రాణం ధరించని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం తాగి నడుపుతున్న 50 మంది అరెస్టు చేశామని వెల్లడించారు.

గంటస్తంభం వద్ద ప్రజలు, చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## శ్రీరాం విద్యాపీఠం పూర్వ విద్యార్థుల సందడి

గరివిడిలోని శ్రీరాం విద్యాపీఠం విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానికంగా ఉన్న ఓ వేడుకా మందిరంలో జరిగింది. విద్యాపీఠం పరిధిలోని శ్రీరాం ఉన్నత పాఠశాల, గోదావరి దేవి సరాఫ్ ఉన్నత పాఠశాల, శ్రీరాం జూనియర్ కళాశాల, ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో చదివిన 150 మంది పూర్వ విద్యార్థులు ఒకే చోట చేరి ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వెంకటేశ్వరరావును, ఐవీఎఫ్ జిల్లా సంఘం ఉపాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మరో పూర్వ విద్యార్థి గుప్తాను సన్మానించారు. – న్యూస్‌టుడే, గరివిడి

వేదికపై నృత్యం చేస్తున్న మహిళలు

**EENADU Classifieds**

**EDUCATION**
Professional English Training Projects at schools, Colleges, Hotels & Corporate Offices CONVO English Club C:7286099991.

**PROFESSIONAL SERVICES**

**ASTROLOGY**
శ్రీ గాయత్రీ జోతిష్యం. 25 సం VZMలో స్థిరపడి ఉన్నారు. విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్యం, మీకు ఎటువంటి సమస్యలున్నా ✆ 9701778711.

**REAL ESTATE**

**FLAT FOR SALE**
Mudidam 4KM from VZM Vijaya Residency F Nos. 101, 202, 304, 910 + 80 Sft. Ready to Occupy 25 Lakhs. ✆ 9440306999, 9441716590

**JOBS**
విజయనగరంలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతీయువకులు కావలెను. జీతం- 10,000-13,500. Ph: 9030588502, 9154296345

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయసు. యువతి, యువకులు కావలెను. జీతం: 10,000-13,500 ఫుడ్, రూము 9704637370, 9949904532.

**FACULTY/ TEACHERS**
Faculty for B.Sc Nursing College O:M.Sc(Nursing), B.Sc(Nursing) Candidates C:8008083353,7799772299 EMail:balajee.nursing@gmail.com

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

**SECURITY GUARDS**
జైగణేష్ సెక్యూరిటీ సంస్థలో విశాఖ స్టీల్‌ప్లాంటు ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 150 మంది 8 గం|| డ్యూటీ. జీతం: 18815/- PF, ESI. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ 11 మంది (Ex-Service) జీతం: 22690/- సెక్యూరిటీ ఆఫీసర్ (Ex or Rtd పోలీస్ ఆఫీసర్) జీతం: 30000/- యూనిఫామ్-ఫ్రీ. ✆ 63091 17776.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

# బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

## భగవద్గీత శ్లోకపఠన పోటీలు

రాజాం, న్యూస్‌టుడే: మండలంలోని విద్యార్థులకు శ్రీవిజయ కోదండాశ్రమం ఆధ్వర్యంలో వికాసతరంగిణిలో భగవద్గీత శ్లోకపఠన పోటీలు ఆదివారం జరిగాయి. మూడు విభాగాల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వైద్యుడు డా.జీసీ హేమంతరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వికాసతరంగిణి అధ్యక్షుడు వి.వెంకటపైడిరాజు, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న హేమంతరావు

## తెరపై ఈనాడు

● లక్ష్మి థియేటర్: **మోగ్లీ** ● వాసవి: **రాజు వెడ్స్ రాంబాయి** ● టీబీఆర్ స్క్రీన్-1: **అఖండ-2** ● టీబీఆర్ స్క్రీన్-2: **అఖండ- 2** – న్యూస్‌టుడే, బొబ్బిలి
● ఎస్వీసీ సీతారామా: **మోగ్లీ** ● ఎస్వీసీ సీతారామా మినీ: **డ్రైవ్** ● ఎస్వీసీ అప్సర: **అఖండ-2**
– న్యూస్‌టుడే, రాజాం

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

| | |
|---|---|
| బొబ్బిలి | 80085 74367 |
| గజపతినగరం | 80085 74332 |
| రాజాం | 80085 74308 |
| గరివిడి | 80085 74348 |

? పట్టణంలోని కోవెలవీధిలో మురుగు రోడ్డుపై ఉంది. చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. అనారోగ్యం బారిన పడుతున్నాం. - **స్థానికులు** ★ చర్యలు చేపడతాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** రాజాం పట్టణం, న్యూస్‌టుడే

? భూపాలరాజపురం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతోంది. చర్యలు తీసుకోవాలి. - **స్థానికులు** ★ ఉన్నతాధికారులకు నివేదిస్తాం. - **వెంకటరావు, ఎంఈవో**
– న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? గింజేరు గ్రామంలో కాలువల్లేక మురుగు రోడ్డెక్కుతోంది. - **స్థానికులు** ★ పరిశీలించి చర్యలు చేపడతాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – గంట్యాడ గ్రామీణం

? నాయుడువలస, పాలవలస గ్రామాల్లో కాలువలు పాడయ్యాయి. వర్షమొస్తే నీరు రోడ్డుపైకి వస్తోంది. - **స్థానికులు** ★ కాలువల నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. - **రమేష్, ఏఈ**
– న్యూస్‌టుడే, రామభద్రపురం

? గొల్లుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద వ్యర్థాల గుట్టలు పేరుకుపోయాయి. - **స్థానికులు** ★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **గిరిబాల, ఎంపీడీవో**
– న్యూస్‌టుడే, బొండపల్లి

## బ్యాడ్మింటన్‌లో బొబ్బిలి సత్తా

పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో ఆదివారం జిల్లా స్థాయిపోటీలు నిర్వహించారు. డబుల్స్‌లో 50 ప్లస్ విభాగంలో బొబ్బిలికి చెందిన సత్యనారాయణ, రామకృష్ణ విజేతగా, సుంకరి సాయిరమేష్, గంగరాజు రన్నర్‌గా నిలిచారు. 55 ప్లస్ సింగిల్స్ విభాగంలో సుంకరి సాయిరమేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

రాజాం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పెంటాథ్లాన్ క్రీడా పోటీలకు జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థి కె.కార్తీక్ ఎంపికైనట్లు పీడీ చీకటి కేశవనారాయణ రావు తెలిపారు. శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు తెలిపారు. డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు డా.ఎం.పురుషోత్తమరావు, సీహెచ్ రవీంద్రకుమార్‌లు విద్యార్థిని అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు, పీడీ

## 16న మెగా ఉద్యోగ మేళా

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వం ఐటీఐలో ఈనెల 16న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐలు సంయుక్తంగా మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంతకుమార్ తెలిపారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పాసైన 18-35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ముందుగా https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 96187 92572, 99888 53335కు సంప్రదించాలన్నారు.

## ఆఖరి మజిలీకి అంతులేని అవస్థలు

గరివిడి, చీపురుపల్లి, గుర్ల, న్యూస్‌టుడే: చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో అంతిమయాత్రకు అష్టకష్టాలు ఎదురవుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక, రహదారులు కరవై దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో రహదారిపై ఓ మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేసిన ఘటన శ్మశాన వాటికల దయనీయ స్థితిని తెలియజేస్తుందంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది.

అధ్వాన రహదారిలో మృతదేహాన్ని మోసుకెళ్తూ..

### దహనానికీ తిప్పలే...

చీపురుపల్లి, గరివిడి, గుర్ల నియోజకవర్గాల్లోని మరుభూములు తుప్పలు, ముళ్ల పొదలతో చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. ప్రహరీల్లేక పశువులకు, పందులకు ఆవాసాలుగా మారాయి. కొంతమంది పట్టణాలు, గ్రామ శివార్లలో ఉన్న మరుభూములను ఆక్రమించి పంట పొలాలుగా మార్చేస్తున్నారు. దీంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

■ చీపురుపల్లిలో 11 శ్మశానాలు ఉండగా అయిదింటికి మాత్రమే నీటి సదుపాయం, దహన సంస్కారాలకు షెడ్లు ఉన్నాయి. రెడ్డి పేట, కొత్తకుమ్మరికాలనీ, జి.అగ్రహారం-2, వంగపల్లిపేట, కొత్తఅగ్రహారంలోని శ్మశానాల్లో చివరి ఘట్టానికి అవస్థలు తప్పడం లేదు. జి.ములగాంలో రుద్రభూమికి వెళ్లాలంటే రేగాన గెడ్డను దాటాల్సిందే.

■ గరివిడి నియోజకవర్గంలో దేవాడ శ్మశానవాటికకు చెందిన భూముల్లో దాదాపు 2 ఎకరాల భూమి ఆక్రమించి పంట పొలాలుగా మార్చారు. సర్వే చేసిన రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. పట్టణంలో రామేశ్వరకాలనీ, కొండపాలెం శ్మశానవాటికలకు సరైన దారిలేక అధ్వానంగా ఉన్నాయి. విశ్వభారత్ సేవా ట్రస్టు వారి సహకారంతో ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గుర్లలోనూ ఇదే పరిస్థితి.

**ప్రతిపాదనలు చేస్తున్నాం..:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ఎలాంటి సదుపాయాలు కల్పించాలనే అంశాలు గుర్తించి సమగ్ర ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తాం. - **కె.హేమసుందరరావు, డీడీవో, చీపురుపల్లి డివిజన్**

## కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త

బొండపల్లి మండలంలోని దేవుపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్థానికులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. పాఠశాలకు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు. సమస్యను డిప్యూటీ ఎంపీడీవో రఘువరరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, బొండపల్లి

## శిథిలం.. నిరుపయోగం

రాజాం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆర్‌అండ్‌బీకి చెందిన పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. స్థలం నిరుపయోగంగా మారింది. ఇదే అదనుగా కొందరు ఆక్రమణలకు యత్నిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ స్థలంలో భవనాలు నిర్మించి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

## అధ్వాన రహదారితో ఇక్కట్లు

గుర్ల మండలం పీఆర్‌పేట నుంచి కోటగండ్రేడు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు బాగులేకపోవడంతో గుర్ల మీదుగా వెళ్లాల్సి వస్తోందని దీంతో పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. విషయం ఎంపీడీవో రవిశంకర్ వద్ద ప్రస్తావించగా జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామన్నారు. –న్యూస్‌టుడే, గుర్ల

## దారి దారుణం.. ప్రయాణం నరకం

తెర్లాం మండలంలోని పణుకువలస కూడలి నుంచి వంతరాం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. అమిటి వంతెన సమీపంలో రోడ్డు గుంతలతో రాళ్లు తేలిపోయాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువైపు ప్రయాణమంటేనే భయపడుతున్నారు. రూ. 3.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులొచ్చిన వెంటనే పనులు చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ అప్పలరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, తెర్లాం

## తుప్పల్లో నియంత్రణ ఎలా?

పెదమజ్జిపాలెం గ్రామంలో విద్యుత్తు నియంత్రిక తుప్పల్లో దర్శనమిస్తోంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే పరిష్కారానికి దీన్ని ఏర్పాటు చేశారు. దీనికి రక్షణ కంచె లేకపోవడం, నిర్వహణ గాలికొదిలేయడంతో చుట్టూ పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. సిబ్బంది అక్కడికి వెళ్లలేని పరిస్థితి. ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

## అండగా ఉంటాం.. ఆదుకుంటాం

తెర్లాం, న్యూస్‌టుడే: కె.సీతారాంపురం అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఆదివారం గ్రామంలో బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సొంత నిధులతో సమకూర్చిన దుస్తులు, నిత్యావసరాలు, కొంత నగదు అందజేశారు. ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ, తెదేపా మండలాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, నాయకులు శంకరరావు, శ్రీనివాసరావు, జగ్గారావు, అప్పలనాయుడు ఉన్నారు. ★ గొలుగువలసలో అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతుకు సాయం అందజేశారు. ★ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో 12 బాధిత కుటుంబాలకు వంట సామగ్రి, టార్పాలిన్లు, దుప్పట్లు తదితరాలు అందజేశారు. ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ★ బొబ్బిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, పార్టీ మండలాధ్యక్షుడు మరడాన రవి, జనసైనికులు బాధితులను పరామర్శించి, నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. పి.అప్పారావు, వి.రామకృష్ణ ఉన్నారు. ★ రెవెన్యూ యంత్రాంగం బాధితులకు అండగా నిలిచింది. శుక్రవారం రాత్రి ప్రమాదం జరిగిన తర్వాత బాధితులను అంగన్‌వాడీ కేంద్రంలోకి తరలించారు. శనివారం ఉదయం రెవెన్యూ శాఖ తరఫున అయిదు రోజులకు సరిపడా సరకులు పంపిణీ చేశారు.

బాధితురాలిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

## శిథిల భవనం.. దిన దిన గండం

మండల కేంద్రంలోని పశువైద్య భవనమిది. 40 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో శిథిలావస్థకు చేరుకుని భయంకరంగా కనిపిస్తుంది. భవనం స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పశువైద్యులు, పాడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో పశువుల పెంపకంలో రామభద్రపురం ప్రథమ స్థానంలో ఉన్నప్పటికీ అధికారులు దీన్ని పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యను పశువైద్యాధికారి అప్పలనాయుడు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.
– న్యూస్‌టుడే, రామభద్రపురం



## నెమ్మదించిన ఈకేవైసీ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని తీసుకొచ్చింది. జాబు కార్డుల్లో ఉన్న ప్రతి వేతనదారుడు చేయించుకోవాలని స్పష్టం చేసింది. క్షేత్రసహాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రక్రియ చేపడుతున్నారు.

ఎం.బూర్జివలసలో పనులు చేస్తున్న వేతనదారులు

| మండలం | వేతనదారులు | ఈకేవైసీ చేసినవారు | ఈకేవైసీ చేయని వారు |
|---|---|---|---|
| బొబ్బిలి | 30,575 | 24,768 | 5,807 |
| బొండపల్లి | 21,848 | 18,564 | 3,284 |
| దత్తిరాజేరు | 24,374 | 18,622 | 5,752 |
| గజపతినగరం | 22,689 | 18,964 | 3,725 |
| మెంటాడ | 20,806 | 16,400 | 4,406 |
| రామభద్రపురం | 19,611 | 13,938 | 5,672 |

### ఇదీ పరిస్థితి..

బొబ్బిలి క్లస్టర్ పరిధిలోని బొబ్బిలి, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ, రామభద్రపురం మండలాల్లో 1,39,903 మంది వేతనదారులు ఉన్నారు. ఇప్పటికి 1,11,256 మందికి పూర్తవగా, 28,647 మంది చేసుకోలేదు. చాలామంది స్థానికంగా పనులు లేక విజయవాడ, హైదరాబాదు, తమిళనాడు, విశాఖకు వలస వెళ్లిపోతున్నారు. ఇలా శాశ్వతంగా వలస వెళ్లిన వారిని తొలగించాలని పేర్కొంది. దీంతో గత నెలలో ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దాదాపు 2,552 మందిని తొలగించారు. తాత్కాలిక వలసదారులు ఊరికి వచ్చినప్పుడు చేయిస్తున్నారు. పలువురు అందుబాటులో లేక ఇబ్బంది ఎదురవుతోంది, వచ్చే ఏడాదికల్లా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**పూర్తికి చర్యలు..:** వేతనదారులందరికీ ఈకేవైసీ చేయించేలా చర్యలు చేపడుతున్నాం. దాదాపు చివరికొచ్చింది. తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ చేయిస్తున్నాం. క్షేత్రసహాయకులంతా ఇదే పనిలో ఉన్నారు. - **రమామణి, ఏపీడీ, ఉపాధి**

## 25న ఎన్జీజీవో ఎన్నికలు

రాజాం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీజీవో రాజాం తాలూకా ఎన్నికలు ఈనెల 25న ప్రభుత్వాసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు చీపురుపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎల్.అప్పలనాయుడు ఆదివారం తెలిపారు. 18న ఉదయం 10 నుంచి 12గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

### 16న గుర్లగెడ్డ ఆయకట్టు రైతుల సమావేశం

మెంటాడ: రొంపల్లిలో 16న గుర్లగెడ్డ ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించనున్నామని జిల్లా కౌలు రైతుల సంఘ జిల్లా కార్యదర్శి రాములు తెలిపారు. అందరూ పాల్గొనాలన్నారు.

### తపాలా సిబ్బందికి సత్కారం

వంగర, న్యూస్‌టుడే: ఎం.సీతారాంపురంలో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కె.కృష్ణ, పాలకొండకు బదిలీ అయిన సబ్ పోస్టుమాస్టార్ ఎం.హరిబాబును తపాలా సిబ్బంది ఆదివారం ఎం.సీతారాంపురంలో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.

## గరివిడిలో పాలిథిన్ సంచుల నిషేధం

గరివిడి, న్యూస్‌టుడే: కొండపాలెం(గరివిడి) మేజరు పంచాయతీలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను అధికారులు నిషేధించారు. 'కోరలు చాస్తున్న ప్లాస్టిక్ భూతం' శీర్షికతో 14న ఈనాడులో ప్రచురితమైన కథనానికి ఈవో వేణుగోపాల్ స్పందించారు. గరివిడి పట్టణంలో 55 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులు విక్రయించ వద్దని పట్టణంలో ప్రచారం చేయించారు. పాలిథిన్ సంచులు విక్రయిస్తున్న వ్యాపారులు, దుకాణదారులకు వారం గడువుతో నోటీసులు జారీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. గరివిడి శివారు జగనన్న కాలనీ డంపింగ్ యార్డులో వ్యర్థాలను తొలగించారు.

వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఈనాడు కథనానికి స్పందన

## నిబంధనల మేరకే పత్తి కొనుగోళ్లు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల మేరకే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నామని జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగు అధికారి బి.రవికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 'దోపిడీ దారి కాస్తోంది.. పట్టు వీడుతోంది' శీర్షికతో 14న ఈనాడులో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ క్రాప్, కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగు చేసుకున్నవారి నుంచి కొనుగోలు చేస్తున్నామన్నారు. తేమ శాతం ఆధారంగా క్వింటా రూ.8,110కి తీసుకుంటున్నామని చెప్పారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రాజాం, రామభద్రపురం జిన్నింగు మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

## కాలువల నిర్మాణానికి చర్యలు

గజపతినగరం: పురిటిపెంట న్యూకాలనీలోని మెంటాడ మార్గంలో వర్షమొస్తే రోడ్డు జలమయమవుతోంది. ఇటీవలే రూ.1.26 కోట్లతో దీన్ని అభివృద్ధి చేసినా, కాలువలు లేక ఈ పరిస్థితి ఎదురైంది. సమస్యను స్థానికులు మంత్రి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన చర్యలు తీసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఏఈ అజయ్ భార్గవ్ తెలిపారు.

## మాజీ సర్పంచి మృతి

రామభద్రపురం, న్యూస్‌టుడే: కొండ కెంగువ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కంచుపల్లి అప్పారావు (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే బేబీనాయన, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, నాయకులు శంకరరావు, శ్రీనివాసరావు, సీతారాం తదితరులు సంతాపం తెలిపారు.

## ఉర్దూ భాషాభివృద్ధికి కృషి

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఉర్దూ భాష అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఉర్దూ అకాడమీ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'సరూర్ ఎ ఉర్దూ మహోత్సవ్'కు సంబంధించిన గోడప్రతులను ఆదివారం ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉర్దూను అందరూ గౌరవించాలన్నారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు భాషా, సభ్యులు జాఫర్, బాబ్జి, లైబ్రేరియన్ ఖుద్దూస్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

మెంటాడ: మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆండ్ర ఎస్సై సీతారం తెలిపారు. కొండపర్తికి చెందిన వ్యక్తి గొలుసు దుకాణం నిర్వహించేందుకు 31 మద్యం సీసాలను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా ఆండ్రలో అరెస్ట్ చేశామన్నారు. కేసు నమోదు చేసి, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామన్నారు.

## బస్సులో పొగలు

గుర్ల: చీపురుపల్లి నుంచి ఆదివారం విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు గుర్ల వద్దకు చేరుకునే సరికి వాహనం నుంచి పొగలు వచ్చాయి. గుర్ల కూడలి వద్ద గమనించిన కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, సురేష్ ద్విచక్ర వాహనంపై వెంబడించి బస్సు ఆపారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని, సరిచేసి వెళ్లారని డ్రైవర్ తెలిపారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

చీపురుపల్లి గ్రామీణం: గత వారం రోజులుగా మండలంలోని రావివలసలో చీపురుపల్లి సత్యరామ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. చివరి రోజున స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించారు. పీవో ముకుంద, మండల స్వచ్ఛభారత్ సమన్వయకర్త లక్ష్మణరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ జీఏ జగదీష్, సర్పంచి పి.మణికంఠ ఉన్నారు.

## పార్టీ శ్రేణులు తరలిరావాలి

గరివిడి, గుర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి సోమవారం తరలించే కార్యక్రమంలో శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం గరివిడి క్యాంపు కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నాయకులు వరహాలనాయుడు, అనంతం, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ✦ గుర్లలో రాజాం పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు, ఎంపీపీ ప్రమీల, మండలాధ్యక్షుడు సన్యాసినాయుడు కోరారు.

సమావేశంలో ఎమ్మెల్సీ బొత్స, నాయకులు

## సేవలతోనే గుర్తింపు

సామాజిక కార్యకర్తలను సత్కరిస్తున్న నిర్వాహకులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: సమాజానికి చేసిన సేవలే గుర్తింపును తెస్తాయని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు అన్నారు. సేవలందించిన కళింగవైశ్య సంఘ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు దంపతులు, రోటరీక్లబ్ బొబ్బిలి తొలి అధ్యక్షుడు చంద్రకిశోర్, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు బంగార్రాజును సన్మానించారు. మన్యం జిల్లా భద్రగిరి బాలికల కళాశాల అభివృద్ధికి అంతర్జాతీయ రోటరీ సంస్థ రూ.66 లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. బొబ్బిలి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు 100 పరుపులు, బీసీ బాలికల వసతి గృహానికి 16 పంకాలు, దీపాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బొబ్బిలి యూనిట్ అధ్యక్షుడు హరి, కార్యదర్శి శివకాంత్, రోటరీ క్లబ్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణకు యత్నం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పారాది వద్ద వేగావతి నదికి ఆనుకుని ఉన్న భూమిని పలువురు సాగు చేసేందుకు చదును చేశారు. గతంలో ఇక్కడ మొక్కజొన్న పండించినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ భూములు, కాలువలు, వాగులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పంచాయతీలోని ఓ వీధిలో గ్రామకంతం భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం చదును చేసినట్లు పలువురు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తాను ఆక్రమించలేదని, తన స్థలంలో నిర్మించుకుంటున్నట్లు సదరు వ్యక్తి ఫిర్యాదు చేశారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలి, గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీను హెచ్చరించారు. అప్పయ్యపేట రహదారిలోని రవితేజ ట్రేడర్స్, కలవరాయి ధాన్యం మిల్లులను ఆదివారం తనిఖీ చేసి, దస్త్రాలను పరిశీలించారు. ధాన్యం ముక్కవుతోందని క్వింటా వద్ద 5 నుంచి 10 కిలోల వరకు అదనంగా తీసుకుంటున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదు వస్తున్నాయని, అలా చేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. తూకాలు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. బ్యాంకు గ్యారెంటీ తీయాలన్నారు. గోనె సంచులు కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు.

## గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మోసూరువలస, చిలకమ్మవలస, ఎరందొరవలస, సియోనువలస, విజయపురి గిరిజన గ్రామాలకు చెందిన పేదలకు మాజీ సైనికులు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. 100 మంది పేదలకు వీటిని అందించినట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రతి ఏటా సంఘం తరఫున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామినాయుడు, కార్యదర్శి గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేస్తున్న మాజీ సైనికులు

(c) eenadu

# విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం- 80089 02900
విజయనగరం గ్రామీణం-80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం -70959 54646

?: డిమ్స్ కంప్యూటర్స్, వైఎస్సార్ కాలనీదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**
★ సిబ్బందిని పంపించి, బాగు చేయిస్తాం. **- స్రవంతి, ఏఈ, విజయనగరం నగరపాలిక**

?: ధర్మపురి ప్రాంతంలో పందుల బెడద ఎక్కువగా ఉంది. **- స్థానికులు** ★ నివారణకు చర్యలు తీసుకుంటాం. **- నల్లనయ్య, కమిషనరు**

## కాలువలు శుభ్రం

**విజయనగరం పట్టణం:** నగరంలోని సన్ స్కూల్ ప్రాంతంలో కాలువలు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

## దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

**విజయనగరం పట్టణం:** నగరంలోని నాయుడు కాలనీ దారిలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు విన్నవించారు. సమస్యను ఏఈ స్రవంతి దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో బాగు చేయించారు.

## గుంతల పూడ్చివేత

**శృంగవరపుకోట, న్యూస్‌టుడే:** శృంగవరపుకోట పట్టణంలోని శ్రీనివాసాకాలనీలో ఇంటింటి కుళాయిల కోసం సీసీ రోడ్డు తవ్వి వదిలేశారు. దీనిపై గత నెల ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన రక్షిత మంచినీటి విభాగం జేఈ సత్య కిషోర్ చర్యలు తీసుకున్నారు.

## తెరపై ఈనాడు

● ఎన్సీఎస్: మోగ్లీ ● శ్రీకృష్ణ: అఖండ 2 ● ఆదిత్య: డ్రైవ్ ● లీలామహల్: అఖండ 2 ● రంజనీ స్క్రీన్- 1: అఖండ 2 ● శివరంజనీ స్క్రీన్-2: మోగ్లీ ● హిమగిరి: ఆంధ్రా కింగ్ తాలూకా ● సప్తగిరి: అఖండ 2
- న్యూస్‌టుడే, కంటోన్మెంట్

## బస్తానిండా అక్రమాలే!!

- న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

విజయనగరం శివారులోని ఓ రేషన్ దుకాణానికి వెళ్లిన వృద్ధురాలు బియ్యం ఇవ్వండని కోరగా.. సంచిలో మీరే వేసుకోవాలని సూచించారు. వృద్ధురాలినని చెప్పినా పట్టించుకోలేదు.
★ నగర నడిబొడ్డునున్న మరో డిపోలో ఓ యజమాని రెండు, మూడు కిలోలు తక్కువగా ఇస్తుండడంతో లబ్ధిదారులు ప్రశ్నించారు. పైనుంచి రావడమే తక్కువ. .అందుకే కోత విధిస్తున్నామని అతడు చెప్పడం గమనార్హం.
★ కొందరు డీలర్లు నేరుగా తమకే సరకును అమ్మాలని, రూ.15 నుంచి రూ.17 వరకు ఇస్తామని చెబుతున్నారు.

విజయనగరం నియోజకవర్గంలో పౌర సరఫరాల వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం, ఇతర సరకులు దళారుల పరమవుతున్నాయి. ప్రభుత్వం కిలో రూ.48 విలువైన బియ్యాన్ని కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే సరకు చేరకముందే బేరసారాలు జరిగిపోతున్నాయి. కొందరు డీలర్లు మధ్యవర్తులతో కుమ్మక్కై ఈ తంతు సాగిస్తున్నారు. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

రేషన్ బియ్యం తూకం

### గుట్టుచప్పుడు కాకుండా..

గ్రామాల్లో ఉండే కొందరు ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్నారు. మరికొందరు డీలర్లతో బేరాలు కుదుర్చుకుని కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి మిల్లులకు తరలిస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాల్లో ఉన్న మూడు చిన్నపాటి గోదాముల్లో భద్రపరుస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా కాకినాడతో పాటు ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్తున్నారు.

### ఎప్పుడిస్తారో తెలియదు..

ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు డిపోల ద్వారా సరకులు అందించాలి. ఉదయం 8 నుంచి 12, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 వరకు డీలర్లు అందుబాటులో ఉండాలి. కానీ చాలాచోట్ల 10వ తేదీ వరకు తెరవడం లేదు. ఆ తరువాత వెళితే అన్నీ అయిపోయాయని, వచ్చే నెలలో ఇస్తామని చెబుతున్నారని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయమై గత నెలలో కణపాక వాసులు తహసీల్దారు, పౌరసరఫరాల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

లబ్ధిదారులకు చేరని బియ్యం
దళారుల ప్రవేశంతో మధ్యలోనే అమ్మకాలు

**నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..**

| | |
|---|---|
| రేషన్ డిపోలు | : 112 |
| కార్డుదారులు | : 74,217 |
| ఈనెలకు కేటాయించిన బియ్యం | : 1150 టన్నులు |

### కఠిన చర్యలు..

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసినా, నిబంధనలకు విరుద్ధంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, గోదాముల్లో నిల్వలను పరిశీలిస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయని డీలర్లపై దృష్టిపెడతాం. లబ్ధిదారులకు సకాలంలో సరకులు అందేలా చూస్తాం.
- మురళీనాథ్, డీఎస్వో, విజయనగరం

## సమస్యలకు పరిష్కారం ఎప్పుడో?

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

నగరపాలిక పరిధిలోని కోట కూడలి మూడు డివిజన్ల పరిధిలో విస్తరించింది. సమస్యలు సైతం ఆ స్థాయిలోనే ఉన్నాయి. ఇక్కడ వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ★ గురాచారివారి వీధిలో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు ★ కోట ప్రాంతంలో పలుచోట్ల కాలువలపై అక్రమంగా పలకలు వేశారు. దీంతో వ్యర్థాల తొలగింపునకు అవస్థలు తప్పడం లేదు ★ బోడమ్మ బంగ్లా దారిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది ★ లంక వీధి కూడలిలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది ★ ఎంజేబీ స్కూల్ వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు ★ కానుకుర్తివారి వీధిలోని చేతిపంపు పనిచేయడం లేదు ★ ఎంఆర్ కళాశాల ప్రాంతంలో సామాజిక మరుగుదొడ్లు లేవు ★ లక్కపందిరి వీధి మెయిన్ రోడ్డు దారిలో కుళాయిల నీరు వృథాగా పోతోంది ★ కోట ఎదురుగా, లంకవీధి రామమందిరం దారిలో డెబ్రిస్ పేరుకుపోయింది. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

లక్కపందిరివీధిలో ప్రమాదకరంగా కల్వర్టు పలకలు

## దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

**భోగాపురం, న్యూస్‌టుడే:** దళితులపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని దళిత సంఘం నాయకుడు పి.వెంకటరమణ డిమాండు చేసారు. భోగాపురం మండలంలోని ముంజేరు సిద్ధార్థ కాలనీ వాసులపై గత నెల 18న వీధి కాలువ నిర్మాణంలో భాగంగా జరిగిన దాడిపై నిరసన తెలియజేస్తూ నిర్వహిస్తున్న నిరాహార దీక్ష 9వ రోజుకు చేరాయి. రోజులు గడుస్తున్నా యంత్రాంగం పట్టించుకోకపోవడంపై ఆదివారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న పోలీసు స్టేషన్‌లో ప్రవేశించి నినాదాలు చేశారు. నిందితులను అరెస్టు చేయాలని కోరారు. ఎస్సై పాపారావు స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారంతా అక్కడ నుంచి వెనుదిరిగారు.

## బాబోయ్ ఈ రహదారికో దండం

జిల్లాలో ప్రధాన రహదారైన భీమసింగి నుంచి విజయనగరం మార్గం అధ్వానంగా ఉంది. భీమసింగి సచివాలయం ఎదురుగా గోతులు ఏర్పడి చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి గుండా విజయవాడ, గుంటూరు, హైదరాబాద్‌కు వాహనాలు తిరుగుతుంటాయి. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ ఉదయకుమార్ వద్ద ప్రస్తావించగా మరమ్మతులకు రూ.1.7 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, జామి**

## పొగతో తప్పని అవస్థలు

శృంగవరపుకోట పట్టణంలోని పుణ్యగిరి సమీపంలో ఉన్న పంచాయతీ డంపింగు యార్డులో చెత్త కుప్పలకు నిప్పు పెట్టడంతో వెలువడిన పొగతో ఇబ్బందులు పడినట్లు వేచలపు కల్లాల వాసులు తెలిపారు. దీనిపై పంచాయతీ ఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, శృంగవరపుకోట**

## వేళ్లూనుకున్న నిర్లక్ష్యం

ఈ చిత్రం చూడండి.. లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఉపాధి హామీ, వెలుగు కార్యాలయాలకు సంబంధించిన భవనమిది. నిర్వహణ లేక మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించకపోవడంతో ఇప్పటికే గోడలు బీటలువారాయి. సమస్యను ఉపాధి హామీ ఏపీవో విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా పరిశీలించి, తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, లక్కవరపుకోట**

## అనధికార నిరోధకాలతో ముప్పు

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి ప్రధాన రహదారిపై అనధికారికంగా వేసిన వేగ నిరోధకాలు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంపై రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి వల్ల తీవ్ర ప్రమాదాలు జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ నందకుమార్ మాట్లాడుతూ పరిశీలించి ప్రమాదకరంగా ఉంటే తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నెల్లిమర్ల**

## నిలిచిన తాగునీటి సరఫరా

కొత్తవలస మేజరు పంచాయతీ శివారు ఎన్జీవో కాలనీలో వీధి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగడం లేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.50 లక్షల వ్యయంతో నీటి పథకాన్ని ఏర్పాటు చేసి కొన్ని రోజులు సరఫరా చేశారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా ఇక్కడి ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పంచాయతీ ఏర్పాటుచేసిన డైరెక్టు పంపింగ్ వ్యవస్థ కూడా పనిచేయడం లేదని వాపోతున్నారు. సర్పంచి ఎం.ఎర్రయ్య రామస్వామి వద్ద ప్రస్తావించగా తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, కొత్తవలస**

## నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రావణ్‌కుమార్ గణేశ్వరరావు

**విద్యావిభాగం:** యూటీఎఫ్ విజయనగరం మండల కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలోని మహారాజా సంస్కృత ఉన్నత పాఠశాలలో జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శ్రావణ్‌కుమార్, బి.గణేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా ఎ.దక్షిణామూర్తి, సహాధ్యక్షులుగా మాధవీలత, బంగార్రాజు, కోశాధికారిగా వి.హరికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే.ఈశ్వరరావు, కె.విజయగౌరి పాల్గొన్నారు.

## హామీలు పక్కనపెట్టి శంకుస్థాపన చేస్తే అడ్డుకుంటాం

నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

**శృంగవరపుకోట, న్యూస్‌టుడే:** జిందాల్ నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా శంకుస్థాపన చేస్తే అడ్డుకుంటామని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల జగన్ అన్నారు. ఆదివారం శృంగవరపుకోట మండలం బొడ్డవరలో నిర్వాసితుల శిబిరం వద్ద మాట్లాడుతూ భూములు తీసుకున్నప్పుడు కంపెనీ నిర్మించి ఉద్యోగాలు, వాటాలు ఇచ్చి నిర్వాసితులను ఆదుకుంటామని చెప్పారన్నారు. నేడు జీవో నెం.14 పేరిట అమ్మకానికి సిద్ధం చేసిన యాజమాన్యానికి ప్రభుత్వం అండగా నిలిచి శంకుస్థాపనలు చేయిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే స్పందించాలని కోరారు.

## వృద్ధురాలి హత్య కేసులో అనుమానాలు

**భోగాపురం, న్యూస్‌టుడే:** భోగాపురం మండలంలోని ముడసర్లపేట(లింగాలవలస ఆర్ అండ్ ఆర్ కాలనీ)లో శనివారం వృద్ధురాలు ఎం.అప్పయ్యమ్మ(70)ను హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకున్న విషయం తెలిసిందే. ఈ నేరానికి సంబంధించి కుటుంబ సభ్యుల హస్తం ఉండవచ్చునన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మనవడిని కీలక వ్యక్తిగా గుర్తించి విచారిస్తున్నట్లు సమాచారం. విచారణ అనంతరం ఈ కేసు వివరాలు వెల్లడిస్తామని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

## ప్రలోభాలకు లొంగం.. ఓట్లను అమ్ముకోం

**జామి, న్యూస్‌టుడే:** జామి మండలం కుమరాంలోని యువకులు రాజకీయాలకు అతీతంగా ఆదివారం ఆ గ్రామానికి చెందిన ఐ.కృష్ణ అధ్యక్షతన సమావేశమైయ్యారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామాభివృద్ధి కోసం పనిచేవారిని ఎన్నుకుంటామని నిర్ణయం తీసుకున్నారు. ఓటు హక్కును వృథా చేసుకోమని ప్రతినబూనారు. మద్యం, బిర్యానీ, నగదు, బహుమతులు.. తదితర ప్రలోభాలకు లొంగమని అంతా ప్రతిజ్ఞ చేశారు.

నినాదాలు చేస్తున్న యువకులు

## సంక్షిప్త సమాచారం

### అందరూ మొక్కలు నాటాలి

**బాబామెట్ట:** పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలక పాత్రను పోషిస్తాయని, ప్రతిఒక్కరూ నాటేందుకు ముందుకు రావాలని ఎన్‌సీసీ అధికారి బి.సూరపునాయుడు అన్నారు. సత్య డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో తోటపాలెంలోని పలు వీధుల్లో ఆదివారం మొక్కలు నాటారు.

### ర్యాలీకి అనుమతి నిరాకరణ

**అయ్యన్నపేట, న్యూస్‌టుడే:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో జరగాల్సిన వైకాపా ర్యాలీకి అనుమతులు నిరాకరిస్తున్నట్లు విజయనగరం ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాలీల కారణంగా వ్యాపార కూడళ్లు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

### మృతికి సంతాపం

**భోగాపురం, న్యూస్‌టుడే:** భోగాపురం మండల కేంద్రానికి చెందిన తెదేపా పార్టీ సీనియర్ కార్యకర్త కూరాడ సూర్యప్రకాష్(83) అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, పలువురు ఆ పార్టీ నాయకులు తెదేపా జెండాలు, పూల మాలలతో నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

### లోక్అదాలత్‌లో 94 కేసుల పరిష్కారం

**భోగాపురం, న్యూస్‌టుడే:** భోగాపురం అబ్కారీ పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన 94 అనాధికార మద్యం కేసులు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో పరిష్కరించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ కేసులు పరిష్కారం ద్వారా రూ.3,61,722 అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు.

### మంచి వక్తలను తయారు చేయాలి

**విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలంటే మంచి వక్తలను తయారు చేయాల్సిన బాధ్యత జన విజ్ఞాన వేదిక కార్యకర్తలపై ఉందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు.

## పెంచిన మెనూ ఛార్జీల అమలు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే

మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథక సహాయ సంచాలకుడు శ్రీరామ్మూర్తి

**లక్కవరపుకోట, న్యూస్‌టుడే:** ఇటీవల పెంచిన మధ్యాహ్న భోజన పథక మెనూ ఛార్జీలు ప్రభుత్వం ప్రకటించిన రోజు అనగా ఫిబ్రవరి 2025 నుంచే అమల్లోకి వస్తాయని ఆ పథక సహాయ సంచాలకుడు జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. ఎల్.కోట మండల విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించి ఎంఈవోలు కూర్మారావు, శ్రీనివాసరావుతో మాట్లాడారు. పెంచిన రేట్లు ఒక్కో విద్యార్థికీ చెల్లిస్తుందన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సెప్టెంబరు నెల వరకు నిర్వాహకుల మెనూ ఛార్జీలు చెల్లించామని, అక్టోబరు నుంచి బకాయి ఉందని శ్రీరామమూర్తి తెలిపారు. నిర్వాహకుల వేతనాలకు సంబంధించి కేంద్రం రూ.1,000, రాష్ట్రం రూ.2,000 కలిపి రూ.3,000 ఇస్తుందన్నారు. గ్యాస్‌పై వంటలు చేయాలన్నారు.

| పాఠశాల రకం | పాత ధర | కొత్త ధర |
|---|---|---|
| ప్రాథమిక | రూ.5.45 | రూ.6.19 |
| ఉన్నత, ప్రాథమికోన్నత | రూ.8.57 | రూ.6.19 |

## ఏళ్లు గడుస్తున్నా ఇంకా మట్టిరోడ్లే

విజయనగరం మండలం దుప్పాడ శివారు కాలనీల్లో పక్కా రోడ్లు లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అయిదేళ్లలో ఇక్కడ పెద్దఎత్తున నివాస గృహాలు వెలిశాయి. అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగింది. కానీ ఆ స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. మట్టి దారులే దర్శనమిస్తుండడంతో వర్షాల సమయంలో బురదమయంగా మారుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎంపీడీవో వెంకటరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.
- న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

## ఆ ఒక్కటీ అడక్కు

**విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే:** విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో ఏటా వర్షాకాలానికి ముందు ప్రధాన, వరద నీటి కాలువల్లో పూడికతీత పనులకు అద్దె వాహనాలు తీసుకుంటున్నారు. ఇందు కోసం రూ.లక్షల్లో వ్యయం చేస్తున్నారు. ఇక్కడ 19.20 కిలోమీటర్ల పరిధిలో వరద నీటి కాలువలున్నాయి. వీటిల్లో పూడికతీత, చెత్త తొలగించడానికి ఛైన్ జేసీబీలు అవసరం ఉంటుంది. నగరపాలికగా ఎదిగి నప్పటికీ ఇంతవరకు కొనుగోలు చేయలేదు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### అద్దె వాహనాలే దిక్కు..

నగరంలోని పెద్దచెరువు అదనపు నీటి కాలువ, సన్ స్కూల్ ప్రాంతం తదితర చోట్ల పూడిక, చెత్త తొలగింపు కోసం ఛైన్ జేసీబీ ఉండాలనే వాదన సిబ్బంది నుంచి వినిపిస్తోంది. ఎంతో అవసరమైన వాహనంగా చెబుతున్నారు. ప్రస్తుతం మురుగులో దిగి పనులు చేస్తున్నారు. ఈక్రమంలో సక్రమంగా ప్రక్రియ సాగడం లేదు. వరదలు, అత్యవసరాల్లో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిపై కమిషనరు నల్లనయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఏటా వర్షాకాలానికి ముందే వరద నీటి కాలువల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయని, ఈమేరకు అద్దె ప్రాతిపదికన ఛైన్ జేసీబీని తీసుకుంటున్నామన్నారు. కొత్తది కొనుగోలుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ప్రధాన కాలువలో కర్రలతో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

## 27న ఏపీఎన్జీవో నగరశాఖ ఎన్నికలు

**విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ అధికారుల సంఘం నగరశాఖ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఎస్.వి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎన్జీవో హోంలో ప్రక్రియ జరుగుతుందని, 16 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

## బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన శ్రీమతి పోలిమేర లక్ష్మీతులసి పద్మలత, భర్త దుర్గినాయుడు, డోరు నెం. 5-15-18/4, కొత్త అగ్రహారం, విజయనగరం వారు యిచ్చిన భోగట్టా ప్రకారం ఈ హెచ్చరిక ప్రకటన జారీచేయడమైనది.

A1 కొణతాల హేమ వెంకట అప్పలనాయుడు (KHVA Naidu -Advocate), A2 కరణం శివరామకృష్ణ, A3 కొణతాల వీరామణి గార్లు షెడ్యూలాస్తిని అమ్ముటకు/అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నాలు చేస్తున్నందున వారిపై అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయనగరంలో AS No. 54/2024, హైకోర్టులో AS No.15/2022, AS No.60/2019, SA 821/2025, SR No. SASR 47044/2025 కేసులు పెండింగులో యున్నాయి. మరియు సదరు KHVA Naidu-Advocate A1, కరణం శివరామకృష్ణ A2, మరియు కొణతాల వీరామణి A3 మీద FIR No. 222/2023, Dated 7-4-2023గా నమోదైయున్నది.

నా క్లయింట్ పత్రిక ప్రకటన మూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయనది ఏమనగా, పైన తెల్పిన వ్యక్తులు షెడ్యూలాస్తిని అమ్ముటకు ప్రయత్నాలు చేస్తున్నందున, సదరు షెడ్యూలాస్తి నిమిత్తం ఎటువంటి క్రయం గాని, క్రయపురోణీలు/అగ్రిమెంట్లు జరిపిన యెడల వారే పూర్తిగా నష్టపోవుదురు అనియు మరియు నా క్లయింట్ తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: విజయనగరం జిల్లా, విజయనగరం టౌను, విజయనగరం IV బిట్, T.S. No. 126/7P & 126/8P, ఖాళీ నివేశన స్థలం రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న 435.58 చ॥గ॥ల ఖాళీ నివేశన స్థలం, యిందుకు హద్దులు: తూర్పు: 100 అడుగుల రింగ్ రోడ్డు, దక్షిణం: ఆడారి వెంకటేశ్వరరావు వగైరాల వలన కోలగట్ల వీర వెంకట తమ్మన్నశెట్టి గారు క్రయం పొందిన స్థలములో యున్న స్థలం, పశ్చిమం: మాన్సాస్ వారి భూమి, ఉత్తరం: మాన్సాస్ వారి భూమి.

న్యాయవాదులు:
గంటి రాఘవేంద్రరావు (G.G.R.) 7032230154
పెంటకోట అప్పలస్వామి, 9440794677
విజయనగరం, విజయనగరం
తేది: 14-12-2025.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు డిమాండు

**శృంగవరపుకోట, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయకపోవడం అన్యాయమని దళిత ఉద్యమ నేత ఉదయ భాస్కర్ అన్నారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శృంగవరపుకోట మండలంలోని సీతారాంపురం, గోపాలపల్లి, వెంకటరమణపేట గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, కులాంతర ప్రోత్సాహకాలు సహా అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. తక్షణమే రుణాలు మంజూరు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, శివరామకృష్ణ, దేవా, కృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

**శృంగవరపుకోట, న్యూస్‌టుడే:** శృంగవరపుకోట మండల సర్వ సభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఎంపీపీ సహా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రొటోకాల్ పాటించడం లేదని వారిపై లిఖితపూర్వక ఫిర్యాదులు తీసుకుంటామన్నారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచి సంతోషికుమారి, పలువురు ఎంపీటీసీలు తనను అవమానించేలా వ్యవహరించిన తీరు బాధ కలిగించిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు స్పందిస్తూ పని ఒత్తిడి వల్ల అలా జరిగిందని క్షమాపణ కోరారు. వైస్ ఎంపీపీలు సుబ్బలక్ష్మి, పినిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు, చిత్రంలో రఘురాజు

## యువ సాహితీవేత్తకు సత్కారం

**లక్కవరపుకోట, న్యూస్‌టుడే:** మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త కిలారి గౌరినాయుడుకు ఆదివారం విశాఖలోని ఏవీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ప్లాస్టిక్ వాడకం వల్ల ఎదురయ్యే పరిణామాలు, బాల్య వివాహాలు, మానవ హక్కులు తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏవీఎన్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణకుమారి, కార్పొరేటర్ కందుల నాగరాజు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి గాయత్రి, బాలవికాస్ ఫౌండేషన్ ప్రతినిధి బాబ్జి తదితరులు గౌరినాయుడును సత్కరించారు.

గౌరినాయుడును సన్మానిస్తున్న రచయితలు

(c) eenadu

# పడవ సిద్ధం..పదండి చూద్దాం

**పక్షుల కేంద్రంలో బోటు షికారు ప్రారంభం**

**కైకలూరు, న్యూస్‌టుడే:** బోటు షికారు ఎప్పుడెప్పుడు చేసేద్దామని పర్యాటకులు ఎదురు చూస్తుంటారు. ఆటపాక పక్షుల కేంద్రం లోని 270 ఎకరాల భారీ చెరువులో బోటు షికారుకు అధిక ప్రాధాన్యం ఉంది. ఇక్కడ సహజ సిద్ధ వృక్షాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రిల్స్‌పై వేలాది వలస పక్షులు కనువిందు చేస్తాయి. అయితే ఇక్కడ సమృద్ధిగా నీరు ఉన్నా గత తుపాను ప్రభావంతో ఈ పక్షుల కేంద్రం మూతపడి బోటు షికారు నిలిచి సందర్శకులు అసంతృప్తి చెందారు. అట వీశాఖ అధికారులు ఇక్కడ పరిస్థితులను మెరుగుపరచి కొన్నిరోజులుగా బోటు షికారును అందుబాటులోకి తెచ్చారు. బుల్లి పిట్టలు, భారీ పక్షు లను అతి దగ్గర నుంచి చూసే వెసులుబాటు రావడంతో బోటులో పయ నించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు.


# ఈనాడు పశ్చిమగోదావరి

సోమవారం డిసెంబరు 15, 2025




# చెత్త కాదు.. నిధులు ఊడ్చేస్తాయ్!

**నరసాపురం, న్యూస్‌టుడే:** చెత్త ఊడ్చే చీపుర్ల కొనుగోళ్ల లోనూ చేతివాటం చూపిన ఉదంతం నరసాపురం పురపాలక సంఘంలో తాజాగా వెలుగు చూసింది. ఇదొక్కటే కాదు బాక్సు టెండర్ల పేరిట భారీగా అక్రమాలు జరుగుతు న్నాయంటూ మూడు పర్యా యాలు నిర్వహించిన పాల కమండలి సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు ఆరోపణలు చేశారు. అత్యవసరమైన పనులను పాలకమండలి దృష్టికి తీసుకెళ్లే సమయం లేనప్పుడు కంటింజెన్సీ బిల్లులు, బాక్సు టెండర్ల పేరుతో కమిషనర్ రూ.లక్ష వరకు వెచ్చించే వెసులుబాటు ఉంది. దీనిని ఆసరాగా చేసుకొని గత నాలుగున్నరేళ్లలో వందల సంఖ్యలో బాక్సు టెండర్లకు రూ.కోట్ల నిధులు వెచ్చించారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

**కొబ్బరి ఈనెలు కిలో రూ.85**

ఇటీవల పారిశుద్ధ్య అవసరాల నిమిత్తం టన్ను రూ.85 వేల చొప్పున అయిదు టన్నుల కొబ్బరి ఈనెలను అయిదు బాక్సు టెండర్ల ద్వారా కొనుగోలు చేశారు. అంటే కిలోకు రూ.85 చెల్లించారు. సాధా రణంగా కొబ్బరి ఆకుల నుంచి ఈనెలు తీసే కార్మికుల నుంచి వాటిని వ్యాపారులు కిలో రూ.20 నుంచి రూ. 25 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్, ఇతర పట్టణాలకు తీసుకెళ్లి టన్ను రూ.35 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇక్కడ ఏకంగా టన్ను రూ.85 వేలకు కొను గోలు చేశారు. దీంతో పాటు మరికొన్ని అభి వృద్ధి పనులు, సామగ్రి కొనుగోళ్లలోనూ భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

**చీపుర్ల మాటున కాసుల వేట**

**చర్యలు తప్పవు..** పురపాలక సంఘంలో నిధుల విని యోగంపై తనిఖీలు, ఆడిట్‌లు ఉంటాయి. దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తప్పవు.' అని పురపాలక శాఖ ఆర్డీ నాగనరసింహారావు తెలిపారు.

# వ్యయమే.. వ్యాయామం లేదు

భీమవరం

▲ ఆదర్శనగర్ పార్కులో పరిక రాలు పాడై శిథి లమై, పొదల్లోకి చేరాయి. మహి ళలు, యువత ఉపయోగించే పరికరాలు విరి గిపోవడంతో మూలన పడేశారు.

**పురపార్కుల్లో నిరుపయోగంగా పరికరాలు**

**పరిశీలన**

**భీమవరం పట్టణం, తాడేపల్లిగూడెం వన్ టౌన్, నరసాపురం, తణుకు, న్యూస్‌టుడే:** వ్యాయామం దైనందిన జీవితంలో అంతర్భాగం వ్వాలనే ఉద్దేశంతో 2019 ఆగస్టు 29న ప్రధాని మోదీ ఫిట్ ఇండియా కార్యక్ర మాన్ని పారంభించారు. పట్టణా ల్లోని పార్కుల్లో వ్యాయామ పరి కరాలు బిగించారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ ఆధ్వర్యంలో వీటిని సమకూర్చారు. ఇంకొన్నింటిని స్థానిక పట్టణ అధికారుల ఆధ్వర్యంలో అమర్చారు. ఏ పట్టణ పార్కును చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు ... ఒక్కటీ ఆహ్లాదం పంచడం లేదు. ఉన్న వ్యాయామ, ఆట పరికరాలు వినియోగంలోకి తెచ్చుకోలేని దైన్యస్థితి.

పరికరాల్లో కొన్ని ఊడిపోయాయి. వాటికి మర మ్మతులు చేయకుండా పక్కకు నెట్టేశారు. మిగిలి నవి తుప్పు పట్టాయి. వాటిని తాకితే గాయమ య్యేట్టుగా ఉన్నాయి. పిల్లలు ఆడుకునే పరికరా లైతే మీద పడతాయని తల్లిదండ్రులు భయపడు తున్నారు. పొదలను దాటుకుంటూ వెళ్లాలి. వానొస్తే బురదలోకి చేరుతున్నాయి. క్షేత్రస్థా యిలో పరిశీలించి నివేదిక తీసుకుంటానని, ఉప యోగంలోకి తీసుకొస్తామని పురపాలక ఆర్డీ సీహెచ్.నాగనరసింహారావు తెలిపారు.

నరసాపురం

నరసాపురంలోని కాటన్ పార్కు ఇది. ఇక్కడ పరికరాలు విరిగి పోయాయి.

తణుకు

న్యూబ్యాంకు కాలనీలో తుప్పుపట్టి, విరిగిపోయాయి.

పురపాలక సంఘానికి చెందిన ఖాళీస్థ లాలు, పార్కు స్థలాలతోపాటు జనరద్దీగా ఉండే ప్రాంతాల్లో వీటిని బిగించారు. గతంలో ఏర్పాటు చేసినవాటితో పాటు అమృత్ పథకంలో భీమ వరం, తాడేపల్లి గూడెం పట్టణా లకు అదనంగా వ్యాయామ పరిక రాలను కేటాయించారు. లాటీపుల్లీ, బటర్‌ఫ్లై, గ్రౌండ్‌పుల్లీ ఇలా పలు రకాల పరికరాలు అందుబా టులో ఉంచారు. ఒక్కో పరికరం విలువ రూ.50 వేలు నుంచి రూ. 1.25 లక్షల వరకు ఉంది.

| పటణాల వారీగా పరికరాల వ్యయం (రూ.లక్షల్లో) | భీమవరం | పాలకొల్లు | తణుకు | నరసాపురం | తాడేపల్లిగూడెం |
|---|---|---|---|---|---|
| | 10 | 8.5 | 6 | 3 | 6 |

అమృత్‌లో వ్యాయామ పరికరాలకు కేటాయించింది రూ.30 లక్షలు

# అటు సర్కార్... ఇటు వందేభారత్

ఆయ్... సర్కార్ ఎప్పుడొస్తాదండి...
సమయానికి వచ్చేస్తాదా...
ఖాళీ ఉంటాదంటారా...

ఒక రైలు బండిని గోదావరి ప్రజలు తమ సొంత వాహనంగా చెప్పుకుంటారంటే అతి శయోక్తి కాదు. సామాన్యుడికి చౌకైన ప్రయాణంతో పాటు సుదూర ప్రాంతాలకు అనువుగా ఉన్న ఏకైక రవాణా మార్గమై బతుకు బండిగా మారిపోయింది. ఉపాధి మొదలు ఆధ్యాత్మిక యాత్రల వరకు అయిదు దశాబ్దాలుగా సర్కార్ సేవలందించగా సోమ వారం నుంచి వందే భారత్ కూడా అదే రీతిలో జిల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

**ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే:**

**తూర్పున సర్కార్, పశ్చిమాన వందే భారత్:** ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి మీదుగా ప్రయాణించే సర్కార్ ఎక్స్‌ప్రెస్ ఎంతోమందిని గమ్య స్థానా లకు చేరవేస్తోంది. కాకినాడ నుంచి చెంగల్‌పట్టు వరకు 755 కి.మీ. 17 గంటల్లో చేరితే, పుదుచ్చేరి వరకు 896 కి.మీ. సుమారు 20 గంటల్లో చేరవేసే ఈ రైలు నిత్యం కిక్కిరిసే ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో నిడదవోలు, తణుకు, అత్తిలి, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు మీదుగా వెళ్తుంది. వందేభారత్ నరసాపురంలో మొదలై భీమవరం టౌన్ మీదుగా చెన్నై చేరుకుంటుంది. తూర్పున సర్కార్ ఎక్స్‌ప్రెస్, పశ్చిమాన వందేభారత్ మొదలవుతుంది.

**వారికి సెంటిమెంట్:** సినీ పరిశ్రమ మద్రాస్ కేంద్రంగా నడుస్తున్న సమ యంలో ఎంతోమంది జిల్లావాసులు సర్కార్ ఎక్స్‌ప్రెస్ లోనే తమ సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. జంధ్యాల, బాపు, చిరంజీవి, బ్రహ్మానందం మొదలు త్రివిక్రమ్, సునీల్ వరకు ఎంతోమంది కళాకారులు ఆ జ్ఞాపకాలను నేటికీ పంచుకుంటున్నారు.

**ఉపాధి, ఆధ్యాత్మికం:** జిల్లాలో రోజూ చెన్నై, ఇతర ప్రాంతాలకు సుమారు 1200 మంది ప్రయాణం చేస్తున్నారు. ఆక్వా ఉత్పత్తులను భీమవరం టౌన్, ఆకివీడు కేంద్రంగా సర్కార్ నుంచే ఎగుమతి అవుతు న్నాయి. రాజధానికి, తిరుపతి, విజయవాడ, నాగ పట్నం ఇతర తీర్థ యాత్రల రాకపోకలకు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, పెద్ద పట్టణాల్లో స్థిరపడిన వారు వారంతాల్లో రావాలన్నా ఇదే ఆధారం. దాంతో ఎప్పుడూ కిక్కిరిసే ఉంటుంది.

**కాస్త ఉపశమనం:** ఆర్థిక, సామాజిక, వాణిజ్య రంగాల్లో అభి వృద్ధికి అనుగుణంగా జిల్లాలో రవాణా సౌకర్యాలు లేవు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఆరోగ్య అవసరాల నిమిత్తం ప్రజలు విజయవాడ, చెన్నై వంటి పెద్ద పట్టణాలకు వెళ్తున్నారు. సర్కార్‌లో రాకపోకలకు సరాసరిన 16 గంటలు పడు తుంటే వందేభారత్‌లో 8 నుంచి 9 గంటల్లో జిల్లాకు చేరుకోవచ్చని, విలువైన సమయం ఆదా అవుతుందని ఉద్యోగులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నేడు ప్రారంభం**

నరసాపురం- చెన్నై సెంట్రల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురం స్టేషన్లో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించను న్నారు. ఈ రైలు 20678 నంబరుతో నరసాపురం నుంచి మధ్యాహ్నం 2.45కు బయలుదేరి రాత్రి 11. 45కు చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు చేరుతుంది. తిరిగి 20677 నంబరుతో ఉదయం 5.35కు బయలు దేరి మధ్యాహ్నం 02.10 గంటలకు నర సాపురం చేరుతుంది.

# నట్టింట్లో జోడెడ్ల బండి!

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** జిల్లాకు చెందిన కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న పలు హస్తక ళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. దగ్గులూరులో తయారయ్యే ఎడ్ల బండి నమూనా ఆకృతులకు మంచి గిరాకీ ఉంది. ఇంటి హాలులో టీపాయ్‌లుగా, దేవుడి గదిలో మండపాల్లా వీటిని అలం కరించుకుంటున్నారు. ఎవరైనా ప్రముఖులు జిల్లాకు వచ్చినప్పుడు వీటినే జ్ఞాపికలుగా అందిస్తున్నారు. గతంలో భీమవరంలో నిర్వహిం చిన అల్లూరి శత జయంతి వేడుకలకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీకి ఇలాంటి జోడెడ్ల బండిని స్థానిక నాయకులు ఆయనకు జ్ఞాపి కగా అందించారు. ఎడ్లను ఫైబర్, ఇతర మిశ్రమాలతో, బళ్లను టేకు, ఇతర కలపతో తయారు చేస్తున్నారు. దగ్గులూరుతో పాటు అత్తిలి మండలం పాలూరులో వీటిని తయారుచేసి విక్రయిస్తున్నారు.

# పిడికిలి బిగిస్తే పతకమే!

తేజస్విని వెంకట శైలజ

**మార్టేరు, న్యూస్‌టుడే:** మారుమూల గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ఈ యువతి బాక్సింగ్‌లో సత్తాచాటుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన మహిళల రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. త్వరలో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు. పెనుమంత్ర మండలం నత్తారామేశ్వరం పరిధి పంపనవారిపాలేనికి చెందిన తేజస్విని వెంకట శైలజ ఎమ్మెస్సీ పూర్తి చేశారు. బాక్సింగ్‌పై ఆసక్తితో ఆరేళ్ల కిందట తన స్నేహితురాలి ద్వారా పెనుమంత్రలో శిక్షకుడు కె.చిరంజీవి వద్ద సాధన ప్రారంభించారు. జాతీయ స్థాయిలో వివిధ చోట్ల జరిగిన పోటీల్లో తొమ్మిదిసార్లు పాల్గొని రెండు స్వర్ణ, నాలుగు రజత పతకాలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో 14 స్వర్ణ, 6 రజత పతకాలు సాధించారు. 2022లో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ సీనియర్ మహిళల టోర్నీలో స్వర్ణ పతకం సాధించారు. అయిదు సార్లు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బాక్సర్ అవార్డులు అందుకున్నారు.

**ఐపీఎస్ సాధనే లక్ష్యం :** 'ప్రస్తుతం సివిల్స్ పరీక్షకు సిద్ధమవుతున్నా. ఐపీఎస్ సాధించడమే నా లక్ష్యం. భవిష్యత్తులో ఏ స్థాయిలో ఉన్నా మరికొందరికి బాక్సింగ్‌లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తా.' అని తేజస్విని వెంకట శైలజ చెప్పారు.

# కొత్త సంఘమా.. మీకు 15 వేలు



**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కొత్తగా ఏర్పడిన స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఈ సంఘాల సభ్యులు ప్రతి నెలా పొదుపు చేస్తూ నిర్ణీత కాలం ముగిసిన తరువాత బ్యాంకు ద్వారా రుణం పొందుతారు. ఒక వేళ వారి పొదుపుపై బ్యాంకు సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తే ఇంకొన్ని నెలల పాటు పొదుపు చేయాల్సి ఉంది. కొత్త సంఘా లకు తోడ్పాటును అందించి వారు సకాలంలో రుణాలు పొందేలా ఆయా సంఘాల పొదుపు ఖాతాలో రూ.15 వేల చొప్పున జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లిం చాల్సిన అవసరం లేదు. తద్వారా బ్యాంకు రుణం పొంది జీవ నోపాధులు చేసుకోవాలని ప్రభుత్వ ఆలోచన.

**రూ.4.05 లక్షల సాయం** ప్రభుత్వం కొత్త సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ పేరిట జమ చేయనున్న ఈ సాయం పొందాలంటే ఆయా సంఘాలు 2024 ఆగస్టు 2 నుంచి 2025 నవంబర్ 30 మధ్యలో ఏర్పడినవై ఉండాలి. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లోని 27 సంఘాలకు ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు డీపీఎం డి. వెంకటేశ్వర రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 బీసీ, 6 ఎస్సీ, ఒక ఎస్టీ స్వయం సహాయక సంఘాలను ఇందు కోసం ఎంపిక చేసి నట్లు వెల్లడించారు. మండల సమాఖ్యలో సంబంధిత ఏపీ ఎంలు గ్రామ నిధి పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తరు వాత ఈ సాయం జమ అవుతుందన్నారు.

# అక్కడ వినకే.. ఇక్కడి దాకా

**ఎస్పీ కార్యాలయ గడప తొక్కుతున్న బాధితులు**

**ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే:**

☛ రొయ్యల చెరువుగట్టుపై ఉన్న విలువైన సామగ్రి అపహరణకు గుర య్యాయని అక్టోబరు 31న మొగల్తూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని, ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేరుపాలెం సౌత్‌కి చెందిన మేళం అశ్వపతి ఆవేదన వ్యక్తం చేశారు.

☛ పెంటపాడు మండలం కూనాక రపేటలో ఇటీవల మోటర్, గ్యాస్‌బండ, 30 కేజీల ఫెన్సింగ్ తీగ, ఇతరత్రా దొంగతనం జరిగాయి. సుమారు 15 రోజులుగా తిరుగుతున్నా స్టేషన్లో పట్టించుకోవడం లేదని బాధితులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నా ఇదే పరిస్థితి నెలకొందని, దీనిపై ఎస్పీని ఆశ్రయించ నున్నట్లు బాధితులు తెలిపారు.

**చెప్పినా...నిర్లక్ష్యమే** నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ నయీం సూచిస్తున్నా.. . కింది స్థాయి సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆపదలో ఉన్నామంటూ వచ్చిన వారి బాధితుల గోడు విని, ధైర్యం చెప్ప కపోగా మరింత కుంగదీస్తున్నారు. కేసు నమోదు చేస్తే దాని పురోగతిపై ఉన్నతాధికారు లకు వివరాలు వెల్లడించాలి, అసలు కేసే నమోదు చేయకపోతే తిరిగి తిరిగి వాళ్లే ఊరు కుంటారనే ఉద్దేశంతో దూరంగా ఉంటున్నారు.

| తేదీ | ఫిర్యాదులు |
|---|---|
| **ఎస్పీ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు** | |
| నవంబర్ 3 - 7 | |
| 10 | 16 |
| 17 | 09 |
| 24 | 15 |
| డిసెంబర్ 1 - 13 | |
| 8 | 19 |

☛ పాలకొల్లు నియోజకవ ర్గంలోని తీర ప్రాంతంలో ఓ పోలీసుస్టేషన్లో ఎస్ఐ నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నారు. ఇటీవల ఒక ఇంటిపై కొందరు దౌర్జన్యం చేయగా బాధితులు సాక్ష్యాధా రాలతో ఫిర్యాదు చేసినా కేసు నమోదుకు సాకులు చెబుతూ తాత్సారం చేశారు. చివరిగా సీఐ వచ్చి కేసు నమోదు చేశారు. మరో మహిళ ఆపదలో ఉన్నానంటూ ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా కేసు నమోదు చేయకపోవడంతో ఇటీవల ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించారు.

ఈ సంఘటనలే కాదు... దాదాపు అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఇలాం టివి జరుగుతున్నా స్థానికంగా కేసులు నమోదు చేయడం లేదు. చేసినా... వాటిని పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక బాధితులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారు. దూరాభారం నుంచి వ్యయప్రయాసలకోర్చి వచ్చి మరీ అర్జీలు సమర్పిస్తున్నారు. స్థానిక పోలీసుస్టేషన్లలో స్పందించడం లేదని, అందుకే ఇక్కడకు వస్తున్నామని బాధితులు చెబుతున్నారు.

పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

● అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని, బాధి తులు ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

**కనరో భాగ్యము!**

16 నుంచి శ్రీవారి ధనుర్మాస ఉత్సవాలు

**ఉపాధి మరింత**

ఏడాదికి 25 పనిదినాల పెంపు

6లో

# 18 నెలల్లో రూ.17 కోట్లతో ఏటిగట్టు పనులు : మంత్రి

**యలమంచిలి, న్యూస్‌టుడే:** యలమంచిలి మండలం చించినాడలో రూ.8. 93 కోట్లతో గోదావరి ఏటిగట్టు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానా యుడు ఆదివారం కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఏటిగట్టు పనులకు రూ.17 కోట్లు మంజూరు చేయించి సగం పనులు పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గోదావరికి వరదలు వచ్చి నప్పుడు అప్పటి మంత్రులు వచ్చారు.. వెళ్లారు తప్ప ఒక్క రూపాయి కూడా ఖర్చు చేసి ఏటిగట్టును బాగు చేయలేదన్నారు. సొసైటీ అధ్యక్షుడు సత్యనారా యణరాజు, సర్పంచి రాజామణి, ఎంపీపీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**పశ్చిమ జట్టే విజేత**

వీరవాసరంలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. -న్యూస్‌టుడే, వీరవాసరం

6 లో

# 17 నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ దర్శనం ఈనెల 17 నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తామని సహాయ కమిషనర్ నగేష్ తెలిపారు. వార్షిక మహోత్సవాల సందర్భంగా ఆల యానికి రంగులతో ముస్తాబు, ఆభరణాలకు మెరుగుల నిమిత్తం దర్శనాన్ని నిలి పివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న దర్శనాన్ని పునః ప్రారంభిస్తామన్నారు. అప్పటి వరకు అమ్మవారి ఉత్సవమూర్తిని దర్శించుకోవచ్చన్నారు.

# 10 లో మెరిసేలా.. 100 రోజుల ప్రణాళిక

**'న్యూస్‌టుడే'తో డీఈవో నారాయణ**

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థి జీవితంలో పదో తరగతి ఓ మైలురాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణతతో పాటు భవిష్యత్తుకు పునాది వేసేలా బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ రూపొందించిన 100 రోజుల ప్రణాళిక అమలు తీరును డీఈవో ఇ. నారాయణ 'న్యూస్‌టుడే'కు వివరించారు.

**గ్రేడ్లుగా విభజించి**

ఇప్పటికే విద్యార్థులను వారి స్థాయిని బట్టి గ్రేడ్లుగా విభ జించాం. సి.డి గ్రేడ్లలో ఉన్నవా రిని స్థాయి-1(రైజింగ్ స్టార్స్), ఎ.బి గ్రేడ్లలో ఉన్నవారిని స్థాయి-2(షైనింగ్ స్టార్స్)గా విభజించాం ఆ స్థాయిని బట్టే ప్రశ్నల నిధి తయారు చేశారు. వీటిని లీప్(లెర్నింగ్ ఎక్సలెన్స్ ఆంధ్రప్రదేశ్)లో పొందుప రిచాం. వాటిని ఉపాధ్యాయులు డౌన్‌లోడు చేసుకుంటారు.

**సెలవుల్లోనూ..**

రోజూ ఉదయం 8 గంటలకు తరగతులు ప్రారంభమవుతు న్నాయి. ఆదివారం, రెండో శని వారం కూడా ఉంటాయి. మధ్యాహ్న భోజనం ఏర్పాటు కూడా చేస్తున్నారు.

**పరీక్ష తప్పనిసరి**

ఏరోజు ఏం చెప్పాలనేది ప్రణా ళికలో స్పష్టంగా ఉంది. ఆ రోజు తరగతులు పూర్తయ్యాక 20 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఆ మార్కులు ఆన్‌లైన్ చేస్తాం.

**మెటీరియల్ సిద్ధం**

ప్రశ్నల నిధి కేవలం ప్రశ్నల సంకలనంగా కాకుండా విద్యార్థి స్థాయికి అనుగుణంగా ప్రణాళికతో చదువుకోవడానికి వీలుగా ఉంది. ప్రతీ పాఠశాలకు మెటీరియల్ ఇచ్చాం.

**నిరంతర పర్యవేక్షణ**

షైనింగ్ స్టార్లు ఉత్తమ మార్కులు సాధించేలా, రైజింగ్ స్టార్స్ ఉత్తీర్ణుల య్యేలా ఎంఈవోలు, డిప్యూటీ ఈవోలు నిరంతరం పర్య వేక్షిస్తున్నారు. రోజువారీ పరీక్షలో మార్కుల్లో మెరు గుదల పరిశీలిస్తారు.

**దత్తత పాఠశాలలు**

కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక్కో అధికారి ఓ పాఠశాల చొప్పున దత్తత తీసుకున్నారు. అక్కడి విద్యార్థులు ఎలా చదువుతున్నారు, 100 రోజుల ప్రణాళిక అమలు తీరుపై ఎప్పటిక ప్పుడు సమీక్ష ఉంటుంది.

**మెరుగైన ఫలితాలు**

ప్రస్తుత విద్యాసంవత్సరంలో నూరుశాతం ఉత్తీర్ణతకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. గత విద్యాసంవత్సరంలో 82.15 శాతంతో రాష్ట్రస్థాయిలో 16వ స్థానంలో జిల్లా నిలిచింది. ఈ ఏడాది మరింత మెరుగైన ఫలి తాలు ఆశిస్తున్నాం.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు- **223**

పదో తరగతి విద్యార్థుల సంఖ్య **12,836**

# లోక్‌అదాలత్‌లో 10,798 కేసుల పరిష్కారం

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 34 బెంచ్‌లు ఏర్పాటు చేసి.. 10,798 కేసులు పరిష్కరించినట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. ఏలూరు 1,988, భీమవరం 974, చింతలపూడి 1,248, జంగారెడ్డిగూడెం 971, కొవ్వూరు 1,092, నరసాపురం 434, పాలకొల్లు 458, తాడే పల్లిగూడెం 1,433, తణుకు 1,082, నిడదవోలు 919, భీమడోలు 153 కేసులు రాజీ చేసినట్లు చెప్పారు. వీటిలో 238 అపరిష్కృత ప్రీ లిటిగేషన్, 153 క్రిమినల్, 294 మోటారు వాహన ప్రమాద కేసులున్నట్లు వివరించారు. లోక్‌అదాలత్ విజయవంతానికి సహ కరించిన న్యాయమూర్తులు, పోలీసులు, వివిధ శాఖల అధికా రులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి ఆమె ఆది వారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుం దని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల స్థాయిలో కూడా జరుగుతుందని వెల్లడించారు.

(c) eenadu

## ఊరూ వాడా.. క్రిస్మస్ సందడి

బెరాకా ప్రార్థన మందిరంలో కొవ్వొత్తుల ప్రదర్శనలో విశ్వాసులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పల్లెలు, పట్టణాలు అంతటా క్రిస్మస్ సందడి మొదలైంది. నూజివీడు నియోజకవర్గంలో చర్చిలు విద్యుద్దీపాలతో వెలుగులీనుతున్నాయి. ఆగిరిపల్లి బెరాకా ప్రార్థన మందిరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. క్యారల్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ నెల 24న క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్ ఆరాధన, 31న రాత్రి విశేష వార్షిక వందన ఆరాధన, జనవరి 1న నూతన సంవత్సర ఆరాధనలు నిర్వహించనున్నారు.

## ఇలానూ చేయొచ్చు.. శ్రీవారి సేవ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఆకలితో ఉన్న భక్తులకు అన్నం పెట్టడం ఎంత పుణ్యమో.. వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు మందులు అందించడం వల్ల అంతే పుణ్య ఫలం లభిస్తుందని భావించారు. అవసరాల మేరకు కావాల్సిన మందులను ఎప్పటికప్పుడు అందజేస్తూ.. శ్రీవారి భక్తుల సేవ చేస్తున్నారు.

**స్వచ్ఛందంగా..** ద్వారకాతిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే.. వారికి చికిత్స అందించేందుకు కొండపైన 'శ్రీవేంకటేశ్వరస్వామి ప్రాణదాన పథకం' ద్వారా ప్రథమ చికిత్స కేంద్రాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. ఆ కేంద్రానికి అవసరమైన మందులను దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచితంగా అందజేస్తున్నారు. గత రెండేళ్లలో 48,209 మంది భక్తులకు అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చారు. ఆక్సిజన్ కన్సన్‌లేటర్, డిజిటల్ మానిటర్, ఆక్సిజన్ సిలిండర్లు, చక్రాల కుర్చీలు వంటి పరికరాలను దాతలు అందజేశారని దేవస్థానం ప్రథమ చికిత్స కేంద్రం వైద్యాధికారి ఆర్.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

**కష్టాలు చూసి..** సుమారు ఏడేళ్లుగా భక్తులు, స్వామివారి సేవ చేసేవారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నా. స్వామివారి సన్నిధికి కాలినడకన వచ్చే భక్తుల కష్టాలను చూశా. వారికి సేవ చేయాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నా. పర్వదినాల్లో, ప్రత్యేక శిబిరాల ఏర్పాటు చేసినప్పుడు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నా. - **ఆలపాటి వెంకట సాంబశివరావు, దాత, తెనాలి**

**భక్తుల ఆరోగ్య సమస్యలు గుర్తించి** శ్రీవారి సన్నిధిలో భక్తుల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందించాలనుకున్నా. సుమారు అయిదేళ్ల నుంచి మందులు అందిస్తున్నా. ఇందుకు నా స్నేహితులు కూడా సహకరిస్తున్నారు. స్వామి ఆలయానికి వచ్చిన భక్తులు ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలని భావిస్తున్నా. **- గర్రె సురేశ్, దాత, విజయవాడ**

**అత్యవసరమైన సమయంలో..** ఆలయానికి వచ్చిన భక్తులు ప్రమాదాలకు గురైనప్పుడు దెబ్బలు తగులుతాయి. ఆ సమయంలో ఇబ్బంది పడకుండా కట్టు కట్టేందుకు అవసరమైన డ్రస్సింగ్ మెటీరియల్‌ను అందిస్తున్నా. దాదాపు మూడేళ్లుగా భక్తులకు ఇలాంటి సేవ చేయడం నాకు సంతృప్తిగా ఉంది. **- మడిపల్లి సత్యనారాయణ స్వామి, విజయవాడ**

## అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: విర్డ్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 11 నుంచి జరుగుతున్న ఎముకల వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. మొత్తం 56 మందిని పరీక్షించి భుజం, మోచేయి, చెయ్యి, తుంటి సమస్యలు ఉన్న 20 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయగలగడం తమ వైద్య సాఫల్యానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు కామినేని శ్రీనాథ్(యూఎస్ఏ), భవ్యచంద్, కృష్ణ కిరణ్, కంభంపాటి శ్రీనివాస్, బాలాజీ, పి.వి.నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత, విర్డ్ ట్రస్ట్ సభ్యులు వి.నారాయణమూర్తి, ఎస్‌వీఎన్ఎన్ నివృతరావు తదితరులు పాల్గొన్నారు.

## చకచకా.. ఎంచక్కా
### వేగంగా వైద్య కళాశాల భవనాల నిర్మాణం

ఈనాడు-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు గత ప్రభుత్వంలో నత్తను తలపించాయి. దీంతో విద్యార్థుల బోధనకు ఆటంకం కలిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే వేగం పుంజుకున్నాయి. 2026 ఆగస్టు నాటికి పనుల పూర్తికి ప్రభుత్వం గడువు పొడిగించింది.

జగన్ సర్కార్ ఆ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదు. గుత్తేదారుకు పూర్తిస్థాయిలో స్థలాలు అప్పగించలేదు. పనులు ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణమే. ఈ విషయం తెలుసుకున్న కూటమి ప్రభుత్వం సమీక్షించి నిర్మాణాలకు సరిపడా స్థలాన్ని కేటాయించి గుత్తేదారుకు బిల్లులు చెల్లించడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2022లో పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.215 కోట్ల విలువైనవి జరిగాయి. 2.76 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో జీ+4 భవనాలు నిర్మించాలి.

**అందుబాటులోకి గ్యాలరీలు..** వైద్య విద్యార్థులు క్లినికల్ పరీక్షల నిర్వహణ, బోధనకు గ్యాలరీ అవసరం. కనీసం దాన్ని వైకాపా ప్రభుత్వం నిర్మించలేదు. మూడో సంవత్సరం విద్యార్థులకు ఒక క్లినికల్ గ్యాలరీ నిర్మించి రెండు మాసాల క్రితమే అప్పగించగా రెండో ఏడాది వారికి మరొకటి సిద్ధం చేస్తున్నారు. ఇది వారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. 2023లో తరగతులు ప్రారంభం కాగా ప్రస్తుతం పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాలు పూర్తి చేయాల్సి ఉంది.

## టెట్‌కు 228 మంది గైర్హాజరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 6 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం జరిగిన టెట్ పరీక్షకు 228 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఇ.నారాయణ తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు మొత్తం 1836 మందికి 1608 అభ్యర్థులు హాజరయ్యారని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈ కుర్రాడు.. వాలీబాల్‌లో దిట్ట

శ్యాంభూషణ్‌బాబు

చినఅమిరం (భీమవరం (గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన ఈద శ్యాంభూషణ్ బాబు స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వాలీబాల్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. అండర్-14 విభాగంలో జోనల్, జిల్లా స్థాయిలో అయిదు పతకాలు సాధించాడు. ఈనెల 16న బుచ్చిరెడ్డిపాలెం(నెల్లూరు)లో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా తరపున ఆడనున్నాడు. అక్కడ విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తానని చెప్పాడు.

## కనరో భాగ్యము..!
### 16 నుంచి శ్రీవారి ధనుర్మాస ఉత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14వరకు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ధనుర్మాసంలో శ్రీవారి సుప్రభాత సేవ ఉండదని, దానికి బదులు తిరుప్పావై సేవ జరుగుతుందని చెప్పారు. నిత్యం ఉదయం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

**30న ఉత్తర ద్వార దర్శనం..** ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రూ.100, రూ.200 టిక్కెట్లతోపాటు రూ.500 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. ముక్కోటి ఏకాదశి నుంచి వచ్చే 2026వ సంవత్సరం జనవరి 9 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో నేపథ్యంలో సాయం కాల సమయంలో జరిగే ఆర్జిత సేవలు ఉండవని వెల్లడించారు.

**29న గిరి ప్రదక్షిణ..** ముక్కోటి ఏకాదశి ముందు రోజు డిసెంబర్ 29న స్వామివారి గిరిప్రదక్షిణ నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆలయ తొలి మెట్టు దగ్గర ప్రారంభమై కొండ చుట్టూ సుమారు 6 కి.మీ. మేర గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఈవో తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తామని చెప్పారు.

## ఉపాధి మరింత!
### ఏడాదికి 25 పనిదినాల పెంపు

ఉద్యాన తోటల వివరాలపై ఆరా తీస్తున్న డ్వామా పీడీ

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. జాబ్‌కార్డుపై ఏడాదికి అమలు చేస్తున్న 100 పనిదినాలను 125కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంటే ఏడాదిలో మూడోవంతు రోజులు ఉపాధి పనులకు వెళ్లొచ్చు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనులు లేని రోజుల్లోనూ శ్రామికుల ఉపాధికి ఎలాంటి ఢోకా ఉండదు. పశ్చిమగోదావరిలో 1.80 లక్షల జాబ్ కార్డులు ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,675 మంది వంద పనిదినాలు పూర్తిచేశారు.

**జిల్లాలో ఇలా..**
జాబ్ కార్డులు: 1.80 లక్షలు
లబ్ధి పొందుతున్న కుటుంబాలు: 98 వేలు
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన వేతనాలు: రూ.85 కోట్లు

**48 గంటల్లో కార్డు జారీ..** ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లాలని భావించే శ్రామికులకు దరఖాస్తు చేసిన 48 గంటల్లోనే జాబ్ కార్డు జారీ చేస్తున్నారు. గతంలో ఈ కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరిగేది. దీంతో శ్రామికులు ఎదుర్కొనేవారు. ఉపాధి పథకం పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్నేళ్లుగా అనేక సంస్కరణలు తెచ్చాయి. ఈ క్రమంలో ఇతర కార్డులపై పనిచేసే కార్మికులు హాజరు నమోదుకు అవకాశం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో కార్డుల జారీ ప్రక్రియలోనూ మార్పులు తెచ్చారు.

**పేదల ఇళ్లకు..** ప్రభుత్వం పేదలకు మంజూరు చేస్తున్న ప్రతి ఇంటికీ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 39 వేల వరకు మంజూరు చేస్తున్నారు. ఇంటి నిర్మాణంలో వివిధ దశలకు రూ.27 వేలు, మరుగు దొడ్డి నిర్మాణం పూర్తిచేస్తే మరో రూ.12 వేలు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారు. దీనికి లబ్ధిదారులు తప్పనిసరిగా జాబ్ కార్డు పొందాల్సి ఉంటుంది. ఈ విభాగంలో కొత్తగా 4,200 మంది కార్డులు పొందారు. పని దినాల పెంపును ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అమలు చేస్తామని, ఈ పథకంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని డ్వామా పీడీకేసీహెచ్ అప్పారావు పేర్కొన్నారు.

## విశ్రాంత పురపాలక ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి.శాస్త్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రేవూరి గోగురాజు(భీమవరం), ప్రధాన కార్యదర్శిగా డి.వి.ఎస్.ఎన్.మూర్తిమురళి(కాకినాడ), ఉపాధ్యక్షులుగా సీహెచ్.హరిబాబు(గుంటూరు), ఎం.వి.నారాయణరెడ్డి(రాజమహేంద్రవరం), బి.మునుస్వామి(అనంతపురం), పి.వి.టి.రమణరావు(విశాఖపట్నం), కోశాధికారిగా జి.వేణుగోపాలస్వామి(తుని), కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.సత్యనారాయణ(కాకినాడ), జె.శ్యామ్‌రాజ్(అనంతపురం), ప్రాంతీయ కార్యదర్శులుగా ఎం.వి.రామారావు(రాజమహేంద్రవరం), బి.వెంకటరామయ్య(అనంతపురం) నియమితులయ్యారు. ముఖ్య అతిథులుగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘాధ్యక్షుడు గాతల జేమ్స్, రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## పరుగులు దండిగా.. వికెట్లు మెండుగా..
### క్రికెట్‌లో రాణిస్తున్న యువతులు

తణుకు, న్యూస్‌టుడే

క్రికెట్ అబ్బాయిల ఆటే అన్న పరిమితులు చెరిపేసి అద్వితీయ ఆటతీరుతో ప్రశంసలందుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు. ఇటీవల మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ గెలవడంతో దేశవ్యాప్తంగా అమ్మాయిలకు ఈ ఆటపై ఆసక్తి పెరుగుతోంది. అదే స్ఫూర్తితో సాగుతున్నారు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలోని విద్యార్థినులు. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్సిటీ స్థాయి ఎంపికల్లో సత్తాచాటి సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు.

**అన్నయ్య స్ఫూర్తితో..** మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ఒకవైపు కూలి పనులు, మరోవైపు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఇంటి వద్ద అన్నయ్యతో ఆడటం మొదలు పెట్టి తన వద్దే మెలకువలు నేర్చుకుంటూ ఆల్‌రౌండర్‌గా మారా. పదో తరగతిలో పాఠశాల తరపున పాల్గొని సత్తాచాటాను. కళాశాలలో చేరిన తర్వాత నుంచి మరింత పట్టుదలతో ఆడటం మొదలుపెట్టా. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయం, మైసూరు విశ్వవిద్యాలయాల తరపున రాజమహేంద్రవరం, మైసూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో మ్యాచులు ఆడా. ఇటీవల జరిగిన పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున ప్రతిభ కనబరచి సౌత్ జోన్‌కు ఎంపికయ్యాను. జాతీయ జట్టులో స్థానం సంపాదించి, పైలెట్ అవ్వాలనేది నా ఆశయం. **- బి.రేవతి, పూళ్ల, డిగ్రీ మూడో సంవత్సరం**

**నాన్న ఆట చూస్తూ..** నాన్న మంచి క్రికెటర్. ఆయన ఆడుతుంటే చూసి ఆసక్తి పెంచుకున్నా. పాఠశాల స్థాయిలో చిన్నగా ఆడటం మొదలుపెట్టా. ఇంటర్ నుంచి సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా వివిధ ప్రాంతాల్లో ప్రతిభ కనబరిచా. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్సిటీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (ఉమెన్) క్రికెట్ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ ఎంపికల్లో సత్తాచాటి జనవరి 16న నుంచి తమిళనాడులో జరగబోయే సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యా. ఇది నాకు మంచి అవకాశంగా భావిస్తున్నా. భారత జట్టుకు ఆడాలనేదే నా లక్ష్యం. **-ఎం. మౌనిక, తణుకు, డిగ్రీ రెండో సంవత్సరం**

## 'ఉనికి కాపాడుకునేందుకే.. వైకాపా అసత్య ప్రచారం'

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉనికిని కాపాడుకునేందుకే వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. వైద్య కళాశాలల పబ్లిక్, ప్రైవేటు, భాగస్వామ్యంపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను తిప్పి కొట్టారు. రామారావుపేటలోని భాజపా కార్యాలయంలో ఆదివారం భాజపా పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందుకు గాను రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సిన ఆర్థిక సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. మహారాష్ట్ర, దిల్లీ వంటి రాష్ట్రాల్లో పీపీపీ విధానం అమలులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా పట్టణ ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగాధర్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వీఆర్‌వీఎల్ నారాయణ, ప్రధాన కార్యదర్శి కావ్యరెడ్డి, ఇమ్మంది బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అభివృద్ధికి తోడ్పాటు

మాట్లాడుతున్న దేవప్రకాశ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రుణాలు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని జలవనరుల శాఖ ముఖ్య పర్యవేక్షక ఇంజినీరు చిలకపాటి దేవప్రకాశ్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ప్రొవెన్షియల్ వర్క్ ఛార్జ్‌డ్ మినిస్టీరియల్, లాస్ట్ గ్రేడ్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పశ్చిమ గోదావరి జిల్లా 42వ మహాజన సభ ఆదివారం నిర్వహించారు. దేవప్రకాశ్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సొసైటీ నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తోందని చెప్పారు. నీరు- ప్రగతి పర్యవేక్షక ఇంజినీరు బి.వెంకటస్వామి, ఉప పర్యవేక్షక ఇంజినీరు పుట్టా ధనంజేయులు మాట్లాడుతూ.. సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సొసైటీ నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ కార్యదర్శి జవంగుల బాపయ్య, హరనాథ్, కె.పి.వెంకన్న, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆరుద్ర జయంతిని అధికారికంగా నిర్వహించండి

పూర్ణచందును సన్మానిస్తున్న నాయకులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తెలుగు జాతి కీర్తి శిఖరం ఆరుద్ర శత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆరుద్ర సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ జి.వి.పూర్ణచందు కోరారు. స్థానిక సాహిత్య మండలిలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యాన ఆరుద్ర శత జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచందుకు జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జాతిని ప్రగతి శీలక బాటలో నడిపిన వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు. మహ్మద్ ఖాజావలీ ఆధ్వర్యంలో హేలాపురి గాయకులు ఆలపించిన సినీ మధుర గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి.

**ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE**
**Tender Notice No.04 EE/APMSIDC/Eluru/2025-26, Dt. 15-12-2025**

Tenders are invited in "e Procurement" for the works "Construction of Stand Alone Government **Ayurveda Dispensarys** at 1) Munduru, 2) Dubacherla, 3) Jinnuru, 4) Veeravasaram, 5) Elurupadu, 6) Rajavaram, 7) Polavaram, 8) Kovvuru, 9) Palakollu, 10) Jaanampeta, Construction of Stand Alone Government **Homeopathy Dispensarys** at 1) Pragadavaram, 2) Tadikalapudi, 3) Kalla, 4) Lakshamaneswaram. **Last date receipt of Tenders 23-12-2025.** The other details can be had at website www.eprocurement.gov.in For further details please Contact Ph.No. 77807 14114.

Sd/- **EE, APMSIDC Division, Eluru, Eluru & W.G. Districts**

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

స్వాధీనం చేసుకున్న కారు, నిందితులతో ఏఎస్పీ సుస్మిత

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ సుస్మిత వివరాలు వెల్లడించారు. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన కనుమర్తి లక్ష్మీ నరసింహ ఆనంద్ కుమార్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి శనివారం వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ సుభాశ్ ఆధ్వర్యంలో ఎస్సై వీరప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. జంగారెడ్డిగూడెం పట్టణ శివారులోని ఫైర్‌స్టేషన్ సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన ముత్యాల గణేశ్, శీలం ఆంజనేయులు, కటూరి సుబ్రహ్మణ్యం అనుమానాస్పదంగా సంచరించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తిరుమలాపురంలోని ఇంటి దొంగతనంతో పాటు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని ఏఎస్పీ తెలిపారు. దీంతో నిందితుల వద్ద నుంచి వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి రూ.లక్ష విలువైన వెండి, బంగారు వస్తువులు, కారు, టీవీ, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. నిందితులు ముత్యాల గణేశ్‌పై 11 కేసులు, శీలం ఆంజనేయులుపై 9, కటూరి సుబ్రహ్మణ్యంపై 8 కేసులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయన్నారు.

## తల్లిదండ్రులు మందలించారని..
## బాలుడి ఆత్మహత్యాయత్నం

పోలవరం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఓ బాలుడు పురుగుమందు తాగిన ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం పనికి వెళ్లాడు. అక్కడి వారితో గొడవ పడి.. ఇంటికి వచ్చాడు. ఆ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గొడవలు ఎందుకు అంటూ మందలించారు. మనస్తాపం చెందిన ఆ బాలుడు పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. ప్రస్తుతం పరిశీలనలో ఉంచామని, పరిస్థితిని బట్టి రాజమహేంద్రవరం తరలిస్తామని వైద్యులు తెలిపారు.

## వసతి గృహం ఆవరణలో..
## ఆకతాయిల హల్‌చల్

**పోలీసుల అదుపులో యువకుడు**

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని ప్రైవేటు వసతి గృహాల వద్ద రాత్రివేళ ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. ఆయా వసతి గృహాల దగ్గరకొచ్చి అరుపులు, కేకలు వేయడం.. ఒక్కోసారి కిటికీల్లో నుంచి నీళ్లు, రాళ్లు విసరడం చేస్తున్నారు. విద్యార్థినులు భయభ్రాంతులకు గురై.. వసతి గృహాలకెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి ఓ యువకుడు వసతి గృహంలోకి చొరబడటంతో.. అప్పటికే మాటు వేసిన సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని గాలాయగూడెం వాసిగా గుర్తించారు. పోలీసులు వసతి గృహాల భద్రతపై దృష్టి సారించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## డీఏ బకాయిల చెల్లింపునకు డిమాండ్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్‌వీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ భవనంలో ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. తోట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఉద్యోగులకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, అప్పటి వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడి పదవీ కాలాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ తీర్మానించారు. సంఘ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు వైజీఎల్ నారాయణ, ముఖ్య సలహాదారు లింగేశ్వరరావు, కోశాధికారి జె.మణికంఠకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

వీరవాసరం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి(ప్రథమ), విజయనగరం(ద్వితీయ), శ్రీకాకుళం(తృతీయ), బాలికల విభాగంలో విజయనగరం(ప్రథమ), పశ్చిమగోదావరి(ద్వితీయ), తూర్పుగోదావరి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను డీఈవో ఇ.నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్ నాయుడు అందజేశారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు పి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత, కె.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలురు, బాలికల ఏపీ జట్లను ఎంపిక చేశారు.

## జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

నాగబాబు

సామర్లకోట, న్యూస్‌టుడే: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కాకినాడ జల్లి సామర్లకోటకు చెందిన క్రీడాకారుడు యాతం నాగబాబు ఎంపికయ్యారు. ఈ నెల 13, 14న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పల్లపర్రులో నిర్వహించిన 45వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ 2025 ఛాంపియన్‌షిప్ పోటీల్లో 100, 1,500 మీటర్ల పరుగులో బంగారు, 800 మీటర్ల పరుగులో రజత పతకాలు సాధించారు. 2026 ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా మలేరియా విభాగంలో పనిచేస్తున్న నాగబాబు ఇప్పటికే అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

## పేరు మార్పుతో ఫలితం శూన్యం: వ్యకాసం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం పేరు మార్చినంత మాత్రాన పేదలకు ఒరిగేది శూన్యమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో సంఘ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. శేఖర్ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంపై తీవ్ర దాడి మొదలు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు వెంకటేశ్వరరావు, కేశవరెడ్డి, వెంకట్రావు, ఈశ్వరరావు, పెద్దయ్య పాల్గొన్నారు.

**92.7 FM Rajamahendravaram** ఈ FM 92.7 Mee FM
**ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
| --- | --- |
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

## కాపుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

తణుకు సమ్మేళనంలో మాట్లాడుతున్న బొండా ఉమ

తణుకు, న్యూస్‌టుడే: కాపు సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. అందరూ ఏకతాటిపై నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం తణుకులోని సీఎం కల్యాణ మండపంలో నిర్వహించిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. కాపు నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించగా, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ఆనాడు మోహనరంగా ఒక విప్లవాత్మక మార్పు కోసం ఉద్యమిస్తే కుట్రపూరితంగా హత్య చేశారనే నిజాన్ని గుర్తించాలన్నారు. బీసీలు, కాపులు, దళితులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కాపునాడు జాతీయ అధ్యక్షులు గల్లా సుబ్రహ్మణ్యం, కాపు జేఏసీ నాయకులు రామకృష్ణ, నల్లా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**EENADU Classifieds**

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

**BUSINESS OFFER**

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్‌టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర : 78160 98199.

**JOBS**

HYD **యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**టెలికాలింగ్** & Data Entry వర్క్ ఫ్రమ్ హోమ్/ ఆఫీసు M/F కావలెను. 10th పైన, Age:18to35, జీ:18to25K. ✆ 8464016870, 8639439870

**ఆదిత్య మోటార్స్,** జంగారెడ్డిగూడెం బ్రాంచిలో పనిచేయుటకు ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12,000/- to 18,000/-. Contact Cell: 85006 44978.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.75 పైౖ
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

(c) eenadu

## ఉచిత వైద్య శిబిరం

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం చినఅమిరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు దివ్యభవానీ, విజయ ఆనందకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలి

గొల్లవానితిప్ప(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: సమాజ సేవలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని వక్తలు పేర్కొన్నారు. డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా గొల్లవానితిప్పలో నిర్వహిస్తున్న సేవాశిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అంజికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ప్రవీణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


# భీమవరం

•భీమవరం •ఉండి


## ఆదిలక్ష్మి జాతరకు పందిరి రాట

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ 35వ జాతరకు శ్రీకారంగా పందిరి రాట పూజ ఆదివారం ఉదయం నిర్వహించారు. రజక యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి 35వ జాతర సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి, ఆలయ సేవా సంఘం సమక్షంలో రజక సంఘ పెద్దలతో ఆర్భాటంగా పందిరి రాట పూజ చేయించారు. యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ జనవరి 13 నుంచి 25 వరకు అమ్మవారి జాతరను దాతలు, భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

పూజలో రజక యూత్, ధర్మకర్తల మండలి

## సోలార్ విద్యుత్తు లైటింగ్ ఏర్పాట్లు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో విస్సాకోడేరు వంతెన నుంచి జిల్లా కలెక్టరేట్ రహదారిలో సోలార్ ప్యానల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని సంయుక్త కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్తు శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ నెల 20న రానున్నారని, ఆయనతో సోలార్ ప్యానల్ లైటింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఎం.ఇ. పి.త్రినాథరావు, విద్యుత్తు ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ భారతి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలోని పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

# లెక్కల్లో ఘనం.. వినియోగంలో హీనం

**ఇదీ భీమవరం పుర పార్కుల దుస్థితి**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో ఆహ్లాదం కోసం ఆశిస్తే అనారోగ్యం తప్పదన్నట్లు పార్కు స్థలాలు ఉన్నాయి. పట్టణంలోని దాదాపు 43 వేల చిన్నారులు, జనాభాలోని 45 శాతం యువత, మహిళలు ఇక్కడే పరిమితం కావాలి. పార్కులను చూడాలంటే వెళ్లే చిట్టడవులను తలపిస్తున్నాయని వాపోతున్నారు. పార్కు స్థలాలకు గతంలో రక్షణ గోడలు నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌లు, కూర్చునేందుకు బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు ఉండేవి. వాటిలో కొన్ని పాడైపోగా మిగిలినవి పొదల్లోకి చేరాయి. కలెక్టర్ చదలవాడ నాగరాణి చొరవ, దాతల సౌజన్యంతో కొన్ని పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లోని పార్కులను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు చేశామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. దాతల సౌజన్యంతో కొన్నింటిని ఆధునికీకరిస్తున్నామన్నారు.

✪ భీమవరం ఆదర్శనగర్‌లో 1.70 ఎకరాల విస్తీర్ణంలో పురపాలక పార్కును అభివృద్ధి చేయడానికి గతంలో కౌన్సిల్ హయాంలో రూ.1.35 కోట్లు ఖర్చుచేశారు. పచ్చదనం కోసం మరో రూ.5 లక్షలతో మొక్కలు నాటారు. ప్రస్తుతం చిట్టడవిలా మారింది.

ఆదర్శనగర్‌లోని పార్కులో నిరుపయోగంగా స్లైడ్

✪ హౌసింగ్‌బోర్డు కాలనీలో మూడు పార్కుల్లో ఒకటి దాతల సౌజన్యంతో అభివృద్ధి చేస్తున్నారు. మరొకటి స్థానికులు అభివృద్ధి చేసుకోగా రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పార్కును పూర్తిగా వదిలేశారు. ఇక్కడ రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు కూడా పొదల్లోకి చేరాయి.

హౌసింగ్‌బోర్డు కాలనీలో అధ్వానంగా పార్కు

**రూ.లక్షలు ఖర్చు చేసి..**

**పార్కు స్థలాలు- 42కి పైగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి- 4 మాత్రమే**

2005లో మారుతీనగర్ పార్కుకు రూ.10 లక్షలతో రక్షణ గోడ నిర్మించారు. 3.40 ఎకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేసేందుకు ఏపీ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ నుంచి తెదేపా హయాంలో రూ.90 లక్షలు కేటాయించింది. పార్కును మెరక చేసేందుకు పురపాలక సాధారణ నిధులు రూ.25 లక్షలు కేటాయించినా అభివృద్ధికి నోచుకోలేదు. స్థానికులు, దాతలసౌజన్యంతో నడకదారి బాగు చేయించుకున్నారు. ఆట వస్తువులు సమకూర్చుకున్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

| | |
|---|---|
| భీమవరం పట్టణం: 80085 74471 | 10 AM to 1 PM |
| భీమవరం మండలం: 80085 74533 | వీరవాసరం: 80085 74475 |
| పాలకోడేరు: 80085 74467 | ఉండి: 80085 74526 |
| ఆకివీడు: 80085 74525 | కాళ్ల: 94401 04042 |

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? రెస్ట్‌హౌస్ రోడ్డు మీద ఉంచిన చెత్త డబ్బాలు తొలగించాలి. రహదారి ఇరుకుగా ఉంది. **-లక్ష్మణరావు, స్థానికుడు**

? బుధవారం మార్కెట్ కూడలిలో చెత్త ఉంది. ఎప్పటికప్పుడు తీయించకపోవడంతో దుర్వాసన, ప్లాస్టిక్ సంచులు చెల్లాచెదురవుతున్నాయి. **-పి.శ్రీను, ప్రైవేటు ఉద్యోగి**

✔ చెత్తను వెంటనే తొలగించి డబ్బాలను పక్కకు పెట్టిస్తాం. **-ఎ.రాంబాబు, సహాయ కమిషనర్**

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు పెదపేట ప్రాంతంలో దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంది. **-స్థానికుడు**

✔ఇటీవల దోమల నిర్మూలనకు ఫాగింగ్‌తో పాటు మందును పిచికారీ చేయించాం. మరోసారి పూర్తిస్థాయిలో చేయిస్తాం.
**-సాకేత్‌బాబు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? కుముదవల్లి చైతన్య స్కూల్ వెనక వైపు ఉన్న పేదల కాలనీలో మట్టి రోడ్లు గుంతలమయంగా తయారవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. సీసీ రహదారులు నిర్మించాలి. **-రామకృష్ణ, పేదల కాలనీ, కుముదవల్లి**

✔ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. **-నరసింహారావు, ఏఈ, గృహనిర్మాణ సంస్థ, పాలకోడేరు**

## మొక్కలు నాటారు

ఈనాడు కథనానికి స్పందన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పైవంతెనకు ఇరువైపులా కుండీల్లో నాటిన మొక్కలు ఎండిపోయాయని 'ఈనాడు'లో నవంబరు 17న వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మొక్కలు నాటిస్తున్నారు. ✦ భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు దృష్టిసారించారు. దుర్వాసన, రోగులు పడుతున్న ఇబ్బందులను తెలుపుతూ 'ఇక్కడకు వస్తేనే రోగమొచ్చేలా ఉందే..' అనే శీర్షికన ఈ నెల 9న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి ఆసుపత్రి పర్యవేక్షకుడు లక్ష్మణ్ జీతానంద్ స్పందించారు. సిబ్బందితో చెత్తను తొలగింపజేయించి, పరిసరాలను శుభ్రం చేయించారు.

# రుణాలు అండగా.. వ్యాపారం దండిగా..

**స్వయం ఉపాధితో రాణిస్తున్న డ్వాక్రా మహిళలు**

విస్సాకోడేరు(పాలకోడేరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు పెద్ద మొత్తంలో రుణాలను మంజూరు చేస్తుండటంతో పలువురు మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకుంటున్నారు. పాలకోడేరు మండలం విస్సాకోడేరుకు చెందిన డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాలు నిర్వహించడంతో ఆర్థిక కష్టాల నుంచి బయటపడి లాభాల బాట పట్టారు. ఈ సందర్భంగా పలువురు తమ విజయగాథను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే...

**నెలకు రూ.40 వేల లాభం**

మా డ్వాక్రా సంఘం లీడర్లు, బ్యాంకు అధికారులు రుణ మంజూరుకు అంగీకరించడంతో పేపర్ ప్లేట్లు, మంచినీటి సీసాలు, గ్లాసుల తయారీ, విక్రయ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నా. బ్యాంక్ ద్వారా రూ.1.5 లక్షలు, ముద్ర రుణం కింద రూ.1.5 లక్షలు రుణం ఇవ్వడంతో ఏడాది కిందట వ్యాపారాన్ని ప్రారంభించా. ప్రస్తుతం నెలకు రూ.40 వేల వరకు లాభం వస్తుంది. దీంతో ఆర్థిక కష్టాల నుంచి బయటపడ్డా. **-సీహెచ్.లక్ష్మీసుధ, విస్సాకోడేరు**

**పాడి సంపదతో..**

నాకు ఇద్దరు పిల్లలు. వారి చదువుల ఖర్చుల కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉండేది. ఈ సమయంలో మా డ్వాక్రా గ్రూపు సభ్యుల సలహా మేరకు బ్యాంకు ద్వారా రూ.50 వేలు రుణం తీసుకుని ఒక పాడి గేదె కొనుగోలు చేశా. పాలు, నెయ్యి, వెన్న, పెరుగు అమ్మకం ద్వారా ఆర్థికంగా కాస్త ఊపిరిపీల్చుకున్నా. తర్వాత మరో రూ.లక్ష రుణం తీసుకుని మరో రెండు గేదెలు కొనుగోలు చేశా. ప్రస్తుతం నెలకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది.
**- బి.సత్యలక్ష్మి, విస్సాకోడేరు**

## నూతన కార్యవర్గం ఏకగ్రీవం

భీమవరం సాంస్కృతికం, పట్టణం, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) పట్టణశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా నిర్మలాదేవి మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కానూరి విజయ్‌కుమార్, కార్యదర్శిగా వి.పవన్ విహారి, కోశాధికారిగా కె.నాగశేఖర్‌లతో ఇంటర్నేషనల్ ఛైర్మన్ డాక్టర్ బి.హర్షవర్ధన్‌రెడ్డి, జోన్ డైరెక్టర్ పేరిచర్ల కృష్ణంరాజు ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. గత 5 ఏళ్లగా పట్టణంలో యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల నిమిత్తం పట్టణానికి చెందిన రాజేష్ అగర్వాల్ కుటుంబం రూ.లక్ష విరాళం అందించినట్లు తెలిపారు. జోన్ అధ్యక్షుడు కె.ప్రమోద్‌కుమార్, మాజీ అధ్యక్షుడు వి.రాహుల్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారంలో పలువురు ప్రతినిధులు

## కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో రహదారులు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని రహదారులు ఇరుకుగా మారడంతో ప్రయాణాలు కష్టంగా మారాయి. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలనే ఆదేశాలతో పురపాలక, పోలీసు అధికారులు బృందాలుగా ఏర్పడి తొలగిస్తున్నారు. రేకులు, సిమెంటుతో శాశ్వతంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను సైతం తొలగిస్తున్నామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు.

## ఆక్రమిస్తూ.. పూడ్చేస్తూ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఇది జిల్లాలోనే అత్యంత కీలకమైన యనమదుర్రు డ్రెయిన్. భీమవరం పట్టణ పరిధిలో ఇలా ఆక్రమణలతో కుచించుకుపోతోంది. కాలువగట్టుపై కొందరు అనధికారికంగా పాకలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల చెత్త వేసి పూడ్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టనట్లు వ్యవహరించడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఏఈ వెంకటేశ్వరరావును సంప్రదించగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కిక్కిస చెత్తతో పూడిపోయిన కాలువ

గట్టుపై వేసిన పాకలు

## నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు చినఅమిరానికి చెందిన బుద్ధరాజు రామరాజు జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీసరస్వతి రూ.1,00,116 విరాళం ఆదివారం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ బంగార్రాజుకు నగదు అందించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. దాసాంజనేయస్వామి ఆలయ ఈవో సీతారామరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈవో, ఛైర్మన్‌లకు నగదు అందజేస్తున్న లక్ష్మీసరస్వతి

# గమ్యం చేరాలంటే గగనమే

**అధ్వానంగా ఆకివీడు- కాళ్ల రహదారి**

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నుంచి అజ్జమూరు, కుప్పనపూడి మీదుగా కాళ్ల వరకు సుమారు 10 కి.మీ. మేర ప్రధాన మార్గంలో అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే బురదమయంగా, ఎండకాస్తే దుమ్ము, ధూళి ఎగసిపడుతున్నాయి. దీంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు, ప్రయాణికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కుప్పనపూడి నుంచి కాళ్ల వరకు ఉన్న రహదారి పూర్తిగా పాడైంది. దీంతో తరచూ లారీలు తదితర వాహనాలు దిగబడి పోతున్నాయి. ఆదివారం చేపల లోడుతో వస్తున్న లారీ దిగబడిపోయి ఇంజిన్ అడుగు భాగం బలంగా ఢీకొనడంతో నిలిచిపోయింది. వేరే లారీలోకి చేపలను ఎగుమతి చేసి, వాహనాన్ని మరమ్మతులు చేయించుకునేందుకు యజమాని, చోదకుడు అవస్థలు పడ్డారు.

కుప్పనపూడి గ్రామ శివారున రహదారిలో దిగబడిపోయిన లారీ

**రైల్వేగేటు మూసివేయడంతో..**

ఇటీవల ఉండి రైల్వే గేటు మూసివేయడంతో ఆకివీడు నుంచి భీమవరం వెళ్లే వాహన చోదకులు అజ్జమూరు, కుప్పనపూడి తదితర గ్రామాల మీదుగా కాళ్ల అక్కడి నుంచి భీమవరం చేరుకుంటున్నారు. దీంతో ఈ రహదారిలో వాహనాల రద్దీ పెరిగింది. ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ జేఈ కె.శ్రీహరిరాజు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా త్వరలో కుప్పనపూడి నుంచి కాళ్ల వరకు ఉన్న రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే ఆకివీడు నుంచి కుప్పనపూడి గ్రామాల మధ్య రహదారి గోతుల్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

# పల్లెలకు శుద్ధి జలాలు

➥ 64 చోట్ల మైక్రో ఫిల్టర్లు
➥ కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ నిధులు మంజూరు

శృంగవృక్షం(పాలకోడేరు), న్యూస్‌టుడే: ఉండి నియోజకవర్గ ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం దాదాపు అన్ని గ్రామాల్లో మంచినీటి పథకాల ద్వారా నీరు సరఫరా అవుతున్నా ఆక్వా సాగుతో పలు చోట్ల జలాలు కలుషితమై తాగడానికి పనికిరాని పరిస్థితి నెలకొంది. అధికశాతం గ్రామాల్లో ప్రైవేటు శుద్ధి కేంద్రాలపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక శాసనసభ్యుడు కనుమూరు రఘురామకృష్ణరాజు కృషితో మంచినీటి పథకాల వద్ద మైక్రోఫిల్టర్ల ఏర్పాటుకు పునాది పడింది. నాలుగు మండలాల పరిధిలో తొలి దశలో 64 చోట్ల వీటి ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో 27 చోట్ల, జల్ జీవన్ మిషన్ పథకంలో 24, ఎంపీ నిధుల ద్వారా 4, పంచాయతీ నిధులతో 7, దాతల సహకారంతో రెండు చోట్ల మైక్రోఫిల్టర్ల ఏర్పాటు పనులు పట్టాలెక్కాయి.

మోగల్లులో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్లు

**వేసవి నాటికి...**

ఉండి, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో దాదాపు 12 చోట్ల పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. సుమారు 20 చోట్ల పనులు చివరి దశకు చేరుకున్నాయి. వచ్చే వేసవి నాటికి మిగిలిన చోట్ల పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. పాలకోడేరు మండలంలో పెన్నాడ, మోగల్లు, కుముదవల్లి, శృంగవృక్షం, మైపలో వినియోగంలోకి తీసుకొచ్చారు. పాలకోడేరులో పనులు చివరి దశకు చేరుకున్నాయి.

**నియోజకవర్గంలో వివరాలు ఇలా..**

| మండలం | మంజూరైన మైక్రోఫిల్టర్ల సంఖ్య |
|---|---|
| పాలకోడేరు | 15 |
| ఉండి | 22 |
| ఆకివీడు | 16 |
| కాళ్ల | 11 |

## ఇంధన పొదుపుపై అవగాహన ప్రదర్శన

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్థానిక ప్రకాశంచౌక్ కూడలి నుంచి అవగాహ ప్రదర్శన నిర్వహిస్తామని విద్యుత్తు ఎస్ఈ పి.ఉషారాణి తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ నాగరాణి పాల్గొని ప్రారంభిస్తారన్నారు.

## నేడు సొసైటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

కొత్తపూసలమూరు(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం లోసరిగూట్లపాడు సహకార బ్యాంకు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం జరగనుంది. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు హాజరు కానున్నారని నాయకులు తెలిపారు.


since 1879 బొంబే డయింగ్
స్టాకిస్టు శ్రీనివాస్ భీమవరం 20వ వార్షికోత్సవ సేల్
15% సంపూర్ణ వస్త్రశ్రేణిపై డిస్కౌంట్ స్పెషల్ ఆఫర్
15 & 16 డిసెంబర్ 2 రోజులు మాత్రమే
కింగ్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2999 లేదా క్వీన్‌సైజ్ డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ MRP. 2699
1 కొనండి 2 ఉచితం
మీడియం డబుల్‌కాట్ బెడ్‌షీట్‌సెట్ 2కొనండి 60% డిస్కౌంట్ పొందండి.
రు.799ల సింగిల్ బెడ్‌షీట్స్ 3కొనండి కేవలం రు.1000లు మాత్రమే
ప్యాంట్ బిట్స్ 3 కొనండి కేవలం రు.1000లు మాత్రమే
పిల్లో 1కొనండి 1ఉచితం
ఫ్లోర్‌మాట్స్ 1కొనండి 1ఉచితం
రు.799ల టర్కీష్‌టవల్ రు.299లు మాత్రమే
రు.399ల పిల్లో కవర్సు పెయిర్ 1కొనండి 1ఉచితం
సుందరం / శ్రీమాన్ లుంగీ 1కొనండి 1ఉచితం
గమనిక: ప్రత్యేక స్కీములున్న వాటికి 15% డిస్కౌంట్ వర్తించదు.
శ్రీనివాస్ బొండవారి వీధి. శ్రీశ్రీశ్రీ మావుళ్ళమ్మ గుడి వీధి, భీమవరం. సెల్: 8977525575




కృతజ్ఞతాభివందనములు
ప్రతిష్టాత్మకమైన "వందే భారత్" నరసాపురం టు చెన్నై TRAINను నరసాపురం నుండి వెళ్ళడానికి కృషి చేసిన మాకు ఆప్తులు, శ్రేయోభిలాషులు, కేంద్ర మంత్రివర్యులు శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ గార్కి ఇవే మా కృతజ్ఞతాభివందనములు..
శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ గారు
నరసాపురం పార్లమెంట్ సభ్యులు
కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు
నేరెళ్ళ పెదబాబు S/o. రామబ్రహ్మం
ఆకివీడు మండల బీజేపీ మాజీ అధ్యక్షులు
రైల్వే ZRUCC మాజీ మెంబర్, ఆకివీడు. 98487 15777


## చికిత్స పొందుతూ మృతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం గ్రామీణ మండలంలోని వినాయకపురంలో చేపల చెరువుపై కాపలా ఉంటున్న వ్యక్తి (55) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చేపల చెరువుకు కొట్టే పురుగుల మందును ప్రమాదవశాత్తూ తాగడంతో చికిత్స నిమిత్తం భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఈ నెల 10న చేర్చారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం తణుకు, అటు నుంచి ఏలూరు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వివరాలు సేకరిస్తున్నామన్నారు.

## బస్‌షెల్టర్ నిర్మాణం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే దారిలో ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు. డాక్టర్ బీవీరాజు విగ్రహం కూడలిలో గతంలో పురపాలక సంఘాధ్వర్యంలో నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలమైంది. ఊడిపడుతున్న రేకులతో ప్రయాణికులు భయపడుతున్నారని సెప్టెంబరు 24న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి దాన్ని తొలగించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచనలతో శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సౌజన్యంతో డాక్టర్ బీవీరాజు మార్గ్‌లో ప్రయాణికులు ఉండేందుకు అనువుగా బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు.

## మురుగు వీడదు.. దీపాలు వెలగవు

**6 వార్డు నివేదన**

జనాభా: 2,900

ప్రధాన ప్రాంతాలు: ఇలాపువారి, పీతలవారి, ఆవాల, ముత్తరాసల, రెడ్డి, పడాల వీధులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీలోని 6వ వార్డు పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో ఫిల్టర్ కాని నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. రహదారులు, డ్రెయినేజీ, వీధి దీపాలు, అల్పవిద్యుత్తు, దోమలు, వీధి కుక్కలు తదితర సమస్యలు పరిష్కరించాల్సి ఉంది. సమస్యలు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు.

పీతలవారివీధిలో మట్టిరోడ్డు

✦ ఇలాపువారి వీధిలో ప్రధాన సీసీ రోడ్డు పల్లంగా ఉంది. ఎత్తు పెంచి నిర్మించాల్సి ఉంది. తాగునీటి పైప్‌లైన్ నిర్మించాలి. ✦ పీతలవారి వీధిలో మట్టిరోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి. ✦ ఆవాల, పీతలవారి వీధులతో పాటు పలు నివాసిత ప్రాంతాల్లో అల్పవిద్యుత్తు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు పరివర్తకాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. ఆవాల వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలి. ✦ సంతమార్కెట్‌కు వెళ్లే రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి. ✦ రెడ్డివీధిలో డ్రెయినేజీల ఎత్తుపెంచాలి. ఇక్కడి నుంచి సంతమార్కెట్‌కు వెళ్లే మార్గంలో రెండు చోట్ల కల్వర్టులు నిర్మించాలి. ✦ ఇలాపువారివీధిలో విద్యుత్తు తీగలు దిగువకు ఉన్నాయి. దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

# గురి పెడతాం.. లక్ష్యాన్ని ఛేదిస్తాం

**రైఫిల్- పిస్టోల్ షూటింగ్‌లో రాణిస్తున్న యువకులు**

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కొన్నేళ్ల కిందట వరకు అతి కొద్ది మంది మాత్రమే నేర్చుకునే రైఫిల్ షూటింగ్‌పై ఇప్పుడు చాలా మంది దృష్టి పెడుతున్నారు. సరదాగా నేర్చుకోవడం కాకుండా.. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం పతకాలు సాధిస్తున్నారు. భీమవరం పట్టణానికి చెందిన పలువురు యువకులు ఒక పక్క చదువులో రాణిస్తూ మరో పక్క వారికిష్టమైన క్రీడాంశంలో ప్రతిభ కనబరుస్తున్నారు. త్వరలో ఇతర రాష్ట్రాల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు పట్టుదలగా సాధన చేస్తున్నారు.

**జాతీయ స్థాయిలో రాణించాలని..**

నాకు రైఫిల్ షూటింగ్ అంటే ఎంతో ఇష్టం. ఈనెల 8న ఇండోర్(మధ్యప్రదేశ్)లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో 200 మందితో పోటీ పడి 20వ ర్యాంకులో నిలిచా. ఈ ఏడాది నవంబరులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో, సెప్టెంబరులో భీమవరంలో జరిగిన జిల్లా పోటీల్లో బంగారు పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించాలన్నది నా కోరిక. వైద్యుడిగా సేవలందించాలని నా భవిష్యత్తు లక్ష్యం.

**సైన్యంలో చేరి దేశానికి సేవలందిస్తా**

జనవరి 15 నుంచి 20 వరకు మీరట్(ఉత్తరప్రదేశ్)లో జరిగే పోటీలకు అర్హత సాధించా. ఈ ఏడాది మేలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచా. నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్నా. ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలన్నది నా కోరిక.

**ప్రత్యేక శిక్షణ తీసుకున్నా**

పిస్టోల్ షూటింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. అక్టోబరులో చెన్నైలో జరిగిన పోటీల్లో 33వ స్థానంలో నిలిచా. 2026 జనవరి 1న దిల్లీలో జరిగే జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నా. సెప్టెంబరులో కేరళలో జరిగిన దక్షిణ భారత జోనల్ పిస్టోల్ పోటీల్లో 23వ ర్యాంకు, ఈ ఏడాది మే నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర పోటీల్లో, నవంబరులో ఒంగోలులో జరిగిన రాష్ట్ర పోటీల్లో ఏడో ర్యాంకు దక్కించుకున్నా. దానికి ముందు జిల్లా పోటీల్లో పలు పతకాలు గెలుచుకున్నా.

## ప్రతి ఒక్కరిలో సేవాగుణం అవసరం

పాలకోడేరు, న్యూస్‌టుడే: చదువుతో పాటు ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే సేవాగుణం కలిగి ఉండాలని పెన్నాడ బైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ సూచించారు. పెన్నాడలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం ముగింపు సభలో శిబిరంలో సేవలందించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శిబిరం సమన్వయకర్త మనోహర్, డీన్ కురెళ్ల భాస్కరరావు, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

# నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## రాష్ట్రస్థాయి తెలుగు పరీక్షలో తృతీయ స్థానం

**పెనుగొండ, న్యూస్‌టుడే:** 'మన సంస్కృతి సంస్థ' రజతోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పరీక్షలో తమ విద్యార్థిని ఎల్లాప్రగడ శ్రీలలిత మూడో స్థానంలో నిలిచిందని పెనుగొండలోని భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ ఎన్. వెంకట అప్పారావు ఆదివారం తెలిపారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన వేడుకలో ఆమె జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉప కులపతి జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి నుంచి అవార్డు, నగదు పురస్కారం అందుకున్నట్లు పేర్కొన్నారు.

జ్ఞాపిక అందుకున్న శ్రీలలిత

## గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

**పోడూరు, న్యూస్‌టుడే:** జిన్నూరులో శాఖా గ్రంథాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఆలమూరు కాళీ ప్రసాద్, రమశ్రీ దంపతులు 200 పుస్తకాలు సమకూర్చారు. వీటిని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స సూర్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు బూడి కృష్ణ, ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఆచంట సాయిరామ్‌లు గ్రంథాలయాధికారికి ఆదివారం అందజేశారు.

**మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM**

| | | | |
|---|---|---|---|
| నరసాపురం | : 80085 74504 | ఆచంట | : 90631 44737 |
| పాలకొల్లు | : 80085 74510 | పెనుగొండ | : 80085 74469 |
| పోడూరు | : 90631 44741 | పెనుమంట్ర | : 91212 29087 |

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** ? దేవుని తోట రోడ్డులో పైపులైను లీకేజీ కారణంగా జలాలు వృథా అవుతున్నాయి కుళాయి నీరు కలుషితమవుతోంది. - **ఎం.చంద్రశేఖర్, నరసాపురం**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -**కిశోర్, పురపాలక ఏఈ**

**నరసాపురం, న్యూస్‌టుడే:** ? మొగల్తూరు రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ సమీపాన చెత్తను సకాలంలో తొలగించడం లేదు. - **వీరాంజనేయులు, నరసాపురం**

✔ పరిశీలించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకుంటాం. - **పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** ? పాలకొల్లులో అన్న క్యాంటీన్ వెనుక ఉన్న పురపాలక దుకాణ సముదాయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. - **కుమార్, స్థానికుడు**

✔ మరమ్మతులు చేయిస్తాం. - **రాజ్‌కుమార్, పురపాలక డీఈ**

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** ? మొగల్తూరులో సేకరించిన చెత్తను ముత్యాలపల్లి వంతెన సమీపాన వేసి నిప్పు పెడుతున్నారు. పొగ, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **కేశవరావు**

✔ చర్యలు చేపడతాం. - **ఎం.నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో**

## ప్రయాణం.. ఇక సాఫీగా!

**కీలక రహదారుల అభివృద్ధికి నిధులు**

**పెనుమంట్ర, పోడూరు, న్యూస్‌టుడే:** రహదారి కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. నరసాపురం డివిజన్ పరిధిలో కీలక రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది. బ్రాహ్మణచెరువు- నౌడూరు ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు.

**ఇదీ పరిస్థితి..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో బ్రాహ్మణచెరువు- వీరవాసరం మార్గంలో పాలమూరు శివారు నౌడూరు కూడలి వరకు రహదారి ఘోరంగా మారింది. ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రత్యేకంగా దృష్టి సారించారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులతో మాట్లాడి రూ. 2.50 కోట్లు మంజూరు చేయించారు. ఇటీవల టెండరు ప్రక్రియ పూర్తయింది. నౌడూరు ప్రాంతంలో 225 మీటర్ల మేర సీసీ రహదారి, బ్రాహ్మణ చెరువు- పాలమూరు మధ్య 2.6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మిస్తారు.

**అనుసంధాన మార్గం పనుల్లో కదలిక**

జిన్నూరులో అనుసంధానం మార్గం పనుల్లో కదలిక వచ్చింది. నరసాపురం- నిడదవోలు ప్రధాన పంటకాలువపై జిన్నూరు వద్ద 2009-14 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మించారు. కానీ అప్రోచ్ నిర్మించకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారింది. ముగ్గురు సర్పంచుల పదవీ కాలం పూర్తయినా ఈ వంతెన వినియోగంలోకి రాలేదు. 2019 ఫిబ్రవరిలో రూ. 1.23 కోట్లతో అప్రోచ్ పనులకు శంకుస్థాపన చేసినా పనుల్లో కదలిక లేదు. ఇటీవల కాలంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు గుత్తేదారుడ్ని పలుమార్లు హెచ్చరించడంతో పనుల్లో కదలిక వచ్చింది. ప్రస్తుతం అప్రోచ్‌కు ఉత్తరం వైపు నుంచి గ్రావెల్ వేసి రహదారి నిర్మిస్తున్నారు. ఈ నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ మూర్తి తెలిపారు.

## సూర్య భగవానుడికి అభిషేకాలు

**నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే:** నరసాపురంలో వశిష్ఠ గోదావరి తీరంలో బాపు ఘాట్ వద్ద ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు ఇచ్చారు.

## రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

**పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** పాలకొల్లులోని అష్ట భుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం (చిన గోపురం)లో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది జనవరి 14 వరకు నిత్యం ఉదయం, సాయంత్రం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేస్తారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

## సాంకేతికత సద్వినియోగంతో విజ్ఞానం

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** ఆధునిక సాంకేతికతను సక్రమంగా వినియోగించుకొంటే విజ్ఞానం పెంపొందించుకోవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. వేములదీవి పడమర పరిధి కాపుల కొడప జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పట్టా శృతి (తొమ్మిదో తరగతి) గాడి ఉడాస్టార్, (ఏడో తరగతి), కల్యాణి శ్రీనిధి (ఏడో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఈనాడు సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రధానోపాధ్యాయుడు వీరవల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అందజేశారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. మాజీ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీ వర్ధంతిని పురస్కరించుకొని యూటీఎఫ్ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణంలోని వైష్ణవి ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డాక్టర్ బాబ్జి ప్రారంభించారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

శంకుస్థాపన పూజల్లో ఎమ్మెల్యే పితాని

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. రూ 3.20 కోట్లతో ఓడూరు, భట్లమగుటూరు, పొలమూరు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాధాన్య క్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. రూ. 2.5 కోట్లతో బ్రాహ్మణచెరువు- నౌడూరు మధ్య బీటీ, సీసీ రహదారి నిర్మాణం చేస్తామని తెలిపారు. రూ. 50 లక్షలతో భట్లమగుటూరు పీహెచ్‌సీలో ఇంటిగ్రేడ్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాశ్, ఎంపీపీ వీరవల్లి భవాని, సర్పంచులు బి.రవికుమార్, కె.రాజేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పి.నరసింహమూర్తి, తెదేపా మండలాధ్యక్షుడు వెలగల బుల్లిరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కర్రి అచ్యుతరామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

### దారి సమస్య పరిష్కారానికి ఆదేశాలు

**పెనుమంట్ర, న్యూస్‌టుడే:** పొలమూరులో ఎస్సీ శ్మశాన వాటిక రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అధికారులు, స్థానికులతో మాట్లాడారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు చరవాణి అందిస్తున్న మంత్రి నిమ్మల

## మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో మంత్రి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 224 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు అధునాతన 5 జీ చరవాణులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలపై పనిభారం తగ్గించేలా యాప్‌ల సంఖ్యను కుదించే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నాయకులు పెచ్చెట్టి బాబు, జీవి, బోనం చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా వాసవీ హోమం

**పెనుగొండ, న్యూస్‌టుడే:** పెనుగొండలోని వాసవీశాంతిధాం ఆదివారం విజయనగరం జిల్లా శృంగవరపుకోట నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అర్చకుడు శిష్ఠా మణికంఠ తదితరులు వారితో గోపూజలు, వాసవీమాత మరకత ప్రతిమ వద్ద పూజలు చేశారు. అనంతరం వాసవీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## బీచ్‌లో పర్యాటకుల సందడి

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్‌ల పరిధిలో బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

## ఐక్యతతో ప్రగతి బాట

మాట్లాడుతున్న సుబ్బారాయుడు

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** రాష్ట్రం ప్రగతి బాటలో పయనించేలా ఐక్యంగా కృషి చేద్దామని కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. సీతారామపురం లేసు పార్కు సమీపాన కొండవీటివారి తోటలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి తెలగ, కాపు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పవన్‌కల్యాణ్ కాపు సామాజిక వర్గానికి మరింత గుర్తింపు, గౌరవాన్ని తీసుకువచ్చారన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యలో ప్రతిభ చూపిన కాపు విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, కాపు సంఘ నాయకుడు కోటిపల్లి సురేశ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి కృషి

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** పేదల అభ్యున్నతే లక్ష్యంగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. వారతిప్ప గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు పెదసింగు శ్రీను తన మద్దతుదారులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరారు. వారికి నాయకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొల్లాటి బాబూరావు, మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు మైలా వసంతరావు, సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారకరామారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. ● వారతిప్ప గ్రామానికి చెందిన వీరవల్లి అశ్వినీకుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కును నాయకర్ అందజేశారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న నాయకర్

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నరసాపురం మండలం చిట్టవరం గ్రామంలో చేపట్టిన సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వాలంటీర్లు గ్రామంలో మొక్కలు నాటారు. సర్పంచి తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న తెదేపా నాయకులు

## ప్రజా సేవలతో గుర్తింపు

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రజల కోసం పనిచేసే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పలువురు నాయకులు అన్నారు. తెదేపా నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పుట్టినరోజును పురస్కరించుకొని సరిపల్లి శివారు చినమామిడిపల్లి కాలనీలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి స్థానికులకు పంచారు. మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, అగ్నికుల క్షత్రియ సంఘం కన్వీనర్ కొప్పాడ రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు నేత్ర పరీక్షలు

**పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే:** పాలకొల్లు వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధాశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వృద్ధులకు నేత్రపరీక్షలు చేసి అవసరమైన వారికి క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, సభ్యులు కళ్లజోళ్లను పంపిణీ చేశారు.

## చిన్నారులకు చలి దుస్తుల పంపిణీ

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లులోని రాచెల్‌శాస్త్రి చిల్డ్రన్ హోంలో చిన్నారులకు ఎస్‌డీపీ లైఫ్ సేవర్స్ బ్లడ్, ఫుడ్ సర్వీస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం చలి దుస్తులు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు తోట దుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదంలో మృతి

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** నరసాపురం- పాలకొల్లు జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టవరం గ్రామ పరిధిలో పెట్రోలు బంకు సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన పూరిళ్ల రమేశ్ (45) తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆయనను 108 అంబులెన్సులో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరం తరలిస్తుండగా మధ్యలో మృతి చెందారు. అతడి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నరసాపురం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జూదరుల అరెస్టు

**నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణ పరిధి జోశ్యులవారివీధిలో నిర్వహిస్తున్న జూద కేంద్రంపై ఆదివారం దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు.

## ప్రోత్సహిస్తే రాణిస్తాం.. సాధిస్తాం!

**క్రీడా పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ**

**పెనుగొండ, న్యూస్‌టుడే:** వడలి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. భీమవరం డీఎన్‌ఆర్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో ఈ నెల 6న నిర్వహించిన జోనల్ స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి షాట్‌పుట్, పరుగు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. తగిన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని ఈ విద్యార్థులు చెబుతున్నారు.

**క్రీడలంటే ఇష్టం**

పదో తరగతి చదువుతున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే ఎంతో ఇష్టం. పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి వివిధ క్రీడల్లో సాధన చేస్తున్నా. ఇటీవల జరిగిన పోటీల్లో 100 మీటర్ల పరుగులో ద్వితీయ బహుమతి సాధించా. షాట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచా. - **బి.దేవీ షణ్ముఖ్**

**నిత్యం సాధన**

నేను ఆరో తరగతి చదువుతున్నా. బాలికల విభాగం పరుగు పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచా. చదువు కొనసాగిస్తూనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో నిత్యం క్రీడా సాధన చేస్తున్నా. ఈ పోటీల్లో విజయం సాధించడం నాలో ఆత్మవిశ్వాసం నింపింది. - **సి.దీవెనలహరి**

**ఉపాధ్యాయుల సూచనలతో..**

ఆరో తరగతి చదువుతున్నా. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో షాట్‌పుట్, ఇతర క్రీడల్లో సాధన చేయడం అలవాటుగా మారింది. ప్రధానోపాధ్యాయుడు కేతా విఘ్నేశ్వరరావు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సాధన చేయడంతో షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించా. - **సి.జీవనలాస్య**

## ఆక్రమణల చెరలో కల్లాలు

**రైతులకు తప్పని ఇక్కట్లు**

**పోడూరు, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే**

గ్రామీణ ప్రాంతాల్లో గతంలో రైతులు కల్లాలుగా వినియోగించిన స్థలాలు కాలక్రమంలో ఆక్రమణతో కనుమరుగయ్యాయి. దీంతో రైతులు ప్రతి సీజన్లోనూ ధాన్యం ఆరబోతకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ యంత్రాలతో వరి కోతలు జరుగుతున్నాయి. దీనికి గంటకు రూ. 3,200వరకు వెచ్చించాల్సి వస్తోంది. ధాన్యాన్ని నాలుగైదు రోజులు ఆరబెడితే గానీ తేమశాతం 17కు తగ్గడం లేదు. అనువైన స్థలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అదనంగా రూ. 2 వేల వరకు రవాణా వ్యయం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆధ్వర్యంలో స్థలాలు సేకరించి సామూహిక కల్లాలుగా అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

● నరసాపురం మండలం మల్లవరం పంచాయతీ పరిధిలో ధాన్యం ఆరబోతకు జాగా లేకపోవడంతో రైతులు పెదలంకలో శ్మశాన వాటికి స్థలాన్ని వినియోగించుకోవాల్సి వస్తోంది.

పెనుమదం పంచాయతీ పరిధి పైడావ రహదారిలో అనధికార లే అవుట్‌ను రైతులు ధాన్యం ఆరబోతకు వినియోగిచుకుంటున్నారు. గ్రామాల్లో పుంతలు ఆక్రమణల చెరలో చిక్కుకోవడంతో సామూహిక కల్లాలు కరవయ్యాయి. దీంతో రైతులు రహదారుల పక్కన, ఇలాంటి లేఅవుట్లు, కాలువగట్లు, శ్మశాన స్థలాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు.

## పోటీతత్వంతో ప్రతిభకు పదును

పరీక్షకు హాజరైన విద్యార్థులు

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పోటీ పరీక్షల ద్వారా స్వీయ సామర్థ్యాలను అంచనా వేసుకొంటూ ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల ప్రాంగణంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతన అర్హత పరీక్షను ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 2,623 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ఛైర్మన్ కె.వి.ఆర్.నరసింహారావు తెలిపారు. కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేలా పోటీ పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో పతకాలు

**ఆచంట, న్యూస్‌టుడే:** తణుకులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే 2025 పోటీల్లో పెనుమంచిలి జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి స్వర్ణ పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థినులు తులసీ జాస్మిన్, నవ్య వైష్ణవి, కీర్తన, దీక్షితలు ఈ పోటీల్లో విజయం సాధించి పతకాలు సాధించినట్లు చెప్పారు. వీరిని పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

## ప్రభుత్వం దృష్టికి దివ్యాంగుల సమస్యలు

**పోడూరు, న్యూస్‌టుడే:** దివ్యాంగుల సమస్యలను మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పెనుమదం నీటి సంఘం అధ్యక్షుడు దేవరపు దొరబాబు పేర్కొన్నారు. పెనుమదంలో ఆదివారం జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్లు, మూడు చక్రాల మోటారు సైకిళ్లు అందించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి తానేటి బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు మానేపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి పీవీ రావు కృషి

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు వర్ధంతిని పాలకొల్లు గాంధీబొమ్మల కూడలిలో ఆదివారం నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, పలువురు నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు, దళితుల అభ్యున్నతికి పీవీ రావు ఎనలేని కృషి చేశారన్నారు.

## డ్రెయిను వేసి.. మట్టి వదిలేసి

**పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** పాలకొల్లు వీవర్స్‌కాలనీలోని జీవీఎస్‌ఆర్ఎం ప్రాథమిక పాఠశాల ప్రహరీని అనుకొని డ్రెయిను నిర్మాణం చేశారు. సుమారు నాలుగు నెలలు గడిచినా దీనికి సంబంధించిన మట్టిని అక్కడి నుంచి తొలగించకుండా వదిలేశారు. ఈ మట్టి క్రమంగా డ్రెయిన్లోకి చేరి మురుగు నిలిచిపోతోందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై పురపాలక డీఈ రాజ్‌కుమార్ స్పందిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి మట్టి తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## పొగతో ఉక్కిరిబిక్కిరి!

**పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** నిత్యం రద్దీగా ఉండే పూలపల్లి- భీమవరం రహదారి వెంబడి కొందరు చిరు వ్యాపారులు వ్యర్థాలు వేసి నిప్పు పెడుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి దట్టమైన పొగ రావడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, చుట్టుపక్కల నివాసితులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొన్నిసార్లు పొగ రహదారిని కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని చోదకులు చెబుతున్నారు. ఈ సమస్యపై డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు స్పందిస్తూ ఆ ప్రాంతంలో చెత్తను దహనం చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇంధన పొదుపు వారోత్సవాలు

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తూర్పు ప్రాంత విద్యుత్తు సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నామని తాడేపల్లిగూడెం తూర్పు ప్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. విద్యుత్ పొదుపు అవగాహన ప్రదర్శనలు, విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

## ఆక్రమణల తొలగింపు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** భీమవరం పట్టణంలో రహదారులు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలోని రహదారులు ఇరుకుగా మారడంతో ప్రయాణాలు కష్టంగా మారాయి. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించారు.


**అమృతమూర్తికి అశ్రునివాళి**

శ్రీమతి బండారు దుర్గ గారు
M.A., M.A., M.Ed., RBP, HPT
రిటైర్డ్ టీచర్, తాడేపల్లిగూడెం
W/o. కీ॥శే॥ బొడ్డు అప్పారావు గారు, B.Sc. (Ag), Rtd. Lecturer

జననం : 8-12-1951
మరణం : 5-12-2025

ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎందరికో విద్యాదానం చేసి, ఆదర్శగృహిణిగా, మాతృమూర్తిగా, ప్రేమ ఆప్యాయతలతో మమ్ములను పెంచి, మన కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసి అలసిసొలసి విశ్రమించిన మీ పాదాలకు మా అశ్రునివాళులు అర్పిస్తూ.. మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ శివైక్యం చెందిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో.. మీ..

కుమారుడు: డా॥ B.B.ఫణికుమార్ M.D., DM (Neph)
కోడలు: డా॥ P.V.శ్రావణి M.D. (DERM)
పెద్దకుమార్తె: U.శ్రీ జోత్స్న B.Com., B.Ed.
అల్లుడు: U.సుబ్బారావు, B.Sc., B.Ed Rtd. ASWO
చిన్న కుమార్తె: డా॥ B.సుధాప్రియ M.A., M.Sc., M.Ed., Ph.D Assistant Professor, SJCW, వైజాగ్
మనుమలు, మనుమరాండ్రు:
డా॥ U.సాహితి అపురూప M.D (Path) - డా॥ R.సందీప్‌కుమార్ M.D(DERM)
U.సాయి చరణ్ M.Tech - U.L.కళ్యాణి M.Sc.,
డా॥ B.సాయి హృదయ్ MBBS,
B.ప్రిషా వైష్ణవి (MBBS), B.ప్రభవ్ చాణక్య (B.Tech)
ముని మనుమలు : R.పూర్వాంశ్ శ్రేయాస్ షణ్ముఖ్, R.రాగ సంహిత, U.N.V.సత్య జియాన్

పెద్దకార్యం : ది. 15-12-2025 సోమవారం తాడేపల్లిగూడెం రామారావుపేట కరణాల సత్రంవారి వీధిలో మా స్వగృహము నందు జరుపబడును. సెల్ : 75698 68529


(c) eenadu

# తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

## అమ్మవారి జాతరకు పందిరి రాట

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** సీతారాంపేట, కొబ్బరితోటలోని పుంతలో ముసలమ్మ అమ్మవారి 43వ వార్షికోత్సవం అంకురార్పణగా ఆదివారం ఉదయం రాట ముహూర్తం కార్యక్రమం జరిగింది. అమ్మవారికి జనవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జాతర మహోత్సవాలు జరుపుతామని ఉత్సవ కమిటీ సభ్యులు రాజాత్రినాథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

76వ జయంతి శుభాకాంక్షలు
తణుకు నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, నిగర్వి, నిరాడంబరులు, నిష్కళంకులు, తణుకు మాజీ శాసనసభ్యులు
శ్రీ Y.T. రాజా గారి
పుట్టినరోజు సందర్భంగా వారికి మా హృదయపూర్వక జయంతి శుభాకాంక్షలు.
పులమాల వీరభద్రం, బీజేపీ నాయకులు, తణుకు
కొడమంచిలి జితేంద్రకుమార్, (బీజేపీ)
యన్నమని రామకృష్ణ, బీజేపీ నాయకులు


## స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

**తాడేపల్లిగూడెంఅర్బన్,న్యూస్‌టుడే:** ఈ వారం మార్కెట్లో కూరగాయల ధరలు క్రితం వారంతో పోలిస్తే స్వల్ప వ్యత్యాసం ఉంది. రావులపాలెం చిక్కుళ్లు, బెండ, ఉల్లిపాయలు, టమాటా, దోస, ఆనపకాయలు రేట్లలో స్వల్ప పెరుగుదల ఉందని వ్యాపారులు అంటున్నారు. తెల్లవంకాయలు, కొత్తిమీర, నిమ్మకాయల రేట్లు గత వారంతో పోలిస్తే రేటు తక్కువగా ఉంది. ఆదివారం కేజీ వంకాయలు రూ. 50, టమాటాలు 60, క్యాబేజీ 30, అల్లం70, బంగాళాదుంపలు కలకత్తా 25, ఆగ్రా బంగాళాదుంపలు 35 రూపాయలు, మిర్చి 60, ఉల్లిపాయలు 27, బెండ 70, దొండకాయలు 55, గుమ్మడికాయ 40, క్యారెట్ 55, కాలీఫ్లవర్ 27, చిక్కుళ్లు 30, నాటు చిక్కుళ్లు 90 రూపాయలుగా ఉన్నాయి.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తూర్పు ప్రాంత విద్యుత్తు సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నామని తాడేపల్లిగూడెం తూర్పు ప్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అవగాహన ప్రదర్శనలు, డివిజన్‌లోని విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు, స్వయం సహాయక మహిళా బృందాల వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## సంచార శకటంతో ఇంటికే వైద్యం

**తణుకు, న్యూస్‌టుడే:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డా హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డా. నిమ్మగడ్డ అచ్యుత రామయ్య తణుకు, ముక్కామల, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు 99853 43530, 90592 90717 నంబర్లను సంప్రదించాలని కోరారు.



Y.T.R 76వ జయంతి నివాళి
పారిశ్రామిక, రాజకీయ, సామాజిక సేవారంగాలలో ఆదర్శంగా ఉంటూ అందరి అభిమానం పొందిన ఆత్మీయ నాయకులు, మాకు ముఖ్యమైన మార్గదర్శకులు అయిన మాజీ MLA శ్రీ యలమర్తి తిమ్మరాజా (వై.టి.ఆర్) గారి 76వ జయంతి సందర్భంగా వారికివే మా ఆత్మీయ నివాళి.
శ్రీ Y.T. రాజా గారు
మాజీ MLA, తణుకు
మల్లిన అరుణసారధి
పారిశ్రామికవేత్త, ఉండ్రాజవరం
అనపర్తి ప్రకాశరావు
డైరెక్టర్ : మాంటిస్సోరి స్కూల్, తణుకు


## చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

**తాడేపల్లిగూడెం అర్బన్,న్యూస్‌టుడే:** స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తను తగలబెడుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద పెద్ద పరుపులు, ఇంటి సామానులు ఇక్కడ పడేస్తున్నారు. దీంతో ఇక్కడ దుర్గంధం విపరీతంగా వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చెత్తవేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇళ్ల నిర్మాణానికి 421 దరఖాస్తులు

**ఇరగవరం, న్యూస్‌టుడే:** 'పీఎం గ్రామీణ ఆవాస్ యోజన'కు సంబంధించి మండలంలో 421 దరఖాస్తులు అందాయని మండల హౌసింగ్ ఏఈ మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. సొంత స్థలం ఉండి ఇళ్లు లేని పేద కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు గృహ నిర్మాణం నిమిత్తం ఒక్కో ఇంటికి రూ.2.5లక్షలు అందిస్తారన్నారు.

## చదవడం అంటే మాకిష్టం

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో 'చదవడం అంటే మాకిష్టం' కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక పఠన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా డిసెంబరు 14న నిర్వహించే నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ డే ప్రాముఖ్యాన్ని వివరించారు. ఇంధన వనరులు, ఉత్పత్తి పొదుపు ఆవశ్యకతలపై పౌరుల బాధ్యతను తెలియజేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుస్తక పఠనం చేశారు.

## ఫొటోగ్రాఫర్ల ఆత్మీయ కలయిక

**తాడేపల్లిగూడెంఅర్బన్,న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ కలయిక ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. కార్యక్రమాన్ని యూనియన్ అధ్యక్షుడు కాపాక గంగాధర్, కార్యదర్శి అయితం ప్రసాద్ వెలిగించిత కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో ఉన్న యూనియన్ నాయకులకు శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మరడాని రాము, కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు పెద్దోజు మురళి, భాను ప్రసాద్, కోశాధికారి మండా పవన్, సహాయ కార్యదర్శి శ్రీను, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పలువురికి పరామర్శ

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాయకుల కుటుంబ సభ్యులను ఏపీ భవన ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ ఆదివారం పరామర్శించారు. పలు గ్రామాల్లో పలు నాయకుల కుటుంబ సభ్యులు మృతి చెందడంతో వారి ఇంటికెళ్లి పరామర్శించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే :** ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు గాయపడిన సంఘటన మండలంలోని ఉరదాళ్లపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం శివారు పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద ఈనెల 11వ తేదీ మధ్యాహ్నం నార్ని సీతారామయ్య (69) ద్విచక్రవాహనంపై ఉండగా గణపవరం గ్రామానికి చెందిన నామాల రాఘవ పిప్పర నుంచి ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉరదాళ్లపాలెంకు చెందిన కాసుల వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాస్ తెలిపారు.

## వ్యాపారిపై దాడి.. నిందితుడిపై కేసు

**కైకలూరు, న్యూస్‌టుడే:** గ్రామాల్లో గృహోపకరణాలు విక్రయించే వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కైకలూరు గ్రామీణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట గ్రామానికి చెందిన వెంట్రపాటి వీర రాఘవులు వాయిదాల విధానంలో సొమ్ములు తీసుకుంటూ గృహోపకరణాలు విక్రయిస్తుంటారు. కొన్నేళ్లుగా కైకలూరు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మండలంలోని దొడ్డిపట్లలో వస్తువులు విక్రయించేందుకు వచ్చారు. గ్రామానికి చెందిన పంచదార నాగమణి కొన్ని వస్తువులు కావాలని అడగ్గా.. పాత బకాయి చెల్లించాలని కోరారు. అక్కడే ఉన్న నాగమణి కుమారుడు రమేశ్ కల్పించుకుని వీర రాఘవులతో గొడవపడి అతని సెల్‌ఫోన్ పగులగొట్టడంతో పాటు దాడి చేసి గాయపరిచాడు. గాయాలతో కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితుడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామీణ థాణా హెడ్ కానిస్టేబుల్ విజయబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

Y.T.రాజా 76వ జయంతి నివాళి
అజరామరమైన కీర్తి ప్రతిష్టలను అణువణువున నింపుకొన్న మనిషి, రాజకీయాల్లో విలువల కోసం కృషిచేసిన అరుదైన ఆదర్శనేత, నిజాన్ని నిర్భయంగా చెప్పే లౌక్యం తెలియని నికార్సయిన మంచి వ్యక్తి, మాకు మార్గదర్శకులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ యలమర్తి తిమ్మరాజా (వై.టి.రాజా) గారి 76వ జయంతి సందర్భంగా వారికివే మా ఆత్మీయ నివాళి.
శ్రీ Y.T.రాజా గారు
తణుకు
ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే
S.N.ఆదినారాయణరాజు (దొరబాబు), DCMS మాజీ ఛైర్మన్
డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్
పరిమి వెంకన్నబాబు, తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్
మంత్రిరావు వెంకటరత్నం (బాబు), AP రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మెంబర్
బసవా రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు
కలగర వెంకటకృష్ణ, తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షులు
వంటెద్దు రాజా, తణుకు తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు
వావిలాల వెంకట రమేష్, రమేష్ జ్యూయలరీ అధినేత
వావిలాల సరళాదేవి, తణుకు పురుషుల శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు
గూడపాటి వెంకట్రావు, పారిశ్రామికవేత్త
గమిని రాంబాబు, పారిశ్రామికవేత్త
నండూరి రామ్మోహన్, అడ్వకేట్
నండూరి రామానుజం, అడ్వకేట్
K.S.L.N.ప్రసాద్, అడ్వకేట్
కానుకొలను శ్రీసాయి సంజయ్, అడ్వకేట్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
తాడిపర్తి కోటేశ్వరరావు, అడ్వకేట్
పుట్టా రామచంద్రరావు, తణుకు రోటరీ క్లబ్ మాజీ కార్యదర్శి
మేడికొండ వెంకటేశ్వరరావు, తణుకు
కంటిపూడి రాంబాబు, APBA ఉపాధ్యక్షులు
పరిమి కృష్ణమల్లిఖార్జున్, S/o. పరిమి వెంకన్నబాబు
అక్కిన బాపినీడు, తణుకు-పాతవూరు
కొఠారు విజయకృష్ణ, రిటైర్డ్ ఎక్సైజ్ APP, తణుకు పాతవూరు
అల్లూరి కరుణాకర్‌చౌదరి, తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు
నల్ల భాస్కరరావు, తణుకు నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు
కోడూరి ఆంజనేయులు, తణుకు




76వ జయంతి శుభాకాంక్షలు
తణుకు నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, నిగర్వి, నిరాడంబరులు, నిష్కళంకులు, మా స్ఫూర్తి ప్రదాత, మా దిశ నిర్దేశికులు
శ్రీ Y.T.రాజా గారి
పుట్టినరోజు సందర్భంగా వారికి మా హృదయపూర్వక జయంతి శుభాకాంక్షలు.
కీ॥శే॥ శ్రీ Y.T.రాజా గారు
తణుకు మాజీ శాసనసభ్యులు
పరిమి వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు)
తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్
నల్ల శ్రీనివాసరావు (వాసు) NRI | చిట్టూరి సాయిబాబు (Ex. కౌన్సిలర్) | పరిమి కృష్ణ మల్లిఖార్జున్
అక్కిన వెంకటేశ్వరరావు (నాని) NRI | సందిన వెంకటేశ్వరావు (బంగారం) (Ex. కౌన్సిలర్) | మాగంటి వరప్రసాద్ (Aptech Babu)
బలుసు అజయ్ NRI | లకంసాని శివరామప్రసాద్ (శివ) | మల్లిన వెంకట్రావు (గిరి)
బలుసు ఉదయ్ NRI | పెండ్యాల ప్రసాద్ | చిట్టూరి పవన్
గారపాటి సంజయ్ NRI | పసల వరప్రసాద్ | మద్దినపూడి రామకృష్ణ శివరావు
సంకురాత్రి మురళి (BROS NRI) | మద్దినపూడి వెంకటేశ్వరరావు (S/o. రాములు) | వల్లూరి గంగయ్య, తణుకు ప్రభుత్వ ఆసుపత్రి ఛైర్మన్
కరుటూరి కాశీవిశ్వేశ్వరరావు (కాశి) | మద్దినపూడి రామకృష్ణ (దత్తుడు) | అన్నంరెడ్డి మురళి
అబ్బదాసరి లాజర్, B.A., LLB | మద్దినపూడి సుబ్బారావు | తాతిని శశిధర్
సప్పరపు సత్యనారాయణ | మద్దినపూడి రంజిత్‌కుమార్ | తాతిని శ్రీధర్
చదలవాడ నాని | మేడికొండ రామకృష్ణ | మారిన సుబ్బారావు
దిద్దే మధుబాబు | కరుటూరి రామలింగేశ్వరరావు (రాంబాబు) | ఆలపాటి చంద్రశేఖర్
నేకూరి కృష్ణ | కాకర్ల విష్ణుసాయి కిరణ్ (S/o. బోసు) | ఆలపాటి వెంకటేశ్వరరావు
అబ్బదాసరి సోలేమాన్ | చిట్టూరి వెంకటకృష్ణ పర్వతాలు | చిప్పాడ రాజు
జక్కంశెట్టి దానేంద్రరావు (జాంపండు) | మల్లిన రాధాకృష్ణ (Ex. కౌన్సిలర్) | చిట్టూరి సురేష్
పూర్ణ బాహుదూర్ | బొడ్డు రంగప్రసాద్ (నిడదవోలు) | మద్దినపూడి ఓంకార్
కడిమి శేఖర్ | చింతలపూడి సన్యాసిరావు | ముళ్ళపూడి ప్రహ్లాద్
పువ్వుల శ్రీకాంత్ | పంపన నాగపద్మారావు | చిట్టూరి రామాంజనేయులు (సింగ్)
కళ్యాణ్ అబ్బదాసరి | మేడికొండ సత్యనారాయణ (కబీర్) | ముళ్ళపూడి హరికృష్ణచౌదరి
మద్దినపూడి సత్యనారాయణ | సొరపల్లి శ్రీనివాసు (డాక్టర్ శ్రీను) | నల్ల వెంకటకృష్ణ రాజేష్ చౌదరి
గంటి కృష్ణ | రామదాసు సూరిబాబు | బూరుగుపల్లి నాగవెంకట సుబ్బారావు
పచ్చిపాల కృష్ణమూర్తి | రేమాల నాగరాజు | నెక్కంటి వాసు
యలగాడ సత్యనారాయణ (సత్తియ్య) | పప్పుశెట్టి లక్ష్మీనారాయణరావు | కరుటూరి బద్రినారాయణ
గజవల్లి దుర్గారావు | కర్రి గంగాధర అప్పారావు | కరుటూరి బుల్లిరామయ్య చౌదరి
ముళ్ళపూడి శ్రీనివాసు (వ్యవసాయం) | కణితి శ్రీనివాసరావు (ఫ్లైన్ లింక్ మెన్ పాల్ట్రీ) | N.L.V.రామ్మోహన్
దేవరకొండ పవన్ | కె.చిన్నారావు | పరిమి రామకృష్ణ
ఉదిండి వెంకట రామరాజు (రాజు) | చిట్టూరి గణిక ప్రసాద్ (బైక్ మెకానిక్) | గోటేటి శ్రీరామమూర్తి (రాంబాబు)
తోట వీరరాఘవులు (ఏసు) | ఊట రామకృష్ణుడు (న్యాయవాది) | దాపర్తి శ్రీనివాసు
కరుటూరి సుబ్రహ్మణ్యం | తమ్మినీడి బలరామ్‌కృష్ణ | ముళ్ళపూడి వెంకటకృష్ణ ప్రసాద్
బొందలపాటి ఆత్మిక్ | బొందలపాటి ఆహిల్ | పరిమి ఇషాన్
పులమాల శ్రీను | ఒమ్మి సత్యనారాయణ | ఊట గోవిందరాజు (Ex. కౌన్సిలర్)
రేలంగి శ్రీనివాసరావు, వెంకటేశ్వరస్వామి గుడి ట్రస్ట్ మెంబర్ | A.V.R.S.చౌదరి | కరుటూరి వెంకటరత్నం
కళ రవి | గుబ్బల జ్ఞానేశ్వరరావు, తణుకు TDP 3వ వార్డు ప్రెసిడెంట్ | YCH శ్రీనివాసరావు (YCH)
పొతూరు రైతు సంఘం, తణుకు



వై.టి. రాజా గారి 76వ జయంతి నివాళి

డా॥ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ గారు
శ్రీ వై.టి. రాజా గారు
శ్రీ ముళ్ళపూడి వెంకటరాయుడు గారు
విలువలు కలిగిన నిలువెత్తు మానవతామూర్తి, రాజకీయ రంగంలో తిరుగులేని మేధావి. అభయమిచ్చిన వారి కోసం నిబద్ధతతో పోరాడిన యోధుడు, జనం గుండెల్లో గూడు కట్టుకున్న ప్రజానాయకుడు నిజాన్ని నిర్భయంగా చెప్పే మా ప్రియతమ మామయ్య గారు, తణుకు మాజీ శాసనసభ్యులు
యలమర్తి తిమ్మరాజా (వై.టి.రాజా) గారి
76వ జయంతి సందర్భంగా వారికి మా ఆత్మీయ నివాళి
ముళ్ళపూడి మృత్యుంజయప్రసాద్


(c) eenadu

## 'ఉనికి కాపాడుకునేందుకే.. వైకాపా అసత్య ప్రచారం'

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ఉనికి కాపాడుకునేందుకే వైకాపా నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. వైద్య కళాశాలల పబ్లిక్, ప్రైవేటు, భాగస్వామ్యంపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను తిప్పి కొట్టారు. రామారావుపేటలోని భాజపా కార్యాలయంలో ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సిన ఆర్థిక సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని గుర్తు చేశారు. మహారాష్ట్ర, దిల్లీ వంటి రాష్ట్రాల్లో పీపీపీ విధానం అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో భాజపా పట్టణ ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగాధర్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వీఆర్‌వీఎల్ నారాయణ, ప్రధాన కార్యదర్శి కావ్యరెడ్డి, ఇమ్మంది బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

**ANDHRA PRADESH MEDICAL SERVICES & INFRASTRUCTURE**
**Tender Notice No.04 EE/APMSIDC/Eluru/2025-26, Dt. 15-12-2025**

Tenders are invited in "e Procurement" for the works "Construction of Stand Alone Government **Ayurveda Dispensarys** at 1) Munduru, 2) Dubacherla, 3) Jinnuru, 4) Veeravasaram, 5) Elurupadu, 6) Rajavaram, 7) Polavaram, 8) Kovvuru, 9) Palakollu, 10) Jaanampeta, Construction of Stand Alone Government **Homeopathy Dispensarys** at 1) Pragadavaram, 2) Tadikalapudi, 3) Kalla, 4) Lakshamaneswaram. **Last date receipt of Tenders 23-12-2025.** The other details can be had at website www.eprocurement.gov.in For further details please Contact Ph.No. 77807 14114.

**Sd/- EE, APMSIDC Division, Eluru, Eluru & W.G. Districts**

## శ్రద్ధాంజలి

నిగర్వి, మంచితనంతో అందరినీ ఆప్యాయంగా పలకరించే మహోన్నత వ్యక్తిత్వం గల శ్రీమతి బండారు దుర్గ గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీమతి బండారు దుర్గ గారు
M.A., M.A., M.Ed., RBP, HPT
రిటైర్డు టీచర్, తాడేపల్లిగూడెం
జననం: 8-12-1951, నిర్యాణం: 5-12-2025

అక్క: జక్కా మాలతి - మాధవ్
అక్క కుమారుడు: నాగశ్రీనివాస్ కోడలు: శ్రీదేవి
స్పందన, సాధన, సుచిర్ మాధవ్
అక్క కుమార్తె - అల్లుడు: కావ్యల తిరుమల నిరిషా - డా॥ రాజేంద్రప్రసాద్
రవళి - అప్పూ, అథర్వ్, సిద్ధార్థ, రేవతి
చెల్లెలు: S.మధుమీనాక్షి - శివాజీరావు
చెల్లెలు కుమారుడు: సత్యఫణిశ్రీకాంత్ - డా॥ నవ్య
చెల్లెలు కుమార్తె - అల్లుడు: P.తిరుమల ధరణి - రమేష్
మనుమలు: P. రాకెంద్ వదన్, S.ఉదిత

## శ్రద్ధాంజలి

శ్రీమతి బండారు దుర్గ గారు
M.A., M.A., M.Ed., RBP, HPT
రిటైర్డు టీచర్, తాడేపల్లిగూడెం
జననం: 8-12-1951, నిర్యాణం: 5-12-2025

నిగర్వి, మంచితనంతో అందరినీ ఆప్యాయంగా పలకరించే మహోన్నత వ్యక్తిత్వం గల శ్రీమతి బండారు దుర్గ గారి మరణం మాకు తీరని లోటు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

తమ్ముడు: బండారు జ్ఞాన ప్రసాద్ B.Sc., M.A., M.Ed., M.Phil., మరదలు: నిర్మల M.A., B.Ed.,
మేనకోడళ్ళు: బండారు రాధిక B.A., U.G.D.P.E., (లేటు)
హారిక B.Tech., MBA, USA - చైతన్య B.Tech.,
జాగృతి M.A., B.Ed., - చంద్రశేఖర్ MCA
జిగీష B.Tech., - ప్రదీప్ కుమార్ M.S.,
మనుమలు, మనుమరాండ్రు:
లక్ష్మీ లలిత్య, జెష్విక్, దేవేష్ జ్ఞాన నందన్, ఆర్య

## అమృతమూర్తికి అశ్రునివాళి

శ్రీమతి బండారు దుర్గ గారు
M.A., M.A., M.Ed., RBP, HPT
రిటైర్డ్ టీచర్, తాడేపల్లిగూడెం
జననం : 8-12-1951 W/o. కీ॥శే॥ బొడ్డు అప్పారావు గారు, B.Sc. (Ag), Rtd. Lecturer మరణం : 5-12-2025

ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎందరికో విద్యాదానం చేసి, ఆదర్శగృహిణిగా, మాతృమూర్తిగా, ప్రేమ ఆప్యాయతలతో మమ్ములను పెంచి, మన కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసి అలసిసొలసి విశ్రమించిన మీ పాదాలకు మా అశ్రునివాళులు అర్పిస్తూ.. మీ జ్ఞాపకాలతో ముందుకు సాగుతూ శివైక్యం చెందిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో.. మీ..

కుమారుడు: డా॥ B.B.ఫణికుమార్ M.D., DM (Neph) కోడలు: డా॥ P.V.శ్రావణి M.D. (DERM)
పెద్దకుమార్తె: U.శ్రీ జోత్స్న B.Com., B.Ed. అల్లుడు: U.సుబ్బారావు, B.Sc., B.Ed Rtd. ASWO
చిన్న కుమార్తె: డా॥ B.సుధాప్రియ M.A., M.Sc., M.Ed., Ph.D Assistant Professor, SJCW, వైజాగ్
మనుమలు, మనుమరాండ్రు:
డా॥ U.సాహితి అపురూప M.D (Path) - డా॥ R.సందీప్‌కుమార్ M.D(DERM)
U.సాయి చరణ్ M.Tech - U.L.కళ్యాణి M.Sc.,
డా॥ B.సాయి హృదయ్ MBBS,
B.ప్రిషా వైష్ణవి (MBBS), B.ప్రభవ్ చాణక్య (B.Tech)
ముని మనుమలు : R.పూర్వాంశ్ శ్రేయాస్ షణ్ముఖ్,
R.రాగ సంహిత, U.N.V.సత్య జియాన్

పెద్దకార్యం : ది. 15-12-2025 సోమవారం తాడేపల్లిగూడెం రామారావుపేట కరణాల సత్రంవారి వీధిలో మా స్వగృహము నందు జరుపబడును. సెల్ : 75698 68529

# పరుగులు దండిగా.. వికెట్లు మెండుగా..

### క్రికెట్‌లో రాణిస్తున్న యువతులు

**తణుకు, న్యూస్‌టుడే**

క్రికెట్ అబ్బాయిల ఆటే అన్న పరిమితులు చెరిపేసి అద్వితీయ ఆటతీరుతో ప్రశంసలందుకుంటున్నారు నేటి తరం అమ్మాయిలు. ఇటీవల మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ గెలవడంతో దేశవ్యాప్తంగా అమ్మాయిలకు ఈ ఆటపై ఆసక్తి పెరుగుతోంది. అదే స్ఫూర్తితో సాగుతున్నారు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలోని విద్యార్థినులు. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్సిటీ స్థాయి ఎంపికల్లో సత్తాచాటి సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు.

**అన్నయ్య స్ఫూర్తితో..** మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ఒకవైపు కూలి పనులు, మరోవైపు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. ఇంటి వద్ద అన్నయ్యతో ఆడటం మొదలు పెట్టి తన వద్దే మెలకువలు నేర్చుకుంటూ ఆల్‌రౌండర్‌గా మారా. పదో తరగతిలో పాఠశాల తరఫున పాల్గొని సత్తాచాటాను. కళాశాలలో చేరిన తర్వాత నుంచి మరింత పట్టుదలతో ఆడటం మొదలుపెట్టా. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయం, మైసూరు విశ్వవిద్యాలయాల తరఫున రాజమహేంద్రవరం, మైసూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో మ్యాచులు ఆడా. ఇటీవల జరిగిన పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరఫున ప్రతిభ కనబరచి సౌత్ జోన్‌కు ఎంపికయ్యాను. జాతీయ జట్టులో స్థానం సంపాదించి, పైలెట్ అవ్వాలనేది నా ఆశయం. **- బి.రేవతి, పూళ్ల, డిగ్రీ మూడో సంవత్సరం**

**నాన్న ఆట చూస్తూ..** నాన్న మంచి క్రికెటర్. ఆయన ఆడుతుంటే చూసి ఆసక్తి పెంచుకున్నా. పాఠశాల స్థాయిలో చిన్నగా ఆడటం మొదలుపెట్టా. ఇంటర్ నుంచి సాధన చేస్తూ ఆల్‌రౌండర్‌గా వివిధ ప్రాంతాల్లో ప్రతిభ కనబరిచా. ఇటీవల భీమవరంలో జరిగిన యూనివర్శిటీ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (ఉమెన్) క్రికెట్ ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ ఎంపికల్లో సత్తాచాటి జనవరి 16న నుంచి తమిళనాడులో జరగబోయే సౌత్‌జోన్ క్రికెట్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యా. ఇది నాకు మంచి అవకాశంగా భావిస్తున్నా. భారత జట్టుకు ఆడాలనేదే నా లక్ష్యం. **-ఎం. మౌనిక, తణుకు, డిగ్రీ రెండో సంవత్సరం**

# కనరో భాగ్యము..!

### 16 నుంచి శ్రీవారి ధనుర్మాస ఉత్సవాలు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జనవరి 14వరకు ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ధనుర్మాసంలో శ్రీవారి సుప్రభాత సేవ ఉండదని, దానికి బదులు తిరుప్పావై సేవ జరుగుతుందని చెప్పారు. నిత్యం ఉదయం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

**30న ఉత్తర ద్వార దర్శనం..** ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రూ.100, రూ.200 టిక్కెట్లతోపాటు రూ.500 ప్రత్యేక దర్శనం టిక్కెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. ముక్కోటి ఏకాదశి నుంచి వచ్చే 2026వ సంవత్సరం జనవరి 9 వరకు అధ్యయనోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో నేపథ్యంలో సాయం కాల సమయంలో జరిగే ఆర్జిత సేవలు ఉండవని వెల్లడించారు.

**29న గిరి ప్రదక్షిణ..** ముక్కోటి ఏకాదశి ముందు రోజు డిసెంబర్ 29న స్వామివారి గిరిప్రదక్షిణ నిర్వహిస్తారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఆలయ తొలి మెట్టు దగ్గర ప్రారంభమై కొండ చుట్టూ సుమారు 6 కి.మీ. మేర గిరి ప్రదక్షిణ జరుగుతుందని ఈవో తెలిపారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తామని చెప్పారు.

## విశ్రాంత పురపాలక ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిటైర్డ్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం భీమవరంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.వి. శాస్త్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా రేపూరి గోగురాజు(భీమవరం), ప్రధాన కార్యదర్శిగా డి.వి.ఎస్.ఎస్. మూర్తి(కాకినాడ), ఉపాధ్యక్షులుగా సీహెచ్. హరిబాబు(గుంటూరు), ఎం.వి.నారాయణరెడ్డి(రాజమహేంద్రవరం), బి. మనుస్వామి(అనంతపురం), పి.వి.టి.రమణారావు(విశాఖపట్నం), కోశాధికారిగా జి.వేణుగోపాలస్వామి(తుని), కార్యనిర్వాహక కార్యదర్శులుగా కె.సత్యనారాయణ(కాకినాడ), జె.శ్యామ్‌లాల్(అనంతపురం), ప్రాంతీయ కార్యదర్శులుగా ఎం.వి.రామారావు(రాజమహేంద్రవరం), బి.వెంకటరమణయ్య(అనంతపురం) నియమితులయ్యారు.

## 'కాపుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా'

తణుకు సమ్మేళనంలో మాట్లాడుతున్న బొండా ఉమ

**తణుకు, న్యూస్‌టుడే:** కాపు సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అందరూ ఏకతాటిపై నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం తణుకులోని సీఎం కల్యాణ మండపంలో నిర్వహించిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడారు. కాపు నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించగా, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ మాట్లాడుతూ.. ఆనాడు మోహనరంగా ఒక విప్లవాత్మక మార్పు కోసం ఉద్యమిస్తే కుట్రపూరితంగా హత్య చేశారనే నిజాన్ని గుర్తించాలన్నారు. బీసీలు, కాపులు, దళితులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గల్లా సుబ్రహ్మణ్యం, కాపు జేఏసీ నాయకులు రామకృష్ణ, నల్లా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** విర్డ్ ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 11 నుంచి జరుగుతున్న ఎముకల వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. మొత్తం 56 మందికి పరీక్షించి భుజం, మోచేయి, చెయ్యి, తుంటి సమస్యలు ఉన్న 20 మందికి శస్త్రచికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయగలగడం తమ వైద్య సాఫల్యానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ శిబిరంలో వైద్యులు కామినేని శ్రీనాథ్(యూఎస్ఏ), భవ్య చంద్, కృష్ణ కిరణ్, కంభంపాటి శ్రీనివాస్, బాలాజీ, పి.వి.నాగేంద్ర బాబు, సింధు, రమ్య, మహిత, విర్డ్ ట్రస్ట్ సభ్యులు వి.నారాయణ మూర్తి, ఎస్‌వీఎన్ఎన్ నివృతరావు తదితరులు పాల్గొన్నారు.

**SBI భారతీయ స్టేట్ బ్యాంక్**
రాజీవ్ చౌక్ బ్రాంచ్ (15902), తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా

**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**
(అనుబంధం - IV చట్టంలోని రూల్ 8 (1) క్రింద)

[illegible]

తేది : 09.12.2025 సం/-అధీకృత అధికారి,
ప్రదేశం : తణుకు భారతీయ స్టేట్ బ్యాంక్

**SBI భారతీయ స్టేట్ బ్యాంక్**
సత్యవతినగర్ బ్రాంచ్ (16305), తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా

**స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)**
(అనుబంధం - IV చట్టంలోని రూల్ 8 (1) క్రింద)

[illegible]

తేది : 09.12.2025 సం/-అధీకృత అధికారి,
ప్రదేశం : తాడేపల్లిగూడెం భారతీయ స్టేట్ బ్యాంక్

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

**వీరవాసరం, న్యూస్‌టుడే:** పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఈ నెల 12 నుంచి జరుగుతున్న 69వ రాష్ట్రస్థాయి అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి(ప్రథమ), విజయనగరం(ద్వితీయ), శ్రీకాకుళం(తృతీయ), బాలికల విభాగంలో విజయనగరం(ప్రథమ), పశ్చిమగోదావరి(ద్వితీయ), తూర్పు గోదావరి(తృతీయ) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులను డీఈవో ఇ.నారాయణ, జడ్పీటీసీ సభ్యుడు జయప్రకాశ్ నాయుడు అందజేశారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు పి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, సునీత, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాఫ్ట్‌బాల్ అండర్ 17 బాలురు, బాలికల ఏపీ జట్లను ఎంపిక చేశారు.

## శ్రమదానంతో శ్మశానం శుభ్రం

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** పెంటపాడు మండలం మౌంజిపాడులో ఉన్న శ్మశానంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ అధ్యక్షతన, సర్పంచి ఆలపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్థులు శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించి.. వ్యర్థాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారని గమనించి సమస్య పరిష్కరించామన్నారు.

# చకచకా.. ఎంచక్కా

### వేగంగా వైద్య కళాశాల భవనాల నిర్మాణం

**ఈనాడు-ఏలూరు:** ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు గత ప్రభుత్వంలో నత్తను తలపించాయి. దీంతో విద్యార్థుల బోధనకు ఆటంకం కలిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాకే వేగం పుంజుకున్నాయి. 2026 ఆగస్టు నాటికి పనుల పూర్తికి ప్రభుత్వం గడువు పొడిగించింది. జగన్ సర్కార్ ఆ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదు. గుత్తేదారుకు పూర్తిస్థాయిలో స్థలాలు అప్పగించలేదు. పనులు ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణమే. ఈ విషయం తెలుసుకున్న కూటమి ప్రభుత్వం సమీక్షించి నిర్మాణాలకు సరిపడా స్థలాన్ని కేటాయించి గుత్తేదారుకు బిల్లులు చెల్లించడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2022లో పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.215 కోట్ల విలువైనవి జరిగాయి. 2.76 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో జీ+4 భవనాలు నిర్మించాలి.

**అందుబాటులోకి గ్యాలరీలు..** వైద్య విద్యార్థులు క్లినికల్ పరీక్షల నిర్వహణ, బోధనకు గ్యాలరీ అవసరం. కనీసం దాన్ని వైకాపా ప్రభుత్వం నిర్మించలేదు. మూడో సంవత్సరం విద్యార్థులకు ఒక క్లినికల్ గ్యాలరీ నిర్మించి రెండు మాసాల క్రితమే అప్పగించగా రెండో ఏడాది వారికి మరొకటి సిద్ధం చేస్తున్నారు. ఇది వారం రోజుల్లో పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. 2023లో తరగతులు ప్రారంభం కాగా ప్రస్తుతం పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి. హాస్టళ్లు, సిబ్బంది నివాస సముదాయాలు పూర్తి చేయాల్సి ఉంది.

## జనసేనలో చేరిక

**గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా సూచించారు.

పెంటపాడు మండలం మీనావల్లూరు గ్రామానికి చెందిన వైకాపా నాయకులు గుబ్బల ఆర్లయ్య, లంక గణపతి, నీల నాగమల్లయ్య తదితరులు జనసేన విడిది కార్యాలయంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు.

కరపత్రాన్ని ఆవిష్కరించి చూపుతున్న సభ్యులు

## 23న తణుకులో హిందూ సమ్మేళనం

**తణుకు, న్యూస్‌టుడే:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 23న స్థానిక భోగవల్లి బాపయ్య అన్నపూర్ణమ్మ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ కార్యదర్శి మద్దిపాటి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీతారామాంజనేయ స్వామి కోవెలలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శృంగవృక్షంలోని దత్తపీఠం పూజ్యశ్రీ సాయిదత్త నాగనంద సరస్వతి స్వామీజీ, ప్రధాన వక్తగా ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యకారిణి సభ్యులు ఓలేటి సత్యనారాయణ పాల్గొంటారన్నారు. హిందువులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

**ఆత్రేయపురం, న్యూస్‌టుడే:** కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన మోటపర్తి సూర్య వెంకటకృష్ణ శేషగిరిరావు, కాదంబరి సత్యవాణి దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళం అందించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

## 'దొడ్డిదారిన మాస్టర్ ప్లాన్ అమలు'

**తణుకు, న్యూస్‌టుడే:** ప్రజాభిప్రాయం తీసుకోకుండా తణుకులో దొడ్డిదారిన మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒక మాస్టర్ ప్లాన్ అమలు చేసే ముందు పాత ప్లాన్‌ను పాత దానికి భంగం కలిగించకుండా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. చిన్న పేపర్ స్టేట్‌మెంట్ ఇచ్చి దాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సుమారు 101.5కి.మీ మేర ఈ మాస్టర్ ప్లాన్ రూపొందించి అందులో ఇష్టానుసారంగా జోన్లు ఏర్పాటు చేశారని దీని వల్ల చిన్న, సన్నకారు రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుని ముందుకు వెళ్లాలని లేదంటే చట్టపరంగా ముందుకు వెళ్లి ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

**92.7 FM Rajamahendravaram**
**ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు**
**సోమవారం నుంచి శుక్రవారం**

| కార్యక్రమము | ప్రసార వేళలు |
|---|---|
| ఉషోదయం | ఉ॥ 5 - ఉ॥ 7 |
| ఈ-మార్నింగ్స్ | ఉ॥ 7 - ఉ॥ 11 |
| నువ్వా నేనా | ఉ॥ 11 - మ॥ 2 |
| సత్యభామ | మ॥ 2 - సా॥ 5 |
| లైట్ తీస్కో | సా॥ 5 - రా॥ 9 |
| సరదాగా కాసేపు | రా॥ 9 - రా॥ 12 |
| బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్ | రా॥ 12 - తె॥ 5 |

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

**EENADU e Classifieds**

**BUSINESS SERVICES**

**బంగారం బ్యాంకులలో/** ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

**BUSINESS OFFER**

**ఉద్యోగం చేస్తూనే** అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైం or ఫుల్‌టైం ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర : 78160 98199.

**JOBS**

HYD **యూనిటీ** హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

**టెలికాలింగ్ & Data Entry** వర్క్ ఫ్రమ్ హోమ్/ ఆఫీసు M/F కావలెను.10th పైన, Age:18to35, జీ:18to25K. ✆8464016870, 8639439870

**ఆదిత్య మోటార్స్,** జంగారెడ్డిగూడెం బ్రాంచిలో పనిచేయుటకు ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12,000/- to 18,000/-. Contact Cell: 85006 44978.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.75 పైసలు
తణుకు ఆఫీసు: 08819-224254

**ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం**
**CLASSIFIEDS**

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
సోమవారం డిసెంబరు 15, 2025 5

## పుంజుకున్న టమాట.. కిలో రూ.44

**మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే:** టమాట మార్కెట్‌లో ధరలు గత వారం కంటే స్వల్పంగా పెరిగాయి. ఆదివారం కిలో అత్యల్పంగా రూ.23 నుంచి అత్యధికంగా నాణ్యమైన కాయలు కిలో రూ.44 వరకు పలికాయి. వారం కిందట కిలో రూ.20 నుంచి రూ.38 మధ్యలో ఉన్న ధర నేడు పుంజుకుంది. మార్కెట్‌కు 123 టన్నుల మేర సరకును రైతులు తీసుకొచ్చారు. ఏ-గ్రేడ్ కిలో రూ.38 నుంచి రూ.44 వరకు, బీ-గ్రేడ్ కిలో రూ.23 నుంచి రూ.37 సగటున కిలో రూ34 నుంచి రూ.42తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి బయటి ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

## ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ విజేత కడప

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** కడప డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ఆదివారం మధ్యాహ్నం కడప - చింతకొమ్మదిన్నె జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చింత కొమ్మదిన్నె జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 94 పరుగులు చేసింది. 95 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కడప జట్టు 13.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. డివిజన్ స్థాయి ట్రోఫీని చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి ఎంఈవోలు రమాదేవి, విజయారెడ్డి, నాయక్ అందించారు.

## విదేశీయుల నోట.. వేద మంత్రమట

విదేశీయులు వేద మంత్రాలు చదువుతూ హోమాలు చేయడం మీరు ఎక్కడైనా చూశారా.. ఆదివారం కడప నగరంలో ఆ దృశ్యం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. సంస్కృత మంత్రాలను చక్కగా ఉచ్ఛరిస్తూ సనాతన ధర్మ సారథులుగా ఉనికిని చాటారు. కడప భాగ్యనగర్ కాలనీలోని ఇస్కాన్ ఆలయంలో లోక కల్యాణార్థం ప్రత్యేక హోమం నిర్వహించారు. తిరుపతి అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘానికి (ఇస్కాన్) చెందిన రూపేశ్వర్, చైతన్య ప్రభు, మాధవదర్శన్ దాస్ ఆలయంలో హోమం నిర్వహించారు. హోమం అనంతరం స్వాములు కృష్ణతత్వాన్ని బోధించారు. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**

## కడప రాళ్లు.. మంగళూరు పెంకులు

చర్చిల్లో అద్భుతమైన కట్టడంగా పేరొందింది ఎస్పీజీ క్రైస్ట్ చర్చి కడప జిల్లా కేంద్రంలో 177 వసంతాలు పూర్తి చేసుకుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రెండుసార్లు కూలిపోయింది. బ్రిటీష్ ప్రభుత్వం అప్పట్లోనే రూ.6 వేలు విరాళం ప్రకటించగా అప్పటి జిల్లా రెవెన్యూ అధికారులు స్మిత్, డబ్ల్యూ హార్సిలీ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. 1849లో ప్రారంభానికి నోచుకుంది. ఈ చర్చి కడప రాళ్లతో నిర్మించగా పైకప్పు మంగళూరు పెంకులతో నిర్మించారు. రాయలసీమ డయాసిస్‌లో కెల్లా ఎంతో సుందరమైందిగా ఈ ప్రార్థనాలయం పేరు గాంచింది.

**- న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

## నెత్తిన గుండు.. జాగ్రత్తగా ఉండు



గాలివీడు మండల పరిధిలోని చీమలచెరువు పంచాయతీ కమలామర్రి రహదారి పక్కనే గుట్టపై రాళ్లపై రాళ్లు ఉన్నాయి. ఈ దారిలో వెళ్లే వారు అటుగా చూసి అరె భలేగా ఉందే అని ఆసక్తితో చూడడంతో పాటు జారి పడితే ఇంకేమైనా ఉందా అని భయాందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు. పాలెగాళ్ల పాలనలో ఓ వ్యాపారి గుర్రంపై వెళ్లేటప్పుడు ఈ రాళ్లను చూసి ఎక్కడ నెత్తిన పడతాయోనని ఆందోళనతో అక్కడిక్కడే మృతి చెందగా సమీపంలోనే ఖననం చేసిన ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఇప్పటికీ ఆ ప్రాంతానికి చేరుకుంటే రాళ్లు ఎక్కడ పడతాయోనని తొందరగా అక్కడి నుంచి వెళ్లిపోతున్నామని ప్రజలు అంటున్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

## ఆకాశవాణి.. కడప కేంద్రం

కడప నగరంలోని సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం ఆకాశవాణి కడప కేంద్రంలో నిర్వహించిన బాల విహార్ కార్యక్రమంలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులే వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తూ నీతి కథలు, దేశ నాయకుల స్ఫూర్తిగాథలు, దేశభక్తి గేయాలు, వేమన, సుమతి శతకాలు, జోక్స్, సామెతలు ఇలా వివిధ రకాల కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు అవకాశం కల్పించిన విద్యాశాఖ అధికారులు, ఆకాశవాణి కడప స్టేషన్ డైరెక్టర్ సుందరం మహేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాది నాగరాజు, ఉపాధ్యాయులు ఆసిఫ్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కడప విద్య**

## జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాకు 3వ ర్యాంకు

**కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ఉమ్మడి కడప జిల్లాకు మూడో ర్యాంకు లభించిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని ఆదివారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 39,120 కేసులు పరిష్కరించి రూ.32,43,49,559లు కక్షిదారులకు చెల్లించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పరిష్కారమైన కేసుల్లో 38,498 క్రిమినల్, 274 సివిల్ కేసులు 348 ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. కేసుల పరిష్కారానికి సహకరించిన న్యాయవాదులకు, రెవెన్యూ, పోలీసు, బీమా, బ్యాంకు, చిట్‌ఫండ్, రవాణా తదితర అధికారులందరికీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# గండికోటలో భూచోళ్ల పాగా

◆ ఓ వైపు అభివృద్ధి.. మరో వైపు ఆక్రమణలు
◆ చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో గండికోటకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. దీంతో గండికోటలో భూముల ధరలు రెక్కలొచ్చాయి. రోజురోజుకు ఇతర రాష్ట్రాల నుంచి సందర్శకుల సంఖ్య పెరగడంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇక్కడ సెంటు భూమి సైతం రూ.లక్షల్లో పలుకుతోంది. రాజకీయ, రెవెన్యూ నాయకుల అండదండలతో కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు. విలువైన ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరించడం ఏమిటని నిలదీస్తున్నారు.

విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి రిసార్ట్ నిర్మించిన ఓ ఆక్రమణదారు

### ఆక్రమణలు సాగుతున్నాయిలా...

గత వైకాపా ప్రభుత్వ హయాంలో గండికోట ప్రధాన రహదారిలోని 99 సర్వే నంబరులో సుమారు 153 ఎకరాల ప్రభుత్వం భూమిలో కొందరు నకిలీ పత్రాలు సృష్టించి విలువైన స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అందులో రిసార్ట్స్‌ల పేరుతో గదులను నిర్మించి సందర్శకులకు అద్దెలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఓ రిసార్ట్ నిర్వాహకుడు సుమారు 25 సెంట్లలో ప్రహరీ నిర్మించి గదులను నిర్మిస్తే.. మరో వ్యక్తి 85 సెంట్ల స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించేశాడు. భారీ స్థలాలను ఆక్రమించుకుంటే ఏమీ చేయలేరనే ఇప్పుడు ప్రతి చోట జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పనులను ఆపేస్తున్నారు. కానీ అక్కడ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా.. అధికారుల్లో చలనం లేకపోవడంతో సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

### చర్యలు తీసుకుంటాం

గండికోటలో ఆక్రమణలు, అనధికార నిర్మాణాల అంశం మా దృష్టికి వచ్చింది. వీటిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెవెన్యూ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా ఎవరినీ ఉపేక్షించం. భూములను సర్వే చేసి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తాం.- **సాయిశ్రీ, ఆర్డీవో, జమ్మలమడుగు**

ఎలాంటి పత్రాలు లేకున్నా ఇంటి నిర్మాణ పనులు

## పుష్పగిరిలో అరుదైన కుడ్య శిల్పం

**వల్లూరు, న్యూస్‌టుడే:** దుష్టశిక్షణ శిష్ట రక్షణకు విష్ణుమూర్తి ఎత్తిన దశావతారాల్లో వామన, నృసింహ, వరాహ.. ఈ మూడు అవతారాల్లో నిల్చున్న భంగిమలో ఉన్న అద్భుతమైన శిల్పం పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి కొండపై వెలసిన శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి ఆలయ గోడలపై ప్రత్యేకంగా చెక్కారు. ఒకే రాతిపై మూడు అవతారాలతో పాటు వాటికి సంబంధించిన పురాణాలను వివరించే అనేక శిల్పాలు ఈ గోడలపై కన్పిస్తున్నాయి. వామనావతారంలో బ్రాహ్మణ బాలుడి రూపంలో ఒక చేతిలో కర్ర, ఎడమ చేతిలో గొడుగు పట్టుకుని హిరణ్యకశ్యపుడిని సంహరించేందుకు మానవ శరీరం సింహం ముఖంతో నృసింహ అవతారంలో ఎడమ చేతిలో గద, అభయహస్తంతో కూడిన శిల్పం మహాద్భుతంగా ఉంది. మూడవది భూమిని రక్షించడానికి వరాహ అవతారం నోటి నుంచి రెండు పెద్ద కోరలతో శిల్పాన్ని చెక్కారు. పుష్పగిరి శిల్పసంపద ప్రత్యేకతను చాటిచెప్పే శిల్పాలుగా వీటిని చెక్కడం విశేషమని ప్రముఖ చరిత్రకారుడు బొమ్మిశెట్టి. రమేష్ తెలిపారు.

## అక్రమార్కులపై పీడీకిలి

● 33కు చేరిన ఖైదీల సంఖ్య
● కి'లేడీ' అరుణ అనుచరులిద్దరిపై పీడీ యాక్టు

**కడప నేర వార్తలు, న్యూస్‌టుడే:** కడప కేంద్ర కారాగారం రోజురోజుకు పీడీ యాక్టు ఖైదీలతో నిండిపోతోంది. ఆ సంఖ్య 33కు పెరిగింది. నెల్లూరు జిల్లాలో లేడీ డాన్‌గా పేరొందిన అరుణపై పలు కేసులు నమోదు కాగా ఆమె స్థానికంగా ఉండడం ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందని కలెక్టరు ఉత్తర్వుల మేరకు పీడీ యాక్టు నమోదు చేసి కడప ప్రత్యేక మహిళా కారాగారానికి పంపించారు. ఆమెతో పాటు నెల్లూరు నగరానికి చెందిన మరో ఇద్దరు జయప్రకాష్, షేక్ షాహుల్‌ల పైనా పీడీ యాక్టు నమోదు చేసి వారిని కేంద్ర కారాగారానికి తరలించారు.

● ప్రివెంటివ్ డిటెన్షన్(పీడీ) యాక్టు కలిగి ఉన్న ఖైదీలను రాజమండ్రి, విశాఖ, కడప కేంద్ర కారాగారాలకు మాత్రమే తరలిస్తారు. ఎందుకంటే పీడీ యాక్టు కలిగిన వారికి ఈ మూడు జైళ్లలోనే ప్రత్యేక సౌకర్యాలున్నాయి. ఈ మేరకు ఇటీవల కడప కేంద్ర కారాగారానికి పీడీ యాక్టు ఖైదీలు వరుస కడుతున్నారు. జైలు అధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పీడీ యాక్టు ఖైదీలకు ప్రత్యేక బ్యారక్‌లు, మిగిలిన ఖైదీలతో పాటు భోజనాలుంటాయి. పీడీ యాక్టు ఏడాది పాటు ఉంటుంది.

## నేడు 'డయల్ యువర్ సీఎండీ'

**కడప గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు నేడు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10.30 నుంచి 12 వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ సమయంలో 89777 16661 నంబరుకు ఫోన్ చేసుకోవచ్చన్నారు.

## పచ్చని పందిరి.. అడుగడుగునా నరహరి

**పెండ్లిమర్రి, న్యూస్‌టుడే :** శేషాచల పర్వత శ్రేణుల్లోని పాలకొండల్లో.. పచ్చని ప్రకృతి, సెల ఏరుల మధ్య వెలిసింది సుప్రసిద్ధ లక్ష్మీ నరసింహాలయం వేయి నూతుల కోన. ఈ క్షేత్రం పెండ్లిమర్రి మండలం చిన్న దాసరపల్లె సమీపాన ఉంది. ప్రధానదైవం లక్ష్మీ నరసింహుడు, లక్ష్మీదేవి అమ్మవారు పచ్చని చెట్లు, కొండకోనల నడుమ ఆహ్లాదకర వాతావరణం భక్తులను ఆహ్వానిస్తోంది. వర్షాకాలంలో కొండ కోనల నుంచి జలపాతాలు జాలువారుతుంటాయి. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మించిన గోపురం, ఆలయ స్తంభాలకు శిల్పకళా ఆకృతులు పలువురిని ఆకట్టుకొనేలా ఉన్నాయి.

## మూతబడిన కేంద్రం.. / సీసాల్లో గరళం

గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధ జలాలను అందించడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలు నిర్వహణ లేక మూలకు చేరాయి.. బడుల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్నా తాగేందుకు నీరు లేక చిన్నారులు ప్రమాదకర ప్లాస్టిక్ సీసాల్లో గరళాన్ని నింపుకొని వస్తున్నారు. ఒంటిమిట్ట మండలంలోని మారుమూల కోనరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో 'మనబడి నాడు-నేడు' తొలి విడతలో రూ.18.53 లక్షలతో మౌలిక వసతుల కల్పనకు అనుమతిచ్చారు. శుద్ధ జలం కోసం ఆర్వో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపంతో అది పనిచేయడం లేదు. దాహార్తి కష్టాలు రాకుండా ఇంటి నుంచి సీసాల్లో నీటిని తెచ్చుకొని తాగుతున్నారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి కుళాయిలను ఏర్పాటు చేసినా అందులో నీరు రావడం లేదు. తాగునీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

## మూలికా వైద్యం.. మూషికంపై ప్రయోగం

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు ప్రభుత్వ పశువైద్య కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) చదువుతున్న విద్యార్థినులు జ్యోత్స్న, కౌసర్ సహారా ప్రయోగశాలలో మగ ఎలుకలపై పరిశోధనలను నిర్వహిస్తున్నారు. పెథాలజీ (వ్యాధుల నిర్ధారణ) విభాగంలో పరిశోధన పత్రాలను సమర్పించడానికి వీటిపై అధ్యయనం చేస్తున్నారు. ఊబకాయం బాధితులకు మధుమేహం నియంత్రణలో ఎంత వరకు ప్రభావితం చేస్తాయో సంబంధించిన మూలికల మొక్కలు ఇన్సులిన్‌పై ప్రయోగం చేస్తున్నారు. తమ పరిశోధనలకు కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ నుంచి తెప్పించుకున్న 80 ఎలుకలను ప్రయోగశాలలో వినియోగిస్తున్నారు. వీటికి ముందస్తుగా అధిక మోతాదులో కొవ్వు కలిగిన పెల్లెట్ ఫుడ్స్, ఆర్వో నీటిని అందజేస్తున్నారు. తర్వాత ఊబకాయం దశకు రాగానే మధుమేహం వ్యాధి వచ్చేలా ఎలుకలకు సూది మందు వేస్తున్నారు. 30 రోజుల వ్యవధిలో మోతాదు ప్రకారం ఇన్సులిన్, నిమ్మగడ్డి ద్రావణాలను లిక్విడ్ రూపంలో నోటి ద్వారా ఎలుకలకు అందజేస్తున్నారు. దీంతో మధుమేహం ఎంత వరకు నియంత్రణలో ఉందో మూల్యాంకనం, శాస్త్రీయ ఫలితాలను నమోదు చేస్తున్నారు. హెచ్‌వోడీ శ్రీనివాస నాయక్ పర్యవేక్షణలో ప్రయోగశాలలోని ఎలుకలపై ఆరు నెలలకు సంబంధించి శాస్త్రీయ పరిశోధన పత్రాలను సమర్పిస్తామని విద్యార్థినులు జ్యోత్స్న (ప్రొద్దుటూరు), కౌసర్ సహారా (పోరుమామిళ్ల) 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంబంధించి గొర్రెలకు వ్యాధి నిర్ధారణపై పరిశోధనాత్మక వ్యాసాలు గత మార్చిలో ఐజేవీపీ జర్నల్‌లో ప్రచురించినట్లు వారు చెప్పారు. సీసీఎస్ఈఏ, ఐఏఈసీ కమిటీల ఆమోదంతో ఈ ప్రయోగాలను చేపడుతున్నారు.

జ్యోత్స్న, పీజీ విద్యార్థిని, ప్రొద్దుటూరు

కౌసర్ సహారా, పీజీ విద్యార్థిని, పోరుమామిళ్ల

## నియోజకవర్గానికో.. స్వర్ణాంధ్ర విజన్ కార్యాలయం

**రాజంపేట గ్రామీణ, కడప, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా స్వర్ణాంధ్ర-2047 భవనాలను నిర్మిస్తున్నారు. జిల్లాకు ఏడు కార్యాలయాలు మంజూరు కాగా నియోజకవర్గ కేంద్రంలో వీటి నిర్మాణం పూర్తి చేసి ఫర్నిచర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

రాజంపేట పట్టణంలో ఏర్పాటైన కార్యాలయం

జిల్లా : వైఎస్సార్ కడప
మండలాలు: 36 ● నియోజకవర్గాలు: 7

● నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశం అయ్యేలా, ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారిని ఇప్పటికే నియమించారు. స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలుపై సమీక్ష చేయనున్నారు.

● **అధికారులు ఇలా:** జిల్లాలో నియోజవర్గాల్లోని ఎంపీడీవో కార్యాలయాలకు స్వర్ణాంధ్ర విజన్-2047 పేరుతో నూతన కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రత్యేక అధికారిగా జిల్లా ఉన్నతాధికారిని కేటాయిస్తున్నారు.

● పంచాయతీలు, పురపాలక అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి విజన్-2047 కాల వ్యవధిలో పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రొద్దుటూరులో కూడా ఇప్పటికే భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగతా ప్రాంతాలకు అధికారుల కేటాయింపు దాదాపు పూర్తయింది.

● నియోజకవర్గ కేంద్రంగా పని చేసే సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్ ఆయా ఎంపీడీవో కార్యాలయాలకు చేరవేస్తున్నారు. పనిచేస్తున్న ప్రత్యేక అధికారి, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ స్థాయి అధికారులు కోసం కంప్యూటర్లు, ఫైల్స్‌ను భద్రపరిచే బీరువాలు, కంప్యూటర్ ప్రింటర్లు, కుర్చీలు, ఎమ్మెల్యే కోసం ఎగ్జిక్యూటివ్ కుర్చీలు కార్యాలయానికి చేరుకున్నాయి.

## పనితీరు ఎలా ఉంది?

అధికారులపై ప్రజాభిప్రాయ సేకరణ



**ఈనాడు, కడప:** ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ప్రభుత్వం తాజాగా అధికారులపైనా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ జరుపుతోంది. ఈ మేరకు ఐవీఆర్ఎస్ విధానాన్ని ఆచరిస్తోంది. ఇది వరకు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రజాప్రతినిధులకే పరిమితమైన వ్యవస్థ ఇప్పుడు అధికారుల వరకు విస్తరించారు. తాజాగా మేము ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ... మీ జిల్లా కలెక్టర్ పనితీరు పట్ల మీరు సంతృప్తిగా ఉన్నారా? మీరు సంతృప్తిగా ఉన్నట్లయితే ఒకటి నొక్కండి. సంతృప్తిగా లేనట్లయితే రెండు నొక్కండి... మరలా వినాలంటే సున్నా నొక్కండి అంటూ అడుగుతున్నారు. ఇలాగే జాయింట్ కలెక్టర్, నగర/ పురపాలక కమిషనర్లు, ఇతరత్రా ఉన్నతాధికారులపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. త్వరలో జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనున్న నేపథ్యంలో జరుగుతున్న అభిప్రాయ సేకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు ఈ- ఆఫీసు నిర్వహణపై ముఖ్యమంత్రి మార్కులు వేశారు. రాష్ట్రంలో ఎవరు ఏ స్థానంలో ఉన్నారన్న విషయాన్ని ఇటీవల వెల్లడించారు. ప్రభుత్వ అధికారుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని సర్కారు భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన పని చేయాలని ముఖ్యమంత్రి తలపోస్తున్నారు. మంచి పాలనకు, నాణ్యమైన సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారు. పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయాన్ని ఐవీఎర్ఎస్ ద్వారా ప్రభుత్వం తెలుసుకుంటోంది. ఇది వరకు ఉచిత ఇసుక విధానం అమలు, నూతన మద్యం పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పథకాలు, కార్యక్రమాల అమలులో రెవెన్యూ, పురపాలక, విద్యుత్ వంటి కీలకశాఖల్లో ప్రజలు పొందుతున్న పౌర సేవలపై కూడా ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగుపర్చే దిశగా అడుగులు వేస్తున్నారు.

(c) eenadu

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**జిల్లా సచివాలయం:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం కడప కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలతో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. తమ సమస్యలు ఇప్పటికే పరిష్కారం కాకపోతే 1100కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కడపతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కేంద్రాల్లో సంబంధిత అధికారులు స్వీకరిస్తారన్నారు.

## 21న కలమల్ల శాసన రెప్లిక ఆవిష్కరణ

**కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే:** కడప నగరం ఎర్రముక్కపల్లెలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఈ నెల 21న జానుమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో తొలి తెలుగు కలమల్ల శాసన రెప్లిక ఆవిష్కరిస్తున్నట్లు జానుమద్ది సాహితీపీఠం కార్యనిర్వాహకుడు జానుమద్ది విజయభాస్కర్, రచయిత చరిత్రకారుడు రమేష్‌లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలమల్ల తొలి తెలుగు శాసనం తొలుత ఆరు అడుగుల ఆరు అంగుళాలు ఉండగా... ప్రస్తుతం నాలుగు అడుగులు మాత్రమే ఉందన్నారు. ఈ శిలాశాసనాన్ని కాపాడడంలో భాగంగా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ సహకారమందించారన్నారు. శిలాశాసనం ప్రారంభోత్సవానికి కలెక్టర్ శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, వైవీయూ వీసీ ఆచార్య రాజశేఖర్ హాజరవుతారన్నారు. సాహిత్యకారులు, రచయితలు, చరిత్రకారులు, కవులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

## పోలేరమ్మకు వెండి మకర తోరణం వితరణ

**బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే:** స్థానిక పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం చిన్నపవని గ్రామానికి చెందిన వేల్ల బ్రహ్మనాయుడు, హిమబిందు దంపతులు అమ్మవారికి 13 కేజీల 992 గ్రాముల వెండి మకర తోరణాన్ని బ్రహ్మంగారిమఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి, పూర్వపు మఠాధిపతి కుమారుడు దత్తాత్రేయ స్వామి, వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అందించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి తోరణాన్ని అలంకరించారు.

అమ్మవారికి సమర్పించిన వెండి మకర తోరణం

## పూలరథంపై ఈశ్వరీ మహాదేవి

**బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే:** జగన్నాథ ఈశ్వరీ మహాదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు పూల రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. గుడి ఉత్సవం, అభిషేకాలు, కుంకుమార్చనలతో పూజలు ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మఠాధిపతి వీరశివకుమారస్వామి దంపతులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూల రథంపై దర్శనమిస్తున్న ఈశ్వరీమహాదేవి అమ్మవారు

## పర్యావరణ పరిరక్షణ యువత బాధ్యత

ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఎస్పీ భావన

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** పర్యావరణ కోసం యువత కృషి చేయాలని డీఎస్పీ భావన, పురపాలక కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఫిట్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ ద్వారా రామచంద్రమిషన్, రోటరీక్లబ్, రోటరీ కంటి ఆసుపత్రి, మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రీన్ హార్ట్ ఫుల్‌నెస్ రన్‌ను డీఎస్పీ, కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మొక్కలను నాటాలన్నారు. డ్రగ్స్‌ను యువత వినియోగించడం వలన కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ చేశారు. ర్యాలీ అనంతరం 250 మందికి పండ్ల, ఔషధ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైవీ.స్వరూప్‌కుమార్‌రెడ్డి, రామచంద్రమిషన్ జోనల్ కోఆర్డినేటర్ బాబు, రోటరీక్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, పీఈటీ సుధాకర్‌రెడ్డి, రాయలసీమ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ రవిశంకర్, మల్లెల ఝాన్సీ, లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పు తగదు

**వేంపల్లె, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును పూజ్య బాపూజీ గ్రామీణరోజ్‌గార్ యోజన అని మార్చడం సరి కాదని మాజీ ఎంపీ తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రూ.403 కోట్ల బకాయిలు ఉన్నాయని.. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు.


EENADU Classifieds

BUSINESS SERVICES

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్. వర్కర్ జీ 20k. ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

BUSINESS OFFER

**మీ బంగారం,** వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

JOBS

**ప్రముఖ ఇనోవిజన్** సంస్థ నందు పనిచేయుటకు పిక్కర్స్, ప్యాకర్స్, డెలివరీ బాయ్స్, సేల్స్ ప్రమోటర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ✆ 95151 30414, 91601 52122.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం


# ధరవింటే.. గుడ్లు తేలేయాల్సిందే!

-న్యూస్‌టుడే, రాజుపాళెం, కమలాపురం

ప్రతి ఇంట్లో నిత్యాహారంలో భాగం కోడి గుడ్డు. పోషకాహారంగా కూడా దీనిని వాడుతున్నారు. పిల్లలు చికెన్ కావాలని మారాం చేసేప్పుడు కూడా తల్లిదండ్రులు ప్రత్యామ్నాయంగా గుడ్డుతో ఆమ్లెట్ వేసి సర్దిచెబుతుంటారు.. అలాంటి గుడ్డు ధర అమాంతం దాదాపుగా రూ.10 దాకా చేరడంతో ప్రజలు ఆందోళనచెందుతున్నారు. ధర ఇలా ఉంటే ఎలా కొనాలని ఆవేదనచెందుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంతలా ధర పెరగలేదు. దీంతో ప్రతి గుడ్డుపై రూ.1.50 నుంచి రూ.2 దాకా వినియోగదారులపై భారం పడుతోంది. జిల్లాలో నెలకు దాదాపు 3 కోట్ల గుడ్లు అవసరమని వ్యాపారవర్గాలు అంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరు లక్షల కుటుంబాలు, 1000కి పైగా పెద్ద చిన్న హోటళ్లు ఉన్నాయి. వీరందరికీ గుడ్లు అవసరమవుతాయి. ధర గతంలో ఎప్పుడూ ఇంతగా ధర పలకలేదంటున్నారు. గతంలో 30 గుడ్ల ధర రూ.160 వరకు ఉంటే ఇప్పుడు రూ.230 వరకు పెరిగిందంటున్నారు.

**సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నిరాశ**
**టోకుగా 100కు రూ.740, చిల్లరగా ఒక్కొక్కటి రూ.9 నుంచి రూ.10**

### మూడు నెలల కిందట ఏర్పడిన సమస్య..

మూడు నెలల కిందట ఫ్లూ వ్యాధి కారణంగా చాలా చోట్ల లక్షలాది కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో గుడ్లకు తీవ్రమైన కొరత ఏర్పడింది. గతంలో అవసరమైనమేర గుడ్ల ప్రస్తుతం ఉత్పత్తి కావడం లేదని వ్యాపారులు అంటున్నారు. ఈ కారణంగా తగినన్ని గుడ్లు సరఫరా లేదు. ఈ ప్రభావం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే వారికి భారంగా మారింది. వీరు నెలలో లక్షల గుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. ప్రజలు సైతం చిల్లరగా గుడ్డు కొంటే అంగడిలో కనీసం రూ.9 ధర పెట్టకతప్పడం లేదు. మారుమూల గ్రామాల్లో గుడ్డు రూ.10 వరకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రాబోవు వేసవి కాలం నాటికి ధర తగ్గవచ్చని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

రాజుపాళెంలోని ఓ అంగడిలో ఉన్న గుడ్లు

## ఉమ్మడి కడప జిల్లాలో పలువురు సీఐల బదిలీలు

**కడప నేరవార్తలు, న్యూస్‌టుడే:** కర్నూలు-అనంతపురం రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన పలువురు సీఐలు బదిలీ అయ్యారు. వారికి కేటాయించిన రేంజ్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. బదిలీ అయిన వారి వివరాలివీ..

| సీఐ | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|
| ఆర్.మోహన్ | వీఆర్ కడప | కమలాపురం |
| ఎస్.రోషన్ | కమలాపురం | రాయచోటి |
| ఎస్.నాగేశ్వరబాబు | వీఆర్ అనంతపురం | ముద్దనూరు |
| కె.దస్తగిరి | ముద్దనూరు | వీఆర్ కడప |
| ఎన్.నారాయణప్ప | వీఆర్ కడప | సీసీఎస్-1 కడప |
| హెచ్.కృష్ణంరాజునాయక్ | సీసీఎస్-1కడప | ఎల్‌ఆర్ పల్లి |
| పి.చంద్రశేఖర్ | ఎర్రగుంట్ల అన్నమయ్య | ఆదోని ఒకటో పట్టణ |
| కె.శ్రీరాం | ఆదోని ఒకటో పట్టణ | ప్రొద్దుటూరు ఒకటో పట్టణ |
| జి.సుబ్బారావు | కడప రెండో పట్టణ | శ్రీశైలం రెండో పట్టణ |
| డి.రామాంజనేయుడు | ఎస్సీ, ఎస్టీ, అన్నమయ్య | ప్రొద్దుటూరు మూడోపట్టణ |
| వి.వేణుగోపాల్ | ప్రొద్దుటూరు మూడోపట్టణ | దేవనకొండ |
| పి.వంశీనాథ్ | దేవనకొండ | ప్రొద్దుటూరు రెండోపట్టణ |
| యూ.సదాశివయ్య | ప్రొద్దుటూరు రెండో పట్టణ | కడప రెండోపట్టణ |
| టి.మధు | వీఆర్ అనంతపురం | డీటీసీ, అన్నమయ్య |
| డి.మస్తాన్‌వల్లీ | వీఆర్, కర్నూలు | ఎస్సీ ఎస్టీ సెల్ అన్నమయ్య |

## ఉమ్మడి జిల్లాలో 54 ముంపు గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

సోమశిల ముంపులో వరికుంట ఎస్సీ కాలనీ (పాత చిత్రం)

**అట్లూరు, న్యూస్‌టుడే:** కడప, అన్నమయ్య జిల్లాలో రెండో విడతలో సోమశిల ముంపు పరిధిలోని 54 గ్రామాల కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా లబ్ధి చేకూరనుంది. గతంలో సోమశిల ముంపు గ్రామాలకు పరిహారం మాత్రమే ఉండేది, 2013 భూసేకరణ చట్టం ప్రకారం తమకు పునరావాసం వసతులు (ఆర్‌అండ్ ఆర్) కల్పించాలంటూ బాధితులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో అట్లూరు, గోపవరం, నందలూరు, ఒంటిమిట్ట మండలాల్లో బాధిత లబ్ధిదారుల రికార్డులను పరిశీలించేందుకు మంగళవారం నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ విచారణ నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. అట్లూరు మండలంలో మద్దూరు, చెండువాయి, విరూరు, వరికుంట, ఉప్పుటూరు, జొన్నవరం, రంగసాయిపల్లె, మల్లెనిట్టూరు గ్రామాలకు స్థానిక స్త్రీ శక్తి భవనంలో విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దార్ శిరీష తెలిపారు. సంబంధిత గ్రామాల ముంపు బాధితులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

## కమనీయం.. వేంకటేశుడి అభిషేకం

**కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే:** కడప మున్సిపల్ మైదానంలో ఆదివారం శ్రీనివాస మాల భక్తబృందం సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉదయం ఆరు గంటలకు సుప్రభాతంతో కార్యక్రమం మొదలైంది. అనంతరం గోమాత పూజ నిర్వహించారు. అనంతరం మాడ విగ్రహం నుంచి స్వామి వారికి వస్త్రాలంకరణ సేవా కార్యక్రమం చేపట్టారు. స్వామి వారికి మంగళస్నానం చేయించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్వామి వారి కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న వేదపండితులు

## ఎమ్మెల్సీని కలిసిన జిల్లా గ్రంథాలయ ఛైర్మన్

**పులివెందుల, న్యూస్‌టుడే:** ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కడప జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దాసరి భానుప్రకాష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను కలిసి పలు విషయాలపై చర్చించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి భానుప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపి జిల్లాలోని పలు గ్రంథాలయాలు అధ్వాన్నంగా ఉన్నాయని వాటి అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన్ను కోరారు.

## ఉపాధ్యాయుల అభ్యున్నతికి ఎస్టీయూ కృషి

కడప ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

**కడప విద్య, న్యూస్‌టుడే:** విద్యా రంగం, ఉపాధ్యాయుల అభ్యున్నతి కోసం ఎస్టీయూ చేస్తున్న కృషి ప్రశంసనీయమని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ హాలులో ఆదివారం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా విద్యా సదస్సు నిర్వహించారు. అంతకు ముందు స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ అర్హత పరీక్షపై ఆందోళన చెందొద్దని రాష్ట్ర ప్రభుత్వం 2011 కన్నా ముందు ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి టెట్ నుంచి మినహాయింపు వచ్చేలా ప్రయత్నిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు విద్యా సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న సంస్కరణల వల్ల విద్యా సంస్థలు కుంటుపడుతోందని ప్రయోగాలు విరమించుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రరెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, పాలకొండయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుదర్శన్, గాజుల నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుబ్రమణ్యంరాజు, జోసెఫ్, సుధీర్‌బాబు, తిమ్మన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జన విజ్ఞాన వేదిక నాయకులు విశ్వనాథం పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలి

మాట్లాడుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి

**కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే:** శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు వెళ్లినపుడే సానుకూల ఫలితాలు వస్తాయని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర కార్యశాలలో ఆదివారం నాయకత్వాన్ని ఉద్దేశించి నారాయణరెడ్డి ప్రసంగించారు. నేటి సమాజంలో సాంకేతికత పెరిగినప్పటికీ... మూఢ నమ్మకాల ప్రభావం తగ్గకపోవడం సరికాదన్నారు. ఆర్‌ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్‌ఎస్‌యూను మరింత బలోపేతం చేస్తామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర వర్క్‌షాప్‌లో జాతీయ కమిటీ సభ్యుడు నవీన్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

## బొలేరో వాహనం ఢీకొని.. ఇద్దరు దుర్మరణం

వీరప్రతాప్‌రెడ్డి పెద్దఎల్లయ్య (పాత చిత్రాలు)

**దువ్వూరు, న్యూస్‌టుడే :** దువ్వూరు-ప్రొద్దుటూరు రహదారిపై దువ్వూరు మండలం మురళి నగర్ మెట్ట సమీపంలో ఆదివారం బొలేరో వాహనం ఢీకొట్టిన ఘటనలో దువ్వూరు మండలం నేలటూరు గ్రామానికి చెందిన చాగలేటి వీరప్రతాప్‌రెడ్డి (48), గోపులాపురం గ్రామానికి చెందిన చిట్టిబోయిన పెద్ద ఎల్లయ్య(63) అనే ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. నేలటూరు గ్రామానికి చెందిన వీరప్రతాప్‌రెడ్డి తన టీవీఎస్ ద్విచక్ర వాహనంలో దువ్వూరుకు వచ్చి తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో గోపులాపురం గ్రామానికి చెందిన పెద్దఎల్లయ్య కనిపించి నేలటూరు మెట్టపొలం వరకు డ్రాప్ అడిగారు. ఇద్దరూ ఒకే వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యలో వాహనాన్ని ఒక వైపుగా నిలిపి ఉంచి వారు పొలం దిశగా వెళుతుండగా దువ్వూరు వైపు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతున్న బొలేరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రహదారిపై మృతదేహాలను చూసి కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### దైవ దర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు

జగదీష్ (పాత చిత్రం)

**ఒంటిమిట్ట, ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే:** మండలంలోని ఒంటిమిట్ట-చెర్లోపల్లి గ్రామాల మధ్యలో తిరుమలకు కాలినడకన వెళ్తున్న ఎర్రగుంట్ల మండలం చిన్నదండ్లూరుకు చెందిన కొర్రపాటి జగదీష్ (21) అనే యువకుడిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్.ఐ వి.శ్రీనివాసులు తెలిపారు. ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామం నుంచి మిత్రుడు సుబ్బరాముడు(38)తో కలిసి తిరుమల శ్రీవారి దర్శనం కోసం రెండు రోజుల కిందట పాదయాత్ర చేపట్టారు. ఒంటిమిట్ట చెరువు-చెర్లోపల్లి మధ్యలో కాలినడకన వెళ్తుండగా రాజంపేట మండలం డీబీఎన్‌పల్లికి చెందిన కె.వెంకటేష్ (32) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వచ్చి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. శ్రీవారి దర్శనానికి వెళ్తూ మృత్యుఒడికి చేరాడంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

### అదృశ్యమై.. విగతజీవిగా మారిన నాగాయపల్లెవాసి

**మైదుకూరు, న్యూస్‌టుడే:** చాపాడు మండలం నాగాయపల్లెకు చెందిన పిచ్చిపాటి వీర ప్రభాకర్‌రెడ్డి (36) ఆదివారం మైదుకూరు వద్ద కేసీ కాలువలో శవమై కనిపించాడు. ప్రభాకర్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి ఆ తర్వాత కనిపించకుండా పోయి కాలువలో శవమై తేలినట్లు సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## కూలీ డబ్బులడిగాడని.. చక్కెర గుత్తితో రౌడీ షీటర్ దాడి

దాడికి ఉపయోగించి చక్కెర గుత్తి | రౌడీషీటర్ దాడిలో గాయపడిన జిలాని

**ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** కూలీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై రౌడీషీటర్ పదునైన చక్కెర గుత్తి (బస్తాల నుంచి బియ్యం, చక్కెర శ్యాంపిల్ తీసే వస్తువు)తో దాడికి పాల్పడిన ఘటన ప్రొద్దుటూరులోని శివాలయం కూడలి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఠాణా పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని మట్టి మసీదు వీధికి చెందిన రౌడీషీటర్ మల్లెల సాధక్ పొరుగు ప్రాంతాల నుంచి పండ్లు తెప్పించి వాటిని స్థానిక శివాలయం కూడలి వద్ద కూలీ మనుషుల ద్వారా తోపుడు బండ్లపై అమ్మిస్తుంటాడు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన జిలానీ అనే వ్యక్తి అతని వద్ద కూలికి పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు తోపుడు బండిపై పండ్లు అమ్మిన జిలాని... కూలీ డబ్బులు ఇవ్వాలని సాధక్‌ను అడిగేందుకు వెళ్లాడు. అతను డబ్బులు ఇవ్వనని చెప్పడంతో వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈ క్రమంలో రౌడీ షీటర్ సాధర్ పక్కనే ఉన్న చక్కెర గుత్తి తీసుకుని జిలాన్ పై దాడికి దిగాడు. దీంతో అతనికి శరీరంపై పలు చోట్ల గాయాలు కాగా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తెదేపాలో చేరిన వైకాపా నేతలు

పార్టీలో చేరిన న్యాయవాది ఈశ్వర్‌రెడ్డి, స్థానికులతో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

**వేంపల్లె, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అన్నారు. మండలంలోని అమ్మగారిపల్లెలో ఆదివారం వైకాపాకు చెందిన న్యాయవాది వెన్నపూస ఈశ్వర్‌రెడ్డితో పాటు శంకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, శివారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డిలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారి వెంట అయిదు కుటుంబాల వారు ఉన్నారు. వారికి బీటెక్ రవి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పులివెందుల పర్యటనకు వస్తున్నారని.. నియోజకవర్గంలో ఉన్న అసంపూర్తి పనుల విషయమై ఆయన దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పులివెందుల, వేంపల్లె ప్రాంతాల్లో ప్రైవేట్ కర్మాగారాలు ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు పార్థసారథిరెడ్డి, అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, రామమునిరెడ్డి, షబ్బీర్, బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిన వైకాపా సానుభూతి పరులు

అమ్మగారిపల్లె గ్రామానికి చెందిన వైకాపా సానుభూతి పరులు కొందరు ఆదివారం తమ ఇళ్లకు తాళాలు వేసి నందిమండలం కొండగంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసుకున్న కార్యక్రమానికి తరలి వెళ్లారు. గ్రామానికి చెందిన కొందరు తెదేపాలో చేరుతున్నట్లు తెలిసి వారంతా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారని తెలిసింది.

## ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

**ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక మెరుగైన పీఆర్సీ, సకాలంలో డీఏలు, అన్ని రకాల బకాయిలు చెల్లిస్తామని చెప్పి ప్రభుత్వం అమలులో జాప్యం చేస్తోందన్నారు. 2023 జులై నుంచి 12వ పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉన్నప్పటికీ కనీసం 12 పీఆర్సీ కమిషన్‌ను కూడా నియమించలేదన్నారు. జులై 2024 నుంచి ఇప్పటి వరకూ మూడు విడతల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు కరవు భత్యం బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ప్రొద్దుటూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, సయ్యద్‌బాషా, జిల్లా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వైవీయూ మార్గం.. పచ్చని తోరణం

కడప శివారులోని యోగివేమన విశ్వవిద్యాలయం సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు వాహనాలకు స్వాగతం పలికే పచ్చని తోరణాల వలె పెరిగాయి. రెండు వైపులా ఉన్న చెట్లు పెద్దవి కావడంతో కొమ్మలు ఒకదానికొకటి అంటుకుని స్వాగతం పలికినట్లు కనిపిస్తున్నాయి. ఈ పచ్చని దృశ్యం చూపరులకు కనువిందు చేస్తోంది. కాస్త దూరం నుంచి చూస్తేనే దృశ్యాలు స్వాగత తోరణాల వలె కనిపిస్తున్నాయి. వైవీయూ ప్రారంభం నుంచి ముగింపు వరకు చెట్లు అలానే ఉన్నాయి. అటువైపు వెళ్లే ప్రకృతి ప్రేమికులు స్వచ్ఛమైన గాలిని పీల్చుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, కడప (చిన్నచౌకు)**

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు జమ్మలమడుగు వేదిక

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మైదానంలో జాతీయస్థాయి అండర్-14 బాలికల వాలీబాల్ పోటీలను జరిపేందుకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు నిర్ణయించారు. జనవరి 5వ తేదీ నుంచి 9 వరకు జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు జరగనున్నాయి. దేశంలోని 45 ప్రాంతాల నుంచి క్రీడాకారిణులు ఈ పోటీలకు హాజరుకానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీరికి వసతి కల్పనకు అయిదుగురు మహిళా వ్యాయామ ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. తొలి రోజున సాయంత్రం ప్రారంభోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు, మొదటి రౌండ్ పోటీలు ఉంటాయని, ఆ మరుసటి రోజు నుంచి ఉదయం, సాయంత్రం పోటీఉలు కొనసాగుతాయి. చివరి రోజు ఉదయం తుది పోటీలుంటాయని ఆ తర్వాత ముగింపు సభ ఉంటుందన్నారు. సోమవారం నుంచి మైదానంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

## రేపటి నుంచి అండర్-19 రాష్ట్ర స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

- ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరగనున్న పోరు

క్రికెట్ మ్యాచ్‌కు సిద్ధం చేసిన స్టేడియం

**కడప క్రీడలు :** కడపలోని వైఎస్ఆర్ ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. కూచ్ బెహర్ మెన్స్ అండర్-19 ఎలైట్ గ్రూప్-సి విభాగంలో జరుగుతున్న చివరి రౌండ్ మ్యాచ్ ఇది. ఈ ఏడాదిలో కడపలో జరుగుతున్న మొదటి రాష్ట్ర మ్యాచ్ కూడా ఇదే కావడం విశేషం. ఎలైట్ గ్రూప్-సి విభాగంలో ఇప్పటికే ఉత్తరాఖండ్ జట్టు 4 మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలు సాధించగా.. ఆంధ్ర జట్టు ఒక విజయమే సాధించినప్పటికీ ఉత్తరాఖండ్‌తో సమానంగా పాయింట్లు సాధించింది.

**గెలిస్తే నాకౌట్‌కు.. :** ఈ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఉత్తరాఖండ్‌పై ఘన విజయం సాధించడంతో పాటు... మహారాష్ట్ర జట్టు తన ప్రత్యర్థి జట్టు కర్ణాటకతో ఓటమి చెందితే ఎలైట్ గ్రూప్-సి లో విభాగంలో ఆంధ్ర జట్టు రెండో స్థానాన్ని దక్కించుకుని నాకౌట్‌కు చేరే అవకాశం ఉంది. అలాగే ఉత్తరాఖండ్ కూడా ఆంధ్ర జట్టుపై విజయం సాధించి పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకోవాలని భావిస్తోంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ మ్యాచ్ కడపలో జరుగుతుండడం క్రికెట్ అభిమానులకు కనువిందు చేయనుంది.

**కడపకు చేరుకున్న జట్లు..:** ఆంధ్ర-ఉత్తరాఖండ్ క్రికెట్ జట్లు ఆదివారం కడపకు చేరుకున్నాయి. సోమవారం ఇరుజట్లు ప్రాక్టీస్ చేసుకునేందుకు జిల్లా క్రికెట్ సంఘం తగు ఏర్పాట్లను చేసింది. ఇప్పటికే అందుకు సంబంధించిన క్రికెట్ నెట్స్‌ను సిద్ధం చేశారు. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ నిర్వహణకు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మొత్తం మీద కడపలో తొలి రాష్ట్ర మ్యాచ్ ఈ ఏడాది జరుగుతుండడం శుభ పరిణామం.

## 16న జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

**కడప క్రీడలు, న్యూస్‌టుడే:** జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలను సీకే దిన్నె మండలం కృష్ణాపురంలోని నారాయణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రామసుబ్బారెడ్డి, నరేంద్రలు తెలిపారు. 18 ఏళ్ల లోపు వయసు కలవారు జూనియర్ విభాగానికి అర్హులని తెలిపారు. 18 ఏళ్ల వయసు పైబడిన వారు సీనియర్స్ విభాగంలో పోటీ పడవచ్చన్నారు. జూనియర్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20, 21 తేదీల్లో జె.పంగులూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడాల్సి ఉంటుందన్నారు. సీనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కృష్ణా జిల్లా గుడివాడలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు.

(c) eenadu

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

## 21న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**మైదుకూరు, న్యూస్‌టుడే :** ఉపాధ్యాయ ఐక్య వేదిక జిల్లా తృతీయ కౌన్సిల్ సమావేశం ఈనెల 21న మైదుకూరు పట్టణం డీసీఎల్ వేడుకల మందిరంలో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా సహ అధ్యక్షుడు వై.రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కౌన్సిల్ సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో యూనియన్ నాయకులు ప్రసన్న లక్ష్మి, బి.శేఖర్, వనమాల రాము, గంగులయ్య, శ్రీనివాసులు, తిరుపేలయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## విద్యార్థుల అపూర్వ కలయిక

గురువులతో పూర్వ విద్యార్థులు

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే:** విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. పాఠశాలలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు బయన నాగేంద్రరెడ్డి, శెట్టెం చెన్నయ్య, శ్రీనివాసులు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం... మీకు తోడుగా...**
(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు గ్రామీణ: 94942 94241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

### పూడికల తొలగింపు

స్పందనకు వందనం

**బద్వేలు, న్యూస్‌టుడే:** పురపాలికలోని శోత్రియం రామాపురంలో మురుగు కాల్వల పరిస్థితి దారుణంగా ఉందని ఇటీవల 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకోసం' లోగో కింద ప్రచురితమైన వార్తకు పురపాలిక అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి మురుగు కాల్వల్లో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

?: బద్వేలు పట్టణంలోని రాజుగారివీధిలోని కాలువల్లో పూడిక తీయలేదు. దీంతో పైవార్డుల నుంచి వచ్చే మురుగు పారడం లేదు. కాల్వలో నీరు నిలిచిపోవడం వల్ల దుర్వాసన వస్తూ దోమలు ఎక్కువై ఇబ్బందులు పడుతున్నాం. **-వెంకటేశ్వర్లు, రాజుగారివీధి**

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయించి సమస్యను పరిష్కరిస్తాం.

?: బద్వేలు పురపాలికలోని మార్తోమనగర్‌లో కొన్ని వీధి దీపాలు రాత్రి సమయంలో వెలగక అంధకారం నెలకొంది. విష పురుగులు సంచరిస్తున్నాయి. **-ఓబులేసు, మార్తోమనగర్, బద్వేలు**

✓: మార్తోమనగర్‌లో వెలగని ఎల్ఈడీ దీపాలను బాగు చేయిస్తాం.

**(పై సమస్యలకు బద్వేలు పురపాలిక కమిషనరు నరసింహారెడ్డి సమాధానం చెప్పారు.)** -న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

?: పోరుమామిళ్ల - కమ్మవారిపల్లె మార్గమధ్యలో రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. **-రమణ, కమ్మవారిపల్లె**

✓: గుంతలను పూడ్చివేస్తాం. ఇటీవలే పడిన వర్షాలకు గుంతలు ఏర్పాడ్డాయి. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **-రజియా, ఏఈ**

?: పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేటలోని జడ్పీహైస్కూల్ పాఠశాల ఆవరణంలో విద్యుత్తు తీగలను ఉన్నాయి. చిన్నపాటి గాలివీచినా తీగలు తెగి కిందపడుతున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-సుబ్బారావు, టేకూరుపేట**

✓: పాఠశాలలోని విద్యుత్తు తీగలు తొలగించేందుకు ప్రతిపాదనలు పంపించాం. సమస్యను డీఈ దృష్టికి తీసుకెళ్లాం.

**-మహేష్, ఏఈ** -న్యూస్‌టుడే, పోరుమామిళ్ల

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**ముద్దనూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఆరవేటిపల్లెకు చెందిన హరిష్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగత పనులపై ముద్దనూరుకొచ్చి తిరిగి వెళుతుండగా మరో వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. హరిష్‌కుమార్‌రెడ్డిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కునుకుపట్టింది.. బండిఅదుపు తప్పింది

**కొండాపురం, న్యూస్‌టుడే:** కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున లారీ అదుపు తప్పి సేఫ్టీ గ్రిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సుమారు 20 మీటర్ల మేర గ్రిల్ పూర్తిగా దెబ్బతినడంతో పాటు ఓ విద్యుత్తు స్తంభం పడిపోయింది. డ్రైవర్ నిద్రపోవడంతో ప్రధాన రహదారికి సర్వీస్ రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన గ్రిల్‌ను ఢీకొట్టి లారీ దూసుకెళ్లి నిలిచిపోయింది. లారీ ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

**ముద్దనూరు, న్యూస్‌టుడే:** మండల పరిధి మంగపట్నం గ్రామంలో శనివారం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని ఎస్సై మైనుద్దీన్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. నాగరాజు నాయుడుకు అదే గ్రామానికి చెందిన నాగేంద్ర నాయుడులకు భూమి విషయంలో ఘర్షణ జరిగింది. ఇరువురికి గాయాలు కావడంతో వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై ఇరు కుటుంబాలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

## మద్యం సీసాల స్వాధీనం

**అట్లూరు, న్యూస్‌టుడే :** మండలంలోని మాడపూరు ఎస్సీ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెడ్డిచెర్ల పెంచలరాజును అదుపులోకి తీసుకొని 19 మద్యం సీసాలు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై నాగకీర్తన తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆమె తెలిపారు..

## పాత భవనంలో పేలిన టపాసులు

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** జమ్మలమడుగు మెయిన్ బజారులో పాడుపడిన ఇంట్లో టపాసులు ఒక్కసారిగా పేలి మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో అగ్నిమాపక వాహనం వచ్చి మంటలార్పడంతో అక్కడున్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. పోస్టాఫీసు వద్ద బాణసంచా గోదాములుగా ఉపయోగించిన రెండు భవనాలను కూల్చివేశారు. భవనాల వెనుక భాగంలో ఉన్న చెత్తను కాల్చేందుకు నిప్పుపెట్టారు. శిథిలాల కింద ఉన్న టపాసులు పేలగా పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కి పడ్డారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పినట్లు ఫైర్‌స్టేషన్ అధికారి చంద్రశేఖరప్ప తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని చెప్పారు.

ఈనాడు
దినపత్రికలలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

# అక్రమ నిర్మాణం.. పూడిక తొలగించక అవరోధం

✤ మడూరు కాలువలపై రూ.లక్షల విలువైన స్థలాలు స్వాహా

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

మడూరుకాలువ స్థలంపై యథేచ్ఛగా కట్టడాలు

ప్రొద్దుటూరు పట్టణం మడూరు వరదకాలువపై అక్రమ కట్టడాల నిర్మాణాలు జోరందుకున్నాయి. పట్టణంలో 2.5 కిలోమీటర్ల మేర ఈ పరిస్థితి కనిపిస్తోంది. వ్యాపార, వాణిజ్య కేంద్రాల వద్ద మరీ దారుణంగా ఉంటోంది. గాంధీరోడ్డు నుంచి రెండో వార్డు పురపాలక ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి వాణిజ్య ప్రాంతంలో ప్రవహిస్తున్న కాలువ పునాదిపై గోడలు, గదులు, ర్యాంపుల వంటి నిర్మాణాలు పెరిగాయి. మరొక అడుగు ముందుకేసి ఆక్రమణదారులు వీటిని అద్దెలకు సైతం ఇస్తున్నారు. ఇలాంటి అక్రమం నిర్మాణాలు దాదాపుగా పది దాకా ఉన్నాయి. 20 అడుగుల వరకు కాలువ పోరంబోకు స్థలం వుంది. ఇక్కడ సెంటు రూ.20 లక్షలకు పైగా ధర పలుకుతోంది. అడ్డదిడ్డంగా కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల ఉదయాన్నే పూడిక తొలగించేందుకు వస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు అసౌకర్యంగా మారింది.

కొత్తపల్లె కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఇటీవల ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పురపాలక సంఘం కమిషనర్‌ను ఆదేశించారు. ఆక్రమణలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినా జనసంచారం అధికంగా ఉన్న ప్రధాన రోడ్డుపై అక్రమ కట్టడాలు చేపట్టినా అధికారులు గుర్తించకపోవడం గమనార్హం.

### ఎమ్మెల్యే ఆదేశించినా పట్టని వైనం

విజయ్‌కుమార్ థియేటర్ వెనుక వైపు మడూరు కాలువ నుంచి శివాలయంరోడ్డు వరకు కాలువ పోరంబోకు స్థలాలపై నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ విభాగాధికారులు వైకాపా ప్రభుత్వ హయాంలో గుర్తించి ఒకటి, రెండు ఆక్రమణలను తొలగించారు. ఆర్థికంగా పలుకుబడి ఉన్న గృహ యజమానులకు సంబంధించినవి కొన్నింటిని తొలగించలేదు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు జరగలేదు. ఈ అంశాలను కమిషనర్ రవిచంద్రారెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఆక్రమణలను గుర్తించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచిస్తానన్నారు.

## ఆర్నెల్లకోసారి వైద్య పరీక్షలు తప్పనిసరి

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు

**ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే:** దైనందిన జీవితంలో డబ్బే ధ్యేయంగా ఉరుకులు పరుగులు తీసే ప్రతి ఒక్కరూ ఆరు నెలలకొక్కసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో సభా భవనంలో ఎన్జీవో సంఘం, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడారు. వైద్యులు కన్ను, గుండె, దంత జబ్బులపై 200 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రొద్దుటూరు అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బయ్య, ప్రమీల, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూర్‌బాషాల అభ్యున్నతికి కృషి

**జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే:** నూర్‌బాషా దూదేకుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు ఇదాయతుల్లా, సిద్దయ్య, ఖాదర్‌బాషా, ఓబులేసులు పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మలమడుగులో రాయలసీమ దూదేకుల సంఘ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల జనాభా ఉన్నా తక్కువగా చూపిస్తూ అవమానిస్తున్నారని, గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేసి సంఘం అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. సంఘ నాయకులు కిరణ్, దస్తగిరి, రమణ, చిన్నపీరయ్య, పెద్దపీరయ్య, కుళాయిస్వామి, ఖాసీం, బ్రహ్మయ్య, ఇమాములు తదితరులు పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు

## విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ల కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన సభ్యులు వీరే..

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక ఆచార్ల కాలనీలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ప్రొద్దుటూరు విశ్వకర్మ - విశ్వబ్రాహ్మణ కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక చేపట్టారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ధనుంజయ, అధ్యక్షుడిగా నరసింహాచారి, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, ఉప కార్యదర్శిగా వెంకట సుబ్బయ్య, కోశాధికారిగా విశ్వరూప, డైరెక్టర్లుగా వీరప్రతాప్, ఉదయ్‌కుమార్, హరినాథ్, మల్లికార్జున, కుళాయిస్వామి, శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ విశ్వకర్మ బ్రాహ్మణ కుటుంబాలకు సంబంధించి కార్పెంటర్స్‌లు అన్ని రంగాల్లో ప్రగతి సాధించడానికి, ప్రభుత్వ సంక్షేమ, ఆర్థిక ప్రయోజనాలు వచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు.

## దీపం వెలిగింది.. చీకటి బెదిరింది

పల్లవోలు బస్టాపు వద్ద విద్యుద్దీపాలంకరణలో స్తంభం

మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారిపై పల్లవోలు బస్టాపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. ఖాదర్‌పల్లె బస్టాపు నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు ప్రధాన రహదారి వెంట ఊరు విస్తరించింది. మండలంలోనే అత్యధిక ఆదాయ వనరున్న గ్రామ పంచాయతీ ఇది. చీకటి పడిందంటే వీధి దీపాలు పనిచేయవు. నెల్లూరు-ముంబై-బళ్లారి 67వ జాతీయ రహదారి అయినా బస్టాపుల వద్ద ఎలాంటి సూచికలు, దీపాలు, సిగ్నల్స్ ఏర్పాటుచేయలేదు. స్థానిక యువత సొంత డబ్బులతో హిందువుల ఐక్యత చాటుతూ ఇనుప స్తంభం నాటి 'ఓం' కాషాయ జెండా ఎగురవేశారు. స్తంభానికి అలంకరణగా దీపాలు ఏర్పాటుచేయడంతో రాత్రివేళ అక్కడ ఓ ఊరుందని ఆ మార్గంలో వెళ్లే వాహనాలకు దూరం నుంచి కనిపిస్తుంది. ప్రమాదాల నివారణకు స్థానిక యువత ఓ ప్రయత్నం చేయడాన్ని గ్రామస్థులు అభినందించారు. **-న్యూస్‌టుడే, చాపాడు**

## ప్రొద్దుటూరు పోలీస్ శాఖలో ప్రక్షాళన

**ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరులో పోలీసు అధికారులపై శాఖా పరమైన ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి వెలువడిన బదిలీ ఉత్తర్వుల్లో ప్రొద్దుటూరు చెందిన ఇద్దరు సీఐలు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారిలో ఇటీవల దుమారం రేపిన ఓ కేసు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ కూడా ఉన్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి అతని సోదరుడిపై నమోదైన కేసు, అరెస్టులో పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర స్థాయిలో దుమారం రేపిన విషయం తెలిసిందే.

## క్రైస్తవులందరూ ఐక్యత చాటాలి

మాట్లాడుతున్న బిషప్ కామనూరి సంతోష్ ప్రసన్నరావు

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** క్రైస్తవులందరూ ఐక్యంగా ఉండాలని దక్షిణ భారత క్రైస్తవ సంఘం నేత, నంద్యాల బిషప్ కామనూరి సంతోష్ ప్రసన్నరావు అన్నారు. స్థానిక మైదుకూరురోడ్డులో ఎస్‌పీజీ చర్చి ఆధ్వర్యంలో ఐక్య దీపారాధన సందర్భంగా పట్టణానికి వచ్చారు. చర్చిలో రాత్రి క్రైస్తవ భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్రైస్తవ బోధనలపై భక్తులు ఆధ్యాత్మిక పాటలు పాడారు. రాత్రి 10 గంటలకు వచ్చిన వారందరూ కొవ్వొత్తులు పట్టుకుని చర్చి ఆవరణలో ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చి ఫాదర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదినారాయణరెడ్డికి రాజకీయ సమాధి

**జమ్మలమడుగు, న్యూస్‌టుడే:** 'మీ అన్నకు 2004లో ఒక ఇంజెక్షన్ ఇచ్చావు, 2024లో అన్న కుమారుడికి మరొక ఇంజెక్షన్ ఇచ్చావు. 2029లో ప్రజలు నీకు ఇంజెక్షన్ ఇచ్చి రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని' వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలంటే ఆదికి భయం పట్టుకుందని అందుకే ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే పులివెందుల మాదిరిగా అక్రమ పద్ధతిలో జరపాలని లేకుంటే గెలవలేమని మొరపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇంకోసారి జగన్, భారతి, ఎంపీ అవినాశ్‌రెడ్డి గురించి మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# మాటలతో ఆటలు.. భవితకు బాటలు

✶ ప్రత్యేక అవసరాల చిన్నారులకు చికిత్స ✶ తల్లిదండ్రుల్లో చిగురిస్తున్న ఆశలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ఫిజియోథెరపి చేస్తున్న వైద్యుడు సుదర్శన్

ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవిత కేంద్రం ఆశాకిరణంలా నిలిచింది. వివిధ లోపాలతో పుట్టిన వారిలో ఎన్నో మార్పులు తెస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన జమ్మలమడుగు భవిత కేంద్రంలో సుమారు 20 మందికి పైగా బాధిత చిన్నారలు సేవలు పొందుతున్నారు. అందరిలా అవయవాలన్నీ సహకరించకపోయినా జీవితంలో ఎదగాలన్న సంకల్పమే వారిలో ధైర్యాన్ని నింపుతూ విజయపథంలో నడిపిస్తోంది. విభిన్న ప్రతిభావంతుల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా బంగారు బాట వేస్తోంది. ప్రత్యేక శిక్షణతో దివ్యాంగుల జీవితాల్లో మార్పులు తీసుకొస్తున్నారు.

### రంగులపై అవగాహన

పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ పుట్టుకతోనే బుద్ధిమాంద్యంతో జన్మించడంతో ప్రవర్తన సరిగాలేదు. పుట్టుకతోనే చెవిటి, మూగ కావడంతో తన భావాలను వ్యక్తపరచలేని స్థితి. భవిత కేంద్రంలో కొంతకాలంగా ఫిజియోథెరపీలో శిక్షణ పొందుతున్నాడు. ప్రస్తుతం చిత్రాలు గీయడంతో పాటు అక్షరాలు సైతం రాస్తున్నాడు. సైగలతో తన భావాలను ఇతరులకు తెలియజేస్తున్నాడు. **-మహమ్మద్ ఇర్ఫాన్**

### ప్రవర్తనలో మార్పులు

పట్టణంలోని నాగులకట్ట వీధికి చెందిన అనిల్ కుమార్ మానసిక వైకల్యంతో బాధపడుతుండేవాడు. దీంతో ఒంటరిగా ఉండటం, తనలో తానే మాట్లాడుకోవడం చేస్తున్నాడు. భవిత కేంద్రంలో చేరినప్పటి నుంచి ప్రవర్తనలో మార్పులు వచ్చాయి. తోటి పిల్లలతో ఆడుకుంటూ.. తన పని తానే చేసుకుంటున్నాడు. అక్షరాలు వరుస క్రమంలో చేర్చడం, పదాలను పలకడం, జంతువులను గుర్తించి వాటి పేర్లు కూడా చెప్పగలుగుతున్నాడు. **- అనిల్ కుమార్**

### ఆటల్లో ముందంజ

జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్.హుస్సేన్ బాషా భవిత కేంద్రానికి రాకముందు మాటలు రాక, సొంత పనులు చేసుకోలేక ఉండేవాడు. స్థిరంగా ఒక చోట నిలబడలేని పరిస్థితి. ప్రస్తుతం భవిత కేంద్రానికి వచ్చాక ప్రత్యేక శిక్షణతో పదాలు రాయడం, చదవడం నేర్చుకున్నాడు. అంతేకాకుండా ఆటల్లో చురుగ్గా పాల్గొంటూ జిల్లా స్థాయి దివ్యాంగ పోటీల్లో పాల్గొని పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందాడు. **-ఎస్.హుస్సేన్ బాషా**

## ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

**ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రొద్దుటూరు పట్టణంలో ఉర్దూ డిగ్రీ కళాశాల, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారూక్‌షిబ్లీకి వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణానికి వచ్చిన ఛైర్మన్‌కు ఆదివారం ఉదయం మూమెంట్ ఫర్ పీస్ అండ్‌జస్టిస్ (ఎంపీజే) సంస్థ ప్రతినిధులు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వరకు ఉర్దూ భాషలో చదువుకున్న విద్యార్థులు డిగ్రీ చదివే అవకాశం లేక జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనివల్ల మధ్యలోనే చదువు ఆగిపోతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయూబ్‌ఖాన్, జాకీర్ ఉమి, రఫీ, గౌస్‌లాజం, సాబీర్, సఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారూక్‌షిబ్లీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీజే నాయకులు

## ధర్మ రక్షణపై పిల్లలకు అవగాహన అవసరం

మాట్లాడుతున్న సరస్వతి మాత

**చాపాడు, న్యూస్‌టుడే:** ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచి హైందవ ధర్మం గూర్చి చెప్పాలని శివదర్శనానంద సరస్వతి మాతా అన్నారు. ఆదివారం అల్లాడుపల్లె దేవళాలులో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆమె బోధించారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి, జాతీయ భావాలు నిర్మాణం చేస్తూ, హిందూ సమాజాన్ని జాగృతం చేయాలని నేతలు తెలిపారు. చంద్రఓబుళరెడ్డి. చిన్న గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## భూపరిహారాన్ని పునః సమీక్షించాలి

**ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** చాగలమర్రి- వేంపల్లె వరకు జాతీయ రహదారి-440 ఏర్పాటుకు సంబంధించి స్థానిక కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని భూములు, నివేశన స్థలాలకు సెంటు రూ.2.67 లక్షల చొప్పున నిర్ణయించిన తక్కువ ధర వలన ఆర్థికంగా నష్టపోతున్నట్లు పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మైదుకూరు రోడ్డులోని డి-మార్ట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో భూపరిహారం పెంపునకు పునఃసమీక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## కాశినాయనలో పుస్తకావిష్కరణ

**పోరుమామిళ్ల, న్యూస్‌టుడే**: కాశినాయన మండలంలోని ఓబులాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి 'సేవామృతం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆశ్రమ నిర్వాహకుడు రామకృష్ణారెడ్డి, డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై కంపల తొలగింపు

స్పందనకు వందనం

**చాపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని వీవీ కొట్టాలకు వెళ్లే గ్రామంలో రహదారికి ఇరువైపులా కంపచెట్లు పెరిగి అధ్వానంగా ఉందని ఈ నెల 8న 'ఈనాడు'లో 'ముళ్లపొదలు.. తొలగించక అవస్థలు' శీర్షికన ప్రచురితమైంది. ఎంపీడీవో వీరకిషోర్, డిప్యూటీ ఎంపీడీవో హరినాథ్, పంచాయతీ కార్యదర్శి సుమలత, సర్పంచి నారాయణరెడ్డి స్పందించి శుక్రవారం యంత్రంతో రోడ్డు శుభ్రం చేయించారు.

## రెడ్డి సంఘంలో పలువురికి బాధ్యతలు

కొత్తగా నియమితులైన వారితో రాష్ట్ర నాయకులు

**బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే:** అఖిల భారత రెడ్డి సంఘంలో బద్వేలుకు చెందిన పలువురికి బాధ్యతలు ఇచ్చినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలులో వారు మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దిరెడ్డి విజయ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా టి.సరస్వతి, కార్యదర్శిగా ఎం.వెంకటకృష్ణారెడ్డి, బద్వేలు నియోజక వర్గ అధ్యక్షుడిగా ఒ. నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటశివారెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా వెంకటసుహాసినిని నియమించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డి కుటుంబాల్లో పేదవారిని ఆదుకోవాలని, వారికి రాయితీ రుణాలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

2025-26 విద్యా సంవత్సరానికి విశ్వం ఎడుటెక్ వారు మైదుకూరులో నిర్వహించిన జోనల్, జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో ప్రతిభ చూపిన మా విద్యార్థులు
సి.షష్టిర రెడ్డి, జి.సాహిత్ నారాయణ శెట్టిలకు
అభినందనలతో...
ఉషోదయ U.P. హైస్కూల్
జి.శివనారాయణ & టీచర్స్
కరస్పాండెంట్
చిలంకూరు, యర్రగుంట్ల (మం).

శ్రద్ధాంజలి

కీ॥శే॥ బద్వేలి సుబ్బన్న గారు
Rtd. Teacher (H.M.),
ప్రొద్దుటూరు రోడ్డు, మైదుకూరు.
మా బాబాయి కీ॥శే॥ బద్వేలి సుబ్బన్న గారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
అన్నకుమారులు :
డా॥ బద్వేలి సుబ్బరాయుడు (24 గంటల హాస్పిటల్)
బద్వేలి సుబ్బన్న (S.V.S.మెడికల్స్)
బద్వేలి లక్ష్మయ్య (మాజీ వైస్ ఛైర్మన్, మార్కెట్ కమిటీ)
బద్వేలి శ్రీనివాసులు (T.V)
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

# కడప

•కడప •పులివెందుల •కమలాపురం

పూజలందుకున్న రుక్మిణీ సమేత కృష్ణ భగవానుడు

## కమనీయం.. శ్రీకృష్ణుడి కల్యాణం

**పులివెందుల, న్యూస్‌టుడే:** పులివెందులలోని శ్రీకృష్ణ ఆలయంలో శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణ భగవానుడి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కమనీయంగా జరిగింది. ఆలయ అర్చకులు మనోజ్‌కుమార్ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు తరలి వచ్చారు.

## శిల్పారామంలో సండే సందడి

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** నగరంలోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. శిల్పారామంలో పద్మాకర్ సహకారంతో ఆర్కే డ్యాన్స్ విద్యార్థులు చేసిన పల్లె జానపదాలు, నృత్యాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ఆకట్టుకున్న యువకుల నృత్యం

## కడపలో కొనసాగించాలని రిలే దీక్షలు

దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు

**సిద్దవటం, న్యూస్‌టుడే:** అన్నమయ్య జిల్లాలో విలీనం చేయకుండా సిద్దవటాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని సిద్దవటం, భాకరాపేట, మాధవరం గ్రామాల్లో ఆదివారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా సిద్దవటంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, భాకరాపేట, మాధవరం గ్రామాల్లో జేఏసీ నాయకులతో పాటు తెదేపా, వైకాపా, జనసేన పార్టీ నాయకులు, స్థానికులు రిలే దీక్షల్లో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, నూర్ బాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరభద్రుడు, సొసైటీ అధ్యక్షుడు దశరథరామనాయుడు, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సిద్దవటానికి సమీపంలో ఉన్న కడప జిల్లాను కాదని సుదూరంలో ఉన్న రాయచోటి జిల్లా కేంద్రంలో విలీనం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ●సిద్దవటం మండలాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కడపలో ఆదివారం వారు ఆయన్ను కలిసి మాట్లాడారు. సిద్దవటాన్ని జిల్లాలో విలీనం చేస్తే భవిష్యత్తులో విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులకు గురవుతారన్నారు.

## బాటసారి / ఆక్రమణలతో పాదచారులకు అవస్థలు

**కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే:** పాదచారుల సౌకర్యార్థం రూ.లక్షలు వెచ్చించి నగరంలో పలు చోట్ల ఫుట్‌పాత్‌లను నిర్మించారు. కానీ అవి పాదచారులకు ప్రయోజనకరంగా లేవు. నగరంలో ఉన్న ఫుట్‌పాత్‌లన్నింటిపై పలువురు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసి ఆక్రమించేశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు వారికి సంబంధించిన వస్తువులను అడ్డంగా ఉంచేశారు. గత్యంతరం లేక పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

**మచ్చుకు కొన్ని... :** ● నగరంలోని ఫుట్‌పాత్‌లన్నీ దాదాపు ఆక్రమణలకు గురయ్యాయి. కోటిరెడ్డి కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్టీఆర్ కూడలి నుంచి కోటిరెడ్డి కూడలి వరకు, గోకుల్ కూడలి నుంచి కృష్ణా కూడలి, కృష్ణా కూడలి నుంచి అన్నమయ్య కూడలి, కృష్ణా కూడలి నుంచి మాసాపేట కూడలి ఇలా పలు చోట్ల రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వీటన్నింటినీ వ్యాపారులు ఆక్రమించేశారు. దీంతో ట్రాఫిక్‌కు సమస్యగా మారింది.
● హరిత హోటల్ వద్దనున్న ఫుట్‌పాత్‌పై కొబ్బరి బోండాల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. సీఎస్ఐ చర్చి ముందు వైపు ఉన్న వారు వివిధ రకాల పండ్ల విక్రయాలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ ఠాణా ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌పై వివిధ రకాల బొమ్మలు, తోపుడు బండ్లు ఇలా అన్ని రకాల వ్యాపారాలు ఫుట్‌పాతులపైనే సాగుతున్నాయి. ● గోకుల్ కూడలి నుంచి కృష్ణాకూడలి వరకు గృహోపకరణాల దుకాణాలున్నాయి. వాటికి సంబంధించి వస్తువులన్నింటిని కాలిబాటలపైనే ఏర్పాటు చేశారు. కృష్ణా కూడలి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై సైకిళ్ల వ్యాపారులు, మెకానిక్‌లు, వివిధ వ్యాపారులు ఆక్రమించేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న గదుల నిర్వాహకులంతా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాటిపై వ్యాపారాలు చేస్తున్నారు.

**ప్రత్యేక స్థలాలు కేటాయించాలి :** కాలిబాటలపై ఉన్న వివిధ రకాల వ్యాపారులు, పండ్లు, కూరగాయలు విక్రయించే వారికి ప్రత్యేకమైన స్థలాలు కేటాయించాలి. పాదచారులకు ఇబ్బంది లేకుండా, ట్రాఫిక్ సమస్య లేని ప్రాంతాల్లో వ్యాపారులకు కేటాయిస్తే వారు అక్కడే వ్యాపారాలు చేసుకుంటారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కోటిరెడ్డి కూడలిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి కొబ్బరి బోండాల వ్యాపారం

హరిత హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

### గంగమ్మకు ప్రత్యేక పూజలు

**చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే:** బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

### ఘనంగా సీతారాముల కల్యాణం

**లింగాల, న్యూస్‌టుడే:** తాతిరెడ్డిపల్లెలో శ్రీకోదండరామాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సీతా రాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు రామకుమార్‌శర్మ ఆధ్వర్యంలో 101 మంది మహిళలతో కుంకుమార్చన పూజలు, ప్రత్యేక పూజలు చేయించారు. పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

### కమలాపురంలో పరిష్కార వేదిక నేడు

**కమలాపురం :** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కారానికి కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ హాజరవుతారని తహసీల్దార్ శివరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా కేంద్రానికి వెళ్లకుండా ఇక్కడే వినతులు అందజేస్తే పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరవుతారని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### కలిసికట్టుగా జిల్లాను సాధించుకుందాం

**రాజంపేట, న్యూస్‌టుడే:** రాజంపేట జిల్లా కేంద్రాన్ని అందరూ కలిసికట్టుగా సాధించుకుందామని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. గత వైకాపా ప్రభుత్వం రాజంపేట ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని, ఆ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు కొత్త డ్రామా ఆడుతున్నారని విమర్శించారు.

## నెహ్రూ పార్కు ఆధునికీకరణకు చర్యలు

**కడప నగరపాలక, న్యూస్‌టుడే:** కడప నగరం 25వ డివిజన్ పరిధిలోని నెహ్రూ పార్కును పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలని మేయర్ పాకా సురేష్‌బాబు నగరపాలక అధికారులను ఆదేశించారు. ఎంఈ ధనలక్ష్మితో పాటు ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఆయన పార్కును పరిశీలించారు. మరుగుదొడ్లు, ఫౌంటెయిన్, వాకింగ్ ట్రాక్, కూర్చునే బల్లలు, ఘంటసాల మండపం, తాగునీటి ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. అవన్నీ శిథిలావస్థకు చేరినట్లు గుర్తించి వెంటనే పార్కు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఇప్పటికే రూ.75 లక్షలతో పార్కు ఆధునికీకరణకు టెండర్లు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా ఆ ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పనులు ప్రారంభించాలన్నారు. అప్పటి వరకు తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.

పార్కులో నీటి నిల్వలను పరిశీలిస్తున్న మేయర్ పాకా సురేష్

## ఉద్యమానికి సంపూర్ణ సహకారం అందిస్తాం

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడపలోనే కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణంగా సహకారం అందిస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. ఒంటిమిట్టలో ఐకాస నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజు ఆదివారం కొనసాగాయి. శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి సంఘీభావం తెలిపారు. జిల్లా భౌగోళిక పరంగా మధ్యలో ఉన్న రాయచోటిలో జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాడు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా మదనపల్లెను జిల్లా చేస్తామని ఇప్పటి ప్రభుత్వం ప్రకటించినట్లు వివరించారు. అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాంతంలో జిల్లా కేంద్రాన్ని ఉంచాలని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐకాస నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి

### శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడు:** శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్.ఐ **వల్లెపు శ్రీనివాసులు** అన్నారు. ఒంటిమిట్టలో ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి బదిలీపై వచ్చారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాషా తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### ధ్యాన మందిరం ప్రారంభం

జ్యోతి వెలిగిస్తున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, బ్రహ్మకుమారీలు

**కమలాపురం, న్యూస్‌టుడే:** పట్టణంలోని పడమర వీధిలోని శివాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఓం శాంతి ధ్యాన(భవనం) మందిరాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రముఖ బ్రహ్మకుమారీలు లీలా, గీతా అక్కయ్యల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ధ్యాన మందిరాన్ని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పుత్తా నరసింహారెడ్డి రూ.లక్ష నగదును ధ్యాన మందిరానికి అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. మందిరానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన తెదేపా నేత దివాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఓంశాంతి ప్రతినిధులు సత్కరించారు.

### వృద్ధాశ్రమంలో అన్నదానం

**అరవిందనగర్ (కడప):** ప్రేమాలయ వృద్ధాశ్రమంలో విశ్రాంత డీఎస్పీ దన్నాసి వెంకటకిషోర్ అన్నదానం చేశారు. తన తండ్రి దన్నాసి వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. నిరాదరణకు గురైన వారి కోసం తమ వంతు సాయంగా అన్నదానం చేశామన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: మండలంలోని అజాద్‌నగర్‌లో చెత్త నిల్వ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వారానికి ఒకసారైనా చెత్తను తొలగించండి. **-మద్దిలేటి, అజాద్‌నగర్.**

✓: ప్రతి నెలా చెత్తను తొలగిస్తున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా వారానికి ఒకసారి చెత్తను తొలగించి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.**- కుళాయిబాబు, ఎంపీడీవో, సీకేదిన్నె,**
**- చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే**

### నిత్యాన్నదాన స్థల వివాదాన్ని పరిష్కరించండి

**ఒంటిమిట్ట, న్యూస్‌టుడే:** ఒంటిమిట్ట కోదండ రామాలయం ఉద్యాన వనంలో ఏర్పాటు చేస్తున్న నిత్యాన్నదాన స్థల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం మండల తహసీల్దారు డి.దామోదర్‌రెడ్డిని ఆదేశించారు. రామయ్య క్షేత్రాన్ని 2015 సెప్టెంబర్ 9న తితిదేలోకి విలీనం చేశారు. ఆ తర్వాత ఆలయ పరిసర ప్రాంతాల్లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపట్టారు. మూడు రోజులుగా పనులు చేయకుండా స్థానికులు కొందరు అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తితిదే ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

### విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

**తొండూరు, పులివెందుల, న్యూస్‌టుడే:** మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన చిన్నారులను మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పరామర్శించారు. తొండూరు మండలం యాదవారిపల్లెలోని పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం తిని తొమ్మిది మంది విద్యార్థులు అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న బీటెక్ రవి పులివెందులలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఆదివారం కలిసి మాట్లాడారు. ఆహారం తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

### వైకాపాలో అసమ్మతి సెగలు!

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** కడప నగర వైకాపాలో అసమ్మతి చెలరేగింది. నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో శనివారం రాత్రి నగరంలోని 16వ డివిజన్ నాయకుల సమావేశం రచ్చరచ్చగా మారింది. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడిన వారికి సరైన గుర్తింపు లేదంటూ వాపోయారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా కమిటీలు ఏర్పాటు చేయకుండా డివిజన్ బాధ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. డివిజన్ ఇన్‌ఛార్జిని బాధ్యతల నుంచి తప్పించాలని పలువురు అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కాసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

## డైరెక్టర్‌ను సత్కరించిన తెదేపా నేతలు

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బరాయుడును అభినందిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

**అరవిందనగర్ (కడప), కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే:** సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్‌ను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సత్కరించారు. కడపలోని ఆయన నివాసంలో సత్కరించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. తెదేపాలో కష్టించి పని చేసిన వారికి సరైన గుర్తింపు ఉంటుందన్నారు. ● కడపలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సుబ్బరాయుడు యాదవ్‌తో పాటు నగర మార్కెట్ యార్డు డైరెక్టర్ నరసింహులను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి సత్కరించారు.

## క్రిస్మస్ సంబరాలు ఐక్యతతో నిర్వహించాలి

**అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే:** క్రిస్మస్ సంబరాలు ఐక్యతతో నిర్వహించుకుని విశ్వాసులకు సందేశాన్ని అందించాలని న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు (పాస్టర్) మహేష్ పిలుపునిచ్చారు. కడప నగరంలోని న్యూనేటివ్‌కృపా మందిరంలో ఆదివారం ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో క్రైస్తవులు తమ హక్కుల కోసం ఐక్యతతో మెలగాలన్నారు. అర్హులైన పాస్టర్లకు గౌరవ వేతనం పొందేలా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దైవ జనులు థామస్,మాణిక్యం, దేవదానం, రవిబాబు,రమేష్‌బాబు,రవితేజ,జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న పాస్టర్లు

### జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ఎంపికైన సంజయ్, ధనుష్

**పులివెందుల, న్యూస్‌టుడే:** పులివెందుల హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పట్టణంలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో క్రీడాకారులు ధనుష్, సంజయ్‌లు ప్రతిభ కనబర్చడంతో వీరు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని కోచ్ రవి కుమార్ తెలిపారు. ధనుష్ తండ్రి శామ్యూల్ జిరాక్స్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తుండగా.. సంజయ్ తండ్రి జోసఫ్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. క్రీడాకారులకు కోచ్, ఉపాధ్యాయులు అభినందించారు.

### పోలీసు స్టేషన్‌లో శాంతి పూజలు

**పులివెందుల, న్యూస్‌టుడే:** పులివెందులలోని ఓ పోలీస స్టేషన్‌లో ఆదివారం జంతు బలి ఇచ్చి శాంతి పూజలు చేయించడం చర్చనీయాంశమైంది. స్థానిక పోలీస స్టేషన్‌కు పోస్టింగ్‌పై వచ్చిన సిబ్బంది విధుల్లో చేరిన కొద్ది రోజులకే వీఆర్ లేదా బదిలీపై ఇతర కారణాలతో వెళ్లిపోతుండటంతో స్టేషన్ అధికారులు ఇలా శాంతి పూజలు చేయించడం గమనార్హం.

### అధ్వాన దారి.. ప్రయాణమెలా మరి

సిద్దవటం మండలంలోని వెలుగుపల్లెలో ప్రధాన రహదారి ముళ్లకంప చెట్లతో మూసుకుపోయింది. సిద్దవటం నుంచి జంగాలపల్లె మీదుగా వెలుగుపల్లె వరకు అలానే ఉంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే చోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సిద్దవటం**

## అన్నమయ్యలో విలీనం... తప్పదు దూరాభారం / కడపలోనే కొనసాగించాలని డిమాండ్

**సిద్దవటం, న్యూస్‌టుడే:** సిద్దవటం చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతం రెవెన్యూ డివిజన్‌గా, అసెంబ్లీ నియోజకవర్గంగా, తాలూకా కేంద్రం, చివరకు మండల కేంద్రంగా మారింది. ఈ ప్రాంతం పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇతర జిల్లాలో విలీనం చేసే ప్రక్రియలు తరచూ చేపట్టడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చరిత్ర కలిగిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ శ్రీధర్‌కు విన్నవిస్తున్న సిద్దవటం నాయకులు(పాత చిత్రం)

**ఇదీ పరిస్థితి!:** గతంలో జిల్లా కేంద్రాన్ని సిద్దవటం నుంచి కడపకు తరలించినప్పటికీ కడపలోని రెవెన్యూ డివిజన్, అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఉండేది. కడపకు కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలంలోని లింగంపల్లె పెన్నానది నుంచి కడప నగరానికి తాగునీటి సరఫరా కొన్నేళ్లుగా కొనసాగుతోంది. సిద్దవటం ప్రజలు కడపతో ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా సత్సంబంధాలు కలిగి ఉన్నాయి. 2009లో జిల్లాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా అప్పటి పాలకులు సిద్దవటాన్ని కడప నుంచి విడదీసి రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోకి మార్చారు. దీంతో ఏళ్ల తరబడి పరిపాలన పరంగా ఇక్కడి ఉద్యోగులు, ప్రజలు సుమారు 50 కి.మీ దూరంలో ఉన్న రాజంపేటకు వెళుతూ ఇక్కట్లకు గురయ్యారు.

**పలు మార్లు మార్పులు..:** 2022లో మళ్లీ జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. సిద్దవటం ప్రజల ఇబ్బందులను గుర్తించిన అప్పటి పాలకులు సిద్దవటం ప్రాంతాన్ని మళ్లీ కడప రెవెన్యూ డివిజన్‌లోకే మార్చారు. దీంతో ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ చేపట్టింది. సిద్దవటం, ఒంటిమిట్ట మడలాలను రాజంపేట రెవెన్యూ డివిజన్‌లోకి విలీనం చేసే ప్రక్రియ చేపట్టి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సిద్దవటానికి కూతవేటు దూరంలో ఉన్న కడప జిల్లాను కాదని 80 కి.మీ దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలో విలీనం చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై రాయచోటి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాలంటే వ్యయప్రయాసాలకు గురికావాల్సిఉంటుందని వాపోతున్నారు. పాలకులు ఇష్టానుసారంగా మండలాలను అటు నుంచి ఇటు.. ఇక్కడి నుంచి అటు విలీనం చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదంటూ పెదవివిరుస్తున్నారు.

### రైతుబజారులో కూరగాయల ధరలు

**కడప వ్యవసాయం, న్యూస్‌టుడే:** రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా.. ..బంగాళదుంప-45, క్యాబేజీ-28, క్యారెట్-68, బీన్స్-70, బీట్‌రూట్-45, కీర-30, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-35, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-25, మిరపకాయలు 45, వంకాయలు-30, బెండకాయలు-45, బీర-55, కాకర- 50, మటిక్కాయ-45, చిక్కుడు-50, అలసందకాయలు-50, అనపకాయలు-50, ఉల్లిపాయలు-20, 25.

### కంకర పరిచారు... తారు మరిచారు

పులివెందుల పట్టణం పోలేపల్లె మధ్య తారు రోడ్డు నిర్మాణం కంకరతోనే సరిపెట్టేశారు. తారు రోడ్డు నిర్మాణం కోసం కంకర పరిచి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు తారు వేయలేదు. గత వైకాపా ప్రభుత్వం ఈఏపీ కింద వివిధ గ్రామాలకు నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా కడప, పులివెందుల ప్రధాన రహదారిలోని బెస్తవారిపల్లె నుంచి పులివెందుల పట్టణం పోలేపల్లె మధ్య తారురోడ్డు నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరైంది. పనులను దక్కించుకున్న గుత్తేదారు నిర్మాణాన్ని కంకర పరిచి, ఇంత వరకు తారు వేయలేదు. దీంతో ఆ మార్గం కంకర తేలడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, వేముల**

## నీటి వృథా.. తప్పని వ్యథ

**తొండూరు, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన తొండూరు గ్రామంలో తాగునీటి పైపులు తుప్పు పట్టి లీకేజీతో నీరు వృథాగా పోతున్నాయి. దీని వల్ల ఎగువ ప్రాంతాల్లో ఉన్న వారికి నీరు అందడం లేదంటూ వాపోతున్నారు. లీకేజీతో కలుషితమైన నీరు పైపులోకి వెళ్లడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## పాపఘ్నిపై వంతెన పనులు ఘురూ! / ఇక నదిపైనే నాలుగు వరుసల దారి

**ఈనాడు కడప, న్యూస్‌టుడే వేంపల్లె:** గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఆగిన వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారి పనులు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా వేంపల్లె మండలంలోని వీరన్నగట్టుపల్లె వద్ద పాపఘ్ని నదిపై ప్రస్తుతమున్న రెండు వరుసల పాత వంతెన పక్కనే అదనపు రెండు వరుసల వంతెన నిర్మిస్తున్నారు. దీంతో ఇక నదిపైనా నాలుగు వరుసల వంతెనపైనే ప్రయాణాలు సాగనున్నాయి. నంద్యాల జిల్లా చాగలమర్రి-అన్నమయ్య జిల్లా రాయచోటి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వేంపల్లె మండలంలోని కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీ నుంచి రాయచోటి వరకు ఉన్న 53.6 కిలోమీటర్ల నిర్మాణానికి రూ.245 కోట్లతో కేంద్ర ప్రభుత్వం 2022 మేలో టెండర్లు పిలిచింది. ఈ పనులను ఓ గుత్తేదారు సంస్థ 30 శాతం తక్కువ ధరకు దక్కించుకుంది. ఈ మొత్తం రహదారి నిర్మాణం భూములు, ఇళ్లు కోల్పోయిన ఇతరులకు కలిపి కేంద్రం రూ.450 కోట్లు కేటాయించింది.

వీరన్నగట్టుపల్లె వద్ద పాపఘ్ని నదిపై నిర్మాణంలో ఉన్న అదనపు వంతెన

**ఇదీ పరిస్థితి! :** వీరన్నగట్టుపల్లె నుంచి రాయచోటి వరకు ఉన్న సింగిల్ రోడ్డును రెండు లైన్ల రోడ్డుగా మార్చడమే కాకుండా వీరన్నగట్టుపల్లె, మద్దిరేవుల వద్ద భారీ వంతెనలతో పాటు ఈ మార్గంలో చిన్న, పెద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ పనులు 85 శాతం మేర పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో వీరన్నగట్టుపల్లె వద్ద పాపఘ్ని నదిపై ఉన్న పాత వంతెన గురించి గతంలో 'ఈనాడు'లో 'వణుకుతున్న వంతెన, వంతెన గజగజ', 'ప్రయాణం దడదడ' అనే శీర్షికలతో వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఇక్కడి పాపఘ్ని నదిపై అదనపు వంతెన నిర్మాణం పనులు చేపట్టారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్ ) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468